మాతృగీత



డాక్టర్ కొమరవోలు వెంకట సుబ్బారావు

M.A., M.D.H., D.Sc.

మాతృగీత

డా॥ కొమరవోలు వెంకట సుబ్బారావు

33/55, ఆఫీసర్స్ కాలనీ
రామకృష్ణాపురం, సికింద్రాబాద్-500056

మాతృగీత

డా॥ కొమరవోలు వెంకట సుబ్బారావు

ప్రథమ ముద్రణ: జులై, 2002
ప్రతులు: 500

For Copies:
DR. K.V.SUBBA RAO
MATRU SRI
Ex-Service Men's Free Homeo - Magneto
Radionic - Sujok Clinic,
33/55, Officer's Colony
R.K.Puram, Secunderabad.

Type setting:
RJ Graphics, Hyderabad.
Ph: 661 0373

Printed at:
Saraswathi Offset Printers
Hyderabad - 44.
Ph: 761 2180.

వెల: రూ. 300/-

చదవండి మళ్ళీ మళ్ళీ

ఇరవయ్యో శతాబ్ది తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేసిన పద్య కవులలో ఒకరు డా॥ కొమరవోలు వెంకట సుబ్బారావుగారు. ఎప్పుడో యాభై సంవత్సరాలకు పూర్వమే "భారతి" తదితర సాహిత్య పత్రికలలో రాయప్రోలు, విశ్వనాథ ప్రభృతి కవుల రచనల సరసనే కొమరవోలు వారి కవితలు కనిపిస్తుండేవి. "పద్యము లందును, గేయములందును కూడా ధారాశుద్ధి పుష్కలమై వానిని శ్రవణానంద సంధాయకములుగా తీర్చిదిద్దుచున్నది" అని ఆయన కవిత్వాన్ని డా॥ దివాకర్ల వెంక టావధానిగారు ప్రశంసించారు. ఆయన రచించిన "రాగసుధ" కావ్య సంకలనాన్ని అంకితం అందుకుంటూ దేవులపల్లి కృష్ణశాస్త్రి గారు అన్నారు ఇలా:

"గట్టులేని చీ/కట్ల కడలిలో
కలసిపోయిన నా బ్రతుకు-
ఈ కవిమిత్రుని/పలుకులనే తా
రా కనకదీప కళికలలో
నిలుతుగాక/కలకాలము"

"తారాకనకదీపకళికలు" అన్నారు కృష్ణశాస్త్రి. "చెరుగని సత్యముగా రవంతయు తరగని ప్రేమగా నిలుచుగాక కలకాలము" అని కూడా ఆయన అన్నారు. కొమర వోలు వారి కవిత అలాంటిది. ఒక కవిని మరొక కవి ప్రశంసించడమే ఘనమైన సంగతి. అందులోనూ కృష్ణశాస్త్రి అంతటి కవినుంచి మెచ్చుకోలు!

డాక్టర్ కొమరవోలు వెంకట సుబ్బారావుగారి కవిత షష్టిపూర్తిని, సప్తతిని కూడా చేసుకొన్నది. ఆయన కవి మాత్రమే కాదు. సైన్స్ రచయితగా తెలుగు వైజ్ఞానిక సాహిత్యంలో ఆయనకు ప్రత్యేకస్థానం ఉంది. పరమాణు విజ్ఞానం మీద ఆయన 1950 సం॥రానికి పూర్వమే ఒక ప్రామాణిక గ్రంథం వ్రాశారు. పరమాణు విజ్ఞానంపై తెలుగులో మొదటి గ్రంథం బహుశా అదే. రేడియానిక్స్ ఆయన అబి మాన విషయాలలో ఒకటి. అఖిల భారత స్థాయి రేడియానిక్స్ సంఘం వ్యవస్థాపకు లాయన. వైద్యశాస్త్రంలో, ప్రత్యేకించి హోమియో వైద్యంలో ఆయనకు మంచి పేరు ఉంది. మొండికిపడిన వ్యాధులను తగ్గించి ఆయన ఎందరికో ఆయుర్వృద్ధి కలిగించారు. అన్నింటికీమించి ఆయన తత్త్వవిదుడు. సాంసారిక జీవితం సాగిస్తూనే ఆధ్యాత్మిక సాధనలో పురోగతిని సాధించిన ఋషి సమానుడు. జిల్లెళ్ళమూడి అమ్మ

అనుగ్రహం పొందిన అదృష్టశాలి. సహస్ర చంద్రదర్శనం చేసిన తరువాత కూడా ఆయన రచనా వ్యాసంగం అకుంఠితంగా కొనసాగుతూనే ఉంది. 'ఛిన్నమస్త', 'మృత్యులగ్నం', 'దశ మహావిద్యలు' ఆయన ఇటీవలి సంవత్సరాలలో రచించిన గ్రంథాలు. పద్య, గేయ ప్రక్రియలలో ఆయన కావ్యరచనా సామర్థ్యానికి, ఆధునిక దృష్టికి, సర్వసమన్వయ వైఖరికి అవి అద్దం పడుతున్నాయి.

ఇప్పుడు మీ చేతుల్లో ఉన్న పుస్తకం 'మాతృగీత' డాక్టర్ సుబ్బారావుగారి సరికొత్త ప్రచురణ. ఆయన ఈ గ్రంథాన్ని రచించినప్పుడు "ఆత్మకింపైన భోజనం" చేయ లేదు. "ఉయ్యాలమంచం" భోగం అసలేలేదు. "ఒప్పుతప్పురయురసజ్ఞ" శ్రోతల ప్రసక్తి లేనేలేదు. ఎందుకంటే ఆయన ఈ గ్రంథ రచన చేసినది యుద్ధశ్రేణిలో ఒక బంకరులో కూర్చొని! అది తూర్పు పాకిస్తాన్‌ను బంగ్లాదేశ్‌గా మార్చినప్పటి యుద్ధం. ఏ కాగితం ముక్క దొరికితే దానిమీద ఆయన వ్రాసుకుంటూ ఉండేవారు. అలా వ్రాయడం ఒక ఎత్తైతే వాటిని భద్రపరచుకొనడం ఇంకొక ఎత్తు. (బంకరు అంటే సైనికులు తాము దాగి యుద్ధం చేయడానికి తవ్వుకొన్న కందకము) "సేనయోర్ఉభయుర్మధ్యే" శ్రీకృష్ణుడు అర్జునుడికి గీతోపదేశం చేస్తే మన సుబ్బారావు గారు యుద్ధం మధ్య "మాతృగీత" గ్రంథ రచన చేశారు. ఎంత ఆశ్చర్యం కలిగించే రచనా వ్యాసంగం!

'మాతృగీత' నా దృష్టిలో సుబ్బారావుగారి పుస్తకాలన్నింటిలోకి తలమానికం. ఇంగ్లీషుమాట వాడాలంటే ఆయన 'మాగ్నం ఓపస్'. ఇది భగవద్గీతకు, జిల్లెళ్ళమూడి అమ్మ ప్రబోధించిన తత్త్వం పరంగా వ్యాఖానం.

ఆమె తత్త్వానికి భాష్యం అని కూడా అనవచ్చు. భగవద్గీతకు వివిధ భాషలలో ఇప్పటికే వేలకొలది వ్యాఖ్యాన గ్రంథాలు ఉన్నాయి. తెలుగులో సైతం అర్థతాత్పర్య వివరణలతో చాలా పుస్తకాలు వెలువడ్డాయి. జిల్లెళ్ళమూడి అమ్మను గురించి, ఆమె తత్త్వాన్ని గురించి కూడా ఎన్నో రచనలు వచ్చాయి. అయితే అమ్మ బోధనలపరంగా భగవద్గీతకు ఇంతవరకు ఎవరూ వ్యాఖ్యానాలు వ్రాయలేదు. సుబ్బారావు గారిదే మొదటి గ్రంథం. భగవద్గీతకు శంకరులవలె, రామానుజులవలె, మధ్వాచార్యులవలె సుబ్బారావుగారు ఈ రచన చేశారు. ఈ గ్రంథ రచనకు సుబ్బారావుగారు తన జీవిత కాలంలో చదివిన అంతులేని ఆధ్యాత్మిక వాఙ్మయం చాలా ఉపయోగపడి ఉంటుంది. వేదవేదాంగాల విజ్ఞానం ఈ రచన అంతటా కనిపిస్తున్నది. అంతటి ఉన్నతమైన రచన గనుకనే ఈ వ్యాఖ్యాన గ్రంథం భగవద్గీతపై బాలగంగాధర తిలక్, సర్వేపల్లి రాధాకృష్ణన్, అరవిందుడు వ్రాసిన వ్యాఖ్యానాల సరసన నిలిచే యోగ్యతను సంపా

దించుకున్నది. అమ్మతత్త్వంపై డాక్టర్ శ్రీపాద గోపాల కృష్ణమూర్తి, అమెరికన్ జర్నలిస్టు రిచర్డ్ రచించిన గ్రంథాలకు ఇది తోడుగా కలకాలం నిలుస్తుంది. "అమ్మా! నాకు ప్రసన్నవుగమ్మా! గీతా రహస్య గాఢ నిగూఢార్థమ్ముల పూచిన పూవుల కమ్మని పూదండనల్లి గళమున వేయన్!" అని ద్వితీయాధ్యాయమైన సాంఖ్యయోగానికి వ్యాఖ్యానం ప్రారంభిస్తూ సుబ్బారావుగారు అమ్మకు విన్నవించుకొన్నారు. ఆయన ప్రార్థనను విని, ఆయనపై అమ్మ అపారమైన కరుణామృతాన్ని వర్షించినట్లుంది. అందుకే కావచ్చు అద్భుత రచనగా 'మాతృగీత' మనకు లభ్యమవుతున్నది.

భగవద్గీత పదునెనిమిది అధ్యాయాలకు సుబ్బారావుగారు తాత్పర్యంతో పాటు శ్లోకాలను సైతం యధాతథంగా ఇచ్చారు. ప్రమాణ ప్రతులన్నింటిలో వలెనే అష్టాదశ అధ్యాయాల అన్ని శ్లోకాలను ఇచ్చారు. ప్రక్షిప్తాలంటూ వేటిని ఏరివేయలేదు. ఎనిమిదవ అధ్యాయానికి చాలా ప్రమాణ ప్రతులలో ఉన్నట్టు 'అక్షర పరబ్రహ్మాయోగం' అనిగాక శంకర భాష్యంలో వలె "తారకబ్రహ్మ యోగం" అనే ప్రయోగాన్నే స్వీకరించారు.

అమ్మను సుబ్బారావుగారు ఏమనుకొని ఆరాధించారు? రాజవిద్యా రాజగుహ్యా యోగం అధ్యాయంలో పదమూడవదైన "మహాత్మనస్తుమాం పార్థ..." శ్లోకానికి వ్యాఖ్యానం వ్రాస్తూ ఆయన అమ్మను మహాత్మురాలన్నారు. రామకృష్ణ పరమహంస, వివేకానంద, అరవింద, వశిష్ట గణపతిముని, రమణ మహర్షి – వీరందరి కోవకు చెందిన మహనీయురాలన్నారు. వీరందరు దైవప్రకృతులని అభివర్ణించారు. "వికేంద్రీకృతమై ఉన్న జగత్తులో పుట్టిన వీరు స్వీయ జీవితాలను ప్రయోగశాలలను చేసి, పరమాత్మ భావనను విస్తరింపచేయడానికి జీవితాలను ఖర్చు చేశారన్నారు. విశ్వరూప సందర్శన యోగ శ్లోకాలకు వ్యాఖ్యానం వ్రాస్తూ లలితా సహస్ర నామాలలోని "అనేకకోటి బ్రహ్మాండ జనన్యై నమః, విశ్వగర్భాయై నమః, సర్వయోన్యై నమః" శబ్దాలకు అమ్మ ప్రతీక అన్నారు. తాత్త్విక సత్యాలు, కావ్యశోభ, విజ్ఞానశాస్త్రం అనే మూడు ప్రవాహాలు కలసి 'మాతృగీత' త్రివేణి సంగమంగా రూపొందాయి.

అమ్మ ప్రవచించిన తాత్త్విక సత్యాలు ఏ మత గ్రంథాల చట్రంలోనూ ఇమడవు. అలాగని అవి వివిధ మత విశ్వాసాలకు పూర్తిగా విరుద్ధమైనవనడానికి కూడా వీలులేదు. అందువల్ల శంకర, రామానుజ, మధ్వాచార్యుల కృషికి సుబ్బారావు గారి రచన సమానమైనదని, విలక్షణమైనదని నాకు అనిపిస్తున్నది.

అమ్మ ప్రవచనాలలో పరస్పర వైరుధ్యం ఎక్కడా లేదు. బాల్యంనుంచి చెపుతూ వచ్చిన మాటలలో అంతస్సూత్రం "అంతా అదే". "సృష్టి అనాది, నాది" అని అమ్మ

ప్రకటించింది. "రెండు లేవు" అన్నది. "నేను నేనైన నేను" అనీ, "అందరికీ సుగతే" అనీ చెప్పి అర్థం చేసుకోమన్నది. లౌకిక దృష్టితో ఆలోచిస్తే అమ్మ సూక్తులు ప్రశ్నించ దగినవిగా అనిపించవచ్చు. కానీ లోతుకు తరచిన కొలదీ అందులోని సత్యం మరింత స్పష్టంగా ఆవిష్కృతమవుతుంటుంది. విశ్వరూప సందర్శనయోగం అధ్యాయం అర్ధశతం శ్లోకాలలో చెప్పిన సత్యాన్ని అమ్మ "మీరంతా నేనే, మీదంతా నేనే. ఇదంతా నేనే" అనే మూడు ముక్కల్లో చెప్పింది.

"చాతుర్వర్ణ్యం మయాసృష్టం గుణ కర్మ విభాగశః" అన్న గీతావాక్యాన్ని చర్చించి "వృత్తిని బట్టే కులం ఏర్పడుతుందని" సుబ్బారావుగారు సిద్ధాంతీకరించారు. మహా భారత కాలంలో ఇప్పటివలె జన్మనిబట్టి కుల నిర్ణయం జరిగేది కాదని దృష్టాంతాలు చూపించారు. "రక్తమే ఈశ్వరతత్త్వమ"ని బోధించిన అమ్మ ప్రవచనాలతో గీతా వాక్యాన్ని సమన్వయ పరిచారు. అమ్మకు కులవివక్ష లేకపోవడాన్ని సోదాహరణంగా వివరించారు.

మనిషిచేసే పనులలో దేనికీ అతడు కర్తకాదని అమ్మ తన బాల్యం నుంచి స్పష్టం చేస్తూ వచ్చింది. సాంఖ్య యోగంలో "బుద్ధియుక్తో జహాతీహా ఉభే సుకృత దుష్కృతే.." అనే శ్లోకాన్ని వివరిస్తూ అమ్మచెప్పిన సిద్ధాంతానికి శ్రీకృష్ణుడి ప్రవచనం ఎలా సరితూగుతుందో సుబ్బారావుగారు సుదీర్ఘచర్చ చేశారు. "పుణ్యమనుకొని నీవు పుణ్యమూ చెయ్యలేవు. పాపమనుకొని పాపమూ చెయ్యలేవు. ప్రకృతి జనితములైన గుణ స్వభావాలు నీచేత ఏ పనులు చేయిస్తే వాటిని చేయడానికే నీకు అధికారమూ, సామర్థ్యమూ ఉంది. వాని స్థలాభి సంధి రూపమైన పుణ్యపాప నిర్ణయాలు, సిద్ధ్యసిద్ధి ప్రయోజనాలు ఈశ్వర ప్రమేయాలు గనుక వాటిని గురించి లేనిపోని ఆలోచనలను, బాధ్యతలను నెత్తిమీద వేసుకొని పుణ్యం చేస్తున్నానని సంతోషించి, పాపం చేస్తున్నా నని భీతిచెంది, మానస దౌర్బల్యం, క్లైబ్యంతో..." అంటూ సుబ్బారావుగారు చేసిన వ్యాఖ్య అమ్మ మహావాక్యానికి విపులీకరణ.

అనేక సంవత్సరాల కాలంగా జిల్లెళ్ళమూడి వెళ్ళి వస్తూ అమ్మని దర్శించిన వారు, స్వయంగా అమ్మతో ఆధ్యాత్మిక విషయాలను చర్చించినవారు అంతా ఒకే విధంగా ఆలోచించలేదు. అమ్మ మాటలను ఆచరణలో అక్షరాలా పాటించాలను కొన్నా అలా అనుకొన్న వారు పాటించలేకపోయారు. అదే అమ్మ సూక్తికి తిరుగులేని నిరూపణ. "అందరికీ సుగతే" అని అమ్మ పలికిన మాటలకు అర్థం ఏమిటని కొందరు సోదరీ సోదరులు అమ్మ సమక్షంలోనే వాదులాడుకోవడం నాకు తెలుసు. "కాస్త వెనకా ముందూ" అని కొసరు వడ్డించి అందరినీ సంతృప్తి పరచింది అమ్మ! విభూతి

యోగం వ్యాఖ్యానంలో ఈ సూక్తినికూడా చర్చించారు సుబ్బారావుగారు. "గీతలో లేనిదీ నేను కొత్తగా చెపుతున్నదీ ఏమీలేదని" అమ్మ అన్న మాటల్ని ఈ సందర్భంలో ఆయన పాఠకులకు గుర్తు చేశారు.

తమ శాస్త్రపాండిత్యంతో అడ్డదిడ్డాలుగా ప్రశ్నలు అడిగి, 'అమ్మను పరీక్షించుదామ'ని వచ్చి అమ్మ చెప్పిన మహా వాక్యాల అంతరార్థ భావాన్ని అవగాహన చేసుకొనలేక "అమ్మా! నీవు సాక్షాత్తూ బాలరాజరాజేశ్వరివి" అని అంగలార్చిన కొందరు మహాపండితుల అనుభవాన్ని సుబ్బారావు గారు 'విభూతి యోగం' చర్చలో ప్రస్తావించారు. విద్వాంసులమని విర్రవీగిన వారు అమ్మ సమక్షంలో అత్యంత వినయ సౌశీల్యాన్ని చూపించడం నాకు కూడా తెలుసు. తాత్త్విక సత్యాలతోపాటు మాతృగీతలోని ప్రతి అధ్యాయంలోనూ కొత్త కొత్త వైజ్ఞానిక విశేషాలు కనిపిస్తాయి. ఆధునిక విజ్ఞానాన్ని ఔపోసన పట్టిన రచయితకే ఇది సాధ్యమవుతుంది. "చంద్రుడు తనకున్న పరిధి రేఖను ఒక మిల్లీమీటరు భూగోళంవైపు జరిగితే సముద్రం పొంగి ప్రళయం వస్తుంది. సూర్యుని కిరణాలు వేడిని అయోనీ మండలం సగానికి సగం హరించక పోతే భూపరితలం మీది సృష్టి అంతా భస్మీపటలం అయిపోతుంది" లాంటి అనేక అంతరిక్ష విజ్ఞాన విశేషాలను గ్రంథకర్త సులభంగా అర్థమయ్యే శైలిలో చెప్పారు. చెట్లు అన్నీ స్థావరాలు కావు! "సోమలత జంగమ లత" అని ఆశ్చర్యకరమైన వైజ్ఞానిక సత్యాన్ని వెల్లడించారు గ్రంథకర్త (విశ్వరూప సందర్శ యోగం వ్యాఖ్యానంలో). "ఒకే పండు నుంచి కోసిన రెండు ముక్కలు ఒకటే రీతిగా ఉండవని రేడియోనిక్స్ చెపుతుంది" – ఇలాంటి విశేషాలు లెక్కలేనన్ని ఈ గ్రంథంలో కనిపిస్తాయి.

తాత్త్విక చర్చ ఆసక్తిదాయకం కావడానికి పిట్టకథలు చాలా ఉపయోగపడతాయి. అందులోనూ కవితాత్మకంగా చెపితే విషయం మరింత ఆసక్తి దాయకమవుతుంది. సుబ్బారావు గారు చెప్పిన ఒక చిన్న కథ మచ్చుకు: అప్పయ్య దీక్షితులు గంగ ఒడ్డున కూర్చుని సంధ్యా వందనం చేస్తుంటే పొరపాటున గోచీ ఊడిందట. ఆయన అది చూసుకోకుండానే ధ్యానం కొనసాగిస్తున్నారట. అదిచూసిన సాటి సాధకులు అది ఆచారమో, పద్ధతో అనుకొని గోచీలను ఊడదీసుకుని సంధ్యా వందనం సాగించుకొన్నారట. "యద్యదాచరతి శ్రేష్ఠః తత్తదేవే తరోజనః" అనే శ్లోకానికి వ్యాఖ్యానంలో సుబ్బారావుగారు ఉదహరించిన కథ ఇది. చాలామంది అనుకుంటున్నట్టు ఇది సదాచారాలను గురించి బోధ చేసేశ్లోకం కాదనీ, దురాచారాలను గురించి చేసిన హెచ్చరికని గ్రంథకర్త వ్యాఖ్య. కొత్తగా అనిపించవచ్చునే గాని ఆలోచిస్తే అదే సరైన అర్థం అనిపిస్తుంది!

భగవద్గీత చివరి ఆరు అధ్యాయాలూ జ్ఞానషట్కంగా ప్రసిద్ధి. ఈ ఆరింటిపై వ్యాఖ్యానం వ్రాయడంలో గ్రంథకర్త తాను ఉన్నత స్థితిని అందుకోవడమేగాక పఠితులను సైతం వెంట తీసుకొని వెడతారు. ఉత్తమ రచనల ఉత్తమ లక్షణం అది. మొత్తం రచన కవితాత్మకమైనప్పటికీ ప్రత్యేకించి చివరి అధ్యాయాలలో సుబ్బారావు గారి కవితాత్మ మరింతగా ఆవిష్కృతమవుతుంది. ఉదాహరణకు దైవాసుర సంపత్వి భాగ యోగంలో ఆయన అంటారిలా:

"వెన్నకంటె మెత్తని, పూవుకంటే సుతిమెత్తని, వెన్నెల కంటే చల్లని, తేనెకంటే తియ్యని, అమృత మధుర మాతృమూర్తి మనస్సులో సాక్షాత్కరిస్తున్నది. ఆ మధుర మూర్తి ఎప్పుడూ బాలింతే, చూలింతే. ఆ శిశూదయ భావస్ఫూర్తి బ్రహ్మపదార్థం నుండి బ్రహ్మాండమే విరిసిపోతున్న విశ్వరూపంతో ఐక్యమవుతున్నది. ఇక్కడ ఆస్తికుడెవడో నాస్తికుడెవడో నాకు బోధ పడటం లేదు... ఏదో అనిర్వచనీయమైన కులకలు లేని శాంతితప్ప... నాకింకో సందేహం రావడంలేదు... దేహాన్ని గురించి గాని, దేహిని గురించిగాని. మనస్సు మాత్రం త్వరపెట్టుతున్నది. ఎందులోపట్టినా ఈ అమ్మ దగ్గర మధురరాశి ఉన్నదనీ, అందులో అణుమాత్రం అర్థం కావడంలేదనీ, అదేదో దాచు కొమ్మనీ..."

నా దృష్టిలో ఇది డాక్టర్ కొమరవోలు వెంకట సుబ్బారావుగారి ఆత్మసాక్షాత్కారానుభూతి. ఇది కేవలం కవితావేశంతో కూడిన వర్ణన అనుకుంటే అది పొరపాటవుతుంది. ఈ విధమైన ఆత్మ సాక్షాత్కారానుభవం జీవన్ముక్తుడికే సాధ్యం. ఈ 'మాతృగీత' గ్రంథాన్ని చదవడమే ఒక అపూర్వానుభూతి. కాని ఒకసారి చదివిఊరుకోలేము. భగవద్గీతలో మోక్షసన్యాసయోగం చివరి అధ్యాయం. అందులో చివరిదైన "యత్ర యోగేశ్వరః కృష్ణో యత్ర పార్థో ధనుర్ధరః..." శ్లోకానికి ముందు, అంటే చివరినుంచి రెండవది– ఒక అద్భుత శ్లోకం ఉంది.

తచ్చ సంస్మృత్య సంస్మృత్య రూప మత్యద్భుతం హరేః
విస్మయోమే మహాన్ రాజన్ హృష్యామి చ పునఃపునః

హరి స్వరూపాన్ని స్మరించగా, స్మరించగా మరింత మరింతగా ఆశ్చర్యం, ఆనందం కలుగుతున్నాయని భావం. శ్లోకంలో అందమంతా సంస్కృత్య శబ్దాన్ని రెండు సార్లు అనడంలో ఉంది. అలాగే, ఈ గ్రంథాన్ని మళ్ళీ మళ్ళీ చదవడం ఆత్మానందాన్ని మరింత మరింతగా వృద్ధిపరుస్తుంది.

–పొత్తూరి వెంకటేశ్వరరావు

Maatru Geeta

Sri Komaravolu Venkata Subbarao who has recently retired as a military officer had recited Matru Geeta a commentary on Bhagavad Geeta in the light of Mother's sayings as understood by him, from 16th August in the immediate presence of Mother and other brothers.

Sri Subbarao is a sensitive poet with a keen sense of perception and a mellifluous flow of diction. He has already tc his credit the following poetical works. Pratyoosham. Raagasudha, Amarasri, story of the Atom, and Mrutyulagnam which is yet to be published. His keen sense of modern science coupled with a rare imagination renders a unique quality to his poetry. Some of his poetical works are prescribed as text-books for Modern Telugu poetry by the three universities.

He was inspired by Mother's sayings and felt impelled to write commentary on the Geeta from this view-point, since he felt that all other commentaries were inadequate and Mother's teachings alone could bring the light of Geeta to the modern man in its proper perspective and depth.

He put in a stupendous effort for five years from '68 to '73, labouring in his leisure time as a soldier through peace and war in his camps and bunkers-practically he had no reference books at all leave alone a library-to fulfil this onerous task and he mostly relied on his prodigious memory of classics like the Upanishads, the purushasookta, and the works of sankara. Perhaps no commentary on Geeta was written with such stupendous effort and very little support from other sources. While the commentary encompasses in its scope the

పైసంఘటన లన్నింటిలోను అద్భుతం ఏమిటంటే వచ్చిన చిత్రాలన్నీ ఏకదేశ మాత్రాలు. రెండో కొస కెమేరా కాదు. ఫొటో తీయబడిన విగ్రహమూ కాదు. అవి ఎలా పనిచేస్తున్నాయో తెలీదంలేదు. కెమెరాకు నోరులేదు. నోరున్నా ఫోకస్సైన విగ్రహం మారలేదు. ఎందుకు, ఎప్పుడు, ఎలా, ఎవడు, ఎవతె, ఏది, దేనిని, ఈవిధంగా అన్ని విభక్తులను ఏకరువుపెట్టగా వచ్చిన సమాధానాలు, పరిస్థితులను బుజువు చేస్తే తప్ప సైన్సు ఒప్పుకోదు.

ఆత్మ విభూతికాని, ఆవిష్కార విభూతికాని, రెండూ ఒకేసారి జరిగే పనులు. అమ్మ సూదిలో దారంగ్రుచ్చి ఒకే దారాన్ని రెండుగా చూపించినట్లు, అలా కనిపిస్తాయి. ద్విముఖిలాగా! అంటే ప్రసవిస్తున్న తల్లి మొగం పైన ప్రసవమయ్యే బిడ్డ మొగం క్రిందా ఇది మగజాతికి చేతగాని పని. ఒకటి రెండయ్యే సృష్టిసూత్రం. కాని తల్లితనం ఒకటే. దానికి ద్వివచన బహువచనాలు లేవు. అంటే అదే విషయం మృత్యువుగాను కన్పిస్తుంది జన్మంగానూ కన్పిస్తుంది. కృష్ణార్జునుల లాగా! ఎలాగంటే

కౌరవ పాండవసేనల పక్షంలో శంఖాలూదుతూ, సమరోత్సాహంతో కన్పించే జీవద్దృశ్యం ఒకటీ, వాళ్ళే, కేచిద్విలగ్నా దశనాంతరేషు సందృశ్యంతే చూర్ణితైరుత్తమాంగైః అనే మృత్యుదశ ఒకటీ. ఇలా జీవన్మరణ దృశ్యాలను, ఎదురెదురుగానూ, ప్రక్కప్రక్కలను బెట్టి, ప్రదర్శించింది ప్రపంచవాఙ్మయంలో భగవద్గీత ఒక్కటే!

ఇది అనుల్లంఘ్యంగా పరమాత్మ చేస్తున్నపనే. అర్జునుడు నిమిత్తమాత్రుడే.

ఏ భీష్ముడూ, ద్రోణుడూ, కర్ణుడూ, జయద్రథుడూ అర్జునుడి కవధ్యులయ్యారో, వారందఱూ 'మయాహతాః' అంటే నదులన్నీ సముద్రంలో నామరూపాలు లేకుండా పోయి కలిసినట్లు, మిడతలు అగ్నిలో దూకినట్లు, సుగతిలో కలిసిపోయారు.

9 నెలల గర్భవాసదశకు శిశూదయం-కాన్పు-మృత్యువే. సమిష్టి నుంచి వ్యష్టిగా బయటబడడం కూడాను. క్రొత్త అల పుట్టడం కూడాను. బృహదారణ్యకోపనిషత్తు వక్కాణించినట్లు, మృత్యువే బ్రహ్మను సృష్టిచేయడం కూడాను. అమ్మ సూదిలో దారం గ్రుచ్చి రెండుగా ప్రదర్శించడం కూడాను. పూర్ణంగా ఉన్న సున్నా చప్టాయించబడినప్పుడు రెండు కొసలేర్పడడం కూడాను. ఆ రెండు కొసలమధ్య భాగమే ఒకటి కావడం కూడాను. సృష్టి అనే మింటులో నుండి చెలామణియేకాని రెండు వైపులు లేని నాణెం బయటకు ఉరకడం కూడాను. మిమ్ములనందఱినీ నేనేకన్ని, మీ తల్లులకు పెంపుడిచ్చానని చెప్పిన అసలైన అమ్మ సాక్షాత్కరించడం కూడాను.

ఈ విధంగా మాతృగీత నడిచింది. దీనికి శ్రీ పొత్తూరి వెంకటేశ్వరరావుగారు ముందుమాట వ్రాశారు. వారికి నా కృతజ్ఞతలు. అన్నలక్కలందఱికీ మాతృగర్భాలయంలో కూర్చుని నే చేసే వినతులు.

22-5-2002 డా॥ కొమరవోలు వెంకట సుబ్బారావు

విషయ సూచిక

తప్పొప్పుల పట్టిక

పేజీ	లైను	తప్పు	ఒప్పు
37	5	ప్రపస్వామి	ప్రపస్యామి
48	9	వ్యానసన	వ్యానసమాన
50	16	వత్సయుతాన్ దర్శయ	వత్సయుతా నదర్శయ
62	22	నిన్న	నిన్ను
63	4	పరమత్మ	పరమాత్మ
70	22	సమధౌ	సమాధౌ
71	16	నిత్వసత్వస్థం	నిత్యసత్వస్థం
91	25	లోయిపత్వం	లోలుపత్వం
100	22	జరియిపోయినట్లు	జరిగిపోయినట్లు
104	10	లేకమానవ	లేకమానస
107	15	వెల	వేల
108	23	యద్యఛ్ఛృణోతి	యద్యచ్ఛృణోతి
117	9	అంటి పెట్టుకని	అంటి పెట్టుకుని
118	15	కర్మలను	కర్మలకు
144	19	పదుకుండా	పడకుండా
169	6	అమ్యోన్య	అమ్యోన్మ
	28	వనుకుంటాడు	ననుకుంటాడు
170	16 శ్లో	మాత్మవ	మాత్మనః
172	8	సంసార	సంసారం
	18	అది	అవి
175	5	వాడౌతోడా	వాడౌతాడో
177	4	వ్యస్త	న్యస్త
	10	వల్లి	నల్లి
	5	యాగమని	యోగమని
178	13	చీకీర్షుల	చికీర్షుల
179	27	నాత్మనా	వాత్మనా
186	8	వచ్చిన వచ్చిన	వచ్చిన
187	4	భావించబడరో	భావించబడదో
190	10	దుఃఖ	దుఃఖం
198	26	యోగను	యోగములేక ధ్యానయోగమను
218	24	రామానులు	రామానుజులు
224	29	పొందేంటందుకు	పొందేటందుకు

పుట	పంక్తి	తప్పు	ఒప్పు
270	15	వేస	వేసి
	27	రాలవు	రావు
292	16	చేతాచేతనా	చేతనాచేతనా
294	8	సమాసాల్ల	సమాసాల్లో
309	4	సీ	నీ
	16	నీ	స్నీ
310	11	రుడు	వాడు
	8	లలితాంబగారు	లలితాంబగారికి
315	4	బీభత్సధజనకమూ	బీభత్ససంజనకమూ
319	11	భీష్మద్రోణుగతి	భీష్మద్రోణులగతి
321	24	దూతులాః	మాతులాః
330	30	పస్తే	వస్తే
335	3	మయ్యేవ	8. మయ్యేవ
343	26	యస్ప	యస్య
356	8	SERODINGER	SCHRODINGER
358	26	మాత్రశ్రీ	మాతృశ్రీ
361	28	ప్రపదం	ప్రవదం
	18	లేదీ	లేదే
362	23	మహోర్షులు	మహర్షులు
370	28	సమ్మద్ధం	సమ్మర్దం
382	3	చెప్తామ	చెప్తాను
388	26	ఈ అపకృతి	ఈ ప్రకృతి
391	18	వాళ్లుకూ	వాళ్లకూ
402	3	తండ్రి అయిగా పరమాత్మ	తండ్రిగా అయి పరమాత్మ
	18	కు న్నటున్నది	కున్నట్లున్నది
437	1	నచ్చే	నిచ్చే
	30	పేర్కొన్నది	పేర్కొన్నవి
445	1	ఏదీ	ఏది
	29	విశిష్ట	వశిష్ఠ
447	14	మాటనేను	మాటనే
451	23	విగ్రహమతి	విగ్రహమని
454	9	ఉన్నారే	ఉన్నవారే
	26	భరద్వాం	భరద్వాజ
460	9	అన్నీ	అనీ
469	10	పిసిరి	విసిరి
470	7	దైవీయ సంత్తి	దైవీయ సంపత్తి

పుట	పంక్తి	తప్పు	ఒప్పు
475	10	అనుభవాన్నివ్వదు	అనుభవానివ్వదు
481	24	ఎషం	వేషం
484	6	యజ్ఞమే	యజ్ఞము
	22	గుర్తు)	) గుర్తు
486	12	తపస్మా	తపస్సూ
487	14	మౌనంతోని	మౌనంలోని
	20	వచ్చిన	నచ్చిన
	25	సేలవిచ్చినార	సెలవిచ్చినారు
489	18	ఆదేశ	అదేశ
	20	ఆదేశంలో ఆకాలంలో	అదేశంలో అకాలంలో
490	2	అందులో	లెస్సగా
496	4	నైమిత్తిశ	నైమిత్తిక
	8	ఆగతఃప్రాప్తా	ఆగతప్రాప్తా
497	17	దోషాన్ని	దోషం
500	18	నానుషజ్జతే	నా ఉనుషజ్జతే
	22	కర్మలతో	కర్మలలో
501	13	రామానుజా	రామానుజులు
505	16	యదార్థ్యాన్ని	యాదార్థ్యాన్ని
509	17	హర్షశోకాన్వితః ఇష్టం	హర్షశోకాన్వితః : ఇష్టం
510	25	ప్రవృత్తిని, వృత్తులనూ	ప్రవృత్తి నివృత్తులనూ
511	10	తిత ఉ	తితఉ
513	6	యోగే ా	యోగేనా
513	17	ప్రియవియోగం	ప్రియావియోగం
514	5	ఇదంతా	ఇదంతాయే
516	10	బ్రహ్మణ	బ్రాహ్మణ
	15	ప్రపంచంతో	ప్రపంచంలో
518	16	అన్ని	అందఱు
	20	ని ష్కయత్వ	నిష్క్రియత్వ
521	11	పటించ	పఠించ
	15	మితాహరి	మితాహారి
525	29	నిర్వికుల్ప	నిర్వికల్ప
511	2	ప్రవృత్తి ఈకర్మ	ప్రవృత్తి. ఈ కర్మ
526	9	అన్నయ్యా	అన్నాయి
529	19	గుహ్యాద్గుహ్యతనూల	గుహ్యాద్గుహ్యతరాల
530	11	బలాన్నిస్తాయి	Print Impression poor
	12	భక్తుదు	భక్తుడి
532	24	అధ్య వసాయం	అధ్యవసాయం
534	15	నియమై	నియమమై

మాతృగీత

By

Dr. K.V.Subba Rao

మాతృగీత

గీతారహస్యాలను లెస్సగా అవగాహన చేసికోవడానికి భగవద్గీతను గూర్చి సామాన్యంగా ప్రజా హృదయాలలో నెలకొని ఉన్న అభిప్రాయాలను మనం పునశ్చరణం చేసికోవాల్సివస్తుంది. యథార్థంగా వస్తువునకుండే రూపాన్ని గుర్తించ గలిగినప్పుడే కదా ఆరూప లక్షణాలు, వాటి సౌందర్య గాంభీర్యాలు మనకు అవగతమయ్యేది. ఎంతవరకు మనం వస్తువును ఉపయోగదృష్టితో, వస్తుమూల్య దృష్టితో, కావ్యకథా దృష్టితో చూస్తూ ఉంటామో, ఆయాదృష్టి కోణ దిశాగతాలైన ఆక్షేపవిక్షేపాలు ఆవస్తు యథార్థ రూపదర్శనానికి ఆటంకాలుగా నిలుస్తూనే ఉంటాయి.

అందువలన భగవద్గీతా స్వరూపాన్ని మొట్టమొదట స్థూలంగా అర్థం చేసుకుంటేనే తప్ప, దానిలోని సూక్ష్మాంశాలను సూటిగా మనస్సుకు పట్టించుకోలేక పోతాము. తద్దృష్ట్యా ఈ క్రింది విషయాలను మనం ముఖ్యంగా గమనించవలసి ఉంటుంది.

1. గీతను కేవలం చారిత్రక కథా దృష్టితోనే చూడకూడదు.

చాలమంది చరిత్రకారులు, విజ్ఞానవేత్తలు భారతంలో పేర్కొన్న అనేక ప్రదేశాల పేర్లను, పట్టణాలను, అద్యతన భారతంలో ప్రాదేశికంగా ఎక్కడెక్కడ ఉన్నవో గుర్తించి, ఆయా కథావ్యక్తులైన శ్రీకృష్ణ ధృతరాష్ట్ర ధర్మజ భీమార్జున నకులసహదేవ దుర్యోధన కర్ణాదిపాత్రల జీవితకాలాలను నిర్ణయించి, భారతయుద్ధ కాండకు కొంత రూఢమైన స్థానిక వ్యవస్థ కల్పించి, ఆరీతిగా భారతగాథలోని పూర్వాపూర్వ సంఘటనలను, నేటి అవశిష్ట శిథిలాలపైన అతికించి, కొంత రూపకల్పనా వైచిత్ర్యాన్ని ప్రదర్శించడానికి ప్రయత్నం చేశారు. ఈ ప్రయత్నం మంచిదే. దీనివలన నేడు పాడుబడి కన్పించే ఈ నేటి కట్టడాలూ, పూడిపోయిన నగరాలూ, ఒక నాడు మహైశ్వర్య సంపన్నంగా విరాజిల్లిన స్వప్న దృశ్యం మన మనస్సులలో మెరుస్తుంది. మన మనస్సులకు ఇతోధిక మహాకార్యాలు చేయాలనే ఉత్తేజక భావాన్నీ ఉత్సాహాన్నీ కల్పిస్తుంది.

కాని నాటిచరిత్ర నేడే స్థితిలో ఉన్నది? పాండవేయుల పదును కత్తుల మండి మెఱసిన ఆనాటి రణకథ. ఆనాటి ప్రతాపశౌర్య రసస్ఫురణ, నాటి సత్యవాక్సంస్కృతీ, జీర్ణదశలో చారిత్రశల్యాలతో మూలుగుతూ ఉన్నదే కాని ఏ మానవుడిలోనైన దిఙ్మాత్రంగానైనా కన్పిస్తున్నవా? లేదుకదా! దీనికెవరు బాధ్యులు? ఇదెవరి తప్పు? సమాధానమేమిటంటే ఇదెవరి తప్పూకాదు! మార్పులక్షణమే అంత! కాబట్టి పైనచెప్పబడిన పరిశోధనాత్మకమైన ప్రయత్నాలు కూడా, శాశ్వతమైన విలువలు ఆర్జించుకోకుండానే శిథిలావస్థలో విస్మృతి చెందగలవు. కాల లక్షణమే అంత! అది ఎవరి తప్పూకాదు. త్రికాలాబాధ్యమైన స్థిరత్వం ఈ దృష్టిలోలేదు. విద్యార్థులను పట్టభద్రులను చేసే ప్రయోజనం ఇది సాధించవచ్చుగాక! కాని ప్రకృతి విద్యాలయంలో భగవంతుడూ, పంచభూతాలూ జీవులకిచ్చే ప్రచండ పరీక్షా పత్రంలోని ప్రశ్నలకు, ఈచారిత్రక దృష్టితో వ్రాసిన వ్యాసాలు, గ్రంథాలూ, సమాధానం ఇవ్వజాలవు. జన్మ మృత్యుప్రహేళికా భరితమైన జీవిత సంగ్రామానికి, ఈ దృష్టితో వ్రాసిన గ్రంథాలు కూడా, కారణోప పత్తులను చూపించజాలవు. ఆత్యంతిక దుఃఖనివృత్తినీ, ఆనంద పరివ్యాప్తినీ కల్పించనూలేవు.

ఆధ్యాత్మిక విషయములయందు, పరిశోధనల పరిమితిని నిశ్చయించి చెప్పడానికే కాని పరిశోధన ఆవశ్యకతను గాని ఇతర క్షేత్రములలో దాని ఉపయోగమును గాని హీన పఱచుటకు పైవాక్యము లుద్దిష్టములుకావను మాట విజ్ఞులకు చెప్పవలసిన పనిలేదు.

గీతను సముచితమైన పద్ధతిలో దర్శించడానికి ఒకే ప్రశస్తమైన పద్ధతి భారతంలో గుప్తాంతరార్థ ధ్వనిరూపంగా చెప్పబడి ఉంది. అది ఇది. నా ఛిన్నమస్తకావ్యంలోనిది.

పంచపాండవు లనం బంచ భూతంబులు,
ద్రౌపది తలపోయప్రాణ శక్తి
అరిషడ్గుణములు కర్ణాది సంబంధులు
కౌరవేశ్వరు దహంకార గుణము.
భీష్మాదులు విశిష్ట విధ్యుక్త మార్గముల్
విదురుండు ధర్మవివేకపటిమ,
శ్రీవల్లభుడు గమ్య సీమాపరంజ్యోతి
అంబికేయుం దంధయాత్రికుండు

భారతకథా ప్రపంచ శరీరమునకు
క్రైస్తవశతాబ్ద సామాజికమ్ములైన
కొలత బద్దలతో దాని గొలువ బూను
కొనుట మన బుద్ధిహీనత గొలుచుకొనుటె
కనుక ఈ దృష్టితోనే గీతను పఠించాలి.

2. గీతను దానిలోని సంగ్రామాన్ని నేడు వ్యవహారంలో ఉన్న రాజనీతి దృష్టితో చూడగూడదు.

ఆధునిక రాజకీయ పద్ధతులకూ ఆర్యసంస్కృతిని దీపించిన మానవ ధర్మ పద్ధతులకూ, హస్తిమశకాంతరం వార! నేటి రాజకీయాలు స్వార్థపరత్వంతో, అధికార మోహాంధతతో, అన్యాయ దౌర్జన్యాలతో, అన్యోన్యకలహాలతో, దురాక్రమణలతో, దురాచార దుర్గంధంతో, పుచ్చిపురుగు లోడుతూ ఉన్నాయి. మానవతకు అలంకార గుణాలైన, సహజ దయాదాక్షిణ్యాలూ, పరోపకార బుద్ధీ, ఔదార్య గాంభీర్యాలూ, ఋజువర్తనమూ, పాపభీతీ, రాజకీయవేత్తలలో కలికానికి కూడా కానరాకుండా అదృశ్యమైపోయాయి. కపటం నయవంచనను క్షుద్రోపాసన చేసే నాయకులు జాతిని బుడ్డ పుంజులులా పట్టుకొని రక్తపానం చేస్తున్నారు. ప్రకృతి శక్తులతో సామరస్యం సాధించి, తద్వారా భగవత్సాన్నిధ్యాన్ని చేరుకోజూచే మానవ చికీర్ష, హింసాలాలసకూ, మారణ కాండకూ గూండానీతికీ, ఆత్మవంచనకూ, ఆత్మప్రాభవ జిగీషకూ, పరజాతి జిఘాంసకూ దారి దీస్తున్నది. "సర్వేజనాః సుఖినోభవంతు" అనే ఋషి మహావాణియొక్క ఆశీర్వాదస్థానంలో స్వకుక్షింభరిత్వమూ, నిష్కారణ పరహింసా ప్రవృత్తీ సుస్థాపితాలైనాయి.

ఏయే పద్ధతులు మన పురాణాలలో ధర్మబద్ధాలైనవిగా ఉపదిష్టాలైనవో, అవన్నీ నేడు అనాగరికాలుగాను, అసభ్యాలుగానూ, అసమర్థుని ప్రలాపాలుగానూ, అప్రయోజకములుగానూ నిర్ణీతాలై పోయాయి. అనృతం చౌర్యం, భ్రూణహత్య, సురాపానం, గురునింద, స్త్రీలపై అత్యాచారం మొదలైన మహాపాతకాలు, నేడు సాంఘిక, రాజకీయ, గౌరవ జీవన ఘన మర్యాదా లక్షణాలై కూర్చున్నాయి. అంతేకాదు. అవి పాలక సాధనాలయినాయి కూడా! ఇటువంటి చిత్తవృత్తులతో నడిచే కలికాల రాజకీయాల దృష్టిలో భగవద్గీతలో వర్ణితమైన జీవన సంగ్రామము, తత్సంబంధమైన మిత బోధలు, కేవలం అనాగరిక జల్పవాక్కులుగా తోచడంలో ఆశ్చర్యమేమీ లేదు. సత్యం, ఋజువర్తన, ప్రజాక్షేమం, ప్రజావాక్యం మీద గౌరవం. ఇటువంటివన్నీ దౌర్బల్య

లక్షణాలుగా భావించబడుతున్న నేటి కాలంలో భగవద్గీతా వాక్యాలను సదుపదేశా లుగా ఎవడు గౌరవిస్తాడు?

త్రికరణశుద్ధి మానవ జీవితయాత్రకు చుక్కాని వంటిదని గీత చెప్పుతుంది. ఈనాడో? ముఖ్యంగా రాజకీయ వేత్తలు సరేసరి; సామాన్య మానవుడు కూడా. అను కునే దొకటీ, బయటికి చెప్పే దొకటీ, తరువాత చేసే దొకటీ. ఇటువంటి కుటిల సభ్యతను లక్ష్యసాధనకు ఉపయోగించుకుంటున్న సమాజము భగవద్గీతలోని సత్య సాధన, 'ఆత్మన్యే వాత్మనో బంధుః, ఆత్మస్య రిపు రాత్మనః' అనే వాక్యాన్ని ఎలా గౌర విస్తుంది?

నరుల భావన ఎలా ఉన్నా, రాజుల వక్రబుద్ధులెన్ని వంకరలు తిరిగినా, పంచ భూతాల పరాక్రమానికీ ఏవిధమైన లోటూ లేదు. గీతలోని సారాంశం ఏ ఒక్క విజేతకుగాని, జాతికిగాని, రాజ్యాంగ నేతకుగాని సంబంధించినది కాదు. ఐహికాతీత విషయాలను సాధించడానికి, పురుషుడుగా పుట్టినవాడు పురుషోత్తముడుగా పరిణ మించడానికి, వ్యక్తి శరీరయాత్రకు ఏవిధంగా లక్షించి, రక్షించి, శిక్షించుకోవలసి ఉంటుందో, ఆ ప్రత్యేక విషయాన్నే గీత వివరిస్తుంది. ఆ దృష్టితోనే మనం గీతను అవగాహన చేసుకోవాలి. 'సేనయోరుభయోర్మధ్యే' అన్న మాటలలో అంతరార్థ సూచితములైన ధర్మాధర్మములనే సేనలే ముఖ్యార్థముకాని, కౌరవ పాండవ సేనలు కావనీ, అవి నిమిత్తార్థ మాత్రములే అని మనము గుర్తించాలి. ఆ దృష్టితోనే గీత అంతటినీ పఠించాలి. గీతోపదేశాలు ఏ ఒక్కజాతికీ, కాలానికీ చెందినవికావనీ, గీత దేశ కాల పాత్రాతీతమైన విలువలుకల గ్రంథమనీ మనం గ్రహించాలి.

3. ఆస్తిక బుద్ధితోనే మనం గీతాపఠనం చేయాలి. నాస్తిక బుద్ధితో చేయకూడదు.

గీతా పారాయణాన్ని దుష్టకర్మగా భావించేవాళ్ళు కూడా లేకపోలేదు. వారు గీతను అభిచార క్రియా గ్రంథంగా విమర్శిస్తారు. కృష్ణభగవానుడు ఏదోవిధంగా కౌరవవంశ నాశనం చేయబూనుకొన్నాడు. ఏవో యుక్తి వాదాలు చెప్పి అర్జునుడి చేత ఆ మారణకాండను చేయించదలుచుకున్నాడు. బాంధవుల వధ పాపకృత్యంగా అతడు తలపోసినా, ఆత్మ అవినాశి అనీ, శరీరం మాత్రమే నశిస్తుందనీ, దైవం కౌరవు లను అంతకుముందే చంపి ఉంచాడనీ, అర్జునుడు కేవలం నిమిత్త మాత్రుడనీ, అతడు యుద్ధం చేసినా చేయకపోయినా, ప్రత్యర్థి రాజలోకం బ్రదికి ఉండేమాట అబద్ధమనీ, ఇలాంటి మాటలతో అతని బుద్ధికి మత్తు మందెక్కించి, కౌరవ వధ అనే పోలేరమ్మ జాతరకు అతనిని పురిగొల్పి, కసాయివాణ్ణిగా చేసి వదిలేశాడు, అని వారి

మతం. దానివలన జరిగిందేమిటి? పితామహుడులాంటి భీష్మున్ని, సాక్షాత్తూ గురు దేవుడైన ద్రోణున్ని, ఇతర బంధువులందఱిని తెగనఱికి విడిచిపెట్టా డతడు.

'అహింసాపరమోధర్మః' అని శ్రుతులు ఘోషిస్తాయి. మతమేదైనా సరే మానవ నాశనానికి, ప్రోత్సాహమిచ్చేదిగా అది ఉండకూడదు. చేసిన దురంత వధలను సమ ర్థించుకోడానికి అల్లిన యుక్తివాద రూపమైన మారణ తంత్ర గ్రంథమూ, హింసాత్మక కావ్యమూ కాక గీత జీవిత పరమార్థాన్ని నిరూపించగల ప్రమాణ గ్రంథం కాదు. మానవ కళ్యాణ సూచకమైన బోధ కాని, మానవత్వాన్ని నిర్ధారించే వాక్యంగాని ఒక్కటి కూడా అందులోలేదు. మానవ జీవితానికి పవిత్రతనిచ్చే ఆశావాదం అందులో అసలే లేదు. నిక్కచ్చిగా కళ్లకు స్పష్టంగా కనిపించే సదేహజీవితాన్ని కాలదన్నుకొని, విదేహ జీవితాన్ని శ్లాఘించే ఇటువంటి కృత్రిమ మతగ్రంథాలు, మానవులకు చెడుగే చేస్తాయి కాని శ్రేయస్సును చేకూర్చవు. కనుక గీతాపఠనాన్ని నిషేధించాలని ఈ అతివాదుల మతం.

సామాజికవాదుల మతంలో ఈ వాదానికి కొంత మఱుకు పట్టున్నది. ఈ తర గతికి చెందిన వారికి పుట్టుకతో వచ్చిన జీవితం చావుతో తీరిపోతుందనే కాని వ్యాపారం అంతటికీ సూత్రధారుడొకడున్నాడనే విశ్వాసం ఉండదు. చావుకూడా జీవితంలో భాగమే అనే భావం అసలే ఉండదు. అణువిజ్ఞానాన్ని అవలోకించినా, ప్రాణపరివర్తన విద్యను ఆలోకించినా, పిపీలికాది బ్రహ్మపర్యంతంకల జీవరాసులలో జీవస్పందలేని వస్తువు ప్రకృతిలో లేనేలేదు. అణువు మొదలు బ్రహ్మాండం వఱకు అంతా భగవత్స్వరూపమే అని వేదం చెబుతుంది. భగవద్గీత దాన్ని విపులీకరిస్తుంది. మనము నిత్యమూ పీల్చేగాలిలో కంటికి కనిపించని కోట్లాది సూక్ష్మ జీవరాసులు న్నాయి. త్రాగేనీటిలో భూతద్దానికి కూడా గోచరించని అసంఖ్యాకములైన జీవరాసు లున్నవి. మనదేహంలోనే శరీర యంత్ర చాలనక్రియలవల్ల అనుక్షణం లక్షల కొద్దీ జీవరాసులుత్పత్తి అవుతూ ఉన్నవి. లక్షల కొద్దీజీవరాసులు నశిస్తూ ఉన్నవి. అవి కూడా మనలాగానే సప్రాణజీవులే. వాటిని నాశనం చేయడానికి మనకు నిజానికి హక్కులేదు. పెరుగు తోటకూర మొక్క లక్షలాది సూక్ష్మజీవాణువులను ఆహారం చేసు కుని వర్ధిల్లుతుంది. దానిని పెంచే ప్రతిజీవాణువు దానిలాంటి జీవత్ప్రకృతియే. ఆ మొక్కను మనం తరిగి కూర చేసుకుని తింటాం. జీవాణువులు లేని ఆహారపదార్థమే లేదు.

అందుకనే 'అన్నం పరబ్రహ్మస్వరూపమ్' అని శ్రుతులు చెప్పుతాయి. 'అన్నా ద్భూతానిజాయంతే జాతాన్యన్నేన వర్ధంతే' అని కూడా శ్రుతివాక్యం. అన్నం నుంచి

భూతాలు పుట్టాయి. అన్నం చేతనే అవి వర్ధిల్లుతాయి అని తాత్పర్యం. అదే శ్రుతి ఇంకో విశేషం కూడా చెప్పింది. 'అద్యతే ఉ త్తిచ భూతాని తస్మాదన్నం తదుచ్యత ఇతి' అనివాక్యం. భూతాలను తినేస్తుంది కనుక దానికి అన్నం అని ప్రసిద్ధి వచ్చిందని భావం. భూతాలు తినేది అన్నమనే మాట ఎంత సమంజసమైనదో, భూతాలను తినేది కూడా అన్నమే అనేమాట కూడా అంత సమంజసమైనదే.

అయితే ఇక్కడ హింసాస్థానం అన్నమా? భూతాలా అని ప్రశ్న.

'అహింసాపరమోధర్మః' అనే సిద్ధాంతాన్ని పట్టుకొని ప్రేలాడిన బుద్ధ భగవానుడు గొంతులో ఒక ఎముక పేడు 'గ్రుచ్చు' కొని శరీర యాత్ర చాలించాడని చరిత్ర చెబుతుంది. ఈసందర్భంలో మేకను చంపిన హింస బుద్ధభగవానునికంట గట్టాలా? అని ప్రశ్న. మొక్కలు బాగా ఎదగడానికి చేపలను చంపి ఎరువుగా వేస్తారు. చేపలను పట్టుకోడానికి ఎఱ్ఱలను చంపి వాటి ముక్కలను గాలానికి తొడుగుతారు. పెద్ద చేపలను పట్టుకోడానికి చిన్న చేపలను గాలాలకు గ్రుచ్చి పడేస్తారు. మనిషి ఆరోగ్యంగా ఉండడానికి షార్క్‌లివర్ ఆయిల్, కాడ్‌లివర్ ఆయిల్ త్రాగుతాడు.

శాకాహారి అయిన బెర్నార్డ్ షాకు డాక్టర్ ఒకసారి షార్క్‌లివర్ ఆయిల్ ఇంజక్షను ఇచ్చాడు. ప్రక్కన ఉన్న స్నేహితుడు షాను అడిగాడుట.

ఏమయ్యా! నీవు శాకాహారినంటావు. జంతువును చంపి తిత్తి ఒలిచి తీసిన లివరు సారాన్ని ఎలా శరీరంలోకి ఎక్కించుకున్నా'వని.

షా బదులు చెప్పాడట.

'నీవూ శాకాహారివే! రోజూ పాలు త్రాగుతున్నావు కదా! ఆ పాలు జంతువుల శరీరాల తిత్తులలో నుంచి రావడంలేదా' అని. తల్లి జీవాణువులతో నిండిన పాలను శిశువు త్రాగుతుంది. శిశువు తల్లిని హింసించిందనుకుంటామా?

కాబట్టి హింసావ్యాపారాన్ని, మారణ కాండనూ, ఇదమిత్థమని నిరూపణ చేసి నిర్ణయించడం కష్టం; సబబు కాదు కూడాను.

అమ్మ ఈ సందర్భంలో ఏమంటుందో చూడండి. ఎవరో అడిగారు అమ్మను.

'అమ్మా! మేము మాంసాహారులం. మరి హింస పాపం కదా! మేమేమి చెయ్యాలంటారు! అదీకాక, ఆహారం కోసం చేసేది కొందఱు హింస కాదంటారు! కొందఱు హింసయే అంటారు! ఏది నిజమమ్మా?'

'హింస అంటే సహించలేనిదే నాన్నా! మేకలను కోసేవాడు, ఆవులను నఱకడం సహించలేడు. కోళ్లను కోసేవాడు గొఱ్ఱెలను చంపడం చూడలేడు. సర్వమూ

ప్రాణమయమే అనుకున్నప్పుడు, అన్నము తినడమూ, కూరగాయలను కోయడమూ, మంచినీళ్లు త్రాగడమూ కూడా హింసే కనుక ఏది హింస, ఏది కాదు? అన్నది సమస్య కాదు. 'ఎవరు ఏది - సహించలేరో- అది హింసకాబట్టి- దానిని మానుకుంటే సరి - అదీ మానుకోగలిగితే'- అని సమాధానం ఇచ్చారు.

కనుక నిత్యమూ పరివర్తనచెందే జీవిత వ్యాపారంలో ఏది చస్తున్నదో ఎవరు చంపుతున్నారో, ఏది ఎంతసేపు చస్తున్నదో, ఎంతసేపు బ్రతుకుతూ చస్తూన్నదో, నిర్ణయించడం సాధ్యం కాదు. జీవితమే మహా సంగ్రామం. అందులో జీవనిర్మాణ క్రియలో జీవ విధ్వంసక్రియ కూడ ఇమిడియే ఉన్నది. కాల సాగరంలో ఒక క్షణం వెనుకబడుతూ ఉంటే మఱొక క్షణం బయటపడుతూ ఉంటుంది. కాల యంత్రాం గాన్నీ, పంచభూతాల యంత్రాంగాన్నీ, ఈరెంటినీ జతకూర్చి నడిపే పరాశక్తి భావప్రేరణనూ, లెస్సగా అర్థం చేసుకుంటేనేగాని, జీవప్రకృతికి, భావప్రకృతికి అతీత మైన పారమాత్మిక రహస్యాలను చర్చించిన గీతాసారం రుచిచూడజాలము.

ఉత్పత్తి స్థితి సంహారములు ప్రకృతిలో నిత్యమూ జఱిగే వ్యవస్థలు. విశ్వ క్రియా ప్రయోజనానికి ఈ మూడూ మూడు ముఖాలు. ఒకచోటి సూర్యోదయం ఇంకో చోటికి సూర్యాస్తమయం. చూసేవాడు అనుకోవడంలో వచ్చిన మార్పేకాని, సూర్యుని మార్పేమీ లేదిందులో. నిత్యమూ కనిపించే జన్మ మృత్యువులూ ఇంతే. జన్మవలెనే చావుకూడ ప్రకృతిలోని తప్పించుకోరాని వ్యవస్థ అని తెలిసికొని మనుష్యప్రయత్నం ఎంత చేసినా విధి నిర్ణయించిన ఈరెంటినీ ఎవడూ తప్పించుకోలేడనీ, గీత సక్ర మంగా భోధిస్తుంది. దేవుడు లేడనుకునే నాస్తికవాదులు లేవదీసే హింసా హింసాత్మక సిద్ధాంతాలు గట్టిగా నిలదీసి అడిగితే నిలిచేవికావు. గీత నిత్య సత్యాలయిన మృత్యువు, జీవితము, వాటిని నిర్ణయించే భగవత్ప్రేరణను గుఱించి చెప్పుతుంది. కనుక మానవ సంహారకాండను ప్రోత్సహించే గ్రంథమది అని కొందఱు చేసే విమర్శ సహేతుక మైనది కాదు.

4. గీతను పురోభాగి దృష్టితో పఠించకూడదు. విశ్వాసంతోనూ, భక్తితోనూ పఠించాలి.

పురోభాగులనగా దోషైక దృక్కులనే అర్థం. ఉన్నా లేకపోయినా ప్రతి విషయం లోనూ లోపాలు చూపడమే వారి ధ్యేయం. లోపాలు వెదకడం అనే ఈ జాడ్యం గత శతాబ్దంలో ఎక్కువగా అంకురించింది. విజ్ఞానం, తర్కం, హేతువాదం, ప్రమాణసిద్ధి ఈ శతాబ్దంలో వెలిగే దీపాలు, ఈదీపాల కాంతిలో కనిపించే వస్తువుకే అస్తిత్వం ఉన్నదనీ, లేని దానికి అస్తిత్వం లేదనీ ఆధునికులలో చాలామందికి విశ్వాసం.

గుణద్రవ్యరూప సహితాలైన ప్రకృతి భాగాలకే ప్రయోగాలూ, ప్రత్యక్ష ప్రమాణాలూ వర్తిస్తాయి. ఆ ప్రయోగాల కతీతమైన దానిని నమ్మడానికి ఆధునికుల మేధస్సు లంగీకరింపవు.

ప్రయోగముల కతీతమైన నిర్గుణ నిర్వికార నిర్ద్వంద్వ, నిరాకార పరబ్రహ్మ తత్వాన్ని గూర్చిన విషయాలలో, తార్కికయుక్తితో పర్యవేక్షించే మానవబుద్ధికి, తర్కాని కందని అనేక ప్రతిబంధకాలు అడ్డుతగులుతూ ఉంటాయి. వాటిని నిరాధారాలు గానూ మూఢ విశ్వాసాలుగానూ త్రోసివేసి గీతను అవినీతిని రెచ్చగొట్టే పుస్తకంగా నిర్ణయించే ప్రబుద్ధులు లేక పోలేదు.

వారి వాదం ప్రకారం గీతాప్రబోధాలు యువకులను, బాధ్యతాహీనములైన ప్రవర్తనలకు, చేష్టలకు ప్రేరేపించి, అనేక వ్యసనాలకు గూడా పురికొల్పుతాయని, వారికి పుణ్యాత్ముల బురఖాలను కూడా తగిలించి పంపుతాయనీ గీత మీద వారు చేసే ఆరోపణ. ఎందుకంటే హత్యలు గీత ప్రకారం పుణ్యకార్యాలు. భగవంతుడు ఆ హత భాగ్యులను అంతకుముందే చంపి ఉంచాడు. హంతకులు నిమిత్తమాత్రులే వారి దోషమేమీలేదు. కనుక గీతను ప్రమాణగ్రంథంగా చేసుకుని ఎవడైనా, ఎవడినైనా నిరభ్యంతరంగా హత్య చేయవచ్చు. ఎందుకంటే 'య ఏనం వేత్తి హంతారం యశ్చైనం మన్యతే హతమ్ ఉభౌతా నవిజానీతో నాయంహన్తి న హన్యతే' ఈ ఆత్మ చంపబడుతుందనీ, ఈ ఆత్మ చంపుతుందనీ తలచేవారిద్దఋూ తెలియనివాళ్లే, ఆత్మ చంపబడదు చావదు' అని పరమాత్మ సెలవిచ్చారు కనుక. ఈ విధంగా దుర్నీతులను గీత ప్రేరేపిస్తుందని వారి వాదం.

ఈ సందర్భంలో అమ్మ మాటలను స్మరించడమే సముచితమైనకార్యం. ఒక సారి అమ్మ మనం చేసే పనుల్లో మనబాధ్యత ఎంత ఉన్నదో వివరిస్తూ ఇలా అన్నది.

అమ్మ: నిజమే! చేసేవాడూ చేయించేవాడూ వాడే అనుకున్నప్పుడు నీకలాంటి పాపపుణ్యాలు లేవు అని భావిస్తున్నాను.

నేను: ఒకడు ఒకడ్ని చంపుతున్నాడు అంటే అది వాడివల్ల జరిగే, జరుగుతున్న పని కాదనుకోమంటావా?

అమ్మ: (చిరునవ్వు చిందిస్తూ) అలాగే అనుకో నాన్నా!

నేను: అదేమిటమ్మా! అలా అంటావు! నీ సిద్ధాంతమే నిజమని భావిస్తే ఒకడు మరి ఒకడిని ఇట్టే చంపి అలా చంపబడడం తనవల్ల జరుగుతున్నది కాదని ఆభారం దైవం మీదికి త్రోసి తప్పుకోడూ ?

అమ్మ: అలాగా! పద నాన్నా - నీకో కత్తి ఇస్తాగానీ నీవే చంపుతున్నావు అనుకుని ఎవరినైనా ఒక నలుగురిని చంపిరా! చూస్తాను. అలా నీవు చంపినందువల్ల వచ్చే పాపానికి నేను బాధ్యత వహిస్తాను.

అమ్మ అలా నలుగురిలో నన్ను ఛాలెంజ్ చేసి అడిగేటప్పటికి నాకు ఒకమారుగా మతిపోయినట్లయింది....

అమ్మ: ఆ పైవాడి ప్రయత్నమంటూ లేనిదే ఎవడ్ని ఎవడూ చంపలేడు. అ చంపేవాడూ చంపబడే వాడూ అంతా వాడి నిర్ణయమే నాన్నా..

ఈ ప్రసక్తే పదకొండో అధ్యాయం 34వ శ్లోకంలో కూడా వస్తుంది.

అనుల్లంఘ్యమై, సర్వజ్ఞరూపమై, స్వపర సృష్ట్యాత్మకమైన ఒక సర్వశాసక పరంజ్యోతి తనలో నుండి ప్రసరించిన ఒక కిరణానికి వాగ్రూప సాక్షాత్కారంచేసిన సరస్వతి భగవద్గీత. ఆ కిరణమే అర్జునుడు. ఆ పరంజ్యోతి కృష్ణ పరమాత్మ. మమ కారాంధులమైన మన ప్రశ్నలన్నీ గ్రుడ్డి రాజు వేసిన ప్రశ్నలలాగే ఉంటాయి. ధృత రాష్ట్రుడు ఏమని ప్రశ్నించాడు?

మాతృగీత

భగవద్గీత

అర్జున విషాద యోగము

ప్రథమాధ్యాయము

ధృతరాష్ట్ర ఉవాచ-

ధర్మక్షేత్రే కురుక్షేత్రే సమవేతాయుయుత్సవః।
మామకాః పాండవాశ్చైవ కిమకుర్వత సంజయ!॥

తా: ధృతరాష్ట్రుడిట్లు పలికెను

యుద్ధం చేయడానికి సిద్ధమై ధర్మక్షేత్రమైన కురుక్షేత్రం చేరిన నా పుత్రులు పాండవులు ఏంచేశారు సంజయా?

గీత ధర్మశబ్దంతో ప్రారంభిస్తుంది. కురుక్షేత్రాన్ని ధర్మ క్షేత్రంగా నిర్ణయిస్తుంది, నిరూపిస్తుంది.

"అమ్మా! ధర్మం ధర్మం అంటున్నారు కదా! ఏది ధర్మం? దానిని మేమెట్లు ఆచరించాలి?"

"మన శాస్త్రాలలో ధర్మాలన్నీ చెప్పబడే ఉన్నయ్. నాన్నా! అవి ప్రతి మానవునికీ కొన్ని పనులను నిషేధించినయ్. కొన్నింటిని శాసించినయ్. కాని ఎవరూ నిషేధించిన వాటిని మానుకున్నదీ లేదు. శాసించిన వాటిని ఆచరిస్తున్నదీ లేదు. అంటే ఈ విధినిషేధాలను బట్టి కాదు మానవుడు ఆచరిస్తున్నది. ఏది అవసరమో అది ఆచరిస్తున్నాడు. అంటే మనిషిని అవసరమే నడుపుతున్నది. అవసరమే విలువయినదనిపిస్తుంది నాకు.

అమ్మ– Natural expediency

పురాణాల్లో ధర్మ గ్రంథములలో శాసించబడి ఉన్నా, భారతయుద్ధం ఎందుకు రావలసి వచ్చింది? ఆ ధర్మాలను ఎందుకు దుర్యోధనుడు కాని, ఇతర కౌరవేయులైన మేధావులు కాని ఆచరణలో పెట్టలేదు. ధర్మాలు ప్రకృతి సహజాలయిన మార్గాలమీద వేయబడ్డాయి. వాటి నడక సరియైన దారుల్లో జరిగినంతవఱకు రైలుబండి పట్టాలనంటి పెట్టుకునే పరిగెత్తుతుంది. ధర్మాలు తారుమారైనప్పుడు బండి పట్టాలు తప్పుతుంది. బండి పట్టాలు తప్పితే జరిగే విధ్వంసకాండ అంతా అందఱికీ తెలిసిందే! అదే జరిగింది కురుక్షేత్రంలో. తమకు ఐదు ఊళ్లు ఇచ్చినా చాలునన్నారు పాండవులు. సూది మోపినంత జాగా కూడా ఇవ్వనన్నాడు దుర్యోధనుడు.

ధర్మం పట్టాలు తప్పిన కురుక్షేత్రంలో సోదరులూ, బంధువులూ ఐన కురు పాండవులకు యుయుత్సువులు– తమ వాటాల కోసం– యుద్ధం చేయడానికి ఇచ్ఛ గలవారైనారు.

పాండవుల అరణ్యాజ్ఞాతవాసకాలాలైన పదమూడేండ్ల గ్రుడ్డిపాలనలో దుర్యోధనుని స్వైరత్వానికి తాళం వేసి, హస్తినాపుర ప్రాభవంకోసం సర్వస్వం త్యాగం చేసిన భీష్మపితామహుల వంటి మహానుభావుల నోళ్ళకు కూడ రాజేచ్ఛ అనే తాళాన్ని వేసిన ధృతరాష్ట్రుడు శ్లోకంలో మనస్సులోని విషాన్ని కక్కేశాడు.

వ్యంగ్యంగా అడిగినా మొదట అతడుపయోగించిన 'మామకాః' అనే మాటలోని తన పుత్రులమీద కరడుగట్టిన మమకారాన్ని 'పాండవాః' అనే మాటలోని పరకీయ తను చదువరులు గుర్తించక పోరు.

ఈ మామకాః అనే మాటలేకపోతే పైశ్లోకం నిర్జీవమైపోయి ఉండేది.

18 అధ్యాయాల గ్రంథంకల భగవద్గీత అంతటికీ ఈ మొదటి శ్లోకం ఒక్కటే 'ఈ గ్రుడ్డి రాజు పలికినిది. సంజయ అనే సంబోధనవలన ధృతరాష్ట్రుని నిస్సహాయత, అంధత్వమూ స్పష్టంగా కనిపిస్తున్నా, మమకారాహంకారాలవలన కనులతో బాటు మనసు కూడా గ్రుడ్డిదైంది.

ఈ విషయం 2వ అధ్యాయంలోని 27వ శ్లోకంలో వస్తుంది. ఆ శ్లోకం ఇది "ప్రకృతేః క్రియమాణాని గుణైః కర్మాణి సర్వశః అహంకార విమూఢాత్మా కర్తా హ మితి మన్యతే."

ప్రకృతి శక్తిని విస్మరించి అహంకార విమూఢాత్ములైన వారు తమ శక్తి వలననే పనులన్నీ జరుగుతున్నాయని తలుస్తారు. నిజానికి కార్యాన్ని జరిపించేది ప్రకృతి శక్తియే. అహంకార మూఢులైనవారు ఇతర శక్తులను నమ్మరు. తమశక్తి వల్లనే అన్నీ జరిగిపోతే అందఱూ రాజులూ, ప్రధానమంత్రులూ అయి ఉండేవారే. వారి ఉత్త మాంగాలు అటువంటి తలపులకు రానేరానీయవు. చివరకు అట్టి ఉత్తమాంగాలను ఆ మృత్యు శక్తియే, ఆ ఘటనా శక్తియే చూర్ణీకృతం చేసి కబళిస్తుంది.

వక్త్రాణి తే త్వరమాణా విశన్తి
దంష్ట్రా కరాళాని భయానకాని।
కేచి ద్విలగ్నా దశనాంతరేషు
సందృశ్యంతే చూర్ణితై రుత్త మాంగైః॥

ఈ శక్తి కున్న మరోపేరు ధర్మం.

కార్యాన్నీ కారణాన్నీ సజావుగాకలిపి ఉంచి సార్వకాలికంగా, సార్వదేశికంగా, సార్వజనీనంగా. ఒకే ఫలితాన్నిచ్చి బుద్ధివాదానికి లోబడ కుండా అవ్యయంగా ఉండే అంతిమాతీత శక్తినే ధర్మం అంటారు. ఆ శక్తికి అన్నివైపులా చేతులూ, కాళ్ళూ, మనస్సూ, ప్రేరణా, ధారణా, క్రియా వేగం పని చేస్తుంటాయి. అదే కౌరవులు విస్మరించిన దైవక్రియా శక్తి.

విధి ధర్మాన్ని నిర్వహిస్తుంది. క్రియా శక్తిగా ప్రేరణగా అంకురిస్తుంది. జగత్తుగా విస్తరిస్తుంది. దాని ప్రభావం మనకంటే, మనందఱి కంటే, మనందఱి విజ్ఞానం, ప్రాణశక్తుల కంటే, చేతనత్వ చిచ్ఛక్తుల కంటె పెద్దది. క్లుప్తమూ, లుప్తమూ కావడము మహత్తుగా విరిసిపోవడం, చైతన్య శేషంగా మిగిలి అదృశ్యం కావడమూ దాని లక్షణాలు. లక్షణమే కార్యావసరాలను కూడగట్టుకొని ధర్మమవుతుంది. దీనిని గుర్తించని వాడు ప్రతి వాడు ధృతరాష్ట్రుడే.

'యమే వైష వృణుతే తేన లభ్యః' అని కఠోపనిషత్తు వక్కాణిస్తుంది.

దాన్నే అమ్మ నమస్కారం నీవు పెట్టడం కాదు. నేను పెట్టించుకోవడమే అంటుంది. పారమార్థికంగా నమస్కరించినవాడు అని భేదం లేదని అంటుంది అమ్మ. మీరు కానిది నేనేమీ కాదంటుంది. ఒకటి పేరుకున్న నెయ్యి రెండవది కరిగిన నెయ్యి! ఈ మార్పులను పొందుతూ మార్పుల కతీతమైన వాడు సంజయుడు.

గ్రుడ్డి రాజు ప్రశ్నకు సంజయుడేమని సమాధానమిచ్చాడు?

సంజయ ఉవాచ:

2. దృష్ట్వాతు పాండవానీకం వ్యూఢం దుర్యోధన స్తథా।
ఆచార్య ముపసంగమ్య రాజా వచన మబ్రవీత్॥

ఈ శ్లోకం మొదలుకొని సంజయుడు ఇరువాగుల సైన్యసన్నాహాన్ని వర్ణిస్తాడు. కౌరవ చక్రవర్తికి సుయోధనుడు, దుర్యోధనుడు అని రెండు పేర్లున్నాయి. తన సైన్యం అపారంగా ఉన్నా, ఎదిరిసేనలు అల్ప తరంగా ఉన్నా, నైతికమైన విశ్వాసం లేక పోవడం మూలాన వెంటనే అధైర్యచ్ఛాయలు మనస్సు పైన అల్లుకోగా గురువైన ద్రోణాచార్యులను సమీపించాడు.

చక్రవర్తి కనుక సైన్యాధిపతిని తానే కబురుపెట్టి రప్పించుకోవచ్చు. కాని గురువుపై గౌరవము, ప్రపత్తి, కనబఱచినట్లయింది తానే ఆచార్యులను సమీపించడం వలన.

ఈ సందర్భంలో దుర్యోధన శబ్దాన్ని వాడి వ్యాసభగవానుడు కురు రాజును చక్కగా చిత్రించాడు. ఆచార్యశబ్దాన్ని వాడి దుర్యోధనుడు కేవలం శిష్యపరమాణు వేననీ కూడా సూచిస్తూ, రాజా అనే శబ్దాన్ని వెంటనే వాడి అతనిలోని అహంకారాన్ని ప్రదర్శించాడు. వెళ్లేటప్పుడు శిష్యుడుగా వెళ్లినా మాటల్లో మాత్రం దుర్యోధనుడు రాజరికాన్ని ప్రదర్శించాడని భావం.

3. దుర్యోధన ఉవాచ

పశ్యైతాం పాండుపుత్రాణాం
ఆచార్య! మహతీం చమూమ్।
వ్యూఢం ద్రుపద పుత్రేణ
తవశిష్యేణ ధీమతా॥

దుర్యోధనుడు చెబుతున్నాడు.

తా: ఆచార్యవర్యా! ధీమంతుడును, మీదుమిక్కిలి తమ శిష్యుడును ఐన దృష్టద్యుమ్నునిచే మోహరింపబడినదియు మహత్తరమైనదియునైన ఈ పాండవుల సైన్యాన్ని చూడండి.

ఈ శ్లోకంలోనూ రాబోయే శ్లోకాల్లోనూ, దుర్యోధనుడి అవిచారితమైన వాచాలత్వం బాగా గోచరిస్తుంది. మనస్సులో చిత్తవిభ్రమం తాండవిస్తున్నప్పుడు యుక్తాయుక్త పరిజ్ఞానాన్ని కోలుపోవడం సహజం. పాండవుల హక్కుభుక్తములైన రాజ్యాధికారాలను అపహరించి అన్యాయ యుద్ధానికి సిద్ధమైనాననే అంతఃకరణ భీతి అతన్ని పీడిస్తున్నది, అందువలన ఎవరితో ఏం మాట్లాడుతున్నదీ తెలియడం లేదు. గురువులకు ఎలా గౌరవమివ్వాలో కూడా తెలియడం లేదు, కనుక వ్యంగ్యంగా గురువుతో మాట్లాడుతూ కూడా, అప్రస్తుతమైన ఎత్తి పొడుపు మాటలను మాట్లాడసాగాడు. 'తవ శిష్యేణ', అనే మాటలో నీవుద్రుపద పుత్రునికి యుద్ధవ్యూహ రచనా రహస్యాలన్నీ చెప్పావు, తప్పు చేశావు. ఇప్పు డతడు మన శత్రుపక్షంలో చేరి గురువు కెదురు తిరిగి పంగనామాలు పెట్టసాగాడు. ఏకు మేకై కూర్చున్నాడు. అని నిందాగర్భితంగా ఉండే మాటలను ప్రయోగించాడు.

దీనికి మూలహేతువు, తనకంటే ఏదోమహత్తరమైన శక్తి సర్వకార్యాలను నడిపిస్తున్నదనే అంతరంగ మహామంత్రం వెంటబడి వేధిస్తున్నది. అది ప్రేరణ. అది అనిపిస్తున్న మాటలను అతడు పలుకుతున్నాడు. తన మాటలు ఎదుటివారికి మధురాలుగా ఉన్నయ్యా అనే గొడవేలేదతనికి।

ధీమతా, తవ శిష్యేణ అనే మాటలు శ్లోకార్థాన్ని పరాకోటికిదెచ్చి విడిచి పెట్టాయి, గురువుకు పంగనామాలు పెట్టే వాడుగా ధృష్టద్యుమ్నుడు తయారయ్యాడు అనే భావాన్ని దుర్యోధనుడు తన మాటలలో ధ్వనింప జేశాడు. శిష్యుడని అతన్ని కరుణించవద్దు అనే ధ్వని కూడా ఈమాటల్లో ఉంది.

శ్లో: **అత్ర శూరాః మహేష్వాసాః భీమార్జున సమాః యుధి।**
యుయుధానో విరాటశ్చ ద్రుపదశ్చ మహారథః॥

శ్లో: **ధృష్ట కేతు శ్చేకితానః శాశీరాజశ్చ వీర్యవాన్।**
పురుజి త్కుంతిభోజశ్చ శైబ్యశ్చ నరపుంగవః॥

శ్లో: **యుధామన్యుశ్చ విక్రాంతః ఉత్తమౌజాశ్చ వీర్యవాన్।**
సౌభద్రో ద్రౌపదే యాశ్చ సర్వ ఏవ మహారథాః!!

తా: భీమార్జున సమానులైన, యుయుధానుడు, విరాటరాజు, ద్రుపదుడు, ధృష్టశేతువు చేకితానుడు, కాశీరాజు, పురుజిత్తు, కుంతి భోజుడు, శైబ్యుడు, యుధా మద్యుడు, ఉత్తమౌజుడు, సౌభద్రుడు, ఉపపాండవులు వారి సైన్యములో మహారథు లున్నారు. కాని అతిరథుడవైన నీకు వారందఱిని జయించడం కష్టంగాదు. కాని వారి సైన్యం ఉపేక్షించదగినదీ కాదు.

అస్మాకం తు విశిష్టా యే తాన్నిబోధ ద్విజోత్తమ!
నాయకా మమ సైన్యస్య సంజ్ఞార్థం బ్రవీమితే.

తా: బ్రాహ్మణ శ్రేష్ఠుడవైన ద్రోణాచార్యా! ఇంతవఱకు పాండవ సేనలోని వీరులను గూర్చి నీకు చెప్పే ఉన్నాను. ఇక మన సేనలోని వీరాధివీరులను గూర్చి కూడా తెలిసికోవలసి ఉంది. నీవు ప్రత్యేకంగా గుర్తించగలందులకు వాళ్ళను కూడా పేర్కొంటున్నాను.

వ్యా: గత శ్లోకాలలో దుర్యోధనుడు పేర్కొన్న వీరులందఱూ ద్రోణాచార్యుని శిష్యులే అని సాభిప్రాయంగా ఉటంకించాడు, అంటే యుద్ధంలో నీవు వాళ్ళమీద దయచూపక మానవని వ్యంగ్యంగా సూచించాడు.

అంతటితో ఊరుకోక మన సైన్యంలోని వీరులను కూడా నీకు జ్ఞాపకం చేస్తున్నాను. అనడంలో ద్రోణుడు సేనాపతి అయిఉండీ కూడా వాళ్ళను మఱిచి పోయాడనా అతని అభిప్రాయం? లేక వాళ్ళు తన శిష్యులు కారు అని వాళ్ల యోగక్షే మాలను ఆతడు విస్మరిస్తాడనా? లేక తానుచేసిన అక్రమాలూ, అన్యాయాలూ,

భయాపస్మార పిశాచాల రూపాలతో బుద్ధిని పట్టుకోవడం మూలాన, మోహరించిన సైన్యాలను చూచి స్వస్థత తప్పిన మనస్సుతో గురువైన ద్రోణాచార్యుల విశ్వాసాన్ని కూడా శంకించే దురవస్థలో పడ్డాడా దుర్యోధనుడు? ఎంతటి వీరాధి వీరులకైనా అధర్మపద్ధతికి ఒడిగట్టి నప్పుడు అంతరాత్మ ఘోషింపక మానదని కవి అభిప్రాయం గావచ్చు.

8. భవాన్ భీష్మశ్చ కర్ణశ్చ కృపశ్చ సమితింజయః
అశ్వత్థామా వికర్ణశ్చ సౌమదత్తి స్తథైవ చ॥

9. అన్యేచ బహవశ్శూరా మదర్థేత్యక్త జీవితాః
నానా శస్త్ర ప్రహరణా స్సర్వే యుద్ధ విశారదాః॥!!

10. అపర్యాప్తం తదస్మాకం బలం భీష్మాభి రక్షితమ్॥
పర్యాప్తం త్విదమేతేషాం బలం భీమాభి రక్షితమ్॥

11. అయనేషుచ సర్వేషు యథాభాగ మవస్థితాః
భీష్మ మేవాభి రక్షంతు భవన్త స్సర్వ ఏవ హి॥

తా: దుర్యోధనుడు తన తొందరపాటును వెంటనే గుర్తించాడు. గురువైన ద్రోణాచార్యుల మనస్సును నర్మగర్భాలైన తన మాటలచేత నొప్పించానని తెలుసుకున్నాడు. ద్రోణుడేమీ బదులు చెప్పకుండా ఉండడంతో అతని అనుమానం స్థిరమైపోయింది. శ్లాఘాపూర్వకంగా అతన్ని ప్రసన్నం చేసుకోవాలనుకున్నాడు.

మహా సేనానాయకుడైన భీష్మాచార్యుణ్ణి రెండోస్థానానికి నెట్టి, భవాన్ అని మొదలుపెట్టి వీరాధివీరుల ప్రథమ స్థానాన్ని ద్రోణాచార్యుల కిచ్చాడు. ద్రోణుని బావ అయిన కృపాచార్యునికి సమితింజయ అనే బిరుదాన్ని తగిలించి ప్రత్యేకాభిమానాన్ని చూపించాడు. ద్రోణపుత్రుడైన అశ్వత్థామను కూడా ప్రత్యేకంగా పేర్కొన్నాడు. చెప్పిన ఏడుగురు వీరులలో ముగ్గురు ద్రోణుని కుటుంబీకులు, ఆవిధంగా గురు నిందాగర్భిత వాచాపచారానికి ప్రతిక్రియ పొగడికతో ద్రోణుని మనస్సు రంజింపచేయడానికి ప్రయత్నించాడు దుర్యోధనుడు. చండ శాసనత్వంతో, రాజ్యకాంక్షతో వివేకదృష్టిని కాలరాచిన చక్రవర్తుల ప్రవర్తన ఇలాగే ఉంటుంది.

'మదర్థేత్యక్త జీవితాః' అనే మాట రాబోయే యుద్ధ ఫలితాన్ని సూటిగా సూచిస్తుంది. దుర్యోధన బలం ఎలాగూ పరాజయం పొందడం నిశ్చయమనీ, యుద్ధంలో కౌరవసేనలోని చెప్పబడ్డ కురువీరులందఱు త్యక్తజీవులయ్యే వారేననీ, విధినోట్లో తలకాయపెట్టి చూర్ణితమయ్యే గతి వారికి తప్పదనీ, ఈ శ్లోకం ధ్వనిస్తుంది.

అపర్యాప్త పర్యాప్త శబ్దాల ద్వంద్వ వ్యాఖ్యానం కూడా దీన్ని దృఢ పరుస్తుంది. పర్యాప్తశబ్దానికి చాలినంత కొలతపెట్టదగినంత అనీ, అపర్యాప్త శబ్దానికి, పనికి సరిపోని పరిమాణంగల అనీ అర్థాలున్నాయి, స్వపర సేనలపరంగా ఈ శబ్దాలను వర్తింపచేసి వ్యాస భగవానుడు ఈ సందర్భంలో దుర్యోధనుని మానసిక వికలావస్థ లోని రెండు దృశ్యాలనూ చమత్కరించి చూపాడు.

భీముడంటే దుర్యోధనుడికి సింహ స్వప్నం. తన సేన 11 అక్షౌహిణులున్నా, భీమునిచే నడపబడేది 7 అక్షౌహిణులే అయినా భీమకర్ముడయిన అతనివలన సుయో ధనుడికి భయమే. స్వల్ప సంఖ్యగల పాండవసేనను భూతద్దంలోలాగ చూస్తే తప్ప దుర్యోధనుడికి దానిని పర్యాప్తం లేక అమితం అనడానికి వీలులేదు.

తరువాతి శ్లోకంలో అందఱూ భీష్ముణ్ణి రక్షించాలి అంటాడు అతడు. భీష్ముడు మహాభారత పాత్రలన్నింటిలోను మెరుపువంటివాడు. ఇచ్ఛామరణ శక్తి కలవాడు. అచంచల ప్రతిజ్ఞా ప్రజ్ఞా నిష్ఠలు కలవాడు. అతడు రాజసభలో పలికిన వాక్యాలను బట్టి, ధర్మమే పక్షాన ఉన్నదీ చక్కగా గుర్తించినవాడని కూడా మనకర్థమౌతుంది. అయినా అధర్మ పక్షాన్నే నిలిచి పోరాడడానికి సంసిద్ధమైనాడనే అపశ్రుతి అతనికి అంటగట్టడానికి వీలులేదు. అతని జీవితచరిత్రనంతటినీ గీతా ప్రవచనాల కుదాహర ణంగా నిరూపించవచ్చు. ప్రతి విషయంలోనూ, నిష్కామకర్మకు అతని జీవితం సాటి లేని తార్కాణం. ఆడి తప్పని నిజాయితీకి, ఆత్మ త్యాగానికి, ఆజన్మ బ్రహ్మచర్యానికి, అసమాన శౌర్యదీక్షకు, అఖండ శాస్త్రపాండిత్యానికి, అమరులలో అమరుడైన భీష్ముని జీవితం ఒక మహాజ్యోతి. అంతటి శౌర్య ధైర్య సాహస గుణోపేతుడైనవాడు ఆడిన మాట ప్రకారం కౌరవపక్షాన నిలిచి యుద్ధంచేసి విధికి బలి అయినాడు. ఎందుకంటే ఎంతటి మహత్తర శక్తియుక్తుడైనా, ధర్మశక్తినీ, బలీయమైన విధి సూత్రాలను ఎదిరించి నిలవజాలడనే నిజాన్ని చాటటానికే భీష్మాచార్యులవారు చావునదలించి దూరంగా ఉంచి ఇచ్ఛా మరణాన్ని పొందాడు. భీష్మునిది అమూల్య ప్రాణమనీ, తన ఆశలన్నిటికీ అతడే పట్టుకొమ్మ అనీ, దుర్యోధనునికి తెలియకపోలేదు. కాబట్టి 'భవన్తస్సర్వ ఏవహి భీష్మమే వాభిరక్షన్తు' అని రాజాజ్ఞను చేశాడు.

ఆ మాటలవల్ల ద్రోణునికి సంతోషమే కలిగిందో, విషాదమే కలిగిందో మనం చెప్పలేం. దీని అర్థం మాత్రం ఇతరులకిలా స్ఫురిస్తుంది. "మీ అందఱి వల్లా నాకు ప్రయోజనముండేలాగా కనిపించడం లేదు. మీమీద ఆశలు పెట్టుకొని ముందుకు సాగడం కష్టంగా ఉంది. కనీసం నా ఆజ్ఞలనైనా సరిగా పరిపాలించి నడుచుకోండి. సరిగా యుద్ధాన్ని నడిపే మార్గం మీకు తోచేలాగా లేదు. అందఱికీ ప్రధాన కర్తవ్య

మేమిటంటే భీష్ముడి ప్రాణాలను కాపాడండి" అని రాజరాజు ఆజ్ఞాపించినట్లుంది. ఇందులో దుర్యోధనుని దాంభికత్వం స్పష్టంగా ప్రకాశితమైంది, భీష్ముడిమీద అత దెంతగా ఆశలు పెట్టుకున్నదీ అర్థమౌతుంది. కాని ఆ ఆడంబరాన్ని చాపాచార్యుని ముందు రాజవాక్యంగా వినిపించడం రాజనీతిజ్ఞత కాదు. అందుకనే తెలియని మూర్ఖుడు దుర్యోధనుడంటారు లోకులు.

12. తస్య సంజనయన్ హర్షం కురువృద్ధ పితామహః।
సింహనాదం వినద్యోచ్చైః శంఖమ్ దధ్మౌ ప్రతాప వాన్॥

దుర్యోధనుడికి ఉత్సాహము సంతోషము పుట్టించడానికి, కురువృద్ధుడూ, పితామహుడు, ప్రతాపవంతుడూ అయిన భీష్ముడు సింహనాదాన్ని చేసి శంఖాన్ని పూరించాడు.

యుద్ధ కారణాలలో ఇదొక ప్రబలమైన సంఘటన. విచారణ క్రమంలో రేపెట్టిందెవరు? అనే ప్రశ్న వస్తుంది. అందులో భీష్ముని వంటి స్థితప్రజ్ఞుడు చేసిన పని అది. దానికి కారణమేమైనా, బారులుతీరి ఉన్న రెండు సేనలలోనూ ముందుగా సింహనాదం చేసి శంఖాన్ని పూరించిన వైపు కౌరవపక్షమైంది. యుద్ధసూత్రాల ప్రకారం యుద్ధం ఆరంభించిన నేరం, కయ్యానికి కాలుదువ్విన నేరం, కౌరవులకే చెందింది. ఈ సింహనాదమే ఈ శంఖధ్వానమే సర్వనాశనానికి దారితీసింది. యుద్ధారంభానికి నాంది అయింది.

13. తతః శంఖాశ్చ భేర్యశ్చ పణవానక గోముఖాః।
సహసై వాభ్యహ న్యన్త సశబ్దః తుములో భవత్॥

ఆ పిదప శంఖాలూ, భేరీ వాద్యాలు, దుందుభులూ, గోముఖ తూర్యాలూ, డప్పులూ, తక్షణమే ఒక్కపెట్టున మ్రోగాయి. గందరగోళంగా ఆ ధ్వనులన్నీ కలిసి రణగుణ ధ్వని అయింది. ఉభయసేనలూ యుయుత్సువులై ఎదురెదురుగా మోహరించి ఉద్రిక్తంగా ఉన్న సమయంలో ఒక (కౌరవ) సేనాపతి శంఖాన్ని పూరించి 'సై' అంటే రెండవ సేనావారు మాత్రం ఊరికే ఉండగలదా?

భూకంపం ఎట్లా కలుగుతుందమ్మా అని అడిగారు. అమ్మ అన్నది కదా!

'దానివల్లే. కంపానికి వ్యుత్పత్యర్థం లేదు. స్పందనానికీ లేదు. పువ్వు విచ్చిన తరువాత తెలుస్తుందిగాని ఎట్లా విచ్చుతుందో తెలియదు. జరిగేటప్పుడు తెలీదుగాని జరిగిన తరువాత తెలుస్తుంది. జరుగుతూ ఉన్నప్పుడు తెలిసేది చైతన్యం. అంటే కదలిక కనిపిస్తుంది. స్పందనం కనపడదు.

ధర్మక్షేత్రమైన కురుక్షేత్రంలో కలిగిన భూరి భూకంప వర్ణనమే భగవద్గీత అంటే మాతృగీత.

14. తతః శ్వేతై ర్హయైర్యుక్తే మహతి స్పందనే స్థితే।
మాధవః పాండవ శ్చైవ దివ్యౌ శంఖౌ ప్రదధ్మతుః॥

ఆ పిమ్మట తెల్లని గుఱ్ఱాలను పూన్చిన రథంమీద ఉపవిష్టులై ఉన్న కృష్ణార్జునులు దివ్య ప్రభావ వంతాలయిన తమ శంఖాలను గట్టిగా పూరించారు.

తెల్లని గుఱ్ఱాలు సత్వస్వభావం కల పాండవ పక్షాన్ని సూచిస్తాయి. మాధవ శబ్దం భగవానుని పర్యాయ శబ్దాల్లో ఒకొటి. మా అంటే లక్ష్మి. ధవుడు అంటే భర్త. సృష్టి అంతా మహాకాళీ, మహాలక్ష్మి, మహా సరస్వతుల రూపమే అంటుంది అమ్మ. వస్తురూపం లక్ష్మి, ఉపయోగ విజ్ఞానం సరస్వతి, వస్తుశక్తి పార్వతి. పంచభూతాల సమ్మేళనమే గాయత్రి అంటుంది అమ్మ. లోతుకు దిగిచూస్తే శ్వేతహయాలు సూర్య కిరణాలని, మహత్తు మహత్తే అనీ, మాధవుడు సాక్షి మాత్రుడైన విశ్వనిర్మాణ క్రమమనీ, కృష్ణార్జునులు పూరించినది BIG BANG శంఖమనీ, సహజంగా జరిగి పోయిన దానిని మనం కార్యకారణాలంటగట్టి మానవబుద్ధి వివేచనల క్రిందికి లాక్కొస్తామనీ, బోధపడుతుంది. ఈ శ్లోకంలోని ప్రతి పదమూ గంభీరార్థ ద్యోతకమూ, భావిసూచకమూ అని బోధపడుతుంది.

15. పాంచజన్యం హృషీకేశో దేవదత్తం ధనంజయః।
పౌండ్రం దధ్మౌ మహాశంఖం భీమ కర్మా వృకోదరః॥

పాంచజన్యమనే శంఖాన్ని కృష్ణపరమాత్మ, దేవదత్తమనే శంఖాన్ని అర్జునుడు, పౌండ్రమనే పేరుగల పెద్ద శంఖాన్ని భయానక కార్యాలు చేసే భీమసేనుడూ పూరించారు.

శత్రుసైన్యం నుండి శంఖధ్వని సింహనాదం, యుద్ధానికి పిలుపే అవుతుంది. కౌరవసేన నుండి ఆ ధ్వనులు వినబడగానే ఉద్రేకంతో ఉత్తంభితులై ఉన్న పాండవ పక్షం దానికి ప్రత్యుత్తరంగా ప్రతి శంఖధ్వని చేయడం విధియే కనుక, అందులో ఏమీ విశేషం లేదు. విశేషమల్లా యుద్ధంలో ఏమీ జోక్యం కలుగజేసుకోనన్న కృష్ణపరమాత్మయే మొట్టమొదటగా పాంచజన్యమెత్తి శత్రువులకు ప్రత్యుత్తరమీయడమే. ఎందుకంటే ధర్మానికి శత్రువులు అందటికీ శత్రువులే.

పంచజనుడనే పేరుగల రాక్షసుడు శంఖాకారంతోరాగా వానిని సంహరించి శ్రీకృష్ణుడు అతనిపై కరుణచేత అతనినే శంఖంగా జేసికొన్నాడు. కనుక కృష్ణభగవానుని శంఖానికి పాంచజన్యమని పేరు.

రాక్షసుల సంహారంలో తోడ్పడినందున ఇంద్రుడు అర్జునుడికి ఒక శంఖాన్ని బహూకరించాడు. దేవరాజుచే ఇయ్యబడింది కనుక దానికి దేవదత్తమని పేరు.

హృషీకేశుడు - హృషీకాలంటే ఇంద్రియాలు. వాటికి ఈశుడు కనుక హృషీ కేశుడు.

ధనంజయుడు = రాజసూయ యాగంలో రాజులందటి నుండి ధనాన్ని జయించి తెచ్చి ఇచ్చినవాడు కనుక అర్జునుడు ధనంజయుడు.

వృకోదరుడు. వృకమంటే తోడేలు. దానికి ఆకలి, జీర్ణశక్తి ఎక్కువ. అటువంటి జీర్ణశక్తి కలవాడేకాక తోడేలు లాగానే లోపలికి కుంచించుకొన్న పొట్టకలవాడు కనుక భీముడు వృకోదరుడు.

ఇంకో విషయం. పాండవుల సేనలోని వీరులకే శంఖనామాలున్నాయి. కౌర వుల శంఖాలకు లేవు. సృష్టిక్రమంలో అమ్మచెప్పిన విభాగాలలో ఇదొక పెద్ద భేదం. ప్రతివస్తువుకూ ద్రవ్యశక్తి లక్ష్మి; ఆకర్షణ వికర్షణలు పార్వతి, దాని పేరు సరస్వతి అయినప్పుడు, వస్తు నామమే శబ్దబ్రహ్మ సృష్టిలోని ప్రధానాంశమవుతుంది. అది లభించనంతవఱకు, రూప ఘటనా కారణాలయిన స్పందనాకర్షణ, స్పందన వినిమ యము జరగదు. పరాపశ్యన్తి మధ్యమావైఖరీ సిద్ధిగతమైతేనేగాని శంఖత్వమూ, శబ్ద చైతన్యమూ కుదరదు. శక్తిత్రయంలోని సరస్వతి అంతటి ప్రభావం కలది. కౌరవుల శంఖనామాల లోపం సత్యసంధత, ఋజుశక్తి, ఋతంభర శక్తిని లోపింప జేస్తుంది. దానివలన విశ్వశక్తుల జరుగుబాటులోని పెడసరపు విధానాలేర్పడి, అను కొన్నదొక టైతే జరిగేది ప్రతికూలంగా జరుగుతుంది. అదే జరిగింది భారత యుద్ధంలో.

16. అనన్త విజయం రాజా కున్తీపుత్రో యుధిష్ఠిరః।
నకుల స్సహదేవశ్చ సుఘోష మణిపుష్పకౌ॥

17. కాశ్య శ్చ పరమేష్వాసః శిఖండీ చ మహారథాః।
దృష్టద్యుమ్నో విరాటశ్చ సాత్యకి శ్చాపరాజితః॥

18. ద్రుపదో ద్రౌపదేయాశ్చ సర్వతః పృధివీపతే।
సౌభద్రశ్చ మహాబాహు శ్శంఖాన్ దధ్ముః పృథక్ పృథక్॥

కుంతీ పుత్రుడైన యుధిష్ఠిర మహారాజు, అనంత విజయమనే శంఖాన్ని, నకులుడు సుఘోష మనే శంఖాన్ని, సహదేవుడు మణిపుష్పకమనే శంఖాన్నీ మఱిన్ని మహాధనుర్ధారియైన కాశీరాజు, మహారథుడైన శిఖండీ, పలాయనమెఱుగని సాత్యకి,

ధృష్టద్యుమ్నుడు, విరాటరాజు, ద్రుపద మహారాజు, ద్రౌపది. అయిదుగురు పుత్రులు, మహాబాహు బలంగల అభిమన్యుడు, వారివారి శంఖాలను విడివిడిగా పూరించారు అన్నాడు సంజయుడు పృథివీ పతే అని ధృతరాష్ట్రుణ్ణి సంబోధిస్తూ.

19. స ఘోషో ధార్తరాష్ట్రాణాం, హృదయాని వ్యదారయత్।
నభశ్చ పృథివీం శ్చైవ తుములోవ్యను నాదయన్॥

తా: ప్రచండమైన ఆ శంఖధ్వనులు ఒక్కటై ధార్తరాష్ట్రుల గుండెలు బ్రద్దలుచేస్తూ భూమ్యాకాశాల మధ్య ప్రతిస్పందించాయి.

13వ శ్లోకంలో భీష్ముడు ఒక్కడు చేసిన శంఖ ధ్వనికి భూమీ ఆకాశం దద్ద రిల్లేటట్లు పాండవసేనలో 18 మంది యోధులు శంఖ ప్రతిధ్వని చేశారు. అంత పెద్దగా జవాబు వస్తుందని దుర్యోధనాదులు అనుకుని కూడా ఉండరు. అదీకాక వారి మనస్సులు అసలే అన్యాయ దుష్కృత్యాలను చేసిన జంకుతో నిండి ఉండనే ఉన్నాయి. కనుక పాండవులు చేసిన శంఖ ధ్వనులు వాళ్ళ గుండెలను అవిసేలాగా చేశాయంటే ఆశ్చర్యంలేదు.

20. అథ వ్యవస్థితాన్ దృష్ట్వా ధార్తరాష్ట్రాన్ కపిధ్వజః।
ప్రవృత్తే శస్త్ర సంపాతే ధనురుద్యమ్య పాండవః॥

తా: పిమ్మట బాణాలు వేయడానికి సిద్ధపడుతున్న వారై, బారులు తీరియున్న ధార్తరాష్ట్రులను చూచి విల్లును చేపట్టినవాడై (తరువాత శ్లోకంతో అన్వయం)

వ్యా: కౌరవసేన శంఖనాదాలతోనే కాక అంబులు తొడిగి నారి సారిస్తున్న సంగతి చూచి అర్జునుడు విల్లుపట్టుకొన్నాడు. ఈ శ్లోకంలో కూడా మొదట బాణాలు వేయతలపెట్టింది దుష్టులైన కౌరవసేనయే అని అర్థం కాగలదు.

యుద్ధమైతే ఆరంభం కాలేదు గాని ఉద్రిక్తంగా ఉన్న ఆ క్షణంలో అర్జునుడు యుద్ధరంగంలో ప్రవేశించాడు. దుర్జేయుడైన హనుమంతుని రూపం అర్జునుడి రథ కేతనం మీద ఉంది.

ఆ కాలపు యుద్ధాలలో మహారథుడు మహారథునితోనే యుద్ధం చేయడం ధర్మ శాసనం. సామాన్య భటుడు మహారథునిమీద బాణాలు కూడా వేయకూడదు. అందుకై ప్రతివీరుడు గుర్తుకోసం రథంమీద ఒక విశిష్టమైన పతాకం' ధరించేవారు.

21. హృషీకేశం తదా వాక్యమిద మాహ మహీపతే।
సేన యో రుభయోర్మధ్యే రథం స్థాపయ మే ఽ చ్యుత!॥

తా: మహారాజా! శ్రీకృష్ణునితో అప్పుడు (అర్జునుడు) ఈ మాట అన్నాడు. కృష్ణా! ఉభయ సేనల మధ్య నా రథాన్ని నిలుపు. ఎందుకు?

22. యావదేతా న్నిరీక్షేహం యోద్ధుకామా నవస్థితాన్।
కై ర్మయా సహ యోద్ధవ్య మస్మి న్రణ సముద్యమే॥

తా: యుద్ధం చేయడానికి వచ్చి తయారై నిల్చిన ఈ వీరులందఱిలోను ఎవ రెవరితో నేను రణక్రీడ సల్పవలసి ఉంటుందో చూడగలందులకు (పైశ్లోకంతో అన్వయం)

రెండు సేనల మధ్యను తన రథాన్ని నిలుపమన్నాడు అర్జునుడు. రథం శరీరం గాను జీవన సంగ్రామం కురుక్షేత్రయుద్ధంగాను అర్థం చేసుకుంటే చాలా చక్కని భావాలను మనం సమీక్షించవచ్చు. వ్యక్తమధ్యత్వం మీదనే భగవద్గీత అంతా వ్యాఖ్యా తమై ఉంది. రెండో అధ్యాయంలో 27వ శ్లోకంలో 'అవ్యక్తాదీని భూతాని వ్యక్తమధ్యాని భారత?' అని ఉంది. ఈ వ్యక్త మధ్యత్వం అన్నింటికి మూలసూత్రం, వ్యక్త మధ్యం కాకపోతే జగత్తు, సృష్టి అంటే ఏమిటని ప్రశ్న. ఉపాదాన రహితమైనది సర్వమూ, 'సర్వానికి సర్వమూ కారణం' అంటుంది అమ్మ. ప్రకృతికి ఆది అంత్యం లేదు. ఆనంత్యమైనదది. తాను తటస్థంగా ఉండి అన్ని పనులూ చేస్తుంది.

'ప్రకృతేః క్రియ మాణానిగుణైః కర్మాణి సర్వశః"

ఈ క్రియా శక్తికి ఉత్తమ, మధ్యమ, ప్రథమ పురుషలు లేవు. అది అమ్మ చెప్పే భూతాతీతమైన మహాశక్తి. దానికి మధ్యమత్వం లభించి ఉభయసేనల నడుమ నిలువవలసి వచ్చేసరికి అర్జునుడు, కృష్ణ భగవానుని శక్తిగా వ్యక్తం కావలసి వచ్చింది. అదే సేనయోరుభయోర్మధ్యమత్వమైంది. అదే అర్జునుని, లేక ప్రతివీరుని అహం కారమన్నా తప్పులేదు.

23. యోత్స్యమానా నవేక్షే౽హం య ఏతే౽త్ర సమాగతాః।
ధార్త రాష్ట్రస్య దుర్బుద్ధే ర్యుద్ధే ప్రియ చికీర్షవః॥

తా: దుర్బుద్ధియైన దుర్యోధనుడికి యుద్ధం చేయడం ద్వారా సంతోషాన్ని కల్పించే ఇచ్ఛతో కురుక్షేత్రంలో పోరాటానికి సిద్ధమైన ఈ యందఱిని చూడడానికై (రథాన్ని సేనలమధ్య నిలుపుము).

వ్యా: దుర్యోధనుడి పక్షంలోచేరి యుద్ధానికి సిద్ధపడిన రాజులందఱు అతనిది ధర్మపక్షమని వచ్చినవారు కారు. కొందఱు సేవా ధర్మానికి కట్టుబడీ, మఱికొందఱు

పాండవులు యుద్ధంలో నాశనమైతే వారి రాజ్యంలో కొంతభాగం పంచుకోవచ్చునని కూడా వచ్చి ఉంటారు. ఆ తలపురాగానే అర్జునుడి మనసు మండిపోయి ఆ దురాత్ముల నందటిని కళ్ళారా చూద్దామని కూడా రెండుసేనల మధ్యా రథాన్ని నిలపమన్నాడు. ఇప్పుడు అర్జునుడు కేవలం పరాక్రమ శీలియై యుద్ధరంగంలో దూకమన్న నిప్పుతునకలాంటి వీరుడు. అతని మనస్సులో యుద్ధం చేసి శత్రువులను నాశనం చేసి జయలక్ష్మిని చేపట్టాలనే ఉత్సాహం తప్ప ఇంకో నీడలేదు. అందుకనే వీరాధివీరుని ధీమాతో కృష్ణా! నా రథాన్ని రెండు సేనల మధ్యకూ సాగించి అక్కడ స్థాపించు. ఈ పెద్ద పెద్ద హేమా హేమీల సంగతేమిటో చూస్తాను అన్న ధోరణిలో మాట్లాడాడు.

సంజయ ఉవాచ

24. ఏవముక్తో హృషీకేశోగుడాకేశేన భారత।
సేనయో రుభయో ర్మధ్యే స్థాప యిత్వా పరథోత్తమమ్॥

సంజయుడు పలికెను.

తా: అర్జునునిచేత ఈవిధంగా సంబోధింపబడిన వాడై, శ్రీకృష్ణుడు ఆ రథాన్ని సేనల రెంటినడుమా నిలిపి (పై శ్లోకంతో అన్వయం)

గుడాక అంటే నిద్ర - నిద్రను జయించిన వాడని అర్జునునికి పేరు. రథ చోదకుడు నిద్రపోగూడదు.

25. భీష్మ ద్రోణ ప్రముఖత స్సర్వేషాం చ మహీక్షితామ్।
ఉవాచ పార్థ! పశ్యైతాన్ సమవేతాన్కురూ నితి॥

తా: భీష్ముడు, ద్రోణుడు తక్కిన మహీపతులందఱు ఎదురుగా కనిపించేలాగా రథాన్ని నిలిపి కృష్ణుడు "పార్థా! ఏకైక ప్రయోజనాభిలాషులై ఒక్కచోజేరి ఉన్న ఈ కౌరవులందటిని చూడు"అని పలికెను.

కౌరవులసేన విహగవ్యూహంగా పన్నబడి ఉంది. నడుమ నిలిచి ఉన్నారు ద్రోణుడు, భీష్ముడు. సేనల మధ్యంలో రథాన్ని నిలపడంతో అర్జునుడు సాక్షాత్తూ భీష్మ ద్రోణులకు సరిగా ఎదురై నిలిచినట్లైంది. ఇక ఇంతవఱకు వీరరసం పెల్లుబుకుతున్న అర్జున హృదయంలో గాలం వేసినట్లయింది. తనతో పోరాడగల సహయోద్ధ ఎవడా? వాడిని చూడాలని అతని హృదయం కొట్టుకుంటున్నది. అతని ప్రతిస్పర్ధి ఐన ఏ కర్ణుడో, పాండవులను అవమానం చేసిన ఏ దుర్యోధనుడో, దుశ్శాసనుడో ఆ వ్యక్తి అయి ఉంటే రసపోషకగా సన్నివేశం జరిగేది.

అలా కాకుండా పరమపూజ్యులయిన, గురువులక్కడ కనిపించడంతో అర్జునుని విషాద ఘట్టానికి ఆరంభం అయింది. గీతా బోధకు అంకురార్పణ మయింది.

ఈ మొదటి అధ్యాయంలో శ్రీకృష్ణుడన్నది ఈ మాట ఒక్కటే. "ఒక్కచోట చేరి ఒకే ప్రయోజనాన్ని ఆశించి వచ్చిన భీష్మ ద్రోణాది భూపతులను చూడు" ఆ మాట మందుపాతర దగ్గఱ అగ్గిపుల్ల వెలిగించిట్టైంది.

మొదటి అధ్యాయంలో శ్రీకృష్ణుడు అన్నమాట కూడా ఈ ఒక్కటే. 11వ అధ్యాయంలో విశ్వరూపంగా, కాలరూపంగా, సర్వరూపకంగా, జ్ఞాన, కర్మ, భక్తియోగాల రూపంగా ప్రదర్శితమైంది కూడా ఇదే.

26. తత్రాపశ్యత్ స్థితాన్పార్థః పితౄనథ పితామహాన్।
ఆచార్యాన్ మాతులాన్ భ్రాతౄ న్పుత్రా న్పౌత్రా న్సఖీం స్తథా॥

27. శ్వశురాన్సుహృదశ్చైవ సేనయో రుభయో రపి।
తాన్సమీక్ష్య స కౌంతేయ స్సర్వాన్బంధూ నవస్థితాన్॥

28. కృపయా పరియా ఉ ఉ విష్టోర విషీదన్నిద బ్రవీత్।

అర్జున ఉవాచ

దృష్ట్వేమం స్వజనం కృష్ణ! యుయుత్సుం సముపస్థితమ్!!

29. సీదన్తి మమ గాత్రాణి ముఖంచ పరిశుష్యతి।
వేపథుశ్చ శరీరేమే రోమహర్షశ్చ జాయతే॥

30. గాండీవం స్రంసతే హస్తా త్త్వక్చైవ పరిదహ్యతే।
న చ శక్నో మ్యవస్థాతుం భ్రమతీవ చ మే మనః॥

తా॥ అర్జునుడు అక్కడచేరి ఉన్న తండ్రులు, తాతలు, గురువులు, మామలు, సోదరులు, కొడుకులు, మనుమలు, స్నేహితులు అయిన వారినే శత్రుపక్షంగా నిల్చి ఉన్న వారిలో చూచెను. ఇంకా రెండుసేనలలో మామలు, స్నేహితులు రెండువైపులా ఉన్న సేనలుగా నిల్చి చిత్రవధలను చేసుకోడానికి క్రేళ్ళురుకుతుండడాన్ని చూచి పరాకాష్ఠను చెందిన కరుణతో, విషాదం చెందిన మనస్సుతో అర్జునుడు ఈవిధంగా అన్నాడు.

వ్యా: యుద్ధంచేసే ఇచ్ఛగలవారై ఇక్కడ సమకొన్న నా బంధువులను చూడగా 'నే,నా అంగములు శిథిలాలౌతున్నాయి. నా దేహం కంపిస్తున్నది. నా దేహంలో

గగ్గురుపాట్లు పుడుతున్నాయి. గాండీవం చేతుల్లోనుంచి జారిపోతున్నది. ఒళ్ళు మరిచిపోతున్నది. నిలబడ్డానికి కూడా శక్తి చాలడంలేదు. తల తిరిగిపోతున్నది. మనస్సు వికలంగా ఉంది.

ఆర్జునుడి మనస్సులో ఉదయించిన పరమమైన కరుణ, దానివెనుక యుద్ధంలో తాండవించే మహామృత్యువు రెండూ ఎలా పెనవేసుకొని అతని మనశ్శరీరాలను నిర్వీర్యాలుగా చేశాయో పై శ్లోకాలు వర్ణిస్తాయి.

గాండీవం చేతిలోనుంచి జాటిపోతున్నదంటే ముసలాడి చేతిలో కఱ్ఱక్రింద పడిపోతున్నట్టుగా అనుకోవడానికి వీల్లేదు. గాండీవం మహాప్రభావం కల విల్లు. ఉద్యోగపర్వం 95 అధ్యాయం 45వ శ్లోకంలో గాండీవ ధనువు ఇలా వర్ణించబడింది.

కాకుదీకం శుకం నాకం
అక్షిసంతర్జనం తథా।
సంతానం నర్తకం ఘోరం
ఆ స్యమోదక మష్టమమ్॥
కామ క్రోధో లోభ మోహో
మద మానౌ తథైవచ।
మాత్సర్యా హంకృతి శ్చైవ
ప్రమాదేత ఉదాహృతా॥

గాండీవానికి ఎనిమిది ప్రభావాలున్నాయి.

1. కాకుదీకము= శత్రువులను మూర్ఛిల్లజేయటం.
2. శుకం = మోహభ్రమలు కలుగజేయటం
3. నాకం = ఉన్మదావస్థను కల్పించడం
4. అక్షిసంతర్జనం = కనులు మిఱుమిట్లుగొల్పడం
5. సంతానము = ఒక్కబాణం అంఖ్యాకమైన బాణాలుగా కన్పింపజేయడం
6. నర్తకం = శత్రువును పిశాచం పట్టినవానిలాగా జేయడం.
7. ఘోరం = రాక్షస బీభత్సాన్ని సృష్టించడం
8. ఆస్యమోదకం= ఆత్మహత్య చేసికొనేలాగా చేయడం.

నరనారాయణులలో ఒకరై ఉన్నంత కాలమే గాండీవాన్ని అర్జునుడు ఉపయోగించగలిగాడు. ఆ ప్రభావం సన్నగిల్లిపోగానే దాన్ని అతడు ఎత్తలేకపోయాడు.

31. నిమిత్తాని చ పశ్యామి విపరీతాని కేశవ!।
న చ శ్రేయోఽ ను పశ్యామి హత్వా స్వజన మాహవే॥

తా: విపరీతమైన దుశ్శకునాలు కనిపిస్తున్నాయి. యుద్ధంలో స్వజనులను చంపడంలో నాకెట్టి మేలు కనిపించదు.

వ్యా: వామనేత్ర మదరడం, నక్కలు కూయడం, గృధ్రవాయసాదులు అప్రదక్షిణంగా సంచరించడం ఇలాంటి వాటి దుర్నిమిత్తాలంటారు.

32. న కాంక్షే విజయం కృష్ణ! న చ రాజ్యం సుఖాని చ।
కింనో రాజ్యేన గోవింద! కిం భోగై ర్జీవితేన వా॥

33. ఏషామర్థే కాంక్షితం నో రాజ్యం భోగా స్సుఖానిచ।
త ఇమేఽ వ స్థితా యుద్ధే ప్రాణాం స్త్యక్త్వా ధనాని చ॥

34. ఆచార్యాః పితరః పుత్రా స్తథైవ చ పితామహాః।
మాతులాః శ్వశురాః పౌత్రాః స్యాలా స్సంబంధి న స్తథా॥

తా: కృష్ణా! నాకు విజయం వద్దు. రాజ్యం వద్దు. జీవితం కూడా వద్దు. గోవిందా! రాజ్యంవలన, సామ్రాజ్య భోగాలవలన వచ్చే లాభమేమిటి? ఎవరికోసం రాజ్యం, భోగం, సుఖాలు కోరుకుంటామో అట్టి పితృపితామహాచార్య స్యాలకాదులు ప్రత్యక్షంగా నిలబడి చావడానికైనా సిద్ధమైనారు. వారందఱు మరణించిన తరువాత ఈ రాజ్యాలు భోగాలు ఎవరికోసం?

'ఎవరు లేకుంటే ఈ రాజ్యాదులన్నీ అర్థహీనాలవుతాయంటారో వారు ఆచార్యులు, పితరులు, పుత్రులు, పితామహులు, మాతులులు, శ్వశురులు, పౌత్రులు, స్యాలకులు, ఇతర సంబంధిత జనులు. వారి నందఱిని చంపడానికి ఆయత్తమయ్యాను నేను. నాకిష్టం లేదీపని.

35. ఏతాన్నహంతు మిచ్ఛామి ఘ్నతోఽ పి మధుసూదన।
అపి త్రైలోక్య రాజ్యస్య హేతోః కింను మహీకృతే॥

తా: నేనే చావవలసి వచ్చినా వాళ్ళను చంపను. హే మధుసూధనా। త్రైలోక్య రాజ్యం లభించినా వారిని చంపడానికొప్పుకోను. ఇక రాజ్యభాగాల మాటెందుకు.

ఈ యుద్ధమంతా రాజ్యభాగాల నిమిత్తం తలెత్తింది. తీరా చంపవలసిన వాళ్ళే పూజార్హులయ్యారు.

36. **నిహత్య ధార్తరాష్ట్రాన్నః కా ప్రీతి స్స్యా జ్జనార్దన!।**
పాపమేవాశ్రయే దస్మాన్హత్వైతా నాతతాయినః॥

తా: ధార్త రాష్ట్రులను చంపడంవలన మాకు కలిగే సంతోషం ఏముంది? దానివలన మాకు లభించేది పాపమే! మేము ఆతతాయుల మౌతాము.

వ్యా: జనార్దన అనే సంబోధనం వలన ప్రళయకాలంలో సర్వజన సంహారకుడు అని సూచింపబడ్డది. కాని ఆ సంహర్తకు ఏపాపమూ అంటదు.

అగ్నిదో గరద శ్చైవ శస్త్రపాణి ర్ధనాపహృత్
క్షేత్ర దార హరశ్చైవ షడైతే హ్యాత తాయినః

అంటే ఇళ్ళకగ్నిని ముట్టించేవాడు, విషం పెట్టేవాడు, నిష్కారణంగా శస్త్రా శస్త్రాలను ధరించేవాడు, పర ధనాన్ని అపహరించేవాడు, పర క్షేత్రాల నపహరించే ాడు, పరదారల నపహరించేవాడు. ఈ ఆరుగురిని ఆతతాయులంటారు. పై అన్ని ులను చేసి ఆతతాయులై ఉన్నవారే కౌరవులు. వాళ్ళు చేసిన పాపాలకు వాళ్ళు శిక్ష నుభవిస్తారు. మేమెందుకు దానికొడబడాలి?

37 **తస్మా న్నార్హావయం హంతుం ధార్త రాష్ట్రాన్ సబాంధవాన్।**
స్వజ నం హికథం హత్వా సుఖిన స్స్యామ మాధవ!॥

38 **యద్య ప్యేతే న పశ్యన్తి లోభోపహత చేతసః।**
కులక్షయకృతం దోషం మిత్ర ద్రోహేచ పాతకమ్॥

39 **కథం న జ్ఞేయ మస్మాభిః పాపాదస్మా న్నివర్తితుమ్।**
కులక్షయ కృతం దోషం ప్రపశ్యద్భి ర్జనార్దన॥

తా: అందువలన ధార్త రాష్ట్రులను చంపడానికి మేము అర్హులం కాము - ఎందువలన! స్వజనాన్ని చంపుకోవడంవలన మాకు పాపం చుట్టుకుంటున్నది. మేము ఆతతాయిల మౌతున్నాం. కులక్షయం లాటి అనర్థాలెన్నో కలుగుతున్నాయి. స్వజనాన్నే చంపుకొని ఎలా సుఖించగలం?

అలాగయితే దుర్యోధనాదులకు మాత్రం కులక్షయం స్వజనహింస ఎందుకు అభ్యంతరం కావు? ఎందుకంటే వారు రాజ్యలోభోప హతచేతస్కులు. యుక్తాయుక్త జ్ఞానంలేనివారు? మిత్రద్రోహం పాతకం అనే మాటలు వాళ్ళ మనస్సు కెక్కడం లేదు.

వాళ్ళకు వర్తించే సూత్రాలే మనకూ వర్తిస్తాయి. మనం మాత్రం ఎందుకు ఊరు

కోవాలి? అంటారేమో! రాజ్యకాంక్షా పిశాచం వాళ్ళకు పట్టుకొని ఉంది. వాళ్ళకు వివేకం లేకపోతే మనకైనా ఉండాలి కదా!

వ్యా: అర్జునుని కొక్కనికే ఈ నిర్వేద ఎందుకు రావల్సి వచ్చింది? ఎవని బాణాల వలన ద్రోణుడు, భీష్ముడు, కర్ణుడు కడతేరవలసి ఉన్నదో. ఈ వీరునికే ఈ విషాదాన్ని వ్యాసుడేల కల్పించాడు. దీనికి కారణం ఇదనిపిస్తుంది.

ఏదైనా పెద్ద ఎత్తైన గోడమీదినుండి దూకదలచుకొన్నవాడు వెనక్కుపోయి, పరుగెత్తుకొనివచ్చి ఊపందుకొని ఒక్కసారిగా పైకెగురుతాడు. బాగా దెబ్బ కొట్ట దలచుకొన్నవాడు కత్తిని వెనక్కు వంచి ఊతం తీసుకొని మతీవ్రేటు వేస్తాడు. వక్రించిన గ్రహం ఇనిమిక్కిలి తీవ్రతను చూపుతుంది. అలాగే ధర్మాధర్మ సంఘర్షణలో పడి బంధుత్వమనే మేకతోళ్ళు కప్పుకొన్న తోడేళ్ళను సంహరించడానికి, అర్జుని మనస్సనే వింటిని వెనక్కిలాగి వ్యాస భగవానుడు అతని అంబులకు ఊపిరిపోస్తున్నాడని ఇక్కడ పాఠకులు గ్రహించాలి. లేకుంటే అర్జునుని వ్యసనానికి మానవత్వానికి మించిన విశిష్టత ఏమీలేదు. కులక్షయ మీమాంస కౌరవులకు మాత్రం ఏల కలగలేదు! రాజ్య కాంక్షా పిశాచం బట్టిన వాళ్ళ మెదళ్ళలో ఆ ఊహ జనించనే లేదు.

40 కులక్షయే ప్రణశ్యంతి కులధర్మాస్సనాతనాః।
ధర్మే నష్టే కులం కృత్స్న మధర్మోఽ భిభవత్యుత॥

తా: వర్ణ వ్యవస్థలు నశించిపోవడంవల్ల అనుభవంగా వస్తూ ఉన్న కులాచార ధర్మాలు నశించిపోతాయి. ఆధ్యాత్మికత అనే ధర్మం నశిస్తే అనాచారమే మిగిలితే కుల వ్యవస్థలన్నీ సంపూర్ణంగా అధర్మంతో, నాస్తికతతో నిండిపోవడం నిశ్చయం.

వ్యా: ఈ శ్లోకాన్ని చక్కగా పరిశీలిస్తే అర్జునుడికి కులవ్యవస్థలంటే ధృఢ విశ్వాసం ఉంది. కుల ధర్మాలు నిరాటంకంగా సాగిపోతూ కట్టడిగా ఉండాలి. ధృఢ విశ్వాసము, ఆపేక్ష ఉన్నట్లు బోధ పడుతుంది. అవి అలాసాగకుండా ఉంటే కలిగే ఉపద్రవాలూ, సంఘ హానీ కూడా అతనికి తెలుసు. కులము, ధర్మము, అధర్మము, కులధర్మాలు అనే మాటలకు వ్యాఖ్యాతలు వారి వారి అభిప్రాయాల ననుసరించి అర్థాలు వ్రాశారు. అమ్మ విషయంలో వర్ణ వ్యవస్థల సంగతిని పరామర్శిస్తున్నప్పుడు ఒక విషయం గుర్తుకు వస్తుంది.

'ఒకసారి అనపర్తి ఆయన ఒకాయన వచ్చి "అమ్మా! రాజరాజేశ్వరివై ఉండి కూడా ఇట్లా చేస్తున్నావేమిటి? వర్ణాశ్రమ విధాయినీ' అన్నారు కదా!" అన్నారు.

రాజరాజేశ్వరీ, వర్ణాశ్రమ విధాయినీ అనీ ఎప్పుడైతే ఉన్నదో 'ఏ కాకినీ' 'భూమ రూపా' విభేదినీ, భేదరూపా అనీ వాని ప్రక్కనే ఉన్నది కదా! అన్నారు అమ్మ.

'రక్తమే ఈశ్వర తత్వ'మని బోధించిన అమ్మకు కుల వివక్షతలు లేవు.

'చాతుర్వర్ణ్యం మయాసృష్టం గుణకర్మ విభాగశః' అని పరమాత్మ వాక్యం. జన్మనా జాయతే శూద్రః సంస్కారా ద్ద్విజ ఉచ్యతే" అని నానుడి. కులం వృత్తిని బట్టి ఏర్పడుతుందా? జన్మనుబట్టి ఏర్పడుతుందా? అనే ప్రశ్నకు వృత్తిని బట్టే ఏర్పడు తుందని సరైన సమాధానం.

41 అధర్మాభిభవా త్కృష్ణ! ప్రదుష్యన్తి కుల స్త్రియః।
స్త్రీషు దుష్టాసు వార్ష్ణేయ! జాయతే వర్ణ సంకరః!

తా: అధర్మం చెలరేగడంతో కులస్త్రీలు దుష్టప్రవర్తనం గలవారౌతారు. స్త్రీలే సృష్టికి వ్యాప్తికి కారణ సంభూతులు కాబట్టి, దానంతట అదే వర్ణ సంకరం కలుగు తుంది. వృష్టి వంశ ప్రదీపకుడవైన కృష్ణా! ఇది అంకుర సృష్టినే కల్మషం చేస్తుంది. వర్ణ సంకరం ఏర్పడుతుంది.

యుద్ధంలో ఆభిజాత్యంగల పురుషులందఱు చచ్చిపోగా, ఇళ్ళలో మిగిలిన కులాంగనలకు ఎవరు ఆధారం కాగలరు? చావక మిగిలిన నికృష్ట జనం తప్ప వాళ్ళ కెవరు దిక్కు? దానివలన వచ్చే ఫలితం ముందుకు పోయిన కులం మళ్ళీ వెనక్కు దిగజారిపడడమేగా!

మహాభారత కాలంలోని వర్ణవ్యవస్థ నేటికాలంలోలాగా జన్మాన్నిబట్టి నిర్ణయించ బడేదికాదు. వర్ణ శబ్దానికి రంగు, అచ్చులు, హల్లులు, కులం మొదలైన ఎన్నో అర్థా లున్నవి. ప్రతి అర్థానికి అంటి పెట్టుకుని ఉన్న విజ్ఞాన శాస్త్రాలున్నాయి. అన్నింటి స్వచ్ఛతమీదా ఆధారపడి ఉంది మానవ సమాజంయొక్క పురోగతి. "చాతుర్వర్ణ్యం మయాసృష్టం గుణకర్మ విభాగశః" అని గీతాచార్యుని వాక్యం. బ్రాహ్మణ కులాన్నే తీసుకోండి.

"తర్హికోవా బ్రాహ్మణోనామ" అని ప్రశ్నించుకొని వజ్ర సూచ్యుపనిషత్తు ఇలా చెబుతుంది. "యః కశ్చిదాత్మానమద్వితీయం, జాతి క్రియాగుణహీనం, షడూర్మిష డ్భావేత్యాది సర్వదోషరహితమ్, సత్య జ్ఞానానంత రూపం, స్వయం నిర్వికల్ప మశేష కల్పాధార మశేష భూతాంతర్యామిత్వేన వర్తమానమంత ర్బహిశ్చా కాశవదను స్యూత మఖండానంద స్వభావమప్రమేయ మనుభవైకవేద్య మపరోక్షతయా భాసమానం,

కరతలామలక వత్సాక్షాద పరోక్షీకృత్య కృతార్థతయా కామరాగాది దోషరహిత శ్శమదమాది సంపన్నోభావ మాత్సర్య తృష్ణా శామోహాది రహితో దంభా హంకా రాదిభి రసంస్పృష్ట చేతావర్తతే ఏవముక్త లక్షణో య స్స ఏవ బ్రాహ్మణ ఇతి శ్రుతి స్మృతి పురా ణేతిహాసానా మభిప్రాయః, అన్యథా బ్రాహ్మణత్వ సిద్ధిర్నాస్త్యేవ, సచ్చిదా నంద మాత్మాన మద్వితీయం బ్రహ్మభావయే దాత్మానం సచ్చిదానందం బ్రహ్మ భావ మేయేది త్యుపనిషత్'.

అమ్మ చెప్పిన ప్రతి అక్షరమూ, చేసిన ప్రతిపనీపై ఉపనిష ద్వాక్యాలకు ప్రత్యక్ష తార్కాణాలు.

42. సంకరో నరకాయైవ కులఘ్నానాం కులస్య చ।
పతంతి పితరో హ్యేషాం లుప్త పిండోదక క్రియాః॥

తా: కులాలు కలగాపులగం అయిపోవడం చేత ఆయా కులాలకుండే శ్రాద్ధాది విహిత కర్మలు నశిస్తాయి. పిండ ప్రదానాలు, పితృ తర్పణాలు లేక పితరులు పతితు లౌతారు. దీని కంతటికీ కారణం కులక్షయమే కదా! ఆవిధంగా కుల క్షయానికి కారణమూ, కారకులూ అయినవారు కులాలతో సహా నరకాల పాలవుతారు.

వ్యా: ఈ శ్లోకంలో అర్జునుడు నరకాన్ని గూర్చి ప్రస్తావించాడు. రెండో అధ్యాయం 32వ శ్లోకంలో కృష్ణ పరమాత్మ 'యదృచ్ఛయా చోపపన్నం స్వర్గద్వారమ పావృతం' అంటూ స్వర్గాన్ని గూర్చి కూడా ప్రస్తావించాడు. దీనివలన గీతలోని ప్రధాన పాత్రలకు స్వర్గమూ, నరకమూ వేఱుగా ఉన్నాయనే విశ్వాసమున్నట్లు దీనివల్ల మనకు తెలుస్తుంది.

అమ్మ మతంలో

'చచ్చినవాడు తింటున్నాడో లేదో మనకు తెలియదు. మన పెద్దలందఱినీ తలు చుకుని ముద్ద అగ్నిహోత్రంలో వేసి తినడం'.

తలపుల లోకంలో ఉన్నారు పెద్దలు. ఉండి వాళ్ళు ఊరికే ఉండడం లేదు. ఆభి జాత్యం వంటి మనఃప్రపంచాన్ని సృష్టించుతుంటారు. కాలాన్ని జ్ఞప్తి అతిక్రమిస్తుంది. అనుకున్న ఏర్పాట్లను చేస్తుంది. పితరులను గూర్చిన జ్ఞాపకాలు పరోక్షంగా నేటి నడ వళ్ళను దిద్ది చరిత్రను ఏర్పరుస్తుంది. రక్త ప్రసారంలో దూఱి కూర్చుని స్వభావాన్ని నిర్మిస్తుంది. అమ్మ అన్న రక్తమే కులమయినప్పుడు ఆ అనూచాన రక్త సంబంధమే పిండోదక ధర్మమౌతుంది. దాన్ని మఱచిపోడానికి అమ్మ ఒప్పుకోదు. ఎందుకంటే ప్రేరణ ఫలితమే సర్వస్వం. ప్రేరణ ధర్మాలే మనః ప్రపంచంలోని పిండోదక ధర్మాలు.

43. దోషై రేతైః కులఘ్నానాం వర్ణ సంకర కారకైః।
ఉత్సాద్యంతే జాతిధర్మాః కులధర్మాశ్చ శాశ్వతాః॥

తా: పైవిధంగా కులమర్యాదలను, వర్ణ వ్యవస్థను కలగాపులగం చేసి కులాచారాలను నాశనం చేసిన కులనాశకుల పాపాల ఫలితంగా అనూచానంగా వస్తూన్న జాతి ధర్మాలు ధ్వంసమైపోతాయి.

వ్యా: పైవిధంగా యుద్ధం కులమర్యాదలనేకాక సమాజాన్ని బిగించి ఉంచే అన్ని వ్యవస్థలను, జాతి సంస్కృతిని, ఒక్క త్రాటిమీద నడిపే అన్ని శిక్షణలను తారుమారు చేసే అనర్థాలను తెచ్చి పెడుతుందనే మాట సత్యమే. కాబట్టి యుద్ధాన్ని బహిష్కరించాలి మానవ సమాజం నుంచి అనే వాదానికి అర్జునుడి వాక్యమే నాందిగా కనిపించుతుంది పైశ్లోకం వల్ల

44 ఉత్పన్న కులధర్మాణాం మనుష్యాణాం జనార్దన!।
నరకే నియతం వాసో భవతీ త్యనుశుశ్రుమ॥

తా: కృష్ణా! కులధర్మాలు పాటించని పాపాత్ములకు ఇంత అనే అంతులేని కాలంపాటు నరకనివాసం వ్రాసిపెట్టి ఉందని (పెద్దలు, శాస్త్రమూ) చెప్పినట్లు అనుశ్రుతి కూడా ఉంది.

వ్యా: అమ్మ విషయంలో ఆచారాలు సార్థకంగా నెఱవేరుతై.

"అత్తగారి క్రతువుకు కోడలు దీపారాధన చెయ్యాలి కదా! మందిరంలోకి వెళ్ళి అమ్మ దీపారాధన చేసివచ్చారు. అలా వెళ్ళినప్పుడల్లా వాకిట్లోనే పాదుకలు విడిచి దీపారాధన చేసి వచ్చారు.

బామ్మగారి మృతదేహానికి సాష్టాంగ నమస్కారం చేశారమ్మ.

సీతాపతి తాతగారు మరణించినప్పుడు అంతా చల్లగా జరిగిపోయింది. అమ్మ 15 నిమిషాలవఱకూ చూసి తలదగ్గఱ దీపం పెట్టమన్నారు.

ఎవరో

ఇంకా కొంతసేపు చూద్దాం (స్ఫురణ వస్తుందేమో) అన్నారు.

"ఎందుకూ! ఇంకా! అయినా దీపం వెలిగించినందువల్ల నష్టం ఏమిటీ?"

దీపావళి పండగనాడు సీతాపతి తాతగారికి ధర్మోదకాలు విడిచేరోజు. ఆనాడు అమ్మమ్మ సుమంగళి చిహ్నాలు తీసినరోజు. అమ్మ సాయంకాలం తెల్లచీర, తెల్ల రవికా ధరించారు. రుక్మిణక్కయ్య బ్రతిమాలినా పట్టుచీర "కట్టుకోలేను రుక్మిణీ!" అన్నారు.

కొన్ని అంధ విశ్వాసాల మీద ఉండే బూజును దులిపేసి ఆచారాల సహజ స్వరూపం చూపించారు అమ్మ.

"అమ్మా! లలితా సహస్రం ఆడవాళ్ళు చెయ్యకూడదంటారు. ఎందుకమ్మా! చేస్తే ఏదో ఆహుతి కావాలిట"

"అన్నీ చెయ్యొచ్చమ్మా! - మనసే ఆహుతి చేస్తే ఇంకా వేరు ఆహుతి ఎందుకు?"

"అమ్మవారు నెత్తి అణుస్తుందనీ, అదనీ, ఇదనీ అంటారు. అదేమీ లేదని అనుకుంటాను. తల్లి నెత్తి అణుస్తుందా?

మతం, ఆచారవ్యవహారాలూ, ఒక జాతి జీవనాదులు, మనః పరిపక్వతకు వచ్చిన మెఱుగును చూపిస్తాయి. ఆచారాల్ని, మత సంప్రదాయాల్ని మానుకోవడం పతనానికి గోతిని త్రవ్వుకోవడమే. కులధర్మాలు, మత సంప్రదాయాలు, దేవ. కాల జాత్యవసరాలను బట్టి మారవచ్చుగాక! కాని తమాము, మతాన్ని, ఆచారాల్ని, సంప్రదాయాన్ని భ్రష్టం చేసి, జనసమాజంలో సాంకర్యాన్ని వృద్ధి చేసే యుద్ధం లాంటి ఉపద్రవాలు, సమాజశ్రేయస్సుకు మానవనీతికి విరుద్ధంగానే భావించాలి.

45. అహో! బత! మహత్పాపం కర్తుం వ్యవసితా వయమ్।
యద్రాజ్య సుఖలోభేవ హన్తుం స్వజన ముద్యతాః॥

తా: ఓ హోహో! రాజ్య భోగాలమీద దురాశా లోభాల చేత గ్రుడ్డివాళ్ళమై ప్రియ బంధువులనే చంపుకోవడమనే మహాపాప కృత్యానికి పూనుకొన్నాము.

వ్యా: పాప భీతి అనే రసం అర్జునుడి మనస్సులో చిక్కబడుతున్నది.

46. యది మా మప్రతీకార మశస్త్రం శస్త్ర పాణయః।
ధార్తరాష్ట్రా రణే హన్యు స్తన్మే క్షేమతరం భవేత్॥

తా: యుద్ధంలో నిరోధించడం మానేసి, నిరాయుధుడనై ఉన్న నన్ను సాయుధులై వచ్చి ధృతరాష్ట్రుని పుత్రులు చంపివేయడమే మేలనిపిస్తున్నది.

వ్యా: అర్జునుడి విషాదభావం పరాకోటినందుకున్నది.

జీవితేచ్ఛ బ్రతికి ఉండడానికి మొదటి కారణం, పాపపుణ్యాల రాద్ధాంతం బ్రతికి ఉన్న వాళ్ళకేగాని చచ్చిన మానవులకు కాదు. Murder in the name of war is no crime అని ఈనాటి సిద్ధాంతం. చావును తప్పించి ప్రాణాన్ని నిలపడం ఆ నాటి ధర్మం. ధర్మానికి అధర్మానికి జరిగిన ఈ యుద్ధంలో ధర్మప్రవర్తకుడైన శ్రీకృష్ణుడు పంచభూతాల సంతానమైన పాండవ పక్షం వహించి సత్యమే జయిస్తుందని

నిరూపించవలసి వచ్చింది. స్వకీయ పరకీయత్వాలు అసలైన ఉనికికిలేవని నిరూపించవలసి వచ్చింది.

సంజయ ఉవాచ

47. ఏవ ముక్త్వాఽ ర్జున స్సంఖ్యే రథోపస్థ ఉపావిశత్।
విసృజ్య సశరం చాపం శోక సంవిగ్న మానసః॥

తా: ఈ విధంగా చెప్పి యుద్ధమధ్యంలో, మహాశోకంతో కూడిన మనస్సు కలవాడై అర్జునుడు విల్లంబులు పడేసి తన రథం మీద కూర్చుండి పోయాడు.

వ్యా: అర్జునుని వచనాలు అతన్ని పాపభీరువుగాను ఆశారహితుడినిగాను, లోకశ్రేయోభిలాషిగాను నిరూపిస్తున్నాయి. ఈ అధికారాలున్నవాడే బ్రహ్మ విద్యకు అర్హుడౌతాడు. ఈ ఔచిత్యాన్ని గుర్తించి కృష్ణ పరమాత్మ భగవద్గీతా బ్రహ్మవిద్యను ఆతనికి బోధించాడు.

ఇది శ్రీమన్మాతృగీతలోని అర్జున విషాదయోగమను ప్రథమాధ్యాయము

మాతృగీత

సాంఖ్యయోగం

ద్వితీయాధ్యాయం

అమ్మా! నాకు ప్రసన్నవు
గమ్మా! గీతారహస్య గాఢనిగూఢా
ధ్వమ్ముల బూచిన పూవుల
కమ్మని పూదండ నల్లిగళమున వేయన్

సంజయ ఉవాచ

1. తం తథా కృపయావిష్ట మశ్రుపూర్ణాకు లేక్షణమ్।
విషీదన్త మిదం వాక్య మువాచ మధుసూదనః॥

తా: సంజయుడు పలికెను

ఆ విధంగా జాలిగుండెతో నీరుగారిన వాడూ, కన్నీళ్ళతో నిండి ఆర్తి చూపులు గలవాడూ, విషాదాన్ని పూరించిన మనస్సు కలవాడూ అయిన అర్జునునితో కృష్ణ పరమాత్మ ఈ విధంగా పలికేడు.

వ్యా: బంధువులను శత్రు వధ్యస్థానాలమీద చూచినప్పుడు అర్జునుడికి మనో విఘాతం తగిలింది. కాబట్టి ఇక్కడ అర్జునుడు ఇతరులమీద దయచూపించే టంత ప్రశాంత స్థితిలో ఉన్నాడా! అని కొంతమంది విమర్శకులు ప్రశ్నిస్తారు. రాగల శ్లోకాలలో 'కార్పణ్య దోషోపహత స్వభావః పృచ్ఛామిత్వాం ధర్మసమ్మూఢ చేతసః" అనే అర్జున వాక్యం వస్తుంది. కృపణుని భావమే కార్పణ్యం. అర్జునుడు కార్పణ్యం వల్లనే క్షత్రియ స్వభావం కోలుపోయాడు కాని ఇతర కారణాలవలన కాదు. ఆ సంగతి అతనికి తెలుసు. తన మనస్సులో ఏమి జరుగుతున్నదో బొత్తిగా తెలియని ఉన్మాదా వస్థలో అర్జునుడు లేడనీ, ధర్మ సంశయం వల్లనే అతనికి మనోవిప్లవం కలిగిందనీ, అతనికీమాట బాగానే తెలుసుననీ, మనకు విశదం అవుతుంది.

శ్రీ భగవానువాచ

2. కుత స్త్వా కశ్మల మిదం విషమే సముపస్థితమ్।
అనార్యజుష్ట మస్వర్గ్య మకీర్తికర మర్జున!॥

తా: అర్జునా! ఈ విషమ సమయంలో అనార్యులకు మాత్రమే ఆశ్రయమైనదీ; అకీర్తికరమైనదీ, స్వర్గ లోకానికి వెలిబాట అయినదీ, అయిన ఈ నీచమైన నిరుత్సాహం నీకెందుకు దాపురించింది?

వ్యా: కణకణమండి కాల్చిపారెయ్యవలసిన సమయంలో అగ్ని మండక పొగచూరితే ఎలాగా?

ఆయుధాలు కాదు ఖండించేది ఆయుధాన్ని ఉపయోగించే మనస్సు. అర్జునుడు క్రిందటి అధ్యాయంలో 'ఘ్నతోపి' అనే పెద్ద మాటను పారేశాడు. అర్జునుడే చచ్చిపోతే లేక చచ్చిన శవంమాదిరిగా ఉంటే ఇంకా భారతయుద్ధం ఏముంది. దుష్కృతుల వినాశం ఎలా జరుగుతుంది.

దీనికి సమాధానం 11వ అధ్యాయంలో "ఋతేపిత్వాం నభవిష్యన్తి సర్వాః యేవ స్థితాః ప్రత్యనీకేషు యోధాః", "మయాహతాః సర్వాః త్వం నిమిత్తమాత్రం భవ సవ్యసాచిన్."

ఈ కర్మల భావాన్ని, అనార్యజుష్టమైన దానిని, అస్వర్గ్యమైన దానిని, అకీర్తి కరమైన దానిని వదిలించడానికి 10 అధ్యాయాల బోధ చేసినా అర్జునుడి మనస్సు నుండి ఆక్లీబత్వం వదలకపోయేసరికి కృష్ణ పరమాత్మ పైమాటలతో శస్త్ర చికిత్సకు పూనుకోవలసి వచ్చింది. వెనకటి అధ్యాయంలో నరకం గొడవ ఎత్తాడు అర్జునుడు. ఈ శ్లోకంలో అర్జునుని కశ్మల భావాలు అస్వర్గ్యాలుగా ఉన్నాయని కృష్ణుడు బదులు చెప్పాడు.

3. క్లైబ్యం మాస్మగమః పార్థ! నై తత్త్వ య్యుపపద్యతే।
క్షుద్రం హృదయదౌర్బల్యం త్యక్త్వోత్తిష్ఠ పరంతప!॥

తా: పార్థా! నీవు నపుంసకుడివి కాదు. క్లైబ్యం నీకు తగదు. హృదయ దౌర్బల్య మున్నవాడు ఏ పనీ చేయలేడు. యుద్ధమేకాదు, దాన్ని విడిచిపెట్టి లేచి నిలబడు. నీకు పరులను తపింపచేసే సామర్థ్యం ఉంది.

వ్యా: చంపుతామని ఎత్తి వచ్చిన శత్రువులు పైనబడుతుంటే ఎదుర్కోడానికి బదులు నేను చచ్చినా వాళ్ళను చంపననడం పేడితనం కాక మఱేమిటి?

అర్జున ఉవాచ

4. కథం భీష్మ మహం సంఖ్యే ద్రోణం చ మధుసూదన!।
ఇషుభిః ప్రతియోత్స్యామి పూజార్హా వరిసూదన!॥

అర్జునుని వాక్యము

అరిసూదనా! మధుసూదనా! యుద్ధంలో పూజార్హులైన భీష్మద్రోణులను ఎలా ఎదిరించి పోరగలను?

వ్యా: అర్జునుడు కూడా వ్యంగ్యార్థ ప్రసంగంలో కృష్ణపరమాత్మకు తీసిపోయే వాడు కాడు. క్రిందటి శ్లోకంలో 'క్లైబ్యం' అనే మురికిలాంటి మాటను ప్రయోగించి పరమేశ్వరుడు తనలోలేని పిటికితనాన్ని తనకు ఆరోపించాడు. ఎదుట నిలబడి ఉన్న పదకొండు అక్షౌహిణుల సైన్యంతో యుద్ధం చేయవలసి వస్తుందని తానెఱుగడా? భీష్మద్రోణుల పరాక్రమం తానెఱుగనివాడా? 27వ శ్లోకంలో వారిని ప్రధానంగా చెప్పడమెందుకూ?

ఉత్తర గోగ్రహణ సమయంలో తానొక్కడే ఈ అందటినీ ఎదిరించి యుద్ధం చేయలేదా! కాని అది వాళ్ళను పాఱద్రోలడం మాత్రమే అనీ, ఇక్కడ మళ్ళీ కనిపించ కుండా చంపి అవతల పారేయడమనీ పరమాత్మ ఎఱుగడా? యుద్ధరంగం తనకు క్రొత్తా? ఎన్నెన్ని యుద్ధాలు చూడలేదు తను? ఈ యుద్ధం తాము కావాలని తెచ్చు కున్నదా? తనను పిటికివాడని ఎత్తి పొడిచిన పరమాత్మ మధ్యవర్తిగా చేసిన రాయ బారాన్ని సాగకుండా చేసినది ఎవరు? కౌరవులు కాదా? ఆ విధంగా బంధు క్షయానికి కారకులౌతున్నది కౌరవులు కాదా?

సంధి పడనీయకుండా చేసి బంధు క్షయానికి కారకులౌతున్న కౌరవులు మానవ జాతికి శత్రువులే! రాక్షసులే! మధురాక్షసునికి తీసిపోయే వాళ్ళేమీకాదు. ఈ రాక్షస ప్రముఖుల్లో ఎవడెవడు మొనగాడో ఎవరెవరితో తాను యుద్ధం చేయవలసి వస్తుందో అంచనా వేసుకుందామని 'సేనయోరు భయోర్మధ్యే రథాన్ని స్థాపించమని తానన్న మాట నిజమే. కాని తనకిప్పుడెదురై యున్న వారు, రాక్షసులూ కారు. శత్రువులూ కారు. పైగా తనకు గురువులు. తన ధనుర్విద్యకు కారకులు. పూజింపదగిన వారు. పరమాత్మా? నీవు అరిసూదనుడవు; శత్రువులన్నా రాక్షసులన్నా నాకూ భయంలేదు. కాని పూజార్హులైన ఈ భీష్మద్రోణులమీద బాణాలు వేసి, ఎదిరించి ఎలా పోరగల నయ్యా అని ఇంకా తన వైముఖ్యాన్ని నైతిక సూత్రాలతో అల్లి ఒక ముసుగును వేస్తున్నా డర్జునుడు.

5. గురూ నహత్వా హి మహానుభావాన్
శ్రేయో భోక్తుం భైక్ష మపీహ లోకే।
హత్వాఽర్థ కామాన్స్తు గురూ నిహైవ
భుంజీయ భోగాన్ రుధిర ప్రదిగ్ధాన్॥

తా: మహానుభావులైన గురువులను చంపడం కంటే ఈ లోకంలో ముష్టి ఎత్తుకుని జీవించడం మేలు. అర్థకాములైనా గురువులను చంపి అనుభవించే భోగాలు నెత్తుటి కూటితో సమానం.

వ్యా: పెద్దవాళ్ళ ఆశీర్వచన బలంవల్ల చిన్నవాళ్ళ యోగక్షేమాలకు పుష్టి చేకూరుతుంది. ఆ పెద్ద వాళ్ళు మహానుభావులూ, గురువులూ అయినప్పుడు ఇంకా చెప్పవలసిందేముంది. అలాంటి పెద్దవాళ్ళ హత్యలవలన పొందజూచే శ్రేయస్సు కంటే ఇంకొకడి దయాధర్మ భైక్షంమీద ఆధారపడి బ్రదకడం మంచిది. నెత్తురు త్రాగి కండలు తిని అనుభవించే భోగాలుగానే అర్థం చేసుకోవాలి గురువుల వధతో ఆర్జించిన భోగాలు.

కాని అర్జునుని దృష్టి ఎల్లప్పుడూ అలా లేదనిపిస్తుంది. విశ్వరూప సందర్శనాధ్యాయంలో ఈ శ్లోకం వస్తుంది.

అమీచ త్వాం ధృతరాష్ట్రస్య పుత్రాః
సర్వే సహా వావనిపాల సంఘైః
భీష్మో ద్రోణ స్సూత పుత్రస్తథాఽ సౌ
సహాస్మదీయై రపి యోధముఖ్యైః॥

కాలపురుషుని నోటిలోనికి జారబడే వాళ్ళలో భీష్మద్రోణుల ప్రత్యేక ప్రస్తావన ఉంది. ఎందుకంటే వాళ్ళు అర్థకాములైనంతగా ధర్మకాములు గారు.

6 **నచైత ద్విద్మః కతరన్నోగరీయో**
యద్వా జయేమ యది వా నో జయేయుః॥
యానేవ హత్వా న జిజీవిషామ
స్తేఽ వస్థితాః ప్రముఖే ధార్త రాష్ట్రాః॥

తా: ఇప్పుడేమి చేయాలో ఏది మంచిదో అర్థంకావడంలేదు. జయాపజయాలు దైవాధీనాలు. యుద్ధంలో వాళ్ళే గెలుస్తారో మనమే గెలుస్తామో చెప్పలేము. ఎవళ్ళను చంపి మనం జీవించడానికి కిష్టపడమో వాళ్ళే యుద్ధ సన్నద్ధులై మనముందు నిలిచి ఉన్నారు.

7. **కార్పణ్య దోషోపహత స్వభావః**
పృచ్ఛామి త్వాం ధర్మసమ్మూఢ చేతాః॥
యచ్ఛ్రేయః స్యాన్నిశ్చితం బ్రూహి తన్మే
శిష్యస్తేఽ హం శాధి మాం త్వాం ప్రపన్నం॥

కృపణత్వదోషం వలన నా స్వభావం నశించిపోయింది. నేను ధర్మమేదో అధర్మమేదో తెలుసుకోలేని వాడనై ఉన్నాను. నిన్నడుగుతున్నాను. ఏది నాకు శ్రేయస్సు కూర్చుతుందో దాన్ని నిశ్చయించి నాకు చెప్పు. నేను నీ శిష్యుణ్ణి. శరణాగతుణ్ణి. నన్ను గురువులాగా శాసించు.

8. **న హి ప్రపశ్యామి మమాపనుద్యా**
ద్య చ్ఛోక ముచ్ఛోషణ మింద్రియాణామ్।
అవాప్య భూమా వసపత్న మృద్ధమ్
రాజ్యం సురాణా మపి చాధిపత్యమ్॥

ఈ భూమిలో నిష్కంటకమూ, ధనధాన్య సమృద్ధమూ, అసపత్నమూ అయిన రాజ్యంకాని, దేవతాధిపత్యంగాని లభించినా కూడా, నా ఇంద్రియాలను శోషింప చేస్తున్న ఈ శోకాన్ని చల్లార్చే ఉపాయం తెలీకుండా ఉంది.

స్వాభావికంగా క్షత్రియ ధర్మమైన యుద్ధం చేయడానికి తయారై వచ్చిన అర్జునుడు శోకమోహాలచే నశించిన విజ్ఞాన వివేకాలు గలవాడై యుద్ధం నుంచి విరమించి భిక్షావృత్తిద్వారా జీవించడానికి కూడా సిద్ధమైనాడు. కళ్ళ ముందు అగతాసు ప్రపంచమై కనపడే దృశ్యం తాను కారణంగా గతాసువుగా మారిపోగల మనశ్చిత్రం ఎదుట ప్రత్యక్షమైంది. ఇప్పుడు బంధువులు, గురువులు, స్నేహితులుగా ఉన్న వారంతా తన బాణాలతో పీనుగులై క్రింద పడిపోతూండడం ప్రత్యక్షంగా కండ్ల ముందు దిగింది.

స్వధర్మము నెఱవేర్చే వాళ్ళకు కూడా మనస్సు వాక్కు శరీరాదుల ప్రవృత్తి ఫలకాంక్షా పూర్వకంగానే ఉంటుంది. శోకమోహాలు వాళ్ళ మనస్సును కూడా పీడిస్తూ వారి ఇంద్రియాలను నిర్వీర్యాలుగా చేస్తాయి. ఈ రెండూ పోవాలంటే ఆత్మ జ్ఞానం కంటే వేఱే ఉపాయం లేదు. కాబట్టి ఆ ఆత్మజ్ఞానాన్ని ఉపదేశింపదలచి అర్జునుడిని నిమిత్తంగా ఉంచుకొని శ్రీకృష్ణ పరమాత్మ 'అశోచ్యా నన్వశోచస్త్వం' అని చెప్పడం ప్రారంభించాడు.

సంజయ ఉవాచ

9. **ఏవముక్త్వా హృషీకేశం గుడా కేశః పరంతపః।**
న యోత్స్య ఇతిగోవింద ముక్త్వా తూష్ణీం బభూవహః॥

10. **త మువాచ హృషీకేశః ప్రహస న్నివ భారత!।**
సేనయో రుభయో ర్మధ్యే విషీదన్త మిదం వచః॥

పరంతపుడూ గుడాకేశుడూ అయిన అర్జునుడు హృషీకేశుడైన గోవిందునితో ఈ విధంగా చెప్పి 'నేను యుద్ధం చెయ్యనంటూ' కూర్చుండిపోయాడు. అప్పుడు కృష్ణ పరమాత్మ ఇలా అన్నాడు. ఓ భారత! ఇక్కడ నుంచే అసలు భగవద్గీత ఆరంభిస్తుంది. ప్రాణహీనమై శరీరం పడిపోవడమే, చావుగా, నిశ్శేషత్వంగా తలచిన అర్జునుని వైఖరి పరమాత్మకు చిఱునవ్వు తెప్పించింది.

వ్యా: అహంకార మమకారాలనే గాండీవాన్ని అంబులనూ, క్రింద పారేసి, అర్జునుడనే జీవాత్మ ఎప్పుడైతే ఆర్తి అనే అగ్నిలో తప్తమైనాడో, అప్పుడు పరమాత్మ సారథి భావాన్నవలంబించి, రథాన్ని రథికుడినీ శ్రేయోమార్గానికి తీసుకుపోయాడు అని అంతరార్థం చెబుతారు వ్యాఖ్యాత లీ శ్లోకానికి. ఎక్కడైనా ఇంద్రియాలనే గుఱ్ఱాలను లాగిపట్టుకోవలసిన బాధ్యతా, మనసును ఎగద్రోసే ప్రేరణా ప్రయత్నమూ, పరమాత్మ నుండే లభించాలి. కృష్ణ పరమాత్మ చిఱునవ్వు దివ్యవిజ్ఞాన జ్యోతియైన దినకరుని రాకకు ప్రతీహారి అయిన ప్రత్యూష కాంతివలె భావగర్భిత మైనది. ప్రేయోమార్గాన్ని వరించిన అర్జునునకు పరమాత్మ అనుగ్రహం త్వరలో విజ్ఞానమయ రూపంలో ప్రసాదించబడనున్నదని సూచన.

శ్రీ భగవానువాచ

11. అశోచ్యా నన్వశోచ స్త్వం ప్రజ్ఞావాదాం శ్చ భాషసే।
గతాసూ నగతాసూం శ్చ నానుశోచన్తి పండితాః॥

తా: నీవు శోకింపదగని వారిగూర్చి శోకిస్తున్నావు. పండితులు ప్రాణంపోయిన వాళ్ళను గూర్చిగాని, ప్రాణంపోని వాళ్ళను గూర్చిగాని (వేఱు దృష్టితో) శోకింపరు ప్రజ్ఞావాదమేగాని నీ మాటలలో తత్వస్థైర్యం లేదు.

వ్యా: "పుట్టేవాళ్ళంతా ఎవరి దగ్గఱనుండి వస్తారు? చచ్చిపోయి ఎక్కడకు వెళ్తారు. దేవుడు పంపిన వాళ్ళు ఆయన పిలిస్తే మళ్ళీ ఆయన దగ్గఱకు పోతే మధ్య మనం ఏడవడమెందుకు?

గీతలో నిజమైన ఆధ్యాత్మిక బోధ ఈ శ్లోకం నుంచే ఆరంభమౌతుంది. అర్జునుని శోకానికి ప్రధానమైన కారణాలు లేదా స్వధర్మమైన యుద్ధం చేయడానికి అభ్యంతరాలు.

1. యుద్ధంచేసి చంపవలసి ఉన్న శత్రువులు తనకు బంధువులు, గురువులు, పెద్దలూ కావడం.

(నేనూ నాది నా వాడూ అనే సంకుచిత భావం)

2. యుద్ధంవల్ల ధర్మచ్యుతిని కలిగించి, అ ధర్మాన్ని వృద్ధిచేసి, వర్ణ సాంకర్యానికి దారితీసి, సమాజాన్ని అధోగతికి తేవడం.

(కర్తృత్వాన్ని పైనవేసుకోవడం, వర్ణ ధర్మాల మిథ్యా జ్ఞానం)

3. వర్ణాశ్రమ ధర్మాలను, సంకరకులస్థులు, పాటించకపోతే పరలోకంలో ఉండే పితరులుగూడా, నిత్య పిండోదక క్రియలలోపంవల్ల పతితులు కావడం.

(అన్యతా జ్ఞానం, దేశాంతర కాలాంతర వ్యవస్థలలోనిపురోవృత్తులను భ్రాంతి కనుకూలంగా మలిచిపోవడం)

4. గురువులు, పెద్దలూ అయిన వారిని చంపి ఇహలోక భోగాలు సంపాదించినా అవి బంధురుధిరప్లావితాలు కావడంవల్ల అనుభోగ్యాలు కాకపోవడం.

(అన్వయ వ్యతిరేక బుద్ధి)

5. పెద్దలను చంపడంవల్ల తానుకూడా పాపం మూటకట్టుకొని నరకానికి అర్హుడు కావడం.

(ధర్మ విస్మృతికి అధర్మ వేషాన్ని తగిలించడం)

6. యుద్ధం పేరుబెట్టి బంధువులను, గురువులను చంపవచ్చునా? చంపకూడదా? అనే ధర్మ సందేహం తీరకపోవడం.

(సంశయాత్మ)

పైన చెప్పినదంతా అర్జునుని ప్రజ్ఞావాదం.

ఇలాగా యుద్ధం మూలంగా ఒక వైపున ఇహానికి పరానికి దూరం అయ్యే పరిస్థితి ఏర్పడి ఉంది. రెండో వైపున ఆ యుద్ధ విజయంవల్ల, తనకు శత్రువులు లేని ఇహలోక సామ్రాజ్యాధిపత్యం వచ్చినా, అంతకు మించిన స్వర్గలోకాధిపత్యం, ఇంద్రియాలను దహించివేసే బంధువధాశోకం నిత్యమూ మనస్సును తినివేస్తూ ఉండదా? అవి ఎలా రుచిస్తాయి? అటువంటి ఇహలోక నరకంలో ఇంకా ఆ ఆధిపత్యాలవల్ల ఏ ప్రయోజనం అని అర్జునుడు తన విషణ్ణతను భగవానునకు నివేదించి ఏది శ్రేయస్కరమైనదో ఆ మార్గంలో తనను నడిపించమని శరణాగతిని పొందాడు.

భగవానుడు అతని శంకాగ్రంథిని బాగానే అర్థం చేసుకున్నాడు. అర్జునుడు ప్రవృత్తి ధర్మాన్ని నివృత్తి ధర్మాన్ని రెంటినీ పీటముడివేసి గుండెలమీద బిగించుకొని కూర్చున్నాడు. ప్రవృత్తి ధర్మానికి నివృత్తి ధర్మానికి ఉన్న భేదాభేదాలు, విడమఱచి చూపిస్తే తప్ప, అతని విషాదం మాసిపోదని పరమాత్మ గ్రహించాడు.

కాని ప్రవృత్తించ నివృత్తించ అని 16వ అధ్యాయంలో చెప్పినట్లు ఓనమాల క్లాసులో మొదలుపెట్టే స్థితిలో లేదు అర్జునుడు. అందువల్ల ఎకాయకిగా చావు బ్రదుకుల సమస్యతోనే పాఠాన్ని ఆరంభించాడు పరమాత్మ.

మొట్టమొదటి శ్లోకంలోనే శోకించదగని వారిగూర్చి శోకించడమే నిన్ను పట్టుకొన్న బంధమని సూటిగా చెప్పాడు పరమాత్మ. ఆ మాట విన్న తరువాత అర్జునుడి మనసులో తప్పక ఈ ప్రశ్నలుదయిస్తాయి.

1. తన శోకం ఆత్యంతిక దుఃఖమైన మృత్యువును గూర్చికదా? బంధువులు, గురువులు చచ్చిపోతే అందులోను తన బాణప్రహారాలవల్ల చచ్చిపోతే - అది శోకింపదగని విషయమెలా అవుతుంది. అలాంటి సందేహానికి భగవానుడు రెండవ పాదంలో సమాధానం చెప్పాడు.

పండితులైన వాళ్ళు ప్రాణాలుపోయిన వాళ్ళను గూర్చిగాని, ప్రాణాలుపోని వాళ్ళను గూర్చిగాని విలపించరు. పామరులు, అజ్ఞానులు మాత్రమే విలపిస్తారు.

అయితే పండితుల మతంలో శరీరం ప్రాణసహితంగా ఉండడానికి ప్రాణరహితంగా ఉండడానికి భేదం లేదా? పామరులు ఈ రెండవస్థలను ఎలా అర్థం చేసుకోవాలి? చావంటే ఏమిటి? బ్రతుకంటే ఏమిటి? శరీరాన్ని ముక్కలు ముక్కలుగా చేసినా ప్రాణం మిగులుతుందా? ప్రాణం లేకుండా శరీరం నడుస్తుందా? గురువులూ తాతలూ అయిన ద్రోణాదులు చచ్చిపోతే నేను విచారించగూడదా? పెద్దవాళ్ళ మీద గౌరవం కూడా నాకు బంధమే అవుతుందా? అనే శంకలు అర్జునుడి మనసులో మెఱుస్తాయి. వీటిని తొలగించడానికి సృష్టి రహస్యాన్ని విడమఱచి చెప్పే ఆత్మబోధ వినా మఱో మార్గంలేదు. అర్జునుడి విషాదం అంతా తనతో రక్తసంబంధం, మనస్సంబంధం గల స్థూలదేహాల వ్యవస్థను గుఱించి, దేహబుద్ధిగల ప్రతి వ్యక్తికి ప్రపంచంలో జరుగుతూనే ఉండే నిత్యానుభవమే ఇది. వీళ్ళు నా రక్త సంబంధులు, నేనూ, వీళ్ళూ, ఇదేనా ప్రపంచం. పైవాళ్ళందఱూ పరాయివాళ్ళు, లేక శత్రువులు అనుకుంటాడు మానవుడు. అలా అనుకుంటూ తన చుట్టూ ఒక బూజుగూడు అల్లుకుంటాడు. గొంగడి పురుగు చావబోయేటప్పుడు తన చుట్టూ అల్లుకున్నట్లుగా నేనూ నా వాడూ అనే చిక్కంలోబడి తన్నుకుంటాడు. ఎంత పెద్దవాడికైనా ఈ బూజుగూడూ ఈ చిక్కం తప్పవు. చిన్నవాళ్ళకు చిన్నగూడు, పెద్ద వాళ్ళకు పెద్దగూడు.

అర్జునుడు కూడా కావాలని ఇలాంటి గూడు కట్టుకున్నాడు. వ్యాఖ్యాతలు అతనికి పిఱికితనాన్ని ఆరోపిస్తారు. కాని అది సరికాదు. అతని మనోవిప్లవానికి

నిమిత్త కారణం యుద్ధమే అయినప్పటికీ, అలాంటి యుద్ధాలూ, అలాంటి స్థూల దేహాల వధలూ ఎన్నో అర్జునుడిది 'వఱ'కు చూచే ఉన్నాడు. పూర్వం జఱిగిన యుద్ధాలలో అతనికి దేహవధా విషాదం ఉత్పన్నం కాలేదు. ఎందుకంటే చంపబడిన దేహాలన్నీ అతని అహానికి సంబంధించనివి. ఈ యుద్ధంలో ఎదుట నిలిచిన దేహాల్లో తన అహానికీ, మమకారానికీ సంబంధించినవి, తన రక్తంతో సంబంధమున్న రక్తముంది.

కనుక అతని అనురాగం వాటిమీద అల్లుకొని మనస్సును కలవరపెట్టసాగింది. ఏక దేశమైన అనురాగం ఇది. అతని అనురాగం సర్వత్రా వ్యాపించినది కాదు. ఏ కొద్ది మంది బంధువుల మీద మాత్రమే అది ముడిబడినది కనుక అతనికి అనాసక్తి బుద్ధిగాని, సర్వత్రా సమానమైన ఆసక్త బుద్ధిగాని లేకపోయింది. ఏక దేశమాత్రమైన అహంకార విక్షేపం అది.

'సర్వత్రానురాగమే విరాగం' అన్నది అమ్మ అలాటప్పుడు అర్జునుని మనస్సుకు యథార్థమైన ప్రేరణను కల్పించి, దేహాలన్నింటికీ ఉండే, అశాశ్వతత్వమూ, ప్రాణాధారత్వమూ, అతనిచేత గుర్తింపజేయడానికి భగవంతుడు సంకల్పించుకున్నాడు. ఎదుట ఉండే రాజులుగాని, యోధులుగాని, గురువులుగాని, బంధువులుగాని వ్యష్టి భేదాలతో వివిధ శరీరాలుగా కనిపిస్తున్నారే కాని ఆ బలగమంతా సమష్టిగా ఏకైక సత్తాకు సంబంధించిన వారేనని విశదీకరించాడు పరమాత్మ. ఆ సత్తాకు నేను నీవు అనే భేదాలులేవు. కుండల్లో అంతటా మట్టి నిండి ఉన్నట్లే కాలభేదం లేకుండా ఆ సత్తాయే నిండి ఉందని దాన్ని ఎవరూ వధించలేరని పరమాత్మ చెప్పారు.

12. న త్వే వాహం జాతు నాసం నత్వం నేమే జనాధిపాః।
న చైవ న భవిష్యామః సర్వే వయ మతః పరమ్.

తా: నేనుకాని, నీవుకాని, ఈ రాజులుకాని, ఈ అందఱం ఇది వఱకు ఎన్నడు ఉండి ఉండకపోలేదు. ఇక ముందు కూడా ఉండి ఉండకపోము.

వ్యా: దేహబుద్ధి రూపకమైన అర్జునుని వాదాన్ని, ప్రజ్ఞావాదంగా నిరాకరించి, తత్వతః ఉండే సత్యాన్ని, ఈ శ్లోకంలో పరమాత్మ చెబుతున్నారు. నేను అంటే సచ్చిదానంద పరబ్రహ్మ స్వరూపాన్ని అయిన నేనూ, నన్ను గుర్తింపచేసుకుంటున్న చైతన్య భావానివైన నీవూ, అనేకులై ఇక్కడ ఉన్న ఈ రాజులూ ఆనంత్యరూపకంగా, ఎన్నడూ లేని వాళ్ళంకాము. ఉండబోని వాళ్ళం కాముకూడా! ఉండని వాళ్ళమూ కాము. స్వయంగా పరమాత్మ చెబుతున్న ఈ మాట. జగత్తు వేఱు; జీవాత్మ వేఱు, పరమాత్మ వేఱు అని వాదించే వారికి చక్కని సమాధానం.

సృష్టే భగవంతుడు. సృష్టి కానిదేదైనా ఉంటే అదీ భగవంతుడే. పైశ్లోకంలో నేనూ, నీవూ వాడు అనే మూడు పురుషులను పరమాత్మ ఉపయోగించి 'సర్వే వయమతః పరం, నచైవ నభవిష్యామః। అన్నారు పరమాత్మ అనేది నా కంటే వేఱు కాదు. అన్నీ నేనే అయి ఉన్నాను. అనేకాక వయం(మనం) అనే మాట కూడా అన్నారు. అంటే సృష్టి ఉంది, పరమాత్మా ఉంది అన్నీ నచైవ నభవిష్యామః అన్నారు పరమాత్మ. అన్నీ నాకంటే వేరుకాదు. అన్నీ నేనే అయి ఉన్నాను అనే కాకవయం అన్న మాట కూడా అన్నారంటే 'సృష్టీ ఉంది పరమాత్మా ఉంది అన్నారు.

ఉదా: మీరంతా నేనే, మీదంతా నేనే; ఇదంతా నేనే అన్నది అమ్మ.

ఈ కనపడే దాన్ని చెఱిపెయ్యడానికి ఎవరికీ శక్యంకాదు. శాశ్వతమూ అనంతమూ అయిన దీన్ని నాశనం చేస్తున్నాననుకునే వాడు మూఢుడు. ప్రాణం దేహంతో సంబంధించింది కాదు. ఆత్మతో సంబంధించింది. ప్రాణవిద్యకు 'పండా' అని కూడా పేరుంది. అది ఉన్న వారిని పండితులంటారు.

ప్రాణయాత్ర దేహ సంబంధి పురుష (ఉత్తమ, మధ్యమ, ప్రథమ) సంబంధి కాదు. భీష్మాదులు అశోచ్యులు ఎందుకారంటావా?

13. దేహినోఽస్మిన్ యథా దేహే కౌమారం యౌవనం జరా।
తథా దేహాంతర ప్రాప్తి ర్ధీర స్తత్ర న ముహ్యతే॥

తా॥ దేహి (అంటే ప్రాణం! ఉన్నంతకాలం దేహానికి కౌమారం, పడుచుదనం, ముసలితనం అనే మార్పులు తప్పని సరిగా వస్తాయి. జగదాత్మలో దేహి కలిసి పోగానే దేహానికి మార్పులు రావు. సమష్టిలో వ్యష్టి కలిసి పోవడమే చావంటే. సమష్టిగా నిత్యమూ ఉంటుందీ ఆత్మ. శరీరం మారడాన్ని గూర్చి పండితులు మోహం చెందరు. వికారంతోనే ఆకారం వచ్చిందంటుంది అమ్మ. సమష్టి యొక్క వ్యష్టిత్వమే ప్రపంచం అని కూడా అమ్మవాక్యం.

14. మాత్రా స్పర్శాస్తు కౌన్తేయ! శీతోష్ణ సుఖ దుఃఖదాః।
ఆగమాపాయినోఽనిత్యా స్తాం స్థితిక్ష స్వ భారత!॥

తా॥ శీతోష్ణ సుఖదుఃఖాలను కల్పించే మాత్రా స్పర్శములు, రావడం పోవడం అనే గుణాలు కలవి కాబట్టి అవి అనిత్యాలు. వాటిని తితిక్షతో భరించు అర్జునా!

వ్యా: వెనుకటి శ్లోకంలో చెప్పిన కౌమారాదులు శరీరంతోబాటు సహజంగా వచ్చేవి, మాత్రాస్పర్శలు శరీరమునకు బహిరంగంగా ఉండేవి.

అంతేకాక శీతోష్ణాలు నిత్యమూ సుఖాన్నిగాని దుఃఖాన్నిగాని ఒకే రకంగా కలిగించేవి కావు. కాబట్టి అదేవిధంగా వాటిని అర్థం చేసుకోమని పరమాత్మ చెప్పారు.

15. యంహి నవ్యథయన్త్యేతే పురుషం పురుషర్షభ!।
సమ దుఃఖ సుఖంధీరం, సోమృతత్వాయ కల్పతే॥

తా: పురుష శ్రేష్ఠుడవైన అర్జునా! ఎవనిని ఈ శీతోష్ణ సుఖదుఃఖాలు బాధించకుండా ఉంటాయో, ఎవని మనస్సు సమభావం దృఢంగా నెలకొని ఉన్నదో అట్టి శాంతచిత్తుడు పురుష శ్రేష్ఠుడు, అమృత యోగాన్ని పొందడానికి అర్హుడౌతాడు.

మనస్సు ఆ అనుభవ భేదాన్ని కల్పించకపోతే, అంటే ఇంద్రియాలు ఒకే త్రాటిమీద పనిచేస్తుంటే, అంటే మనస్సముద్రంలో ప్రాణశరీరాలు నీళ్ళలో నీళ్ళై కలిసి ఉంటే దాన్ని అమనస్క యోగం అంటారు. ఈ అమనస్క స్థితిలో శీతానికి ఉష్ణానికి భేదం ఉండదు. ఈ నిగ్రహం సాధనవలనా రావచ్చు. పరమేశ్వరుని అనుగ్రహం వలనా రావచ్చు. స్వతస్సిద్ధంగానూ ఆ విధంగా జన్మించవచ్చు. భర్తృహరి సుభాషితంలో ఏనుగు లక్ష్మణకవి వ్రాసిన (తెలుగు చేసిన) చక్కని పద్యం గుర్తుకు వస్తున్నది.

శ్రీ సురసింధు తీరమున శీత నగోపల సీమయందు ప
ద్మాసన వర్తినై శివునుపాస్తి యొనర్చుచు యోగనిద్రచే
భాసిలుచున్న నాతనువుపై తమమేనుల తీటదీఱ, న
త్రాసములై కురంగములు రాపులు చేయుట కల్గునే కదా!

ఇటువంటి సమాధి గత చిత్తానికి సదసత్తుల భేదం లేదు.

16. నాఽ సతో విద్యతేఽ భావో నా ఽ భావో విద్యతే సతః।
ఉభయో రపి దృష్టోఽ న్త స్త్వనయో స్తత్వ దర్శిభిః॥

తా: ప్రకృతి కార్యమైన అసత్తుకు మార్పేకాని అసలు లేకపోవడమంటూ లేదు. ఆత్మ చైతన్యమైన సత్తుకు మార్పే తప్ప అసలు లేకపోవడమంటూ లేదు. ప్రకృతి కార్యము, పరమాత్మ భావము అనే రెండింటి తాలూకు నిర్ణయాలనూ, లెస్సగా బ్రహ్మవేత్తలు చేసే ఉన్నారు.

అసత్తు, సత్తు, అభావం అనే పదాలు పైశ్లోకంలో గంభీరార్థద్యోతకాలుగా ప్రయోగించబడ్డాయి. సత్తు అనే మాటకు, పరమాత్మ చైతన్యం అనీ, అసత్తు అనే మాటకు ప్రకృతి కార్యమైన జగత్తునీ, అభావం అనే మాటకు మార్పు అనీ అర్థాలుగా గ్రహించవలసి ఉంటుంది.

పైపదాలకు, వ్యాఖ్యాతలు, పలు రకాలుగా వ్యాఖ్యానిస్తారు. త్రికాలాబాధ్యమై నట్టే, నిర్వికారమైనట్టీ, సత్తా జగత్తుకు లేదు కాబట్టి అది సత్తు కాదంటారు.

జగత్తు, అనాది, నాదీ అన్నది అమ్మ అనాది అయిన జగత్తు ద్వారానే అనాది ప్రకృతులైన జగద్భూతాలు పరమాత్మను చేరుకోడానికి ప్రయాణం చేస్తున్నాయి. ఈ జగత్ప్రయాణంలో జరిగే మార్పులు, పరిణామాలు, ఇవి మాటిమాటికీ తిరిగి పోతున్నాయి కాబట్టి సృష్టిని అసత్తు అంటే వికార ధర్మానికి లోబడినది అంటున్నాం. ఆత్మను, ఆత్మ చైతన్యాన్ని సత్తు అంటే త్రికాలం బాధ్యంగా ఉండేది అంటున్నాం. కాని ఆత్మ చైతన్యం కానటువంటి జడంగాని, స్థావరంగాని, చేతనంగాని, అచేతనం గాని లేదని శాస్త్రం చెబుతుంది.

గీతలోనే 13వ అధ్యాయంలో ఇలాగుంది.

జ్ఞేయం యత్త త్ప్రవక్ష్యామి య ద్జ్ఞాత్వా మృత మశ్నుతే।
అనాది మత్పరం బ్రహ్మ న సత్త న్నాస దుచ్యతే॥

దేన్ని తెలుసుకుంటే మోక్షం లభిస్తుందో దాన్ని చెబుతున్నాను. ఏది అనాది అయి ఉందో, ఏది పరబ్రహ్మమని చెప్పబడుతుందో, ఏది జ్ఞేయమో, అది సత్తు అనిగాని అసత్తనిగాని చెప్పడానికి వీలులేనిది. ఎందుకంటే రెండూ అదే కాబట్టి.

సర్వత పాణిపాదం తత్ సర్వతోక్షి శిరోముఖమ్।
సర్వతః శ్రుతిమల్లోకే సర్వమా వృత్యతిష్ఠతి॥
సర్వేంద్రియ గుణాభాసం సర్వేంద్రియ వివర్జితమ్।
అసక్తం సర్వభృచ్చైవ నిర్గుణం గుణభోక్తృచ॥
బహిరంతశ్చ భూతానాం నచరం చరమేవచ।
సూక్ష్మత్వా త్త ద విజ్ఞేయం దూరస్థం చాఽన్తికేన తత్॥
అవిభక్తం చ, భూతేషు విభక్తమివ చ స్థితమ్।
భూత భర్తృ చ తద్జ్ఞేయమ్ గ్రసిష్ణు ప్రభవిష్ణు చ॥

దాని కన్నిచోట్లా కాళ్ళూ, చేతులూ ఉన్నాయి. అన్ని చోట్లా కళ్ళూ, శిరస్సులూ, ముఖాలూ ఉన్నాయి. అన్ని చోట్లా చెవులున్నాయి - లోకమంతా అదే అయి ఉంది. ఇంద్రియ వర్జితంగా ఉన్నట్లు కన్పిస్తుంది. దేనిని అంటుకోనిదైనా, అన్నింటి ఆకారా లను ధరించి తానే అయి ఉంటుంది. గుణాతీతమైనదైనప్పటికీ అన్ని గుణాలూ తానే అనుభవిస్తూ ఉంటుంది. భూతాలకు వెలుపలా లోపలా అదే కదులుతుంది. కదలదు గూడా. సూక్ష్మాతి సూక్ష్మమై తెలుసుకోడానికి వీలుకానిది. దూరంగా ఉన్నట్లు

అనిపిస్తుంది. కాని దగ్గతే ఉంటుంది. భూతాలనుంచి దాన్ని విభాగం చేయరానిది. విభజింపబడినట్లు కనిపిస్తుంది. అది భూతాలను భరిస్తూ ఉంటుంది. సృష్టిస్తూ ఉంటుంది. తానే తిరిగి పుడుతూ ఉంటుంది. "అన్ని రూపాలూ ఆయనవే కనుక రూపరహితుడు" అన్నది అమ్మ అటువంటి ఆత్మచైతన్యాన్ని ఎలా వర్ణిస్తాం. సత్తైనా అదే అసత్తైనా అదే. సత్తుకూ అసత్తుకూ లంకెగా ఉన్న విశేషం వికారమే. అదే వికారం చెందుతుంది. వికారం లేకుండానూ ఉంటుంది.

సవికార నిర్వికారావస్థలు రెండూ దానివే. సవికార దశలో వర్తించేటప్పుడు అవికార దశగాని ఆయా అంతర్దశలు గాని జ్ఞప్తికిరావు.

స్వప్నంలో విహరించే వాడికి జాగ్రద్దశా విశేషాలు గుర్తుండనట్లు గుడ్డను చూసే టప్పుడు నూలూ దాని పుట్టుపూర్వోత్తరాలూ జ్ఞప్తికి రానట్లు జాగ్రద్దశలోనే స్వప్న దశకు బీజాలున్నాయి. పారమార్థిక సత్తాలోనే వ్యావహారిక సత్తా ఇమిడి ఉంది. వీణలోగానం, ఱాతిలో విగ్రహం ఎలా లీనమై ఉంటాయో ప్రపంచకార్యం కూడా పరమాత్మలో లీనమై ఉండనే ఉన్నది. పరమాత్మ ఉన్నాడు. ప్రపంచమూ ఉన్నది. ఆ రెంటి ఉనికికీ అభావమంటూ లేదు. ప్రపంచమే పరమాత్మ, పరమాత్మయే ప్రపంచమూ అయి ఉన్నారు.

సత్తూ అసత్తూ పైవిధంగా అభావంలేని వాస్తవాలైనప్పటికీ, రెండూ సత్యములూ, రెండూ నిత్యములూ అయినప్పటికీ, ఈ రెంటికీ తేడా ఉన్నదనే భ్రమ ఎక్కడనుంచి వస్తున్నది? ఎందుకంటే మార్పు అనే లక్షణం ఆ రెంటికీ తేడాకాదు. రెంటినీ అవినాభావంగా చేసే లంకెయే, రెండూ పరబ్రహ్మ విశేషాలే కనుక సదసత్తుల విషయంలో భ్రాంతికాని, మిథ్యాజ్ఞానం కాని ఉండడానికి చోటులేకుండా పోయినా, ఈ భ్రాంతి అనే కొలమానం ఎక్కడ నుండి వస్తున్నది?

'యాదేవీ సర్వభూతేషు భ్రాంతిరూపేణ సంస్థితా'

నమస్తస్యై, నమస్తస్యై, నమస్తస్యై నమోనమః" అని చెప్పి దేవీసారస్వతం -ంతిని కూడా దేవీరూపంగానే నిరూపించింది.

'భ్రాంతి అంటే మమకారమనీ, భ్రాంతి వదిలితే బ్రహ్మ' అనీ అన్నారు అమ్మ.

మమకారమంటే అసలుది నేను కావడమే అనీ, ఉత్తమ మధ్యమ ప్రథమ పురుషులు లీనమైపోవడంలోనే మోక్షమనీ, అవి వేఱువేఱుగా ఉండడంలోనే బంధం ఉందనీ, వాటిని వేఱుగా గుర్తించి వాటికి ప్రత్యేక విశిష్టతను కల్పించిన మనోన్మాదం లోనే మనస్సు వేఱూ, దేహం వేఱూ అనుకోడంలోనే భ్రాంతికి బీజాంకురమైనదనీ

అవగతమౌతుంది. ఈ బీజమే బ్రహ్మ చైతన్య సంయోగానికి వికారాన్ని తెచ్చిపెట్టింది. సహజంగా జరిగిన ఈ వికార ప్రస్తారాలను మనఃప్రాభవం ఇంద్రియమోహం అనే తెరలు కప్పివేశాయి. ప్రతి జీవికీ బ్రతుకు నాటకం ఆరంభించింది. నాటకం నాటకమే కనుక భరతవాక్యం కాగానే నటకులూ ప్రేక్షకులూ కలిసి వెళ్ళిపోతారు.

బొమ్మా బొరుసూ విడిపోతుంది. మధ్యన మిగిలేది అభావమే – అభావమే పునః ప్రదర్శనానికి హేతువు.

అమ్మ ప్రథమ స్పందనం ఎలా జరిగింది? అంటూ ఉండేది? అంటే బ్రహ్మ చైతన్యానికి వికార సంయోగం ఎలా జరిగింది? సహజంగానే జరిగింది. అలా జరగడం దాని స్వభావం.

17. అవినాశి తు తద్విద్ధి యేన సర్వ మిదం తతమ్।
వినాశ మవ్యయ స్యాస్య న కశ్చి త్కర్తు మర్హతి॥

తా: దేనివలన ఈ సర్వమూ వ్యాప్తమయి అంతా అదే అయి ఉన్నదో, అది అవినాశి అని తెలుసుకో. దానికి వినాశంగాని, వ్యయంగాని, ఎవడూ తెచ్చి పెట్టలేడు. అది అవ్యయమైనది.

వ్యా: దాన్ని శక్తి అను, పరమాత్మ అను, దేవుడను, ఏ పేరైనా దానికి పెట్టు. లేదా ఐన్‌స్టీన్ చెప్పిన శక్తి పదార్థాల మొత్తమే అను. హోయిలే చెప్పిన విస్తరించిన సాంద్రత అను. ఎడ్డింగ్‌టన్ చెప్పినట్లు అంతా మనః పదార్థమే అను. ఎలా అన్నా సరే ఏ విధంగా చూచినా సరే. అది తఱుగు లేనిది. వినాశం లేనిది. స్థితి స్థాపకశక్తి కలది. అంతటా నిండి దట్టంగా ఒరుసుకొని ఉన్న శక్తి అది. పిక్కట బిర్రై నిండి ఉన్న ఉనికి అది ఎలాంటి మార్పువచ్చినా తాత్కాలికంగా వికార రూపియై, దేశ కాలాలలో కొంతదూరం సాగిపోయినా తిరిగి మూలాధార స్థిత వస్తువులోకి చేరుకునే స్వభావం కలది కాబట్టి.

అవ్యయమ్: అది అవ్యయమైనది. చేద్దామనుకున్నా ఇది ఖర్చయ్యేది కాదు. ఒక దీపంతో ఇంకో వెయ్యి దీపాలు వెలిగించినా, మొదటి దీపానికి ఏ కాంతి తఱిగి పోనట్లు.

అవినాశి అయిన ఆ ఉనికి అంతటా నిండి ఉంది. అకాశంలాగా – ఆధారంలాగా–అమ్మంటే ఆధారం, నాన్నంటే ఆకాశం – ఆకాశానికి ఆధారమేమిటి? ఆధారం లేకపోతే ఆకాశం ఎక్కడకు పోతుంది? ఆకాశం ఆకాశంలోనే ముడుచుకొని ఉంటుందా? ఆధారానికి ఆధారం ఉంటుందా? తనకు తనేనా అది? అదే కాబోలు

యేన సర్వమిదం తతమ్ అనుకున్నాను. అంతటా నిండి ఉన్నది ఆకాశమా? ఆధారమా? రెంటికీ భేదం ఉందా? భేదం చెప్పడానికైనా ఆస్కారం ఉందా?

అంతటా నిండి ఉన్న దానిలో నుండి కొంచెమైనా తీసి వేతే ఉంచుదామన్నా, ఆ తీసినదాన్ని ఉంచడానికి అయినా ఖాళీ జాగా దొరకొద్దూ! అన్ని చోట్లా ఖాళీలేకుండా నిండి ఉన్న దానికి ఎదుగూ లేదు, బొదుగు లేదు కాబట్టి తఱుగూ లేదు.

అవ్యయమైన దాన్ని ఖర్చుచేద్దామన్నా దేనికోసం ఎప్పుడు ఎక్కడ చేయ వచ్చును? నీటిలో మునిగి ఉన్నవాడు దోసెడు నీళ్ళు తీసి నీరులేని చోట తాను బయటికి రాకుండా వారబోయడానికి యత్నించినట్లు, మహా ఝంఝూ మారుతంలో కొట్టుకుపోయే గడ్డి పరక తోకతో కాస్త గాలి పిసరును ఇవతలనుంచి అవతలకు నెట్టబోయినట్లు, ఎవడైనా ఒక తులం పరమాత్మ పదార్థాన్ని పుటంబెట్టి నాశనం చేద్దామనుకోవచ్చు గాక. అది స్వభావతః అవ్యయమైనది కాబట్టి దానికి నాశనం రావడం కల్ల.

భీష్మాదుల ఉనికి కూడా అవ్యయమైన పరమాత్మ చైతన్యం ఉనికిలోనిదే. దానిని అర్జునుడు అనే ఒక వ్యక్తి నాశనం చేయగలననుకోవడం అవివేకం. 'పరిణామమే కాని వినాశం లేదు' అన్నది అమ్మ.

పరమాత్మ పదార్థాన్ని నాశనం చేద్దామని హిరణ్యకశ్యప, హిరణ్యాక్ష, రావణ, కుంభకర్ణ, శిశుపాల దంతవక్త్రాది మహాదైత్యులు ఎందఱో తలక్రిందులుగా తపస్సు చేసి తలపడి ధరణిని దడదడ లాడించారు. కాని వారందఱూ ఆ ప్రయత్నంలో తామే భగ్గుమన్నారు. ఇంకా నాశనం చేసే ప్రయత్నం ఎక్కడిది? పరమాత్మ శక్తి అంటే నాశనం కాకపోతేగా? విధ్వంసం కూడా పరమాత్మ శక్తియే అంతా నేనేనని ఢంకా బజాయించి చెప్పుకున్న పరమాత్మ రావణాదులు మాత్రం ఎందుకు కాదూ?

ఎందుకు కాదూ? అన్నీ పరమాత్మనోరే? పరమాత్మ అనే సాలె పురుగుకి రెండు నోళ్ళు లేవు. ఆ నోరే క్రక్కుతుంది. ఆ నోరే మ్రింగుతుంది.

ఐన్‌స్టెన్ పండితుడు విశ్వం తూరలా Cylindricalగా ఉంటుందన్నాడు. ఒక వైపు నుండి ప్రవేశం ఇంకో వైపునుండి నిష్క్రమణం పరమాత్మ చైతన్య ధనంలో ఖర్చయ్యే భాగం నయాపైసా వంతైనా లేదు కదా! అలా అయితే మనం రోజూ చూచే చావులూ, వఱదలూ, భూకంపాలూ, తుఫానులూ, విధ్వంసకాండా, ఇవన్నీ ఏమిటని అనుకోవచ్చు ఎవరేనా? అనంతమైన పరమాత్మకూ ఈ దేహాంతాలకూ ఏమీ సంబంధం లేదా అంటే ఈ రూపాల రాకపోకలవల్ల పరమాత్మ చైతన్యం ఏమీ తఱుగదు. ఆ విపరీతాలే పరమాత్మ కనుక.

"అందరికీ అర్థమై ఆనందించడం కోసం రూపం, రూపం ఉన్నందువలన శక్తి పెరిగేదీ లేదు, తరిగేదీ లేదు" అమ్మ.

18. అంతవంత ఇమే దేహాః నిత్యస్యోక్తాః శరీరిణః।
అనాశినోఽప్రమేయస్య తస్మా ద్యుధ్యస్వ భారత!॥

తా: అర్జునా! ఈ దేహాలు అంతవంతాలై ఉన్నాయి. ఆ శరీరివే అయినా వీటి సత్తా (అయిన పరమాత్మ చైతన్యం) నిత్యమూ అవినాశి, అప్రమేయమూ అని చెప్పబడుతుంది. కాబట్టి లేచి యుద్ధం చెయ్యి.

వ్యా: దహ్యతి ఇతి దేహః శీర్యతి ఇతి శరీరః దహింపబడేది దేహం. చివికి పోయేది శరీరం. ప్రాణాపానోదాన వ్యానసన వాయువుల చేతా, జఠరాగ్నిచేతా, బ్రతికి ఉన్నంతదాకా అంతరగ్నులచేతా చచ్చిన తరువాత బహిరగ్నిచేత దహింప బడేది దేహం.అది చివికిపోయి నశ్వరమైన శరీరం. దహించుకునే స్వభావం కావా లనుకునే పరమాత్మ దేహమయ్యాడు. పరమాత్మ చైతన్యరహితంగా దేహం రూపొం దదు.

అంతాన్ని చెందే స్వభావం కలవి దేహాలు. వీటికి మృత్యువు తప్పదు. శరీరాలను రక్షించేవాడు భక్షించేవాడూ పరమాత్మయే. ఆ పరమాత్మ మృత్యువు లాగా నిత్యుడే. కొలతలన్నీ దేహానికే నీవల్లనే కాకపోయినా దేహాలు నిలిచి ఉండేవికావు. కాబట్టి వృథా శంకలు మానివేసి నీ ధర్మాన్ని నిర్వహించు యుద్ధం చెయ్యి.

అశేష సృష్టిరూపం దాల్చినది నిత్యుడైన పరమాత్మ. నదులన్నీ సముద్రంలోకే ప్రవహించినా సముద్రం పెరగదు తరగదు. సముద్రమంతా ఒక్కటే అలగా ఎన్నడూ కాదు. ప్రపంచరూపాలన్నీ సముద్రంలో అలల్లాగా పరమాత్మలో లీనమయ్యేవే. అహంకారాన్ని వదలి నీ పని నీవు చెయ్యి.

19. య ఏనం వేత్తి హన్తారం యశ్చైనం మన్యతే హతం।
ఉభౌతౌ న విజానీతో నాయం హన్తి న హన్యతే॥

తా: ఈ ఉనికిని ఒకడు చంపుతున్నాననుకుంటాడు. ఒకడు చంపబడేదాన్నిగా ఉనికిని తలుస్తాడు. వాళ్లిద్దరూ అజ్ఞానులే. ఆత్మ చచ్చేదీ కాదు చంపబడేదీ కాదు.

వ్యా: ప్రాణం ప్రాణమే కనుక దానికి చావులేదు. కాంతికి అంధకారం లేనట్లు. పరమాత్మయే సృష్టి అయి ఉన్న సందర్భంలో దానికి నాశనం కలగడం ఎలా జరుగు తుంది?

సృష్టిలో జరిగే మార్పులను, పరిణామాలను సంహారాలుగా అర్థం చేసుకో కూడదు. దీపం వెలుతురులో నశించే జీవరాశి చావులకు దీపం వెలిగించిన వాని తలకు చుట్టుకుంటాయా? చుట్టుకోవు.

చావు కూడా బ్రతుకులాగా తప్పించుకోరాని దైవికమే. దీపం వెలిగించినవాడు తను చేసిన పని వలన పురుగులు చచ్చాయనుకుంటే అదీ తప్పే! తనే హంతకుడననుకున్నా అదీ తప్పే. వాడు చంపనూ లేదు. వాని వలన అవి చావనూ లేదు!

20. న జాయతే మ్రియతే వా కదాచి
న్నాయం భూత్వా భవితా వా న భూయః।
అజో నిత్య శ్శాశ్వతోఽ యం పురాణో
న హన్యతే హన్యమానే శరీరే॥

తా: ఈ ఆత్మచైతన్యం ఎన్నడూ పుట్టేదీకాదు. గిట్టేదీకాదు. ఒకప్పుడుండి మళ్ళీ ఉండకపోయేదీకాదు.

అతడు అజుడూ, నిత్యుడూ, శాశ్వతుడూ పురాణుడూ కాబట్టి చచ్చిపోయే శరీరంలో ఉండి కూడా చావకుండా ఉంటాడు.

వ్యా: ఎల్లప్పుడూ ఉండేది కాబట్టే దీనికి ఉనికి అని పేరు. ఎప్పుడూ ఉండే దానికి పుట్టడం చావడం ఏమిటి? పుట్టుకలేని వానికి చావేమిటి? నిత్యంగా శాశ్వతంగా పురాతనంగా ఉన్నా నిత్య నవీనంగా ఉండే స్థితికి మారడం పాతబడడం రాలిపోవడం ఇలాంటి బాధలుండవు.

21. వేదావినాశినం నిత్యం య ఏన మజ మవ్యయమ్।
కథం స పురుషః పార్థ! కం ఘాతయతి హంతి కమ్॥

తా: అర్జునా! నాశనం లేనట్టిన్నీ, నిత్యంగా ఉండునట్టిన్నీ, పుట్టుక లేనట్టిన్నీ, తఱుగులేనట్టిన్నీ, ఆత్మనుగా ఎవడు సర్వాన్ని తెలుసుకుంటాడో ఆ పురుషుడు ఎవనిని చంపించగలడు ఎవనిని చంపగలడు?

వ్యా: బిడ్డగా తల్లియే ప్రత్యక్షమౌతూ ఉండే, తల్లి ఉండగానే బిడ్డలు కూడా ఉంటూ ఉంటే, రూపం నుండి రూపం రావడమే నిత్యత్వంగా భాసిస్తూ ఉంటే, మార్పే అసలు పదార్థానికి వచ్చిందనుకోవాలి గాని అనుకోడానికయినా ఎవడు ఎవడిని చంపించగలడు లేక చంపగలడు.

అవ్యయం అంటే అర్థం ఏమిటో క్రిందటి శ్లోకంలో విపులంగా వ్రాశాను. పారమార్థిక దృష్ట్యా, పరమాత్మ చెప్పుతున్న మాటలకు వ్యావహారికార్థములను కల్పించుకోవడంలోనే వ్యాఖ్యానాభిప్రాయాలలో తికమకలూ, శ్రోతల అభిప్రాయాలలో సందేహాలూ వస్తున్నాయి. కానీ – వ్యావహారిక దృష్ట్యా ఈ శరీరాన్ని నరికివేస్తే

ఈ జన్మ అంతరించిందని అర్థంగా గ్రహిస్తాము. కాని పరమార్థంతో విచారణచేస్తే, దేహానికి కూడా మర్త్యత్వం లేదు. ఈ విషయాన్నే ప్రవచిస్తూ శంకర భగవత్పాదులు ప్రబోధసుధాకరంలో ఇలా వ్రాశారు.

పరమార్థతో విచారే గుడ తన్మధురత్వ దృష్టాన్తాత్।
నశ్వర మపి నర దేహం పరమాత్మా కారతాం యాతి॥

బెల్లం కంటె మాధుర్య గుణం వేఱుకానట్లే పరమార్థతత్త్వేన విచారణ చేస్తే నరదేహం నశ్వరమైనప్పటికీ పరమాత్మరూపమే అవుతుంది.

కిం పున రనన్త శక్తేః లీలావపు రీశ్వర స్యేహ
కర్మాణ్య లౌకికాని స్వమాయయా విదధతో నృహరేః॥

పైన చెప్పిన ప్రకారంగా సాధారణ మానవదేహమే పరమాత్మరూపమౌతూ ఉంటే అనన్త శక్తిసంపన్నుడై తన మాయతో అనన్త అలౌకిక అద్భుత కృత్యాలను చేసిన పరమాత్మ లీలాకృత శరీరం పరమాత్మ కావడంలో ఆశ్చర్యం ఏముంది? అంతేకాక బ్రహ్మాండంలోని శరీరాలన్నీ పరమాత్మయే అనే మాటను కూడా కృష్ణపరమాత్మ వత్సాపహరణ సమయంలో ఋజువుచేసి ఉన్నారు.

బ్రహ్మాణ్డాని బహూని పంకజ భవా ప్రత్యంద మ త్యద్భుతాన్
గోపా వత్సయుతాన్ దర్శయ దజం విష్ణూ నశేషాంశ్చ యః
శంభు ర్య చ్చరణోదకం స్వశిరసే ధత్తే చ మూర్తిత్రయాత్
కృష్ణో వై పృథగస్తి కోఽ ప్యవికృతః సచ్చిన్మయో నీలిమా.

అజుడు గోవులను గోపాలకులను హరించికొనిపోయిపోయినప్పుడు తానే ఆ శరీరాలన్నింటిని ధరించి, అత్యద్భుతాలయిన బ్రహ్మాండాలను, ఒక్కొక్క దానిలో అనంతబ్రహ్మలను, విష్ణువులను, గోపకులను, వారితోపాటు ఆవులను దూడలను కృష్ణపరమాత్మ బ్రహ్మకు ప్రదర్శించాడు. శివుడు ఆ దేవ దేవుని పాదోదకాన్ని భక్తితో శిరస్సున ధరిస్తాడు. కాబట్టి కృష్ణుడు అంటే మూర్తిత్రయాతీతమైన, అనిర్వచనీయ మైన, అవ్యాకృతమైన, సచ్చైతన్యరూపమైన నీలవర్ణమే. అని భావం.

ఈ అనంతరూపత్వంలో ఒక రూపం వచ్చి 'కం ఘాతయతి హన్తి కం'?

ఈ జగత్తు బ్రహ్మంకంటె వేఱుకాదు. అందులో ఉండే వివిధమైన భూతాలూ జగత్తుకంటె వేఱుకాదు. అగ్ని నుంచి లేచిన రవ్వలు అగ్ని కంటే వేఱుకావు.

"యథాగ్నేః క్షుద్రా విస్ఫులిఙ్గా వ్యుచ్చర స్త్యేవ।
మేవా స్మాదాత్మనః సర్వే ప్రాణాః సర్వేలోకాః సర్వే॥
దేవాః సర్వాణి భూతాని వ్యుచ్చరన్తి" (బృ 2:1:10)

అగ్ని నుంచి వివిధములైన రవ్వలు పైకి వచ్చేరీతిగా ఈ ఆత్మ నుంచి వాగాది ప్రాణాలూ, భూరాదిలోకాలూ, అగ్న్యాది దేవతలూ, బ్రహ్మాదిస్తంబ పర్యంతం అన్ని ప్రాణిజాతాలు లేచి బయటబడుతున్నాయి. అంతేకాక

ఓతప్రోతశ్చ తంతు ష్విహ వితతపటు శ్చిత్ర వర్ణేషు చిత్ర
స్తస్మిన్ జిజ్ఞాస్యమానే ననుభవతి పటః సూత్రమా త్రావశేషః
తద్వ ద్విశ్వం విచిత్రం ఖగ నగ నగరగ్రామ పశ్వాదిరూపం
ప్రోతం వైరాజరూపే సవియతి తదపి బ్రహ్మణి ప్రోత మోతమ్.

అన్నారు శంకరులు.

చిత్రవర్ణాలు కల వస్త్రం చిత్రచిత్రవర్ణాలు కల దారాలలో పడుగు పేకల రూపంగా ఉంటుంది. కాని పరిశీలించి చూస్తే తంతువులు వేఱూ వస్త్రం వేఱూ కావు. సూత్రాలకంటే అగుపడకుండా దారాలలో ఉన్న రేసులూ, ఆ పత్తిరేసులలో ఉండే కలయికా, వాటినేతా, వీటి అన్నిటికంటే వేఱుకాదు వస్త్రం. చివరకు వస్త్రం అంటే సూత్రమాత్రావశేషం, వాటినేతా అవుతుంది. అలాగే పర్వత, నగర మనుష్య పశ్వాది రూపాలతో ఉన్న ఈ విశ్వం, విరాట్టులోనూ, విరాట్టు ఆకాశంలోనూ, అది బ్రహ్మలోనూ ఓతప్రోతములుగా ఉన్నాయి. పరిశీలించిచూస్తే బ్రహ్మవేఱూ జగత్తు వేఱూకాదు. సర్వం బ్రహ్మమయం.

"యస్మి న్నిదగ్ం సంచలిచైతిసర్వం స ఓతః
ప్రోతశ్చ విభుః ప్రజాసు" (తై 4:12)

"ఏ తస్మిన్ను ఖ ల్వక్షరే గా ర్గ్యాకాశ ఓతశ్చ ప్రోతశ్చ (బృ 3:8:11)

పరమాత్మ చైతన్యం అనే వస్త్రం ఒకటి ఉంది. దాన్ని ఈ భూతాలు కప్పుకుంటూ తీసేసుకుంటునట్లు కనిపిస్తున్నది. ఈ క్రొత్త పాతల మార్పిడికర్థం ఏమిటి?

22. వాసాంసి జీర్ణాని యథా విహాయ
నవాని గృహ్ణాతి నరోఽ పరాణి
తథా శరీరాణి విహాయ జీర్ణా
న్యన్యాని సంయాతి నవాని దేహీ॥

తా: చిరిగి జీర్ణమైన గుడ్డలను విడిచిపెట్టి క్రొత్త వాటిని మనుష్యుడేవిధంగా ధరిస్తాడో శరీరం జీర్ణమైపోతే దాన్ని కూడా వదిలేసి వేఱొక మంచిదాన్ని నరుడు ధరిస్తాడు.

వ్యా: అంతవంతమైన దేహాలను ధరించిన పరమాత్మ చైతన్యం కొన్ని విశేషాలను తప్పని సరిగా ఎదుర్కొవలసివస్తుంది, ఆ విశేషాలలో ముఖ్యమైనది శరీర త్యాగం. కాలం తేడాయే కాని పాత చొక్కాతీసేసి క్రొత్త చొక్కా తొడుక్కోడం వంటిదే అన్నారు పరమాత్మ. క్రొత్త చొక్కాను శరీరపరంగా అర్థం చేసుకుంటే - మొదట్లో శుక్ల శోణితాలు కలిసిన ప్రాణప్రకృతి ఏదో చొంగలాంటి ఆవరణం ఏర్పడుతుంది. దాని తరువాత అతి సన్నని ప్లాస్టిక్ పొరలాంటి ఆవరణం ఏర్పడుతుంది. క్రమక్రమంగా ముఖ్మల్లు కంటె మెత్తని ఒక గర్భాశయపు గూడు ఏర్పడుతుంది. ఈ స్థితిలో లోపలి బీజప్రకృతికి సబ్బు నురుగు బుడగపై పొరలాంటి ఒక వస్త్రం. దానిపైన వాయు కర్పరం, వాయుకర్పరంపైన ఉష్ణతామయమైన మఱొక కప్పు, దానిపైన నీటిమయమైన మఱో అంబరం, దానిపైన మావి అనే పార్థివ ప్రకృతితో కూడిన మఱో సంచి, ఇలాగా పంచభూతాలూ వాటి తాలూకు వస్త్రాచ్ఛాదనాలూ అయిదుంటాయి.

లోపల ఉండే జీవి అంటే పిండం యొక్క చర్మవసనమూ, రక్తవసనమూ, అస్థివసనమూ అగ్నివసనమూ, ఆకాశవసనమూ, నిత్యనూతనంగా అభివృద్ధి చెందుతూందగా, ఆ గ్రుడ్డుకు పైన ఉన్న పంచభూతాత్మికమైన, మావి లోపలి రసమూ అందులోని ఆచ్ఛాదన ధర్మమూ, అంతా జీర్ణావస్థను చేరుకుంటాయి. పక్వదశను చేరుకుంటాయి, అలా పరిపక్వ దశకు చేరుకునే సరికి పై మావి వస్త్రాన్ని విడిచిపెట్టి, చర్మాధికమైన పాంచ భౌతిక వస్త్రాన్ని ధరించి పరమాత్మ బయటపడడానికి తరుణం ఆసన్నమౌతుంది. శిశూదయం అవుతుంది. శిశుదేహాన్ని పంచభూతాత్మికమైన మహా వస్త్రం ఆచ్ఛాదిస్తుంది.

శక్తి యొక్క ఆకారమే పదార్థం. పదార్థం యొక్క ఆకారమే శరీరం. శక్తిలేనిదే శరీరం కూడా ఉండజాలదు. ఉండదు. అది వఱకు శరీరాకారంగా ఉన్నదే తరువాత పాము కూసమైంది. కూసం క్రమంగా మట్టి అయింది. ఆ మట్టిని తిని మళ్ళీ పాము శరీరాన్ని పెంచుకుంది.

మట్టి కుదురైంది. కుదుట్లో గింజ మొక్కైంది. మొక్క మళ్ళీ గింజైంది. పూర్వానిది పరానికి దేహం. గింజ నుండి చెట్టు. చెట్టు నుండి గింజవలె దేహం. మట్టిగా ఐ, మట్టి తిరిగి ఆకారోత్పత్తికి వినియోగపడుతున్నది. క్రొత్త ఆకారానికి మట్టి ఆకాశం నుండి ఊడిపడడం లేదు. అలల రూపాలు నీళ్లలో కలిసి అవే క్రొత్త అలలుగా అవుతున్నట్లే

పాత దేహాలు మహా మృత్తికలో కలిసి మళ్లీ శరీరాలవుతున్నాయి. దేహంలోని చైతన్యము మహాచైతన్యములో కలుస్తున్నది. చైతన్యానికి మృత్తికకూ భేదం లేదని చెప్పాం. దేహం పుట్టడం అంటే చైతన్యంతో సహా పుట్టడమే. ఈ మార్పులు వరసగా అంతటా జరగడానికి సర్వత్రా చైతన్యమే, కారణం అవుతున్నా, లోకవ్యవహారంలో మాత్రం ప్రతి దేహానికి ఒక్కొక్క ఆత్మ కేటాయించబడి ఉన్నట్లూ అది తను చేసుకున్న కర్మాలను బట్టి ఏర్పడినట్లూ, లౌకిక సుఖదుఃఖ భోగ నిమిత్తం అనేక జన్మాలను దండగా ఎత్తుతుందని వ్యాఖ్యానాలు వ్రాస్తారు పండితులు.

చెట్టు రూపంగా గింజ ప్రత్యక్షమౌతున్నట్లే బిడ్డల రూపంలో తండ్రి తాతల శరీరాలు ప్రత్యక్షమవుతున్నాయనడం సమంజసం. ఆత్మావై పుత్రనామాసి అని శ్రుతి.

ఇంతకూ పాత చొక్కాలను తీసేసి క్రొత్త వాటిని ధరిస్తున్నది ఎవరు? సర్వానికీ సర్వం కారణం ప్రతి అలకూ మహాసముద్రమే కారణమవుతున్నది. సముద్రం లేక పోతే అలకూడా లేదు.

23. నైనం ఛిందంతి శస్త్రాణి నైనం దహతి పావకః
న చైవం క్లేదయ న్త్యాపో న శోషయతి మారుతః॥

తా: ఈ ఉనికిని పార్థివ సంబంధములైన ఆయుధాలు ఖండింపలేవు. అగ్ని దీనిని తగులబెట్టలేదు. నీరు దీనిని తడుపలేదు. గాలి దీనిని ఆర్పలేదు.

వ్యా: పృథివ్యాపస్తే జోవాయురాకాశాల్లో చివరి ఆకాశం తప్ప తక్కిన నాలుగు భూతాలూ ఇక్కడ చెప్పబడ్డాయి. అవకాశం ఉంటేనే క్రియారంగం ఏర్పడుతుంది. శక్తి ఉంటేనే భూతాలు పనిచేస్తాయి. పరమాత్మ చైతన్యం తోడ్పడకుంటే భూతాలు పని చేయవు.

దేవాసుర యుద్ధంలో విజయాన్ని తామే సాధించామని దేవతలు అహం భావాన్ని పొందారు. ఆ అహంకారాన్ని తెలుసుకొని పరబ్రహ్మ ఒక యక్షరూపంగా ప్రత్యక్షమయ్యాడు. దాన్ని తెలుసుకోలేక దేవతలందరూ తికమకపడ్డారు. దాన్ని తెలుసుకోడానికి, జాతవేదుణ్ణి వాయువును పంపిస్తారు. ఆయక్షం ఒక గడ్డిపరకను ముందుపడేసి దాన్ని దహించమనీ కదిలించమనీ అగ్ని వాయువులకు చెబుతుంది. వారా పనులను చేయలేకపోతారు. ఇంద్రుడా యక్షమును సమీపించేసరికి అది అదృశ్యమైపోతుంది. అప్పుడు ఇంద్రునికి ఆకాశంలో మహాకాంతితో కూడినదీ, ఉమ అనే పేరుగలదీ, హిమవంతుని పుత్రిక అయిన స్త్రీరూపధారిణి అయిన ఒక దేవి కనిపించగా ఆమె దగ్గఱకుపోయి ఇంద్రుడా యక్షస్వరూపమేమిటని అడుగుతాడు.

ఆ రాజరాజేశ్వరి. అది బ్రహ్మము. ఆ బ్రహ్మమువలననే మీకు మహిమలు వచ్చాయని చెబుతుంది. తరువాత వచ్చే మంత్రం ఇలా ఉంటుంది.

తస్యైష ఆదేశో యదేతద్విద్యుతోఽ వ్యద్యు తదా ఇతీతి న్యమీ మిషదా ఇత్యధిదైవమ్.

బ్రహ్మానికి ఇది ఆదేశం లేక గుర్తు. అది మెఱుపుతీగలా కంటి ఱెప్పపాటులా ఉంటుంది.

ఇది అధిదైవతమైన ఉపదేశం. అంటే మెఱుములేనిది మెఱవడంలేదు. మెఱవడం లేని మెఱుపు తీగా లేదు. ఈ రెంటికీ పరస్పర భేదం లేదు. బ్రహ్మమూ, శక్తీ, రూపమూ అంతా ఒకటే. అలాగే కంటి ఱెప్పపాటు కూడా అని తాత్పర్యం బ్రహ్మ చైతన్యంగా ఉండేది తనే కార్యరూపంగా అయ్యేదీ తనే. అగ్న్యాదులు వేఱుగావు. వాటి క్రియలూ వేఱుకావు.

24. అచ్ఛేద్యోఽ యమదాహ్యో యమక్లేద్యో శోష్య ఏవ చ।
నిత్య స్సర్వ గతః స్థాణురచలోఽ యం సనాతనః॥

తా: ఈ ఉనికి ఖండింపరానిదిన్ని, దహింపరానిదిన్ని, తడుపరానిదిన్ని, ఎండింప రానిదిన్ని, మఱియు నిత్యమైనదిన్ని, సర్వత్రవ్యాపించి ఉన్నదిన్ని, అణు రూపంగా ఉన్నదిన్ని అచలమైనదిన్ని అయిఉన్నది.

వ్యా: పైశ్లోకంలో చెప్పిన అంగాలే ఇందులోను పునరుక్తమయినట్లు కనిపిస్తాయి కాని రెంటికీ భేదం ఉంది. పైశ్లోకంలో అర్జునునికి పరిచయమైన శస్త్రాదులను గూర్చి చెప్పబడగా ఈ శ్లోకంతో వాటి ధర్మాలను గూర్చి వర్ణితమైనది.

25. అవ్యక్తోఽ యమచింత్యోఽ యమవికార్యోఽ యముచ్యతే।
తస్మా దేవం విదిత్వైనం నాను శోచితు మర్హసి॥

తా: ఈ ఉనికి అవ్యక్తమూ, అచింత్యమూ అవికార్యమూ, అని చెప్పబడుతుంది. అందువలన దీని నిలుకడను తెలుసుకున్న తరువాత కూడా విచారించుట తగదు.

వ్యా: అవ్యక్తము – 'అంతా అయిన వాడు అర్థంకాని వాడు'

అచింత్యం: మరుగే నా విధానం

అవికార్యం: ఏం చేసినా మారనిదీ, చెదరనిదీ, ఎక్కడుంటే అదీ.

ఇదం సర్వం యదయమాత్మా బృ – కనిపించేదంతా ఆత్మయే.

26. అథ చైనం నిత్య జాతం నిత్యం వా మన్యసే మృతమ్ ।
తథాపి త్వం మహాబాహో! నైవం శోచితు మర్హసి.

తా: ఆత్మ కూడా శరీరంతో పుట్టి శరీరంతో నశించేదాన్నిగా నీవు తలపోసినా అప్పుడు కూడా శోకించడానికి కారణం లేదు. మహాబాహూ! నిత్యం చచ్చేవాడికోసం ఎవడేడుస్తూ కూచుంటాడు.

27. జాతస్య హి ధ్రువో మృత్యుః ధ్రువం జన్మ మృతస్య చ।
తస్మా దపరిహార్యేஉ ర్థే నత్వం శోచితు మర్హసి॥

తా: నాస్తికులనే విధంగా పుట్టిన ప్రతిజీవి చచ్చి తీరాల్సిందే చచ్చిన ప్రతిజీవి మళ్లీ పుట్టాల్సిందే. జనన మరణాలు ఈ విధంగా అపరిహార్యములు అంటే తప్పించు కోరానివి అని తలచినా తప్పించుకోరాని దానికై నీవు శోకించడం తగదు.

వ్యా: నాస్తికులు దేహాత్మవాదులు. వారికి గురువు చార్వాకుడు. ప్రత్యక్షాన్ని తప్ప నమ్మరు. విరోచన లోకాయతమతాలూ అలాంటివే.

'దేహస్థౌల్య యోగాచ్చ స ఏవాత్మా న చాపరః' అంటారు వారు. దేహంతో ఆత్మ పుడుతుంది. దేహంతోనే నశిస్తుంది అంటారు వారు. మాట వరసకు ఆ వాదాన్ని అంగీకరించినా నీ శోకానికి కారణం కనబడదు.

డాక్టర్లు ఎంత ఎంత ప్రయత్నించినా మరణం తప్పదు. పుట్టిన వాడికి ఎలా అంతం తప్పదో అంతమొందిన వానికి మళ్ళీ పుట్టడమూ తప్పదు. పురుడొస్తుందని ఏడవడమెందుకు? మరణమంటే పరిణామమేకదా!

28. అవ్యక్తాదీని భూతాని వ్యక్త మధ్యాని భారత!।
అవ్యక్త నిధనా న్యేవ తత్ర కా పరిదేవనా॥

తా: అవ్యక్తం అంటే కనపడకపోవడం. సదేహంగా తల్లి కన్పించినట్లు గర్భంలో ప్రవేశించక పూర్వం శిశువు ఎలా బయలుదేరాడో అది కనిపించదు. పుట్టిన తరువాత జరిగే చరిత్రను సినిమా తీయవచ్చు. చావు తప్పదు. ఎలా ఎక్కడికి వెళ్తాడో అదీ తెలి యదు. పక్షి కొమ్మను విడిచిపెట్టి ఆకాశంలో ఎగిరి మళ్లీ ఇంకో కొమ్మమీద వ్రాలడమే జీవితమంటే. ఈ స్వల్ప ప్రదర్శనం కోసం ఏడుస్తూ కూర్చోడమెందుకు?

వ్యా: రైలుపెట్టెలో కూర్చున్నంత సేపూ నవ్వుతారు పేలుతారు. వాడి స్టేషను రాగానే వాడు దిగిపోతాడు. దీనికి ఏడవడమెందుకూ?

29. ఆశ్చర్యవత్పశ్యతి కశ్చి దేన
మాశ్చర్యవ ద్వదతి తథైవ చాన్యః।
ఆశ్చర్యవచ్చైన మన్యశ్శృణోతి
శ్రుత్వాప్యేనం వేద న చైవ కశ్చిత్॥

28, 29 శ్లోకాలు చాలా అందమైన, ఎంత ఆలోచించినా ఆలోచనలను క్రొత్తగా రేకెత్తించే శ్లోకాలు రెంటినీ కలిపి వ్రాయడానికి మనస్సు ఉబలాటపడు తున్నది.

భూతాలు పుట్టక పూర్వం భూతాలుండే చోట ఏది ఉండేదో అది పరమాత్మ చైతన్యమే. భూతాలు మృత్యుదశ చెందిన తరువాత భూతాలుండే చోట ఏది ఉంటుందో అది కూడా పరమాత్మ చైతన్యమే. భూతాలు పుట్టిన దగ్గఱ నుండి చచ్చిపోయేదాకా ఉండే మధ్య దశలో భూతాలుగా ఉండేదీ పరమాత్మ చైతన్యమే.

"నజాయతే మ్రియతే వా కదాచిత్ నాయం భూత్వా
భవితా వా నభూయః" అని ఇది వఱకే చెప్పి ఉన్నారు.

ఒకప్పుడుండి ఇక ఉండకపోయేది కాదు. ఇప్పుడు లేకుండా రాబోయేది కాదు. ఎల్లప్పుడు ఇది ఉన్నదే ఎల్లప్పుడూ ఉండే దానికి విచారించడం తగదు. దైవం పంపిన మనిషి దైవం ఇష్టం ప్రకారం దైవంలోకి పోతే మధ్యలో మనకేడుపెందుకు? తేలు ఉంది. దాన్ని నేను చంపాను. అది ఎక్కడకు పోయింది? శక్తిశక్తిలోనే కలిసిపోయింది. శక్తిశక్తిలో కలవక ఎక్కడకుపోతుంది? టైరులోకి గాలి ఎక్కక పూర్వం అది ఎక్కడ ఉందీ? డైనమోలో ధ్రువాల వైషమ్యంగా విభజింపబడక పూర్వం ఎలక్ట్రిసిటీ ఎక్కడ ఉండేదీ? ఐస్‌బర్గ్‌గా రూపొందక పూర్వం అందులో నీళ్ళు ఎక్కడ ఉండేవి? మంచు గడ్డగా కాక పూర్వ మంచుగడ్డ ఎక్కడ ఉండేది? అంతాశక్తి రూపకంగానే ఉండేది కాని ఆ రూపంలో ఉన్న ఈ నిర్దిష్ట స్వభావం మనకర్థం కాదు.

అమ్మ జడ పదార్థం అంటూ లేదంటుంది. భౌతికంగా ఉండే ప్రకృతి విశేషాలకీ, జడ ప్రకృతి అని మనం కేటాయించిన భాగానికి, జడచేతనత్వాలు రెండూ ఖచితమై ఉన్నట్లే శాస్త్రజ్ఞులు గుర్తించారు. వెబుజాకర్ అనే శాస్త్రవేత్త ప్రాణ ప్రకృతులకు పరమాణు వ్యాపారాలకు క్వాంటం సంబంధాలున్నాయని ప్రవచించాడు.

He pointed out another instance in which he showed that there was no sharp line of duration between the living and the nonliving. A virus, for instance, has the properties of nonliving matter, such as, fixed molecular weight and crytallisability, on the one hand, and the properties of living matter, such as, assimilation, production, etc on the other.

A world view P95

కాబట్టి భూతాల వ్యక్తదశ ప్రాణసహితమైన దశ అని కాని, ప్రాణ రహిత మైనదని కాని, మస్తిష్క సహితమైన దశ అని కాని. మస్తిష్కరహితమైనదని కాని, జడ

చేతన దశ అని కాని, అది కాని దశ అని కాని నిరూపించడానికి వీలులేనిది. మనకు తెలిసిందేదో అది మధ్యదశ. అది కూడా హైసెన్‌బర్గు చెప్పిన సందిగ్ధ వాదానికీ, ష్రోడింజరు చెప్పిన సంభావ్య వాదానికీ లోబడిన వ్యక్త దశలే.

అవ్యక్తంగా ఒక Antimatter దశ కూడా ఉన్నదనే అంశాన్ని ఇప్పుడిప్పుడే శాస్త్రజ్ఞులు చర్చిస్తున్నారు. Antimatterలో నుంచి matter ఎలా అవుతుందో అది మళ్లీ Antimatter గా ఎలా కరిగిపోతుందో ఇదంతా ఒక అర్థం కాని రహస్యం. ఈ రహస్యం భూతం అనే మాటలోనే ఇమిడి ఉన్నది. భూతం అనే మాటకు అయినది అని అర్థం. ఏది ఇదిగా అయినది? ఎక్కడకు పోతుంది? అన్నింటికీ అదే సమాధానం.

అదే అవ్యక్తం – ఆదే, నిధనం అమ్మ

ఇదే వ్యక్తం – మధ్యం – అదే ఇది.

కాబట్టి పార్థా! ఆత్మతత్వం బహు గహన మైనది. దీన్ని ఒకొక్కడు ఆశ్చర్యవతుగా చూస్తాడు. ఇంకొకడు అలాగే ఆశ్చర్యవతుగా భాషిస్తాడు. మఱొకడు ఆశ్చర్యవతుగా వింటాడు. ఎంత విన్నా ఈ ఆత్మను గూర్చి కొంచెం గూడా ఎవడికీ తెలియదు.

పరమాత్మ దేహదీపాన్ని అంటే కంటిని, వాగ్దీపాన్ని అంటే నోటినీ, చెవిదీపాన్ని అంటే వినడాన్ని వెలిగించి చూపిస్తున్నారు. కన్నూ నోరూ బయటికి పాటిపోయేవి. చెవి ఒక్కటే లోపలికి వచ్చేది, అడ్డుంటే కన్నుకనపడదు. చెవికాబాధలేదు. ఇంట్లో కూర్చున్నా ఉఱుము వినిపిస్తుంది. మెఱుపు కనిపించదు ముసుగేసుకుంటే, నోటికీ చెవికీ ఉన్నంతగా కంటికీ చెవికీ మైత్రి ఏర్పడలేదు.

ఎట్లా చూచేవాళ్లకు అట్లాకనబడడం పరమాత్మ చైతన్య లక్షణం.

కన్ను తనకు తాను చూచుకోలేదు. దూరంగా ఉన్నదాన్ని చూచి అక్కడ పారేస్తుంది కంటిని. కంట్లో నుంచి శబ్దం రాదు, నోరు వినలేదు. వినే చెవి బయటి దాన్ని లోపలికి జేరవేస్తుంది. చె అంటే చెప్పడం వి అంటే వినడం. చెవికి చెప్పడం చేతగాదు గాని పలుసార్లు చెప్పించడం చేతౌతుంది. వినిపించకపోతే గట్టిగా నోరు అరుస్తుంది చెవిలో ఒక పసిబిడ్డ కూర్చుని ఉంటాడు. చెవి వంకరలను పరిశీలించి చూస్తే పసిబిడ్డ పుట్టబోయే బిడ్డలాగా ఉంటుంది. ఈ బిడ్డ దేహం మన్నయ్యే దాకా ఉంటాడు. దేహయంత్రంలోని పరమాశ్చర్యాలలో ఇది ఒకటి. శరీరంచేసే ప్రతి క్రియ ఈ ఆశ్చర్యకర శ్రోతృనిర్మాణంచేసే మౌన వ్యాఖ్యలలో అంతఃకరణ వాక్కొకటి. నయనేంద్రియ వ్యాపారంవల్ల సర్వసంసారానికి ఉద్భవ కారణమైన తేజస్తత్వాన్ని, వాగింద్రియ వ్యాపారం వలన ప్రాణాన్ని ప్రాణ తత్వాన్ని, శ్రవణేంద్రియ వ్యాపారం వలన ఆకాశ

తత్వాన్ని పరమాత్మ ఈ శ్లోకంలో బోధించారని గ్రహించేది. కనకనే అంతా అయిన వాడు అర్థం కానివాడు భగవంతుడు. 11వ శ్లోకం నుంచి పరమాత్మ రకరకాలుగా పర మాత్మకూ దేహానికీ ఉండే సంబంధాన్ని చెప్పిదాన్ని ఈ శ్లోకంలో ఆ విషయాన్ని నిర్ధారణ చేశారు.

ఇక రాగల శ్లోకాలలో స్వధర్మాన్ని గూర్చి కూడ పరమాత్మ చెప్పబోతారు.

30. దేహీ నిత్య మవధ్యో౽ యం దేహే సర్వస్యభారత!।
తస్మా త్సర్వాణి భూతాని న త్వం శోచితు మర్హసి॥

తా: నీ సకలత్వాన్ని ఆలోచించినా నీ విలా నీళ్ళుగారిపోవడం తగదు. తాను సకల భూతాల శరీర సర్వస్వంగా రూపొందియున్న అంటే నీలాగా ఉన్న పరమాత్మ చైతన్యం నిత్యమైనది అవధ్యమైనది, ఈ అన్ని దేహాలూ సమసిపోయినా అది సమసేదికాదు. ఈ పరిస్థితిని ఆలోచించి నీవు శోకింపదగదు.

అర్జునుడు స్వధర్మమైన యుద్ధాన్ని చేస్తుంటే దానికి అడ్డంవచ్చినవారు చస్తారు దాని వలన అర్జునుని తలకు పాపం చుట్టుకోదు.

స్వధర్మం అంటే ఏమిటి? శరీరం మాద్యం ఖలు ధర్మసాధనం. కాబట్టి బ్రతికి ఉన్నజీవి జీవయాత్ర చేయడం. తన హక్కులను కాపాడుకోవడం. ఆ ధర్మాన్ని అను సరించుకునే తక్కిన ధర్మాలు అన్నీ ఏర్పడతాయి. సంసారాన్ని చించుకొని అవతలకు పోయి అక్కడ ఉన్నదాన్ని దేన్నో సాధించుదామంటే అది సహజవిరుద్ధమైన పని. అది కార్యాలుగా ఉన్నట్లు కనిపించే దాని వికారాలే ఈ సృష్టి అని స్మృతులూ శ్రుతులూ ఘోషిస్తూనే ఉన్నాయి. ఆ మాటలనే భగవద్గీత పునరుద్ఘాటించడంలో విశేషమేమీ లేదు. భగవద్గీత ఆధ్యాత్మిక సత్వాన్ని నిత్యజీవితంలో రంగరించివేస్తుంది. మన పనులు మనం చేసుకుంటూనే భగవత్తత్వాన్ని ఎలా తెలుసుకోవచ్చునో భగవద్గీత ఆ మార్గాన్ని ప్రదర్శిస్తుంది. అలాంటి మార్గాన్నే అమ్మకూడా చాలా తేలికైన మాటలలో మనస్సుకు హత్తుకునేలా బోధిస్తుంది. తన జీవితంలో ఆ బోధలను చేసి చూపిస్తుంది. అందుకనే చెప్పే తీరు వేఱుగా ఉండవచ్చు గాని గీతలో ఇది వఱకు లేనిదీ నేను క్రొత్తగా చెప్పుతున్నదీ ఏమీ లేదంటుంది అమ్మ.

చంపదగనివాణ్ణి చంపడంకంటె చంపదగినవాణ్ణి చంపకపోవడం గొప్ప దోషం పాండవులు ఉండడానికి సూది మోపినంత జాగా కూడ లభించని హక్కుదారులు. వారు ఉండడానికి చోటుచూచుకోవద్దా? మొదటి నుంచి చివరదాకా అంతా వేదాంతమే కాని పాండవులకు జరిగిన అన్యాయాన్ని గూర్చి ఘాటుగా ఎక్కడా

చెప్పడం జరగలేదు గీతలో. అందుకనే కృష్ణపరమాత్మ అర్జునుణ్ణి ఆ రకంగా ప్రోత్స హించవలసి వచ్చింది.

అర్జునునికి జన్మతః క్షత్రియత్వం ఉన్నదనే మాటకంటే స్వభావతః అతడు క్షత్రియత్వం మూర్తీభవించిన వీరుడు అనడంలో ఎక్కువ సత్యం ఉంది. పుట్టుకవల్ల బ్రాహ్మణుడైనా ద్రోణుడు, కృపుడు, అశ్వత్థామ వీరందఱు స్వభావతః క్షత్రియులే. పుట్టుకవల్ల ధర్మరాజు క్షత్రియుడే. కాని అతనిలో సాత్విక స్వభావం ఎక్కువ ఉండి ఏదో రాజర్షులకోవకు చెందినవాడని అనిపిస్తుంది. చేయవలసివస్తే యుద్ధం చేయలేడని కాదు. అతని స్వభావం అతన్ని (ధర్మరాజును) యుద్ధం చేయడానికి పురి కొల్పదు. సహజంగా వచ్చిన ఈ స్వభావమే స్వధర్మం అంటే అందుకనే ధర్మరాజుకు కోపంవస్తే నీళ్ళలో అగ్ని పుట్టినట్టే అంటారు.

జీవిత యుద్ధాన్ని ధైర్యంగా ఢీకొనవలసిన క్షత్రియ స్వభావం నీలో ఉంది కనుక నీకు యుద్ధం తీరావచ్చి మీదపడినప్పుడు, నీళ్లు కారిపోయి కంపించుతూ ఉండడం తగదని, యుద్ధం చేయడం కంటె క్షత్రియుడికి శ్రేయస్కరమైన మరోధర్మం లేదని పరమాత్మ బోధిస్తున్నారు.

క్షతా త్కిల త్రాయత ఇత్యుదగ్రః
క్షత్రస్య శబ్దో భువనేషు రూఢః॥

ఉపద్రవాల నుంచి రక్షించే ధర్మంలో ప్రసిద్ధుడై ముందంజవేసేవాడు కనుక క్షత్రియుడు అనే మాటకు రూఢ్యర్థం. ఇప్పుడు క్షత్రియుల వలన తన వారందఱికీ హాని, ఉపద్రవము కలిగించే యుద్ధం వచ్చి శత్రువులు యెదుట మోహరించి ఉన్న ప్పుడు 'వేపథుశ్చ శరీరోమే' అంటూ కంపించుతూ అర్జునుడు కూర్చుండిపోయాడు. ఇది అతని స్వధర్మానికి విరుద్ధమైన సంగతి అన్నారు పరమాత్మ.

క్రియామయమైనది యుద్ధం. క్షత్రియుడు క్రియామయుడు. ధర్మయుద్ధంలో పాప పుణ్యాలు లేవు. మఱిక్షత్రియుడి స్వభావం యుద్ధం వచ్చినప్పుడు ఎలా ప్రకటిత మౌతుంది? అనుకుంటే హానీ ఉపద్రవమూ వచ్చినప్పుడు రక్షించడం ఎలా క్షత్రియ ధర్మమో అది రాకుండా జాగ్రత్తపడి ప్రజారక్షణ చేయడమూ కూడా అలాంటి ధర్మమే. మఱిఎప్పుడో ఒకప్పుడు తటస్థించే అవాంతరాల మీద స్వభావం ఆధారపడాలా? అంటే యాదృచ్ఛికంగా వచ్చే యుద్ధంలో కూడా లేని పాపాన్ని పైన వేసుకొని కూచోడం క్షాత్రధర్మం కానేకాదు. అన్నారు పరమాత్మ.

31. **స్వధర్మమపి చావేక్ష్య న వికంపితు మర్హసి।**
ధర్మ్యాద్ధి యుద్ధా చ్ఛ్రేయోఽ న్యత్ క్షత్రియస్య నవిద్యతే॥

తా: నీ స్వధర్మాన్ని ఆలోచించినా ఇలా కంపించి పోవడం తగదు. ఎందుకంటే ధర్మయుక్తమైన యుద్ధం చేయడంకంటె క్షత్రియుడికి కళ్యాణదాయకమైన కర్తవ్యం ఇంకోటి ఎక్కడా చెప్పబడి ఉండలేదు.

32. **యదృచ్ఛయా చోపపన్నం స్వర్గద్వార మపావృతమ్।**
సుఖినః క్షత్రియాః పార్థ! లభంతే యుద్ధ మీదృశమ్॥

తా: పార్థా! అనుకోకుండా స్వర్గానికి తలుపులు తెఱిచిఉన్న యుద్ధం నీకు ప్రాప్తించింది. ఈ దృశమైన యుద్ధం లభించిన క్షత్రియులు సుఖవంతులు అదృష్ట వంతులు.

వ్యా: రాజ్యార్హతగల పాండవులు అరణ్యవాసం చెయ్యాలనిగాని, అజ్ఞాతవాసం చెయ్యాలనిగాని అనుకోలేదు. భగవద్దత్తమైన కష్టసమయం వాళ్ళు అనుభవించారు. అయిదూళ్ళు ఇచ్చినా చాలన్న ధర్మరాజు కోరికకు కూడా పరమాత్మ ప్రేరణతో దారి దొరకలేదు. పరమాత్మ ప్రేరితమైన యుద్ధం దానంతట అదే ఆసన్నమైంది. అందులో పాల్గొన్న అందఱికీ సుగతే అన్నట్లు స్వర్గద్వారం తెఱుచుకుంది. యుద్ధసన్నద్ధులై ఇరుపక్షాల వారూ తలుపుతెక్కల్లాగా తెఱుచుకున్నారు. అందులో కాలు పెట్టడానికి సంశయించాడు అర్జునుడు.

యుద్ధం, మారణబీభత్సం లోకదృష్టిలో క్లేశదాయకాలయినప్పటికీ పరమాత్మ దృష్టిలో జననమరణాలకు ఏవిధమైన భేదంలేదు. యుద్ధం లభించడం, మారణ హోమం జ్వలించడం క్షత్రియుడికి సౌఖ్యజనకమైన వృత్తాంతం కావాలి. అప్పుడే అతని క్షత్రియత్వమెలాంటిదో తెలుసుకోడానికి గీటురాయి దొరికినట్లు అవుతుంది. క్షతాత్త్రాయతే ఇతిక్షత్రియః" అని పూర్వ శ్లోకంలో చెప్పియున్నాము కదా! శత్రు సంహారంలోనే క్షత్రియునికి నిజమైన ఆనందం దొరుకుతుంది. ఆ శత్రువులు అన్ని సందర్భాలలోనూ మనుష్యులే అయి ఉండనక్కరలేదు కదా? అరిషడ్వర్గాలూ కావచ్చు. జీవితమనే యుద్ధంలో అరిషడ్వర్గాలతో పోరాడి జయించడంలోనే ప్రతి మనుష్యుడికి క్షాత్రమూ సౌఖ్యమూ ఉంది. అలా జయించిన వాడే సుఖి. అలా చేసిన సంగ్రామమే ధర్మమైన యుద్ధం. మఱి ఆ యుద్ధం చేయకపోతేనో!

33. **అథచే త్త్వమిమం ధర్మ్యం సంగ్రామం న కరిష్యసి।**
తతః స్వధర్మం కీర్తిం చ హిత్వా పాప మవాప్స్యసి॥

తా: నీవు ధర్మమైన ఈ యుద్ధాన్ని చేయకుండా తప్పుకొనిపోతే, అందువలన స్వధర్మానికి కీర్తికి నీళ్ళు వదులుకున్న వాడవై పాపాన్ని మూట కట్టుకుంటావు.

వ్యా: అగ్నికి కాల్చడం ధర్మం. సహనశీలమైన ప్రతాపాన్ని ప్రదర్శించడం క్షత్రియుడి ధర్మం ఈ ధర్మాన్ని, గుణం, స్వభావం. నైజం, పుణ్యం, మార్గం, గమనం, ప్రాణం, జ్ఞప్తి, శక్తి, చైతన్యం, కీర్తి, అని సందర్భాన్ని అనుసరించి దానికి తగిన ఏ మాటైనా వాడుకోవచ్చు. అధర్మమైన దానికి ఆయా మాటలకు వ్యతిరేకపదాలు కూడా ఉపయోగించుకోవచ్చు. భూతాలూ, తమ తమ ధర్మాలను కలిగిఉండడమూ ప్రదర్శిస్తూ ఉండడమే సృష్టి. వాటికా ధర్మాలు లేకపోవడం ప్రళయం, మారణం, మఱపు. మఱపే మరణం కదా! సర్వవ్యాప్తమై స్వతః స్ఫురితమైన శక్తి మెదడులో జ్ఞప్తిగాను, శరీరంలో శక్తిగాను, శరీర బాహ్యమైన సంసారంలో కర్మగాను వికసిస్తుంది. ఈ మూడు సరిగా లంకెపడి ఉన్నప్పుడే సంసారం యొక్క వ్యక్త స్వభావం కీర్తిత మౌతుంది. ఈ అంతటికీ ధర్మమని పేరు. క్షాత్రం విరాడ్రూపానికి బాహుసత్వం. 'బాహూరాజన్యఃకృతః' అని పురుషసూక్తం. యాదృచ్ఛిక సత్తాతోనే ఈ బాహువులు జీవితమనే యుద్ధం చేయాలి. అర్జునుడనే మాటకు అమలోదాత్త ధర్మకర్మములను చేసేవాడని అర్థం. అగ్నిదేవుడిచ్చిన విల్లు, గాండీవం; యుద్ధం తరువాత ఆ విల్లు రథంతో సహా మండిపోయేదాకా తన పనిని తాను చెయ్యడానికే అతని దగ్గఱకు వచ్చింది. అక్షయతూణీరాలూ తమ పని చేయడానికే అతన్ని ఆశ్రయించాయి. ఇదంతా పరమాత్మ సంకల్పంలోని భాగమే. ఇంకో విధంగా జరగడానికి వీలులేనిదయినా మాట వరసకు, అర్జునుడి లెవెలుకు దిగి పరమాత్మ నీవు యుద్ధం చేయకపోతే స్వధర్మానికి కీర్తికి దూరుడవౌతావని ఇక్కడ చెప్పారు. కాని 18వ అధ్యాయంలో అహంకారంతో నీవు యుద్ధం. చేయనని భీష్మించుకున్నా ఆ ప్రయత్నం సాగేది కాదు నీ క్షత్రియస్వభావమే నీచేత యుద్ధాన్ని చేయించి తీరుతుంది అని హిప్నాటిస్టు చెప్పినట్లుగా చెప్పారు పరమాత్మ.

భగవద్గీతలో పరమాత్మ పార్థుడికి చెప్పిన ధోరణి చూస్తే మాటిమాటికీ అమ్మబిడ్డలకు చెప్పే విధానం గుర్తుకొస్తుంది. పరమాత్మలాంటివాడు అర్జునుడి అంతస్థుకు దిగివచ్చి అతనికి అర్థమయ్యే మాటలతోనే ఎందుకు చెప్పవలసివచ్చిందయ్యా అంటే పరమాత్మ 'ఇష్టోసిమే' నీవు నాకు ఇష్టుడవు అంటాడు. అదిట కారణం. ఈ బిడ్డల ప్రేమంతా ఎందుకమ్మా నీకు. ఈ జంజాటం ఎందుకూ అంటే 'నాకోసమే' అంటుంది అమ్మ. అలా ఉండడమే పరమాత్మకు కీర్తి. లేకుంటే.

34. అకీర్తిం చాపి భూతాని కథయిష్యన్తి తేఽ వ్యయామ్।
సంభావితస్య చాకీర్తిః మరణా దతిరిచ్యతే॥

తా: లోకులు తరతరాలుగా నీ విషయమైన అపకీర్తిని తెంపులేకుండా చెప్పు కుంటారు. చావునైనా భరించవచ్చునుకాని గౌరవంగా బ్రతికినవాడికి అపకీర్తి దుర్భర మైనది.

వ్యా: శాశ్వతంగా కళ్లు తెఱుచుకుని ఉండే అపకీర్తి కంటె చావే మేలు.

35. భయా ద్రణా దుపరతం మన్యంతే త్వాం మహారథాః।
యేషాం చ త్వం బహుమతో భూత్వా యాస్యసి లాఘవమ్॥

తా: యుద్ధం చేయకుండా నీవు తిరిగిపోతే కురుపాండవ సేనలందలి మహా రథులందఱు నిన్ను చులకనగా చూస్తారు. ఇంతకంటె అవమానమే ముంటుంది.

వ్యా: ఇంతవఱకు ఘనంగా తలపబడుతున్న నీవు అందఱిలోనూ చులకనై పోతావు. భయపడి పాఱిపోయావని అనుకుంటారు.

శరీరాన్ని రథంగాను, ఆత్మను రథికుడుగాను ఉపనిషత్తులు వర్ణిస్తాయి. రెండూ సరిగా ఉన్నప్పుడే మహారథ శబ్దానికి సార్థక్యం. సూర్యుడుదయించడానికి ప్రకాశించ డానికి ఎలా భయపడడో మహారథికుని క్షత్రియాత్మ ఎన్నడూ భయవిహ్వాలం కాదని భావం. క్షత్రియరక్తం గల అర్జునుడి వైక్లబ్యాన్ని పొగొట్టడానికి ఎన్ని రకాలుగా పౌరుష ప్రోత్సాహకరమైన వచనాలు చెప్పడానికి వీలవుతుందో అన్నింటినీ చెప్పి చూస్తున్నారు పరమాత్మ. అభిమానధనుడైన అర్జునుడులాంటి లోకైక వీరునికి తన సామర్థ్యాన్ని ఇతరులు హేళనచేయడం చావుకంటె ఘోరమే అవుతుంది. సంగతి తెలిసిన పరమాత్మ అర్జునుని అభిమాన కీలకస్థానాన్నే లక్ష్యం చేసుకొని చెబుతున్నారు. అది ఏమిటి? ఇతరుల అవహేళన!

36. అవాచ్య వాదాంశ్చ బహూన్ వదిష్యన్తి తవాహితాః।
నిందంత స్తవ సామర్థ్యం తతో దుఃఖతరం ను కిమ్॥

తా: ఆడరాని మాటలెన్నో ఆడి నీ శత్రువులు నిన్న నిందిస్తూ నీ క్షాత్రాన్ని తెగనాడతారు. ఇంతకంటె దుఃఖతరమైనదేముంటుంది?

అయితే నన్నేమి చేయమంటావు?

37. హతోవా ప్రాప్స్యసే స్వర్గం జిత్వా వా భోక్ష్యసే మహీం।
తస్మా దుత్తిష్ఠ కౌన్తేయ! యుద్ధాయ కృతనిశ్చయః॥

తా: అర్జునా! యుద్ధం ఒకవేళ శరీరాన్ని కోల్పోతే నీవు పరమాత్మ స్వరూపమైన స్వర్గధామాన్ని చేరుకుంటావు. గెలిచావా అంటే ఈ శరీరముండగానే భూలోకంలోనే

ఆ సుఖాన్ని పొందగలవు. కాబట్టి రెండు విధాలా మేలొన గూర్చేయుద్ధం చేయడానికి కృత నిశ్చయుడవై లే.

వ్యా: లోగడ ఒక్కసారి 'యద్వాజయేమ యది వామోజయేయుః' అని అర్జునుడన్నమాటను పురస్కరించుకొని పరమత్మ నీవు గెలిచినా ఓడినా నీవు యుద్ధం చేయడంలోన పురుషార్థమూ సౌఖ్యమూ ఉందిగాని వీలు విలు నమ్ములు పారేసి కూర్చోడంలో లేదని అర్జునుడిని హెచ్చరించారు. పాపభూయిష్టములైన మర్త్య సుఖాలూ వద్దు స్వర్గసుఖాలూ వద్దు. అనుకుంటావేమో! పాపరహితమైన మార్గం ఒకటే ఉంది! అదేమంటే

38. సుఖ దుఃఖే సమేకృత్వా లాభాలాభౌ జయాజయౌ।
తతో యుద్ధాయ యుజ్యస్వ నైవం పాప మవాప్స్యసి॥

తా: సుఖదుఃఖాలను, లాభాలాభాలను జయాజయాలను సమభావంతో అంగీకరించి నీవు యుద్ధాన్ని చెయ్యి. అలాచేస్తే నీకు ఏమాత్రం పాపం రాదు.

వ్యా: పరమాత్మ ఈ శ్లోకం మొదలుకొని, 41వ శ్లోకం వఱకు కర్మను ఏవిధంగా కర్మయోగంగా చేసుకోవాలో వర్ణించి చెబుతున్నారు.

కృష్ణపరమాత్మ ఇంతవఱకు అర్జునుడి విషాదాన్ని పోగొట్టడానికి అనేక విధాలుగా పరమాత్మ చైతన్యం యొక్క నిత్యత్వాన్ని, దేహాదికముల వివర్తభావాన్ని మరణం యొక్క అయథార్థత్వాన్ని, వ్యష్టిసమష్టుల అభేదభావాన్ని గూర్చి చెప్పి, చివరకు నాస్తిక భావాన్ని ఆలోచించినా అర్జునుని వైక్లబ్యానికి కారణం లేదని అనేకోదాహరణలతో సత్యాంశాన్ని బోధించారు. అర్జునుడు యుద్ధం చేయక తప్పదని నిర్ణయించారు. కాని అర్జునుడు మొదట్లో చెప్పిన ఆక్షేపణ అంటే బంధువధా పాపం అనే శంకకు పరమాత్మ ఇంతవఱకు చెప్పిన ఉపన్యాసంలో అర్జునుడికి సమాధానం దొరకలేదు.

ఇప్పుడు పరమాత్మ ఈ శ్లోకంలో ఆ విషయాన్ని ఎత్తుకున్నారు. ఏవిధంగా మనం నిత్యకృత్యాలు చేస్తే మనకు పాపపంకం అంటుకోదో ఆ మార్గాన్ని పరమాత్మ సూచిస్తున్నారు.

పరమాత్మ ఇప్పుడు సూచిస్తున్న మార్గం వేదాలలో కూడా చెప్పబడినదే. యజ్ఞాదికర్మాచరణల వలననూ, తపోధ్యాన సమాధి ప్రాణాయామ ప్రత్యాహారాల వల్లనూ, లభించే ఆత్మశుద్ధీ, ఆత్మసంయమనమూ ఏవిధంగా మలుచుకుంటూ దైనందిన కర్మలను ఆచరిస్తే నిత్యజీవితాలలో కూడా ఆ ఫలితాలనే పొందవచ్చునో ఆ మార్గానికి యోగమని పేరు పెట్టారు. పరమాత్మచే భగవద్గీతలో ఇటువంటి యోగాలు

అలాగే మనుస్మృతులు యాజ్ఞవల్క్య స్మృతులు. జీవితాన్ని తయారుచెయ్యలేవు. జీవితంలో ఆచరణ భాగానికి సిద్ధాంతభాగానికి చాలా వ్యత్యాసం ఉంటుంది.

సిద్ధాంతాన్ని అమలు పఱచడానికి క్రియలు అవసరం. క్రియలు కర్మల రూపం దాల్చేసరికి, కర్తకు ప్రతి కర్మా ఆనందదాయకంగానూ దుఃఖదాయకంగానూ పరిణమిస్తూ ఉంటుంది. కర్మఫలాన్ని అనుసరించి ఫలప్రయోజనాన్ని అనుసరించీ, దానివలన కలిగే యోగక్షేమాలు, హాని అభ్యంతరాలూ, ఆ జీవితాన్ని ఆనంద మయంగానో దుఃఖయంగానో జేస్తూ ఉంటాయి. ఆనందం కలిగినప్పుడు మనస్సు ముక్తమవుతుంది. దుఃఖం కలిగినప్పుడు బద్ధమౌతుంది. కాబట్టి కర్మలు బంధన కారణాలు అవుతాయి. సిద్ధాంత విజ్ఞానాన్ని జీవిత కళగా సాధించాలంటే దానికి సరియైన పద్ధతులు తెలిస్తే తప్ప అప్రయోజనం నెఱవేఱదు. గీత ఈ పద్ధతులను చెబుతుంది. సిద్ధాంతభాగాలను ఉపనిషత్తులు కూడా చెబుతాయి. గీతకున్న విశిష్టత ఇది!

పరమాత్మ చైతన్యం యొక్క మార్పే దేహయాత్ర అనీ, సంసారమూ ఆత్మ చైతన్యమూ రెండూ ఒకటే అనీ ఈ అద్వైతభావం అనుభవరీత్యా కలగడానికి, ఈ రెంటికి స్వరూపమైన జీవితం మొదట నిర్మలం కావాలనీ, ఈ నైర్మల్యం లభించడానికి సిద్ధాంతరూపమైన యోగవిజ్ఞానం తోడ్పడుతుందనీ, శ్లోకంలోని విశిష్ట భావం.

ఆత్మవిజ్ఞానం జీవితకళగా రూపొందే విద్యకే కర్మయోగమని పేరు. కర్మయోగం సాంఖ్యయోగ సాధనమన్నారు రామానుజులు. మఱి ఈ యోగ ఆచరణ వలనకలిగే ఫలితమేమిటి? దీని ప్రభావమెంత వఱకుంటుంది అంటే

40. నేహాభి క్రమ నాశోఽ_స్తి ప్రత్యవాయో న విద్యతే।
స్వల్పమప్యస్య ధర్మస్య త్రాయతే మహతో భయాత్॥

తా: ఇందులో అభిక్రమనాశనం లేదు, ప్రత్యవాయం కూడ కలుగదు. ఈ ధర్మంలోని కొంచెమైనా కర్తను మహత్తరమైన భయాన్నుంచి రక్షిస్తుంది.

వ్యా: ఇందులో అంటే ఈ పైన చెప్పిన కర్మయోగంలో అభిక్రమనాశం అంటే ఆరంభవిఘ్నం ఉండదు. ఈ కర్మయోగాన్ని ఆరంభించడానికి కాలదోషంలేదు.

నిష్కామకర్మలకు వర్జ్యకాలం ఉత్తమమైనది అన్నది అమ్మ. వర్జ్యకాలంలో మొదలు పెట్టడంవల్ల నిష్కామఫలం మొదట్లోనే అంటే పని ఆరంభిస్తూనే సమ కూరుతుందని భావం.

ప్రత్యవాయం అంటే యజ్ఞయాగాదిక్రతువులు పూర్తి కాకుండా వచ్చే అవాంతరాలు. ఈ అవాంతరం యజ్ఞాన్ని పూర్తి చేయనీకుండా అడ్డుకోవడమేకాక దాని ఫలితాన్ని కూడా కర్మకందనీయకుండా చేయడమేకాక, దుష్ఫలితాన్ని కూడా తెచ్చి పెడుతుంది. రావణుడు చేసిన పాతాళయజ్ఞం పూర్తి కాకుండా అంగదుడు అవాంతరాలు తెచ్చిపెట్టడంవల్ల అజేయమై రథాదులు రావణుడికి లభించకుండా పోవడమే కాక, అతని పతనానికి కూడా అసంపూర్ణ యజ్ఞం కారణమైంది. అటువంటి ప్రత్యవాయాలేమీ కర్మయోగానికి దాపురించేవి కావు. సగం కట్టిన ఇల్లు అంటే కప్పులేకుండా గోడలు మాత్రమే లేచిన ఇల్లు ఎలా నిష్ప్రయోజనమో, సగం చేసిన వేదవిహితకర్మలు నిష్ఫలాలు అయ్యేవ్యవస్థ ఉంది. కాని ఈ కర్మయోగానికి ఆ బాధలేదు. చాలా మహిమకలది. ఇందులో అత్యల్పభాగాన్ని సాధన చేసినా మహాభయాలనుంచి కూడా కర్తను రక్షిస్తుంది. మృత్యువుకంటే మహాభయం లోకంలో ఇంకొకటి లేదు కదా! మృత్యుభయాన్ని కూడా కర్మయోగం నివారిస్తుంది.

నిర్గుణపరబ్రహ్మ సగుణంగా అనేక దశల ద్వారా గుణోల్బణ ధర్మ ప్రసూతమైన వ్యక్త సృష్టిగానై, మళ్ళీ ఆ సగుణమే నిర్గుణంగా మారే ఈ వ్యాపారానికి ఎన్నడూ నాశనం లేదు. దీనికి అభిక్రమం అంటూ లేదు. కనుక ఒక చోట నాశనమౌతున్నట్లు కన్పిస్తూ ఇంకోచోట పుడుతున్నట్లు కనిపించే నిత్యపరివర్తనానికి అంతూ ఆదీ లేదు. ఆత్మధర్మం ఇది. ఈ ధర్మం యొక్క ఇయత్త అంతులేనిది. ఇందులో స్వల్పంగా తెలుసుకున్నా మహత్తరమైన భయం నుంచి మనుష్యుడు రక్షింపబడతాడు. సర్వత్ర భిన్నత్వం లేకపోవడమే పరిపూర్ణత్వం కదా!

ఏది చూచినా అక్కడికది పరిపూర్ణమే ఇలా తెలియడమే పరిపూర్ణత్వం. తెలిసినవాడికి అన్నీ ఏకాగ్రతలోనే ఇమిడిపోయి పరిపూర్ణంగా కనిపిస్తాయి. అలాంటి వ్యవసాయాత్మికమైన బుద్ధికలగడమే కర్మయోగంలోని రహస్యం.

41. వ్యవసాయాత్మికా బుద్ధి రే కేహ కురునందన!।
బహుశాఖా హ్యనంతా శ్చ బుద్ధయో౽ వ్యవసాయినామ్॥

తా: పార్థా! కర్మయోగ విషయంలో వ్యవసాయాత్మికమైన బుద్ధి ఒక్కటే. అవ్యవసాయాత్మికమైన బుద్ధులు బహుశాఖలుగాను అనంతంగాను ఉంటాయి.

కర్మయోగంలో సిద్ధాంతభాగం, జీవితకళ రెండూ కలిసిఉన్నాయని చెప్పుకున్నాం. ఎన్ని సిద్ధాంతాలను బుద్ధివల్లె వేసినా అది ప్రయత్నశీలమూ, తీవ్రతరంగా ఆచరణ దక్షమూ కాకపోతే కర్మయోగసిద్ధి లభించదు. పరమాత్మ తత్వజిజ్ఞాసలో అంతఃకరణనైర్మల్యమూ ఉండాలి. దినచర్యా రూపకమైన కర్మ నైర్మల్యమూ ఉండాలి.

సమస్తజీవరాశిని పరమాత్మగానే దర్శించి పరమాత్మ యెడల ఏవిధంగా నిరంతరమూ భక్తి ప్రేమకైంకర్యాది భావాలతో ఉంటాడో, అదేవిధంగా కీటాదిబ్రహ్మ పర్యంతమూ భక్తిగౌరవాలతో కొలిచి, స్వార్థమూ అహంకారమూ అడ్డునిలవకుండా జీవితం గడిపేవాడు వ్యవసాయాత్మికబుద్ధి. అటువంటి వాని బుద్ధి ఏకాగ్రంగా ఎక్కడో ఒక చోటే పరమాత్మ ఉన్నాడన్నట్లుగా సూచీముఖమై ఉండనక్కఱలేదు. అంతటా నిండి ఉన్నదే అని ఆకాశవతుగా మనస్సు విస్తరించి పోయి ఉండవచ్చు. పరమాత్మ భావనతో తప్ప తాను సదేహుడై జీవించలేననే ఉత్కర్ష అతనికి కలగాలి.

వ్యవసాయాత్మిక బుద్ధిని గుఱించి వినోబాభావే రెండు కథలను ఉదహరించారు. శివాజీ ఒకసారి తుకారామ్‌ను గౌరవించుటకుగాను పల్లకీని పంపి రాజ సన్మానానికి ఏర్పాటు చేయగా, భగవంతుడు గౌరవప్రతిష్ఠలనే ఫలాన్ని అతని చేతుల్లో పెట్టి పీడ వదల్చు కుందా మనుకున్నాడని శోకించాడట!

పుండరీకుడు తల్లిదండ్రులకు సేవ చేస్తూ ఉండేవాడు. అతని సేవవలన ప్రసన్నుడై పాండురంగడు అతని వద్దకు పరిగెత్తుకొని వచ్చాడట. కాని పుండరీకుడు పరమాత్మ దర్శనలోభంలో చిక్కుకోలేదు. మాతాపితల సేవే అతనికి ఈశ్వరభక్తి అయింది. నేను తల్లిదండ్రుల సేవలో నిమగ్నుడనై ఉన్నాను. నీ సంగతి ఇప్పుడు చూడలేను. క్షమించు అంటూ భగవంతుడు నిలబడడానికి ఇటుక ఱాతిని ముందుకు త్రోశా డట తుకారామ్ ఈ విషయమై పరిహాసంచేసి ఇలా అన్నాడట. ఓరీ! ఎంత వెఱ్ఱి భక్తు డివి. పాండురంగని కూడ ఇటిక ఱాతిమీద నిలబెట్టావు. ఎంత మొండి సాహసివి.

వ్యవసాయాత్మిక బుద్ధి ఆకాశంవలె ఒకే ఒకటై ఉంటే, అవ్యవసాయాత్మికమైన బుద్ధి ఆకాశంలోని చుక్కల్లాగా బహుభేదాలతోను, అనంతంగాను ఉంటుంది. ఏ ఒక విషయమూ, ఏ ఒక పరమాత్మాంశమూ అటువంటి బుద్ధికి సమాధానంగా ఉండజాలదు. కాబట్టి అతని బుద్ధి ఒకదాని నుండి మఱొక పూజవైపో, నమ్మకం వైపో, గురువువైపో, ఉపదేశం వైపో, కోరిక వైపో పరుగెత్తుతూ ఉంటుంది. అతని బుద్ధి సంకుచితమై చంచలమై ఉంటుంది. వివిధ విధములైన దేవతానీకాలపూజలకై అఱ్ఱులుచాస్తూ ఉంటుంది. నిజానికి వేదంలోనూ, బ్రాహ్మణాలలోనూ, పూర్వమీమాంసలోనూ, చెప్పబడిన కర్మకాండ అంతా ఇలాంటి పృథగ్విధభావాలను, పూజలను రెచ్చగొట్టేవిగా ఉన్నాయి. కాని పరమాత్మ తత్వం మారేది కాదు కదా! దాన్ని చూచిన మన ఊహలు ఎన్నిరకాలుగానైనా ఉండవచ్చు. సంకల్పం ఎప్పుడూ మారదు. దాన్ని గుఱించిన ఆలోచనలు మారుతాయి.

అనంతశాఖలుగా విడిపోయే అవ్యవసాయబుద్ధికి యోగసిద్ధి అబ్బదు. అయినా అవ్యవసాయ బుద్ధికి అహంకారమెక్కువ. కాబట్టి తన మతమే మతమని, తన పద్ధతి కంటె సర్వశ్రేష్ఠమైన పద్ధతి వేఱొకటి లేదని అతడు వాదిస్తాడు. అట్టి బుద్ధి అజ్ఞాన వ్యవసితమైనది. అట్టివారి వాదనలను గూర్చి క్రింద మూడు శ్లోకాలలో పరమాత్మ వివరిస్తున్నారు.

42. **యామిమాం పుష్పితాం వాచం ప్రవదంత్య విపశ్చితః।**
వేదవాదరతాః పార్థ! నాన్య దస్తీతి వాదినః॥

43. **కామాత్మానః స్వర్గపరాః జన్మ కర్మ ఫల ప్రదామ్।**
క్రియా విశేష బహుళాం భోగైశ్వర్య గతిం ప్రతి॥

44. **భోగైశ్వర్య ప్రసక్తానాం తయాఽ పహృతచేతసామ్।**
వ్యవసాయాత్మికా బుద్ధిః సమాధౌ న విధీయతే॥

తా: వేదం అనే చక్కని పూల చెట్టున్నది. ప్రభు సమ్మితంగా అర్థవాదలనే పూలు పూస్తుంది. అపండితులుకాగితపు పూలను కూడా ప్రదర్శిస్తూ, మిథ్యావాదాలను ప్రచారం చేస్తూ తాముచెప్పే వాటికంటే ఇంకో సత్యం లేదని పిడివాదం చేస్తుంటారు. సాక్షాదనుభవం కంటె వాఙ్నిర్ణయాల మీదనే ఈ తెగ ఆధారపడి ఉంటుంది. వారు అర్థవాదులు అవివేకులు, వేదవాదాసక్త చిత్తులు.

దేహధారిఐ జన్మకర్మ ఫలాన్ని లెస్సగా అనుభవించే ఆకాంక్షతోనే వారు పని చేస్తారు. స్వర్గముగా ఈ లోకాన్ని మార్చినా భోగైశ్వర్యాలంటే, పుత్ర పశుధనాది వాంఛాలగ్నంగానే వారి దృష్టి ఉంటుందిగాని నిరాసక్తంగా ఉండదు.

భోగైశ్వర్యాలను లక్ష్యాలుగా పెట్టుకొన్న వారికి అవే పురుషార్థాలౌతాయి. వారు చేసే ప్రయత్నాలు పనులూ వారిని ఆ దుష్టపథాల్లోనే పడేసి ఈడ్చుకుపోతాయి. త్రికరణాలూ ఐహికసిద్ధులపైనే లగ్నం చేసుకుని, భోగైశ్వర్యాల రైలెక్కి కూర్చుని సమాధి శాంతి కావాలంటే ఎలా లభిస్తుంది? లభించదు.

నాన్యదస్తీతి వాదినః: తాము చెప్పేదానికంటే వేఱుమోక్షమార్గం లేదని వాదించే వాళ్లు నేటికాలంలో లెక్కకు మిక్కిలిగా ఉన్నారు. క్రిస్టియనులు, ఇస్లాం, బౌద్ధం, జైనమతం, మన మతంలోనే చైతన్య మతం, రాధాస్వామిమతం, బ్రాహ్మమతం, బ్రహ్మకుమారి మతం, శైవమతం, వైష్ణవ మతం ఎవరికి వారే ఈ మతాల వాళ్ళందఱూ, తాము చూపిందే మోక్షానికి దారి అంటారు. మతకలహాలు రోజూ

మనం చూస్తున్నవే. ఏవిధంగా పూజించినా అమ్మను పూజించుకోవచ్చు. అమ్మను పూజించినవారిలో మహమ్మదీయులూ క్రిస్టియనులూ ఉన్నారు. అమ్మ పఠించినదల్లా 'సరే' మంత్రమట. అన్ని మతభేదాలూ ఈ మంత్రంతో తుడిచిపెట్టుకొని పోతాయి. పరమాత్మ చైతన్యం, మనుషులు తగిలించిన బురఖాలను దించుకుని అమ్మ సూక్తులలోనూ, అమ్మ జీవితంలోనూ బయటబడుతుంది.

వేదవాదరతాః: శాసనతుల్యమయినది వేదవాదం. అదే వాదాన్ని ఎవరికర్థం అయినట్లు వారు చెప్పి తమదే నిశ్చితార్థమంటారు. ఎవరికర్థమయినట్లు వారు, ఎవరి అనుభవానికి తగినట్లు వారు వ్రాస్తారు. ఉదాహరణకు వేదాల్లోనే స్వర్గాది ఫలాలను ప్రతిపాదించే స్మార్తాది కామ్యకర్మలను గురించి చెప్పేభాగం ఒకటుంది. దీన్ని కర్మ కాండ అంటారు.

మోక్షాన్ని ప్రతిపాదించే ఉపనిషత్తులు కూడా ఇంకోభాగంలో ఉన్నాయి. దీన్ని జ్ఞానకాండ అంటారు. వ్యాఖ్యానకర్తలు తమ మనస్సుకు తమ సిద్ధాంతాలకు అను కూలమైన భాగాన్ని ప్రమాణంగా తీసుకుని, అందఱూ వేదాన్నే ప్రమాణంగా ఉదహ రిస్తారు. అన్ని వాదాలూ సత్యాన్నే ఎలా చెప్పవౌతాయంటే.

'సర్వేవేదా యత్పద మామనంతి'
'వేదోఽ ఖిలో ధర్మమూలం'

అని ఏకరువు పెట్టి ధర్మాన్ని నిర్ణయిస్తారు. అందుకనే శాస్త్రం చెప్పింది ఒక్కటే. అర్థం చేసుకోటం వేఱు అంటుంది అమ్మ. మఱిశాస్త్రం ఎలా ఉండాలి అంటే - భగ వంతుడు లేడు అనే వాడికీ, ఉన్నాడనే వాడికీ ఎవరూ అనే వాడికీ సరిపోయేటట్లు చెప్పగలిగిందే శాస్త్రం. అన్నది అమ్మ. ఆచార్య త్రయాన్ని చూడండి. పైశ్లోకంలో సమాధి అనే మాటకు సాధారణార్థం జీవాత్మ పరమాత్మల సమతావస్థ అని ఉండగా శంకరులు దీనికి బుద్ధి అనీ, రామానుజులు మనస్సు అనీ, మధ్వాచార్యులు సమధౌ అంటే సమాధి నిమిత్తం అనీ అర్థాన్ని చెప్పారు.

45. త్రైగుణ్య విషయా వేదాః నిస్త్రైగుణ్యో భవార్జున।
నిర్ద్వంద్వో నిత్య సత్వస్థో నిర్యోగ క్షేమ ఆత్మవాన్॥

తా: వేదాలు త్రైగుణ్యమే విషయంగా కలవి. నీవు నిస్త్రైగుణ్యుడవుకా అర్జునా! నిర్ద్వంద్వుడవుకా! ఎల్లప్పుడూ సత్వగుణంలోనే మిగిలిన వాడవు కా! యోగక్షేమాలు పాటింపనివాడివి ఆత్మవంతుడవు కావలసింది.

వ్యా: వేదయతీతివేదః తెలియజేసేది వేదం. వేదకాలంలో సహజమైన నిజా

యితీ, ఋతంభరప్రజ్ఞ, అంతఃప్రజ్ఞ, బహిఃప్రజ్ఞ. ఉభయతఃప్రజ్ఞ, చిత్తవృత్తి నిరోధ రూపమైన మనోగతి, స్వదృష్టి, నిగ్రహం, అంతరాత్మసాన్నిధ్యం, విశ్వశక్తులతో ఐక్య భావం ఇవన్నీ కలిసి చిత్త వృత్తిని నడిపేవి. సంపూర్ణత్వానికి సమంత జ్ఞానానికి తిరుగుండేది కాదు. వేదాలు అంటే ఋషుల అనుభవజ్ఞానమే. ఎవరి అనుభవం వారిది. వెలుతురుకు ఎన్నో రంగులుండవచ్చు. చీకటికొకటే. గుణత్రయ విభాగ యోగంలో ఈ శ్లోకములున్నాయి.

మమ యోని మహద్బ్రహ్మ తస్మిన్ గర్భం దదా మ్యహమ్।
సంభవ స్సర్వభూతానాం తతో భవతి భారత।
సర్వయోనిషు కౌన్తేయ! మూర్తయ స్సంభవన్తి యాః।
తాసాం బ్రహ్మ మహద్యోనిః అహం బీజ ప్రదః పితా॥
సత్వం రజ స్తమ ఇతి గుణాః ప్రకృతి సంభవాః।
నిబధ్నన్తి మహాబాహో దేహే దేహిన మవ్యయమ్॥

సృష్టి అంతటికి బీజప్రదుడైన వాడు పరమాత్మయే. సత్వరజస్తమో గుణాలు దేహిని దేహంలో కట్టిపడేస్తాయి. బీజం పరమాత్మది కావడంచేత సృష్టికి నిత్యత్వం వచ్చింది. వేదాలకు నిత్యత్వం వచ్చింది. గుణాతీతత్వం వచ్చింది. రెండు లేకపోవడం (నిర్ద్వంద్వత్వం) నిత్యమూ సత్వగుణంలోనే మునిగి ఉండడం (నిత్యసత్వస్థం) యోగాతీతుడై ఉండడం (నిర్యోగః క్షేమ ఆత్మవాన్) నిత్యక్షేమంతో ఉండడం, ఆత్మగానే ఉండడం ఇట్టివానికి సులువుగా లభిస్తాయి. దీనికి మార్గమేమిటి?

సర్వారంభపరిత్యాగం. ఏదీ చెయ్యకుండా ఉండడం కాదు. భగవంతుడు చేయిస్తుంటే నేను చేస్తున్నాననుకొని అన్నీ చేయడం. సృష్టి పాటిపోకుండా, కారిపోకుండా, జారిపోకుండా, నిర్దిష్ట ప్రయోజనాన్ని పరమాత్మ చైతన్యం మార్పు లేకుండా అందిస్తుంది. గుణత్రయ యంత్రాంగం దానికబ్బిన అనూచానమయినవీ, జాతిజన్మ ప్రాప్తాలయినవీ, భౌగోళికాలయినవీ లక్షణాలతో తయారుచేసిన నమూనా దేహాన్ని కాలం రైల్లో పడేస్తుంది. త్రిగుణాల నుండి లభించిన లక్షణాలే వ్యక్తి మనస్సుకు చుక్కాని.

సర్వతస్సంప్లుతోదకమైనా, ఉదపానమైనా, కుక్క నాలుకతోనే గతుకుతుంది. రాసెడు వడ్లున్నా కోడి నాలుగు వైపులకూ విరజిమ్మకుండా గింజలు తినదు. ఏరుకునిగాని తినదు.

46. **యావానర్థ ఉదపానే సర్వతస్సంప్లు తోదకే।**
తావా న్సర్వేషు వేదేషు బ్రాహ్మణస్య విజానతః॥

తా: బావిలో పరిమితమై ఉన్నా, అంతటా నిండి వఆదలా ఉన్నా, జలమునందు ఎంత ప్రయోజనం కలదో, బ్రహ్మజ్ఞానికి వేదాల యందు కూడా అంతే ప్రయోజనం కలదు.

వ్యా: ఉదపానః అంటే పరిమితమైన బావి దొరువు వంటి జలస్థానం. సర్వతస్సంప్లుతోదకే. అంటే అంతటా నిండి బావులనూ చెఱువులనూ ముంచివేసిన వఆదనీటి స్థితి. నీటి ప్రయోజనం రెంటిలోనూ ఒకటే. పరిమితమైన వ్యక్తి దేహంలో ప్రాణవాయువుగా, మనస్సుగా ఉన్నదీ పరమాత్మే. అపరిమితంగా సమష్టి రూపంగా ఉన్నదీ పరమాత్మే. అపరిమితంగా ఉన్న ఆకాశాన్ని ఊహించుకోడానికి శక్యంగాక పరిమితమైన గోడల మధ్య ఆకాశాన్ని అర్థం చేసుకుంటాం.

అంతటా ఉన్న అమ్మ అర్థం చేసుకోడానికే ఈ అమ్మ.

వేదాలలో పరమాత్మ స్వరూపం వర్ణించబడి ఉంది. అగ్ని అనీ, ఇంద్రుడనీ, అశ్వినులనీ, మిత్రావరుణులనీ, పరమాత్మ వ్యక్తస్వరూపం అనేక విధాలుగా వర్ణింపబడి ఉంది. అందులో విధించబడ్డ అగ్నిష్టో మాదిక్రతువులు అనంతంగానే ఉన్నాయి. ఇలా వర్ణించబడిన ప్రతిరూపమూ, ప్రతి అనుష్ఠానమూ ఒక బావియో లేక చెఱువో అయిఉన్న విజ్ఞానమే. భూగర్భంలో ఉన్న నీళ్ళను కూడా కలుపుకొని, ఎక్కడ ఉన్నా జలభూతం జలభూతమే అనుకోడం కూడా మంచిదే. లేక ఈ బావిలోవి ఇన్ని నీళ్ళు అంటే 100 గాలనులు, ఈ దొరువులోనివి 200 గాలనులు అనుకోడమూ మంచిదే మన లెక్కలవలన ఉన్నజలానికి గాని దాని ఉపయోగానికి గాని ఏవిధమైన బాధకమూ లేదు. అలాగే వేదాల ఉపయోగములను బ్రహ్మనిష్ట కలిగి బ్రహ్మజ్ఞాన సముద్రంలో లీనమైనవానికి వేదాల ప్రయోజనం కూడా దప్పిక తీర్చడానికి ఎక్కడ ఉన్నదైనా జలంవంటిదే అవుతుంది.

ఈ శ్లోకంలో ఉదపానే సర్వతస్సంప్లుతోదకే అనే మాటలు సప్తమ్యంతాలుగా ప్రయోగించబడ్డాయి. యావాన్ తావాన్ అనే పదాలు. అర్థ విషయంలో సంశయాన్ని కల్పిస్తున్నాయి. వ్యాఖ్యాతలందయా 'సర్వతః సంప్లుతోదకే అనే దానిముందు తావాన్ అర్థం' అనే పదాన్ని చేర్చుకుని అన్వయంచేసుకున్నారు. శంకరులు, మధ్వాచార్యులూ, ఏవిధంగా బావులూ చెఱువులూ వఆదజలంలో అంతర్భావం పొందుతాయో అలాగే వేదార్థములవలన లభించే స్వల్పప్రయోజనం బ్రహ్మ జ్ఞానానుభవం వచ్చిన జ్ఞానికి అంతర్భావం చెందుతాయని వ్రాశారు.

'నాలుగో అధ్యాయంలో

'సర్వకర్మాఖిలం పార్థ! జ్ఞానే పరిసమాప్యతే'

సర్వకర్మజాతమూ జ్ఞానంలో పరిసమాప్తి చెందుతుందనే అర్థం పైభావాన్నే సూచిస్తుంది.

రామాజులు చెఱువులోగాని నూతిలోగాని వఱదలోగాని తన కవసరమైన నీటిని మనుష్యుడు ఎలా తీసుకుంటాడో అలాగే జ్ఞాని తనకవసరమైన వేదభాగాలను మాత్రమే తీసుకుంటాడని భావించారు.

47. కర్మణ్యే వాధికారస్తే మా ఫలేషు కదాచన।
మా కర్మఫల హేతుర్భూః మా తే సంగో౽స్త్వకర్మణి॥

తా: అర్జునా! కర్మములు చేయడమునకు మాత్రమే నీకధికారం ఉంది. ఫలాన్ని ఆశించడానికి ఎన్నడూ కాదు.

కర్మఫలహేతుభూతుడవు కూడా నీవు కావద్దు. కర్మలు బొత్తిగా చేయకుండా ఉండాలని కూడా నీవు అనుకోవద్దు.

పై శ్లోకంలోని నాలుగు వాక్యాలను తిలకుగారు బ్రహ్మ సూత్రాలలోని చతుస్సూత్రిగా భావించవచ్చని అన్నారు.

1. సూత్రం: కర్మచెయ్యడానికి మాత్రమే నీకున్న అధికారం.
2. సూత్రం: నీకు కర్మఫలానికధికారం లేదు.
3. కర్మఫలహేతు భూతుడవు కూడ కారాదు నీవు.
4. ఏ మాత్రం పనిచేయకుండా ఊరికే కూర్చోడానికీ వీలులేదు కూడా! అన్ని కర్మలూ చేస్తూనే ఉండాలి.

కర్తద్వారానే కర్మయేర్పడ్డది కనుక అతడు దానికధికారియే. చేసే తీరులో పని ఉంటుంది. కనుక దాని ఫలితాన్ని కర్తనిర్ణయించలేడు. కర్మచేసే సామర్థ్యం పరమాత్మ ప్రసాదం కనుక కర్మఫలానికి హేతువుగా ఎన్నడూ కాలేడు. కర్త, కర్మ, క్రియ ఒకటే కనుక అకర్మకృత్తుగా ఉందామన్నా ఉండలేడు. తటస్థంగా ఉండి కర్మలను చేయమని భావము. భలే శ్లోకం. విమాన చోదకులకు Light House లాంటిది. నేటి కృత్రిమ జీవన సరళికి అగ్ని పర్వతం వంటిది.

48. యోగస్థః కురుకర్మాణి సంగం త్యక్త్వాధనంజయ!।
సిద్ధ్య సిద్ధ్యో స్సమో భూత్వా సమత్వం యోగ ఉచ్యతే॥

తా: ధనంజయా! ఆసక్తిని త్యజించి, సిద్ధి అసిద్ధి ఈ రెంటిని సమానంగానే భావించి, యోగస్థుడవై కర్మలను చెయ్యి, యోగమంటే సిద్ధ్యసిద్ధులయందు సమ భావమే.

వ్యా: పరమాత్మ ఆజ్ఞగా ప్రతి పనినీ చేసేవాడికి ఏ క్లేశమూ ఉండదు. ఫలితం మీద దృష్టి లేకుండా పని చేయడమే యోగస్థః కురుకర్మాణి అనే వాక్యానికర్థం.

అమ్మ: నీ అనుభవం నీకు ఏది బాగా నేర్పితే దాని ప్రకారం చెయ్యి నాన్నా.

ఒకరు: అలా నా అనుభవం ఏం నేర్పుతుందో తెలుసుకోవాలని నా జీవితం మీద Experiments మొదలుపెడితే చివరకు ఏదీ సాధించకుండానే ఈ జీవితకాలం వెళ్లిపోతుందేమోనని భయం వేస్తున్నదమ్మా.

అమ్మ: అలాటప్పుడు మనల్నందరినీ నడిపించే శక్తి ఒకటున్నదని దాన్ని నమ్ముకొని సాధన చెయ్యి నాన్నా! ఆశక్తే నీకు సుఖం కలిగించినా దుఃఖం కలిగించినా అని నమ్ము.

అసిద్ధితో కోరిక లంపటల బరువులు ఎక్కువౌతాయి. మనిషిని దిగలాగుతాయి. సమత్వంలో ఆ బాధ ఉండదు. అవసరాన్ని బట్టి ఫలసిద్ధి విలువలు మారుతాయి.

ఫలంలో తేడా ఎందుకుంటుంది? అలా అనుకుని చేస్తే (ఉంటుంది). ఇది నాది అనుకుని చేయకూడదు. సర్వం నాదే అనుకోలేక పోతున్నా అనే బాధే కాని (ఇంకోటి కాదు). ఇదే నీదనుకోకుండా సర్వం నీదే అనుకోమనికాని నీదనుకోవద్దని కాదు. సర్వత్రా మమకారమే సమత్వం. ఈ సమత్వాన్నే యోగం అంటారు.

భగవద్గీత రెండు అష్టాక్షరి మంత్రాలను చెప్పింది. అందులో ఒకటి

'సమత్వం యోగ ఉచ్యతే'

రెండోది

'యోగః కర్మసు కౌశలమ్' ఈ రెండే నేటి భారతంలో (నభఃపుష్పాలు)

జ్ఞాన సిద్ధికిగాని, జీవిత కళాసిద్ధికిగాని పరమభేషజ క్రియగా, తంత్ర క్రియగా, ఉపాయంగా, గీతాకారుడు సృష్టించిన అనర్ఘమైన పదం 'యోగం'. ఈ యోగం అనే మాటకు ఎవరు ఎన్ని అర్థాలు చెప్పినా పరమాత్మ చెప్పిన అర్థాలు ఈ రెండే. ఒకటి 'సమత్వం'. రెండవది 'కర్మసు కౌశలమ్' ఈ రెండూ రెండు తక్కెడ సిబ్బిలుగా చేసి పరమాత్మ జీవితాలను తూచి విలువగట్టి విడిచిపెట్టారు.

సమత్వం అంటే ఏమిటి? అనే ప్రశ్నకు కూతురును కోడలిని ఒకే రీతిగా చూచుకోడమన్నది అమ్మ. గృహస్థురాలి మమకారాన్ని మథించి తీసిన వెన్నగదా ఈమాట.

యోగి హృదయం ఎలా ఉండాలో పరమాత్మ పై శ్లోకంలో చెప్పారు. అది ఎలా ఉండకూడదో క్రింది శ్లోకలో చెబుతున్నారు.

49. దూరేణ హ్యవరం కర్మ బుద్ధి యోగా ద్ధనంజయ!।
బుద్ధౌ శరణ మన్విచ్ఛ కృపణాః ఫలహేతవః॥

తా: ధనంజయా! పైన చెప్పిన సమత్వ బుద్ధియోగం కంటె ఇతరమైన కర్మ మిక్కిలి నీచమైనది సుమా! కాబట్టి నీవు బుద్ధియోగాన్నే శరణు పొందుము. ఫలహేతువులైనవారు కృపణులు.

వ్యా: సమత్వ బుద్ధితోచేసిన కర్మలు మనస్సును పట్టుకొన్న పాకుడును వదలగొట్టి నిర్మలంగా చేస్తాయి. ఫలాసక్తితో చేసిన కర్మలు ఆశలనూ పాశలనూ పెంచి అహంకార మమకార బంధనాలను వ్యక్తికి కల్పిస్తాయి. నేనే నామోక్షానికి కర్తను అని అతడు భావిస్తాడు. తనకు ఇతరులవల్లా జగత్తువల్లా ఏమీ సహాయ సంబంధాలు లేవని అనుకుంటాడు. తన ఒక్కడి కర్మవల్లనే జగత్తు నిలబడుతుందనుకునేవాడు తన కాళ్ళతో ఆకాశాన్ని ఎత్తి నిలబెతున్నాననుకునే తలక్రిందు పక్షి వంటివాడు. ప్రతి ఒక్కరు చేసే పనిలోనూ నేనూ భాగస్వామినే అనుకునే వాడు బుద్ధియోగం గలవాడు. బుద్ధియోగి సర్వమూ నాదనుకుంటూ ఏదీ నాదికాదను బుద్ధితో పనులు చేస్తాడు. అక్షరత్వాన్ని తెలుసుకోకుండా చచ్చిపోయేవాడు, కృపణుడని లోగడ చెప్పుకుని ఉన్నాం.

ఫలతృష్ణా ప్రేరితులై సకామ కర్మలను చేసేవాళ్ళు కృపణులు. యోగ పద్ధతి కృపణుల పద్ధతి కాదు. అయితే యోగమంటే ఏమిటి?

50. బుద్ధియుక్తో జహాతీహ ఉభే సుకృత దుష్కృతే।
తస్మా ద్యోగాయ యుజ్యస్వ యోగః కర్మసు కౌశలమ్॥

తా: బుద్ధి యుక్తుడైనవాడు సుకృత దుష్కృతాలను ఇక్కడే విడిచి పెడతాడు. యోగమంటే నేర్పుతో పనులు చేయడమే. కాబట్టి అట్టి యోగాన్ని పొందడానికి ప్రయత్నించు.

వ్యా: సమత్వబుద్ధితో కర్మలను చేయడమే యోగం. ఈ యోగాన్ని నిపుణంగా ఆచరించేవాడు బుద్ధియుక్తుడు. బుద్ధియోగంతో సిద్ధి అసిద్ధి సమానంగా ఎంచేకర్త

స్వభావం చేత ఒక అద్భుతమైన మార్పు జరుగుతుంది. సహజంగా అన్ని కర్మలు బంధన స్వభావం కలిగి ఉంటాయి. బుద్ధియోగంతో కర్త సమత్వాన్ని ఎప్పుడు అవలంబించడం ఆరంభిస్తాడో కర్మలు బంధన స్వభావాన్ని విడిచిపెట్టి సరళములై పోతాయి. దానివలన అతడు సుకృత దుష్కృతాలను రెంటిని ఇహలోకంలోనే విడిచిపెట్టిన వాడౌతాడు. దీన్నే అతి సుందరమైన భాషలో పరమాత్మ చెప్పిన 'యోగః కర్మసు కౌశలమ్' అని అతి మధురము, బహు గంభీరమూ మహావాక్య తుల్యమూ అయినది ఈ వాక్యము - భగవద్గీతలో చెప్పబడిన అన్ని యోగాలకు ఇది సమానంగా వర్తించుతుంది. బంధ విచ్ఛిత్తికి ఇదే ఏకైక విముక్త మార్గమై నిలుస్తుంది. సుకృత దుష్కృతాలు తారతమ్య సిద్ధాంతం మీద ఆధారపడి ఉంటాయి. ఒకడినీతి ఇంకొకడికి అవినీతి. ఒకటి అవసరం ఇంకొకడికి అపహాస్యం, ఒకడి బాధ ఇంకొకడికి ఆనందం. ఇటువంటి అప్రయుక్త స్థితికి ప్రామాణికత్వం నిర్ణయించడం సాధ్యంకాదు.

ఆధ్యాత్మిక వివేచనం అటువంటి ప్రామాణికత్వం లేకుండా ముందుకు సాగదు. 'అహింసా పరమోధర్మః' అని ఒక వంక ఘోషిస్తూ 'పరిత్రాణాయ సాధూనాం వినాశాయచ దుష్కృతాం' అనే సూత్రంతో ప్రతీ చిత్రవధనూ, హింసా కాండనూ సమర్థించుకునే నీతిసూత్రాలు ఏ ప్రమాణానికి లోబడతాయి? సీదా సాదాగా ఆలోచించే మనస్సులకు ఇవి విపరీతాలుగాను, పరస్పర విరుద్ధాలుగాను తోచడంలో విడ్డూరం ఏమీలేదు.

అట్టిసమస్యే అర్జునుడికి ఎదురైంది. బంధు వధ పాపమనిపించింది. యుద్ధం చేయనన్నాడు. గాండీవంక్రింద పారేసి కూర్చున్నాడు. శ్రీకృష్ణుడు పుణ్యపాప వివక్షత చేయవలసి వచ్చింది.

పుణ్యమనుకుని నీవుపుణ్యమూ చెయ్యలేవు. పాపమనుకొని పాపమూ చెయ్యలేవు. ప్రకృతి జనితములైన గుణస్వభావాలు నీచేత ఏ పనులు చేయిస్తే వాటిని చేయడానికే నీకు అధికారమూ సామర్థ్యమూ ఉంది. వాని ఫలాభిసంధి రూపమైన పుణ్యాపాప నిర్ణయాలు, సిద్ధ్యసిద్ధి ప్రయోజనములు, ఈశ్వర ప్రమేయాలు కనుక, వాటిని గూర్చి లేనిపోని ఆలోచనలను బాధ్యతలను నెత్తిమీద వేసుకుని, పుణ్యం చేస్తున్నానని సంతోషించి, పాపకార్యం చేస్తున్నానని భీతిచెంది, మానస దౌర్బల్యం, క్లైబ్యంతో, పరుషకారాన్నే నశింపజేసుకోవడం కృపణుల స్వభావం, మనం చేసే ప్రతికర్మ పరమాత్మ ప్రేరణతో ఓతప్రోతమై ఉన్నదనే సిద్ధభావనతో, దృఢవిశ్వాసంతో నీవే పనిచేసినా అది ధర్మకార్యమే అవుతుంది. ఎందుకంటే చేసేవాడు కారయితా గాడు. కర్తా కాకుండా నిమిత్త మాత్రుడవుతాడు. పులి లేడిని చంపిందంటే ఉదర నిమిత్తం అవుతుంది. ఉదర నిమిత్తం కాకపోతే ఆ చంపడం జరగదు కనుక.

ఎంతవఱకు నీ లాభా లాభాలు, జయాపజయాలు వాటి తాలూకు స్వార్థపరత్వమూ, ఈ అన్నింటినీ, ఆ సామ్యయోగ భావంతో రంగరించుతూ ఉంటావో, ఆ విశ్వాసంతో రూపుమాపుతూ ఉంటావో, అంతవఱకూ నీ బుద్ధికి నిర్లిప్తత, జ్యోతి మార్గదర్శి, ఔతుంది. పరిమిత బుద్ధి రూపుమాసిపోగానే పారమాత్మిక బుద్ధి ప్రత్యక్షమౌతుంది. పారమాత్మిక బుద్ధిలేని లోకులు నీ కార్యాలను పాపాలుగా పుణ్యాలుగా విభజించినా, వాటి తాలూకు నిందాస్తుతులు, క్లేశాభిమానాలు, ఆనందాక్రందనాలు నీదాకా రావు. అలా విభజించుకొన్న వారి మనస్సులనే ఆయా వాసనలు అంటి పెట్టుకుని ఉండి పోతాయి కాని నీవు వాటినుండి ముక్తుడవే అయి ఉండగలవు. పరమాత్మమీద భారం వేసి కర్మచేయడంలో ఇంతప్రభావమున్నది. పుణ్యపాపాల అల్లికనుంచి నిన్ను అది ముక్తుణ్ణి చేస్తుంది. ఆవిధంగా పుణ్య పాపాలను నీవు ఇక్కడనే అంటే ఎక్కడ కర్మలు చేస్తావో అక్కడనే విడిచిపెట్టి నీ మానాన నీవువెళ్ళిపోగలవు.

అటువంటి కర్మకౌశలమే అంటే నేర్పుగా కాకుండా సహజబుద్ధితో పనిచేసే స్వభావమే, యోగమనబడుతుంది. అటువంటి యోగాన్ని అవలంబనంగా చేసుకుని నీవు కర్మలను అనుష్ఠించుమని పరమాత్మ అర్జునునకు బోధించారు.

పూర్వం చెప్పిన రీతిగా "యోగః కర్మసు కౌశలమ్" అనేది అష్టాక్షరీ మంత్రం. ఈ అష్టాక్షరీ మంత్రాన్ని నవలంబించిన మనుషులకు ఎటువంటి ఫలం ప్రాప్తిస్తుందంటే.

51. కర్మజం బుద్ధి యుక్తాహి ఫలం త్యక్త్వామనీషిణః
జన్మబంధ వినిర్ముక్తాః పదం గచ్ఛన్త్యనామయమ్॥

తా: బుద్ధియుక్తులైన మనీషులు, కర్మజమైన ఫలాన్ని త్యజించినవారై జన్మబంధ వినిర్ముక్తులై అనామయమైన పదమును చేరుచున్నారు.

బుద్ధి యుక్తులంటే సమత్వ ప్రధానమైన బుద్ధియోగంతో కూడుకున్న వాళ్ళని అర్థం. అటువంటి బుద్ధిమంతులు తాము కర్మలను చేస్తున్నప్పటికీ ఫలాలను కాంక్షింపరు కాబట్టి ఈ జీవితానికి బంధరూపంగా పరిణమించే చిక్కులలో పడ కుండా అత్యంత సుఖానుభవాన్నిచ్చే స్థానాన్ని పొందుతారని అర్థం.

సమబుద్ధి అంటే నిర్లిప్తమైన బుద్ధి. కాంతిని వడబోస్తే మడ్డి ఏమీ మిగలనట్లు, ఆపేక్షా వాసనలు లేకుండా స్వచ్ఛమైన మనస్సుతో చేసే కర్మలు, ఏవిధమైన కల్మష ఫలితాన్ని మిగల్చవు.

జగత్తులోనూ, జీవితంలోనూ ఏది జరుగుతున్నా, అది ఈశ్వర చైతన్య కళగానే గుర్తించిన మనస్సు మనస్సుని ఖండించుకొని, బుద్ధిని నిష్కలంకంగా విడిచిపెట్టు తుంది. అప్పుడు సమత్వబుద్ధి ఏర్పడుతుంది. కర్మలవల్ల సంభవమయ్యే ఫలాఫల రూపాలైన ఆశాపాశాలు, అతన్ని బంధించ జాలవు. అన్యమనస్కమైన బుద్ధితో అతడు చేసే అన్ని కర్మలకూ ఫలాకాంక్షలూ, వాటి వాసనలూ దూరంగానే ఉండిపోతాయి. వాటిచేత అతడు ఆ కృష్టుడూ గాడు. అపకృష్టుడూ కాదు.

అటువంటివాడు జన్మబంధములచేత విడువబడతాడు. జన్మబంధాలు అనే మాటను జాగ్రత్తగా అర్థం చేసుకోవాలి. వ్యాఖ్యాతలు జన్మబంధమనే మాటకు, ఈజన్మలో వ్యక్తిచేసిన కర్మల ఫలితములైన వాసనల వలన ఉత్పన్నం కాగల భవిష్య జ్జన్మ పరంపరలని అర్థం చెబుతారు. కాని ఇక్కడ సరియైన అర్థం అదికాదు.

మహాచైతన్యానికి స్వరూప భావనవలన ఏర్పడిన బంధరూపమైన పరిమిత దశగానే దాన్ని అర్థం చేసుకోవాలి. జలత్వంలో తరంగత్వం, తరంగత్వంలో జలత్వం ఏవిధంగా అన్యోన్యాశ్రయాశ్రయీ భావాలతో ఉంటాయో అలాగే జీవాత్మ పర మాత్మతో పరమాత్మ జీవాత్మతో ఓతప్రోత సంబంధాలు కలిగే ఉన్నారు. పరమాత్మ చైతన్యానికీ సృష్టికీ ఈ ఓతప్రోత సంబంధం ఉన్నదని బృహదారణ్యకాది ఉపనిషత్తులు చెప్పుతున్నాయి.

మహాచైతన్యంలో వ్యక్తి చైతన్యరూపం బండఱాతిలో అంతర్హితంగా అవ్యక్తంగా, అవ్యాకృతంగా ఉన్న ప్రతిమా రేఖలా గుప్తంగా ఉంటుంది. శిల్పికి బండ ఱాతిలో ప్రతిమ కన్పించినట్లే ఆత్మ దృష్టికి నిరాకారమైన మహాచైతన్యంలో ఎలా తాను భావిం చుకుంటే అలా సృష్టిరూపాలన్నీ ద్యోతకాలవుతాయి. అలా భావన చేసుకోవడం ఆత్మ సహజలీల. సృష్టిగా తనను భావించికొని పరమాత్మ సృష్టి అవుతున్నాడు. నిజస్వరూప భావనచేత ఆనందచిద్ఘనుడూ అవుతున్నాడు. పరమార్థమయమైన నిర్వికార బ్రహ్మయే సవికారమైన సృష్టి అవుతున్నాడు. నిర్వికారుడు సవికారుడు ఎలా కాగలడనే శంక వాచ్యార్థ శంకయే. అన్ని వికారాలూ ఆయనవే కనుక ఆయన నిర్వికారుడు అనే అర్థంలో యథార్థ సత్యం బోధపడుతుంది.

ఈ సవికారదశలో అనంతకోటి ప్రాణి జనన మరణాలను మహాచైతన్యం తానే అనుభవిస్తుంటుంది. ఈ ప్రాణులూ వాటి జన్మమరణాలూ అలౌకికమైన ఈ మహా చైతన్యం యొక్క అవయవ స్పందనాలే అవుతాయి. ఈ మహాచైతన్యం సృష్టిలోని అన్ని జీవులూ, వస్తువులూ, సంఘటనలూ, సర్వత్వంగా తనను భావించుకుంటూ ఆనం

దిస్తూ ఉంటుంది. పరిమితికిలోనైన చైతన్య వికారమే దానికి బంధనమని ఆలం కారికంగా చెప్పుకుంటున్నాం. దానిని నిరూపించగల భాషలేదు.

జలంలో ద్రవత్వం జలానికి ధర్మం. ఘనత్వం దానికి బంధం: బంధానికి లోబడి అది మంచుగడ్డగా అవుతుంది. జన్మ మరణాలు కూడా సవికారమైన పరమాత్మ చైత న్యానికి బంధాలే. జలంలో ద్రవత్వ ఘనత్వాలలా. చిదాకాశంలో చిదాకారమే జగ ద్రూపకంగా, జనన మరణ సంఘటనలుగా, జీవుల కథలను నాటకమాడుతున్నది. ఏ కారణంచేత ఆ చిదాత్మ, తననే రంగభూమిగా చేసుకొని, ఈ జనన మరణాది రూపకమైన చితి మనోఘన జగత్తులను భాసింపజేస్తున్నదో, ఆ కారణంచేతనే శ్రుతులు చైతన్యం చేతనే ఈ జగత్తు రచింపబడుతున్నది అని ఘోషిస్తున్నాయి. పరిమిత స్వభావంగల సృష్టి ఇయత్తకూ, అపరిమిత స్వభావంగల మహాచైతన్య సత్తాకు, భేదం లేదు. రెండూ సమానమైనవేకాక అవి రెండు చివరలుకల ఒకటి కూడా! ఈ సమానత్వాన్ని గుర్తించడమే యోగముగా గీతాచార్యుడు చెప్పుతున్నాడు. ఏ ఒక్క భాగం జనన మరణాది వికారాల నొందవలసి వచ్చినా సృష్టి అంతటిమీదా దాని ప్రభావం పడుతుంది. సృష్టి అంతా కలిసే ఆ వికారాన్ని పొందుతుంది. వ్యావ హారికంగా మనకలా అనిపించదు.

జగత్తంతా సమకూడితేకాని ఏ ఒక్క పనీ జరగదు అన్నాను. సూర్యకుటుం బంలో భూగోళం తన నియత పరిధిలో నిరాఘాటంగా తిరగ గలగడానికి, మిగతా అన్నిగోళాల ఆకర్షణలూ పనిచేస్తాయి. ఏ ఒక్క గోళం వికర్షణ ఎక్కువయినా తక్కు వయినా, భూగోళం ఇలా నిలవదు. తనకు వచ్చే భూకంపాన్నే అది తట్టుకోలేదు. ఇలా ఇది నిలవకపోతే మనమూ నిలవం.

చంద్రుడు తనకున్న పరిధి రేఖను విడిచి ఒక మిల్లీమీటరు భూగోళంవైపుకు జరిగితే సముద్రాలుప్పొంగి జలప్రళయం వస్తుంది. ప్రళయం వస్తే కథ కంచికే కదా!

సూర్యుని కిరణాల వేడిని అయోనీ మండలం సగానికి సగం ఆహరించకపోతే భూపరితలం మీది సృష్టి అంతా భస్మీపటలం అయిపోతుంది. ఇంత పెద్ద పెద్ద ప్రసంగం అనవసరం. ప్రొద్దున పాలవాడు పాలుతేవడం ఆలస్యమైతే, పనిమనిషి రాకపోతే, ప్రాణం మంచం మీదినుంచి లేవదు. ఎలక్ట్రిసిటీ బందై బల్బు వెలక్కపోతే లోకానికి కళ్ళుపోతాయి. ఏ పనీ జరగదు. పంపులోకి నీళ్ళు రాకపోతే గొంతెండి గోలపెడతాం.

ఎన్ని పరకీయ విషయాల నాధారంగా చేసుకొని, సాలెపురుగు దారంమీద ఉన్నట్లుగా, ఈ ప్రాణి బ్రతుకుతున్నదో మనం నిత్యజీవితంలో గుర్తించం. అంతా

మన బహుదూరీతనమే అనుకొని లోకాన్ని మనమే సృష్టించినట్లు భావిస్తాం, జ్ఞాని అట్లా అనుకోడు.

తన జీవితానికి జగమంతా ఆస్కారమౌతున్నదని గుర్తించి, తన జీవితాన్ని ఇతర జీవితాలతో కలిపేసుకుంటాడు. అందఱూ సహాయపడుతున్నారు గనుకనే తానూ పనులు చేయగలుగుతున్నానని గుర్తిస్తాడు. అందఱితో తననైక్యం చేసుకుని, తను చేసే ప్రతి పనీ అన్ని నేనుల హస్తాల నుండి వెడలిన కృషిగా గ్రహిస్తాడు. అన్ని జన్మలతోనూ అతని జన్మ ఐక్యమైపోతుంది. అహంకార రూపమైన జన్మల బంధం అతనికి సమాప్తమవుతుంది. అనుభవంవల్ల ఈ సంగతిని గుర్తించిన వానికి జీవన్ముక్తి కలిగి నిత్యకళ్యాణ స్థానం లభిస్తుంది. ఈ శ్లోకాని కర్థం చెబుతూ జ్ఞానులు ఈ జన్మలోనే ముక్తి పొందుతున్నారన్నారు శంకరులు. బుద్ధియోగంతోకూడి ఫలాసక్తిలేని కర్మలు చేసే వాళ్ళనుగూర్చి ఈ శ్లోకం చెబుతుంది అన్నారు రామానుజులు.

యోగంతో కూడిన కర్మ సాధనం, జ్ఞానం
మోక్ష సాధనమన్నారు మధ్వాచార్యులు.

52. యదా తే మోహ కలిలం బుద్ధి ర్వ్యతితరిష్యతి
తదా గంతాసి నిర్వేదం శ్రోతవ్యస్య శ్రుతస్యచ॥

తా: మోహమనే చిక్కునుంచి ఎప్పుడు నీ బుద్ధి దాటి బయటబడుతుందో, అప్పుడు వినవలసిన దాన్నిగూర్చి, విన్నదాన్ని గూర్చి నీకు విరక్తి కలుగుతుంది.

వ్యా: మోహకలిలమ్ - కలిల మంటే ఏమిటి? కల్యతే క్షిప్యతే మతిరత్రేతి కలిలం- 'కలకిలక్షేపే'

- అంటే మతిని బయటికి తోసేసేది అని అర్థం. ఎంతవఱకు ఇంద్ర ధనుస్సులాగా ఇల్లూ, డబ్బూ, కామినులూ కనిపిస్తుంటారో బుద్ధి పెడదారి బట్టి నడిచిపోతుంది. బుద్ధి ఎదుటిదాన్ని శ్రద్ధగా చూస్తుంది. అయిపోయిన దానిని రావలసిన దానిని అంతశ్రద్ధగా చూడదు, నమ్మదు. శ్రోతవ్యం అంటే వినదగినది. ఉచితంగా లేకపోతే మానెయ్యొచ్చు కూడాను. విన్నది విన్నదే. భూతకాలంలో కలిసి పోయింది. శ్రోతవ్యశ్చ శ్రుతస్యచ - అభిప్రాయం ఇది. బుద్ధి మలినంగా ఉన్నంతసేపు ఏది విన్నా తలకెక్కదు. తలకెక్కిన తరువాత, విన్నది వినవలసినది కూడ బుద్ధి అంతా వివేకంతో నిండి ఉండడంచేత ఇక వినదగినది లేదనిపిస్తుంది. అవసరమైనదంతా వినేశాడు మళ్ళీ విననక్కరలేదనిపిస్తుంది.

53. శ్రుతి విప్రతిపన్నా తే యదా స్థాస్యతి నిశ్చలా
సమాధా వచలా బుద్ధి స్తదా యోగ మవాప్స్యసి॥

తా: శ్రుతుల చేత కలవరపెట్టబడిన నీ మనస్సు ఎప్పుడు సమధిగతమై నిశ్చలంగా, స్థిరంగా నిలిచి ఉంటుందో అప్పుడు నీవు యోగాన్ని పొందగలవు.

వ్యా: 1. శ్రుతుల చేత ఏవిధంగా మనస్సు కలవరపెట్టబడుతుంది.

2. సమాధి అంటే ఏమిటి?

3. యోగమంటే ఇక్కడ ఎలా సరిపోతుంది?

శ్రుతులు పరమాత్మను గూర్చి చెప్పుతాయి. సంసారాన్ని గూర్చి కూడా చెప్పుతాయి. సంసారంలో జీవితాన్ని ఎలా నడిపిస్తే సంసారికి పరమాత్మకు ఐక్యత ఎలా కలుగుతుందో ఆ పద్ధతులూ చెప్పుతాయి. శ్రుతివాక్యాలు సూత్రప్రాయంగా ఉంటాయి. వాటికి వ్యాఖ్యానప్రాయంగా అందఱికీ అర్థం గావడానికి బ్రాహ్మణాలకూ, ఉపనిషత్తులకూ మతాచార్యులు భాష్యాలు వ్రాశారు.

ఇది ఒకటేకాదు, ఇది ఒకటేకాదు. అంటూ అంతా అదే అంటుంది అద్వైతం.

బొమ్మలో కూడా రెండు వేళ్ళూ విడిగా చూపిస్తూ జీవాత్మవేలు, పరమాత్మ వేలు అంటారు మధ్వాచార్యులు.

పండు మొత్తం అద్వైతం. తొక్కవేలూ పండు వేలూ అయితే విశిష్టాద్వైతం.

షడ్దర్శనాలూ వేలువేలుగా పరమాత్మను నిరూపిస్తాయి. ఆస్తిక దర్శనాలు వేలు, నాస్తిక దర్శనాలు వేలు. చివరకు ఉపనిషత్తుల్లో అల్లా ఉపనిషత్తు కూడా ఉంది.

ఈ వైదిక విజ్ఞానమనే మహారణ్యంలో పరమాత్మ స్థానం ఎక్కడ ఎలా ఉన్నదని సాధకుడు నమ్మాలి? ఒక మతకర్త ఇంకో మతకర్త వాదాన్ని ఖండిస్తాడు. పుత్రాత్మ వాదుల్ని దేహాత్మవాదులూ, దేహాత్మ వాదుల్ని ఇంద్రియాత్మ వాదులూ, ఇంద్రియాత్మ వాదుల్ని ప్రాణాత్మవాదులూ, ప్రాణాత్మవాదుల్ని బుద్ధ్యాత్మవాదులూ, అజ్ఞానాత్మ వాదుల్ని జ్ఞానాత్మవాదులూ ఖండిస్తారు. ఇందులో చాలామంది శ్రుతివాక్యాలనే తమ వాక్యాలకు, వాదాలకు, ప్రమాణంగా తీసుకుంటారు. నాస్తికవాదులు ఏ ప్రమాణాన్ని అంగీకరించరు. ఈ అందఱి మధ్య పామరుడు శ్రుతివిప్రతిపన్నబుద్ధిగా తయారౌతున్నాడు.

మఱి వీడికి దారి ఏమిటి? ఆ బుద్ధి చలించకుండా ఎలా సమాధిగతమై నిలిచి ఉంటుందీ, సమాధావచలాబుద్ధి అన్నారు పరమాత్మ. సమాధి అంటే ఏమిటి? 'యమేవైషవృణుతే తేనలభ్యః' 'మత్ప్రసాదాత్తరిష్యసి' ఇలాటి వాక్యములు. సమాధి అనేమాట

చాలాచోట్ల వస్తుంది. అందువలన సమాధి పదానికీ టూకీగా అర్థం వ్రాయడం మంచిదనిపిస్తున్నది. బ్రహ్మానంద రసాస్వాదగుణకమయిన స్థితిని సమాధి అంటారు. శ్రవణమనన నిదిధ్యాసలకు అది కడపటి మెట్టు. ఈ భూమికలోనే పరమేశ్వర సాక్షాత్కారం కలుగుతుంది.

సమాధులనేక విధాలుగా ఉన్నాయి. ముఖ్యమైనవి (1) సవికల్ప సమాధి (2) నిర్వికల్ప సమాధి.

సవికల్పమంటే వికల్పాలతో కూడుకున్నది. జ్ఞానం, జ్ఞేయం, జ్ఞాతం. ఈ మూటినీ వికల్పాలంటారు. వికల్పాలతో కూడుకున్నది సవికల్పం. వికల్పాలే త్రిపుటి; పరమాత్మ సాక్షాత్కారంతో బాటు త్రిపుటి కూడా ఇందులో గోచరిస్తూ ఉంటుంది.

సవికల్ప సమాధి మళ్ళీ రెండు విధాలు.

(1) దృశ్యానువిద్ధం, (2) శబ్దాను విద్ధం.

కామక్రోధాధి చిత్తవృత్తులు ఆత్మకంటే భిన్నంగా గోచరించేవి కాబట్టి వాటిని దృశ్యాలు అంటారు. అవే శబ్దవృత్తులై నేను, నాది, ఇది అనే మనోవృత్తులకు లక్ష్యాలయితే శబ్దగతాలవుతాయి. ఇట్టి దృశ్యభావాలూ, శబ్దభావాలూ పరమేశ్వర సాక్షాత్కారంతో బాటు గోచరిస్తున్నప్పుడు దృశ్యాను విద్ధ శబ్దానువిద్ధ సమాధుల విభజన ఏర్పడుతుంది.

2. నిర్వికల్ప సమాధి

సంకల్ప వికల్పాలు లేకుండా ఆత్మతో ఆత్మను రమించే స్థితి.

జ్ఞాతృజ్ఞానాలు ఇందులో వికల్పాలు. బుద్ధికే జ్ఞేయమైన బ్రహ్మంతో లీనమైపోయి వికల్పద్వయాన్ని విడిచిపెట్టేస్తుంది. కాబట్టి దీన్ని నిర్వికల్ప సమాధి అంటారు. బ్రహ్మంతో కలిసి ఉంటుంది కాబట్టి ఈ నిర్వికల్ప సమాధినే యోగమూ అని కూడా అంటారు. సవికల్పంలో జాతృజ్ఞాన వికల్పద్వయ రూపమైన బుద్ధి వృత్తి ఉంటుంది. నిర్వికల్పంలో ఆ బుద్ధి వృత్తి ఉండదు. ఇదే భేదం. ఇక మిగిలిన సమాధుల స్వరూపాన్ని గూర్చి కూడా సంక్షేపంగా చెపుతాను.

నాదాను సంధానరూప సమాధి

సదాశివుని చేత చెప్పబడ్డ లయ యోగ విధానాలు ఒక లక్షా పాతికవేలు ఈ లోకంలో ప్రచారంలో ఉన్నాయి. వాటిలోకల్లా నాదానురూప సమాధి శ్రేష్ఠమయినది.

రేచక పూరక కుంభకాలవల్ల నాడులు పరిశుద్ధములౌతాయి. అప్పుడు అనాహత పద్మం వికసిస్తుంది. దానిలోనుంచి ఆత్మ లాభోపాయమైన తత్వజ్ఞానం స్వయం

గా వికసిస్తుంది. దానివలన మనస్సు ప్రాణంతో కలిసి విష్ణుపదంలో (బ్రహ్మంలో) విలీనమౌతుంది. ఇదే నాదాను సంధాన రూపసమాధి.

4. సహజ సమాధి

రాజయోగ ప్రభావంవల్ల, సమస్త దృశ్యవస్తువులనూ విసర్జించి, నయనేంద్రియాన్ని జయించినప్పుడు, జాగ్రచ్ఛుషుప్తులుగాని, జీవన మరణాలుగాని లేని ఒక విచిత్రస్థితి సంభవిస్తుంది. వారికి ఉన్మేష నిమిషాలు ఉచ్ఛ్వాస నిశ్వాసాలు, 'అవును, కాదు' అనడాలూ, ఈ స్థితిలో ఉండవు. జగత్తు వారికి ఉండీ లేనట్లే ఉంటుంది. అహంకార మమకారాలు, శిథిలీభావాన్ని పొందుతాయి. వారు అమస్కస్థితిని ప్రాప్తించి, మనస్సుకు అతీత మైన, వాయువృత్తి రహితమైన ఆకాశభావాన్ని పొందుతారు. దీన్ని సంవిన్మయ సహజావస్థ అనీ, మనోన్మనీ స్థితి అనీ అంటారు. వీరు సమాధి స్థితిని పొందడానికి ప్రయత్నించరు. వారికది సహజంగానే ఉంటుంది.

అట్టివారు సర్వకాల సర్వావస్థల యందూ సహజమయిన సహనంలో ఉంటారు. వారికి నిశ్శబ్దంలో అన్ని శబ్దాలు వినబడతాయి. అంతా ఆత్మగానే తోస్తుంది. లోపల ఏదో వెలుపలా అదే ఉంటుంది. వీరికి మనమంతా ఆత్మకు ప్రతి రూపులమై కనబడతాము. వారిది ఏమీ తెలియని అంతా తెలిసిన సంపూర్ణ స్థాయి స్థితి. వారు తటస్థులై సాక్షిమాత్రులై జగత్తును చూస్తూ పరమాత్మలోనే లయమై ఉంటారు. దేహభావం వారికుండదు. వారి కళ్ళలోకి మనం చూస్తే అవి చుట్టూ జరుగుతున్న సంఘటనలను ఏవీ చూస్తున్నట్లూ గమనిస్తున్నట్లూ కనిపించవు. కాని వారికి తెలియని విషయమంటూ ఉండదు. వారి దృష్టిని దేనివైపుకైనా ఆకర్షించ డానికి ప్రయత్నం కావాలి. అప్పుడైనా వారు ఏదో నిద్రలోనుంచి, ఏదో స్వప్నంలో నుంచో, మేలుకొని మనలోకి వస్తున్నట్లు వారి కన్నులలో వచ్చే మార్పులు మనకు బోధిస్తాయి.

దీన్ని సహజ సమాధి అంటారు. ఇదే అమ్మ ఉండే స్థితి. పుట్టుకతోనే ఈ యోగం వ్యక్తికి అబ్బవచ్చు. అంటే గర్భస్థ శిశువుగా కూడా అదేస్థితిలో ఉండవచ్చు.

5. భావసమాధి

పరమేశ్వర భావస్ఫురణ కలిగినప్పుడు నిత్యమూ తన్నుదాను మఱచిపోయి, తాను భావించుకొన్న గుర్తుతో ఐక్యమై పోవడం. రామకృష్ణ పరమహంస దీనికి తార్కాణం. కాళీమాత అతనికి ఎంత తీవ్రంగా ధ్యేయవస్తువయిందంటే, దేవిని గూర్చి ఎప్పుడు మాట్లాడుకున్నా, పరమహంస సమాధిలోకి వెళ్ళిపోయి, రోజుల పర్యంతం

అలా పడి ఉండేవారు. తెలివి వచ్చిన తరువాత మళ్ళీ అలాంటి సన్నివేశం మళ్ళీ ఏదివచ్చినా, సమాధిలోకి వెళ్ళిపోతూ ఉండేవారు. ఆ సమాధి స్థితిలో జగదంబను ఆయన స్వయంగా దర్శింపగలిగేవారు. విచ్ఛిన్నరూపంగా వస్తున్న ఈ సమాధ్యవస్థ లతో ఆయనకు తృప్తికలుగక అదే అవస్థలో సర్వకాలమూ ఉండిపోదామని ప్రయత్నం చేశారు. ఆయన, అలాంటిస్థితిలో ఉండగా మధ్య మధ్య ఆయన అహం భావం లుప్తమైపోతూ ఉండడం వల్ల ఆయన శరీరంమీద మృత్యుచిహ్నాలు వచ్చేవి. అహం భావం కేవలం అల్పాంశంగా ఉన్న కొన్ని వేళలందు ప్రాణచిహ్నాలు కని పించేవి. ఆరునెలలు ఈవిధంగా జీవన్మృత దశలలో ఊగులాడే సమాధిలో గడపిన పిదప నీవు భావముఖుడవై నన్ను సేవిస్తూ ఉండవలసిందని అమ్మ వాణి విని పించింది. అప్పటి నుండి ఆయన భావ సమాధిలోనే ఉంటూ వచ్చారు.

భావ సమాధిలో పరిపక్వమైన విరాడహంకారం ఉంటుంది. అందుకనే రామకృష్ణులిలా చెబుతూ ఉండేవారు.

"సోదరులారా! నేను వీడి కొడుకును. నేను వీడి తండ్రిని, నేను బ్రాహ్మణుడిని. నేను శూద్రుడను. నేను పండితుడిని. నేను ధనవంతుడిని. ఇలా ఉండేది క్షుద్రమైన అహంకారమ. ఇది మనుష్యుడికి బంధనమౌతుంది. ఇలాంటి అహంకారాన్ని పరిత్యజించాలి. నేను భగవంతుడి దాసుడను. నేను ఆయన భక్తుడను. నేను ఆయన సంతానాన్ని. నేను ఆయన అంశాన్ని. ఇలా ఉండేది పరిపక్వమైన అహంకారం. ఇటువంటి అహంకారం మోక్షదాయకమైనది. "ఈ భావ సమాధినే నిర్బీజ సమాధి అని కూడా అంటారు. ఇంకా పతంజలి యోగసూత్రాలలోనూ, ఇతరత్రానూ, సవి తర్క, నిర్వితర్క, సవిచార, నిర్విచార, అసంప్రజ్ఞాత, సమాధి భేదాలు అనేకం చెప్ప బడ్డా. ఇవన్నీ మానసిక శిక్షకూ, బుద్ధిశిక్షకూ సంబంధించినవి. కాని జీవిత శిక్షకు సంబంధించిన మఱొక్క విలక్షణమైన సమాధిని గీతాచార్యులు చెప్పి ఉన్నారు. నాలుగో అధ్యాయం 24వ శ్లోకంలో

బ్రహ్మార్పణం బ్రహ్మహవి ర్బ్రహ్మాగ్నౌ బ్రహ్మణాహుతమ్
బ్రహ్మైవ తేన గన్తవ్యమ్ బ్రహ్మకర్మ సమాధినా।

6. ఇది గీతాకారుడు సృష్టించిన కర్మ సమాధి

అంతా అదే బ్రహ్మపదార్థం అని కృష్ణపరమాత్మ చెప్పారు. ఈ భావనతో చేసిన ప్రతి పనీ బ్రహ్మకర్మమే. జీవితమంతా యజ్ఞమే. యజ్ఞకర్తా, యజ్ఞ భోక్తా, యజ్ఞమూ,

హవిస్సూ, హోమాగ్నీ, అంతా బ్రహ్మ కంటె వేఱుకాదు. బ్రహ్మకర్మ సమాధిలో పర బ్రహ్మాన్ని పొందవచ్చును. కర్మకూడా సమాధియే అని చెప్పబడింది. సమాధి అంటే ప్రాణాయామ ప్రత్యాహార ఉచ్ఛ్వాసనిశ్వాస నిరోధాదులక్కరలేదనీ, శ్రవణమనన నిదిధ్యాసాదులక్కర లేదనీ, శవ వత్స్థితీ, నాడులూ, ప్రశాంతీ, చిత్తశమనమూ, అక్కర లేదని, బ్రదికి ఉండగానే, పరమేశ్వరుడే నా చేత ఈ పనులు చేయిస్తున్నాడని త్రికరణ శుద్ధిగా నమ్మిచేసిన పనులు కూడా సమాధిస్థితికి చేరుతాయనీ పరమాత్మ బోధించాడు.

అటు వంటి. కర్మ సమాధిస్థితిని పొందిన వాడికి భగవత్సాక్షాత్కారం ఒక పెద్ద ఘనత కాదు, పుండరీకుడికి భగవత్సాక్షాత్కార మైనప్పటికీ అలా పాండురంగ విఠలుని ఇటుకఱాతి మీదనుంచో బెట్టి తన మాతా పితరులసేవ చేసుకొని పోయాడు. ఇదే నిష్కామ కర్మలో ఇమిడి ఉన్న పరబ్రహ్మాభావం. అమ్మ ఆచరించిన కర్మయోగం కూడా ఇదే.

యోగం అంటే ఏమిటి- ఈ ప్రశ్నకు ఎన్నిసార్లు వ్రాసినా సమాధానం సరి పోదు. జీవన్ముక్త దశ అది. అంటే దేహం ఉండగానే దేహ బంధనాల నుండి మానసిక బంధనాల నుండి విముక్తి. ఐహికాన్ని ఆముష్మికంతో సమానంగా చేసుకున్నవాడు యోగి. ఉన్మత్తవత్, పిశాచవత్ వ్యవహరించే వాళ్ళైనా జనకాది మహా యోగిజనులను ఏవిధంగా ప్రపంచ కల్యాణానికి పాటుబడ్డారో అలాగే కర్మయోగులై నడుచుకోమని, పరమాత్మ బోధించారు. కృష్ణ పరమాత్మ యోగీశ్వరుడు కనుక కర్మసమాధిభావాన్ని యోగతుల్యంగా చేసి నిత్యజీవన కల్యాణ బలవర్ధకౌషధంగా అందించగలిగాడు.

సిద్ధాంత రీత్యా ఇంతవఱకు చెప్పిన తత్త్వమంతా బాగానే ఉంది కాని, ఇటు వంటి తత్వాన్ని జీర్ణించుకొని జీవితాన్ని నడిపే పురుషుడు ఎలా ఉంటాడు - ప్రపంచంలో అతని నడనడి ఎలా ఉంటుందో తెలుసుకోవాలనుకున్నాడు అర్జునుడు.

అర్జున ఉవాచ

అర్జునుడన్నాడు

54. స్థితప్రజ్ఞస్య కా భాషా సమాధి స్థస్య కేశవ!।
స్థితధీః కిం ప్రభాషేత? కిమాసీత? వ్రజేత కిమ్?॥

తా॥ స్థితప్రజ్ఞుడనీ, సమాధిస్థుడనీ చెప్పబడే ఆ మహనీయుని లక్షణాలేమి? అతని సమాధి ఎటువంటిది? అతడేవిధంగా మాట్లాడుతాడు. ఎలా కూర్చుంటాడు? ఎలా సంచరిస్తాడు?

వ్యా: ఇంతవఱకు కృష్ణ పరమాత్మ చెప్పినది ఆత్మను గూర్చిన వ్యాఖ్యానం; అట్టి ఆత్మవంతుడికీ లోకానికీ నిత్య సంబంధాలు - వ్యవహారాలు ఏ విధంగా ఉంటాయని అర్జునునకు సందేహం వచ్చి వెంటనే అడిగేశాడు.

స్థితప్రజ్ఞ పదం క్రొత్తగా దొర్లినమాట. అర్జునుని నోటినుంచి ఊడిపడ్డది. ఇంతవఱకు పరమాత్మ చెప్పిన అశరీరతత్వాన్ని వడబోసి చూస్తే మిగిలేవాడు సమాధిస్థుడైన స్థితప్రజ్ఞుడే. కాని అతడు అందఱు దేహధారుల మాదిరిగా ఉండేవాడుగా అర్థంకావడం లేదు. అసామాన్య ప్రతిభావంతుడైన అతని లక్షణాలెలా ఉంటాయి? ఎలా కూర్చుంటాడు? ఎలా సమాధిలో ఉంటాడు? ఎలా మాట్లాడుతాడు? ఎక్కడకు వెళ్ళుతాడు?

శ్రీ భగవానువాచ

55. ప్రజహాతి యదాకామాన్ సర్వాన్ పార్థ! మనోగతాన్।
ఆత్మన్యే వాత్మనా తృప్తః స్థితప్రజ్ఞ స్త దోచ్యతే॥

పరమాత్మ చెప్పెను.

తా: మనోగతాలైన కామాలనన్నింటినీ త్యజించి ఆత్మయందాత్మతో సంతుష్టి చెందేవాడు స్థితప్రజ్ఞుడని తెలియబడతాడు.

వ్యా: 'స్థితప్రజ్ఞస్య కా భాషా' అనే అర్జునుడి ప్రథమ ప్రశ్నకు పరమాత్మ సమాధానం చెబుతున్నారు.

మనోగతాలైన కామాదులన్నింటినీ త్యజించడమంటే ఏ కోరికా లేకుండా ఉండడంకాదు. కోరిక ఏదీ తనదే అనుకోకుండా అందఱి కోరికలూ తన వాటి లాగానే అనుకోడం. సమష్టిలో వ్యష్టిత్వం మాసిపోవడం.

'ఆత్మన్యేవాత్మనే తుష్టః' అనే మాటకు చక్కటి అర్థం ఉంది. ఆత్మకు శరీరం అని కూడా అర్థం.

'శరీరం కూడా ఆత్మ కాక పోదు'

ఆత్మ పదానికి జ్ఞానమనీ అర్థం ఉంది. ఆత్మయం దాత్మచేత తృప్తి పొందడమనేది అనుభవైకవేద్యమే కాని వాచ్యంగా చెప్పదగింది కాదు. మనస్సుతో మనస్సును గుర్తించడం లాంటిది. కామాలు శరీరాన్ని మనస్సునూ అంటిపెట్టుకుని ఉంటాయి. శరీరమూ మనస్సు ఆత్మలో కరగిపోయినప్పుడు ఇతర కామాల ప్రసక్తి ఉండదు. ఉండేదల్లా సంతుష్టి ఒక్కటే.

శరీరమూ మనస్సూ ఎలా ఆత్మలో విలీనం అయిపోతుందో రెండు ఉదాహరణల ద్వారా వివరిస్తాను.

రామకృష్ణ పరమహంస ఒక ప్రశాంతమైన సాయం సమయాన పచ్చని పచ్చికతో నిండిన ప్రాణవంతమైన ఒక మనోహర ప్రదేశంలో కూర్చుని విశ్రాంతి తీసుకుంటున్నారట. అస్తమిస్తున్న సూర్యకాంతిలో వింతరంగులీనుతూ ప్రాణ వికాసాన్ని ఒలికిస్తున్న ఆ దృశ్యంతో ఆత్మతః పరమహంసలీనమైపోయి, తాదాత్మ్యంతో ఉండిపోయారు. అంతలో ఎవరో ఒక మనుష్యుడు ఆ పచ్చికమీది రామకృష్ణుని కెదురుగా, ఒకవైపు నుంచి మఱొకవైపుకు నడచిపోయాడు. రామకృష్ణులు దుర్భరమైన బాధ ననుభవించారు. శిష్యులు కారణమడుగగా ఆ మనుష్యుడు తన గుండెల మీది నుంచియే నడచిపోయినట్లు తనకనుభవమైనదని పరమహంస చెప్పారు. పరమహంస గుండెలమీద ఆ మనుష్యుని అడుగుల గుర్తులు కనిపించాయి. (2) మఱొకసారి రామకృష్ణులు గంగానది ఒడ్డున ఒక మందిరంలో కూర్చుని నీటిలో తేలియాడుతున్న నావనూ, తరంగాల సౌందర్యాన్నీ చూస్తూ ఆ దృశ్యంతో తన్మయత్వం చెందిపోయారు. ఇంతలో ఇద్దఱు బెస్తవాళ్ళు ఆ నావలోకి వచ్చి దెబ్బలాడుకోవడం మొదలుపెట్టారు. కొంత సేపటికి వాళ్ళిద్దఱూ కఱ్ఱలతో బాదుకోవడం ఆరంభించారు. మందిరంలోని పరమహంస బిగ్గఱగా బాధామయంగా కేకలు వెయ్యనారంభించారు. శిష్యులు వచ్చి చూడగా రామకృష్ణుని వీపు కండెలు కట్టి రక్తమోడుతూ కనిపించింది. పరమహంసది 'ఆత్మన్యేవాత్మనా తుష్ట స్వభావం.

స్థితప్రజ్ఞాపదం చాలా అర్థవంతమైనది. విద్యుచ్ఛక్తి సర్వపదార్థాలలోనూ ఉన్నది. కాని అది స్థితిరూపకంగా ఉంటుంది. దానివలన చైతన్యకార్యం జరగదు. ఆ శక్తి చలించి ప్రవాహ రూపమొందితేగాని బల్బులు వెలగవు. పంకాలు తిరగవు. ఇత్యాది కార్యాలు సాధ్యంకావు. పనులుచేసే ప్రవాహ విద్యుత్తు స్థిరవిద్యుత్తు కంటే వేఱుకాదు. యురేనియం అణువులలో నిద్రితంగా ఉండే శక్తిని మేలు కొలిపేటప్పటికి, అది ప్రళయరూపం దాల్చి అణువు బాంబుగా తయారైంది. స్థిరత్వం చరత్వం రెండూ శక్తి లక్షణాలే.

మనశ్శక్తికి, మనోధర్మానికి, మనోబుద్ధుల సంబంధానికి ప్రజ్ఞ అని పేరు. జగద్వ్యాపారాన్ని స్వాయత్తంగా అర్థం చేసుకునే మనశ్శక్తి పేరు కూడా ప్రజ్ఞయే. జాగరిత ప్రజ్ఞుడొక్కనిమేషమైనా ఊరికే ఉండలేడు. ప్రకృతి శక్తుల ఆకర్షణ వికర్షణలూ, అందుకయ్యే ప్రేరణలూ, అతన్ని చబుకుతో బాది, పరిగెత్తిస్తాయి. అట్టి పరుగు పందెమునకే గతి అని పేరు. ఆ గతిలో తగులుకొని ఉన్న ప్రజ్ఞ గతి ప్రజ్ఞ, గతి దార్ఢ్యం

అంతా పరమాత్మ ప్రేరణే. కామములు పరమాత్మ ప్రేరణలే. ఎందుకంటే ఆలోచనలు వస్తున్నట్లే మనకు తెలుస్తుంది కాని అవి. ఎక్కడ నుంచి వస్తున్నాయో మనకు తెలీదు. ఇట్టి చలన దశాకల్లోలాలు, లేకుండా ఉండే ప్రజ్ఞ అంతశ్శీతలత్వాన్ని ఎప్పుడు పొందుతుందో అప్పుడది స్థితప్రజ్ఞ అవుతుంది. స్థిత దశ అంటే నిశ్చేతన దశకాదు. సమాధినొందిన చిత్తదశ. మందుదట్టించి ప్రేలడానికి సిద్ధంగా ఉన్న ఫిరంగి దశ. ఆ దశలో నిత్యజాగృతి నిత్యవిస్మృతి రెండూ ఉంటాయి. అదే స్థితిప్రజ్ఞుని దశ.

మనోగతములయిన అన్నింటిని విడిచిపెట్టినవాడు, తనకంటే వేఱయినదంతా తానే అవి తెలుసుకున్నవాడు. సర్వం తెలుసుకున్న వాడు స్థితప్రజ్ఞుడు.

56. దుఃఖే ష్వనుద్విగ్న మనాః సుఖేషు విగత స్పృహః।
వీత రాగ భయ క్రోధో స్థితధీ ర్ముని రుచ్యతే॥

తా: దుఃఖమునందుద్వేగం పొందనివాడు, సుఖం వచ్చినప్పుడు ఒళ్ళు మర వనివాడు, రాగము, భయము, కోపములను విడిచిపెట్టినవాడు స్థితప్రజ్ఞుడని, ముని అని చెప్పబడతాడు.

వ్యా: దుఃఖం అంటే ఏమిటి? సుఖస్పృహ యే దుఃఖం. ఏ సుఖం లేకపోతుందో దాన్ని తలుచుకుని బాధపడడమే దుఃఖం. దుఃఖం వచ్చినప్పుడు బాధపడనివాడు అంటే వచ్చిన దాన్ని సహించడమని కాదు అర్థం. వాడి కది దుఃఖమనిపించదు. అంతే. ఏడవడం మనస్సుకు తప్పనిదైనా ఏడుపుతో అతనికి సంబంధం ఉండదు. దేనికదే.

దుఃఖానికి చరమ దశ సంతోషం. సంతోషానికి చరమదశ దుఃఖం. బాధ లేకపోతే బ్రతకడం అనవసరం.

తాతగారి మృతదేహం ప్రక్కన కూర్చొని ఉండగా గుంటూరినుంచి వచ్చి నాయన టెంకాయ కొట్టడానికి సందేహించారు.

'దీనికీ దానికీ సంబంధం లేదు. దేనికదే' అన్నదమ్మ.

బాధంటే చైతన్యమే అంటుందమ్మ. అదిలేకపోతే ఏదీలేదు.

నిర్వికల్ప సమాధిలో తల్లి కడుపులో ఉన్న బిడ్డకు సుఖమంటే ఏమిటో దుఃఖ మంటే ఏమిటో తెలియదు కదా. తల్లిగర్భం నుండి బయటబడి లోకంలో భాగంగా కాగానే ఏడుపెందుకు రావాలి? లోకంగా కావడమే దుఃఖం. 'లోకం శోకహతంచ సమస్తం' అన్నారు శంకరులు.

దుఃఖానికి ప్రతిబింబం సుఖం. లోకంకోసం అనారోగ్యాన్ని (ఇతరుల రోగాలను) దుఃఖాన్ని స్వయంగా పైనవేసుకుని సుఖంగా అనుభవిస్తాడు జ్ఞాని.

అమ్మ: "అన్నపూర్ణమ్మ తల్లీ! నువ్వు నా గదిలో ప్రవేశించింది మొదలు నాకు అనారోగ్యం మొదలయింది. నిన్ను తొలగించాలి."

అన్నపూర్ణ: అనారోగ్యాన్ని తొలగించుకోరాదూ!

అమ్మ: దాన్నెందుకూ? తగినవాడు వస్తే నిన్నే తొలగిస్తాను.

1972లో జలందర్‌లో కాప్టెన్ శిష్ట్లా అన్నపూర్ణలను చూచి వాళ్ళ ఆతిథ్యాన్ని స్వీకరించి చాలా ఆనందించాను. మాతృగీతలో కొన్ని భాగాలు వాళ్ళకు చదివి వినిపించాను కూడా. ఈ సంఘటన తలుచుకుంటే 'బాధ లేకపోతే బ్రతకడమనవసర మనే అమ్మ మాట చాలా సంతోషాన్నిస్తుంది నాకు.

When mind takes over the body అనే టి.వి. ప్రదర్శన ఒకటి ఉంది. రోగికి అనెస్తీషియా ఇవ్వకుండా మొలక్రింది భాగాలూ, మోకాళ్ళకూ డాక్టర్లు ఆపరేషన్లు చేస్తుంటారు. రోగి నవ్వుతూ పరాయి వాళ్ళతో మాట్లాడుతూ ఉంటుంది.

దుఃఖం వచ్చినప్పుడు సుఖాన్ని నెమరువేసుకోకుండా సుఖం వచ్చినప్పుడు ఒళ్ళు మరచిపోకుండా రెంటినీ కల్పించే మనస్సును అతిక్రమించే వాడిని, వీటికి బానిసలైన రాగము, భయము, క్రోధము అవే చప్పబడి విడిచిపోతాయి.

రాగం అంటే తన కొఱకు చేసేది. భయమంటే రెండు లేవని తెలియకపడే సంకుచితత్వం. క్రోధం అవతలివాడు నాశనమయ్యే వఱకూ చేసే సాధింపు.

ఈ మూడు భావాలూ విడిచిపెట్టిన మనస్సు. బుద్ధికలవాడు, స్థితప్రజ్ఞుడు. అలాటి వ్యక్తియే ముని. వీతరాగ భయక్రోధత్వం కేవలం పరిమితంగానే ఉండేదా? లేక సంసార పర్యాప్తంగా ఉండేదా? అంటే.

57. యస్సర్వత్రానభిస్నేహ స్తత్త త్ప్రాప్య శుభాశుభమ్।
నాభి నందతి న ద్వేష్టి తస్యప్రజ్ఞా ప్రతిష్ఠితా॥

తా: జీవితంలో తమంతట తామే ప్రాప్తించే శుభాశుభాలను అభినందించిగాని, ద్వేషించిగాని, కల్లోలితుడు గాకుండా ఎల్లయెడలను తగులుబాటు లేకుండా ఎవడుండగలడో, వాని ప్రజ్ఞ స్థిరంగా ఉంటుంది.

వ్యా: భగవంతుని అనుగ్రహ విలాసంవల్లనే శుభాశుభాలు, సుఖదుఃఖాలు కలుగుతాయనే సత్యాన్ని, తత్తత్ప్రాప్య అనే మాటలు తెలియజేస్తాయి. తన ప్రమేయం

లేకుండా వచ్చిన సుఖాసుఖాలకు తన కర్తృత్వాన్ని ఆరోపించడమే సంతోషద్వేషాలకు బీజమౌతుంది. అంతా పరమాత్మయే. అతని ప్రేరణవలననే తన ఉద్ధారణ కోసమే ఈ సుఖమూ దుఃఖమూ వచ్చాయని అనుకోడంవల్ల వాటివలన కలిగే సంతోషద్వేషాలు దూరంగా ఉండిపోతాయి. భర్తృహరి చెప్పినట్లు

ఏల పరిభ్రమించెద వనేక విధంబుల వెఱ్ఱిచిత్తమా!
తాలిమి విశ్రమింపు మొకతావున యత్నము లేకయే యగున్
మేలును కీడు నే దలప మించిన కార్యము భావికార్యమున్
లాలస వృత్తి గోర విధిలబ్ధ ఫలంబుల నే భుజించెదన్

సర్వత్ర ఒకేరీతి అయిన స్నేహం ఉండడానికీ, సర్వత్ర అనభిస్నేహం ఉండడానికీ, భేదం ఏమీలేదు. సర్వత్రా ఏకరూపమైన భావాన్ని కలిగి ఉన్నవాడు, ఏ సంఘటన వచ్చినా, అది పరమాత్మ తన బాగుకోసం పంపిన దాన్ని లాగానే భావిస్తాడు. అటువంటివాడు పండితుడు. అటువంటి మనుష్యుని ప్రజ్ఞ స్థిరంగా ఉంటుంది.

చక్షురాదీంద్రియ జ్ఞానాన్నే ప్రజ్ఞ అంటారు. వివిధ వ్యక్తుల అధికార భేదాలను బట్టి ఈ ప్రజ్ఞ కూడా హెచ్చు తగ్గులుగా ఉంటుంది. ఆయా వ్యక్తులు పెంచుకునే లాలసనూ, అహంతనూ బట్టి అది చంచలంగా కూడా ఉంటుంది. లాలస విడిపోయి చాంచల్యం దూరమైననాడు ఆ ప్రజ్ఞ మనుష్యుడిలో ప్రతిష్ఠితంగా ఉంటుంది. అటువంటి స్థితప్రజ్ఞుడు జనులందరితోను ఐక్యభావుడై ఉంటాడు. అమ్మ ఒడిలోనే అందరూ తిరుగుతున్నట్లు ఆనందిస్తారు; గుణభేదమే అమ్మకుంటే ఏ ఒకరూ అమ్మ దగ్గఱకు రాగలిగే వాళ్ళుకారు. అమ్మ దగ్గఱకు తీయడం తప్ప వాళ్ళు రావడం కాదు.

58. యదా సంహరతే చాయం కూర్మోఽఙ్గానీవ సర్వశః।
ఇన్ద్రియాణీంద్రియార్థేభ్య స్తస్య ప్రజ్ఞాప్రతిష్ఠితా॥

తా: తాబేలు తన అంగాలను ఎలా లోపలికి లాక్కోగలుగుతుందో అలాగే సర్వశః ఇంద్రియాలను ఇంద్రియార్థముల నుండి లాగివేసుకోగలిగిన వాడు ప్రజ్ఞా ప్రతిష్ఠితుడు.

వ్యా: తాబేలు నడవవలసి వచ్చినప్పుడు, ఆహారాన్ని తినవలసి వచ్చినప్పుడు తన కాళ్ళను తలను పైన చిప్పగూటినుంచి బయటికి జాపుతుంది. ఆపత్సమయాలలో వాటిని లోపలికి లాక్కొంటుంది.

'ఆత్మన్యేవాత్మనా తుష్టి, సుఖదుఃఖ సమభావమూ, సర్వత్రా నభిస్నేహమూ, ఉన్నవాడు ఆత్మను ఆత్మలో పాతేసుకుని ముమ్మిడివరం యోగిలా ఊయిలా కూర్చుని

ఉండిపోనూవచ్చు లేదా జగత్తులో సంచరిస్తూ అమ్మలా అందటి మధ్యనూ ఉండ వచ్చు కూడా! ఏ పద్ధతి అవలంబించాలి అనుకుంటే అతడా పద్ధతిని స్వీకరిస్తాడు.

భారతీయ విజ్ఞాన సంప్రదాయంలో పారంగత సోపానం వేదాంత విద్య. అది లోకానికి ఉపయోగించని నిర్మనస్కులను, నిష్క్రియులను బాధ్యతా రహితులనూ తయారుచేయలేదు. లోకాన్ని సన్యసించితేగాని ముక్తిలేదన్న ఆదిశంకరులే భారత దేశానికి నాలుగు మూలాలా నాలుగు పీఠాలను స్థాపించి, జాతీయత్వాన్ని ఏకా గ్రంగా, ఏకముఖంగా చేయడానికి ప్రయత్నించారు. మళ్ళీ ఆ ప్రయత్నం జిల్లెళ్ళ మూడి కేంద్రంగా అమ్మ చేస్తున్నది.

ప్రతి జీవికీ తాబేటికి లాగానే, ఆపత్సూచన రాగానే ఉపసంహరించుకునే శక్తిని పరమాత్మ ప్రసాదించాడు. పులి, పిల్లి, కుక్క పురుగు, బయటినుండి ప్రమాదమేదైనా వస్తున్నదనే సూచన రాగానే, శరీరాన్ని కుంచించుకుంటుంది. ఈ కుంచనంచేత వచ్చేహాని నెదుర్కోడానికి, జంతుశరీరం ఎక్కువ బలాన్ని పుంజుకుంటుంది. ఈ స్వభా వాన్ని ప్రకృతిజ్ఞత, లేక సహజజ్ఞత అంటాం. ఈ శక్తిని మానవుడు కోల్పోయాడు. దానిస్థానే మనస్సు, బుద్ధి, విచక్షణశక్తులు అతనికి సంప్రాప్తించాయి. కాని ఈ ప్రసా దిత గుణాలవలన అతనికి సత్యవీర్యం, చిత్తవీర్యం లోపించాయి. మిగతా జంతువు లలో ఈ శక్తి ఇంకా బాగా మిగిలి ఉంది.

నేరస్థులను పట్టుకోడానికి పోలీసువారి చాకచక్యం, అపరాధ పరిశోధకుల బుద్ధినైశిత్యం, నిష్ఫలమైనప్పుడు నేరస్థులను వాసనతో పసికట్టడానికి, కుక్కలను ఉప యోగిస్తారు. నేరస్థులను పట్టుకోడంలో కుక్కలు తప్పుచేయవు. (తప్పుడు వాసనలను నెలకొల్పితే తప్ప.)

కుక్క పశుజాతికి చెందింది. మనుష్యుడు బుద్ధిజీవి. మనుష్యుని మించిన తెలివి కుక్కకుందనుకుందామా? అన్ని జీవులకూ సమానంగా ఉన్న శక్తిని మనుష్యుడెందుకు పోగొట్టుకున్నాడు? ఆటవిక జాతులలో ప్రకృతి పరిసరాల ప్రమత్తత ఇంకా ప్రతిష్ఠితం గానే ఉంది. నాగరికుడు ఈ వ్యగ్రత్వాన్ని తన కృత్రిమ జీవన పద్ధతితో, ఇంద్రియ లోయిపత్వంతో అసహజ జీవన పద్ధతితో, పోగొట్టుకొన్నాడనే అనుకోవాలి.

ఆకాశంలో పక్షులు సైనుబోర్డులు లేకుండా గూళ్ళను కనుక్కుంటాయి. వేటవేటి పేర్లు పెట్టుకోకపోయినా తమ బిడ్డలను తాము గుర్తించడంతో తప్పుచేయవు. ఎన్ని చీట్లూ, రికార్డ్లూ, తనిఖీలూ ఉన్నా ఆసుపత్రుల్లో ఒక తల్లి బిడ్డను ఇంకో తల్లిప్రక్కలో నర్సులు పడుకోబెడతారు. అగ్ని కాలడంలో ఎలా తప్పుచేయదో, సహజజ్ఞత కూడా తప్పుచేయదు కాని, మనకు కావలసిన రూపంలో దానికి విచక్షణతలేదు.

చోరీ జరిగిందనుకుందాం. ఇనప్పెట్టెను దొంగబ్రద్దలు కొట్టి ఖజానా దోచేశాడు. మర్నాడు యజమాని ఇనప్పెట్టెను తెఱిచి చూచుకుంటే అంతా ఖాళీగా కనిపించింది. పోలీసు కుక్కలు వస్తాయి. పెట్టెనవి వాసన చూచి, ఇంటి యజమానిని చూపుతాయి. ఆఖరు పర్యాయం పెట్టెను ముట్టుకున్న వాడు యజమాని కనుక దొంగకూడా అక్కడ ఉంటే దొంగనూ చూపుతాయి. ఇద్దటిలో ఎవరు దొంగ అని చిక్కుప్రశ్న వస్తుంది? నోట్లు కూడా దొరికినా నోట్లను యజమానీ తాకాడు, దొంగా తాకాడు.

ప్రకృతిజ్ఞకు, చిద్జ్ఞతకు ఇదే తేడా. బుద్ధి జీవులతో చిద్జ్ఞతా, జంతువులలో ప్రకృతిజ్ఞతా ఉంటాయి. పైశ్లోకంలోని తాబేటి ఉపమానం చాలా అందమైనది. వేదాంతశాస్త్రంలో తాబేటికి చిదంశం కూడా ఉన్నట్లు ప్రస్తావన ఉంది. కపి, విహంగ, మార్జాల, మీన, కూర్మ మార్గాలనే పంచమార్గాలలో కూర్మమార్గం ఒకటి.

తాబేలు ఎక్కడో గ్రుడ్లుపెట్టి, తానింకో చోటికిపోయి, ఆ గ్రుడ్లను గూర్చి తలుచుకోగా తలుచుకోగా అవి ఎదిగి పిల్లలై వృద్ధి పొందుతాయి. ఇక్కడ తలపే స్తన్యభావాన్ని పొందుతుంది. బిడ్డలందఱూ తన అవయవాలే అన్నది అమ్మ. తాబేలు తన అవయవాలను లోపలకు కుంచించుకున్నట్లే, బిడ్డల రూపములో ఉన్న తన అవయవాలను లోపలికి ఉపసంహరించుకొని, వాళ్ళనే తలుచుకుంటూ, భౌతికంగా వాళ్ళెక్కడ ఉన్నా, వాళ్ళను వృద్ధి చేసుకుంటూ, ఆనందించుతున్న మాతృభావం ఈ శ్లోకంలో నాకు ద్యోతకమవుతుంది. మాతృత్వమే మౌనయోగంగా మారినప్పుడు, ఈ భారాన్ని ఆశక్తి తప్పించుకోలేదు. అదంతా తన కోసమే. 'భారం వహించే శక్తి ఎక్కడ ఉన్నదో' అదే మాతృత్వం అమ్మ.

అంగాలను లోపలికి కుంచించుకునే ప్రకృతిజ్ఞతా, పిల్లలను తలుచుకుని తృప్తిపడే చిత్సంవిజ్ఞతా, ఇంద్రియార్థాల నుండి ఇంద్రియార్థాలను లాగేసుకునే సహజజ్ఞతా ఎప్పుడు యోగికి పరమేశ్వర ప్రసాదంవల్ల కలుగుతాయో అప్పుడతని ప్రజ్ఞ ప్రతిష్ఠితమవుతుంది.

శిరస్సులో ఉండే సప్తరంధ్రాలనుంచీ, చిత్తజ్యోతి కిరణాలు బయటికి ప్రసరించి బయటి వస్తువులను, సంఘటనలను ఆవేశించి, వాని ఆవిష్ట జ్ఞానంతో, మళ్ళీ మనస్సులో ప్రవేశించి, మనస్సుకు ఆ జ్ఞానాన్ని కల్గిస్తుంటాయి. జ్ఞానేంద్రియగ్రహణ స్వరూపమైనదే బయటి ప్రపంచం. ఈ ప్రపంచం అందఱిదీ, ఒకడిదేకాదు. ఒకటిగా కనిపిస్తున్నా ఎవడి ప్రపంచం వాడిదే మన నిత్యజీవితంలో. పంచేంద్రియాలద్వారా

అనుభూతమవుతూ ఉన్న, అన్ని శరీరాలతో, అన్ని వస్తువులతో అవిష్టలమై, ఏకత్రితులమై ఉంటున్నా, ఆ విషయాన్ని మనం గుర్తించక, మనం వేఱు, మన శరీరాలు వేఱు, అనే భావాన్ని పెంచుకుంటూ ఉంటాం. ఇంద్రియాణీంద్రియార్థేషు అనే మాటలో ఈ భావం స్ఫురిస్తుంది.

విజ్ఞాన శాస్త్రంవల్ల కూడా ఈ విషయం ఋజువవుతుంది. కాంతి కిరణాలు వస్తువులను ప్రకాశింపచేసినట్లు, x-కిరణాలు మనకు కనిపించని ఎముకలను ప్రకాశింపచేసినట్లు, మనఃకిరణాలు గుహాంతర్వర్తులైన సర్వహిరణ్య గర్భాంశాలనూ ప్రకాశింపచేస్తాయి.

ఈ ప్రకాశాన్ని గుర్తించగలవాడి ప్రజ్ఞ ప్రతిష్ఠితమవుతుంది.

59. విషయా వినివర్తన్తే నిరాహారస్య దేహినః।
రసవర్జ్యం రసోఽ ప్యస్య పరం దృష్ట్వా నివర్తతే॥

తా: నిరాహారియైన దేహికి రసమును మాత్రం వెనక్కు మిగిల్చి, విషయాలన్నీ వివర్తిస్తాయి. పరమాత్మ దర్శనం అయిన తరువాత ఆ రసం కూడా వినివర్తిస్తుంది.

వ్యా: నిరాహారి అంటే ఎవరు? రసమంటే ఏమిటి? పరం అంటే ఏమిటి?

విషయమంటే ఏమిటి? ఈ పదాలకర్థం తెలుసుకుంటేగాని శ్లోకానికుండే అసలు అర్థం బయటపడదు.

పరమాత్మ అర్జునుడు వేసిన కిమాసీత అనే ప్రశ్నకు 59, 60, 61 శ్లోకాలలో సమాధానం ఇస్తున్నారు. నిరాహారి అనే మాటను తలుచుకుంటే ఒక చక్కని కథ జ్ఞప్తికి వస్తుంది.

తమసా నది అవతలి ఒడ్డున అగస్త్యుడు తపస్సు చేసుకుంటూ ఉండేవాడు. ఇవతలి ఒడ్డున వశిష్టుని ఆశ్రమం. వశిష్ఠుని భార్య అరుంధతి. పాపం! అగస్త్యుని కెవరూ అన్నం పెట్టేవాళ్ళు లేరు కదా అనుకుని అన్నం వండి తమసను దాటి ఆయనకు ఆరగించబెట్టి వస్తూ ఉండేది. అరుంధతికి నూరుగురు సంతానం. పిల్లలతో యాతనపడుతూ గూడా నేనేకదా అగస్త్యునికి అన్నంపెట్టి వస్తున్నానుకున్నదట ఆ ఇల్లాలొకనాడు. వశిష్ఠ మహర్షి మనస్సులో ఒక మెఱపు మెఱిసింది. వాన కురిసింది. తమస పొంగిపోయింది. అరుంధతికి అవతలి ఒడ్డెలా చేరాలో తోచలేదు. అగస్త్యుడు పాపం ఆకటితో ఎంత నకనకలాడుతున్నాడో అనే యాతన మాత్రం ఆమెను చాలా బాధించసాగింది. వశిష్ఠుని దగ్గఱకు వెళ్ళి సంగతంతా చెప్పి తమసును దాటే ఉపాయం చెప్పమన్నది. అతడన్నాడు కదా! నీవు తమసా నది దగ్గఱకు పోయి 'ఓ

మాతా! తమసా నదీ! సదా నిరాహారికోసం ఆహారం తీసుకుపోతున్నాను. కరుణించి దారి ఇమ్మని ప్రార్థించమన్నాడు.

ఆమె అలాగే చేసింది. తమస దారి ఇచ్చింది. అరుంధతి అవతలి ఒడ్డుకు చేరి అగస్త్యునికి భోజనంపెట్టి ఇంటికి తిరిగి వద్దామని రేవు దగ్గఱకు రాగా, ఇదివఱకు కంటె తమసలో వఱద పొంగుచూపి ఉంది. కంగారుపడి ఆమె అగస్త్యుని దగ్గఱకు పోయింది. 'మహామునీ! అవతల పిల్లలెంత ఏడుస్తున్నారో ఏమో! వఱదతో తమస ఉరుకులు పరుగులు తీస్తున్నది. భర్త కాల్యోచితాలకు వేళ కూడా అయిపోతున్నది. అవతలి ఒడ్డు చేరే ఉపాయం చెప్పండి' అన్నది.

'సదా బ్రహ్మచారి దగ్గఱకు పోతున్నాను. కనుక దారిమ్మని' తమసను ప్రార్థించ మన్నాడు అగస్త్యుడు. అలాగే చేసేసరికి నది దారి ఇచ్చింది. ఆమె అవతలి ఒడ్డయితే చేరింది. కాని పట్టలేని సందేహాలు ఆమె మనస్సు నిండా మూగాయి. హృదయ భారంతో ఇల్లు చేరింది. వశిష్ఠ మహామునిని అడిగేసిందామె. రోజూ పళ్ళెం నిండా ఉన్న అన్నాన్ని చెల్లిస్తున్న అగస్త్య మహర్షి సదా నిరాహారి ఎలా అయ్యాడు? నూరుగురు పిల్లలను నా నుండి కన్న మీరు సదా బ్రహ్మచారులెలా అయ్యారు? మహానుభావా?' అని ఆమె అడిగింది.

'అగస్త్యుడు అన్నం కావాలి అని నిన్నడగలేదు. పిల్లలు కావాలని నేనూ నిన్నడగలేదు. మాతృత్వం స్త్రీకి ఎలా ధర్మమో, స్తన్యం ఇచ్చి పిల్లలను పెంచడమూ ధర్మమే అన్నాడు వశిష్ట మహాముని. అమూల్యమయినది మాతృత్వం.

నిజానికి ఆహారికి నిరాహారికి భేదం మనస్సుదే కాని శరీరానిదికాదు, ఆహా రానిది కాదు. ఇక్కడ ఆహారం అంటే పొట్టలో పడేసుకునే తిండి అనేకాక పంచేంద్రి యాల చేత భోగ్యములయ్యే వస్తువులు అనే అర్థం. మనస్సులో నిర్దిష్టమైన ఆకర్షణకు అది క్షేత్రమై ఉంటేనే ఇంద్రియార్థాలు అందులోకి లాగబడతాయి. చుంబకక్షేత్రంలేని ఇనుము దగ్గఱకు ఇనుప తునకలు లాగబడవు కదా!

'అన్నాద్భవంతి భూతాని' అంటే ఇంద్రియార్థాలలో నుంచే ఇంద్రియాల గృహ మైన దేహం పుట్టింది. అన్నంతో పుట్టి, అన్నంతో పెరిగి అన్నంలో కలిసిపోయే భూతాలు అన్నానికి దూరంగా ఎలా ఉండగలుగుతాయి?

అద్యతేత్తి భూతాని తస్మాదన్నం ప్రయుజ్యతే' భూతాలను కూడా అన్నమే తినేస్తుంది కనుక దానికాపేరు వచ్చిందని ఆ మాటల కర్థం. కాబట్టి భూతాలు చివరకు చేరే స్థానమూ అన్నమే.

అమ్మ విషయంలో

"మీకాహారం ఏమిటి?"

'ఈ వ్యవహారమే నాకాహారం'.

'మరి ఏమీ తినటం లేదుగా'

'చెట్లు లేవూ నాన్నా'

మఠో సందర్భంలో

నేను అన్నాన్ని విడిచిపెట్టలేదు. అన్నమే నన్ను విడిచిపెట్టింది. అన్నదమ్మ నిరాహారిని విషయాలు విడిచిపెట్టి వెళ్ళిపోతాయంటే ఇదే అర్థం.

దేహినః అనే మాటకూడా సాభిప్రాయం ఉపయోగించబడ్డది. దేహానికాధారం ప్రాణం + మనస్సు + కన్ను + ముక్కు + వాక్కు + పరమాత్మ + రసంతో ఏకమై నిర్వికల్ప సమాధిలోగాని సహజ సమాధిలోగాని ఉన్నవాడిని ఇంద్రియ వ్యాపారాలు విడిచిపెట్టి వెళ్ళిపోతాయి.

రామకృష్ణ పరమహంస 6 నెలలు ఏకబిగిన సమాధిలో ఉండిపోతే ఆయన శరీరంమీద మృతకచిహ్నాలు కనబడినప్పుడు, శరీరం శిథిలంగా కూడా ఉండడానికి బలవంతంగా ఆహారాన్ని నోటిలో క్రుక్కే వాళ్ళనీ, మ్రింగుడు పడినదేదో లోపలికి పోయేదనీ, మిగతాది బయటికి వచ్చేదనీ, ఆ శరీరం ఆరు నెలలు అలాగే ఉండడం చూచి, నిర్జీవమైపోతుందేమోననుకొని శ్రేయోభిలాషి అయిన ఒకరు ఆ దేహాన్ని కఱ్ఱతోబాది, స్మారకాన్ని తెప్పించడానికి ప్రయత్నించారనీ వ్రాస్తారు. నిరాహారదశలో నిర్వికల్ప దశలో 21 రోజులు దాటి ఉంటే సామాన్య సాధకుడికి శరీర పాతమవు తుందనీ చెబుతూ రామకృష్ణ పరమహంస ఇలా అన్నారు.

'జిస్ స్థితిమేఀ పహుంచ్ జానే పర్, సాధారణ్ సాధక్ వహాసే లౌట్ నహి సక్తా, ఇక్కీస్ దినోంమేఀ హి ఉస్కా శరీర్ పకేహుయే పత్తేకే సమాన్, గిర్ పడ్తాహై, ఉస్ స్థితిమేఀ మైఀ మాతాకి కృపాసే ఛః మహినే తక్ రహా! దిన్ కబ్ నికలా, రాత్ కబ్ హుయీ యహ్ నహీఀ జాన్ పడ్తాథా! మరేహుయే మనుష్యకే నాక్ ముహ్ ఆదిమే జైసే మఖ్ఖి యాఀ చలీ జాతీహైఀ వైసే చలిజావేఀతో భికుఛ్ మాలూం నహీంహో. శిర్‌కీ కేశ్‌కి జటా బన్‌గయీ. పహనే హుయే కప్డేమేఀ హి మల్ మూత్ర హోజావేపర్ జాన్‌నపడే! ఐసీ అవస్థామేఀ క్యా శరీర్ కాటిక్నా సంభవ్‌హై? వహ్‌తో కబ్‌కా నష్ట్ హోగయా హోతా? పరంతు లగ్‌భగ్ ఉసీ సమయ్ దక్షిణేశ్వర్ మేఀ ఏక్‌సాధు అయే హుయేథే! ఉన్హోంసే దేఖ్తే హి మేరీ అవస్థా పహ్‌చాన్‌లీ ఔర్ ఉన్కేమన్‌మేఀ ఆయాకి ఇస్

దేహ్ ద్వారా శ్రీ జగదంబాకే అనేక్ కామ్ అభిహోనేకో బాకీహైం! అతః యది ఇస్కి రక్షాహమ్ కర్ సకేతో అనేక్‌లోగోంకా కళ్యాణ్ హోగా! ఉన్‌కేపాస్ రూల్‌కే సమాన్ ఏక్‌లక్‌డీ థీ! ఉస్ లక్డీసే మార్‌మార్ కర్ ముఝె హోశ్‌మెం లానే కా ప్రయత్నవేకియా కర్తేథే! ఔర్ జబ్‌మైం కుఛ్ థోడా సా భి హోశ్‌మెం ఆతాసా దిఖాయీ దేతాథా తబ్ తురంత్ హి వే ఔర్ హృదయ్‌తక్ దోకౌర్‌మేరే ముహ్‌మేం డాల్తేథే! ఉస్‌మేంసే కుచ్ అంశ్‌కి సీదిన్ గళేకేనీచే ఉతర్ జాతా థా ఔర్‌కిసిదిన్ నహీం ఉతర్ తాథా! ఇస్ తరహ్ ఛః మహినేతక్ చలా!"

ఇది ఒక పద్ధతి, ముమ్మిడివరం బాలయోగిలాటి వారికివేమీ అక్కరలేకుండానే ఉండిపోతున్నారు. ఏండ్ల పర్యంతం పంచభూతాలనుంచి ప్రాణసారాన్ని గ్రహించేశక్తి అలవడుతుంది. పైవిషయాలను బట్టి దేహం చైతన్యవంతంగా ఉండడానికి, ఏదో ఒక విలక్షణమైన శక్తి సారం అంతఃకరణ ప్రపంచంలోనుంచి కూడా పని చేస్తున్నట్లు తెలుస్తుంది. దాన్నేరసమంటారు.

రసమంటే ఏమిటి? రసశబ్దం ఉపనిషత్తులలో చిత్తవీర్యంలేక ఆత్మసారం అనే అర్థంలో ఉపయోగించబడ్డది.

ప్రజాపతిర్లో కానభ్యతపత్తేషాం తప్యమానా నాగ్ రసాన్ ప్రావృహదగ్నిం పృథివ్యావాయు మన్తరిక్షాదాదిత్యందివః'

ఛాందోగ్యం 4-17-1

ప్రజాపతి లోకాలయందు ఏది సారమో తెలుసుకునేందుకు తపస్సు చేశాడు. పృథ్విలో అగ్నిరసమనీ, అంతరిక్షంలో వాయువురసమనీ, స్వర్గంలో ఆదిత్యుడు రసమనీ తెలుసుకున్నాడు.

విషయాలంటే బయటి పరిసరాలకూ తనకూ సంబంధాన్ని కల్పించే యంత్ర సామగ్రి. ఈ యంత్రసామగ్రిలో పదార్థమయమైన దేహాదులూ ఉంటాయి. దేహాదులను నడిపించే పదార్థ సంబంధాలైన శక్తులూ ఉంటాయి. వీటి పరిధిల్లోనివే పాత కొత్తల కలయికలు కూడా. వీటి పని అల్లా బయటి సంఘటనలను అంతఃకరణకు చేరవేయడం. అంతఃకరణ స్వయంగానే బయటి వస్తువులను కన్నుమూసుకుని కూడా చూడగలిగే శక్తి గలదైతే కంటి ప్రయోజనమేముంటుంది.

టెలిప్రింటర్లు రాకపూర్వం టెలిఫోనులు, టెలిఫోనులు రాకపూర్వం వార్తాహరులూ, ఆవశ్యకమైనట్లూ టెలిపతీ రాగానే వాటి అంతట అవే అనవసరమై వెనక్కు దిగబడిపోయినట్లు చిత్తం పరాన్ని గుర్తించగానే, అంతవఱకు పరిశిష్ట రసాంశాలుగా ఉన్న విషయాలు వ్యక్తి మనస్సును విడిచిపెట్టి వెళ్ళిపోతాయి.

ఇక్కడి సందర్భంలో ఇంద్రియగతమైన వీర్యశక్తి కాకుండా, చిత్తగత వీర్యమనే రసశబ్దానికర్థం చెప్పుకోవాలి. యోగి నిరాహారి కావడంవల్ల లవణతిక్తామ్ల కట్వాది గుణాలను ప్రేరేపించే విషయాల లాగానే రాగద్వేషాలు కూడా అతనిని చేరకుండా తిరిగిపోతాయి. అతడు పదార్థమయం కాకుండా తనకు కావలసిన ప్రాణసారాన్ని భూత గ్రామాన్నుండి గ్రహిస్తూ ఉంటాడు. అతని శరీర యంత్రాంగం దానికి కావల సిన ప్రాణవాయువును స్వయంగా లోపలినుండే ఉత్పత్తి చేసుకుంటుంది. బొగ్గు పులుసు వాయువుకు దేహంలో చోటుండదు. అమ్మకు ఆత్మశక్తి ఆధారమవు తున్నట్లుగా, అన్ని నేనులు నేనై పర్యవసించి, అదేపరం పదార్థమవుతుంది. ఈ పర దశకు వీర్యం ఆవశ్యకత కూడా తీరిపోతుంది. అప్పుడతడు ఆత్మవీర్యసంపత్తిగలవాడై పరమాత్మతో ఐక్యమవుతాడు.

60. యతతో హ్యపి కౌన్తేయ! పురుషస్య విపశ్చితః।
ఇంద్రియాణి ప్రమాథీని హరంతి ప్రసభం మనః॥

తా: పార్థా! పండితుడైన పురుషుడు ఆత్మ సంయమనం కలిగేందుకు ప్రయ త్నిస్తున్నప్పటికీ కల్లోలితములైన అతని ఇంద్రియాలు అతని మనస్సును బలాత్కా రంగా హరిస్తూ ఉంటాయి.

వ్యా: 'బలవానింద్రియ గ్రామో విద్వాంస మపి కర్షతి' అని వ్యాస భగవానుడు వ్రాసిన శ్లోకాన్ని నారదుడు 'విద్వాంసం నాపి కర్షతి' అని దిద్దడమూ, ఆ తరువాత మోహినీ రూపం దాల్చిన వ్యాసునివలన పరాభవం పొందిన తరువాత అతడే విద్వాంస మపి కర్షత్యేవ' అని మూడుసార్లు వ్రాశాడన్న కథ అందఱకూ తెలిసినదే. పురాణాల్లో విశ్వామిత్రుడు మేనక వలలో బడిన కథకూడా అందరెఱిగినదే. మన స్స్వభావమే అంత! పరమేశ్వరుని శక్తి అయిన మాయామోహం, పరమేశ్వరుని కంటే అన్యమేమికాదు. సుస్థిరంగా ఉన్న పరమాత్మశక్తి మనోరూపకంగా ప్రసరించి కామ మయింది. ప్రసార భావాన్ని అవలంబించేసరికి దాని అంతట అదే చలన గుణం అబ్బినదైంది. ప్రకృతి, పురుషుడూ ఒకటే. జీవాత్మా, పరమాత్మా రెండూ ఒకటే అని తెలిసినవాడు ఇంద్రియ గ్రామంలో నుండి కూడా పరమాత్మ భావాన్ని పొందుతాడు.

విచరమ మతి రేతా నిర్వికల్పే సమాధౌ
కుచకలశ యుగే వా కృష్ణసారేక్షణానామ్
చరతు జడ మతే వా సజ్జనానాం మతే వా
మతికృత గుణదోషా మాం విభుం న స్పృశన్తి

సర్వకామ, సర్వకర్మ, సర్వగంధ, సర్వమిద మభ్యత్తా, అవాగి, అనాదరమై ఉండే నా ఆత్మ హృదయాంతంగా ఉండే ఆత్మా రెండూ బ్రహ్మమే అని తెలుసుకున్న తరువాత మనిషికబ్బే స్థితిని గూర్చి శంకరులిలా వర్ణించారు.

'ఈ నా మనస్సు నిర్వికల్ప సమాధి యందే విహరించునుగాక లేదా హరిణేక్షణల కుచభూములయందు విహరించునుగాక లేదా సజ్జనుల మతాన్ని అనుసరించి తిరుగుతుంది గాక, ఆ ఈ బుద్ధి దోషాలు సర్వవ్యాపినైన నన్నంటుకోవు.

'ద్వంద్వాల్లో తోచే సంకల్పమే మానవత్వం"

61. తాని సర్వాణి సంయమ్య యుక్త ఆసీతమత్పరః।
వశే హి యస్యేంద్రియాణి తస్యప్రజ్ఞా ప్రతిష్ఠితా॥

తా: అలాంటప్పుడు నాయందే దృఢాసక్తి కలిగి, నా పరంగానే ఇంద్రియాలనన్నింటిని వశమునందుంచుకొని, పురుషుడు నన్ను ధ్యానిస్తూ ఉండాలి. ఇంద్రియాలు అలాగా స్వాధీనమై ఉన్నవాడు ప్రజ్ఞా ప్రతిష్ఠితుడవుతాడు.

57వ శ్లోకంలో ఎవడు ఇంద్రియాలను ఇంద్రియ విషయాల నుండి గుంజుకోగలుగుతాడో అతడు జ్ఞాని అని ప్రవచించి, గత శ్లోకంలో జ్ఞాని అయిన వాడెంత ప్రయత్నించినా ఇంద్రియాలు లొంగేవికావని పరమాత్మ చెప్పారు. ప్రయత్నించినా మనస్సును వేధించక మాననివైతే, ఇంద్రియాలకంటే మనస్సు బలవత్తరమైనదా లేక మనస్సు కంటే ఇంద్రియాలు బలవత్తరమైనవా అనే ప్రశ్న తలెత్తుతుంది. చైతన్యంవల్ల ప్రేరితమైన మనస్సు బలంగా ఉంటే ఇంద్రియాలదే పైచేయి అవుతుంది. భగవంతుని ప్రేరణవలన మనస్సు తనలో తాను ఇంకిపోయే సరికి అది శమించక తీరదు. ఆ తరువాత జరిగే మనోవ్యాపారం పాఠం ఈ శ్లోకంలో వివరించబడ్డది.

తాని సర్వాణి సంయమ్య అంటే అన్ని ఇంద్రియాలు శమింపచేసుకుని అంటే మనస్సును అదుపులో ఉంచుకొని అని అర్థం. అలా అదుపులో ఉంచుకోవడం ప్రయత్న సాధ్యంకాదని పరమాత్మే చెప్పారు. మహాతపశ్శాలురైన మునులుకూడా ఇంద్రియాలలౌల్యానికి లోనైనవారే.

అసలు మనోయంత్రంలోనే ఈ దౌర్బల్యం ఇమిడి ఉంది. మనస్సంయమనం కావాలంటే కోతిని తలుచుకోకుండా ఉంటే సరి అని ఎవరో సలహా ఇచ్చారట. ఆ మాట విన్న వాళ్ళ మనస్సుల్లో కోతి భావనయే దృఢంగా పాతుకొనిపోయింది. కోతి మాట ఎత్తకుండా ఉంటే ఆ ప్రసక్తే మనస్సుకు వచ్చేది కాదేమో! కాని ఒకసారి

వ్యతిరేక రూపకంగానైనా మనస్సులో ప్రవేశించిన తరువాత కోతికోతే. ఆ భావన విడిచిపెట్టడం సాధ్యంకాదు.

పరమాత్మ అనుగ్రహం - అభ్యాసంకూడా అనుగ్రహమే - కాకుండా ఏ సామర్థ్యమూ మనస్సుకు కలుగదు. అందుకనే మత్పరః అనే మాటను పరమాత్మ ప్రయోగించారు. సాధకుడు తాను ఎలా వేఱుకారో తన అనుగ్రహమూ సాధకుడూ కూడా వేఱుకారని అర్థం. దీనికై నాకు సర్వమూ సమర్పించుకొన్న మనస్సుతో అన్ని సాధనలను ఆరంభించాలని అర్థం.

పరమాత్మ ప్రేరణలేకుండా ఆ ప్రయత్నం చేయాలని కూడా బుద్ధి పుట్టదని గ్రహించేది.

62. ధ్యాయతో విషయాన్పుంసః సంగ స్తేషూపజాయతే।
సంగా త్సంజాయతే కామః కామా త్క్రోధో భిజాయతే॥

63. క్రోధాద్భవతి సంమోహః సంమోహాత్స్మృతి విభ్రమః।
స్మృతి భ్రంశా ద్బుద్ధినాశో బుద్ధి నాశా త్ప్రణశ్యతి॥

తా: సర్వకార్యాలూ తన వల్లనే జరుగుతున్నాయని అనుకునే మనుష్యుని చిత్తం సదా విషయ భోగములనే ఆలోచిస్తూ ఉంటుంది. ఆ ఆలోచనల వలన లంపట ఉత్పన్నమవుతుంది. లంపట కోరికలను పెంచుతుంది. తీరని కోరికల వలన క్రోధం ప్రతీకార వాంఛరేగుతుంది.

క్రోధంవల్ల సమ్మోహం, సమ్మోహంవలన స్మృతి విభ్రమం. స్మృతి విభ్రమం వలన బుద్ధి నాశమూ కలుగుతుంది. బుద్ధి నాశంవలన మనుష్యుడే నశిస్తాడు.

ఇవన్నీ ఒక దాని వలన మఱొకటి కలుగుతుందని పైశ్లోకాల్లో చెప్పబడ్డది.

సంగం అంటే ఏమిటి? పలుసార్లు దాన్నే గుఱించి ఆలోచిస్తూ ఉండడంవల్ల మనస్సు ఆ విషయానికి అంటుకుపోవడం.

విషయాలు పిల్లలు. వాళ్ళు కావాలని నిత్యమూ ధ్యానిస్తూ ఉండడం అమ్మకున్న సంగం.

కామం అంటే ఏమిటి? ఇది కావాలనే ఇచ్ఛ, ఇచ్ఛ ముదిరితే ఆశ అవుతుంది.

జీవితమనే పుష్పానికి ఆశ మొగ్గలాటి దన్నది అమ్మ.

మొగ్గ అంకురించడానికి ఇంకా మొదటి దశ. అంటే మొగ్గ ముందుకు వద్దామని ప్రయత్నిస్తున్న ముందు దశ కామం.

క్రోధం - కోపం వేఱు క్రోధం వేఱు. అవతలవాడు చచ్చేదాకా సాధింపు క్రోధం. కోరిక తీరకపోవడంవల్ల వచ్చే వ్యతిరేకమైన మనోభావం క్రోధం, క్రోధానికి మారుపేరు వికటించిన ప్రేమ. ప్రేమ లేనిచోట కోపమూ ఉండదు, ద్వేషమూ ఉండదు.

సమ్మోహం - ఉన్న విధానానికి భిన్నంగా కనిపించడం సమ్మోహం

స్మృతి విభ్రమం: కంగారు, మూర్ఛ, పిచ్చి, అచేతనత్వం, తదేకమగ్నత్వం ఇలాంటి అన్ని దశలనూ కూడగట్టుకొని ఆ దశ ఏ వికారంతోనైనా ప్రత్యక్షం గావచ్చు. ప్రతీకారవాంఛ క్రోధంతోనే ఉత్పన్నమవుతుంది. సమ్మోహావస్థకు చేరుకునేసరికి ప్రతీకారంలోనే వాడికి మోక్షం కనిపిస్తుంది. హిరణ్యకశిపుడికిలా - రావణ బ్రహ్మ కులా ఇది కూడా ఆ వ్యక్తిని ఉద్ధరించడానికి ఇంకో రకంగా ప్రసరిస్తున్న పరమేశ్వరుని అనుగ్రహమే. సమ్మోహమంటే కార్యవివేక శూన్యత అని శంకరులు, అధర్మము నందలి కోరిక అని రామానుజులు స్మృతి విభ్రమం- యుక్తా యుక్త విచక్షణ రూప మయిన పూర్వానుభవజ్ఞానం తారుమారవడం.

తెలివి మీద తెర జారడం

బుద్ధినాశం చిత్త ప్రకాశం బుద్ధి-మఱపు, అనే అంధకారం క్రమ్ముకోడానికి బుద్ధినాశం కావాలి. అనులోమ క్రమంగా సంగ కామక్రోధ స్మృతి విభ్రమాల విపర్యయం చెప్పబడినా, విలోమక్రమంగా అవన్నీ పరమేశ్వరప్రసాదితమైన బుద్ధి నాశం వల్లనే సంభవిస్తున్నవి. బుద్ధినాశం పరమేశ్వర సంకల్పం వల్లనే కలుగు తున్నది. ఏది ఎక్కడ నాశం కావాలని పరమేశ్వరుని నిర్ణయమై ఉందో అక్కడ బుద్ధి నాశం మొదటనే (మయైవేతే నిహతా పూర్వమేవ లాగా) సంభవిస్తుంది.

మిగతా జరిగే కార్యకలాపం నిమిత్త మాత్రంగా జరిగి వ్యక్తి గతమైన పతనం వలన బుద్ధి నాశాత్ ప్రణశ్యతి అనే కార్యం జరియిపోయినట్లు మనకు కనిపిస్తుంది.

'పతనం అనేది నేను కాకపోలేదు'

ధ్యాయతే విషయాన్పుంసః' అనే మాటను ఈ దృష్టికోణం నుంచి చూస్తే మనుష్యుడి ధ్యానం అప్రయత్నంగానే నిర్ణీతమైన పద్ధతులలో ప్రసరిస్తుందనే మాట సిద్ధమౌతుంది.

కావాలని మనుష్యుడు ధన వంతుల ఇళ్లలోగాని బీదల ఇళ్లలోగాని పుట్టలేదు. కావాలని అతడు భగవద్భక్తుడూ, సాధకుడూ కాలేదు. పరమేశ్వరుని నిర్ణయం ప్రకారం తానుంచబడిన పరిసరాలతో వ్యక్తికి సంబంధం పరిపుష్టమౌతున్నప్పుడు

విషయముల సంపర్కం అతని మనస్సుకు నచ్చిన రీతిలో జరగదు. పరమేశ్వర సంకల్పం వల్లనే జరుగుతుంది.

తన అధీనంలో లేని ఇటువంటి లోకసంపర్కంవల్ల, అంతఃప్రజ్ఞకూ బహిః ప్రజ్ఞకూ సాన్నిహిత్యం కుదురుతుంది. సాన్నిహిత్యం ఏకదేశం అయినప్పుడు కామం గా మారుతుంది. ఈ కామం స్వభావ విరుద్ధమైనది కాదు. ప్రతిఘటింపరాని సహజ ప్రేరణ. అంతా మన చేతుల్లోనే ఉంటే ప్రతివాడు ప్రధాన మంత్రే అయ్యేవాడు. ఈ పరోక్షప్రేరణతో సంసారజంబాలంలో పడి ఈదుకుంటూ అవతలితీరం చేరుకోడం లోనే మోక్షం.

ఉత్తరోత్తర పదానూన స్పృహాచాంచల్యం మానవత్వానికి సహజగుణం. తీరడం ఉంటే అదికోరికే కాదు. కోరిక ఈరిక.

నిత్యమూ జన్మించేది ఈరిక, ఒక కోరిక లోనుంచి ఇంకోటి పుట్టడం దాని స్వభావం. అలా ఉండడమే ప్రపంచం. అలా ఉండకపోవడం అప్రపంచం. తగ్గుస్థితి నుంచి హెచ్చు అనుకునే ఇంకోస్థితిని పొందాలనే ఆవేగమే కామన. ఈ హెచ్చుతగ్గులే సృష్టి, తృప్తిలేక పోవడమే కామన , తృప్తియేమోక్షం.

లేనిది కావాలనుకోవడం కామం కాదు. దాని మీద ఆపేక్షాకామమే, పాత ఆచారం సంప్రదాయం, వీటిమీద ఆపేక్షా కామమే.

నిర్వికల్ప సమాధి దశను కూడా అందుకోగలిగిన తోతాపురి కూడా ఈ దౌర్బల్యా న్నుంచి బయటపడలేక పోయాడు.

ఒకనాడు రామకృష్ణుడూ తోతాపురి పరమాత్మభజనలో తన్మయులై ఉండి పోయారు. వారి యెదుట అగ్నిహోత్రం తన శతజిహ్వాలూ సాచుకుంటూ వాళ్లతో తన్మయమైపోయినట్లు వెలుగు తున్నది. ఇంతలో తోటమాలితో పని చేస్తున్న ఒక కూలివాడు చిలుం గొట్టాన్ని నింపుకొని, లోపలికివచ్చి, అగ్నిస్థానం నుండి ఒక కొఱివిని లాగి హుక్కాను ముట్టించుకుంటున్నాడు, తోతాపురి ఆదృశ్యాన్ని చూచి అగ్నిని ముట్టుకుని ధూమపానం నిమిత్తం కల్మషం చేసినందుకు వాడి మీద తీవ్ర క్రోధపూరితుడయ్యాడు, చిమ్టాతీసుకుని వాడిని కొట్టబోయాడు. నానాతిట్లూ తిట్టాడు. రామకృష్ణుడు నవ్వసాగాడు.

'వాడు చేసింది అపరాధమేకాని, వాడితో పోల్చిచూస్తే బ్రహ్మజ్ఞానానికి కల్గిన అవహేళన కొట్ట వచ్చినట్లు నాకు కన్పిస్తున్నది. ఇప్పుడిప్పుడే మీరు సంసారమంతా పరబ్రహ్మ స్వరూపం తప్ప ఇంకోటి కాదని బోధ చేశారు, ఇందులోని వ్యక్తులూ వస్తువులూ పరమాత్మ ప్రకాశం యొక్క అంశాలే అన్నారు. ఇదే క్షణంలో అదంతా

మఱిచిపోయి ఆ మనుష్యుడిని చావగొట్టడానికి తయారైనారు. మహామాయ బలం ఎంత బలిష్ఠమైనదో కదా అని నాకు నవ్వు వచ్చింది.

కళ్లు మూసుకొని మీరు ఎన్నైనా ప్రగల్భాలు పలకవచ్చును. నాకు ముల్లు గ్రుచ్చుకోదు. నాకాలికి నెప్పి పెట్టదు. అని మనస్సుకు ఎంతైనా గట్టిగా బుద్ధి చెప్ప వచ్చును. నిజంగా ముల్లు గ్రుచ్చు కున్నప్పుడు మనస్సు అబ్బాఅని వ్యాకుల పడడం తప్పదు. అలాగే మనస్సుకు నీవెంతగా

నాహం దేహో జన్మమృత్యుః కు తోమే

నాహం ప్రాణో క్షుత్పిపాసో కుతో మే।

నాహం కర్తా బంధ మోక్షో కుతో మే

నాహం చిత్తం శోక మోహౌ కుతో మే॥

అనిబోధించుకున్నా సంసారంలో రూప రసాది విషయాలు, కామకాంచనాలు, కొంచెమైనా దగ్గఱకు వచ్చి మిలమిలలాడే సరికి, మోహదుఃఖక్రోధతరంగాలు మన స్సులో ఉవ్వెత్తుగా లేవకమానవు. అప్పుడు మనుష్యుడు కింకర్తవ్యతావిమూఢుడై కావలసిన అవకార్యాన్ని చేయకమానడు, అది మనదృష్టిలో శిక్ష అయితే కావచ్చుగాక, అమ్మ దృష్టిలో

'శిక్ష అంటే క్రమశిక్షణే'

తరుణం వస్తేగాని వీటికి తరణోపాయంకూడా లభించదు, ఈశ్వరానుగ్రహం లేకపోతే శ్వాసకోశాలు పనిచేయవు. ఆత్మజ్ఞానం మాట ఎలా ఉన్నా ఆయుర్దాయమే సంశయమౌతుంది.

'సైషా ప్రసన్నా వరదానృణాం భవతి ముక్తయే' అంటే జగదంబ కృపజూచి మార్గాన్ని నిష్కంటకంగా ఉంచకపోతే ఏకొంచెమూ బ్రతుకులో సఫలంకాదని, జన్మ ఇచ్చిన వాడే ముక్తినీ ఇస్తాడని అభిప్రాయం

64. రాగ ద్వేష వియు క్తైస్తు విషయా నింద్రియైశ్చరన్।
ఆత్మవశ్యై ర్విధేయాత్మా ప్రసాద మధిగచ్ఛతి॥

తా: పరమాత్మ అనుగ్రహం వల్ల అంతః కరణం స్వాధీనంలోకి వచ్చినవాడు రాగద్వేషాల నుంచి విముక్తుడై, అంటే విడివడిన వాడై, విషయభోగాలను అనుభ విస్తున్నప్పటికీ వశీకృతమైన ఆత్మబలం చేత చిత్తంలో ప్రసన్నతను, నిత్యతృప్తినీ, పొందుతాడు.

వ్యా: క్రిందటి శ్లోకంలో చెప్పబడిన రీతిగా, ఇంద్రియాలూ ఇంద్రియార్థాలూ కారణాలుగా పనిచేస్తున్నప్పటికీ, రాగము ద్వేషమూ లేకపోతే వాటి పనికి ఏమీ ప్రభావంగాని అసరుగాని ఉండదని పరమాత్మ వివరిస్తున్నారు.

రాగము ద్వేషమూ లేకుండా ఉండడం ఎలా? రాగం ఉన్నచోట ద్వేషానికి తావు లేదనీ, ద్వేషం ఉన్నచోట రాగానికి తావు లేదనీ చాలామంది భావిస్తారు. కాని ఈ సృష్టి రాగద్వేషాలు కలవాడి చేతనే చేయబడ్డది.' అన్నదమ్మ.

కాబట్టి నిత్యజీవితంలో ఈ రెండూ బొత్తిగా ఉండని స్థితి ఆకళింపుకురాదు. అమ్మ మాటలు వినండి.

'మమకార మంటే మిమ్మల్ని దగ్గఱకు తీయడమూ మీరు కావాలను కోవడమూ అనుకో-దీనిని మమకారమనూ, అనురాగమనూ- అయితే నీ విరాగ మేమిటి? అనే వాళ్లతో నా పోట్లాట ఏమిటో తెలుసా?

'సర్వత్రాను రాగమే విరాగమని,'

ఇది మమతల గర్భగుడి-విరాగిని కాదుగా నాన్నా- కాబట్టి అందటినీ చూచు కోవాలనే ఉంటుంది."

యోగి మనస్థితి బహిఃప్రపంచ వ్యాపారాలవల్ల మలినం కాకుండా ఉన్నంత వఱకూ ఆ ప్రపంచం అతనికి ఉండీ లేనట్లే. సంసారసాగరంలో మునకలు వేస్తున్నా అతడు ఒడ్డున ఉన్నట్లే, అతనికి సముద్రంగాని, ఒడ్డు మెరక గాని భేద భావాన్ని కల్పించదు.

ఈ శ్లోకానికి అమ్మ జీవితమే వ్యాఖ్యానం. సంసారాన్ని తెగద్రెంచుకొని ఎక్కడికో ముక్తి కోసం పాఱిపోయేస్థితి బాధ్యతలను విస్మరించడమే. పెళ్లి అంటే పెద్దపులి అను కునేవాళ్ల భ్రమనివారణ చేయడానికి తాను వివాహజీవితం గడుపుతూ నిర్లిప్తంగా ఉండేస్థితిని ప్రదర్శించారు అమ్మ.

'సంసారబాధ్యతలే ఆధ్యాత్మిక సాధన నాయనా! ఆధ్యాత్మిక సాధన అంటే వేఱే అదేదోకాదు. నువ్వు చేసే ప్రతీపనీ భగవత్సేవ అనీ, భగవదనుజ్ఞాను సారమేననీ అను కోగలిగితే- సంసారంప్రతిబంధకం కానేరదు,' - అమ్మ.

అటువంటి యోగి ఇంద్రియాలన్నీ పరమాత్మభావంతో ఉక్కిరి బిక్కిరి ఔతూ మోక్ష విద్యోన్ముఖాలై ఉంటాయి. ఇంద్రియాలకల్లోలం లేక చప్పబడిపోయినప్పుడు మనస్సు ఆత్మ అతని స్వాధీనములై ఉన్నప్పుడు

'సశాంతి మధిగచ్ఛతి.'

'ప్రజేతకిమ్' అనే అర్జునుని ప్రశ్నకు సమాధానం క్రింది శ్లోకంతో మొదలైంది.

65. **ప్రసాదే సర్వ దుఃఖానాం హాని రస్యోపజాయతే।**
ప్రసన్న చేతసో హ్యాశు బుద్ధిః పర్యవతిష్ఠతే॥

తా: అటు వంటి నిర్మల మైన ప్రసాదగుణం మనస్సులో ఉదయించిన వారికి దుఃఖాలు నశిస్తాయి. ప్రసన్న చేతస్కుడైన అతని బుద్ధి శీఘ్రంగా స్థిరంగా నిలుస్తుంది.

వ్యా: దుఃఖాన్ని సుఖంగా అనుభవించే వాడిని దుఃఖం ఏమీచెయ్యలేదు. తృప్తియే ముక్తి కనుక సుఖాలూ దుఃఖాలూ అంటే మనస్తృప్తి యొక్క హెచ్చు తగ్గులే కాని యాథార్థ్యంలో దుఃఖమంటూ సుఖమంటూ ప్రత్యేకంగా ప్రపంచంలో లేవు. ఉన్న దానిలోనే ఈహెచ్చుతగ్గులను కల్పించుకోడం మానవలక్షణం. లేక మానవ లక్షణం మనస్సు అనే పాదు నుంచిలేచిన తీగలే కాని, నిజానికి వాటికొక ప్రమాణం గాని రూపంగానిలేదు. చాలా మంది మనుష్యులు ప్రపంచలో సుఖంపాలు కంటె దుఃఖపుపాలే ఎక్కువగా ఉందనీ ఆదుఃఖంపోతే ప్రపంచం నందన వనం అవుతుందనీ అనుకుంటారు. కాని తనకు దుఃఖమయ్యే విషయం ఇతరులకు తప్పని సరిగా దుఃఖం అయి తీరాలని నిబంధన ఏమీ లేదనీ గుర్తించడు మానవుడు.

జగత్తు పరమాత్మ కంటే వేఱుకాదు. జగత్తునుప్రేమించి దానితో రాచబాట లేపుకున్న వాడికి ఏమూల చూచినా తానే ఉంటాడు. తనలో ఏమూల చూచినా జగత్తే ఉంటుంది. ఆకారణంగా అతని అహంకారానికి చోటు లేకుండాపోతుంది.

ప్రసాదే అనే మాటను అర్థం చేసుకోడానికి అమ్మమాటలను అర్థం చేసుకోడానికి అమ్మ మాటలను నెమరువేసుకోవాలి.

'అశాంతీ శాంతిలోదే' అశాంతికళాయి ఉంటేనే శాంతి అద్దంలో పాపకనిపిస్తుంది.

గోడ ఇవతల పాయస భోజనాలు మెక్కి చేతులు గోడఅవతల కడుక్కున్నట్లు– గోడమనుష్యుడే– ఇటు తిరిగి నప్పుడు శాంతీ– అటు తిరిగినప్పుడు అశాంతీ. మనిషిబొమ్మతో తోసుకుంటూపోతాడు. వీపుతోమోసుకుంటూవస్తాడు. రెంటికీ చలనం గమనం ఒక్కటే–అనుకోడంలోనే తేడా!

సుఖం ఎంత అవసరాన్ని బట్టి వస్తుందో, దుఃఖం కూడా అంత అవసరాన్ని బట్టేవస్తుంది, అవసరం ఏమిటో పరమాత్మకు తెలుస్తుంది. మనిషికి తెలియదు.

అవసరం చాలా విలువైనది. నాన్నా! పూలమాల కావాలను కున్నాను, కనుక

దారంతో బిగించక తప్పదు. మాలను ధరించాలను కుంటున్నాను కనుక బిగిస్తాను. దాన్నిమోస్తాను.

కాబట్టి నొప్పిని ఇచ్చిందివాడేననే భావన కలగటమూ నివారణే. అయి మనస్సులో ప్రసాదగుణం ఏర్పడి, సుఖదుఃఖాలకు భేదభావం మనసునుంచి తొలగిపోయినప్పుడు అతని బుద్ధి ప్రసన్నతకు స్థానంకాగలదు.

66. నాస్తి బుద్ధి రయుక్తస్య న చాయుక్తస్య భావనా
న చాభావయత శ్శాంతిః అశాంతస్య కుతస్సుఖమ్?॥

తా: అయుక్తునికి బుద్ధి ఉండదు. అతనికి భావన కూడా ఉండదు. భావనలేని వానికి శాంతి ఉండదు. శాంతిలేని వానికి సుఖం ఎక్కడిది? అంటే ఉండదు. అయుక్తుడు అంటే చంచలచిత్తం కలవాడు. అట్టివాడికి వివేకం ఎక్కడనుంచి వస్తుంది? భావన అంటే భగవద్భావన- అస్థిర చిత్తుని మనస్సు తనకు కలిసి వచ్చిన పనులన్నీ తన ప్రయత్నం వల్లనే సఫలమయ్యాయనుకుంటాడు. కలిసిరానిపనులు పరమాత్మ ఆగ్రహం వల్ల విఫలమయ్యాయనుకుంటాడు, చిక్కులు తెచ్చిపెట్టి తన బంధువులూ శత్రువులూ ఏడిపిస్తున్నారనుకుంటాడు. భగవంతుడు తప్ప ఎవరూ చిక్కులు పెట్టలేరనుకోడు. భగవద్భావననే భావన అంటాం భగవంతుని ధ్యానించ డానికి అతనికి బుద్ధిపుట్టదు ఆత్మవివేకం ఉన్నవాడికి దీనికి కేవలం వ్యతిరేకంగాపని చేస్తూ ఉంటుంది బుద్ధి. ఆత్మ వివేకాన్నే యోగమంటారు. ఇంద్రియవ్యాపారాలు చక్కగా పండిన స్థితిలో ఉండడమే యోగం, అట్టి యోగం కలవాడు యుక్తుడు. అది లేనివాడు అయుక్తుడు. అయుక్తునికి శాంతి ఉండదు. శాంతిలేని వాడికి సుఖమూ ఉండదు. ఇంద్రియ వ్యాపారాలు పక్వస్థితిలో పరిపూర్ణములై ఉన్నప్పుడు యోగి మనస్సు సంయమనస్థితిని చెందుతుంది. అట్టివాడు యుక్తుడు కూడా! మనుష్యుడు అయుక్తుడుగా జన్మమెత్తడం స్వప్రయత్నం వల్లకాదు. పరమాత్మసంకల్పంవల్లనే. కాబట్టి జన్మమెత్తింది మొదలు, అతనిభావన బుద్ధిమనశ్శాంతి సుఖం అన్నీ పరమాత్మ అనుగ్రహం మీదనే ఆధారపడి ఉన్నాయని తేలుతుంది. శాంతమూ లేక సౌఖ్యమూ లేదు అన్నాడు త్యాగరాజు.

67. ఇంద్రియాణాం హి చరతాం యన్మనోఽ ను విధీయతే
తదస్య హరతి ప్రజ్ఞాం వాయుర్నావ మివాంభసి॥

తా: ఇంద్రియాలు విషయాలలో సంచరిస్తూ ఉండగా, ఏమనస్సు, వాటినే అను

సరిస్తూనే ఉంటుందో, అది,-నీటిలో పోయేనావను పెదదారి పట్టించి, విసురుగా లాక్కొనిపోయినట్లు అతని ప్రజ్ఞను కూడా హరిస్తుంది.

వివేక నేత్రం పడవకు చుక్కానివంటిది. వెనుకటిశ్లోకంలో అది ఎలా మూసుకు పోతుందో పరమాత్మచెప్పి ఉన్నారు, కళ్లుమూసుకుని విషయ వ్యాపారంలోనే మునకలు వేస్తూ ఉండే మనస్సు సముద్రంలో తుఫానులను రేపేసుడిగాలి వంటిది. అలలూ, కల్లోలం ఇవన్నీ విషయాలతో అట్టిట్టవుతున్న ఇంద్రియాల వంటివి. బుద్ధి తుఫానులో చిక్కిననావలాటిది. వివేక నేత్రం, మూసుకునిపోయినప్పుడు, చుక్కాని కంట్రోలు తప్పిపోతుంది. తుఫాను దాన్ని ఎక్కడకు చేరిస్తే అక్కడకు దానిగతి. తుఫానులు నిత్యమూ ఉండేవే. ప్రపంచమే ఒక పెద్ద తుఫాను. గాలి, ఆపడవ నెత్తుకు పోయి ఏఆాళ్లమీదనో విసిరికొట్టి ముక్కలు చేస్తుంది. ఏ అనంతగంభీర మైన సుడిలోనో ముంచేస్తుంది.

చమురునంటు కోని వత్తికాలిపోతుంది.

'పరమార్థాన్నంటుకోని వ్యక్తి గతి కూడా అంతే. పైశ్లోకంలో తుఫానుల రాక పోకలు మనుష్యుని అధీనంలో లేవు. అవి మనుష్యకృతాలుకావు. అలాతుఫానుల మధ్య చిక్కుబడ్డప్పుడు, ఓడ యజమాని దైవాన్నిప్రార్థించి, 'పరమాత్మా! అపాయాన్ని తప్పించడం నీచేతుల్లోనే ఉంది. అని శరణాగతి పొందుతాడు. అలాగే మనస్సు అధీనంలోనే లేనివాడు కూడా పరమాత్మ శరణం పొందడం కంటే గత్యంతరంలేదు.

లౌకికస్థితులకు ఏది సహాయ పడుతుందో పరమాత్మస్థితిని కూడా అదే ఇస్తుంది. రెండూ పరమాత్మ విలాసాలే.

68. తస్మాద్యస్య మహాబాహో! నిగృహీతాని సర్వశః।
ఇంద్రియాణీంద్రి యార్థేభ్యః తస్యప్రజ్ఞా ప్రతిష్ఠితా॥

తా: కాబట్టి మహా బాహుడవైన అర్జునా! ఎవని ఇంద్రియాలు విషయ సుఖాల నుండి విముఖములై పూర్తిగా నిగృహీతములై ఉంటాయో అతని మనోజ్ఞానము సుప్రతిష్ఠితమై ఉంటుంది.

వ్యా: గీత జీవిత కళకూ, అధ్యాత్మిక కళకూ, సామరస్యం ఏర్పఱచిన శాస్త్రమని లోగడ వ్రాసియున్నాను. ఆత్మ సాక్షాత్కారానికై లోక వృత్తుల నుండి సన్యాసాన్ని పుచ్చుకో నవసరం లేదనీ ఇక్కడ ఉంటూనే, పరమాత్మ సాక్షాత్కారసిద్ధిని సాధించ వచ్చుననీ అమ్మ చెప్పిన వాక్యాలూ గీతా వాక్యాలూ అన్యోన్యం సమర్థించుకుంటు న్నయ్యనీ కూడా లోగడ వ్రాశాను. జీవిత కళకు ఆత్మకళకూ సమన్వయం కుదిర్చిన

విద్యనే యోగమంటారని కూడా వివరించాను. ఆ యోగవిద్యకు ఆదర్శమూర్తిగా చెప్పబడిన వాడు. స్థిత ప్రజ్ఞుడన బడతాడని గతకతిపయశ్లోకాలు వర్ణించాయి.

ఈ స్థిత ప్రజ్ఞుడు ధర్మవీరుడు. ఆత్మవీరుడు ఇహజీవనంలోనే పురుషార్థాలను సాధించిన పురుషోత్తముడు.

దివానిశల సంధ్యాకాలంలాగా ఇతని జీవితక్రమం నిర్లిప్తంగా ఉంటుంది, ఇతడులోక సంబంధిత విషయాలలో, సమభావము, దయాదాక్షిణ్యాలు, సర్వత్ర మమకారమూ, లోకంతో తాదాత్మ్యమూ, పరుల కష్టసుఖాలు తనవిగాభావించ డమూ, ఇలాటిగుణాలు కలిగి తనయందు సకల భూతములందు నొకభంగిస మహితత్వంబున జఋవువాడైన ప్రహ్లాదుడు. లలితమర్యాదుడు.

వ్యక్తిగతంగా నిష్కాముడూ, నిస్సంగుడూ, నిర్వికారుడూ, వశీకృతేంద్రియుడూ, నిర్ద్వంద్వుడూ, సంయమీ శీలీ, ఏకాగ్రచిత్తుడూ బాధ్యతాపూర్ణుడైలోక వ్యవహారాన్ని నిర్వర్తించేవాడై ఉంటాడు.

ఇతనిలో ఉండే పరభావం ఎలా ఉంటుందంటే జగత్తు పరమాత్మ కంటే వేఱు కాదు. అందఱు వ్యక్తులూ వస్తువులూ పరమాత్మ అంశాలే, వ్యష్టిసమూహాలను కలిపి ఒకటే సమష్టిగా గ్రహించడం లోనే పరమాత్మభావం ఉంది వ్యష్టులందఱిలో ఉన్ననేనే సమష్టి అంతటిలోని నేను, చెఱువులో నీళ్లన్నీ రెండు వెల గ్యాలను లనుకోడంలోను తప్పులేదు. ఇదొక గ్యాలను ఇదొక గ్యాలను అనుకోడంలోనూ తప్పులేదు. తను చేసే ప్రతికర్మ అందఱికి సంబంధించి కూడా ఉంటుంది. అందఱి కర్మలూ తనస్వంతాలు గాను అభిన్నంగానూభావిస్తాడు.

ఈవిధంగా పరమాత్మలో సంసారాన్ని లేదా సంసారాన్నే పరమాత్మగానే చూస్తూ తానూ అందులో భాగమైపోగలుగు తాడు- తానే అవిగా కాగలుగుతాడు. తానే సంసారమై ఉన్నా తనలో ఆ సంసారాన్ని ఉంచుకోడు.

ఈ ప్రయత్నంలో అతని ఇంద్రియములు అతన్ని వ్యాకుల పెట్టవచ్చు. అతని మనస్సు సంకుచితం కావడానికి ప్రయత్నించవచ్చు. సంగం, కామం, క్రోధం సమ్మోహం, బుద్ధినాశం, సర్వనాశం, ఇవి ద్వారంలో నిలిచి అతన్ని జంకించ వచ్చు. కాని అతడు ఈ ఇంద్రియాల వల్ల కలిగే హానిని సులభంగా తప్పించు కోడానికి రెండు చక్కటి ఉపాయాలను తెలుసు కున్నాడు కనుక ఈ ఇంద్రియాల దండయాత్రను అవలీలగాజయిస్తాడు. ఆ ఉపాయాలు ఏమిటంటే

1. రాగద్వేషాలను పూర్ణభావం పొందించి సంకుచితత్వం వాటికి లేకుండా చేయడం. ఎప్పుడైతే సర్వత్ర ఏకభావాన్ని పొందుతాయో, రాగద్వేషాలు, ఒక

దానితో మఱొకటి లయమై అంతరించి పోతాయి.

2. రెండోపని. అతడు చేసే ప్రతిపనీ భగవదర్పణంగా చేస్తాడు. భగవదర్పణం పరుసవేది విద్య. కష్టమూ సుఖమూ రెండూ ఎలా భగవద్దత్తములుగా అనుకుని జీవయాత్ర ఆరంభించాడో తాను చేసిన ప్రతి పనికి ఫలంగా వచ్చేకష్ట సుఖా లను గూడా అతడు పట్టించుకోడు. అప్పుడతడు జ్ఞానకర్మేంద్రియాలు, కంజాక్షు నర్చించుకరములు, అనే పద్యంలో చెప్పబడ్డట్లు, అన్నీ భగవద్వాహ కాలై పర్యవసిస్తాయి.

ఈ విధంగా పరిణతి చెందిన స్థిత ప్రజ్ఞుని ఇహభావాన్ని, జాగృతిభావంగానూ, పరభావాన్ని నిశాభావంగానూ పరమాత్మ ముందు శ్లోకంలో చెప్పబోతారు.

స్థిత ప్రజ్ఞుని గూర్చి చెప్పిన ఈ 18 శ్లోకాలలోను, గీతయొక్క అష్టాదశాధ్యా యాలలోని సారమంతా పరమాత్మ క్లుప్తపఱచి చెప్పారు. ఈ విధంగానే అయిదో అధ్యాయంలో జీవన్ముక్తుని యొక్కా, పంద్రెండవ అధ్యాయంలో భక్తుని యొక్కా, పదునెనిమిదవ అధ్యాయంలో జ్ఞాననిష్ఠుని యొక్కా, వర్ణనలు చేయబడ్డాయి. ఈ అన్నింటిలోనూ, స్థిత ప్రజ్ఞుని వర్ణనే గీతకు మకుటాయమానంగా ఉంది. ఇందులో సిద్ధుని లక్షణాలతో బాటు సాధకుడి లక్షణాలూ చెప్పబడ్డాయి. జ్ఞానయోగ, కర్మయోగ, భక్తియోగాలు చెప్పబడ్డాయి. సమస్తోపాయాలూ నిష్ఫలా లయినా, ఎన్నడూ నిష్ఫలం గాని భక్తిమార్గం ఇందులో వర్ణించబడింది. భక్తి మార్గంలో పరిణతుడైన స్థితప్రజ్ఞుడికీ, వేదాంతంలో వర్ణించబడ్డఘటావస్థకూ, సాక్షాత్సంసారంలో అమ్మచేసి చూపించిన సంసారయజ్ఞానికీ ఏమీ భేదంలేదు.

ఇంద్రియాణీంద్రి యార్థేభ్యోయత్ ప్రత్యాహరణంస్ఫుటం।
యోగే కుంభక మాదాయ యత్ప్రత్యాహార ఉచ్యతే
యద్యత్పశ్యతి చక్షుభ్యాం తత్తదాత్మేతి భావయేత్॥
యద్యచ్ఛృణోతి కర్ణాభ్యాం తత్తదాత్మేతి భావయేత్
లభతే నాసయా యద్య త్తత్త దాత్మే తిభావయేత్,
జిహ్వయాయద్ర సం హ్యత్తి తత్తదాత్మేతి భావయేత్॥
త్వచా యద్య త్స్పశే ద్యోగే తత్త దాత్మేతిభావయేత్।
యోగతత్వోపనిషత్తు

నిత్యజీవితాన్నే ఉపనిషత్తుగాచేసి చదువుకున్నదమ్మ.

మనో మార్గం వేఱు. సాదా్రబదుకు మార్గం వేఱు. యోగమార్గం వేఱు, జ్ఞాన మార్గం వేఱు. అని బోధలు ఉపన్యాసాలు, పదవాక్య అర్థవివాదాలూ ఈ ఆర్భాటాలు,

ప్రచారాలూ పెట్టుకోలేదు. అన్నాద్భవంతి భూతాని అనే అసలైన జీవిత స్కంధాన్నే బీజావస్థనుంచి మొలేసిపెంచి పెద్ద చేసింది. అమ్మ దానివలన జరిగిన గారడీ ఏమంటే

69. **యా నిశా సర్వ భూతానాం తస్యాం జాగర్తి సంయమీ।**
యస్యాం జాగ్రతి భూతాని సా నిశా పశ్యతో మునేః॥

తా: సకల జీవులకు ఏది రాత్రి యో దానియందు సంయమిమేలు కొని ఉంటాడు, సకల జీవులూ దేని యందు మేలుకొని ఉంటాయో అందులో మునిరాత్రినే చూస్తాడు.

వ్యా: ఈ శ్లోకం వ్యంగ్యంగానూ, ధ్వన్యాత్మకంగాను వ్రాయబడ్డది. సందర్భోచితంగా అర్థం చెప్పుకోవాలి. అంటే శ్లోకభావం ఈ విధంగాతేలుతుంది.

సర్వభూతాలకు పగలనీ రాత్రి అని భిన్న భావంతో వ్యవహరింపబడే ఒకే అభిన్నమైన ఏకకాల రూపానికి విభాగాలు విభేదాన్ని కాని వికారాన్ని కాని యోగి చూడడు. తెలియనిది లేక పోయినా తెలిసినది లేక పోయినా ఒకటే స్థితి. ఇన్ని బ్రహ్మలు లేవు. మారుతూ ఉన్న బ్రహ్మ ఒక్కటే, చీకటి వెలుతురు కాధారం. చీకటంటే ఘనీభవించిన వెలుతురే, ప్రజ్ఞానం బ్రహ్మయితే అజ్ఞానమూబ్రహ్మ.

'సదేవ సోమ్మేద మగ్ర ఆసీత్' అని ఒక ఉపనిషత్తు చెబితే 'అసదేవఅగ్ర ఆసీత్, అని మఱో ఉపనిషత్తుచెబుతుంది.

వ్యాఖ్యాతలందఱూ నిశ అంటే అజ్ఞానమనీ, అవిద్యఅనీ, మాయ శోకం ఇటువంటి వెలితిని అసత్తును సూచించడానికి వాడుకున్నపదమనీ జాగర్తి అంటే జ్ఞానం బోధ, పరమాత్మ ఇలాంటి అర్థచ్ఛాయలను సూచించడానికి అభిప్రాయపడ్డారు.

'విద్యాది ప్రకాశత్వా దవిద్యా రాత్రి' రుచ్యతే

అనే సన్యాసోపనిషద్వాక్యాన్ని దీనికి ప్రమాణం గా స్వీకరించారు. ఆత్మ విద్య నభ్యసించే వాడికి ప్రకాశమానమైన విద్య పగలు, అట్టి ప్రకాశంలేని అవిద్యరాత్రి.

తిలకుగారు నిశకు కామ్యకర్మాసక్తి అనీ, జాగర్తికిమోక్ష కర్మాసక్తి అనీ అర్థం చెప్పారు.

సంయమం అంటే ఏమిటి?

శోక బంధం మనోరమ సూత్రమయ్యే వ్యాపారం ఏది ఉందో, శాంతంగా, శివంగా, సుందరంగా, చీకట్లోగాని వెలుగులోగాని, యావన్నగ్నమైన నవ్యమైన, సత్యమైన రసమూర్తిని దర్శించగల శక్తి ఏది ఉన్నదో, సృష్టినంతా మఘేకంగానూ

సత్యముఖీకృతంగానూ, చేసికోగల చిన్మయధారణ శక్తి ఏది ఉందో ఆశక్తిని సంయ మనం అంటారు.

ఆ శక్తికల వాడు సంయమి

ముని అంటే ఎవరు?

షట్చక్రాలను భేదించుకొని, ఆజ్ఞాచక్రాన్ని దాటి కుండలినిసహస్రార సమ్మేళన భూమియందు- శివశక్తుల ఆనంద బిందువులు నిస్రుతమౌతాయి.

అంత వఱకు ప్రకృతి వ్యాపారాలను గ్రహించ గలగడం మాత్రమే శక్తిగాగల జ్ఞానేంద్రియాలకు, ఇచ్ఛాశక్తి క్రియాశక్తి కలిగి, తమకు ప్రేరణ కలిగినట్లు భావిస్తూ, బయటి ప్రపంచంలో ఆయా వ్యాపారాలను సృష్టిచేసే శక్తి గలవౌతాయి. ఎదుటి గులాబీపూవుల కత్తరు లేకపోయినా, భావించిన రీతిగా ఆయా సౌరభాలను తాము అనుభవించడానికిగాని, ఇతరుల చేత అనుభవింపజేయడానికిగాని ఘ్రాణేంద్రియ సమర్థత కలిగినవౌతాయి. అలాగే చెవి, నాలుకా, ఘ్రాణేంద్రియం లాగానే సమర్థత కలిగిన వౌతాయి.

అన్ని భూతాలకూ ఏది విజ్ఞానమో, సుఖమో, జాగ్రదవస్థయో, దానిలో ముని యైనవాడు అవిద్యారూపంగా ఉన్నపరమాత్మను చూడగలడు. అంటే విద్యల రూప కంగా ఉన్న పరమాత్మకు గాని, జగద్రూపకంగా ఉన్న పరమాత్మకు గాని, ముని భేదం పాటించడని భావం.

నేను జగత్తు సత్యమంటాను!

మిథ్య అంటే లేదని కాదుగా! మార్పు. మార్పు ప్రతి వస్తువుకూ ఉంది. మారేది మారని దాన్లో నుంచి పుట్టింది. రెండూ సత్యాలే.రెండూ నిత్యాలే.

'సంయమి, ముని, మారేదాన్లో మారని దాన్ని చూస్తారు. ప్రపంచమూ అందలి వ్యక్తులూ, భూతాలూ అన్ని ఆకారాలు, ఆయన ఆకారాలు గానేచూస్తారు. అన్ని ఆకా రాలు ఆయనవే. కనుక ఆయన నిరాకారుడు. ప్రతివ్యక్తిలో తననూ, చూచుకోగలడు ముని, ప్రతి సంఘటన లోనూ భగవత్ప్రసాదాన్ని సందర్శించగలడు. ఇతరులో వారి వారి అభిరుచుల్ని బట్టి ప్రపంచాన్ని స్వార్థరూపాలలో నిశావత్ గాను జాగ్రత్ వత్‌గానూ చూస్తారు.

జ్ఞానికి భూతభవిష్యద్వర్తమానాలుండవు. భూమి పరిభ్రమించడం వల్లనే కదా! రాత్రి పగలు మనకేర్పడు తున్నాయి. అంతరిక్షంలోకి రాకెట్టులో ఎగిరి భూపరి భ్రమణ వేగంతో అపసవ్యంగా భూమిచుట్టూ మనం తిరగ గలిగతే- ఈనాడు ఇది

సంభవం కావడంలో ఏమీ ఆశ్చర్యం లేదు- సూర్యుడు నిత్యమూ మన యెదుట కదలకుండా నిలిచే ఉంటాడు, అప్పుడు నిశగాని, పగలుగాని మనకు ప్రత్యేకంగా కనిపించవు.

భూత భవిష్యద్వర్త మానాలూ ఉండవు. అలాగే దేహపరిమిత భావం నుంచి అతిక్రమించి పైకి పోయిన యోగికి విద్యావిద్యలభేదం కూడా ఉండదు.

70. **ఆ పూర్యమాణ మచలప్రతిష్ఠం**
సముద్రమాపః ప్రవిశన్తి యద్వత్।
తద్వత్ కామా యం ప్రవిశన్తి సర్వే
స శాంతి మాప్నోతి న కామ కామీ॥

తా: అంతటా నిండి నిశ్చలంగాను నిలుకడగాను ఉన్న సముద్రంలోకి నదీ జలాలు ప్రవేశించి, అందులో ఎలా అంతర్లీనములై పోతాయో అదే విధంగా జ్ఞాని యొక్క మనస్సులోకి కామ ప్రవృత్తి ప్రవేశించినా అందులో లీనమైపోతుంది.

వ్యా: నదీ జలాల ప్రవేశం వల్ల సముద్రం ఎక్కువ కావడం కాని తక్కువ కావడం కాని ఉండదు. అటువంటి ప్రశాంతమైన మనస్సు అబ్బిన వానికి, నిత్యశాంతి నిలుకడగా ఉంటుంది. కామాలను కామించే వాడి మనస్సుకు ఈ నిశ్చలత్వం ఉండదు.

సహజ తృప్తికల వానికి మోక్షాసక్తి కూడా ఉండదు. 'నమోక్షస్యాకాంక్షా నచ విభవ వాంఛాపి చ నమే' అను కుంటాడు.

71. **విహాయ కామాన్ యస్సర్వాన్, పుమాన్ శ్చరతి నిస్పృహః।**
నిర్మమో నిరహంకారో స శాంతి మధిగచ్ఛతి॥

తా: ఎవడైతే కోరికలను విడిచి పెట్టి కామాటం లేకుండా, నాది పరాయి వాడిది అనే లంపట లేకుండా, చరించుతూ ఉంటాడో, అతడు శాంతిని పొందగలడు.

వ్యా: ప్రపంచంలోని, శోకమూ, నిరాశా, అహంకారాన్ని, లోభాన్ని-పట్టుకొని వ్రేలాడుతూ ఉంటాయి. స్వప్రయత్నం విఫల మయినప్పుడు అహంకారానికి గాయం తగులుతుంది, అహంకారానికి గాయంతగిలితే నిరాశ పుట్టుకొస్తుంది. నిరాశకు పునాది సస్పృహమైన కామన, కామన నిస్పృహంగా ఉంటే – ఆ శారహి తంగా ఉంటే ఫలాఫలరూపాలతో సుఖదుఃఖాలు మనస్సుకు తగలవు. నిస్పృహంగా కామన కలుగ గలదా అని ప్రశ్న, ప్రయత్నంనాది అనే భావన ఎంత వఱకు మనస్సును ఏడిపిస్తుందో ఫలాఫల ప్రభావం కూడా దాని వెంట నంటక తప్పదు. ప్రయత్నం నాది కాదు. ఎవరి

ప్రేరణ వల్లనూ నిమిత్త మాత్రంగా నేనీ పనిని చేస్తున్నాననే భావన రాగానే మమత్వం చచ్చి పోతుంది. మమత్వ బంధం వదలి పోగానే అహంకారానికి నిలవడానికి స్థానం లేకుండా సమసి పోతుంది. అంతటికీ మూలకారణమైన చెడుగు అహం కర్తృత్వ భావం.

దీనికై ప్రతి కార్యంలోను భగవత్ప్రేరణను మన నిమిత్త మాత్రత్వమును, త్రికరణ శుద్ధిగా అంగీకరించిన నాడు ఏవిధమైన హతాశ, దుఃఖమూ, మనస్సును బాధించదు.

కాళ్లు నడుస్తున్నయి కనుక మనమే నడుస్తున్నాం అనుకుంటాం, కాని నడిపిస్తున్న శక్తి అర్థం కావడం లేదు. ప్రేరణ అర్థం కాదు. ప్రయత్నం అర్థం అవుతుంది. కనుక కోరికలను విడిచి పెట్టడ మంటే కోరికల లంపటను విడిచి పెట్టడమనే అర్థం చేసుకోవాలి. కోరికలను విడిచి పెట్టాలను కోవడమూ ఒకకోరికే.

కాని కోరికలు లేకుండా జీవితమే గడవదు. కాని భగవందుని ప్రేరణను గుర్తించి పనిని మనం భగవ దర్పణంగా చేసుకుపోతూంటే అహంకార జనితమైన దుఃఖాలు మనకు దూరంగా ఉంటాయి. పైగా పరమాత్మ రక్షణ సహజంగా మనకు ఛత్రం పట్టడానికి సిద్ధమవుతుంది. అశాంతి కూడా భగవత్ప్ర సాదమే అవుతుంది. అశాంతీ శాంతి లోనిదే.

అహంకార రహితములయిన కోరికలు మాత్రం వ్యక్తిని బాధించకుండా ఉంటాయా? అంటే రామకృష్ణ పరమ హంస ఇలా అన్నారు.

"మేకతలను నటికి వేసిన తరువాత ప్రాణం ఇంకా ఉన్నట్లుగా కొంచెం సేపు మొండెం కొట్టుకుంటుంది. జ్ఞానోదయం కాగానే జ్ఞాని అహంకార శేషాన్ని కూడా, ఇటువంటి బలివేదన బాధించక తీరదు. శరీర యాత్రకుపకరించడానికి గాని రవ్వంత అహంకారలేశం దేహంలో శేషించి నిలువక మానదు. కాని సంసార బంధంలో జ్ఞానిని మళ్లీ కట్టివేయడానికి ఆ రవ్వంత అహంకారానికి శక్తి చాలదు.

72. ఏషా బ్రాహ్మీ స్థితిః పార్థ! నైనాం ప్రాప్య విముహ్యతి।
స్థిత్వాఽ స్యా మంతకాలేఽ పి బ్రహ్మ నిర్వాణ మృచ్ఛతి॥

తా: ఓ పార్థా! ఇదియే బ్రాహ్మీస్థితి! దీనిని ప్రాప్తించిన పిదప మనుష్యుడు మోహాన్ని పొందదు. మరణకాలమందైనను. దీనిలో స్థిరపడినట్టి వాడు బ్రహ్మైక్య సంధానాన్ని పొందగలడు.

వ్యా: - "ముముక్షుత్వమే మోక్షం"

ఇటువంటి స్థితే బ్రాహ్మీస్థితి అని వర్ణించ బడ్డది. ఈ స్థితిలో ఉన్న వాడికి అంతా ఆత్మగానే గోచరిస్తుంది. అన్ని శబ్దాలు తన శబ్దాలుగాను, అన్ని భూతాలూ తనకంటె వేఱు గానట్లూ తెలుస్తుంది. ఏమీ తెలియని, అంతా తెలిసిన సంపూర్ణ స్థాయి స్థితి ఇది.

ఈ స్థితిని పొందిన వాడికి ద్వంద్వాల వికల్పం తోచదు. ఏ ప్రయత్నము తానుగా చేస్తున్నాననిభ్రమ పడడు. అన్నీ తానే అనే మనస్తత్వంతో ఆనందిస్తుంటాడు. ఏ విషయలో భ్రమ పడడు.

ప్రతి జీవికీ మరణం సహజం, మరణ కాలంలో ఈజ్ఞానంకలిగినా, అతనికి మోక్షం లభిస్తుంది. ఇటువంటి జ్ఞానం కలగడమే, దివ్యత్వం కలగడం. దేహధారిగా ఉన్నప్పుడే ఈ జ్ఞానం కలిగినవాడు జీవన్ముక్తుడౌతాడు. మరణకాలంలో కలిగితే అతడు బ్రహ్మ పదాన్ని, బ్రహ్మ నిర్వాణాన్ని పొందుతాడు.

ఇది శ్రీమన్మాతృగీత లోని సాంఖ్యయోగము అను ద్వితీయాధ్యాయము.

మాతృగీత

తృతీయాధ్యాయము

కర్మయోగము

భగవద్గీతకు మూలకందం జీవనమరణ సమస్య. ప్రకృతి చేతిలోని మారణా యుధ మది. దానికి వ్యష్టి సమష్టి భేదాలు లేవు. తప్పించుకోరాని దైవికమది.

అవ్యయమైన నగ్నసత్యం బ్రహ్మ పదార్థం. మారేదీ మారనిది కూడా మారని దానివైపే సాగిపోతుంది. సర్వమూ తానై భేదం లేనిది. భేదం రానిది ఆ బ్రహ్మ పదార్థం. అది అవ్యక్తం. 'అవ్యక్తాదీని భూతాని'. 'అవ్యక్తోஉ క్షర ఇత్యుక్త స్తమాహుః పర ఘాంగతిం యంప్రాప్య న నివర్తన్తే తద్ధామ పరమం మమ.

జీవన్మరణ చక్రాన్ని తప్పించుకొని ఈ పరమ స్థానాన్ని చేరుకోడానికే జగత్తు ప్రయాణిస్తున్నది. అందఱూ అక్కడకు చేరుకునేవారే. 'అందఱకూ సుగతే' అన్నది అమ్మ.

ఈ సుగతిని పొందడానికి రెండు మార్గాలను పరమాత్మ చెప్పారు. (1) జ్ఞాన మార్గం (2) కర్మమార్గం. జ్ఞాన మార్గాన్ని గూర్చి సాంఖ్య యోగంలో విపులంగా బోధించి, దాని గమ్యస్థానమే బ్రాహ్మీస్థితి, సర్వశ్రేష్ఠస్థితి అని వర్ణించారు పరమాత్మ.

అటువంటి శుద్ధమార్గమైన మార్గాన్ని విడిచిపెట్టి క్షుద్రమైన హింసామార్గాన్ని ఎందుకు పరమాత్మ బోధిస్తున్నారో అర్జునునికి అర్థం కాలేదు. కనుక పరమాత్మను అర్జునుడీవిధంగా అడిగాడు.

జ్యాయసీ చే త్కర్మణస్తే మతా బుద్ధి ర్జనార్దన!।
తత్కిం కర్మణి ఘోరే మాం నియోజయసి కేశవ!॥

తా: జనార్దనా! కర్మకంటె జ్ఞానము శ్రేష్ఠమని భావిస్తే నన్నీ హింసాత్మకమైన కర్మలో ఏల నియోగిస్తున్నారు?

2. వ్యామిశ్రేణేవ వాక్యేన బుద్ధిం మోహయసీవ మే।
తదేకం వద నిశ్చిత్య యేన శ్రేయోஉ హమాప్నుయాం॥

తా: భగవాన్! నీవొకసారి జ్ఞానమార్గం గొప్పదని చెప్పుతున్నావు. ఇంకోసారి కర్మమార్గమే గొప్పదని చెప్పుతున్నావు. ఈ తికమక మాటలవలన నా బుద్ధి మోహంలో పడి, ఏది సత్యమో ఏదసత్యమో తెలుసుకోలేకుండా ఉన్నది. కాబట్టి

ఏమార్గం చేత శ్రేయస్సబ్బుతుంతో ఆ మార్గాన్నే నిశ్చయించి చెప్పు అని అర్జునుడు పరమాత్మ నడిగాడు.

శ్రీ భగవానువాచ

పరమాత్మ ఇలా చెబుతున్నాడు.

3. లోకేఽ స్మిన్ ద్వివిధా నిష్ఠా పురాప్రోక్తా మయాఽ నఘ।
జ్ఞాన యోగేన సాంఖ్యానాం కర్మయోగేన యోగినాం॥

తా: పుణ్యాత్ముడా! లోకంలో అనాదినుండి సాంఖ్యులకు జ్ఞాన యోగం మూలంగాను, యోగులకు కర్మయోగ మార్గం మూలంగాను ధర్మ నిష్ఠ రెండువిధాలుగా నాచేత చెప్పబడింది.

వ్యా: ఇక్కడ సాంఖ్యులంటే ఎవరు? యోగులంటే ఎవరు? అని ప్రశ్నలు. "శుద్ధాత్మ తత్వవిజ్ఞానం సాంఖ్యమిత్యభిధీయతే" అని లోగడ వ్రాసి ఉన్నాను.

యోగులంటే ఎవరు? అత్మతత్వ విజ్ఞానమే వీరి పరాకాష్ఠ కూడాను. అయినా వీరు లోకాన్ని విడిచిపెట్టి వెళ్ళరు. యాగాది కర్మలు చేస్తూ అందటికి ముక్తి లభింపచేయడంలోనే వీరికి ముక్తి లభించడమేకాక అదే వీరి ముక్తి అయి ఉంటుంది.

మొదటి ప్రకృతి వ్యష్టి. రెండోది సమష్టి. జ్ఞానం నిష్ఠవలన లభిస్తుందా?

"నిష్ఠ అంటే సాధనకి పరిపక్వమైన అవస్థ. అది భగవత్ప్రసాదంగా రావలసిందే గాని మనంతట మనం అభ్యసించేదికాదు" అమ్మ.

బ్రహ్మచర్యం, గార్హస్థ్యం, వానప్రస్థం, సన్యాసం అనే ఆశ్రమ చతుష్టయంలో సన్యాసం దాని కనుకూలంగా ఉంటుందంటారు శంకరులు.

సన్యాసం పుచ్చుకోవడమనేది వేఱు. సన్యాసి కావడం వేఱు." అంటుంది అమ్మ.

ప్రకృతిచే ఉత్పన్నమైన గుణాలే గుణములందు వర్తిస్తాయని గుర్తించి, ఆ ప్రకారంగా మనస్సును, ఇంద్రియాలను, శరీరాన్ని మలుచుకొని, సమస్త క్రియలందు కర్తృత్వ భావనను విస్మరించి, అభిమానం లేకుండా, సర్వవ్యాపి, సచ్చిదానంద ఘనుడు అయిన పరమాత్మతో ఏకీభావాన్ని చెందడమే జ్ఞానయోగం అంటారు. దానికే సన్యాసమని మఱో పేరు.

ఫలాసక్తిని త్యజించి, భగవదాజ్ఞానుసారంగా, కేవలం భగవదర్థంగా, సమత్వ బుద్ధితో సమస్త కర్మలను ఆచరించడం కర్మయోగమంటారు. దీన్నేసమత్వయోగమనీ, బుద్ధియోగమనీ, కర్మయోగమనీ, తదర్థ కర్మయోగమనీ, మత్కర్మమనీ, వేర్వేరు పేర్లతో పిలుస్తారు.

4. నకర్మణా మనారంభాత్ నైష్కర్మ్యం పురుషోఽ_ శ్నుతే।
న చ సన్న్యసనా దేవ సిద్ధిం సమధిగచ్ఛతి॥

తా: కర్మలను మొదలుపెట్టకుండా ఊరుకుని ఉండడం వల్లనే పురుషునికి నైష్కర్మ్య సిద్ధి కలగదు. కేవలం సన్యాసం పుచ్చుకోవడంవల్లనే జ్ఞానసిద్ధికూడా లభించదు.

వ్యా: పురుషునికి ఏ అవస్థ సంభవించడంవలన కర్మకు అకర్మకు భేదం లేకుండా తొలిగిపోతుందో ఆ అవస్థను, అంటే కర్మకు ఫలోత్పత్తి కాకుండా ఉండే స్థితిని నైష్కర్మ్యమంటారు. చెట్టు కాస్తే కదా దానికి అంకురస్థితి కలగడం. నైష్కర్మ్యంలో తన తాలూకు ఫలం ఒక్కటే కర్త ప్రధానంగా పెట్టుకోడు. అందటి ఫలప్రాప్తి అతని మనసును ఆవరించి ఉంటుంది. అది మహాసముద్రం. వ్యష్టి ప్రయోజనాలు అందులో దూఱవు. కనుక అది నైష్కర్మ్యమే అవుతుంది.

1970కి పూర్వం ధర్మయుగ్ (హిందీ వారపత్రిక)లో ఒక యథార్థమైన యోగి అనుభవం ప్రకటించబడ్డది. ఆ యోగి తానేమి కర్మలు చేయకుండా ఉంటే ఏం జరుగుతుందో చూడాలనుకున్నాడు. చేతులతోకదా కర్మలు చేసేది. కర్కట బంధంలో చేతుల వేళ్ళను బంధించి ఆహారం కూడా లేకుండా అరణ్యంలో ఏదో ఒక మారుమూలకు పోయి కూర్చున్నాడు.

పొరుగూళ్ళకు పోవడానికి ఆ అడవిని దాటివెళ్ళే దారి ఒకటి ఉంది. ప్రజలా దారి వెంట వెళ్ళుతుండేవారు. ఒకనాడా దారిలో తిరుగుతున్న పులి కన్పించింది. ప్రజలు భయంచేత ఆ దారిని మార్చుకుని మరోదారిని ఎంచుకున్నారు. క్రొత్తదారి ఈ యోగి కూర్చున్న చెట్టుప్రక్కల నుండి సాగింది.

రోజూ ఒక ముసలమ్మ పొరుగూరికి పోతూ వ్రేళ్ళను కట్టేసుకుని కూర్చున్న యోగిని చూచి 'పాపం' మాటలు రావు అనుకొని రెండు రొట్టెలు అతనిముందు పడేసి వెళ్ళింది. తిరిగివస్తూ ఆ రొట్టెలు ఎలా పడేసినవలాగే ఉండడం చూచింది. "పాపం తినడం కూడా చేతకాదు. చేతులు పడిపోయాయి." అనుకొని రొట్టెలను ముక్కలుచేసి నోట్లోకి త్రోయడం మొదలుపెట్టింది.

యోగి లోకంవల్ల తనకు వచ్చిన ఆయాచిత శాంతి భంగానికి వ్యాకులుడై హిమాలయాలకు చేరాడు. చేతులను విప్పలేదు. ఒక కొండ చఱియపైన నడుస్తూ మంచులో కాలుజారి అంత ఎత్తునుండి క్రింద ప్రవహించే నదిలో పడ్డాడు. చేతులను మాత్రం విప్పలేదు. దెబ్బలు తగిలి స్మృతి లేకుండా ఉన్న అతని శరీరం ప్రవాహంలో కొట్టుకుపోయి ఒకరేవు చేరింది. ఆ రేవులోని మనుష్యులు ఆయన్ను ఇంటికిచేర్చి

మందిప్పించి బ్రతికించారు. ఇంత జరిగినా అతను చేతులు విప్పలేదు. అతడు బెనారెస్ హిందూ యూనివర్శిటీలో ఉపన్యాసమిస్తూ ఈ శ్లోకాన్నే గుర్తుచేశాడు.

ఐతే అనైచ్ఛికంగా జరిగేది కర్మ అవుతుందా?

సూర్య కిరణాలవలన కోట్లకొలది జీవరాసులుత్పన్నము లౌతాయి. బ్రదుకుతున్నాయి. చస్తున్నాయి. తమవలన ఈ సృష్టి ఇలా జరుగుతున్నదని సూర్యకిరణాలు అనుకుంటాయా?

అనుకోవు. వాటికి మెదడులేదు. ప్రకృతిలో తటస్థత్వం ఉంది. ప్రాణంలేని వస్తువు లేదు. దేహాన్నంటిపెట్టుకొని ఉండేది ప్రాణం. అది జడమూ. చేతనమూ కూడా. శరీరాన్ని అంటి పెట్టుకుని ఉంటే జడం. మనసును అంటిపెట్టుకని ఉంటే చేతనం. ఇచ్ఛకు ప్రస్థుతత్వం (అవసరం) అక్కఱ లేదు. అది ప్రేరణను కల్పిస్తుంది. కర్త లేకుండా దానంతట అదే జఱిగే కర్మం వికర్మ మంటారని ముందు ముందు రాబోతుంది.

ప్రేరణవలన పనులు అవుతాయి. కర్మకు వస్తు ప్రస్థుతత్వం ఉంది. దానికి కారణంగా ఇచ్ఛాశక్తి కూడా ఉంది. ప్రకృతి అంటే ద్రవ్యభూమియే కాదు. ప్రేరణ కూడాను. ప్రేరితములైన ద్రవ్యశక్తులు కర్మలుగా రూపొందుతున్నాయి. దాన్నే పరివర్తనమూ, పరిణామమూ అన్నారు. ఒక్కక్షణం కూడా ప్రకృతిని పరిణామం చెందకుండా ఉండనీయదు. ఫలితం? ఇచ్ఛకు, కాళ్ళు, చేతులు, మెదడూ లేవు.

5. న హి కశ్చిత్ క్షణ మపిజాతు తిష్ఠ త్యకర్మకృత్।
కార్యతే హ్యవశః కర్మ సర్వః ప్రకృతిజై ర్గుణైః॥

తా: ఏ ప్రాణి కూడా అకర్మకృత్తుగా క్షణమైనా జీవించి ఉండజాలదు. సర్వ ప్రాణులు స్వభావ జన్యములైన గుణముల ప్రేరణచేత తమ కిష్టమున్నా లేకపోయినా ఆయా కర్మలను చేస్తూనే ఉంటాయి.

వ్యా: ఈ శ్లోకంలో మనుష్యుడు చేసే పనులపైన అతని కర్తృత్వం ఎంతగా ఉన్నదో స్పష్టంగా చెప్పబడింది. నేను ఏపనీ చేయను అని భీష్మించుకొని, వ్రేళ్ళు బిగించుకొని కూర్చున్న యోగి అనుభవాన్ని క్రిందటి శ్లోకంతో వ్రాసి ఉన్నాను. శిల ఏపనీ చేయకుండా ఉంటున్నది కదా అనుకుంటాం. శిలా రూపంలో కోట్ల కొలది అణువులు ప్రచండ వేగంతో తిరుగుతూ ఉంటాయి. వాటి అన్యోన్యాకర్షణమే శిలా రూపాన్ని ఏర్పఱుస్తున్నది. కేవలం ఉండడమూ కూడా ఒక పనే. ఉండడం ఏవిధంగా పనికాగలదనుకుంటారో! కాని శిల కూడా సముద్రంలాగానే, తరంగాలతో అక్కళిస్తూ

ముక్కళిస్తూ ఉంటుంది. వేడికి పెద్దదౌతుంది. చలికి ఇల కఱుచుకుపోతుంది. దానికీ ఉచ్ఛ్వాస నిశ్వాసాలున్నాయి. ప్రతి ఱాయిలోను శాపగ్రస్త అయిన ఒక అహల్య దాగి ఉండనే ఉన్నది.

తనవలన పనులు జఱుగుతున్నప్పుడు తాను చేయడంలేదని అనుకోవడం ఎలాగా అనుకుంటే 'ఇదే నీదనుకోకుండా సర్వం నీదే అనుకోమనిగాని నీదనుకో వద్దని కాదు'.

మనుష్యుడు బ్రతికి ఉండడం పనికాదా? నిద్రిస్తున్నప్పుడతని గుండె కొట్టు కుంటున్నది. రక్తం ప్రవహిస్తున్నది. గాలి లోపలికీ బయటికీ పోతున్నది. ఏపనీ చేయ కుండా జరగకుండా బ్రదికి ఉండడం సాధ్యం కాదు. ఇవన్నీ ప్రకృతి వ్యాపారాలంటా రేమో! ప్రకృతియే అన్ని పనులకు కర్తగా ఉండగా మూఢత్వం చేత మనం చేస్తు న్నామనుకుంటాం అన్నారు పరమాత్మ రాగల 21వ శ్లోకంలో ఆ శ్లోకం ఇది.

ప్రకృతేః క్రియమాణాని గుణైః కర్మాణి సర్వశః
అహంకార విమూఢాత్మా కర్తాహమితి మన్యతే॥

అకర్మకృత్ అనేమాట కూడా చాలా అర్థవంతమైనది. కర్తలను విడిచిపెట్టి కర్మలను పుణ్యపాప ఫలాల నంటగట్టిన ప్రజ్ఞ కూడా మనుష్యునిదే.

6. కర్మేంద్రియాణి సంయమ్య య ఆస్తే మనసా స్మరమ్
ఇంద్రియార్థాన్ విమూఢాత్మా మిథ్యాచార స్స ఉచ్యతే॥

తా: హస్తపాదాది కర్మేంద్రియాలను బిగపట్టి విషయాలను మనస్సుతో ఆలో చిస్తూ ఉండే విమూఢాత్ముడు అంటే మోహవివశమైన అంతఃకరణంగలవాడు మిథ్యా చారుడు పాపాచారుడు అనబడతాడు.

వ్యా: పరమాత్మ అనుగ్రహం చేతనే దేహేంద్రియాల అదుపు మహా నిగ్రహం లభిస్తుంది. విశ్వాసం లేక హఠంచేత కర్మేంద్రియాలు తాను చెప్పినట్లు వింటున్నా యని భావిస్తూ, మనస్సులో ఇంద్రియ సుఖాలను నెమరువేసుకునే మూఢాత్ముడు మిథ్యాచారి అనబడతాడు.

"బలవా నింద్రియ గ్రామో విద్వాంస మపి కర్షతి" అని విద్వద్వాక్యం.

శారీరక వ్యభిచారమే వ్యభిచారం కాదు. కాఫీత్రాగు, త్రాగు అని మనస్సు పీకు తున్నా, మొగమాటానికో, బడాయికో 'నా కలవాటు లేదండీ' అని ఇచ్చిన కాఫీని కప్పునూ త్రోసివేసే వ్యక్తులు మనలో ఎందఱో ఉన్నారు. సర్వసంగ పరిత్యాగం చేసిన

సన్యాసులు అప్పుడప్పుడు పూర్వాశ్రమంలోని అలవాట్లకు లోనుగావడం చూస్తూనే ఉన్నాం.

ఆ రుచిని మఱచిపోలేక మనస్సులో ఒక మిథ్యాప్రపంచాన్ని సృష్టి చేసుకొని, దానిని అనుభవిస్తూ బయటికి మిథ్యాచారాలను నటిస్తూ, మనుష్యుల మన్నన అందు కోడానికి వారు ప్రయత్నిస్తుంటారు. కొంతమంది అతీత వ్యక్తులు సంసారం జంజా టంలో ఉన్నట్టు కనిపిస్తున్నా వాటి బాధలను ఆనందంగా అనుభవిస్తూనే అంటు కోకుండా తామరాకులో నీటిబొట్టుగా భరిస్తూనే ఉంటారు.

"ఈ ఆశ్రమం తీసుకుంటే కాని ఇది రాదు అనీ, ఈ ఆశ్రమమే గొప్పది అనీ – నేను అనలేను. అంటున్నా – అనడానికి ఎట్లా? నేను సన్యాసిని అవునా? కాదా? సన్యాసిని కాదుగా! అనుభవించి చెప్పేదికదా! నేను గృహస్థురాలిని. కాని నా అభిప్రాయం మాత్రం అది" అంది అమ్మ.

7. యస్త్వింద్రియాణి మనసా నియమ్యారభతేఽర్జున!।
కర్మేంద్రియైః కర్మయోగం అసక్త స్స విశిష్యతే॥

తా: అర్జునా! ఎవరైతే మనస్సు చేతనే ఇంద్రియాలను (భగవత్కాటక్షం వలన) నిగ్రహించగల శక్తిగల వారౌతారో, వారు కర్మేంద్రియాలతో, కర్మయాగాన్ని అనా సక్తులై అనుష్ఠిస్తున్నారు అని చెప్పబడతారు.

8. నియతం కురు కర్మ త్వం కర్మ జ్యా యోహ్య కర్మణః।
శరీర యాత్రాపి చ తే న ప్రసిద్ధ్యే దకర్మణః॥

తా: నీవు నియతమైన కర్మను చెయ్యి. కర్మ చెయ్యకపోవడం కంటె కర్మ చెయ్యడమే ఉత్తమమైనది. (ఒకవేళ ఏ పనీ చేయకుండా ఉందామనుకుంటావేమో) కర్మ చెయ్యడం అంటే బ్రదికి ఉండడమే. పీనుగులు పనులు చేయవు. కర్మచేయ కుండా బ్రదికి ఉండి శరీరయాత్ర చెయ్యడం సంభవం కాదు. 5వ శ్లోకంలో వ్యాఖ్యా నించినట్లు బ్రదికి ఉండడమే ఒక పని.

అంటే సశరీరంగా పరమాత్మ శక్తి వ్యక్తం కావాలంటే, జన్మయెత్తడం, బ్రదికి ఉండడం, పెరగడం, నశించడం, అనే పనులు జరిగితీరాలి. అప్పుడే శరీర యాత్ర ప్రసిద్ధికి వచ్చినట్లు అవుతుంది. అంటే గుర్తించబడుతుంది. అంతదాకా అది జరగదు.

9. యజ్ఞార్థా త్కర్మణోఽ న్యత్ర లోకోఽ యం కర్మబంధనః।
తదర్థం కర్మ కౌంతేయ! ముక్తసంగ స్సమాచర॥

తా: కౌంతేయా! అన్ని కర్మలూ యజ్ఞార్థమై ఏర్పడ్డవే! అలాగా అనుకోకుండా ఉండే పక్షంలో ఈ లోకం కర్మబంధమే అయి ఊరుకుంటుంది. కాబట్టి సంగాన్ని త్యజించి ఈ మహనీయమైన మార్గంలో యజ్ఞార్థంగానే కర్మలను చెయ్యి.

వ్యా: ఇక్కడ 'యజ్ఞం' అనే మాటను బాగా అర్థం చేసుకోవాలి. సృష్టి కర్మం అంతా ఒక యజ్ఞమేననీ పురుషుణ్ణి యజ్ఞపశువుగాచేసి దేవతలు యజ్ఞం చేయగా, "చంద్రమా మనసోజాతః చక్షో స్సూర్యో అజాయత" మనస్సు నుండి చంద్రుడూ, కన్నుల నుండి సూర్యుడూ పుట్టారనీ పురుష సూక్తం చెబుతుంది. ప్రతి జీవితమూ అందువలన ఒక యజ్ఞంగానే అర్థం చేసుకోవాలి. అటువంటి జీవితమనే కర్మ ప్రతిదీ విశ్వయజ్ఞార్థమే. అలా అనుకొన్ననాడు సృష్టికార్యమంతా మోక్షయాత్రకోసం నిర్వర్తించబడే కార్యక్రమమే ఔతుంది. అలా అనుకోనినాడు, లోకం శోకహతమవుతుంది. కాబట్టి "యద్యత్కర్మకరోమి తత్త దఖిలం శంభో తవారాధనం" అనే నమ్మకంతోనే అన్ని కర్మలను చెయ్యి. అదెట్లా సాధ్యమవుతుందంటే, ముక్తసంగః తటస్థంగా ఉండి ఫలాపేక్ష లేకుండా ఆ కర్మను చేయడమే మహనీయమైన మార్గం.

10. సహ యజ్ఞైః ప్రజా స్సృష్ట్వా పురోవాచ ప్రజాపతిః।
అనేన ప్రసవిష్యధ్వ మేష వోస్త్విష్ట కామధుక్॥

తా: సర్గాదిలో ప్రజాపతి అంటే బ్రహ్మ పైన చెప్పినరీతిగా యజ్ఞసహితమైన ప్రజానీకాన్ని సృష్టించి, ఇలా అన్నాడు. 'ఈ యజ్ఞంవల్లనే అందఱూ ప్రసవించ బడతారు. ఈ యజ్ఞమే మీకు ఇష్టాపూర్తిని కల్పించి కోరికలను పిండేది కాగలదు. అంటే ఈ సంసారమే బంధమోక్షాలకు హేతువు కాగలదు.

11. దేవాన్ భావయతానేన తే దేవా భావయంతు వః।
పరస్పరం భావయంతః శ్రేయః పర మవాప్స్యథ॥

ఎంత చక్కటి శ్లోకం!

తా: ఈ యజ్ఞం ద్వారా దేవతలను భావించడమవుతుంది. ఆ దేవతలు ఈ యజ్ఞం ద్వారానే మిమ్ములను భావించడమౌతుంది. మిమ్ములను వారు, వారిని మీరు భావించు కోవడంవలన, మీరు అత్యంత శ్రేష్ఠమైన శ్రేయస్సును పొందగలరు.

వ్యా: ఇందులో చెప్పబడిన దేవతలెవరు? ఈశ్వర మనస్సంకల్ప జాతులై లేదా సంకల్ప రూపులైనట్టి, "యత్పురుషేన హవిషాదేవాయజ్ఞ మతన్వత" అనే మంత్రంలో ఉదహరించబడినట్టి దేవతలే వీరు.

"సో కామయత బహుస్యాం ప్రజాయేతి! స
తపోతప్యత! స తప స్తప్త్వా ఇదగ్ సర్వ
మసృజత! యదిదం కించ! తత్సృష్ట్వాత దేవాను
ప్రావిశత్! తదనుప్రవిశ్యత చ్ఛత్యాభవత్"

తైత్తిరీయం.

ఆ దేవతలు వసంతాన్ని ఆజ్యంగాను, గ్రీష్మాన్ని ఇధ్మంగాను, శరత్తును హవిస్సుగాను గ్రహించి, త్రిస్సప్తస్సమిధలతో పురుషుణ్ణి పశువుగా బంధించి విశ్వసృగ్ యజ్ఞాన్ని నిర్వహించారు. ప్రతి బుద్ధి జీవిలోను మనోరూపులై నిలిచారు. లోకానికి చంద్రుడు – మనిషికి మనస్సు; జగత్తుకు సూర్యుడు – మనిషికి కన్ను; జగము కన్నే మనిషి కన్ను. దేవతలంతటా నిండి ఉన్నారు. మనిషి మనస్సులోనూ ఉన్నారు. బయటా నిండి ఉన్నారు. మనుష్యుడంటేనే సూక్ష్మజగత్తు.

పరమాత్మ కేంద్రం నుండి ప్రఫుల్లమైన విశ్వమనేవృత్తంలో కేంద్ర బిందువుకూ బయటి పరిధికీ ఏవిధమైన భేదం లేదు.

ఆదీ, అంతమూ, సర్వమూ అదే.

'ఈ సర్వానికీ సర్వమూ కారణమే' – కార్యమే అంతర్బహిశ్చ తత్సర్వం వ్యాప్య నారాయణ స్థితః అని పురుషసూక్తం. ఆద్యంతమధ్యస్థ సర్వమూ, సర్వాతీత సర్వమూ, అనాది పూర్వ సర్వమూ, అలోకలోకాతీతమైన సర్వం, అనన్య సర్వమూ అయినది ఈ జగత్తు. మంత్ర పుష్పమంత్రాలలోను, ఉపనిషన్మంత్రాలలోనూ, వేద మంత్రాల్లలోను, ఈ ఏకత్వం అనేక విధాలుగా వర్ణించబడి ఉంది.

'ఏకోవిప్రః బహుధా వదంతి'

'పరస్పరం భాయయంతః' అనే శ్లోకభాగంలో ఒకరినొకరు భావించుకునే హృదయకోశమందే బ్రహ్మాండమంతా ఇమిడి ఉంది అనే అర్థం సూచితమైంది. భగవంతుని అనుగ్రహం ప్రసరించినపుడు ఈ సత్యాన్ని మనుష్యుడి మనస్సు గుర్తించ గలుగుతుంది. గుర్తించిన మనస్సును దేవతలూ గుర్తిస్తారు.

'గుర్తుతో గుర్తించి గుర్తు మాసిపోవడమేగా' అమ్మ.

12. ఇష్టాన్ భోగాన్ హి వో దేవా దాస్యంతే యజ్ఞ భావితాః।
తై ర్దత్తా న ప్రదాయైభ్యో యో భుంక్తే స్తేన యేవ సః॥

తా: యజ్ఞభావితులైన దేవతలు మర్త్యులకు ఇష్టాలను, భోగాలను ప్రసాదిస్తారు. దేవదత్తాలు కాకుండా వారికీయకుండా అనుభవించేవాడు చోరుడు.

వ్యా: ఇష్టాలు భోగాలూ అంటే లడ్డుండలు, పట్టు పఱుపులూ కావు. ఆయా కామనలవలన మనస్సుకు లభించే తృప్తి మాత్రలు. పరమాత్మ ఇస్తుంటేనే మనకు ఆనందం లభిస్తుందనే విశ్వాసం పరమాత్మ అనుగ్రహం వల్లనే మనలో ఉద యిస్తుంది. అదే రాజమార్గం. పరమాత్మ అనుగ్రహంతో సంబంధం లేకుండా మన ప్రయత్నాలవల్లనే అన్ని భోగాలూ సమకూడగలవనుకోవడం పెడమార్గం. దొంగలు సంచరించే మార్గం. ఇక్కడ స్తేన శబ్దానికి దొంగ అని అర్థం. పరమాత్మ జ్ఞానాన్ని అపహరించే గజదొంగ అహంకారం కాక మఱెవరూ?

13. యజ్ఞ శిష్టాశినః సంతో ముచ్యంతే సర్వకిల్బిషైః।
భుంజతేః తే త్వఘం పాపాః యే పచన్త్యాత్మ కారణాత్॥

యజ్ఞం అంటే ఏమిటో విశ్వసృగ్యజ్ఞం అంటే ఏమిటో పైన చెప్పే ఉన్నాం. ఇక యజ్ఞ శిష్టం అంటే ఏమిటి. "పూర్ణస్య పూర్ణమాదాయ పూర్ణమేవావ శిష్యతే" అని శ్రుతి. సున్నానుంచి సున్నాను తీసేస్తే సున్నా మిగిలినట్లు, సర్వాన్నుంచి సర్వాన్నీ తీసేస్తే సర్వమూ మిగులుతుంది. అంటే విశ్వ సృష్టి అంతా మిగులుతుంది.

ఇదేమిటి అనుకోవచ్చు మీరు. నాలుగో క్లాసు మేథమేటిక్స్ కాదుగా విశ్వసృష్టి గణితం? విశ్వంలో నిత్యమూ మారుతుండని చోటంటూ లేదు. అనుక్షణమూ ఉన్న సృష్టి, ఉండే సృష్టి నుండి తీసివేయబడుతూ, ఉండిపోయిన సృష్టిగా పరిణమిస్తున్నది. యజ్ఞశిష్ట శబ్దానికిదే అర్థం. సృష్టిని ఈవిధంగా అర్థం చేసుకుని అనుభవించే మనస్సులలో ఏవిధమైన మకిలా ఉండజాలదు. సర్వమూ స్వకీయ ప్రభావ ప్రగల్భంవల్లనే జరుగుతున్నదనే భావంతో పక్వమైన మనస్సు కలవాళ్ళు

అఘాన్ని అంటే మనస్సు మకిలనే కలిగి ఉంటారు.

14. అన్నా ద్భవంతి భూతాని పర్జన్యా దన్న సంభవః।
యజ్ఞా ద్భవతి పర్జన్యః యజ్ఞః కర్మ సముద్భవః॥

తా: అన్నం వలన భూతాలు పుడతాయి. పర్జన్యుని (మేఘం) వలన అన్నం పుడుతుంది. మేఘం యజ్ఞంవలన పుడుతుంది. యజ్ఞం కర్మవలన పుడుతుంది.

అన్నం అంటే బియ్యంతో వండిన అన్నమనే కాదు. కొందఱికి గోధుమలు అన్నం. కొందఱికి మాంసం అన్నం. కొన్ని జీవులకు మట్టి అన్నం. కొన్ని జీవులకు రాళ్ళు అన్నం. అన్నం అంటే ఆహారం అని అర్థం చేసుకుందామనుకున్నా అదీ సరిపోదు. అంకుర ప్రేరణకు సహాయపడే అదృష్టవదాత్మ సంయోగమని అన్నానికి అర్థం

సరిపోతుంది. ఎందుకంటే అన్నం తిని జీవులు బ్రదుకుతాయి. బ్రదికిన జీవులు సంగమిస్తాయి. సంగమం వలన బీజాంకురమౌతుంది. ఈ వ్యాపారానికంతటికీ కారణమౌతుంది. కనుక అన్నమే భూతాలకు మాత అని చెప్పుకోవడం 'నగ పగతు పగతు పగతుని' అనే పద్యం అర్థంలాగా ఉంటుంది. జనాన్ని తినేస్తుంది కనుక అన్నాని కాపేరు వచ్చిందని ఉపనిషత్తు చెబుతుంది. మురిగిన ఎరువు మృత్యు స్వరూపమే. ఆ మృత్యువే మొక్కలు అంకురించడానికి దోహదమౌతుంది. అంటే మృత్యుశక్తి కూడా జన్మకు కారణమౌతుంది అన్నమాట. కాకేం. బృహదారణ్యకంలో ఈ కథ ఉంది.

మొదట్లో మృత్యువే బ్రహ్మదేవుణ్ణి సృష్టించి ఆకలి వేసినప్పుడు వీడిని తినెయ్యొచ్చుగదా అనుకున్నదట. మృత్యువు సృష్టించడమేమిటి?

క్రుళ్ళిన ఎరువునుండి మొక్క పుట్టినట్లు ఉల్లి పాషాణాన్ని పురుగులు తినేసినట్లు గరళం చివరి గడియలో ప్రాణాన్ని ఆదుకున్నట్టు వాస్తవానికి జన్మ మృత్యువులకు భేదం లేదు.

"పర్జన్యాదన్న సంభవః" మహాభారతంలో ఈ క్రింది పద్యం ఉంది.

వెరవును లావునుం గృషియు వేయి విధంబుల మేలొనర్చినన్
దొరకొనునే ఫలంబుతతితో తగు వర్షము లేకయున్న"

పొలం దున్ని, ఎరువువేసి, చల్లకం చల్లి, ఎంతచేసినా తగిన సమయంలో చాలినంత వర్షం పడకపోతే మొక్కలు మొలవవని ఘోషించాడు కవి. తటితో తగు వర్షము అనుమాటకే అదృష్టవదాత్మ సంయోగము అని అర్థం. రెండంచులా పదునున్న కత్తిలా చంపడానికి బ్రదికించడానికి సమర్థమైనది అన్నం. అది లభించడానికి అదృష్టవదాత్మ సంయోగరూపకమైన పరమాత్మ ప్రేరణయే కారణమని మొదటి రెండు పాదాల తాత్పర్యం.

అంతేకాదు. ఈశ్వర చికీర్షలేనిదే పరమాణువులలో క్రియా సామర్థ్యం పుట్టదు. ఆ క్రియా సామర్థ్యం లేనిదే సృష్టి కార్యం కాదు.

'ఈశ్వరస్య చికీర్షా వశా త్పరమాణుషు క్రియా జాయతే'

యజ్ఞంవలన పర్జన్యుడు, కర్మవలన యజ్ఞమూ ఉద్భవిస్తాయని తరువాతి పాదాల అర్థం. ఈశ్వర చికీర్ష లేనిదే భూతోత్పత్తి జరగదు. కనుక పర్జన్యోత్పత్తి జరగదు కూడా.

కాగా అన్నింటికి కారణమైన యజ్ఞం కర్మనుండి ఉద్భవిస్తుందని శ్లోకం తాత్పర్యం. అయితే కర్మ అంటే ఏమిటి?

8వ అధ్యాయంలో భూత భావోద్భవ కరోవిసర్గః కర్మసంజ్ఞితః' అని ఉంది.

అంటే భూతసత్తా భూతభావం. దాని ఉద్భవం అంటే ఉత్పత్తి. అంటే భూత వస్తువులను చేసేది అని అర్థం. ఏది చేస్తుంది? యజ్ఞం చేస్తుంది. కర్మ అని దానికి పేరు. దేవతలను ఉద్దేశించి చేసే చరుపురో డాశ హవన యోగ్యా లయిన ద్రవ్యాల 'విసర్గ' అంటే

పరిత్యాగాన్ని చేయడమే రూపంగా కల యజ్ఞమే కర్మ అనబడుతుంది. బీజరూపమైన ఈ యజ్ఞంవల్ల వర్షాలు కురుస్తాయి. స్థావర జంగమాత్మకాలైన ప్రాణికోటి అంతా ఉద్భవిస్తుంది.

15. కర్మ బ్రహ్మోద్భవం విద్ధి బ్రహ్మాక్షర సముద్భవమ్!
తస్మాత్సర్వగతం బ్రహ్మ నిత్యం యజ్ఞే ప్రతిష్ఠితమ్॥

తా: కర్మ పరబ్రహ్మస్వరూపం నుండి ఉద్భవించింది. బ్రహ్మపదార్థం ఓంకారమనే అక్షరం నుంచి పుట్టింది. కాబట్టి బ్రహ్మసర్వగతము, సర్వ వ్యాప్తమూ అయి ఉన్నది. అది నిత్యమూ ప్రపంచ యజ్ఞముగా ప్రతిష్ఠించబడి ఉంది.

వ్యా: క్రియాస్వభావం కల బ్రహ్మ పదార్థం స్వరూపందాల్చి మొదట అక్షరమై (ప్రణవమై) తరువాత వేదమై, ఆ తరువాత ప్రపంచంగా మారి, సర్వకాల మూర్తియై, సర్వవ్యాప్తమై, నిత్య సర్వస్వమై, అంతర్యజ్ఞ గుహలో ప్రతిష్ఠితమైంది అని గుర్తించు.

16. ఏవం ప్రవర్తితం చక్రం నాను వర్తయతీ హ యః
అఘాయు రింద్రి యారామో మోఘం పార్థ స జీవతి!॥

తా: ఇలా ప్రవర్తితమైన బ్రహ్మచక్రాన్ని అనుసరించనివాడు పాప భూయిష్ఠమైన జీవితాన్ని గడుపుతాడు.

ఎవని మనస్సు ఆత్మరతియందే మగ్నమై ఉంటుందో, ఎవనికి ఆత్మ తృప్తి లభిస్తుందో, ఆత్మయందే ఎవడు ఆత్మ సంతుష్టి కలిగి ఉంటాడో, అతడు (తనకోసమై) తాను చేయవలసిన పని అంటూ ఏమీ ఉండదు. అతనికి అన్ని పనులలోను తృప్తియే లభిస్తుంది.

వ్యా: 'తృప్తియే ముక్తి' అమ్మ

వ్యా: నేను ప్రవర్తింపచేసిన ఈ చక్రం జ్ఞానులకు అజ్ఞానులకూ సమానంగా

వర్తిస్తుంది. పైన చెప్పిన ఆత్మ సంతుష్టి కలవానికే తన కొఱకే చేయవలసిన పనికూడా ఏమీ ఉండదు.

17. యస్త్వాత్మరతి రేవ స్యా దాత్మ తృప్తస్య మానవః।
ఆత్మ న్యేవ చ సంతుష్ట స్తస్య కార్యం న విద్యతే॥

తా: ఆత్మతృప్తి కలిగిన మానవుడు ఇంద్రియా రాముడై, ఓ పార్థా! పుణ్యాత్ముడై జీవిస్తాడు. అలా కానివాడు అఘాయువై పాపభూయిష్ఠమైన జీవితాన్ని గడుపుతాడు.

లోకం అంతా అతడే అయిపోయిన మానవునికి అతడు చేసే ప్రతి పనీ లోకులందఱికీ సమానంగా వర్తించే, క్షేమంకరునికి, తన కోసమే చేయదగిన ప్రత్యేకమైన పనీ ఉండదు. అలాయిదాకా అతనికి మాత్రమే వర్తించే నివాసమూ ఉండదు. కోడలూ, కూతురూ ఇద్దఱూ అతనికి సమానమే.

18. నైవ తస్య కృతే నార్థో నా కృతే నేహ కశ్చన।
న చాస్య సర్వభూతేషు కశ్చి దర్థ వ్యపాశ్రయః॥

తా: నిర్లిప్తంగా ఉండి అన్ని పనులూ నిర్వర్తించేవాడు ఏదో ఒక్క పని చేయక పోతే జరిగే హాని ఏమీ ఉండదు. ఏదో ఒక్క ఆశ్రయంవలన సమకూడే ప్రయోజనాన్ని అర్థవ్యపాశ్రయ మంటారు. సర్వ భూతహితార్థమై అతడు చేసే పనులకు ఏకదేశ ప్రయోజనం తనకుగాని పరులకుగాని ఉండదు.

ఆత్మయందే ఆత్మ సంతుష్టిని పొందే మహాత్మునికి (తనకోసమే) చేయవలసిన పని కూడా ఉండదు.

వ్యా: "అన్ని నేనులూ నేనైన నేను"అమ్మ. పురుషత్రితయమూ కరగి ఒకటైన బంగారు మాట ఇది.

ఈ సంసారంలో అమ్మలాంటి వ్యక్తులకు తాము చేసే ఏ పనులలోను తమకై ఏ ప్రయోజనమూ ఉండదు. ఆ పనులు తాము చేయకుండా ఉండడంలో కూడా స్వార్థమూ ఉండదు. ప్రయోజనమూ, ఆసక్తీ దేనిలోనూ పెట్టుకోరు. సర్వభూతాలను ఒకేవిధంగా ఆప్యాయంతో దగ్గఱకు తీసుకుంటారు. ఐనప్పటికీ వారు చేసే అన్ని పనులు లోకకళ్యాణ కారకాలుగా ఉంటాయి.

అంతేకాని భూతాలలో ఏ ఒక్కదానినుండి ఏ ప్రయోజనమూ కోరి దానిని ఆశ్రయించడవలసిన అవసరం వారికి కలగదు. ధాన్యం కుప్పనుగాని, ఇసుకమేటను గాని చూచినప్పుడు ఆ కుప్పలోని ప్రతిగింజ పాత్రను గాని, ఆ మేటలోని ప్రతి ఇసుక

రేణువు తాలూకు ప్రత్యేకత్వాన్నిగాని మనం గుర్తించం. దరహంమీద అన్ని వ్యష్టులను కలిపి సమష్టిగా కుప్పలేక మేట అని అంటాం. నిజానికి రేణువు వ్యష్టిత్వం గింజ ప్రత్యేకత్వం లేకపోతే సమష్టి కూడా ఉండడం సంభవం కాదు. అందరిల్లు ఎలా అందరిదో అలాగే ప్రతి ఒక్కడిదీని, ప్రతి ఒక్కడిదీ కాకపోతే అది అందరిల్లు కాకేపోయేది.

కాబట్టి అమ్మలాంటి యోగులు చేసే కార్యాలు ఏ ప్రత్యేక వ్యక్తి ఒక్కరి ప్రయోజనమూ ఉద్దేశించినమై ఉంటాయి. ఉండకనూ పోవు.

'నాకృతేనేహకశ్చన' వారు చెయ్యని పనులు కూడా అలాగే సర్వజగత్తుకూ సంబంధించి ఉంటాయని అర్థం. చెయ్యని పనివలన ప్రయోజనమే ముంటుందను కోవచ్చు ఎవరైనా!

మద్రాసులో సత్యమూర్తి అనే లోకైక ప్రసిద్ధుడైన న్యాయవాది ఒకడుండేవాడు. ఒకసారి మద్రాసులో ఎసెంబ్లీ ఎలెక్షనులో రామస్వామి నాయకర్‌కు ఇంకొక ప్రసిద్ధ వ్యక్తికీ పోటీ వచ్చింది. సత్యమూర్తి ఎవరిపక్షాన మాట్లాడి ప్రచారంచేస్తే అతడు తప్పక నెగ్గుతాడని ఇద్దఋ పోటీదార్లకూ తెలుసు. అందుకని ఎవరి పక్షాన్నీ బలపఋచకుండా, ఎలెక్షను రోజుల్లో నోరువిప్పకుండా ఉండే షరతుమీద సత్యమూర్తికి చెఱో లక్ష రూపాయలు అభ్యర్థులు చెల్లించుకున్నారని పుకారు.

కాబట్టి కర్మ చెయ్యకపోవడంలోకూడా ప్రయోజనాన్ని సాధించగల అవస్థ కూడా ఉంది. మహాత్ములు జగత్కల్యాణదాయకాలైన సార్వత్రికంగా ఉండే తమ శక్తిని ఉపయోగిస్తారు. సత్యమూర్తి విషయంలో అది స్వార్థంతో కూడినదైంది. మహాత్ముల విషయంలో అలా ఉండడంలోగాని, ఉండకపోవడంలోగాని, ఆయా కర్తలకు, ఏ విధమైన భావనగాని అపేక్షగాని, ఆసక్తిగాని ఉండదు. ఇచ్ఛ కూడా కలిగి ఉండదు.

అందరింట్లో అమ్మబిడ్డలు అన్నం తింటున్నారు. ఇక్కడకు వచ్చిన వాళ్ళు. ఇది ప్రయోజనంకాదా అంటే, లేదని చెప్పింది అమ్మ. వాళ్ళ అన్నం ఇక్కడ ఉంది. కనుక వాళ్ళు తింటున్నారు అనుకుంటాను. తినకపోతే వాళ్ళ అన్నం ఇక్కడ లేదనుకుంటాను అన్నది అమ్మ.

19. తస్మా దసక్త స్సతతం కార్యం కర్మ సమాచర।
అసక్తో హ్యాచర న్కర్మ పరమా ప్నోతి పూరుషః॥

తా: కాబట్టి అర్జునా! చేయదగిన పనికాని చేసేపనిగాని ఆసక్తిలేకుండా చెయ్యి. ఆసక్తి లేకుండా పనులను చేసే మహాత్ముడు పరమపదాన్ని పొందుతాడు.

20. యద్య దాచరతి శ్రేష్ఠః తత్త దేవేతరో జనః
స య త్ప్రమాణం కురుతే లోక స్తదను వర్తతే॥

తా: శ్రేష్ఠుడైన పురుషుడు ఏ ఏ ప్రకారంగా ఏది ఏది చేస్తాడో, అన్య జనులు ఆయా ప్రకారంగానే ఆయా కర్మలనే చేస్తారు. అతడు దేనిని ఒరవడిగా దిద్దుతాడో దానినే లోకం అనుసరిస్తుంది.

వ్యా: శ్రేష్ఠుడు కావడంకూడా ప్రమాదమే. లోకమంతా ఒక సిబ్బిలో కూర్చుం టుంది. శ్రేష్ఠుడొకడూ ఇంకో సిబ్బిలో కూర్చుంటాడు.

నిజానికి ఈ శ్లోకంలో చెప్పబడింది దురాచారాలను గూర్చిన హెచ్చరికగాని సదాచారాలను గూర్చి కాదనిపిస్తుంది. ఎందుకంటే శ్రేష్ఠుడైన వాడెప్పుడూ సదాచా రాలనే చేస్తాడు. లోకం వాటిని అనుసరిస్తే తప్పేముంది? ప్రమాదం చేతనయినా శ్రేష్ఠుడెన్నడూ తప్పు పనులను చేయరాదని హెచ్చరిక.

ఒకసారి అప్పయ్య దీక్షితులవారు కాశీ ఒడ్డున గంగా ఘట్టాన కూర్చుని తన్మయులై సంధ్యావందనం చేసుకుంటున్నారట. పొరపాటున ఆ సమయాన ఆయన వెనుక గోచీ ఊడిపోయి నేలమీద పడ్డదట. దాన్ని చూచిన జనులందఱు సంధ్యా వందనంలో ఇది కూడా ఒక నియమం కాబోలు ననుకొని తమ తమ గోచీలన్ను వదిలించుకొని నేలమీద బాఱుగా పఱచుకొని సంధ్య వార్చుడం ప్రారంభించారట. ఆయన కాలంలో ప్రమాణ పురుషుడాయన. ఆయన ఏదిచేస్తే అందఱూ దాన్నే ఆచరించేవారు.

గాంధీ మహాత్మునికి చాలాకాలం వఱకు, ఎదిగిన కాలేజీ గరల్ స్టూడెంట్స్ బుజాలమీద చేతులు వేసి నడవడం అలవాటుగా ఉండేది. ఆయన పెద్దవాడు. పిల్లల మీద వాత్సల్యం చేత అలాచేసేవాడు మహాత్ముడు. దానిని చూసిన యువకులు కొందఱు యువతుల బుజాల మీద చేతులు వేసి తిరగడ మారంభించారు. అదే మంటే వ్రేలెత్తి గాంధీ మహాత్ముణ్ణి చూపి 'అంతటి మహాత్ముడు చేస్తే తప్పుగానిది మేం చేస్తే తప్పెలా అయింది' అన్నారట. మహాత్ముడు మఱునాటి వార్తాపత్రికలలో 'నా అలవాటు కొందఱిని పెడమార్గాన పెడుతున్నది అని తెలిసింది. కాబట్టి దీనిని నేను మానుకుంటున్నానని' ప్రచురించారు.

ప్రమాణం అనేది గడ్డుమాట. అమ్మ మన అందఱికీ ప్రమాణం. మన మన స్సులు అమ్మ మనస్సులాగా ఎందుకుండవు? ప్రకృతి సిద్ధములైన గుణాలు అందఱికి సమానంగా ఉండవు.

'హెచ్చుతగ్గులే ఈ సృష్టి; ఈ ప్రపంచమూ' అన్నారమ్మ.

హెచ్చు తగ్గులను నివర్తించడానికి దినదినం అనుభవరూపమైన క్రమశిక్షణను పరమాత్మ ప్రసాదిస్తూనే ఉన్నాడు. ఎవరెవరికి ఎంత ఎంత, ఎలా ఎలా ఇవ్వాలో అమ్మకూ తెలుసు. పతితుడిని ఒక్కసారిగా ఉరిశిక్షవేసి సృష్టిసూత్రం సంహరించదు. నిప్పులాగా తగలబెట్టదు.

'శిక్ష అంటే మనిషిని సంహరించడం కాదుగా! గుణాన్ని సంహరించడమే! ఎవరేదారినపోతే వారినా దారినపోనిచ్చి. మెల్లగా ఇటు త్రిప్పుకురావాలి' అమ్మ వాక్యం.

దారికిరాని వారిని ప్రకృతియే బలవత్తరంగా త్రిప్పుతుంది. దానికి ఎవరి జీవితం వారికి తాళం. కాలం బీగం.

22. నమే పార్థాస్థి కర్తవ్యం త్రిషు లోకేషు కించన।
నానవాప్త మవాప్తవ్యం వర్త ఏవ చ కర్మణి॥

తా: అర్జునా! నాకు మూడులోకాలలోను, ఏవిధమైన కర్తవ్యం లేదు. నేను పొందనిదీ పొందదగినదీ అంటూ కూడా లేదు. అయినా నేను కర్మలలో వర్తిస్తూనే ఉన్నాను.

వ్యా: వింతగా ఉంది కాదూ ఈ శ్లోకం. మూడు లోకాలలోనూ పరమాత్మకు కర్తవ్యమంటూ లేదట. ప్రాప్తం కానిది లేదట. ప్రాప్తవ్యం అయినదీ లేదట.

అన్ని జీవరాసులూ, చావుపుట్టుకలూ వృద్ధిక్షయాలు. పంచ తన్మాత్రలూ, పంచ భూతాలూ అన్నీ ఆయనగానే ఉన్నప్పుడు దానికి మించిన కర్తవ్యం ఎలా ఉంటుంది?

ఎలెక్ట్రిసిటీకి ఏది కర్తవ్యం? ఏది అకర్తవ్యం. సూర్యరశ్మికి ఏది కర్తవ్యం? ఏది అకర్తవ్యం? పంచభూతాల క్రియా వ్యవహారములలో విచక్షణ అంటూ లేదు. నిరపేక్షంగా వాటిపని అవి చేసుకుని పోతుంటాయి. చేస్తున్నామనే గుప్తికాని, తమ చేతలవలన కలిగే ఫలితాలను ఆలోచించడంగాని లేదు. వాటికి మనస్సు ఉందో లేదో మనకు తెలీదు. అవి చేసే పనులను మనం మనస్సుమీద వేసుకుని చప్పరించు కుంటాం. కొందటికి ఘాటుగా తగిలితే కొందటికి చప్పగా తగులుతుంది. ఒకే సంఘటన పలువురికి పలువిధాలుగా తోస్తుంది.

ఎందుకని? నిత్యమూ వర్తమానంలో ఉండేది జగత్తు, పరమాత్మ సదానతం లేనివాళ్ళు మర్త్యులు. అయినప్పటికీ నేను కర్మలు చేస్తూనే ఉన్నాను అంటారు పరమాత్మ. చరించే, చలించే, లోకం తానైనప్పుడు కర్మలు చేయడం ఎలా తప్పు

తుంది? ఆత్మకర్మ అంటే సంసారం అయినప్పుడు, ఆయన కర్మలు చేయకపోవడం ఎలా జరుగుతుంది? సంసారం లేకపోవడమంటూ ఎన్నడూ జరగదు. సంసారమూ ఉంటుంది. సంసారంగా పరమాత్మా ఉంటాడు. ఒకచోట సూక్ష్మంగా ఉంటే మరో చోట స్థూలంగా ఉన్నట్టు మనకు భ్రమ కలగవచ్చు.

23. యది హ్యహం నవర్తేయం జాతుకర్మణ్య తంద్రితః।
మమ వర్త్మా నువర్తన్తే మనుష్యాః పార్థ! సర్వశః॥

తా: అర్జునా! నేను కనుక పరాకు లేకుండా కర్మలను చేస్తూ ఉండకపోతే, మనుష్యులు అన్ని విధాలుగా నన్నే అనుసరిస్తారు.

వ్యా: భగవంతుడే, జగత్కర్తయే సంసారమని పై శ్లోకంలో చెప్పుకుని ఉన్నాము. సంసారం లేప్పుడు మనుష్యులేమవుతారు? సంసారం లాగానే పరమాత్మననుసరిస్తారు.

24. ఉత్సీదేయు రిమే లోకాః నకుర్యాం కర్మచే దహం,
సంకరస్య చ కర్తా స్యా ముపహన్యా మిమాః ప్రజాః॥

తా: నేను కర్మలను మానుకొని (సమాధి నొందడం సంభవిస్తే) ఊరుకుంటే ఈ లోకాలన్నీ నశిస్తాయి. సర్గవర్గాలు వాటి నియమక్రమం తప్పి సంకరమౌతాయి. ప్రజలందటినీ నేనే సంహరించిన వాడనౌతాను.

వ్యా: ఈ శ్లోకంలో ప్రళయావస్థ, అంటేపరమాత్మ కర్మలు మానుకుంటే లోకాలకు ప్రజానీకానికి కలిగే ప్రళయావస్థ స్పష్టంగానే చెప్పబడింది. కాని భగవద్రూపమైన సంసారంగాని, అందులోని అవయవాలైన జీవులుగాని, సహజావస్థలోనైనా, ప్రళయావస్థలోనైనా పరమాత్మను విడిచి ఉండరు.

“జీవులు పుట్టినా, గిట్టినా, ఆమెకు దూరంగా ఉన్నవారు కారు. అందఱూ నా ఒడిలోనే తిరుగుతూ ఉన్నారు. ఒడి విడిచి ఎవ్వరూ లేరు” అమ్మ.

25. సక్తాః కర్మ ణ్యవిద్వాంసో యథా కుర్వంతి భారత!।
కుర్యా ద్విద్వాం స్తథాஉ సక్త శ్చికీర్షు ర్లోక సంగ్రహమ్॥

తా: అర్జునా! ఏవిధంగా అజ్ఞానులు ఆసక్తులై కర్మలను చేస్తూ ఉంటారో విద్వాంసులు అదేవిధంగా లోక సంగ్రహార్థం నిరాసక్తులై కర్మలను చేస్తుంటారు.

వ్యా: పతితులపట్ల, పాపాత్ముల పట్ల అమ్మ అత్యంత ప్రేమాదరాలు చూపిస్తుంది. వాళ్ళు బురదరాచుకొని వచ్చిన పిల్లలే అంటుంది. ఆమె సమక్షంలో అధిక

లనీ, అధములనీ పాపాత్ములనీ పుణ్యులనీ తేడాలుండవు. తల్లి తన సంతానంలో అందఱిపట్లా ఒకేరకంగా వాత్సల్యాన్ని చూపిస్తుంది. అందులో నష్టజాతకుడెవడైనా ఉంటే వాడిపైన మక్కువ ఇంకా ఎక్కువగా చూపిస్తుంది.

అన్నం ముద్దలు చేసి నోట్లో పెడుతూ, నవ్విస్తూ కవ్విస్తూ కబుర్లు చెబుతూ ఉంటే ఒక సోదరుడు చూసి 'పీఠాధిపతులుగానీ మరే స్వాములుగానీ ఇట్లా దగ్గఱగా రానీయ రమ్మా! మీరేమిటి ఇలా ఉన్నారు' అని అడిగాడు. అమ్మ నవ్వి వాళ్ళు అట్లా ఉండడం ధర్మం. నేనిట్లా ఉండడం ధర్మం. శుచి చేయాల్సిన బాధ్యత నాది (తల్లిది). శుచిగా ఉన్నట్లు కనపడిన వాళ్ళనే దగ్గఱకు తీసుకుంటారు పీఠాధిపతులు" అంది. ఇందులో లోక శిక్షలో అమ్మకున్న ఆసక్తిగాని అనాసక్తిగాని ఏమైనా అంతరం కని పిస్తుందా?

26. న బుద్ధి భేదం జనయే దజ్ఞానాం కర్మసంగినామ్।
జోషయే త్సర్వ కర్మాణి విద్వా న్యుక్త స్సమాచరన్

తా: కర్మసంగులైన అజ్ఞానులయందు (హఠాత్తుగా) విద్వాంసులు బుద్ధిభేదాన్ని జనింప జేయకూడదు. తాము పరమాత్మ స్వరూపము నందే స్థితులై ఉండి, వారికి వారి వారి కర్మలయందు అశ్రద్ధ కల్పించకుండానే, యుక్తమైన కర్మల యందు వారి మనస్సు ప్రవేశించేలాగా చేయాలి.

వ్యా: జ్ఞాని అయినవాడు కర్మలు చేయుటలో ఆసక్తిగల వివేక రహితుల విష యంలో బుద్ధి భేదాన్ని కలిగించరాదు. ఇది నా కర్తవ్యం. దీని ఫలం నేను అనుభ వించాల్సిందే. కాబట్టి నేనీపని తప్పక చేయాలి అనే నిశ్చయాన్ని కదిలించకూడదు.

అయితే ఏంచేయాలి అంటే – సమాహిత చిత్తుడైన విద్వాంసుడు తాను కూడా స్వయంగా అజ్ఞానులవలెనే చేస్తూ, సవ్యమైన మార్గానికి వాళ్ళను నెమ్మదిగా తిప్పుకు రావాలి.

27. ప్రకృతేః క్రియ మాణాని గుణైః కర్మాణి సర్వశః!
అహంకార విమూఢాత్మా కర్తాఽ హ మితి మన్యతే॥

తా: సామ్యావస్థయందున్న ప్రకృతిచేత, త్రిగుణాల చేత, కరణాల చేత పనులన్నీ జరుపబడుతూ ఉండగా, అహంకారం వలన మూఢులైన మనుష్యుడు ఆ పనులన్నీ తానే చేస్తున్నానని తలపోస్తాడు.

వ్యా: 'చేయించేవాడు, చేసేవాడు వాడే. నీవు నిమిత్త మాత్రుడవు' అమ్మ.

28. తత్వవిత్తు మహాబాహో! గుణకర్మ విభాగయోః।
గుణా గుణేషు వర్తంతే ఇతి మత్వా న సజ్జతే॥

తా: ఓ మహాబాహూ! గుణకర్మ విభాగాల తత్వాన్ని తెలిసినవాడు, అంటే గుణవిభాగం, కర్మ విభాగం ఈ రెంటిని తెలిసిన జ్ఞాని, ' ఇంద్రియాది రూపగుణాలే విషయ రూపగుణాల్లో కూడా వర్తిస్తున్నాయని, అది ఆత్మకాదనీ గుర్తించి ఆసక్తుడు కాకుండా ఉంటాడు.

వ్యా: ప్రవర్తక శక్తులన్నీ ప్రకృతి శక్తులే. సూక్ష్మప్రపంచమై ఉన్నమనుష్యాకారం పంచభూతశక్తిమయం. పంచభూతాలు లేకుంటే ఇంద్రియాలే లేవు, ద్రవ్యరూపకంగా ఉన్నాశక్తిరూపకం ఉన్నా అదే ఇది. ఇదే అది. స్థూలసూక్ష్మకారణాలు దాటి చిన్మయావస్థను చేరిన విశ్వసృష్టికి గుణమే కర్మమౌతుంది.

కనుక ప్రపంచ కార్యానికి హేతువైన మహాభూతాలు, మనోబుద్ధి చిత్తాహంకారాలు, ఐదు కర్మేంద్రియాలు, శబ్దాది పంచవిషయాలు, ఈ అన్నింటి సాముదాయిక జ్ఞానమే గుణవిభాగం. పారస్పరికమైన ఈ అన్నింటి చేష్టల సంబంధ విజ్ఞానమే కర్మవిభాగము.

గుణాలలోనే గుణాలు వర్తిస్తున్నాయని తత్వవిత్తు ఎలా తెలుసుకుంటాడు? నేను చేస్తున్నాననే బాధను ఏ అతీత మనస్సుతో పోగొట్టుకుంటాడు.

'ముల్లుతో ముల్లు తీసేసినట్లు
బాధతో బాధతీసేసినట్లు
మనస్సుతో మనస్సును గుర్తించినట్లు
కర్మ ఎట్లు తీసేస్తావంటే కర్మతోనే, అన్నాను,
మనస్సును ఎలా గుర్తిస్తావంటే మనస్సుతోనే, భావన అక్కర్లేదు.'

29. ప్రకృతే ర్గుణసమ్మూఢాః సజ్జన్తే గుణ కర్మసు।
తానకృత్స్న విదో మన్దాన్కృత్స్నవి న్నవిచాలయేత్॥

తా: ప్రకృతి గుణాలను గుర్తించలేని మూఢులు ఆయాగుణ కర్మల యందే ఆసక్తి కలవారౌతారు. (ఆ మూఢాత్ములను ఒక్కసారిగా సరిదిద్దడం సరికాదు. కాబట్టి) బాగా తెలిసినవారు వారికి క్రమంగానే మంచి మార్గానికి త్రిప్పుకురావాలి.

30. మయి సర్వాణి కర్మాణి సన్య స్యాధ్యాత్మ చేతసా!
నిరాశీ ర్నిర్మమో భూత్వా యుధ్యస్వ విగతజ్వరః!!

తా: కాబట్టి అధ్యాత్మచేతస్కుడవై, జ్ఞాననిష్ఠతో, సర్వకర్మల (బాగోగుల)ను నాకు అర్పణచేసి ఆశారహితుడవై, అహంకారం విడిచిపెట్టి విగతజ్వరుడవై యుద్ధం చెయ్యి.

31. యే మే మత మిదం నిత్య మనుతిష్ఠంతి మానవాః!।
శ్రద్ధావంతోఽ నసూయంతో ముచ్యంతే తేఽ పి కర్మభిః॥

తా: అర్జునా! ఈ నామతాన్ని ఏ మానవులైతే సదావిశ్వాస సహితులూ, అసూయారహితులూ, శ్రద్ధావంతులూ, స్థిరచిత్తులూ, ఐ అనుసరిస్తుంటారో, వారు కర్మ బంధం నుంచి విముక్తిచెందుతారు.

32. యే త్వేత దభ్యసూయంతో నాను తిష్ఠంతి మే మతమ్।
సర్వజ్ఞాన విమూఢాం స్తా న్విద్ధి నష్టా నచేతసః॥

తా: అసూయా వంతులూ, దోషైక దృక్కులూ, ఈ మతాన్ని విశ్వసించకుండా, ఎవరు, హరిస్తారో, వారు సంపూర్ణంగా అజ్ఞానులనీ, మూఢులనీ, భ్రష్టులనీ, చిత్త చైతన్యం లేనివారలనీ తెలుసుకో!

వ్యా: శాపం బెట్టి నట్లుగా ఉంది ఈ శ్లోకం, కాకేమిటి? స్పష్టంగా కన్పిస్తున్న వాస్తవ విషయాలని విస్మరిస్తూ, బుద్ధిని తికమకపెట్టే ఇంద్రజాల యంత్రాన్ని అల్లుతూ, అందులోనే పడి సర్కసు వాలాల లాగా పల్టీలు వేస్తూ, కొట్టుకునే వేదాంతుల సిద్ధాంత రాద్ధాంతాలు ఎవడి మనస్సునూ పరిశుద్ధంగా చేయలేవు. నాయనా! ప్రకృతి జములైన గుణాలే నీలో నిలిచి నీలో అన్ని భాగాలూతామై, తామే పరమాత్మగా కర్మలన్నీ, చేస్తుంటే, అహంకారంతో కళ్లుబోయిన నీవు, చేసేదంతానేనని జబ్బలు చఱుచుకొంటావని తెగేసి పరమాత్మ చెప్తున్నా, ఆమాట విశ్వసించక, అలా అనుకునే వాళ్లందఱినీ Fatalists అని ముద్రవేసి మనుష్యుల అహంకారాన్ని మఱింత రెచ్చగొట్టే పండితమ్మన్యులు, సర్వజ్ఞానవిమూఢులు, నష్టచేతస్కులూ, కాక మఱే మవుతారు?

33. సదృశంచేష్టతే స్వస్యాః ప్రకృతే ర్జ్ఞానవానపి!
ప్రకృతిం యాంతి భూతాని నిగ్రహః కిం కరిష్యతి!!

తా: మహాజ్ఞాని కూడా స్వభావసిద్ధమైన ప్రకృతి ప్రేరిత కర్మలనే చేస్తుంటాడు. భూతాలు ప్రకృతి ననుసరించియేపోతాయి. ప్రకృతిని (నిరోధిస్తే) ఏమి కాగలదు?

వ్యా: అనుకుని ఎవరూ పుణ్యమూ చేయలేరు. అనుకుని ఎవరూ పాపమూ చేయలేరు. ప్రకృతి ప్రసాదించిన గుణాలను అనుసరించే వ్యక్తి తన చేష్టలను చేస్తూ ఉంటాడు. పండితుడైనా పామరుడైనా వ్యక్తి కానున్న దానికి నిమిత్తకారణమే అవుతాడు. స్వభావం మార్చుకుందామని చేసే ప్రయత్నం నటనే అవుతుంది. మనుష్య బుద్ధి ప్రకృతిలోదికాదా? చావు ప్రకృతిలోది కాదా?

చంద్రలోకానికి వెళ్లితిరిగి వచ్చాననీ, ప్రకృతికి అతీతుడనై పోయానని మనిషి అనుకోరాదు. అణువు బాంబు నిర్మించాననీ, విద్యున్మేధస్సు సృష్టించాననీ మానవుడు గర్వించకూడదు. ప్రకృతి బలవత్తరమైనశక్తి, అది ప్రసాదించిన శక్తితోనే మానవుడు చంద్రలోకానికి వెళ్లడమైనా తక్కిన అసాధ్యకార్యాలు చేయడమైనా? ప్రకృతి మాదాసి అని ఇటీవల కొంత మంది అహంకరించడం కూడా అర్థంలేని విఱ్ఱవీగుడే, 'కారే రాజులు రాజ్యముల్ గలుగవే! గర్వోన్నతిం జెందరే! వారేరీ? అమోఘమైన తెలుగు-మూడక్షరాలు-వారేరీ! అనేమాటకు ఇంగ్లీషు పదంలేదు. ప్రకృతి శక్తులకు, అంటే కర్మలకు కూడా తిరుగుడు. మీరూ, నేనూ, అందఱమూ, ప్రకృతిలోని భాగాలమే. ప్రకృతిలోని వాళ్లంకాకపోతే ఇక్కడ ఉండగలిగే వాళ్లం కాదు, ప్రకృతిలో భాగమై ఉన్నవాడు అప్రాకృతిక మైనపనులు చేయలేడు. భూతాల పరిధిని మించి మనుష్యుడు జరగలేడు.మనిషి కూడా భూతాలలోని భాగమే!

34. ఇంద్రియ స్యేంద్రి స్యార్థే రాగ ద్వేషౌ వ్యవస్థితౌ।
తయో ర్న వశ మాగచ్ఛేత్ తౌ హ్యస్య పరిపరిపంథినౌ॥

తా: ప్రతీ ఇంద్రియభోగంగాని, ఉద్వేగకారకమైన ఘటన కాని, రాగద్వేషాలకు కారకమవుతుంది. ఈ రెంటికీ వశుడవు కావద్దు. అవేనీకు శత్రువులు.

వ్యా: రాగ మంటే ప్రీతి. ద్వేషమంటే పగ. ఏ సంఘటనలో నైనా ఇవి జనించ డానికి ఆస్కారముంటుంది. సంఘటనలను కల్పించేవి కూడా అవే. ప్రీతి భీతి లేకుండా ఏపనులూ ఆరంభించవు. కామనలన్నీ నాకు లభిస్తుంటే నాకు ద్వేష మెందుకు? ఎవరి మీద? అలాక్కాకుండా, నాకను కున్నది నీకు లభించితే పీకులాట వస్తుంది. ఈ తగాదాలన్నీ, రాగద్వేషాల యుద్ధమంతా నేను నీవుల మధ్యనే ఉంది. అది మాసిపోవాలంటే నేను నీవులు మాసిపోవాలి. రాగం వల్లనే కదా అర్జునుడు యుద్ధం చేయనంటున్నది!

ఒకరు 'నేను నేనైన నేను' అంటే అర్థం ఏమిటని అమ్మనడిగారు.

సమాధానం. 'నీవులేని నేను' అమ్మ.

35. శ్రేయాన్ స్వధర్మో విగుణః పరధర్మా త్స్వనుష్ఠితాత్।
స్వధర్మే నిధనం శ్రేయః పరధర్మో భయావహః॥

తా: లెస్సగా ఆచరించబడిన, అనుష్ఠించబడిన పరధర్మం కంటెవిగుణ సహిత మైనదైనా స్వధర్మమే మేలు. స్వధర్మంలో చచ్చిపోవడం మేలు, పరధర్మాన్ని అనుష్ఠిం చడం భయావహమైన విషయం.

వ్యా: చాలామంచి శ్లోకం. లోకవ్యవహారాన్ని పుక్కిలించిన శ్లోకం. అమలు పఱచడానికి అసాధ్యమైన శ్లోకం. 'సత్యం వద; ధర్మం చర' మహావాక్యంలోని చివరి సగం.

'మనిషి ప్రవర్తనయే మనిషి' అన్న వాక్యం అర్థవంతంగా ఉండే రోజుల్లో వ్రాసిన శ్లోకం. అమ్మ అన్నట్లు ఇప్పుడు అంతా అవసరం మీద నడుస్తున్నది. నీతినియమాలకు, ధర్మాధర్మాలకు ఏకొంచెమూ విలువలేదు. ఈ ప్రళయంలో విచక్షణ, క్షణిక మోహం రాజ్యమేలుతున్నది. శాశ్వతత్వం ప్రపంచగతికే వర్తిస్తుంది. ప్రపంచగతియే స్వధర్మంగా అర్థం స్వీకరించడం సమంజసంగా ఉంటుంది. ఏది స్వధర్మం? మనం తప్పించుకోలేనిది స్వధర్మం."

అర్జున ఉవాచ:

36. అథకేన ప్రయుక్తోఽ_యం పాపం చరతి పూరుషః।
అనిచ్ఛ న్నపి వార్ష్ణేయ! బలాదివ నియోజితః॥

అర్జునుని వాక్యము!

తా: కృష్ణా! మఱి బలాత్కారంగా నియోగింపబడ్డవాడై పురుషుడు ఎవనిచేత ప్రేరేపింపబడి ఇష్టం లేకపోయినా పాపాన్ని చేస్తుంటాడు?

వ్యా: కర్మణ్యర్థంలో అడిగినా అర్జునుడు స్పష్టంగానే అడిగాడు. బావా! నేను యుద్ధం చేయనంటూంటే నీవు నన్ను చెయ్యమని బలవంతం చేస్తున్నావు.

దానికి తగిన సమాధానం పరమాత్మయే ఇచ్చాడు.

శ్రీ భగవానువాచ

37. కామ ఏష క్రోధ ఏష రజోగుణ సముద్భవః।
మహాశనో మహాపాప్మా విద్ధ్యేన మిహ వైరిణమ్॥

తా: రజోగుణం నుండి ఉత్పన్నమైన కామమే మఱొక వేషం దాల్చి, క్రోధమై, దీని కంతటికీ ప్రేరణనిస్తున్నది. అగ్నిహోత్రం లాగా ఇది అన్నింటిని భక్షించే మహా పాపశక్తి. ఇదే పురుషుడికి ప్రత్యక్ష శత్రువు. ఎన్ని భోగాలు అనుభవించినా కామానికి తృప్తిలేదు.

38. ధూమేనా వ్రియతే వహ్ని ర్యథాఽ_ దర్శో మలేనచ।
యథోల్బేనావృతో గర్భ స్తథా తేనేద మావృతమ్॥

తా:నిప్పును పొగలాగాను, అద్దాన్ని మైల లాగాను, గర్భాన్ని మావిలాగాను మనుష్య బుద్ధిని ఇది కప్పి ఉంటుంది.

వ్యా: స్వచ్ఛంగా పుట్టించినవాడు స్వచ్ఛంగా ఉండడు. పసివాళ్ళు బురద పూసు కొని వస్తారు. ఆ బురదే నిప్పును పొగలాగాను, అద్దాన్ని దుమ్ములాగాను, పుట్టిన బిడ్డను మావిలాగాను కప్పుకుని ఉంటుంది. ఉదాహరణలెంత అందంగా ఉన్నవో చూడండి. నిప్పుకు కణకణలాడే గుణమూ ఉంది. పొగచూరే గుణమూ ఉంది. తగులుకుంటే తగలేస్తుంది. కాని ప్రతిఫలించదు.

ఆ గుణం అద్దానికుంది. కాని దుమ్ము పైనబడితే అది ప్రతిఫలించదు. పుట్టిన బిడ్డ నుండి తానే తొలిగిపోతుంది మావి. బిడ్డ బుద్ధిజీవి. కర్మ సిద్ధాంతాన్ని అర్థం చేసు కునే పురుషుడు కాగలడు.

బుద్ధి నిప్పుతోను, అద్దంతోను పోల్చబడింది. నిప్పు తనను తాను దహించుకొని వేడిగా మారుతుంది. పరమాత్మ 'సతపస్తప్త్వా' తన తపస్సులో తాను తపించి బహు ముఖాలైనాడు. అద్దం మరో వస్తువును ప్రతిఫలిస్తుంది. చీకటిలో ప్రతిఫలించదు. పరంజ్యోతి ఎదుట నేనని నిలబడగలుగుతుంది. అగ్నిని ధూమం కప్పిన ఉప మానంలో ద్వైధీభావం లేదు. నిప్పే పొగగా రాజుకుంటుంది. ద్వైధీ భావానికి ఉన్ము ఖత్వం ఉంది. ముఖం – నీడ –

మూడో ఉదాహరణలో ద్విముఖీత్వం స్పష్టంగానే స్ఫురిస్తుంది. ధూమం లేకుండా వహ్ని ఉండదు. కళాయి లేకుండా అద్దం ఉండదు. తల్లి లేకుండా బిడ్డ ఉండడు.

అమ్మ తొక్క ఒలిచిన అరటిపండు ద్వైతంగాను, ఒలవని అరటిపండు అద్వైతం గాను చెప్పడం ఈ శ్లోకాభిప్రాయానికి ఎంతో అందాన్ని తెచ్చింది. ఎలా చెబుదామను కున్నా ఈ శ్లోకం అమ్మ దగ్గఱకే వస్తున్నది.

మొదటి ఉపమానం జనుల అజ్ఞానంతో కప్పబడిన అమ్మ బాల్యం, రెండో ఉపమానం జనుల మనస్సులనే అద్దాలలో ఉంటూనే పరాశక్తి లక్షణాలను ప్రతిఫలి స్తున్నా ఆ సత్యాన్ని వారు గ్రహించని దశ, మూడో ఉపమానం జీవకోట్లను, ప్రజా నీకాన్ని తన గర్భ శిశువులుగా చేసికొన్న దశగా పై శ్లోకం విశదీకరించుతుంది.

39. అవృతం జ్ఞానమేతేన జ్ఞానినో నిత్యవైరిణా
కామరూపేణ కౌన్తేయ! దుష్పూరే ణానలేన చ॥

తా: జ్ఞానులకు నిత్య వైరి, కామరూప ధారిణి, అగ్నిలాగా అంతంలేని ఆకలి

గలది, అయిన ఈకామం, సద్జ్ఞానాన్ని నిత్యమూ ఆవరించుకొనియే ఉంటుంది. అది కామరూపి అనడంలో ఇచ్ఛారూపి అని కూడా అర్థం.

వ్యా: వెలుగున్నచోట చీకటి ఉండజాలదు. సమానత్వంలో జ్ఞానమూ, అజ్ఞానమూ, చీకటీ, వెలుగూ, విద్యా, అవిద్యా ఒకటే -DARKNESS IS CONDENSED LIGHT అనే సిద్ధాంతం కూడా ఒకటి ఉంది. ప్రకృతిలోని ద్వంద్వాలు బొమ్మాబొరుసుల్లాగానే గాని విరుద్ధంగా ఉన్నట్లు కనిపించవు. తలలు వేఱయినా తల్లీ బిడ్డల సంబంధం.

నారింజ పండులో తొనలూ, ముంజెలూ గింజలూ, రసమూ అన్ని ఉన్నట్లే పైన తొక్క కూడా ఉంటుంది. తొక్కలేని నారింజ పండును ఇంతవఱకూ ఎవరు ఎఱగరు. అనుభవించే అధికారి చేతిలో పడినప్పుడు ఆ తొక్క విసర్జింపబడుతుంది. అలాంటిదే కామం కూడాను. వ్యష్టి నిష్ఠపై ఉన్నంత వఱకే కామం కామం అనిపించుకుంటుంది. సమష్టి నిష్ఠయైనప్పుడు ఆ కామానికి ప్రత్యేకత లేకుండా అంతర్హితమై పోతుంది. దేహంలో కామం ఎక్కడ ఉంటుంది?

40. ఇంద్రియాణి మనో బుద్ధి రస్యాధిష్ఠాన ముచ్యతే।
ఏ తైర్వి మోహయ త్యేష జ్ఞాన మావృత్య దేహినమ్॥

తా: ఇంద్రియాలూ, మనస్సు, బుద్ధి, ఈ కామానికి ఆవాస స్థానాలంటారు. ఇది మనో బుద్ధీంద్రియాలద్వారా దేహధారి యొక్క జ్ఞానాన్ని ఆవరించుకొని ఉంటుంది.

వ్యా: పై శ్లోకాలలో జ్ఞానానికి మనం అనుకునే ఎన్ని ఆవరణలున్నయ్యో వాటి నన్నింటినీ పరమాత్మ చక్కగా వివరించారు. ఆవరణలన్నీ అజ్ఞానపు గోడలే అనుకున్నా, కోటలోని సార్వభౌముడిని చూడాలనుకుంటే, గోడల ద్వారాల నుండే పోవలసి ఉంటుంది. జ్ఞానాన్ని పొందాలంటే అజ్ఞానమార్గాల ద్వారానే ఆ పని జఱగాలి. మఱోమార్గం లేదు.

41. తస్మా త్త్వ మింద్రియాణ్యాదౌ నియమ్య భరతర్షభ!
పాప్మానం ప్రజహి హ్యేనం జ్ఞానవిజ్ఞాన నాశనమ్॥

తా: శరీరం కంటె ఇంద్రియాలకు, ఇంద్రియాలకంటె మనస్సుకు, మనస్సు కంటే బుద్ధికి, బుద్ధికంటే పరమాత్మకు ఈ శరీరంలోనే ఉత్తరోత్తరంగా శ్రేష్ఠ స్థానాలున్నవి. కాబట్టి పరమాత్మ అనుగ్రహం ఎప్పుడు కలుగుతుందో అనీ, ఈ కామ భూతాన్ని అందాకా ఎలా నాశనం చేయకుండా ఉండగలనో అనీ, శంకించనక్కఱ లేదు. 41వ శ్లోకంలో చెప్పిన ప్రకారం జ్ఞాన విజ్ఞాన సుముఖుడవయితే కామం

భగవంతుని అనుగ్రహమే కాబట్టి, సాక్షిగామియైన విజ్ఞాన ప్రవాహం నీవైపు తిరుగుతుంది. దాన్ని నీవైపు త్రిప్పుకోడానికి నీవు దానివైపు నడవాలి. పరమాత్మ అనుగ్రహం నీయందు సర్వదా ఉండనే ఉన్నది. ఈ భగవద్గీతా బోధ రావడానికి నీకు లేనిపోని పాపశంకలు రావడం ఎలా కారణమైందో. అలాగే కామంచేసే దుష్కృత్యాలు కూడా మహనీయ మైన జ్ఞానోదయానికి పునాదులు కాగలవు. ఇందుకు ఆనాడు వాల్మీకి సాక్షి.

42. ఇంద్రియాణి పరాణ్యాహుః ఇంద్రియేభ్యః పరం మనః।
మనస స్తు పరా బుద్ధిః యో బుద్ధేః పరత స్తు సః॥

తా॥ జ్ఞానాన్ని చెఱచడానికి ఇంద్రియాలు ప్రధానాలు. వాటికంటె ఘనమైనది మనస్సు. దానిని మించినది విపరీతబుద్ధి, ఈ అన్నింటిని మించినది కామం.

43. ఏవం బుద్ధేః పరంబుద్ధ్వా సంస్తభ్యాత్మాన మాత్మనా।
జహి శత్రుం మహాబాహో! కామరూపం దురాసదమ్॥

తా: అర్జునా! ఈ ప్రకారంగా మనకుండే బుద్ధిజ్ఞానం కంటె, పరమాత్మ ప్రేర ణయే శ్రేష్ఠమైనదిగా తలపోసి, మనస్సును మనస్సుతోనే సమాళింప జేసుకొని, దురా సదమైన ఈ కామరూపమనే అంతశ్శత్రువును సంహరించు.

వ్యా: అంతశ్శత్రు సంహారానికి కూడా పరమేశ్వర ప్రసాదమే అవశ్యకమని పై శ్లోకంలో చెప్పబడింది. మనకున్న మిడిమిడి జ్ఞానం పరిమితం. మన విధి నిషేధాలు ఇంకో దేశ కాలాలలో వర్తించవు. ఎంత చంద్రలోకానికి చేతులు చాచినా, అనంత కోటి బ్రహ్మాండ భాండమైన ఈ విశ్వరూపం మనిషి కౌగిట్లోకి వచ్చేదికాదు. పరమాత్మ జ్ఞానమే దీనికి మార్గం. కాబట్టి దృఢ నిశ్చయంతో మనసా వాచా కర్మణా సర్వస్వం పరమాత్మ ఆధీనంచేసి, పరమాత్మ దర్శనానికి ఆటంకాలుగా నిలిచిన్న అడ్డంకుల నన్నింటిని నివర్తించుకోమని అర్జునునకు శ్రీకృష్ణపరమాత్మ ఉపదేశించాడు.

శ్రీమన్ మాతృగీతా వ్యాఖ్యానంలోని కర్మయోగం అను తృతీయోధ్యాయము.

మాతృగీత

జ్ఞానయోగము

నాలుగవ అధ్యాయము

శ్రీ భగవానువాచ

1. **ఇమం వివస్వతే యోగం ప్రోక్తవా నహ మవ్యయమ్।**
వివస్వాన్ మనవే ప్రాహ మను రిక్ష్వాకవేఽ బ్రవీత్!।

శ్రీ కృష్ణ భగవానుడిలా అన్నాడు.

తా: అర్జునా! కల్పాదియందు అవినాశి అయిన ఈ యోగాన్ని, సూర్యునికి ఉపదేశించాను. సూర్యుడు దీనిని మనువునకు, మనువు ఇక్ష్వాకువుకు ఉపదేశించారు.

2. **ఏవం పరం పరా ప్రాప్త మిమం రాజర్షయో విదుః।**
స కాలేనేహ మహతా యోగో నష్టః పరంతపన!।।

తా: పరంతపా! ఈ ప్రకారం పారంపర్యంగా ప్రాప్తించిన యోగాన్ని రాజర్షులు తెలుసుకుని అనుష్ఠించారు. కాలక్రమాన మహనీయమైన ఈ యోగం నష్టమై పోయింది.

3. **స ఏవాయం మయాతేఽ ద్య యోగః ప్రోక్తః పురాతనః।**
భక్తోఽ సి మే సఖా చేతి రహస్యం హ్యేతదుత్తమమ్।।

తా: అర్జునా! నీవు నాభక్తుడవు, సఖుడవూ కాబట్టి మహనీయమూ, ఉత్తమమూ అయిన రహస్యాన్ని నీకు చెప్పాను.

అర్జున ఉవాచ

అర్జునుడన్నాడు కదా

4. **అపరం భవతో జన్మ పరం జన్మ వివస్వతః।**
కథమేత ద్విజానీయాం త్వమాదౌ ప్రోక్తవానితి।।

తా: ఎన్నియుగాల నాడో పుట్టినవాడు సూర్యుడు. తరువాత పుట్టిన వాడవు నీవు. నీవు సూర్యునికి ఈ యోగం ఉపదేశించానంటే నమ్మడమెలాగ?

శ్రీభగవానువాచ

5. **బహూని మే వ్యతీతాని జన్మాని తవ చార్జున।**
తాన్యహం వేద సర్వాణి నత్వం వేత్థ పరంతప!॥

పరమాత్మ ఇలా అన్నాడు.

తా: అర్జునా! ఇది వఱుకు నాకూ నీకూ బహు సంఖ్యాకములైన జన్మలు గడచి పోయాయి. ఆ అన్నింటిని నేనెఱుగుదును. పరంతపా! నీవు మాత్రం వాటి నెఱుగవు.

సముద్రం అలతో మాట్లాడినట్లుంది ఈ శ్లోకం. ఓ అలా! ఏ నీటితో అన్ని అలల రూపాల నెత్తుతున్నానో నాకు తెలుసు. ఆ సంగతి సముద్రానివైతే కాని నీకు తెలియదు.

6. **అజోஉ పి స న్నవ్యయాత్మా భూతానా మీశ్వరోஉ పిసన్॥**
ప్రకృతింస్వా మధిష్టాయ సంభవా మ్యాత్మ మాయయా॥

తా: పుట్టుకలేనివాడనై ఉండి కూడా అవ్యయమైన పరమాత్మనై ఉండి కూడా, సర్వభూతాధి నాథుడనై ఉండి కూడా నా ప్రకృతిని నేనే అధిష్టించి నా శక్తిని నేనే ఆధారం చేసుకుని పుట్టుకను ధరిస్తున్నాను.

వ్యా: పుట్టుక లేనివాడు పుట్టడమేమిటి? అవ్యయమైన పరమాత్మ అంతవంత మైన దేహం ధరించడమేమిటి? సర్వభూతాలకు ఈశ్వరుడైనవాడు పంచభూతాలకు అధీనుడు కావడమేమిటి?

a) ______________________________

ఇది ఋజురేఖ ఔనా కాదా? కనిపించడానికి ఋజురేఖ లాగానే కనిపిస్తుంది.

కాని భూత అద్దంలో చూస్తే ఆ ఋజురేఖ ఇలా కనిపిస్తుంది.

b) 

Frequency ఎక్కువైనప్పుడు తరంగాల ఆపులూ ఊపులూ, ఫుల్ స్టాపులూ మనకు కనిపించవు. అవగతం కావు. అలాంటివే జన్మపరంపరలు కూడా! అవ్యయాత్మ కాలాతీతవేగంతో మనోతీత ప్రభావంతో, బుద్ధ్యతీత ప్రమాణంతో పని చేస్తుంది. ఆ ప్రచండవేగ ప్రభూత మహాప్రయాణంలో నలిగిపోయిన నజిగిజి అయిన జీవాలలో జన్మలలో నాది ఇదని గుర్తించగలశక్తి ఎవరికీ ఉండదు. పరిమితమైన వేగంతో నడిస్తేనే మనుష్యమేధ దేనినైనా గ్రహించగలుగుతుంది. అలాగే పరిమిత

మైన పరిమాణాన్ని మాత్రమే అవగాహన చేసుకోగలుగుతుంది. సెకనుకు 33,000 మైళ్లవేగం ఎలా ఉంటుంది అని అడిగిన పిల్లవాడికి ఎవరైనా, సోదాహరణంగా, వాడికి తెలిసే లాగా చెప్పగలరా? తాబేటి కుందేటి కథ అందఱకు తెలిసే ఉంటుంది. దాని కలవాటుపడ్డ మనస్సు రాకెట్టు వేగాన్ని అర్థం చేసుకోలేదు. అలాగే పూవు పూసే క్రమాన్ని పదిరెట్లు వేగవంతం చేసి చూపినా మనస్సు ఆలోచనలో పడుతుంది. అదే కంగారు పరిమితార్థాలను అనంతార్థాల ప్రక్కన ఉంచినా జనిస్తుంది. అజ అవ్యయ శబ్దాల అవగాహన విషయంలో కూడా ఇదే చిక్కు వస్తుంది. అవ్యయత్వానికి అమే యత్వం, అనంతత్వం అంతులేని బహుత్వం కూడా అర్థాలే. అంతులేని బహుత్వం = అవ్యయత్వం అనే సమీకరణంలో ఎల్లప్పుడూ చివరయే మొదలుగా ఉంటుంది. ఆద్యంతాలు లేని ప్రకృతిలో వాటి ఉద్భవంగాని ప్రమేయంగాని ఎలా గలుగుతుంది? ధర్మహాని ధర్మగ్లాని కలిగినప్పుడు పొటమరింతకు కతం కలిగినప్పుడు. ఈ అవసరమే ధాత్వర్థాన్ని తాత్పర్యంగా చేస్తుంది. ఎప్పుడు?

7. యదా యదా హి ధర్మస్య గ్లాని ర్భవతి భారత।
అభ్యుత్థాన మధర్మస్య తదాత్మానం సృజామ్యహం॥

తా: ధర్మవతుగా ప్రపంచం నడవలేక, గడవలేక, ఒడిదుడుకుల్లో ఎప్పుడు పడుతుందో, ఇడుములే తలెత్తి పుడమిని ముట్టడి వేస్తాయో, అప్పుడు నన్ను నేను సృష్టించుకుంటాను.

ఈ శ్లోకంలోను, రాబోయే శ్లోకంలోను ధర్మశబ్దానికి వ్యాఖ్యానకర్తలు, పలు రీతులుగా అర్థాన్ని చెప్పుతారు. శంకర రామానుజులు, వర్ణ ఆశ్రమ ధర్మాలే ధర్మాలు అన్నారు. అవేకాక లోకసంగ్రహార్థమైన న్యాయం నీతి ఇవన్నీ కూడా ధర్మాలలోనే చేరు తాయన్నారు తిలక్. వర్ణాశ్రమ ధర్మాలను గుఱించి అవి ఎంతవఱకు ప్రపంచమంత టికీ వర్తించగలవనే విషయాన్ని గుఱించి లోగడ చర్చించుకొనియే ఉన్నాం. ఒక జాతి ఆచార ధర్మాలు, విధి నిషేధాలూ మఱో జాతికినప్పవు గనుక, అందఱికీ నప్పేవిగా ఉండే మనుష్య కృతములైన ధర్మాలకు, ధర్మశబ్దాన్ని విధించగల ప్రామాణికత్వం లేదని కూడా అనుకున్నాం.

ఏతావతా అందఱికీ ఏ భేదమూ లేకుండా నప్పే ధర్మాలు చావుబ్రదుకూ లాంటి పంచభూతాత్మికమైన ప్రకృతి ధర్మాలే అని ఇచ్చట అర్థం చెప్పడం సర్వసమం జసంగా ఉంటుంది. అటువంటి పాంచ భౌతికధర్మాలకు వ్యత్యయం కలిగినప్పుడు, తప్పకుండా ప్రకృతి సూత్రాలేతానై ఉన్న పరమాత్మ, ఒకానొకచోట తన సాక్షాత్కా రాన్ని స్ఫురింపజేస్తాడు. లేక ప్రకృతి శక్తులే ఆ అవతారంగా రూపొందుతాయి.

గాలి వేడెక్కినప్పుడు ఇంకో చోటికి వీచుకుంటూపోతుంది. అదివఱకు అక్కడ ఉన్న గాలి మఱోచోటికి వెళ్లి ప్రత్యక్షంగావడం లాగా సర్దుకోవలసిన అగత్యం ఏర్పడు తుంది. రబ్బరు బెలూను నిండా నీళ్లు పోసి ఒకచోట దాన్ని నొక్కితే, ఇంకోచోట ఉబ్బుతుంది. నొక్కబడిన చోటు ప్రకృతి ధర్మానికిగ్లాని అనుకుందాం. ఉబ్బు లేచిన చోట ప్రకృతి రూపంలో ఉన్న పరమాత్మ సామ్యస్థితి నుంచి ప్రస్ఫుటించే స్థితికి వచ్చా డనుకుందాం. పాంచభౌతిక పరిస్థితికి ప్రకృతి ధర్మానికి వ్యత్యయం కల్గుతుందా? ఆ కలిగే వ్యత్యయం మాత్రం ప్రకృతి ధర్మం కాకపోతుందా? అనే శంక కూడా విచా రించదగ్గదే.

పౌరాణికంగా తీసుకుంటే మహాతపస్వులైన రావణబ్రహ్మ లాంటివాళ్లు పంచ భూతాలను గడగడలాడించారు. విశ్వామిత్రుని వంటి రాజర్షులు, సృష్టికి ప్రతి సృష్టి చేసి ప్రకృతి ధర్మానికి అవాంతర ధర్మాన్ని కల్పించారు. హిరణ్యాక్షుడు ఏకంగా భూమిని చుట్టజుట్టి, వేదాల తెలివిడిని, జ్ఞానాన్ని దొంగిలించుకుపోయాడు. ఇదీ ప్రకృతి ధర్మవిపర్యయం.

పౌరాణిక భావాన్ని విడిచిపెట్టినా, లోగడ మనం చర్చించుకున్నట్లు, ఏ ఒక్క ప్రాణి పుట్టడానికైనా సమస్త జగత్తూ తానై పూనుకుని పుడుతుంది. కాబట్టి ప్రాణుల జీవితవిధానాల్లో మార్పులు వచ్చినా, అది సమస్త జగద్వ్యవస్థకు వచ్చిన మార్పే, ధర్మగ్లానియే అవుతుంది. నేటి జన్యు విజ్ఞాన విప్లవం అలాంటిదే.

అట్టి విపర్యయం సంభవించిన చోట Law of compensation పనిచేస్తుంది. విశ్వచైతన్యానికి పరిశుద్ధం చేయవలసిన అగత్యం ఏర్పడుతుంది. కాబట్టి అధర్మానికి అభ్యుత్థానమయినా, ధర్మానికి గ్లాని అయినా పరిహార ప్రక్రియనపేక్షించేవే అవు తాయి. ఆప్రక్రియ నైసర్గికంగా తనంతటతానే జరిగిపోతుంది. అంటే పరమాత్మ తన్ను తానేపుట్టించుకుంటాడు. ఎందుకు? ధర్మం కోసం తల్లిగాదు. తల్లి ధర్మం నిర్వ ర్తించడానికే "వచ్చానన్నది అమ్మ.

8. పరిత్రాణాయ సాధూనాం వినాశాయ చ దుష్కృతామ్।
ధర్మసంస్థాపనార్థాయ సంభవామి యుగే యుగే॥

తా: సాధుపురుషులను రక్షించుటకున్నూ, దుష్టాత్ములను నాశనం చేయడాని కిన్ని, ధర్మసంస్థాపనం చేసే కొఱకున్ను యుగయుగాల్లో నేను పుడుతున్నాను.

యుగయుగాల్లో అంటే 'అమ్మ చెప్పిన' అవసర మయినప్పుడల్లా అని అర్థం.

అవసరమంటే అశాంతి, మనస్సుకు ఆకలి, ఉద్రిక్తత, ఉనికిలో కదలిక ఊరు

కుని ఉండలేకపోవడం, మార్పుకు ఆరాటం, మనుష్యుని శరీరం పైన ఒత్తిడి, దురద, మంట, బాధ, ఇంద్రియాల ప్రకోపం, ఏదో కావలసి రావడం, ఆలోచనకు అవ కాశం, మనః ప్రవేశం, నిరోధం, విరోధం, బుద్ధిగుఝ్ఝానికి కొరడా, పలాయనానికి సాకు, ఆత్మరక్షణ, అన్యరక్షణ, సంఘటనకాత్మ బింబం, జాగ్రత్త, జాగరూకత, నిద్రకు వెలి, చికిత్సాస్ఫోటనం, ముందు, వెనుకలు, పంచభూతాల క్రియలన్నీని ఒక మితి దాటినప్పుడు. ఇదంతా కంటికిగాని మనస్సుకుగాని ఊపు చూపు ఉంటేనే. అనా సక్తునికి ఏ గొడవా ఉండదు. అర్జునుడు అనాసక్తి జాడ్యాన్ని పైన వేసుకున్నాడు. పరోక్ష జాగృతిని పరమాత్మ ఔషధంగా ప్రయోగించాడు.

పరోక్ష జాగృతికే పరిధిలేని మమత్వం అని మరోపేరు.

"అమ్మకు ఎక్కడ ఎవరిని చూచినా తన బిడ్డే అనిపిస్తుందట. తానే మనలనంద టినీ కని మన తల్లులకు పెంపుడిచ్చిందట. అందుకే ఒకసారి అమ్మ అన్నది. మీరం దఱూ లేకుండా నేను వెళ్తుంటే నా ఒళ్లో నుండి పిల్లలను లాగి అవతల పారేసి నన్ను తీసుకు వెళ్తున్నట్లుంది"

ఇలా అమ్మ ఎన్నో రీతులలో మనకూ తనకూ గల అభేద స్థితిని, మాతా శిశుబాంధవ్యాన్నీ స్పష్టం చేసింది. సాధువులను రక్షించడానికంటే పిల్లల కంటె సాధువు 'లెవరుంటారు? కాని ప్రత్యక్ష ప్రమాణవాదులైన నేటి తరం వారిలో చాలా మంది "మీకు కనిపించినదేదో నాకూ కనిపించవద్దూ" అనే మొండి ఘటాలు. చెలసాని నాగేశ్వరరావుగారు 'మహాస్వర్గానికి సోపానాలు' అని వ్రాస్తూ ఇలా అన్నారు.

'సరిగా ఇదే తల్లీ! ఇప్పటివారి పిడివాదముతో కూడిన మనస్తత్వము. ఎలా సరిచేస్తావోతల్లీ! ఇట్టి బుద్ధిలేని జీవుల అసురభావమును ఏవిధంగా మీ ప్రసాదభరిత వీక్షణము అతనిని (బ్రహ్మయ్యగారి అబ్బాయిని) పాదాశ్రితునిగావించుకొన్నదో అలాగే భవదాగమనము అందఱినీ చేసుకుంటుందని ఎదురు చూస్తున్నది మాతః.

ఒక అందమయిన సాయంకాలం అమ్మ 'సతులకై కొన్నాళ్లు, సుతులకై కొన్నాళ్లు' అనే త్యాగరాజ కీర్తనవింటూ, నేనిప్పుడు అదే స్థితిలో ఉన్నాను. ఈ సంతానం కొఱకేగా అన్నది.

ఇంకొక సందర్భంలో 'మీరనేకం ఆలోచిస్తుంటారు. కానీ నాకొకటే ఆలోచన మీగుఱించే' అన్నది. అమ్మ.

అమ్మ అనారోగ్య విషయమూ, అమ్మకు గల జబ్బుల ప్రస్తావనా, వచ్చినప్పుడు "మీరు లేనప్పుడు ఇవీ ఉండవు" అవి ప్రకటించింది. భగవంతునికి ఈ సృష్టిగా ఉండడం లీలాజాడ్యం. అలాటి జాడ్యమే అమ్మకు పిల్లలుగా ఉండడం, ఇంకోమాట.

తన పిల్లలందఱూ అమ్మకు సాధువులే. ఆలా సాధువులను రక్షించుకోడం కోసమే అమ్మ అవతారం ఎత్తింది. బిడ్డల మీద ప్రేమ అనే ఖడ్గంతో ప్రజల అజ్ఞాన దుష్కృతులను ఛేదించివేస్తున్నది. సాధువులెలాగో దుష్కృతులు అలాగే అమ్మకు సాధ్వసాధుభేదం ఉంటే అమ్మ అమ్మే కాదనే భావం ఎన్నోసార్లు తన వ్యక్తం చేసింది.

'గుణ భేదమే నాకు ఉంటే ఏ ఒక్కరూ నా దగ్గరకు రాగలిగే వారు కారు.

'నేను దగ్గఱకు తీయడమే కాని వాళ్లు దగ్గఱకు రావడం కాదు.

'నేను మీ గుణగణాలను చూచి ప్రేమించడం లేదు. నాకోసం నేను ప్రేమిస్తు న్నాను.

కాని 'వినాశాయ చదుష్కృతాం' అనే పదంలో అర్థమే వేఱు. పాకిస్తాన్ సైన్యం బంగ్లాదేశంలోని ప్రజానీకాన్ని నఱికి వేసినట్లుకాదు. అమెరికనులు హిరోషిమా నాగసాకి ప్రజానీకాన్ని ఖూనీ చేసినట్లు కాదు.

మహాయుద్ధంలో సాధువులు, దుష్కృతులనే వివక్షతేలేదు. యుద్ధం ఓ రకమైన మృత్యువే. కాని అమ్మ చెప్పే సంహారం మనిషిని సంహరించడం గాదుగా! గుణాన్ని సంహరించడమే. ఎంత చక్కని శిక్షణ.

ధర్మసంస్థాపనార్థాయ అనే మాటకు కూడ, ఏది ధర్మం అని ఆలోచిస్తే అమ్మ ఆ మాట కూడ స్పష్టంగానే చెప్పింది.

"నాకు ప్రేమించడం సహజం. మీకు ప్రేమించబడడం సహజం" ఇదే అవి లంఘ్యమైన పరమాత్మ, పరాశక్తి ధర్మం. ఈ ధర్మాన్ని నిర్వహించడానికే అమ్మ అవ తారం.

సోదరులు సుదర్శనంగారు 'అమ్మ మతాన్ని ఉద్ధరించడానికి కాదు. మాన వాళిని ఉద్ధరించడానికి అవతరించింది" అని వెల్లడించారు.

9. జన్మ కర్మ చ మే దివ్య మేవం యో వేత్తి తత్వతః।
త్యక్త్వా దేహం పునర్జన్మ నైతి మామేతి సోఽ ర్జున॥

తా: అర్జునా! ఎవరైతే తత్వబుద్ధి కలవారై నా జన్మ కర్మలను అలౌకికాలుగా తెలుసుకుంటారో, వారు ఈ దేహాన్ని విడిచి పెట్టిన తరువాత మళ్లీ జన్మబుద్ధి లేకుండా నన్నే చేరుకుంటారు.

వ్యా: పిల్లలమయమైన అమ్మ శరీరం లాగానే శ్రీ కృష్ణుని శరీరం గోవులమయం గోపాలకులమయం. బ్రహ్మదేవుడు గోవులను గోపకులను అపహరించినప్పుడు.

ఆయా ఆకారాలతో ఎవరి ఇంటికి వాడై తానే వెళ్లాడు. 'అంగనా మంగనా మంతరే మాధవో మాధవం మాధవం చాంతరేణాంగనా! అనే శ్లోకాలలో వర్ణితమైనట్లు, ఏ గోపికకు ఆ కృష్ణుడైనాడు రాసక్రీడలో. ఇది పుస్తక వర్ణనకాదు. జిల్లెళ్లమూడిలో అమ్మ ప్రేమనందుకొన్నవాళ్లు అనుభవించారు స్వయంగా, ఆవేశం పట్టలేక అందఱూ ఏడుస్తారు. అమ్మ ఒళ్లో పిల్లల్లాగా ఆ ఏడుపు ప్రేమతో కరిగిన మనస్సు కార్చే కన్నీరే కాని కంటిరోగం వలన వచ్చింది కాదు. అలౌకికమైన అందం కల అమ్మ దేహాన్ని చూచి మెడ్రాస్‌లో సినీ స్టార్స్ అన్నారు.

"మనం ఇన్ని రకాల మేకప్ చేసుకుంటాం. అమ్మ చూడు నిమిషంలో ఎట్లా మారిందో!"

అమ్మకున్న సార్వత్రిక సమగ్ర వాత్సల్యం, దాని అనుభవం, ఆనందం ఎలాగా పొందగలగడం? అమ్మ అలా కటాక్షించినప్పుడే మన మనస్సులు ఆ పరమ సాక్షాత్కారాన్ని పొందుతాయి. దానికి అధికారం కూడా అమ్మే ఇవ్వాలి. ఆ అధికారంపొందే దాకా అన్ని అగ్నిపరీక్షలూ అనుభవించాలి. ఆ అనుభవం 'తత్వతః' ఎప్పుడర్థ మౌతుందంటే 'నేను మిమ్ములనెప్పుడు చూస్తాను. కాని నేను చూస్తున్నాననేది మీకెప్పుడు అర్థమౌతుందంటే మీరు చూస్తున్నప్పుడు నేను చూసినట్లు కన్పించినప్పుడు"

ఆ అనుభవం కలిగినప్పుడు ఆవరణలన్నీ పటాపంచలవుతాయి. అలాటి వాడికి పునర్జన్మ ఎత్తుతున్నాననే భయంపోతుంది. నేను అమ్మ అవయవాన్నే, అమ్మకూ నాకూ అభేదం అని తెలుసుకుంటాడు. మనఃకల్లోలాన్ని విడిచిపెట్టి నిత్యతృప్తిని పొందుతాడు. పునర్జన్మలున్నాయని బాధ పడకుండా అంతా భగవత్స్వరూపమేననీ, ఆ స్వరూపంలో ఆ పూలమాలలో ప్రతి జన్మమూ ఒక పూవేననీ, జగత్తంటే పూల దండేననీ గ్రహిస్తాడు. అలా ఉండడమే దివ్యత్వమంటే. అలాంటి సంస్కారమబ్బిన జన్మలు దివ్యములు. ఆ జన్మలను వరించిన శరీర ధారుల కర్మాలు కూడా దివ్యాలే.

10. వీత రాగ భయక్రోధాః మన్మయాః మాముపాశ్రితాః।
బహవోజ్ఞాన తపసా పూతాఃమద్భావ మా గతాః

తా: ఈ భాగవతధర్మం సనాతనంగా జరుగుతూనే ఉంది. అర్జునా! రాగం నుండి భయం నుండి, క్రోధం నుండి, విడుదల పొందిన వాళ్లై, నన్ను శరణుచొచ్చిన వాళ్ళై, జ్ఞానతపస్సులలో క్రాగిపవిత్రులైన వాళ్ళై, నా భావమే వారి భావంగా కలవాళ్ళై ఇది వఱకెందఱెందఱో నాలో ఐక్యమైపోయారు

కాని వారందఱూ 'మన్మయు'లు. ఎందఱునాలో చేరినా నేనొకడినే, బిడ్డల తల్లిలాగా

11. యే యథా మాం ప్రపద్యన్తే తాంస్తథైవ భజామ్యహం।
మమ వర్త్మానువర్తన్తే మనుష్యాః పార్థ! సర్వశః॥

తా: పార్థా! ఎవరు ఏయే విధాలుగా నన్ను భజిస్తారో, నేను కూడా వారిని ఆయా విధాలుగా భజిస్తాను. దీనిని తెలిసికొన్న బుద్ధిమంతులు, విద్వాంసులు, నా మార్గాన్నే సదా అనుసరించి నన్ను చేరుకుంటారు.

వ్యా: రావణుడు, శిశుపాలుడు, అంతకు ముందు, హిరణ్యాక్షుడు, హిరణ్యకశ్యపుడూ, వైరిభావంతో భగవంతుడనైన నన్ను పూజించారు. అర్జునుడు సఖభావంతోను, చైతన్యస్వామి స్వయం రాధగా మధురభావంతోను, అక్రూరుడు భక్తభావంతోనూ, భగవంతుడిని పలువురు పలు రకాలుగా పరమాత్మను పూజించారు. ధగిడి మియా భక్తిగాని, దాసానుదాసభక్తిగాని, ఘాతుకభక్తిగాని ఏదైనా ఒకటే పరమాత్మకు.

అమ్మను కొబ్బరి చిప్పలతో, కుడప్పిడకలతో, దూలగొండి ఆకులతో కొంత మంది భక్తులు పూజించారు. సోదరి వసుంధర, సోదరి ఉష, అమ్మను కల్యాణం చేసుకున్నారు. కళంకరహితమైన మనస్సును కళంకరహితంగా అర్పించడమే కళ్యాణమంటే అన్నది అమ్మ.

అన్నంగా భుజించిన వారికి భూదేవి అన్నాన్ని సమకూర్చింది. అణుశక్తిగా పూజించిన వారికి 'యురేనియం 235' నిచ్చి అణువు బాంబుగా ప్రత్యక్షమైంది.

సర్వంసహ అయిన భూదేవి తలకట్టువిదుల్చుకొని కొయ్నా భూకంపంగా అమ్మకు సాక్షాత్కరించింది.

12. కాంక్షంతః కర్మణాం సిద్ధిం యజన్త ఇహ దేవతాః।
క్షిప్రం హి మానుషే లోకే సిద్ధిః భవతి కర్మజా॥

తా: కర్మల ఫలితాల యందు కోరికలు పెట్టుకొని ఇంకే దేవతల రూపాలనయినా ఆరాధించే వారికి ఈ లోకంలోనే శ్రీఘ్రంగానే ఆయా సిద్ధులు ప్రాప్తిస్తాయి.

13. చాతుర్వర్ణ్యం మయా సృష్టం గుణకర్మ విభాగశః।
తస్య కర్తార మపి మాం విధ్యకర్తార మవ్యయం॥

తా: గుణముల యొక్కయు, కర్మముల యొక్కయు విభాగాన్ని ఆధారంగా జేసుకుని, నాలుగు వర్ణాలను నేను ఏర్పాటు చేశాను. అటువంటి చాతుర్వర్ణ్య వ్యవస్థకు కర్తను నేనే అయినప్పటికీ, నన్ను నీవు అకర్తనుగానే తెలుసుకోవలసినది.

పురుషసూక్తంలో ఈ దిగువ మంత్రం ఉంది. 'బ్రాహ్మణోస్య ముఖ మాసీత్,

బాహూరాజన్యః కృతః ఊరూతదస్య యద్వైశ్యః పద్భ్యాగ్ం శూద్రో అజాయత" స్పష్టంగానే అర్థం అవుతున్నది.

కాళ్లు, చేతులు, ముఖం, తొడలు, అని అవయవాలకు వేఱువేఱు పేర్లున్నా, శరీరం కంటే అవేవీ వేఱు కావు. మెదడుతో ఆలోచించేటప్పుడు ఆ శరీర బ్రాహ్మణుడౌతుంది. చేతులతో పనిచేసేటప్పుడు క్షత్రియుడౌతుంది. ఊరువులతో పనిచేసే తరుణంలో వైశ్యుడౌతుంది. పాదాలతో సంచరించేటప్పుడు శూద్రుడౌతుంది. శరీర భారాన్నంతా మోసే పాదాలకే ఎక్కువ ప్రాధాన్యం. ప్రతివాడూ జన్మనా జాయతే శూద్రః అని వాక్యం. మనిషి శరీరంలోనే ఈ నాలుగూ విడదీయరాని భాగాలుగా ఉన్నాయి. మానవ సమాజమే మనిషి శరీరం. ఈ నాలుగు భాగాలూ ఉండడంవల్లనే ప్రతి మనుష్యుడూ మానవ సమాజ రూపుడూ, చాతుర్వర్ణ్య రూపుడునూ. గుణభేదాల కర్మభేదాలననుసరించిన విభాగమే కాని జాతి భేదాన్ననుసరించి పెట్టిన విభాగం కాదుగా ఇది. కాళ్లు శూద్రాంశాలనుకొని, బ్రహ్మణుడెవడూ వాటిని మంచం క్రింద వదిలేసి నిద్రపోడుగా! ఈ సత్యాన్ని స్వార్థప్రయోజనాల కోసం వక్రించి వికృతార్థాయి కల్పించి, జాతివైషమ్యాలను సృష్టించి, కొన్ని వర్గాలు సంఘంలో కల్లోలాలను సృష్టించి, కొన్ని వర్గాలు సంఘంలో అశాంతిని సృష్టించారు. అమ్మకు మాత్రం ఒకటే కులం రక్త కులం. గుణం ఏ రక్తకణంతో ఏర్పడితే ఆద్యంతాలు లేని ఆ ఏక రసమే ఏక రక్తగుణమూ, వికస్వర శక్తీ కర్మమూ అయి, బహుధా లోకాలూ, లోకాల్లోని ప్రాణులూఐ అభివ్యక్తం అయి సృష్టి అయింది. బహుముఖాల సృష్టి.

కర్తారం అనే మాటకు అమ్మ భాషలోచేసే వాడూ చేయించేవాడూ కూడా, ఇలా ఒకడైనాడు కనుక భేదం ఎక్కడా తలెత్తదు.

14. న మాం కర్మాణి లింపంతి న మే కర్మఫలే స్పృహా।
ఇతి మాం యోఽభిజానాతి, కర్మ భిర్న స బధ్యతే॥

తా: నాకు కర్మఫలాల యందు స్పృహలేదు. కాబట్టి కర్మలు నన్నంటుకోవు. ఎవడు ఈ విషయాన్ని లెస్సగా గ్రహిస్తాడో. అతడిని కూడా కర్మలు బంధించవు.

వ్యా: ఎండకాస్తున్నానని సూర్యుడనుకోడు. దహిస్తున్నానని అగ్ని అనుకోదు. ఇదే రీతిగా స్వభావసిద్ధమైన కర్మలు పరమాత్మ ఇచ్ఛారూపకంగా వాటి అంతట అవే జరిగిపోతుంటాయి. కొండలు కావాలనుకున్న పరమాత్మ కొండలుగా పడిఉన్నాడు. సముద్రాలుగా భావించుకొన్న పరమాత్మ సముద్రాలై అక్కడ ఉన్నాడు. నేను వెలుగు ననుకొన్న పరమాత్మ వెలుగై ప్రకాశిస్తున్నాడు. అలా కావడం ఆయన స్వభావం

ఇంకోవిధంగా చెప్పడానికి భాషనప్పుదు కనుక అలా చెప్పడంమేకాని నామవాచ కాలూ, సర్వనామాలూ, క్రియలూ, ఆశక్తి నిరూపించడానికి సరిపోవు.

'యతోవాచా నివర్తంతే అప్రాప్య మనసా సహ' అలా కావడం స్వభావసిద్ధమైన తంతు పరమాత్మది.

ఏ కార్యకర్మలూ ఆయన్ను అంటుకోవు వాటి ఫలస్పృహలు. రూపంలేనిది రూపం ధరించడం సృష్టి' అమ్మ

15. ఏవం జ్ఞాత్వా కృతం కర్మపూర్వై రపి ముముక్షుభిః।
కురు కర్మైవ తస్మాత్వం పూర్వైః పూర్వతరం కృతమ్॥

తా: ఇంతకు పూర్వం కూడా ముముక్షువులైన పురుషులు ఇదే ప్రకారంగా తెలుసుకొని కర్మలను ఆచరించి ఉన్నారు. నీవు కూడా ఆ అందఱు పురాతనులైన వారిచేత అనూచానంగా చేయబడుతూ ఉన్న ఈ విషయాన్ని తెలిసికొని కర్మలనాచ రించు.

వ్యా: 'సృష్టి అనాది నాది. ఎవరిదో కాదు నాదే" అమ్మ.

16. కిం కర్మ కిమకర్మేతి కవయోఽ ప్యత్ర మోహితాః।
తత్తే కర్మ ప్రవక్ష్యామి యద్ జ్ఞాత్వా మోక్ష్యసేఽ శుభాత్॥

తా: కర్మమంటే ఏమిటి? అకర్మమంటే ఏమిటి? ఈ విషయాన్ని నిర్ధారించే పట్ల పండితులు కూడా పొరబడుతూ ఉంటారు. కాబట్టి నీకు దానిని గుఱించి నిష్కర్షగా బోధిస్తాను. దాన్ని తెలుసుకొని అశుభముల నుండి నీవు విముక్తి పొందగలవు.

వ్యా: ఎలక్ట్రిసిటీనే మళ్లీ ఉదాహరణగా తీసుకుందాం. దాని మూలంగా అనేక మైన పనులు జరుగుతుంటాయి. అదే కరెంటు హీటరులో వేడినివ్వడానికి సాయ పడితే ఫ్రిజ్‌లో చల్లదనాన్నిస్తుంది. రెండూ దాని కర్మలే. ఉష్ణతాహేతువుగా పోతుంది. సూర్య కిరణం సూటిగా పోయి ఎక్కడో మనకు తెలీనిచోట వంగుతుంది. గ్రద్ద ఎగరడాన్ని నమూనా చేసుకుంటే కపోతం యొక్క ఉడ్డీన సండీన ప్రడీనాలు వికృతాలుగా మనకు తోచవచ్చు. కపోతానికైతే అది రూఢిగమనమే. ఇంకోవిధంగా ఎగరడం దానికి చేతకాదు.

పావురాన్ని పాములాగా ప్రాకుతూ పొమ్మంటే అది ఆ పని చేయలేదు. కాబట్టి వికృత కర్మ అంటూ ప్రకృతి పరిభాషలో లేదు కొందఱు వికర్మ అంటే నిషిద్ధ కర్మ అని, స్వయంభవ కర్మ అనీ అర్థం చెప్తుతారు. ప్రకృతి పరిభాషలో నిషిద్ధమంటూ లేదు.

అగ్నినికాల వద్దని నిషేధిస్తే అది ఆగదు, దానికి అడవిని కాల్చినా, ఇళ్ళను కాల్చినా, దాచుకొన్న నోట్ల కట్టలను కాల్చినా, పెంచుకున్న పిల్లాణ్ణి కాల్చినా, ప్రేమించిన భార్యను కాల్చినా, ఏదోషమూ లేదు విశ్లేషమూ లేదు. అది నిషిద్ధ కర్మంకాదు. విధి నిషేధాలు సాపేక్ష ధర్మాలు, ఒకడి విధి ఇంకోడికి నిషేధం ఏ సమాజ వ్యవస్థలోని విధి నిషేధాలు ఆ సమాజానికే పరిమితాలై ఉంటాయి. కాని సార్వత్రికంగా సమగ్రంగా, ప్రకృతిసిద్ధంగా, సార్వజనీనంగా అవి సహజధర్మాలుగా ఉండవు. మనోవైకల్యంచేత స్పృశించబడని సహజమైన చేష్టయే కర్మ. పసిబిడ్డ తల్లి పాలు త్రాగడం లాగ.

'బోద్ధవ్యంచవికర్మణః! అనే పదాలకు వికర్మకు స్వరూపమంటూ లేదని కూడా తెలుసుకోవాలి అని అర్థంగా నాకు స్ఫురిస్తుంది. శశి విషాణన్యాయం వికర్మ అంటూ చెప్పే సాపేక్ష ధర్మాలలోని విధి నిషేధాలను పాప పుణ్యకర్మలుగా భావించవద్దని అర్జునునకు పరమాత్మ ఉపదేశిస్తున్నారు.

కొందఱు వికర్మ శబ్దానికి భగవంతుడే అని అర్థం చెప్పారు. కర్మాకర్మలకు భగవత్ప్రేరణయే మూలమని తెలుసుకోమనడం సవ్యంగా ఉన్నట్లు అనిపించినా, భగవంతునితోనే కారణ కారణత్వం ఆరంభిస్తుంది కనుక, ఆ సర్వత్వాన్ని వికర్మతో జోడించడం అంత సమీచీనం కాదనిపిస్తుంది. కాకపోతే ఇలా చెప్పొచ్చు. కర్మా, అకర్మాగాని వికర్మ అనబడే ఏదైనా శేషం ఉంటే అది కూడా పరమాత్మయే అని తెలుసుకోవాలి.

ఏది కర్మమో అంటే బ్రహ్మకర్మమో, అంటే ప్రకృతి యజ్ఞకర్మమో, దాన్ని మనుష్యుల పరంగా చెప్పవలసివస్తే అది ఎలా ఉంటుందో దాన్ని ఆచరించే మహాత్ములెలా ఉంటారో అర్జునునకు బోధిస్తున్నారు.

18. కర్మణ్య కర్మ యః పశ్యే దకర్మణి చ కర్మయః।
స బుద్ధిమా న్మనుష్యేషు సంయుక్తః కృత్స్నకర్మకృత్.

తా: ఏ బుద్ధిమంతుడైన మనుష్యుడు కర్మలో అకర్మను, అకర్మలో కర్మను దర్శిస్తాడో, అతడే యోగ్యుడు, కర్మలన్నీ చేసినవాడున్నూ.

వ్యా: పొడుపు కథలాగా ఉంది ఈ శ్లోకం చేసిన చేతను చెయ్యని దానిలాగాను చేయని దాన్ని చేసిన దాని లాగాను ఎలాగా అనుకోవడం?

ఏ పనినైనా అన్ని పనుల్లాగానే స్వార్థంలేకుండా చేయడంలోనే ఉంది ఈ కీలకం. తన కోసం చేయని ప్రతి పనీ చేయనట్లే లెక్క. తన కోసంచేసే పనిలో కూడా తన పని కాదనే భావన పొందుతున్నప్పుడు, అతడు అకర్మలో కర్మను చూచిన

వాడౌతాడు. ఇతరుల కోసం చేసిన కర్మలన్నీ తనకోసమే చేస్తున్నట్లు అనుకునేవాడు అకర్మలో కర్మను దర్శిస్తాడు. అది సహజంగాజరిగే భావన. కాని తెచ్చిపెట్టుకుంటే బయటబడే సినిమా ధోరణి కాదు.

సాక్షీభూతధర్మం తటస్థధర్మం ఇవి అంత సులభ సాధ్యాలు కావు. "నాదనుకున్నప్పుడు చెయ్యగలుగుతావు. కాదనుకొని ఎప్పుడైనా చేశారా ఒక పని. నిత్యజీవితమే సాధన' అన్నది అమ్మ 'నా'లో 'నా' అనే మాట కరిగిపోయినప్పుడు ఈ తటస్థ ధర్మం సఫలీకృతం అవుతుంది. ఎలక్ట్రిసిటీ చేస్తున్న పనులన్నీ తాను చేస్తున్నానన్నుకుని చేస్తున్నదా? అనుకోకుండా మానేస్తున్నదా? ప్రేరణ ఫలితంగా అది అన్ని పనులను నిర్లిప్తంగా చేస్తున్నది.

ఆశాజీవి, బుద్ధిజీవి ఐన మానవుడు అలా తటస్థంగా అన్ని పనులు చెయ్యగలడా? బుద్ధి ప్రేరణలేకుండా మనిషికి క్రియేచ్ఛ. అసలు కలుగుతుందా? మనసును వంగదీసి నిర్లిప్తకర్మలను చేయించమని గీత చెబుతుంది. అది జరగడం ప్రశస్తమైన మార్గమే! దాని కొఱకు బ్రతుకును సాధనగా ఉపయోగించుకోమని అమ్మ చెబుతుంది.

19. యస్య సర్వే సమారంభాః కామ సంకల్ప వర్జితాః।
జ్ఞానాగ్ని దగ్ధ కర్మాణం త మాహుః పండితం బుధాః॥

తా: ఏ పురుషుడు కామ సంకల్పవర్జితంగా అన్ని పనులను నిర్వర్తిస్తాడో, ఎవడి కర్మాలు జ్ఞానాగ్ని చేత దహింపబడిన వౌతాయో ఆ మనిషి వివేకంతుడని పండితులు పరిగణిస్తారు.

వ్యా: నేనే చేస్తున్నాననుకొని చేయడం వేఱు. చేసే దానిమీదా ఆసక్తి లేకుండా, ఇంకో శక్తి చేయిస్తుంటే నేను ఆ బలంతో చేస్తున్నాననుకొని చేయడం వేఱు. ఎంతో మంది ఇచ్చిన దానాన్ని మఱిచిపోతారు. కీర్తి ప్రతిష్టలకోసం కాకుండా తన శరీరానికే కలిగిన అవసరంగా తలపోసి ఆ అవసరానికాదుకుంటారు. అగ్నిదగ్ధమైన బంగారం నుంచి మైలవిడిపోతుంది. జ్ఞానాగ్నిదగ్ధమైన మనస్సు నుండి మమత్వం కూడా అలాగే విడిపోతుంది. మమతాబంధంపోయిన మనస్సులో పరమాత్మయే మిగిలేది. ఇలాంటి మనస్సు కలవాడు పండితుడే.

20. త్యక్త్వా కర్మ ఫలాసంగం నిత్య తృప్తో నిరాశ్రయః।
కర్మ ణ్యభిప్రవృత్తోఽపి నైవ కించిత్ కరోతి సః॥

తా: కర్మఫలాపేక్షను విడిచిపెట్టి, నిరా(శయుడై నిత్యతృప్తితో ఉండేవాడు కర్మలందే అంటిపెట్టుకొని ఉంటూ సంసారంలో కర్మలలో మునిగి ఉన్నట్లే కని పిస్తాడు. కాని వాడినవేమీ అంటుకోవు సరికదా, అతడు వాటిని చేయనట్లే లెక్క.

వ్యా: భగవంతుని (పేరణ వలన నిమిత్తమా(తుడనుగా సర్వమూ చేయగలుగు తున్నానుగాని, చేయించేదీ చేసేదీ ఆయనే. సుత్తెవల్ల మేకుకుతగిలిన దెబ్బలో సుత్తె నాడించిన చేతిని విడిచిపెడితే, సుత్తెకెంత బాధ్యత ఉంటుందో నాకూ అంతే స్థానం అని తెలుసుకున్నవాడు కొన్ని పనులను చేస్తున్నట్లు కనిపిస్తున్నా, వాడుగా స్వతం (త్రించి ఏ ఒక్క పనీ చేయనివాడే అవుతున్నాడు. మనమే అన్నీ చేస్తున్నామనుకుంటాం. నడుస్తున్నది మనమనుకుంటాం. నడిపిస్తున్నది దైవశక్తి అని గుర్తించం.

18వ శ్లోకంలో కృత్స్నకర్మకృత్ ఎవరో చెప్పారు. ఈ శ్లోకంలో ఏ కొంచెమూ పని చేయని వాడిని గూర్చి చెప్పారు పరమాత్మ. రెండు సందర్భాలలోను కర్మలలో అకర్మలను, అకర్మలలో కర్మలను దర్శించే విధానం కూడా చెప్పారు. ఇక ఆ మహా త్ముల అలవాట్లెలా ఉంటాయో ముందు శ్లోకంలో చెబుతున్నారు.

21. నిరాశీ ర్యత చిత్తాత్మా త్యక్త సర్వపరి(గహః।
శారీరం కేవలం కర్మ కుర్వ న్నాప్నోతి కిల్బిషమ్॥

తా: అంతఃకరణంలోని పాకుడును విసర్జించి, భగవంతుని అను(గహం వల్ల మనస్సును ని(గహించుకొని, ఆశాబంధాలలో బడక, సమస్త భోగసామ(గ్రిని మన స్సుతో త్యజించిన మహాత్ముడు, కేవలం శరీర సంబంధియైన కర్మలను చేస్తూ ఉన్న ప్పటికీ అతడిని ఏ పాపమూ అంటుకోదు.

బురదలో కుమ్మరి పురుగుంటుంది. కాని బురద ఆ పురుగును అంటుకోదు.

22. యదృచ్ఛా లాభ సంతుష్టో, ద్వంద్వా తీతో, విమత్సరః।
సమ స్సిద్ధా వసిద్ధౌ చ కృత్వాపి న ని బధ్యతే॥

తా: యాచన చేయకుండా లభించిన దానితో సంతుష్టుడయ్యేవాడు యదృచ్ఛా లాభ సంతుష్టుడు.

ద్వంద్వాతీతుడంటే శీతోష్ణ సుఖాలను జయించినవాడు. సిద్ధ్యసిద్ధులను సమా నంగా ఎంచేవాడు. ఈర్ష్యలేనివాడు విమత్సరుడు కర్మలనుచేసినా పైన చెప్పబడిన వాళ్లు కర్మబంధాలను జయించి కర్మలను చేయని వాళ్లే అవుతున్నారు.

23. గతసంగస్య ముక్తస్య జ్ఞానావస్థిత చేతసః।
యజ్ఞాయాచరతః కర్మ సమగ్రం ప్రవిలీయతే॥

తా: కోరికలు లేని వానిని, నిత్య సంతుష్టి గలవాడిని, జ్ఞానావస్థితమైన చిత్తంగల వాడిని కేవలం పరమాత్మ యజ్ఞంకోసమే కర్మలు చేయడం పరాకాష్ఠగా కల వానిని, అతడు చేసే కర్మలేమాత్రం, అతనిని అంటుకోవు. ఆ కర్మల్లో అవే ప్రవిలీనమై పోతాయి.

24. బ్రహ్మార్పణం బ్రహ్మహవిః బ్రహ్మాగ్నౌ బ్రహ్మణా హుతమ్।
బ్రహ్మైవ తేన గంతవ్యం బ్రహ్మ కర్మ సమాధినా॥

తా॥ పైన చెప్పబడిన రీతిగా, జగద్యజ్ఞ స్వరూపాన్ని లెస్సగా తెలుసుకున్న మహాపురుషులు స్రుక్స్రువాదికములైన సంకల్ప రూపసృష్టి కూడ బ్రహ్మాయే అనిన్ని, హోమకుండములు, హోమసామగ్రి, హవిస్సు మొదలైన వాటి రూపమైన ఈ బ్రహ్మాండ సృష్టి, ఈ అన్నింటికీ అంతస్తేజస్సుగా నిలిచి యంత్రాంగాన్ని నడుపుతున్న భూతప్రాణ శక్త్యాదికములన్నింటికీ మూలకందమై ఏది ఉన్నదో, అదికూడా బ్రహ్మాకారమైన అగ్నిగాను, యజ్ఞకర్మకుండ బ్రహ్మగానే తలపోసి బ్రహ్మరూపమైన, ఈ జగద్యజ్ఞకర్మములో, సమాధిస్థులై, యజ్ఞంవలన లభించే ఫలం కూడా బ్రహ్మ రూపమే అని తెలుసుకుని, ఆనందాన్ని అనుభవిస్తారు. అది కాని దిదేమీ లేదు – అమ్మ.

25. దైవ మే వా పరే యజ్ఞం యోగినః పర్యుపాసతే।
బ్రహ్మ గ్నా వపరే యజ్ఞం యజ్ఞే నైవోప జుహ్వతి॥

తా॥ కొందఱు యోగులు, దేవతారూపమైన యజ్ఞాన్ని చేసి పరమాత్మనుపాసిస్తుంటారు. మఱికొందఱు బ్రహ్మాగ్నిలో హుతమైనదే యజ్ఞమని ఆ యజ్ఞరూపమైన పరమాత్మనుపాసిస్తుంటారు.

వ్యా: మంచుగడ్డతో విష్ణుమూర్తి బొమ్మను చెక్కి పూజించామనుకోండి. ఎండవేడి తగలగానే అది నీళ్ళై రూపంలేకుండా పోతుంది. విష్ణుమూర్తి ఆకారంగా ఉన్న సీసాలో ఆ నీళ్ళను నింపామనుకోండి. నీళ్ళైన స్థితిలో కూడా మళ్ళీ ఒక రూపం ప్రకటమౌతుంది. ఆ నీళ్ళను కూడా హైడ్రోజన్, ఆక్సిజన్ వాయువులుగా విడగొట్టి ఆ సీసాలను నింపామనుకోండి. అప్పుడు ఆ వాయువు కంటికి కనిపించని మనం కల్పించిన ఆకారాన్ని ప్రదర్శిస్తుంది. ఆ వాయువులను కూడా అణువులుగా విడగొట్టి ఆ సీసాలను నింపామనుకోండి. మెర్క్యురీ లైటు లాగా ఏదో తేజోమయాకారం కని

పించవచ్చు. సీసా ఆవరణం లేదనుకోండి. వాయువు వాయువులో విలీనమైపో తుంది. ఇంకా వ్యాప్తిచెంది విశాల ప్రదేశాన్ని ఆక్రమిస్తుంది. ఎలెక్ట్రానులు, ప్రోటా నులు, న్యూట్రానుల వంటి అణురూపశక్తిని దాల్చినప్పుడు ఆ అవతారం ఇంకా అదనపు లక్షణాలని ప్రకటించవచ్చు.

విశ్వప్రస్తారక క్షమమైన స్వరూపాన్ని పరిమితంగా ఉన్న మంచుగడ్డ రూపం లోను 'విశ్వవ్యాప్తి, అంతటిలోను, ప్రతిపరిమితమూర్తిలోను ప్రజ్ఞాచక్షువు చూడ గలుగుతాడు. ఎలా కావాలంటే పరమాత్మ స్వరూపం అతనికి అలాగే ప్రత్యక్ష మౌతుంది. దేవయజ్ఞం అనుకుంటే అది దేవయజ్ఞమే అవుతుంది. బ్రహ్మయజ్ఞం అను కుంటే అది బ్రహ్మయజ్ఞమే అవుతుంది. చూచేవాళ్లకు పరమాత్మ ఇచ్చిన అధికారాన్ని బట్టి, పరమాత్మ శక్తి, ఆయా సాధకుల భావనల కనుగుణంగా ప్రదర్శితమవుతుంది.

తుకారామ్‌కు పరమాత్మ కుక్కలో ప్రత్యక్షమయ్యాడు.

క్రియ, కారకం, భేద బుద్ధిరహితమైనదీ, కర్తృత్వాభిమానం, ఫలాభి సంధీలేని యజ్ఞాలు ఎక్కడా కనిపించవు. పైన చెప్పిన యజ్ఞాలక్రమం ఫలాభి సంధిహీనమై ఉంది కాబట్టి అది అకర్మే అవుతున్నది. కర్మ యందకర్మను చూడడమే జ్ఞాననిష్ఠ. ఫలి తార్థం యజ్ఞమంటే సమ్యగ్దర్శనమే అంటే జ్ఞానోదయమే. బ్రహ్మమంటే స్రుక్స్రు వాదులే. ఆ మంత్రార్థాలే.

26. శ్రోత్రాదీ నింద్రియాణ్యన్యే సంయమాగ్నిషు జుహ్వతి।
శబ్దాదీ న్విషయానన్యే ఇంద్రియాగ్నిషు జుహ్వతి॥

తా: అన్యులు శ్రోత్రాదికములయిన ఇంద్రియాదులను సంయమాగ్నిలో హోమం చేస్తారు. ఇతరులు శబ్దాది విషయాలను ఇంద్రియాగ్నిలో హోమం చేస్తారు.

వ్యా: త్వక్చక్షుశ్రోత్రజిహ్వాఘ్రాణాలనే జ్ఞానేంద్రియాలైదు మనస్సనేయంత్రం భాగాలు. వాటి ద్వారా బహిఃప్రపంచ వ్యవహారాలను జరుపుకుంటాడు బుద్ధిజీవి మానవుడు. ఈ భాగాలు శరీరంలో కవలుగా విడివిడిగా నెలకొని శరీర స్థానాలై ఉండడం విశేషం. ఒకదాని బాధ మఱోజ్ఞానేంద్రియానికి తెలియకపోవడం మఱో విశేషం. కంటి బాధముక్కుకు తెలియదు. ముక్కు బాధ చెవికి తెలియదు. అన్నీ తలలోనే ఉన్నా. అన్నింటి బాధలు మనస్సు ద్వారా వ్యక్తమవుతాయి.

లోకానుభవాలు సుఖదుఃఖాలు అనే సమిధలతో మనస్సు అగ్నిలాగా జ్వలిస్తుం టుంది. సమిధలుంటేనే గాని జ్వలించని, జ్వలించజాలని అగ్నిని మాత్రమే మనం ఎఱుగుదుం, సమిధలు అంటే ఇంద్రియాల అనుభవాలు లేకుండా, నిర్ధూమమైన

పరంజ్యోతిగా వెలిగే శక్తి కూడా మనస్సుకున్నది. లోకానుభవాలు శ్రోత్రాదీంద్రియాల ద్వారా జ్వలించి పరమాత్మ అనుగ్రహంవల్ల ఉద్విగ్నత శమించి, రెపరెప కొట్టుకునే మనస్సు సంయమించి కుంభగత ప్రదీక కళికగా నిలిచిపోయినప్పుడు శ్రోత్రాదులు భస్మసాత్కృతములైపోయి, ఇక పనిచేయవు. ఈ అర్థాన్నే సంయమాగ్నిషు జుహ్వతి అని రసవత్తరంగా ఋషి వర్ణించారు.

శ్రోత్రేంద్రియం శబ్దనిష్టమూ శబ్దపుష్టమూను. బయటి శబ్దాలనది మనస్సు లోనికి చేరవేస్తుంది. కంటి అవగాహన కంటే ముందుగా చెవి అవగాహనను అందు కుంటాడు ప్రతి జీవీ. కళ్ళు మూసుకుని శబ్దాన్ని వినవచ్చు. శబ్దవేధ విద్య దశరథ మహారాజు కథకు, రామాయణగాథ అంతటికీ తల్లి వేరయింది. 'శబ్ద బ్రహ్మోద్భవం విద్ధి' అని మీమాంసా వాక్యం జగత్తంతా శబ్దంనుంచి పుట్టిందని అర్థం శబ్దజ్ఞానంతో పరోక్షానుభవాన్ని పొందుతాడు వ్యక్తి. అంటే మనస్సు మతీ పదునెక్కి శబ్దచక్షువై నప్పుడు ఇంద్రియాల అగ్నిలోనే అంటే ఇహలోకానుభవంలోనే పరమాత్మను దర్శించ గలుగుతాడు జ్ఞాని. ఇదే శబ్దాది విషయాలను ఇంద్రియాగ్నిలో వ్రేల్చడమంటే. అమ్మ చేస్తున్న పనే ఇది.

27. సర్వాణీంద్రియ కర్మాణి ప్రాణకర్మాణి చాపరే।
ఆత్మ సంయమయోగాగ్నౌ జుహ్వతి జ్ఞాన దీపితే॥

తా: ఇంద్రియ కర్మలతోబాటు ప్రాణి కర్మలన్నింటినీ ఇంకనూ కొందఱు యోగులు, ఆత్మ సంయమ యోగాగ్నిలో, అంటే పరమాత్మలో జ్ఞాన దీపికగా నిలిచి పోయిన తపోగ్నిలో ఆహుతి చేస్తారు.

సంయమమంటే నిగ్రహమని అర్థం.

'సతపస్తప్త్వా' అనే వాక్యం అనేక ఉపనిషత్తులలో మనకు వినబడుతుంది. తపస్సుతో, తపస్సులో, తపస్సును తపించి పరమాత్మ పదార్థం ఈ జగత్తయి నిలిచింది. మనస్సుతో, మనస్సులో, మనస్సును, మనసించిన వాడు ఆత్మ సంయమన సిద్ధిని పొందిన వాడౌతాడు. ఇంద్రియ కర్మలంటే, తినడం, తిరగడం, చూడడం, వినడం, సంసారం చేయడం, ఆలోచించడం, రాగద్వేషాలకు లోనుగావడం మొదలైనవి. ప్రాణి కర్మంటే తిన్నది అరిగించుకోవడం, ఊపిరిపీల్చడం, గుండెదడ రాకుండా శాంతిగా ఉండడం. పిల్లలను కనడం, ప్రాణాయామం చేయడం యోగాన్ని అభ్యసించడం, పరమాత్మకు మనశ్శుద్ధిగా ఆత్మార్పణం చేసుకోవడం మొదలైన కర్మలు. శుచి, శుభ్రత, మితభోజనం, యమ, నియమ, తితిక్షా, ముముక్షాదికాలు కూడా ప్రాణి

కర్మములే. ఈ లోకాన్ని అంటీ అంటనట్లుంచుకుంటూ, సర్వకర్మాలు, ధర్మాలు, ఆచరించడానికి సాయపడేవన్నీ ప్రాణికర్మాలే. ప్రాణి కర్మాలను ఇంద్రియ కర్మాలను నిక్కచ్చిగా విడగొట్టి చెప్పడం కష్టసాధ్యమేకాని, ఈ లోకానికి సంబంధించినవి ఇంద్రియ కర్మాలనీ, పరలోక సాధనకు ఉపకరిస్తూ దేహధారణకు కారణమైనవీ ఆధారమైనవీ, ప్రాణికర్మాలని చెప్పవచ్చు.

ప్రాణం లేకుండా ఈ దేహంలో కాని, లోకంలోగాని ఉండగలమా? అది లేకుండా ఇహలోక యాత్ర సాగుతుందా? అనే సంశయం కొందఱి కుదయించవచ్చు. లోకం, సంసారం, దైహిక సంబంధం కలవి. ఆకారం నష్టమైపోతే ఇంద్రియ కర్మలు సమసిపోతాయి. ఇంద్రియాలు దేహాన్ని అంటి పెట్టుకుని ఉంటాయి కనుక. ప్రాణ కర్మానికాఆపత్తి లేదు. ఈ సందర్భంలో నా మృత్యులగ్న కావ్యంలోని పద్యం జ్ఞప్తికి వస్తున్నది.

ప్రాణము ప్రాణమె కావున
ప్రాణమునకు చావు లేదు; ప్రతి జీవికి ని
ద్రాణస్థితి మైమార్పు, ప్ర
యాణపు మజిలీయేకాక యవధి యెటులగున్

జగత్ప్రాణం జడమూ చేతనమూ కూడాను. ద్రవ్య సంబంధి, శరీర సంబంధి అయినప్పుడది జడం, మనస్సంబంధి అయినప్పుడు అది చేతనం.

వ్యష్టి శరీర ప్రాణంగా దాన్ని అర్థం చేసుకుంటే చాలా తికమకలున్నాయి. జగత్తులో ప్రాణంలేని వస్తువేలేదు. ఎటొచ్చీ అది మనకు ఉపయోగపడే రీతిలో ఉండకపోవచ్చు. మన విజ్ఞానం స్థాయిని బట్టి ప్రతి అచేతన వస్తువునూ జడ ప్రపంచ వస్తువుల జాబితాలలో జేర్చవచ్చు.

ప్రాణానికి చావుంటే అది ప్రాణమెలా అవుతుంది? ప్రాణ కర్మం అంటే ఆత్మ సాక్షాత్కారానికి వినియోగపడే మనస్సంయమ, యోగాసన, ప్రాణాయామ, ప్రత్యాహారాది కర్మలనే అర్థం చేసుకోవాలి. ఇంద్రియ కర్మలకుగాని, ప్రాణ కర్మలకుగాని మనస్సే పీఠమూ చుక్కాని, మనస్సుకు ఆత్మచుక్కాని. ఆత్మ సంయమనమనే అగ్నిలో ఈ రెండు రకాలైన కర్మలూ దహించబడితే ఇంకా మిగిలేదేముంది.

'నేను నేనైన నేనే'

28. ద్రవ్య యజ్ఞా స్తపోయజ్ఞా యోగయజ్ఞా స్తథాపరే।
స్వాధ్యాయ జ్ఞాన యజ్ఞా శ్చ యతయః సంశ్రిత వ్రతాః॥

తా: ఇంకను మఱికొందఱు పురుషులు, ఈశ్వరార్పణ బుద్ధితో, లోకసేవా రూపంగా తమ ద్రవ్యాన్ని వినియోగించే వాళ్ళు, అలాగే మఱి కొందఱు నిష్ఠురమైన తపస్సుచేస్తూ భగవత్సాక్షాత్కారం కోసం తపించేవాళ్ళు, ఇంకను కొందఱు అష్టాంగ యోగసాధనలు చేసేవాళ్ళు. ఇంకను కొందఱు అహింసాది తీక్ష్ణవ్రతాలను అనుష్ఠించే వాళ్ళు. ఇంకను భగవంతుని నామాన్ని జపించుతూ భగవత్ప్రాప్తి విషయమైన శాస్త్రాలను అధ్యయనం చేస్తూ జ్ఞానాన్వేషులైనవాళ్ళు. ఈవిధంగా అనేకులు కూడా భగవన్మార్గ గాములున్నారు. భగవానుడెంత పెద్ద ప్రాభవ వైభవాలు, కలవాడో, అయన్ను చేర్చే మార్గాలు కూడా అంత విపులంగా ఉన్నాయి.

29. అపానే జుహ్వతి ప్రాణం ప్రాణేఽ పానం తథాఽ పరే।
ప్రాణా పానగతీ రుద్ధ్వా ప్రాణాయామ పరాయణాః॥

తా: ఇంకను కొందఱు యోగివరులు అపానవాయువులో ప్రాణవాయువును హోమం చేస్తారు. మఱికొందఱు ప్రాణవాయువులో అపానవాయువును హోమం చేస్తారు. మఱికొందఱు ప్రాణాపాన వాయువులు రెంటి గతులను నిరోధించి ప్రాణాయామ పరాయణులౌతారు.

30. అపరే నియతాహారాః ప్రాణాన్ ప్రాణేషు జుహ్వతి।
సర్వేప్యేతే యజ్ఞవిదో యజ్ఞ క్షపిత కల్మషాః॥

తా: ఇంకను ఇతరులు నియతాహారులై ప్రాణాలను ప్రాణాలయందే హోమం చేస్తారు. పైన చెప్పబడిన అందఱు యజ్ఞం చేయడమంటే తెలిసినవాళ్ళు. సినిమా సరుకుగాదు. ఇలా తెలుసుకొని యజ్ఞ కర్మాన్ని చేసేవాళ్ళు తాము చేసే యజ్ఞ కర్మాల మూలంగా కడిగివేయబడ్డ కల్మషాలు గల వాళ్ళౌతారు.

మనలో చాలామంది విస్తరిముందు కూర్చుని నోట్లో పిడచ పెట్టుకోకముందు ఆత్మాభిముఖంగా చేతులు త్రిప్పుకుంటారు. కొంతమంది అయిదుచోట్ల అయిదు మెతుకుల విస్తరిప్రక్కన పడేస్తారు. కొందఱు చేతిలో నీళ్ళను తీసుకుని అన్నంమీద చిలకరించి

ఓం భూర్భువస్సువః ఓం తత్సవితుర్వరేణ్యం
భర్గో దేవస్య ధీమహి ధియో యో నః ప్రచోదయాత్

విస్తరి చుట్టూ నీళ్ళను ధారావృతం చేసి, సత్యంత్వర్తేన పరిషించయామి అమృతమస్తు అంటూ సవ్యంగా త్రిప్పి విస్తరిమీద ఎడమచేతి మధ్యవ్రేలి నానించి

ఓం ప్రాణాయస్వాహా

ఓం అపానాయస్వాహా

ఓం వ్యానాయస్వాహా

ఓం ఉదానాయస్వాహా

ఓం సమానాయస్వాహా

అంటూ ప్రాణాహుతులను చేస్తారు. భోజనమయిపోయిన తరువాత అమృతాభిధానమసి, రవే రవే పుణ్యనిలయే పద్మార్బుద నివాసినాం అర్థినా ముదకం దత్తం అక్షయ్య ముపతిష్ఠతు

అని అపసవ్యంగా నీటిని విస్తరిచుట్టూ త్రిప్పి బ్రేవుమంటూ మఱో వాయువును విసర్జించి పీటమీద నుండి లేస్తారు. పై మంత్రాలలోని అర్థాన్ని, తాత్పర్యాన్ని చక్కగా గ్రహిస్తే నిత్యమూ మనం ఆత్మయజ్ఞాన్ని చేస్తున్నామనే గ్రహించగలం. తెలియని వాళ్ళ పట్ల ఇవన్నీ మూఢాచారాలుగా మారిపోయాయి.

తెలిసిన వాళ్ళు ఈ మంత్రాలను పఠించకుండానే అన్నీ అనుభవ జ్ఞాన రూపకంగా చేస్తుంటారు. పైన చెప్పిన శ్లోకాలన్నింటి అర్థాన్నీ మూసకట్టి అమ్మ తన జీవితంగా ప్రదర్శించింది.

కర్మ ఫలాసంగమూ, నిత్యతృప్తి, నిరాశ్రయత్వము, సంసారంచేస్తూ కూడా సంసారాన్ని అంటకుండా ఉండడమూ, యత చిత్తమూ, ఆశారహిత చిత్తమూ కేవలం శరీరమే కర్మలు చేస్తున్నట్లు కనిపిస్తున్నా మనస్సును ఆ కర్మల కంటిపెట్టుకొని ఉండక పోవడమూ, యదృచ్ఛా లాభ సంతుష్టి, ద్వంద్వాతీతభావమూ, విమత్సరత్వమూ, తాను చేసే పనిలోనేకాక, బాధలో కూడా భగవంతుడున్నాడనే భావనా, భగవంతుడు చేసిన పనే తానని ఋజువు చేయడమూ, నిత్యముక్త స్వభావమూ, జ్ఞానావస్థితమైన చిత్తమూ, సమగ్రమైన మాతృప్రేమ, బ్రహ్మకర్మ సమాధిత్వమూ దేవీదేవతల నుపాసించినా, పరబ్రహ్మతత్వాన్ని ఉపాసించినా అన్నీ ఒకటిగా తలపోయడమూ, ఇదికాని దదేమీలేదను సూత్రమూ, చెవి చేష్టను శబ్దంలోను, శబ్దతత్వాన్ని శ్రోతాగ్నిలోను హోమం చేయడంలోనూ, ప్రతినిత్యమూ అన్య కుశల చింతనలోనే గడపడమూ, తెలుగుభాష అనే గంగిగోవు నుండి మధుర మధురమైన భాషాపయస్సును పిండడమూ, ఇంద్రియ కర్మాలను ప్రాణ కర్మాలను సంయమాగ్నిలో వ్రేల్చడమూ, ద్రవ్య యజ్ఞ, బ్రహ్మయజ్ఞాలను సంసార యజ్ఞంగా నిర్వహించడమూ ప్రాణాయామ ప్రత్యాహారాది క్రియలను బ్రాహ్మీ శాంభవీ ఛిన్నమస్తాది ముద్రలను స్వయంగా ధరించి చూపడమూ, సమస్త దేవతానీకప్రభా, ప్రతిభా, ప్రభావ విన్యాసాలను స్వయంగా

ప్రజలకు తెలియకుండా వారికందజేయడమూ, నియతాహారమూ, నిరాహారమూ, ప్రాణయజ్ఞానుష్ఠానమూ, ఇందులో అమ్మ దేన్ని ప్రదర్శించడంలేదు? అన్నీ అమ్మ చూపుతూనే ఉన్నది. ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ, చూడలేని వాళ్ళం వినలేని వాళ్ళం మనమే.

'నా సంసారానికి మొదలూ చివరాలేదు. మీ సంసారం లాంటిదికాదు. నాది విశ్వ సంసారం'

31. యజ్ఞ శిష్టా మృత భుజో యాన్తి బ్రహ్మ సనాతనమ్।
నాయంలోకో౽ స్త్య యజ్ఞస్య కుతో౽ న్యః కురుసత్తమ!॥

తా: కురుశ్రేష్ఠా! అర్జునా! యజ్ఞ పరిణామరూపమైన జ్ఞానామృతాన్ని సేవించే యోగిజనులు, సనాతన పరబ్రహ్మాన్ని, పరమాత్మను పొందుతారు. యజ్ఞరహితులకు ఈలోకం కూడా లేదంటే పరలోకం ఎక్కడుంది?

32. ఏవం బహువిధా యజ్ఞా వితతా బ్రహ్మణో ముఖే
కర్మజా న్విద్ధితా న్సర్వా నేవం జ్ఞాత్వా విమోక్ష్యసే॥

తా: ఈవిధంగా, బహు ప్రకారములైన యజ్ఞాలు పరబ్రహ్మ ముఖాన్నుంచి విస్తరించాయి. ఆ సర్వమూ కర్మోద్భవములైన యజ్ఞాలని తెలుసుకో. ఇలా తెలుసుకుని ముక్తుడవౌతావు.

వ్యా: బ్రహ్మశక్తి విశ్వాసమై దిగి కర్మకాండగా మారినప్పుడు యజ్ఞరూపం దాల్చింది. ఆ కర్మరూపం దాల్చి వ్యక్తిత్వం సమసిపోవడం సాధన. దానికి ఆత్మార్పణం కావాలి.

"సర్వబాధ్యతలూ నీవి, అని దైవాన్ని విశ్వసించినప్పుడే - అది ఆత్మార్పణ మౌతుంది. ఇక అక్కడ మిగిలిందంటూ ఏముంటుంది?" అమ్మ.

33. శ్రేయాన్ ద్రవ్యమయా ద్యజ్ఞా జ్ఞానయజ్ఞం పరంతప!।
సర్వం కర్మాఖిలం పార్థ! జ్ఞానే పరి సమాప్యతే."

తా: అర్జునా! ద్రవ్యమయమైన యజ్ఞం కంటె జ్ఞాన యజ్ఞం శ్రేయస్కరమైనది. సర్వమూ అంటే ఈ సంసారం సర్వమూ, సకల కర్మలూ, జ్ఞానమునందే పరిసమాప్తి చెందుతాయి.

వ్యా: "నేను బ్రహ్మమై నీవు అనే వస్తువు నేర్పఱచుకొన్నాను! అన్నది అమ్మ. నీవు అంటే ఈ కనపడేదంతా! ఇదే నేను నీవులకు భేదం. సంసారం ఉత్పత్తి కావడమంటే

ద్రవ్యమయ యజ్ఞం అన్నమాట. పరమాత్మ తన్నుతానుగా భావించుకుంటూ సంసారమైనాడు. తన్ను తానుగా భావించుకోకుండా జ్ఞాన యజ్ఞమౌతాడు. సంసారానికీ జ్ఞాన యజ్ఞానానికీ అంతరం లేదు. చెట్టుకూ విత్తుకూ భేదం లేనట్లు!

34. త ద్విద్ధి ప్రణిపాతేన పరిప్రశ్నేన సేవయా,।
ఉపదేక్ష్యన్తి తే జ్ఞానం జ్ఞానిన స్తత్త్వ దర్శినః॥

తా: నిష్కపటంగా నమస్కరించీ, ప్రశ్నించీ, సేవించీ, పండితులనుంచి ఈ జ్ఞానాన్ని తెలుసుకో. తత్వదర్శినులైన జ్ఞానులు నీకీజ్ఞానాన్ని బోధిస్తారు.

వ్యా: అమ్మ ఒక పృచ్ఛకునితో ఇలా అంది. 'నీలా మనసు విప్పి ప్రశ్న అడిగే వాళ్ళంటే నాకెప్పుడూ సరదాయే నాన్నా. కొంతమంది పృచ్ఛకులు జిజ్ఞాసతో కాకుండా జిగీషతో ప్రశ్నలు వేస్తుంటారు.

35. యద్ జ్ఞాత్వా న పునర్మోహ మేవం యాస్యతి పాండవ!।
యేన భూతా న్య శేషేణ ద్రక్ష్య స్యాత్మ న్యథో మయి॥

తా: ఓ పాండవా! తత్వజ్ఞానులచేత పొందబడిన అటువంటి జ్ఞానమును పొందిన తరువాత, ఇటువంటి మోహాన్ని మళ్ళీ పొందవు. అశేష భూత ప్రపంచాన్ని నీలోనే నీవు ప్రత్యక్షంగా చూడగలవు. అదేవిధంగా ఆ దృశ్యాన్ని నాలోకూడా చూడ గలవు.

వ్యా: ఇది విశ్వరూప సందర్శానికి మొదటిమెట్టు.

"ఈ అవతారం చుట్టూ మీరూ, మీకోసం ఈ అవతారం" అమ్మ.

36. అపి చే దసి పాపేభ్యః సర్వేభ్యః పాపకృత్తమః।
సర్వం జ్ఞానప్లవే నైవ వృజినం సంతరిష్యసి॥

తా: పాపుల్లో అధిక పాపివైనప్పటికీ, జ్ఞానరూపమనే నావద్వారా సమస్త పాపరూప సముద్రాన్ని చక్కగా దాటిపోగలవు. ముముక్షువుకు ధర్మం కూడా (పుణ్య కార్యం) పాపమే అవుతుందా? అలా ధ్వనిస్తుంది ఈ శ్లోకం.

37. యథై ధాంసి సమిద్ధోஉగ్నిః భస్మసాత్కురు తేஉర్జున।
జ్ఞానాగ్నిః సర్వకర్మాణి భస్మసాత్కురుతే తథా॥

తా: అర్జునా! ఏవిధంగా ప్రజ్వలించే అగ్ని సమిధలను బూడిదచేసి విడిచి పెడుతుందో అలాగే జ్ఞానాగ్ని కూడా అన్ని కర్మలను బూడిదచేసి విడిచిపెడుతుంది.

అన్ని కర్మలను నిర్బీజాలుచేసి జ్ఞానాగ్ని వదుల్తుంది అని వ్యాఖ్యాతల అభి ప్రాయం. అమ్మ కర్మ సిద్ధాంతాన్ని ఒప్పుకోదు. జ్ఞానాగ్ని కూడా ప్రారబ్ధకర్మను భస్మం చేయలేదు. తొలి జన్మకు అంటే అంతకు ముందు ఏ కర్మా చేయని జన్మకు కారణ మేమిటని అమ్మ అడుగుతుంది.

38. నహి జ్ఞానేన సదృశం పవిత్ర మిహ విద్యతే।
తత్స్వయం యోగ సంసిద్ధః కాలే నాత్మని విందతి॥

తా: జ్ఞానానికి సమానంగా పవిత్రం చేసే శక్తి ఈ లోకంలో ఇంకోటి లేదు. కర్మ యోగం లేక సమాధి యోగంద్వారా శుద్ధాంతఃకరణుడైన వాడు, అంటే ముముక్షువు స్వయంగా తన ఆత్మలోనే ఈ జ్ఞానాన్ని పొందగలదు.

వ్యా: అయితే అనుభవం వేఱూ జ్ఞానం వేఱూనా? అనుభవంనుంచి జ్ఞానం వస్తుంది. ఎన్నిసార్లు అనుభవించినా జ్ఞానంరాని వాళ్ళు ఎంతో మంది ఉన్నారు. యమే వైషవృణుతే తేనలభ్యః అని కఠోపనిషత్తు చెబుతుంది. దానికి సాధన అవ సరంలేదు.

'పాతవారు ఏడుస్తూ నా వెంట బడతారు. క్రొత్తవాళ్ళను నేను వెతుక్కుంటాను. నాకవసరమైన వాళ్ళను లాక్కుంటాను' అమ్మ.

39. శ్రద్ధావా న్లభతే జ్ఞానంతత్పరః సంయతేన్ద్రియః।
జ్ఞానం లబ్ధ్వా పరాం శాంతి మచిరే ణాధిగచ్ఛతి॥

తా: శ్రద్ధాళువు, తత్పరుడు, సంయతేంద్రియుడూ అయి ఉండేవాడు తప్పక జ్ఞానాన్ని పొందగలడు, జ్ఞానాన్ని పొందిన మానవుడు మోక్ష రూపమైన శాంతిని పొందుతాడు. ఈ అంతటిని సమ్యగ్దర్శనమంటారు. దానివలన మోక్షం కలుగు తుంది.

40. అజ్ఞ శ్చాశ్రద్దధానశ్చ సంశయాత్మా వినశ్యతి।
నాఽయం లోకోఽస్తి న పరో న సుఖం సంశయాత్మనః॥

తా: ఆత్మజ్ఞానం లేనివాడు, శ్రద్ధ లేనివాడు సంశయాత్ముడు, ముఖ్యంగా చివరి సంశయాత్ముడు నశిస్తాడు. ఈ లోకమే అతనికి కాకుండా పోతుంటే పరలోకాన్ని గూర్చి ఇంకా ఏం చెప్పాలి?

ఉభయ భ్రష్టుత్వమే అతని గతి

41. యోగ సన్న్యస్త కర్మాణం, జ్ఞానసంఛిన్న సంశయం।
ఆత్మవంతం న కర్మాణి నిబధ్నన్తి ధనుంజయ!॥

తా: యోగసన్న్యస్తకర్ముడు, జ్ఞాన సంఛిన్న సంశయుడు ఆత్మవంతుడు అయిన వానిని కర్మలు బంధింపవు.

వ్యా: కర్మయోగం వలన అంతః కరణంలో మాలిన్యం తొలగిపోతుంది. ఆత్మ జ్ఞానం కలుగుతుంది. జ్ఞానాగ్ని వలన కర్మలు దగ్ధమౌతాయి. సంశయాలు నశిస్తాయి. శాశ్వతమైన వెలుగులాటి జ్ఞాన యోగమే మిగులుతుంది.

42. తస్మా దజ్ఞాన సంభూతం హృత్స్థం జ్ఞానాసి నా త్మనః।
ఛిత్త్వైనం సంశయం యోగ మాతిష్ఠోత్తిష్ట భారత!॥

తా: అజ్ఞానమూ దానివలన ఉత్పన్నమయ్యే సంశయాన్ని జ్ఞానమనే ఖడ్గంచేత ఛేదించి కర్మయోగంలో స్థితుడ వగుము. ఓ భారతా! లేచి యుద్ధానికి సంసిద్ధుడివి కమ్ము.

ఇది శ్రీమన్ మాతృగీతలోని జ్ఞానయోగము అను చతుర్ధాధ్యాయము.

మాతృగీత

ఐదవ అధ్యాయము

కర్మసన్యాసయోగము

అమ్మ వాక్యాలను రెంటిని ఉదహరించి ఈ అధ్యాయాన్ని ప్రారంభిస్తాడు.

'లింగభేదం, రూపభేదం లేనివాడు సన్యాసి'

'ఆ కోరికలేని స్థితిని సంపాదించుకోవటానికి ప్రయత్నం సన్యాసం'

పైరెండు వాక్యాలూ, మనశ్శరీరాలకు సంబంధించినవి. మనశ్శరీరయాత్రయే, దాని పరిణామమే జగత్కథ. తనతనాన్ని వదులుకొని తక్కిన జగత్తుగా మారి, దాని పోషణకు కూడా బాధ్యత వహించేది తల్లి.' పోషణ సగం శరీరం, సగం మనస్సు, స్వయం సంన్యాసంద్వారా జగన్మన శ్శరీరాలకు ఏ విధంగా సమన్వయం కల్పిస్తుందో అమ్మ ఒక కథ చెప్పింది. దాన్ని వింటే సన్యాసమంటే ఏమిటో మీకూ బాగా అర్థ మవుతుంది.

ఒక తల్లికి యువకుడైన ఒక కొడుకున్నాడు. అతడొక యువతితో పిచ్చి ప్రేమలో పడ్డాడు. అమ్మాయికి జబ్బు చేసింది. డాక్టరు ఒక తల్లిగుండెకాయ మందు కోసం కావాలన్నాడు. కొడుకు తల్లి నడిగాడు. అమ్మా నీ గుండెకాయ మందుకోసం కావాలి అని. 'సరే! నాయనా! తీసుకో! అన్నది తల్లి. తల్లి గుండెను కోసి డబ్బాలో పెట్టుకొని గబగబా పరిగెత్తుకుని పోతూ రాయి తగిలి బొక్కబోర్లాపడి పోయాడు. సీల్డు డబ్బా దూరంగా పడిపోయింది. ఇంకెవరూ అక్కడ లేరు. యువకుడు లేచి డబ్బా కోసం వెదుక్కుంటుంటే "భద్రం బాబూ నెమ్మదిగా నడు" అని మాటలు వినపడు తున్నాయి. మాటలు వచ్చే చోటికి వెళ్ళి చూస్తే ఆ డబ్బాలో నుంచే ఆ శబ్దాలు వస్తు న్నాయి.

వ్యక్తిత్వాన్ని మాపేసుకోవడమే తల్లికావడం అంటే. ఇంతదాకా ఆలోచించలేదు అర్జునుడు. కేవలం పైపైన స్ఫురించిన అర్థాలనే గ్రహించాడు. అతని ప్రశ్న చాలా సూటిగా ఉంది.

1. అర్జున ఉవాచ

సంన్యాసం కర్మణాం కృష్ణ పునర్యోగం చ శంససి।
యచ్ఛ్రేయ ఏతయో రేకం తన్మే బ్రూహి సునిశ్చితమ్॥

తా: అర్జునుడిలా అడుగుతున్నాడు.

కృష్ణా! నీవొక్కసారి కర్మలను సంన్యసించాలని చెబుతావు. ఇంకోసారి నిష్కామ కర్మయోగమే గొప్పదని ప్రశంసిస్తావు. ఈ రెంటిలో ఏది శ్రేయోదాయకమైనదో సునిశ్చితంగా చెప్పు. ఒక్క మాటే చెప్పు. నాకయితే ఈ రెండు విధాల మాటలకు శ్రేయోదాయకమైన అర్థం బోధపడడం లేదు.

శ్రీ భగవానువాచ

2. సన్న్యాసః కర్మయోగశ్చ నిశ్రేయస కరా వుభౌ।
తయోస్తు కర్మసన్న్యాసాత్ కర్మయోగో విశిష్యతే॥

పరమాత్మ వాక్యము

తా: కర్మ సన్న్యాసము కర్మయోగము రెండూ శ్రేయోదాయకాలే. రెంటిలో కర్మయోగమే మంచిది.

3. జ్ఞేయః సనిత్య సన్న్యాసీ యో న ద్వేష్టి న కాంక్షతి।
నిర్ద్వంద్వో హి మహాబాహో! సుఖం బంధా త్ప్రముచ్యతే॥

తా: ఎవడైతే ఒకడిని ద్వేషించడో, దేనినీ కాంక్షించడో, వాడు నిత్యసన్న్యాసి అని తెలుసుకో. రాగద్వేషాలనే ద్వంద్వాలకు దూరమైనవాడు సుఖంగా సంసార బంధం నుండి ముక్తి నొందినవాడవుతాడు.

వ్యా: అర్జునుడు వేసిన ప్రశ్న ఏమిటి? భగవంతుడిచ్చిన సమాధానమేమిటి?

అర్జునుని మాట ఇది. భగవాన్! ఒకసారి కర్మలను కర్మ ఫలాలను విడిచి పెట్టమంటావు. ఇంకోసారి (నిష్కామ) కర్మయోగమే గొప్పదని చెబుతావు. ఇది సందిగ్ధంగా ఉంది. ఇందులో ఏది శ్రేయోదాయకమైన పద్ధతియో నిశ్చయంగా చెప్పమని ప్రశ్న.

దానికి సమాధానం రాగద్వేషాలకు వాంఛామమకారాలకు, ద్వంద్వాలకు దూరమైనవాడు సన్న్యాసి అనబడతాడు. అతడు సుఖాన్ని పొంది బంధాల నుంచి విముక్తి పొందుతాడు అని భగవద్వాక్యం. రెంటికీ సమన్వయం–

అర్జునుని మనస్సులో సన్న్యాసం అంటే అన్నీ త్యజించి కర్మలను చేయకుండా లోకానికి దూరంగా ముమ్మిడివరం బాలయోగిలాగా కూర్చోడం.

ఎవడైనా కర్మలను నావనుకునే చేస్తాడు. నాదనుకోకుండా ఎవడూ ఏ పనీ

చేయదు. అలా అనుకోవడంలోనే పనిమీద మమకార బంధం ఏర్పడుతుంది. ఈ తగులాటం రాగానికి అనురక్తికి కారణమౌతుంది. ప్రయత్నం ఫలవంతం కాకపోతే క్రోధం, ద్వేషం తలెత్తుతాయి. అనురాగం ఎంత ప్రబలమైన బంధమో అంతకంటే ప్రబలమైన బంధం ద్వేషం. శ్రీరామచంద్రమూర్తికి ప్రేమ కారణంగా సీత ఎంత బంధమైందో, ద్వేషం వైరం కారణంగా రావణుడూ అంతబంధమే అయినాడు. ఒక విధంగా ఆలోచిస్తే రావణుని బంధమే ఎక్కువ బలీయంగా కనిపిస్తుంది. ఎందుకంటే పరమాత్మ సీతను విడిచిపెట్టగలిగాడు. అలా విడిచిపెట్టి ఊరుకోలేదు రావణుణ్ణి.

ఈ మాటలు అర్థం కావడానికి సమయం పట్టినా, ఆలోచించిన కొద్దీ, మనస్సును కరగించి, వెన్నలా కరగిపోయి అగాధపు లోతులను ప్రదర్శిస్తాయి. తరంగాలుగా వచ్చే సముద్రమే నీదనుకోకుండా, వాటి వెనుక ఉన్న మహాసముద్రం అంతా నీదే అనుకోమని కాని ఏ ఒక దాన్ని నీదనుకోవద్దని కాదు అంటుంది అమ్మ. సర్వమూ తనదే అనుకున్నప్పుడు సుఖమూ తనదే; దుఃఖమూ తనదే; మిత్రుడూ తనవాడే, శత్రువూ తనవాడే; పాము పిల్లా తనే, పంది పిల్లా తనే. అటువంటి ద్వంద్వాతీత నిశ్రేణికను ఎక్కిపోయిన వానికి బంధం ఇంకా ఎక్కడనుంచి వస్తుంది?

4. సాంఖ్యయోగౌ పృథ గ్బాలాః ప్రవదన్తి న పండితాః।
ఏక మప్యాస్థిత స్సమ్య గుభయో ర్విందతే ఫలమ్॥

తా: పైన చెప్పబడిన కర్మయోగమూ, జ్ఞానయోగమూ, రెండూ సాంఖ్య యోగాలే. మూర్ఖులైన వాళ్ళు రెంటినీ వేఱువేఱుగా చేసి అర్థం చెప్పి ఫలప్రాప్తిని కూడా రెంటికీ వేఱుగా నిర్ణయిస్తుంటారు. పండితులలా చెప్పరు. ఎందుకంటే ఈ రెంటిలో ఏ ఒక్క దాన్ని సరిగా అనుష్ఠించినా ఫలప్రాప్తి ఒకే విధంగా ఉంటుంది.

5. యత్సాంఖ్యైః ప్రాప్యతే స్థానం త ద్యోగై రపి గమ్యతే।
ఏకం సాఖ్యం చ యోగం చ యః పశ్యతి సపశ్యతి॥

తా: జ్ఞానయోగుల చేత పొందబడే పరంధామ స్థానమే నిష్కామ కర్మయోగుల చేత కూడా పొందబడుతుంది. ఫలరూపంలో సాంఖ్యయోగాన్నీ, నిష్కామ కర్మ యోగాన్ని ఒకటిగానే దర్శించగలవాడే యథార్థాన్ని దర్శించిన పండితుడు.

వ్యా: అమ్మ చేతల్లో లౌకికమూ, ఆధ్యాత్మికమూ రెండు లేవు. ఉన్నదంతా అదే. ఇది వేరూ అది వేరూ కాదు. వాడి క్రియానిక్రియా అంటూ రెండులేవు. ఉన్నదొక్కటే క్రియ. చెట్టూ, దాని శాఖల్లాగా వ్యష్టిగా కనబడుతుంది. అంతే. అన్ని క్రియలూ అన్ని సంకల్పాలూ, అన్ని రూపాలూ, అన్ని నామాలు వాడివే.

6. సన్యాసస్తు మహాబాహో! దుఃఖమాప్తుమ యోగతః।
యోగయుక్తో మునిర్బ్రహ్మ న చిరేణాధి గచ్ఛతి॥

తా: అర్జునా!కేవలం సన్యాసాన్నే నమ్ముకొని కర్మయోగాన్ని విడిచిపెట్టిన వాడు దుఃఖాన్నే పొందుతాడు. కర్మయోగాన్ని అనుష్ఠిస్తూ ముని అయినవాడు శీఘ్రంగా లోకాన్ని తరించి పరమాత్మను చేరుకుంటాడు.

వ్యా: వ్యక్తి సంసారంలో జన్మించాడు. అలా అనడం కంటే ఆ సంసారమే తానై వ్యష్టిగా కూర్చున్నాడు. తప్పనిసరిగా చావు వచ్చిన చోటికి తీసుకు వెళ్తుంది. (1) తప్పనిసరి అయిన మొదటి విషయం. (2) ఉన్న ఒకటిలో తనను వేఱుగా ప్రదర్శిస్తుంది, తన శరీరం. అది బాల్యయౌవన కౌమార యౌవన వార్థ్యక్యదశల్లో బడేసి ఈడ్చుకుపోతున్నది. వద్దనుకున్న జబ్బులతోపాటు ఈ దశలు మీదబడుతున్నాయి. అనుభవించక తప్పడంలేదు. తను భూకంపాలను సృష్టించలేదు. మారే ఋతువులనూ ఆపలేదు. అవి తెచ్చిపెట్టిన అనుభవాలను తప్పనిసరిగా అనుభవించాల్సి వస్తున్నది. తామొకటి తలిస్తే తక్కిన ప్రపంచం ఇంకోటి తలుస్తున్నది. పుట్టుకా, చావూ తన చేతిలో ఉండడంలేదు. ఇదిలా ఎందుకు జరుగుతున్నదంటే కర్మసిద్ధాంతం దూకుతుంది. అన్నింటినీ తనతోబాటు నడిపిస్తున్న ఒక శక్తి ఉన్నదనుకుంటే అన్నింటికి సరైన సమాధానాలు వస్తాయి; శంకలు తెగిపోతాయి. ప్రతి దానిలో తాను ఉండి కూర్చోడం, అది అనుకున్నట్లు జరక్కపోవడంలో తన అసమర్థతే ఋజువౌతున్నది. లోకంలోని సన్యాసాశ్రమాలు కలగాపులగంగా కనిపిస్తున్నాయి.

'నీ కోసం నీవు సన్యసించావు గాని లోకకల్యాణం కోసం కాదు' అన్నది – అమ్మ. 100టికి 90 పాళ్ళు సన్యాసాలన్నీ ఇలాటివే. సన్యాసం పుచ్చుకొన్న తరువాత కూడా స్వంత ఇంట్లోనే కాలం గడిపేసేవారు చాలా మంది మనకు కనిపిస్తారు.

'సన్యాసి కావాలేగాని పుచ్చుకోడం కాద'న్నది అమ్మ. సంసారిగా ఉంటూ సన్యాసమంటే ఎలా ఉంటుందో ఋజువు చేసింది అమ్మ.

తనదైన జగత్తు తనంతట తటస్థంగా నడచిపోతుంటే దానిలోని తన బిడ్డలతో ఐక్యము కావడమే సర్వస్వమూగా త్యాగం చేసిన జీవితం అమ్మది.

అది మమకారాల గుడి.

మచ్చుకు కూడా మమకారం లేనిది

Detatched Awareness.

సాంఖ్యాన్నీ, కర్మయోగాన్ని, ఆచరణలో బెట్టి, శ్లోకంలో చెప్పినట్లు రెండూ ఒకటేనని నిరూపించిన జీవితం అమ్మది.

7. **యోగయుక్తో విశుద్ధాత్మా విజితాత్మా జితేంద్రియః।**
సర్వభూతాత్మ భూతాత్మా కుర్వ న్నపి న లిప్యతే॥

తా: యోగయుక్తుడూ, విశుద్ధాత్ముడూ, విజితాత్ముడూ, జితేంద్రియుడూ, సర్వ భూతాలను, ఆత్మభూతములుగా గుర్తించిన వాడూ కర్మలు చేస్తున్నా వాటి అంటూ సొంటూ లేని వాడుగానే ఉంటాడు.

వ్యా: నేనులో నేనును దర్శిస్తూ, ఆ దర్శనం యొక్క ఆనందాన్ని అనుభవిస్తూ తటస్థుడై జీవించేవాడు యోగయుక్తుడు.

మనోవాక్కాయ కర్మలలో ఎటువంటి భిన్నతాలేని వాడు విశుద్ధాత్ముడు.

చెప్పేదొకటి, చేసేదొకటి, ఆలోచించేదొకటి. అంతా చదరంగపు టెత్తులాగా గడుపుతుంటాం జీవితం మనం. పన్నాగం లేనిదే బ్రతుకు గడవదు. అనుకున్నది చెప్పి, చెప్పిన దాన్నే చేసేవాడు విశుద్ధాత్ముడు.

విజితాత్ముడింకా పైమెట్టువాడు. విశుద్ధాత్ముడు నేను చేస్తున్నాననే భావన కలిగి ఉంటే కలిగి ఉండవచ్చు. తైలధారావతుగా జీవన వ్యాపారాన్ని చూచేవాడు. ఆత్మలో ఆత్మను ఐక్యం చేసుకున్నవాడు మనస్సును మనస్సుతో గెలిచిన వాడు విజితాత్ముడు.

విజితేంద్రియుడు, సంసారంలో ఉంటూ సంసారానికి దూరమైనవాడు, జ్ఞానేంద్రియ కర్మేంద్రియ మనస్సంపర్కం లేకుండా నిమిత్తమాత్రుడై వ్యవహరించేవాడు విజితేంద్రియుడు.

సర్వభూతాలను తన సంతానంగాను, పరమాత్మ స్వరూపంగాను చూచుకొనే వాడు, సర్వభూతాత్మ భూతాత్ముడు.

ఇంకో మెట్టు పైకి వెళ్ళింది అమ్మ.

'మీరంతా పుట్టింది ఇక్కడనే, నేనే మీ తల్లులకు పెంపుడిచ్చా! అన్నది అమ్మ.

మీరంతా పరమాత్మ స్వరూపాలే అన్న 'అమ్మ' మాటక్కూడా ఇదే అర్థం.

ఇలా గుణాలు కల వ్యక్తి కర్మలు మాని ఊయిలా కూచుని ఉంటాడా అంటే అలా కూర్చోడు. 'కుర్వన్నపినలిప్యతే కర్మలు చేస్తాడు కాని వాటిని వేసుకుని పులుముకోడు లేదా వాటిచేత పులుముకోబడదు. ఈ పులుముడే, అన్ని కార్యాలకు, ఆలంబనకు, పరమాత్మ దర్శనానికి అడ్డుగోడ ఔతుంది. అన్ని పనులకు కర్తృత్వం పరమాత్మ మీద పెట్టడమే దానికి విఱుగుడు.

8. **నైవ కించి త్కరోమీతి యుక్తో మన్యేత తత్త్వవిత్।**
పశ్యన్ శృణ్వన్ స్పృశన్ జిఘ్ర న్నశ్నన్ గచ్ఛన్ స్వపన్ శ్వసన్॥

9. **ప్రలపన్ విసృజన్ గృహ్ణాన్ ఉన్మిష న్నిమిషన్నపి।**
ఇంద్రియా ణీంద్రియార్థేషు వర్తంత ఇది ధారయన్॥

తా: తత్వమెఱిగిన సాంఖ్యయోగి జీవిత యజ్ఞంకోసం ఈ శరీరం చేస్తున్న కర్మలన్నింటినీ పరమాత్మ కృతాలు; లేక పరమాత్మ ప్రేరణవల్లనే జరుగుతున్నవని భావిస్తాడు. చూస్తూ, వింటూ, స్పృశిస్తూ, మూచూస్తూ, తింటూ, నడుస్తూ, కునుకుతూ, ఊపిరితీస్తూ, మాట్లాడుతూ, త్యజిస్తూ, గ్రహిస్తూ, ఱెప్పలు విప్పుతూ, ఱెప్పలు మూస్తూ, ఆలోచిస్తూ కూడా ఆయా జ్ఞానేంద్రియ కర్మేంద్రియాలు ఎందుకొఱకై నిర్మించబడ్డాయో ఆయా క్రియాకలాపాలను నిర్వహిస్తున్నవనే తెలుసుకుంటాడు గాని, నేనే ఈ పనులన్నీ చేస్తున్నానని తనతనాన్ని పైన వేసుకోడు.

వ్యా: ఈ శ్లోకంలో బ్రదికి ఉండే మనిషికి అవసరమైన అన్ని పనులూ ఉదహరించబడ్డాయి. చూడడం, వినడం మొదలుకొని, ఊపిరితీయడం దాకా, అన్నీ చెప్పబడినాయి.

ఈ పనులు చేయడం మానుకుని ఎవడూ బ్రతికి ఉండి శరీరయాత్ర చేయలేడు, బ్రతికి ఉండడమంటే ఈ పనులు చేయడమనే అర్థం. అయితే ఈ పనులన్నీ తన ప్రగల్భతవల్లనే జరుగుతున్నాయని ప్రాణి అనుకుంటాడు. ఱెప్పలు విప్పి మేలుకుని ఉన్నా, ఱెప్పలు మూసి నిద్రిస్తున్నా, అది భగవంతుని ప్రేరణవల్లనే జరుగుతుంది కాని మన ప్రయత్నం దానిలో ఏమీలేదు. Sleeping pills మ్రింగినా, ఱెప్పలు జిగురు పెట్టి అంటించుకున్నా నిద్రే పట్టదు కొందరికి. అలాటి యమయాతన పడుతుంటారు కొందఱు. కొందఱు మంచంమీద నడుం వాల్చడమే తడవుగా గుర్రుమంటారు. దానికీ భగవదనుగ్రహమే కారణం అనుకోక తప్పదు.

'చలన్నపి' అనే మాటకు నాకొక సంఘటన జ్ఞాపకానికి వస్తున్నది. డెహరా రోడ్డులో నేనూ, నాయబ్ సుబేదారు నాయర్ ఒకసారి పరమాత్మ ప్రేరణను గుఱించి వాదించుకోవడం జరిగింది. పైశ్లోకాన్ని ఉదహరిస్తూ అన్ని పనులూ అంటే ఊపిరి తీయడంగూడా పరమాత్మ అనుగ్రహమే అన్నాను నేను. వెంటనే నాయర్ కుర్చీనుంచి లేచి గుమ్మంవైపు నాలుగడుగులు వేసి తిరిగి వచ్చి మళ్ళీ కూర్చుని ఇలా అన్నాడు.

"ఇదుగో చూడు! నేను లేవాలని నడవాలని అనుకున్నాను. లేచాను నడిచాను. తిరిగి వచ్చాను కూర్చున్నాను మళ్ళీ ఈ కుర్చీలోనే. పరమాత్మ ప్రమేయం ఇందులో ఏముందో చెప్పు అన్నాడు.

అమ్మ అన్న మాటలు జ్ఞాపకానికి వచ్చాయి. 'తలుచుకున్నామనుకుంటాం మన

స్సులో. తలపులు కనిపించినప్పుడే అవి తలపులుగా గోచరిస్తాయి. మనస్సు పైకి రానప్పుడు అవి ఎక్కడున్నాయో చెప్పగలరా?'

"మనం నడుస్తున్నామనుకుంటాం. ఏ శక్తిని ఆధారంగా చేసుకుని మనం నడుస్తున్నామో మనం మరచిపోతాం."

ఈ మాటలనే నాయర్‌కు విడమఱచి చెప్పాను.

శ్లోకంలో జాగ్రత్స్వప్న సుషుప్తుల అవస్థలలోని వ్యాపారాలకు మనుష్యుని స్వయం ప్రయత్న సిద్ధి ఎంతవరకుంటుందో కూడా సూచింపబడింది. 'ఇంద్రియాణీంద్రియార్థేభ్యః' ఇంద్రియార్థాల కొఱకు, ఇంద్రియాలు పనిచేస్తుంటాయి కాని మనుష్యుడు వాటిని పనిచేయించే కర్తనని ఆ మాటల కర్థమని మనం అనుకోడానికి వీలులేదు. సర్వే సర్వత్రా మనుష్యుడు ఇంద్రియాలకు దాసుడై ఉండడాన్నే మనం చూస్తున్నాం కాని వాటిని అదుపులో ఉంచుకోవడం చూడడం లేదు. అరగవురా బాబూ అవి తినవద్దని మొఱబెడుతున్నా ఆరు గారెలైనా తినకుండా నాలుక ఊరుకోదు. బెస్తవాడి బుట్టలో పడితేగాని గాలానికి గ్రుచ్చిన ఎఱ్ఱముక్కను చేప తినడం మానదు. ఇంద్రియాలు మనస్సుకు అధీనాలా? మనస్సు ఇంద్రియాలకధీనమా? అనే ప్రశ్న చిక్కు ప్రశ్న భగవత్ప్రేరణయే అన్నింటికి కారణమనడమే ఆ ప్రశ్నకు సరైన సమాధానం.

"ఏ మార్గాన నడిచినా వాడే నడిపిస్తున్నాడనుకోడం సన్మార్గం" అమ్మ.

10. బ్రహ్మణ్యాధాయ కర్మాణి సంగం త్యక్త్వా కరోతి యః।
లిప్యతే న స పాపేన పద్మపత్ర మివాంభసా॥

తా: పరమాత్మయే అన్ని కార్యకారణాలకు కారణమని నమ్మి, తనయందు తగులు విడిచి, ఎవడైతే, నిమిత్తమాత్రుడై కర్మలను చేస్తాడో వాడు నీటిలోనే ఉన్నా నీటిచేత అంటుకోబడని తామరాకు వలె నిర్లిప్తుడై ఉంటాడు.

వ్యా: భారతంలో ఒక పద్యముంది. నాగలితో పొలాన్ని దున్నుతూ ఉంటాం. నాగేటి కొసతగిలి చిన్న పాములూ, వానపాములూ అనేకం చస్తాయి. దీపం వెలిగిస్తాం, దీపపు కాంతివేడిలో పడి అనేక జీవులు నశిస్తాయి. వాటి చావుకు నాగలి నడిపిన వాడిని, దీపం పెట్టిన వాడిని అంటుకుంటుందా అంటే అంటుకోదనే అన్నారు మహర్షి. పాపానికి కర్తవ్య బాధ్యతను నిర్ణయిస్తూ శంకరుల నిర్ణయం కూడా జ్ఞాపకానికి వస్తుంది.

ఒక వేటకాడు దూరంగా పొదలో మచ్చలు మచ్చలున్న ఒక జంతువుని చూచి

చిఱుతపులి అనుకొని బాణం ఎక్కుపెట్టి నారిలాగాడు. దాని తలపొదలో జొరబడి ఉంది కనుక దానికున్న మచ్చలను బట్టి పులే అనుకున్నాడు. బాణాన్ని తీరా వదిలిన క్షణమే అది తలపైకెత్తింది. వేటకాడు అనుకున్నట్లు అది పులికాక ఆవు అయింది. బాణం తగిలి ఆవు చచ్చింది. గోహత్యాపాపం అతన్ని చుట్టుకుంటుందా? చుట్టు కోదా? అని ప్రశ్న. తెలియని దశలో ఘాతుక జంతువనుకొని బాణం వేశాడు వేట గాడు. యదార్థస్థితి తెలిసే సరికి బాణం చేతినుండి జారిపోయింది. ఆవు చచ్చింది కనుక తెలిసి చేసినా తెలియక చేసినా గోహత్యా పాపం అతన్ని చుట్టుకుం టుందనే నిర్ణయించారు శంకరులు.

ఏది పాపం? ఏది పాపంకాదు? అని నిర్ణయించడం కష్టం. పాము కప్పను తింటుంది. కప్ప పురుగులను తింటుంది. పామును ముంగిస చంపుతుంది. కాని తినదు. పామును గ్రద్ద తింటుంది. పామును, ముంగిని, గ్రద్దను మనిషి తింటాడు. జాతివైరంవల్ల అనేక హత్యలు జరుగుతాయి. చిన్న జీవిని తిని పెద్ద జీవి బ్రతకడం సృష్టిలోని జీవన రహస్యం, ఏదిహింస, ఏది హత్య, ఏది పాపం? వీటిని నిర్ణ యించడం కష్టం. సర్వానికి సర్వంకారణం అనుకుని మనం నిమిత్త మాత్రులం అను కుని పనులను చేసేవాడికి ఏ పాపమూ అంటుకోదు అని శ్లోకానికి తాత్పర్యం. మూడో మనస్సు ప్రమేయం లేకుండా ప్రకృతిలో సహజంగా జరిగిపోయేది ఏదీ పాపభూయిష్ఠమైనది కాదు. అది ఎంత సహజంగా జరిగిపోతుందంటే తామరాకు లోని నీటిబొట్టులాగా ఎవరినీ అంటుకోదు. సహజ శబ్దానికదే అర్థం.

అమ్మయితే 'సహింపలేనిది హింస' అన్నది.

"సుఖానికి ఒకటే మార్గం. ఏది చేసినా దైవం చేశాడనుకోవడమే".

అంటుకోకపోవడం దైవత్వం

అంటుకోవడం మానవత్వం.

11. కాయేన మనసా బుద్ధ్యా కేవలై రింద్రియై రపి।
యోగినః కర్మ కుర్వంతి సంగం త్యక్త్వాఽఽ త్మశుద్ధయే॥

తా: శరీరం చేతా, మనస్సు చేతా, బుద్ధిచేతా ఒకేవిధంగా ప్రవర్తిస్తూ, చివరకు ఇంద్రియాలద్వారా చేసే కర్మలనైనా నిస్సంగులై ఆత్మశుద్ధితో యోగులు కర్మలను చేస్తారు.

వ్యా: ఇందులోనే ఇమిడి ఉంది రహస్యమంతా. కన్ను గీటుతుంది. నోరు వెక్కి రిస్తుంది. మనసు కులుకుతుంది."మీరు మహానుభావులు. మార్తాండ తేజులు"అని సమక్షంలో పొగిడిన వ్యక్తినే అతడు అవతలకు పోగానే, వెధవ తెలివి వెలిగించ

బోయాడు నా ముందఱ. తల గొరిగించి పంపేశాను. నీచుల్లో పరమ నీచుడు 'వీడు' అంటాం.

అనే మాటకు, చేసే చేతకు, తలచే తలపుకు ఎక్కడా సమన్వయం ఉండదు. మనుష్య ప్రవర్తనలో. ఎందుకంటే 'నా' అనే జిగురు అలా పట్టుకొని ఏడిపిస్తుంది. అలాక్కాక మనోబుద్ధి వాక్కాయ కర్మములతోగాని, భగవత్ప్రేరణను గుర్తించి అన్నింటికి సమన్వయపద్ధతి కుదిరేలాగా కర్మలను చేస్తాడు యోగి. అన్యోన్య విరోధం వాటికుండదు.

12. యుక్తః కర్మఫలం త్యక్త్వా శాంతి మాప్నోతి నైష్ఠికీమ్!
అయుక్తః కామకారేణ ఫలే సక్తో నిబధ్యతే॥

తా: నిష్కామ కర్మయోగులు కర్మఫలాదులను పరమేశ్వరార్పణంచేసి భగవత్ప్రాప్తి రూపమైన శాంతిని పొందుతారు. వాళ్ళు యుక్తులనబడతారు. సకామ పురుషులు ఫలములందాసక్తి గల వారలై, కామనలచే బద్ధులై మఱింత కామ కారకులౌతారు.

జ్ఞానులు అలా కావడం కూడా భగవత్ప్రేరణ కార్యంగా తెలుసుకుంటారు.

13. సర్వ కర్మాణి మనసా, సన్యస్యాస్తే సుఖం వశీ
నవద్వారే పురే దేహీ నైవ కుర్వ న్న కారయన్॥

తా: పరమాత్మ అనుగ్రహంవల్ల అన్ని ఇంద్రియాలను వశమునందుంచుకొనగలవారు. సర్వకర్మాలను మనసా పరమాత్మయందే సన్యసించి సుఖాన్ని పొందుతారు. తొమ్మిది ద్వారములు కల ఈ దేహమనే నగరమందు నివసించే దేహి చేసేవాడూ కాదు. చేయించేవాడూ కాదు.

వ్యా: నవద్వారాలంటే ముక్కరాలు రెండు, కళ్ళు రెండు, చెవులు రెండు, మూత్ర పురీషద్వారాలు రెండు, నోరు ఒకటి వెరసి తొమ్మిది. ఈ రంధ్రాలు బ్రదికి ఉన్న మనిషి కంటే అస్థిపంజరంలో బాగా కనిపిస్తాయి. ఇదే నవద్వారపురమంటే, ఈ దేహమే. ప్రాణం పోయిన తరువాత కూడా ఈ నవద్వార పురి ఉంటుంది. కాని ద్వారాలు పని చేయవు. పనులన్నీ జరిపేది ఈ పురాన్ని నివాసంగా చేసుకున్న అహంకార స్వరూపుడైన పురుషుడు అన్న మాట. దేహమోహంలో పడి అన్ని పనులు తానే స్వయంగా చేస్తున్నాననుకుంటాడు. ఇతరులను ఆజ్ఞాపించి ఇతరులచేత కూడా చేయిస్తున్నావనుకుంటాడు. రెండూ ప్రత్యుత్పన్న ప్రమాదాలే. ఆ శక్తి, జీవకళ, ఆమనో జాగృతి ఉంటేనే కాని, ఏ పనీ వట్టి శరీరంవల్ల జరిగేదికాదు. కాబట్టి శరీర స్వరూపుడు, చేసే

వాడూకాదు చేయించేవాడూ కాదు. ప్రేరణ స్వరూపుడైన పరమాత్మయే చేసేవాడూ చేయించేవాడూ, శరీరం నిమిత్త మాత్రమే.

14. న కర్తృత్వం నకర్మాణి లోకస్య సృజతి ప్రభుః।
న కర్మఫల సంయోగం స్వభావ స్తు ప్రవర్తతే॥

తా: భూతాలకు ప్రాణులకు కర్తృత్వాన్నిగాని కర్మలనుగానీ పరమేశ్వరుడు సృష్టించలేదు. కర్మఫల సంయోగాన్ని కూడా పరమేశ్వరు దేర్పాటు చేయలేదు. మఱి ఇలా ఎందుకౌతున్నవంటే అది పరమేశ్వరుని స్వభావమే.

వ్యా: సూర్యునికి ప్రకాశించడం ఎలా స్వభావమో, పరమేశ్వరుడు లోకంగా ప్రత్యక్షం కావడం కూడా స్వభావమే. పరమేశ్వరుని సంకల్ప వికల్పాలు కూడా ఆయన స్వభావాలే. పరమేశ్వరుడున్నాడు కనుకనే లోకమున్నది.

15. నా దత్తే కస్యచిత్ పాపం న చైవ సుకృతం విభుః।
అజ్ఞానే నావృతం జ్ఞానం తేన ముహ్యంతి జంతవః॥

తా: సర్వవ్యాపి అయిన పరమాత్మ ఎవరికీ సుకృతాన్నిగాని, పాపాన్ని గాని పంచి పెట్టడు. అజ్ఞానం వలన జ్ఞానం ఆవరించబడడంచేత, జంతుకోటి మోహం లోను మాయలోను మునిగి పాపపుణ్య విచారణలకు పాల్పడుతున్నాయి.

16. జ్ఞానేనతు తదజ్ఞానం యేషాంనాశిత మాత్మవ।
తేషా మాదిత్య వద్జ్ఞానం ప్రకాశయతి తత్పరం॥

తా: ఆత్మజ్ఞానం ద్వారా పరమేశ్వరుని కృపవలస ఎవడైతే అజ్ఞానాన్ని నాశనం చేసుకోగలుగుతాడో, అతని మనస్సులో సచ్చిదానంద ఘనుడైన పరమాత్మ జ్యోతి సూర్యునివలె ప్రకాశిస్తుంది. అందులో అతడు మగ్నుడౌతాడు.

17. తద్బుద్ధయ స్తదాత్మానః స్తన్నిష్ఠాః తత్పరాయణః।
గచ్ఛన్త్య పునరావృత్తిం జ్ఞాన నిర్ధూత కల్మషాః॥

తా: తద్రూపమైన బుద్ధి, తద్రూపమైన మనస్సు, తద్రూపమైన నిష్ఠ, పరమాత్మ సేవాపరాయణత్వమే జీవితంగా ఏ మహనీయునికి ఉంటాయో అతని కల్మషాలన్నీ జ్ఞానముచే ఎగురగొట్టబడగా తిరుగులేని బ్రహ్మ పదవిని పొందుతాడు.

18. విద్యా వినయ సంపన్నే బ్రాహ్మణే గవి హస్తిని।
శుని చైవ శ్వపాకే చ పండితాః సమదర్శినః॥

తా: అటువంటి జ్ఞానులైన పురుషులు, విద్యావినయ సంపన్నులై, బ్రాహ్మణుడు, ఆవు, ఏనుగు, కుక్క చివరకు చండాలుడు అనే భేదం లేకుండా అందఱి యెడల సమదర్శనులై ఉంటారు.

వ్యా: ఈ విషయానికి అందఱిల్లే తార్కాణం. పంది పిల్లకు భోజనం పెట్టింది అమ్మ. ఆంబోతు చచ్చిపోతే ఆత్మీయులు పోయినట్లు దుఃఖించింది. అమ్మ జీవితంలో తురకలు అనీ, కిరస్తానీలనీ, బిచ్చగాళ్ళనీ, భాగ్యవంతులనీ, పేదవాళ్ళనీ, మంత్రి పుంగవులనీ, మాల మాదిగలనీ తారతమ్యాలు లేవు. అందఱినీ ఆదరించి సమానంగా అన్నం కలిపి నోట్లో ముద్దలు పెట్టి, కటాక్షించి ప్రజలను గట్టెక్కించిన తార్కాణాలెన్నో కనిపిస్తాయి. 'ప్రేమించడం తల్లికి, ప్రేమించబడడం పిల్లలకు స్వభావం' అన్నది అమ్మ.

19. ఇహైవ తైర్జితః సర్గః యేషాం సామ్యే స్థితం మనః।
నిర్దోషం హి సమం బ్రహ్మ తస్మాద్బ్రహ్మణి తే స్థితాః॥

తా: ఎవనికైతే ఇలాంటి సమత్వ భావం అలవడుతుందో అతడు జీవితమునందే సంపూర్ణ సంసారాన్ని జయించిన వాడౌతాడు. బ్రదికి ఉండగానే అతడు ముక్తుడౌతాడు. ఎందువల్లనంటే సచ్చిదానంద ఘనుడైన పరమాత్మ నిర్దోషి. సమాన స్వభావం కలవాడు. కాబట్టి అతడు సచ్చిదానంద పరబ్రహ్మస్థితియందే సుస్థితుడై ఉంటాడు.

20. న ప్రహృష్యే త్ప్రియం ప్రాప్య నో ద్విజేత్ ప్రాప్య చాప్రియమ్।
స్థిర బుద్ధి రసమ్మూఢః బ్రహ్మ వి ద్బ్రహ్మణి స్థితః॥

తా: ప్రియము ప్రాప్తించినప్పుడు సంతోషము, అప్రియము ప్రాప్తించినప్పుడు ఉద్వేగము, ఎవడు చెందడో స్థిరమైన బుద్ధి కలిగి ఎవడుంటాడో, వివేకవంతుడై ఎవడుంటాడో వారు బ్రహ్మవిత్తము డౌతాడు. బ్రహ్మమునందే లీనమై ఉంటాడు.

వ్యా: నాలుగువేళ్ళూ నోట్లోకి పోతుంటే నా అంతవాడు లేడని విఱ్ఱవీగేవాళ్ళూ, చీమకుట్టినా ఇల్లు ఒక కొలిక్కి తెచ్చేవాళ్ళూ ఎందఱో ఉన్నారు మనలో. నరాలమీద కంట్రోలు లేకపోవడమే దీనికి కారణం. కొన్ని పరీక్షలలో నడిపించడానికి పరమాత్మయే ఆయా వ్యక్తులను కంట్రోలు లేకుండా చేస్తాడు. అలాంటి నిగ్రహం అబ్బిన వాని మనస్సు స్థిరంగా నిలుస్తుంది. అతనకి మౌఢ్యమనే పరదా చిరిగిపోయి జ్ఞానోదయమౌతుంది. మనశ్శాంతి లభిస్తుంది. మనశ్శాంతికి ఆనందమే బ్రహ్మణ స్థితి.

అమ్మకున్న బంగారు నగలన్నీ ఒకసారి దొంగలెత్తుకుని పోయారు.

'ఎవరికి ప్రాప్తమున్నవి వారిని చేరుకున్నాయి' అనే అర్థం గల మాటలన్నది అమ్మ.

21. బాహ్య స్పర్శే ష్వసక్తాత్మా విందత్యాత్మని య త్సుఖమ్।
స బ్రహ్మయోగ యుక్తాత్మా సుఖ మక్షయ మశ్నుతే॥

తా: బాహిరమైన విషయాల్లో, అంటే సంసారిక విషయాల్లో ఆసక్తుడై ఉండే వాడు పొందే సుఖాన్ని సచ్చిదానంద ఘనుడైన పరమాత్మ యందే ఏకీభావం పొందిన మహాజ్ఞాని కూడా పొందుతాడు. ఆ సుఖం అక్షయమైనది.

వ్యా: అమ్మలాగా సంసార చేస్తూ ఆసక్తి రహితంగా కర్మలను చేసే వ్యక్తి పొందే సుఖానికీ, బ్రహ్మజ్ఞానంవలన యోగి జనులు పరమాత్మతో ఐక్యమైపోయి, పొందే ఆనందానికీ ఏమీ భేదం లేదని తాత్పర్యం. అంటే 'లోకం శోకహత'మనీ జంజాటాలూ పుంజాలూ త్రెంచుకుని అడవికిపోయి ముక్కు మూసుకుని కూర్చోడంవల్లనే మోక్షం లభించదనీ, తటస్థంగా సాక్షి మాత్రుడై కర్మలు ఆసక్తి లేకుండా చేసే సంసారికి కూడా అదే మోక్షం లభ్యమౌతుందని అర్థం.

22. యే హి సంస్పర్శజాః భోగాః దుఃఖయోనయ ఏవతే।
ఆద్యన్తవన్తః కౌన్తేయ! నతేషు రమతే బుధః॥

తా: అర్జునా! ఇంద్రియముల యొక్క విషయాల యొక్క సంయోగం చేత ఉత్పన్నమయ్యే భోగాలు, విషయలోలురైన పురుషులకు, సుఖాన్ని కల్పించేవిలాగా కన్పించినా, నిజానికవి దుఃఖానికి జనన స్థానాలు. అది ఆదిఅంతమూ కలది కావడం చేత శాశ్వతాలు కావు కాబట్టి పండితులైనవారు వాటియందు రమించరు.

'యద్వయావధిత్వం తదనిత్యం' యన్మధ్యమ పరిమాణమ్ దదనిత్యమ్. అంటే దేనికైతేరెండు కొసలూ, మధ్యమ పరమాణమూ ఉంటుందో అది అనిత్యమైనది అవి అర్థం. ప్రపంచంలో దేనినైనా తీసుకోండి. రెండు కొసలు లేని వస్తువులే లేవు. ఈ పుస్తకానికి ఈకొస ఆకొస మధ్యమ పరిమాణమూ ఉన్నవి. ఇది శిథిలమైపోతుంది. చెదలు తినేస్తే నిప్పంటుకుంటే దీనికి రూపం ఉండదు. అలాగే, జీవితానికి కూడా బ్రదుకూ చావూ ఆద్యంతాలు.

గుర్తులేనిది గుర్తు కాగానే దానికి మొదలూ చివరా నడిమీ ఏర్పడుతుంది. ఈ మూడూ ఏర్పడినప్పుడు దానివలన అబ్బే ప్రయోజనం కూడా అనిత్యమే అవుతుంది. సూర్యుని ఆయుః ప్రమాణం, ఆకాశంలోని తారల, గ్రహాల ఆయుః ప్రమాణం, మనువులూ, బ్రహ్మల ఆయుః ప్రమాణాలు, స్వర్గమర్త్య పాతాళాల ఆయుఃప్రమాణాలు

అన్నీ అనిత్యాలే. అనిత్యత లేకుండా ఉండే నిత్య వస్తువును తెలుసుకోగలమా? అని ప్రశ్న.

భగవంతుడు అపరిచ్ఛిన్న ఆద్యంత రహిత అప్రమేయ, అనుమాన రహితమైన తన ఆనందమయ రూపాన్ని తెలుసుకోవడానికి ఈ అనిత్యమూ, ఆద్యంత సహితమూ అయిన సంసార రూపాన్ని ధరిస్తాడు. అలాగే కావడంలో అతనికి ప్రత్యేక ప్రయోజనం ఏమీ లేదు. అది పరమాత్మ స్వభావమే. అంతే "అసలు అమ్మను తెలుసుకోవడానికే ఈ అమ్మ" అని అమ్మ. మహదాకాశాన్ని తెలుసుకోవడానికి మనుష్య మేధకు అసాధ్యం కనుక, గోడల మధ్య పరిమితి ఏర్పడుతుంది. చిన్న మెదడుకు చిన్నమేర. పరమాత్మ గ్రహణానికి పరిమాత్మయే కావాలి.

ఇదే భావాన్ని "అవ్యక్తా దీని భూతాని' అనే శ్లోకంలో కూడా ఇంతకు పూర్వం పరమాత్మ చెప్పి ఉన్నాడు. ఈ సంగతిని గ్రహించిన పండితుడు అనిత్య సంసారంలో పరమాత్మ స్వరూపాన్ని గుర్తించి ఆనందం పొందుతాడు. ప్రపంచ స్వరూపమే ఈ మార్పే అవధి అనుకోడు.

23. శక్నోతీహైవ యస్సోఢుం ప్రాక్శరీర విమోక్షణాత్।
కామ క్రోధోద్భవం వేగం సంయుక్తః స సుఖీ నరః॥

తా: కామ క్రోధోద్భవమైన వేగాన్ని ఎవడైతే శరీరం రాలిపోకముందే అధిగమించగలుగుతాడో వాడే కృతార్థుడు. జ్ఞాని, సుఖం ప్రాప్తించిన మనుష్యుడూ.

వ్యా: చక్కని శ్లోకం. కామక్రోధాలు పరమాత్మను, శరీరం ధరించేసరికి, వచ్చి చుట్టుకున్నాయి. కామం లేకుండా శరీరం రాదు. క్రోధం లేకుండా అది సమసిపోదు. కామానికి క్రోధం ఎండు కట్టెలు. వంట చెఱుకు. దానిమీద పొగరాజుతుంది. ఆ పొగే తామసం. ఈర్ష్య, ఊరికే కామం ఉన్నా ఊరికే క్రోధం ఉన్నా అవేమీ చేయలేవు. వాటికి ఒక ఊపూ, ఒక వేగం కావాలి. "పేదవాని కినుక పెదవులు చేటు గాకేమి ఫలము' అన్నాడు కవి. క్రోధం ప్రయాణం సాగించినప్పుడే అడివి అంటుకుంటుంది. కార్చిచ్చుగా అవుతుంది. కామం కూడా అంతే. నిద్రిస్తున్న కామం ఎవరినీ బాధించేది కాదు. అది పరిగెత్తడం ఆరంభిస్తేనే, తనకూ లోకానికీ చేటు. వాటి వేగంలోనే ఉంది వాటి ప్రభావం. అంతా స్థిరవిద్యుత్తులో చైతన్యం మణిగి ఉంటుంది. మందు దట్టించిన ఫిరంగికి అగ్నిస్పర్శయై ప్రేలేదాకా ఏ బాధా లేదు. శక్తి మేలుకుంటేనే ప్రళయం.

వీటికి ఆశ్రయం శరీరం, శరీరం పడిపోతే, తగలబడితే వీటికి ఆసరా కూడా లేదు. శరీరం తగలబడకముందే శరీరత్వాన్ని, శరీర ధారణా మర్మాన్ని తెలుసుకోవాలి. దాన్ని తెలుసుకున్నప్పుడు, కామమూ ఉండదు, క్రోధమూ ఉండదు. మిగిలేది

శాశ్వతమైన ఆనందమే. ఇది అంత సులభసాధ్యమైన పనికాదు. భగవంతుని అను గ్రహం వల్లనే ఇది సాధ్యం అవుతుంది.

24. యోఽ న్తః సుఖోఽ న్తరారామ స్తథాఽ న్త ర్జ్యోతిరేవ యః।
సయోగీ బ్రహ్మ నిర్వాణం బ్రహ్మభూతోఽ ధిగచ్ఛతి॥

తా: అంతరాత్మలో సుఖమున్నవాడు అంతస్సుఖుడు అంతరాత్మలో రమించే వాడు అంతరా రాముడు అంతరాత్మ యెవనికి జ్యోతియో అతడు అంతర్జ్యోతి.

పై లక్షణాలెవరికున్నాయో అతడు బ్రహ్మ నిర్వాణాన్ని పొంది బ్రహ్మ భూతు డవుతాడు.

వ్యా: లక్షాధికారికి లక్షల మీద బెంగ. భిక్షాధికారికి భిక్షలేదని బెంగ. ఉన్న వాడికి ఉన్న బెంగ. లేనివాడికి లేని బెంగ. అంతఃకరణంలో శాంతి లేకపోతే స్వర్గానికి వెళ్ళినా సుఖం ఉండదు. అంతఃశాంతి కలవాడు హాయిగా ముళ్ళ పానుపుమీద నయినా నిద్రపోతాడు. అతని దృష్టి ముళ్ళమీద ఉండదు గనుక.

అంతస్సుఖం కావాలంటే తృప్తికావాలంది అమ్మ. తృప్తియే ముక్తి. సుఖంలో కూడా చైతన్యం చలనం ఉంది. చైతన్యం చలనం శాంతిమయంగా అయినప్పుడు యోగి బ్రహ్మత్వాన్ని పొందుతాడు.

25. లభన్తే బ్రహ్మ నిర్వాణ మృషయః క్షీణకల్మషాః।
ఛిన్న ద్వైధాః యతాత్మానః సర్వభూతహితే రతాః॥

తా: ఎవని కల్మషాలు క్షీణించిన వౌతాయో, జ్ఞానోదయం వలన ఎవడు సంశ యనివృత్తుడౌతాడో, ఎవడు సంపూర్ణ భూతప్రాణకోటి యొక్క హితాన్నే నిరతంగా మనస్సులో ఉంచుకుంటాడో, భగవద్ధ్యానంలో ఎవనికి ఏకాగ్రత కలుగుతుందో, ప్రపంచం వేఱు, పరమాత్మ వేఱు, అనే భేద భావన ఎవనికి తొలిగిపోతుందో అతనికి పరబ్రహ్మప్రాప్తి కలుగుతుంది.

26. కామక్రోధవియుక్తానాం యతీనాం యతచేతసాం।
అభితో బ్రహ్మ నిర్వాణం వర్తతేవిజితాత్మనాం॥

తా: కామక్రోధవియుక్తులకు, యతులకు, యతచేతస్కులకు, విదితాత్ములకు, జ్ఞానులకు, పరబ్రహ్మ పరమాత్మ ప్రాప్తి తప్పక కలుగుతుంది.

27. స్పర్శాన్ కృత్వా బహిర్ బాహ్యాన్ శ్చక్షుశ్చైవాంతరేభ్రువోః
ప్రాణాపానౌ సమౌకృత్వా నాసా భ్యంతర చారిణౌ॥

తా: అర్జునా! బాహ్యామైన విషయ భోగాలను బయటనే త్యజించి అంటే వాటి యందు ఆసక్తిని విడిచిన మనస్సు కలవాడై, భ్రుకుటి మధ్యలో నేత్రదృష్టిని కేంద్రీక

రించి, నాసికాంతములలో చరించే ప్రాణవాయువును అపాన వాయువుతో సమంగా బంధించి, తరువాత శ్లోకంతో సమన్వయం

28 యతేన్ద్రియ మనోబుద్ధిర్మునిర్మోక్ష పరాయణః।
విగతే చ్ఛా భయక్రోధః య స్సదాముక్త ఏవ సః॥

తా: ఇన్ద్రియాలను ఎవడు నియమించిన వాడౌతోడా, పరమేశ్వర స్వరూపాన్నే నిరంతరమూ స్మరిస్తూ ఎవడు మనస్సుచేత, బుద్ధిచేతా, మోక్షపరాయణుడౌతాడో, ఆ ముని, అంటే మౌనం ధరించినవాడు, ఇచ్ఛాభయ క్రోధాదులచే బంధింపబడని వాడూ నిరంతరమూ ముక్తుడౌతాడు.

29. భోక్తారం యజ్ఞతపసాం సర్వలోక మహేశ్వరమ్।
సుహృదం సర్వభూతానాం జ్ఞాత్వా మాం శాంతి మృచ్ఛతి॥

తా: యజ్ఞ భోక్తనుగాను, తపో లక్షణంగాను, సర్వ లోకాలకు ఈశ్వరుణ్ణిగాను, సర్వభూతాలకు శ్రేయస్సు కోరే హితైషిగాను, నన్ను తెలుసుకున్న జ్ఞానిని గుర్తించి జనులు శాంతిని చెందుతారు.

వ్యా: ప్రత్యక్ష ప్రమాణ బుద్ధులైన నేటి విజ్ఞానిలోకానికి కండ్లముందఱ కని పిస్తేనేకాని భగవంతుని ఉనికి విశ్వసనీయం కాదు. ఉంటే నా ముందటికి వచ్చి కనపడరా దేవుడా! దాగుడు మూతలాడి ఏం ఉద్ధరించగలవని ఛాలెంజ్ చేస్తాడు నేటి మానవుడు. తనకంటే లోకాన్ని శాసించే శక్తి మఱొకటి ఉందని ఒప్పుకోడు. గోచీ పెట్టుకోలేని కుంక వెధవ కూడా పహిల్వానును బోల్తా కొట్టించగలననుకుంటాడు. సర్వ ప్రాణులకు స్నేహితుడుగా ఎవడుండగలడు కనుక! కుక్కకు పిల్లిమీదా, పిల్లికి ఎలుకమీదా ఆపేక్ష కలుగుతుందా? అనుకుంటాడు. దైవీయ సంపత్తిని దౌర్బల్యంగా జమకడతాడు. అలాటి మహాత్ముల చేతుల నుండి వెలువడేవే హింసాభిశంసనలన్నీ. భయంకరమైన మానవ కల్పితోపద్రవాలన్నీని, పరమాత్మ స్వరూపం ఆరకంగా పరిణమించాలి అనుకుంటే అలాగే ప్రత్యక్షమవుతుంది. అణువు బాంబులాగా, భూకంపం లాగ, పెను తుఫాను లాగ సౌమ్యంగా ఉన్నా ఘోరంగా ఉన్నా అన్నింటికీ కారణం పరమాత్మయే అని తెలుసుకున్న మహాత్ముడు శాంతమనస్కుడై మోక్షాన్ని కరతలామలకం చేసుకోగలుగుతాడు.

ఇది మాతృగీతలో కర్మ సంన్యాస యోగమనే పంచమోధ్యాయము.

మాతృగీత

ఆరవ అధ్యాయము

ధ్యానయోగము

సారాంశము - గృహస్థాశ్రమంలో స్థితుడై ఉన్న పురుషుడు యోగాన్ని ఆరోహించే కోరిక గలవాడై మననశీలుడై ఉంటే, అతనికి, ఫలాభి సంధి రహితంగా చేయబడే అగ్నిహోత్రాదికర్మలు అంతఃకరణ శుద్ధిని కల్గించుటద్వారా, ధ్యాన యోగంలో ఆరూఢుడు కావడానికి సాధనాలౌతాయి.

శ్రీ భగవానువాచ

1. **అనాశ్రితః కర్మఫలం కార్యం కర్మ కరోతియః।**
స సన్యాసీ చ యోగీచ, న నిరగ్నిః న చా క్రియః॥

తా: కర్మఫలాన్ని ఆశించకుండా కార్యములనూ కర్మలనూ ఎవడు ఆచరిస్తాడో, వాడే నిజమైన సన్యాసీ, యోగీ కాని, నిత్యాగ్ని హోత్రం మానుకొని, నిష్క్రియత్వాన్ని అవలంబించినవాడు కాడు.

వ్యా: సోమిదేవమ్మలు, సోమిదేవులూ ఫలాభి సంధి రహితంగా కర్మలు చేయరు. శిష్టాచారం నిష్కామ కర్మకు కొలతబద్ధకాదు. స్వభావ సిద్ధంగా చేసే పనికి సుఖంగాని దుఃఖంగాని కలుగదు.

చీమకు ఆకలివేసి చక్కెర తునకను కొఱుకుతుంది. చక్కెర కాని దానిని చక్కెర అనుకుని మోసపోవడం దానికి తెలియదు. అందువల్ల చక్కెర లభించాలని ఆశించి ప్రయత్నం చేయడమూ దానికీ ఉండదు. చేసిన ప్రయత్నం విఫలమై పోవడమనే దుఃఖమూ దానికుండదు. బెల్లమున్న చోటికే అది పోతుంది. వృథాగా అది ప్రయత్నం చేయదు.

మస్తిష్క జీవులకే ఆశలూ పాశలూ. ఆశ విఫలమైతే రోషాలు. ఆహారం కోసం మైళ్ల కొద్ది గూటిని విడిచిపెట్టి ఎగిరిపోయిన పక్షి ఆహారం దొరక్కపోతే ఆకలిబాధ అనుభవించవచ్చుగాక. ప్రయత్నం విఫలమైందనే దుఃఖం మాత్రం పడదు. కర్మఫలాన్ని ముందుగా ఆశించి, కామ్యకర్మలు చేయడం బుద్ధిజీవికి రోగం. కర్మఫలం తను అనుకున్నట్లు వస్తుందని ఆశ. ఆకాంక్ష కూడాను. ఈ ఆకాంక్ష ఆశ లేకుండా పనిచేయడం జీవులకు సహజ ధర్మంగా ఎప్పుడు పరిణామం పరిపక్వ మౌతుందో అదే నిర్వాణానికి ఆఖరిమెట్టు కడుతుంది. ఆస్థితినే కర్మఫలాన్ని ఆశ్రయించకుండా

కర్మలను చేసేవాడు కూడా అప్రయత్నంగా సంసారంలో ఉంటూ కూడా పొంద గలడు.

2. యం స న్యాస మితి ప్రాహు ర్యోగం తం విద్ధి పాండవ!।
న హ్యా న్య వ్యస్త సంకల్పో యోగీ భవతి కశ్చన॥

తా: అర్జునా! దేనిని సన్యాసమని పండితులంటూ ఉంటారో అదే యాగమని కూడా తెలుసుకో. సంకల్పమనే చిత్త స్వభావాన్నుండి విడివడజాలని మనుష్యుడు ఎన్నడూ యోగి కాలేడు.

వ్యా: అమ్మ చెప్పిన వాక్యమ్ము లనుభవాల
నీడలానీడ నీడలనే బఠించి
రకరకాలుగ వల్లియర్థమ్ము చెప్పు
మన మనస్సులు; సూర్య బింబమ్మె అమ్మ.

శరీరమూ మనస్సు – యోగానికి కర్మ సన్యాసానికీ మూలాలు, శరీరాన్ని విడిచి మనస్సూ లేదు. మనస్సును విడిచి శరీరమూ లేదు.

3. ఆరురురుక్షోః మునేః యోగం కర్మ కారణ ముచ్యతే।
యోగారూఢస్య తస్యైవ శమః కారణ ముచ్యతే

తా: యోగాన్ని ఆరోహించాలనే ఇచ్ఛగల మునికి కర్మయే కారణమని చెప్పబడు తుంది. యోగారూఢుడైన మునికి ఆ కర్మలను శమింప జేసుకోవడమే ముక్తికి కారణ మౌతుందని చెప్పబడుతుంది.

వ్యా: నిష్కామ కర్మయోగం అనే నిచ్చెనను అధిరోహించి పైన ద్వారాన్ని దాటి పునరావృత్తి లేకుండా, మోక్షసౌధాన్ని చేరుకుందామనుకున్నాడనుకోండి ఒక ముని. నిచ్చెన దాపులేకుండా నిలవదుకదా. ఆ గోడయే కర్మలను చేయడమంటే. సకామంగా పనిచేసినా నిష్కామంగా చేసినా కర్మలు అనే ప్రాతిపదిక ఒకటి ఉంటేనేకదా తరువాతి కథ వచ్చేది.

నిష్కామ కర్మయోగానికి కర్మలనుచేస్తూ సంసారంలో జీవించడమే కారణ మౌతుంది; కాని కర్మలను విడిచిపెట్టి సంసారాన్నుంచి పాటిపోవడం కారణం కాదు. నిచ్చెన ఎక్కి పైమెట్టు అందుకున్న తరువాత ఇక దిగకుండా, దిగుదామన్నా దిగడానికి వీలులేకుండా, ఉండేలాగా నిచ్చెనను క్రిందికి త్రోసివేయడమే మంచి ఉపాయ మౌతుంది. నిచ్చెన త్రోసివేసిన కారణంగా యోగారూఢునికి, సాక్షాన్ముక్తి లభిస్తుంది.

తాత్పర్యమేమిటంటే సంసారాన్ని విడిచిపెట్టే సన్యాసం, సంన్యాసం కాదని.

4. యదా హి చేంద్రియార్థేషు న కర్మ ష్వనుషజ్జతే।
సర్వ సంకల్ప సంన్యాసీ యోగారూఢ స్తదోచ్యతే॥

తా: ఎప్పుడైతే ఇంద్రియార్థములందు గాని

కర్మలయందుగాని మనుష్యుడు ఆసక్తిలేనివాడౌతాడో అప్పుడు సర్వ సంకల్ప సన్యాసి అని చెప్పబడతాడు.

వ్యా: నాదనుకోకుండా ఎవడూ ఏ పనీచేయడు. ఇదే నాదనుకోకుండా అన్నీ నావనుకోమంటుంది అమ్మ. అదీ జరిగే పనికాదు. ఈ పద్ధతి అన్నిటికంటే శ్రేష్ఠమైన పద్ధతీ, మోక్షదాయక పద్ధతేకాని ఇతరుల పనులను నావనుకొని చేయడం ఆ స్థాయి కెదిగినవాళ్ళకు తప్ప చటుక్కున అలవాటయ్యే పద్ధతి అనిపించదు. నాదీ నీదీ అనే భేదం లేకుండా నిత్యమూ పనిలో మునిగి ఉండడం మేలనిపిస్తుంది. అలా ఉండే వాళ్ళని చాలామందిని చూశాను. "మీకెందుకు? మీరు అలా కూర్చోండి.! ఏమీ లోటు రాకుండా కానిచ్చేస్తాం" అని అన్ని పనులూ కడదాకా చేసి పారేసేవాళ్ళు ఎంతోమంది సమాజంలో ఉన్నారు. పాశ్చాత్య నాగరికత పైబడిన కొద్దీ ఈ చీకీర్షుల పాలు తగ్గి పోతున్నది.

"సంకల్పమూలః కామో వై యజ్ఞాః సంకల్ప సంభవః" కామానికి మూలము సంకల్పము, యజ్ఞాలూ సంకల్ప సంభవాలే. కామం అంటే కోరిక. సమస్త కామాలు సంకల్పాలూ త్యజించినవాడు సర్వకామ సంకల్ప సన్యాసి"

5. ఉద్ధరే దాత్మనాఽఽత్మానం, నాత్మాన మవసాదయేత్।
ఆత్మై వ హ్యాత్మనో బంధుః ఆత్మైవ రేపు రాత్మనః॥

తా: చాలా చక్కని ముఖ్యమైన శ్లోకం. శరీరం కూడా ఆత్మేనన్నది అమ్మ. అంటే చివరకు పంచభూతాలతో కలిసిపోయే స్వభావం కలది – శ్లోక తాత్పర్యం ఇలా ఉంది.

తా: ఆత్మను ఆత్మతోనే ఉద్ధరించాలి. ఆత్మను దిగజాఱనీయకూడదు. ఆత్మకు ఆత్మయే బంధువు. ఆత్మకు ఆత్మయే శత్రువు. రెంటికీ ఏమి సంబంధం?

ఒక వస్తువును ఇంకోటి లేవనెత్తడానికిగాని ఆ మట్టంలో నిలిపి ఉంచ డానికిగాని మొదటి దానికంటే రెండో దానికి బలముండాలి. దాని కంటె ఇది బలహీనమయితే హరుని విల్లెత్తబోయిన రావణాసురుడి గతే పడుతుంది.

ఆత్మ మహతో మహీయమైనది. పెద్ద వాటిలో పెద్దది. దానికంటె పెద్దదింకోటి లేదు. ఆకాశాన్ని మనిషి ఎత్తి పారెయ్యలేడు. ఆకాశాన్ని ఆకాశమే నిర్వహించు

కోవాలి. ఏ పరిస్థితిలోనూ ఆకాశం దిగజాఱకూడదు. దిగజాఱ నియ్యకూడదు. దిగజార్చడమంటే ఏమిటి? పైన ఉన్న దాన్ని క్రిందికి విడిచిపెట్టడం. మనం చొరబడ లేనిచోట కూడా ఉంది ఆకాశం. క్రిందా పైన, ఒక్కటిగా అలుముకొనిపోయి అంతటా నిండి ఉన్నది ఆకాశం. ఆకాశం లాంటిదే కాలం. అవెక్కడకు దిగజాఱుతాయి. అలాంటి మహత్తును దిగజార్చడమంటే ఏమిటి? ఎవడా దిగ జార్చగలిగేవాడు? తానే అన్ని రూపాలుగానైన పరమాత్మను ఏ ఒక్కరూపం ఎలా ఉద్ధరించగలదు? కనుక మొదటి పాదానికిదే అర్థం. ఉద్గమన శీలమైనది పరమాత్మ. పతనశీలమైనది కాదు. చెట్లు భూమి అడుగు నుండి పైకి లేస్తాయి. అగ్ని ఊర్ధ్వ ముఖంగా జ్వలిస్తుంది. భూమ్యాకర్షణ శక్తి క్రిందికి గుంజుతున్నా ప్రాణవాయువు పైకే లేచిపోతుంది. ఉద్ధరణ శీలమైన ఆత్మచైతన్యాన్ని మఱొక శక్తి ఉద్ధరించజాలదు. ఆత్మ గమనానికి ఆత్మయే వేగాన్ని బలాన్నిస్తుంది. ఆత్మయే ఆత్మకు ఉద్ధరణ హేతువైనా పతనహేతువైనా ఎందుకంటే సర్వానికి సర్వం కారణం కాబట్టి. దిగజాఱడం దాని స్వభావంలో లేదు. మనం కష్టాలు అనుకున్నవి కష్టాలూ కావు. సుఖాలనుకున్నవి సుఖాలూకావు. కష్టాలను శత్రువులనుకోవడం, సుఖాలను స్నేహితులనుకోవడం అజ్ఞానం. అలాటి అవిద్య కూడా పరమాత్మ చేష్టయే.

ఆత్మకంటె ఆత్మకు శత్రువుగాని మిత్రుడుగాని లేడంటే అర్థం తనకు తానే మిత్రుడు తనకు తానే శత్రువూ అయ్యేవాడికి ఇంకా వేఱే శత్రువులూ మిత్రులూ ఎవరుంటారు? ఫలితార్థమేమిటంటే ఆత్మకు శత్రువులూ లేరు. మిత్రులూ లేరు. అందఱూ సర్వసమానులే.

"సమోఽహం సర్వభూతేషు నమే ద్వేష్యోస్తి నప్రియః" విశ్వజననికి అందఱు బిడ్డలూ సమానులే. అందఱూ సమానులే అయితే అందఱకూ ఒకేరీతిగా పరిస్థితులను ఎందుకు కల్పించదంటే, ఎంతవాడికి అర్హతో, ఎంత వాడి సత్తా నిభాయించ గలదో అంతే అమ్మవాడికి ప్రసాదిస్తుంది. ఎక్కువ పెట్టి నిభాయించుకోలేని దుర వస్థను బిడ్డకు కల్పించడం తల్లికి చేతకానిపని. ఈ రెండు భావాలలోనూ ప్రేమలోని సర్వసమానత్వమే గోచరిస్తుంది. కాని వ్యత్యాసం కనిపించదు.

'పెట్టడం సమానమే – పంచడంలో తేడా ఉండవచ్చు' అమ్మ. వైవిధ్యమే సృష్టి.

6. బంధు రాత్మాఽత్మన స్తస్య యేనాఽత్మై నాత్మనా జితః।
అనాత్మన స్తు శత్రుత్వే వర్తే తాత్మైవ శత్రువత్॥

తా: ఆత్మచేతనే ఆత్మ ఎవనియందు జయించబడిన దౌతుందో, వాడికాత్మ

బంధువు. కార్యకారణ సంఘాత రూపమైన శరీరాకారాన్ని వశము చేసుకోలేని అజితేంద్రియునికి ఆత్మయే శత్రువు.

వ్యా: వజ్రాన్ని వజ్రమే కోయగలదు. ఆత్మను ఆత్మయే జయించగలదు. సజాతి అయిన వజ్రం ఇంకో వజ్రానికి మిత్రుడా శత్రువా? ప్రయోగాన్ని బట్టి రెండూను. కాబట్టి ప్రయోజనమే శత్రుత్వ మిత్రత్వాలను నిర్ణయించడానికి హేతువౌతుంది. కాని శ్లోకం మొదటిపాదంలో ఒక విచిత్రమైన విశిష్టత ఉంది. ఎవడియందు ఆత్మచేత ఆత్మ జయించబడుతుందో అతనికి ఆత్మ బంధువట. జయించడమనేది శత్రుభావాన్ని దాల్చిన ఆత్మను సూచిస్తుంది. ఆత్మవైరాన్ని ఆత్మభావంచేత జయించిన వాడికి ఆత్మ బంధువు. అంటే ప్రతివాడిలోను ఆత్మ వైరభావంతో కూడా సంచరిస్తుందన్న మాట. వైరిని కంటె వైరాన్ని చంపడమే అమ్మ మతం. ఆత్మలో ఆత్మకు సంభవించిన వైరం తీరిపోతే ఆత్మ స్వచ్ఛంగా మిగులుతుంది.

ఆ వైరభావం ఇంద్రియ విషయాలనుకుందాం. ఇంద్రియ విషయాలను ఇంద్రియార్థాలతోటే జయించడమంటే వాటిని అనుభవం ద్వారానో, నిగ్రహం ద్వారానో పరిసమాప్తించడమన్నమాట. నిస్సంగత్వం కూడా మూడో మార్గం. అలాంటి స్థితి అబ్బిన వానికి ఆత్మబంధువు. ఈ పాదంలో వైరం దాల్చిన ఆత్మయే వ్యక్తికి బంధువౌతుంది. బుడంకాయ చేదుగాపుట్టి పండేసరికి స్వాదువైనట్లు వైరం దాల్చి ఆత్మ మిత్రుడౌతుంది.

రావణుడు పరమాత్మయందు విశ్వాసం లేనివాడు కనుకనే నిత్యం అతన్ని ఏకైక శత్రువుగా తలపోశాడు. శత్రుత్వాన్ని సాధించాడు. నిత్యమూ కోటి లింగార్చన చేసే రావణుడు పరమాత్మకు శత్రువా? వైరభక్తి కూడ ఒక విధమైన భక్తే. రావణునికి వైరభావంతోనే పరమాత్మ మోక్షాన్ని ప్రసాదించాడు. సహజంగా ఉండే ప్రాణ్యుత్పత్తి సూత్రాలను తలక్రిందులు చేస్తున్న క్లోనింగ్ పరిశోధనలకు కూడా ఇదేగతి రాసి పెట్టి ఉందేమో!

7. జితాత్మనః ప్రశాన్తస్య పరమాత్మా సమాహితః।
శీతోష్ణ సుఖ దుఃఖేషు, తథా మానావమానయోః॥

తా: జితాత్ముడు అంటే, ఎవని అంతఃకరణ వృత్తి సమానంగా, నిర్వికారంగా ఉంటుందో, వాడు, శీతోష్ణ పరిస్థితులందు ఉద్వేగం చెందకుండా శాంతంగా ఉంటాడు. అతడు సచ్చిదానంద ఘనుడైన పరమాత్మయందు సమాహితుడై ఉంటాడు.

వ్యా: గురు అర్జునదేవుని తురుష్కులు ఉష్ణభాండంలో త్రోసి ఉడకబెట్టారు. క్రీస్తును సజీవంగా శిలువపైన కాళ్ళకు, చేతులకు మేకులుగొట్టి వ్రేలాడదీశారు. ఇగ్రేజీయులు జోన్ ఆఫ్ ఆర్కు కన్యను నిలువునా సజీవ దహనం చేశారు. ఆంగ్లేయ ప్రభుత్వం తాంతియా టోపేని నిలువునా ఉరిదీసింది. ఈ అందఱు చచ్చిపోయేటప్పుడు అబ్బ అమ్మ అనకుండా నవ్వుతూ మరణించారు. శీతోష్ణ సుఖఃదుఖాలలో శాంతంగా ఉండడమంటే అదే. వాళ్ళెలా అలా ఉండగలిగారంటే పరమాత్మకళ వారి హృదయాలలో ప్రజ్వరిల్లుతూ ఉంది. వారు అందఱూ పరమాత్మ సమాహితులై ఉన్నారు. కాబట్టి ప్రకృతిలోని హింసా భాగాలు అన్నీ వారికి మిత్రత్వమునే చూపించాయి. ఆయిమాయి గారడీ ఇందులో ఏమీ లేదు. పరమాత్మ శక్తి ఎవరిని వరిస్తే వారలా అవుతారు. మఱి సామాన్య జనుల విషయంలోనో.

అమ్మ అన్నది కదా 'వానపామును చూసినా కళ్ళు తీసుకుంటాం'.

8. జ్ఞాన విజ్ఞాన తృప్తాత్మా కూటస్థో విజితేంద్రియః।
యుక్త ఇత్యుచ్యతే యోగీ సమ లోష్టాశ్మ కాంచనః॥

తా: జ్ఞానం చేతా విజ్ఞానం చేతా ఎవని మనస్సు తృప్తి వహిస్తుందో, ఎవనికి ఇంద్రియాలు వశమునందుంటాయో ఎవనికి బంగారం, మట్టీ, ఱాయీ సమానంగా తోస్తాయో అతడే యోగి అని యుక్తుడనీ చెప్పబడతాడు.

వ్యా: చాలా చక్కని శ్లోకం, జ్ఞానం అంటే జగత్ సార జ్ఞానం. ఆత్మ జ్ఞానం – ఆముష్మికజ్ఞానం. అనుభవజ్ఞానం. విజ్ఞానం అంటే భౌతిక వైదుష్యం. పంచభూతాల మార్పులూ, కాల దిగ్దేశ వ్యాప్తి జ్ఞానం. అంటే సైన్సు.

మొదటి విజ్ఞానం మార్పులేనిది. స్వయంభువు.

రెండవ విజ్ఞానం మారేది విశ్వంభువు

మొదటి జ్ఞానం స్వయం సిద్ధము పారమాత్మికం

రెండవది మనస్సిద్ధము. సీమాత్మికం.

ఇచ్చిన ఉదాహరణ రెండవ జాతిది. మట్టికంటె ఘనం ఱాయి. ఱాతికంటె ఘనం లోహమైన బంగారం. ఒకదానికంటె రెండోది, రెండవ దానికంటే మూడోది విలువల కలది. విలువలు మనుష్యులిచ్చేవి. ఈ నిచ్చెనలూ, పాములూ బుద్ధికి సంబంధించినవి. ఆ బంధంలేనిది మొదటి జ్ఞానం. అక్రియము. రెండోది సక్రియము. మొదటిదాన్ని చేరుకోవడానికి మార్గం రెండవదైన విజ్ఞానమే. కనుకనే శ్లోకం జ్ఞాన విజ్ఞాన తృప్తాత్మా అని చెప్పింది. తృప్తియే ముక్తి. అదే సాకార క్షమమైన నిత్య

జాగృతి మితిలేని చితి. మితిలేని ధృతి, మితిలేని గతి. రెండూ వేఱుకావు. స్తరాలు వేఱు.

సుహృ న్మిత్రార్యుదాసీన మధ్యస్థ ద్వేష్య బంధుషు।
సాధు ష్వపి చ పాపేషు సమ బుద్ధి ర్విశిష్యతే॥

తా: అంతరంగికులూ, మిత్రులూ, శత్రువులూ, ఉదాసీనులూ మధ్యస్థులు, ద్వేషులు, సాధువులు ఈ యందఱి యందున్ను, మీదు మిక్కిలి పాపులయందుకూడా యోగిజనులు సమబుద్ధితో ఉంటారు.

వ్యా: సుహృత్ = స్వార్థ రహితుడు
ఉదాసీనుడు = పక్షపాతం లేనివాడు
మధ్యస్థుడు = రెండుపక్షాలకు మేలు కోరేవాడు.

10. యోగీ యుంజీత సతత మాత్మానం రహ సి స్థితః।
ఏకాకీ యతచిత్తాత్మా నిరాశీ రపరిగ్రహః॥

తా: నిత్యమూ ఆత్మయందే నిమగ్నుడై రహస్యంగా ఉంటూ, ఏకాంత ప్రదేశంలో ఉంటూ, నియత చిత్తుడై, ఆశలులేనివాడై, ఏ వస్తువునందు గ్రహణశీలుడు కాకుండా యోగి అయినవాడు గడపాలి.

వ్యా: ఏకాంతానికి అనేకాంతానికి అంతరంలేనిది అమ్మ. అందరితోనూ ఆయిలా బాయిలాగా మాట్లాడుతూనే ఉంటుంది అమ్మ. కాని వారి సంభాషణా సంపర్కం అమ్మపైన ఏ మాత్రమూ ఉండదు. నిగ్రహించబడిన చిత్తం ఉండడం పరమేశ్వరుని కృపయే. చిన్నతనం నుంచి ఈ అలవాటును అభ్యసించాలంటుంది అమ్మ. నాదనే వస్తువు మీదా, ఆభరణాల మీదా, చిన్నతనం నుండి అమ్మకు మమకారం లేకుండాపోయింది. అపరిగ్రహః అంటే పుచ్చుకోవడం లేకుండా, మఱో విధంగా చెబితే ఇవ్వడం లేకుండా (ఫలాభి సంధితో) అని అర్థమే ఆమాటకు నా మృత్యు లగ్నంలోని పద్యం గుర్తుకు వస్తుంది ఏకాకి అనే మాటను తలుచుకుంటే

ఒంటరి తనమ్మె రుచియగు నొక్కొకపుడు
వాస్త వైకాంత దశ సుహృద్వృత్ని వోలె
సరస నాత్మ ద్వితీయయ్యె వరలునెడల,

పామూ దోమా మనిషీ మృగమూ అందఱూ బిడ్డలుగా తోచేటప్పుడు ఏకాంత దశ ఎలా ఉంటుంది?

యోగాభ్యాసం చేసేవారికి యోగసాధనాలైన ఆసన ఆహార నియమాలను, యోగలక్షణాలు పొందిన వానికి లభించే ఫలాలను. ఈ శ్లోకం నుంచి ఆరంభించి పరమాత్మ ఉపన్యసిస్తున్నారు.

11. శుచౌ దేశే ప్రతిష్ఠాప్య స్థిర మాసన మాత్మనః।
నాత్యుచ్ఛ్రితం, నాతినీచం చైలాజిన కుశోత్తరమ్॥

12. తత్రైకాగ్రం మనః కృత్వా యత చిత్తేంద్రియః క్రియః।
ఉపవిశ్యాసనే యుజ్యా ద్యోగమాత్మ విశుద్ధయే॥

తా: ఆటే ఎత్తూ, ఆటేపల్లంకాకుండా, పరిశుభ్రమైన భూమిని చూచుకొని, దాని మీద కుశలు అంటే దర్భలు పఱచి, దర్భలమీద కృష్ణాజినం, కృష్ణాజినంమీద వస్త్రమూ ఆస్తరణంగా వేసుకొని, ఊగులాడకుండా ఉండేలాగా, ఆసనాన్ని దిట్టం చేసుకోవాలి. మనస్సు ప్రసన్నంగా ఉంచుకొని ఇంద్రియ క్రియాకలాపాలను భగవంతుని అనుగ్రహంవలన స్వాధీనంలోనికి తెచ్చుకొన్నవాడై ఏకాగ్రచిత్తంతో ఆసనమునం దుపవిష్టుడై ఆత్మశుద్ధికోసం యోగాన్ని అభ్యసించాలి.

వ్యా: ఇందులో చెప్పబడిన ఎత్తూపల్లాలూ, స్థిరాసనం, ఏకాగ్రత, యోగాభ్యాసానికి ప్రయత్నమంతా బాహిరానికెలాగో, అంతఃకరణానికీ అలాగే వర్తిస్తాయి. అవి సిద్ధించినప్పుడు ఆనందమయమైన స్థితి దాని అంతట అదే అలవడుతుంది. ఉపకరణాలను సమకూర్చుకునే బుద్ధి కూడా పరమేశ్వరుని కృపవల్లనే కలుగుతుంది. అయస్కాంతం దూరంగాఉంటే ప్రయత్నంచేసి కూడా ఇనుపముక్క దాన్ని అంటుకోజాలదు. ఆ ఆకర్షణే భగవత్కటాక్షం.

13. సమం కాయం శిరోగ్రీవం ధారయ న్నచలం స్థిరః।
సంప్రేక్ష్య నాసికాగ్రం స్వం దిశ శ్చానవలోకయన్॥

14. ప్రశాన్తాత్మా విగతభీః బ్రహ్మచారి వ్రతే స్థితః।
మన స్సంయమ్య మచ్చిత్తో యుక్త ఆసీత మత్పరః॥

తా: శరీరాన్ని, శిరస్సును, మెడను, దండవతుగా స్థిరంగా సమంగా నిలిపి, నాలుగు వైపులకు చూడకుండా, నాసికాగ్రాన్ని సూటిగా చూస్తూ, ప్రశాంతాత్ముడు, భయంలేనివాడు, బ్రహ్మచారి వ్రతమునందు స్థితుడైన వాడు మనస్సును సంయమించుకొని, నాయందే బుద్ధిని నిలిపినవాడూ, మత్పరాయణుడూ ఐన రాజయోగి ముక్తిని పొందగలుగుతాడు.

వ్యా: బ్రహ్మచర్యమంటే కేవలం పెండ్లిచేసుకోకపోవడమే కాదు. బ్రహ్మ చర్యమంటే లింగభేదం, రూపభేదం, స్పర్శభేదమూ లేకుండా ఉండడం.

15. యుంజ న్నేవం సదాఽఽ త్మానం యోగీ నియతమానసః।
శాన్తిం నిర్వాణ పరమాం మత్సంస్థా మధిగచ్ఛతి॥

తా: భగవదనుగ్రహంవల్ల ఈ ప్రకారంగా పుటాలతో శుభ్రపడిన మనస్సు నిరంతరం పరమేశ్వర స్వరూపంతోనే లగ్న మైనదై స్వాధీనంలోనికి వచ్చినదై, ప్రశమన రూపం దాలుస్తుంది. ఆ మనస్సుకల యోగిరాజు పరమ నిర్వాణశాంతిని పరమాత్మ స్థితరూపమైన పరమానంద పరాకాష్ఠగల శాంతిని చూఱగొంటాడు.

వ్యా: అనుభవాగ్నిలో మరిగిన మనస్సే, పైన చెప్పిన నిర్వాణ శాంతికి కుదురు. తప్పుడు మార్గాలలో వ్యక్తిని ఈడ్చుకొనిపోయేదీ మనస్సే. మనస్సుకు లోలుపత్వాన్ని గల్పించేవి ఇంద్రియ సుఖాలు. నాసికప్రాణద్వారం. చక్షువు ప్రపంచద్వారం. చక్షువును ప్రాణాగ్రం మీద గ్రుచ్చి ఉంచడంతో, ప్రపంచమే వచ్చి ఆత్మతో ఏకీభావం చెందుతుంది.

రక్తంలోని గుణాలవల్ల మనస్సుకు చిన్నప్పటి నుంచి కొన్ని వస్తువుల మీద ద్వేషం భీతి ఏర్పడతాయి. పాము, దయ్యం, భూతం, నరకం, బాధ, నిప్పు, రోగం, రొచ్చు, ముల్లు, వీటన్నిటికీ దూరంగా ఉండటానికి ప్రయత్నిస్తాం. అలాగే కొంత మంది, మనుష్యులు విరసంగా ఉంటారు. వారితో మాట్లాడ్డానికి కూడా మనస్కరించదు పూర్వపు పద్ధతుల ప్రకారం మనోవికారాలు లేని స్వచ్ఛమైన తత్త్వమే దేవత్వమనీ, వికారాలున్నది మానవత్వమూ రాక్షసత్వమనీ, రాక్షసత్వాన్ని పరిమార్చడానికి భగవంతుడు యుగయుగాల్లో అటువంటి ప్రక్షాళన పాత్రలను ధరిస్తాడనీ వాటిని అవతారాలంటారనీ స్మృతులు ఇతిహాసాలూ చెబుతాయి.

అమ్మ మతంలో మంచీ చెడూ కూడా భగవంతుడేననీ, మనకు కనిపించే ప్రకృతికీ, దాని మార్పులకూ భగవత్సత్తాకు ఏమీ భేదంలేదనీ, అవన్నీ కలిసిన సత్తాయే భగవంతుడనీ అంటుంది అమ్మ.

ఇది చీకటి వెలుగుల సత్తాలవలె ఉంటుంది. వెలుగున్న చోట చీకటి ఉండదు. చీకటి అంటే ఘనీభవించిన వెలుతురే అనే వాదం ఒకటి ఉన్నది. లోకంబులు లోకేశులు అన్న భాగవతపద్యంలో వర్ణించిన అంశం కూడా ఇదే.

దాఖలా కోసం మనస్సూ, మనస్సుకోసం దాఖలా మిగులుతాయి చివరకు. బొమ్మా బొరుసులూలాగా.

16. **నాత్యశ్నతస్తు యోగాஉస్తి న చైకాంత మనశ్నతః।**
న చాతి స్వప్నశీలస్య జాగ్రతో నైవ చార్జున!॥

తా: అర్జునా! ఈ యోగం మితిమీరి తిండితినే తిండిపోతుకుగాని, బొత్తిగా కడుపు మాడ్చుకునే బక్కవఅడుకుగాని, గుఱ్ఱుబెట్టి నిద్రపోయే కలల మారికిగాని, నిద్రలేకుండా కనులు జ్యోతుల్లా వెలిగే చండయోగికిగాని సిద్ధించేది కాదు.

వ్యా: తినబడడానికిగాని, మననుతినెయ్యడానికిగాని అన్నం పుట్టింది. అది మితిమీరి తినేవాళ్ల ప్రాణాలను హరించినట్లే, తిననివాళ్లనూ అలాగే తినేస్తుంది. జిల్లేళ్లమూడి అమ్మను కాని ముమ్మిడివరం బాలయోగినికాని, అన్నం బాధించలేదు. నేను అన్నాన్ని విడిచిపెట్టలేదు. అన్నమే నన్ను విడిచిపెట్టింది. అన్నది అమ్మ. ప్రాణసారాన్ని పంచభూతాల నుండి నేరుగా గ్రహించే పద్ధతితో బ్రతికే వారికి అన్నం అవసరంలేదు. అంతేకాక అమ్మ నిద్రకూ మెళుకువకూ భేదంలేదు అంతా వర్త మానమే, నాకు భూతం భవిష్యత్తు లేదన్నది. అమ్మ. ప్రేమమయి మాతాతో రాత్రి మాట్లాడుతున్నావా అమ్మా! అని అడిగితే నాకు తెలియదు! అన్నది అమ్మ

జగత్తే పరమాత్మకు స్వప్నమైతే, మఱి మన స్వప్న జాగృతులు అందులో ఏ లెక్కకు వస్తాయి?

17. **యుక్తాహార విహారస్య యుక్త చేష్టస్య కర్మసు।**
యుక్త స్వప్నావబోధస్య యోగో భవతి దుఃఖహా॥

తా: సముచితమైన ఆహార విహారాలు కలవారికి, కర్మలతో యథాయోగ్యంగా చేష్టలనుచేసే వానికి, యథాయోగ్యంగా నిద్రాజాగృతులు కలవానికి, యోగము దుఃఖనాశకమౌతుంది.

వ్యా: కడుపు ఆకలికి కొలత, అది నిండిన తరువాత ఇంకో పిడచకూడా ఎక్కించడాన్ని అది సహించదు. అది శిక్షే. తాను కాపురమున్న నవద్వారాల నగరి పరిమితిని తెలిసికోకపోవడం మానవత్వం. తెలుసుకుని వర్తించడం దైవత్వం. ఆహార విహారాలు ఐచ్ఛికాలు. ఉన్నవాడికి లేనివాడికి అవి అవసరాలు.

యోగానికి ఆహార నియమం అవసరమా అని ప్రశ్న.

"యోగసాధనకు ఉప్పూ, కారమూ, పులుసూ, కూడదని చెబుతున్నారు వీటివల్ల ప్రకోపాలు కలుగుతాయని అంటున్నారు. ఉప్పుకారమూ తినని ఇతర దేశాల్లో కూడా ప్రకోపాలు కలుగుతూనే ఉన్నాయి. మిరపకాయలు తినకపోవచ్చు కానీ మిరప

కాయలో ఉన్న గుణం మన శరీరంలో ఉన్నది. మనసుకూ ఆహారానికీ సంబంధం లేదు" అన్నది అమ్మ.

అన్నం అమ్మను విడిచిపెట్టినా అమ్మ బిడ్డలందరికి అన్నం పెట్టింది. ఇంతకంటె దీనికి వ్యాఖ్యానం అనవసరం. గీతను చెప్పిన పరమాత్మ పాలూ వెన్న దండిగా త్రాగాడు అరిగించుకున్నాడు. అష్ట భార్యలతో సంసారం చేశాడు.

18. యదా వినియతం చిత్త మాత్మన్యేవావతిష్ఠతే
ని స్పృహ స్సర్వ కామేభ్యో యుక్త ఇ త్యుచ్యతే తదా॥

తా: ఎప్పుడైతే స్వాధీనంలోకి వచ్చిన వచ్చిన మనస్సు ఆత్మయందు తిష్టవేసుకుని కూర్చుంటుందో అట్టి మనస్సు కల వ్యక్తి సర్వకామముల యందు స్పృహలేని వాడౌతాడు.

వ్యా: పరమాత్మ శక్తియే చేయిస్తున్నదని భావించే వ్యక్తికి, భగవంతుడు కామ రూపంగాను, కార్యరూపంగాను, ఫలరూపంగాను ప్రత్యక్షమౌతాడు. కాబట్టి అతని వ్యక్తిగతమైన ప్రమేయం దాని యందు ఉంచుకోకుండా ఉంటాడు కర్త. చేసేవాడూ చేయించేవాడూ అతడే అవుతాడు. చేసిన పని పరమాత్మ స్వరూపమే కాగలదు.

19. యథా దీపో నివాతస్థో నేఙ్గతే సోపమా స్మృతా।
యోగినో యతచిత్తస్య యుంజతోయోగమాత్మనః॥

తా: గాలిలేని చోట దీపం ఎలా నిశ్చలంగా ఉంటుందో యోగి మనస్సులో కూడా ఆత్మయోగం అలాగే నిశ్చలంగా ఉంటుందని ఉపమానం చెప్పబడింది.

పరమాత్మ దీపమే – జగత్తు దాని కాంతి.

20. యత్రోపరమతే చిత్తం. నిరుద్ధం యోగసేవయా।
యత్ర చై వాఽ త్మనాఽ త్మానం, పశ్యన్నాత్మని తుష్యతి॥

తా: యోగాభ్యాసం వలన చిత్తం బాహ్యావికల్పాల నుంచి ఎక్కడ నిరుద్ధమై ఉంటుందో, ఎక్కడ ఆత్మయందాత్మను చూస్తూ ఆత్మసంతుష్టి చెందుతుందో

21. సుఖ మాత్యంతికం యత్తత్ బుద్ధిగ్రాహ్య మతీంద్రియమ్।
వేత్తి యత్ర న చైవాయం స్థితః చలతి తత్వతః॥

అతీంద్రియమూ సహజమూ శుద్ధమూ అయి సూక్ష్మబుద్ధికి మాత్రమే గ్రహణ యోగ్యమయిన ఏ అనంత ఆనందం ఉందో, దానిని ఏ అవస్థ యందు అనుభవిస్తాడో, ఆ అవస్థలోనే మునిగి, ముని భగవత్స్వరూపంచేత చలాయమానుడు కాకుండా ఉంటాడు.

22. యం లబ్ధ్వా చాపరం లాభం మన్యతే నాధికం తతః।
యస్మిన్ స్థితో న దుఃఖేన గురుణాఽ పి విచాల్యతే॥

తా: ఏది లభించిన తరువాత అంతకంటె అధిక తరమైన లాభం ఇంకోకటి ఉంటుందని భావించబడరో, ఎందులో ఉండడంచేత ఎంత ఘోరమైన దుఃఖం చేతకూడా (పురుషుడు) చలాయ మానుడు కాకుండా ఉండగలుగుతాడో

23. తంవిద్యాద్దుఃఖ సంయోగ వియోగం యోగ సంజ్ఞితమ్
స నిశ్చయేన యోక్తవ్యో యోగోఽ నిర్విణ్ణచేతసా॥

దుఃఖ సంయోగవియోగ రూపమైనదిన్నీ యోగమనే సంజ్ఞకలదిన్నీ, అయిన ఆ పరవస్తువును చక్కగా తెలుసుకోదగును. మఱిన్నీ సునిశ్చయంతో మఱుమాట లేకుండా అనిర్విణ్ణచేతస్కుడై ఆ యోగాన్ని అభ్యసించవలెను.

వ్యా: పై శ్లోకాల్లో యోగ సంజ్ఞితమైన ఆత్మతత్వం ఎలా ఉంటుందో చెప్ప బడింది. యోగస్థితుడైన వాని మనస్సు కామములందు స్పృహలేకుండా ఉంటుంది. గాలిలేని చోట నిట్టనిలువుగా వెలిగే దీపకళికలాగా ఉంటుంది. బాహ్యావికల్పాల నుండి నిరుద్ధమై ఉంటుంది. తనలో తనను చూచుకుంటూ, అద్వితీయమైన ఆనం దాన్ని అనుభవిస్తూ ఉంటుంది. ఈ అనుభవమంతా సూక్ష్మబుద్ధికి మాత్రమే గ్రహణయోగ్యమై ఉంటుంది కాని సైన్సు ప్రయోగాల వలన ఋజువయ్యేదిగా ఉండదు. ఈ మహాభాగ్యం కంటె అధికతరమైన లాభంలేదు. ఇది అలముకొన్న తరువాత మనస్సును ఎంతటి ఘోరదుఃఖమైనా చలింపజేయలేదు. ఇట్టి భగవత్ప్రాప్తి అనే యోగం లభించిన యోగికి దుఃఖ సంయోగ వియోగముల భేదావస్థలుండవు.

'యోగానుభవం సాకారమైనదే' అమ్మ.

24. సంకల్ప ప్రభవా న్కామాం స్త్యక్త్వా సర్వా నశేషతః।
మనసై వేంద్రియ గ్రామం వినియమ్య సమంతతః॥

25. శనై శ్శనై రుపరమే ద్బుద్ధ్యా ధృతి గృహీతయా।
ఆత్మసంస్థం మనఃకృత్వా నకించి దపి చింతయేత్॥

తా: సంకల్పం నుండి ఉత్పన్నములయిన కామనలను నిశ్శేషంగా ఆసక్తి లేకుండా త్యజించి, సమగ్రంగా మనస్సుతోనే ఇంద్రియగ్రామాన్ని నియమించుకొని, క్రమక్రమంగా పరమేశ్వరునిపై ఆస్తిక్య బుద్ధివలన లభించే ధైర్యాన్ని అవలంబనంగా చేసుకుని మనస్సును ఆత్మయందు ప్రతిష్ఠించినవాడై అన్యచింతన లేవీలేకుండా ఉన్న

వానికి పరమేశ్వర సాక్షాత్కారం తప్పక లభిస్తుంది. అంటే ఐహికబంధం మాసి పోతుంది.

వ్యా: మాతృశ్రీ సాన్నిధ్యంలో అమ్మచేతి మీదుగా దినదినమూ శుభకార్యాలు, ఉపనయనాలు, వివాహాలు, అపరకార్యాలు, హోమాలు, పూజలు, కైంకర్యాల చికి త్సలు, నైవేద్యాలు, చర్చలు, కచేరీలు, ఆనందాలు, ఆక్రోశాలు, సల్లాపాలు, సంతో షాలు, ఎన్నో జరుగుతున్నాయి. అన్నింటికి మూలాధార స్తంభం అమ్మ కనుక అమ్మ సహాయ సంపర్కాలు లేకుండా ఇవన్నీ జరుగుతున్నాయంటే ఎవరూ ఒప్పుకోరు. జరిగే అన్నింటికీ మహాక్షేత్రం అమ్మే. అందులోకి నీళ్ళలాగా దొర్లుకొని వస్తాయి ఈ కార్యాలన్నీ, వాటిని పండిస్తుంది అమ్మ. పండిన పైరును కోసుకుని తీసుకుపోతుంది లోకం.

ఇందులోని అందం ఏమిటంటే పండిన పైరూ తన బిడ్డే! దాన్ని కోసిన వాళ్ళూ బిడ్డలే. తిన్నవాళ్ళూ తన బిడ్డలే. పైరైపోవడం తనవంతు. క్షేత్రంగా ఉండిపోవడం తనవంతు. భూసారం పంటగా మారేదీ, పంట అన్నంగా మారేదీ, 'అన్నాద్భవంతి భూతాని' అదీ తనే. తనకేమీ అనుబంధం, బంధంలేదు ఈ మార్పుల్లో – ఎందుకంటే అలాకావడం తన స్వభావం, స్వభావమంటే ప్రకృతి.

26. యతో యతో నిస్సరతి మనశ్చంచల మస్థిరమ్।
తత స్తతో నియమ్యైత దాత్మ న్యేవ వశం నయేత్॥

తా: ఏఏ విషయాల్లో మనస్సు స్వాధీనంలో ఉండకుండా ఎలా ఎలా అస్థిరంగా, చంచలంగా, సంచరిస్తూ ఉంటుందో, అలా అలాగే దాన్ని నియమించికొని ఆత్మ స్వాధీనంలోనికి నెమ్మది నెమ్మదిగా తెచ్చుకోవాలి.

వ్యా: ఇంతకు ముందు శ్లోకాలలో మనసు స్వాధీనంలో ఉన్న యోగి యొక్క అనుభవాలను, అధికారాన్ని ఐశ్వర్యాన్ని వర్ణించి పరమాత్మ చెప్పారు. ఈ శ్లోకం ఇక రాబోయే శ్లోకాల్లోనూ మనస్సు స్వాధీనంలో లేకపోతే ఏం చేయాలో చెప్పుతున్నారు. మనస్సులో భావనలు కూడా పరమాత్మ ప్రేరణవల్లనే ఉత్పన్నమౌతాయి. అనే మూల సూత్రానికి ఇప్పుడు పరీక్ష వస్తుంది.

యదా యదాహి దర్మస్య గ్లాని ర్భవతి భారత।
అభ్యుత్థాన మధర్మస్య తదాత్మానం సృజామ్యహం॥

అనే చోట కూడా అధర్మమూ భగవత్కార్యమే అయితే, దాన్ని శాసించుకోడానికి మళ్లీ పరమాత్మ అవతారం ఎందుకెత్తాలి అనే శంక కూడా వస్తుంది. అలాటిదే మనశ్చాంచల్య విషయం కూడా!

ఈ మనశ్చాంచల్యం పరమేశ్వర ప్రేరణయా? దాన్ని మనుష్య ప్రయత్నం వల్ల సరి దిద్దుకోవడానికి వీలౌతుందా? వీలుకాకపోవడం కూడా భగవత్ప్రేరణయేనా? దీనికి అంతెక్కడ!

సర్వేపల్లి రాధాకృష్ణులు మనుష్యుని కుండే అర్హతనూ, అధికారాన్నీ పేకాటతో పోల్చారు. పేకముక్కలు దేవుడిచ్చినవే! వాటిని ఆడే నేర్పు మానవునిది. సరిగా ఆడి గెలిచినా, ఆడడం చేతకాక తగలేసినా, మనుష్యుడిదే ఆ బాధ్యత అన్నారు వారు. కాని సరిగా ఆడే నైపుణ్యాన్నిగాని, చెడగొట్టే అసమర్థతనుగాని మనుష్యుడు జన్మతః పొందిన గుణమేకాని, బజారులో కొనుక్కు తెచ్చుకుని టోపీ లాగా నెత్తిన బోర్లించు కున్నది కాదు గదా! వేదాంతులైతే వాసనలను అంటగట్టుతారు మనస్సుకి, జన్మాంతర వాసనల ప్రాబల్యంవలన కొన్ని సంస్కారాలు అబ్బుతాయి. వాటివల్ల మనస్సులో కొన్ని విషయాల పట్ల, సౌమనస్య వైమనస్యాలు, ఉన్ముఖత్వ విముఖత్వాలూ, మన స్సులో జనిస్తాయి. వాటివల్ల ప్రయత్న శీలత్వం, అలసత్వం మందకొడితనం అలవడు తాయి. అని వారి వాదం. వినడానికి ఆలోచించడానికి అందంగాను సమంజసం గాను, తర్కానికి అనుకూలంగాను ఉంటుంది ఈ వాదం. భగవంతుడు అందఱి ఎడలా సమానంగా కటాక్షిస్తూ ఉంటే ఫలితాల్లో తేడా లెందుకు రావాలంటారు వారు. ఎక్కువ తక్కువలే సృష్టి అంటుంది అమ్మ. కర్మ సిద్ధాంతాన్ని లేవదీసిన వారు వేదాం తులు. ఈ విషయాన్ని లోగడ చర్చించియే ఉన్నాను. ప్రస్తుత విషయం మనస్సును అదుపులో పెట్టుకోవడానికి మనుష్యుడు అధికారి ఔనా కాదా అని.

మనస్సంటే ఏమిటి? మనశ్శాస్త్రజ్ఞులు దాన్ని అనుభవాల పాతర అన్నారు. పుట్టుకతోబాటు మనస్సు కూడ ప్రాప్తిస్తుందా? పుట్టుకతోటే కాదు. కడుపుతో ఉన్న ప్పటి నుంచి అబ్బుతుంది మనస్సు ప్రతి శరీరానికి ప్రహ్లాదుడు, అభిమన్యుడు కడు పులో ఉండగా విని ఎన్నో రహస్యాలు నేర్చుకున్నారు. ఇది ఎలా జరుగుతుంది అని పరిశోధనలు జరుగుతున్నాయి. మనస్సే శరీరంగా రూపొందుతుంది. కనుక ఇందులో వేదవిజ్ఞానం ప్రకారం ఏమీ వింతలేదు.

కేంద్రీకృతమైన మనస్సు వెలిగే దీపాన్ని ఆర్పగలదు. ఊళ్ళను బ్రద్దలు గొట్ట గలదు, మనుష్యులను నిద్రపుచ్చగలదు ఇతర మనస్సులను తన ఇష్టం వచ్చినట్లు త్రిప్పగలదు. ఈ ప్రభావాలు, సిద్ధులు అందఱికి ఎందుకబ్బవు?

'అనుకున్నది జరగదు. తనకున్నది తప్పదు' అన్నది అమ్మ.

తన బుద్ధి తీక్ష్ణంగా ఉండాలని ఎవరి కనిపించదు? తన చేతల్లోనే అంతా

సాధ్యమైతే తాను ప్రధానమంత్రి నౌదామని ఎవరి కనిపించదు? గణితాన్ని ఔపోసన పట్టిన ఘటికుడు రామానుజం ఒక్కడే ఎందుకు కావాలి? కోటి మంది రామానుజాలు ఎందుకు పుట్టలేదు? మహాత్మాగాంధీలు వెయ్యి మంది ఎందుకు పుట్టలేదు? ఒకే పండు నుంచి కోసిన రెండు ముక్కలు ఒకటే రీతిగా ఉండవని రేడియానిక్స్ చెబు తుంది. ఎవని DNA FINGER PRINT వాడిదే? ప్రతి ఇద్దఋ వ్యక్తులకు సామాన్యతా ఉంది విశేషతా ఉంది.

మనస్సును అదుపులో పెట్టుకునే సంకల్పాన్ని కూడా మనస్సే అవధరించాలి; అధిష్ఠించాలి! ఆచరించాలి. మనస్సంటే పరమాత్మే అని యోగవాశిష్టం నిరూ పిస్తుంది. అంటే సంకల్పాన్ని కూడా పరమేశ్వరుడే కటాక్షించాలని అని అంగీకరించక తీరదు.

అంతేకాదు ఆ కటాక్షం లేకుంటే పనులూ జరగవు. దానికి సత్తా లభించదు. ప్రేరణా ఉండదు. ప్రేరణ లేకుంటే ఉద్ధరణా కలగదు. కాబట్టి పైశ్లోకంలో ఎలాఎలా మనస్సు పరిభ్రమిస్తుంటే అలా అలాగే దాన్ని మళ్లించుకు రావాలి అని చెప్పబడింది.

27. ప్రశాంత మనసం హ్యే నం యోగినం సుఖ ముత్తమమ్।
ఉపైతి శాంతరజసం బ్రహ్మభూత మకల్మషమ్॥

తా: ప్రశాంతమైన మనస్సు కలయోగి, ఉత్తమమైన ఉత్కృష్టమైన సుఖాన్ని పొందుతాడు. రజోగుణ ప్రవృత్తి అతనిలో ప్రకోపించకుండా శాంతంగా ఉంటుంది. అతడు అకల్మషమైన పరమాత్మ సరూపస్థితిలో మగ్నుడై ఆనందిస్తాడు.

28. యుంజన్నేవం సదాత్మానం యోగీ విగతకల్మషః।
సుఖేన బ్రహ్మ సంస్పర్శ మత్యన్తం సుఖ మశ్నుతే॥

తా: విగతకల్మషుడూ మనశ్చాంచల్యం లేనివాడూ; అయిన యోగి మనస్సు పరమాత్మతో ఏకభావాన్ని పొందగా నిరంతరమూ సుఖపూర్వకమైన, పరబ్రహ్మ సంస్పృష్టమైన మహదానందానుభూతిని ప్రకృష్టంగా అనుభవిస్తూ ఉంటాడు.

29. సర్వభూతస్థ మాత్మానం సర్వభూతాని చాత్మని
ఈక్షతే యోగ యుక్తాత్మా సర్వత్ర సమదర్శనః॥

తా: తనను సర్వభూతముల యందున్నట్లుగాను, సర్వభూతాలను తన యందు న్నట్లుగాను, యోగయుక్తాత్ముడు ఈక్షిస్తాడు. అట్టి మహాత్ముడు అన్నిచోట్లను నన్నే దర్శిస్తాడు.

వ్యా: తనలో సర్వభూతములనూ ఎలా చూడగలగడం? సూక్ష్మంగా విచారిస్తే ఈ సమస్య తెగిపోతుంది. అమ్మ అన్నట్లు గుడ్డను చూచేటప్పుడు మనకు నూలు జ్ఞప్తికి రాదు. గుడ్డ బాగున్నదా లేదా నేత, మన్నిక, రంగు, వెడల్పు, పొడుగు ఇలాటివే చూస్తారు. దారం విషయం తట్టదు. దారానికి ప్రత్తి, ప్రత్తికి నూలురాట్నం, వడికే మనిషి, ఆ మనిషి పుట్టుపూర్వోత్తరాలు, ప్రత్తి మొక్క, దాన్ని పెంచిన రైతు శ్రమా, మొక్కకు ఆధారమైన భూమి, భూసారం వర్షం, ఇవన్నీ కారణాలే ఔతాయి. ఇంకా లేవదీస్తే పంచభూతాలు విశ్వశక్తులూ అన్నీ ముగ్గులోకి వస్తాయి. అలాగే ప్రతి వస్తువు, ప్రతిజీవి కథానూ. ప్రపంచమంతా ప్రతి వ్యక్తి అయి నిలుస్తుంది.

మన రక్తకణాలను పంచుకొని పుట్టబోయే సంతానమూ, ప్రత్యక్షమై భూత, భవిష్యద్వర్తమానాలను ఏకం జేస్తుంది. కాబట్టి సర్వభూతస్థమాత్మానం, సర్వభూతాని చాత్మని అనే సాంకేతిక పదాలకిదే అర్థాన్ని చెప్పాలి. వ్యష్టిగా వ్యక్తిగతంగా ఇదంతా దూరాన్వయమనిపించవచ్చు.

సముద్ర సంబంధం ప్రతి అలకూ ఉన్నదనే సత్యాన్ని విస్మరించగలిగితే, యోగ యుక్తుడైన జ్ఞాని ఈ వ్యాప్తి లక్షణాన్ని గుర్తించగల సత్యం కూడా దూరాన్వయ మౌతుంది.

30. యో మాం పశ్యతి సర్వత్ర సర్వం చ మయి పశ్యతి।
తస్యాహం న ప్రణస్యామి స చ మే నప్రణశ్యతి॥

తా: ఏ పురుషుడు సర్వత్ర అంటే సర్వభూతాలయందు నన్ను చూస్తాడో, నాలో సర్వమూ చూస్తాడో అతనికి నేను అదృశ్యుణ్ణికాను. నాకతడు అదృశ్యుడూ కాడు.

వ్యా: ప్రాణరక్షణమూ, పరమాత్మ ఈక్షణమూ లేకుండా మనకన్నులూ, మనస్సూ, ఇంద్రియాలూ ఏవీ పని చేయలేవు. ఈక్షణం చూడగలగడానికి హేతువు. ఎవనికి. వాడు శివోహం అని తృప్తిపడడమూ లాగే అవుతుంది. సముద్రంలో పడే అర్హత తనకు మాత్రమే దక్కుతున్నదని ప్రతి నదీ అనుకున్నట్టే ఉంటుంది. యోగికి ఈ రకమైన ఇఱుకులాట ఉండదు. అన్ని చోట్ల సూర్యతేజస్సు ఎండనే చూస్తాడు. అన్నిచోట్లా భగవంతుడే కనిపిస్తాడు. అదృశ్యుడు కాడు. అలాగే యీశ్వరుడనయిన నేను కూడా ఆ ఏకదర్శికి ప్రతిచోటా కనబడకుండా ఉండను. అంటే సర్వమూ అంటే ఏకత్వమనీ, ఏకత్వమంటే సర్వమూ అనీ అర్థం.

31. సర్వభూత స్థితం యో మాం భజ త్యేకత్వ మాస్థితః।
సర్వథా వర్తమానోఽపి స యోగీ మయివర్తతే॥

తా: సర్వభూతస్థితుడనైయున్న నన్ను ఏకీభావంతో కూడుకొని యున్నవాడై ఎవడు భజిస్తాడో సర్వధా ప్రపంచంతో వర్తిస్తున్నవాడైనప్పటికీ ఆ యోగి నా యందే వర్తిస్తున్నవాడౌతాడు.

వ్యా: పరమాత్మ యొక్క ఏకత్వం, బహుత్వం, నిత్యత్వం అన్యోన్యత్వం, ప్రపంచమయత్వం, త్రికాల నిత్యత్వములను చక్కగా వర్ణించిన గంభీరశ్లోకమిది. ఏకత్వం అంటే సృష్టితో ఏకత్వం బహుత్వం అంటే సృష్టిలో బహుత్వం, నిత్యత్వం అంటే భూతభవిష్య ద్వర్తమానాతీత్వం, ఎన్నో అర్థాలను స్ఫురింపజేసే స్ఫటిక పంజరం ఈ శ్లోకం. 'అణోరణీయాన్ మహతో మహీయాన్' వంటిది.

32. ఆత్మౌపమ్యేన సర్వత్ర సమం పశ్యతి యోఽర్జున!।
సుఖం వా యది వా దుఃఖ స యోగీ పరమో మతః॥

తా: అర్జునా! తనకు లాగానే దుఃఖంగాని సుఖంగాని సర్వభూతాలకు సమానమైన దృష్టితో ఎవడు చూడగలడో ఆ యోగి ఉత్తమోత్తముడని చెప్పబడతాడు.

వ్యా: తన పదవి ఇంద్రవైభవం – తన చావులోక ప్రళయంగా అనుకునే మనస్సులు చాలా ఉన్నాయి. ఇతరుల బాధలను గురించీ, ఇతరుల గొప్పతనాన్ని గూర్చి వచ్చే వార్తలు సాధారణంగా ఎవరికీ రుచించవు. ఒకడిని చంపి తను బాగుపడదామనుకునే నేటిలోకం వరవడిలో ఇతరుల సుఖదుఃఖాలను పట్టించుకునేవాళ్ళు ఎంత మంది ఉంటారు? పైగా అమ్మలాగా ఇతరుల జాడ్యాలను కూడా పైన వేసుకుని బాధపడేవాళ్ళు వేయింటికొక్కడూ ఉండడు.

"జబ్బులను తప్ప ఎవరివీ తీసుకోవడం లేదుగా" అంది అమ్మ.

అర్జున ఉవాచ:

33. యోఽయం యోగ స్త్వయా ప్రోక్తః సామ్యేన మధుసూదన!।
ఏతస్యా హం న పశ్యామి చంచలత్వాత్ స్థితిం స్థిరామ్॥

34. చంచలం హి మనః కృష్ణ! ప్రమాథి బలవద్దృఢమ్।
తస్యాహం నిగ్రహం మన్యే వాయో రివ సుదుష్కరమ్॥

తా: మధుసూదనా! యోగమనీ సామ్యభావమనీ నీవు చెప్పిన సాధన క్రమమంతా చంచలమనస్కుడనైన నాకు కొఱుకు బడకుండా ఉంది. ఏ సాధన అయినా మనః స్థైర్యంతోనే చేయాల్సిఉంది. ఆ మనస్సు మహా చంచలమైనది. ఇంద్రియాలతో కలిసి కుట్రలు పన్నుతుంది. మహాబలవంతమైనది, గాలిని బంధించడం ఎంత కష్టమో అంతకష్టమైన పనే మనస్సును బంధించడం కూడా?

వ్యా: ఈ శ్లోకాలకు వ్యాఖ్యానం వ్రాయడం కంటె అమ్మ వాక్యాలనుదహరించడమే సమంజసమనిపిస్తున్నది.

"జగన్మాతను వర్‌షిప్ చెయ్యాలంటే అచంచలంగా ఉండడమెట్లాగా?"

"ముందు ఈవర్‌షిప్ చెయ్యడానికి ప్రేరణ ఏది కలిగించిందో అదే చేస్తుంది"

"మానవులు చంచల స్వభావులు కదమ్మా"

" చంచల స్వభావం కూడా అందులోదే కదా! జగన్మాతే అమ్మే అన్నీ అనుకుంటున్నప్పుడు, – ఇక ఇందులో నీ ప్రమేయం ఏముందీ? చంచల స్వరూపంగా ఉన్న అమ్మ ఎప్పుడో అచంచలంగా చేసుకుంటుంది...

ఈ నామాల్లో కూడా అన్నారే... చపలాయై నమః చంచలాయై నమః"

"నువ్వేమీ చేయవద్దు నాయనా!., ఆదైవం ఏం చేయిస్తే అది చెయ్యి."

శ్రీ భగవానువాచ

35. అసంశయం మహాబాహో! మనో దుర్నిగ్రహం చలమ్।
అభ్యాసేన తు కౌన్తేయ! వైరాగ్యేణ చ గృహ్యతే॥

కృష్ణపరమాత్మ చెబుతున్నాడు

మహాబాహూ! అర్జునా! మనస్సు చంచలమైనదీ, నిగ్రహింపరానిదీ అనే మాటలో ఏమీ సందేహం లేదు. కాని అభ్యాసం చేతా వైరాగ్యం చేతా దాన్ని నిగ్రహించాలి.

12వ అధ్యాయం 9వ శ్లోకంలో కూడా ఈ మాట వస్తుంది.

అథచిత్తం సమాధాతుం నశక్నోషి మయి స్థిరమ్।
అభ్యాస యోగేన తతో మా మిచ్ఛాప్తుంధనంజయ!॥

అర్జునా! నీవు నా మీద నిశ్చలంగా మనస్సు నిలపడానికి శక్తిలేనివాడవయితే అభ్యాసయోగం చేత నన్ను పొందడానికి ఇచ్ఛింపవలసినది అని అర్థం.

వ్యాఖ్యానకర్తలు భగవంతుని నామగుణ శ్రవణకీర్తన మనన ధ్యాననిదిధ్యాసములలో మగ్నులై దినదినమూ ఉండడమూ, భగవత్ప్రాప్తి విషయికమైన శాస్త్రముల పఠన పాఠక్రమమునందాసక్తి కలిగిన చేష్టలను చేయడమే అభ్యాసమని నిర్ణయించారు.

నిత్యమూ ఆచార్యులకు భిక్షలు పెడుతూ పురాణ సంకీర్తనంచేస్తూ , ముక్కు మూసుకుని ప్రాణాయామంచేస్తూ, నశ్యం పీలుస్తూ, నోరు కదిపితే బారెడు బారెడు శాస్త్రవాక్యాలను గుప్పిస్తూ ఉండే మహానుభావులు కూడా పగలల్లా స్వార్థంలో మున

కలువేస్తూ, కోర్టుకెక్కి అబద్ధాలాడుతూ, అబద్ధాలాడించడం, హత్యలు చేయడం ఆకతాయి పనులన్నీ చేయడం, సాయంత్రం ఇంటికి చేరగానే ఏడుకొండలవాడిని క్షమాపణ వేడుకోవడం, ఇదంతారోజూ మనం చూస్తున్నదే. ఇది అభ్యాసంలేక వచ్చిన పరమార్థమా? లేక అభ్యాసంచేస్తూ కూడా వచ్చే పరిణామమా? అని ఆలోచిస్తే దానికి దైవానుగ్రహం లేకపోవడమే అని తోస్తుంది. త్యాగం సమాజం నుండి ఎన్నడో అదృశ్యమయింది. నిజమైన భక్తికి దైవీయ సంపత్తి పునాది. పరిసరాలు ప్రబలమైన పోషకాలు. ఈ బీజాలులేని వ్యక్తి సినిమా తారకాగలడే కాని, సహజ భక్తుడు కాలేదు.

మనస్సును మార్చలేని అభ్యాసం పదేపదే ఎక్కాలను తప్పుగా చదివే బాలకుడే. ఎన్నాళ్ళు చదివినా ఎన్నిసార్లు చదివినా, 2 x 2 = 5 కానేరదు. తప్పు తప్పే. దైవానుగ్రహం తప్పులను సరిచేయడమెలాగో, తప్పులు చేయడం కూడా అంటుంది అమ్మ. అభ్యాసం కూసువిద్య అని తెలుగులో వాక్యముంది. గణనీయం కాని విద్యను కూసువిద్య అంటారు, భజన పార్టీలకు గంటకు ఇంతని డబ్బు రేట్లు ఉంటాయి. వాళ్లకు ఎంత పెద్దగా అరిస్తే అంత గొప్పగా భజన చేశారని కొలతబద్ద ఉంది. అలాంటివే కూసు విద్యలంటే భజనకీర్తనలు పాత వైనా ఆవేశంతోపాడితే ఎదుటివాళ్లను కదిలిస్తుంది. నిత్య నూతనంగా ఉంటుంది. అభ్యాసం అంటే నిత్యనూతనత్వం రోకంటి దంపు కాదు. నిత్యనూతనత్వం ఉట్టిపడేలాగా అభ్యాసం చేయమని పరమాత్మ చెప్పిన మాటకర్థం. అటు వంటి మనస్సాధననే అభ్యాసయోగమంటారు. దాన్నే అనుభూతి అని కూడా అంటుంది అమ్మ.

36. అసంయతాత్మనా యోగో దుష్ప్రాప ఇతి మే మతిః।
వశ్యాత్మనా తు యతతాశక్యోఽ వాప్తు ముపాయతః॥

తా: అసంయతాత్ముడైన వానికి, యోగం ప్రాప్తించదని నా అభిప్రాయం. మనస్సు స్వాధీనంలో ఉన్న మహనీయుడు ప్రయత్నించి ఉపాయంవల్ల యోగం పొందదగిన వాడౌతాడు.

వ్యా: చాలా ముఖ్యమైన శ్లోకం. ఇందులో పరమాత్మ వాడిన అతి ముఖ్యమైన పదాలున్నాయి. అసంయతాత్మనా, యోగః, దుష్ప్రాప, వశ్యాత్మనా, యతతా, ఉపాయతః. ఇవి ఆ పదాలు.

ఏదైనా ప్రయోజన సిద్ధికి మనిషి ప్రయత్నం అవసరమా కాదా? అని ప్రశ్న.

'తను చేసే పనులలో ఏదో ఉన్నదనుకోకపోతే బ్రతకలేదు. మిగిలింది అదొకటే. తాను చెయ్యకపోయినా చేశాననుకోవడం' అన్నది అమ్మ, అంతేకాక తనకు కలిసివచ్చిందానికి కర్త తాననీ కలిసిరాని దానికి కర్త భగవంతుడు అని అనుకోకుండా

అంతటికి తానే కర్తననుకోమని కాని అనుకోవద్దని కాదని అమ్మ చెప్పింది. అంతేకాక సర్వానికి అంటే మంచికీ చెడుకూ ప్రేరణనిచ్చేది భగవంతుడు అనీ, నీదేమీ లేదనీ చెప్పింది.

కాని పైమాటలకు చివరకు మిగిలే అర్థం ఏమీ చేయకుండా ఉండే అమనస్క యోగం, అంటే నిష్కామయోగం కనుక, అది వాసనలేవీ మిగిలి ఉండని పక్వ ఫల దశకనుక కాకతాళీయ న్యాయంగా రాలే పక్వఫలదశ నిశ్శేష సంపూర్ణదశ అవుతుంది. పతంజలి చెప్పిన యోగశ్చిత్త వృత్తి నిరోధః అవుతుంది. అంటే అదే చరమోపాయమవుతుంది.

పక్వతకూ, కాలగణనానికీ, కారణ పరిణామాల విడిపోవడానికి, అమ్మ చెప్పిన మాటలకూ, వేద వచనాలకు చక్కని సమన్వయం కుదురుతుంది.

అర్జున ఉవాచ

37. అయతిః శ్రద్ధయోపేతోయోగా చ్చలిత మానసః
అప్రాప్య యోగ సంసిద్ధిం కాం గతిం కృష్ణ! గచ్ఛతి॥

అర్జునుడు పలికెను

తా: తగినంత ప్రయత్నంలేని కారణంచేత, యోగి శ్రద్ధావంతుడైనప్పటికీ మరణ కాలాన చలించిన చిత్తంకలవాడు కావడంచేత యోగసిద్ధి పొందజాలని వాడై కృష్ణా! ఏ గతిని పొందుతాడు.

వ్యా: భ్రష్టుడైన యోగి ఏ గతికి పోతాడు?

38. కచ్చిన్నో భయ విభ్రష్ట శ్ఛిన్నాభ్ర మివ నశ్యతి।
అప్రతిష్ఠో మహాబాహో! విమూఢో బ్రహ్మణః పథి॥

తా: గొప్పబాహువులు కలకృష్ణా! అలా యోగసిద్ధి అనుకున్న ప్రకారంగా సిద్ధించని యోగి పగిలిపోయిన మబ్బు తునకలాగా ఇహానికి పరానికి భ్రష్టుడై భగవత్ప్రాప్తిని పొందలేనివాడై, విమూఢుడై. నష్టభాగ్యుడై నశిస్తాడా?

వ్యా: భ్రష్టయోగికి ఛిన్నాభ్రత్వం తప్పదా! లాభంలేదు సరికదా! నష్టం కూడా రాసిపెట్టి ఉందా?

39. ఏతంమే సంశయం కృష్ణ! ఛేత్తుమర్హ త్యశేషతః।
త్వ దన్య స్సంశయ స్యాస్య ఛేత్తా న హ్యుపపద్యతే॥

తా: ఓ కృష్ణ! అశేషంగా ఈనాసంశయాన్ని ఛేదించి వేయడానికి నీవే తగినవాడవు. ఇంకెవరూ దీన్ని తీర్చలేరు.

శ్రీ భగవానువాచ

40. **పార్థ! నైవేహ నాముత్ర వినాశ స్తస్య విద్యతే।**
నహి కళ్యాణ కృ త్కశ్చిత్ దుర్గతిం తాత! గచ్ఛతి॥

తా: పార్థా! అటువంటి యోగికి ఈలోకంలోగానీ పరలోకంలోగానీ, వినాశం కలుగదు. కల్యాణాత్మకమైన కర్మలను చేసేవారెన్నడూ దుర్గతికి పోరు బావా!

41. **ప్రాప్య పుణ్యకృతాం లోకా నుషిత్వా శాశ్వతీః సమాః।**
శుచీనాం శ్రీమతాం గేహే యోగభ్రష్టోఽభిజాయతే॥

తా: చేసిన పుణ్యం ఎన్నడూ వృథా కాదు, దానివలన శాశ్వతీ సములైన లోకాలను (అనుభవించి), విడిచిపెట్టి, యోగభ్రష్టుడు శుచిమంతులు శ్రీమంతులు అయిన వారి ఇండ్లలో జన్మమెత్తుతాడు.

వ్యా: యోగభ్రష్టుడు అథోగతిని పొందడం తప్ప క్రియలనుచేసే వానికి ఎన్నడూ దుర్గతి లేదు అని సమాధానం. 'అందఱికీ సుగతే' అని అమ్మ. ఈ శ్లోకంలోనూ తరువాత శ్లోకంలోనూ, చేసిన పుణ్యం వలన యోగి పరమాత్మకు మఱింత సన్నిహితంగా అవుతాడే కాని దూరగుడు కాడు అని పరమాత్మ బదులు చెప్పారు. అంటే ఈ పరిణామచక్రం అన్నినేనులు నేనయ్యేదాకా తిరుగుతూనే ఉంటుంది అని అభిప్రాయం.

యోగిగా పుట్టిన వాడూ పరమాత్మయే అతడు చేసిన పుణ్యకార్యాలూ పరమాత్మయే! పుణ్యఫలితమైన లోకమూ పరమాత్మయే. కాని పూర్ణత్వం లభించేదాకా అపూర్ణత్వాన్ని నింపుకుంటూ పోవడం సృష్టి సూత్రం. యోగి చేసిన అపూర్ణకర్మను పూరించడానికి విశ్వంలో మఱొక చోట మఱొక క్రియ జరుగవలసి ఉంది. దీన్ని పూరణ క్రియాయోగం (Law of compensation) అందాం. దీని ప్రకారం యోగి క్రియలోని అపూర్ణత్వం మఱొక చోట శుచిమంతుని ఇంట్లో ఇంకో జన్మగా రూపొందుతుంది. మొదటి అపూర్ణత్వానికి తరువాత పూరణక్రియా కలాపానికి పూర్ణక్రియా యోగమే సంబంధం. ఈ క్రియాకలాపాన్ని చేసే వాడూ చేయించే వాడూ, ఆ క్రియాకలాపం అన్నీ పరమాత్మ అంశాలే. ఈ అంశాల పూర్ణత్వాన్నే గుర్తించాలి. కాని ప్రత్యేకించి వ్యాఖ్యానించకూడదు.

42. **అథవా యోగినా మేవ కులే భవతి ధీమతామ్।**
ఏ తద్ధి దుర్లభతరం లోకే జన్మ యదీదృశమ్॥

తా: అథవాధీమంతులైన యోగుల కులంలోనే ఆజన్మ కలిగిందనుకుందాం. ఈ లోకంలో ఈదృశమైన జన్మకలగడం దుర్లభతరమైన సంఘటన అని తెలుసుకో! ఈ శరీరయాత్రలోనే బ్రాహ్మణులకు ద్విజులు అని నామకరణం చేశారు.

వ్యా: అండజాలు రెండుసార్లు శరీరధారణచేసి ద్విజత్వాన్ని పొందుతాయి. గ్రుడ్డుగా ఒకసారి తల్లిగర్భం నుంచి వెలువడి గ్రుడ్డు నుంచి పిల్లగా జన్మించి పక్షి రెండు జన్మలు కలదౌతుంది. ఉపనయనాత్పూర్వం ఒక జన్మలోను, ఉపనయ నానంతరం ఒక జన్మలోనూ ఉంటాడు కనుక ద్విజుడు కూడ ఒకే దేహంలో రెండు జన్మలు కలవాడౌతాడు, అన్ని జన్మలూ ఎత్తేవాడు పరమాత్మయే. అన్ని ఆ కారాలు ఆయనవే కనుక పరమాత్మ నిరాకారుడు.

ఎలెక్ట్రిసిటీ ప్రవాహంలో తీగెలోని ఒక ఎలెక్ట్రానును మఱొకటి నెట్టుతుంది. అన్ని ఎలెక్ట్రానులూ ఒకదాన్ని మఱొకటి తమస్థానాలను విడవకుండా నెట్టుకోవడం వలన శక్తి విక్షేపానికి అవి కారణమౌతాయి. పడవకు తెడ్లు వేసే వాళ్లు తమ కూర్చొన్న చోట్లను విడవకుండా తెడ్లనులాగి నీటి గుంజుడులోని అవరోధక శక్తితో పడవను ఒక చోట నుండి మఱొక చోటికి చేరేలాగా చేస్తారు. ప్రతి జీవీ పడవ నడిపే కళాసుల్లా, తీగెలోని ఎలెక్ట్రాను. ల్లాగా తామున్న చోట్లను వదల కుండానే చలనానికి శక్తి విక్షేపా నికి కారణమౌతున్నాడు. పడవ మనిషి శరీరం కాదు. సంసార యాత్రయే, సంసార యాత్ర అంటే పరమాత్మయే, 'అజాయ మానో బహుథా విజాయతే' అన్ని కాలాల లోను, అన్ని దశల పరిణామంలోను, తానుగా మిగిలిపోతున్నాడు. అంటే అజాయ మానత్వం బహుథా విజాయ మానత్వంగా విస్తరిస్తున్నది. ఒక చోట నీటి మట్టంలో కలిగిన అల, ఊపువల్ల, మఱొకచోట తరంగంగా పైకి లేవవచ్చు. అది మొదటి అలకు మఱో జన్మం కాజాలదు. ఊపుతో పైకి లేచిన అల ఆ ఊపుని మట్టు బెట్టి మఱో అల లేవడానికి కారణం కాకుండా సముద్రంలో కలిసిపోవడం దుష్కరం, యోగి అయిన వాడు యోగ భ్రష్టుడై శ్రీమంతులూ ధీమంతులూ అయిన యోగి కుటుం బాల్లో పుట్టడం కూడా అలాంటిదే అని పరమాత్మ సెలవిచ్చారు.

43. తత్ర తం బుద్ధి సంయోగం లభతే పౌర్వదైహికమ్।
యతతే చ తతో భూయః సంసిద్ధౌ కురు నందన!॥

తా: కురునందనా! అర్జునా! అక్కడ తని పూర్వదేహానికి సంబంధించిన బుద్ధి సంయోగం కలుగుతుంది దాని సహాయంతో అతడు లెస్సగా ప్రయత్నించి అతడు సిద్ధిని పొందుతాడు.

వ్యా: పౌర్వదైహికమైన బుద్ధి సంయోగము ప్రేరణ వలన బీదల ఇంట్లో పుట్టినప్పటికి పూర్వజన్మంలో భ్రష్టయోగి అయినప్పటికి ఈ జన్మంలో అతడు చేసే పనులు పరమాత్మను చేర్చే మార్గంలోనే నడిపిస్తాయి.

పరమేశ్వరేచ్ఛగాని పరాపరప్రేరణగాని ఎలా పరిణమిస్తుందో ఎవనికీ గణిత పద్ధతిలో తెలియదు. ఈపని చేస్తే ఈ ఫలితం వస్తుందని నిక్కచ్చిగా చెప్పలేం, అలా

ఆశించడం మానవత్వం. పరమేశ్వరుడు కొంత సేపు ఒడ్డు మీదనిలిచి ఆడుకుంటాడు. కొంత సేపు నీటిలో ఈదుతూ ఆడుకుంటాడు. ఏది జరిగినా పరమేశ్వరేచ్ఛయే అలాగా రూపొందింది అని అనుకోమన్నది అమ్మ. అలాంటిదే బుద్ధిలో మెటిసే పూర్వ దైహిక బుద్ధి వృత్తాంతాలు ప్రభావాలు కూడా.

44. పూర్వాభ్యాసేన తేనైవ హ్రియతే హ్యవశోఽపి సః।
జిజ్ఞాసు రపి యోగస్య శబ్ద బ్రహ్మాతి వర్తతే॥

తా: పూర్వాభ్యాసం వలన అవశుడైయే, అతడు యోగంవైపునకు లాగ బడిన వాడౌతాడు. యోగ జన్య సంస్కారము దానిపని అది చేస్తుంది. ప్రేరణ కలిగిన మనస్సు యోగ మార్గంలో ప్రవర్తిస్తాడు. వేదము చెప్పిన కర్మ ఫలాన్ని కూడ అతిక్రమించి పైకి వెళ్తాడు.

వ్యా: జిజ్ఞాసువు అంటే సన్యాసి అని లర్ధము.

45. ప్రయత్నా ద్యతమానస్తు యోగీ సంశుద్ధ కిల్బిషః।
అనేక జన్మ సంసిద్ధ స్తతోయాతి పరాంగతిమ్॥

తా: మోక్షమునకై ప్రయత్నం చేస్తున్నాడు. స్వయంగా కడిగివేయబడిన దోషాలు నశించినవై తలవెత్తడం లేదు. ఎప్పుడు పుట్టినా సంస్కారాలే ఆర్జితాలౌతున్నాయి. సిద్ధావస్థను పొంది చివరకు మోక్షాన్ని కూడా అతడు పొందుతాడు.

46. తపస్విభ్యోఽధికో యోగీ, జ్ఞానిభ్యోఽపి మతోఽధికః।
కర్మిభ్య! శ్చాధికో యోగీతస్మా ద్యోగీ భవా ర్జున!॥

తా: తపస్వుల కంటెను, జ్ఞానుల కంటెను,యోగి అధికుడు. అగ్నిహోత్రాది కర్మలను చేసే వానికంటె కూడ యోగియే అధికుడు. అందుచేత అర్జునా! నీవే యోగివిగా అయిపో!

47. యోగినా మపి సర్వేషాం మద్గతే నాంతరాత్మనా।
శ్రద్ధావా న్భజతే యో మాం స మే యుక్తతమో మతః॥

తా: సమస్త యోగుల కంటె, వాసుదేవుడ నైన నాయందు సమాహితమైన అంతఃకరణం లగ్నం చేసి నన్నే శ్రద్ధతో కొలిచే యోగులే యుక్తతములని నామతం.

ఇది శ్రీమన్ మాతృగీతలోని ఆత్మ సంయమ యోగను షష్ఠోధ్యాయము.

మాతృగీత

విజ్ఞానయోగము

ఏడవ అధ్యాయము

భగవద్గీతలో మొదటి ఆఱు అధ్యాయాలు, తత్త్వమసి మహావాక్యంలో త్వం పదార్థాన్ని గూర్చి బోధిస్తాయి. 7వ అధ్యాయం మొదలు 14వ అధ్యాయం వఱకు తత్పదార్థనిష్ఠమూ ఉపాస్య ప్రధానమూ అయిన ద్వితీయ షట్కం ఆరంభమౌతున్నది. ఇది పూర్వవ్యాఖ్యాతల మతం.

ప్రపంచానికి, పరమాత్మకు అభేదం పాటించని ఆ విషయం అంతగా ప్రాధాన్యం కాదు.

శ్రీ భగవానువాచ

1. **మయ్యాసక్తమనాః పార్థ! యోగం యుంజ న్మదాశ్రయః।**
అసంశయం సమగ్రం మాం యథా జ్ఞాస్యసి తచ్ఛృణు.

తా: పరమాత్మలో జీర్ణించిన ఆత్మకల వానికి పరమాత్మ మీదనే ఆసక్తి నిత్యం లగ్నమై ఉంటుంది. పరమాత్మ యందేనియుక్తుడై ఉంటాడు. అట్టివాడు సంశయం లేకుండా వన్ను-పరమాత్మను-సమగ్రంగా ఎలాగా తెలుసుకోగలుగుతాడో అదంతా చెబుతా విను.

2. **జ్ఞానం తేఽ హం సవిజ్ఞానం ఇదం వక్ష్యా మ్యశేషతః।**
యత్ జ్ఞాత్వా నేహ భూయోఽ న్య జ్ఞాతవ్య మవ శిష్యతే॥

తా: దేనిని తెలుసుకున్న తరువాత ఇక తెలుసుకో దగ్గదేదీ మిగిలి ఉండదో అటువంటి జ్ఞానాన్నిబోధిస్తాను.

3. **మనుష్యాణాం సహస్రేషు కశ్చి ద్యతతి సిద్ధయే।**
యతతా మపి సిద్ధానాం కశ్చి న్మాం వేత్తి తత్త్వతః॥

తా: వేయి మంది మనుష్యులలో ఎవడో ఒకడు భగవత్సిద్ధికై ప్రయత్నిస్తాడు. వాళ్లలో కూడా ఏ ఒకడో నన్ను తత్త్వతః తెలుసుకుంటాడు.

4. **భూమి రాపో నలో వాయుః ఖం మనో బుద్ధి రేవ చ।**
అహంకార ఇతీయం మే భిన్నా ప్రకృతి రష్టధా॥

అర్జునా! నాప్రకృతి విభూతులు, భూమి, నీరు, అగ్ని, గాలి, ఆకాశం, మనస్సు, బుద్ధి, అహంకారం, అనే రూపాలతో ఎనిమిదిగా ఉన్నాయి.

5. అపరేయ మిత స్త్వన్యాం ప్రకృతిం విద్ధి మే పరాం।
జీవ భూతాం మహాబాహో! యయేదం ధార్యతే జగత్॥

తా: మహాబాహూ! పైన చెప్పిన అష్టవిధాలుగా, ఉండేదే, భేదశీలమైన నా అపరారూపము. అనగా జడప్రకృతి – దీనికి ప్రతిరూపమైన రెండోది పరారూపం – అంటే చేతనప్రకృతి – ఈచేతన ప్రకృతిచేతనే జగత్తంతా ధరించబడి ఉంది.

వ్యా: జగత్తులో కనిపించే సమస్త వస్తువులు జీవులు, శక్తులు, ఒకానొక నిర్దిష్ట మైన ప్రణాళిక ప్రకారం ఏదో మహాబుద్ధి దీర్ఘంగా ఆలోచించి, నియమబద్ధంగా చేసి ఉన్నట్లు కన్పిస్తాయి. అవసరాన్ని బట్టి మనుష్య బుద్ధిలాగా వాటి కార్యసూత్రాలు ఎందుకు మారవో తెలీడం లేదు – మూల ధాతువులు (ఇప్పుడు 106) ఒకానొక పథకంలో ఏర్పాటై ఉన్నాయి. దానినే Periodic table అన్నారు. ఈపర్యదిక పట్టిక లోని ధాతువులు వాయువులు కలిసి పరస్పరంభిన్న భిన్నరీతులుగా సమ్మేళనం కావడంవల్లనే లోకంలో మనకు కన్పించే వస్తుజాలం ఏర్పడుతుంది. అలాగే భూమ్యా కర్షణ శక్తి, చుంబక శక్తి, విద్యుచ్చుంబక శక్తి, చిచ్చేతన శక్తి, రేడియోధార్మికశక్తి, ఉష్ణత, కాంతి, ఇవన్నీ కొన్ని నిర్దిష్టమైన నియమిత సూత్రాలకు లోబడి పని చేస్తున్నాయి. ప్రకృతి వ్యవస్థ, ఇంత వఱకు మాత్రమే మానవమేధకు అందుబాటు లోకి, అవగాహనలోకి వచ్చింది, ప్రకృతి. కాని ప్రకృతి శక్తుల స్తరాన్ని అతిక్రమించి అంతఃకరణ ప్రదేశంలోకి ప్రవేశించినప్పుడు, మానవ బుద్ధికి అందు బాటులోనికి రాని పరిణామాన్ని, పొందింది. మనస్సు వఱకు మనం చేతులు జాచనే అక్కఱలేదు. ప్రాణ శక్తి, రూపాన్ని ఎత్తి వేయి తలల నాగేంద్రుడై విహరించ సాగేటప్పుడు మానవ బుద్ధి దాని దర్శనానికి కూడా భయపడుతుంది. ప్రాణాన్నిమించింది మనశ్శక్తి, మన శ్శక్తిని మించినది ఆత్మశక్తి. వీటన్నిటి కూడలియే పరాశక్తి, పరా శక్తియొక్క స్థూల రూపమే. ఈమహా సంసారం.

6. ఏత ద్యోనీని భూతాని సర్వాణీ త్యు పధారయ।
అహం కృత్స్నస్య జగతః ప్రభవః ప్రళయ స్తథా॥

తా: ఈబాహ్యాంతః ప్రకృతులు రెండూ సమస్త భూతాలకు జన్మస్థానాలని తెలుసుకో! సమస్త జగత్తుకు, నేను ప్రళయాన్ని ఎలాగో, ప్రభవాన్ని కూడా అలాగే!

వ్యా: పరాశక్తియే జగద్యోని అనిపై శ్లోకంలో చెప్పబడింది. ఆంతరికమైన

యంత్రాంగంతో, బాహిరమైన యంత్రాంగం కూడా, సృష్టి ప్రణాళికకు అవినాభావ సంబంధంతో ఉన్నట్లు పైన చెప్పబడింది. బాహ్యాంతరాల సంబంధ సన్నివేశాలు కలిగి మానవబుద్ధిని భ్రమింపజేస్తుంటాయి. భ్రమయే నిజమనిపిస్తుంటుంది. ఒక వస్తువే ఇంకేదోగా పరిణమించి రెండు రకాలుగా మనకు కనపడుతుంది. రెండేం? లెక్క లేనన్ని రకాలుగా కనిపిస్తుంది. విత్తును తీసుకోండి, చెట్టు కంటె భేదంగా కని పిస్తుంది. అదే మొక్క అవుతుంది. మొక్క ఇంకా పెద్దదై చెట్టవుతుంది. అదింకాపెద్దదై మ్రాకవుతుంది. మ్రాకుమోడవుతుంది. ఒక విత్తు చెట్టు ఆకారం దాల్చి బహు బీజయోని అవుతుంది. ఇది వ్యాకోచమార్గం సృష్టికి.

దీనికి వ్యతిరేక మైనది సంకోచమార్గం. విస్తరించి ఉన్నమ్రోదును, బహువ్యాప్తి చెందిన దాని ఆకులు, కొమ్మలు, ఒరపిడిని, కార్చిచ్చునూ వెదుక్కుంటూ వెళ్ళి నీళ్ళలో కలిసి, ముఱుగూ, క్రుళ్లాగా మారి, భూగర్భంలోని కుంపటిలో దగ్ధమై, నుసియై, మసిఐ, గాలిలో గాలిగా, నీటిలో నీరుగా, లవణాలలో లవణాలుగా కలిసి, తేజస్సులో తేజస్సుగా, ఆకాశంలో ఆకాశంగా కలిసి ప్రకృతి యై ఏర్పడిన అన్నిభాగాలలోనూ అన్ని భాగాలూ సర్దుకుంటాయి. మార్పును చూస్తూ మనస్సు వెనక్కు మిగిలి పోయి నట్లే అనుకుంటూ ఈ జరిగిందంతా ఎవరి పని అని తన్నుతానే ప్రశ్నించుకుని, జరిగిందీ, జరిపిందీ, తెలుసుకున్నదీ, అంతా తనే ఐ తనతోతనే దాగుడు మూతలాడు కుంటున్నానని తెలుసుకుంటుంది ప్రకృతి.

ఏ ఇంజనీర్లూ, ఏవిజ్ఞాన ప్రయోగాలూ, పరిశోధనలూ, పరీక్షలూ, తనిఖీలూ, లేకుండా, తప్పు జరగకుండా, ప్రకృతి యంత్రాంగం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తు న్నది. దాన్ని అర్థం చేసుకోబోయి మనమే తప్పులు చేస్తున్నాము.

ఈ యంత్రాంగానికి కావలసిన నీరూ, నూనె, వేడి, లూబ్రికెంట్సు, అన్నింటిని, సూర్యుడూ, చంద్రుడూ, వాయువూ, ఆకాశం సమకూరుస్తూ, నోటిదూకుళ్లు, పోట్లా టలు, లేకుండా విశ్వసంసారాన్నినడుపుతున్నాయి. మన సూర్య కుటుంబాల లాంటి విశ్వకూటాలు లెక్క కుమించినవి ఉన్నాయి బ్రహ్మాండంలో, ఈ విశ్వచేష్టకు వెనకాల మనస్సంకల్పం ఉండాలా అని ఆలోచిస్తే, బహుముఖాల నుంచి సమాధానాలు వస్తాయి.

మనిషికి మనిషి ఆకారంతోటే బిడ్డపుడతాడు. బాదం కాయను మొలేస్తే బాదంచెట్టే అవుతుంది. కాకి గ్రుడ్డు నుంచి కాకిపిల్లే పుడుతుంది. కొన్ని కొన్నిపాళ్లతో నియతమైన ఒత్తిడి, వేడిపాళ్లతో ప్రధాన ధాతువుల సంయోగమైతేనే తప్ప తక్కిన మిశ్ర ద్రవ్యాలు తయారు కావు. భూమ్యాకర్షణ శక్తి, విద్యుచ్ఛక్తి కాంతికిరణాలు, కిరణాలు,

ఉష్ణత, శైత్యము, ఇవన్నీనియతమయిన సూత్రాలకులో బడిపనిచేస్తున్నాయి. నీరు పల్లానికే ప్రవహిస్తుంది. నిప్పునింగికేలేస్తుంది. ఈనియమాలన్నీ వాటంతట అవే ఏర్పాటయ్యాయనడానికి వీల్లేదు. అయితే ప్రకృతిలో మనకు కన్పించే కల్లోలాలకీ, వఱదలకీ, వఱపులకూ, అగ్నిప్రమాదాలకు కారణమేమిటని ప్రశ్నిస్తే స్వార్థపరత్వంతో కూడుకున్న మనస్సులతో ఇల్లు దాటి బయటి ప్రపంచంలోని అవసరాలను గుర్తించ లేని భావనలతో నిండిన సమాధానాలే మనకులభిస్తాయి. మానవ జాతి బాగే నేడు టెక్కెంగా ఎగురుతున్నది. సృష్టి ఎలా తగలడ్డా ఎవరికీ పట్టదు.

పుట్టుకకు చప్పట్లు కొడతాం. గిట్ట డానికి నోరుమోదుకుంటాం, జననమర ణాలు రెండూ ఒకే పాత్రధారి చేస్తున్నఅభినయాలని. గుర్తించం. అమ్మప్రలయం అనేది జగత్తుకు లేదంటుంది. ప్రభవాన్ని మ్రింగేసేది ప్రళయ మైతే ప్రళయాన్ని మ్రింగేసేది ప్రభవంకాదా! ఈరెండూ అన్యోన్యభుక్కులు, వీటిభోజన సామగ్రియే ప్రపంచం భోజనాన్ని వడ్డించేది అమ్మ- విశ్వజనని, గుర్తించే వాళ్ళకు అమ్మా ఉంది. ప్రపంచమూ ఉంది. బిడ్డలూ ఉన్నారు. గుర్తించని వాళ్లకు ఎవరులేరు- ఎవరికీ ఏదీ లేదు. అమ్మ కైతే అందఱూ ఉన్నారు. సమస్తత్వానికి, సర్వత్రత్వానికి, నిత్యత్వానికి, పరిమితభావనలు లేవు- త్రెంపులు లేవు.

7. మత్తః పరతరం నాన్య త్కించి దస్తి ధనంజయ!।
మయి సర్వ మిదం ప్రోతం సూత్రే మణిగణా ఇవ॥

తా: ధనంజయా! నాకంటె వేఱయిన దేదీలేదు. దారపుపోగులో మణులు గ్రుచ్చ బడినట్టుగా నాయందే ఈజగత్తంతామణుల లాగా గ్రుచ్చబడి ఉంది.

వ్యా: పరమాత్మకు బహిరంతరాలలో ప్రపంచమూ, ప్రపంచానికి బహిరంత రాలలో పరమాత్మ ఓతప్రోతంగా ఉన్న సంగతి వేయి నోళ్ళతో ఉపనిషత్తులూ, శాస్త్రాలూ ఉపన్యసించాయి. ఇక్కడలేనిది ఎక్కడా ఏమీలేదని అరటిపండు ఒలిచి చెప్పినట్లు అమ్మ చెప్పింది.

మణుల యందు సూత్రం గ్రుచ్చబడి ఉంటుందా? సూత్రము నందు మణులు గ్రుచ్చబడి ఉంటాయా? అంటే రెండూ సరి అయిన అర్థాలే, ఎలా గంటే స్థూల సృష్టి భిన్నాభిన్నమై కారణ సృష్టి అవుతుంది. కారణసృష్టిభిన్నాభిన్న మై పరమాత్మ సంకల్ప సృష్టిఅవుతుంది. సంకల్పమే పరమాత్మ. పరమాత్మ యే సంకల్పం. ఆధునిక విజ్ఞానం లోకూడ, అదే పద్ధతిగా శక్తి పదార్థాల ఉత్పత్తి స్థితిలయాలు జరుగుతున్నాయని నిరూ పించబడ్డది. ఉత్పత్తి స్థితిలయాలు అనే మాటనుపయోగించడం కంటే ఒండొంటి మార్పు అనడం సబబుగా ఉంటుందేమో! పదార్థంలోని చరమకణం భిన్నమై ఒక

నెగెట్రాను ఒకపాజిట్రానుగా శక్తి రూపమెత్తుతాయి. పాజిట్రాను నెగెట్రానులు అన్యోన్యం మాసిపోయినప్పుడు, అవి పదార్థంలో చరమకణంగా మార్పుచెందు తాయి.

'రేకలన్నీ పువ్వులో భాగాలే అయినట్లే మన మందఱమూ వాడిలో భాగాలమే' అమ్మ ఆత్మ ఎక్కడ ఉందంటే అంతటా నిండి ఉంది. ఎవడికి ఎక్కడ కనిపిస్తే అక్కడ చూస్తాడు.

8. రసోఽ హ మప్సు కౌంతేయ! ప్రభాఽ స్మి శశిసూర్యయోః।
ప్రణవ స్సర్వ వేదేషు శబ్దః ఖే పౌరుషం నృషు॥

తా: కౌన్తేయా! నేను నీటిలో రసాన్ని. సూర్యచంద్రులలో కాంతిని. వేదాల్లోని ఓంకారాన్ని- ఆకాశంలో శబ్దాన్ని- పురుషుల్లో పౌరుషాన్ని.

వ్యా: సృష్టిలో వస్తువు వస్తుగుణం రెండుగా ఉన్నట్లు కనిపిస్తాయి. నిజానికి ఆ గుణమే వస్తురూపంగా కనిపిస్తున్నా మనం వాటిని వేఱువేఱుగా గ్రహిస్తాం. సూర్య గోళంలో ఘనపదార్థమంటూలేదని శాస్త్రజ్ఞులు విశ్వసిస్తారు. కార్బన్ సైకిల్ అనే పరిణామ చక్ర భ్రమణంలో బడి ఒక అణువుతో మఱొకటి విలీనమౌతూ మఱో అణు వుగా ఉత్పత్తి చెందే కార్యక్రమంలో వాటి పరివర్తన క్రమఫలితంగా విడుదల అయ్యే శక్తి మనకు సూర్యరశ్మిగా అందుతున్నదని నేటి శాస్త్రజ్ఞులు చెబుతారు. కాని వాయు సారమే వర్తులించి, శక్తిని వెదజల్లుతూ గోళాకారంగా కన్పించుతూ, వీపులను మాడు స్తున్నదంటే మనకు విశ్వసనీయంగాతోచదు. ఉప్పును సోడియం క్లోరైడ్ అని రసా యన శాస్త్రజ్ఞుడు నిర్వచిస్తాడు. కాని ఆధ్యాత్మికవాదులు ఉప్పదనమే ఘనీభవించి ఉప్పౌతుందంటారు. తెలుగు వాడిని కాబట్టి ఉప్పు ప్రస్తావన రాగానే కారమూ జ్ఞాప కానికి వచ్చింది. అమ్మ అన్నది కదా.

'మిరపకాయకు కారం స్వభావం అంటాడు. నాస్తికుడు. మిరపకాయలో కారం పెట్టేడు అంటాడు ఆస్తికుడు.'

ఆమాట అంటూనే' గుణాలకు ఆధారం భగవంతుడైనప్పుడు గుణం మాత్రం ఎందుకుకాదు?' అని అమ్మ ప్రశ్నించింది.

గుణం లేని వస్తువంటూ ప్రపంచంలోనూ సృష్టిలోనూ లేనేలేదు, ఈ సంగతి మనం బాగా గ్రహించాలి. ఉన్నగుణం మనతత్వానికి నచ్చక పోవడం అది వేఱే సంగతి. గుణమే రూపమెత్తి నప్పుడు భూయిష్ఠాంశగా మారుతుంది. భూయిష్ఠత యేకాని రూపం నిజానికి అనంత్యపర్యాయ వాచకంగాలేనేలేదు.

'యా సృష్టి స్రష్టురాద్యా' అని కాళిదాసు మహాకవి కారణవారిని వర్ణించాడు. 'రసోవైసః' అని వేదాంతులు దాన్ని పరబ్రహ్మపదార్థంగా నిర్వచించారు. ద్రవత్వ, నిర్మలత్వ, స్వాద్వాది గుణాలన్నీ ఒకటిగా జేసి, రసంగా గుదిగ్రుచ్చి ఆరసాన్నేతానన్నాడు పరమాత్మ.

సూర్య చంద్రులు లేకుండా మనకు తెలిసిన చిత్తుగాని సత్తుగాని లేదు. మనస్సు ప్రాణం ఈరెంటికి కారణాలు, లంకెలు కూడా.

పరమాత్మ తాను సూర్యచంద్రులలోని రశ్మినడంలో ఏవిధంగా కారణబ్రహ్మ క్రమంగా రశ్మిగా, శబ్దగుణమైన ఆకారంగా, అన్నింటికి కారణమైన వేదంగా, ప్రణవంగా, ఆధారంగా ఉన్న దశలన్నింటినీ సూచించి ప్రతిఫలించి ప్రదర్శిస్తుంది ఈ శ్లోకం.

పురుషుల్లో పౌరుషాన్ని అంటే అర్జునునికి ఆదశలో కావలసిన దాన్నికూడా పరమాత్మ సూచించారు.

9. పుణ్యో గన్ధః పృథివ్యాం చ తేజ శ్చాస్మి విభావసౌ।
జీవనం సర్వభూతేషు తపశ్చాస్మి తపస్విషు॥

తా: పృథివిలోని పవిత్రమైన గంధం, అగ్నిలోని తేజస్సు, సంపూర్ణమైన భూత జగత్తులోని జీవనము, తపస్వులలోని తపస్సునునేనే.

వ్యా: పృథివి గంధవతి. అగ్ని దహనశీలుడు. సర్వభూతసృష్టి ప్రాణ సహితము, తపస్విజనులు తపోగ్నిజ్వలితులు. శ్లోకంలోని అందమైన ఐక్యత ఎక్కడ ఉందంటే. పృథివిలోని గంధ గుణమే అగ్నిలోని దహనగుణం లేక తేజస్సు; అగ్నిలోని తేజస్సే ప్రాణకోటిలోని ప్రాణాగ్ని; ప్రాణవహ్నియే తపస్వులలోని తపోగ్ని; ఉపాధి ననుసరించి పరమాత్మశక్తి ఒక్కటే అనేక విధాలుగా ప్రస్ఫుట మవుతున్నది.

'అబింధనమ్ విద్యుత్ సువర్ణ మాకరజం!' అని కదా శాస్త్రం. నీరు ఇంధనంగా అయినప్పుడు ఆ శక్తి విద్యుత్తైంది. పృథివి ఇంధనంగా అయినప్పుడు. అదే శక్తి బంగారమైంది.

ఒకే శక్తిని పరమాత్మ అని మనంవాడుకుంటాం. అదే అన్నింటిలోనూ, ఉపాదాన సహితంగా ప్రస్ఫుటించినప్పుడు. ఆకారం, స్వభావం, ద్రవ్యశక్తులననుసరించి పలు విధాలగా బహిర్గతంకావచ్చు, గుర్తించే వారి అధికారసామర్థ్యాలను బట్టి, అవగాహనల వైవిధ్యం ఏర్పడుతుంది. Saint xavier లాంటి వాళ్లకు చచ్చిన తరువాత కూడా ప్రాణలక్షణాలు కన్పిస్తాయి.

పైన శ్లోకంలో శబ్ద స్పర్శరూపరసగంధ ప్రసంగంలో పుణ్యశబ్దం జోడించ బడింది. కాబట్టి వాటి వలన పంచతన్మాత్రలనే అర్థంచేసుకోవలసి ఉంటుంది.

10. బీజం మాం సర్వభూతానాం విద్ధి పార్థ! సనాతనమ్।
బుద్ధి ర్బుద్ధిమతా మస్మి, తేజస్తే జస్వినా మహమ్॥

తా: అర్జునా! సంపూర్ణ భూతకోటికి, సనాతన కారణబీజాన్ని, నేనే అని గుర్తించు. బుద్ధి మంతులలో ఉన్నబుద్ధిగాను, తేజస్వులలో ఉండే తేజస్సుగానూ నన్ను గుర్తించు.

వ్యా: ప్రతి జన్మకూ పితృబీజం ఒకటి కారణమౌతుంది కదా! అనంతకోటి భూతాలకు అనంతకోటి పితృబీజాలు కారణాలు కావలసి ఉండగా పరమాత్మనేనే అన్నింటికి కారణం అని చెప్పడంలో అర్థం ఏమిటి?

చెట్టేతాను బీజరూపాన్ని ఎత్తితన్నుదాను సృష్టించు కుంటుంది. తాత తండ్రిగా పుట్టిమనుమడి రూపకంగా తనను తాను సృష్టించు కుంటున్నాడు. అన్ని ఆకారాలుగా అమ్మ తనను తానే సృష్టించుకుంటున్నది. ఈ పరిణామక్రమానికి వ్యాఖ్యానాన్ని సృష్టిస్తే చావు బ్రదుకులకు అర్థమే లేకుండా పోతుంది.

అమ్మమాట– శరీరధారి యై ఉండి కూడా (మనుష్యుడు) అనుక్షణం చస్తున్నాడు. ఇంకో విధంగా చెప్తేచావు కర్థంలేదు.

బీజోదరమున సుప్తిని జెందు వృక్షాంకు
రమె బీజమగుచు మేల్కాంచుచుండ,
తనుగతంబైన ఆత్మయె పుత్రు డై జన్మ
మెత్తి తాతలను సృజించుచుండ,
బాష్పరూపము నెత్తి వనరాశి వర్షమై
తనను దా గల్పించుకొనుచు నుండ
గిరులు రేణువులౌచు ఝురులలో శరణొంది
శరధిలో గిరులుగా బెరుగుచుండ
కారణమె మారు రూపుతో కార్యమగుచు
గార్యమున లింగరూపమై కారణమ్ము
నడగి యుంటయు లోక సత్యమ్ము గాగ
మరణమున కర్థమేమని మది దలంతు

మృత్యులగ్నము.

అందుకనే విజ్ఞులు పరమాత్మను కారణ కారణుడన్నారు. అన్ని కారణాలూ ఆయనవే కనుక ఆయన విషయమై దేనికీ కారణం వెదకనవసరంలేదు. అన్నింటికి మొదటి కారణం పరమాత్మయే కాబట్టి శంకాస్థానమే లేదు. మొట్టమొదట జరిగిన సంఘటన అది వఱకు జరగని ఫలితాన్నిస్తే మొదటి దానినే కారణమనీ, తరువాత దాన్నే కార్యమనీ వ్యవహరిస్తాం. కార్యకారణ కర్త ఆయనే కదా!

విత్తుకు చెట్టు కారణం, చెట్టుకు విత్తుకారణం అంకురించని గింజను వదిలేస్తే ఈ వాదం తెగిపోతుంది. మనం చూచే దృక్కోణాన్ని బట్టి మారుతుంటుంది. కారణ కార్యవాదం. అలాటిదే పరమాత్మకారణవాదం. సర్వానికీ సర్వమూకారణ మన్నది కదా అమ్మ. పరమాత్మయే జగత్తనీ, జగత్తే పరమాత్మనీ– మీరు కానిది నేనేమీ కానని ఎన్నోవిధాల చెప్పింది కదా అమ్మ. సర్వభూతాలకు నేనే బీజాన్ని అని పరమాత్మ చెప్ప డంలోని ఆంతర్యం కూడా ఇదేనని గ్రహించేది. అంటే ఏది? మీరు కానిది నేనేమీ కానని అమ్మ అన్నది–సరే–అయితే పిల్లలు తల్లులు కూడానా? పిల్లగా ఉన్నప్పుడు కాదు. తల్లి అయినప్పుడు తల్లే.

11. బలం బలవతాం చాహం కామరాగ వివర్జితమ్।
ధర్మావిరుద్ధో భూతేషు కామోఽస్మి భరతర్షభ!॥

తా: భరతకులములో శ్రేష్ఠుడవైన అర్జునా! బలవంతుల కామరాగ వివర్జిత మైన బలాన్ని నేను. భూతములందు ధర్మావిరుద్ధమైన కామాన్నినేను.

వ్యా: కామనలతో ఆసక్తితో నుండే బలం దైవీయం కాదా అనే శంకరాక మానదు. ఆసక్తి, కామన, స్వార్థంతో ఆగిపోతే అవి మానవీయ గుణాలు అవుతాయి. ఆసక్తి, కామన, తనవిషయంలో ఎలాచూపు కుంటాడో, పొరుగు వాడివిషయంలో కూడా అలాగే ప్రపంచభూతాలన్నింటి విషయంలో కూడా అలాగే! ఆసక్తి చూప గలుగుతాడో, అప్పుడు ఆవ్యక్తిలోనికామనలు ఆసక్తి దైవీయమే అవుతుంది. అటు వంటి వ్యక్తిలోని బలానికి, పరమాత్మ స్వభావానికి ఏవిధమైన అంతరమూ ఉండదు. అతనిలోని సామర్థ్యము, దార్ఢ్యము, ఇతరులను ధ్వంసంచేయ డానికి కాక వారిని రక్షించడానికీ ఉపయోగపడుతుంది.

ఒక వేళ అట్టి వ్యక్తి చేతుల్లో శ్రీ రామచంద్రుని చేతుల్లో రావణుడులాగ మర ణించడమే తటస్థిస్తే అది ముక్తి కారణమే అవుతుంది అతనికి. పోతే ధర్మవిరుద్ధమైన కామం అంటే ఏమిటి? తన యందుగాని, పరులయందు గాని వ్యతిరేక భావాన్నిరేకెత్తించని కామంధర్మానికి విరుద్ధం కాని దవుతుంది. అటు వంటి కామం

కూడా దైవీయ సంపత్తియే అని గీతబోధిస్తుంది. పరమాత్మధర్మవిరుద్ధం కాని కామమూ, కామరాగవివర్జిత మైన సామర్థ్యము తానేనని వక్కాణిస్తున్నాడు.

12. యే చైవ సాత్వికా భావా రాజసా స్తామసా శ్చయే।
మత్త ఏవేతి తా న్విద్ధి న త్వహం తేషు తే మయి॥

తా: అదే ప్రకారంగా సత్వగుణం వల్లగాని, ఉత్పన్నమయ్యేభావాలన్నీ నావల్లనే ఉత్పన్నమవుతున్నాయని తెలుసుకో, వారు నాయందు గాని నేను వారియందుగాని వేఱు వేఱుగా ఉండడం వల్ల అలా ఉత్పన్నం కావడం కాదని కూడా తెలుసుకో!

వ్యా: ఇంతకు ముందటి శ్లోకంలో మానవీయ మయిన కామరాగ ధర్మాలను గూర్చి చెబుతూ, పరమాత్మ అవి సూర్యునిలో ప్రకాశంలాగా, అగ్నిలోని వేడిలాగా, సార్వత్రిక ధర్మాలై ఉంటే ఆ గుణాలు తన స్వరూపాలుగా తెలుసుకోమని అర్జుననకు బోధించాడు. మఱి ఆ గుణాలు మానవీయాలుగా ఉంటే వాటిమాట ఏమిటి? అనే శంక ఎవరికన్నా మనస్సులో వెంటనే పొడమక మానదు. సార్వత్రికంగా వర్తించే కామమూ, రాగమూ, దైవీయమూ, సాత్విక భావమూ అయితే స్వార్థంతో వర్తించే వేళ అవే రాజస తామస భావాలౌతాయి కదా! రాజస, తామస భావాలు, పరమాత్మవి కావా అనే సందేహం తొలగించడానికి ఈ శ్లోకం చెప్పారు పరమాత్మ. భావం సాత్విక మైనా సరే, రాజసమైనా సరే, తామసమైనా సరే, దాన్ని నా స్వరూపం గానే తెలుసు కోమని బోధించారు పరమాత్మ. అయితే మనం దుర్మార్గులు, ఆకతాయిలు, విషపుచ్ఛ జీవులు, పరహింసా పరాయణులూ, అనుకునే అసురప్రకృతులు గూడా ఈ సూత్రం ప్రకారం దైవాంశ సంభూతులే అవుతారా? అంటే అవుతారనే సమాధానం. హింస, చెడ్డతనం, ఘాతుకత్వం ఇవన్నీ బయటనుంచి చూచేవాడిని బట్టిగాని స్వతస్సిద్ధంగా ఆయా చర్యలకుండే స్వభావాలు కావు. భౌతిక విజ్ఞాన సింహమూ, మహామేధావి అయిన స్రోడింజరు పండితుడు అనే మాటలు వినండి.

There is nothing either good or bad. But thinking makes it so. No material happening in itself neither good or bad nor is it in itself, beautiful or ugly. The values are missing and quite particularly, the meaning and end are missing. Nature does not act by purposes.

కారణ కార్యాలకు లంకె మనం పెట్టుకున్నది గాని ప్రకృతికి ఆ బాజర బంధి లేదు. ఈ వ్యాపారం చేయడంవల్ల, ఈ లాభం సమకూడింది కనుక ఈ వ్యాపార ప్రణాళికను మళ్లీ ఆచరణలోపెట్టి మఱింత లాభాన్ని సంపాదిద్దామనే ప్రయోగపద్ధతి, సంకలన పద్ధతి, మానవుడికేకాని ప్రకృతికి ఆ విచక్షణగాని, వివక్షతగాని లేదు.

ఒకసారి సూర్యబింబం నుంచి బయటపడ్డ కిరణం మళ్ళీ సూర్యబింబంలో అదేరీతిగా జొరబడదు. ఒకసారి ప్రకృతిలో జరిగిపోయిన సంఘటన సినిమా రీలు వెనక్కు త్రిప్పి నడిపినట్లుగా వెనక్కు నడవదు. ప్రకృతి ఎల్లప్పుడు పురోగామియే. పశ్చాద్దృష్టి, మనస్సులో ఇంకిన కొన్ని అనుభవజ్ఞానాంశాల వల్ల మధ్య మధ్య మనుష్యునిలో మేలుకుంటూ ఉంటుంది. ఈ మేలుకోవడమనేదే మనుష్యునిలో ఉండే మర్త్యస్వభావం - అంటే మర్త్యుడు అమర్త్యుడుగా మేలుకోవడం అన్నమాట. భగవదంశ నిత్యజాగృతి కలది. అది మానవునిలో లేకపోతే అతడు మేలుకోడానికే ఆస్కారం లేకపోయి ఉండును. మానవుని లాగానే సృష్టి అంతటికీ ఈ సూత్రం సమానంగా వర్తిస్తున్నా, తమలో ఈ పరమాత్మాంశ ఉన్నదనే జ్ఞానం అప్పుడప్పుడు మనుష్య ప్రకృతిలో తళుకు తళుకుమంటూ ఉంటుంది. ఈ తళుకు మనడం ఉన్నంతసేపూ, మానవుడు, మర్త్యత్వంలోనే మిణుకుమిణుకుమంటూ ఉంటాడు. నాలో భగవంతుడున్నాడు. భగవంతునిలో నేనున్నాను. అనే భావంతో, తననూ పరమాత్మనూ రెండుగా అనుకుంటూ బాధపడుతూ ఉంటాడు. ఈ ద్వైధీభావం విరిగిపోగానే అమ్మ అన్నట్లు మీరు కానిది నేనేమీ కాను అనే సంగతిని గుర్తించి శాంత చిత్తుడౌతాడు. ఈ విషయాన్నే పరమాత్మ 'నత్వహం తేషుతేమయి' అనే మాటలలో వ్యక్తపరిచాడు.

ఇదే అభిప్రాయాన్ని తొమ్మిదవ అధ్యాయంలో నాలుగు అయిదు శ్లోకాలలో కూడా ఈ క్రిందివిధంగా పరమాత్మ వివరించారు.

మయా తత మిదమ్ సర్వమ్ జగ దవ్యక్త మూర్తినా।
మత్‌స్థాని సర్వభూతాని నచాఽహం తే ష్వవస్థితః॥

నా యందు భూతములున్నవని కాని, భూతములందు నేనున్నానని కాని అర్థం కాదు. మొదటిభాగంలో చెప్పినట్లు అన్నీ నేనేయై ఉన్నానని అర్థం.

న చ మత్ స్థాని భూతాని, పశ్యమే యోగమైశ్వరమ్।
భూతభృ న్న చభూతస్థో మమా త్మాభూత భావనః॥

భూతాత్ముడై, భూతాలను భరిస్తాడు కాని భూతాల్లో ఉండని వాడెలాంటి వాడై ఉంటాడు? భూతాలే తానైన వాడై ఉంటాడు.

13. **త్రిభిర్గుణ మయై ర్భావై రేభి స్సర్వ మిదంజగత్।**
మోహితం నాభిజానాతి మా మేభ్యః పర మవ్యయమ్॥

తా: ఈ జగత్తు సర్వమూ సత్వర జస్తమములనే త్రిగుణాలవలన ఉత్పన్నములైన

భావాలచే మోహితమై వీటివలన పరమూ అవ్యయమూ అయిన నన్ను ఎఱుగకుండా ఉన్నది.

వ్యా: సత్వర జస్తమో గుణాలు పరమాత్మను కప్పివేసి ఉంచును. అవ్యయుడైన పరమాత్మకు ఆచ్ఛాదనం కూడానా? ఆయన్ను ఆచ్ఛాదించే శక్తులు కూడా ఉన్నాయా?

వ్యా: సత్వర జస్తమో గుణాలు పరమాత్మవి కావా? జగత్తు పరమాత్మకంటె భిన్న వస్తువా? అనే ప్రశ్నలు వెంటనే వా... లల నెత్తుతాయి. కాని ఈ విషయం మనం అర్థం చేసుకోవడం లోనే ఉంది. నిజానికి ఇందులో భిన్నత్వం ఏమీ లేదు. దీన్ని అవగాహన చేసుకోవడానికి ఈ క్రింది విషయాలను విచారిద్దాం.

1. పరమాత్మ అంటూ లేకపోతే సత్వరజస్తమో గుణాలు ఉండేవా?
2. పరమాత్మ అంటూ లేకపోతే యోగమాయ వేఱుగా ఉండేదా?
3. పరమాత్మ అంటూ లేకపోతే జగత్తు వేఱుగా ఉండేదా?

పై మూడు ప్రశ్నలకూ సమాధానం, పరమాత్మ అంటూ లేకపోతే గుణాలు ఉండేవికావు, జగత్తూ ఉండేది కాదు. యోగమాయ ఉండేది కాదు.

తగాదా ఎక్కడ వచ్చిందంటే వ్యాఖ్యాతలు రెండోపాదంలోని ఆఖరు మాటలు "ఏభ్యః పర మవ్యయమ్" అనే వాటికి "వీటికంటె అన్యమైన" అని అర్థం చెప్పడంవలన, జగత్తు వేఱూ, పరమాత్మ వేఱూ అనే ద్వైతభావానికి స్థానం కలిగింది. కాని ఇక్కడ పరశబ్దానికి 'అన్యము' అని అర్థము కాదు పరమాత్మ అనే అర్థం.

ఈ సందర్భంలో రెండో అధ్యాయంలోని 59వ శ్లోకాన్ని చూడండి.

'విషయా వినివర్తంతే నిరాహారస్యదేహినః।
రసవర్జం రసోప్యస్య పరం దృష్ట్వా నివర్తతే'॥

అంటే నిరాహారి అయిన దేహికి విషయాలు తిరుగుముఖం పడతాయి. అనురక్తి మాత్రం అతన్ని అంటిపెట్టుకునే ఉంటుంది. పరం దృష్ట్వా – అంటే పరమాత్మను దర్శించినప్పుడు ఈ అనురక్తి కూడా మళ్ళిపోతుంది. అని శ్లోకానికక్కడ అర్థం చెప్పాం.

అదే అర్థంలో పరశబ్దం ఈ శ్లోకంలో కూడా వాడబడింది. అదే అర్థం ఇక్కడ కూడా చెప్పుకోవాలి. కాబట్టి త్రిగుణ సంజనిత భావాల బంధనంలో పడి ఇదంతా వ్యయమైపోతూ ఉండడం కన్నులారా చూస్తున్నా, అన్ని వ్యయాలూ ఎవరిలో

లయమై, వ్యయమై పోతాయో ఆ అవ్యయమైన పరమాత్మను నన్నుగా జగత్తు గుర్తించడంలేదని పై శ్లోకానికి భావం.

ఎందుకు గుర్తించడంలేదని మనకు మనమే ప్రశ్న వేసుకుందాం. దీనికి కారణాలివి.

1. జగత్తు నుండి మనం మనస్సును వేఱు చేసుకున్నాం
2. మనస్సే జగత్తుకు సృష్టికర్త అనే రహస్యాన్ని మనం మఱచిపోయాం.
3. బాహ్యకారాన్ని బట్టే వాదోపవాద ఘోర యుద్ధమును సాగిస్తుంటాం. కాని ఆ బాహ్యకారంలోని అంతర్నిర్మాణాన్ని, ఆ అంతర్నిర్మాణంలోని క్రియాపరత్వాన్ని గుర్తించడానికి నిరాకరించాం.

మనుష్యుడికి మనస్సులేకపోతే, భూతజాలాన్ని గుర్తించే అంతశ్శక్తి లేకపోతే సృష్టి అనేది ఈ రీతిగా ఉండేదా అని మనం మనను ప్రశ్నించుకోవచ్చు. మందబుద్ధి జాతి విగ్రహాన్ని ఏదో ఒక స్వరూపంగా భావించుకున్నాడంటే ఒప్పుకోవచ్చు. కాని ఆ విగ్రహం ఆవిధంగా కనిపించ గలగడానికి హేతువులైన తదంతర్గత పరమాణువుల సంయోగ వియోగములు, ఆకర్షణ వికర్షణ శక్తులు, వీటనన్నిటిని తర్జనభర్జన చేసి అన్ని స్వరూపాలూ ఏవో విలక్షణమైన క్వాంటమ్ నిర్మాణాలని సిద్ధాంతీకరిస్తే ఒప్పు కుంటామా? ఒప్పుకోం, ఈ సందర్భంలో స్క్రోడింజరు రచించిన Mind and matter అనే గ్రంథంనుంచి కొంతభాగం ఉదహరిస్తాను.

"Some readers may remember, AS Eddingtons Two writing Desks" One is the familiar old piece, of furniture at which, he is seated, resting his arm on it,the other is the scienfific physical body, which not only lacks all and every sensual qualities, but in addition is riddled with holes by far the greatest part of it, is empty space, just nothingness, interspersed with tiny specks of something, the electrons, and the nucleii whirling round, but always separated by distances, at least 1,00,000 times their own size. After having contrasted the two in his wonderfully plastic style, he summarizes thus.

In the world of Pnysics we watch shadowgraphic performance of familiar life. The shadow of my elbow rests on the shadow table, as the shadow ink flows over the shadow paper. The frank realisation that physical science is concerned with a world of shadows is one of the most significant of recent advances.

The nature of the physical world. - Eddington.

ఇటువంటి సందర్భంలోనే శ్రీ శ్రీపాద గోపాల కృష్ణమూర్తిగారు 'గజం నాస్తి పలాయనం నాస్తి' అని ఉదహరించారు. సందర్భం ఇది. ఆది శంకరులు ఎదురుగా వస్తున్న ఏనుగును చూచి తప్పుకున్నారట. ప్రక్కనున్న వాళ్ళు 'బ్రహ్మసత్యం జగన్మిథ్యా' అని కదా మీరు బోధించేది. మిథ్యా గజాన్నిచూచి అలా తప్పుకున్నారేం అని అడిగారట. శంకరులు 'గజం నాస్తి, పలాయనం నాస్తి' అని జవాబు చెప్పారట.

నిజానికి మనం ఛాయా మాత్రమైన జగత్తులో నివసిస్తూ, దాని యథార్థ రూపాన్ని వస్తు సత్యాన్ని గమనించక మార్పుచెందే బహిరాకారమే దాని సహజాకృతి అనుకుంటూ ఉంటాం. కనుక దాని యథార్థానికి ఎల్లప్పుడూ దూరస్థుల మయ్యే ఉంటాం. ఇలా ఉండడం కూడా భగవంతుని సంకల్పమే. రెండూ దైవమైనా రెండ యితే కాని సృష్టి నడవదు. 'సూదీ, దారం ఉన్నది. దారం ఒకటే. ఆ రంధ్రంలో గ్రుచ్చి నప్పుడు అది రెండుగా కనిపిస్తోంది. చూడడానికి రెండుగాని పోగు ఒకటే. ఈ అడ్డం ఉంచింది నేనే. రెండుగా కనబడడానికి కారణం నేనే అయినప్పుడు నేను మిమ్మల్ని ఎట్లా అంటాను. మీరు మంచికీ చెడుకూ దేనికీ కర్తలు కారు' అమ్మ.

జగత్తు వ్యామోహంలో పడి ఉన్నప్పుడు పరమాత్మను గుర్తించకపోవడం కూడా భగవంతుని ఏర్పాటే అని పై విషయాలవల్ల తెలుస్తుంది.

స్థూలం తగలడితే కాని సూక్ష్మ దశ కాదు.

14. దైవీ హ్యేషా గుణమయీ, మమ మాయా దురత్యయా।
మా మేవ యే ప్రపద్యన్తే మాయా మేతా తరన్తితే॥

తా: త్రిగుణమయమూ, దైవీయమూ, అయిన యీ నా మాయ మనుష్యులకు దురత్యయమైనది. ఎవరు నన్ను అంతఃకరణ శుద్ధిగా భజిస్తారో, వారు ఈ నా మాయను ఉల్లంఘించి తరిస్తారు.

వ్యా: 16వ శ్లోకంలో ఇంతవఱకు వాడని 'మాయా' అనే పదాన్ని పరమాత్మ వాడారు. వివర్తవాదంలో అతి ముఖ్యమైన స్థానాన్ని ఆక్రమించుకొని ఉండేది 'మాయ'. 'యామాసామాయా' తిరగేసి మరగేసి చదివినా తన స్వరూపాన్ని కోల్పోని వాక్యమది. ఏదిలేదో అది అని అర్థం ఆ వాక్యానికి. నా 'యామాసా' కావ్యంలో మాయను గూర్చిన ఈ పద్యముంది.

'పరిపక్వ జీవనిర్భర కర్మ వశమున
మూల ప్రకృతి సృష్టి కాలమందు

మాయ, యవిద్య, తామసి నాగ మూడగు;
వానిలో శుద్ధ సత్వ ప్రధాన
మైనది మాయ; తానందు సృష్ట్యాదిమ
బ్రహ్మ చైతన్యంబు ప్రతిఫలించి
యీశ్వరుండను పేరనెసగు; నవ్యాకృతాం
తర్యామి పదముల దనరు నితడె;
ఈతడే జగ(త్స్రష్టయు నీతడె పరి
పూర్ణ చైతన్య సత్స్వరూపుడయి కూడ
సాలెపురువట్లు తామసీచ్ఛన్నుడగుచు
జగదుపాదాన కారణు డగును కూడ

త్రిగుణాత్మకమైన మాయ అనాది సిద్ధము. 'మాయాంతు ప్రకృతిం విద్యాన్మాయి నంతు మహేశ్వరమ్' క్రొత్తగుణాలు వచ్చి చేరినప్పుడు సృష్టి కనుకూలమైన రూపాన్ని దాల్చి అవిద్య, తామసి అవుతుంది. అవిద్య, తామసి కూడా పరమాత్మయే సముద్రం వేఱనీ, అలలు వేఱనీ ప్రత్యేకంగా చూపలేము గదా! కాని వేఱుగా కనిపిస్తాయిగా!

పేరినదే నెయ్యి కాదుగా! కరగినదీ నెయ్యే! పాలలో ఉన్నదీ నెయ్యే - సాలె పురుగు కడుపులో దారాన్ని పుట్టించే శక్తీ దారమే, చైతన్యమే. కనుక ఉపనిషత్తులు చెప్పినది వేఱూ అమ్మ చెప్పేది వేఱూ అని కొందఱు వాదించే పద్ధతి సమర్థించ దగింది కాదు. శాస్త్రాలంకంటే తాను క్రొత్తగా ఏమీ చెప్పటల్లేదనీ అమ్మే ఒకసారి అన్నది.

వివర్తవాదం అంటే మూల పదార్థంలోని అసలును మార్చకుండా దాన్ని వేఱుగా కన్పించేలాగా చేయడం. ఆభాసతత్వం. ప్రకృతియే మాయ. 'మాయా చావిద్యా చ స్వయమేవ భవంతి' అని ప్రమాణం. సత్వరజస్తమో గుణాలలో సత్వ గుణోపేతమైనది మాయ. రజస్తమోగుణాలతో కూడుకున్నవి 'అవిద్య తామసి' అవి కూడా భగవంతుని శక్తికంటె వేఱు కావు. భగవచ్ఛక్తి లేనిదే ఏ గుణమూ పనిచేయదు. 'మామేవ యే ప్రపద్యన్తే' ఈ మాటలు పరమాత్మ అంటున్న మాటలు. అంటే పరమాత్మ చైతన్యాన్ని ఎవరు కలిగి ఉంటారో వారు ఈ మాయను దాటేస్తారు. మాయ మోహింపచేసి మనస్సును భ్రాంతితో నింపుతుంది. ఆ మాయను శక్తిగా గలవాని అనుగ్రహం వలన అది పరిసిపోతుంది.

15. న మాం దుష్కృతినో మూఢాః ప్ర పద్యన్తే నరాధమాః।
మాయయాஉ పహృతజ్ఞానా ఆసురం భావమాశ్రితాః॥

తా: అయినప్పటికీ దుష్కృతులు, మూఢులు నరాధములు, నా మాయచేత అపహరించబడిన జ్ఞానం కలవారై, అసురభావాన్ని ఆశ్రయించి, నన్ను భజించ కుండా ఉంటారు.

వ్యా: నరులందఱు ఒకేవిధంగా జన్మమెత్తినా, కొంతమంది, అందులో నరా ధములుంటారు. దుష్కృతులుంటారు. చెడు పనులనే చేసే మూఢులుంటారు. అలాగా అవుదామని వాళ్ళు ప్రయత్నించరు కాని. పరమాత్మ మాయవాళ్ళ జ్ఞానాన్ని హరించడంవల్లనూ, వాళ్ళ సంస్కారం ఆ మార్గంలోనే ఉండడంవల్లనూ వాళ్ళు అసురభావాన్ని అవలంబిస్తారు. భగవత్సంకల్పమే దానికి కారణం.

'నేను ప్రతిదానిలోనూ ఉన్నారు. పతనమనే భాగంలో ఉండకుండా లేను. అన్నింట్లోనూ నేను ఉన్నాను.'

పైన చెప్పిన నరాధములు, దుష్కృతులు, మూఢులు, సృష్టికర్త కంటే వేరు కారనీ, ఏదో ప్రయోజనానికే పరమాత్మ వారిలాగా అయాడనీ దీనికి పరమాత్మ స్వభావమైన మాయయే కారణమనీ తెలుసుకునేది.

(బహుసంఖ్యా క్షేమవాదులకీ తాత్పర్యం నచ్చకపోచ్చు. యుద్ధం అంటే ఏమి? బలహీనులను బలవంతుడు చంపడం. బలహీనుడే బలవంతుడైతే ఈ సమన్వయం తారుమారు ఔతుందా?" అయితే కఱ్ఱ కలవాడిదే గొఱ్ఱెయా?

16. చతుర్విధా భజన్తే మాం జనాః సుకృతినోஉ ర్జున।
ఆర్తో జిజ్ఞాసు రర్థార్థీ జ్ఞానీ చ భరతర్షభ॥

తా: అర్జునా! భరతవంశశ్రేష్ఠుడా! ఆర్తులు, జిజ్ఞాసువులు, అర్థార్థులు, జ్ఞానులు అని నన్ను సేవించే సుకృతాత్ములు నాలుగు విధాలుగా ఉంటారు.

17. తేషాం జ్ఞానీ నిత్యయుక్తః ఏకభక్తి ర్విశిష్యతే।
ప్రియోஉ హి జ్ఞానినో త్యర్థ మహం స చ మమప్రియః॥

తా: వారిలో నిత్యమూ యోగ్యమైన ఏకైక భక్తితో నన్ను కొలిచే జ్ఞాని అత్యంత శ్రేష్ఠుడు, అటువంటి జ్ఞానులకు అత్యంతమూ నేను ప్రియమైన వాడను. నాకు అట్టి జ్ఞాని ప్రియమైన వాడు.

వ్యా: జ్ఞాని పరమాత్మ అన్యోన్యంగా ప్రియ వస్తువులై ఉంటారని పరమాత్మ సెలవిచ్చారు.

పరమాత్మకు జ్ఞానికి అభేదాధ్యవసాయంగా అన్యోన్యతను కూర్చే ఆ సంబంధం ఏమిటి? అని మనం గట్టిగా ఆలోచిస్తే అది జ్ఞానమే అని తేలుతుంది. పరమాత్మ ప్రజ్ఞానఘనుడు, చిద్ఘనుడునూ, అలాగే జ్ఞాని కూడా కూటస్థమైన జ్ఞాన స్వరూపము కనుక ఈ రెండు స్థానాలకు అవినాభావ సంబంధం ఉన్నట్లు నిరూపితమౌతుంది. ఇంకో విధంగా ఆలోచించినా, ఈ సంగతి అతి విచిత్రమైన భావాన్ని మనస్సులో దీపితం చేస్తున్నది.

మన శరీరం అనేక జీవకణాలతో నిండి ఉంది. ప్రతిజీవ కణమూ, ఒక మాత్రా జీవమే. అటువంటి మాత్రా జీవాలు కోటాను కోట్లు ఒక శరీరంలో ఉంటాయి. శరీర గతప్రాణం, ఆ మాత్రా జీవాల సమిష్టియే, ఆ కోటాను కోట్లకణ సమష్టియే ద్రవ్య మయమైన రక్తమాంస శల్యాది నిర్మితమైన శరీరం కూడాను. అలాగే వ్యష్టి జ్ఞాన కళా సమిష్టియే ప్రజ్ఞాన ఘనమైన పరమాత్మ సంపూర్ణత్వం కూడాను. సినిమా ఫిలింలో వేలకొలది ప్లాస్టిక్ ముక్కలుంటాయి. ప్రతి రెండు ముక్కలూ సమానంగా కనిపించినా ఈషద్భేదం గల నటనా సంయుతంగా ఉంటాయి. కాలపురుష సంపర్కంతో (చచ్చి పడి ఉన్న ఆ ముక్కలే) సినిమా కథయై చైతన్య రూపాన్నెత్తుతాయి. అదే జగత్కథ. సృష్టి వినాశస్థితి వైభవాల చైతన్యం.

ఒక ప్రధానమైన విషయం గుర్తించాలి. మాతృ కళలేనిదే ఏదీ ఉత్పన్నం కాదు, వికసించదు, ఫలించదు, పక్వం కాదు–బహుత్వాన్ని పొంది–అనంతం కాదు, మాతృ కళయే జ్ఞానకళ దాన్ని ప్రసవించేది భక్తి, పరమాత్మ జ్ఞాన ప్రియుడు భక్త గురుడు.

18. ఉదారాః సర్వ ఏవైతే జ్ఞానీ త్వాత్మైవ మే మతమ్।
ఆస్థితః స హి యుక్తాత్మా మామే వానుత్తమాం గతిమ్॥

తా: (శ్రద్ధా సహితులూ, భగవద్భక్తి పరులూ కావడంచేత) ఆర్త, జిజ్ఞాస, అర్థా ర్థులు ముగ్గురూ ఉదారులే. కాని అందటిలోనూ జ్ఞాని ఆత్మశుద్ధి కలవాడు. కనుక అతడే ఆత్మ అని నా మతం. స్థిరచిత్తుడై సమీచీనమై అత్యంతమూ, ఉత్తమమైన గతి కలిగి జ్ఞాని నాయందే నివసిస్తూ ఉంటాడు.

వ్యా: క్రియాశక్తి ఉన్న చోట పడితే తప్ప బీజం అంకురించదు. ఱాతి మీద పడిన విత్తు ఎండిపోతుంది. అంకురిస్తే కాని బీజం జీవితం సార్థకం కాదు. ఇది సృష్టి సూత్రం. పిల్లలను కంటేనే అమ్మ అమ్మవుతుంది. మనస్సులో పడే జ్ఞానాంకురం కూడా బీజం వంటిదే. అంకురయోగ్యమైన సంఘటన ఎలా జరుగుతుందనే శంకకు, అదృష్టవదాత్మ సంయోగమని న్యాయశాస్త్రం సమాధానమిస్తుంది. అదృష్టం ముందటి

యుక్తి వాదమూ, తర్కమూ పనిచేయవు. ప్రయత్నం పని చేయవచ్చు, అంతా మౌన వ్యాఖ్యానం గా నక్కఅలేదు.

అంతా అమ్మే చేయిస్తుంది, అంతా అమ్మదయే. అని మాటగా కాదు. నాయనా! నీకు ఉండాల్సినంత విశ్వాసమే నీలోఉంటే ఈ మాటకు తావుండదు.

తెలిసే సమయం ఎప్పుడు వస్తుందమ్మా! తెలిసి వచ్చేదికాదు. వస్తే తెలిసేదీ కాదు!

ఇందు (సృష్టి)లో దేనికీ, మనం కర్తలంకాము. మరి అనుభవానికి కర్తలమై అనుభవిస్తున్న బాధ ఎప్పుడు తీరుదుందయ్యా! అంటే- ఇది-(మనం దేనికీ కర్తలం కామనే) నిజం మాటలతో కాకుండా, మనసా, ఆభావం కలిగినప్పుడు హాయిగా ఉంటుంది.

మనస్సాక్షాత్కార మంటే ఇదేనేమో! ఈ సాక్షాత్కారానికి జ్ఞానిని పరమేశ్వరుని హృదయపీఠం మీద కూర్చో బెట్టగల శక్తి ఉంది. ఇద్దఱికీ అవినాభావ సంబంధాన్ని సమకూరుస్తుంది. సంబంధం అనే అంతరం లేకుండా చేస్తుంది.

19. **బహూనాం జన్మనా మంతే జ్ఞాన వా న్మాం ప్రపద్యతే।**
వాసుదేవ స్సర్వ మితి స మహాత్మా సుదుర్లభః॥

తా: అసంఖ్యాకములయిన జన్మల(ను దర్శించిన) తరువాత ఈ కనిపించే దంతా వాసుదేవుడే అని తెలుసుకుంటాడు. అట్టి ఆత్మచక్షువైన మహాత్ముడు సాధార ణంగా లభించడు.

వ్యా: శరీరాన్ని ధరించడం, దాన్ని విడిచిపోవడమే జన్మగా అనుకొని అటువంటి ఫలితాన్ని ఇచ్చే యుద్ధాన్ని అర్జునుడు చేయననగా, పరమాత్మ, జగత్కథకూ, దానిలోని పాత్రధారులకూ అనుల్లంఘ్యమైన పరమాత్మోపాధిని గూర్చి, దాని అఖండత్వ, అవ్య యత్వ, సమస్తత్వ, విశ్వత్వ, సంపూర్ణత్వాలను గూర్చి అద్భుతంగా ప్రసంగించి అతన్ని మంత్రముగ్ధుణ్ణి చేశారు. వ్యష్టి సమష్టిత్వములే బొమ్మా బొరుసులయిన ఈ నాణెం చెల్లుబాటును గూర్చి రెండు మాటలు ఇక్కడ తప్పనిసరిగా వ్రాయవలసి ఉంది.

Legal Tender అనే మాట ఇంగ్లీషులో ఉంది. చెల్లుబాటు అని దానికి తెలు గులో అర్థం. పది రూపాయల నోటైనా వెయ్యి రూపాయల నోటైనా దాని విలువ కాగితంలో గాని దాని అచ్చులో గాని ఉండదు. ప్రపంచ దేశాల ఆర్థిక స్థోమత మీద ఆధారపడి ఉంటుంది. ఈ స్తోమతను సంఖ్యామానంలో చెప్పలేం. అర్థం చేసు కోడానికి వీలుగా తప్పనిసరిగా అంకెల భాషలోనే విలువ గట్టాల్సివస్తుంది.

ఈ నోట్లలాంటివే వ్యష్టి గతంగా అందలి జన్మాలు. అమ్మ తెలిసిన వాడికి జన్మలు లేవు అంటే ఇదే అర్థం. పరమాత్మ Legal tender అనంతమైనది. దానికదే కొలమానం.

నిత్యమూ మారే ఎన్నో కోట్ల జీవరాసులన్నింటిలోనూ వాసుదేవత్వం (అప త్యత్వం) నిండి ఉంది. తన జన్మకెలా పరమాత్మ శక్తి కారణమో, కార్యమో, అన్ని జన్మ లకూ అదే మూలమని జనన జ్ఞానాన్ని పొందుతాడు. జగత్తంతా వాసుదేవమయమనే తెలుసుకుంటాడు. దీనికెంతో పరిణామ మావశ్యకమై ఉంది. అఖిల జీవుల యందు తననూ, తనలో సకల జీవులనూ సాక్షాత్కరించుకోగల శక్తిని పొందుతాడు. ఇట్టి జ్ఞానోదయ మొందిన మహాత్ముడు నూటికి కోటికి ఒకడు లభిస్తాడు.

20. కామై స్తై స్తైర్హృత జ్ఞానాః ప్రపద్యన్తేఽ న్య దేవతాః।
తం తం నియమ మాస్థాయ ప్రకృత్యా నియతాః స్వయం॥

తా: సర్వమూ వాసుదేవమయమే అనే జ్ఞానం లేకుండా కామములచేత అపహ రింపబడిన జ్ఞానం కలవాళ్ళై, ఆయా కామోపలబ్ధులకై అనేక దేవతలను కొలిచేవాళ్లు. ప్రకృతిచే స్వయంగా నియమించబడి, తదనుగుణంగా కొన్ని నియమాలను అనుస రిస్తూ ఉంటారు.

వ్యా: ప్రకృతి స్వయంసిద్ధ. ఏరకంగా భావించేవాళ్ళకు ఆ రకంగానే పరి ణామాన్ని కల్పిస్తూ, అందలికి చివరికి సుగతిని లభింపజేసే మార్గానికి లాక్కునిపోతూ ఉంటుంది. పూర్వం చెప్పిన కుళాయిల ఉపమానమే తీసుకుందాం. ఒకడు స్నానాల గదిలో షవర్‌బాత్ పెట్టుకుంటాడు. ఇంకోడు బేతింగ్ టబ్‌ను పెట్టుకుంటాడు. ఇంకోడు ఏకంగా స్విమింగ్‌పూల్‌నే పెట్టుకుంటాడు. ఇంకోడు ఫౌంటెన్ జల యంత్రాన్ని పెట్టుకుంటాడు. ఇంకా ఇంకా మఱుగుదొడ్డి కడగడానికి, మంచినీళ్ళ సరఫరా చెయ్యడానికి వాడుకుంటాడు.

అన్నింటిలోను ఉపాధిత్వం జలప్రయోజనం. అదే బ్రహ్మత్వం - ఉన్నదే అది. కాని దాని నుంచి లోకం తమ అవసరాలను బట్టి ఆర్తో, జిజ్ఞాసు రర్థార్థి జ్ఞానులవలె ఔతారు. ఆ ఏకత్వం అంటే వాసుదేవ సర్వస్వం నుండి ఆశించేవి కూడా నానాత్వ సమ్మితాలే! ఇదంతా జరగడానికి ఇచ్ఛాక్రియా శక్తులను లోకం ప్రకృతి నుండియే పొందుతుంది.

21. యో యో యాంయాం తనుం భక్తః శ్రద్ధయాఽ ర్చితు మిచ్ఛతి।
తస్య తస్యాచలం శ్రద్ధాం తామేవ విదధా మ్యహం॥

తా: ఏఏ భక్తులు ఏఏ ఆకారాలను శ్రద్ధతో అర్చించడానికి వాంఛిస్తారో, వారి వారికి ఆయా ఆకారాల మీద అచంచలమైన శ్రద్ధను కూడా నేనే కల్పిస్తాను!

"నాకు వ్యక్తి పూజ మీద నమ్మకం లేదండీ"

"మంచిదే. నాయనా! నీకు దేనిమీద నమ్మకం ఉంటే అదే పూర్తిగా చెయ్యి"

పొన్నూరు నుంచి వచ్చిన ఒక సోదరుడు అమ్మను అడిగాడు.

"గాయత్రిని ఉపాసిస్తున్నప్పుడు ఆచారంగా ఉండాలంటారు. నేను చేసేది ఉపాధ్యాయవృత్తి. అందువలన నాకు అది నిష్ఠగా సాగడం లేదు. ఉతికిన బట్టలు పనికి వస్తాయా అందుకు?"

"ఏమీ ఫర్వాలేదు నాన్నా! చేసుకోవచ్చు. ఇరవై నాలుగు గంటలూ గుర్తు ఉండాలేగానీ, అంతకంటే కావాల్సింది ఏముంది? నిష్ఠలూ, ఆచారాలూ, పెట్టారు అంటే ఒక నియమంకోసమే. నీకిది గుర్తుండాలి కానీ ఏ స్థితిలో అయినా చేసుకోవచ్చు.

"మా ఆయన పూజచేసే వాడు. చచ్చిపోయాడు" ఇప్పుడెట్లా జరుగుతుంది"

"ఏం! నువ్వు చెయ్యవచ్చా లేదా అనా?"

"ఊ"

"చెయ్యవచ్చు"

పైశ్లోకానికి అమ్మ చెప్పిన మాటలకంటే వేటే వ్యాఖ్యానం అవసరంలేదు. 20వ శ్లోకం భావాన్నే ఈ శ్లోకం విపులీకరించింది. ఎవరికి భగవంతుని ఏ రూపంలో దర్శనం కావడానికి విధించబడి ఉందో ఆ విధానానికి అవసరమైన ప్రేరణా, మనో వైఖరీ, శ్రద్ధా వీటినన్నిటిని, తానే ఆవ్యక్తులకు ప్రసాదిస్తానని పరమాత్మ సెలవిచ్చారు.

"అక్కడ దేవుడెట్లా ఉంటాడమ్మా!"

"ఎట్లా చూసేవాళ్లకు అట్లా ఉంటాడు, ఆ చూపు ఇవ్వవలసిన వాడు కూడా వాడే"

22. స తయా శ్రద్ధయా యుక్త స్తస్యారాధన మీహతే।
లభతే చ తతః కామా న్మయైవ విహితాన్ హి తాన్॥

తా: ఇష్టదైవతముపై నాచే ప్రసాదించబడిన శ్రద్ధతో అతడు ఆరాధన జరుపుతాడు. నాచేత నిర్ణయింపబడిన ఫలాన్నే పొందుతాడు.

వ్యా: భగవంతుని మీద శ్రద్ధాభక్తులుకలగడం కూడా దైవేచ్ఛ. తరువాత క్రమంగా అది వినియోగమై దేవతారాధన రూపాన్ని తాలుస్తుంది. అది ఏ దేవతైనా

కావచ్చు. దాని ఫలప్రాప్తి కూడా దైవనిర్ణయమే. ఫలం ఏ విధంగా సాధకుడిని చేరు తుంది అనే విషయం కూడా దైవ నిర్ణయమే. అయినప్పటికీ జరిగిన అంతా మన కనుకూలంగానే జరిగిందని అన్వయించుకుంటాం. మన ప్రయోజకత్వాన్ని స్థాపించు కుంటాం. ఈ అజ్ఞాన ప్రాగల్భ్యాన్ని భగవంతుడు మానవుడిలో ఎందుకు కల్పించాడు. అంటే జ్ఞానానికి ఎదురుగా అజ్ఞానం భాసిస్తే తప్ప సృష్టి జరగదు.

ద్వంద్వం లేకపోతే ప్రపంచమే లేదు.

రెండూ ఆదైవమే అయినా రెండయితే గాని సృష్టినడవదు.

23. అంతవత్తు ఫలం తేషాం తద్భవ త్యల్ప మేధసామ్।
దేవా దేవయజో యాన్తి మద్భక్తా యాన్తి మా మపి॥

తా: అల్పమేధస్సుగల వారు చేసే సాధనలన్నింటికీ కలిగే ఫలితాలు అంతము గలవై ఉంటాయి. అన్యదేవతలను నమ్మి పూజించేవాళ్లు ఆ దేవతలనే పొందుతారు. నన్ను కొలిచే వాళ్ళు నన్నే (వాసుదేవుడినే) పొందుతారు. దేవతలనుకున్నా, పరమాత్మ అనుకున్నా, అల్పమేధస్సనుకున్నా అధికమేధస్సనుకున్నా, అంతా పరమాత్మ సంక ల్పమే.

24. అవ్యక్తం వ్యక్తిమాపన్నం మన్యంతే మా మబుద్ధయః।
పరంభావ మజానన్తో మమాఽ వ్యయ మనుత్తమమ్॥

తా: బుద్ధిహీనులు అవ్యక్తంగా ఉండేదేదో వ్యక్తంగా అయిందని తలుస్తారే కాని, ఈ రెంటికీ అవినాభావ సంబంధ రూపంగా ఉంటూ అవ్యయమూ, పరమ శ్రేష్ఠముగా ఉన్న నాపరభావాన్ని గుర్తించకుండా ఉన్నారు.

వ్యా: పరమాత్మకూ ప్రపంచానికీ ఉండే సంబంధాన్ని సూచిస్తున్నది. ఎంత పెద్ద మేధావులైనా ప్రపంచం యొక్క అస్తిత్వాన్ని కాదని పరమాత్మ అస్థిత్వాన్నే నిరూ పించలేరు. పరమాత్మా ఉన్నాడు. ప్రపంచమూ ఉన్నది అని వాదిస్తే రెండూ వేఱు వేఱు అస్థిత్వాలా అనే అనుమానం ప్రతివారికీ కలుగుతుంది. శంకరుడూ రామా నులూ పరమాత్మ ప్రపంచానికి ఉపాదాన కారణమూ, నిమిత్తం కారణమూ అని అంగీకరిస్తారు. మధ్వాచార్యులు మాత్రం నిమిత్తకారణమేగాని ఉపాదాన కారణం కాదని అంటారు, గౌడపాదులు భగవంతుని స్వభావమే ప్రపంచమంటారు.

రాబోయే (8వ) అధ్యాయంలో 18వ శ్లోకం ఇలా ఉంది.

'అవ్యక్తా ద్వ్యక్తయ స్సర్వాః ప్రభవం త్యహరాగమే।
రాత్ర్యాగమే ప్రలీయంతే తత్రై వావ్యక్త సంజ్ఞకే॥

'సృష్టి అవసరమా? సహజమా? లీలా? ఎవరికి అవసరం? ఎందుకవసరం? లీల అంటావా? అదంతాతానే అయినప్పుడు లీల ఏమిటి? సహజం అంటాను" అమ్మ.

25. నాఽహం ప్రకాశః సర్వస్య యోగమాయా సమావృతః।
మూఢోఽయం నాఽభిజానన్తి లోకో మా మజ మవ్యయం॥

తా: యోగమాయచే కప్పబడి ఉన్న నేను అందటికి ప్రత్యక్షంగా ప్రకాశించే వాడను కాను. అజుడను, అవ్యయుడనూ అయిన నన్ను ఈ మూర్ఖలోకం తెలుసుకోజాలదు. యోగమాయను గుణయోగమన్నారు శంకరులు.

వ్యా: పరమాత్మ యోగమాయచేత కప్పబడడమేమిటి? పరమాత్మ వేఱూ అతని యోగమాయ వేఱూనా? పరమాత్మకంటె అతని యోగమాయ ఎక్కువ ప్రభావం కలదా? ఈ ప్రశ్నలను గూర్చి చర్చించుకునే ముందు అమ్మమాటలు రెండు ఉదహరిస్తాను.

"రెండు లేనివాడూ రెండూ అయిన వాడూ భగవంతుడు"

'ఏకమే వాద్వితీయం బ్రహ్మ' అని సంస్కృతం.

రెండైన ఒకటి ఎలా ఉంటుంది? ఒకటి లాగా? ఒకటికి రెండు కొసలు - రెండు గాక ముందు ఒకటి సున్నాగా ఉండేది. సున్నాను చప్టాయించేసరికి పరిధి పరిగెత్తడానికి శక్యంగాక అది ఒకటై సాగిపోయింది. అనిత్యత్వం ఆవహించింది. ఇంకా గట్టిగా మాట్లాడితే అది మూడు కూడా అయింది. ద్వయావధిత్వము + మధ్యమ పరిమాణం. ఈ మూడు పురుడు బోసుకుని త్రిమూర్తులు, త్రిగుణాలు, Electron, Proton, Neutron, సృష్టి స్తితిలయాలు త్రిపుటి త్రికాలాలు, అయి ఊరుకున్నాయి ద్వయావధిత్వం + మధ్యమ పరిమాణంలేని వస్తువు సృష్టిలో లేదు.

యద్వ యావధిత్వం తదనిత్యం।
య న్మధ్యమ పరిమాణం త దనిత్యం॥

సృష్టి ఉనికికి అనిత్యత్వం (పరిణామం) ఒకవైపు బొమ్మగా ఉంటే పరమాత్మ చైతన్యం రెండో వైపు బొరుసుగా ఉంటుంది. ఈ నాణెం యొక్క విలువయే ఆత్మ, అనుభవం, ఆనందం, అనాది, అసలు సిసలు. అజమైనది ఎప్పుడూ అవ్యయమే.

యోగమాయను గూర్చినది బహుసుందరమైన భావస్ఫోరకమైన ఘట్టం. యోగమాయచేత కప్పబడి ఉండడంవల్ల తాను అందటికి ప్రకాశమానంగా ఉండనని పరమాత్మ వచించారు.

ఈ యోగమాయ అంటే ఏమిటి? అదిపరమాత్మనే ఆవరించుకొని ఉంటుం దా? సృష్టిని ఆవహించుకొని ఉంటుందా? పరమాత్మనే ఆవరించుకొని ఉంటుంది అనే పక్షంలో కాంతిని చీకటి ఆవరించుకొని ఉండగలదా? ప్రజ్ఞానచిద్ఘనసారాన్ని అవిద్య ఆవహించుకొని ఉండగలదా? అనే ప్రశ్నలు ఉత్పన్నమౌతాయి? ఏవిధంగా ఆలోచించినా వైజ్ఞానికంగా ఈ ప్రశ్నలకు అనుభవానికి అందివఱకు సమాధానాలు దొరకవు Darkness is condensed light అని ఒక నానుడి ఉంది. దాని ప్రకారం విద్య అవిద్య రెండూ ఒకటే అని చెపుతుంది. విద్య పరమాత్మ అయితే అవిద్య మాత్రం కాదా అంటుంది అమ్మ. వైజ్ఞానికంగా చీకటి చీకటే వెలుగువెలుగే.

ఈ సందర్భంలో పోతన్నగారి పద్యం ఒకటి రంగం మీద దూకుతుంది.

లోకంబులు లోకేశులు

లోకస్థులు తెగిన తుది నలోకం బగుపెన్

జీకటి కవ్వల నెవ్వడు

ఏకాకృతి వెలుగు నతనినే పూజింతున్.

లోకాలూ, లోకేశులూ, లోకస్థులు సమసిన తరువాత ఉండేది అలోకం. ఆ అలోకానికి అవతల పెంజీకటి. దాని కవతల ఏకాకృతిగా వెలిగే జ్యోతీ. ఈ వర్ణనం బహుసుందరంగానూ మనోగహనంగాను ఉంది. కాని సందేహానికి తావు ఎక్కడ వస్తుంది? అంటే, ఈ పూజించే వ్యక్తిలోకంబులు, లోకేశులు, లోకస్థులలోనివాడు కాదా? ఇవన్నీ తెగిపోగా ఇంకా అలోకంలో కూడా అతనికి స్థానం ఉండదా? స్థానం కల్పించుకున్నాడనుకున్నా, అలోకంలోనుంచి ఆవ్యక్తి బయటబడిన తరువాత అక్కడ ఉండే చీకటి అతన్ని మ్రింగేయకుండా మిగులుస్తుందా? చీకటి తెరలను దాటిన తరువాత ఆవ్యక్తి వెలుగును చూచాడనే అనుకుందాం.

లేదా – ఇదంతా లోకాలకు అవతల అంచున కూర్చుని అతడు చేసే మనః పర్యటనమేనా?

కాదు – వట్టి మనః పర్యటనం ఏమాత్రమూ కాదు. ఇవన్నీ ఉండడం పరమ సత్యములే. కాని వెలుగుకున్న స్తరాలన్నీ ఆ వెలుగు నుంచి ప్రసరిస్తున్న వికారాలే. అది లేకపోతే లోకాన్నే చూడలేకపోయి ఉందుం. లోకాన్ని చూచేటప్పుడు ఆలోకమే కనిపించింది. దాన్ని గుతించే మనం అనుకున్నాం. వెలుగును గుతించి అనుకోం. నిత్యమూ సూర్యరశ్మిలోనే బ్రతుకుతున్నా ఎంత మంది ఆ రశ్మిని గూర్చి పట్టించు కుంటున్నారో ఆలోచించండి. ఆ రశ్మివలన జీవరాసులూ, వృక్షాలూ, సమస్త

ప్రపంచాన్ని గూర్చి ఎవడు ఆలోచిస్తున్నాడో గమనించండి. దాన్ని ఆధారం జేసుకుని జరిగే ప్రపంచకార్యాన్ని ఎవడు పట్టించుకుంటున్నాడు? పరిసరాల్లో మనం పట్టించుకోనంత మాత్రాన సృష్టి పరిణామకార్యాలు ఆగిపోతున్నాయా? లోక వృత్తాంతం అంతా వచ్చి మీదబడితే మనుష్యుడు జీవించలేడు. భరించలేడు. పరిమితమైన పరమాత్మ శక్తియే మానవుడు.

అన్ని సృష్ట్యంశాలు. యోగమాయయే. పరమేశ్వరత్వం విడిగా ఉంటే వ్యష్టిత్వం. ఇసుకలో తలదూర్చిన ఉష్ట్రపక్షి ప్రతి సృష్ట్యంశము – ఆ బీజమే చెట్టై విస్తరించితే ఆ అంతా పరమాత్మ. సృష్టిమందిరానికి తలుపుల్లేవు మానవత్వమే తలుపు.

యోగమాయావృతుడనని తానుగా తనను గురించి చెప్పుకున్నారు పరమాత్మ యోగం అంటే పరమాత్మ నిరీక్షణం. ఆ నిరీక్షణం మనపైనపడ్డప్పుడు మన మను కుంటున్నట్లుగా కనిపిస్తాడు. అలా కనిపించే ఘటనా విశేషానికి యోగమని పేరు కనిపించనంతకాలం మనకాయోగం లేదనుకుంటూ వేచి ఉండాల్సిందే. మాయ అనే పదానికి దేశకాల రూపాల బలం అని అర్థం. యోగమూ భగవత్స్వరూపమే. సాక్షాత్కరించేదీ భగవత్స్వరూపమే. అయితే ఈ మాయ ఏమిటి?

మాయ అనే పదం వినగానే శంకరుని వివర్తవాదం, అద్వైత సిద్ధాంతాలు ముందుకు దూకుతాయి. శంకరుని మహావాక్యమైన బ్రహ్మసత్యం జగన్మిథ్యా కొట్ట వచ్చినట్లు వినబడుతుంది. మిథ్య అంటే శూన్యంగాదుగా అన్నదమ్మ. అప్పుడుండి ఇంకో క్షణంలో అదేవిధంగా ఉండకపోవడం. పెరగడం, తఱగడం వంటి ప్రాణ వ్యాపారాలు, స్థానచలనాలు, ఋతుధర్మాలు, ప్రమాదాలు, క్షోభలూ, యుద్ధాలూ, సంస్తంభనలూ, ప్రతి విపరీత సంఘటనా, మార్పును తెచ్చిపెడుతుంది. మానసికం గాను, భౌతికంగాను వచ్చే మార్పులే మాయకు పునాదులు. ఒక్క వాక్యంలో చెప్పా లంటే అసలు సిసలుగా కావడం కన్పించడం యోగమాయ. అంతా కొంతగానే కన్పించడం కూడా. జరగడం కూడా! ఏదీ కాదంటూ అంతా అదేననడం అద్వైతం అన్నదమ్మ. ఏదీకానిది పరమాత్మ – అంతా ఐనది సృష్టి. చెట్టూ దానివ్రేళ్ళూలాగా.

26. వేదా హం సమతీతాని వర్తమానాని చా ర్జున!।
భవిష్యాణి చ భూతాని మాం తు వేద న కశ్చ న॥

తా: అర్జునా! భూతభవిష్యద్వర్తమానాలన్నీ నాకు తెలుసు. నన్ను మాత్రం ఎవడూ తెలుసుకోలేడు.

వ్యా: తెలియబడిన భూతభవిష్యత్తులు వర్తమానంతో సమానమైనవే. పారమార్థికంగా భూతభవిష్యత్తులకర్థంలేదు. ఒకానొక గుర్తు నిశ్చలంగా ఉండగలిగితే దాన్ని బట్టి ముందుండేది భవిష్యత్తనీ, వెనుక ఉండిపోయినది భూతమనీ అనుకోవచ్చు. పరిమితమైన మన మనస్సులను కొంచెం పైకి లాగినా క్రిందికి లాగినా భూత భవిష్యత్తులకు మనం అనుకునే అర్థం సరిపోదనే తెలుస్తుంది. భూమి తన చుట్టు తాను తిరుగుతూ సూర్యుని చుట్టూ తిరగడం వలన రాత్రింబవళ్ళు, సంవత్సరాలు ఏర్పడుతున్నాయి. చంద్రుడు భూమి చుట్టూ ప్రదక్షిణం చేస్తున్నాడుకనుక, ఆ తిరగడాన్ని బట్టి మనం మాసాలను గుణించుకుంటున్నాం. అలాగే సూర్యకుటుంబంలోని గ్రహాలు సూర్యుని చుట్టూ వేర్వేరు దూరాలలో తిరుగుతున్నాయి కాబట్టి వేర్వేరు రీతులుగా కాలగణనం చేసుకోవచ్చు. తప్పేమీ ఉండదు. ఈ క్రమం కొంచెం తారుమారైనా, అన్నీ తప్పుదార్లు తొక్కుతాయి.

వాస్తవానికి కాలానికి గణనలేదు. ఇది రోదసీనౌకల (spaceship) యుగం. ఒక రోదసీనౌకలో ఎక్కి మనం భూపరిభ్రమణ వేగానికి సమానమైన వేగంతో భూమ్యుపరివాయు మండలంలో తూర్పు నుంచి పడమరకు సూర్యప్రకాశంలో ప్రయాణం చేస్తున్నామను కోండి. అప్పుడు రాత్రింబవళ్లు అనే విచక్షణ లేకుండా, సూర్యుడు గుంజకు కట్టిన గుఱ్ఱం లాగా ఒకే చోట తన చుట్టూ తాను గుడుగుడు గుంజాలాడుతూ మనకు ప్రత్యక్షమౌతాడు. నిత్యమూ సూర్యసాక్షాత్కారమౌతున్నది కనుక, రాత్రింబగళ్ళు ఉండవు. గడియారాలు మూలబడతాయి. కాలానికి కాళ్లు తెగిపోతాయి. ధ్రువాలలో ఆరునెలలపాటు రాత్రి, ఆరునెలలపాటు పగలూ ఉండే కుంభకర్ణుని వాసాలున్నాయి. ఇవన్నీ ఎందుకు వివరించానంటే స్థిరంగా ఉంటే విశ్రామస్థానం దొరికితేనే తప్ప తక్కిన చలనాలను గుర్తించడానికి వీలుకాదు. మతిప్రపంచంలో అన్నీ చలించేవే. భూమితోపాటు మనందఱమూ ఇళ్ళతోసహా, మేడలతోసహా, పట్టణాలతోసహా, సముద్రాలతోసహా. హిమాలయ పర్వతాలతోసహా రంగులరాట్నంలో లాగా సూర్యుని చుట్టూ తిరుగుతున్నాం. సూర్యుడు తన చుట్టూ తాను తిరుగుతూ, నవగ్రహాలనూ చుట్టూ త్రిప్పుకుంటున్నాడు. ఒక గ్రహానికి వర్తించే కాలమానం ఇంకో గ్రహానికి వర్తించదు. ఒక గ్రహానికి అయ్యే వర్తమాన వ్యవస్థ ఇంకో గ్రహానికి భూత కాలవ్యవస్థ. ఆభూతకాలవ్యవస్థయే ఇంకో గ్రహానికి భవిష్యత్కాల వ్యవస్థ. కాబట్టి స్థిరమైన పరమ విరామదశగాని, స్థిరమైన పరమ చలద్దశకాని మనకు తెలిసిన సృష్టిలో లేదు. స్థిరమైన పరమచరద్దశలో గ్రహాలు తిరుగుతూ ఉండే యెడల క్రమ క్రమంగా వాటి గతి క్షీణించడానికి కారణం

కనిపించదు, శక్తి ప్రసారమంతా తరంగ వతుగా జరుగుతుందని శాస్త్రజ్ఞులంటారు. విశ్వజీవితం, బ్రహ్మాండ కటాహ పరిణాహ సంకోచాలు కూడా అదేరీతిగా జరుగుతూ ఉండవచ్చు. ఇలా దాని అంతట అదే బ్రహ్మాండ యంత్రాగారం జరిగి పోతున్నదంటే విశ్వాసార్హమైన మాటకాదు. భగవత్సంకల్పంగానే అది మార్పులు చెందుతూ నిరంతరయానం సాగిస్తున్నదనే అనుకోవాలి. ఈ నైరంతర్యంలో, ఈ ఆనంత్యదశలో, భూత భవిష్యత్తులకు స్థానం లేదు. అంతా వర్తమానమే. అంతా చిద్విలాసమే.

భరద్వాజ: నీకు మూడు కాలాలూ వర్తమానమే కదమ్మా!

అమ్మ: అవును.

27. ఇచ్ఛా ద్వేషసముత్థేన ద్వంద్వ మోహేన భారత!।
సర్వభూతాని సమ్మోహం, సర్గే యాన్తి పరంతప!॥

తా: భరతవంశ సంభూతుడవైన అర్జునా! పరంతపా! ఇచ్ఛాద్వేషములవలన ఉత్పన్నములయిన, సుఖ దుఃఖాదిద్వంద్వాల ద్వారా మోహంలో పడి సంసార బంధంలో చిక్కుబడి ఉంటాయి భూతాలన్నీ.

వ్యా: ద్వంద్వాల అలజడి లేకుండా సర్గమూ సంసారమూ ఉండనే ఉండదు. "ద్వంద్వాలే సృష్టికాధారం" ద్వంద్వార్థ డిండిమమే ప్రపంచం, సంకల్పంగా ఏర్పడిన సృష్టిలో సంకల్పం అంశాలు ఎందుకుండకుండాపోతాయి? అనంతమైన శక్తి పరిమిత రూపాన్ని ధరించిననాడు పరిమితమైనవే అయ్యాయి తక్కిన అంశాలు కూడా. విశ్వాంతరాళంలోని ఘటనలన్నీ నడిపించే విద్యుచ్ఛక్తికి నెగటివ్ పాజిటివ్ ఉంటే కాని క్రియాకాండ నడవదు. చుంబకశక్తిని ఉత్తర దక్షిణ ధ్రువాలుంటేనేగాని ఆకర్షణ వికర్షణలు నిలవవు. జగత్తంతా ఎలక్ట్రాను ప్రోటానుల మయం. శక్తి పదార్థాల ఉత్పత్తికి కూడా ద్వంద్వాలుండాలి. ద్వంద్వాల మారురూపాలే శక్తి పదార్థాలు. ఎలక్ట్రాను, పాజిట్రాను అనే ద్వంద్వం ఏకమౌతూ విడిపోతూ, అవతార భేదాల నెత్తుతూ ప్రపంచం అనే ఇంద్రజాలిక ప్రదర్శనను నడుపుతున్నాయి. ఈ శక్తులకు మనస్సుగాని సంకల్పంగాని లేదు. ఈ సంఘటన కంతటికీ వెనుకనుండి వచ్చే ప్రేరణ ప్రకారమే ఈ నాటకమంతా జఱుగుతున్నది.

"భగవంతుడు రచయితా నాటక ప్రదర్శకుడూ వంటివాడు. నాటకానికి పాత్రలంటూ ఉంటేనే కదా అందం" అన్నది అమ్మ. అన్నింటికంటే అందం ఏమిటంటే, ఇందులోని పాత్రలూ భగవంతుడే చూసే ప్రేక్షకులూ భగవంతుడే. గామాకిరణం ద్రవ్యాన్ని విఘట్టితం చేసినప్పుడు, అది పాజిట్రాను, ఎలక్ట్రానులుగా విడిపోతుంది.

పాజిట్రాను అంటే అభావభూయిష్ఠాంశ. ఎలక్ట్రాను అంటే భావజగత్తు. ధనఋణ ప్రేరణలను పుట్టిస్తాయి. అదే ప్రకారంగా భగవంతుని ప్రేరణ ఒకటే. పాత్రల మనస్సులలో ఇచ్ఛాద్వేషాలు అనే రెండు రూపాలౌతుంది. ఇచ్ఛాద్వేషాల క్రియా కలాపం కూడా వ్యక్తులను బట్టి వేర్వేరు రీతులుగా భాసిస్తూ ఉంటుంది. అమ్మయే ఈ రీతులను చక్కని మాటలతో చెప్పింది.

"మంచి చెడ్డల వివరణ ఎట్లా? అది కూడా ఇష్టాయిష్టాల మీద ఆధారపడి ఉంది. ఒకడికి ఇష్టమైనది ఇంకొకడికి అయిష్టంగా వాడి మంచి వీడికి చెడ్డగా కనిపించవచ్చు. అంతేకాదు ఒకడికే ఆ మంచిచెడ్డలు కూడా పరిస్థితులను బట్టీ, కాలాన్ని బట్టీ మారుతూ ఉంటాయి."

మంచిచెడ్డల ప్రమాణత్వాన్ని వేఱొకచోట, చర్చించియే ఉన్నాం, పరిమిత మయిన రూపం దాల్చడంవల్ల వచ్చిన పరిమిత స్వభావాన్ని బట్టి ద్వంద్వాలను గూర్చిన విచక్షణ తారుమారైపోయి అదే మానవత్వమైంది. ఏది చేసినా తానే అను కోవడం ఒకటి – ఏది చేసినా దైవమే అనుకునేది మఱొకటి – ఈ రెండూ దైవత్వ చిహ్నాలే కాని కొంత తనదీ, కొంత దేవుడిదీ అనుకునేది మానవత్వం అయింది. తాను సృష్టిగా మారడంలో వచ్చే భేదాలను హెచ్చుతగ్గులని మాత్రమే గుర్తించుకుంటే వాటినే మంచి చెడ్డలుగా కష్టసుఖాలుగా పుణ్యపాపాలుగా, మానవత్వం చూస్తోంది. ద్వంద్వాలకు ఆధారమైంది దైవత్వం, అయితే ద్వంద్వాలలో నలగడమే మానవత్వ మైంది.

28. యేషా త్వంత గతం పాపం జనానాం పుణ్య కర్మణాం
తే ద్వంద్వ మోహ నిర్ముక్తా భజంతే మాం దృఢవ్రతాః

తా: కాని కొంత మంది పుణ్యకర్మాలను మాత్రమే చేస్తూ పాపాలనుండి విడి వడ్డ జనులు కూడా ఉంటారు. వారు ఈ ద్వంద్వమోహం నుంచి విడివడి దృఢ వ్రతులై నన్ను భజిస్తూ ఉంటారు. ఈ మహాభాగ్యం పరమేశ్వరుని అనుగ్రహం వల్లనే కలుగుతుంది.

29. జరామరణ మోక్షాయ, మా మాశ్రిత్య యతన్తి యే।
తే బ్రహ్మ త ద్విదుః కృత్స్న మధ్యాత్మం కర్మ చా ఖిలమ్॥

తా: ఎవరు నన్నాశ్రయించి జరామరణముల నుండి మోక్షం పొందేంటందుకు ప్రయత్నిస్తారో వారే బ్రహ్మతత్వవిదులు. వారే లెస్సగా అధ్యాత్మవిదులు. వారే అఖిల కర్మాలను చేయడ మెఱిగిన వారూను.

వ్యా: ఇక్కడ జరామరణముల యొక్క నిశ్చయ జ్ఞానాన్ని పొంది, పరమాత్మయే తప్ప మోక్షం ఇవ్వడానికిగాని, దానికై యత్నించడానికైనా, ప్రేరణ ఇవ్వడానికిగాని, ఇంకెవ్వరూ అధికారులు కారనే బుద్ధిని పొంది అనుకూల సమయంలో ఆజ్ఞానాన్ని భగవత్కృపవలన పొందడమే అది వచ్చేదాకా భగవంతుడిచ్చే మేలుకీళ్లను అనుభవించడమే లక్ష్యంగా పెట్టుకొన్నవాళ్ళు కర్మవిదులుగా తెలుసుకునేది.

30. సాధిభూతాధి దైవం మాం సాధి యజ్ఞం చ యే విదుః।
ప్రయాణ కాలేఽ పి చ మాం తే విదు ర్యుక్త చేతసః॥

తా: ఎందుకంటే ఆధిభౌతికంగానూ, ఆధిదైవికంగానూ, ఆధియజ్ఞం గానూ, అన్నింటికీ నేనే ఆధారాన్నై ఉన్నాను, నీరు, ఆవిరి, మేఘం, మంచు ఇవన్నీ ఒకే జల స్వరూపములైనట్లే ఆధిభూత, ఆధిదైవ, ఆది యజ్ఞములకు చెందే అన్ని కర్మలలోనూ అన్ని వ్యవస్థలలోనూ, నన్నే మూలాధారుణ్ణిగా ఏ యుక్తచేతస్కులు గుర్తిస్తారో, వారు మరణకాలమునందు కూడా నన్ను అలాగే పొందుతారు. అంటే భూమిమీద, స్వర్గంలోను, యజ్ఞకాండలోను, వాళ్ళు నన్నే పరమాత్మగా గుర్తిస్తారు. వారి ఆత్మలు పరిశుద్ధములైనవి కనుక ప్రయాణకాలంలో కూడ వారు నన్నే చూడగలుగుతారు.

ఇది శ్రీమన్ మాతృగీతలోని జ్ఞానవిజ్ఞాన యోగమను సప్తమోధ్యాయము.

మాతృగీత

తారకబ్రహ్మయోగము

అష్టమోధ్యాయము

అర్జున ఉవాచ

1. కిం త ద్బ్రహ్మ కి మధ్యాత్మం కిం కర్మ పురుషోత్తమ!।
అధిభూతంచ కిం ప్రోక్తం అధిదైవం కి ముచ్యతే॥

2. అధియజ్ఞః కథం కో౽ త్ర దేహే౽ స్మి న్మధుసూదన!
ప్రయాణ కాలే చ కథం జ్ఞేయోసి నియతాత్మభిః॥

తా: అర్జునుడు పలికెను.

పురుషోత్తమా! ఆబ్రహ్మ ఎవరు? అధ్యాత్మమంటే ఏమిటి? కర్మ అంటే ఏమిటి? అధిభూతమంటే ఏమిటి? అధిదైవమంటే ఏమిటి? ఈ దేహంలో అధియజ్ఞ క్రతువును అనుష్ఠించేవాడెవడు? ఏవిధంగా ఈ యజ్ఞం నిర్వహించబడుతుంది? ప్రాణ ప్రయాణ సమయం దాపురించినప్పుడు నియతాత్ములు నిన్నే విధంగా తెలుసుకోగలుగుతారు?

వ్యా: అర్జునునిచే వేయబడినవి మొత్తం ఏడు ప్రశ్నలు.

అధిభూతం, అధిదైవం, అధియజ్ఞం, ప్రయాణకాలం అనే 4 మాటలను పరమాత్మ క్రిందటి అధ్యాయం ఆఖరు శ్లోకంలో ఉపయోగించి ఉన్నారు. ఆనాల్గింటికి బ్రహ్మ, అధ్యాత్మ, కర్మలనే మూడు మాటలను ప్రసంగాలలో పూర్వం ఉపయోగించిన వాటిని చేర్చి 7 ప్రశ్నలు చేసి పరమాత్మను అడిగాడు అర్జునుడు.

బ్రహ్మ, అధ్యాత్మం. కర్మ, అధిభూతం, అధిదైవం, అధియజ్ఞం, ఇవన్నీ ఒకటి చేసి పైశ్లోకాలలోని మూలభావాన్ని తెలిసేలా విశదీకరించమని పరమాత్మ నడిగాడు అర్జునుడు.

చెఱువులో ఉన్నా, బావిలో ఉన్నా చెంబులో ఉన్నా, కుండలో ఉన్నా సముద్రంలో ఉన్నా, చాకిబానలో ఉన్నా, తరంగంలో ఉన్నా, మింటిమబ్బులో ఉన్నా నీటికి భేదమే మాత్రమూ లేదు. ఆశ్రయాన్ని బట్టి భేదం. వాడుకునేటప్పుడు చెఱువు నీరని వాడుకోం. ఎండిపోయినా చెఱువు చెఱువే. త్రాగనేర్చినవాడు 'ఈ నీళ్ళు చాలా బాగున్నాయి ఎక్కడి వంటే? అని అడిగితే మాత్రం చెఱువు నీరని చెబుతాం. అలాటిదే అర్జునుడి ప్రశ్న కూడా.

ముందు రాగల విశ్వరూప సందర్శనాధ్యాయంలో 'సఖేతిమత్వా' అనేశ్లోకంలో అజ్ఞానం వలన హేకృష్ణా! హేయాదవా! అని నిన్ను పిలిచి ఉంటాను. క్షమించు! అంటాడు. జగద్రూపకంగా ఉన్నా బ్రహ్మాది స్తంబరూపంగా ఉన్నా ఉన్నదొక్కటే. గట్టిగా ఆలోచిస్తే అర్జునుడు వేసిన ప్రశ్నయే దానికి జవాబౌతుంది.

శ్రీ భగవా నువాచ

3. **అక్షరం బ్రహ్మ పరమం స్వభావోఽ ధ్యాత్మ ముచ్యతే।**
భూత భావోద్భవకరో విసర్గః కర్మసంజ్ఞితః॥

తా: పర అంటే దానికంటే పైది మా అంటే లేదని అర్థం. పరమబ్రహ్మము నాశరహితమైనది. శాశ్వతమైనది. ఆ బ్రహ్మం స్వభావమే మనుష్యుడిలో అధ్యాత్మ మనబడుతుంది. కర్మ అంటే భూతభావంగా సృష్టి రూపమెత్తి కనిపించే పరమాత్మ శక్తియే.

వ్యా: పరబ్రహ్మ అంటే నాలుగు చేతులు, మూడు తలలు, సరంజామాతో అట్టహాసంగా లోకంబుల కావలివైపున ఏదో పగటి వేషం ధరించిన వాడి లాగా ఉండేవాడు కాడు. అలా అనుకునే వాళ్లకు అలాగే వ్యక్తంగావడానికి సందేహం లేదు కూడాను. పరమాత్మ ఎలా కనిపించాలనుకున్న వాళ్లకలా కనిపిస్తాడు. ఈ విశేషంలోనే ఉంది పరమాత్మ అక్షరత్వం. అతనికి ఒక రూపం అంటూ లేదు. అతడు అది ఆమె అనే లింగవివక్షతా లేదు. మనస్సే భగవంతుడని యోగవాసిష్ఠం ఘోషిస్తుంది. అన్ని రూపాలూ పరమాత్మవే కనుక ఆయన రూపరహితుడు అన్ని నామాలూ ఆయనవే. కనుక నామరహితుడు. సృష్టే భగవంతుడు. నాశరహితుడైన పరమాత్మనుగా నిత్యమూ మారే సృష్టినెలా అర్థం చేసుకోవాలి? మారడమూ మారక పోవడమూ పరమాత్మ గుణాలే. స్వభావమే. ఇదెలాగా?

సృష్టికి పూర్వంలేదు కనుక సృష్టితోనే సృష్టి అయింది కనుక. సృష్టికి ఆద్యం తాలు లేవు కనుక.

అయినా కార్యకారణ సంబంధంలేనిదే ఆ సంబంధం మనస్సుకు తగిలేలాగా అర్థంకానిదే, పై మాటలను మనం ఒప్పుకోం. ఒకవైపు నుంచి ఏ ఆకారాలు లేని వాడు భగవంతుడని చెబుతూ, అన్ని ఆకారాలూ భగవంతుడే అని చెబితే ఎలా ఒప్పుకుంటాం? అయితే దృష్టిభేదం వికారం కాదని ఒప్పుకోవాలి. ఇద్దఱు ఒకే రీతిగా దేన్ని చూడజాలరని కూడా ఒప్పుకోవాలి. చావులాగా నిర్ణయం తప్పనిదై ఉండాలి. ఆ నిర్ణేత మార్పును తేగలిగి, దానికతీతుడై ఉండాలి. అన్ని శంకలకు

జవాబొక్కటే. ఉండగా ఉన్నది అప్పడం కావచ్చు. అప్పడం చుట్టుకొని పొడుగ్గా కావచ్చు. పొడుగులో అప్పడమూ ఉంది. అప్పడంలో పొడుగు ఉందా? ఉంది. దేనికైనా ప్రయోజనముండాలి కదా? సృష్టి ఎందుకు ఏర్పడింది?

అమ్మ నిప్పెందుకు కాలుతుందని అడిగింది.

దాని స్వభావమన్నారొకరు.

అమ్మ! ఇదీ అంతే నాన్నా! అన్నది స్వభావోధ్యాత్మముచ్యతే. పరమాత్మ భావమే బ్రతికి ఉండడం అధ్యాత్మమంటే. రసాయన రూపంగా కాదు. బ్రహ్మ స్వరూపమే. భూతభావోద్భవకరో విసర్గః కర్మ సంజ్ఞితః - విసర్గమంటే విడిచి పెట్టడం - విడిచి పెట్టడం అంటే తృప్తికలిగేలా పెట్టడం ఎవడువాడు? పెట్టేవాడు కానేకాదు - మరి? తినేవాడు- అన్నం పెట్టడంవల్లనే అది సాధ్యమవు తుంది. ఆకలి ఎన్నో రకాలుగా ఉండవచ్చు. బ్రహ్మ భావంతో ఆకలి తీర్చి స్థావర జంగమ సృష్టికి దోహదమయ్యే లాగా బ్రహ్మభావంతో బ్రతికి ఆకలి తీర్చడమే కర్మ. శాస్త్ర విహిత యజ్ఞదానహోమా త్మక త్యాగమని పూర్వ వ్యాఖ్యాతలు వ్యాఖ్యానిస్తారు.

4. అధిభూతం క్షరోభావః పురుష శ్చాధి దైవతమ్
అధియజ్ఞోఽ హ మేవాఽ త్ర దేహే దేహభృతాం వర॥

తా: కాలగమనంతో మారిపోయే ద్రవ్యమయమైన ఈ పంచభూతమయ ప్రపంచం క్షరమైనది. అందులోని భావమయమైన పరమ పురుషాంశము అధిదైవ తము. దేహధారులలో శ్రేష్ఠుడవైన అర్జునా! దేహధారణమనే యజ్ఞాన్ని నిర్వహిస్తూ, దేహంలో అంతర్గతంగా ఉంటున్న అధియజ్ఞం అనే క్రియాశక్తిని నేను.

వ్యా: పైపైన మాటలను చూచేవాళ్ళకు ఆధిభూతం లేదు. ఆధిదైవతం లేదు. ఆధియజ్ఞం కూడా లేదు అన్నట్లుగా కనిపిస్తుంది పైశ్లోకంలో. కాని పంచభూత మయమైన శరీరం. శరీరంలోని శుక్లశోణితాస్థిమజ్జాదిధాతుద్రవ్యాలు, పంచ భూతాలు కూడి సంకలనమైనదే అది. అలాకావడానికి అయ్యే భావంప్రేరణ పరమాత్మదే. అవన్నీ కలిపి క్రియారూపకంగా అయిన యజ్ఞం కూడా పరమాత్మదే. ఆధిభూతంగా ఉన్న శరీరమూ పరమాత్మే. అధిదైవంగా ఉన్న ప్రేరణా పర మాత్మయే. అధియజ్ఞంగా ఉండే జీవితమూ పరమాత్మే.

'చేసేవాడూ, చేయించేవాడూ, జరిగేపని అన్నీ పరమాత్మయే అంటుందమ్మ.

'యజ్ఞరూపాయైనమః' అని పరాశక్తి నామాల్లో ఒకటి. 'యజ్ఞో వై విష్ణుః' అనే శ్రుతివల్ల సర్వవ్యాప్తమై, 'సర్వస్వరూపాత్మకమై, సర్వధారకమైన విష్ణురూపమని కూడా అర్థం. రహస్యామ్నాయంలో 'ఇంద్రియ ద్వార సంగ్రాహ్యై ర్గన్ధా ద్యైరాత్మ

దేవతామ్' స్వయం భక్త్యా సమారాధ్య జ్ఞాతస్థో౽యం మహామఖః అని ఉంది. ఇంద్రియ ద్వారాలచేత ఆత్మదేవతను భక్తితో ఆరాధించడమే మహామఖమనే నియమాన్ని బట్టి, యజ్ఞమంటే అంతర్యాగస్వరూపమనే అర్థం.

5. అన్తకాలే చ మా మేవ స్మర న్ముక్త్వా కళేబరమ్।
యః ప్రయాతి సమద్భావం యాతి నాస్త్యత్ర సంశయః॥

తా: మరణకాలంలో ప్రాణోద్గమనముహూర్తంలో ఎవడు నన్ను స్మరిస్తూ కళేబరాన్ని విడుస్తాడో వాడు నా భావాన్ని పొంది నన్ను చేరుకుంటాడు. ఇందులో ఏమీ సంశయం లేదు.

వ్యా: ప్రపంచయాత్రలో ఎన్నెన్ని విజయాలు సాధించినా చివరకు మరణాన్ని ఎదుర్కొక ఎవరికీ తప్పదు. ఇది జగన్నాటకానికి పాత్రయైన ప్రతి జీవితమూ ఒక్కొక్క అంతర్నాటకం లాంటిదే. ఈ వ్యక్తుల అంతర్నాటకాలన్నీ కలిసి బృహజ్జగన్నాటకంగా నడుస్తూ ఉంటుంది. ఈ పెద్ద నాటకానికి నాందీ ప్రస్తావనలుగాని, భరతవాక్య స్వస్తి వాక్యాలుగాని ఉండవు. బ్రతికి ఉన్నప్పుడు తాను సభా నాయకుడై తన అంతర్నాటకాన్ని నడుపుతూ, ఇతరుల అంతర్నాటకాలలో కూడా పాత్రధారియై ప్రతి మనుష్యుడు నటిస్తూ ఉంటాడు. కథానాయకుడై తాను నటించిన తన పాత్ర తన అంతర్నాటకానికి ఎంత అనుకూలమై అవసరమై ఉందో ఇతరుల అంతర్నాటకాలలో తను నటించిన పాత్రలకు అంతే అవసరమూ ప్రాధాన్యతా ఉంది. నాటకానికి పాత్రలంటూ ఉంటే కదా అందం. ఏ పాత్రకు ఆ పాత్రే అవసరం అంది కదా అమ్మ. ఈ అంతర్నాటకాలలో అందం ఏమిటంటే ఇతర అంతర్నాటకాలలో తాను ధరించిన పాత్రలకు, తన అంతర్నాటకంలో తాను ధరించిన కథానాయకుడి పాత్రకూ అవినాభావ సంబంధం, భేదం ఏమీలేదు. కాని కథానాయకుడి పాత్ర ముగిసిపోవడంతో తన అంతర్నాటక రంగం మీదనయితే తెరపడవచ్చును. కాని ఇతరుల అంతర్నాటకాలు ఇంకా సాగుతూనే ఉండవచ్చును. భలే అందమైన ఏర్పాటు. దీనికి ఇంటర్వల్ అంటూ లేదు.

నాటక రచయితయే ఆ పాత్రను నటించినప్పుడు పాత్ర తాలూకు విభావాను భావాలను రచయితగా కాకుండా పాత్రకు సహజంగా ఉండేట్లాగే నటిస్తాడు.

అనాది - నా ఆది - నాది అంది అమ్మ రంగం మీద ఉన్నప్పుడు నవరసాలూ నటిస్తాడు. నిజానికి బాధలూ సుఖాలూ అనుభవిస్తాడు. అది పూతపూసిన వాసనలతో సతమతమౌతాడు. మనసుకున్న ఆభిజాత్యాన్ని మఱిచిపోయి బ్రతికి ఉండగానే

చచ్చిపోతాడు. శరీరం కూడా రాలిపోవడానికి తరుణం వచ్చిన ముహూర్తంలో, 'మామేవ స్మర' ఈ మాట అతనికి సాధ్యమైన విషయమేనా? అంతవరకు ఏ అవిలంఘనీయమైన ప్రేరణకు లోబడి అతని జీవితం నడిచిందో దానికే లోబడి అతని కళేబరమూ కడతేరుతుంది. పరమాత్మను గుఱించి బ్రతికి ఉండగానే అను కోవడం పడదు. చచ్చేటప్పుడిక చెప్పాలా? అలాగా అని ఎవరూ మరణకాలంలో పరమాత్మను స్మరించరా అంటే, తప్పక స్మరిస్తారు. ఆ క్షణంలో పరమాత్మ ఎవరిని గూర్చి అనుకుంటాడో అతడు పరమాత్మను గూర్చి కూడా అనుకుంటాడు. పర మాత్మ అనుకుంటేనే మనమూ అనుకోడం.

అయితే కళేబరాన్ని విడిచిపెట్టిన వ్యక్తి తరువాత ఎక్కడకుపోతాడు? మద్భా వాన్ని పొందుతాడు. అని పరమాత్మయే చెప్పాడు. మద్భావం అంటే ఏమిటి?

6. యం యం వాపిస్మరన్ భావం త్యజంత్యన్తే కళేబరమ్।
తం త మే వైతి కాన్తేయ! సదా తద్భావ భావితః॥

తా: కౌన్తేయా! పరమాత్మ ప్రేరితుడై నిత్యమూ ఎవరెవరిని గూర్చి తలపోస్తూ చావుగడియల్లో కూడా ఎవరిని గూర్చి తలపోస్తూ, చావు గడియాల్లో కూడా ఎవరిని స్మరిస్తూ, కళేబరాన్ని విడుస్తాడో, ఆయా వారలనే నరుడు పొందుతాడు.

వ్యా: ఇక్కడ ఒక సందేహం రావచ్చు. కళేబరం విడిచిపెట్టిన తరువాత కూడా వ్యక్తికింకా మిగిలేదేముంది? ఎవరినైనా ఎలా పొందుతాడు?

"ప్రాణం పోతుందంటారే! ఎక్కడకు పోతుందమ్మా!" అని అడిగిన ప్రశ్నకు అమ్మ ఒకసారి

"ఎక్కడకు పోతుందీ? అక్కడే ఉంటుంది? ఎక్కడకూ పోదు. టైరు ఉన్న దనుకో! అమ్మా! దానిలో గాలిపోతే ఎందులో కలుస్తుందీ? గాలిలోనే కలుస్తుంది. ప్రాణమూ అంతే! ఉన్నదంతా అదే కనుక అందులోనే కలిసిపోతుంది.

అయితే ప్రాణం ప్రాణంలో కలిసిపోతే వ్యక్తికుండే కాపీనాలూ. తాప త్రయాలూ, వాడు నిత్యమూ భావించిన లంపటలూ వీటికే మళ్ళీ అతడు చేరు కుంటాడని కదా శ్లోకం చెబుతున్నది. ఇదెల్లా అన్వయిస్తుందంటే

ప్రాణం పీకుతున్నదని తెలుగులో నానుడి ఉంది. కామక్రోధలోభమోహ మదమాత్సర్యాలు దేహాన్ని అంటిపెట్టుకొని ఉండేవే కాని, ప్రాణాన్ని, ఆత్మను అంటి పెట్టుకొని ఉండవు. అవి భూజలాగ్నివాయుధాతు ప్రేరితాలై, స్వయంప్రబుద్ధాలై, అన్యప్రోద్ధుతాలై బయటి కుబుకుతాయి.

గంజాయి త్రాగితే పిచ్చిమాటలు వస్తాయి. కాంథారిస్‌ని త్రాగితే కామోద్రేకం కలుగుతుంది. సూర్యకిరణాల ద్వారా, రసాయనిక ప్రేరణలు వృద్ధి అవుతాయి. ఆలోచనల ద్వారా, కూడా రసాయనిక ప్రేరణలు వృద్ధి అవుతాయి. ఆలోచనల ద్వారా వాసనలు పెరుగుతాయి. ఆ వాసనలు అలవాట్లను తెచ్చిపెడతాయి. శరీరం దాన్ని కప్పుకొని అలవాటు ప్రకారం నడవడం నేర్చుకుంటుంది.

ప్రాణం రాలిపోగానే దాన్ని పాతిబెడితే, లేక తగలేస్తే, ఆయా సూక్ష్మజీవుల కాహారమై ఆయా కణాలతోబాటు వాసనలను కూడా మోసుకుపోతాయి. విశ్వ సామగ్రితో ఏకమవుతాయి. తగలేస్తే వాయు కణాలలో అవి చేరిపోతాయి.

ఉదాహరణకు గంధకంలో లోభాన్ని వృద్ధి చేసే గుణముంది. వడ్డీ వ్యాపారాలు, చేసి ఆలుబిడ్డలకు అన్నం పెట్టక వరవిక్రయంలో సింగరాజు లింగరాజులాగా బ్రతికాడనుకోండి. జీవరసాయనిక సూత్రాల ప్రకారం వాడి శరీరంలో గంధకం ఎక్కువగా ఉంటుంది. మట్టిలోగాని మంటలోగాని ఆ శరీరం కలిసిపోతే లోభానికి స్థానమైన ఆ శరీరంలోని గంధకం. పంటల్లోనూ, ఎరువుల్లోను, క్రియల్లోను చేరిపోయి ఆహారంగా మారి, ఇతర జంతువులలో మనుషుల్లో ప్రవేశిస్తుంది.

7. తస్మాత్సర్వేషు కాలేషు మా మనుస్మర యుధ్యచ,
మయ్యర్పిత మనో బుద్ధిః మామేవైష్య స్యసంశయః॥

తా: కాబట్టి అర్జునా! సర్వకాల సర్వావస్థల యందు నన్నే స్మరిస్తూ, మనో బుద్ధులను నాకే సమర్పించి, (జీవిత) యుద్ధం చెయ్యి. నిస్సందేహంగా నీవునన్నే పొందగలవు.

వ్యా: సర్వేషుకాలేషులోనే చేరుతుంది, అంతకాలేష అనే మాట. జీవితమనేదీ పరమాత్మ మనచేత చేయిస్తున్న అభ్యాసం. దీన్ని త్రెంచుకుని ఎక్కడకూ పోలేము. కనుక ఇది సాధ్యమైనది. పరమేశ్వరుని కంటే ఇంకోటి లక్ష్యంగాకపోవడం నాన్య గామినీత్వం.

సర్వేషుకాలేష అంటే ఏమిటో తెలుసుకోవాలి. దేశకాలాలను గురించి ఎక్కువగా ప్రస్తావించుతాం. దేశకాలాలులేని అనాది అంటూ ఉంటుందా? ఊరికే మనస్సు భ్రమించినట్లు అలా వ్రాస్తారుగాని పరిమితభావాన్ని మనస్సు విడిచిపెట్టగలదా? నిత్యమూ ఉండే దానికి పరిమితత్వాన్ని మనస్సే కల్పించుకుంటుంది. కాబట్టి మనస్సుకందినంత వరకు దేహమున్నంతదాక అని అర్థం చెప్పుకోవాలి.

8. అభ్యాస యోగ యుక్తేన చేతసా నాన్యగామినా।
పరమం పురుషం దివ్యం యాతి పార్థా నుచింతయన్॥

తా: పార్థ! పెడత్రోవలు బట్టకుండా ఉండే మనస్సుతో పరమాత్మ అనుగ్రహ మనే అభ్యాసయోగం అబ్బినవాడు దివ్యమూ పరమోత్తమమూ అయిన పరమ పురుషప్రాప్తి లభించిన వాడౌతాడు.

వ్యా: అభ్యాసయోగం అనే మాట చాలా మోహజనకమైనది. ఎందుకంటే అభ్యాసమంటే ప్రాణాయామ ప్రత్యాహార నిదిధ్యాస సమాధ్యవస్థలు, కేవలం సాధనతో లభించే సామగ్రి అని పరంపరగా అనూచానంగా దిగుమతి ఔతున్న ఉపదేశం.

'మనస్సుకుండే తెగులే అన్యగామినత్వం. అందఱూ అమ్మ దగ్గఱ అనే మాటే అది. లక్ష్యం కుదరడంలేదంటారు. లక్ష్యం కుదరకపోవడమే దేవుడనుకోమంటుం దమ్మ. వ్యాఖ్యాతలయితే ఫలప్రాప్తికి పురుష ప్రయత్నమే కారణమంటారు. వెనకటికి లక్ష్యం ఏకాగ్రత కుదరాలంటే కోతిని తలుచుకోకుండా ఉంటేసరి అని సలహా ఇచ్చారట. కళ్ళుమూసుకుంటే కోతియే ప్రత్యక్షమౌతూ ఉండేదట. అలాటిదే పురుష ప్రయత్నం కూడా.

యోగం సాధకుడు తెచ్చుకునేది కాదు, చేసేవాడు వాడైనా లక్ష్యశుద్ధి పర మాత్మచేత ఇవ్వబడ్డది. అది సమకూడిన వాడికి రామకృష్ణపరమహంసలాగా కఱ్ఱ లతో కొట్టినా మెళుకువరాదు. "యమేవైషవృణుతే తేనలభ్యః" అని ఉపనిషత్తు. భగవంతుడెవడిని వరిస్తాడో అతని చేతనే అది పొందబడుతుందని అర్థం. "చూస్తే కనపడను, కనబడితే చూస్తారు." అమ్మ

9. కవిం పురాణ మనశాసితారం
అణో రణీయాంస మనుస్మరేద్యః।
సర్వస్య ధాతార మచింత్య రూప
మాదిత్య వర్ణం తమసః పరస్తాత్॥

కవీ, సర్వజ్ఞుడూ, అనాది, సర్వ నియంతా అణువుల కంటె అణుతరంగా ఉండి కూడా ఈ అనంత జగత్తును పాలించి, పోషించి భరించేవాడూ, అచిన్త్య రూపుడూ, సూర్యసదృశ నిత్య చైతన్యస్వరూపుడూ, అంధకారమూ, దాని కవతలి వాడూ అయిన పరమాత్మను (పొందుతాడు అని క్రింది శ్లోకంతో అన్వయం)

10. ప్రయాణకాలే మనసాఽచలేన
భక్త్యా యుక్తో యోగబలేన చైవ।
భ్రువో ర్మధ్యే ప్రాణమావేశ్య సమ్యక్
స తం పరం పురుష ముపైతి దివ్యమ్॥

తా: భక్తియుక్తుడై (ఏ నరుడు) అంతకాలంలో యోగబలంతో భ్రుకుటి మధ్యంలో లెస్సగా ప్రాణాన్ని నిలిపి, అచలమైన మనస్సుతో (పరమాత్మను) స్మరణ చేయ గలుగుతాడో అతడు దివ్యస్వరూపుడైన పరమపురుష పరమాత్మను పొందుతాడు.

వ్యా: పై రెండు శ్లోకాలకూ మనుష్యుని బుద్ధ్యాత్మ జ్ఞానానికి, సృష్టి యొక్క అనుపానులకూ చాలా సంబంధం ఉంది. అధ్యాయం మొదటి నుండి ప్రాణ ప్రయాణ కాలాన దేహి దేన్ని భావిస్తూ శరీరం చాలిస్తాడో, తదను రూపమైన వికారాన్ని పునర్జన్మను పొందుతాడు. అనే విషయం చెప్పబడుతూ వస్తున్నది. దీనిని గూర్చి అమ్మ నామనస్సులో సృష్టించిన భావాలను కూడా అక్కడక్కడ లోగడ వివరించి ఉన్నాను. మళ్ళీ ఈ విషయాన్ని అవలోడనం చెయ్యగా బాదరాయణోపనిషత్తులో కూడా పైఅభిప్రాయాలే నిరూపితాలయి ఉన్నట్లు కనిపించింది.

బాదరాయణుని ప్రకారం "తెలిసిన వాడికి పునర్జన్మ ఆభాసమాత్రమే. సర్వే సర్వత్ర, సర్వధా పరమాత్మ బహిరంతరాలలో ఆకాశవతుగా పరివ్యాప్తుడై ఉంటూ ఉండగా ఎక్కడ నుండి ఎక్కడకు ఈ జీవాత్మ ప్రయాణిస్తుందనుకోవాలి? ఆత్మ నిత్యమూ, సనాతనమూ, అయినది కదా! పరమాత్మ స్వరూపమయినవాడు, పరమాత్మ అంతస్థు నుండి దిగజాఱడు కదా! అతనికి ప్రచ్యుతి ఉండని యెడల ఇంకో చోటికిపోవడంలో అర్థం ఏమిటి? కాబట్టి జనన మరణాలు శాబ్దికమైన మోహమే కాని వస్తుతః వాటికి ఆధ్యాత్మికమయిన అర్థం లేదు. ఈ విషయమే పై ఆఱవ శ్లోకంలో కూడా చెప్పబడింది. వ్యాఖ్యాతలైతే కుక్కను తలుచుకుంటూ చస్తే కుక్కైపుడతాడని, పిల్లిని తలుచుకుంటూ చస్తే పిల్లైపుడతాడనీ వ్రాస్తారు. కాని తద్భావభావితః అనే మాటకు అర్థం స్వతస్సిద్ధంగా ఉండే భావమనే అర్థం. స్వతస్సిద్ధంగా అగ్నికి కాల్చే గుణం ఉంది. ఆ స్వభావం దాన్ని విడిచి ఇంకో చోటికి పోదు. అగ్నితోనే ఉంటుంది. దహనగుణం మంచుగడ్డలో ఉన్న అగ్నికి కూడా ఉంటుంది. అలాటిదే తద్భావభావత్వం. ఆ శరీరానికి, ఆ శరీరాన్ని నడిపిన ప్రేరణకు ఏది స్వభావమో ఆస్వభావంలోనే అవి చేరిపోతాయని భావార్థం.

ఎనిమిదవ శ్లోకంలో పరమాత్మ కవిగా చెప్పబడినాడు. రమణీయార్థాన్ని

నెమరు వేసుకుంటూ పరమాత్మ కవిఔతాడు. కవి ఐ ఈ సృష్టికార్యంగా కూడా ఔతాడు. అమ్మ కంటే కవి ఎవరు?

'మూడడుగుల మనిషినే సముద్రమంత ఆశతో బ్రతుకుతూ ఉన్నాను. ఆ ఆశలో నుండి అసంతృప్తి అనే అలలు లేచి పడేస్తున్నాయి.'

అని త్రివిక్రమావతారాన్ని ప్రదర్శించి,

'అన్ని నేనులలోనేనైన నేనై' అనే శబ్దస్ఫోటతో శబ్ద బ్రహ్మ కృతిని దాల్చి, నేను వాననా, నేను కురవనా అనే మాటలతో మూగవాన నోరు తానై పలికి, సృష్టి కంటే మహిమ ఏముంది? అని పలుకు పలుకులోనూ తన కావ్యాత్మను ప్రదర్శించే అమ్మ కంటే,

మీరంతా నా అవయవాలు అనుకుంటాను. మీరు కానిది నేనేమీ కాదు. అనే రసమయి అయిన అమ్మకంటే ఇంకో కవయిత్రినిగాని కవినిగాని ప్రత్యక్షంగా ఆధ్యాత్మికత్వానికి నిదర్శనం ఎవడిని చూపగలం?

పురాణం: పురాణం అంటే పురానవం ఎంత పురాతనంగా ఉన్నా, ఎప్పుడూ క్రొత్తగా ఉండే వాడని అర్థం. నిత్యనూతనత్వంలో పురాతనత్వమును చూడగలగడమే కాలాతీత, దేశాతీత దృష్టి –

సూర్యుని వయస్సెంత? సూర్యుడు పాతబడినదెప్పుడు?

అనుశాసితారం: సర్వజ్ఞత్వం, సర్వనియంతృత్వం, సర్వత్వమూ, మూడూ పరమాత్మ లక్షణాలు, సృష్టి అనాది. ఎవరిదో కాదు – నాదే. నేను ఏమన్నా కాస్త తొణికానంటే నీ పని ఏమవుతుంది. ఉదా చంద్రంగోళం ఒక మిల్లీమీటరు భూమికి దగ్గఅగా జటిగిందంటే మహాప్రళయం ఆసన్నమౌతుంది.

'అమ్మ సృష్టిని కూడా ఇలాగే అల్లారో?' అమ్మ అన్నది నవ్వి

'అల్లు కుంటున్నాను. పువ్వులు ఉన్నాయి కదా ఎదురుగా–కూర్చోవడం ఎందుకులే? అని"

అణోరణీయాన్ మహతోమహీయాన్
ఆత్మాస్య జంతో ర్నిహితో గుహాయాం
తమక్రతుః పశ్యతి వీత శోకో
ధాతు ప్రసాదా న్మహిమాన మాత్మనః

అనే ఉపనిషద్వాక్యాన్ని గుర్తుకు తెస్తుంది ఈ మాట.

అణువు కంటె కూడా చిన్నవాడు పరమాత్మ అంటే అంతకంటె చిన్నా, ఇంకా

అంతకంటె చిన్నా, ఎంత అనుకుంటే -అంతకంటె చిన్న- అనే అనవస్థ ఏర్పడుతుంది. అలాగే ఎంత పెద్దదనుకుంటే అంతకంటే, అంతకంటే. అంతకంటే పెద్దది పరమాత్మ అనే అనవస్థ కూడా ఏర్పడుతుంది. పరమాత్మను కొలిచే లఘిమలు, గరిమలు లేకుండాపోతాయి. అది అలా పెరుగుతూ తరుగుతూ సాగిపోతూనే ఉంటుంది. బిందుస్థానం యొక్క వికాస సంకోచాలకు అంతుండదు. అన్నిచోట్లా అదే అయి ఊరుకుంటుంది. శక్తిరూపం దాల్చి ఉన్నదే అదవుతుంది.

సర్వస్యధాతారం - అచింత్యరూపం

అన్నింటికి కారణ రూపుడూ, మనస్సుతో అర్థం చేసుకోడానికి వీలు కానివాడు.

నాకు మా అమ్మ కారణం. మీకు మీ అమ్మ కారణం. అంటే అర్థం అయ్యే మాటే కాని మీరందఱూ ఇక్కడే పుట్టారు. మీ తల్లులకు నేను పెంచుకోడానికిచ్చాననే మాట ఎలా అర్థమౌతుంది. అర్థం కావడానికి అమ్మలాగా కావాలి. అర్థం అయ్యే శక్తిని పరమాత్మ ఇవ్వాలి. 'అమ్మలగన్న యమ్మ అన్నారు పోతరాజుగారు. సర్వస్య ధాతారమనే మాటకదే అర్థం. అచింత్యరూపం అంటే భావించడానికి సాధ్యంకాని రూపం. పెద్ద పెద్ద వేదాంత పరిభాషల దాకా పోనక్కరలేదు. మన భావనాశక్తి ఎంతలో ఉంటుందో చూడండి.

ఎఱ్ఱని చీకటి, పచ్చని చీకటి, తెల్లని చీకటి, భావించి చూడండి. ఎలా ఉంటుందో, అలాగే పుల్లని ధ్వని, చప్పని ధ్వని, ఎలా ఉంటాయి? (చప్పగా మాట్లాడాడు. తియ్యగా మాట్లాడాడు) చేదుమాటలు. అలంకారప్రయోగాలకివి ఉపయోగిస్తాయి. సాక్షాదనుభవానికి కాదు. అలాగే ఒక కొండ నాలుగు వైపులూ, దాని అంతర్రాంతరాలూ, అన్నీ కలిసిన సమవాయి అసమవాయి సంబంధాలకతీతమయిన - స్ర్కాండింజరు - చెప్పిన ఛాయాస్వరూపం యొక్క సార్వత్రిక భావనను ఆకళించుకోడానికి ప్రయత్నించండి. నిన్నటి రేపులో, రేపటి నిన్న ఎలా కలిసి ఉందో ప్రత్యక్షంగా చూడడానికి యత్నించండి. అమ్మకయితే అంతా నిన్నటి రేపే. రేపటి నిన్నే. ఆ బాధ అక్కడ ఉండదు.

మన బుద్ధి దేశకాల మాన పరిమితమైనది. ఒకే క్షణంలో అమ్మనాలు గిండ్లలో కనిపించిందంటే విస్తుబోతాం మనం.

"అజాయమానో బహుధా విజాయతే" అని పురుష సూక్తం చెబుతుంది. మారేది కొంతగా ఉందా - కొంత మారనిదిగా ఉందా - ఈ రెంటికి Ratio ఏమిటి? అంటూ జిజ్ఞాసచేసే గణిత ఖడ్గాలకు తెగేది కాదిది. అంటే పరమాత్మ

చైతన్యం. ఊహకందేదంతా రూపమే అవుతుంది. మారని అనూహ్యామైన పరమాత్మ అంశాన్ని ఊహతో కొలవడానికి సాధ్యంకాదు.

అజాయమానుడై ఎలా ఉండగలడు? అని ఏర్పడిన ప్రశ్నకు 'బహుధావిజాయితే' సమాధానమవుతుంది. వెంటనే ఇప్పటిలాగా రెండూ లేక మూడు అనే కుటుంబ నియంత్రణ లేదు కాబట్టి పరమాత్మ అన్నీ అయి ఊరుకున్నాడు. దానికి లెక్కలేదు. తప్పుడు జనాభా లెక్కలు లేవు. శేషాలు, కొసర్లు, మిగుళ్లు ఉంటేగా? సృష్టికి, సాగిపోవడమే తెలుసు. పూర్ణత్వమే దానికి తెలుసు.

అదిత్యవర్ణం: సూర్యుని కాంతి లేకపోతే భూమి మీద ఈ సృష్టి కూడా లేదు. ఈ సృష్టి మారురూపుతో ఉన్న సూర్యరశ్మియే. ఇది సైన్సు ఒప్పుకున్నమాటే! మనలో ఉన్న ఎముకలూ కండలూ, రక్తమూ వాయువూ ప్రాణమూ అన్నీ సూర్యరశ్మియే. సందేహం లేదు. ఆదిత్యుడంటే మనకు కన్పించే సూర్యభగవానుడు ఒకడే కాడు. ద్వాదశాదిత్యులను గూర్చి పురాణాలు చెప్పాయి. అనంతసంఖ్యాకములైన సూర్య మండలాల అంతర్గతుడైన పురుషుణ్ణి వర్ణించాయి. ఆదిత్యమండల జాలాన్ని గూర్చి సైన్సు చెబుతుంది. అతని వికాసమే సూర్యరశ్మి. ఈ కాంతి సహాయంతోనే మనను మనము చూచుకొని ఇతరులను చూడగలుగుతున్నాం. దీని సహాయం వల్లనే నీవు నేను అనే భేదాన్ని కూడా కల్పించుకోగలుగుతున్నాం. కాంతి సహాయంవల్లనే నీవు లేని నేను కూడా గుర్తించగలుగుతున్నాం.

వస్తువులకు నీడలున్నాయి కనుకనే అవి అనేకంగా కనిపిస్తాయి. చుక్క వెలుగు కూడా లేని చీకటిలో నాలుగు దుంగలను ఎడమెడంగా నిలిపి చూడండి. బహు వచనంలో ఉంటాయో ఏకవచనంలో ఉంటాయో - అసలు వచనమంటూ ఉంటుందో ఉండదో మనతరపు నుంచి అలాగే క్రిందా పైనా ప్రక్కలా మెఱుపు కాంతినిండి ఉన్నచోట కూడా ఇదే. అభేదభావం కనిపిస్తుంది. అందులో కూడా నాలుగు దుంగలూ తమ సంఖ్యాభావాన్ని విసర్జించుకొని కాంతితో లీనమౌతాయి. అలాటిదే అమ్మ అవే అన్ని నేనులూ నేనైన నేను. ఎవరో ఆ మాట కర్థమేమని అడిగితే అమ్మ 'నీవు లేని నేనని' సమాధానం చెప్పింది.

ఆ మాటలో చివరకు మిగిలే ఒక నేను ఏదో మిగిలిపోతున్నట్లూ, ఒక గుర్తు మిగిలిపోతున్నట్లూ మనకనిపిస్తుంది. ఈ మిగిలే దాని స్వరూపభావాలేమిటి? అని కొందఱు చర్చించారు. అందులో మిగిలేది ఆదిత్య వర్ణమే. దానిలో గుర్తంటూ ఎక్కడా దొరకదు. ఎందుకంటే దాన్ని గుర్తించేవాడు ఇంకొకడెవడూ ఉండడు కాబట్టి. ఆనంద ఘన, ప్రజ్ఞానఘనములకు ఒక చోటంటూ ఉండదు. ఒక గుర్తు అంటూ ఉండదు.

తమసః పరస్తాత్

ఈ మాటలకు చీకటి కంటె అవతల అంటే చీకటికి ముందున్న వెలుగు అని అర్థం. అయితే చీకటి అంటే ఏమిటి? అని ప్రశ్నించుకుంటే సాదృశ్యపర్యాయంగా ఛాయ, నీడ అనే ఒక ఊహ ఏర్పడుతుంది మన మనస్సులలో రోదసీ నౌకా యాత్రలు జరుగుతున్న ఈ దినాల్లో భూమిని విడిచి చంద్రలోకానికి పోయేదారిలో ఛాయలు లేని ప్రదేశాల నుండి కూడా ప్రయాణం సాగుతుంది. అక్కడ అగమ్యత్వం, మనస్సులో అంధకారం తప్ప ఏ అంధకారమూ ఉండదు. మనం నిత్యమూ కళ్ళు మూసుకుంటే కనిపించని చీకటి నిజానికి చీకటి కాదు. ఆ చీకటిలో పిల్లి, పులి, గ్రుడ్లగూబ చక్కగా చూస్తాయి.

మనకేది చీకటో, ఇతర జంతువులకు కాకపోవచ్చు. దూరదృష్టి, మనోదృష్టి కలవాళ్ళకు చీకటి లేకపోవచ్చు. ఘనీభవించిన వెలుగే చీకటి అనుకుంటే నయన వ్యాపారంకాక చీకటి అంటే అవిద్య అవుతుంది. ఒళ్ళంతా కాంతి అయిన మిణు గురు పురుగూ కొన్ని సరీసృపాలూ, చీకటి నీ ప్రాణాన్ని ఏకంచేసి చూపిస్తాయి. వెలుగుతో చీకటిని, జ్ఞానంతో అజ్ఞానాన్ని వెదకలేం. చీకటి వేటలో పరిహరించ బడేది భగవదనుగ్రహం, దురదృష్టం. "సత్యమంతా భగవంతుని స్వరూపం అను కున్నా అసత్యమూ వాడిది కాకుండాపోదు" అన్నది అమ్మ.

అటువంటి పరమ పురుషుణ్ణి, చిరకాల నిరంతరాదరాలతో కూడిన భక్తితో ఆయన అనుగ్రహం బలంగా చేసుకుని కొలుస్తూ, ప్రాణప్రయాణకాలంలో తదేకదీక్ష వలన స్వేదమలిన శ్లేష్మపిత్తాది కాలరూపంగా అరిషడ్వర్గాలన్నీ బహిర్గతాలై కాల క్రమాన క్షాళితాలు కాగా, అంతర్ముఖత్వం వహించిన దృష్టి ప్రాణాన్ని భ్రుకుటి మధ్యంలో నిలిపి ఉంచగా, పరమేశ్వర ప్రేరణ వలన పరమాత్మను స్మరిస్తూ ప్రేయో మార్గాన శరీరాన్ని విడిచి ఆ వ్యక్తి పరమ పురుషునిలో లీనమౌతాడు.

11. య దక్షరం వేదవిదో వదన్తి విశన్తి యద్యతయో వీతరాగాః।
యదిచ్ఛన్తో బ్రహ్మచర్యం చరన్తి తత్తేపదం సంగ్రహేణ ప్రవక్ష్యే॥

తా: వేదవిదులు దేనిని ఓంకారాత్మకంగా వచిస్తారో, వీతరాగులైన మహా త్ములు, దేని యందు ప్రవేశించడానికి ప్రయత్నిస్తారో, దేనిని మనస్సునందుంచుకొని ముముక్షువులు బ్రహ్మచర్యాన్ని అవలంబిస్తారో ఆ పరమ పదాన్ని గూర్చి నీకు సంక్షేపంగా చెప్పుతాను.

వ్యా: ఒకానొక అనర్ఘస్థానముంది. అందులో ప్రణవనాదం మ్రోగుతూ ఉంటుందని వేదవిదులంటారు. రాగద్వేషాలు లేనివాళ్లు అందులో ప్రవేశించడానికి నిత్యం ప్రయత్నిస్తుంటారు. మిగతావాళ్ళు ముముక్షువులు దాన్ని చేరి బ్రహ్మచర్యాన్ని పాటిస్తారు. బ్రహ్మచర్యం అంటే బ్రహ్మలోచరించడం. దాన్ని గురించి టూకీగా చెప్తాను. విను.

12. సర్వద్వారాణి సంయమ్య మనో హృది నిరుధ్యచ।
మూర్ధ్న్యాధాయాత్మనః ప్రాణం ఆస్థితో యోగధారణామ్॥

తా: ఏ మనుష్యుడు అవసాన కాలాన యోగాన్ని అవలంబించినవాడై, అన్ని ద్వారాలను సంయమింపజేసికొని ఆత్మలో మనస్సును, హృదయాన్ని లయింపజేసి కొని మూర్ధస్థానానికి ప్రాణాన్ని చేర్చి

13. ఓమిత్యేకాక్షరం బ్రహ్మ వ్యాహర మా మనుస్మరన్।
యః ప్రయాతి త్యజన్ దేహం స యాతి పరమాం గతిం॥

తా: "ఓమిత్యే కాక్షరం బ్రహ్మ" అని ఉచ్చరిస్తూ, ఆ మాటల కర్థ స్వరూపుడనైన నన్ను స్మరిస్తూ శరీరత్యాగం చేస్తాడో అతడు ఉత్తమోత్తమమైన గతిని పొందుతాడు.

14. అనన్యచేతాః సతతమ్ యో మాం స్మరతి నిత్యశః।
తస్యా హం సులభః పార్థ! నిత్యయుక్తస్య యోగినః॥

తా: అనన్యచేతస్కులై ఎవరు నిత్యమూ (భగవదనుగ్రహంచేత) నన్ను అవిరామంగా స్మరించుతూ ఉంటారో, అర్జునా! అటువంటి నిత్యయుక్తులైన యోగులకు నేను సులభంగా లభిస్తాను.

వ్యా: భగవంతుడు మనయెడల ప్రసన్నభావంతో ఉన్నాడనేది ఎలా తెలుస్తుంది?

"నేను మిమ్మల్ని ఎప్పుడూ చూస్తాను. కానీ నేను చూస్తున్నాననేది మీకు ఎప్పుడు అర్థమవుతుందంటే మీరు చూస్తున్నప్పుడు నేను చూసినట్టు కనిపించినప్పుడే."

ఈ కనిపించడమనేది భగవదనుగ్రహంవల్ల కనిపించడమే కాని, మనం చూడగలగడంలో లేదు. చాలా మంది ఈ మాటకు ఒడబడరు. ఏం! భగవంతుడి చేతులో మే అంతగా కీలుబొమ్మలమైపోయామా అని తిరగబడతారు. అలా తిరగబడడమనేది ఉన్నప్పుడే మానవత్వం ఔతుంది. తిరగబడడంలో నుంచే మళ్లీ తిరగ

బడడం రావాలి. ఆ రావడం భగవదనుగ్రహమే. మనంగా తిరగబడడం బోర్లాపడ డమే అవుతుంది.

"నేను దగ్గఱకు తియ్యడమే తప్ప వాళ్ళు దగ్గఱకు రావడం కాదు. ఎవరి విషయమైనా అంతే"

15. మా ముపేత్య పునర్జన్మ దుఃఖాలయ మశాశ్వతమ్।
నాప్నువంతి మహాత్మానః సంసిద్ధిం పరమాం గతాః॥

తా: పరమసిద్ధిని పొందిన మహాత్మ జనులు నన్ను ప్రాప్తించిన వారై దుఃఖ స్థానమూ క్షణభంగురమూ అయిన పునర్జన్మ భావనకు లోనుగారు.

16. ఆ బ్రహ్మ భువనాల్లోకాః పునరావర్తినోఽ ర్జున।
మా ముపేత్య తు కౌన్తేయ! పునర్జన్మ న విద్యతే॥

తా: అర్జునా! అన్ని లోకాలూ తెగిపోతాయి. సృష్టి అయిన బ్రహ్మలోకం తెగి పోయి మళ్ళీ చిగురిస్తుంది. కౌన్తేయా! నన్ను పొందినవాడు మృత్యువు నుంచి మృత్యు వును పొందడు "జగత్తు ఎప్పుడూ ఉంటుంది. వచ్చేవాడు వస్తుంటాడు. పోయేవాడు పోతుంటాడు". సంసారంలో ఉంటున్నప్పుడు కూడా జ్ఞానికి మృత్యుభావన ఉండదు.

17. సహస్రయుగ పర్యన్త మహర్య ద్బ్రహ్మణో విదుః।
రాత్రిం యుగ సహస్రాన్తాం తేఽ హోరాత్ర విదో జనాః॥

తా: సహస్రయగ పర్యంతము పగలుగాను, యుగసహస్రాంతము రాత్రిగాను బ్రహ్మయే పర్యవసించి ఉంటాడని ఎవరు తెలుసుకుంటారో వారే అహోరాత్రాలను లెస్సగా తెలుసుకున్నవాళ్ళౌతారు.

18. అవ్యక్తా ద్వ్యక్తయః సర్వాః ప్రభవత్య హ రాగమే।
రాత్ర్యాగమే ప్రలీయన్తే తత్రైవా వ్యక్త సంజ్ఞకే॥

తా: దృశ్యమాత్రమైన భూతగణ స్వరూపంగా అవ్యక్తదశ నుండి వ్యక్తంగా బ్రహ్మప్రభవించడమే అతని అహరాగమంగానూ, తిరిగి అవ్యక్త సంజ్ఞకమైన అదృశ్య విభూతిలో అతడు విలీనం కావడమే రాత్ర్యాగమంగానూ జ్ఞానులు తెలుసు కుంటారు.

19. భూతగ్రామః స ఏవాఽ యం భూత్వా భూత్వా ప్రలీయతే
రాత్ర్యాగమేఽ వశః పార్థ! ప్రభవ త్యహరాగమే॥

తా: పార్థా! పుట్టి పుట్టి పరమేశ్వరేచ్ఛారూపకంగా అవశమై రాత్ర్యాగమంలో విలీనమైపోయే ఈ భూతగ్రామమంతా అదే - ఆ పరమాత్మయే - అదే అహ రాగమంలో ప్రభవిస్తుంటుంది మళ్ళీ.

20. పర స్తస్మా త్తు భావో న్యోఽ వ్యక్తోఽ వ్యక్త స్సనాతనః
య స్స సర్వేషు భూతేషు నశత్సు న వినశ్యతి॥

తా: దృశ్యాదృశ్యరూపములలో ఉన్న ఈ సృష్టి అంతటి కంటె కూడా జ్ఞానగమ్యమైన పరమాత్మభావం ఒకటి ఇందులోనే ఉంది. సర్వభూతాలూ అదృశ్యమైపోయినా ఆ పరమాత్మ భావం సనాతనంగా నశించకుండా నిలిచిఉంటుంది.

వ్యా: పై శ్లోకాలలో చెప్పబడిన సారాంశాన్ని టూకీగా వివరించవలసి ఉంది.

1. వేదాలకు సారమైనది, సృష్టిగా పుష్పించినది ఓంకారం.
2. ఈ ఓంకారానికి పూర్ణత్వం, ఏకత్వం బహుధాత్వమూ, నిత్యత్వము, అక్షరత్వము, పరివర్తనత్వము, సూక్ష్మ స్థూలత్వాలు, రూపవిరూపత్వాలు, అన్యత్వ దేశకాల వ్యాప్తిమానత్వాలు, చైతన్యము, మానసత్వమూ, భ్రమణాది చైత్రికత్వము, నాదస్ఫోటనత్వము, సమస్తత్వం, అమేయత్వమూ, ప్రేరణ గుణాలు
3. సృష్టి స్థితి సంహారాలు కారణకార్యాలు - ఎన్నిపాకాలు చేసినా ఓలు, పాత్ర, అగ్ని, మారనట్లే ఇదీ మారదు
4. జీవుడు బాణముగాను, బ్రహ్మం లక్ష్యంగాను, చిత్తం యుద్ధభూమిగాను, ఆయుష్కాలం పరిమితిగాను జీవితయజ్ఞం జరుగుతుంది.
5. నాదంలోదే కాలం - నాదానికి కాలం వ్యాప్తినీ మార్పునూ కల్పిస్తుంది. రెండూ కలిసి ఏకమయ్యేసరికి మాయ అంటే లేమిగా తయారవుతుంది. ఉండడమే లేకపోవడమవుతుంది. ఈ దశలకు సృష్టి స్థితిలయలని పేరు పెట్టారు. బ్రహ్మ విష్ణుమహేశ్వరులూ వారి కార్యకలాపాలూ ఆవిర్భవించాయి. మృత్యువే బ్రహ్మను సృష్టి చేసిందని లోగడ వ్రాసే ఉన్నాను. మృత్యువుకు ఆదీ అంతంలేదు. ఉనికికి ఆదీ అంతం లేదు. ఒక్క పుట్టుకకే ఆది ఉంది. ఆది ఉంటే అంతమూ ఉంటుంది. అందుకనే బ్రహ్మ గణనీయుడు కాదు. ఆయనకు దేవాలయాలు లేవు. పేరు మాత్రం ఉంది. శివుడూ విష్ణువూ ఏక రూపులు. వర్తమాన స్థితిలో సంహారస్థితి సంహారస్థితిలో వర్తమానస్థితి మిళితమై ఉంటుంది, గీతకు రెండు కొసలలాగా 'యద్ద్వయావధిత్వం తదనిత్యం

– యన్మధ్యమ పరిమాణం తదనిత్యం. సున్నానుచప్టాయించితే ఒకటి అవుతుంది. ఒకటికి రెండు కొసలు. మధ్యమ పరిమాణంతో కలిసి అది మూడు అవుతుంది వారే త్రిమూర్తులంటే.

అధ్యాయంలోని శ్లోకాలు 'కింతద్బ్రహ్మతో మొదలవుతాయి. రాగల జన్మలు – ఈ జన్మయొక్క పర్యవసానంలో, వ్యక్తి చిత్త దశాచరమభావం మీద ఆధారపడి ఉంటాయని చెబుతాయి 'యంయంవాపి' ఇత్యాది శ్లోకాలు.

ఆదిత్య వర్ణంతోబాటు తమః ప్రశంస కూడా అంటే మృత్యుస్మరణ కూడా జరిగింది, భూపరిభ్రమణమే నిత్యసూర్యుని ఉదయాస్తమయాలకు కారణం. నిజానికి సూర్యునికి అస్తమయం అంటూ లేదు. మనకు కనిపించనంత మాత్రాన ఆకాశం నుండి సూర్యుడు నిర్గమించాడని కాని ఇంకో చోటలేదని కాని అర్థం కాదు గదా!

'అణోరణీయాన్ మహతోమహీయాన్‌లో పెద్దది సమష్టిగా తయారైంది. చిన్నది వ్యష్టిగా తయారైంది. సనాతనత్వం సదాతనత్వం ఆనంత్యం (continuum) అయింది. ఓంకారం, బ్రహ్మ అనే సంకల్ప సృష్టిగా రూపొందింది. పౌనఃపున్యం (frequency. vibration BigBang) అంటే పూర్ణత్వం సగానికి తెగి రెండు సగాలూ నిలువుగా కలుసుకుని ప్రకాశ విమర్శలుగా సాగిపోవడం. ఇదొక పెద్ద Mobius ఛిన్నమస్త – తన రక్తాన్ని తానే త్రాగి జీవన యంత్రాన్ని నడిపిస్తున్నానని ప్రకటించే అహంకార తంత్రాంగం. ఈ తంత్రాంగంలో దేశకాల రూపగుణ క్రియావిక్రియల భేదాలన్నింటిని సమర్థించవచ్చు.

గుర్తించడంలోనే పరమాత్మ భావం ప్రస్థితమై ఉంది. గుర్తించడానికి గుర్తు కావాలి. గుర్తు అంటేనే రూపభావన సృష్టి. గుర్తుతో గుర్తించి, గుర్తును లేకుండా చేసుకోవడంలోనే పరమానందానుభూతి లభిస్తుంది. గుర్తు అనే చోట మనస్సని గాని, అహంకార మనిగాని, అన్యమనిగాని, స్వీయమనిగాని ప్రతిష్ఠించుకోవచ్చు. గుర్తులు సమసిపోవడమంటే "భూతేషు సర్వేషునశ్యత్సు' అని అర్థం. 'సవినశ్యతి అనే మాటకు గుర్తు లేకుండాపోయిన సనాతనమైన పరమాత్మ జ్ఞానాన్ని పొందడ మని అర్థం. దాన్ని శరీర సహితంగానే పొందవచ్చు.

21. అవ్యక్తోక్షర ఇత్యుక్త స్తమాహుః పరమాంగతిమ్।
యం ప్రాప్య ననివర్తంతే తద్ధామ పరమం మమ॥

తా: ఈ అవ్యక్త స్వరూపమైన ఆత్మస్వభావమే శాశ్వతమైనదని చెప్పబడు

తుంది. అదియే అన్నింటికి పరమశ్రేష్ఠమైన స్థానం. దేనిని ప్రాప్తించిన తరువాత తిరిగి పునరాగమనం లేకుండా ఉంటుందో అదే నా పరమపద నివాస స్థానం.

22. పురుష స్స పరః పార్థ! భక్త్యా లభ్య స్త్వనన్యయా।
యస్యాన్త స్థాని భూతాని యేన సర్వ మిదం తతమ్॥

తా: ఎవని అంతర్గతములై ఈ భూతాలన్నీ జీవించి ఉంటున్నాయో ఎవని నుండి ' సర్వమూ ఉద్భవించి అవహించి ఉండుటచేత తానే ఇదియై ఉన్నాడో, భక్తివినా ఇంకొకటి ఎవనిని చేరుటకు మార్గము కాదో, పార్థా! ఆసనాతనుడే పర మాత్మ.

వ్యా: జగత్తే తానైనప్పుడు జగత్తులో భాగాలు తనవి కాకుండా ఎట్లా ఉంటాయి?

23. యత్ర కాలే త్వనావృత్తి మా వృత్తిం చైవ యోగినః।
ప్రయాతా యాన్తి తం కాలంవక్ష్యామి భరతర్షభ!॥

తా: భరత వంశశ్రేష్ఠుడలైన అర్జునా! ఏ కాలమునందు దేహత్యాగం జరిగితే యోగులకు అనావృత్తి రూపమైన తేజోగమనం కలుగుతుందో, ఏకాలం ఆ వృత్తి రూపంగా పరిణమిస్తుందో ఆయా కాలాలను వివరిస్తాను విను.

వ్యా: జీవితంలో ప్రతినిత్యమూ మరణమూ జీవనమూ రెండూ కలిసే ఉన్నాయి. చూచే దృక్కోణాన్ని బట్టి అదే చావు బ్రతుకుగాను అదే బ్రతుకు చావుగాను తోచవచ్చు. ఈ విచక్షణ సూక్ష్మంగా ఆలోచిస్తేగాని అర్థం కాదు. ఈ దృక్కోణాన్ని బట్టే ఆ వృత్తే, అనావృత్తీ, అహరాగమం, రాత్ర్యాగమం, వీటి భేదాలూ, తోస్తూ ఉంటాయి. లోగడ వచ్చిన ఒక శ్లోకంలో

యా నిశా సర్వభూతాని తస్యాం జాగర్తి సంయమీ।
యస్యాం జాగర్తి భూతాని సా నిశా పశ్యతోమునేః॥

అని పరమాత్మ చెప్పి ఉన్నారు. పై శ్లోకంతో కలిపి 23వ శ్లోకాన్ని తరువాత వచ్చే శ్లోకాలను అర్థవిచారణ చేస్తే వ్యక్తుల దృక్కోణ భేదాలను బట్టే ఈ కాల విచక్షణాభేదాలు కూడా ఏర్పడుతున్నట్లు వ్యక్తం కాగలదు.

24. అగ్నిర్ జ్యోతి రహ శ్శుక్లః షణ్మాసా ఉత్తరాయణమ్।
తత్ర ప్రయాతా గచ్ఛన్తి బ్రహ్మ బ్రహ్మవిదోజనాః॥

తా: అగ్ని (తపన), జ్యోతి = వెలుగు (జ్ఞానం), పగలు = సూర్యసాక్షాత్కారం

(జగన్మాయతొలగిపోవడం), వ్యాపిత, వికాసం, శుక్లపక్షం (మనోనైర్మల్యం) ఉత్త రాయణం (సూర్యుడు ఉత్తర దిక్కుకు మళ్లడం) ఆత్మవికాసం - ఇవి మోక్షసిద్ధికి సోపానాలు. బ్రహ్మ జ్ఞానులైన జనులు ఇందులో ఏ ప్రకారంగా ప్రయాణించినా పరబ్రహ్మను చేరుకుంటారు.

వ్యా: అగ్ని ఆర్తితో బయలుదేరుతుంది.

"కోహం కథమిదం జాతం కోవా కర్తాస్య విద్యతే।
ఉపాదానం కిమస్తీ హ విచార స్సోఁయ మీదృశః॥

నేనెవడను? ఎలా పుట్టాను? నన్నెవరు పుట్టించారు? ఈ జగత్తుకు ఉపాదాన మెవరు? అంటూ జిజ్ఞాసాగ్ని మనస్సులో బయలుదేరుతుంది. స్వతస్సిద్ధంగా మనస్సులో బయలు దేరాల్సిందే పదవాక్యార్థ చర్చవలన పుట్టేది కాదు. ఈ అగ్నితో తపిస్తూ ఉన్న మనస్సులోని తపన నెమ్మదిగా జ్యోతిగా మారడం ఆరంభిస్తుంది ఈ తపనకూ జ్యోతిర్గమనానికీ మౌనమే ప్రాతిపదిక. కుండలిని జాగరితమయ్యేటప్పుడు గుదస్థానం నుండి వేడిగా బయలుదేరిన వికాసం వెన్నెముక నుండి మెఱుపులాగా అనిర్వచనీయ జ్యోతిగా జిగిల్లుమని వికసిస్తూ సహస్రారందాకా ఒళ్ళంతా కమ్ము కుంటుందని అనుభవజ్ఞులు చెబుతారు. అలాంటప్పుడు ఆ వ్యక్తికి ఇహలోకపు హంగామా, ఉండదు, సరికదా, ఇక్కడ ఉండడమంటే విరక్తిగా తోచి ఏకాంత స్థానానికి పారిపోయి, ఆనందానుభవంలో తన్మయుడుగా ఉండడానికే తీవ్రంగా ఉన్ముఖుడై ఉంటాడు. మనస్సు ప్రయత్నించకుండానే, తనంతట తానే ఆ దారినబడి పోతుంది. ఎవరో గొలుసులువేసి కట్టి, లాక్కుపోయి ఆ మౌనంలో దిగబెట్టినట్లుగా అతని ప్రమేయం లేకుండానే అంతా యథావతుగా జరిగిపోతుంది. అది జరగ కుండా అతడు తప్పించుకోలేడు. మౌనంలోని నిర్బంధం లేక దిగ్బంధం అలాంటిది. బహిర్ముఖ వికాసం కంటె అంతర్ముఖ వికాసం అంతబలిష్ఠమైనది. నివాతస్థమైన దీపకళికలో ప్రేలదగిన యాటం బాంబు అంతటి శక్తి కేంద్రీకృతమౌతుంది. అలాంటిదే ఏకాగ్రమైన మనస్సు కూడా

మనస్సుకు అధితేవత చంద్రుడు. చంద్రుడు వికసించే సమయం శుక్లపక్షం. బుద్ధికి అధిదేవత సూర్యుడు. అతని వికాస దశయే ఉత్తరాయణంలోని ఆరు మాసాలూ, ఈ విధంగా ఈ శ్లోకంలో ప్రపంచంలో మనకు కన్పించే కార్యకారణ సహిత భౌతిక యంత్రాంగం అంతటినీ అగ్నిజ్యోతిరాది సమష్టి బాహ్యశక్తులకూ, వ్యష్టిగతంగా ఉండే వ్యక్త్యంతర శక్తులకూ, మృత్యువుకూ, ఈ అన్నింటినీ కలిపే

ఐక్యతకూ అవినాభావ సంబంధాన్ని ఏర్పఱచి చూపి సృష్టి యొక్క బహిర్వికాసాన్ని దానికి ప్రతిబింబమైన అంతర్వికాసాన్ని వివరించి, ప్రదర్శించింది. అంతర్వికాసాన్ని పొంది సృష్టిలో లేకుండా చచ్చివిరగడైపోయాడనుకోడం కంటె పుట్టింటికిపోయి సదాతనత్వాన్ని చిరంజీవత్వాన్ని పొందాడనుకుంటే మరణం దేహత్యాగం అనే మాటలకు అంటిపెట్టుకుని ఉండే వైముఖ్యం విషరసం విఱిగిపోతుంది.

కఠోపనిషత్తులో నచికేతుడు యమధర్మరాజును ఈ ప్రశ్న వేస్తాడు.

దేహత్యాగం అయిన తరువాత ఇంకా జీవి ఉంటాడని కొందఱంటారు. ఉండరని కొందఱంటారు. సత్యం ఏమిటి?

యమధర్మరాజు సమాధానం.

"పరమాత్మ జీవాత్మలు ఎన్నడూ పుట్టేవీ చచ్చేవీ కావు"

"ఆత్మయే మనస్సు; ఆత్మయే ప్రాణం; ఆత్మయే జ్యోతి; ఆత్మయే సత్యం; ఆత్మయే అనంతాకాశం; ఆత్మలోనే అన్ని కారణకార్యాలూ, తృష్ణలూ, వాసనలూ, రుచులూ, ఇమిడి ఉన్నాయి. తానై ప్రపంచంగావికసించినది ఆత్మయే. మౌనంగా అందఱిలో అభిమాన రూపంగా ప్రకృతి రూపంగా వికసించినది ఆత్మయే.

నీవార శూకవతుగా నా హృదయంతో ఉండే పరమాత్మకు - బీజమూ ఆత్మయే. నా మనస్సులోని ఈ ఆత్మభూమి కంటె, ఆకాశం కంటె ఎంతో పెద్దది" అని ఉంది.

కేనోపనిషత్తులో ఇలా ఉంది.

"మెఱుపులోని జ్యోతిలో పరమాత్మ వసించి ఉన్నాడు. మెఱుపు వలె జ్ఞానోదయమైనపుడు పరమాత్మ జీవాత్మతో ఐక్యమయినట్లు స్ఫురిస్తాడు."

నాగరికమైన నేటి శాస్త్ర విజ్ఞానం "అనంత్య భావాన్ని పరిమితమైన మనస్సులతో కొలువజాలం. ఊహకూ కల్పనకూ అందనిది పరమాత్మ. ఆత్మమనస్సు లోపలగాని వెలుపలగాని ఉండే ఏ ఒక్క విషయమూ గాదు, భూతకాలంలోగాని భవిష్యత్ కాలంలోగాని, వర్తమానకాలంలోగాని ఇమిడి ఉండే ఏ ఒక్క విషయమూ కాదు. ఏదీ అది కాకపోదున్నూ. ఇవన్నీ కాలగగనపర్యాప్తములైన ఊహా విశేషాలు. సచ్చిదానంద ఘనమూ, జ్ఞానఘనమూ అయిన ఒకానొక విశేషమని మాత్రమే బ్రహ్మపదార్థాన్నిగా మనం అర్థం చేసుకోవచ్చును, అని ఉంది. మాండూక్యోపనిషత్తు ఓంకారమే పరబ్రహ్మ స్వరూపమంటుంది.

పైశ్లోకంలో లోకానికాధారమైన శక్తుల సమ్మేళనం అయ్యే ప్రణాళికలోని

క్రియాశక్తియే ప్రాణరూపంగాను, కాలగమన రూపంగానూ ప్రదర్శితమౌతూ ఉంటుందనీ, ఆ సంవత్సరమే కాలగమన చిహ్నమనీ, షాణ్మాసప్రక్రియా రూపమైన దీనిలో కాలగతి ఎప్పుడైనా కావచ్చుననీ వివరించబడింది. ఈ మహాపరిణామ కాండమే పరబ్రహ్మ స్వభావమని కూడా చెప్పబడింది. శుక్లపక్షంలోని మనః కళల వృద్ధీ, బ్రహ్మవిదుల ఉద్గమన మనస్థితిని సూచిస్తుంది.

25. ధూమో రాత్రి స్తథాకృష్ణః షణ్మాసా దక్షిణాయనమ్।
తత్ర చాన్ద్రమసం జ్యోతి ర్యోగీ ప్రాప్య నివర్తతే॥

తా: ధూమమూ, రాత్రీ, కృష్ణ పక్షమూ, దక్షిణాయనమూ, దానిలోని ఆరు మాసాలూ, వీటియందు గతించిన యోగి అక్కడ చాన్ద్రమసజ్యోతితో ప్రవేశించి తిరిగి మృత్యుమయమైన జగత్తులోకి వస్తాడు.

వ్యా: కృష్ణపక్షం లేకుండా శుక్లపక్షమూ, దక్షిణాయనం లేకుండా పగలూ, పొగలేకుండా నిప్పు, ఎలా ఉండదో మృత్యుమయమైన జగత్తు లేకుండా అమర్త్య మయమైన జగత్తు లేదని తాత్పర్యం. చాన్ద్రమసజ్యోతి వికసించేది మనః పుటిలో. హృదయాకాశంలోని ఆచాంద్రమసజ్యోతియే దేవలోక జీవులకు ఆహారం. చాంద్ర మసజ్యోతిని ప్రాప్తించడమంటే కూడా నివృత్తి మార్గాన్ని పొందడమనే అర్థం.

26. శుక్ల కృష్ణే గతీహ్యేతే జగతః శాశ్వతే మతే।
ఏకయా యా త్యనా వృత్తి మన్యయా వర్తతే పునః॥

తా: ఈ శుక్లకృష్ణగతులు రెండూ జగత్తులో శాశ్వతంగా ఉన్నవే. ఒకటి అర్చి రాదిగతీ, రెండోది కృష్ణలేక ధూమ్రాదిగతీ. ఒకదాని వలన అనావృత్తి లభిస్తుంది. రెండో దానివలన పునః నివృత్తి లభిస్తుంది.

వ్యా: శుక్లకృష్ణ పక్షాలు ఎలా ఏర్పడుతున్నాయి? భూమి చుట్టు చంద్రుడు పరిభ్రమిస్తున్న గతిలో వైషమ్యం వలన కొన్నాళ్లు చందమామ పెరుగుతున్నట్లు కొన్నాళ్ళు తఱుగు తున్నట్లు కనిపిస్తుంటుంది. భూమి అడ్డం కాకుండా సూర్యుని కాంతి పూర్తిగా చంద్రుని మీద పడుతుంటే అది పూర్ణమాసియే అవుతుంది. కృష్ణ పక్షం శుక్లపక్షం అనే భేదం లేకపోతే సృష్టి ఈ ప్రకారంగా ఉండేది కాదేమో! కృష్ణ పక్షంలో నేరాలూ, హత్యలూ, అపరాధాలూ ఎక్కువౌతాయన్నారు శాస్త్రజ్ఞులు. చంద్రుడు తఱగడానికి, నేరాలు పెరగడానికి గల సంబంధాన్ని విజ్ఞులు పరిశోధిస్తు న్నారు. సముద్రం ఆటుపోటులకు చంద్రుని సామీప్యంగాని దూరస్థితిగాని కారక మైనట్లే మనుజుని స్వభావం మీద కూడా కృష్ణపక్ష ప్రభావం పనిచేస్తూ ఉంటుందని

ంస్త్రజ్ఞులు అభిప్రాయపడుతున్నారు. ఎందుకంటె భూగోళంలో నీటిభాగం 80 వంతులున్నట్లే, మన శరీర నిర్మాణంలో కూడ జలతత్వం 80 వంతు లుంది.

చంద్రుని ఆకర్షణవల్ల సముద్రాల జలాలు ఆటుపోట్లకు గుఱిఅయినట్లే మన శరీరాలలోని జలతత్వం కూడా ఆటుపోట్లకు గుఱిఅవుతుందనీ, దాని ఫలితంగా మనస్సులోని ఉద్రేకాలు రెచ్చినేరాలు, అక్రమ కార్యాలకు ప్రేరణ కలుగుతుందని వారు వ్రాశారు. వాత్స్యాయనాది మహర్షులు మానవ శరీరంలోని మనస్థానాలకూ, కృష్ణపక్ష శుక్లపక్షాదులలోని తిథులక్రమాలకు సంబంధం ఏర్పఱచి స్త్రీల కళాస్థానాలను గుర్తించారు. ఈ హెచ్చుతగ్గులు, హార్మోనుల ప్రభావాలూ, భగవంతుడేర్పఱచినవే కాని మనుష్య కల్పితాలు కావు, ఈ హెచ్చుతగ్గులు కూడా పరమాత్మ అంశములే. అవి అలాకావడం కూడా పరమాత్మ స్వభావమే.

'సృష్టియే భగవంతుడు' అని అమ్మవాక్యం అర్చిరాది మార్గంలో బ్రహ్మలోకాన్ని చేరుకున్నా, ధూమ్రాదిమార్గలో మనుష్యలోకాన్ని చేరుకున్నా, యోగి చేరుకునే స్థానాల్లో భగవంతుడు కానిదేదీ లేదని గ్రహించేది.

23వ శ్లోకంలోని 'యత్రకాలేత్వనావృత్తిం' అనే పాదంలోని కాలశబ్దానికి వ్యాఖ్యానంగానే ఈ శ్లోకంలోని 'శుక్లకృష్ణగతీహ్యేతే' అనే పాదంలోని గతి శబ్దం వాడబడినదనీ, - శుక్లకృష్ణ పక్షాల గతియే కాలముగా చెప్పబడినదనీ గ్రహించేది. తరువాత శ్లోకంలో ఈ కాలమే ఈ గతియే సృతి అని కూడా వ్యవహరించబడ్డది.

27. నైతే సృతీ పార్థ! జాన న్యోగీముహ్యతి కశ్చన।
తస్మా త్సర్వేషు కాలేషు యోగ యుక్తో భవార్జున॥

తా: పార్థా! ఈ శుక్లకృష్ణమార్గాల గతులను గుఱించి, తెలిసిన యోగి ఎవడూ మోహపడడు. (ఎందుకంటే శుక్ల కృష్ణమార్గాలకు గాని, హెచ్చుతగ్గులకుగాని, జనన మరణాలకుగాని, ఉండే లంకె పరమాత్మయే అనే రహస్యం అతనికి లెస్సగా తెలుసును (కాబట్టి ఆ తెలుసుకోడాన్నే యోగమంటారు) సర్వకాలసర్వావస్థల యందు నీవు కూడా అలాగే యోగయుక్తుడవై - ఆ తెలివితో అసలైన తెలివిని తెలుసుకో.

వ్యా: కృష్ణపక్షం శుక్లపక్షం ద్వంద్వంగా కనిపిస్తున్నా అదంతా ఒకటే ప్రపంచంగా అయి ఉంది. బహుశా ప్రపంచం మారడానికి ద్వంద్వంలేని వస్తువు ద్వంద్వంగా కావలసి వచ్చింది కాబోలు. పరిపూర్ణత్వం సున్నా లాంటిది. సున్నాను చప్టాయిస్తే రెండు కొసలు గల ఒకటి అవుతుంది. సున్నాగా ఉంటూనే, అవే వ్యక్తావ్యక్తాలు. అవ్యక్తంలో నుంచి వ్యక్తం రావడంలో అపూర్వత ఏమీలేదు. ద్వంద్వాలన్నీ

రెండు కొసలు గల ఒకటే. యోగి అయిన వాడీ విషయంలో భ్రాంతి పడడు. భ్రాంతి పడకుండా జగత్తు యొక్క ప్రాణుల యొక్క అద్వయాత్మకతను తెలుసుకో వలసినదని పరమాత్మ అర్జునునికి బోధించాడు. యోగమంటే ద్వంద్వత్వమే.

'ద్వంద్వం లేకపోతే ప్రపంచమేలేదు' అమ్మ

ఈ శ్లోకంలో మొదటి పాదంలోని 'నైతేసృతీ'లో సృతీ అనే మాటకు వెనుకటి శ్లోకాల్లోని కాలమూగతీ అనే మాటలకున్న అర్థమే వర్తిస్తుంది. కాలమంటే, చల నమూ, ప్రసరణమూ, అని అర్థం. లెక్క అని కూడ అర్థం. సూర్యచంద్రాదుల యొక్కా అగ్నిజ్యోతిస్సుల యొక్కా ఉత్తరాయణ దక్షిణాయనాల యొక్క అధిగమన క్రమాన్ని, జననమరణాలనే యాతాయాత క్రమంతో ముడిబెట్టి, ఈ యల్లికనంతా యోగమనే కొలికిపూసతో జతగూర్చిన రచనా శిల్పం. ఈ శిల్పంతో తొణికిస లాడుతున్నది శ్లోకం.

గత శ్లోకచతుష్టయం. సృష్టి శిల్పకళను. గుంభితం చేసి పరమాత్మ యొక్క కవినామధేయాన్ని సార్థకం చేశాయి. అధ్యాయం ముగింపు అన్నింటి కంటె బాగుంది.

28. వేదేషు, యజ్ఞేషు, తపస్సు చైవ
దానేషు యత్పుణ్య ఫలం ప్రదిష్టమ్।
అ త్యేతి తత్సర్వ మిదం విదిత్వా
యోగీ పరం స్థాన ముపైతి చాద్యమ్॥

తా: వేదాధ్యయనంవల్లా, యజ్ఞాచరణవల్లా, తపశ్చర్యవల్లా, దానాలవల్లా ఏ పుణ్యలబ్ధి కొంత ఉన్నదని చెప్పబడిందో, ఆ అంతటికంటె గూడ అధికతరమైన మహాసుకృతాన్ని ఈ తేజస్తమత్వాన్ని తెలుసుకున్న యోగి పొందగలడు. అతడు ఆద్యపదమైన దివ్యస్థానాన్ని పొందగలడు.

ఇది శ్రీ మన్మాతృగీతలోని తారకబ్రహ్మయోగమను అష్టమోధ్యాయము.

మాతృగీత

రాజవిద్యారాజగుహ్య యోగము

నవమోధ్యాయము

శ్రీ భగవానువాచ

1. **ఇదంతు తే గుహ్య తమం ప్రవక్ష్యా మ్యనసూయవే!**
జ్ఞానం విజ్ఞాన సహితం యద్ జ్ఞాత్వా మోక్ష్యసేఽ శుభాత్

తా: అసూయారహితుడవైన అర్జునా! అతి రహస్య తమము, జ్ఞాన విజ్ఞాన సహితమూ, దేన్ని తెలుసుకుంటే మోక్షకారకమవుతుందో ఆ యోగాన్ని నీకిప్పుడు బోధిస్తాను.

2. **రాజవిద్యా రాజగుహ్యం పవిత్ర మిదముత్తమమ్।**
ప్రత్యక్షావగమం ధర్మ్యం సుసుఖం కర్తు మవ్యయమ్॥

తా: అన్ని విద్యలకు ఇది రాజు, గోపనీయమైన వాటికి కూడా రాజే! అతి పవిత్రమైనది. ఉత్తమమైనది. ప్రత్యక్షంగా అనుభవానికి వచ్చేదీ, ధర్మయుక్తమైనదీ, అందఱికీ పరమమనో రథాలనిచ్చేదిన్నీ.

వ్యా: తెలిసినదే విద్య. అందులో, లోకరహస్యమేమీ ఉండదు. రహస్యంగా ఉన్నంత వఱకు అది తెలిసినదెల్లా అవుతుంది? విద్యలలో కెల్ల ఇది రాజు అంటే లెస్సగా తెలియబడినదనే కదా అర్థం. మఱి గోప్యమైన వాటిలో కూడా, ఇది రాజే అంటే అసలు తెలియబడనిదనే కదా? ఇదే ఇందులోని చమత్కారం. ఎదురుగా కట్టఉంటే దాన్ని కట్టయే అనుకుంటాం. స్తంభం అనుకోం. భగవంతుడనుకోం. అలా అనుకునే శక్తి అబ్బేదాకా, మన మనస్సులు హిరణ్యకశ్యప స్వరూపాలుగానే ఉంటాయి. భగవంతుడెక్కడ ఉన్నాడు అని ప్రశ్నించుకుంటూనే నేతి అనుకుంటూ, సాగిపోతూ ఉంటాం రాకెట్లతో చంద్రమండలాన్ని అంగారక గ్రహాన్నీ వెదుక్కుంటూ పోతాం రాళ్ళూ రప్పలూ తప్ప కనబడవు. స్రోడింజరు అంటారు కదా It is searching for a black cat in a dark room which is not there. అది విజ్ఞాన రహస్యమవుతుంది. పరమాత్మ అనుగ్రహం అదే మనస్సు మీద వాలిందనుకోండి." ఇందుగలడందు లేడని సందేహము వలదు చక్రి సర్వోపగతుం డెందెందు వెదకి చూచిన నందందే కలడు దానవాగ్రణి! వింటే! వింటే అనే పదం పాదపూరణం కోసం వాడిన వ్యర్థ పదం అనిపిస్తుంది. కాని అది ఊతపదం కాదు. హిరణ్య

కశ్యపుడు చెవులు, కళ్లు మనస్సు మూసుకుని శఠంగా ప్రహ్లాదుణ్ణి ప్రశ్నిస్తున్నాడు. అతని మనస్సును మౌఢ్యం కప్పి ఉన్నందున, దేనిలోను పరమాత్మ కనిపించనందున, అతని ధ్వని కూడా వినపించనందున, ఎక్కడ దాగి ఉన్నాడో చూపుమని ప్రహ్లాదుణ్ణి హింసిస్తున్నాడు. చెవుల్లో వ్రేళ్లు పెట్టుకొని వింటే మనలోని ప్రాణనాదం, అనాహతనాదం చక్కగా వినిపిస్తుంది. మనస్సు ఇంకో చోట లగ్నమైనప్పుడు అది వినిపించదు. అలాగే ప్రహ్లాదుని మాటా అతనికి వినిపించడం లేదు. చె అంటే చెప్పడం వి అంటే వినడం, చెప్పిన దాన్ని వింటేనే చెవి. తక్కిన ఇంద్రియాలకు బయటికి లోపటికి దారులున్నా, లోపటికి మాత్రమే దారి ఉన్నది చెవి ఒక్కటే అది మూసుకుని పోయినందున ప్రహ్లాదుని మాటలు అతనికి వినిపించి మనస్సును చేరడం లేదు. ప్రహ్లాదునికైతే సకలేంద్రియాలూ మనస్సూ హరిగానే ఉన్నాయి. కనుక పోతన్నగారు ప్రహ్లాదుని శరీరంలో దూరి మఱీ చెప్పారు. ఓ మూర్ఖుడా! వింటే వినిపిస్తుంది. వినకపోతే ఎలా వినిపిస్తుంది? వినే సమయం వచ్చింది. స్తంభంలోని సింహగర్జన నాకు వినిపిస్తున్నది. నీకు వినిపించడం లేదా? సింహగర్జనలాంటిదే మౌనంలో ఉన్న నాదం. సమయం వచ్చింది. GOD IS NO WHERE అని చదవకు. GOD IS NOW HERE అని చదువు. నీవు తెలుసుకోనని మొండి పట్టు పట్టినా, నీ గుండెలు చీల్చి మఱీ ఈ అనుభవాన్ని ప్రత్యక్షావగతం చేసి, అవ్యయమైన సుఖాన్ని కల్పించి, మోక్షాన్ని సమకూర్చి తీరుతుంది. ఎందుకంటే అందఱకు సుగతే కనుక. ఈ అర్థమంతా ఉంది వింటే అనే మాటలో.

ఇదే తెలియబడినదీ గోప్యమైనదీ అనే రెండు లక్షణాలూ కలరాజ విద్యా రాజ గుహ్యం అనే మాటలకు అర్థం. ఇది సర్వ ప్రకృతి నీ పవిత్రంచేసేది, విషయాసక్తులకు భ్రాంతి అనే ఇంద్రియాల తెరలాగా కనిపించేది. దాని వెనుక గుహ్యమైనదైనా ప్రత్యక్షానుభవంగా బోధకు వచ్చేది. ధర్మ్యం అంటే కృత్రిమ పద్ధతిలో కాకుండా, సహజమైన పద్ధతిలో స్వతస్సిద్ధంగా ఏర్పడి ఉన్నదీ, అగ్నికి కాల్చడం లాగా విడిచిపోనిదీ అందఱికీ మేలును చేకూర్చేదిన్నీ. బ్యాంకులో ఖజానా తీస్తూ ఉంటే కొంత కాలానికైనా తఱిగిపోవచ్చు. అలాగా కాకుండా ఈ ఖజానా ఎన్నాళ్లకూ తఱగని దిన్ని ఇటువంటి రహస్యాన్ని నీకు చెబుతాను.

3. అశ్రద్ధ ధానాః పురుషాః ధర్మస్యాస్య పరంతప।
అప్రాప్య మాం నివర్తన్తే మృత్యు సంసార వర్త్మని॥

తా: పరంతపా! ఈ ధర్మమునందు శ్రద్ధ కలుగని పురుషులు నన్ను పొందలేరు. మృత్యుస్వరూపమైన సంసారమార్గంలో తిరుగుతుంటారు.

వ్యా: అన్నిచోట్లా, అన్నింటిలోను, ఎల్లప్పుడు పరమాత్మ ఉన్నాడని మనస్సుకు అంటేలాగా, తెలివి కల్గడంలోనే ముక్తి ఉంది. అది ఉదయించని వానికి, ఈ సంసారం అంతా మృత్యుసాగరంలోనే కొట్టుకుంటున్నట్లు కనిపిస్తుంది. అట్టివారు నన్ను చేరలేక మృత్యువు నోట్లో దూరుతారు.

4. మయా తత మిదం సర్వం జగదవ్యక్త మూర్తినా।
మత్థాని సర్వభూతాని నచాహం తేష్వవస్థితః॥

తా: ఈ సర్వమూ అవ్యక్తమూర్తినైన నాతోనే నిండి ఉన్నది. అన్ని భూతాలూ నాలోనే ఇమిడి ఉన్నాయి. కాని నేను ప్రత్యేకంగా వాటిలో లేను.

వ్యా: పరమేశ్వరుడు అవ్యక్తమూర్తిగా అంతటా నిండి ఉన్నాడంటే ప్రత్యక్షవాదు లకు అర్థంకాదు. అర్థం చేసుకోడానికి మళ్ళీ పరమేశ్వరుడే కావాలి కాని పరిమిత బుద్ధులైన మానవులకు సాధ్యంకాదని తాత్పర్యం. ఇంద్రియ జ్ఞానంలాగా మారే దాకా అతడు దేనినీ విశ్వసించడు. దగాకోర్లని ముందుగా ఉదహరించవలసింది ఇంద్రియాలనే. కళ్ళు చూస్తుంటే చెవులు ఎక్కడో వింటుంటాయి. మనసు మరోచోట కునుకుతుంటుంది. ఎందుకంటే కనులు చేసే పనిని చెవులు చెయ్యలేవు. నాలుక పనిని ముక్కు చెయ్యలేదు. నరాల బాధను మెదడు ప్రతిబింబిస్తుంది. కాని మెద డులో నరాలు లేవు. మెదడును ముక్కలు ముక్కలు చేసినా నొప్పిని ప్రతిబింబించే యంత్రాంగం దానికి భగవంతుడివ్వలేదు. ఏకదేశమాత్ర జ్ఞానాన్నే స్వయం గతంగా చేసుకోజాలని మనబుద్ధి 'మయాతతమిదం సర్వం'లోని సార్వత్రికత్వాన్ని ఎలా గ్రహించగలదు? అందుకనే అవ్యక్తమూర్తినై అంతటా నిండి ఉన్నానని పరమాత్మ సెలవిచ్చారు. నా కంటె భూతాలు కాని భూతాల కంటె నేను కాని వేఱుకాదు.

రెండూ ఒకటే అయినా మంచుగడ్డ నీటిలో తేలుతూ వేఱుగా కనిపిస్తుంది. మంచుగడ్డలో నీళ్ళు వేఱుగా కనిపించవు. అలాగే నీటిలో తరంగాలు వేఱుగా కని పిస్తాయి. సుళ్ళు ఉంటాయి చూపఱులకు సుళ్ళు తరంగాలు వేఱుగా నీళ్ళు నింపు కోడం కొబ్బరికాయ గుణం, నీళ్ళు వేఱుగా కనిపించవు సుళ్ళు తరంగాలను ఒడ్డు మీద బెట్టివేఱుగా చూపడానికి సాధ్యం కాదు, అలాగే పరమాత్మ భావంలో సృష్టి కూడాను, ఈ భావం మనస్సులో జీర్ణించాలంటే అంతంత మాత్రంగా సాధ్యంకాదు. జ్ఞానేంద్రియ కర్మేంద్రియాలు ఏకముఖం కావాలి. అప్పుడే అది సాధ్యమవుతుంది.

మనస్సే అన్ని ఇంద్రియాల పనులూ చేయగలిగతే అంటే యుగపద్వృత్తి గాకుండా సాక్షాద్వృత్తి దానికబ్బితే కూడా ఈ మాటలు అర్థమౌతాయి. ఎంతగా

మారబోతున్నది సందర్భం! వచ్చే శ్లోకంలో భూతాలు తనలో లేవని చెప్పబోతున్నారు పరమాత్మ.

5. న చ మత్థ్సాని భూతాని పశ్యమే, యోగ మైశ్వరమ్।
భూతభృ న్న చ భూతస్థో మమాత్మా భూతభావనః॥

తా: భూతాలు నాయందుండేవి కావు. భూతాలు నాకాధారం కాదు. వాటిని నేను వేఱుగా భరించడంలేదు. పుట్టించడమూలేదు. వాటిల్లో నేను వేఱుగా ఉండ డమూ లేదు. అంటే ఆభూతాలన్నీ నేనే ఐ ఉన్నాను. అవినాకంటే వేఱుకావు అని తాత్పర్యం.

వ్యా: నీళ్ళు నింపుకోవడం ఎలా కొబ్బరికాయకు సహజగుణమో, తన నీళ్ళను తానే త్రాగేసి మొలకగా బయలు బడడమూ గుణమే. లేదా దేవుడి ముందఱ బ్రద్దలై ఇంకొకందుకు ఉపయోగపడడం సహజగుణమే.

కొబ్బరికాయలో నీళ్ళూ, కొబ్బరి, పెంకూ, పీచు, నూనె, రుచి ఉన్నాయి. ఇవన్నీ కలిస్తేనే కొబ్బరికాయ. అలాటి విషయమే, పరమాత్మ, అతని శక్తిలోకాలు, పంచభూతాలూ, గుణత్రయం, మనస్సు, కాలం, దేశం. ఇంకో విషయం కూడా ఉంది.

ఆరో అధ్యాయంలో పరమాత్మ "నచ మత్థాని భూతాని," "సర్వభూతస్థితం యోమాం భజత్యేకత్వ మాస్థితం" అంటూ చెప్పి సర్వభూతాల్లోనూ తానే ఉన్నట్లు సెలవిచ్చారు. పదో అధ్యాయంలో 'అహమాత్మ గుడాకేశ సర్వభూతాశయ స్థితః అని చెప్పబోతారు. అంటే అర్జునా! అన్నిభూతాలలోను నేనే నివసిస్తున్నాను అని అర్థం. ఇంతకుముందు వచ్చిన శ్లోకంలోనే 'మత్థాని సర్వభూతాని' అంటే అన్ని భూతాలూ నాలోనే ఉన్నవని చెప్పి ఉన్నారు. ఇన్నిసార్లు భూతాలన్నీ తనలోనే ఉన్నా యని చెబుతూ నా యందు భూతాలు లేవని చెప్పడం వింతగా కనిపిస్తుంది. కాని ఇందులో వింత ఏమీ లేదు. వింతలన్నీ మన దృష్టికి సంబంధించినవి మాత్రమే. మనం రైల్లో కూర్చుని బయటికి చూస్తున్నామనుకోండి. ప్రక్క పట్టాల మీద రైలు పరుగెత్తిపోతూ ఉంటే మనమున్న రైలే కదిలిపోతున్నదని నిజంగా పరిగెత్తిపోయే రైలు ఆగి ఉన్నదనీ అనిపిస్తుంది. అలాగే సముద్రం కంటె వేఱు కాని అలను సముద్రం కంటె భిన్నంగా అనుకుంటాం. బద్ధకంగా ఒళ్ళు విఱుచుకునే సమ యంలో శరీరం ఎన్ని వంకరలలో తిరుగుతుంది. ఆ వంకరలనన్నింటినీ ఫిలిం తీసివేర్వేరుగా చూస్తే ప్రతి శరీరంలోను వెయ్యి శరీరాలున్నట్లు కనిపిస్తుంది. అన్ని శరీరాలు నిజానికి జీవికున్నాయా? లేవు. అసంఖ్యాకంగా సముద్రంలో విఱిగే తరం

గాలు సముద్రం అడుగున మణిగి ఉన్నాయా, లేవు. కాలమూ గగనమూ కలిసి పడే కల్లోలాల ఫలితంగా పరమాత్మ సంకల్పరూపంగా ఉద్భవించే రూపాలన్నీ - ఈ భూకంపాలు, ఈ తుఫానులు, ఈ సముద్రాలు, ఈ గోళాలు, ఈ తారకలు ఈ వాయు మండలాలు, ఈ విద్యుచ్చుంబక క్షేత్రాలు, పరమాత్మలో వేఱుగా పర్సులో రూపాయ నాణేలలాగా ఉన్నాయా? లేవు. అన్నీ ఆ పరమాత్మయే ఐనా మనం అన్నింటినీ పరమాత్మ నుండి వేఱుచేసి చూస్తాం. సంకల్పమూ ఆయనే. సంకల్ప ఫలితమైన ఈ సంసారమూ ఆయనే. సర్వానికీ సర్వమూ కారణం. సర్వానికీ సర్వమూ ఆధారం సర్వంలోనూ సర్వం ఇమిడి ఉంది. అన్ని విషయాలను గూర్చి ఒక్కసారిగా గాని, ఒక్క విషయాన్ని గూర్చి సాకల్యంగా గాని, అవగాహన చేసుకునే సామర్థ్యం మానవుడి మెదడుకుండదు. కొంచెంలోతుగా ఆలోచించవలసిన విషయం వస్తే మనస్సు అంధకారంలో డుబ్కీవేసి కూర్చుంటుంది.

ఉదాహరణకు ఇవ్వాళ అన్నపూర్ణాలయంలో వంకాయకూరవండారనుకొండి. వంటింట్లోకి రాకపూర్వం ఆ వంకాయలెక్కడ ఉన్నాయి అని ప్రశ్నవేస్తే స్టోరు కొట్లో గంపలలో ఉన్నాయని సమాధానం వస్తుంది. గంపల్లోనికి చేరకపూర్వం అవి ఎక్కడ ఉన్నాయి అని ప్రశ్నిస్తే అవి పొలంలో చెట్ల మీద ఉండేవి అని సమాధానం వస్తుంది. ఆ కాయలు చెట్లకు కాయక పూర్వం ఎక్కడ ఉండేవి అని ప్రశ్నిస్తే మనస్సు తిక మకపడి అంధకారంలో డుబ్కీవేస్తుంది. కంటికి కనిపించే వంకాయల పుట్టు పూర్వో త్తరాలే నిర్ణయించుకోలేని మనుష్యుని మనస్సు బ్రహ్మాండ గోళాల పుట్టుపూర్వోత్త రాలను ఎలా నిర్ణయించగలుగుతుంది?

జగత్తుకు భూతాలకు పరమాత్మ ఉపాదాన కారణమా? నిమిత్త కారణమా? పరమాత్మకు జగత్తుకు ఉండే సంబంధం సమవాయియా? అసమవాయియా? పరమాత్మ జగత్తనే గంపలో పండులా ఉన్నాడా? పూవులో వాసనలా ఉన్నాడా? అగ్నిలో వేడిలాగా ఉన్నాడా? ఆకాశంలో వ్యాప్తిలాగా ఉన్నాడా? ఈ సంబంధాలను చర్చించేటప్పుడు పండు తీసేసినా గంప మిగిలినట్లు నూలు లాగేసినా గుడ్డలేక నేత మిగులుతుందా? పూర్ణత్వానికి హద్దేమిటి? 'పూర్ణస్య పూర్ణమాదాయ పూర్ణమే వావశిష్యతే' అనే శ్రుతివాక్యంలో ఉన్న పూర్ణాలు పరమాత్మ జగత్తువేకావా? ఈ విచారణా చర్చా ముగిసేసరికి మిగిలే అర్థం ఎలా ఉంటుందంటే ఊతిలో విగ్రహం లేదు. విగ్రహంలో అంటే విగ్రహ భావంలో ఊయిలేదు. ఏ ఒక్క విగ్రహరేఖలోనూ ప్రత్యేకంగా ఊతిలోపమే లేదు. అర్థం అయ్యేటప్పుడు రెండూ ఉన్నాయనే అని పిస్తుంది.

అలాంటిదే భూతాల్లో నేను లేను. నాలో భూతాలు లేవు అనే మాటలు కూడా జగత్తును పరమాత్మను ఒకదాన్ని విడిచి రెండోదాన్ని అర్థం చేసుకోడం సాధ్యం కాదు అని భావం. తాను భూతాలను వేఱుగా భరించడం లేదు. వాటిలో వేఱుగా ఉండడంలేదు. వేఱుగా పుట్టించడం లేదు. కుమ్మరివాడు కుండను తన కంటే దూరంగా తయారుచేస్తున్నాడు. కుండ వేఱుగా ఉంటున్నది. జగత్పరమాత్మలు అలా వేఱుగా ఉండడంలేదు. ఏకంగానే ఉంటున్నారు. అనంత్యం (Continuum)లోని ప్రతీ ఒక్క క్షణమూ మూలంతో ఐక్యంగానే ఉంటున్నది.

6. యథాకాశస్థితో నిత్యం వాయుః సర్వత్రగో మహాన్।
తథా సర్వాణి భూతాని మత్స్థానీ త్యుపధారయ॥

తా: ఏవిధంగా నిత్యవిభువైన మహావాయువు ఆకాశస్థితమై ఉండి కూడా అంతటా సంచరిస్తుంటుందో అలాగే సర్వభూతాలూ నా యందున్నట్లుగా తెలుసుకో.

వ్యా: క్రిందటి శ్లోకంలో 'నచమత్‌స్థాని భూతాని' అంటే భూతాలు నాయందుండేవికావు అని పరమాత్మ సెలవిచ్చారు. కాని పరమాత్మయే అయి ఉన్నప్పుడు, ఇంకా అవి ఉండడానికి వేఱే స్థానం ఎక్కడ ఉంటుంది అనే శంకా స్థానానికి ఈ శ్లోకంలో వివరణ చెబుతున్నారు. వాయువు ఒకచోట స్తంభీ భూతంగా ఉండే వస్తువు కాదు.. ప్రాణవాయువు లేకుంటే ప్రాణమే ఉండదు. ప్రాణం లేకపోతే భూతాలూ ఉండవు. ఆకాశమో మఱి. ఆకాశమంటే ఏమిటి? ఆకాశమే అవకాశం space ఉండేందుకు జాగా. ఉండడమంటే లేనిదానికి అర్థస్ఫూర్తిని కలగజేయడం. గుర్తులేనిది గుర్తుకావడం. లేదా గుర్తుకు రావడం. ఆకాశం మాత్రం ఉండడం కాదా అంటే అదీ ఉండడమే కాని గుర్తుకు రానిది. అతి భూమమైనది అంతరాళం. ఒక్కసారిగా అది ముకుళించుకుని మనకంటి పాపలో ఖైదీ అయిపోవడానికి సాధ్యం కాదు గదా! సర్వవ్యాప్తమైన ఆకాశాన్ని అర్థం చేసుకోజాలం కనుక ఈ గోడల మధ్య పరిమితంగా ఉన్న ఖాళీ జాగాను గుర్తించుకొని దీనితో పోల్చి చూచికొని బయటి ఆకాశాన్ని ఊహిస్తున్నాము. నిజానికి గోడలు అంతరాయంగా అడ్డంగా ఉన్నట్లు మనకు అనిపిస్తున్నా అవి కూడా ఆకాశంతోనే నిండి ఉన్నాయి. గోడల నిండా ఱాళ్ళూ, ఇసుకా, సిమెంటూ, వాటినిండా పిఠరాలూ, అంటే మోలిక్యూల్సు, పిఠరాల నిండా అణువులూ, అణువుల నిండా గర్భాలూ, అంతరాళాలూ, ఈ అంతటికీ ప్రతి అంతరాంతరంలోనూ ఆకాశం ఇమిడి ఉంది. ఘాటానులలోనూ ఆకాశం ఉంది. చెఱువు నీటిలో లక్షల కడవల నీరున్నది అనుకుందాం. పఱుచుకొని

ఉన్న నీటి ఆ కడవల ఆకారాలను మనం ఊహించుకోవడంలో తప్పేమీలేదు. మన ఊహల వలన నీటి పటుపుకు బాధేమీలేదు

ఆ ప్రకారంగానే ప్రాణవాయువు ఆకాశస్థితమై ఉండి కూడా అన్ని రూపాలు ధరించి కనిపిస్తున్నట్లే అన్ని భూతాలు నాయందున్నట్లుగా భావించమని పరమాత్మ ఆనతిచ్చారు. ఆకాశం లేకుండా వాయువుండజాలనట్లే పరమాత్మ కాకుండా భూతాలూ ఉండజాలవనిన్నీ వస్తుతత్వంతో పరమాత్మకూ భూతాలకూ భేదం లేదనీ తాత్పర్యంగా గ్రహించేది.

'ఆకాశాద్వాయుః' అనితైత్తి రీయోపనిషత్తు ఘోషిస్తుంది. 13వ అధ్యాయంలో "యదా సర్వగతం సౌక్ష్మ్యా దాకాశం నోపలిప్యతే సర్వత్రావస్థితో దేహే తథా౽౽ త్మావోపలిప్యతే" అని చెప్పబోతారు కూడా. సూక్ష్మరూపంతో అన్నింటిలోనూ ఉన్నా ఏవిధంగా వాటి ఆకారాల చేత బాధింపబడదో, అదే విధంగా సర్వేసర్వత్ర అన్ని దేహాలూ తానే అయి ఉన్నా ఆత్మపదార్థం వాటివల్ల బాధింపబడదు అని దాని అర్థం. పై అభిప్రాయాన్నే ఈ వాక్యాలు కూడా దృఢపటుస్తున్నాయి.

7. సర్వ భూతాని కౌన్తేయ! ప్రకృతింయాన్తి మామికామ్।
కల్పక్షయే పునస్తాని కల్పాదౌ విసృజా మ్యహమ్॥

తా: కౌన్తేయా! ప్రళయకాలంలో ఈ భూతాలన్నీ నా ప్రకృతిలోనే లీనమైపో తుంటాయి. కల్పాది యందు మళ్ళీ నారూపంలోనే విసృజిస్తుంటాను.

వ్యా: ఈ శ్లోకంలో కల్పక్షయమూ కల్పాది అనే మాటలు చెప్పబడి ఉన్నాయి. 8వ అధ్యాయంలో బ్రహ్మ యొక్క ఆయుష్కాలం చెప్పబడింది.

శాస్త్రవిజ్ఞానం కాలాన్ని యుగాలుగా విభజించింది.

ప్రకాశ విమర్శామయమైన సృష్టిలో, ధర్మార్థ కామమోక్షములే పునాదిగా గల చాతుర్వర్ణ్యవ్యవస్థయే చతుర్యుగాలు. యుగాల ప్రమాణాన్ని అనేకులనేక భంగులుగా చెప్పారు. ఒక భంగిని నేనీ క్రింద వివరిస్తున్నాను.

ధర్మధేనువు కృతయుగంలో నాలుగు పాదాల మీదా త్రేతాయుగంలో మూడు పాదాల మీదా, ద్వాపరయుగంలో రెండు పాదాల మీదా, కలియుగంలో ఒక్కపాదం మీదా నడుస్తుంది. నాలుగు యుగాలు కలిసి ఒక మహాయుగం. అంటే 4,320,000 సంవత్సరాలు. అటువంటి మహాయుగాలు వెయ్యి అయితే బ్రహ్మకొక పగలు అంటే 4,320,000,000 సంవత్సరాలు. బ్రహ్మకు ఏది ఒక పగలో దాన్నే

ఈ పరిణామ యంత్రాంగంలో రూపాంతర క్రియనే మనం ప్రళయమని భావిస్తున్నాం. Law of compensation ప్రకారం ఒకచోట పడ్డలొత్త ఇంకోచోట ఉబ్బుగా కనిపించుతుంది. అలా మార్పు కావడమే ఉంటుంది కాని లేకుండా సమసిపోవడం జరగదు. ఎందుకంటే ఉనికికి, అస్థిత్వానికి, ఏ సందర్భంలోనూ లేమి అనే అర్థం రావడంకానీ, అర్థం సిద్ధించడంగానీ జరగదు.

అస్థిత్వం ఎల్లప్పుడూ అస్థిత్వమే. ఇటువంటి దృక్కోణం నుంచే కల్పాది. కల్పక్షయ శబ్దాలకు అర్థం చెప్పుకోవాలి కాని సర్వేసర్వత్ర ఒక్కసారిగా ప్రళయం వచ్చి సృష్టి ఆగిపోయి తెల్లవారే దాకా ఉంటుందని అర్థం చెప్పుకోగూడదు. ఎందుకంటే సృష్టి అనాదీ, అనంతమూ, పైశ్లోకంలో ప్రకృతి అనే మాటకు శంక రులు త్రిగుణాత్మకమైన అపరాప్రకృతి అనీ, రామానుజులు తమస్సు అనే పేరు గల ప్రకృతి అనీ నిర్వచించారు. ఫలితార్థం ఏమిటంటే

1. మార్పు అంటే లేకపోవడం కాదు. మారినదిగా నిలిచి ఉండడం.
2. ప్రళయం అంటే లేకుండా పోవడంకాదు. లయమై నిలిచిఉండడం.
3. ప్రళయం సర్వేసర్వత్ర వచ్చేదికాదు. శిథిలమూ జీర్ణము అయిన చోట మాత్రమే అంతటా కాలక్రమానవచ్చేది.
4. రాత్రింబవళ్ళు నిత్యమూ ఎక్కడో ఒకచోట ఈ మార్పు జరిగేదే. సహజ మైనదే. పునఃపునః జరిగేదే.

8. ప్రకృతిం స్వా మవష్టభ్య విసృజామి పునః పునః।
భూతగ్రామ మిమం కృత్స్నం అవశం ప్రకృతే ర్వశాత్॥

తా: ప్రకృతికి వశమై ఉన్నందున అస్వతంత్రములైన జనన మరణాదులు గల ఈ భూతగ్రామమును అంతటినీ, నా ప్రకృతి శక్తిని పరిణమింపజేసికొని నేను మాటిమాటికీ విసృజిస్తున్నాను.

వ్యా: ఇంతవఱకూ మనం పరమాత్మయే ప్రకృతి శక్తిని పరిణమింపజేసికొని సృష్టిగా అవుతున్నాడని చెబుతూ వస్తున్నాము. పైశ్లోకంలోని విసృజామి అనే మాటకు విసర్జించడమనే కాని ప్రసవించడమని అర్థం కాదు. సాలెపురుగు దారాన్ని విసర్జిస్తుందే కాని ప్రసవించదు. ఈ విసర్జన ధర్మానికే ప్రకృతి లేక క్రియాశక్తి అనిపేరు. క్రియాశక్తి వాయువులో కలిసిన వాయువు లాగా, నిప్పుకు ముట్టించిన నిప్పులాగ, దీపానికి ముట్టించిన దీపంలాగా వేడిని వెలుగును వెదజిమ్ముతుంది. జగన్నాటకానికి పరమాత్మయే సూత్రధారి, పాత్రధారి, ద్రష్ట, నాటకం అన్నీ ఆయనే.

9. **న చ మాం తాని కర్మాణి నిబధ్నంతి ధనంజయ।**
ఉదాసీనవ దాసీన మసక్తం తేషు కర్మసు॥

తా: ధనంజయా! ఆయా ప్రకృతి నవష్టంభించడంవల్ల సృష్టిగా రూపొందడ మనే కర్మాన్ని కర్మబుద్ధుడనై చేయడంలేదు. ఆజీవి జన్మస్థానమూ కర్తృరీతి, భావ భంగి ఆజీవినలా నడిపిస్తుంది. ఆ అన్నింటికి నేను ఉదాసీనుడనై, సృష్టిజీవుల కర్మ లలో అసక్తుడనై ఉంటాను.

వ్యా: స్వభావాన్ని బట్టి గాలి వీచింది. సూర్యుడు ప్రకాశించాడు. గాలివీస్తే ఇక్కడ పుప్పొడిపోయి ఇంకో చోటిపూల మీద పడి పూలను చూలాంద్రను చేసింది. ఇక్కడ గింజలు ఎగిరిపోయి సారవంతమైన భూమిపై పడి వానకురవగానే మొక్క లుగా మేలుకున్నాయి. స్వభావ సిద్ధంగా సూర్యుడు కిరణాలను విరజిమ్మాడు. వాటి గిలిగింతకాగలేక మొగ్గలు పక్కున నవ్వాయి. ఆకులు ఆ కిరణాలను పాయసంలాగా జుఱ్ఱుకున్నాయి. ఆ పాయసాన్ని త్రాగి లతలు చెట్లు రంగురంగుల చీరలు కట్టుకు న్నాయి. ఆ గారడీని చూచి విస్తుపోయి సీతాకోకచిలకలు, తుమ్మెదలు, గంతులు వేశాయి. వనమంతా నందనవనమై అన్ని చోట్లు గుమగుమలాడాయి. వసంత చక్రవర్తి ఏకచ్ఛత్రాధిపత్యం సాగించాడు. విరహులు ఏడ్చారు. కోకిలమ్మ పాడింది. లేళ్ళగుంపులు తందనాలు త్రొక్కాయి. గాలి దేవుడుగాని సూర్యభగవానుడు గాని ఈ ఆర్భాటాన్ని ఏమీ పట్టించుకోలేదు. ఎంత అంటీముట్టనట్లుగా ఉదయించాడో సూర్యుడు అంతే అంటీముట్టనట్లుగా అస్తమించాడు. అలాగే వాయుదేవుడు అతి నిర్లిప్తంగా సముద్రంమీద పచార్లు చేశాడు. అలలకు గిలిగింతలు పెట్టాడు. ఈ జంజాటమంతా ఎవరికి పట్టుకుందయ్యా అంటే అసలు వాళ్ళెవళ్ళకూ పట్టలేదు. మధ్యవచ్చి మధ్యపోయే వాళ్ళనే పట్టుకుంది. అలానే పరమాత్మ సృష్టి కర్మ పర మాత్మకు బంధం కాదు. తన కర్మకు తాను పరమాత్మ ఎప్పుడూ తటస్థుడే. మనమే పరమాత్మకన్నీ అంటగడతాం.

రాగాది దోషరహిత స్వజనాను రాగం
వైరాగ్య శాంతి నిలయంగిరిజా సహాయం
మాధుర్య ధైర్య సుభగం గరళాభిరామం
వారాణసీపురపతిం భజ విశ్వనాథం.

అనివ్యాస మహర్షి విశ్వనాథ దేవుణ్ణి కీర్తించాడు. రాగాది దోషరహితుడై నప్పటికీ నాగేంద్ర భూషణుడు స్వజనుల మీద అనురాగం కలవాడట. వైరాగ్య

శాంతి గుణాలకు నివాసమైనప్పటికీ అతడు గిరిపుత్రిక మీద అనురాగం కలవాడట. మాధుర్య ధైర్యాలతో విలసిల్లే ప్రభువైనప్పటికీ, కంఠంలో మనోహరంగా గరళాన్ని ధరించాడట. ఇదిగో! ఈ సమతాభావమే మనిషిని పరమాత్మగా చేసేది. నిజానికి ఏ జంజాటం లేని అమ్మకు ఈ బిడ్డల మీద మమకారం ఎందుకూ? పిల్లలందఱూ తన అవయవాలే అని అమ్మ ఎందుకనుకుంటుంది? మీ కంటె నేను వేఱుగానని మాటిమాటికీ ఎందుకు అమ్మనొక్కి చెబుతుంది? ఎందుకంటే పరమాత్మకూ తానే అదిగా రూపొందిన తన సృష్టికి ఏమాత్రమూ భేదంలేదు కనుక. 'సంహరంత మపి ప్రపంచమశేష లోకనివాసినం అన్నారు మహాశివుని గూర్చి మార్కండేయస్తవంలో తాను సంహరించే లోకాల్లోనే నివాసముంటాడట ఛిన్నమస్త ఆయన భార్యేకదా! మన విషయంలో లాగా సృష్టి వికాసం, సృష్టి నిర్వహణ సంహరణం అనే మాటలకు భిన్నార్థాలు లేవు, ఆ మూడింటికీ ఒకటే అర్థం.

10. మయాఽ ధ్యక్షేణ ప్రకృతి స్సూయతే సచరాచరమ్।
హేతునాఽ నేన కౌంతేయ! జగ ద్విపరివర్తతే.

తా: కౌన్తేయా! నేనధ్యక్షుడనై ఉండడంచేత ప్రకృతి సచరాచర జగంగా రూపొందుతున్నది. ఆ హేతువువల్లనే జగత్తు కూడా సరిగా (తన మార్గంలో తాను) నడుస్తున్నది.

వ్యా: పరమాత్మ లేకుంటే ప్రకృతి లేదు, ప్రకృతి పరమాత్మలకు భేదంలేదు. అంతటా ఎలక్ట్రిసిటీ ఉన్నా ఎక్కడ బల్బు అంటుకుంటే అక్కడ దీపం వెలిగినట్లు, (పరమాత్మ ప్రకృతుల సాన్నిధ్యం ప్రతి చోటా ఉన్నా) సంకల్పమనే బల్బు ఎక్కడ అంటుకుంటుందో అక్కడ చరాచరమైన సృష్టి చక్రం నిర్మాణమవుతున్నది. సంకల్పానికి వేఱే కారణంలేదు. పరమాత్మ స్వభావమే సంకల్పం. ఈ శ్లోకంలో పరమాత్మ అధ్యక్షత్వం వేఱుగా చెప్పబడింది. వ్యాఖ్యాతలు సన్నిధిమాత్ర సత్తాగా వ్యాఖ్యానిస్తారు దాన్ని. ప్రకృతియే పరమాత్మ అనుకొన్నప్పుడు ప్రకృతి రూపుడైన పరమాత్మ అధ్యక్షత్వం అని అర్థం. ఏ బాధా లేకుండా వస్తుంది. సూయతే అంటే కనడం. ప్రకృతి రూపుడై సృష్టిని కంటున్నాడని అర్థం. ఈ అర్థం చెప్పేటప్పుడు SHE అంటే ప్రకృతికి ప్రాధాన్యం. అప్పుడు పరమాత్మను SHEలో ఉన్న He గా గుర్తిస్తాం.

11. అవజానన్తి మాం మూఢాః మానుషీం తను మాశ్రితం।
పరం భావ మజానన్తో మమభూత మహేశ్వరమ్။

తా: భూతమహేశ్వరుణ్ణి నేను మనుష్య శరీరాన్ని ధరించి ఉన్నాను. శాశ్వ

తమూ సత్యమూ అయిన నా నిజరూపాన్ని గుర్తించక నన్ను కొందఱు అవమానిస్తు న్నారు.

వ్యా: ఏదో శ్లోకానికి 11వ శ్లోకం వివరణ అనిపిస్తుంది. మామూలుగా వ్యాఖ్యాతలు 10వ శ్లోకానికి ఇలా అర్థం చెబుతారు. పరమాత్మ పురుషుడు. ప్రకృతి స్త్రీ, పురుషుని సాన్నిధ్యంచేత ప్రకృతికి చైతన్యం కలుగుతుంది. దాని వలన వివిధ బంధాలకు ప్రసూతి బాధలకు కారణమైన సృష్టికర్మను ప్రకృతి చేస్తుంది. కర్మబంధాలు ప్రకృతినే పట్టుకుంటాయి గాని పురుషుణ్ణి చుట్టుకోవు. అతడు అన్నింటికీ తటస్థంగా ఉంటాడు. కాబట్టి పరమాత్మ సంకల్పం వలననే అంతా ఉద్భవిస్తున్నా దానికీ పరమాత్మకూ ఏమీ సంబంధం లేదు. పరమాత్మ ఎలాగూ కంటికి కనిపించడు కనుక కనిపించే ప్రకృతి కార్యాన్ని ఆసరాగా చేసుకుని పరమాత్మ ఉనికి నిరూపిస్తాం. కనిపించే వసిష్ఠ నక్షత్రాన్ని ముందఱ గుర్తించి తరువాత దాని ప్రక్కన మినుకు మినుకుమనే అరుంధతిని గుర్తించినట్లు. 7వ శ్లోకంలో తానే సర్వభూతాలను ఉద్గమింపజేస్తానని పరమాత్మ సెలవిచ్చారు. సృష్టికర్మలో సగం బాధ్యత తనదిగా స్వీకరించారు. ప్రకృతినుజ్జీవింపజేసి భూతగ్రామాన్ని ఉద్భవింపజేస్తానని కూడ చెప్పారు. జఱిగే కర్మకాండకు అధ్యక్షుడనని చెప్పారు. కాని సాన్నిధ్య మాత్రం వల్లనే ప్రకృతి కార్యశీలమౌతున్నదని పరమాత్మ సాక్షిమాత్రుడనీ, వ్యాఖ్యాతలు చేపలను బట్టే వల అల్లారు.

ప్రకృతి పురుషుల అభేదాన్ని గూర్చి ఇంతవఱకు ఎన్నోసార్లు ఆమ్రేడితం చేశాను పరమాత్మ నిష్క్రియుడనే వాదాన్ని పుష్టి చేయడానికి అల్లినదే పై చేపలవల.

"భగవంతుడు అన్నది నువ్వు పెట్టిన పేరు గాని ఆ శక్తికి స్త్రీపురుషభేదం లేదు నాన్నా. దాన్ని భగవంతుడనే కాదు ఏ పేరైనా పెట్టు. ఉన్నదొక్కటే "అమ్మ".

12. మోఘాశా మోఘకర్మాణో మోఘజ్ఞానా విచేతసః
రాక్షసీ మాసురీంచైవ ప్రకృతిం మోహినీం శ్రితాః॥

తా: నా పరమాత్మ భావాన్ని గుర్తించలేనివాళ్ళు, అంతా పరమాత్మ స్వరూపమని గుర్తించనంత వఱకూ వ్యర్థంగా ఆశలను పెంచుకుంటూ, వ్యర్థంగా పనులను చేస్తూ, వ్యర్థమైన మిడిమిడి జ్ఞానంలో పడి కొట్టుకుంటూ రాక్షస ప్రకృతిచేతా, ఆసుర ప్రకృతి చేతా మోహితులై హింసాపరాయణులగు చున్నారు.

వ్యా: ఛింది, భింది, పిబ, ఖాద, పరధనమపహర, ఇంద్రియాలు చెప్పినట్లే విను, అందమైన స్త్రీలతో కాలం వెళ్ళబుచ్చు దేహం కంటె ఇంకో లోకంలేదు. ఇట్టి

బోధలు చేసేవాళ్ళు మోఘాశామోఘ కర్మాణోమోఘు జ్ఞానావిచేతసః అనే తెగకు చెందిన రాక్షసులు అసురులు.

13. మహాత్మాన స్తు మాం పార్థ! దైవీం ప్రకృతిమాశ్రితాః!।
భజ న్త్యనన్య మనసో జ్ఞాత్వా భూతాది మవ్యయమ్॥

తా: హేపార్థా! దైవీప్రకృతిని ఆశ్రయించిన మహాత్ములు ఐతే అనన్యమనస్కులై భూతాలకన్నింటికి కారణమైన నా ఉత్తమ తత్వాన్ని తెలుసుకుని నన్ను భజిస్తుంటారు.

వ్యా: బయటి ప్రపంచానికీ మనుష్యునికీలింకుగా పితృదత్తమైన మహావరం శరీరం. ఈ శరీరాన్ని గూర్చి ప్రధానమైన వాదాలు రెండున్నాయి.

(1) శస్త్రవాదం (2) వస్త్రవాదం.

(1) శస్త్రవాదం అంటే ఇహలోకవాదం. అన్నింటినీ నఱుక్కుంటూ పోవడం. విజ్ఞానము లేక సైన్సు అని దానికి పేరు. ఏమి ఎవడు, ఎక్కడ, ఎందుకు, ఎలా, ఏది, ఎప్పుడు, ఈ ప్రశ్నలకు సమాధానాలను రాబట్టుకొని వాటిని విస్తరింపజేయడానికి ప్రయత్నం చేయడం. అహంకారానికి పెద్దపీట ప్రత్యక్షం మీదనే విశ్వాసం. ఖడ్గతత్వం వికేంద్రీకరణ నకిలీ జీవితం. విశ్వామిత్ర సృష్టి. బహుసంఖ్యావాదం. అవిలంఘ్యత్వం మీద అవిశ్వాసం. బంగారు గ్రుడ్డుపెట్టే బాతు ఒకటుండేది. పొట్టకోసి అందులోని బంగారాన్ని ఒక్కసారిగా లాగేసుకుందామని దాని ఆసామీ భావించాడు పొట్టకోశాడు. ఏమీ కనిపించలేదు.

స్వాధిష్టానాది చక్రాలను గూర్చి అత్యంత మనోహరంగా పోతులూరి వీరబ్రహ్మంగారు ఉపన్యసించారు. దాన్ని గుమ్మానికానుకుని మాల జీతగాడు విన్నాడు. ఇంటికి వెళ్లి భార్యను నిలువునా కోసి చూశాడు. చక్రాలు కనిపించలేదు. భార్య చచ్చిపోయింది వీరబ్రహ్మంగారి దగ్గఱకు వెళ్ళి మొఱపెట్టుకున్నాడు. మహిమాన్వితుడైన వీరబ్రహ్మంగారు మాలెతను బ్రతికించారని ఆయన చరిత్రలో ఉంది. శస్త్రవాదానికి చక్కటి ఉదాహరణ.

వస్త్రవాదం. ఓతప్రోత సంకలనం ఇందులోని విశేషం ఆచ్ఛాదనం. విస్తరణం. రూపసృష్టి. వ్యక్తీకరణం. సహజోత్పత్తి. చైతన్యం. పౌనఃపున్యం. సహజత్వం. నైరంతర్యం. శాశ్వతత్వం. ప్రాణచలనం. జీవన్ముక్తి. అనురాగం.సమ్మేళనం నవీనత్వం. మనస్సంచారం. దేశకాల వ్యవస్థలు. ఇందులోని ప్రధాన స్వభావాలు గుణాలు. రామకృష్ణపరమ హంస. వివేకానందుడు. అరవింద మహర్షి. వశిష్ఠ గణపతిముని, రమణమహర్షి, జిల్లెళ్ళమూడి అమ్మ చక్కటి ఉదాహరణలు.

మహాత్ముల కోవకు చెందినవారు వీరందఱు. దైవప్రకృతులు వీరు. వికేంద్రీకృతమై ఉన్న జగత్తులో పుట్టిన వీరు స్వీయ జీవితాలను ప్రయోగశాలలుగా జేసి వస్త్రవాదాన్ని నిరూపించడానికి ప్రయత్నించారు.

పరమాత్మ భావాన్ని విస్తరింపజేయడానికి జీవితాలను ఖర్చుజేశారు.

"ఎదుటివారిలో దైవత్వం చూస్తున్నంతసేపూ మనలో దైవత్వం కలుగుతుంద"న్నది అమ్మ.

దైవీ ప్రకృతి సత్వగుణ ప్రధానమైంది కనుక ఆ గుణ ప్రభావం కలవారందఱూ అన్ని భూతాలలోనూ పరమాత్మ సాన్నిధ్యాన్ని దర్శించి భజిస్తుంటారు. ఈ మహాత్ముల నిత్య వర్తన రాక్షసీ స్వభావానికి కేవలం వ్యతిరేకంగా ఉంటుంది.

ఎలాగంటే

14 సతతం కీర్తయన్తో మాం యతన్తశ్చ దృఢవ్రతాః।
నమస్యంతశ్చ మాం భక్త్యా నిత్యయుక్తా ఉపాసతే॥

తా: (వాళ్ళు) అనవరతమూ నన్ను కీర్తిస్తూ దృఢవ్రతులై నన్ను గూర్చి యత్నములు సలుపుతూ, నాకు భక్తితో నమస్కరిస్తూ, నిత్యం నాయందే మనస్సును నిలిపి నన్నే సేవిస్తుంటారు.

15 జ్ఞాన యజ్ఞేన చాప్య న్యే యజన్తో మా ముపాసతే।
ఏకత్వేన పృథక్త్వేన బహుధా విశ్వతో ముఖం॥

తా: ఇతరులు కూడా నన్ను జ్ఞాన యజ్ఞం చేతను, ఒక్కడనే అయిన సచ్చిదానంద పరమాత్మగా ఉపాసిస్తారు. కొందఱు సూర్యాది దేవతలుగా పెక్కుగా పూజిస్తారు. విశ్వమంతా ఐ ఉన్న నారూపాలను ఏకంగాను అనేక ప్రకారాలుగాను భజిస్తున్నారు.

వ్యా: జ్ఞాన యజ్ఞం వలన అద్వైతులు, పృథక్త్వం వలన ద్వైతులు, విశ్వతోముఖ బహుత్వంవల్ల విశిష్టాద్వైతులు నన్ను వేర్వేరు రీతులుగా పూజిస్తున్నప్పటికీ అన్ని రీతులూ, అన్ని మార్గాలూ నాకు సమ్మతమైనవే. మనుష్యుడు ఏ మార్గంలో పూజించినా, ఏ మతం అవలంబించినా, అన్నీ పరమాత్మకు సమ్మతమైనవే కాని తన మతమే గొప్పదని, తన మార్గమే విశిష్టమైనదనీ, ఇతరుల మార్గాలు నికృష్టములైనవనీ, ఎవనినీ, దేనినీ తెగనాడకూడదు. నాస్తికుల విషయంలోనైనా భగవన్ చెప్పినట్లు వాడి దేవుడు వాడికి లేకపోవచ్చుగాక, ఇంకొకళ్ళకు దేవుడు లేడనడానికి

వాడెవడు. కాని దేవుడు ఒక్కడే ఉండగా, ఈ అసంఖ్యాక జీవకోటి, అసంఖ్యాక మార్గాలలో చేసే కైంకర్యమంతా అతనికి తప్పక చేరుతుందా అంటే తప్పక చేరుతుంది. ఎలాగా, ఎందుకు, ఎప్పుడు అనే ప్రశ్నార్థాలకు పరమాత్మ ఇచ్చిన చక్కని సమాధానం ఇది.

16. అహం క్రతు రహం యజ్ఞ స్స్వధా౽ హ మహ మౌషధమ్।
మంత్రో౽ హ మహ మే వా౽ జ్య మహ మగ్ని రహం హుతమ్॥

తా: నేనే క్రతువును. నేనే యజ్ఞాన్ని; నేనే స్వధాస్వాహా రూపమైన యజ్ఞపిండాన్ని, నేనే ఔషధాన్ని; నేనే మంత్రాన్ని; నేనే ఆజ్యాన్ని; నేనే అగ్నిని; నేనే హోమ కర్మాన్ని.

వ్యా: యజ్ఞం చేయడానికి యజ్ఞకర్త యజ్ఞ హోత, యజ్ఞహోమం, హోమ సామగ్రి, యజ్ఞకార్యం, యజ్ఞమంత్రాలు, అగ్నిదేవుడు, సమిధలు ఇవన్నీ ఉండాలి. అన్నీ పరమాత్మయే అయినప్పుడు, ఆ అంశాలను భాగాలు, భాగాలుగా చూసే వాళ్లదే పొరపాటవుతుంది కాని పరమాత్మది కాదుగా. మాటి మాటికీ అన్నీ నేనే, అన్నీ నేనే అని పరమాత్మ చెప్పడంలో తాత్పర్యం ఇదే. నేను కాని దేదీ లేదు. వ్యష్టిగా ఉన్నా సమష్టిగా ఉన్నా అంతా నేనే. మీకు తట్టేది కూడా సమష్టే. దాన్ని పరమాహంత అంటారు. పర = అంటే దానికంటే పైన మా అంటే లేదని అర్థం. అదే పరమాత్మ. అమ్మ ఏపని చేసినా తన తృప్తికోసమే అన్న మాటను పట్టుకొని ఆ పనులు కామ్యకర్మాలుగా అర్థం తీస్తున్నారు కొందఱు. అది సరికాదు. అమ్మచేసిన పనివలన కలిగిన తృప్తి అమ్మ కెలాగో సమస్త జీవులకూ అదే రీతిగా తృప్తి కలుగుతుంది. అందువలన ఈ మాటకు ఏకదేశ విశిష్టమైన అర్థం చెప్పగూడదు.

17. పితా౽ హ మస్య జగతో మాతా ధాతా పితా మహః।
వేద్యం పవిత్ర మోఙ్కారః ఋక్సామ యజు రేవ చ॥

తా: ఈ జగత్తుకు తండ్రిని నేను. తల్లిని నేను. తాతను నేను. ధాతను నేను. లోకానికి బీజరూపమైన పవిత్రమైన ఓంకారాన్ని నేను,. ఋగ్యజు స్సామాథర్వ వేదాలన్నీ నేనే.

వ్యా: ముందుగా జగత్తుకు తండ్రిని నేనని చెప్పడంలో చాలా అందం ఉంది. తల్లి గర్భంలో అండ పిండరూపాలతో శిశువు 9నెలలు వృద్ధి చెంది తరువాత భూపతనమౌతుంది. కాని తల్లి గర్భంలోనికి చేరకపూర్వం 3 నెలలు తండ్రి మనస్సులో బిడ్డ సంకల్ప రూపంగా 3 నెలలు ఎదుగుతుందని ఉపనిషత్తు చెబుతుంది.

సైన్సూ ఒప్పుకుంటుంది. వెరసి గర్భవాసకాలం శిశువుకు 12 నెలలు అంటే సూర్యుని చుట్టూ భూమి తిరిగే కాలం. సంవత్సరోత్పత్తి క్రమం. పరమేష్ఠి సంకల్పం కారణంగా ఉద్భవిస్తుంది జగత్తు. కాబట్టి జగత్తు ఉద్భవించడాన్ని గూర్చి చెప్పే సందర్భంలో ముందుగా తండ్రినని చెప్పడం చాలా సమంజసంగా ఉంది. తరువాత 9 నెలల కార్యక్రమం బ్రహ్మదేవుడే చేస్తాడు. కనుక నేను ధాతనని పరమాత్మ చెప్పుకున్నాడు. అటువంటి బ్రహ్మను కూడా తన నాభీ కమలం నుండి సృష్టించాడు కనుక తాను జగత్తుకు తాతనని చెప్పుకున్నాడు సృష్టి అనాది - నాది.

ఏ మనిషికైనా ఒక తల్లి ఒక తండ్రి ఉంటారు. అందఱు మనుష్యులకూ ఉండే అందఱు తల్లులకూ తల్లి అమ్మట. అందఱు తండ్రులకూ కూడా తల్లి అమ్మట. వింతగా లేదూ? అయితే అందఱు మనుష్యులకూ తాతా అమ్మే. ధాతా అంటే కర్మ ఫలాన్ని ప్రాణులకు విధించేవాడని శంకరులు అన్నారు. ధాతృశబ్దం మాతాపితృ జన్మ ప్రయోజన విశేషమని రామానుజులన్నారు.

ప్రపంచమంతా ఓంకారం నుంచి ఉద్భవించిందని మీమాంసాశాస్త్రం చెబుతుంది. 'శబ్దబ్రహ్మోద్భవం విద్ధి'. అనాహతమైన నాదం రూపుదాల్చి ఓంకారాత్మకమై చరాచరాత్మకమైన ప్రపంచంగా రూపొందిన గాథ చిత్రాతి చిత్రమైంది. తల్లి తండ్రి, తాతలను గూర్చి చెప్పి, ఈ జగత్తు నా బిడ్డ, నా కన్న కడుపు నా మనుమని రూపం అని పరమాత్మ సెలవిస్తుంటే, జగత్పరిణామంలో ఎన్నిరకాలయిన బిగ్ బాంగులు కట్టెదుట దొర్లిపోతున్నాయో స్పష్టీకరించినట్లవుతుంది. ఈ పరిణామాన్ని అంతటినీ తెలుసుకున్నవాడు సారూప్యం చెందడమే, ఋక్సామ యజుర్వేదాలు అవతరించడానికి అర్థం. అందం ఏమిటంటే జగత్తును ధాతపిత ఐన బ్రహ్మ ముఖాన ఉద్భవించిన వేద సరస్వతి కూడా తెలియబడిన జగత్తుగా రూపొందడం. అదే ప్రకృతి పురుషుల అవినాభావం కూడాను.

18. గతి ర్భర్తా ప్రభు స్సాక్షీ నివాస శ్శరణం సుహృత్।
ప్రభవః ప్రళయ స్థానం నిధానం బీజ మవ్యయమ్॥

తా: ఈ జగత్తుకు చైతన్యాత్మకమైన గతిని నేను. భరించేవాడిని నేను. యజమానిని నేను, నిత్యమూ కన్నుల్లో పెట్టుకుని బాగోగులు చూస్తున్నవాడిని నేను, శరణస్థానాన్ని నేను, దీని మేలుకోరే వాడిని నేను. పుట్టుకలోనే ప్రళయంగానున్న జగత్ స్థానాన్ని నేను నిక్షేపించిన నిలుకడతావును నేను. తఱుగులేని కారణాన్ని నేను.

వ్యా: ఈ సంసారం నిరంతరం పరిణామం చెందుతూ ఏదో గమ్యస్థానానికి చేరుకోడానికిలాగా పోతున్నది. ఈ పరిణామానికి కారణమైన చలనశక్తిని గతి అంటారు. చక్కగావింటే ఇసుక కణాలలోని గుసగుస కోణాకృతిలో వినబడతాయి. ఇది గతి స్వభావం. అలాటి గతిని నేనే అని పరమాత్మ చెబుతున్నారు. గమ్యస్థానం చేరుకోకముందు ప్రయాణంలోనూ, చేరుకున్న తరువాతనూ ఈ సంసారాన్ని భరించేవాడు కావాలి కదా? ఆ భరించే భర్తను కూడా నేను. ఈ భరణశక్తి సాగే గీతల్లాగా ఉంటుంది. ఈ సంసారాన్ని తప్పుత్రోవల్లో పోకుండా శాసించే ప్రభువును నేను. విరళ స్వభావం కలది ఈ శాసనం. అంతేకాక సంసారం నడిచే మార్గానికి ముందు వెనుకలు చూపే చోపుదారీ కూడా ఉండాలి కదా! ఆ చోపుదారి పనిచేసే సాక్షిని కూడా నేనే. అంటే సంసారానికి సగుణ నిర్గుణ రూపాలతో ఉండే సమస్తాన్నీ నేను. సంసారానికి దిక్కును నేను. సంసారం మేలును కోరే హితైషిని నేను, సంసారాన్ని మేలుకొలిపే ప్రళయంలోని ఉత్పత్తిలాగానే ఉత్పత్తిలోని ప్రళయాన్ని కూడా నేను. నేనే దాన్ని రక్షించేవాడిని, భద్రపఱిచేవాడిని. దానికి ఎన్నడూ మాసి పోని బీజాంకురాన్ని నేను. విత్తు మొలేస్తే ఆ విత్తు నష్టమై మఱో చెట్టు దానిస్థానే వస్తుంది. ఈ సందర్భంలో విత్తు వ్యయమై పోయినట్లు మనం భావిస్తాం. కాని సంసారం విషయంలో ఎలాగా, ఎంతగా, ఎన్నాళ్ళు ఖర్చుచేసినా రవ్వంతైనా వ్యయ మైపోని విత్తనాన్ని నేను.

ఈ సందర్భంలో Thermo Dynamic Laws చెప్పే తికమకను కూడా వివ రించాల్సి ఉంది. థెర్మోడైనమిక్ సూత్రాలు మూడు. మొదటి సూత్రం నీఒక టన్ను బరువుగల ప్రయత్నం చేస్తే ధానికి వచ్చే ఫలితం ఎప్పుడూ టన్నుకు తక్కువగానే ఉంటుందనీ, ఇలా తగ్గించే శక్తిని ఎంట్రొపీ (Entropy) అంటారనీ మొదటిసూత్రం బల్లగుద్ది మఱీ చెబుతుంది. మిగతా సూత్రాలు Entropyని ఎదుర్కోలేని మనిషి అసమర్థతను వివరించుతాయి. బ్రదికి ఉండడానికి ఎదగడానికి మనుష్యుడు చేసే ప్రయత్నమే సంసారమూ చేస్తున్నది. మిలియన్ల, బిలియన్ల సంవత్సరాల నుండి ఆ పనిలో అది నిమగ్నమై ఉన్నది. థర్మోడైనమిక్స్ మొదటి సూత్రంలోని Entropy సిద్ధాంతం ప్రకారం సంసారం చేసే పనికి వచ్చే ఫలితం ఎప్పుడూ తక్కువగానే ఉండాలి కదా! అదే నిజమైతే ఈ పాటికి సంసారం ఎన్నడో శూన్యమైపోయి ఉండేది. సిద్ధ సత్యం ఏమిటి? WE ARE LIVING IN AN EXPANDING UNIVERSE. విస్తరించుకొని పోతున్న సంసారంలో మనం నివసిస్తున్నాం. సంసార పరిణామంతో పోల్చి, ప్రయోగించి చూస్తే సైన్సు సూత్రాలు పరిమిత

సత్యాలే అవుతాయి. సంసారం విత్తనం ఎంత ఖర్చుచేసినా రవ్వంతైనా తఱగని విత్తనం. ఈ ప్రకారంగా పరమాత్మ తనకూ సంసారానికీగల సంబంధాన్ని చక్కని మాటలతో సెలవిచ్చారు.

"ఇదంతా నేను. కారణం నేను. కాలం నేను. నిన్ను సృష్టించింది నేను. నీకు అన్నీ ఇచ్చేది నేను. అమ్మంటే జిల్లెళ్ళమూడిలో మంచం మీద కూర్చునేదే కాదు. ఉండేది, నీకు కనిపిస్తే చూస్తావు. నిన్ను నావేపు త్రిప్పుకునేదీ , నడిపించుకునేదీ నేను. స్థితి నీవు సాధించేది కాదు. నీకు నేను ఇచ్చేది. నేను సృష్టి స్థితిలయ కారిణిని. సృష్టించే నేను. కావాలనుకుంటే చంపేసేదీ నేనే" అమ్మ.

క్రిందటి శ్లోకంలో అమ్మ అంటే అందఱకూ అమ్మయే అమ్మ అని చెప్పి ఉన్నాం కదా! అమ్మ అనే విత్తనం నుండి బిడ్డలనే చెట్లూ విత్తనాలూ పుట్టుతుంటారు. చెట్లు కూడావిత్తనాలను ఇచ్చి అమ్మలవుతుంటాయి. ఆ విత్తనాలు మళ్ళీ చెట్లనిచ్చి అమ్మ అవుతుంటాయి. ఇలాగా సంసారమనే గొలుసు అవ్యయంగా ఉత్తరోత్తరాభివృద్ధి శీలమై సాగిపోతూ ఉంటుంది. దీన్నే బీజాంకుర న్యాయం అన్నారు. ఇందులో ENTROPY ని ఎన్నడైనా ఎవరైనా చూశారా?

19 తపా మ్యహ మహం వర్షం నిగృహ్ణా మ్యుత్సృ జామి చ।
అమృతంచైవ మృత్యు శ్చ సద సచ్చాహ మర్జున!॥

తా: అర్జునా! నేను సూర్యుడినై లోకాన్ని పక్వం చేసి నా వేడితో జీవింపచేస్తున్నాను. వర్షాన్ని పుట్టించి కురిసి, జీవులకు జీవరసాన్ని అందిస్తున్నాను. వర్షం కురవనీకుండా ఆపి, వఱపును పుట్టించి మృత్యువు కాహారాన్ని కల్పిస్తున్నాను. మృత్యువు లేకుండా ఉండే కారణాన్ని ఎలాగౌతున్నానో, మృత్యువుగా కూడా అలాగే అవుతున్నాను. మారని సత్తును మారే అసత్తును విడిగా లేకుండా ఈ రెండూ నేనే అయి ఉన్నాను.

వ్యా: ఈ శ్లోకంలో పరమాత్మ లోక వ్యవహారంలో ఉండే భ్రాంతి మూలకాలైన అపోహలను, ఎన్నింటినో తొలగించే లాగా చక్కనిమాటలతో క్లుప్తంగా అద్భుతమైన రహస్యాలను వెల్లడించారు. దేవుడు కరుణామయుడు కనుక లోకం మేలు కోరే వాడు కనుక, మనకిష్టమైన వాటిని సమకూర్చినప్పుడే అతనికా బిరుదం దక్కుతుంది. కాని అరిష్టాలని కలిగించేవాడయితే అతడు లోకాలకు శత్రువే అనుకోవాల్సి వస్తుంది అని మనుష్యుల మనస్సులలో ఉండే అపోహ ఒకటి. ఇష్టానిష్టాలూ కష్ట సుఖాలూ అందఱి మనస్సులలో ఒకేరీతిగా ఉంటాయా? పేరయ్యకు పకోడీలు

ఇష్టం. సూరయ్యకు చేగోడీలు ఇష్టం. పకోడీలు ఇచ్చినప్పుడే పేరయ్యకు భగవంతుడు భగవంతుడౌతాడు. చేగోడీలిచ్చినప్పుడే భగవంతుడు భగవంతుడు సూరయ్యకు.

వర్షమూ, ఎండా, వాటి పరిమితి, మనుష్యుని తగినట్లుగా ఉంటేనే భగవంతుడు నిష్పక్షపాతి అవుతాడు.

మృత్యుభయం అనే తెరమీద జీవితాశ అనే సినిమాను చూస్తుంటాడు మానవుడు.

ఒకళ్ళ సత్తు ఇంకొకళ్ళకు అసత్తు. రెండూ కలిసి ఉన్నదే అసలు సత్యం. ఈ న్యాయాన్ని అమ్మ ఎంతో మధురంగా తిరగేసి చెప్పారు. ఎలా ఉండకూడదో కూడా చెప్పారు. 'నేను పొట్టు ఒలుస్తుంటాను. ఇక విత్తనానికి పనికిరాదు'.

20. **త్రైవిద్యా మాం సోమపాః పూత పాపాః**
యజ్ఞైరిష్ట్వా స్వర్గతిం ప్రార్థయన్తే!
తే పుణ్యమా సాద్య సురేంద్ర లోక
మశ్నన్తి దివ్యాన్ దివి దేవభోగాన్||

తా: మూడు వేదాలను అధ్యయం చేసి, సోమపానం చేసి, పాపముల నుండి విముక్తిని పొందినవారై, యజ్ఞాదులను చేసి స్వర్గం కోసం నన్ను పుణ్యాత్ములు ప్రార్థిస్తుంటారు. వాళ్ళా పుణ్యాలను పొందినవారై ఇంద్ర దేవతా లోకమును పొంది ఉత్తమములైన దివ్య భోగాలను అనుభవిస్తూ ఉంటారు.

పరమాత్మ కవియై జగత్కథా గ్రంథాన్ని వ్రాయడానికి, అస్తినాస్తి జీవన్మరణార్చిరాది ధూమ్రాది మార్గాలు రెండువైపులుగా గల కాగితాలు స్వీకరించిన విషయం 8వ అధ్యాయంలో వివరించబడ్డది. ఆ కాగితాలమీద బ్రహ్మ సంకల్ప ముద్రణ రూపమైన శిల్పసృష్టితో రచిస్తున్న జగత్కథా కావ్యం ఈ అధ్యాయంలోను రాబోయే అధ్యాయలలోను వర్ణించబడుతున్నది. 'పితాహమస్య జగతో' శ్లోకం నుండి రచనా శిల్పం మొదలైంది. ఏఏ శక్తుల నైపుణ్యం ఇందులో ఉపయోగపడుతున్నదో వర్ణించబడుతున్నది.

అమృతాన్ని మృత్యువును, సత్తును అసత్తును సనాతనత్వము సాకల్యత్వము, చావు లేకపోవడమూ; చావే ఉండడం, సత్తు, అంతా అదేగా ఉండడం, అసత్తు, ఏదీ లేకపోవడం, తనను తాను చంపుకునే యజ్ఞం అనే పవిత్రమైన పాపం చేసిన కర్మ ఫలితంగా, స్వర్గరూపం దాల్చిన ఈ జగత్తులోనే ఆ ఊహాభోగాలు అనుభవిస్తూ,

కొంతకాలం గడిపి ప్రతి జీవి తిరిగి జంజాటాల సంసారంలోకి ప్రవేశిస్తాడు. ఈ వాక్యాలు వేదం చెప్పినవే.

21. తే తం భుక్త్వా స్వర్గలోకం విశాలం
క్షీణే పుణ్యే మర్త్యలోకం విశన్తి।
ఏవం త్రయీధర్మ మనుప్రపన్నా
గతాగతం కామకామా లభన్తే॥

తా: వారా విశాలమైన స్వర్గలోక సుఖాలను అనుభవిస్తూ తాము చేసిన పుణ్యఫలం క్షీణించిపోగా - మళ్ళీ మర్త్యలోకంలో ప్రవేశిస్తారు. ఈవిధంగా కామాభిలాషులై వేద విహిత ధర్మాలను ఆచరించినవారు నిత్యమూ మార్పుచెందుతూ ఉండే సుఖాసుఖమయ మర్త్యలోక జీవధర్మాన్నే, మర్త్యజీవాన్నే అవలంబిస్తుంటారు.

వ్యా: మాత్రా శూన్యమైనదీ, సర్వ మాత్రలకు స్థానమై నెలకొని ఉన్నదీ బిందువు అది. ప్రమాణ పరిమాణాలుపొంది సగుణ రూపం పొంది త్రికోణమైంది. MOBIUS లోని మెలికగా తయారైంది.

సర్వద్వంద్వాలూ నానాత్వం వైపూ, వ్యష్టి సమష్టివైపు మళ్ళడమే MOBIUS లోని మెలిక. మెలికయే మాయ. అదే DNA. ప్రాణ తరంగమూ. BIG BANG లోని ప్రథమ స్పందనమూ, MObius లోని చైతన్య ధారయే ప్రాణం. ప్రాణం అవతారమే మనస్సు. మనస్సు అవతారమే ఊహ. ఊహా పరిణామమే కర్మ. కర్మ లోని చైతన్యమే కాలం. కాలానికి రెండువైపులు వ్యక్తావ్యక్తాలు. వ్యక్తావ్యక్తాల పాకమే పురుష మేధమైన సృష్టి. అదే సంకల్ప ధర్మం. ధర్మం వికసించి వ్యష్టిగా కామ్యకర్మ అయింది. కామ్య కర్మలు పూత పాపాలు. వాటిని చేసి పవిత్రులైన పుణ్యాత్ములు లోకాన్నే స్వర్గంగా మార్చుకొని కొన్నాళ్ళు గడిపి, కామ్యకర్మలు సమిష్టి శ్రేయో కర్మలుగా మారగానే అందరికీ సుగతి కలిగే పనుల్లో కరిగిపోతారు.

22. అనన్యా శ్చింతయంతో మాం యే జనాః పర్యుపాసతే।
తేషాం నిత్యాభి యుక్తానాం యోగక్షేమం వహామ్యహం॥

తా: ఇతర విధాలైన చింతనలు లేకుండా నన్నే మదిలో ఏ జనులుపాసిస్తూ ఉంటారో వారి యోగక్షేమాల బాధ్యత నేనే వహిస్తాను.

వ్యా: అమ్మ చింతలన్నీ పిల్లలంటే, లోకంలోని జనులను గుఱించే. అది కూడా ఒక్క లిప్త కూడా ఇతరత్రా కాకుండా. పరమాత్మగా ఉన్న ఇతర ప్రపంచమూ, దాని లోని సమస్తమూ కూడా పరమాత్మయే. సమష్టి లోకం మీద కేంద్రీకరించడం పర

మాత్మమీద ధ్యానం ప్రసరింపచేయడం అవుతుంది.

కారణ ప్రపంచం సూక్ష్మ ప్రపంచంలో జఱిగే ప్రమాణ పరిణామాలన్నీ సైన్సుకు అందవు. అందిన భాగంలో ఎక్కువపాలు వికృత వినాశాలదే. అటువంటి మార్పులలో రక్తమే పాలుగామారి ప్రాణం యొక్క ఉత్పత్తి వికాసములకు మార్గాన్ని ఏర్పఱచి, సృష్టివర్ధనానికి అనువుగా కావడం ఒక ముఖ్యమైన అంశం. దాన్నే అమ్మతనం అంటారు. పరిణామంలోని యంత్రాంగం అర్థంకాని విషయం కాదు. తన్నుతాను తినేయడమే పరిణామం.. అదిలేతగా, ముదురుగా, చిక్కగా జరగవచ్చు. మనకామార్పు ఘోరంగా తోచవచ్చు. మనస్సుకు తట్టే గుణం పరమాత్మ వ్యాపారం బుద్ధిమయ ప్రపంచం యోగక్షేమాలు సమకూర్చేదానిలాగా మారిపోతుంది. - లేకపోతాను అని పరమాత్మ సెలవిస్తున్నారు, సృష్టిని, నోరుగా చేసుకుని; యోగం అంటే ఇదివఱకు లభించనిది ఇప్పుడు లభించడమని అర్థం. ఆ లభించనిది జాఱి పడిపోకుండా స్థైర్యం కలగడమని అర్థం క్షేమ పదానికి. అంటే అట్టి నిత్యాభియుక్తు లకు నాయందే స్థానం లభించేలాగా చేస్తానని పరమాత్మ సెలవిచ్చారు. మఱి ఇతర దేవతలను పూజించే వాళ్ళ సంగతో?

23. యేఽ ప్యన్య దేవతా భక్తాః యజన్తే శ్రద్ధ యాఽన్వితా
తేఽ పి మామేవ కౌంతేయ! యజన్త్యవిధి పూర్వకమ్.

తా: అర్జునా! ఇతర దేవతలను శ్రద్ధతో పూజించే భక్తులు కూడా అ విధి పూర్వకంగా నన్నే పూజించిన వారౌతున్నారు.

వ్యా: వెంకటేశ్వరస్వామి, పాండురంగడు, జగన్నాధుడు, వీరందఱూ అమ్మ తన బిడ్డలే అంటుంది. ఈ దేవతలను పూజించడమంటే అమ్మను ప్రత్యక్షంగా పూజించడమే అవుతుంది. కాబట్టి ప్రత్యక్షంగా లేదనే భేదభావం పరమాత్మకు లేదు. ఎవరికి ఎలా పూజలు నమస్కారాలు చేసినా తనకే చేరుతాయని పరమాత్మ చెప్పారు. ఎందుకంటే పూజించబడే వారందఱూ, పూజా విధి, పూజాసామగ్రి ఇవన్నీ పరమాత్మయే తప్ప వేఱే కావని రాబోయే శ్లోకంలో పరమాత్మ సెలవీయ బోతున్నారు.

24. అహం హి సర్వ యజ్ఞానాం భోక్తా చ ప్రభు రేవ చ।
న తు మా మభిజానన్తి తత్వేనాత శ్చ్యవన్తితే॥

తా: నేనే కదా! సర్వ యజ్ఞాలకు కర్తనూ భోక్తనూ, పరిపాలకుడను కూడా అయి ఉన్నాను. ఈ రహస్యాన్ని తెలిసికోకుండా ఉత్తమ పదస్థుడనైన నన్ను

పూజించడానికి మారుగా తమ బుద్ధిని క్రింది మెట్టుకు దిగలాగుకొనుటవలన ఉపేక్షిస్తున్నారు.

వ్యా: ఆధ్యాత్మిక విషయాలను చర్చించేటప్పుడు సర్వ సాధారణంగా పుణ్యమంటే ఏమిటి? పాపమంటే ఏమిటి? వర్ణ ఆశ్రమ ధర్మాలలోని రహస్యమేమిటి? సామాజిక క్షేమమంటే ఏమిటి? వ్యష్టి సమష్టి భేదాలు పరాప్రకృతిలో ఉన్నాయా? పునర్జన్మలు, కర్మ ఫలితాలు, ఒకదాని కొకటి కారణ కార్యాలుగా ఉంటాయా? కారణానికి ఇంకోటి కారణమంటూ ఉండదా? అనే ఇత్యాది విషయాలు చర్చనీయాంశాలుగా ఉంటాయి. వీటిని తలచుకుంటూ పోతే ఒకానొకస్థితిలో ఈ ద్వంద్వాలన్నీ పేలిపోయి నిర్ద్వంద్వమైన ఏకత్వం మిగులుతుంది. పృథక్త్వం కూడా మాసిపోతుంది. పాప పుణ్యభేదాలూ, మంచి చెడ్డా మనుష్య బుద్ధి నిర్మించిన భేదాలే కాని, ప్రకృతి పురుషుల క్రియాకలాపాల్లో ఈ భేదం మనకు కనిపించకుండా పోతుంది. చరాచరాలు, జడచైతన్యాలూ అక్కడ మనకు కనిపించవు. అటువంటి తురీయస్థితికి పరమార్థ దృష్టి అని పేరుపెట్టి వాటి అభేదాన్ని అద్వైతులు వర్ణించారు. అమ్మ అనే తెలిసిన స్థితి అది. దాన్నే పై శ్లోకంలో పరంభావం అని భగవానుడు నిర్వచించాడు. పరంభావం సమకూడిన వాడికి జన్మలు, కర్మలు, ద్వంద్వాలు. భేదాలు ఉండవని అద్వైతాచార్యులు వర్ణించారు.

తత్వేనాభి జానంతి అనే వాక్యంలో తత్ + త్వం అనే మాటల యొక్క అర్థాన్ని సరిగా గమనిస్తే పరమాత్మ అభిప్రాయం లెస్సగా బోధపడుతుంది. తత్ అంటే అది పరమాత్మత్వం అంటే నీవు. ఈ రెంటికీ భేదం లేదనే భావమే పరం భావం. అదే జ్ఞానసారం. అది కలగడమే యథార్థ దృష్టి రావడం. యథార్థ దృష్టి కలగడమే అసలు అంతస్థును చేరుకోవడం. అక్కడకు చేరకుండా ఉన్నంతవరకు క్రింది అంతస్థులోనే ఉంటారని భావం చ్యవన్తి అంటే అదే పై దశకోసం దిగజారుతూ మళ్ళీ ప్రాకులాడుతూ పరిణమిస్తూ ఉంటారని భావం.

25. యాన్తి దేవవ్రతా దేవాన్ పితౄన్ యాన్తి పితృవ్రతాః।
భూతాని యాన్తి భూతేజ్యాః యాన్తి మద్యాజినోఽపి మాం॥

తా: దేవతలను కొలిచేవాళ్ళు దేవతలను పొందుతారు. పితృదేవతలను కొలిచే వాళ్ళు పితృదేవతలను పొందుతారు. భూతాలను పూజించేవాళ్ళు భూతాలను పొందుతారు. నన్ను కొలిచే వాళ్ళు నన్నే పొందుతారు.

వ్యా: ఇంద్రాది దేవతలను భజించే వాళ్ళు ఇంద్రాదిదేవల అధిష్ఠానంలో ఉండే

స్థానాన్ని పొందుతారు. అలాగే పితృదేవతలను వినాయకాది దేవతలను పూజించే వాళ్ళు వాళ్ళ అధిష్టానం ఉండే స్థానాలనే పొందుతారు. మనస్సు పరిపక్వం గావ డానికి ఎన్నెన్ని అంతస్థులు దాటవలసి ఉంటుందో వాటిని పరమాత్మ ఆయా పదాలతో సూచించారు. పిపీలికా మార్గంలో చీమ పండును చేరడానికి, మొదట చెట్టు మ్రానుమీదకు, అక్కడ నుండి చిన్న కొమ్మమీదకు, అక్కడి నుండి రెమ్మమీదకు, రెమ్మనుండి పండు మీదకు అంతస్థులు అంతస్థులుగా ఎలా ప్రాకుకుంటూ పోతుందో, అలాగే భక్తుడు కూడా. మనస్సు పరిపక్వం కావడానికి, భూత. పితృ, దేవతా పరమాత్మలను పూజించి ఆయా పడి కట్లనెక్కి ఆ అంతస్థులను దాటు కుంటూ పోతాడు. డాబా ఎక్కాలంటే ఈ అంతస్థులన్నింటిని దాటవలసియే ఉంటుంది. మెట్ల నెక్కుతున్నవాడు అక్కడ పడుకొని నిద్రపోడు. డాబా నెక్కినవానికి మెట్ల ధ్యాస ఉండదు కూడాను. పరమేశ్వరుని అనుగ్రహం పొందిన విహంగ మార్గంలో ఆకాశంలో ఎగురుతూనే వచ్చి పై నుంచే పండుమీద వ్రాలగలడు. ఎక్కివచ్చినా, ఎగిరి వచ్చినా ఇద్దఱకీ పరమేశ్వరానుగ్రహమే ఫలప్రాప్తికి కారణ మౌతుంది. ఈ భేదాలు ఎందుకు వచ్చాయి అంటే సృష్టి అంటేనే భేదం, అభిన్నుడూ, అవిచ్ఛిన్నుడూ అయిన పరమాత్మ అణుకం నుండి ద్వ్యణుకం, ద్వ్యణుకం నుండి త్ర్యణుకం గావడమే భేద రూపాన్ని కల్పించి భేదశీలమైన సృష్టికి పునాది వేస నట్లయింది. కాని దేవతా భేదాలన్నీ పరమాత్మయే కాకపోవు. మీకు ఎలా. తోస్తే అలా ఆరాధించండి అంటుంది అమ్మ.

మఱి కొండంత దేవుడికి కొండంత పత్రితెచ్చి ప్రతీవ్యక్తీ పూజించగలడా అంటే ఎవరికెంత భగవంతుడు ప్రసాదించాడో దానితోనే భగంతుడు తృప్తి పడతాడట.

26 పత్రం పుష్పం ఫలం తోయం యోమే భక్త్యా ప్రయచ్ఛతి।
తద హం భక్త్యుపహృత మశ్నామి ప్రయతాత్మనః॥

తా: ఆకునుగాని, పూవునుగాని, పండునుగాని, చివరకు నీళ్ళనైనా సరే ఎవడు భక్తితో నాకు సమర్పిస్తాడో ఆ భక్త్యుపహృతమైన దానిని నేను ప్రీతిపూర్వకంగా అనుభవిస్తాను.

వ్యా: ఆకులు, పూలు, పండ్లు ఉత్తరోత్తర ప్రాధాన్యతకలవి. ఆకులు వచ్చిగాని పూలు రాలవు. పూలు పూసిగాని పండు లభించదు. అలాగే భక్తి కూడా వ్యక్తి మన స్సులో అంకురించి ఆకుతొడిగి పూలుపూసి పండైతేగాని పరమాత్మకు దాన్ని సమ ర్పించుకుందామనే పరిపక్వదశరాదు. వట్టి మోడు లాగా ఉండే గుండెలో పర మేశ్వరుని మీద ఆసక్తి భక్తీఅంకురించదు కూడా. తోయం అంటే నీరు. ఆకు,

పూవు, ఫలం అన్నింటికీ ప్రాణాన్నిచ్చేది. జీవరసం. పూర్వం వచ్చిన అధ్యాయంలో నేను అలాంటి జీవరసాన్ని అనికూడా పరమాత్మ సెలవిచ్చి ఉన్నారు. ఆకు, పూవు పండు మనస్సు పరిణతిని తెలియజేస్తే, తోయం అనే మాట మనస్సు ద్రవించడాన్ని సూచిస్తుంది. మనస్సు ద్రవించనిదే హృదయంలో పరమాత్మ రసం తానై ద్రవించ కుండా భక్తిభావం సగుణాత్మకంగా ప్రసరించడం దుర్లభంకూడాను. అప్పుడే భక్తుని హృదయంలోని స్థాయికి పరమాత్మ అనుగ్రహంలోని స్థాయికి సమానాధికరహిత స్థితి ఏర్పడి అదే ఇదై ఊరుకుంటుంది. భక్త్యా ప్రయచ్ఛతి అనే మాటలను బాగా గమ నించాలి. ఆడంబరంకోసం బండెడు పూలు రెండు బళ్ళ ఆకులు వందబళ్ళ టెంకాయలు ఖరాబుచేస్తే భక్తిని దేవుడి నుండి అన్ని బళ్ళనిండా సంపాదించినట్లు కాదు. ఇన్ని బళ్ళ పత్రిని ఇన్ని వేల రూపాయల ఖర్చుతో అని ఘోషించవచ్చుగాక. బంగారపుపూలతో పూజచేశారని అందఱూ విస్తుబోవవచ్చు గాక. కాని లవవేశం కూడా భక్తిలేని ఆ పూజ అంతా వ్యర్థమే. కృష్ణుణ్ణి తూచడానికి సత్యభామ వేసిన ఏడు వారాల నగలూ, శ్యమంతకమణి పెట్టిన మేటెడు మేటెడు బంగారం కాని ఆ త్రాసు ముల్లును రవంతయినా కదల్పలేకపోయింది. రుక్మిణిదేవి భక్తితో వేసిన తులసీదళమే దాన్ని తలక్రిందులు చేసింది. పాదరసం లాటిది భక్తి బరువు. సత్య నారాయణ వ్రతకథలో సన్యాసి శాపం దిన్న నౌకలోని డబ్బూ దసకం ఆకూ అలం అయిపోయింది. భక్త్యా ప్రయచ్ఛతి, భక్త్యుపహృతం అని రెండుసార్లు భక్తిమాటను రెట్టించి మఱీ చెప్పడంలోని అంతరార్థం కూడా ఇదే.

అట్టి భక్తులు ఏపనిని చేసినప్పటికీ దాన్ని భగవాదారాధనగానే చేస్తారు.

27. యత్కరోషి యదశ్నాసి యజ్జుహోషి దదాసి యత్।
య త్తపస్యసి కౌంతేయ! తత్కురుష్వ మదర్పణమ్॥

తా: అర్జునా! నీవు ఏ పనిచేసినా, ఏది తిన్నా, దేన్ని హోమం చేసినా, దేన్ని ఇచ్చినా, దాన్ని నాకు అర్పించి చేస్తూ ఉండు.

వ్యా: చేసేవాడూ, చేయించేవాడూ, చేసే పని అన్నీ పరమాత్మయే అయి ఉండగా అందులో మన ప్రమేయం ఎందుకూ? పరిమితబుద్ధి, పరిమిత శక్తి కలిగి ఉండి కూడా మనం చేసే పనులన్నీ మన ప్రభావంవల్లనే జరుగుతున్నాయనుకోడం లోనే మానవత్వం ఉంది.

'ప్రకృతేః క్రియమానాని గుణైః కర్మాణి సర్వశః।
అహంకార విమూఢాత్మా కర్తాహ మితి మన్యతే॥

అని గీతయే చెబుతుంది. అహంకార విమూఢుడని మానవుడిని వాత వేసింది గీత. ఏ పని జరగడానికైనా పరమాత్మ ప్రేరణకూడా ఉండాలి. దీన్ని గుర్తించిన బుద్ధిమంతులు అన్ని పనులను పరమాత్మకే అర్పించి చేస్తుంటారు.

28. శుభాశుభ ఫలైరేవం మోక్ష్యసే కర్మ బంధనాత్।
సన్యాసయోగ యుక్తాత్మా విముక్తో మా ముపైష్యసి॥

తా: ఈవిధంగా అంటే సర్వకర్మలను పరమాత్మకే అర్పించడంవలన కర్మల వలన కలిగే బంధనం నుండి విడిబడిన వాడవౌతావు. దానివలన నీకు కర్మ సన్యాసం లభిస్తుంది. జ్ఞానం కలుగుతుంది. మోక్షం లభించి నన్ను చేరుకుంటావు.

వ్యా: లంపట తొలిగిపోతేనే మనస్సు స్వేచ్ఛామయమౌతుంది. కర్మలమీద కర్తృత్వ భావం తొలిగిపోతుంది. తటస్థభావం ఆవహిస్తుంది. కాబట్టి అర్జునా! నీవు నిమిత్త మాత్రుడవని తెలుసుకో! ఈ పని అందఱూ చేయగలరా? అనుగ్రహానికి నోచుకోలేని పరమాత్మ ప్రేమిస్తాడా? అని ఎవరైనా అనుకుంటారేమోనని క్రింది శ్లోకాన్ని అరటి పండొలిచినట్లు పరమాత్మ చెప్పారు.

29. సమోహం సర్వభూతేషు నమే ద్వేష్యోఽస్తి నప్రియః।
యే భజన్తి తు మాం భక్త్యా మయితే తేషు చా ప్యహం॥

తా: అన్ని భూతాలయందు సముడనై ఉన్నాను. నాకు ద్వేషింపదగిన వారనీ ప్రేమించదగినవారనీ వేరుగా లేరు. నన్ను భక్తితో ఏ మనుష్యుడు భజిస్తుంటాడో వానియందు నేనున్నాను. నాయందు అతడున్నాడు.

వ్యా: ప్రకృతి ఎవరిమీదా ద్వేషం ఉంచుకొని పనిచేయడం లేదు. సూర్య భగవానుడు ఎవరిమీదాప్రత్యేక ప్రేమగాని ప్రత్యేక ద్వేషంగాని చూపించడు. అలాగే మేఘుడూ, అగ్నిదేవుడూ స్వతస్సిద్ధంగా ప్రకృతికి వైరమూ స్నేహమూలేవు. అలాటి పరమాత్మ దృష్టి కూడాను. సర్వభూతాలూ ఆయనకు సమానమే.

'గుణభేదమే ఉంటే ఏ ఒక్కరూ నా దగ్గఱకు రాగలిగే వాళ్ళు కారు' అన్నది అమ్మ. అమ్మకు ద్వేషింపదగిన వారూ ప్రత్యేకంగా ప్రేమింపదగిన వాళ్ళూ ఎవరూ లేరు. తన దగ్గఱకు వచ్చేవాళ్ళెంత ఆత్మీయులో దూరస్థులై దగ్గఱకు రాలేకపోయిన వాళ్ళూ అంతే ఆత్మీయులు. 'నమేద్వేష్యోస్థిన ప్రియః' అనే శ్లోక భాగానికి అమ్మే ఉదాహరణ. 'మయితే తేషు చాప్యహం'. ఇందులోని పాత్రలు రెండు. (1) పర మాత్మ (2) భక్తుడు. ఒకరిలో ఒకరున్నారని శ్లోకం చెబుతుంది. అయితే 1=2 అవు తుంది. 1 రెండుగా ఎలా అవుతుంది. ఎలాగంటే 1కి ద్వయావధిత్వం ఉంది.

భక్తుడిలో పరమాత్మ. పరమాత్మలో భక్తుడు ఉండడానికి వీలుగా 1 రెండౌతుంది. రెండు ఒకటౌతుంది. మటి దుష్టత్వం శిష్టత్వం లాంటి నిత్య ద్వంద్వాలో అంటే.

30. అపిచే త్సుదురాచారో భజతే మా మనన్య భాక్।
సాధు రేవ సమంతవ్యో సమ్య గ్వ్యవసితో హి సః॥

తా: అనన్య భక్తితో నన్ను సేవించే వాడు చాలా దురాచారుడైనప్పటికీ అతడు సాధువుగానే తలచదగినవాడు అవుతాడు. ఎందువల్లనంటే ఇతర చింతనలు లేక నన్నే ఆశ్రయించడమువల్ల అతడు మంచి వ్యవసాయాత్మిక బుద్ధిని పొంది సామాన్యాన్ని అతిక్రమించిన వాడౌతాడు.

వ్యా: స్పర్శవేదిని చేరిన తుచ్ఛ లోహం బంగారమే అవుతుంది. క్రూరాత్ములూ, దురాచారులూ అయిన అజామిళుడు, నిగమశర్మ మొదలయివారు పరమేశ్వరుని కృపాకటాక్షము చెందిన కథలు లెక్కకు మిక్కుటముగా పురాణాల్లో ఉన్నాయి. అమ్మ ఒంటిమీది నగలు ఒల్చుకొని పోవాలనుకొన్న దొంగలు కూడా సాధువులై మనసు మార్చుకున్న భగవద్భక్తుల కథలు అమ్మ జీవిత చరిత్ర నుంచి తెలుస్తుంది.

హిందూ మతంలో పాపాత్ములకు నరకవాసం తప్ప మరోగతి లేదని క్రైస్తవ మత ప్రచారకులు చెప్తుతూ ఉంటారు. పాపులకు దురాచారులకు మిగతా సజ్జనులకుండే గతి ఎలా లభించగలదో ఈ శ్లోకం చెబుతుంది. భక్తితో తనను సేవించిన యెడల పాపాలు ప్రతి బంధకాలు పటాపంచలవుతాయని పరమాత్మ వాక్యం. ఎందుకలా అవుతుంది? అంటే.

31. క్షిప్రం భవతి ధర్మాత్మా శశ్వ చ్ఛాన్తిం నిగచ్ఛతి।
కౌంతేయ! ప్రతిజానీహి న మే భక్త ప్రణశ్యతి॥

తా: అర్జునా! అటువంటి భక్తిరతుడు నా అనుగ్రహం వలన తక్షణమే దుష్ప్రవర్తనాన్ని వదలి సత్ప్రవర్తనాన్ని అవలంబించి శాశ్వతమైన శాంతిని పొందుతాడు. (నా భక్తుడెవడూ నశింపడు) నీవు ప్రతిజ్ఞ చెయ్యి.

వ్యా: తన భక్తుడెవడూ నశింపడని అర్జునుడు ప్రతిజ్ఞ చెయ్యడమేమిటి? సంభాషణావశంలో మనం ఎదుటివాని విశ్వాసం కోసం 'ఒట్టు' అని ప్రతిజ్ఞ చేస్తాం. ఇక్కడ ఆ ప్రతిజ్ఞను పరమాత్మ అర్జునుని చేత చేయిస్తున్నాడు. 'నవాసుదేవ భక్తానామశుభం విద్యతే క్వచిత్' అని కూడా శాస్త్రం చెబుతుంది.

అందటింట్లో ఎవరు భోజనం చేశారో ఎవరు చేయలేదో అమ్మకు బాగానే తెలుస్తుంది. కాని నీవు భోజనం చేశావా నాన్నా అని అడుగుతుంది బిడ్డలను.

కడుపునిండా తల్లి బిడ్డల కన్నం పెట్టుతున్నా, పిల్లలు మా కడుపు నిండిందని మాటంటే తప్ప తల్లి కడుపు నిండదు.

**32. మాంహి పార్థ వ్యపాశ్రిత్య యేపి స్యుః పాపయోనయః।
స్త్రియో వైశ్యా స్తథా శూద్రాః తేపి యాన్తి పరాం గతిమ్॥**

తా: అర్జునా! నన్ను ఆశ్రయించిన వాళ్ళు ఎటువంటి నికృష్ణ జన్మకు చెందిన వారైనా సరే! అంటే వాళ్ళు స్త్రీలు, వైశ్యులు, అట్లే శూద్రులూ అయి ఉన్నా, ఉత్తమ గతిని పొందిన వారౌతున్నారు.

వ్యా: జన్మం చేతనే ఎవడైనా పాపయోని అవుతాడా అని ప్రశ్న. "జన్మనా జాయతే శూద్రః సంస్కారా ద్విజ ఉచ్యతే" అని జవాబు. వజ్ర సూచకోపనిషత్తు. ఋషులలో ఎవరికి బ్రాహ్మ జన్మలని గుర్తింపు లేదు. శంకరానందుడు, మధు సూదన సరస్వతి, శ్రీధరుడు మొదలయిన టీకా కారులు మ్లేచ్ఛ, చండాల, పుల్కస, కిరాత, హూణాదులును, పశువులను, పాప యోనులుగా వ్యాఖ్యానించారు. స్త్రీ వైశ్య శూద్రాదులను వేదాధ్యయం లేకపోవడం చేతా, కృష్యాది వ్యాపారాల చేతా 30వ శ్లోకం ప్రకారం దురాచారులుగా పరిగణించారు. కుక్కకుండే విశ్వాసం మను ష్యునికి ఏ కోశానా ఉండదు. మోసగాళ్ళలో మోసగాడైన సాలీడు కాళహస్తీశ్వరుని పూజించి మోక్షం చెందిందని క్షేత్రగాథ చెబుతుంది. అయోనిజాత అయిన సీతా మహాదేవి పుట్టుకవలన ఏం పాపం చేసిందని అన్ని అవస్థలు పడ్డది? యాజ్ఞవల్క్యు నితో వేదాలను వాదించిన గార్గి నెవరు పాపయోని అనగలరు? భగవంతుని స్మరణ చేయకపోవడమే పాపాలలో కల్లా పాపం. అమ్మ లేకుండా మన పుట్టుకలు వచ్చా యనే అహం పెంచుకోవడం మహాపాపం. ఈ పాపం చేసుకున్నదే పాపయోని. అంతేకాని ఏ జీవీ పాపం చేసుకుని పుట్టదు. అదీగాక భక్తి మొదలైన గుణాలకు నోచుకోని పశ్వాదులు పాప యోనులనడం అంతకంటె యుక్తం కాదు.

స్త్రీలూ బ్రాహ్మణేతరులూ పురుషసూక్తం చదవడం, ఐం, హ్రీం, శ్రీం, క్లీం అనడంగాని నిషిద్ధమా కాదా అనే ప్రసంగానికి అమ్మ అలాటి అభ్యంతరం ఏమీ ఉండదని ఎన్నో సందర్భాలలో చెప్పింది. 'లలితోపాసన చేసే భర్త చచ్చిపోతే భార్య ఆ దేవతార్చాన చేయవచ్చునా అనే సంశయాన్ని భయాన్ని వెలిబుచ్చిన భాగ్య శాలినికి. ఆడవాళ్ళు దేవతార్చన చేయడం తప్పేమీ కాదని అమ్మ ఆమె భయాన్ని తీర్చింది. కడగా ఉంటే భగవంతుడు జ్ఞాపకానికి వస్తే స్త్రీలు నరకానికి పోతా రనుకోడమూ అవివేకమే అవుతుంది. హిందూమతం ఈ దేశంలో బ్రతికి ఉన్నదంటే అది స్త్రీల వల్లనే అని విశ్వసించాలి కాగా నికృష్టజన్మలెత్తిన వాళ్లే మోక్షానికర్హులు

కాగా బ్రాహ్మణాది సంస్కార పరిణీతలై జన్మల నెత్తినవారు మోక్షం పొందడంలో వింత ఏముంటుందని చెప్పడానికి ఊతంచేసుకున్న విషయంగానే "పాపయో నయః" శబ్దాన్ని మనం గ్రహించాలి.

33. కింపున ర్బ్రాహ్మణాః పుణ్యాః భక్తా రాజర్షయః స్తథా।
అనిత్య మసుఖం లోక మిమం ప్రాప్య భజస్వమామ్॥

తా: అటువంటప్పుడు పుణ్యాత్ములైన బ్రాహ్మణుల విషయంలోను, భక్తులైన రాజర్షుల విషయంలోను ఇంకా చెప్పవలసిన పని యేమున్నది, నీవు ఉత్తమ క్షత్రియ వంశంలో పుట్టి ఉన్నావు. కాబట్టి అనిత్యమూ, అసుఖనీయమూ అయిన ఈలోకాన్ని పొంది ఉన్నావు. కనుక నన్ను భజించి శాశ్వతమైన పుణ్యస్థానాన్ని అందుకో అంద ఱకూ ఇది సుగతిదాయకమైన మార్గం.

ఇంత వఱకు పరమాత్మ భక్తి ప్రభావాన్ని వర్ణించి అన్నింటికి సూత్ర ప్రాయ మైన సాధనలనీ, ఆరహస్యాన్నీ, కూడా చెప్పి రాజగుహ్యాయోగ పథాన్ని అన్వర్థం చేశారు చివరకు కిటుకు మాటలు కూడా చెబుతున్నారు.

34. మన్మనా భవ, మద్భక్తో, మద్యాజీ, మాం నమస్కురు।
మామేవైష్యసి యుక్త్వైవ మాత్మానం మత్పరాయణః॥

తా:నాతోనిండిన మనస్సుకలవాడవు కమ్ము; నాయందే భక్తి కలిగి ఉండుము; నన్నే భజించుచుండుము. పూజించుచుండుము, నాకే నమస్కరించుచుండుము. ఈ రీతిగా సంతతమూ నేను తప్ప ఇంకో ధ్యాసలేనివాడవై ఆత్మను నాయందే నిలిపి ఉంచడం వలన నన్నే పొందగలవు.

మనస్సు ఏ వస్తువును ధ్యానిస్తే దాని రూపాన్ని ఎత్తుతుంది, ఆవిషయమైన విభావాను భావాలను శరీరం బహిరంగంచేస్తుంది. పంచదార చిలకను గూర్చి తలుచుకుంటే మనస్సు పంచదార చిలక ఆకారాన్ని దాలుస్తుంది. దాని ప్రభావంవల్ల నోటిలోని రుచితిత్తులకు ఉద్రేకం కలిగి నోరూరుతుంది. మనస్సుకూ శరీరానికీ అంత దగ్గఱ సంబంధం ఉంది. కాబట్టి మనస్సు నిత్యమూ పరమాత్మను గూర్చియే తలపోస్తూ ఉంటే దాని రూపాన్నే ఎత్తుతుంది, పరమాత్మ విషయమైన వ్యవ సాయాన్నే శరీరం కూడా చేస్తుంది, కాబట్టి మొదటి రహస్యం మన్మనాభవ, అంటే నాతోనే కలిసిన రూపమైపోయి ఉండు, కలిసిన మనస్సై కూడా ఉండు. ఇది నా అనుగ్రహం చేతనే నీకు లభించగలదు.

నాయందే భక్తిగల వాడవై ఉండడం రెండో సూత్రం, శ్రవణ మననని దిధ్యాసనాదులతో నన్ను పొసిస్తూ ఉండడం మూడో సూత్రం, అంటే మద్యాజీ భవ. రెండు పాదాలూ, రెండుచేతులూ శిరస్సూ మనస్సూ చిత్తమూ అహంకారాలనే ఎనిమిదింటినీ వంచి నాకు సాష్టాంగ మొనరించడం దీని వలన సిద్ధించే ఫలం ఏమిటంటే నీవు నా స్థానాన్ని పొందడమే. అదే మోక్షం.

అన్నింటికీ కారణం అమ్మేఅనుకోడం. అమ్మనే ధ్యానించే మనస్సు కలిగి ఉండడం. అమ్మను యజించి, అమ్మకు నమస్కరించి, అమ్మ భక్తితో నిరంతరమూ నిండి ఉండడం ఇదే ఈ లోకంలో తరణోపాయంగా గుర్తించడం.

ఇది శ్రీమన్మాతృగీతలోని రాజవిద్యా రాజగుహ్య యోగమను నవమోధ్యాయము.

మాతృగీత

విభూతి యోగము

దశమోధ్యాయము

శ్రీభగవానువాచ

1. భూయ ఏవ మహాబాహో! శృణుమే పరమం వచః।
యత్తేఽ హం ప్రీయమాణాయ వక్ష్యామి హితకామ్యయా॥

భగవానుడు పలికెను.

తా: అర్జునా! మహాబాహో! నీవు నామాటలను అత్యంత ప్రీతితో వింటున్నావు. నీకు హితము కూర్చే బుద్ధితో ఇంకా శ్రేష్ఠమైన మాటలను చెప్పబోతున్నాను. వాటిని కూడా విను.

వ్యా: ఇంతవఱకు జఱిగిన బోధలో భగవంతుని సోపాధిక నిరుపాధిక తత్త్వం సవిశేషనిర్వి శేషతత్వం చోటుచేసుకున్నాయి. దాన్ని విన్న అర్జునుని మనస్సులోని గ్రంధులు విడిపోయి జ్ఞానప్రకాశం కనబడడమారంభించింది. అట్టి మార్పును గమనించిన పరమాత్మ అర్జునుని హితాన్ని కోరి శిష్యుని మనస్సుకు హత్తుకునేలాగా తన విభూతిని అన్ని విధాలుగాను తెలియజేయసాగారు.

విభూతి అనే పదానికి ఐశ్వర్యం అని అర్థం. ఐశ్వర్యం అంటే ఈశ్వరత్వం. పరమాత్మ తానే మఱోరూపమై ప్రకటించుకొని సృష్టి యంత్రాంగాన్ని నడుపుతున్నాడు. సూర్యచంద్ర గ్రహతారకలు, గోళసముదాయాలూ, బ్రహ్మాండాలూ, కాలచక్రమూ, అంతరాళమూ, అందులోని విచిత్ర శక్తులూ, అన్నీ పరమాత్మ శాసించిన సూత్రాల ప్రకారమే నడుస్తున్నాయి.

పైన కనిపించే స్థూలరూపంలోని ద్రవ్యమూ లోపల కనిపించని ఒకానొక అంతర్యంత్రాంగాన్ని తలపిస్తున్నది. రెండూ పరమాత్మ అంశాలే అయినా బయటికి కనిపించేది ఒక పాలయితే కనిపించనిది మూడు పాళ్లుగా పని చేస్తున్నది.

'పాదోస్య విశ్వాభూతాని త్రి పాదస్యామృతం దివి' అని చెప్పుకుంటూ లోకులను మోహపెట్టుతున్నది, ఆకాశం విస్తరించుకొని పోతున్నది. చెట్లు పెరుగుతున్నాయి. ఆకాశంలో చుక్కలను చూసి, ఏమనుకుంటాం? ఏమీ అనుకోం. కాని తత్వజిజ్ఞాస కలవానికి ఇందులోని ప్రతి అంశమూ అత్యద్భుతంగా కనిపించి ఆలో

చనలను రేకెత్తిస్తుంది. విజ్ఞానపథంలో మనం ఎంత ముందుకు సాగితే క్షితిజ అంత దూరంగా సాగిపోతుంది.

2. న మే విదుస్సురగణాః ప్రభవం న మహర్షయః।
అహ మాదిర్హి దేవానాం మహర్షీణాం చ సర్వశః॥

తా: నా ప్రభావాన్ని, నా ఆదిని దేవతాగణాలుకాని మహర్షులుగాని తెలుసుకో లేరు, అంటే ఎఱుగరు. ఎందుకంటే దేవతలకుగాని మహర్షులకుగాని నేనే కారణాన్ని; తొలిని.

వ్యా: మానవుని పుట్టుకను మన మెఱుగుదుమా? ఎవడి పుట్టుకను వాడు చూచుకుంటూనే పుట్టాడా? వీళ్లూ వాళ్లూ నీవు ఫలానా యల్లయ్యకూ ఫలానా యల్లమ్మకూ పుట్టావంటేనూ, జ్ఞానం వచ్చే దాకా ఫలానా వాళ్ల ఒళ్లో పెరిగిన హేతువు చేతనూ తల్లిదండ్రులను గుర్తిస్తున్నాం. ప్రత్యక్ష ప్రమాణాలు సాధారణంగా మానవుల జన్మలకు దొరకవు. అలాంటప్పుడు పరమాత్మ పుట్టించిన మహర్షులకు, దేవతలకు పరమాత్మ ఆదిని గూర్చి ఎలా తెలుస్తుంది? అనంతం అయినది పరమాత్మ విభూతి దానికి ఆది అంటూ ఉంటే అనంతం ఎలా ఔతుంది? అనాది ఎలా ఔతుంది?

'నేను ఆదెమ్మను' అన్నది అమ్మ, ఆది+అమ్మ= ఆదెమ్మ. అమ్మయే అన్ని ప్రభవ లక్షణాలకు జననస్థానం అమ్మకు జననస్థానం ఏది? అని ప్రశ్నిస్తే, మళ్లీ ఆ జనన స్థానానికి జననస్థానం కావలసివస్తుంది. అనవస్థ ఏర్పడుతుంది, అనాదికి తెలియనిదనే అర్థం.

3. యోమా మజ మనాదిం చ వేత్తి లోక మహేశ్వరం।
అసమ్మూఢ స్స మర్త్యేషు సర్వపాపైః ప్రముచ్యతే॥

తా: ఏ మనుష్యుడు నన్ను అజుణ్ణిగాను, తెలుసుకుంటాడో, అతడు మోహము నుండి విడివడి అన్ని పాపాల నుండి ముక్తుడగుచున్నాడు.

వ్యా: పుట్టుకలను చావులనను నిజంగా జరుగుతున్న వాటినిగా ఎంచడమే మోహము. ఆమోహం నుండి విముక్తుడైన వానికి జన్మ మృత్యువులు, ఆభాస మాత్రంగానే కన్పిస్తాయి. పరమాత్మకు కూడా జన్మలను, ఆరంభాన్నీ, అంటగట్టే స్వభావం మర్త్యులది. ప్రకృతి ప్రసవ శీల మవుతుంది. పరమాత్మ ఈక్షణం ఆ ప్రసవ శీల స్వభావమే. మహామాతృత్వమునకు ప్రతీక అవుతుంది. అందులో అసలు పదార్థానికీ, ఆత్మకు వచ్చే ప్రతి వికారమూ జన్మగా మనకుతోస్తుంది. అసలు

జన్మఅంటూ ఉంటేనే అజన్మశబ్దం అర్థం అవుతుంది. కాబట్టి అజ శబ్దంలో జన్మ అజన్మా రెండూ మిళితమై ఉన్నాయి. కాబట్టి జన్మ అనేది అవికారమైన దాని వికారం. కాని అన్ని వికారాలు ఆయనవే కనుక పరమాత్మ అవికారుడు. అన్ని క్రియలు ఆయనవే కనుక పరమాత్మ నిష్క్రియుడు అన్ని గుణములు ఆయనవే కనుక ఆయన నిర్గుణుడు. అన్ని ఆకారాలు ఆయనవే కనుక పరమాత్మ నిరాకారుడు. అన్ని జన్మలూ ఆయనవే కాబట్టి పరమాత్మ అజుడు. అజశబ్దంవల్ల అనాది అనే అర్థం ద్యోతకమౌతున్నా, అనాది అనే పదం పరమాత్మకు వాడబడినది. అజత్వమంటే అన్నీ తానే ఐ ప్రత్యేకంగా తనకేదీ జన్మ స్వభావం లేకపోవడం. అనాది అంటే సర్వవ్యాపకత్వ రూపంగా తాను నిలిచి ఉండడం లోక మహేశ్వరం అంటే ప్రభవించిన లోకాల బహిరాంతర్యాలుగా తానై వాటిని నడిపిస్తూ ఉండే నియమన శక్తి. ఈ మూడింటిని గుర్తించిన వాడు అజ్ఞానాన్ని విడిచిన వాడే, మానవీయమైన ప్రతిబంధకాల నుంచి ముక్తుడౌతున్నాడు. అయితే అజత్వం అంటే లేకపోవడం అని అర్థంకాదుగా! అదేదో అర్థం కాకపోవడం. అలాగే అనాది అంటే కూడా లేకపోవడం అని అర్థం కాదుగా! పుట్టకుండా దేనికైనా ఉనికి ఉండగలగడం మనకైతే విడ్డూరంగానే తోస్తుంది. మొదలు అంటూ లేని ఉనికి చాలా విచిత్రంగా తోస్తుంది. కాని తరంగాలతో నిండిన సముద్రాన్ని చూచి మనం విస్తుబోము. సముద్రం నీటిలో పఱపునుంచే ఉవ్వెత్తుగా లేచి తరంగాలు వస్తూ ఉంటాయి. ప్రతి తరంగానికి మొదలేదో కనిపెట్టబోతే ఆ మొదలు సముద్రమంతటా వ్యాపించి ఉన్నట్లే కనిపిస్తుంది. తరంగాల మొదళ్ళన్నీ సముద్రమంతటా వ్యాపించి ఉంటాయి. అలాగే పరమాత్మకూ ఆదీ, పరమాత్మకు జన్మా, బ్రహ్మాండమంతటా వ్యాపించి ఉండడంవల్ల పరమాత్మను అజుడనీ, అనాది అనీ వ్యవహరిస్తాం. ఈ స్వరూపాన్నే అమ్మ సర్వానికీ సర్వమూ ఆధారమని నిర్వచించింది. ఇలా గుండడమే పరమాత్మ యొక్క మహేశ్వరత్వం గూడా. ప్రతీ దేహంలోని జీవికీ. అందులోని జీవకళకూ. ఆ దేహం మీద ఈశ్వరత్వం ఉన్నట్లే అన్ని జీవుల దేహాలూ వాటిని నడిపే అంతరంగశక్తి అయిన ఆత్మా ఈ రెండూ పరమాత్మయే అయి ఉండడం వలన అతడు మహేశ్వరుడౌతున్నాడు. ఈ మహాస్వరూపాన్ని చెప్పేటప్పుడు మహేశ్వర శబ్దంలోని సార్ధక్యత మనకు గోచరిస్తుంది. ఈ విశ్వతోముఖలీలను ఎఱిగిన బుద్ధిజీవులు వాటి వాటి పరిమితములయిన మనోగ్రంథుల నుండి విముక్తి పొంది శాశ్వత సుఖాన్ని పొందిన వారౌతారు. కాని ఈ జ్ఞానసిద్ధి ఎలా కలుగుతుంది. అంటే అది పరమాత్మ అనుగ్రహంవల్లనే సిద్ధించాలి. ఎందుకంటే అంతరంగ ప్రపంచమునకు అధినేత అయిన

పరమాత్మయే ఆజ్ఞాన సిద్ధిని కలుగజేయవలసి ఉంది. అంతరంగంలో ప్రభవించే ప్రతిభావానికీ పరమాత్మయే కారణమని క్రింది శ్లోకంలో పరమాత్మ చెప్పబోతాడు.

4. బుద్ధి ర్జ్ఞాన మసమ్మోహః క్షమా సత్యం దమ శ్శమః।
సుఖం దుఃఖం భవోఽ భావో భయం చాభయ మేవ చ॥

5. అహింసా సమతా తుష్టి స్తపో దానం యశోఽ యశః।
భవన్తి భావా భూతానాం మత్త ఏవ పృథగ్విధాః॥

తా: బుద్ధి, జ్ఞానం, అసమ్మోహం, క్షమ, సత్యం, దమమూ శమమూ, సుఖమూ, దుఃఖమూ, భవమూ, అభావమూ, భయము, అభయము, అహింస, సమత, తుష్టి, తపస్సు, దానం, యశస్సు, అయశస్సు, భూతముల మనస్సులలో ఇలా అనేక విధాలుగా ఉండే భావాలన్నీ నేనే. నా వల్లనే ఆయా భావాలన్నీ కలుగుతున్నాయి.

వ్యా: లోకంలో ఏ భూతానికి, ఏ బుద్ధిజీవికి, మనస్సులో ఏ భావం కలిగినా, అది నావల్లనే కలుగుతున్నది. ఆ కలిగే భావం సుఖం కల్పించనీ, దుఃఖం కల్పించనీ, భయం కల్పించనీ, ఆశను కల్పించనీ, ఇవన్నీ నావల్లనే కలుగుతున్నాయి అంటే నేనే అంతః కరణప్రపంచంలో అధిష్టాతనై ఉండి భావప్రవృత్తులను కల్గిస్తున్నాను. అని చెప్పుతూ ఉదాహరణకు మనోభావాల పట్టిక నిచ్చి పైశ్లోకాలలో తెలియ జేశారు.

బుద్ధి: మనోవ్యాపారాలన్నింటికీ సవ్యమైన రూపాన్ని కల్పించే ప్రవృత్తి

జ్ఞానం: కనపడ్డ దానిని అవగాహన చేసుకుని ఆ అవగాహనను తనదిగా చేసుకునే మనః ప్రవృత్తి

అసమ్మోహము: మంచి చెడ్డలను వివక్షణచేసే మనఃప్రవృత్తి

క్షమ: తనకు బాధాకరములైన పరిస్థితులు కలిగినా ఆ వేగము చెందకుండా శాంతంగా ఉండే మన స్థైర్యము.

సత్యం: ఉన్న దానిని జనులకు శ్రేయస్సు కలిగే రీతిగా చెప్పే పరిస్థితులను విని యోగించే మనః ప్రవృత్తి.

దమము: బాహ్యేంద్రియ నిగ్రహం

శమము: అంతరింద్రియ నిగ్రహం

సుఖం: ప్రకృతిలో జరిగే ఘటనలను ప్రసన్నంగానే అవగాహన చేసుకుని ఆనం

దించగల మనఃప్రవృత్తి. ఇతరులకు కూడా తనలాగే ఉల్లాసం కూర్చ గలశక్తి.

దుఃఖం: తన కంటే బాహ్యమైన ప్రపంచానికీ సంఘటనలకు, వ్యక్తులకు విము ఖంగా ఉండి వాటినుంచి వైరస్యాన్నే పొందే మనః ప్రవృత్తి, దేనిలోనూ మంచిని, ఆనందాన్ని చూడలేకపోవడం. అసహజత్వం.

భవము: అదివఱకు లేనిది ఉన్నదిగా కావడం కనబడడం - అలాతోచడం.

అభావం: ఒకప్పుడు ఉన్నట్లుగా కనిపించిందే అదృశ్యంగా ఉండడం. మాసి పోవడం. మారిపోవడం (Anti matter)

భయం: పరిసరాలను తనకు అపకారం చేసేవిగా తలపోసి వాటికి దూరంగా జరగడం. వాటిని ఎదుర్కొని తన ధైర్యం పాడుచేసుకోవడం.

అభయం: పరిసరాలు తనకుపకారం చేసేవిగానే తలపోసి నిశ్చింతగా ఉండడం. హానిని శంకించకుండా ఉండడం.

అహింస: సహించలేనిది. హింస. సహించలేకపోవడం కర్మకూ కర్తకూ సమా నంగా వర్తిస్తుంది.

సమత: సర్వభూతములను తనవలెనే చూచుకునే భావం.

తుష్టి: లేని దానికి రాని దానికి ఆశ పడకపోవడం.

తపస్సు: పరమాత్మ కోసం ఆర్తి

దానం: తనకున్న దానిని ఇతరులకిచ్చుట - లేక పంచుకొనుట నిల్వ చేసుకోక పోవడం.

యశస్సు: ఇతరులకు సంతోషం సమకూర్చడం వలన పొందే ప్రశంస - మెచ్చు కోలు.

అయశస్సు: ఇతరులకు కష్టాలు మనఃఖేదము కల్గించడం వలన పొందే దూషణ.

పైన చెప్పిన భావాలన్నీ మనః ప్రపంచంలో తలపులులాగా ప్రభవించుతుం టాయి. మనస్సు యొక్క సహజస్థితి నుంచి పుట్టిన విశేషాలుగా మొదట్లో వ్యక్తికి అవగతమౌతాయి. ఆ భావాలు ముఖవైఖరులు బాహ్యచేష్టలు వీటి అన్నింటివల్ల బయటివాళ్ళకు కూడ ప్రస్ఫుటమౌతాయి.

ఇవన్నీ బయటికి ముందుగా వ్యక్తంగాకుండా కంటికి కనిపించకుండా ఉండే అంతరంగ జగత్తులో జరిగే గారడీలే. భావోత్పత్తికి అసలు కారణం, పుట్టే చోటు

ఏది అనే ప్రశ్నకు అనేక మన శ్శాస్త్రజ్ఞులు అనేక విధాలుగా చెప్పారు. (1) Subconscious. (2) Conscious అని రెండు రకాల మనఃస్థితులుంటాయని పరిసరాల ప్రభావంవల్ల నాడీమండలం. నరాల రాయబారం, మేథోయంత్రాంగం ఇవన్నీ జాగరితములై, పూర్వస్మృతి జ్ఞానంవేసిన బాటలో తలపులు దారాలుగా ప్రవహిస్తాయని వారి సిద్ధాంతం. మనస్సుకూ శరీరానికి, ఇంద్రియాలకూ ఉండే లంకెను చర్చించి మనో వ్యాపారాన్నంతా ఈ రెంటితోనే సమసింపజేసి, ఏవో గజిబిజి అల్లికలను అల్లుతారు.

ఆ అల్లికలు శరీర యంత్రాంగాన్ని దాటిపోవలసివస్తే Heredity వంశ పారంపర్యం. పిత్రీయమైన వాసనలు, ఆదేహంలోకి దిగుమతి అయ్యాయేమో అని ఒక మెట్టు ఎక్కి మళ్ళీ దిగిపోతాయి. జగత్పిత జోలికి ఈ సిద్ధాంతాలుపోవు.

"పరమాత్మ తలిస్తేనే మనం తలుస్తాం"

కాబట్టి మనస్సులో మంచి భావాలుకాని, చెడ్డ భావాలు కాని పుట్టడానిక మనం కర్తలంకామనీ, మనోవ్యాపారమంతా పరమాత్మ అధీనంలోనే నియమించ బడి తిరుగుతున్నదనీ పైశ్లోకం వలన స్పష్టమవుతుంది. పరమాత్మ ఇంత. స్పష్టంగా చెబుతున్నా (1) Individuality. (2) Personality. (3) Free will అనే పెద్ద పెద్ద మాటలు లేవదీసి వాదులాడుతుంటాం. వ్యక్తికి ఇంతమాత్రం కూడా స్వాతంత్ర్యం లేకుండా దేవుడి చేతిలో కట్టెముక్కగా సుత్తె ముక్కగా అయిపోయి నాడా? అని పర మాత్మను మనం సృష్టించినట్లు వితండవాదం చేస్తూ ఉంటాం. ఇదే మోహం అంటే. అహం అంటే. ఇవి ఉంటేనే మనకు మానవత్వం ఉంది. పరమాత్మ ఈ అధ్యా యంలో చెబుతున్న అంతఃకరణ ప్రపంచంలో బయలుదేరితేనే తప్ప ఏ మనస్సం స్కారమైనా బహిఃప్రపంచంలో తేలి సర్దుబాటు కాదు.

6. మహర్షయ స్సప్త పూర్వే చత్వారో మనవ స్తథా।
మద్భావా మానసా జాతాః యేషాం లోకే ఇమాః ప్రజాః॥

తా: ఈ లోకంలోని ప్రజలందఱూ పూర్వులైన నలుగురు మనువులు సప్తమహ ర్షులు వీరి సంతతికి చెందివున్నారు. వీరందఱూ నా మానస జాతపుత్రులు, నా భావాన్నే కలవారై ఉన్నారు.

వ్యా: 'హే అమృతస్యపుత్రాః' అని ఉపనిషత్తులు మనుష్యజాతిని సంబోధిం చాయి. భగవద్గీతలోని ఎన్నో శ్లోకాలు నోళ్ళు తెరచి 'ఓహో' అని బదులు పలికాయి. దానితో భగవద్గీత ఉపనిషత్తై కూర్చున్నది. అలా నోరు తెఱచి జవాబు చెప్పిన వాటిలో ఈ శ్లోకమొకటి.

7. ఏతాం విభూతిం యోగం చ మమ యో వేత్తి తత్వతః।
సోఽ వికమ్పేన యోగేన యుజ్యతే నాత్ర సంశయః॥

తా: తత్వతః నాఈ విభూతి యోగాన్ని ఎవడు చక్కగా తెలుసుకుంటాడో అతడు చలింపని యోగాన్ని పొందుతున్నాడు. దీనికి సందేహంలేదు.

8. అహం సర్వస్య ప్రభవో మత్త స్సర్వం ప్రవర్తతే।
ఇతి మత్వా భజంతే మాం బుధా భావసమన్వితాః॥

తా: నేనే ఈ సర్వానికి పరమ కారణాన్ని అనీ, నేనుగా సర్వమూ ప్రవర్తిస్తున్న దనీ, తలచి పండితులు పరమార్థభక్తి భావసమన్వితులై నన్ను కొలుస్తూ ఉంటారు.

9. మచ్చిత్తా మద్గత ప్రాణా బోధయన్తః పరస్పరమ్।
కథయన్త శ్చమాం నిత్యం తుష్యన్తి చ రమన్తి చ॥

తా: అలాంటివాళ్ళు నాయందే చిత్తం సమాహితంచేసి నాలోనే ఉంచబడిన ప్రాణాలతో ఒకరికొకరు బోధ చేసుకుంటూ, నా విషయమే సదాముచ్చటించు కొంటూ, సంతోషంగా ఉంటారు. నన్ను గూర్చి చెప్పేవాడు తనకా అవకాశం దొరి కింది కదా అని సంతోషిస్తాడు. వినేవాడు అమృతమయమైన భగవద్వర్ణన విని ఆనందిస్తాడు.

10. తేషాం సతత యుక్తానాం భజతాం ప్రీతి పూర్వకం।
దదామి బుద్ధియోగం తం యేన మా ముపయాన్తి తే॥

తా: అలాగా ఎల్లప్పుడూ నాయందే అనన్యభక్తి భావాన్ని ఉంచి. సంతోషంతో నన్ను సేవించేవాళ్ళు నన్ను చేరుకుని శాశ్వతమోక్ష సుఖాన్ని అనుభవించడానికి తగిన బుద్ధియోగాన్ని ఇస్తున్నాను.

వ్యా: మానవవిగ్రహంలో కనపడే భాగం శరీరం. కంటికి గోచరించని భాగం అంతఃకరణం. అంతఃకరణంలో బుద్ధి, మనస్సు, చిన్నమేధస్సులు ఉంటాయి. దేహంలో చేతులూ మెదడు, జుట్టూ, కళ్ళూ, జననేంద్రియాలు, కాళ్ళూ, చర్మం లాంటి పైకి కన్పించే భాగాలు. కాలేయం, ప్లీహం, పొట్ట మూత్రపిండాలూ ప్రేగులూ, జననేంద్రియ గ్రంథులూ, నాడీమండలం, రక్తమాంస, శల్యాదుల స్వచ్ఛ త్వాలూ, దృఢత్వాలూ, వీటి ప్రభావాలు సుష్టుగా పనిచేస్తేనే బాహ్య విగ్రహం సమ ర్థంగా ఉంటుంది. దేహం సుష్టుగా ఉంటేనే మనస్సూ ప్రాణం సుష్టుగా ఉంటాయని ఒకవాదం. ముమ్మిడివరం బాలయోగిని శరీరం కాపాడలేదు. మనస్సే కాపాడింది.

ఆహారం స్వాదుత్వాన్ని చెప్పడం దగ్గఱనుంచి మనస్సే కావాల్సి వస్తుంది. ఈ విషయం శ్రోత్రం చక్షుః స్పర్శనం చ అనే 15వ అధ్యాయంలో పరమాత్మ చెప్ప బోతారు.

ఈ విధంగా మనుష్యుని విగ్రహంలోని అంతర్బహిర్భాగాలు ఒకదాన్ని మఱొ కటి వెక్కిరించుకుంటుంటాయి. ఒకటే మందాన్ని విశదం చేయడానికి రెండు గీతలు కావలసి వచ్చినట్లుగా, ఒకే బుద్ధియోగాన్ని కొలిచి చూపించడానికి స్థూల శరీరానికి తట్టెడు సరంజామా అవసరమౌతుంది. గత శ్లోకాలలో సృష్టికార్యం మనస్సుతోనే మొదలౌతుందని చెప్పడానికి పరమాత్మ చక్కని రీతిగా ఉపన్యసించారు.

6వ శ్లోకంలో మనువులు 14 గురైనా స్వాయంభువాది మనువులు నలు గురినీ, ఋగ్వాది మహర్షులనూ తొలివిడత సృష్టిగా పేర్కొన్నారు. 7, 8 శ్లోకాల్లో సృష్టికీ తనకుండే అంతఃకరణ సంబంధాన్ని పరమాత్మ వివరించారు.

భగవంతుడు తలిస్తేనే మనమూ భగవంతుణ్ణి తలుచుకుంటామని అమ్మ చెప్పే మాటలనే గీతావాక్యములుగా 9, 10 శ్లోకాలుగా కన్పిస్తున్నవని గ్రహించేది.

ఈ శ్లోకంలో జ్ఞానయోగం ద్వారా ఉపాసన చెయ్యడం, భక్తియోగం ద్వారా ఉపాసన చెయ్యడం ఈ రెండు రహదారులను ఒకే చోటికి చేర్చినట్లైనది. భక్తి అనే పూవుకు జ్ఞానమనే పండు కలిగే విషయాన్ని పరమాత్మ ఇందు సూచించారు. ప్రీతిపూర్వకంగా సేవించడం భక్తిలక్షణం. బుద్ధి యోగాన్నిస్తాననడం జ్ఞానలక్షణం.

పరమాత్మ భక్తుణ్ణి తనవైపు లాక్కుంటాడు. అంటే అతని బుద్ధిని తనవైపు త్రిప్పుకుంటాడు. పరమాత్మ ఆకర్షణ లేకుండా ఏ బుద్ధీపరార్థచింతనకు సుముఖం కాజాలదు. ఒకసారి ఆవిధంగా పరమాత్మ వైపుకు మొగ్గిన ఆ మనస్సును మఱింత త్వరగా తనను చేరుకోడానికి తగిన బుద్ధియోగాన్ని అభ్యాసయోగాన్ని పరమాత్మే భక్తునికి సమకూరుస్తుంటాడు. యోగ శబ్దం చేత మనుష్యుని కందుబాటులోలేని ఒకానొక లక్షణ వ్యాపారాన్ని తెలియజేయడానికే పరమాత్మ ఉద్దేశించినాడు.

ఈ సందర్భంలో ఒక్క మాటను చెప్పవలసిఉంది. 18వ అధ్యాయంలోని 'సర్వ ధర్మాన్ పరిత్యజ్య' అనే శ్లోకాన్ని ఆధారంగా చేసుకుని కొందఱు ఇలా అర్థం చెప్తుతారు. అన్ని ధర్మాలను త్యజించి తననే శరణు పొందుమని భగవంతుడు ఏదో షరతును చెప్పినట్లున్నదనీ, ఆ షరతును నెఱవేర్చకపోతే పరమాత్మ ఇచ్చే మోక్షానికి అతనికి అధికారం లభించదనీ, గీతా వచనాల్లో ప్రస్తావించబడిన మోక్షం సహజంగా, స్వచ్ఛందంగా లేదనీ కొందఱు వ్యాఖ్యానిస్తారు. అమ్మ అన్నమాట

'అందరికీ సుగతే' అని. ఇంకొకమాట భగవంతుడు తలిస్తేనే తాను తలుస్తాడు అని మూడోమాట. చెప్పేతీరు వేరుగా ఉండవచ్చుగాని గీతలో లేనిది నేను కొత్తగా చెప్పుతున్నదీ ఏమీలేదనీ, ఈ వ్యాఖ్యానాలను, అమ్మ మాటలను కలబోసి ఆలోచిస్తే జరిగేది అంతా సవ్యంగానే, సహజంగానే జరుగుతుందని అనిపిస్తుంది.

ముందు ముందు ఈ బుద్ధియోగంతోబాటు అభ్యాసయోగం కూడా తానే ప్రసాదిస్తానని పరమాత్మ సెలవిస్తారు. పన్నెండో అధ్యాయంలో ఇంతకష్టం నీవెం దుకు పడతావయ్యా అంటే

11. **తేషా మేవాను కంపార్థ మహమజ్ఞానజం తమః।**
నాశయా మ్యాత్మ భావస్థో జ్ఞానదీపేన భాస్వతా॥

తా: అర్జునా! భక్తుల యందలి అనుకంపవల్లనే నేను వారి యందుండే అజ్ఞాన జన్యమైన అంధకారాన్ని నశింపజేసి అచ్చట ఆత్మభావస్థమైన జ్ఞానదీపాన్ని ప్రకాశ వంతంగా చేస్తున్నాను.

వ్యా: పరమేశ్వరు డెవరిని వరిస్తాడో అతనివల్లనే పొందబడతాడు. కాబట్టి భక్తి అయినా అభ్యాసమయినా భక్తుడికా యోగం కలిగినప్పుడే అతడిని భగవత్ అనుగ్రహరూపకరంగా అది వరిస్తుంది.

అర్జున ఉవాచ

12. **పరంబ్రహ్మ పరంధామ పవిత్రం పరమం భవాన్।**
పురుషం శాశ్వతం దివ్య మాది దేవ మజం విభుమ్॥

13. **ఆహుస్త్వా మృషయ స్సర్వే దేవర్షి ర్నారద స్తథా।**
అసితో దేవలోవ్యాస స్స్వయం చైవ బ్రవీషిమే॥

అర్జునుడు చెప్పుతున్నాడు.

తా: నీవు పరబ్రహ్మవు. పరంధాముడవు. పవిత్రుడవు. పరముడవు. శాశ్వతు డవు. నీవు దేవతల కాదిదేవుడవని. సర్వవ్యాపకుడవైన విభుడవని, మహాపురుషు డవని నిన్ను గూర్చి సర్వఋషులును, దేవర్షియైన నారదుడును, అదే ప్రకారంగా, అసితుడు, దేవలుడు, వ్యాసుడు పూర్వం చెప్పి ఉన్నారు. అంతేకాక ఆ మాట స్వయంగా నీవే చెప్పి ఉన్నావు.

వ్యా: ఇంతవఱకు చెప్పబడిన విషయం అర్జునుడి మనస్సుకు బాగా

పట్టుకుపోతున్నది. ఇదివఱకులాగా "వ్యామిశ్రేణేవవాక్యేన, బుద్ధి మోహయసీవమే' అనిగాని.

"అపరం భవతోజన్మ పరంజన్మవివస్వత' అనిగాని

భగవత్సంశయాత్మకమైన ప్రశ్నలను అర్జునుడు. ఇక వేయడం మానుకు న్నాడు. అతడి మనస్సులో పరమాత్మ యొక్క పరమార్థతత్వం చక్కగా పాదుకుంటు న్నది. శ్రీకృష్ణుని రూపంలో పరంబ్రహ్మము, పరంధాముని అంటే అమితమైన తేజోమూర్తిని పరమపావనమైన ఆకారాన్ని చూడగలుగుతున్నాడు. ఆ దివ్యమూర్తిని ఆది పురుషుణ్ణిగాను, దేవాదిదేవునిగాను, శాశ్వతునిగాను గుర్తిస్తున్నాడు. పూర్వం మహర్షులు, దేవలుడు నారదుడు, అసితుడు మున్నగు మహామహులు చెప్పిన వాక్యాలు, నెమరుకు వస్తున్నాయి. ఇక భగవానుడు చెప్పే వాక్యాలలో అతనికి సంశయాలు. ఉత్పన్నం కావడం లేదు. ఆయన చెప్పిన వాక్యాలు యథార్థాలుగా పరమ రహస్యాలుగా అతనికి తోస్తున్నాయి. ఇంకా అతని వచోమృతధార ఆస్వా దించడానికి మనస్సు ఉవ్విళ్ళూరుతున్నది.

తన శాస్త్రపాండిత్యంతో అడ్డదిడ్డాలుగా ప్రశ్నలడిగి 'అమ్మను పరీక్షించుదామని వచ్చి అమ్మ చెప్పిన, అతి తేలిక మాటలతో చెప్పిన, మహావాక్యాల అంతరార్థ భావాన్ని అవగాహన చేసుకోలేక మాటలు తడబడి 'అమ్మా! నీవు సాక్షాత్తూ బాల రాజరాజేశ్వరి వమ్మా' అని మాత్రం పలుకజాలి అమ్మ ప్రేమకోసం అంగలార్చిన మహాపండితులు, ఆశ్రమవాసులలా అర్జునుడి సంశయ గ్రంథులన్నీ విడిపోగా, పరమాత్మ అసలు స్వరూపం కళ్ళఎదుట ప్రత్యక్షంగా కనిపించేసరికి అర్జునుడు ఆ మహామహుని స్తోత్రం చేయప్రారంభించాడు.

14. సర్వ మేత దృతం మన్యే య న్మాం వదసి కేశవ।
న హి తే భగవన్! వ్యక్తిం విదుర్దేవా న దానవాః॥

తా: కేశవ! కృష్ణా! ఏదైతే నీవు నాకు ఇంతవఱకు చెప్పి ఉన్నావో అదంతా సత్యమనే నమ్ముతున్నాను. నీ వ్యక్తిని దేవతలుగాని రాక్షసులుగాని తెలుసుకోలే రనడంలో వింతలేదు.

వ్యా: చాలా మంది అమ్మ దగ్గఱకు వచ్చేవారిలో ఎంత మంది ఆమె నిజ స్వరూపాన్ని గుర్తించగలిగారు?

15. స్వయ మే వాత్మ నాత్మానం వేత్థ త్వం పురుషోత్తమ!।
భూతభావన! భూతేశ! దేవ దేవ! జగత్పతే!॥

తా: పురుషులలో ఉత్తముడా! భూతాలను నియమించేవాడా! భూతాలకు ఈశ్వరుడా! దేవదేవా! జగత్పతే! జగద్రక్షకా! నీ స్వరూపాన్ని నీవే ఎఱుగుదువు. ఇతరులకు తెలిసేదికాదు.

వ్యా: (భగవద్గీతా వ్యాఖ్యానంద్వారా అమ్మను చూదామనుకున్న నా యీ ప్రయత్నంలో ఎక్కడికక్కడే అమ్మదాటుకుపోవడాన్నే చూస్తున్నాను. మనసులో అమ్మే అమ్మనిపిస్తున్నది).

అర్జునుడింతవఱకు పరమాత్మ పరతత్వాన్ని గూర్చి విన్నాడేకాని ఆతత్వ లెస్సగా అర్థం కావాలంటే ఆయన విభూతివిస్తారాన్ని తెలుసుకోవాలి. దానివలన భగవత్తత్వం ఆయన శక్తిమత్త రెండూ కళ్ళకు గట్టినట్లౌతాయి అని అర్జునుడికి ఉత్కంఠ కలిగింది.

16. వక్తు మర్హస్యశేషణ దివ్యాహ్యాత్మ విభూతయః।
యాభి ర్విభూతిభి ర్లోకా నిమాం స్త్వం వ్యాప్య తిష్ఠసి॥

తా: దివ్యములైన నీ ఐశ్వర్యాలను సవిస్తరంగా చెప్పడానికి నీవు తప్ప ఇతరులెవ్వరూ సమర్థులు కారు. కాబట్టి ఏ ఐశ్వర్యాలతో ఈ లోకాలన్నింటనూ వ్యాపించి నిండిఉన్నాయో వాటినన్నింటినీ నాకు చెప్పుము.

వ్యా: వచ్చే అధ్యాయంలో కూడా 'మన్యసే యది యచ్ఛక్యం మయాద్రష్టుమ్' నేను చూడగలనని నీకు తోస్తే నీ విశ్వరూపాన్ని నాకు చూపించుమని కోరాడు అర్జునుడు. దానికి పరమాత్మ 'నతుమాంశక్యసే ద్రష్టుం' అనే నైవ స్వ చక్షుషా దివ్యంతదదామితే చక్షుః పశ్యమే యోగమైశ్వరమ్ అని చెప్పి దివ్యచక్షువు లను గ్రహించాడు పరమాత్మ వాటితో కూడ చూడలేక 'తే నైవ రూపేణ సహస్ర బాహో చతుర్భుజేన తవ రూపం దర్శయ' అని ప్రార్థించాడు.

17. కథం విద్యా మహం యోగీ త్వాం సదా పరిచిన్తయన్।
కేషుకేషు చ భావేషు చింత్యోఽసి భగవ న్మయా॥

తా: హేయోగీ! హేభగవన్! నిన్ను ఎలా ధ్యానంచేసి తెలుసుకోగలను!

18. విస్తరేణా త్మనో యోగం విభూతిం చ జనార్దన!।
భూయః కథయ తృప్తిర్హి శృణ్వతో నాస్తి మేఽమృతమ్॥

తా: జనార్దనా! నీ ఆత్మవిభూతి యోగాన్ని, మాహాత్మ్యా మృతాన్ని, దాన్ని

గూర్చి నీవు చెప్పే వాగమృతాన్ని, ఎంత చవి చూచినా, ఎంత సేవించినా తనివి తీరడం లేదు. కాబట్టి వాటిని గూర్చి ఇంకా సవిస్తరంగా చెప్పవలసింది.

శ్రీభగవానువాచ

19. హన్త తే కథయిష్యామి దివ్యా హ్యాత్మ విభూతయః।
ప్రాధాన్యతః కురుశ్రేష్ఠ! నాస్త్యన్తో విస్తరస్యమే॥

తా: అర్జునా! కురుశ్రేష్ఠుడా! అబ్బ! నా శ్రమ ఫలించిందయ్యా! నీకు నా విభూతులలోని ప్రధానములైన వాటిని మాత్రము చెబుతాను. సవిస్తరంగా చెప్ప డానికి నా విభూతులు, దివ్యములూ అనంతములున్నూ.

వ్యా: ఈ శ్లోకంలోని మొదటి పదమైన 'హన్త' అనే దానికి వ్యాఖ్యానకర్తలు మహాసంతోషంతో, మహావేశంతో వివరణాన్ని ఉల్లేఖించారు. పరమాత్మ లోగడ చెప్పిన 9వ అధ్యాయంలో చెప్పిన గ్రంథమంతా కావలసివచ్చింది. అర్జునుడి మనస్సులోని క్లైబ్యాన్ని పోగొట్టడానికి. మహాసంగ్రామ మధ్యంలో అటో ఇటో తెములుచ్చుకోవలసిన పరిస్థితిలో శోకసంవిగ్నమానసుడై సశరంగా చాపాన్ని విసర్జించి కూలబడిన అర్జునుడిని, శత్రువులు మీద బడినన్ను చంపినా మేలేకాని నేనుమాత్రం యుద్ధం చేయనని విలపించే సవ్యసాచిని, ఓ మహాయోగీ! హే భగవాన్, ఓ జనార్దనా! నీ ఐశ్వర్యం ఎంత గొప్పదయ్యా! నీ విభూతిని గూర్చి బ్రహ్మర్షులు కూడా స్తుతించారు. అదంతా నాకు సవిస్తరంగా చెప్పు. నాకు నీ వాక్యామృతం వల్ల పున ర్జీవనం కలుగుతున్నది. ఇంకా చెప్పు ఇంకా చెప్పు అనే దశకు తేవడానికి పరమాత్మ ఎంత శ్రమపడ్డాడు? ఎన్ని సామ దాన భేద తర్క మూలకాలైన ఉపాయాలతో సత్యాన్ని సాధించాడు? తాను చికిత్స చేస్తున్న రోగి కోలుకుంటున్నాడంటే ఏ వైద్యు నికి సంతోషం కలగదు? అలాటి సంతోషమే పరమాత్మకు కూడా కలిగింది. అబ్బ! నా శ్రమ ఫలించిందయ్యా! పార్థా! క్రొత్తగా నీలో ఉబుకుతున్న ఉత్సాహంతో సమస్త విభూతులనూ సవిస్తరంగా చెప్పమని నీవైతే కోరావుగాని, ఆ విభూతులు అనంత ములూ దివ్యములూ. అదీకాక నీవు ఎంతగా వాటిని భరించగలవో అదీ నాకు తెలుసు. కాబట్టి నీకెంత పథ్యమో, ఎంతవఱకు ఉచితమో, అంతవఱకు నా మహా విభూతులలోని ప్రధానమైన వాటినే నీకు చెబుతాను అన్నారు పరమాత్మ.

బిడ్డలకు ఎంతెంత పెడితే క్షేమకరమో అంతే పెడతాను అని అర్థం వచ్చే మాటలను అన్నది అమ్మ. కడుపు మానం తెలీకుండా తిందామనుకునే పిల్లలకు తల్లి ఎంతవఱకు వాళ్ళు అరిగించుకోగలరో అంతే ప్రసాదించడంలో అమ్మ అవ్యా జానుగ్రహం వెల్లడి కాగలదు.

20. అహమాత్మా గుడాకేశ! సర్వభూతాశయ స్థితః।
అహ మాదిశ్చ మధ్యం చ భూతానా మంత ఏవచ॥

తా: గుడాకేశా! అర్జునా! సర్వభూతాలకు ఆటపట్టుగా ఉన్న ఆత్మను నేను, భూతాలకు ఆది, మధ్యం అంతములుకూడా నేనే.

వ్యా: ఈ శ్లోకంలో గుడాకేశ శబ్దం సాభిప్రాయంగా ఉపయోగించబడ్డది. గుడాకమంటే నిద్ర. దానికి ఈశుడు అంటే దాన్ని స్వాధీనపఱచుకున్న వాడు గుడా కేశుడు. ఇంతవఱకు భ్రాంతి రూపకమైన నిద్రను జయించి సత్యదర్శనం చేస్తున్న అర్జునుని స్థితి ఈ మాటలో సూచించబడుతున్నది. ఉన్నది పరమాత్మ పదార్థం. అయినది భూతం. ఉన్నది నీరే. అది మంచుగడ్డగా అయింది. ఈ కావడం వికాసం అనేదే భూతోత్పత్తి. సృష్టి కీలకం. సృష్టికీ పరమాత్మకూ అభేదమే. కాబట్టి భూతా లకూ ఆటపట్టుగా ఉన్నది నేనే.

భూతాలే నేను. నేనే భూతాలు. మఱి వాటికి ఆద్యంతాలూ మధ్యమస్థితీ ఉన్నాయనుకుంటాం కదా! ఆత్మ పదార్థానికి అవి లేవని చెబుతారు కదా! ఈ వికా రాలు ఆత్మకు వేఱుగా ఎక్కడ నుండి వస్తున్నాయి అంటావేమో? ఆది మధ్య అంతా లనే ఆ భూతాల స్థితులనూ నేనే. అంటే జీవుల పుట్టుకనూ, ఉండడాన్నీ, ఉండలేక పోవడాన్నీ కూడా నేనే. అంటే 'అసలు నేను'గా ఉన్న స్థితి నేనుగా అవుతూ, మళ్ళీ నేను లోనికి చేరిపోవడాన్ని కూడానేను, ఆత్మ పదార్థమే జగత్తుగా మారుతుందనీ. మళ్ళీ జగత్తే ఆత్మపదార్థంలోకి చేరిపోతుందనీ భావం. ఆత్మా సత్యమైనదే జగత్తూ సత్యమైనదే అని భావం.

సర్వస్య చాహం హృది సన్నివిష్టో
మత్తః స్మృతిర్జ్ఞానమపోహనంచ
వేదైశ్చ సర్వైరహమేవవేద్యో
వేదాన్త కృద్వేదవిదేవ చాహం

అని పురుషోత్తమ ప్రాప్తియోగంలో పరమాత్మ సెలవీయబోతారు.

సమస్త ప్రాణి జాతులహృదయాల యందు ఉండేవాడిని నేను. జ్ఞాపకశక్తి, జ్ఞానం, మఱుపు నావల్లనే కలుగుతాయి. సమస్త వేదముల వల్ల తెలియబడేవాడిని నేను. ఉపనిషత్స్వరూపమయిన వేదాంత శాస్త్రాన్ని నిర్మించిన వాడిని నేను. వేద తత్వాన్ని ఎఱిగిన వాడిని కూడా నేనే అని దీనిభావం.

21. ఆదిత్యా నా మహం విష్ణు ర్జ్యోతిషాం రవి రంశుమాన్।
మరీచి ర్మరుతా మస్మి నక్షత్రాణా మహం శశీ॥

తా: ఆదిత్యులు 12 గురు. వారిలో విష్ణు వనుపేరు ఆదిత్యుడను. జ్యోతులతో కిరణాలుగల సూర్యజ్యోతిని నేను. మరుత్తులనే దేవతా గణంలో మరీచి అనేవాడిని నేను. నక్షత్రాలలోచంద్రుడిని నేను.

22. వేదానాం సామవేదోఽస్మి దేవానా మస్మి వాసవః।
ఇంద్రియాణాం మనశ్చాస్మి భూతానా మస్మి చేతనా॥

తా: వేదాల్లో సామవేదాన్ని, దేవతల్లో ఇంద్రుడిని. ఇంద్రియాల్లో మనస్సును, ప్రాణుల్లోని చైతన్యాన్ని.

వ్యా: మనస్సునూ, జ్ఞాపక శక్తినీ పరమాత్మకు భిన్నంగా గుర్తించి విచిత్ర సిద్ధాంతాలు అల్లమొదలు బెడితే మనం లోకంలో ఎక్కడ కాలుపెట్టి నిలవగలమో తెలియదు. మనం చేసే వాదోపవాదాలు, సిద్ధాంతాలు, మనస్సుతోనే, బుద్ధితోనే, పరమాత్మ నేనేబుద్ధిని, నేనే మనస్సును, నేనే విజ్ఞాన శక్తిని అని ఢంకా బజాయించి చెబుతున్నా మనకు మాత్రం ఈ అన్నింటికి ఆయన భిన్నంగా కనబడుతుంటాడు. అందుకని అమ్మ పరమాత్మకూ ఆయన సంకల్పానికీ, సంకల్పానికీ సంసారానికీ, సంసారానికీ పరమాత్మకూ ఏమీ భేదం లేదంటుంది.

23. రుద్రాణాం శంకర శ్చాస్మి విత్తేశో యక్షరక్షసామ్।
వసూనాం పావక శ్చాస్మి మేరు శ్శిఖరిణా మహమ్॥

తా: రుద్రులు పదకొండు మంది. అందులో శంకరుడను. యక్ష రాక్షసులలో కుబేరుడను. అష్టవసువులలో పావకుడనే అగ్నిని, శిఖరంగల పర్వతాలలో మేరువును.

24. పురోధసాం చ ముఖ్యం మాం విద్ధి పార్థ! బృహస్పతిమ్।
సేనానీనా మహం స్కంద స్సరసా మస్మి సాగరః॥

తా: అర్జునా! పురోహితులలో ముఖ్యుడైన బృహస్పతినని తెలుసుకో: సేనా నాయకులలో కుమారస్వామిని, సరస్సులలో సముద్రాన్ని.

25. మహర్షీణాం భృగురహం, గిరా మస్మ్యేకమక్షరమ్।
యజ్ఞానాం జపయజ్ఞోఽస్మి స్థావరాణాం హిమాలయః॥

తా: మహర్షులలో భృగుమహర్షిగాను, వాక్కులలో ఓంకారంగాను అయి ఉన్నాను. యజ్ఞాలలో జపయజ్ఞాన్ని, స్థావరాల్లో హిమాలయాన్ని

26. అశ్వత్థ స్సర్వ వృక్షాణాం దేవర్షీణాం చ నారదః।
గంధర్వాణాం చిత్రరథ స్సిద్ధానాం కపిలో మునిః॥

తా: వృక్షాలలో రావిచెట్టును దేవర్షులలో నారదుడిని. గంధర్వులలో చిత్ర రథుడిని, సిద్ధులలో కపిలమునిని,

సిద్ధుడు అంటే పుట్టుక చేతనే పరమార్థాన్ని తెలుసుకున్న వాడని అర్థం.

27. ఉచ్చైశ్రవస మశ్వానాం విద్ధి మా మమృ తోద్భవమ్।
ఐరావతం గజేంద్రాణాం నరాణాం చ నరాధిపమ్॥

తా: గుఱ్ఱాల్లో సముద్ర ధన సమయంలో అమృతంతో కలిసి పుట్టిన ఉచ్చై శ్రవాన్ని అని తెలుసుకో. ఏనుగుల్లో ఐరావతంగాను, నరుల్లో రాజుగాను నన్ను గుర్తించు.

28. ఆయుధానా మహం వజ్రం ధేనూనా మస్మి కామధుక్।
ప్రజన శ్చాస్మి కందర్ప స్సర్పాణా మస్మి వాసుకిః॥

తా: ఆయుధాల్లో నేను వజ్రాయుధాన్ని, ధేనువులలో కామధేనువును. జనన కారణాలలో మన్మథుణ్ణి. ఒక తలగల పాముల్లో వాసుకిని.

29. అనంత శ్చాస్మి నాగానాం వరుణోయాదసాం అహం।
పితౄణా మర్యమా చాస్మి యమ సంయమతా మహం॥

తా: పెక్కుతలలు గల నాగులలోనేను అనంతుడుడను, జలదేవతలలో వరుణుడిని. పితృదేవతలలో అర్యముడనే పేరుగల పితృరాజును. శిక్షించే వాళ్లలో యమ ధర్మరాజును.

వ్యా: 'పక్షుల్లో గరుత్మంతుడినీ, పాముల్లో సుబ్రహ్మణ్యేశ్వరుడినీ అని చెప్పుకోవడంలో వాడి ఉద్దేశం అన్నింట్లో నేనున్నానని చెప్పుకోవడం కోసమే. సాటి మానవుడినే సమంగా చూడలేని మనం ఒక దుష్టజంతువుని చూడగలమా? అందుకని అందులో సుబ్రహ్మణ్యేశ్వర స్వామిని అన్నాడు. అంతే. తతిమ్మావి కావని కాదు. నిగ్రహంకోసం విగ్రహారాధన ఎట్లాంటిదో అలాగ అన్నిట్లో సర్వత్రా వాడున్నాడని తెలుసుకోవడం కోసం అమ్మ.

30. ప్రహ్లాద శ్చాస్మి దైత్యానాం కాలః కలయతా మహం।
మృగాణాం మృగేంద్రోఽ హం వైనతే యశ్చ పక్షిణామ్॥

తా: రాక్షసుల్లో ప్రహ్లాదుణ్ణి. కాలాన్ని లెక్కించే వాళ్ళలో కాలాన్ని నేను. మృగాల్లో సింహాన్ని, పక్షుల్లో గరుత్మంతుణ్ణి.

31. పవనః పవతా మస్మి రామ శ్శస్త్ర భృతా మహం।
ఝషాణాం మకర శ్చాస్మి స్రోతసామస్మి జాహ్నవీ॥

తా: వేగంగల వాటిల్లో గాలిని నేను. శస్త్ర పాణుల్లో శ్రీరామ చంద్రమూర్తిని. చేపలలో మొసలిని. నదుల్లో గంగానదిని.

32. సర్గాణా మాది రంతాశ్చ మధ్య చైవాహ మర్జున!।
అధ్యాత్మ విద్యా విద్యానాం వాద ప్రవదతా మహం॥

తా: అర్జునా! సర్గాల ఉత్పత్తి స్థితి లయాలు నేను. విద్యలన్నింటిలో ఆధ్యాత్మ విద్యను నేను. వాదించే వారలలో వాదాన్ని నేను.

వ్యా: 20వ శ్లోకంలో కూడా పరమాత్మ తాను మొదలు నడుమ, చివర తానేగా చెప్పి ఉన్నారు. మళ్ళీ ఈ శ్లోకంలో కూడా ఆది మధ్యాంతాలు తానేగా చెప్పి ఉన్నారు. ఇది పునశ్చరణం అనిపించవచ్చు. కాని ఇది సర్గాలను గురించి చెప్పిన విషయం. ఇక్కడ చేతాచేతనాత్మకమైన సమస్త జగత్ సృష్టికి తానే ఆది మధ్యాం తాలుగా చెప్పబడినదని తెలుసుకునేది.

అదీకాక 'యన్మధ్యమ పరిమాణం తదనిత్యం' అనే వాక్యాలనుబట్టి ఆది మధ్యాంతాల ప్రసంగం ఉన్న వెల్ల అనిత్యాలే. నిత్యములూ అనిత్యములూ పరిణామ శీలములు. పరిణామ యంత్రాంగంలో జరిగే రూపాంతర క్రియయే మనకు నాశనమనిపిస్తుంది. ఈ రూపాంతర క్రియ గుణాత్మకంగానూ ఉండవచ్చు.

మొగ్గ పువ్వు కావడానికి, పువ్వు కాయ గావడానికి, కాయ పండు గావడానికి ఎన్నో మార్పులు సంభవిస్తాయి. వెనుకటి దశ ముందటి దశలోనూ, ముందు దశలో వెనుకటి దశ అంతా లయమైపోతూ ఉన్నా, ఈ వస్త్వాత్మకమైన మార్పులు మనకు గుర్తుకురావు. పువ్విచ్చే వాసన పండులో లభించకపోవచ్చు. కాని ఇది సహజంగా జరుగుతున్నదే. పెద్ద ఎత్తున జరగడం లేదు కాబట్టి పువ్వు పండుగా అయినప్పుడు దాన్ని ప్రళయం అనుకోము. గాలివాన వచ్చి బహుముఖతః నాశనం జరిగితే దాన్ని ప్రళయం అంటాం. ప్రకృష్టమైన లయమే ప్రళయం. ప్రకృష్టమైన

లయమంటే ఏమిటి? గుణాత్మకమైన మార్పులు అభివృద్ధికి ఉన్ముఖం కావలసిన పద్ధతిలో జరిగితే అది ప్రళయం కాదు. పువ్వు పండై ఆ పండు మళ్ళీ బీజకారణం కాగల స్థితికి వచ్చినదయితే దాన్ని ప్రళయమనం. పండు క్రుళ్ళిపోయి, విత్తనాలు అంకురశక్తి రాకుండానే చచ్చిపోతే పండుకది ప్రళయమే. ఈ నిర్బీజ స్థితికి సృష్టిలో కొంతభాగం చోటు లభించడమే ప్రళయం అంటారు. మాట గొప్పయే గాని అనంత్య పర్యాయంగా ఇది కూడా ఒక రకమైన మార్పే.

సాంఖ్య యోగంలో పరమాత్మ చావునుగూర్చి చెబుతూ 'అవ్యక్తాదీని భూతాని వ్యక్త మధ్యాని భారత! అవ్యక్త నిధనా న్యేవ కా తత్ర పరిదేవనా' అని చెప్పి ఉన్నారు. అవ్యక్తంలో నుంచి బయటికి దూకి. వ్యక్త మధ్య దశను కొంత గడిపి మళ్ళీ అవ్య క్తంలో జొరబడిపోవడం ఇది సృష్టిలోని ప్రతి అంశానికీ వర్తించేది అయి ఉన్నది. వ్యక్త మధ్య దశ (critical size) ఆపన్న ప్రమాణానికి లోబడి ఉన్నది. అంటే ఎద గడం విఅగడం. లేక క్షీణిస్తూ తరుగుతూ విఅగడం. నక్షత్రాలలో నేను చంద్రుడిననీ, ఆదిత్యులలో సూర్యుడననీ, మరుత్తులలో వాయువున నీచెబుతుంటే ఈ విషయాలు తళుక్కుమంటాయి. నేను మెఱుపును హిమాలయాన్ని అని చెబుతూ నేను వాసవుణ్ణి అని కూడా చెబితే, పర్వతాల ఱెక్కలను ఇంద్రుడు తెగకొట్టిన గాథ జ్ఞప్తికి వస్తుంది. నేను జాహ్నవిని, సాగరాన్ని అని చెబుతుంటే నదులన్నీ సాగరంలో కలిసి సూర్య రశ్మికి ఆవిరై మళ్ళీ నదులుగా మారే సృష్టిచక్రం ప్రత్యక్షమౌతుంది. సామవేదాన్ని, చేతనాన్ని, మనస్సును, ఓంకారాన్ని అని చెబుతుంటే మనోరూపమైన సృష్టి దాన్ని వెక్కిరించే ద్రవ్యరూపమైన ఆకార ప్రపంచమూ, పావకత్వం విశ్వంలో చేసే పాక క్రియలూ, విశ్వంభరత్వమూ, ఋతంభర శక్తులూ ఋతి అనే దాన్ని నిర్మించే యజ్ఞ శక్తీ, జపయజ్ఞ శక్తీ అన్నీ గోచరమౌతాయి. శ్రీరామ చంద్రుడిని, శంకరుడిని, విష్ణువును, కుబేరుడిని, స్కంధుడిని, భృగువును, యముడిని, బృహస్పతిని నారదు డిని అని చెబుతుంటే వారు ఐహికాముష్మిక తత్వాలుగా ప్రత్యక్షమౌతున్న విశ్వనాటక రంగాలన్నీ కండ్ల ఎదుట ప్రత్యక్షమౌతాయి. ఈ అన్నింటిమధ్య వెదుక్కుంటే ఎవనికి వాడే కర్త కర్మ క్రియలుగాను, ఆది మధ్య అంతంగాను రూపొందుతాడు. ఆనం త్యానికి మొదలెక్కడ? నడిమి ఎది? అంతమే రూపంగా ఉంటుంది. అమ్మమాటల్లో సర్వానికి సర్వం ఆది, మధ్య అంతమూ.

వాదం, వివాదం, వితండ వాదం అని మూడురకాలు. వాదంలో సత్యం జయించాలి అనే మాట ప్రబలం. వివాదంలో తనమాట నెగ్గాలనేదే ప్రబలం. వితండవాదం అంటే పిడివాదం. తప్పైనా తనన్నదే నెగ్గాలన్నదే ప్రధానం. ఈ మూడింటిలోనుతాను ఉత్తమ వాదాన్నని సెలవిచ్చారు.

33. అక్షరాణా మకారోఽ_స్మి ద్వంద్వ స్సామాసికస్య చ।
అహ మేవాఽ_క్షయః కాలో ధాతాఽ_హం విశ్వతోముఖః॥

తా: అక్షరాల్లో అకారాన్ని, సమాసాల్లో ద్వంద్వ సమాసాన్ని అంతులేని కాలాన్ని, ఎల్లవైపులా ముఖాలున్న చతుర్ముఖ బ్రహ్మను.

వ్యా: అన్ని భాషల్లోను అకారమే మొదటి అక్షరం ఓంకారానికి కూడా. మొదటి అక్షరం అదే. అచ్చులను ప్రాణాలంటారు. అచ్చుల్లో మొదటి ప్రాణం అదే. అమ్మ తన పేరు అం అ అని వ్రాసేది.

సమాసాల్ల ద్వంద్వ సమాసాన్ని అంటే ద్వంద్వాలు లేనిదే జగత్తే లేదనీ, భగవంతుడు తలిస్తేనే మనమూ తలుస్తాము. అనే మాట ఒకే కాడకు పూచిన రెండు పూవులనీ రెండూ ఒకసారే విచ్చడమే మనస్సు పనిచేయడమంటే అనీ అర్థంగా గ్రహించేది.

అక్షయమైన కాలం అంటే కదలని కాలం. గుక్కపట్టిన బొంగరంలాటి కాలం. చూడడానికి అది ఉన్నచోటనే ఉన్నట్లుంటుంది. తన చుట్టూ తాను ప్రచండ వేగంతో తిరుగుతుంటుంది. అణోరణీయాన్ మహతో మహీయాన్ ఆత్మాస్య జంతోర్ని హితో గుహాయాం తమక్రతుః పశ్యతి వీతశోకో ధాతు ప్రసాదా న్మహిమానమాత్మనః అనే శ్లోకంలోని అర్థం అంతా ఘనీభవించిన దివ్యస్వప్న ప్రకృతి. స్వాదిష్టమైన చండ శాసనత్వం. తప్పించుకోరాని ధారావేగం! ధారాపాతం!! బుద్ధిచోదనం!!!

తిరిగే బొంగరానికి ఎన్ని ముఖాలుంటాయి. తిరిగే బొంగరాన్ని శీర్షాసనమ వేసిగాని, ఇంకో బొంగరం మీద కూర్చునిగాని చూస్తే ఎవరు, ఎప్పుడు, ఎక్కడ, ఎలా, ఏది, ఎందుకు, ఎంత అనే విజ్ఞాన ప్రశ్నలకు సమాధానాలు దొరుకుతాయా? భూమితోబాటు మనమూ తిరుగుతున్నా. భూమి సూర్యునిచుట్టూ తిరుగుతున్నది. సౌర కుటుంబం అంతా ఇంకా ఎంతో పెద్ద కుటుంబం చుట్టూ తిరుగుతున్నది. కాల గగనాల స్థిరత్వం గుర్తించడానికి శక్యం కానిది. అదే విశ్వతోముఖత్వం అంటే... భగవత్సాన్నిధ్యం యొక్క సంపూర్ణత్వం; సర్వవ్యాపకత్వం, అంటే సర్వత్వం.

34. మృత్యుః సర్వ హర శ్చాహ ముద్భవ శ్చ భవిష్యతామ్।
కీర్తి శ్రీ ర్వాక్చ నారీణాం స్మృతి ర్మేధా ధృతిః క్షమా॥

తా: సర్వాన్నీ పరిష్కరించే మృత్యువును. ఉండబోయే అంతటికి పుట్టుకను. స్త్రీ ప్రకృతులుగా తలచబడే కీర్తిని, లక్ష్మిని, సరస్వతిని, స్మృతిని, ధృతిని, మేధస్సును, క్షమను - అన్నీనేనే.

వ్యా: ఈ శ్లోకంలో పరమాత్మ యొక్క సత్వ రజస్తమోగుణాలను గూర్చి చెప్పబడింది. త్రిగుణాలే కాక, స్త్రీ గుణమైన మాతృత్వాన్ని గూర్చి చెప్పబడ్డది. తమస్సువల్లనే సత్వ రజస్సులకు చలనం కలుగుతుంది.

బృహదారణ్య కోప నిషత్తులో మొదట్లో మృత్యువే ఉండేదనీ, అది బ్రహ్మను సృష్టిచేసిందనీ, ఆ శిశువును మృత్యువు మ్రింగబోగా వాడు భయపడి 'భాణ్' అని అటిచాచడనీ, ఆ అఱుపే వేదాలైనాయనీ కథ ఉంది. బ్రహ్మలోకాలను సృష్టిచేశాడు. మృత్యువు వాటిని తింటూపోయింది. రజో గుణం క్రియాత్మకం కావడానికి తమో గుణం క్రియాత్మకమైనది. 'ఉద్భవశ్చ భవిష్యతామ్' కాబోయే సృష్టి సంకల్ప రూపకంగా పరమాత్మలో ముందుగానే ఇమిడి ఉన్నదని అర్థం.

ఆ మృత్యువే తనకు రెండవ ఆత్మ కలుగునుగాక అని ఇచ్ఛించింది, మిథునం గా అయిందని బృహదారణ్యకం చెబుతుంది. నారీణాం అనే పదానికి సంబంధిం చినదే మిథునత్వం. దానికి సంబంధించిన గుణాలే, కీర్తినుంచి శ్రీ, శ్రీ నుంచి వాక్కు, వాక్కు నుంచి స్మృతి, స్మృతి నుంచి మేధ, మేధ నుంచి ధృతి, ధృతి నుంచి క్షమ.

కీర్తి అంటే అవ్యక్తం నుంచి వ్యక్తం గావడం, వ్యక్తమైనది విశదం గావడం శ్రీ, విశదమైనది గుర్తించబడడం వాక్, గుర్తించబడినది మనస్సు కెక్కడం స్మృతి, మనస్సు కెక్కినది సంకల్పం గావడం మేధ, సంకల్పం గట్టి పడడం ధృతి, గట్టిపడిన సంకల్పం కార్యరూపం గావడం వ్యక్తిగా నిలవడం.

35. బృహత్సామ తథా సామ్నాం గాయత్రీ ఛందసా మహం।
మాసానాం మార్గశీర్షో౽హం, ఋతూనాం కుసుమాకరః॥

తా:సామాలలో బృహత్సామాన్ని నేను ఛందస్సులలో గాయత్రీ ఛందస్సును మాసాల్లో మార్గశీర్షమాసాన్ని, ఋతువులలో వసంతరుతువును.

వ్యా: పూర్వం పరమాత్మ వేదానాం 'సామవేదోస్మి' అని చెప్పి ఉన్నారు. అందులో ఇంకో విశేషం కూడా ఉంది. ఋగక్షరారూఢాలైన గీతి విశేషాల్లో "త్వామిద్ధి హవావహే' అనే ఋక్కుకు, గీతి విశేష రూపమైన బృహత్సామ ఉంది. ఆ సామము ఇంద్రుణ్ణిస్తుతిస్తుంది. ఇతర సామల కంటే అది శ్రేష్ఠమైంది అది నాస్వరూపం అని పరమాత్మ సెలవిస్తున్నారు.

అక్షర నియమాలున్న పాదరూప ఛందో విశిష్టాలైన ఋక్కుల్లో గాయత్రిని నేను. "తత్సవితుర్వరేణ్యం భర్గోదేవస్య ధీమహి ధియోయోనః ప్రచోదయాత్" అనేది గాయత్రి మంత్రం.

రోగక్రిములు బలహీనములై ఆరోగ్యవర్ధక దినాలతో భాసిల్లేది మార్గశీర్ష మాసం. కుసుమాకర శబ్దం ఆధ్యాత్మికంగా సాధకులకు అహంకార విచ్ఛిత్తితోబాటు గర్భకోశవాస ప్రాప్తములైన పూర్వానూచాన వాసలు నశించి ఐహికతయే స్వర్గముగా రూపొందే మార్పు కలగడమని అర్థం.

36. ద్యూతం ఛలయతా మస్మి తేజ స్తేజస్వినా మహమ్।
జయోஉ_స్మి వ్యవసాయోஉ_స్మి సత్వం సత్వవతా మహమ్॥

తా: మోసాల్లో జూదాన్ని, తేజస్వులలోని తేజస్సును, జయాన్ని నేను ప్రయత్నాన్ని; సాత్వికులలోని సత్వగుణాన్ని.

వ్యా: సత్వరజస్తమో గుణరూపుడైన పరమాత్మకు మనకిష్టం లేదని వాటికి ఆయన్ను దూరంగా ఉంచడం, మనకు తగుతుంది. కాని పరమాత్మయే వక్త అయినప్పుడు తమోగుణాన్ని ఎలా విడిచి పెడతాడు? విద్య ఆయన అయితే అవిద్య మాటేమిటి? మోసాన్ని నేనే. జూదాన్నీ నేనే అన్నారు. మాయ, భ్రాంతి, ప్రకృతి రూపాలతో ఆవహించినప్పుడు లేనిచోట లాభం ఉన్నట్లు కనిపించుతుంది. తేజస్సు వెల్లివిరిసిన మనస్సులో జూదపుమాయ అనే అంధకారం మాసిపోతుంది. సూర్యకాంతి వెలిగి పగలుగా వెల్లివిరిసి రాత్రిని పగలు చేస్తుంది. ప్రయత్నం విజయవంతమౌతుంది. సత్వస్ఫూర్తి మయమౌతుంది సర్వం.

37. వృష్ణీనాం వాసుదేవోஉ_స్మి పాండవానాం ధనంజయః।
మునీనా మప్యహం వ్యాసః కవీనా ముశనా కవిః॥

తా: వృష్ణి వంశస్థులలో వాసుదేవుణ్ణి నేను. మునులలో వ్యాసుణ్ణి. కవులలో శుక్రుడను.

వ్యా: 'వాసుదేవస్సర్వమితి' అనే వాక్యాన్ని ఎదుట నిలబెడుతుంది మొదటి మాట. నీవులేని నేనును నిలబెడుతుంది రెండోమాట. 'వ్యాసోచ్ఛిష్టం జగత్సర్వం' అనే మాటను నిలబెడుతుంది. మూడోమాట కవిబ్రహ్మగా శుక్రాచార్యులను నిలబెట్టుతుంది. నాలుగోవాక్యం (అంటే శుక్రుడు చచ్చినవారిని బ్రతికించగలడు)

38. దండో దమయతామస్మి నీతి రస్మి జిగీషతాం।
మౌనం చైవాస్మి గుహ్యానాం జ్ఞానం జ్ఞానవతా మహమ్॥

తా: శాసించేవాళ్ళ దండాన్ని నేను. జయేచ్ఛగల వారి నీతిని నేను. రహస్యములలోని మౌనాన్ని నేను. జ్ఞానులలోని జ్ఞానాన్ని నేను.

వ్యా: ఈ లోకంలో తల నఱికేసినా అది వెంటనే నేరం గాదు. జడ్జి అది నేరమని తీర్పిస్తేనే నేరం. ప్రకృతి శాసనం మన శాసనం వంటిదికాదు. నిప్పు పట్టుకోగానే కాలుతుంది. ప్రకృతి న్యాయస్థానంలో చేసిన తప్పుకు శిక్ష తప్పదు. అదీ అర్థం దండ శబ్దానికి.

సామర్థ్యమూ, విక్రమమూ వీటికే జయం లభించుతుంది. అదే అర్థం నీతి అనేమాటకు. గుహ్యం అంటే ప్రకృతితో అగ్ని పర్వతం చేసే అల్లరీ అట్టహాసమూ హడావిడీ కాదు. పైకి కనిపించే హడావిడి అంతటికీ వెనుక ఉన్న కారణం. అది రహస్యంగానే ఉంటుంది. అదే అర్థం. మౌన శబ్దానికి.

కళ్ళు మూసుకున్నా కనిపించేది జ్ఞానం మూలకారణం బయట పడడమే జ్ఞానం. సమష్టి జ్ఞానం వ్యష్టిగా రూపొందడమే దీని మర్మం. ఇదే అర్థం జ్ఞాన పదానికి.

39. యచ్చాపి సర్వభూతానాం బీజం తదహ మర్జున!।
న తదస్తి వినా యత్స్యా న్మయా భూతం చరాచరమ్॥

తా: అర్జునా! సర్వభూతాలకు ఏది మూలమో, ఆ ప్రధాన కారణాన్ని నేనే. చరాచర భూతజాలంలో నేను కానిదేదీ లేదు.

వ్యా: నేను ఇదనీ అదనీ చెప్పడానికి బదులు పరమాత్మ స్థావర జంగమాలలో తానుగా లేనిది ఏదీలేదని నిర్ధారించి చెప్పాను. నామరూపాలు వేర్వేరుగా ఉన్నప్పటికీ అన్నీ నాలోనే ఐక్యమౌతున్నవి. అన్నీ నానుంచే ఉద్భవిస్తున్నవి. నేనే సమస్త ప్రపంచమూ అయి ఉన్నాను అని చెప్పారు. ఈ రీతిగా పృథక్త్వంలో ఏకత్వం సిద్ధిస్తున్నదని తాత్పర్యం. అయితే శరీరాల భేదాలు వ్యక్తి భేదాలు కావా అని కొందఱు సంశయించవచ్చు.

దీపం బుడ్డిని ఉదాహరణగా తీసుకుందాం. బుడ్లు వేఱుగానే ఉంటాయి. అవి ఇచ్చే కాంతికి భేదం లేదు. ఒక బుడ్డి దీపం నుండి మఱో దీపమును ముట్టించవచ్చు. దానివల్ల మొదటి దీపానికి తఱుగు ఒరుగూ రాదు. వంతెన ప్రయోజనం నదిని దాటడం. వంతెనే కనిపిస్తుంది. కాని దాటడం మనస్సులో కనిపించదు.

ప్రయోజన శీలమైనది జగద్ద్రవ్య రూపం. దాన్ని గూర్చి చెబుతుంది భగవద్గీత. చచ్చిన గొడ్డు పాలివ్వదు. ప్రాణానికీ పాలకీ భేదం లేదా అనివాదించడం మూర్ఖత్వం. క్షీర గ్రంథులు ఏర్పడేదాకా ఏ దూడా పాలివ్వదు. ఆపన్న ప్రమాణమంటారు దీన్ని. ఒకవిధంగా చూస్తే దీపానికి దీపం ముట్టించడమే అవుతుంది. గొడ్డుకు గొడ్డు, చెట్టుకు చెట్టు, మనిషికి మనిషి పుట్టడం కూడా. లక్షణాన్ని గ్రహిం

చాలి. ఆత్మ వేఱు. దాని ప్రతిబింబం వేఱు. ఆత్మ అర్థమయిన వానికి ప్రతిబింబ ధ్యాస ఉండదు. తల్లి రక్తం పాలుగా మారిన తరువాత పాలకు రక్తధ్యాస ఉండదు. తల్లి ధ్యాసే!

40. నాన్తోఽస్తి మమ దివ్యానాం విభూతీనాం పరన్తప!।
ఏష తూద్దేశతః ప్రోక్తో విభూతే ర్విస్తరో మయా॥

తా: పరన్తపా! నా దివ్య విభూతులనన్తములైనవి. చెప్పడానికి శక్యంగాని విస్తారములైనవి. ఉద్దేశ పూర్వకంగానే ప్రధానములైన వాటిని మాత్రమే నీకు చెప్పాను.

వ్యా: అనన్తత్వాన్ని అఱచేతిలో ఇముడ్చుకోవడం ఎలాగా? ప్రమాణంతో కొలవడానికి సాధ్యాసాధ్య పరిమితులున్నాయి గదా! పరిమితాయుష్కులు, ప్రత్యేక బుద్ధిమయులూ, పరిమితేంద్రియ మేధస్కులూ అయిన అహంయువులకు కారణ సూక్ష్మ స్థూల రూపాలను మనసుకు పట్టేలాగా విశదీకరించడం అసాధ్యం. సృష్టి యంత్రాంగం అంత సులువైనది అనుకోవడం మానవుని అజ్ఞానమే.

41. యద్య ద్విభూతి మత్సత్త్వం శ్రీమదూర్జిత మేవ వా।
తత్తదేవావగచ్ఛ త్వం మమ తేఽ జోంశ సంభవమ్॥

తా: ఏదేది విభూతి మంతమో, శ్రీమంతమో, ఊర్జితమో అదంతా నాతేజోంశ సంభవంగానే నీవు తెలుసుకో.

వ్యా: చెప్పని వాటిని గుఱించి సంగ్రహించడానికి ఈ మాట కూడా పరమాత్మ అంటున్నారు. ఐశ్వర్యవంతమూ, సంపద్యుక్తమూ, శోభాసమేతమైన ఏదైనా ఇంకా మిగిలి ఉంటే అదంతా నాతేజోంశ సంభవంగానే తెలుసుకోమని పరమాత్మ చెప్పారు.

42. అథవా బహు నైతేన కింజ్ఞానేన తవార్జున!।
విష్టాభ్యాహ మిదం కృత్స్న మేకాం శేన స్థితో జగత్॥

తా: అర్జునా! అంతేకాక ఇప్పుడు నీచేత తెలిసికోబడిన నా విభూతి సమగ్ర దర్శనం ఇచ్చేటంతది కాదు. నేను నావిభూతిలోని పాతికభాగం చేతనే జగత్తును విశ్వాన్ని భరిస్తున్నాను. అది కూడా నీకు తెలిస్తేనే పూర్ణమౌతుంది.

వ్యా: 'పాదోస్య విశ్వాభూతాని త్రిపాద స్యామృతం దివి' అని పురుష సూక్తం చెబుతుంది. అంటే భగవంతుడు ఒక వంతు జగత్తులోని భూతజాలంలోను, మూడు వంతులు అదృశ్యమైన స్వర్గంలోను (సూక్ష్మసృష్టి) తన విభూతి నుంచి వ్యాపించి ఉన్నాడని అర్థం.

ఇది శ్రీమన్మాతృగీతలోని విభూతి యోగమను దశమాధ్యాయము.

మాతృగీత

విశ్వరూప సందర్శన యోగము

ఏకాదశో అధ్యాయము

అర్జున ఉవాచ

1. మదనుగ్రహాయ పరమం గుహ్యమాధ్యాత్మ సంజ్ఞికమ్।
యత్త్వయోక్తం వచస్తేన మోహోయం విగతో మమ॥

అర్జునుడు చెప్పుచున్నాడు.

తా: నన్ను అనుగ్రహించుటకుగాను, గుహ్యమూ, ఆధ్యాత్మ సంజ్ఞికమూ అయిన పరతత్వమును గూర్చి నీవు చెప్పిన వచనములవలన నా మోహమంతా విచ్చిపోయింది.

వ్యా: పదవ అధ్యాయంలో పరమాత్మ తన విశ్వ విభూతిని ప్రకటిస్తూ చెప్పిన వారిలో కొందఱిని స్వయంగా అర్జునుడు చూచియే ఉన్నాడు. శంకరుడితో పోరి పాశుపతాన్ని సంపాదించాడు. పాండవానాం ధనంజయః అంటే తనే అనుకొన్నాడు. నేను యమధర్మరాజును నేను మృత్యువును అంటూ చెబుతుంటే అదేమిటో వాళ్ళ నిజస్వరూపాలెలా ఉంటాయో చూడాలని అర్జునుడి మనస్సులో ఉత్కంఠ కలిగింది. సర్గాల ఆది మధ్యాంతాలు సృష్టి ఉత్పత్తి స్థితిలయాలు, ఆధ్యాత్మ విద్య, కాలమూ, ఇవన్నీ తానే అని చెప్పగానే క్షత్రియుడు కనుక ఇవన్నీ కలిగి ఏకమైన పరమాత్మ రూపాన్ని కళ్ళారా చూద్దామనే కోర్కె అర్జునుడి మనస్సులో కలిగింది. అదీకాక దివ్య విభూతులకు అంతంలేదు. సర్వ జగత్తును నాలో నాలుగో వంతుతోనే వ్యాపించి ఉన్నానని చెప్పేసరికి పరమాత్మ విభూతి అంతా కేంద్రీకృతమైన బృహద్రూపాన్ని ఒక్కసారిగా చూద్దామనే వాంఛ అర్జునుడి మనస్సులో మెఱిసింది. పరమాత్మ యొక్క జగదాధార, జగత్కారణ, జగద్వ్యాపక, సర్వశక్తిమత్వగుణాలు పృథక్త్వంలోని ఏకత్వం, పరమాత్మ పరోక్షంగా ఎక్కడో ఉంటాడనే అదృశ్యతపోయి ప్రత్యక్షంగా ఎదుట నిలబడి ఉన్న సాక్షాత్వం, కొట్టవచ్చినట్లు కనిపిస్తున్నాయి. కృష్ణుడు తనకిప్పుడు బావ, సఖుడు, సారథిగా కనిపించడంలేదు. సర్వభూతాలు తనకంటే వేఱనుకున్న భ్రమ తొలిగిపోతున్నది. పరమాత్మ వేఱు జగత్తు వేఱు అనే భ్రమ కూడా తొలిగిపోయింది. అన్ని వాచకములు పరమాత్మవే అని తేలింది. కార్యకారణాలకు భేదం లేదని ఋజువౌతున్నది. కాని ఇక ఈ భావం

స్థిరపడాలి అంటే శ్రీకృష్ణ పరమాత్మదేహమే ఆత్మమయమని నిదర్శనం కావాలి. జగత్ పరమాత్మల రూపం సాక్షాత్కారించాలి. ఈ పరినిష్పన్న జ్ఞానం ప్రకాశించాలి తన మనస్సులో. ఇక్కడదయతే 'మోహోఽయం విగతో మమ' అన్నాడు. పరమాత్మ చేసిన బోధ ప్రభావం అలాంటిది. వ్యాఖ్యాతలు 18 అధ్యాయాలను 18 ఔన్సుల మందుగా పోలుస్తారు. 10 ఔన్సుల మందుతోనే అర్జునుడి మోహం అనే రోగం కుదిరిందని వ్రాస్తారు. కాని ఇప్పుడే కనుక 18వ అధ్యాయం చివర చెప్పినట్టు 'కరిష్యేవచనం తవ' అని కనుక అర్జునుడు అనేసినట్లయితే ఈ విశ్వరూప సందర్శనం మనకు దక్కి ఉండేదికాదు. ఈ వికసించిన మనస్సుతో అర్జునుడు పరమాత్మను ఎన్నో రకములయిన మనోహరములయిన సంబోధనలను చేస్తాడు.

కమల పత్రాక్ష! పరమేశ్వర! పురుషోత్తమ! యోగేశ్వర! ప్రభో!

అంటూ మహద్బోధకార్థాలైన పదాలని వాడతాడు. ఇదివఱ కలవాటయిన కేశవ! మాధవ! ఇలాంటి మూడక్షరాల మాటలను విడిచిపెడతాడు.

2. భవాప్యయౌ హి భూతానాం శ్రుతౌ విస్తరశో మయా।
త్వత్తః కమలపత్రాక్ష! మాహాత్మ్య మపి చా వ్యయమ్॥

తా: కమపత్రాల వంటి కనులు కల కృష్ణా! భూతాల జనన మరణాలను గుఱించి విస్తరంగా నీవు చెప్పిన మాటలన్నీ నేను విన్నాను. అవ్యయమైన నీ మహిమాతిశయాలను గూర్చి కూడా నీవు చెప్పిన మాటలు విన్నాను.

వ్యా: భూతము అంటే అయినది అని అర్థం ఉన్నది చైతన్యం. అయినది భూతము చైతన్యమే భూతాలుగా తయారౌతున్నది.

భవ అంటే కావడం అంటే ఉత్పత్తి కావడం అప్యయం అంటే మళ్లీ వెనుక దానిలో చేరడం అంటే రెండుగా లేనిది రెండుగా కావడం. లేదా ఊరికే ఉన్నది. ఏదో ఒక రీతిగా ఒక ఆకృతి నెత్తడం. కరిగిన నెయ్యిలాగా ఆకృతి హరించిపోవడం. నెయ్యి పేరుకున్నట్లు పూర్వస్థితిలో చేరడం. యథాత్వాన్ని పొందడం.

కమల పత్రాక్ష అని సంబోధించడంలో విశేషముంది. సూర్యుని వెలుగు సోకి కమలాలు విడిపోతాయి. అది వఱకు దాకా మూతిముడుచుకొని ఉన్న మొగ్గ వికాసం చెంది అందంతో ఆకర్షణతో నిండిపోతుంది. సూర్యమండలాంతర్వర్తినియైన చైతన్యశక్తిని చూచే చైతన్యశక్తి కలదౌతుంది కమలం. అమ్మ అన్నట్లు సూర్యకాంతికి వికసింపజేసే శక్తి ఉన్నా వికసించే శక్తి కమలానికి ఉంటే తప్ప పుష్పవికాసం భూతవికాసం జరగదు. ఈ వినిమయశక్తిని తనలో గుర్తించిననాడు భూతం తనను

వికసింపజేస్తున్న మహాశక్తిని గూడా గుర్తించే సామర్థ్యం కలదౌతుంది. పరమాత్మనే నేత్రాలతో ఈ వినిమయశక్తిని గుర్తించగలిగాడనీ, సూర్యమండలాంతరితమైన ఆ మహాచైతన్య స్ఫురణ అతని కనులకు కలిగి రాబోయే విశ్వరూప సందర్శనానికి అతడు పక్వదశలో ఉన్నాడనీ కమల పత్రాక్ష అనే సంబోధన వలన సూచిత మౌతుంది.

3. ఏవమేత ద్యథాఽఽ త్థ త్వ మాత్మానం పరమేశ్వర!।
ద్రష్టుమిచ్ఛామి తే రూప మైశ్వరం పురుషోత్తమ!।।

తా: పురుషోత్తముడవు, పరమేశ్వరుడవు అయిన శ్రీకృష్ణా! నీవు ఆత్మ స్వరూపాన్ని గూర్చి చెప్పినదంతా సరే! కాని నీ ఆత్మవిభూతి ఏయే రూపములు కల దాన్నిగా ఇంతవఱకు నీవు చెప్పావోదాన్ని చూడాలని కోరికగా ఉంది.

వ్యా: 10వ అధ్యాయంలో 42వ శ్లోకంలో ఏకాంశేన స్థితో జగత్! ఈ జగత్తంతా నా విభూతిలోని నాలుగో వంతుతోనే భరిస్తున్నానని పరమాత్మ చెప్పారు. జగత్తు అంతులేనిది. నక్షత్ర మండలాలు, గెలక్సీలు, పాలవెల్లి గుంపులు మనకు కనిపించే ఆకాశంలోనే అనంతంగా ఉన్నాయి. అటువంటి ఆకాశాలు అనంతంగా ఉంటాయి. ఒక విశ్వంలో, అలాంటి విశ్వములనంతంగా ఉంటాయి. ఒక బ్రహ్మాండంలో అలాంటి బ్రహ్మాండాలు అనంతంగా ఉంటాయి ఒక కల్పంలో. ఇట్టి దృశ్యమాన భావ్యమాన కల్పాలెన్నో ఒక జగత్తులో. అట్టి జగత్తును నా విభూతిలో నాలుగో వంతుతోనే భరిస్తున్నానని చెప్పేసరికి ఆ మహాదృశ్యాన్ని ఒకసారి కంటితో చూడాలనిపించింది అర్జునునికి పరమాత్మ దాన్ని అనుగ్రహించాడు.

అమ్మ ఒకరికి ఒక క్షణంలో దివ్యదర్శనం ఇస్తుంది. వానిని ఆకాశోన్నతమయిన విశ్వాసపీఠంపైన అధిష్ఠింపజేస్తుంది. అంతలోనే వారిని అవని మీదకు అవరోహింప జేస్తుంది. రెండు క్రియలూ అవ్యాజమే.

4. మన్యసే యది తచ్ఛక్యం మయా ద్రష్టు మితి ప్రభో!।
యోగేశ్వర! తతో మే త్వం దర్శ యాత్మాన మవ్యయం!

తా: యోగేశ్వరుడవు ప్రభుడవు అయిన శ్రీకృష్ణా! నేను చూడడానికి శక్యమయ్యేదని నీవు తలచినట్లైతే నాకు అవ్యయమైన నీ నిజస్వరూపాన్ని చూపించు.

వ్యా: యోగేశ్వర శబ్దంవల్ల పరమేశ్వరుని ఘటనా ఘటనా సామర్థ్యం వ్యక్తమౌతుంది. శిష్యస్తేహం శాధిమాం' అని లోగడ ఒకసారి చెప్పుకున్నాడు అర్జునుడు. గురుశిష్యన్యాయంలో శిష్యుని అధికారాన్ని గుర్తించి ఆ శక్తికి యోగ్యమైన దానిని

గురువు ప్రసాదించడమే తప్ప నాకిది చెప్పు అది చెప్పు అని శిష్యుడు గురువును వేధించడానికి వీలులేదు. అందుకని అర్జునుడు నమ్రతతో కోరరాని కోరికను కోరాను. నేను చూడడానికి సాధ్యమయ్యేదని నీకు తోస్తేనే నాకునీ విశ్వరూపాన్ని చూపించమన్నాడు.

అర్జునుని సాకారతత్వం నిరాకారతత్వంతో చేరడానికి ఉవ్విళ్ళూరుతున్నది. జడచైతన్యాలను కూర్చే విచిత్ర ఘటనకు యోగమని పేరు. ఈ యోగాన్ని చేసే విద్యకు ప్రభువూ, ఈశ్వరుడూ ఐనవాడు యోగేశ్వరుడు.

ఇంతవఱకు సంశయగ్రస్తమయి ఉన్న అర్జునుని మనస్సు ముందు ఆత్మ చైతన్యం యొక్క మహాప్రకాశాన్ని దీపింపజేయడం చీకటి వెలుగుల నొకచోట చేర్చడమే అవుతుంది. ఇదే యోగేశ్వరుడైన శ్రీకృష్ణుడు చేసిన పని. ప్రభువు అనే మాటకు సర్వ సమర్థుడని అర్థం. పై రీతిగా చీకటి వెలుగులనొకచోట చేర్చడం అమ్మ కూడా చేస్తూ ఉంటుంది.

తాను సర్వజ్ఞ అయి ఉన్నా

'నాది తెలిసీ తెలియని స్థితి' అంటుంది.

'నాకు తెలీదమ్మా' అంటుంది.

'నేనేమయినా చదువుకున్నానా!' అని ప్రశ్నిస్తుంది.

'నేనూ మీవంటిదాననే' అంటుంది పరిహాసంగా నాకంటే మీరే నయం అని చమత్కరిస్తుంది.

శ్రీభగవానువాచ

5. పశ్య మే పార్థ! రూపాణి శతశోఽథ సహస్రశః।
నానా విధాని దివ్యాని నానావర్ణాకృతీని చ॥

శ్రీకృష్ణ భగవానుడిలా చెప్పాడు.

తా: చూడు పార్థా అనేక విధాలైనట్టివీ, దివ్యములై నట్టివీ, పెక్కు రంగులూ ఆకృతులూ గలట్టివీ వందలు వేలూ అయిన సంఖ్యలలో అనంతంగా ఉన్నట్టివీ అయిన నా రూపాలను 'పశ్య' అని అద్భుతంగా మొదలు పెట్టారు పరమాత్మ.

వ్యా: విశ్వజననీత్వమే అమ్మ దాల్చిన విశ్వరూపం 'వీళ్లందఱూ పిల్లలేకాదు. నా అవయవాలు' 'మీరంతా నా అవయవాలనుకుంటున్నాను. చెయ్యినొప్పి కాలికి తెలియదు. కాలినొప్పి కంటికి తెలియదు. కాని అన్నింటి నొప్పి నాకు తెలుస్తుంది.

ఒక భక్తుడు 'మీ దృష్టిలో మనుష్యులూ ఇతర జంతువులూ ఒకటిగానే ఉన్నాయి కదా.' అని ప్రశ్నిస్తే అమ్మ 'అవి ఇతరమనిపించడం లేదు' అన్నది.

అనేక కోటి బ్రహ్మాండ జనన్యై నమః
విశ్వగర్భాయై నమః, సర్వ యోన్యై నమః॥

అనే లలితసహస్రనామాలకు అమ్మ ప్రతీక.

ఎంత అందమైన దర్శనం ఇదీ! జడమంటూ లేకుండా సర్వమూ చైతన్య మయాకృతి దాల్చి, గుర్తు కావాలనుకున్న చోట గుర్తయిపోతూ లావణ్యామే తన్ను తాను సృష్టిచేసుకొన్న రీతిగా శక్తిసారం తన్నుతాను ఆకృతించుకొన్న రీతిగా, అన్ని రంగులూ ఒక్క సూర్యకిరణ యోన్యుద్భవాలైనట్లుగా కనిపిస్తూ, చరాచర భూత జాలం సూర్యకిరణ గర్భమైపోతూ కంటికి కనిపించని ఒక ఎలక్ట్రానో ఫోటానో ఒకానొక తలపో అయిపోతూ చరాచర భూతజాలాన్ని నోరువిచ్చి మింగేస్తున్న దృశ్యం.

ఎంత అద్భుతమైనదీ? ఎంత ఘోరమయినదీ? ఈ అర్కకిరణంచేసే సృష్టి సంహారాలనే ఇంద్రజాలం అర్కపురిలో కేంద్రీకృతం గావడం! ఎంత ఆశ్చర్యకర మైనదీ? అర్కపురి అంటే అర్కదేహం అనే అర్థం. అర్కదేహంలో ప్రాణమే కార్బను సైకిలుగా మారిపోతూ జీవచైతన్య పూర్ణమైన జగచ్చక్రంలో రేపే బ్రహ్మాండమైన తుఫానులా, ఉల్లోల తరంగాలూ, క్రోనోస్ఫియరులో కనిపిస్తూ ఉంటాయి. అమ్మ ప్రసన్నవదనం నుంచి పెల్లుబికే వాత్సల్యజలధి కల్లోలాలకీ, క్రోనోస్ఫియర్ ప్రద ర్శించే కల్లోలాలకీ నాకు భేదం కనిపించదు.

సూర్యోపరితల భాగం నుంచి బయలుదేరిన ప్రచండ మార్తండ కిరణం అయో నోస్ఫియరు పొరలలో దూరి క్రిందకు దిగుతున్నప్పుడూ అక్కడ అది తన వేడిని ఇతర శక్తులతో పంచుకుంటున్నప్పుడూ ఇంకా క్రింది వాయుస్తరంలోకి దిగి గాలిని వెచ్చజేసి దాని పరుగుకాళ్లను పుట్టించేటప్పుడూ, సముద్రం మీదికి వాలి ప్రతీ కంకణంతోను ముద్దులాడి ఆనందంతో ప్రేల్చివేసి, ఆకాశానికి పంపుతున్నప్పుడూ, మూతి ముడుచుకున్న మొగ్గకొసమీద వాలి చక్కిలిగింతలు పెట్టి అమ్మ చెప్పినట్లు ఎవరూ చూడకుండా నవ్వించి కవ్వించి, కళాస్థానాల్లో గోళ్ళు గ్రుచ్చి, ఆనంద ఘనత్వంలో మాతృత్వాన్ని నిక్షేపిస్తున్నప్పుడూ ఇటువంటి గారడీలు విశ్వంలో అన్ని మూలలా ప్రతి సూదిమొన మోపినచోటునా, ప్రతీ అర్కకిరణం చేస్తున్న దృశ్యం తలుచుకుంటే ఎంత విభ్రాంతి కల్పిస్తుందీ! ఈ అంతటికీ మన ఎదుట కూర్చున్న

అమ్మా, అమ్మలోని మనమూ కారకులమూ, భాగస్వాములమూ అనే భావం కట్టె దుట నిలిచేసరికి మనస్సు ఎంత ఉక్కిరిబిక్కిరి అవుతుందీ?

6. పశ్యాదిత్యాన్ వసూన్ రుద్రా నశ్వినౌ మరుత స్తథా।
బహూన్యదృష్టపూర్వాణి పశ్యాశ్చర్యాణి భారత!॥

తా: అర్జునా! పం(డ్రెండుగురు సూర్యులను చూడు. ఎనిమిది మంది వసువులను చూడు. పదకొండు మంది రుద్రులను చూడు. ఇద్దఱు అశ్వినీదేవతలను చూడు. నలభై తొమ్మిది వాయువులను ఇది వఱకెన్నడూ చూడని ఆశ్చర్యకరములైన వింతల నిప్పుడుచూడు.

వ్యా: ఆదిత్య వసురూపాలను పితృదేవతలని వ్యవహరిస్తారు. అర్జునుడు బ్రతికి ఉండగానే పరమాత్మ చచ్చినవాళ్లను కూడా చూపించడం దీనిని బట్టి సమస్త విశ్వానికి ఈ సూత్రాన్ని అన్వయించుకోమన్నట్లుంది. ఏక విజ్ఞానేన సర్వవిజ్ఞానం.

అమ్బృణ మహర్షి కూతురిలా అన్నది.

'అహం మఖిలం జగత్। వేదోఽ హ మవేదోహం।
విద్యాఽ హ మవిద్యాహం। అజాఽ హమన
జాఽ హం। అథశ్చోర్ధ్వం చ తిర్యక్చాఽ హం।! అహం
రుద్రేభి ర్వసు భి శ్చరామ్యహ మాదిత్యై ఋత
విశ్వదేవైః। అహం మిత్రావరుణావుభౌభి
భర్మ్యహ మింద్రాగ్నీ। అహ మశ్వినా వుభౌ।
అహంసోమం త్వష్టారం పూషణం భగం
దధామ్యహం। విష్ణు మురుక్రమం బ్రహ్మాణ
ముత ప్రజాపతిం దదామి। అహం దదామి
ద్రవిణం హవిష్మతే సుప్రావ్యే యజమానా యసున్వతే।

దేవ్యుపనిషత్తు

సమస్త జగత్తును నేనే; తెలియబడుదానను నేనే; తెలియబడని దానిని నేనే; జ్ఞానాన్ని అజ్ఞానాన్ని నేనే; రూపాన్ని నేనే - పుట్టుక లేని దాన్ని నేనే: క్రిందును, మీదును, చుట్టుమనేనే; రుద్రులచేత, వసువులచేత అనుసరింపబడుచున్న దానను నేనే. నేను ఆదిత్యులచేత ఋతువులచేత, విశ్వదేవతలచేత, మిత్రావరుణులచేత సేవింపబడుచున్నదానను. ఇంద్ర అగ్నులను నేను, అశ్వినీ దేవతలిద్దఱినీ నేనే. నేను చంద్రుడిని. త్వష్టపూషలను ఇచ్చాను. లోకరక్షకుడైన విష్ణువును, సృష్టికర్త

అయిన బ్రహ్మదేవుడిని ఇచ్చాను. యజమానులచేత హవిస్సులను పొందాను' అని దేవ్యు పనిషత్తు చెబుతుంది. అమ్మ తానే దేవినని స్వయంగా చెప్పదు. కాని నేను తల్లిని అందఱు నా బిడ్డలంటుంది. ప్రత్యక్షంచేత పరోక్షాన్ని సాధించే మార్గంగా ఈ విశ్వజననీత్వం పరిణమిస్తుంది.

7. ఇహైకస్థం జగత్కృత్స్నం పశ్యాద్య సచరాచరమ్।
మమ దేహే గుడాకేశ యచ్చాన్యత్ ద్రష్టు మిచ్ఛసి॥

తా: నిద్రను జయించిన అర్జునా! చరాచరభూతజాలంతో నాదేహంలోనే సమస్త జగత్తూ ఏకస్థంగా ఉండడాన్ని చూడు. ఇది చూచిన తరువాత నీవింకో దాన్ని చూడగోరవు.

వ్యా: నిద్రను జయించిన అర్జునా! నిద్ర అచరానికి జాగ్రత్త చరానికి గుర్తు. భగవంతుని దేహంలో రెండూ ఏకస్థానంలో ఉంటాయి. గుక్కపట్టిన బొంగరం లాగా. అన్నిచోట్లా అన్నివైపులా ఎల్లప్పుడూ ఒకే విధంగా చలించే శక్తియే నిశ్చలన శక్తి. ఒకదశలో రెంటికీ భేదం లేదు, కొండలు కదలవనుకుంటాం. గ్లేసియర్ల చలనం వలన కొండల స్థానాలు మారవచ్చు. క్లామిడోమొనాస్, బట్టర్‌వర్ట్ అనే చెట్ల జాతులు నీళ్ళలో ఒక చోటి నుంచి ఇంకో చోటికి ప్రయాణం చేస్తాయి. సోమ లత జంగమలతయే. రామాయణంలోని కబంధుడు కదలడం చేతగాని అచర ప్రాణి.

అమ్మ సృష్టిలో జడ పదార్థమే లేదంటుంది. అంతా చైతన్యమే అంటుంది. అంతా చైతన్య మనుకునే పక్షంలో చరాచర ప్రశ్నేలేదు. ఈ భేదం వస్తుభేదం గౌణ భేదం అవుతుంది. ఈ రహస్యం తెలిసిన తరువాత, జగత్తులోని వస్త్వైక్యాన్ని లెస్సగా అవగాహన చేసుకున్న తరువాత, అంతా బ్రహ్మపదార్థమే అన్న జ్ఞానం స్థిరపడిన తరువాత ఈ రకమైన జగద్దృశ్యాన్ని చూచిన తరువాత మఱోదృశ్యాన్ని చూడగోరవు అని పరమాత్మ చెప్పారు. ఈ దర్శనం అందఱికీ సాధ్యమా అనే ప్రశ్నకు భగవానుడిలా చెప్పారు.

8. న తు మాం శక్యసే ద్రష్టు మనేనైవ స్వచక్షుషా।
దివ్యం దదామి తే చక్షుః పశ్యమే యోగ మైశ్వరమ్॥

తా: నీకున్న సామాన్య నేత్రాలతో నన్ను చూడలేవు. కాబట్టి నీకుదివ్యచక్షువుల నిస్తున్నాను. వాటితో నా యీశ్వరసంబంధమగు చీకటి వెలుగుల సంబంధాన్ని చూడుము.

ఐశ్వరం - అంటే జ్ఞానైశ్వర్య బలతేజశ్శక్తులు కలది అని అర్థం.

యోగం - ద్వంద్వ సమ్మేళన రూపమగు విభూతియోగం

'అజాయమానో బహుధా విజాయతే' పుట్టడంలేని వాడు అనేక రూపాలతో పుట్టుతున్నాడు' అంటే భిన్నత్వంలేని వానికి భిన్నత్వం కలుగుతున్నది అని అర్థం. దీనికి కారణం స్వచక్షువులతో తన్ను తాను చూచుకోవడం. చూచుకుని కనబడిన దృశ్యం అర్థం కాక భిన్నత్వం చెందడం. ఆత్మలో అంతరాత్మగా ప్రవేశించే ప్రయత్నమే స్వచక్షుర్దృష్టి ఫలితం. విశ్వరూప ప్రదర్శనంలోని మూలం చర్మచక్షువులతో atom Bomb లేక Hydrogen Bombల విస్ఫోటనాన్ని చూడలేము. 'అలాంటప్పుడు' 'దివి సూర్యసహస్రస్య' అంటే వేయి సూర్యులు బ్రద్దలై విజృంభిస్తే చర్మచక్షువులు దానిని చూడగలవా? ఏ filter గ్లాసులు పెట్టుకుని చూచినా ఆ పని సాధ్యం కాదు. కళ్లతో చూచిన దాన్ని మనస్సుతో త్రాగిన ఆనందించిన వైభవం విశ్వరూప సందర్శనం. ఈ మహా విస్ఫోటనంలో పరమాత్మ పాత్ర 99.9 వంతులు. 1 వంతు అర్జునుడిది. అది కూడా స్వయంగా చూచి ఉంటే అర్జునుడి కళ్ళుపోయి ఉండేవి. వాటిని కాపాడడానికి పరమాత్మ నీ స్వంతకళ్ళతో ఈ మహాప్రకాశాన్ని చూడలేవు. దివ్యచక్షువులనిస్తున్నాను దాని కోసమని ప్రేమతో చెప్పారు. వ్యష్టి సమష్టి దృష్టులు కలవడమంటే ఇదే. కనబడితే చూస్తారు. చూస్తే కనబడను అంది అమ్మ. ఇంకో మాటకూడా అన్నది. 'నాలో అంశాలు అన్నీ మీకు ఏ కొంచెమో ఇస్తే తప్ప మీరు నన్ను చూడలేరు.

సంజయ ఉవాచ:-

9. ఏవముక్త్వా తతో రాజన్ మహాయోగేశ్వరో హరిః।
దర్శయామాస పార్థాయ పరమం రూపమైశ్వరమ్॥

సంజయుడు చెబుతున్నాడు

తా: ఓ ధృతరాష్ట్ర మహారాజా! ఈవిధంగా చెప్పిన వాడై మహాయోగేశ్వరుడైన శ్రీకృష్ణుడు అర్జునుని కొఱకు పరమమూ, ఈశ్వర విభూతీ పూర్ణమూ ఐన విశ్వరూపాన్ని ప్రదర్శించాడు.

వ్యా: విశ్వరూపాన్ని వర్ణించిన వారు ఈ అధ్యాయంతో ముగ్గురు (1) పరమాత్మ (2) సంజయుడు (3) అర్జునుడు. సంజయుడైతే విశ్వరూప సందర్శనం చేసి పులకితగాత్రుడై చివరవఱకూ ఆ సంతోషాన్ని మఱచిపోజాలకపోయినాడు. అర్జునుడు సరేసరి. ఆ మహాంబుధిలో మునిగేపోయాడు. 10 అధ్యాయాల గ్రంథం

వినేసరికే గత మోహుడైనాడు అర్జునుడు. అదే విషయం ధృతరాష్ట్రుడు కూడా విన్నాడు. కాని గీతాబోధలు అతని మనసు మీద ఏమీ పనిచేయక ఊతి మీద పోసిన నీళ్ళై క్రిందికి జాటిపోయాయి. విశ్వరూపాన్ని పరమాత్మ చూపాడు అని చెప్పి ఆ సంతోషాన్ని పట్టలేక సంజయుడు పరమాత్మను వర్ణించుకుంటూ పోతాడు. ఇదంతా సేనయోరుభయోర్మధ్యే జరిగింది. అర్జునుడి కళ్లకూ సంజయుడి కళ్ళకూ మాత్రమే కనిపించింది. తక్కిన కళ్ళకు చేతిలో కొరడా పట్టుకొని, పీతాంబరం కుట్టుకొని, రథ్యాలు పట్టుకొని రథం మీద కూర్చున్న నీలమేఘశ్యామాకృతియే కన్పించింది. సంజయునికి కన్పించిన రూపం ఇలా ఉంది.

10. అనేక వక్త్ర నయన మనే కాద్భుత దర్శనమ్।
అనేక దివ్యాభరణం దివ్యా నేకోద్య తాయుధమ్॥

తా: లెక్కలేనన్ని నోళ్ళూ, కళ్ళూ, అనేకాద్భుతకరములైన దృశ్యములూ, పెక్కు దివ్యాలంకారాలూ, దివ్యంగా ప్రకాశిస్తున్న అనేక దివ్యాయుధాలూ

11. దివ్యమాల్యాంబరధరం దివ్యగంధానులేపనం।
సర్వాశ్చర్యమయం దేవ మనంతం విశ్వతోముఖమ్॥

తా: దేవలోక సంబంధమైన పూలమాలలు ధరించినట్టిన్నీ దివ్యమైన చందన పువూతలను గల్గినట్టిన్నీ, అందటికీ ఆశ్చర్యాన్ని కల్పించేటటువంటిన్నీ, అంతములే నట్టిన్నీ, అన్నివైపులా మొగములగలట్టిన్నీ దేవుని అర్జునుడు చూచాడు.

12. దివి సూర్యసహస్రస్య భవే ద్యుగపదుత్థితా।
యది భా స్సదృశీ సా స్యాత్ భాసస్తస్య మహాత్మనః॥

తా: ఆకాశంలో వేయి మంది సూర్యులు ఒక్కసారిగా ఉదయించినట్లయితే, వారందటి కాంతీ కలసి ప్రకాశిస్తే ఆ మహాత్ముని తేజస్సుతో సమానమవుతుందేమో.

'సహస్ర శీర్షాపురుష స్సహస్రాక్ష స్సహస్రపాత్' అని పురుష సూక్తం.

ఇక్కడ సహస్రం అంటే వేయి అని అర్థం కాదు. లెక్కలేనన్ని అని అర్థం. లెక్కలేనన్ని సూర్యుల ప్రకాశంతో కూడా సమానం అవుతుందేమో అన్న అర్థంలో 'స్యాత్' అనే మాట ఉపయుక్తమైంది.

13. తత్రైకస్థం జగత్కృత్స్నం ప్రవిభక్త మనేకధా।
అపశ్య ద్దేవదేవస్య శరీరే పాండవ స్తదా॥

తా: అప్పుడు ఆ దేవదేవుని శరీరమునందు (ఆ విశ్వరూపమునందు) భిన్న భిన్న విభాగములు గల సమస్తజగత్తును ఒక్కచోట నున్న దానినిగా అర్జునుడు చూచెను.

వ్యా: రెండుకుండలను ఒకటిగాచేసి చూపమంటే మానవమాత్రులకు సాధ్యం కాదు కదా! రెంటినీ ఒకచోట పెట్టి ఒకటిగానే అనుకోమన్నా అనుకోవడం సాధ్యం కాదు గదా! అలాంటప్పుడు అనంత కోటి విభాగాలతో పృథక్ పృథక్‌గా ఉన్న జగత్సర్వాన్నీ పరమేశ్వరుని విశ్వరూపంలో ఏకత్రస్థంగా అర్జునుడు చూచాడంటే, ఈ అభూత సంఘటనకు పరమేశ్వరుడు తప్పవేఱొకడు కర్తకాగలడా?

ఇంతవఱకు పైమూడు శ్లోకాలలో చేయబడినది సంజయవర్ణనం. ఆ విశ్వ రూపం అర్జునుని మనస్సు మీద ఎట్టి ప్రభావాన్ని కలిగించినదీ ఈ దిగువ శ్లోకాలలో వర్ణించబడ్డది.

14. తత స్స విస్మయావిష్టో హృష్టరోమా ధనంజయః।
ప్రణమ్య శిరసా దేవం కృతాంజలి రభాషత॥

తా: విశ్వరూపసందర్శనానంతరం, విస్మయావిష్టుడై పులకితరోముడై, అర్జు నుడు శిరస్సుతో నమస్కరించి బద్ధాంజలియై ఈ విధంగా చెప్పాడు.

15. అర్జున ఉవాచ

పశ్యామి దేవాన్ తవ దేవ! దేహే
సర్వాం స్తథా భూత విశేషసంఘాన్।
బ్రహ్మాణ మీశం కమలాసనస్థం
ఋషీం శ్చ సర్వా నురగాం శ్చదివ్యాన్॥

అర్జునుడు చెప్పెను.

తా: దేవా! నీ దివ్యశరీరంలో సమస్తమైన దేవతలను, ప్రాణికోట్లను, పద్మా సనం మీద కూర్చున్న ప్రభువైన బ్రహ్మను, ఋషులను, దివ్యములైన సర్పాలను చూస్తున్నాను. ఎవరు ఎలా తలుచుకుని చూస్తే అమ్మ అలా కనిపిస్తుందంటారు. నీవు నా ఇష్టదేవతలాగా కనిపించావని అంటే, నీ ఇష్టదేవతే అమ్మలాగా కనిపిం చాడంటుంది అమ్మ.

16. అనేక బాహూదర వక్త్రనేత్రం
పశ్యామి త్వాం సర్వతోఽ నంతరూపం।

నాంతం న మధ్యం న పునస్తవాదిం
పశ్యామి విశ్వేశ్వర! విశ్వరూప!॥

తా: విశ్వేశ్వరా! విశ్వరూపా! అనేక బాహువులూ, కడుపులూ, నోళ్ళూ, కళ్ళు కలిగిన నీ అనంత రూపాన్ని నేను చూస్తున్నాను. నీ రూపానికి ఆది మధ్యాంతరాలు నాకు కన్పించుట లేదు.

వ్యా: 'సర్గాణామాదిరంతాశ్చమధ్యం చైవాహమర్జున' అని పరమాత్మ. ఆది మధ్యాంతాలూ తానే అని చెప్పి ఉన్నారు. 'నాంతం నమధ్యం నపునస్తవాదిం' అని అర్జునుడంటున్నాడు. రెంటికీ విరోధమేమీలేదు. ఆదిలో చూచినా పరమాత్మే మధ్యలో చూచినా పరమాత్మే అంతంలో చూచినా పరమాత్మే కనుక ఏకమేవా ద్వితీయం సిద్ధమౌతుంది. ఒకటికి రెండు కొసలు మధ్యభాగం కూడా ఉన్నాయి. ఆది మధ్యాంతముల ధ్యాసగలవాళ్ళకు ఆ మూడుగా పరమాత్మే కనిపిస్తాడని భావం.

17. **కిరీటినం గదినం చక్రిణం చ**
తేజోరాశిం సర్వతో దీప్తి మంతం।
పశ్యామి త్వాం దుర్నిరీక్ష్యం సమంతా
ద్దీప్తానలార్కద్యుతి మప్రమేయం॥

తా: కిరీటము, గద, చక్రమును ధరించినట్టినీ, తేజఃపుంజమైనటువంటిన్ని అన్ని వైపులకు ప్రకాశించుచున్నట్టిన్ని, దీప్తమైన సూర్యాగ్నులతో సమానమైనటు వంటిన్ని, ఎక్కడ హద్దులు కన్పించనట్టిన్ని నిన్ను, ఎల్లవైపులా చూస్తున్నాను.

18. **త్వమక్షరం పరమం వేదితవ్యం**
త్వ మస్య విశ్వస్య పరం నిధానం
త్వమ వ్యయ శ్శాశ్వత ధర్మగోప్తా
సనాతనస్త్వం పురుషో మతో మే.

తా: నీవు అక్షరుడవు; పరముడవు; తెలుసుకోదగిన వాడివి; ఈ విశ్వానికి మూలాధార స్థానానివి. అవ్యయుడవు శాశ్వతుడవు; ధర్మాన్ని రక్షించే వాడివి; సనా తనుడవు; పరమ పురుషుడవు; అని నామతము.

వ్యా: అక్షరుడు – అక్షరవిన్యాసంచేత తెలిసికోబడే అన్ని స్వరూపాలూ, అర్థా పత్తులూ, భావాలూ, అన్నీ నీవే! నాశంలేని వాడివి. వికారం లేనివాడివి.

పరమ: దానికంటె పైన లేనిదేదో అది ఐన వాడివి. వేదితవ్యం– ఎన్ని తెలుసు

కున్నా దేన్ని తెలుసుకోకపోతే తెలివి సంపూర్ణం కాదో ఆ వస్తువువి.

విశ్వస్యపరం నిధానం: జగత్తుకు పరమాత్మ ఉపాదాన కారణమా? నిమిత్త కారణమా? అనే చర్చ తెగని సమస్య. జగత్తే భగవంతుడు. భగవంతుడు జగత్తు కూడాను. అది కానిది ఇదేమీ లేదు. అనే అమ్మ వివరణం తెగతెంపులు ఐన సమస్య.

అవ్యయం: ఎంత ఖర్చుచేసినా ఖర్చు కానిది. జగత్తును ఎంత విస్తారంగా మృత్యువు తినేస్తున్నా తఱుగనిదీ. ఇంకా పెరిగేదీ. అన్నపూర్ణాలయంలోని వంటకాలు జగత్తులో తయారయ్యే వంటకాలే. వాటికి తఱుగూ ఒరుగూ లేదు.

శాశ్వతః: మనం అనుకునే కాలం దేనికి అందాండంగా ఉంటుందో ఆకలన వృత్తికి లక్షణమైనరుడు.

ధర్మగోప్తా: ఇన్ని గోళాలు రోదసిలో ఉన్నా ఒకదాని మీద మఱొకటి పడిపోవు. పడిపోకుండా రక్షించే ఆశక్తిని ఋతి అంటారు. నీటికి తడిపే ధర్మం, అగ్నికి కాల్చే ధర్మం ఆకాశానికి వ్యాపించే ధర్మం ఆ ఋతివల్లనే కలుగుతాయి. ఈ ధర్మాలు ఎలాగా వాని యందు గుప్తపఱచబడి ఉన్నాయో మనకు తెలియదు. కాని ఆ నియ మన ధర్మాన్ని కాపాడేవాడు అని అర్థం ధర్మగోప్తా అనే మాటకు.

సనాతన: కాలవ్యాప్తిలో మన ఊహకందనిది. బహుపురాతనమైనది.

పురుషః: కారణ కారణుడవు.

19. అనాది మధ్యాంత మనంతవీర్యం
అనంతబాహుం శశిసూర్యనేత్రం।
పశ్యామి త్వాం దీప్తహుతాశవక్త్రం
స్వతేజసా విశ్వమిదం తపంతం॥

తా: ఆదిమధ్యాంతాలు లేనివాడివీ, అపరిమిత వీర్యవంతుడవూ, అసంఖ్యాక మైన బాహువులు కలవాడివీ, చంద్రుడూ, సూర్యుడూ నయన ద్వయంగా కల వాడివీ, స్వకీయమైన తేజస్సుతో బ్రహ్మాండాన్ని తపింపజేస్తున్నవాడివీ, ప్రజ్వలించు చున్న అగ్నివంటి ముఖం కలవాడివీ అయిన నిన్ను చూస్తున్నాను. శశిసూర్యనేత్రం అనడంవల్ల జగత్ ప్రహ్లాదన జగత్తాపనత్వాలు సూచించబడుతున్నాయి.

20. ద్యావా పృథివ్యో రిద మంతరం హి
వ్యాప్తం త్వయైకేన దిశశ్చ సర్వాః।

దృష్ట్వాద్భుతం రూపముగ్రం తవేదం
లోకత్రయం ప్రవ్యథితం మహాత్మన్॥

తా: మహాత్మా! సర్వదిక్కులూ, భూమ్యాకాశాల మధ్య ఉన్న ఈ అంతరాళమూ, నీ ఒక్కనిచేతనే వ్యాపించబడి ఉన్నది. ఈ నీ భయంకరమైనట్టీ, అద్భుతమైనట్టీ, ఉగ్రాకృతిని చూచి, ముల్లోకాలు వ్యథ చెందుతూ ఉన్నాయి.

లలితాంబగారు అసలు రూపం చూపిస్తేగానీ అన్నారు. అమ్మ 'అసలు రూపం ఏ చూస్తావు?

దుర్గాష్టమినాడు మామూలుగా వస్తేనే భయపడ్డారు. లలితాంబగారు నవమి నాడు కిరీటం పెట్టుకొని, నల్లచీరకట్టుకుని, జుట్టువిరబోసుకుని వస్తుంటే వళ్ళు ఝల్లుమంది.

21. అమీ హి త్వాం సుర సంఘా విశంతి
కేచి ద్భీతాః ప్రాంజలయో గృణంతి।
స్వస్తీ త్యుక్త్వా మహర్షి సిద్ధసంఘాః
స్తువన్తి త్వాం స్తుతిభిః పుష్కలాభిః॥

తా: ఇక్కడే ఈ యుద్ధభూమిలో ఉన్న దేవతా సమూహాలు నీలో ప్రవేశిస్తు న్నాయి. కొందఱు భయపడిపోయిన వారు దోసిలొగ్గి నిన్ను స్తుతిస్తున్నారు. మహ ర్షులూ సిద్ధసంఘములూ స్వస్తి స్వస్తి! లోకానికి క్షేమం కలుగునుగాక అని పలికి సంపూర్ణ భక్తితో నిన్ను పూర్ణస్తోత్రాలు చేస్తున్నాను.

వ్యా: ఆ యుద్ధభూమిలో కౌరవ పాండవపక్షాలకు చెందిన సేనలూ, యోధులూ బలగమే కాకుండా, ఆ యుద్ధాన్ని చూడడానికి వచ్చి అదృశ్యులై ఇక్కడా అక్కడ తిరుగాడుతుండే దేవతా సమూహాలు, కూడా ఉన్నారు. వాళ్లు ఇంతవఱకూ ఇలా విశ్వరూప సందర్శనమౌతుందని అనుకుని ఉండలేదు. ఒక్కసారిగా దైవీయ ప్రకృ తిలో జఱిగిన ఈ అద్భుత సంఘటనకు ప్రమాన్పడి, ఏదో ఇల్లు తగలడుతుంటే అందఱూ ఆర్పడానికి వచ్చి ఆ ఇంట్లోనూ బైటా దూఱి అవసరమైన పనులను చేస్తున్నట్లు, దేవతలలో కొంత మంది వచ్చి ఆ విశ్వరూపంలో ప్రవేశించారు. కొందఱు బయట ఉండి స్తుతింపసాగారు. ఋషులూ సిద్ధసమూహాలూ స్తోత్రాలను చేశారు.

22. రుద్రా దిత్యాః వసవో యే చ సాధ్యా
విశ్వేఽ శ్వినౌ మరుతశ్చోష్మపాశ్చ।

గన్ధర్వ యక్షాసుర సిద్ధ సంఘాః
వీక్షంతే త్వాం విస్మితాశ్చైవ సర్వే॥

తా: రుద్రులు, సూర్యులు, వసువులు, సాధ్యులు, విశ్వేదేవతలు, అశ్వినీదేవతలు, వాయువులు, పితృదేవతలు, గంధర్వులు, యక్షులు, రాక్షసులు, సిద్ధులు, మొదలగు వారి సమూహాలు, ఆశ్చర్యచకితులై అందఱూ నిన్ను చూస్తున్నారు.

ఊష్మపాః అంటే వేడి పదార్థములనే తినేవాళ్ళు. పితృదేవతలు. 'ఊష్మభాగాహి పితరః' అని శ్రుతి. పితృదేవతలు చల్లబడ్డ వంటకాలను తినరని శాస్త్రం.

23. రూపం మహత్తే బహువక్త్రనేత్రం
మహాబాహో! బహుబాహూరు పాదం।
బహూదరం బహుదంష్ట్రాకరాళం
దృష్ట్వా లోకాః ప్రవ్యథితా స్తథాహం॥

తా: ఓ పెద్ద బాహువులు కలవాడా! అనేక ముఖాలు, నేత్రాలు కలిగినట్టిదే, అనేకములైన తొడలు పాదములూ గలట్టిదీ, అనేకాలైన కడుపులు కోరలూ గలట్టిదీ, భయంకరమైనదీ, చాలా గొప్పదయినదీ అయిన నీ భీతావహరూపాన్ని చూచి లోకాలు హడిలిపోతున్నాయి. అలాగే నేనూ అవుతున్నాను.

కోటాను కోట్లయిన జీవుల తలలే విరాడ్రూపపుతలలు. కోటాను కోట్లయిన జీవుల, ముఖాలూ, నేత్రాలూ, తొడలూ, పాదాలూ, కడుపులూ, కోరలూ, అవయవాలే విరాడ్రూపమైన పరమాత్మ అవయవాలు.

అపాణి పాదో జవ నోగ్రహీతా
పశ్య త్యచక్షుః సశ్రుణోత్యకర్ణః

అని ఉపనిషత్తు

చేతులు కాళ్ళు లేకుండా గ్రహిస్తాడు. పాదాలు లేకుండా చలిస్తాడు. కళ్ళు లేకుండా చూస్తాడు. చెవులు లేకుండా వింటాడని కాని అర్థం.

జీవుల అవయవాలే పరమాత్మ అవయవాలు అయినప్పుడు ఇంకా ప్రత్యేకంగా పరమాత్మ అవయవాల ప్రసక్తి ఎందుకు?

దేశాంతర కాలాంతర జ్ఞానాన్ని అమ్మ ప్రదర్శించినప్పుడు, ఇంకోచోట జరిగిన ప్రసంగాలను కాని, వృత్తాంతాలనుగాని అమ్మ ఉటంకించి నప్పుడు, నీకీ విషయం ఎలా తెలిసిందమ్మా అని ఆమెను అడగ్గా, మీతోబాటు నాలుగో దాన్ని నేనూ

ఉన్నానుగా అని అమ్మ బదులు చెప్పింది. ఈ సర్వాంతర్యామిత్వం కాలాతీతత్వం అందరికీ విశదమైనదే. దీని వలన లోకం విస్తుబోవడం సహజమే.

24. నభ స్పృశం దీప్తమనేకవర్ణమ్
వ్యాత్తాననమ్ దీప్త విశాలనేత్రమ్।
దృష్ట్వా హి త్వాం ప్రవ్యథితాంతరాత్మా
ధృతిం న విందామి శమం చ విష్ణోః॥

తా: విష్ణోః విష్ణుమూర్తీ. ఆకాశాన్ని తాకుతున్నట్లే అనేకములయిన రంగులతో ప్రకాశిస్తున్నట్లే, తెఱిచికొన్న నోళ్ళు కలిగినట్టీ, ప్రజ్వలిస్తున్న విశాలములయిన కన్నులు కల్గినట్టీ నిన్ను చూస్తేనే నా అంతరాత్మ హడిలిపోతున్నది. ధైర్యమూ శాంతీ నాకు దొరకడం లేదు.

విష్ణో– సర్వవ్యాపివైన శ్రీ కృష్ణా! అని సార్ధకమైన సంబోధన చేశాడు అర్జునుడు. క్రిందటి శ్లోకంలో అయితే ముందుగా లోకాలన్నీ భయపడిపోతున్నాయని చెప్పాడు. మఱి నాన్నా! నీ సంగతి ఏమిటి అంటారేమోనని ఆఖరు మాటగా 'తథాహం' అని మూడక్షరాలు తగిలించి నేనూ అలాగే అవుతున్నానని లోకాలతో తనను కూడా కలుపుకున్నాడు. ఈ శ్లోకంలో అయితే నిర్మొహమాటంగా, ఖచ్చితంగా, మహాప్రభో! ఆకాశమునంటే ఆ నీ రూపాన్నీ, దిశలన్నీ ఒకటిగా చేస్తున్ననీ కళ్లనీ, చూచేసరికి నా మనస్సు ధైర్యం కోలుపోయి గజగజలాడుతున్నది. ధృతిం నవిందామి. ధృతి అంటే పట్టు. కాలికి పట్టు దొరకడంలేదు. మనస్సుకు శాంతి లేకుండా దడదడలాడిపోతున్నదని స్పష్టంగా అర్జునుడు ఆవేదన చెందనారంభించాడు. అమ్మ దగ్గఱకు వచ్చేవాళ్ళకు ఇలాంటి అనుభవం క్రొత్తది కాదు.

25. దంష్ట్రాకరాళాని చ తే ముఖాని
దృష్ట్వైవ కాలానిల సన్నిభాని।
దిశో న జానే న లభే చ శర్మ
ప్రసీద దేవేశ! జగన్ని వాస!॥

తా: దేవతలకు ప్రభువా! జగత్తే నివాసమైన వాడా! కోఱలతో నిండి భయంకరమై ప్రళయాగ్ని సదృశ్యంగా మండిపోతున్న నీ భయంకరముఖాలను చూచి నాకు దిడి తప్పిపోతున్నది. దిగ్భ్రమ కలుగుతున్నది. ఏవిధంగానూ సుఖంలేకుండా ఉన్నాను ప్రసన్నుడవు కమ్ము.

వ్యా: అర్జునుడికి పూర్వం కలిగిన విషాదమోహం ఈ షాకుతో ఎగిరిపోయింది. ఇప్పుడు కట్టెదుట ప్రళయాగ్నిలా మండిపోతూ అనేకంగా వంగిన

పండ్లతో భగభగమంటూ వికృతం గా తెఱచుకొని నానా దిశలకు విప్పళించు కుంటున్న విరాట్స్వరూపుని ముఖాలను చూచేసరికి తూర్పేదో పడమర ఏదో తెలీయ కుండాపోయింది. దేవతా స్థాయిని కూడా దాటిపోయింది అతని ఊహాప్రపంచంలో పరమాత్మ ఔన్నత్యం. దేవేశా! అని సంబోధించాడు. జగన్నివాసా! నన్ను కరుణించు. నాకు ప్రసన్నుడివి కావోయి. అని ప్రార్థించడ మారంభించాడు.

అమ్మను గూర్చి డాక్యుమెంటరీ చిత్రం విడుదల అయిన రోజుల్లో సంగతి. రామచంద్రన్ అనే డిస్ట్రిబ్యూటరు ఆ చిత్రానికి రైట్సు సంపాదించుకొని దానితో నాలుగు రాళ్ళు సంపాదించుకొని వెనకేసుకుందామనుకొని జిల్లెళ్ళమూడి చేరాడు. అమ్మ ముందఱ అందఱితో బాటుకూర్చుని ఈ విగ్రహమే నా రాజరాజేశ్వరిది? అనుకుని వెకిలిగా తలపోయడ మారంభించాడు. క్షణంలో అమ్మ కూర్చున్నచోట అమ్మ కనిపించలేదు. అతని ఒంటినిండా చెమటలు పోశాయి. ఒక పెద్దవ్యాఘ్రం వికృతంగా కళ్లూకోఱలూ తెఱచి గాండ్రు మంటూ అమ్మ ఉన్న చోట కనిపించింది. 'వ్యాత్తాననమూ దీప్త విశాలనేత్రమూ, కాలానిల సన్నిభమూ, దంష్ట్రాకరాళ ఘోరమూ అయిన ఆశార్దూలాకారాన్ని చూచి ఒక్క నిమిషం కూడా అక్కడ నిలువ కుండా పరుగులంకించుకొని పాఱిపోయాడట. ఇంకా సికిందరాబాదులో అతడు న్నాడని ఆమాట తలుచుకుంటే గజగజ వణికిపోతాడనీ, రామ చంద్రన్‌ను గూర్చి శ్రీపాద గోపాలకృష్ణమూర్తి గారు చెప్పారు.

26. **అమీ సర్వే ధృతరాష్ట్రస్య పుత్రాః**
సర్వై స్స హైవావనిపాలసంఘైః।
భీష్మోద్రోణ స్సూతపుత్రస్తథాఽ సౌ
సహాస్మదీయైరపి యోధముఖ్యైః॥

27. **వక్త్రాణి తే త్వరమాణా విశంతి**
దంష్ట్రాకరాళాని భయానకాని।
కేచి ద్విలగ్నా దశనాంతరేషు
సందృశ్యన్తే చూర్ణితై రుత్తమాంగైః॥

తా: ఇక్కడ ఉన్న ధృతరాష్ట్రుని కొడుకులందఱున్నూ, భీష్ముడు, ద్రోణుడు, సూతపుత్రుడు అయిన కర్ణుడూ, సమస్త రాజ సమూహాలతో సహా, అదే ప్రకారంగా మన పక్షంలో ఉన్న యోధముఖ్యులు కూడా, కోఱలచే భయంకరములైన నీ

నోళ్ళలోనికి త్వరత్వరగా ప్రవేశిస్తున్నారు. అందులో కొందఱు నీ పండ్ల మధ్యన చిక్కుబడడం వలన వారి తలపండ్లు గుండగుండగా చితికిపోయి కనబడుతున్నవి.

వ్యా: ఇది విశ్వరూప సందర్శన ఘట్టంలో అత్యాశ్చర్యకరమూ, అతి ఘోరమూ, విభ్రమాస్పదమూ, బీభత్సధ జనకమూ, అయిన దృశ్యం. ఇంతవఱకు బోధించిన విషయాలన్నీ ప్రత్యక్షంగా జరిగిపోతున్న దృశ్యాన్ని అర్జునుడు చూస్తున్నాడు. ఒకవంక ధనుష్పాణులై, యోద్ధుకాములై, సజీవులై నిలిచి ఉన్న భీష్మద్రోణ కర్ణాది మహావీరులూ, వారి కభిముఖులై నిలిచిన ధృష్టద్యుమ్నాది మహావీరులందఱూ కనిపిస్తున్నారు. ఇంకో వంకవాళ్ళే మహోఝంఝూ మారుతంచేత తఱుమబడ్డ గడ్డిపరకల్లా పరిగెత్తుకుంటూ వచ్చి పరమాత్మ ముఖగహ్వరంలో జాఱబడుతున్నారు. తాను వారి కాగతిని తప్పించుదామన్నా తప్పించే బలం తనకులేదు.

ఒక వంక బ్రతికి ఉండి కేరింతాలు కొడుతున్న జయేచ్ఛా సహిత జీవ దృశ్యమూ, వేఱొకవైపున వారికి కాబోయే అప్రతిహతమైన మృత్యుదృశ్యం ఈరెంటినీ ప్రక్క ప్రక్కలలో చూచేసరికి అర్జునుని మనస్సులో పేరుకుని ఉన్న అంధకారం పటాపంచలైంది. అంతేకాక ఈ మహామృత్యుశక్తిని చూచేసరికి అతడు భయవిహ్వలుడైపోయాడు. తాను గాండీవం పట్టుకోగలిగినా, ఈ మహాశక్తి ప్రేరణ బలంవల్లనే, తానుపోరాడనని ఊరుకుందామనుకున్నా ఆశక్తి ఇచ్ఛప్రేరణ ఇంకోవిధంగా ఉంటే తానేమీ దానికి విరుద్ధంగా చేయజాలడనే భావం దృఢపడిపోయింది అతని మనస్సులో ఈ దృశ్యంవల్ల, ఈ పర్యవసనాన్ని తలపెట్టియే పరమాత్మ ఇంతవఱకు గీతను బోధిస్తూ వచ్చాడు. అదే జరిగింది.

28. యథానదీనాం బహవో౽ మ్బువేగాః
సముద్ర మేవాభిముఖా ద్రవంతి।
తథా తవామీ నరలోక వీరాః
విశంతి వక్త్రాణ్యభి విజ్వలంతి॥

తా: ఏవిధంగా నదుల యొక్క ప్రవాహవేగాలు సముద్రం వైపునకు ప్రవహించి అందులో ప్రవేశించి సముద్ర రూపాన్నే పొందుతాయో ఈ నరలోక వీరులందఱూ నీ వివృతవక్త్రంలో ప్రవేశించి నీ రూపాన్నే పొందుతున్నారు.

29. యథా ప్రదీప్తం జ్వలనం పతంగాః విశంతినాశాయ సమృద్ధవేగాః।
తథైవ నాశాయ విశంతిలోకా స్తవాపి వక్త్రాణి సమృద్ధవేగాః॥

తా: మండుచున్న అగ్నిలో మిడతలు ఏవిధంగా ఆత్మనాశనం కొఱకు

మహత్తరవేగంతో పడుతున్నవో అదేవిధంగా ఈ లోకాలు మహావేగంతో ఆత్మనాశనాన్ని కోరియే నీ వక్త్రములందు జొఱబడుచున్నవి.

వ్యా: సముద్రంలో నదులు పడడం సహజమైన వృత్తాంతం అబుద్ధిపూర్వకమైన క్రియ. ఎవడూ వెళ్ళి నదులను మెడపట్టి, గెంటి సముద్రంలో పడెయ్యడు. బుద్ధిని మించిన సహజజ్ఞత జంతువులకు క్రిమికీటకాలకూ ఉంటుంది. మానవ బుద్ధిని మోసగించినట్లు ప్రకృతి శక్తులు వాటిని పెడత్రోవను బెట్టలేవు. కాని మిడతకు అగ్నిలో దూకడం లక్షణం. చావడమూ తప్పనిసరే. దీన్ని బుద్ధి పూర్వప్రవేశంగా చెబుతారు వ్యాఖ్యాతలు. పై ఉదాహరణలలో అంబువేగం, ఆత్మహాని స్వభావము ప్రకృతి లక్షణాలుగా చెప్పబడ్డాయి. రెండోవైపున ఉన్నది చావే. ప్రకృతికి రెండో వైపు చావనే గుర్తించేది.

30. లేలిహ్యసే గ్రసమాన స్సమంతా
ల్లోకా సమగ్రాన్ వదనై ర్జ్వలద్భిః
తేజోభి రాపూర్య జగ త్సమగ్రం
భాసస్తవోగ్రాః ప్రతపన్తి విష్ణో!॥

తా: హేవిష్ణో! నీవుతింటూ ఉన్న ఈ రాజలోకం నెత్తురు క్రక్కుకుంటున్నది. ఆ రక్తం నీ పెదవులకంటుకోగా నాలుకతో దానిని నాకుతున్నావు. ఈ విధంగా మండుతున్న నోళ్ళతో ఈ లోకాలను మ్రింగుతున్నావు. ఈ సమస్త జగత్తును భయంకరములైన నీకాంతుల చేత నింపి తపింపజేస్తున్నావు.

వ్యా: సంహారం ఘోరంగానే ఉంటుంది. పరమాత్మ ఘోరస్వరూపుడు కూడాను.

31. ఆఖ్యాహి మే కో భవా నుగ్రరూపో
నమోஉస్తు తే దేవవర! ప్రసీద!
విజ్ఞాతు మిచ్ఛామి భవన్త మాద్యం
న హి ప్రజానామి తవ ప్రవృత్తిమ్॥

తా: ఓదేవతా శ్రేష్ఠుడా! నీకు నమస్కారము. ఆదిపురుషుడవైన నిన్ను తెలుసుకోగోరుచున్నాను. నీ చర్యనాకేమీ బోధపడడంలేదు. భయంకరాకారంగల నీవెవరవో నాకు చెప్పుము నన్ననుగ్రహింపుము.

వ్యా: విశ్వరూప సందర్శనం ఒక్క అర్జునునికే ముఖ్యంగా లభించినది. అయి

నప్పటికీ భవిష్యద్విధిహతులైన రాజలోకం యొక్క పాత్రలన్నీ అందులో పాల్గొన్నవి. ఈవిధంగా భవిష్యత్కాలాన్ని వర్తమాన కాలాన్ని జతకూర్చి అన్నింటిని ఏకంగా భూతకాలానికి గుదిగ్రుచ్చి చూపాడు కృష్ణపరమాత్మ. అందువల్లనే వచ్చే శ్లోకంలో పరమాత్మ నేనుకాలాన్ని - కాలోస్మి అని చెప్పబోతారు.

శ్రీభగవానువాచ

32. కాలోఽ స్మి లోకక్షయకృ త్ప్రవృద్ధో
లోకాన్ సమాహర్తు మిహ ప్రవృత్తః।
ఋతేఽ పి త్వాం న భవిష్యన్తి సర్వే
యేఽ వస్థితాః ప్రత్యనీకేషు యోధాః॥

భగవానుడు చెప్పెను.

తా: లోకనాశనం చేయడం కోసం వృద్ధి పొందిన కాలస్వరూపుడైన మృత్యువును నేను. లోకాన్ని నాశనంచేయడానికే నేనిక్కడ వర్తిస్తున్నాను. ఎదుటిసైన్యంలోని యోధులెవరూ నీవు లేకపోయినప్పటికీ ప్రాణాలతో మిగిలి ఉండరు.

వ్యా: సంవర్తక మేఘాలు క్రిందనున్న ఒక ధూళికణంతో మాట్లాడుతున్నట్లున్నదీ శ్లోకం. నీవు ఉన్నా లేకపోయినా నాకేం లెక్కలోనిదికాదు. ప్రళయం తెచ్చి లోకాన్ని నాశనంచేసి తీరుతాను. నీకింత శక్తి ఉందా అనే సందేహం రాకుండా మొదటనే లోకాలను నాశనం చేయడానికి వ్యాపించి ఉన్నకాలుడిని. మహామృత్యువును, నేను అని తానెవరో తన శక్తి ఏమిటో చక్కగా నిస్సందేహంగా తెలియజెప్పాడు. నీవు సామాన్యంగా కాలుడవుకావచ్చును. నీకెంత శక్తో ఉండనువచ్చును. కాని మాకేం భయమయ్యా అనుకోకుండా నేను నిద్రబోతున్న మృత్యువును కాను. లోకనాశనం చెయ్యడానికి సంకల్పించుకొని వ్యగ్రమైన శక్తితో బయలుదేరిన మహామృత్యువును అని కూడా తెలియజేశాడు. లోకాల్ని ఎక్కడో నాశనం చేస్తే ఇక్కడ మేము బ్రతికి బయటబడవచ్చుకదా. నేను నిమిత్త కారణంగా కూడా కత్తి ఎత్తను గదా అని అర్జునుడు అనుకోకుండా నీవున్నా లేకపోయినా నీవు కలుగజేసుకోకపోయినా వీళ్ళిక ప్రాణాలతో ఉండేవాళ్ళు కారని అప్రతిహతమైన విధి నిర్ణయాన్ని పరమాత్మ అర్జునుడికి స్పష్టం చేశారు. ఈ శ్లోకంలోని అర్థం అర్జునుడికి కొట్టవచ్చినట్లుగా కనిపిస్తున్నది.

ఇక్కడ ఉండే యోధుల దేహాలు ఇక్కడే ఉన్నా ఆదేహాలలోని భవిష్యద్గతి పరిగెత్తుకుని వచ్చి నాలో కలిసింది. నా కోఱల్లో చిక్కు బడినలిగిపోతున్న వాళ్ళతల పండ్లను చూచావు. నేను నాశనం చెయ్యాలనుకోకపోతే ఈ యుద్ధమే వచ్చేది కాదు.

ఇందులో నీవు వేలుపెట్టినా పెట్టకపోయినా ఈ రాజలోకం చావడం ఆగదు. నీ పాత్ర ఇందులో ఎంత ఉందో ఇప్పుడైనా అర్థం చేసుకోమన్నట్లుంది. లెక్కకు రాని దాన్ని లెక్కకు తెప్పించేది కాలం. కలయతీతి కాలః.

33. తస్మా త్వ ముత్తిష్ఠ. యశో లభస్వ
జిత్వాశత్రూన్ భుంక్ష్వ రాజ్యం సమృద్ధమ్।
మయైవైతే నిహతాః పూర్వమేవ
నిమిత్తమాత్రం భవసవ్యసాచిన్॥

తా: కాబట్టి ఓ సవ్యసాచీ! శత్రువులను గెలిచి సమృద్ధమైన రాజ్యాన్ని అనుభవించు. యశస్సుచేపట్టు. ఇంతకుముందే వీళ్ళందరూ నాచేత చంపబడి ఉన్నారు. లోకసంహారానికి నిమిత్తమాత్రుడివి కావడానికి బాధపడకు.

వ్యా: నా విశ్వరూపంలో నీవు వేయబోయే బాణాలు తగలకుండానే నా కోఅల మధ్య తలపండ్లు చిదికిపోతున్న రాజలోకాన్ని చూచావు. నిందలేనిదే బొంది పోదంటారు. ఏదో సాకు దానికుండి తీరాలి కనుక నీవాదేహాలను తెగెయ్యడానికి పూనుకో. శత్రుబలాన్ని సంహరించిన యశస్సును, రాజ్యాన్నీ అనుభవించి వ్యర్థమైన ఆలోచనలు మానెయి. చేసేవాడూ, చేయించేవాడూ, వాడే అయినప్పుడు, నీకెలాంటి పాపపుణ్యాలూ లేవు.

అమ్మ

34. ద్రోణం చ భీష్మం చ జయద్రథం చ
కర్ణం తథాన్యా నపి యోధవీరాన్।
మయా హతాన్ త్వం జహి మా వ్యధిష్ఠాః
యుధ్యస్వ జేతాసి రణే సపత్నాన్॥

తా: ద్రోణుడు, భీష్ముడు, జయద్రథుడు, కర్ణుడు ఆదిగా గల యోధవీరులందఱు ఇదివరకే నాచే చంపబడ్డారు. వ్యథ చెందక యుద్ధం చెయ్యి. శత్రువులను నీవు జయిస్తావు. తప్పక జయిస్తావు. అన్నారు పరమాత్మ.

సంజయ ఉవాచ

35. ఏత చ్ఛ్రుత్వా వచనం కేశవస్య
కృతాంజలి ర్వే పమానః కిరీటీ।
నమస్కృత్వా భూయ ఏవాహ కృష్ణం

సగద్గదం భీతభీతః ప్రణమ్య.

సంజయుడు చెప్పెను.

తా: ఈ ప్రకారంగా చెప్పబడిన పరమాత్మ వచనములను విని, కిరీటి భయంతో గడగడలాడిపోతూ అంజలి ఘటించి మాటిమాటికీ నమస్కరిస్తూ తొట్రుపాటుగల గొంతుతో చెప్పబోయే రీతిగా శ్రీకృష్ణునితో అన్నాడు.

వ్యా: ఇది ఒక్కరి జీవన్మరణ సమస్య కాదు. కౌరవపాండవ బలాల జీవన్మరణ సమస్య. మనం జీవితం అనుకునేది. మృత్యువు యొక్క ఆహార సమస్య. సకల లోకాలలోనూ జీవితాలను ఎవరు నిర్ణయిస్తున్నారు? జగత్కార్యంలోని పరిణామానికి, నిర్వాణానికి కీలకమైన ప్రేరణ ఎవరిదని సమస్య. కర్తృత్వం తనది అనుకుని ధీమాతో విల్లమ్ములు పారేసి కూర్చున్న అర్జునుడు తాను మహామహులనుకుంటున్న భీష్మద్రోణుగతిని శాసించే శక్తి పరమాత్మదని తెలుసుకున్న తరువాత భీతభీతుడైనాడు. భీతభీత ప్రయోగంలోని అందాన్ని గమనించేది.

అర్జున ఉవాచ

36. **స్థానే హృషీకేశ! తవ ప్రకీర్త్యా**
జగత్ ప్రహృష్య త్యనురజ్యతే చ।
రక్షాంసి భీతాని దిశో ద్రవన్తి
సర్వే నమస్యన్తి చ సిద్ధసంఘాః॥

అర్జునుడు చెప్పెను.

తా: హృషీకేశా! నీ గొప్పకీర్తిచేత జగత్తు సంతోషిస్తున్నది. అనురక్తిని కూడా పొందుచున్నది. రాక్షసులు భయపడి దిక్కుల వెంటబడి పరిగెత్తుతున్నారు. సిద్ధ సమూహాలన్నీ నమస్కరిస్తున్నాయి. ఇది అంతా నీ మహత్తుకు తగియే ఉన్నది. ఎందుకంటే

37. **కస్మాచ్చ తే న నమేరన్ మహాత్మన్!**
గరీయసే బ్రహ్మణో௨ప్యాది కర్త్రే।
అనంత! దేవేశ! జగన్నివాస!
త్వ మక్షరం సదసత్తత్పరం యత్॥

తా: నమ అంటే నాది కానిది. ఈ భావంతోనే సిద్ధసంఘాలు నీకు నమస్కారం చేస్తున్నాయి. నాశరహితుడా! దేవతలకు ప్రభువైన వాడా! జగత్తే నీవైనవాడా! సత్తని అసత్తనేవి నీ బుద్ధులు. అక్షర స్వరూపాని కుపధాన భూతాలు. అంటే సదసదు

పధాన ద్వారాన అక్షరం సత్తనీ అసత్తనీ చెప్పబడుతుంది. నీవు సదసద్రూపుడవు. జగత్తే నీవై ఉన్నావు. నీవు కానిదీలోకంలో ఏదీలేదు.

38. త్వమాదిదేవః పురుషః పురాణ
స్త్వమస్య విశ్వస్య పరం నిధానమ్।
వేత్తాసి వేద్యం చ పరం చ ధామ
త్వయా తతం విశ్వ మనంతరూప॥

తా: మొదటి దేవుడవు. పురాణ పురుషుడవు. ఈ విశ్వమంతటికి అభిన్నంగా ఉన్న ఆధారానివి. జగత్తు అంతటికి మహానిధానానివి. తెలిసికొనే వాడవు. తెలుసు కోవలసినవాడవు. పరంధాముడవు. సమస్త విశ్వము నీతోనే నిండి ఉంది. విశ్వంలో కూడ నీవు నిండి ఉన్నావు.

34. వాయుర్యమోऽగ్ని ర్వరుణ శ్శశాంకః
ప్రజాపతి స్త్వం ప్రపితా మహశ్చ।
నమో నమస్తేऽస్తు సహస్రకృత్వః
పున శ్చ భూయోऽపి నమో నమస్తే॥

తా: నీవు వాయువువు; యముడవు; అగ్నివి; వరుణుడవు; చంద్రుడవు; ప్రజా పతివి; చతుర్ముఖ బ్రహ్మవు. అటువంటి నీకు వేయిసార్లు నమస్కారములు. తిరిగి నమస్కారము. మఱొకమారు నమస్కారము.

వ్యా: పరమేశ్వరుడొక్కడే అయినప్పటికీ పెక్కు నామములతో వచించుటలోని అర్థం అన్ని నామములు అతనివే అని చెప్పడానికే. అన్ని పదముల అర్థమూ ఆ పరమాత్మలోనే పర్యవసిస్తుందని చెప్పడానికే

40. నమః పురస్తా దథ పృష్ఠతస్తే
నమోऽస్తు తే సర్వత ఏవ సర్వ।
అనంత వీర్యామిత విక్రమస్త్వం
సర్వం సమాప్నోషి తతోऽసి సర్వః॥

తా: వెనుకముందు కూడా నీకు నమస్కారములు. అన్ని వైపులా నీకు నమ స్కారములు. అమిత బలపరాక్రమములు కలవాడవై నీవు అన్ని వైపులా వ్యాపించి ఉన్నావు. కాబట్టి నీవు సర్వుడవు.

వ్యా: నేను నీవు అనే భావం ఉన్న చోటనే వెనుకాముందు అనే మాట లుండ గలుగుతాయి.

41. సఖేతి మత్వా ప్రసభం యదుక్తం
హేకృష్ణ! హే యాదవ! హే సఖేతి,।
అజానతా మహిమానం తవేదం
మయా ప్రమాదా త్ప్రణయేన వాపి॥

42. యచ్చావహాసార్థ మ సత్కృ తోఽ సి
విహార శయ్యాసన భోజనేషు
ఏకోఽథ వా ప్యచ్యుత! తత్సమక్షం
తత్క్షామయే త్వామహం అప్రమేయమ్॥

తా: అచ్యుతా! నీ మహిమ ఇలాంటిదని ఎఱుగక పూర్వం, నా అజ్ఞానం వల్లనో, చనువువల్లనో, సఖుడవను భావంచేత. ఏమోయి కృష్ణా ఏమోయి గొల్ల వాడా, ఏమోయి దోస్త్, అంటూ బండతనంగా పిలిచి ఉంటాను. ఇంకా పరిహాస రూపకంగా, ఆటలాడుకుంటూనో, పడుకుని ఉన్నప్పుడో, కూర్చుని ఉన్నప్పుడో, భోజనాల దగ్గఱో, లేక నీవు ఎదుట ఉన్నప్పుడో, లేనప్పుడో, ఏదైనా అగౌరవం చేసి ఉంటే దాన్ని క్షమింపమని వేడుకొంటున్నాను. క్షమింపుమని మాటిమాటికీ నిన్ను ప్రార్థిస్తున్నాను. అని అర్జునుడు ప్రమాదాపచారాపరాధప్రాయశ్చిత్తాన్ని అర్థించాడు.

43. పితాసి లోకస్య చరాచరస్య
త్వమస్య పూజ్యశ్చ గురు ర్గరీయాన్।
నత్వత్సమోఽ స్త్యభ్యధికః కుతోఽ న్యో
లోకత్రయేఽ ప్యప్రతిమప్రభావ॥

తా: నిరుపమాన ప్రభావం కల ప్రభూ! నీవు చరాచర సృష్టికి తండ్రివి. పూజింపదగినవాడవు. గురువువు. గొప్పవాడవు. లోకత్రయంలో నీకు సమానుడే లేనప్పుడు అధికుడెక్కడ ఉంటాడు? నీవు అప్రతిమప్రభావుడవు.

వ్యా: ఆచార్యాః పితరః పుత్రాస్త థైవపితామహాః

"దూతులాః శ్వశురాఃపౌత్రాః స్యాలాస్సంబంధి నస్తథా ఏతాన్నహంతు మిచ్ఛామి'' అని శోకించిన అర్జునుడు పరమాత్మయే ఆచార్యుడు, పితరులు పుత్రులు, ఇంతకంటె వేఱుగా ఎవ్వరు ప్రశస్తమైన వారు లేరని గుర్తించినట్లు తెలుస్తుంది. దేహధారులైన తల్లిదండ్రి, బంధువులు, దేహాలతో నశించే వాళ్ళు. జన్మలకు కారణమైన పరమాత్మ చావులేనివాడు.

44. తస్మా త్ప్రణమ్య ప్రణిధాయ కాయం
ప్రసాదయే త్వామహ మీశ మీడ్యం।

పితేవ పుత్రస్య సఖేవ సఖ్యుః
ప్రియః ప్రియా యార్హసి దేవ సోఢుమ్॥

తా: అందువల్ల శరీరం వంచి నమస్కరించి లోకనియామకుడవు స్తుతిపాత్రుడవు అయినట్టి నిన్ను ప్రసన్నున్ని జేసుకుంటున్నాను. నన్ననుగ్రహించి కొడుకును తండ్రివలె ప్రియురాలిని ప్రియుడువలె నాలోపములను సహించి నన్ను క్షమింపుము.

వ్యా: ఒక చెట్టున్నది. అది నీడను అందఱికి సమానంగానే ఇస్తుంది. మంచి వాళ్ళకూ చెడ్డవాళ్ళకూ ఆశ్రయించిన వాళ్ళందఱికీ సమానంగానే ఇస్తుంది. అమ్మను బిడ్డలవలె ఎంతో మంది ప్రియురాంద్రవలె కొంతమంది, చేరి ఆశ్రయాన్ని పొందారు. అందఱినీ వారి వారికి ఇష్టమైన రీతిగానే వారినాదరించింది.

45. అదృష్టపూర్వం హృషితోఽ స్మి దృష్ట్వా
భయేన చ ప్రవ్యథితమ్ మనో మే॥
తదేవ మే దర్శయ దేవ! రూపమ్
ప్రసీద! దేవేశ! జగన్నివాస!॥

తా: ఇదివఱకెన్నడూ చూచి ఎఱుగని నీ విశ్వరూపాన్ని చూచి నేను సంతోషించు తున్నాను. అయినా ఈ మనస్సు భయంతో బాధపడుతున్నది. దేవేశా! జగన్నివాసా! నీ మామూలు రూపాన్నే నన్ననుగ్రహించి నాకు చూపుము.

వ్యా: తమ శక్తికి మించిన కోరికలను కోరుకునేవారు కష్టాలకులోనవుతారు. పరమాత్మ అనుగ్రహించబట్టి సరిపోయిందిగాని చర్మనేత్రాలతో చూచి ఉన్నట్లయితే విశ్వరూపం కనబడేదేకాదు. అతనికి కనబడే ఉంటే కళ్ళు ఆవలణిగిపోయి ఉండేవి. సూర్యగోళం దూరంగా ఉన్నంతవఱకు అది వచ్చి మన ప్రక్కన నిలుచుంటే బాగుండుననిపిస్తుంది. తీరావచ్చి అది నిజంగానే నిలబడితే దాని వేడికి మనం తట్టుకోగలమా? మన శరీరం భస్మమై పోదూ! అలాగే పరమాత్మ విశ్వరూపంలోని ఉగ్రత్వానికి దైవత్వానికీ అర్జునుడు తట్టుకోలేకపోయాడు. పూర్వం ఉన్న సౌమ్యాకృతితోనే కనిపించమని పరమాత్మను వేడుకొన్నాడు.

46. కిరీటినం గదినం చక్రహస్త
మిచ్ఛామి త్వాం ద్రష్టు మహం తథైవ।
తేనైవ రూపేణ చతుర్భుజేన
సహస్రబాహో! భవ విశ్వమూర్తే!॥

తా: సహస్ర బాహువులు కల విశ్వమూర్తీ! కిరీటాన్ని ధరించి, గదను చక్రాన్ని చేతులతో పట్టుకొని, ఉన్న రూపంతో నిన్ను తిరిగి చూడగోరుతున్నాను. ఈ విశ్వ రూపాన్ని క్రమంగా ఉపసంహరించుకొని చతుర్భుజాలతో ఉండే నీ సామాన్య రూపాన్నే ధరించుము.

శ్రీ భగవానువాచ

47. మయాప్రసన్నేన తవార్జునేదం
రూపం పరం దర్శిత మాత్మ యోగాత్।
తేజోమయం విశ్వ మనన్త మాద్యమ్
య న్మే త్వదన్యేన నదృష్టపూర్వమ్॥

భగవానుడు చెప్పుచున్నాడు.

తా: అర్జునా! నీవు తప్ప ఇంకెవ్వరూ నాయీ విశ్వరూపాన్ని చూచి ఉండలేదు. తేజోమయమూ అనంతమూ, ఆద్యమూ, సంపూర్ణమూ, పరమోత్తమమూ అయినది ఈ దివ్యదర్శనము. దీనిని నీ మీద నాకుండే ప్రేమచే నాయోగశక్తి వలన నీకు చూపాను.

వ్యా: అర్జునా! నీకు చూపబడ్డ విశ్వరూపం సంపూర్ణమయినది. పురాణాల్లో గాని శాస్త్ర గ్రంథాలలోగాని ఇంకోటిలేదు. ఈ అర్థాన్ని సూచించడానికే 'రూపం పరం' అనే మాటలు వాడబడ్డాయి పై శ్లోకంలో.

అమ్మ తాలూకు విశ్వరూపం భయంకరమైనది కాదు. అమృతమయమైనది. ప్రేమమయమైనది.

'అంతా అయిన అమ్మ కన్పించడానికే ఈ అమ్మ'.

అంతా అయిన అమ్మ అనంతవక్త్రాలతోను, బాహువులతోను, ఆయుధాల తోను కన్పించలేదు. పసిబుగ్గలతోను, పసిబుగ్గలు కనిపించే పాముపడగలతోను, పాములుగా కనిపించే ముసలివగ్గుల చర్మం ముడతలతోను, పందిపిల్లా, తేనెటీగా, దోమకూనా, మిగతా, సృష్టి ఆదిదశలోని బాంటాసారస్, డైనాసారస్ పిల్లతోను, వీటి నిండా నిండిన మమతల గర్భగుడిగా కన్పించింది. ఇదీ అమ్మగా విరిసిన విశ్వరూపం. గెలక్సీలలోని తారకలకు కూడా తల్లిగా విరిసిపోయిన రూపం. మరి ఈ దృశ్యాన్ని ఎవరైనా చూశారో అంటే చూస్తే కనిపించను – మరి ఎలా చూడడం? కన్పిస్తే చూస్తారు.

అర్జునుడు చూడాలనుకున్నా చూడలేకపోయాడు. పరమాత్మ అసలు రూపం తానై కన్పిస్తేనే చూశాడు. పరమాత్మ తానై అనుగ్రహించి అర్జునుడికి పనిబట్టుకొని విశ్వాకారంగా కనబడి 'పశ్య' అన్నాడు.

నాకు పని అంటూ ఉంటే మీకు కన్పించడమే అంది అమ్మ. కన్పించినా నన్ను చూడగలగవద్దూ.

నాకున్న అన్ని పాళ్ళూ ఏ కొంచెమో ఇస్తేగాని నన్ను కనుక్కోలేరు అంది అమ్మ.

అమ్మ అలా అనుగ్రహించినప్పుడు మనలో ఆత్మ సమర్పణతోబాటు, అమ్మ ప్రకృతి జ్ఞానం, ఆత్మ సత్తాజ్ఞానమూ, ఉదయించడానికి తరుణం వస్తుంది. అప్పుడు మనం చూచే చూపు కళ్ళతో కాదు. మనస్సుతోనే. ఆ చూచింది తానే అయ్యే చూపుతో అమ్మ మనను చూస్తుంటే అమ్మను పొందే చూపుతో మనం చూడడం అబ్బుతుంది. నన్ను పొందడమేమిటీ? చూడడమే'

48. **న వేదయజ్ఞా ధ్యయనై ర్న దానై**
ర్నచ క్రియాభి ర్నతపోభి రుగ్రైః।
ఏవం రూప శ్శక్య అహ నృలోకే
ద్రష్టుం త్వ దన్యేన కురుప్రవీర!॥

తా: కురుశ్రేష్ఠుడవైన అర్జునా! నీవు తప్ప ఇతరులు, వేదాధ్యయన యజ్ఞాధ్య యనాల వల్లగాని, చాంద్రాయణాది ఘోర తపోవ్రతాలవల్లగాని, అగ్నిహోత్రాది క్రియల వల్లగాని, ఇట్టివిధంగా ఉన్న నా రూపాన్ని నరలోకంలో చూడజాలరు.

వ్యా: " గదిలోనికి రానంత మాత్రాన నన్ను చూడనంత మాత్రాన, నాకు మీ మీద ప్రేమతగ్గుతుందని అనుకోవద్దు. ఈ గదిలో మంచం కోళ్ళను అంటిపెట్టుకొని కూర్చున్నంత మాత్రాన నాలుగుసార్లు అటూ ఇటూ తిరిగి నంత మాత్రాన ఎక్కు వయ్యే ప్రేమ ఏదీలేదు."

ఆత్మసాక్షాత్కారాన్ని గుఱించి అడిగిన స్వామిపూర్ణానందతో అమ్మ– నేను ఆత్మలేదనడంలా కానీ వేఱుగా చూడటల్లా ఆత్మని. ఆత్మకు రూపంలేదంటూ, సూది మోపే సందు లేదని చెప్తూ ఆత్మసాక్షాత్కారం అయిందంటే ఎల్లా? అని అడిగారు.

49. **మా తే వ్యథా మా చ విమూఢభావో**
దృష్ట్వా రూపం ఘోర మీదృ జ్మమేదమ్।
వ్యపేతభీః ప్రీతమనాః పున స్త్వం
తథేవ మే రూపమిదం ప్రపశ్య॥

తా: ఇటువంటి ఘోరమైన నా రూపాన్ని చూచి భయమూ, విమూఢ భావమూ, మనోవికలత్వమూ, నీవు పొందవద్దు. సంతోష మనస్కుడవై మఱల నీవు కోరిన నాసాత్విక రూపాన్ని చూడుము.

సంజయ ఉవాచ:

50. ఇత్యర్జునం వాసుదేవ స్తథోక్త్వా
స్వకం రూపం దర్శయామాస భూయః।
ఆశ్వాసయామాస చ భీతమేనం
భూత్వా పున స్సౌమ్యవపు ర్మహాత్మా॥

సంజయుడు చెప్పుచున్నాడు.

ఈ విధంగా అర్జునునితో చెప్పినవాడై, మళ్ళీ తన పూర్వపు సౌమ్యరూపాన్ని ధరించి పరమాత్మ భయపడిపోయిన ఆ అర్జునుని ఓదార్చిన వాడయ్యెను.

అర్జున ఉవాచ:

51. దృష్ట్వేదం మానుషం రూపం
తవ సౌమ్యం జనార్దన!
ఇదానీ మస్మి సంవృత్త
స్స చేతాః ప్రకృతిం గతః॥

అర్జునుడు చెప్పెను.

తా: శ్రీకృష్ణా నీ సౌమ్యమైన మానుషరూపాన్ని చూచి ఇప్పుడు ప్రాణం తేరుకున్నవాడనయ్యాను. మనస్సు కుదుటబడింది. తెలివచ్చింది. ప్రజల్లో బడ్డాను.

శ్రీ భగవానువాచ

52. సుదుర్దర్శ మిదం రూపం
దృష్టవానసియన్మమ।
దేవా అప్యస్య రూపస్య
నిత్యం దర్శనకాంక్షిణః॥

పరమాత్మ చెప్పెను.

తా: నీవు చూచిన సుదుర్దర్శమైన నా రూపాన్ని నిత్యమూ చూడాలని దేవతలు కూడా కోరుతూ ఉంటారు.

53. నాహం వేదైర్న తపసా న దానేన న చేజ్యయా।
శక్య ఏవం విధో ద్రష్టుం దృష్ట వానసి మాం యథా॥

తా: వేదాలచేతగాని యజ్ఞదాన తపః కర్మాలవలన గాని నీవు చూచిన నా రూపం చూడడానికి లభ్యమయ్యేదికాదు.

పూర్వం నుండి భగవత్ప్రాప్తికి దానయజ్ఞయాగాది కర్మాలు సాధనాలని మార్గాలని చెప్పబడి ఉంది. మఱి వాటివల్ల పరమాత్మ దర్శనం లభించకపోతే ఏ సాధనల వలన లభిస్తుంది.

54. భక్త్యా త్వనన్యయా శక్యః అహ మేవం విధోఽ_ర్జున!।
జ్ఞాతుం ద్రష్టుం చ తత్వేన ప్రవేష్టుంచ పరంతప!॥

తా: అర్జునా! శత్రుభయంకరుడా! అన్య చింతలేకుండా ఉన్న భక్తి చేత మాత్రమే ఇటువంటి నా విశ్వరూపాన్ని తెలిసికోవడానికి, చూడడానికి ప్రవేశించ డానికి శక్యమౌతుంది.

వ్యా: యజ్ఞయాగాదులచేతగాని, అగ్ని ష్టోమాదుల చేతగాని వేదాధ్యయనాల చేతగాని లభ్యంకాని విశ్వరూపం అనన్యభక్తి వలన సాధ్యపడుతుందని పరమాత్మ విశదీకరించారు. గీతలో అనన్య భక్తి అనే పదం చాలా చోట్ల వస్తుంది. అనన్య అంటే ఇతర చింతలులేని అవ్యభిచారభక్తి అని అర్థం. భక్తిచాలా మందికి ఉన్నా ఏకాగ్రంగా ఉండదు. ఎలాగో ఒకలా భక్తి ఉండడం మంచిదే కాని పరమాత్మను దర్శించడానికి అది సరిపోదు. ఆర్తికావాలి. భక్తి ఆర్తి రూపం దాల్చాలి. భక్తి తీవ్ర రూపం దాల్చినప్పుడు చిత్తం పరిపక్వతకు వచ్చి భక్తుని మనస్సే పరమాత్మ మన స్సులో భాగంగా అయ్యేస్థితికి వచ్చి పరమాత్మను తెలుసుకోవాలనే తపన పడు తుంటాడు. ఇది జ్ఞాతుం అనే దశ. దాని తరువాత పరమాత్మకు ఎదురెదురై నిలబడే స్థితి వస్తుందతనికి. ఇది ద్రష్టుం అనే దశ. మూడో దశప్రవేష్టుం. దేవునిలో ప్రవే శించడమనేది చరమస్థితి.

అమ్మను గూర్చి వింటారు చాలా మంది. అమెరికాలోని మార్వాహెంఫిల్, యూరప్ నుండి నీలాండ్ లాంటివాళ్ళు అమ్మను గూర్చి విని, తెలుసుకోవాలని జ్ఞాతుందశలో బయలుదేరుతారు. ఎండనక వాననక ఆయన దేశాల నుండి జిల్లెళ్ల మూడి వచ్చి అమ్మ కెదురుగా నిలబడి ద్రష్టృదశానందం అనుభవించితే తప్ప

వాళ్ళకు తృప్తి కలుగదు. ఆ భక్తి దశలో పరమాత్మలో తాము భావైక్యత పొందితేకాని మూడోదశకు వాళ్ళు చేరుకోరు. పరమాత్మను చేరేమార్గమే అయినా నిత్యజీవితంలో మనం చేయవలసిన నిత్యకృత్యాలేమిటంటే పరమాత్మ ఆఖరు మాటగా ఇలా సెల విచ్చారు.

మత్కర్మకృత్ మత్పరమో మద్భక్త స్సంగవర్జితః।
నిర్వైర స్సర్వ భూతేషు యు స్స మా మేతి పాండవ॥

తా: అర్జునా! ఎవడైతే నా కొఱకే కర్మ చేస్తుంటాడో, నన్నే పొందగోరుతూ ఉంటాడో, నాయందే భక్తిగల వాడౌతాడో, ఆసక్తి విడిచిన వాడౌతాడో, సమస్త ప్రాణులయందు ద్వేషం లేని వాడవుతాడో వాడు నన్ను పొందుతున్నాడు.

వ్యా: మత్కర్మకృత్. తల్లి పనిచెయ్యడమంటే బిడ్డగా కావడమే. అప్పుడు పుట్టిన నెత్తురుగుడ్డు పండిన మాతృత్వంకాక మఱేమిటి? మత్కర్మ అమ్మగానే ఉండి విలోమంగా ఇంకో అమ్మరూపమయిన వాడే కదా బిడ్డ. మత్కర్మ అంతకంటె పర మాత్మ పదార్థానికి ఇంకా చేరువగా ఎవరుంటారు? అమ్మ నెత్తురులో నెత్తురు కండలో కండ, ఊపిరిలో ఊపిరి, ప్రాణంలో ప్రాణం. అవయవాల్లో అవయవాలైన నెత్తురు గుడ్డు స్థితే భక్తుడిది. పసిబిడ్డను కప్పియున్న మావియే వాని భక్తిభావం. అందులోనే అమ్మతో నాభీసూత్రంతో బద్ధుడై ఉండడమే ఇంతకన్నా పరమమైన భక్తి భావం మఱొకటి లేదు. సంగవర్జితః సంగం అంటే తగులుబాటు లేకపోవడం. అంటే అమ్మేతానై ఉండడం. మాతృరస ఘనస్వరూపుడే నెత్తురు గుడ్డు. అదే గ్రుడ్డు లోని మనస్సు. కదలడం ఆరంభించే సరికి అతుకులేని చోట అతుకు ఏర్పడుతుంది. ఈ అతుకే సంగం అతుకు అంటే ఒకటిగా ఉన్న అమ్మకు రెండు తల లేర్పడడం అనే భావం. రెండు తల లేర్పడడంలోదే సర్వభూతాల ఉత్పత్తి ఇమిడి ఉంది.

శతమూలాశతాంకురాన్యాయమది. బహుధా అయిపోయిన ఈ సృష్టి అంత టికీ ఆధార బంధం మాతృత్వం. మాతృత్వానికి రెండోవైపు బాల్యం యౌవనం వార్ధక్యం. అన్నింటికీ సమానమైనది మహామృత్యుతత్వం.

ఇతి శ్రీమన్మాతృ గీతలోని విశ్వరూప సందర్శనమను ఏకాదశోధ్యాయము.

మాతృగీత

భక్తియోగము

ద్వాదశోధ్యాయము

అర్జున ఉవాచ

1. ఏవం సతతయుక్తా యే భక్తా స్త్వాం పర్యుపాసతే!
యేచా ప్యక్షర మవ్యక్తం తేషాం కే యోగవిత్తమాః!!

అర్జునుడడిగెను.

తా: శ్రీకృష్ణా! నిత్యయుక్తులై ఏ భక్తులు నిన్ను బాగా ఉపాసిస్తారో ఇంకా ఎవరైతే ఇంద్రియ గోచరంకాని అక్షర పరబ్రహ్మాన్ని బాగా ఉపాసిస్తారో, ఈ యిరు తెగలవారి లోను ఎవరు యోగవిత్తములు!

వ్యా: పై శ్లోకంలో సాకారోపాసకులు శ్రేష్ఠులా? నిరాకారో పాసకులు శ్రేష్ఠులా? అనే సంశయం అర్జునుడు ప్రకటించినట్లయింది. 2వ అధ్యాయం మొదలుగా 11వ అధ్యాయందాకా సగుణ నిర్గుణోపాసనలు పెక్కుచోట్ల ప్రశంసించబడినప్పటికీ విశ్వరూపాన్ని ఉపసంహరించుకునే సందర్భంలో "మత్కర్మ కృ త్మత్పరమో" అనే శ్లోకంతో చెప్పిన అంశాలవల్ల అర్జునుడికి ఈ సంశయం పొడమినట్లుగా మనకు వ్యక్తమవుతుంది. దీనికి పరమాత్మ బహుచాకచక్యంగా "ఎవరు నన్నాశ్రయించి నిరంతరము అతిశ్రద్ధతో నన్ను ధ్యానిస్తుంటారో వారే ఉత్తములు" అని జవాబిస్తారు. శ్రద్ధలేనిది, సాకారోపాసన ఐనా నిష్ఫలమే. నిరాకారోపాసన ఐనా నిష్ఫలమే "అమ్మా! కళ్ళు మూసుకుంటే శూన్యం తప్ప ఏమీ కనిపించడం లేదమ్మా" అని ఎవరో అంటే 'ఆ శూన్యమే పరమాత్మ అనుకోమని చెప్పే అమ్మ మాటలు కూడా ఇలాగే చాకచక్యంగా ఉంటాయి. అమ్మ మళ్ళీ అన్ని అవతారాల లోనూ ప్రత్యక్షమవుతుంది. సాకారపూజలనందుకుంటుంది. చెప్పే మాటల అర్థం ఉపనిషదర్థాలను తలదన్నుతూ ఉంటాయి.

అమ్మకూడా కృష్ణ పరమాత్మలాగానే శ్రద్ధనే ఉపాసనకు ప్రధానంగా చెప్పింది.

శ్రీ భగవానువాచ

2. **మ య్యావేశ్య మనో యే మాం నిత్యయుక్తా ఉపాసతే।**
శ్రద్ధయా పరయోపేతా స్తేమే యుక్తతమా మతాః॥

భగవానుడు పలికెను.

తా: మనస్సును నాయందే నిలిపి, నిత్యమూ ప్రయత్నం చేస్తున్న వాళ్ళై, ఎవరైతే నన్ను అధికమైన శ్రద్ధతో కూడిన వాళ్ళై ఉపాసిస్తూ ఉంటారో, వాళ్ళే నా మతంలో ఉత్తమ యోగులు.

వ్యా: అర్జునుని మనస్సులో వచ్చిన సందేహం సాకార నిరాకారోపాసనలను గుఱించి. ఈ రెండింటిలో ఏది ఉత్కృష్టమైనది అనే దాన్ని గుఱించిన్నీ. సాకారం అంటే రూపంతో కనిపించే, అనిపించే సృష్టి. పంచేంద్రియాలు ఈ సృష్టిని మనకు స్పష్టీకరిస్తాయి. వాటిలో అన్నీ మనకు అనుకున్నట్లు సహాయకారులు కావు. కనబడితేనే చూస్తుంది కన్ను. కంటి జ్ఞానాన్ని తర్జుమా చేసేది మనస్సు. మనస్సు లేనివాడికి కన్ను ఉండీ ప్రయోజనం లేదు. పీనుగుకు కళ్ళుంటాయి. అవి పనిచేయవు. చెవి శబ్దాన్ని వింటుంది. చర్మం స్పర్శను గ్రహిస్తుంది. నోరు శబ్దాన్ని ఆవిష్కరించుతుంది. రుచిని తెలుసుకుంటుంది. ముక్కు వాసనను, ఊపిరినీ తీసుకుంటుంది. వెనుక మనస్సు మద్దత్తు లేకపోతే ఏ ఇంద్రియం చేసేపనీ, దాని తెలివీ మెదడు కందదు. నిత్యమూ ఈ ఇంద్రియ క్రియలు మారుతూ ఉంటాయి. ఒకటిలేకుంటే ఇంకోటి జరగని ప్రవృత్తులు. సగుణ వికాసాన్ని బట్టి నిర్గుణ విలాసాన్ని గుర్తించుతూ ఉంటాం. ఉన్నదాన్ని బట్టి లేనితనాన్ని గుర్తించవచ్చుగాని లేనిదాన్ని బట్టి ఉనికిని గుర్తించడానికి వీలులేదు. గుర్తుతో గుర్తించి గుర్తును మాపుకోవడమే. గుర్తించడం కూడా వ్యక్తికున్న శక్తిని బట్టే, సర్వస్వభావంలో ఏ కొంచెమో ఉంటేగాని సర్వాన్నీ గుర్తించాలనే ఇచ్ఛ కూడా రాదు.

ఇంతకుముందు జఱిగిన విశ్వరూపం సగుణమా, నిర్గుణమా? సగుణత్వం లోని అనంతత్వం దాన్ని ఆత్మగా చేసింది. ఆత్మ నిర్గుణమే. అనంతశక్తిని గుర్తించడానికి అనంతశక్తి కావాలి. కనబడేదంతా ఆత్మే. ఆత్మకు ప్రతి జగత్తు. శక్తిమయంగా అంతటా నిండి ఉన్నదే ఆత్మ. ఈ నిజాన్ని తెలుసుకోవడం తప్ప వేఱే ప్రయోజనం కూడా లేకుండా సర్వథా అదేభావంతో ఆవేశించబడిన మనోబుద్ధులు కలవాడూ, శ్రద్ధా విశ్వాసాలతో అదే మనస్సుతో నన్ను చింతిస్తుంటే నన్ను పొందుతాడు. అవ్యక్తమన్నా వ్యక్తమన్నా పరమాత్మకంటే వేఱు కావనే బుద్ధి కలగాలి. శ్రద్ధ అంటే ప్రాప్యత్వర. ఆ శ్రద్ధ పరాశ్రద్ధ స్థాయిలో ఉండాలి. విశ్వాసం, పట్టుదలా రెండూ చేరి శ్రద్ధ ఔతుంది. తర్కానికి అందుబాటులో లేని శ్రద్ధ కావాలి. ఇటువంటి శ్రద్ధతో చింతించినవాడే ఉత్తమ యోగియని నా మతం.

3. యే త్వక్షర మనిర్దేశ్యం అవ్యక్తం పర్యుపాసతే।
సర్వత్రగ మచింత్యం చ కూటస్థ మచలం ధ్రువమ్॥

4. సన్నియ మ్యేంద్రియగ్రామం సర్వత్ర సమబుద్ధయః।
తే ప్రాప్నువంతి మామేవ సర్వభూతహితే రతాః॥

తా: ఎవరైతే సకల భూతములకూ మేలు కలిగే విషయంలో ప్రీతికలవాళ్ళై అన్నిచోట్లా, అన్ని భూతాలపట్లా సమబుద్ధి కలవాళ్ళై ఇంద్రియ సముదాయాన్ని నియమించుకుని, ఇంద్రియ గోచరం కానట్టీ, ఊహించశక్యం కానట్టీ, కూటస్థుడై నట్టీ, చలింపనట్టీ, నిత్యమైనట్టీ, అక్షర పరబ్రహ్మాన్ని పూజిస్తుంటారో వాళ్ళు నన్నే పొందుతారు.

వ్యా: అక్షరం అంటే ఎప్పుడూ మారని ఏకరూపం. అనిర్దేశ్యం అంటే పేరుతో ఉచ్చరించి చెప్పరానిది. అవ్యక్తం అంటే ప్రమాణాలకు గోచరించనిది. సర్వత్రగం అంటే అంతటా వ్యాపించేది. కూటస్థం అంటే కదలనిది. తనపైని ఏది కదులుతున్నా తాను కదలనిది. కమ్మరివాడు కాల్చిన ఇనుమును సాగగొట్టడానికి ఉపయోగించే ఇనుప దిమ్మను కూడా కూటస్థం అంటారు. ఆ దిమ్మ తనపైన వస్తువులు ఎంత బలిష్ఠమైన సుత్తి దెబ్బలు తింటున్నా, అవి ఎంతగా సాగుతున్నా, వంకలు తిరుగు తున్నా, తనుమాత్రం అచలంగా, కదలకుండా, సాగకుండా ఉంటుంది. అచింత్యం అంటే మనస్సుతో ఊహించడానికి శక్యంకానిది అచలం - నచ్యవతీతి అచలం. తన స్వభావ స్వరూపాల నుండి చలించనిది. ధ్రువం అంటే ఎప్పుడూ అలాగే ఉండేది.

అమ్మ 'నా దృష్టిలో అంతా చైతన్యమే. జడమే లేదు. రెండు ఎలెక్ట్రిక్ దీపాల మధ్య తీగల్లో నయితేనేమి, విద్యుత్తు ఉన్నదిగా. వెలుగు రూపంలో కాకపోతేనేం? అలాగే చైతన్యానిది మనమనుకునే రూపం ఒకటే కాదుగా! దాని అనంత రూపా లలో మనం గుర్తించినది ఒకటి. చైతన్యము భగవంతుడే. భగవంతుని రూపాలన్నీ చైతన్యం రూపాలే' అన్నది.

ఇంద్రియ గ్రామం రేపే ఉన్మాద మోహభ్రాంతి విరోధ వికారాలే జీవితంలోని శోకం. మనం పువ్వును ప్రేమిస్తే అది చేతిమీదికి వంగుతుంది. కుక్కపిల్ల తోకా డిస్తుంది. గైరో స్టెబిలైజర్ లాంటివి ప్రకృతి శక్తులు. సర్వత్ర సమబుద్ధి కలగడానికి వ్యక్తి గైరో స్టెబిలైజరులాగా నడుచుకోవాలి. మన నడవడిలో గైరోస్టెబిలైజరు తత్వం వస్తే ప్రకృతికూడా అలాగే అవుతుంది. భక్తి బాల్యం వంటిది. అది పామైనా తెలి

యదు. కత్తి అయినా తెలియదు. తనవలెనే అందఱూ అనే భావం ఏర్పడిననాడు సర్వభూతహిత రతి కలుగుతుంది. అది కలిగిననాడే నన్ను చేరుకుంటాడు మానవుడు.

5. క్లేశో ధికతర స్తేషా మవ్యక్తాసక్త చేతసాం।
అవ్యక్తా హి గతిర్దుఃఖం దేహవద్భి రవాప్యతే॥

తా: దేహంమీద అహంభావం పేరుకొన్నవారికి నిర్గుణోపాసన అధిక క్లేశ తరమైనది. రూప నిర్మాణం మనోధర్మం. నిర్గుణోపాసనలో మనస్సుకు ఆటే ప్రమేయం ఉండదు.

వ్యా: కిందటి శ్లోకంలో చెప్పబడిన రీతిగా ఇంద్రియ జ్ఞానంతో కూడిన శరీరానుభవమే సగుణోపాసనకు ప్రాతిపదిక అవుతున్నది. పైశ్లోకంలోని దేహవిద్భిః అనే పదం సార్థకమైనది. దేహమే వైకల్యాలన్నిటికి కారణమవుతున్నది. దేహం ఉండడం వల్లనే ప్రత్యక్ష జ్ఞానానికి ప్రాధాన్యత కలుగుతున్నది. అందువల్లనే కొన్ని నాస్తిక మతాలు రావడానికి కూడా కారణమయింది. విగ్రహ పూజలూ సగుణా రాధనా దీనివల్లనే ఆవిర్భవించాయి. If a dog thinks of God. it will think in its own shape అన్నారు వివేకానందులు.

మనుష్యుడు దేవుణ్ణి గూర్చి తలుస్తున్నాడు కాబట్టి అతడు మనుష్యుని ఆకారం లోనే తలుస్తున్నాడు. ఒక తల, రెండు చేతులూ, రెండు కాళ్ళూ అన్నీ తనలాగే ఉండాలని భావించుతాడు. తనకంటే విలక్షణంగా ఉండాలనుకుంటే నాలుగు తలలూ, నాలుగు చేతులూ ఇలాగా ఎక్కువ లక్షణాల నాపాదించి మూర్తీకరించు కున్నాడు. రవివర్మ వేసిన రూపాలే పరమాత్మకున్నాయా అంటే ఎవరు చెప్పగలరు? కాని రవివర్మ అవ్యక్తం, అచింత్యం, అనిర్దేశ్యం, అనంతం, అవికారం ఇలా అర్థం వచ్చేలాగా పరమాత్మను బొమ్మ గీసి చూపమంటే చూపగలడా? కాగితం, కలం, రంగు, కుంచె, కాన్వాసు, ఉలి, సుత్తె, రాయి, ఇవి. అవ్యక్తాన్ని నిరూపించగలవా? నిరూపించలేవు. చింతన చేయడానికి దారి దొరకాలిగదా! చింతన చేయడానికి ఆధారం కనిపించాలి కదా? సూది మొనలాగానైనా ఒకటి కనిపిస్తే కదా, సూది మొన అనుకోడానికి. అవ్యక్తంలోని క్లేశం ఇదే. మన మనస్సులు పరిమిత శక్తి గలవి. అనంతమైన శివరూపాన్ని తలుసుకోలేక హంసనెక్కి బ్రహ్మ పైకీ, వరాహ రూపంలో విష్ణువు క్రిందకూ బయలుదేరారు. శివలింగానికి ఊర్ధ్వం అనుకున్నదల్లా ఇంకో ఊర్ధ్వాన్నీ, అథోభాగం అనుకున్నదల్లా ఇంకో అథోభాగాన్ని చూపడం జరిగే సరికి శివ విభూతిని తెలుసుకోలేక వారిద్దఱూ తిరిగి రావడం జఱిగిందని పురాణ

గాథ. కాబట్టి ఆనంత్యాన్ని గుర్తించడానికి దేవతలకే సాధ్యం కానప్పుడు పరిమిత బుద్ధికల మానవత్వానికి సాధ్యమౌతుందా? కాదు. కాని జీవలోకమంతా పరమేశ్వరుడే తప్ప వేఱుకాదు కదా! 'మమైకాంశో జీవలోకః' అని గీత. జీవలోకమంతా తన అంశ తననే తెలుసుకోడానికి అభ్యంతరమేమిటి? అనుకుంటే ఏడుగురు గ్రుడ్డివాళ్ళు ఏనుగును తెలుసుకుందామని బయలుదేరినట్టే అవుతుంది. చెవి తడివినవాడు ఏనుగ చేటలల్లే ఉంటుందనుకున్నాడు. ఏనుగు కాలును పట్టుకొన్నవాడు స్థంభంలా ఉంటుందన్నాడు.

గుర్తించే గుర్తు లేకపోతే చూచీ, వినీ, చెప్పీ కూడా గుర్తించలేరు. 'శృత్వాప్యేనం వేదనచైవకశ్చిత్' అన్నారు పరమాత్మ. ఈ సర్వతోముఖ జ్ఞానం కలగాలన్నా, పరిమిత జ్ఞానం కలగాలన్నా పరమాత్మయే అనుగ్రహించాలి. అన్ని ఆలోచనలూ పరమాత్మయే ఇవ్వాలి. కలిగించాలి.

అయితే మనుషుల్లో కొందఱికే "నేను నీ వాడను. నీవు నావాడవు" అని భిన్న భిన్న విధాలుగా ఈ భక్తిభావం ఎందుకు తోస్తుంది? రెండూ సమానమయినా ఏది సులువైన దంటే ఏదైనా ఒకటే. రాముడి దగ్గఱ ఉన్నవాడు లక్ష్మణుడు. రాముడిని దగ్గఱ ఉంచుకొన్నవాడు భరతుడు. రుక్మిణి ఎప్పుడూ కృష్ణుని దగ్గఱే ఉంటుంది. రాధ ఎప్పుడూ కృష్ణుడిని తనతోనే ఉంచుకొంటుంది అన్నది అమ్మ. అనంతత్వంలో తను ఐక్యం అయిపోయినా అనంతత్వాన్ని తనలోనే ఐక్యం చేసుకున్నా రెండూ ఒకటే. ఇంత పరిపక్వ దశకు మనస్సు చేరడం చాలా దుర్ఘటం అంటారు పరమాత్మ.

అందువల్ల సగుణోపాసన అందఱికీ సుగమంగా ఉంటుంది అని సెల విచ్చారు. తెలిసినవాడికి జన్మలు లేవని అమ్మ అనడం లాగా తెలిసినవాడికి జడమైన విగ్రహం లేదు. ఱాతి విగ్రహంలో కూడా సూక్ష్మప్రకృతులైన ఎలెక్ట్రానులు గ్రహ మండలాల వేగమునకు తుల్యమైన వేగంతో ప్రయాణిస్తూ ఉంటాయి. అవీ చైతన్య మయమైనవే. చైతన్యం పరమాత్మ ఆకారమైతే శక్తి అతని స్వభావం. కాని ఈ తత్వం మనస్సుకు పట్టేవఱకు జ్ఞానమార్గం ఒక్కసారిగా ఎగిరి అందుకోరానిది. 'దాసోహం' అర్థమయితే కాని 'సోహం' అర్థం కాదు. విగ్రహమూ, మంత్రమూ, యంత్రమూ, ముద్రా ఓంకారమూ, అన్నవి భక్తుని రుచి భేదాన్నే తప్ప తరతమ భావాన్ని సూచించవు. 'క్లేశోధికతరం అనే మాటచేత నిర్గుణోపాసన లాగానే సగుణోపాసనలో కూడా క్లేశం ఉన్నప్పటికీ భక్తిమార్గం అటే దుఃఖకరం కాదని తాత్పర్యం. కాని అన్నమాటలను బట్టి చూస్తే ఈరెంటికీ భేదం లేదు అని తెలుస్తుంది. అంతా అయిన దానిలో ఒక కొంత రెండవ కొంత కంటే ఎక్కువ ఏమిటీ? భక్తులకు ఏ రూపం కావాలంటే దాన్ని ఏరుకుని ఆరాధించవచ్చు. అన్నీ ముక్తిప్రదాలే!

6. యేతు సర్వాణి కర్మాణి మయి సన్యస్య మత్పరాః
అనన్యే నైవ యోగేన మాం ధ్యాయన్త ఉపాసతే॥

7. తేషా మహం సముద్ధర్తా మృత్యు సంసార సాగరాత్।
భవామి న చిరా త్పార్థ! మయ్యావేశిత చేతసామ్॥

తా: అర్జునా! ఎవరైతే సర్వకర్మలను నాయందు సన్యసించి, మత్పరాయణులై, అనన్యమైన యోగంచేత నన్ను ధ్యానిస్తూ ఉపాసిస్తుంటారో నాయందు ప్రవేశించ బెట్టబడిన చిత్తం గలిగినటువంటి ఆ భక్తులను మృత్యుభ్రమతో నిండి ఉన్న ఈ సంసార సాగరం నుండి అతి శీఘ్రంగా ఉద్ధరిస్తాను.

వ్యా: కర్మలు మన ప్రయత్నంవల్లనే జరుగుతున్నాయనుకోడం మానవత్వం. అన్నీ అదే. అన్నిక్రియలూ దానివే. అన్ని సంకల్పాలూ దానివే. నీదేం లేదు. నీదేదో ఉంది అనుకుంటున్నావు కనుక తోచినదే చెయ్యి. (తోపించేవాడు వాడే కదా). నీ వంతుకు వచ్చినదేదో హాయిగా అనుభవించు. తృప్తే ముక్తి.

పరమాత్మవలన, పరమాత్మచేత, పరమాత్మ కొఱకు, పరమాత్మాంశాలుగా తామే ఐ, ఆ పనులు పరమాత్మవిగానే చేస్తుంటారు భక్తులు. ఆ కార్యాలవలన వచ్చే ఫలితం చేసేవాడి చేతిలో లేదు. ఈ మాట అంటే సైన్సు అభివృద్ధిచెందిన ఈ రోజుల్లో అపచారంగా ఉంటుందేమో. ఏ పనైనా నేనే చేశాననుకోవడంలో తప్పు లేదు. నేనే చేశాననుకోడం మానవత్వం. ఈ పని దైవమే నాచేత చేయించాడను కోడం దైవత్వం. కాని నేను కొంత, దైవం కొంత చేశామనుకోడం ఇటు మాన వత్వమూ కాదు, అటు దైవత్వమూ కాదు.

'మయి సన్యస్య' అనే మాటకు యథార్థంగా ఇదే అర్థం. కర్తృత్వాన్ని నీ మీద పెట్టుకోకుండా ఆ పని చేయడానికి సంకల్పమూ, సామర్థ్యమూ, పరమాత్మయే ఇచ్చాడని విశ్వసించి ఆ పనులు చేయడాన్ని కూడా నాయందే అర్పించమని పర మాత్మ అంటున్నారు. 'మత్పరాః' అంటే నాయందే పరాయణత్వాన్ని కలిగి ఉండ మని ఆదేశిస్తున్నారు. భజనల్లో కూర్చున్నప్పుడు, స్మశానాలకు వెళ్ళినప్పుడు, ఏదో ఆవేశంగా వచ్చిన భక్తి వైరాగ్యాల భావాలు ఆయా ప్రదేశాలను విడిచిపెట్టగానే సమసిపోతాయి. దాన్ని శ్మశాన వైరాగ్యమంటారు.

అలాకాకుండా నిత్యమూ, ఏ పనిచేస్తున్నా, మత్పరాయణుడవైన చింతన యందే నిమగ్నుడవై కర్మలు చేయమని ఆదేశించారు పరమాత్మ. అనన్యయోగేన అంటే అది తప్ప వేఱే విషయంగాని ప్రయోజనం గాని ఆశించకుండా తల్లీ నీవైన

మనఃప్రవృత్తి అనన్యయోగం. అంటే బుద్ధికి, మనస్సుకు స్వతంత్రత లేకుండా ప్రాణాయామ ప్రత్యాహార సమాధి స్థితులలో మునిగి ఉండడం.

యోగం అంటే కలుసుకోవడం. ఎవరిని? పరమాత్మ భావంతో మన భావం సమీకరించడం. పరమాత్మ తలపుతో మన తలపు ఏకం కావడం. దేవుడు తలిస్తేనే మనం తలుస్తామంటుంది అమ్మ. అంతేకాదు తనకిష్టమైన పనులను మనచేత చేయిస్తూ మనకిష్టమైనట్లే తాను చేస్తున్నట్టనిపించేది అమ్మ. కనుక అమ్మకు జరగాలనుకున్నది జరుగుతుంది. కాబట్టి జరిగిన పని మనం చేస్తున్నామనుకున్నా, అమ్మ చేయించిందనుకున్నా, కార్యాచరణంలోగాని, ప్రేరణలోగాని భేదం లేకపోవడం, అలాగుంచినా, అమ్మ జరగాలనుకున్నది జరిగిపోవడానికి అభ్యంతరం ఏమీ ఉండదు. తరుణం వచ్చినప్పుడు ఈ పనులు చేసేది నా చేతులు కావు. అమ్మ ప్రేరణవల్ల లభించిన చేతులలోని శక్తి అని అతడే గుర్తిస్తాడు. ద్వంద్వాల్లో తోచే సంకల్పమే మానవత్వం. 'ఏకత్వంగల సంకల్పమే దైవత్వం' అంటుంది అమ్మ. ఏది మానవత్వం, ఏది దైవత్వం అనే మాటకు 'అనన్య యోగేన మాంధ్యాయన్త' అనే మాట సమాధానం. భగవదనుగ్రహం వలన జీవుని మనస్సు పరమాత్మ అనుగ్ర హంతో చేరిపోగా, అవిచ్ఛిన్న తైల ధారావతుగా వచ్చిన భక్తిభావంచేత ఆ పర వస్తువుకూ తనకూ అభేద భావాన్ని గుర్తించి అదే ధ్యాసతో తన గుర్తు మాసిపోవ డానికి దారి కట్టుకుంటున్నవాడు భక్తుడు. అటువంటి భక్తుడిని మృత్యుసంసార సాగరం నుంచి పైకెత్తుతాను అన్నాడు పరమాత్మ. ఎందుకంటే అతడు 'మయ్యా వేశిత చేతస్కుడై'నాడు కనుక. మృత్యుసంసారమంటే మరణయోగం చిహ్నంగాగల ఈ సంసారం అంటే ప్రపంచం. మృత్యువనేది మనం అనుకుంటున్న వ్యవస్థలో సహజంగా ఉండదు. తల్లి గర్భం నుంచి బిడ్డ పుట్టడం జన్మగా మనం వాడుతూ ఉంటాం. కాని తొమ్మిది నెలలుగా తల్లి కడుపులో గడిచిన జీవితానికి ప్రతి జన్మా మృత్యువే. అలాంటిదే ఈ దేహం అదృశ్యమై సంసారంతో లీనమైపోయే వ్యవస్థ కూడాను. అంటే ప్రతీ జన్మా మృత్యువూ అనంతత్వంలో ఒక జన్మ కూడా అవు తుంది. 'మృత్యుసంసార సాగరాత్' అని పరమాత్మ అనడంలో ఒక విశిష్టత ఉంది. ప్రతి తరంగమూ, అవికార సాగర ధర్మానికి ఒక మృత్యువులాంటిదే. తరంగం మాసిపోయి సాగరంలో అడగిపోయే ప్రతి అవస్థా వికార రూపంగా ఉన్న సాగ రానికి ఒక మృత్యువే.

'మయ్యావేశిత చేతసా' అంటే పరమాత్మ భావం ఆవేశించి ఉన్న భక్తుని హృదయంలో, ఈ సంసార సాగరంలో పారంపర్యంగా భ్రమరూపంగా ఉన్న

మృత్యువు నిజానికి మృత్యువు కాదనే జ్ఞానం వికసిస్తుందని శ్లోకతాత్పర్యం. ఈ వికాసం నేనే కల్పిస్తానని పరమాత్మ చెబుతున్నారు.

మయ్యేవ మన ఆథత్స్వ మయి బుద్ధిం నివేశయ।
నివసిష్యసి మయ్యేవ, అత ఊర్ధ్వం న సంశయః॥

తా: నాయందే మనస్సును స్థిరంగా నిలిపి ఉంటూ నాయందే బుద్ధిని ప్రవేశింపజేసి, అలాచేస్తే అటుమీదట నాయందే నిత్యమూ నివసించి ఉండగలవు. దీనికి సందేహం లేదు.

వ్యా: "మనయేవ మనుష్యాణాం కారణం బంధమోక్షయోః" మనుష్యుల బంధ మోక్షాలకు మనస్సే కారణమని పరమాత్మ వక్కాణించి ఉన్నారు. అహంకారంలో ఉండిపోయిన మనస్సయితే, కామక్రోధాదులజంబాలంలో దిగబడిపోయిన మనస్సయితే, సత్యమయిన అర్థాన్ని తెలుసుకోలేక, వివాదగ్రస్తాలయిన, పలుతెఱగులైన, ఊసరవెల్లి ఒంటిమీద రంగులవంటివైన మత వ్యాఖ్యానాలలో ఉక్కిరిబిక్కిరి అయిన మనస్సయితే. విశ్వాసమూ శ్రద్ధాలేని మనస్సయితే, శాశ్వతమై, ప్రచండమైన విశ్వ జ్ఞాన, విశ్వరూప దర్శనానికి తట్టుకోలేని అపరిపక్వ చిత్తంగా తలచి ఇంకా ప్రకృతి పాఠశాలలో బెత్తం దెబ్బల కోసం నియమించి ఉంచిన మనస్సని అనుకోవచ్చు. ఆ మనస్సుకు పంచభూతాలు, అంటే, నూట ఆరు మూలద్రవ్యాలు అణువులు, భౌతిక శక్తులు వీటి కలయికలు, విడిపోవడాలు తప్ప అంతకంటే అతీతమైన శక్తి ఏమీ తోచదు. శరీరమునకు సంబంధించిన భోగాలు, ఆశలు, పాశలు తప్ప మఱేవీ ధ్యేయాలు కావు. ఆహార నిద్రాభయాదులు ద్రవ్య సంపత్తులు తప్ప అతని దృష్టిని కేంద్రీకరించదగిన మఱొక విషయమే కనిపించదు. పరమాత్మ చింతనం అసలే కోశానా అతనికి గిట్టదు. స్వకీయ సామర్థ్యం మీదనే జయాపజయాలు, సిధ్యసిద్ధులు ఉంటాయని అతడు దృఢ నిశ్చయంతో ఉంటాడు. శాస్త్రంలో చెప్పబడిన తామసిక, రాజసిక లక్షణాలను మూర్తీభవించి ఉంటాడతడు. అటువంటి మానవ పశువుకు కూడా దైవానుగ్రహంవల్ల ఒకానొక తరుణం వస్తుంది. అతనికి ఇష్టమైన పనులే అతడు చేస్తూ ఉన్నా, అతను ఆ పనుల్లోనే తన పరిమితత్వాన్ని గ్రహించగలుగుతాడు. ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా, ఏదో ఒకరోగం మీద పడుతూ ఉంటుంది - నిత్య యౌవనంతో ఉండాలనుకున్న దేహం తన ప్రయత్నాలను ధిక్కరించి, వార్ధక్య లక్షణాలను పైన వేసుకోవడం ఆరంభిస్తుంది. విమానాల్లో ఎగిరి వెళ్ళే స్తోమత ఉన్నా, డాక్టరు బెడ్ రెస్ట్ అవసరం. రోగి కదలకూడదు అంటాడు. వళవులు

వస్తాయి. పశువుల్లాగా మేఘాలను తోలుకొనివచ్చి విమానాల సహాయంతో కృత్రిమ వాయుపీడనంతో వఱపు వచ్చిన చోట్లలో వర్షింప చేద్దామని ప్రయత్నించినా మబ్బులే కన్పించవు ఎక్కడా. ఉన్నట్లుండి ప్రజల మనస్సులలో మాస్ హిస్టీరి వ్యాపించి యాదవ కులానికి ముసలం పుట్టినట్లు ఉద్రేకాలు పుట్టి ఒకళ్ళనొకళ్ళు నఱికేసుకోడానికి పూనుకుంటారు. అణుబాంబులు ప్రేలడంవల్లను, రాకెట్లు అంత రాళంలో చేస్తున్న విహారాలు నినాదాలవల్లను, భూమికి కొన్నివేల మైళ్ళపైనున్న అయోనీస్తరాల నిర్మాణ వ్యవస్థలు కదిలిపోయి, గజిబిజి అయిపోయి సూర్యరశ్మి ప్రభావం భూమిమీద కొన్నిచోట్ల అతి ఎక్కువగాను, కొన్నిచోట్ల అతి తక్కువగాను పడి, ఋతువుల రాకపోకలు, వర్ష పవనాలు రాకపోకల టైంటేబులులు అస్తవ్యస్త ములైపోతాయి. కొన్నిచోట్ల మూసల ధారావర్షం, కొన్నిచోట్ల భూమి బీటలువాఱి నోళ్ళు తెఱచుకొని వెకిలినవ్వు ప్రత్యక్షమౌతాయి. అదివఱకు పంచభూతాధి నాథు డననే గర్వంతో మిడిసిపడుతున్న మానవుడికి వాతావరణంలో హాలాహలం (Atmosphere pollution) నేరాల అభివృద్ధి, ఇలాంటి భయంకర సమస్యల మూసలలో పడి మానవుని మనుష్యుని పట్టుకొన్న ఇనుప బంధం నెమ్మదిగా కరగడం ఆరంభి స్తుంది. పరమాత్మ అనుగ్రహం అనే కొలిమిలో పడి అతని గర్విష్ఠి మనస్సు కరిగి పోతూ ఉన్నప్పుడు ఈ మాటలతనికి వినబడతాయి.

"నాయందే మనస్సు నిలుపు. నాయందే నీ బుద్ధిని లగ్నం చెయ్యి. అప్పుడు నా అనుగ్రహంలో ఇల్లు దొరికిన వాడవవుతావు. ఆ తరువాత ఇక నీకు ఊర్ధ్వగతియే. 'దీనిలో ఏ సంశయం లేదు' అని అన్యథాత్వంలేని శరణ స్థానాన్ని పరమాత్మయే చూపిస్తాడు. 'ఆధత్స్వ' అంటే 'సం + ఆధి' అంటే బాగా నాటు. మనస్సు బాహ్య వ్యాపారాలను అవగతంచేసే ప్రవృత్తి బుద్ధి. అంటే యుక్తాయు క్తాలను విమర్శించి తీర్పునిచ్చే ప్రవృత్తి. నా విషయమైన తీర్పును ఎప్పుడైతే బుద్ధి ఇస్తుందో, అప్పుడు 'నివసిష్యసిమయ్యేవ' నేను గూడా ఈ పరమాత్మ అయిన విశ్వంలో భాగాన్నే అని తెలుసుకొని ఊర్ధ్వగతికి ఉన్ముఖుడవౌతావు. నమ్ము. నమ్మ కపో. అది కూడా పరమాత్మయే. ఇందులో సంశయం లేదని నిశ్చయంగా పర మాత్మ చెప్పారు.

9. అథచిత్తం సమాధాతుం నశక్నోషి మయి స్థిరమ్।
అభ్యాసయోగే న తతో మా మిచ్ఛాప్తుం ధనంజయ!॥

తా: అర్జునా! చిత్తాన్ని నాయందు స్థిరంగా నిలిపి ఉంచజాలని వాడవయితే, అన్ని మనో వ్యాపారాలకూ, దేహ వ్యాపారాలకూ, కర్తా అధికారీ, పరమాత్మయే

అనే విశ్వాసం కుదుర్చుకోడానికి ప్రయత్నం చెయ్యి, అభ్యాసంచేస్తూ ఉంటే కాల క్రమాన నీ కోరిక ఫలిస్తుంది.

వ్యా: చిత్త సమాధానం చాలా దుష్కరమైనపని. మనస్సు, బుద్ధి, రెండూ పాదరసం లాంటివే. చిత్, చిత్తం అనే రెండు మాటలున్నాయి. చిత్ అంటే అహం కార సంస్కారంలేని చైతన్యం. విషయాధ్యాసంలో, అహంకార మమకారాలతో కూడినది చిత్తం. అహంకార సంపర్కం ఉన్నంతవఱకూ జరిగే కర్మలన్నీ నావల్లనే జరుగుతున్నాయని చిత్తం రికార్డు చేసుకుంటూ ఉంటుంది. ఈ రికార్డే దీనికి బంధకం. అదే మానవత్వం. ఇది పోవడానికి శరణాగతి, భగవంతుడే అన్నీ చేయిస్తు న్నాడనే భావంతో స్వార్థమును, అహంకారాన్ని మమత్వాన్ని బలిచేయడమే మార్గం. దీనికోసం భక్తియే సులువైన మార్గం. ఎందుకంటే పరమాత్మ చెప్పినట్లు అవ్యక్త ఉపాసన, దుఃఖభూయిష్టమూ, క్లేశ తరమూ అయినది. సగుణోపాసన సులభ మైనది. మోక్షసాధన సామగ్ర్యాం భక్తిరేవగరీయసి. మోక్షసాధన సామగ్రిలో భక్తియే గొప్పది అని నారదభక్తి సూత్రాలు చెప్పాయి. భక్తి అంటే ఏమిటి? భగవంతుని పైన ప్రేమతో చేసే ఉపాసన. ఈ ప్రేమ లౌకిక వాంఛల మీద కేంద్రీకృతమైతే అది రాగమౌతుంది. భగవంతుని మీద కేంద్రీకృతమైతే భక్తి అవుతుంది. భక్తి అనే మాట రాగానే మనకు పుష్పాలతో పూజలూ, ఆవాహనలూ, తీర్థయాత్రలూ, భజన స్మృతికి వస్తాయి. నిరంతరమూ చైతన్యుడిలాగా, గోపికల్లాగా, ఆత్మనివేదనం చేసుకునే ఉచ్చకోటికి చెందిన భక్తీ స్మృతికి వస్తుంది. పుష్పాదుల చేత పూజచేస్తూ, కైంకర్యం చేస్తూ భజనకీర్తన, దాసానుదాస సేవ వీటినన్నిటినీ అనుసరించిన భక్తి, అటుకాక ఆత్మశౌచంతో, మనో నిగ్రహంతో, త్రికరణ శుద్ధిగా, ఆత్మ నివేదనం చేసుకుని, పర మాత్మ కోసమే, పరమాత్మ చేయిస్తున్నాడనే భావంతో అనుసరించే భక్తిని విశేషభక్తి అంటారు. సామాన్యభక్తికి అపరాభక్తి అనీ, విశేషభక్తికి పరాభక్తి అనీ వేర్వేరు పేర్లు. శ్రీకృష్ణపరమాత్మ ఈ పరాభక్తిని గూర్చియే ఈ అధ్యాయంలో పేర్కొన్నారు. "మయ్యేవమన ఆధత్స్వ, మయిబుద్ధిం నివేశయ" అంటే నాయందే మనస్సును నాటి ఉంచు, నాయందే బుద్ధిని నిక్షేపించు అని బాహ్య పూజాదికములను ఉదహ రించకుండా, మనఃపూజనే చెప్పడానికి ఆరంభించారు. ఇదేమో మొదటి పాఠం, భక్తి యోగానికి. అర్జునుడు సగుణోపాసన మంచిదా, నిర్గుణోపాసన ముఖ్యమైనదా అని అడిగిన ప్రశ్నకు పరమాత్మ దేనికైనా 'శ్రద్ధయా పరయోపేతా' అని శ్రద్ధను ప్రధానంగా పేర్కొన్నారు. శ్రద్ధ లేనిది ఏదీ ఫలించదు. పరాభక్తి నిర్గుణోపాసనయే. దానికి మనస్సునే పూవుగాచేసి దేవుని కర్పించాలి. చివరకు ఆ పువ్వు కూడా

అదృశ్యం కాగా, అమనస్క పూజకు భక్తుడు పూనుకోవాలి. పరమాత్మ ముందు ముందు చెప్పబోయే 26 గుణాలు అలవర్చుకోవాలి. ఇదంతా సామాన్యుడికి సాధ్యమయ్యే పనా? మొదటి పాఠమైన 'మయ్యేవ మన ఆధత్స్వ మయి బుద్ధిం నివేశయ' అసాధ్యమైన పాఠమే. ఈ సంగతి పరమాత్మకు బాగా తెలుసు. కాబట్టి అర్జునుడికి అడగడానికి అవకాశం ఇవ్వకుండానే ఈ సాధన కష్టసాధ్యమైనదని నాకు తెలుసును. అంత పని నీవు చెయ్యలేకపోతే అంతకంటె సులభమైన; మఱో మార్గాన్ని చెబుతానని పై శ్లోకం చెప్పారు. అదే అభ్యాసయోగం. దానికి సామర్థ్యం కూడా పరమాత్మ నుండే లభించాలి. అభ్యాసం అయ్యేదే అభ్యాసం. సాధ్యం అయినదే సాధన. ఒకడు 160 పౌనుల బరువును ఎత్తాడనుకోండి. వాడికి సాధ్యమైనదే వాడు చేశాడు. పరమాత్మ వాడికా సామర్థ్యం ఇచ్చి ఉండకపోతే ఆ పని జరిగి ఉండేది కాదు. కనుక వాడికిష్టమైన సాధనను అభ్యాసం చెయ్యాలి అని ఈమాట కర్థం చెప్పాలి. ఎందుకంటే వాడికింతకంటే యోగంలేదు.

'సాధన చెయ్యవద్దని నా అభిప్రాయం కాదు. సాధ్యమయినదే సాధన. ఎంత వరకు నువ్వు చేస్తున్నావో అది సాధన. తరువాత వచ్చేది సాధ్యం అనుకుంటున్నారు వాళ్ళు. సాధ్యం అయితేనే కాని సాధన చేయలేదు. అంటున్నాను నేను. ఆ సాధన కూడా సాధ్యం కావాలి. ఎక్కడికక్కడ సాధ్యమేకాని సాధన అంటూ వేఱే లేదు'.

పరమాత్మ చెప్పిన రెండో పాఠం అభ్యాసయోగం.

పరమాత్మ సహజంగా వ్యక్తికి ప్రసాదించిన శక్తిమత్తను గూర్చిన అవ్యక్త స్మృతి సూత్రాలు చిత్తమూ బుద్ధీ వఱకు వ్యాపించి ఉంటాయి. అవసరం వచ్చినప్పుడు భగవత్ప్రేరణ మూలంగా, చిత్తానికీ, బుద్ధికీ, ఈ అవ్యక్త స్మృతులకూ లంకె ఏర్పడి అభ్యాస ప్రేరణ, ఉపాసక ప్రేరణగా రూపొందుతుంది.

10. అభ్యాసేప్య సమర్థోసి మత్కర్మ పరమో భవ।
మదర్థ మపి కర్మాణి కుర్వన్ సిద్ధి మవాప్స్యసి॥

తా: అభ్యాసం కూడా నీకు చేతకానిదయితే నా కర్మలనే చేస్తూ ఉండు. నన్ను గుఱించే కర్మలు చేస్తున్నా మోక్షం లభిస్తుంది.

వ్యా: వ్యాఖ్యాతలు మనస్సును గయ్యాళి భార్యగా పోలుస్తారు. 'మన్మనాభవ' శ్లోకంలో చెప్పిన ఒక్కక్షరాన్ని కూడా ఆమె ఒప్పుకోదు. దేహేంద్రియాల తృప్తి మానవ జన్మకు లక్ష్యమంది. అయితే విశ్వం అనంతం. అంతవంతమైన దేహాన్ని కొలమానం ఎందుకు చెయ్యాలి అంటే దానికదే దీనికిదే అంటుంది. అంతమైనా విజ్ఞానమే అనంతమైనా విజ్ఞానమే. అంతకుమించి ఏమీ లేదంటుంది. అయితే

ప్రకృతిని మానవుడు సృష్టించాడా? అంటే అవి వగదెగని ప్రశ్నలు. వాటిని నిద్ర లేపకండి. శరీరంతో పుట్టాము. దాని సమస్యలే మన జీవిత సమస్యలంటుంది.

సర్వ శక్తి మంతునకు, పరిపూర్ణుడికి ఏ సమస్యలూ, భేదాలూ, భయాలూ, ఎక్కువ తక్కువలు లేవు. కలగవు. సర్వశక్తిమంతుడు పరిపూర్ణుడు అంటే ప్రకృతియే తానయినవాడు. అంతకన్న తక్కువ వాళ్ళకే, అంటే సాధకులకు అర్జునుడు లాంటి వాళ్ళకే అభ్యాసాలు అవసరమవుతాయి. అభ్యాసం కూడ చేతకాకపోతే చేసే ప్రతిపని నా పేరు పెట్టి చెయ్యి అన్నారు పరమాత్మ. భగవదర్థమని చేసిన ప్రతీదీ సానుకూలమవుతుంది.

యద్య త్కర్మ కరోమి తత్త దఖిలం శంభో తవా రాధనమ్.

మూడో పాఠమిది.

అథైతద ప్యశక్తోఽ సి కర్తుం మద్యోగ మాశ్రితః।
సర్వకర్మ ఫలత్యాగం తతః కురు యతాత్మవాన్॥

తా: ఇక దాన్ని కూడా చేయడం నీ కశక్య మయితే మత్సంబంధమైన యోగాన్ని అవలంబించిన వాడవై పరమాత్మ అనుగ్రహంవల్ల మనస్సును స్వాధీనం చేసుకున్న వాడవై సర్వకర్మ ఫలత్యాగాన్ని చేయుము.

వ్యా: సర్వకర్మ ఫల త్యాగం నాలుగో పాఠం. భగవత్పరంగా అన్ని కర్మలూ చెయ్యడం కూడా చేతకాకపోతే ఇక గతేమిటి! అని విచారిస్తే శ్రీపాద సంతుష్టి కరమైన పూజ ఏమిటి అని అడిగితే

"దగ్గరకు చేరాలనుకోడం, చేతులు జోడించడం, పూలు వెయ్యాలనుకోడం, పండ్లు ఇవ్వడం, బొట్టు పెట్టించుకోవడం, రెండు చేతులతో ప్రసాదం పుచ్చుకోవడం – వెళ్ళిపోతూనే వెనక్కు తిరిగి చూడడం, సంకీర్తనం చేయడం – శ్రద్ధకు ఎన్నయినా ఉన్నాయి నాన్నా! దశాలు. ఒకటే మార్గం; నాయందు మనస్సుంచడం. నేనే నీ మనస్సు కావడం అనే ఉచ్చకోటికి చెందిన భావనతో మొదలుపెట్టి, అది చేతకాకపోతే సాధ్యమైన అభ్యాస కర్మను చెయ్యమని చెప్పి, అభ్యాసం కూడా చేతకాకపోతే నా కైంకర్య కర్మలను అంటే అన్ని కర్మలను భగవత్పరంగా చేయమని చెప్పి అదీ చేతకాకపోతే చేసిన కర్మల ఫలాలను త్యాగం చేయమని ఆదేశించారు పరమాత్మ.

కాబట్టి ఈ నాలుగు తరగతులు ఒకదాని కంటే ఒకటి సులభమైన తరగతి అన్నట్లుగా చెప్పారు. నాలిగింటిలోను ప్రధానపాత్ర వహించేది భక్తుడి మనస్సే.

మొదటి మయ్యేవ మన ఆధత్స్వ స్థితి సమాధి స్థితి. వ్యక్తిగత వ్యవసాయంతో పనిలేదు. సుకృతం పరమేశ్వరానుగ్రహం కారణాలు. అంతకంటె సులభమైన అభ్యాస స్థితిలో కూడా పరిపక్వం కావలసింది మనస్సే. పరిపక్వం కావలసింది భక్తుని శరీరంకాదు. అభ్యాసం కూడా కష్టసాధ్యమయితే అనే మాటకు అర్థం ఏమిటి? హెచ్చుతగ్గులతో సృష్టి అయింది. హెచ్చు తగ్గుల పాళ్ళను బట్టి పక్వతా యోగ్యత ఏర్పడుతుంది. అది కూడా దైవానుగ్రహ ఫలితమే.

అది సాధ్యం కాకపోతే మత్కర్మలను చేయమన్నారు. దేవాలయాలకు ఎంత మంది వెళ్తున్నారు? ఎంతమందికి దైవభావన ఉంది? దానికీ సంస్కారం కావా లంటారు. సంస్కారమంటే మళ్ళీ పైన చెప్పిన పరిపాకమే. ఇదీ సాధ్యం కాకపోతే కర్మఫల త్యాగం చేయమన్నారు. కాని అది కూడా కర్మమూ పరమాత్మే; త్యాగమూ పరమాత్మే అనే విశ్వాసం వస్తేకాని అబ్బదు. ఈ సమస్యకు తాళపుచెవి సర్వధర్మాన్ పరిత్యజ్య అనే శ్లోకమే.

12. శ్రేయో హి జ్ఞాన మభ్యాసాత్ జ్ఞానాద్ధ్యానం విశిష్యతే।
ధ్యానాత్ కర్మఫలత్యాగం త్యాగా చ్ఛాంతి రనంతరమ్॥

తా: అభ్యాసం కంటె జ్ఞానమే శ్రేయస్కరం. జ్ఞానం కంటే ధ్యానం విశిష్టమైనది. దానికంటె కర్మ ఫల త్యాగం విశిష్టమైనది. కర్మఫల త్యాగం అనంతరం ఈ అంతటికీ మధుర ఫలితమైన శాంతి లభిస్తుంది.

వ్యా: అభ్యాసం అంటే ద్వైధీభావం ఉన్నందుకు చిహ్నం. ఎక్కడో ఏదోగా ఉన్న దాన్ని, ఇక్కడే ఇదిగా మార్చుకొంటున్న వ్యక్తి చేస్తున్న ప్రయత్నం. తాను వేఱనుకుంటున్న వ్యక్తి మార్చుకున్న దానిలో కరగి పోవడానికి ప్రయత్నం. అలా అను కుంటూ చేస్తున్న సాధనే అభ్యాసం. ఈ అభ్యాసం సాగుతున్నంతసేపూ, భేదభావం, అహంభావం, మమత్వం, అన్నిపాకుడు లాగాపట్టుకొనే ఉంటుంది మనస్సుకు, మనస్సును. పట్టుకొన్న ఆపాకుడు తొలిగిపోతేజ్ఞానోదయ మౌతుంది. ఆజ్ఞానం అభ్యాసం కంటె ఎన్నోరెట్లు శ్రేష్ఠమైనది. ఈజ్ఞానం ఎట్టిది? ఒక్క మాటలో చెప్పాలంటే సర్వసమానస్థితి.

'జ్ఞానంవృద్ధాప్యం లాంటిది. అన్నీ అయ్యాయి! ఇంకా నాకెందుకూ అన్న లాంటిస్థితి. సర్వమూ ఏదో జరుపుకుపోతున్నది. అన్నది జ్ఞానం'

మఱి భక్తి విషయంలో కూడా ఇలాంటి మాటలే వస్తాయి కదా! భక్తి బాల్యం వంటిదని అమ్మ చెప్పారు కదా! రెంటికీ తేడా ఏమిటి? అనుకుంటే.

'మనమెఱిగిన సర్వానికీ కర్త ఒక రున్నారు. వారినిర్ణయం ప్రకారమే ఇవన్నీ జరిగిపోతున్నాయి. అని ఆ శక్తి యెడలపెంచుకొన్న గౌరవమేభక్తి' అన్నారు అమ్మ.

జ్ఞానంకంటే ధ్యానం విశిష్ఠమైనది అంటే జ్ఞానం పొందిన తరువాత కూడా ఉత్తరోత్తర శ్రేష్ఠములైన గతులున్నాయా అనిపిస్తుంది. ఏవిధంగా ధ్యానం జ్ఞానం కంటె విశిష్టమైనదని అనిపిస్తుంది? జ్ఞానం సర్వసమాన స్థితి అంటే ఇక దానికి కద లికలేనిది. స్థిరవిద్యుత్తులాంటిది. స్థిరవిద్యుత్తులోని చైతన్యం జాగరిత మయ్యేసరికి విద్యుత్తు ప్రవహించడ మారంభిస్తుంది లైట్లు వెలుగు తాయి, పంకాలు తిరుగు తాయి. యంత్రాలు నడుస్తాయి. జ్ఞానానికి చేతనత్వం అబ్బే సరికి జ్ఞాన సహిత ధ్యానం అవుతుంది. చలద్జ్ఞానమే ధ్యానం. ఉచ్చకోటికి చెందిన ఈ ధ్యానంలో వికారాలకు అవికారాలకు అభేదం. ఫలత్యాగం శ్రేష్ఠం అన్నారు పరమాత్మ. కర్మ ఫలానికి కర్మ కారణం. మనశ్శాంతి లేక తృప్తికి కర్మ ఫలం కారణం తృప్తి అంటే ఇంకా కావాలనేది లేక పోవడమే కనుక సర్వకామ్య ఫలత్యాగాలు అందులో విలీ నములయ్యే ఉంటాయి. ఇక తృప్తి లేక శాంతి కారణంగా కలిగే కార్యముగాని, కర్మ గాని, ఫలంగాని, ఉండ కుండా అక్కడితో అన్ని బస్సులకు Terminus లభిస్తుంది.

'సర్వమూతానే అయి నడుచుకు పోయేది ఉన్నది అన్న తెలివే జ్ఞానం. పొంద డమేగాని జ్ఞానం, జ్ఞానంవల్ల పొందడ మేమీ లేదు.'

అటు వంటిస్థితిలో

విశ్వనాట్యాన్ని దర్శించేది భక్తిగా అయి ఊరుకుంటుంది. నాట్యమే తానై ఊరుకుంటుంది జ్ఞానం,

సంప్రదాయ సిద్ధంగా వచ్చిన వ్యాఖ్యానాల్లో అయితే ఈశ్లోకానికి క్రింది విధంగా వివరణలు వ్రాశారు.

అభ్యాసమంటే స్మృతులను ధారావచ్ఛిన్నంగా పేర్చుకుంటూ, వాటికి క్రియా రూపం కల్పించడం అభ్యాసం. అభ్యాసం అవివేక పూర్వకంగా కూడా ఉండవచ్చు. కాని అభ్యాసం వల్లనే కార్యసాధన జరుగుతుంది. అది లేనిదే ఒక్క సారిగా ఎగిరిపై అంతస్థు మీద కూర్చోడం సాధ్యం కాదు, అభ్యాసానికి లక్ష్యమూ, లక్షణమూ, ప్రపత్తి క్రమమూ, అన్నీ జ్ఞానమే. కాబట్టి నిరంతర స్మృత్యధ్యవసాయం కంటె జ్ఞానమే మేలైనది. మొదట్లో ఇది క్లేశోధిక తరమని చెప్పినప్పటికీ స్మృత్యభ్యాసం కంటె అక్షర తత్వాను సంధాన పూర్వకమైన తదపరోక్ష జ్ఞానమే శ్రేష్ఠం. అపరి పూర్ణంగా ఉండే ఆత్మాపరోక్ష జ్ఞానంకంటె దానికి సాధనమైన ధ్యానమే మేలు. అసంపూర్ణ ధ్యానం కంటె దానికి సాధనమైన కర్మ ఫలత్యాగమే మేలు. ఈ రీతిగా

సాధనల సమర్థతల మీదా శ్రేష్ఠత్వం మీదా, పరిపూర్ణత మీదా ఈ విమర్శలు నడి పారు. గుఱ్ఱం బక్కగా ఉంటే దాన్ని బట్టే బండి వేగం. మార్గదర్శకత్వాన్ని ఇవి విచక్షించ లేదు. తప్పుడు మార్గం తప్పుడు చోటికే చేరుస్తుంది. అన్వయం తప్పేగాని మార్గం తప్పు ఇందులో ఏమీ లేదు.

పరమాత్మ ఉపదేశాన్ని ఇంకో విధంగా అన్వయించి అర్థం చేసుకోవచ్చు. ఒకానొక పరిపక్వస్థితిలో భక్తియే జ్ఞానంగా మారుతుంది. దాన్ని మధుర భక్తి అంటారు. రాధారుక్మిణుల ఉదాహరణలనిచ్చి అమ్మ ఎంతో నేర్పుగా ఈ మాటను చెప్పింది. మరిగుజ్జు మానవుడు ఆ జ్ఞాన ద్రాక్షాఫలాన్ని అందుకోవడమెలాగా అంటే పరమాత్మ చివరి ఏడు శ్లోకాలలో తనకు ప్రియుడైన భక్తుడికి ఏయే గుణాలుండాలో విశదీకరిస్తూ, 'ఇతిగుహ్యాతరంశాస్త్రం ఇదం ప్రోక్తం మయానఘ' అంటూ భక్తి యోగాన్ని ముగిస్తారు.

13. అద్వేష్టా సర్వభూతానాం మైత్రః కరుణ ఏవచ।
నిర్మమో నిరహంకార స్సమ దుఃఖ సుఖః క్షమీ॥

14. సంతుష్ట స్సతతం యోగీ, యతాత్మా దృఢ నిశ్చయః।
మయ్యర్పిత మనో బుద్ధి ర్యో మద్భక్త స్స మే ప్రియః॥

తా: సర్వ భూతాల యందూ ద్వేషంలేనివాడూ, మైత్రీ కరుణా గలవాడూ, నిర్మముడూ, నిరహంకారుడూ, సుఖ దుఃఖాలను సమ భావంతో చూచేవాడూ, క్షమాశీలుడూ, ఎల్లప్పుడూ సంతుష్టి కలవాడూ, యోగీ, దృఢనిశ్చయుడూ మనో బుద్ధులను నాకు అర్పించిన వాడూ, నాకు భక్తుడయిన వాడూ, నాకు ప్రియం గూర్చే వాడవుతాడు.

వ్యా: అనావాప్తకామం ద్వేషానికి బీజమౌతుంది. ఇద్దఱు స్త్రీలు ఒక పురుషుణ్ణి ప్రేమించడం, ఇద్దఱు ప్రయత్న శీలురు ఒక ధనరాశి కోసం అఱ్ఱులు సాచినా ద్వేషాన్ని పుట్టిస్తుంది. ఇద్దఱు యాచకులు బిచ్చం కోసం వెళ్లి, ఇంటి వాకిట్లోనే దెబ్బలాడుకుంటారు. యాచకో యాచక శ్శత్రుః. ఇద్దఱికీ బిచ్చం ముట్టవచ్చునుగాక. అది వేఱే సంగతి, రెండోవాడి బిక్షం కూడా తనకే ముట్టాలి అనే ఆశాలోభం దీనికి కారణం. తన కంటే అధినేత ఇంకొకడుండకూడదనే స్వార్థం అభిమానం స్వార్థం ద్వేషాన్ని రగిలిస్తుంది. దీనికి విఱుగుడు భగవద్విషయంగాని ప్రతి దాన్ని ద్వేషించడం. ద్వేషంలో వేడి ఉంది. మన ద్వేషాన్ని చలిమంటలాగా చేస్తే నలుగురు చుట్టూ చేరతారు. అందులో దుశ్చేష్ట దుశ్చింతన లేకుండాలి

మైత్రిపాయసంలాగా మధురంగా ఉండాలి. జగత్తును తగులబడే ఇల్లు లాగా అనుకుని బయట బడడానికి ప్రయత్నిస్తూ ఉంటే మంటలు వాటిపని నవి చేస్తాయి. సాయంచేయడానికి మనస్సు ముందుకు దూకాలి. అప్పుడు భగవద్విముఖులమీద జాలి, కరుణ సహజంగా పుడతాయి. రాజకీయాలలోని జాలి ప్రత్యాశా ఫలితం. అది ఓట్లకోసం, కృత్రిమమైన కరుణ. దాతవేదనలో ఆత్మవేదన లే కుంటే అది సజావైనది కాదు. దుఃఖాన్ని కూడా సుఖంగా అనుకోగల మన శ్శిక్షణ కలగాలి. అది కలగడం భగవదనుగ్రహం వల్లనే, అంతా వాడే చేస్తున్నాడని నమ్మడం వల్ల ఈ మార్పు వస్తుంది.

సతతం యోగీ అనే మాటకు సర్వకాల సర్వావస్థల యందు. సమాన స్థితిలో ఉండేవాడని అర్థం. సమష్టి రూపమైన సమాధిస్థితి యే సతతయోగి లక్షణం. సమాధిలో ఉండి కూడా అతని ప్రపంచం మన ప్రపంచంగానే ఉండి పోతుంది.

దృఢనిశ్చయః: అతని మనస్సు తిరుగుళ్లు మానేస్తుంది. తాను కల్పించిన దాన్నే మనస్సు చూచుకుంటుంది. వింటుంది. స్పృశిస్తుంది. అంతే కాక ఈ ఇంద్రియ వ్యాపారాలకు అందని ఆనందమయమైన స్థితిని, సర్వాంతర్యామిస్థితిని కూడా ఇదే దృఢనిశ్చయం కలిగిస్తుంది.

మయ్యర్పిత మనో బుద్ధిః ఒకసారి అలాగా అవతలగట్టుకు చేరుకుని, ఇవతల గట్టూ అవతలగట్టూ, మధ్య నుండే ప్రవాహమూ తానే అయిపోయి, ఆధారాధేయ భావ సంపుటిగా తానే అయిపోయి, మారి, ఉండీ లేకుండినవాడు, తనువులోని ప్రతీకణమూ, ప్రతీస్పందనమూ, ప్రతీ బిందువూ, ఆత్మ మయమైనవాడు అటువంటి భక్తుడు నాకు ప్రియుడు అని పరమాత్మ సెలవిచ్చాడు.

కో వా దరిద్రో హి విశాల తృష్ణః శ్రీమాంశ్చ
కో యస్య సమస్త తోషః– శంకరులు.
మిక్కుట మైన ఆశకలవాడే దరిద్రుడు.
పరమసంతుష్టి కలవాడే శ్రీమంతుడు.

15. యస్మా న్నో ద్విజతే లోకో లోకా న్నో ద్విజతే చ యః।
హర్షా మర్ష భయో ద్వేగైః ముక్తో యస్స చ మే ప్రియః॥

తా: ఎవడి వలన లోకం ఉద్వేగమూ సంతాపమూ చెందదో, లోకంవల్ల ఎవడు ఉద్వేగమూ సంతాపమూ చెందడో, ఎవడు హర్షము, కోపము, భయము ఉద్వేగము లేని వాడో అట్టివాడు నాకు ప్రియుడు.

వ్యా: కర్ణుడిలాగా కొంత మంది పుట్టి తప్పు చేస్తారు. వాళ్లు చేసిన తప్పుల్లా జన్మమెత్తడమే. పోతనగారు చెప్పినట్లు

చేతులారంగ శివుని పూజింపడేని,

నోరునొవ్వంగ హరికీర్తి నుడువడేని,

దయయు, సత్యంబు లోనుగా దలపడేని,

కలుగనేటికి తల్లుల కడుపుచేటు.

అనే మాట అలా ఉంచినా, వాళ్ళ బ్రతుకు వాళ్లకే భారంగా, భూమికి భారంగా లోకానికే భారంగా చేస్తుంటారు. రౌడీలు, జులాయిలు, పోకిరీమూకలు, హంతకులు, ఈజాతికి చెందుతారు. ఇతరులను బాధించి వాళ్లు ఆనందిస్తారు.

ఎవడు బ్రతికితే పదిమంది బ్రతుకుతారో వాడి బ్రదుకు బ్రదుకుగాని ఎవడు బ్రదికితే పది మంది బాధపడతారో వాడి బ్రదుకు బ్రదుకు కాదు.' నీవు ఏమి చేసినా నా ఒడిలో స్థానం ఉంది. నీకు ప్రేరణ ఇచ్చిన శక్తిదిగాని నీదేమున్నది. అందుకనే గాయత్రీ మంత్రంలో మాబుద్ధిని మంచి పనులు చేసేలాగానే ప్రేరేపించ మని, దేవీ ప్రార్థన.

దుష్ట సంహారం అంటే దుష్టులను సంహారంచేయడమే అని మన భావన. దుష్టులలోని దుష్టత్వాన్ని సంహారంచేయడమని అమ్మభావన.

చెడ్డవారిని అందఱూ అగౌరవిస్తారు. అసహ్యించుకొంటారు. బహిష్కరిస్తారు. ఇక నేనూ వాళ్లను దగ్గఱకు తీసుకోకపోతే వారిగతి ఏమవుతుంది. అంటుంది అమ్మ

బిడ్డ బురద పూసుకు వచ్చినా శుభ్రపఱచ వలసిన బాధ్యత తల్లిదే. వాడికేమీ పట్టదు. అని కూడా అమ్మ ఒప్పుకున్నది. ఒకప్పుడు తననుదూషించిన వారి విష యంలో- దూషణ కూడా ఒక విధమయిన ఆరాధనయే అని ఉదారంగా సమ ర్థించింది అమ్మ. తనను క్రూరంగా హింసించిన వారిని సైతమూ కరుణించిన సంఘటనలనేక మున్నాయి అమ్మ జీవితంలో. అమ్మ అందఱినీ ప్రేమించడానికి కారణం, మన అర్హతలు కావనీ అమ్మకు ప్రేమించడం సహజమనీ తేలుతుంది. అమ్మకు అనుగ్రహం వానజల్లు లాంటిది. ఆజల్లు కొందఱిపై కురిసి కొందఱి పై కురవకపోదు. అమ్మ కరుణ అనే వెన్నెలలో తడిసి లోకం పరవశించడం తప్పవేతే అనుభవింపజాలదు.

'యస్మాన్నోద్విజతే' అనే మాటల కర్థం అటువంటి సంతోషం కోసం ఉద్వేగం నుండి ముక్తుడైన భక్తుడు నాకు ప్రియుడని పరమాత్మ సెలవిచ్చారు.

16. అనపేక్ష శ్శుచి ర్దక్షః ఉదాసీనో గతవ్యథః!
సర్వారంభ పరిత్యాగీ యో మద్భక్త స్స మే ప్రియః!!

తా: కోరిక లేనివాడు, పరిశుద్ధుడు, నేర్పుగల వాడు, తటస్థుడు, దిగులు లేనివాడు, సమస్త కార్యములు పరిత్యజించినవాడు నాయందు భక్తిగలవాడు నాకు ప్రియుడు.

వ్యా: నాకు లేదు అనే భావమే ఆపేక్ష, నాకు లేదు అనే భావం లేక పోవడమూ, లేనిదాని కోసం ప్రాకులాట వల్ల అవస్థలు, లేక పోవడం అనపేక్ష. ఇది కూడా అదృష్టం వల్ల కలగాల్సిందే.

జాతకరీత్యా అందఱి కంటే అదృష్టవంతురాలిని, నేను ఒక్క దాన్నే. ఎందు కంటే ఇది అవస్థ అనే చింతనాకు లేక పోవడమేగా అదృష్టం. అటు వంటప్పుడు, కష్టానికీ, బాధకూ చోటేదీ? ఎన్ని ఉన్నా, ఎంత సుఖం ఉన్నా, నాకు లేదు అనుకోవ డమే దురదృష్టం. అటు వంటి దురదృష్టాలు అదృష్టాలు రెండూ భావనలే.

శుచి అంటే మైలా మడీ కాదు. దేహశౌచంతో పాటు అంతశ్శౌచం కూడా కావాలి. ఆచారాలూ, నియమాలు, అవి శీతోష్ణ పరిస్థితుల ననుసరించి దేశ కాలా ద్యవసరాలను బట్టీ అనేక రీతులుగా మారుతూ ఉంటాయి. మనం దేవాలయంలోకి వెళ్లేటప్పుడు చెప్పులు వేసుకుని వెళ్లం. క్రిస్టియనులు బూట్లతోనే చర్చిలకు వెళ్తారు. రోజుకుమూడు స్నానాలు శుచిప్రదాలుగా మనం భావిస్తాం. కాశ్మీరు, టిబెట్టు లాంటి చోట్ల మూడుస్నానాలు సాధ్యపడవు. మనుస్మృతి లాంటి శౌచప్రక్రియలన్నీ ఇతరదేశాలలో, ఇతరమతాలలోను సాధ్యాలు కావు. శుచి అంటే న్యాయంగా సంపా దించిన ధనంతోనే పెంచిన శరీరం కలవాడు అనికూడా మఱో అర్థం చెప్పారు. పరమాత్మ ఆరాధనకు శరీరమూ, మనస్సూ, ధర్మసాధనాలు కాబట్టి ఈ రెంటినీ శుచిగా ఉంచితే అక్కడ పుట్టే భావాలూ, శరీర వ్యాపారాలు, కూడా శుచిగా ఉంటా యని సంప్రదాయ సిద్ధంగా ఇచ్చే అర్థం. 'ఆచరించడమే ఆచారమంటే అంటుంది అమ్మ, మనం చేస్తున్నది మన మనస్సుకు తెలుస్తున్నదిగా, రెండుగంటల సేపు సోపులతో రుద్దుకొని స్నానం చేసిన తరువాత కూడా, పెదవులు సహస్రగాయత్రిని, మనస్సు సినిమాలో సావిత్రిని, మననం చేస్తూంటే అదేంశుచి అవుతుంది? ఇలా చెయ్యాలా, అలాచెయ్యాలా అనే ఆలోచనతో, అసలు చెయ్యకపోవడమే అనాచారం గానీ, మిథ్యాచారం ఆచారంకాదు. సందేహమే అనాచారం. అసలు మానడం కంటె పాకీదొడ్లో జ్ఞాపకంవస్తే నామం చేసినా అది ఆచరణే అయిందిగా! ఇలాగా అన డంలో పాకీ దొడ్డిలోనే చెయ్యమన్న మాటేంకాదు. ఆచారమంటే ఆచరణం. ఒకడు

వ్యా: కర్ణుడిలాగా కొంత మంది పుట్టి తప్పు చేస్తారు. వాళ్లు చేసిన తప్పులల్లా జన్మమెత్తడమే. పోతనగారు చెప్పినట్లు

చేతులారంగ శివుని పూజింపడేని,

నోరునొవ్వంగ హరికీర్తి నుడువడేని,

దయయు, సత్యంబు లోనుగా దలపడేని,

కలుగనేటికి తల్లుల కడుపుచేటు.

అనే మాట అలా ఉంచినా, వాళ్ళ బ్రతుకు వాళ్లకే భారంగా, భూమికి భారంగా లోకానికే భారంగా చేస్తుంటారు. రౌడీలు, జులాయిలు, పోకిరీమూకలు, హంతకులు, ఈజాతికి చెందుతారు. ఇతరులను బాధించి వాళ్లు ఆనందిస్తారు.

ఎవడు బ్రతికితే పదిమంది బ్రతుకుతారో వాడి బ్రదుకు బ్రదుకుగాని ఎవడు బ్రదికితే పది మంది బాధపడతారో వాడి బ్రదుకు బ్రదుకు కాదు.' నీవు ఏమి చేసినా నా ఒడిలో స్థానం ఉంది. నీకు ప్రేరణ ఇచ్చిన శక్తిదిగాని నీదేమున్నది. అందుకనే గాయత్రీ మంత్రంలో మాబుద్ధిని మంచి పనులు చేసేలాగానే ప్రేరేపించ మని, దేవీ ప్రార్థన.

దుష్ట సంహారం అంటే దుష్టులను సంహారంచేయడమే అని మన భావన. దుష్టులలోని దుష్టత్వాన్ని సంహారంచేయడమని అమ్మభావన.

చెడ్డవారిని అందఱూ అగౌరవిస్తారు. అసహ్యించుకొంటారు. బహిష్కరిస్తారు. ఇక నేనూ వాళ్లను దగ్గఱకు తీసుకోకపోతే వారిగతి ఏమవుతుంది. అంటుంది అమ్మ

బిడ్డ బురద పూసుకు వచ్చినా శుభ్రపఱచ వలసిన బాధ్యత తల్లిదే. వాడికేమీ పట్టదు. అని కూడా అమ్మ ఒప్పుకున్నది. ఒకప్పుడు తననుదూషించిన వారి విష యంలో- దూషణ కూడా ఒక విధమయిన ఆరాధనయే అని ఉదారంగా సమ ర్థించింది అమ్మ. తనను క్రూరంగా హింసించిన వారిని సైతమూ కరుణించిన సంఘటనలనేక మున్నాయి అమ్మ జీవితంలో. అమ్మ అందఱినీ ప్రేమించడానికి కారణం, మన అర్హతలు కావనీ అమ్మకు ప్రేమించడం సహజమనీ తేలుతుంది. అమ్మకు అనుగ్రహం వానజల్లు లాంటిది. ఆజల్లు కొందఱిపై కురిసి కొందఱి పై కురవకపోదు. అమ్మ కరుణ అనే వెన్నెలలో తడిసి లోకం పరవశించడం తప్పవేతే అనుభవింపజాలదు.

'యస్మాన్నోద్విజతే' అనే మాటల కర్థం అటువంటి సంతోషం కోసం ఉద్వేగం నుండి ముక్తుడైన భక్తుడు నాకు ప్రియుడని పరమాత్మ సెలవిచ్చారు.

16. **అనపేక్ష శ్శుచి ర్దక్షః ఉదాసీనో గతవ్యథః!**
సర్వారంభ పరిత్యాగీ యో మద్భక్త స్స మే ప్రియః!!

తా: కోరిక లేనివాడు, పరిశుద్ధుడు, నేర్పుగల వాడు, తటస్థుడు, దిగులు లేనివాడు, సమస్త కార్యములు పరిత్యజించినవాడు నాయందు భక్తిగలవాడు నాకు ప్రియుడు.

వ్యా: నాకు లేదు అనే భావమే ఆపేక్ష, నాకు లేదు అనే భావం లేక పోవడమూ, లేనిదాని కోసం ప్రాకులాట వల్ల అవస్థలు, లేక పోవడం అనపేక్ష. ఇది కూడా అదృష్టం వల్ల కలగాల్సిందే.

జాతకరీత్యా అందఱి కంటే అదృష్టవంతురాలిని, నేను ఒక్క దాన్నే. ఎందు కంటే ఇది అవస్థ అనే చింతనాకు లేక పోవడమేగా అదృష్టం. అటు వంటప్పుడు, కష్టానికీ, బాధకూ చోటేదీ? ఎన్ని ఉన్నా, ఎంత సుఖం ఉన్నా, నాకు లేదు అనుకోవ డమే దురదృష్టం. అటు వంటి దురదృష్టాలు అదృష్టాలు రెండూ భావనలే.

శుచి అంటే మైలా మడీ కాదు. దేహశౌచంతో పాటు అంతశ్శౌచం కూడా కావాలి. ఆచారాలూ, నియమాలు. అవి శీతోష్ణ పరిస్థితుల ననుసరించి దేశ కాలా ద్యవసరాలను బట్టీ అనేక రీతులుగా మారుతూ ఉంటాయి. మనం దేవాలయంలోకి వెళ్లేటప్పుడు చెప్పులు వేసుకుని వెళ్లం. క్రిస్టియనులు బూట్లతోనే చర్చిలకు వెళ్తారు. రోజుకుమూడు స్నానాలు శుచిప్రదాలుగా మనం భావిస్తాం. కాశ్మీరు, టిబెట్టు లాంటి చోట్ల మూడుస్నానాలు సాధ్యపడవు. మనుస్మృతి లాంటి శౌచప్రక్రియలన్నీ ఇతరదేశాలలో, ఇతరమతాలలోను సాధ్యాలు కావు. శుచి అంటే న్యాయంగా సంపా దించిన ధనంతోనే పెంచిన శరీరం కలవాడు అనికూడా మఱో అర్థం చెప్పారు. పరమాత్మ ఆరాధనకు శరీరమూ, మనస్సూ, ధర్మసాధనాలు కాబట్టి ఈ రెంటినీ శుచిగా ఉంచితే అక్కడ పుట్టే భావాలూ, శరీర వ్యాపారాలు, కూడా శుచిగా ఉంటా యని సంప్రదాయ సిద్ధంగా ఇచ్చే అర్థం. 'ఆచరించడమే ఆచారమంటే అంటుంది అమ్మ, మనం చేస్తున్నది మన మనస్సుకు తెలుస్తున్నదిగా, రెండుగంటల సేపు సోపులతో రుద్దుకొని స్నానం చేసిన తరువాత కూడా, పెదవులు సహస్రగాయత్రిని, మనస్సు సినిమాలో సావిత్రిని, మననం చేస్తూంటే అదేంశుచి అవుతుంది? ఇలా చెయ్యాలా, అలాచెయ్యాలా అనే ఆలోచనతో, అసలు చెయ్యకపోవడమే అనాచారం గానీ, మిథ్యాచారం ఆచారంకాదు. సందేహమే అనాచారం. అసలు మానడం కంటె పాకీదొడ్లో జ్ఞాపకంవస్తే నామం చేసినా అది ఆచరణే అయిందిగా! ఇలాగా అన డంలో పాకీ దొడ్డిలోనే చెయ్యమన్న మాటేంకాదు. ఆచారమంటే ఆచరణం. ఒకడు

జ్ఞాపకం వచ్చినప్పుడల్లా నామం చేస్తాడు. ఎక్కడ అన్న ప్రశ్నే లేదు. చెయ్యడమే ఆచారం మడి దడి అక్కర లేదా అను కుంటే దానికి జవాబుగా అమ్మ 'శుచిని ఆచరించేదే మడి' అన్నది. ఎవరికి కావలసిన శుచి వాడు చేసుకో వచ్చు, పై వాళ్లు చెప్పిన శుచి చెయ్యలేక పొయ్యామని బాధపడనక్కఅలేదు. చెప్పేవాళ్లెన్నైనా చెబు తారు. గట్టు మీదకూర్చుని ఎన్నైనా చెప్పవచ్చు. నీటిలో పడి ఈదే వాడు, తనకు వీలైనదే చేయగలడు. చెయ్యాలిగూడా!

నీటి మీదతేలి ఈదుకుపోయేదే ఈత. ఏపద్ధతైతేనేం ఆచరించమే ఆచారం. శుచీ.

దక్షః: నేర్పూ సమర్థతా కలవాడు. కుమ్మరి వాడు కుండలు చేస్తుంటే, తాను కూజాగా అవుదామను కున్నా, కుండ కూజాగా కాదు. తనకిచ్చిన దాన్నే, ఇది వఅకు అయి ఉన్నదాన్నే, సందేహంలే కుండా భగవంతుడు నాచేతచేయిస్తున్నాడు. అనేభావనే నేర్పూ, సమర్థత.

ఉదాసీన: సాక్షి మాత్రుడై, తటస్థుడై ఉండేవాడు. సంప్రదాయసిద్ధాంతాలు ఏమి చెప్పినా మానవ యత్నము, దైవసంకల్పము, రెండూ వేఱుగా ఉన్నాయని చెబుతూ ఉంటాయి. అమ్మ' ఈ రెండూ ఒకటే నాన్నా అని చెబుతుంది. 'తనకున్నది తప్పదు. అనుకున్నది జరగదు! అని కూడా చెబుతుందమ్మ.

అలాంటి పరిస్థితిలో మనుష్యుడు తానునిమిత్త మాత్రుడనిన, ఉపకరణం లాంటి వాడిననీ, తలిచే తటస్థభావం సహజంగా రావలసిందే. ఫ్యాక్టరీలో ఎన్ని యంత్రాలున్నా తమంతట అవిపని చెయ్యలేవు కదా. మెకానిక్ పని చేయిస్తేనే అవి పని చేయాలి మాయిష్టం వచ్చినట్లు మేం చేస్తాం అనుకోవడం మెకానిక్ మీద సుత్తెలూ, ఉలులూ తిరుగుబాటు చేసినట్లు అవుతుంది.

గతవ్యథః: దైవం అనుగ్రహించడం వల్ల పై నమ్మకం మనస్సులో కుదిరిన వాడు మనుష్యుని మనస్సులో ఏవిధమయిన శంకలూ వ్యథలూ ఉండవు. మన స్సులో చిక్కుముళ్లైన ప్రతి శంకా ఒక వ్యథే. శంక మానవుడి స్వభావం. దాన్ని పోగొట్టడం భగవంతుని బాధ్యత, కటాక్షం. అవి ఎప్పుడు మనుష్యుడి మీదలేవా? అంటే భగవంతుని కటాక్షం ఎప్పుడూ ఉన్నది. కాని నీవు అనుకున్నది అనుకున్నట్లు జరిగి నప్పుడు దానిని గుర్తిస్తావు. అన్నది అమ్మ. ఈ హెచ్చుతగ్గులే వ్యథా బీజాలు. సంప్రదాయస్థులు లీల లంటారు.

సర్వారంభ పరిత్యాగీ: అంటే కర్తృత్వం తనమీద పెట్టుకొని చేసే ప్రతి పనీ

ఆరంభమే. ఆరంభపరిత్యాగం అంటే కర్తృత్వభావనను విడిచి పెట్టడమే. తమాము కర్మలను విడిచి పెట్టడమని అర్థంకాదు. 'నహికశ్చిత్ తక్షణమపి జాతు తిష్టత్య కర్మకృత్.' ఏ పనీ చెయ్యకుండా భీష్మించి కూర్చుందా మను కున్నా మనుషుడు కూర్చోలేడు. వాడిచెవులు నులిమి పని చేయిస్తుంది ప్రకృతి, పైలక్షణాలు కలభక్తుడు నాకు ప్రియుడు. అని పరమాత్మవాకొన్నాడు.

17. యో న హృష్యతి న ద్వేష్టి న శోచతి న కాంక్షతి।
శుభాశుభ పరిత్యాగీ భక్తిమాన్ య స్స మే ప్రియః॥

తా: ఎవడు సంతోషించడో, ఎవడు ద్వేషించడో ఎవడుశోకింపడో, ఎవడు కాంక్షింపడో, ఎవడుశుభాశుభాలను పరిత్యజించాడో, ఎవడు నాకు భక్తుడో అతడు నాకు ప్రియుడు.

వ్యా: మనుష్యుడెప్పుడు సంతోషిస్తాడు? ఎప్పుడు ద్వేషిస్తాడు? తనకోరికలు తీరినప్పుడు సంతోషిస్తాడు. తీరనప్పుడు ద్వేషిస్తాడు కోరికలు తీరడమనే భావం తో కవులు ఎన్నో మనోహరమైన ఆటలు ఆడుకున్నారు. తీరేవి కోరికలు కావు.

నిస్స్వోవృష్టిశతం, శతీదశశతం, లక్షం సహస్రాధిపో
లక్షేశః క్షితిపాలతాం, క్షితిపతి శ్చక్రేశతాం వాంఛతి
చక్రేశః సురరాజతాం సురపతి ర్బ్రహ్మాస్పదం వాంఛతి
బ్రహ్మా శైవపదం, శివో హరిపదం, హ్యాశాఽవధిం కో గతః

ఏమీలేనివాడు నూరు రూపాయల కోసం, నూరున్నవాడు వెయ్యికోసం, వెయ్యివాడు లక్షకోసం, లక్షాధికారి రాజరికం కోసం, రాజు చక్రవర్తి పదవికోసం, చక్రవర్తి దేవేంద్ర పదవికోసం, దేవేంద్రుడు బ్రహ్మ శివపదవులకోసం, శివపదస్థుడు విష్ణుపదం కోసం, ప్రాకులాడుతారు. ఆశకు అంతెక్కడ? అని అర్థం కోరికలోనే ఇంకో కోరిక భూతం అణిగి ఉంటుంది. పైది తీరినట్లు కన్పించగానే, లోపలి భూతం ఎత్తు నుంచి చెట్టులాగా, ఐ, ఆచెట్టు ఇంకా అనంతమయిన చెట్లుగా వృద్ధి అయ్యేబీజాలను సృష్టిచేస్తుంది. కనుక కోరిక తీరడమంటూ ఉండదు. సృష్టిక్రమ మంటే భగవదనుగ్రహమే, అనుగ్రహమే భగవంతుడు, అనుగ్రహమే విశ్వవ్యాప్తికే. విశ్వక్రియాసిద్ధికే కారణంగాను, కార్యం గాను అవుతున్నది, అందులో మన కోరి కలు ఎప్పుడు తీరాలో ప్రతి కోరికకు తరుణం నిర్ణీతమయ్యే ఉన్నది ఈ తరుణం వ్యక్తి గతంగా రూపొందడం సహజంగానే జరుగుతున్నా, విశేషంగా మనం అను కుంటుంటాం. పరమాత్మను మన పూజలతో కానుకలతో సంతుష్టుణ్ణిచేసి, ఆ తరు

ణాన్ని ముందుకు జరపడానికి ప్రయత్నిస్తుంటాం. ఈ విధంగా ఒక పక్షపాత బుద్ధిని, లంచగొండితనాన్నీ పరమాత్మకు అంటగట్టు తుంటాం. ఇటు వంటి ఇచ్ఛాద్వేషాలు, పరమాత్మకు లేవు. 'నాదేమీ' లేదు. ఆ తరుణం వచ్చితీరింది. అంటుంది అమ్మ ఎవరైనా తమ కోరికలు అమ్మ అనుగ్రహం వల్ల తీరాయంటే ' ఇదంతా మీరనుకుం టున్న విధంలో తీరటం లేదు. అది సృష్టిలో నిర్దేశింపబడినదే, అంటుంది. కోరిక తీరాలని ఎంతగా ఆమె సంకల్పమో అప్పుడు ఆకోరిక కోరాలనే బుద్ధికలగడమూ ఆమె సంకల్పమే అంటుంది.

మనిషి పుట్టడం తోటే గుణాలు ఉత్పన్నమయినాయి. గుణాలు అన్ని వేళల్లో ఒకటిగా ఉండడమనేది లేదు. అన్ని గుణాలు పరిపూర్ణమవడంవల్ల వ్యక్తం కాకపోగా ఒకే భావం కలుగుతున్నది. నిండుగా ఉన్నప్పుడు ప్రకోపించవు. ప్రేమ ఎట్లా ఉన్నదో ద్వేషమట్లానే ఉన్నది. ప్రేమ మారితేనే ద్వేషం, నా బాధను బట్టి గదా నీ బాధ అర్థమవడం 'అమ్మ'.

"నేను కోరాను. ఒక విధంగా జరిగి ఉండవలసిన దాన్ని కేవలం నా మీద దయతో భగవంతుడు మార్చేశాడు". కోరికలు తీర్చడమంటే మన దృష్టిలో ఇది. భగవంతుని అనుగ్రహం 'నీ', 'నా' విచక్షణలేనిది, విచక్షణ లేని వీక్షణే అనుగ్రహం.

ఈ సత్యాన్ని గుర్తించి కోరికలు తమంతట తాము తీరినప్పుడు, హర్షించి పొంగిపోయి ఒళ్ళు మరిచిపోడో, అవి తీరనప్పుడు ప్రపంచమంతా తనకు శత్రువైన దనీ, తనకు ఇన్ని అవసరాలు పెద్ద పులుల్లాగా గాండ్రుమంటూ కనిపిస్తున్నా, ఒక్క లాటరీని కూడా తనకు ప్రసాదింపడో భగవంతుడు అని పరమాత్మకు పక్షపాత ధోరణిని అంటగట్టి ఇలాటి పరమాత్మ ఉండేం లేకేం అని అతన్ని ద్వేషిస్తూ ఉండే వాడు భక్తుడు అనిపించుకోడు. ఆ లక్షణాలు లేకపోవడమే భక్తుని స్వభావమని పరమాత్మ ఘోషిస్తున్నాడు.

కావలసినదంతా నిర్ణీతమయ్యే ఉంది. నేనే ప్రయత్నం చేసినా వ్యర్థమే. మఱి ఇలాంటి ఖైదీ జన్మను పరమాత్మ నాకివ్వడమెందుకు? ఇలా బందీలను తయారు చేసి పారెయ్యడంలో పరమాత్మ ఉద్దేశ్యమేమిటి? ఇటువంటి ఇనుపచట్రంలాంటి సంసార యంత్రంలో ఏదో చిన్న స్క్రూలాగా నన్ను చేసిపారేసి, ఇలా నా జీవితాన్ని వ్యర్థం చేయడంలో పరమాత్మకు లభించే ఆనందం ఏమిటి? మనం ఇన్ని అద్భుతమైన పరిశోధనలను వెలికి దీస్తున్నాం ఇంతప్రగతిని సాధిస్తున్నాం. ఇదంతా తనదే అనుకోడానికి సాధిస్తున్నాం. ఇదంతా తనదే అనుకోడానికి మన ప్రయ

త్నంలో ఏమాత్రమైనా భాగాన్ని పంచుకున్నాడా? కనీసం అలా చెయ్యి. ఇలా చెయ్యి అని సలహాలయినా ఇచ్చాడా? అంటూ ఏడుస్తూ కూచోడు భక్తుడు. అమ్మ మాటల్లో అతనికి విశ్వాసం ఉంది.

'మీరు దేనికీ కర్తలు కారనిపిస్తుంది. ఏం జరిగినా వీటన్నిటికీ ఒకే కారణం కనిపిస్తుంది నాకు. అందుకే ఒక దాని గొప్పతనం ఇంకో దాని కొద్దితనం కనిపించదు, ఒక వస్తువు తయారు చేశామన్నా దాని మూలం అయిన భూమి గుర్తుకొస్తుంది. అదే ఇవ్వగాలేనిది మనం చెయ్యడంలో విశేషమేమున్నది? పదార్థాలను వస్తువులను మార్పుచెయ్యడంలో మన ప్రతిభ ఉన్నదనుకున్నా- అంటే భూమిలోంచి ఇనుం వచ్చిదానంతటది బీర్వాకాలేదు. మనం చేస్తేనే అయింది. అయినా ఆభూమిలో నుండి రావడానికి అదే కారణమనిపిస్తుంది నాకు. కిరసనాయిలు దీపం కనిపెట్టినా, విమానం కనిపెట్టినా ఆరెండూ నాకు ఒకటే- నాకు రెండు అనిపించదు. మూలకారణ మయిన దానికి అంతశక్తి ఉన్నది. సృష్టినే ఇచ్చిన శక్తికి ఏది కష్టం?

కాబట్టి ప్రతిభా విశిష్టాలయిన విజయానుభూతులను సాధించుదా మని ప్రాకులాడ కుండా, శుభాశుభఫలసిద్ధులన్నింటినీ పరమేశ్వర శక్తిచుంబితాలుగానే తలపోసి ఆయనపైన భక్తి తప్ప సర్వమూవిడిచిన వాడు నాకుప్రియుడు. అని పరమాత్మ ఆనీతిచ్చాడు

18. సమ శ్శత్రౌ చ మిత్రే చ తథామానావ మానయోః।
శీతోష్ణ సుఖ దుఃఖేషు సమస్సంగ వివర్జితః॥

19. తుల్య నిందా స్తుతిర్మౌనీ సంతుష్టో యేన కేనచిత్।
అనికేత స్థిర మతిః భక్తిమాన్ మే ప్రియో నరః॥

తా: శత్రు మిత్రుల యందు సమభావం కలవాడు, మానావ మానముల యందు, సుఖదుఃఖాల యందు కూడా తుల్యభావం కలవాడు, కోరికలను విడిచిన వాడు, దేనిచేత నైనా సంతుష్టినే పొందేవాడూ, నియామకంగా నివాసం లేని వాడూ స్థిరచిత్తం కలవాడు నాయందు భక్తికలవాడు అయిన నరుడు నాకు ప్రియుడు.

వ్యా: మనుష్యుని మనస్సు తులాదండంలాంటిది. అహంకారం, ఆ తులాదండం యొక్క ఆధారదండంగా రూపొందినప్పుడు దానికి రెండువైపులా ద్వంద్వాలనే సిబ్బులేర్పడతయి. శత్రుత్వం మిత్రత్వం అనే భావాలు, మానం, అవమానం, శీతం, ఉష్ణం, సుఖం, దుఃఖం, నిందాస్తుతి, ఇవన్నీ మొదట్లో ఒకటిగా ఉన్నా సృష్టి

కార్యం కోసం రెండుగా విడిపోయి రెండువైపుల సిబ్బులలో కూర్చుంటాయి. ఈ రెంటి హెచ్చుతగ్గులను అహంకార మనే ఆధార దండం తూస్తూ ఉంటుంది. మనస్సు ముల్లులాగా ఎటు వైపుతూకం ఎక్కువైతే అటు వైపు మొగ్గుతూ ఉంటుంది. సంసారమూ పరమాత్మలేదు అనే భావం పాదుకుని ఉన్నంత వఱకు ఈ సిబ్బుల ఊగులాట ఇలాగే సాగుతునే ఉంటుంది. కాని సంసారం ఉత్పత్తి కావడం కోసమే ఈ ద్వైధీభావం కావలసి వచ్చిందని, దుఃఖం, సుఖం అనే రెండూ పరమాత్మ ప్రసాదించినవే అని, దుఃఖాన్ని కూడా సుఖంగానే మనం అనుభవించాల్సిందే అనే జ్ఞానం భగవదనుగ్రహం వల్లనే ఎవరి మనస్సులో ప్రకాశక రూపంగా ఉద యిస్తుందో ఆభక్తుని మనస్సు అనే తులాదండానికి. రెండు సిబ్బులూ ఒకే సిబ్బగా మారిపోతాయి. రెండుగా ఉన్న సుఖదుఃఖాలు, మానావమానాలు, ఒకే చోటికి చేరి అభేద రూపందాల్చి ఉన్న ఒక సిబ్బిలోనూ కూర్చుంటాయి. అది వఱకు ఆధార దండంలో మధ్య సూచిగా ఇటూ అటూ ఊగుతున్న ముల్లు దండం మీద ఏ బిందువు దగ్గఱ చేరుకుంటే సమానస్థాయి ఏర్పడుతుందో ఆ బిందువు దగ్గఱకు చేరుకుంటుంది. పరమేశ్వర సంకల్పంతో వ్యక్తి సంకల్పం కూడా సమైక్యత పొందుతుంది.

పరమాత్మ విశ్వాధార స్థానంగా ఎక్కడి కక్కడే ఉండి ఈ జగత్తును ఎలా నిర్వహిస్తున్నాడో తానూ ఎక్కడి కక్కడే భారసూచిగా నిలిచి తూకాన్ని నిర్వహించే పాత్రను వ్యక్తి మనస్సు అలానిర్వహించే పాత్రను వ్యక్తి మనస్సు అలా నిర్వర్తింప గలుగుతుంది. ఆ బిందు ముహూర్తంలో అంత వఱకు రెండుగా చీలి ద్వంద్వ భ్రాంతిని కల్పిస్తున్న అరసున్నాలు, స్వస్వరూపజ్ఞానం వల్ల వెనక్కు తిరిగి రెండు వెన్నులూ అంటు కొని రూపకంగా శత్రుత్వానికీ మిత్రత్వానికి, మానానికీ అవమానా నికీ, సుఖానికీ దుఃఖానికీ, స్తుతికీ, నిందకీ, సారూప్యం కల్పించి, అన్నింటి విలువ లనూ, నికరంగా, సహజంగా, రూఢంగా నిర్దుష్టంగా చూపగల ఒకే ఒక సంజ్ఞా మాత్రంగా పరిణమిస్తుంది. ఆపరిణతస్థిలో జగత్తులో పరమాత్మ, పరమాత్మలో జగత్తు కన్పిస్తుంది. దుఃఖంలో సుఖమూ, సుఖంలో దుఃఖమూ కన్పిస్తుంది. స్తుతి లోనిందా, నిందలోస్తుతే కన్పిస్తుంది. చీకటిలో వెలుగూ వెలుగులో చీకటీ కన్పి స్తాయి.

సంగవివర్జితుడంటే సర్వసంగ పరిత్యాగం చేసిన వాడు కాదనీ, సర్వేసర్వత్ర సర్వభూతముల యందు సమాన మైన సంగాన్ని కలవాడని అర్థం, అవగాహనకు వస్తుంది. ఇదేనాది అను కోవద్దనీ, అన్నీ నీవే అనుకునే సర్వత్రా ఉండే సమాన మమకారమే నిర్మమత్వమనీ బోధపడుతుంది. అక్కడే అన్నినేనులూ నేనైన నేను,

నీవు లేని నేను, ప్రత్యక్షమౌతుంది. అక్కడే సంతృప్తి మోక్షమవుతుంది. ఆసంతృప్తి కలగడానికి ఏమి విశేష కారణాలుండ నక్కరలేదు. కొబ్బరి కాయతేలేదని బాధ ఉండదు. తలపండునే కొబ్బరి కాయగా అర్పించగల స్థితి వస్తుంది. అటుకులతోనే తృప్తిపడతాడు పరమాత్మ అంతటివాడు. మఱి ఈ తరుణం అనుగ్రహపాతం ఈ బిందుస్థానం సూదిమొన ఎక్కడ ఉంటుందనే ప్రశ్నకు సమాధానం ఇది. అనికేతః - ఎక్కడైనాసరే, సర్వేసర్వత్ర- తనమనస్సులో గాని, ఇతరుల మనస్సులలోగాని, జడజంగమ ప్రపంచాలలో ఎక్కడనైనా సరే ఈ శక్తిచైతన్య విస్ఫోటనానికి తగిన చోటే. ఇటు వంటి అతీతమైన పరమాత్మ అనుగ్రహసిద్ధిని భక్తిద్వారంగా బడసిన భక్తుడు నాకు చాలా ప్రియతముడు.

భక్తుడంటే పరమాత్మకు ఎంత ప్రియమో పై శ్లోకాలవల్లనే తెలుస్తుంది. వరుసగా ఆఱుసార్లు' మద్భక్తస్సమేప్రియః' అని రెట్టించి రెట్టించి చెప్పిన ఈ పద్ధతి అమృతాన్నికురిసింది. ఆ అమృతాన్నే ఆఖరుశ్లోకంలో పరమాత్మ భక్తుల కిలాత్రాగిస్తు న్నారు.

20. యేతు ధర్మ్యా మృత మిదం యథోక్తం పర్యుపాసతే।
శ్రద్ధధానా మత్పరమా భక్తాస్తేఽ తీవ మేప్రియాః॥

తా: ఈ చెప్పిన ధర్మ్యామృతాన్ని యధోక్తంగా, లెస్సగాసేవిస్తూ, శ్రద్ధధానులై, మత్పరాయణులై, ఎవళ్లు, ఉపాసిస్తుంటారో, నాయందు భక్తి గల ఆజనులు నాకు అత్యంతప్రియులు.

వ్యా: ధర్మ్యమృతం- జగత్ స్రోతస్విని నిత్యమూ ప్రవహిస్తూ ఉండడానికి సహజంగా ఏర్పడి ఉన్న శక్త్యనుగ్రహరూపమైన నిమ్నగత్వం, ఇది. రోదసి గోళాల నన్నింటినీ ప్రకాశింప జేసే ఊర్ధ్వగామిని ఐన రోచిశ్చైతన్యధార ఇది. అమర్త్యమై సర్వతః పర్యాప్తమైన విష్ణు తత్వమిది. లోపలా బయటా ఒకే దానికొకటి ఆధారంగా నిలిచి ఉండగల ఆధారతత్వమిది.

అమ్మ అంతులేనిది, అడ్డులేనిది, ఆధార భూతమైనది, ఆధారమంటే- ఇప్పుడు- మీరున్నారు. ఉయ్యాలబల్ల మీద కూర్చున్నారు. మీకు బల్ల ఆధారం- బల్లకు గొలుసు ఆధారం- గొలుసుకు దూలం- దూలానికి గోడలు- గోడలకు భూమి, భూమికి ఆకాశం- ఇట్లా ఆధారం సర్వత్రావ్యాపించి ఉన్నది.

పూలు ఉన్నాయనుకో- వాటికి దారం ఆధారం దండగ్రుచ్చడానికి- పూలకు కొమ్మ. కొమ్మకు చెట్టు, చెట్టుకు భూమీ ఆధారం ఆధారానికి అంతేముంది; సర్వానికి సర్వమూ ఆధారం; ఆధార మనేదే ధర్మ్యామృతం దీనిని శ్రద్ధతో ఒంట బట్టించుకొని

ఎవళ్లు మత్పరాయణులై ఉంటారో, ఆనాభక్తులు నాకు అత్యంతమూ ప్రియమైన వాళ్లు.

ధర్ముడు(విష్ణువు) విషయం గాగలది ధర్మ్యం అని కూడా వ్యాఖ్యాతలు వ్రాశారు.

ఇది శ్రీమన్మాతృగీతలోని భక్తియోగమను ద్వాదశోధ్యాయము.

మాతృగీత

క్షేత్రక్షేత్రజ్ఞ విభాగ యోగము

త్రయోదశోధ్యాయము

అర్జున ఉవాచ

1. **ప్రకృతిం పురుషం చైవ క్షేత్రం క్షేత్రజ్ఞ మే వచ।**
ఏత ద్వేదితు మిచ్ఛామి జ్ఞానం జ్ఞేయం చ కేశవ!॥

అర్జునుడడిగెను

తా: కేశవ! ప్రకృతి అంటే ఏమిటో, పురుష డంటే ఎవడో, క్షేత్ర మంటే ఏమిటో, క్షేత్రజ్ఞుడంటే ఎవడో, ఇంకాజ్ఞాన మంటే ఏమిటో జ్ఞేయమంటే ఏమిటో ఇదంతా సవివరంగా తెలియగోరుచున్నాను.

వ్యా: మానవుడి జ్ఞానశక్తి వికసించడం ఆరంభించిన దగ్గఱ నుంచి దృశ్య మాన ప్రపంచంలో, ముఖ్యంగా జంగమ సృష్టిలో ప్రతి స్వరూపానికి రెండు రకాలుగా ఉన్న ఉనికిని గుర్తిస్తూ వచ్చాడు. ఒకటి భౌతిక శరీరం రెండు దానిని నడిపిస్తున్న శక్తి. శక్తి విడిచి పెట్టి పోగానే శరీరం కట్టెలా అయిపోవడం కూడా కనబడుతున్నది. శరీరం పైకి కనబడేది. లోపల నడిపించే శక్తి పై కి కనిపించనిదీని. పైకి కనిపించే శరీరాన్ని ఆధారం చేసుకుని లోపలి ప్రాణశక్తి ఉంటున్నదా! ప్రాణ శక్తిని ఆధారం చేసుకుని శరీరం ఉంటున్నదా! అనే సమస్య వేదాంతులనూ, ధీమం తులనూ కలవరపెట్టు తూనే ఉంది.

పై శరీర నిర్మాణాన్ని గూర్చి ఎంతో పరిశోధన జరిగింది. లోపల ఉన్న చైతన్య శక్తిని గూర్చి కూడా చాలా పరిశోధన జరిగింది. ప్రాణశక్తి కూడా శరీర పదార్థాల వలెనే పంచభూత సంబంధమైన ధాతు ద్రవ్యాల వల్లనే ఉత్పన్నమౌతున్నదని కొందఱు ప్రతిపాదించారు. లోపలి చైతన్య శక్తిని కూడా ప్రాణశక్తి, చిచ్ఛక్తి అని రెండుగా విభజించారు. ప్రాణశక్తి బాహిరమైన శరీర యంత్రాన్ని నడపడానికి ఉపయోగపడుతూ ఉంటే, చిచ్ఛక్తి అంతఃకరణ ప్రపంచాన్ని నడుపుతూన్నట్లు నిర్ణ యించారు.

జ్ఞానం-జ్ఞేయం- 'నీ చేతనిన్ను తెలుసుకుని నీవవడం'

శరీరాన్ని నడిపించడం, కదిలించడం, అవయవాల పనులు అవయవాలను పని చేయించడం, ఈ కదలికలకు తీసిన ధారక ప్రేరక శక్తులను, ప్రాణ శక్తి

సరఫరా చేసే బుద్ధి లేక మేధశ్శక్తి, అంతఃకరణ వ్యాపారాలను నడుపుతుంది. వస్తుగ్రహణము తన భావాలను ఇతరులకు చెప్పడం, ఇతరుల మాటలను గ్రహించడం, ఆపదల నుంచి తనను రక్షించుకోవడం, భవిష్యత్తును గూర్చి ఆలోచించడం, ఇచ్ఛా రాగ ద్వేషాలను రాజుకోజెయ్యడం, శీతోష్ణ వాయూష్మ స్థితులను సుఖదుఃఖాలుగా మార్చుకోడం ఇలాంటి మనఃప్రవృత్తులను రగుల్చడం, అంతః కరణ శక్తులు చేసేపని.

పై దేహానికి ఆవరణం ప్రపంచమూ ప్రపంచంలోని ద్రవ్యశక్తులూ; లోపలి అంతఃకరణానికి దేహం ఆవరణం. అంతఃకరణం దేనికావరణమో సప్రమాణంగా ఋజువు కాదు కాని అంతఃకరణానికి ఆత్మవస్తువు ప్రేరకమని వేదాంతులంటారు. అన్నమయ ప్రాణమయమనోమయ బుద్ధిమయ ఆనందమయ కోశాల ప్రవృత్తులకూ సైన్సు నేటి విజ్ఞానం బోధించే విషయాలకూ పొత్తు కుదరదు. DNA RNA కణముల వర్తులోన్నత నిర్మాణమే ప్రాణశక్తి కీలకమంటుంది నేటి విజ్ఞానం. DNA RNA కణములకు రాసాయనిక ద్రవ్యాలే పునాది. అలాగే అన్నమయ కోశం ప్రాణమయ కోశానికి ధారకంకావచ్చు. దేహంలో ఏ భాగానికి ఏ కదలిక కలిగినా, అది Sympathetic Nervous system central Nervous system. Autonomous nervous system యొక్క క్రియా విశేషాలేననీ, ఆ క్రియా విశేషాలను, మెదడులోని వివిధభాగాలు శాసిస్తూ ఉంటాయనీ, ఆయా భాగాలు నరాల ద్వారా అవయవాలకు అందించే సందేశాల ద్వారా కండరాలు కదిలి ఆయా కదలికకూ, కర్మకూ కారణాలవుతున్నాయనీ నేటి శాస్త్రం చెబుతుంది. Cerebrum, Cerebellum, Medulla Obiongata, Spinal card అనే మస్తిష్క భాగాలూ వెన్నెముకలోని నరాల త్రాడూ కలిసి యంత్రవతుగా ఈమేని వ్యాపారాన్ని నిర్వహిస్తున్నా యంటారు నేటి శాస్త్రజ్ఞులు. చుట్టూ ఉండే పరిసరాల తాకిడి వల్ల, ఆయా సంఘటనలకు సంబంధించిన వార్తలను మజ్జలేక Spinal Card నరాల ద్వారా మెదడుకు పంపిస్తే, మస్తిష్కం cerebrum ఆ వార్తలను గ్రహించి, (Motor centres) చలన మూలాల నుండి (Motor impulses) ఆ చలన వార్తలను, కండరాలకు పంపించి, ఆయా సంఘటనలకు తగిన ప్రతిక్రియలను దేహంచేత చేయిస్తుందంటారు. మస్తిష్కమే సదా, మాటిమాటికీ ఇంద్రియాల నుండి వచ్చే జ్ఞానాన్ని నిక్షేపించుకుని ఒక అనుభవజ్ఞాన నిధిని తయారుచేసుకుంటుంది. ఆ నిధిని ఆధారంగా చేసుకుని ఆలోచనచేసి సంకల్పంచేసి శరీరధారణకు అనుకూలమైన పద్ధతులలో క్రియాకలాపాన్ని నడిపిస్తుంది. అనుభవ జ్ఞానాన్ని పునాదిగా చేసుకుని ఎప్పటికప్పటికేది అవసరమోదాన్ని

చేయించే నిశ్చయజ్ఞానానికి ప్రజ్ఞ అనీ, (consciousness) పునాదిగా ఉన్న అనుభవ జ్ఞానానికి (Subconciousness) అధఃప్రజ్ఞ అనీ మనశ్శాస్త్రవేత్తలు పేర్లు పెట్టారు. జీవాణువులు శిథిలం అవుతూ మళ్ళీ అవి పునస్సృష్టి అవుతూ ఉండే కార్యకలాపాన్నే జీవం (Life) అనీ ఈ జీవన వ్యాపారాలు నిరంతరంగా జరగడమే ప్రాణలక్షణమనీ (Living process) అనీ నేటి శాస్త్రం అంటుంది. మాటిమాటికీ ఒక అనుభవం పునరావర్తించడంవల్ల నరాలు, కోశాలూ, శరీర యంత్రాంగం ఏవో కొన్ని సుస్థిర ప్రతి కారచర్యలకు అలవాటయిపోతాయి. (వాటిని ఇంగ్లీషులో Reflex action అంటారు. తినుబండారం కళ్ళకు కనిపించగానే నోటిలో నీళ్ళూరుతాయి. కుడికాలు వెంటనే ఎడం కాలులేచి ముందుకు పడుతుంది నడకలో వీటికోసం మెదడు ఆలోచించి వార్తలను ఆయా నాడీమండలానికి పంపడంవల్ల ఆ చర్య జరగదు. కంటి ఱెప్పలు ఏదైనా అపాయశంక రాగానే వాటి అంతట అవే మూసుకుంటాయి. మన జీవిత చర్యలోని 80 వంతులు ఈ Reflex ల చర్యలతోనే నిండి ఉంటుంది. మన కుండే ఆ కామక్రోధలోభ మోహమదమాత్సర్యాదులు మన శరీరంలో ఉండే వివిధములైన తిత్తులలోని ద్రవాల ఉద్గమనంవల్ల ప్రకోపిస్తూ ఉంటాయి. తిత్తులలోని రసాలు స్రవణం కావడానికి ఈ Reflexల అలవాట్లు ఎక్కువగా పనిచేస్తాయి. ఇంద్రియ వార్తను పుట్టించడానికి (Stimulus) ప్రేరేపణకు బాహిరకారణాలు, పరిసరాలూ, పరిసర సంఘటనలూ ఇతరులు చేసే పనులూ ఆడే మాటలూ, వీటివల్ల నియతంగా కొన్ని రకాల గుణాలకు రకరకాల స్వభావాలకు ఆ దేహం ప్రతిష్ఠితమైపోతుంది. దీనికి పిత్రీయత, పారంపర్యమూ (Heredity) కూడా సాయపడి మనిషి స్వభావాన్ని తీర్చిదిద్దుతుంది అంటారు. నేటి శాస్త్రజ్ఞులు. కాని ఈ చిక్కంలో మనస్సు స్థానం ఎక్కడ ఉందో చెప్పమంటే వాళ్ళుచెప్పలేరు. నరాలను నిర్మించిన పరమాణువును (Neuron) అంటారు. నరాలకు వార్తావాహ శక్తి ఈ న్యూరానుల వలనే కలుగుతుంది. న్యూరాను దగ్గఱకు చేరేదాకా ప్రతి సంఘటన తాలూకు కేవలం ద్రవ్యాపేక్షకంగానే ఉంటుంది. అది మస్తిష్కం దగ్గఱకు చేరేసరికి భావాపేక్షకమైన మనోవృత్తి స్వరూపాన్ని ధరించుతుంది. దీన్నే Mentron అంటారు. మనశ్శాస్త్రజ్ఞులు తత్త్వవేత్తలు అక్కడ నుంచి దానికి ఆలోచన సంకల్పం ప్రేరణకాగా మళ్ళీ నరాల ద్వారా ప్రయాణంచేసి కర్మేంద్రియాలను చేరి దేహచర్యగా మారుతుంది. ఏ అవస్థలో ద్రవ్యాపేక్షకంగా పుట్టిన ప్రేరణ మనోవృత్తి అంటే Mentronగా మారుతుందో శాస్త్రజ్ఞులు చెప్పలేరు. అదీగాక మస్తిష్కంలో వివిధ భాగాలు వివిధ జ్ఞానేంద్రియాలకు వివిధ కర్మేంద్రియాలకు కేటాయింపుగా ఉన్నవనే మతాన్ని చాలా మంది ఒప్పుకోరు.

ఎందుకంటే ప్రయోగాల దాఖలాగా ఒక జ్ఞానేంద్రియ భాగాన్ని ధ్వంసం చేసినా దాని పని రెండో భాగంగాని మస్తిష్కం అంతా గాని చేస్తుందని ఋజువైంది. అమ్మ చెప్పే.

'సర్వానికీ సర్వం ఆధారం అనే మాటే ఇక్కడ బాగా వర్తిస్తుంది కాని విభక్తి సూత్రం మస్తిష్క వ్యాపారాలకు ఋజువు కాదు. పోతే మనస్సుకూ శరీరానికీ ఉండే లంకెను ప్రయోగరీత్యా నిర్ధారణ చేసిన వారెవరూ లేరు. కాణాదులు మనస్సు కూడా అణురూపమైనదే అంటారు, Sir James zeans ఎలక్ట్రానును "A particle of thought' అన్నాడు. Serodinger మొదలయిన శాస్త్రవేత్తలు ద్రవ్యానికీ శక్తికీ భేదం లేదని ఋజువు చేశారు. అంతా చైతన్య రూపమయినదే ఈ ప్రపంచం. 'నా దృష్టిలో జడం లేదనే అన్నది' అమ్మ. ఈ విధంగా పరమాత్మకూ జగత్తుకూ సమష్టితః భేదం లేకపోయినప్పటికీ వ్యష్టితః వేఱుగా కన్పించే ఈ వ్యక్తి ఎవరు? వ్యక్తి వ్యక్తిత్వానికి ఆశ్రయం ఏమిటి? ప్రకృతి పురుషులు ఇద్దఱా? ఒకరా? వాళ్ళు చేసే పనులేమిటి? జ్ఞానం అంటే ఏమిటి? జ్ఞేయం అంటే ఏమిటి అని అర్జునుడు పరమాత్మను ప్రశ్నించాడు.

కర్మం దేహానికి సంబంధించినది. ఇది ఏవిధంగా Mentron గా మారి Mentron జ్ఞానంగా మారి మస్తిష్కాన్ని చేరుతున్నది. మనః కణానికి ప్రేరణా ఉంది చింతనా ఉంది. జ్ఞానమూ ఉంది. అది భక్తిగా మారి ఏవిధంగా హృదయమంతటా శరీరమంతటా వ్యాపిస్తున్నది. కర్మజ్ఞాన భక్తియోగాల్లో ఏది ముఖ్యం. జ్ఞానమే ప్రధానమైనా వ్యవహారిక జీవనానికి కర్మయోగం అవసరం. కాళ్ళు నడుస్తున్నాయి. కాబట్టి మనమే నడుస్తున్నాం అనుకుంటాం దాని వెనుక ఉన్న శక్తి మనకర్థం కావడంలేదు. ఈశ్వరుడు, ప్రకృతి, జీవుడు అనే ఈ విభాగం ఒకే లాంతరుకు మూడు వైపులపెట్టినగాజు పలకలు. ఎలక్ట్రిసిటీని మన మెదడుతో అర్థం చేసుకోడానికి కొన్ని కొలతలను వాడతాం వోల్టులనీ, ఓమ్సు అనీ, ఆంపియర్లనీ, ఫరాడ్లనీ, అసంఖ్యాకంగా ఉండే పదజాలం అంతా ఒకానొక విలక్షణమైన శక్తికి సంబంధించిన అంశాలే. మనం అర్థం చేసుకోడానికి పెట్టుకొన్న పేర్లే కాని, మన 'పేర్లతో ఎలక్ట్రిక్ కరెంటుకు ఏమీ సంబంధం లేదు. మేఘంలో ప్రకృతి సిద్ధంగా వెలిగే వెలుగు బల్బులోనూ వెలుగుతున్నది. పిడుగులో వచ్చి వ్రాలే అగ్నిజ్యోతియే హీటరులోనూ ప్రత్యక్షమౌతుంది. పరిమిత మానవబుద్ధి అర్థం చేసుకోడానికి విశ్వరూపంలోని సహస్ర కోటి భేదాలను ఆకళించడానికి సాధ్యంకాదు కనుక. మొదట్లో Major Head, తర్వాత Minor head, తరువాత detailed head గా విభాగం చేసు

కున్నాడు మానవుడు. భారతదేశం అంతా ఒకటేగా అర్థం కావాలంటే దుష్కరం. అందుకని రాష్ట్రాలూ, జిల్లాలూ, తాలూకాలు గ్రామాలూ రేంజీలూ, పంచాయితీలు వగైరాల భేదం. ఆడామగా భేదం సృష్టిలో కనిపిస్తున్నది. చావూ బ్రతుకూ కని పిస్తున్నాయి. విత్తనం మొలవాలంటే పాదు కావలసిన వస్తున్నది. శరీరం చస్తున్నది. బ్రతికిఉండగా ఏదో లోపల శక్తి లేకపోతే అది అలా అన్ని పనులూ చేయలేదని పిస్తున్నది. దీన్ని గూర్చి తెలుసుకోవాలి. దేన్ని గూర్చి? అది కూడా నిర్ణయించాల్సిందే - ఈ సందేహాలతో అర్జునుడి ప్రశ్న బయలుదేరింది - ప్రపంచం సత్యమూ నిత్యమూ - రెండూనా?

కొందఱు ఈ మొదటి శ్లోకాన్ని ప్రక్షిప్తమంటారు. భగవద్గీతా శ్లోకాలు 700 అని శాంకరభాష్యం చెబుతుంది. ఈ శ్లోకంతో ఆ సంఖ్య 701 అవుతుంది.

శ్రీ భగవానువాచ

2. ఇదం శరీరం కౌన్తేయ! క్షేత్ర మిత్యభిధీయతే।
ఏత ద్యోవేత్తి తం ప్రాహుః క్షేత్రజ్ఞ ఇతి త ద్విదః॥

భగవానుడు పలికెను.

తా: కౌన్తేయ! ఈ శరీరాన్ని క్షేత్రం అని పిలుస్తారు. దీనిని తెలిసిన వాడినే క్షేత్రజ్ఞుడని - క్షేత్ర క్షేత్రజ్ఞులను తెలుసుకున్న వాళ్ళు చెప్పుతారు.

వ్యా: గీతలో చివరి ఆఱు అధ్యాయాలను జ్ఞానషట్కం అంటారు. ఇందులో క్షేత్ర క్షేత్రజ్ఞ విభాగయోగం, గుణత్రయ విభాగమయోగం, శ్రద్ధాత్రయ విభాగ యోగం, దైవాసుర సంపద్విభాగయోగం, అని నాలుగు విభాగ, యోగాలున్నాయి. విభాగం అంటే విడదీసి చూపడడం. అంటే శోధన కార్యక్రమం. ఇందులో చెప్పబడే అంశాలు వేదాంత శాస్త్రానికి మొట్టమొదట్లో నేర్వవలసిన ప్రధానాంశాలు. సంస్కృ తాభ్యాసానికి శబ్దమంజరి, ధాతుమంజరి లాంటివి. నిజానికి ఆఱు అధ్యాయాలు గీతకు మొదట్లోనే చెప్పి ఉండాల్సింది. కాని వీటిని చివరనే చెప్పారు పరమాత్మ. ఎందుకలా చెప్పారు? అర్జునికి వచ్చిన భ్రమాప్రమాదస్థితి ఆపన్న ప్రమాణంలో ఉంది కనుక అప్పటి తీవ్రపరిస్థితి ననుసరించి నిమిషాల మీద పనిచేసే ఘాటైన మందు అవసరంగా ఉంది కనుక మొదటి పాఠాలను దాటేసి పరమాత్మ 'అశోచ్యా నన్వశోచ్యస్త్వం' అని ఆరంభించాడు. ఇప్పుడు అర్జునుడు 'మోహోయం విగతో మమ' అని చెప్పాడు.

కనుక ఈ పరిణామాన్ని బట్టి ఇప్పుడు సావధానంగా చెప్పసాగారు. మనకు

కావలసినది అదే. క్షి = నాశం, క్షయ, క్షి + త్ర = క్షేత్ర అంటె దెబ్బ నుంచి నాశం కాకుండా కాపాడేది అని ఒక అర్థం క్షేత్రం అనే మాటకు. పంటలు పండే పంట పొలం అంటే అన్ని కర్మలు చేసేది. 'శరీర మాద్యం ఖలుధర్మసాధనం కర్మలు చేయ డానికి శరీరమే 'ఆది సాధనం' క్షేత్రం అంటే ఆత్మ పదార్థం నివసించి ఉండటానికీ, ఆశ్రయం చేసుకుని ఉండడానికీ ఉపాధిగా ఉండే శరీరమే క్షేత్రం. చెట్టును వేఱుగా, పొలం వేఱుగా మనం చూస్తాము. పొలం లేకుండా చెట్టు మొలిచేదా అని ఆలో చించం. పొలం అంతా వేఱుగా కనిపిస్తున్నా తాను కూడా చెట్టురూపాన్ని దాలుస్తు న్నదని అనుకోము. చెట్టు అంటే పొలమూ శరీరమంటే ప్రాణమున్న శరీరమనే అర్థం. ప్రాణం లేని శరీరం క్షేత్రమవుతుందా అనే విషయాన్ని గూర్చి ముందు ముందు చర్చించుదాం. క్షేత్రం దృశ్యం. క్షేత్రజ్ఞుడు దృక్కు. ఒకటి మారేదీ ఒకటి మారనిది. పూర్వ వ్యాఖ్యాతల ప్రకారం శరీరం జడమైనది. అందులో నివసించే జీవుడు చైతన్య రూపుడు. అమ్మ శవంలో కూడా చైతన్యం ఉంటుంది అంటుంది. జడమే లేదు సృష్టిలో. కనుక క్షేత్ర క్షేత్రజ్ఞ పదాలను చాలా జాగ్రత్తగా అర్థం చేసుకోవాలి. చెట్టు అంటే పొలమూ, విత్తనమూ ఏకమై ఎత్తిన మరో అవతారమని మనం తెలుసు కోము. ఈ రహస్యాన్ని తెలుసుకున్నవాడు క్షేత్రజ్ఞుడు. తాను పొలం కంటె విత్తు కంటే వేఱైన వాడు కాదని తెలుసుకోవడమే జ్ఞానం.

3. క్షేత్ర జ్ఞం చాపి మాం విద్ధి సర్వక్షేత్రేషు భారత।
క్షేత్ర క్షేత్రజ్ఞ యోర్జ్ఞానం యత్తద్ జ్ఞానం మతం మమ॥

అన్ని క్షేత్రములందూ ఉన్న క్షేత్రజ్ఞుణ్ణి నేనే అని తెలుసుకో. క్షేత్ర క్షేత్రజ్ఞ జ్ఞానమే నిజమైన జ్ఞానం అని నా మతం.

విశ్వజననీత్వమే క్షేత్రక్షేత్రజ్ఞ విజ్ఞానం. తనకు తెలీకుండా ఎవరూ తల్లికారు కదా! తానే బిడ్డగా కావడంలోనే తన తల్లి భావం సిద్ధమౌతున్నదని, సృష్టి సూత్రం లోని కిటుకు కూడా ఇదేనని తెలుసుకోవడమే జ్ఞానం. ఈ జ్ఞానం కేవలం అనుభవ వేద్యమే కాని తర్కసిద్ధమైనది కాదు. పసిబిడ్డ, కన్నతల్లి ఒకరి చూపుల్లో ఒకరి చూపులు కలిపి అవ్యాజంగా ఆనందించడమే.

"నీ కనులు చెమ్మగిలేట్లు మాతృశ్రీ అనసూయాదేవి నిన్ను పూర్తిగా సాను భూతితో దయామయంగా చూస్తున్నప్పుడు నీ అమ్మను నీవు చూచినట్లు నీవప్పుడు గ్రహిస్తావు. ఏదో ఒక అమ్మను చూడడం కాదు విశ్వజననిని చూసినట్లు – మాతృశ్రీ అనసూయాదేవి భౌతికరూపం కాదు – నీ జననానికి ఎవరు బాధ్యులో, నీ మరణా

కెవరు బాధ్యులు అవుతారో సర్వత్రా వ్యాపించిన ఆ అమ్మను దర్శించినట్లు తెలుసుకుంటావు.

నీ సర్వస్వమూ ఆమె పాదాక్రాంతం చెయ్ మాతృత్వమంటే, నీ మౌలికస్వత్వం అంటే ఏమిటో నీవు తెలుసుకుంటావు.

నీవూ అమ్మా వేలాది మైళ్ల దూరంవల్ల వేరు చేయబడినప్పుడయినా మాతృశ్రీ అనసూయదేవిని నీవూ చూస్తుండనప్పుడయినా నీ కనులు చెమ్మగిల్లవచ్చు.

కాని అశ్రువులు స్రవిస్తున్నపుడు 'అమ్మ' నీకెంతో చేరువగా ఉన్నదనీ నీ అంతరంగాన్ని శుభ్రంచేస్తున్నదనీ, ఎప్పటివలెనే నీ జాగ్రత్త ఆమె వహిస్తున్నదనీ నీకవగతమవుతుంది.

అప్పుడు నీవు ఎప్పటికీ ముగిసిపోని అనాదియైన అనుబంధాన్ని అనుభవంలో గ్రహిస్తావు. నీవు అయోమయంగా ఉన్నావు-నీలో 'ఆమెను చూడలేకపోతున్నావు - అంతే

ఇదే క్షేత్రక్షేత్రజ్ఞ సంబంధం అంటే

4. తత్ క్షేత్రం యచ్చ యాదృక్చ యద్వికారి యతశ్చ యత్।
సచ యో యత్ప్రభావ శ్చ తత్ సమాసేన మే శృణు॥

తా: ఆ క్షేత్రమనేది ఏమిటి? ఎలాంటి ధర్మాలు కలది? ఎలాటి వికారాలు గలది? క్షేత్రజ్ఞుడంటే ఎవడు? అతని ప్రభావములు ఎట్టివి? ఈ విషయాలను గూర్చి సంగ్రహంగా చెబుతాను విను.

వ్యా: శరీరమంటే దాని స్వరూపం ఏమిటి? దాన్ని ఆశ్రయించుకొని ఉండేవి ఏవి? దానికి సంబంధించిన వికారాలేమిటి? దానివలన ప్రయోజనమేమిటి? క్షేత్రజ్ఞుడంటే స్వరూపం కలవాడా కాడా? అతని శక్తులేమిటి - ఇవన్నీ చెబుతానన్నాడు పరమాత్మ.

శరీరం అస్థిపంజరం, మాంసంముద్ద, రక్తపు తోలుసంచి, నరాల చిక్కుపుట్టం, క్రొవ్వు సుద్ద, నానా రకాల స్రావాలకు పిచికారి - ఎందుకు పుట్టినట్లు, ఎలా పుట్టింది అసలు - పుట్టక ముందెక్కడ ఉంది పుట్టిన తరువాత ఒక స్థితిలో ఉండక నిత్యమూ మారుతుండడానికి కారణం ఏమిటి? పుట్టినదేమో అలాఉండిపోక చచ్చిపోవడమెందుకు? చావంటే ఏమిటి? చావు తన అధీనంలో ఎందుకుండకపోవాలి? చావుకూ బ్రతుక్కూ సంబంధం ఏమిటి? చచ్చిన తరువాత కూడ దేహాని

కింకా బ్రతుకుంటుందా? దేహం చచ్చిపోతే ఎందుకని కదలకుండా ఊరుకుం టుంది? ఏ శక్తి బ్రతికి ఉన్నప్పుడు శరీరాన్ని కదిలించిందో అది ఎందుకని దేహాన్ని విడిచిపోవాల్సి వచ్చింది? ఏ శక్తి శరీరాన్ని కదిలించిందో అది శరీర రహితంగా మనగలదా? శరీరానికి శరీరానికి మధ్య సంబంధం ఏమిటి? మనస్సు ఎక్కడ ఉంటుంది? మనస్సుకూ దేహానికీ ఉన్న లంకె ఏమిటి? మనస్సు ద్రవ్యశక్తుల ప్రభావానికి లోనుకాదా? లోకానికి శరీరానికి సంబంధం ఏమిటి? ఒకటిగా పుట్టి ఒకటిగా చచ్చే దేహానికి ఇతరులతో సంబంధం ఎందుకు? ఇతరుల దేహాలతో ప్రతి దేహానికీ ఉన్న సంబంధం ఏమిటి? శరీరం వ్యక్తం చేసే కామక్రోధ లోభమద మాత్సర్యాలకు జన్మస్థానం లేక క్షేత్రం – శరీరమా? మృత్యువుతోపాటు గుర్తు లేకుండా పోయేది శరీరం ఒక్కటేనా? శరీరం తాలూకు శక్తి కూడానా? జగత్తనే శరీరానికి ఆధారమైన చైతన్యం కూడా ఇలాటి వికారాలకు లోనవుతుందా? సృష్టి సాగరంలో శరీరయాత్ర ఎలా ఉంటుంది? శరీరానికి కారణమైన శక్తియాత్ర ఎలా ఉంటుంది?

ఈ సందర్భంలో శ్రీపాద వారి మాటలు జ్ఞప్తికి వస్తున్నాయి.

రాజరాజేశ్వరి అని ఎవరినంటామూ? నిర్గుణ నిష్క్రియ నిరాకార బ్రహ్మము సృష్టి కార్యము చేయదు కనుక; ఆ బ్రహ్మము యొక్క శక్తిని రాజరాజేశ్వరి అన్నారు. తాంత్రికులు, బ్రహ్మమును తలపక రాజరాజేశ్వరి సర్వమూ నడుపుతుంది అంటారు. మొదటి దృష్టిలో, సృష్టిని చూసుకుని అది తనదే అని అనుకునే వారు ఇద్దరు. బ్రహ్మమూ బ్రహ్మము యొక్క శక్తీని. ఇద్దఱూ సృష్టిలో తన ప్రభావమును చూసుకుంటారు. ఓడ ఒకటి సముద్రంలో కెరటము మీద ఎగిరినది అంటే, ఆ ఎగురుడులో తనను చూసుకునేది ఎవరూ? సముద్రమూ కెరటమూను. ఇక సము ద్రము నిశ్చలంగా ఉన్నప్పుడు తానే అయి ఉండేది ఎవరూ? సముద్రమూ కెరట మూను. కెరటము సముద్రమే అయి ఉంది. కాబట్టి తానే అయి ఉండగలదీ, ఓడ ఎగురుడులో తననే చూసుకోగలదీ ఎవరూ? సముద్రమూ కెరటమూను. అలాగే తానే అయి ఉండగలిగి, లోక ప్రవృత్తిలోనూ తననే చూచుకోగల్గిన వారెవరూ? బ్రహ్మమూ రాజరాజేశ్వరీని. ఇక్కడ అమ్మ తానే అయి ఉండీ లోకములో తననే చూసుకుంటున్నట్టు, ఇంకో సందర్భంలో తెలియవచ్చింది కదా! అంటే ఈమె ఎవ రయినట్టూ 'ఎవరమ్మా నువ్వు' అని ఒకావిడ అడిగితే అమ్మ 'మీరంతా నేనే. మీదంతా నేనే. ఇదంతా నేనే అన్నారు. 'ఈ గోడవతల ఏం జరుగుతున్నదీ నేనెరక్కపోలేదు. అయినా మిమ్మల్ని ఏమీ అనకపోవడానికి కారణం ఏమిటి అంటే!

ఇదంతా నేను చేసుకుంటున్నదే అనిపించడం అన్నారు అమ్మ. మేము ముగ్గురమూ కలిసే గదా వచ్చాము! మాతోనే వచ్చిన యోగయ్య నీకెప్పుడు చెప్పేదూ' అని అడిగితే "మీ ముగ్గురితోపాటు నాలుగో దాన్ని నేనూ మీతో లేనూ" అని అడిగేరు అమ్మ. ఇంకో సందర్భంలో "మీరంతా పుట్టినదిక్కడనే. నేనే పెంపుడిచ్చాను మీ తల్లులకు" అన్నారు. మరొకమారు "అందరూ నా ఒడిలోని వారే. ఒక్కరూ నా ఒడి దాటిలేరు" అన్నారు.

పై ప్రశ్నలకు చాలా వఱకు శ్రీపాద వారి మాటల్లోనే సమాధానాలు దొరుకుతాయి. విషయంలో పరమాత్మ చెప్పిన మాటలను చక్కగా అర్థం చేసుకుని ముందుకు సాగుదాం.

5. ఋషిభి ర్బహుధా గీతం ఛన్దోభి ర్వివిధైః పృథక్।
బ్రహ్మసూత్ర పదై శ్చైవ హేతుమద్భి ర్వినిశ్చితైః॥

తా: క్షేత్రక్షేత్రజ్ఞజ్ఞానం ఋషులచేత రకరకాలుగా చెప్పబడ్డది. వేదంలో వేఱువేఱు విధాలుగా వర్ణించబడ్డది. బ్రహ్మ సూత్రాలచేత కూడా హేతు మద్వాక్యములచేత కూడా బహుప్రకారాలుగా నిశ్చయింపబడినది.

వ్యా: కణాదమహర్షి అణువే విశేషంగా చెప్పాడు సృష్టి రచనలో గౌతమ మహర్షి న్యాయదర్శనాన్ని రచించి ప్రకృతిశక్తులకూ పరమేశ్వరేచ్ఛకూ ముడిపెట్టేడు. సాంఖ్యదర్శనం, ప్రధానమే సృష్టికి కారణమంటుంది. చార్వాక మహర్షి దేవుడే లేడు అంటాడు. మిథున సంయోగం వల్లనే సృష్టి ఉత్పత్తి అయిందంటాడు. మీమాంసాదర్శనం సృష్టి అంతా శబ్దంలో నుంచి పుట్టిందంటుంది. వేదాంతశాస్త్రం పరమాత్మ మాయ నధిష్ఠించిన కారణంగా సృష్టి జరుగుతున్నది అని చెప్తుతుంది. రామానుజులు, మధ్వాచార్యులు, శంకరులు విశిష్టాద్వైత, ద్వైతాద్వైత సిద్ధాంతాలను వారి వారి ఊహలకనుగుణంగా వ్రాశారు.

వేదంలో కూడా వివిధ రీతులుగా చెప్పబడింది పరమాత్మ ఆస్తిక్యం. కాని గీతలోనే వేదాప్రామాణ్యాన్ని గుఱించి ఒక రీతిగా వ్రాయబడి ఉంది.

"త్రైగుణ్య విషయా వేదాః నిస్త్రైగుణ్యో భవార్జున! 2-45

యా మిమాం పుష్పితాం వాచం ప్రపదం త్యవిపశ్చితః।
వేద వాదరతాః పార్థ! నాన్య ద స్తీతి వాదినః॥ 2-42

అనే శ్లోకాలు దీనికి ప్రమాణం. వేదప్రామాణ్యాన్ని స్వీకరించే వాళ్లు. తమ

మతాలకు అనుకూలంగా ఉన్న వాటిని ఉటంకించి విరుద్ధంగా ఉన్న వాటిని నిరాకరిస్తుంటారు. నిరాకృతములయిన భాగాలు ఇతర మతవాదులకు ప్రమాణాలవుతుంటాయి. శ్రీపాద అన్నట్లుగా వేదాలని ఉన్న వాటిని ఉన్నట్టుగా నమ్మనివారూ, గ్రహించనివారూ నాస్తికులంటే. అది ఎందరికో తగులుతుంది. ఆచార్య శంకరులు వేదాన్నే అనుసరిస్తామనే పూర్వమీమాంసావాదుల మతాన్ని అంగీకరించలేదు. ఉపనిషత్తులలో కూడా కర్మవిభాగం, పరలోక సుఖప్రాప్తి వీటిని గూర్చిన విభేదాలూ ఉన్నాయి. వేదాలలో చెప్పిన పితృలోకాలూ, చంద్రలోకాలూ అన్నీ సాధించమనవు.

"మరణానంతరం' అపూర్వం అనేకర్మల ఫలితము స్వర్గలోకానికి తీసుకు వెళ్ళుతుందని మీమాంసకులు అంటే "అదేమీలేదూ. వీళ్ళెవళ్ళు వెళ్ళి చూచి వచ్చిన వారుకారూ! ఇదంతా వట్టిది" అన్నారు చార్వాకులు. ఉపనిషత్తులు 'బ్రతికి ఉండగానే బ్రహ్మమును చక్కగా తెలుసుకుంటేనే శ్రేయమూ లేకుంటే మహానష్టమూ' అంటాయి నష్టమేమిటీ అన్నమాటనలా ఉంచి, లాభమేమిటి అంటే "బ్రహ్మవేద బ్రహ్మైవభవతి' అంటుంది ముండకోపనిషత్తు 'ఎప్పుడు తమస్సుపోవునో అప్పుడు కేవలం శివుడే మిగులును' అంటుంది శ్వేతాశ్వతరం. సముద్రములో కలిసి నామ రూపాలు అస్తమించినట్లేజీవుని కళలు అస్తమించి పురుషుడే అని చెప్పబడును. అంటుంది ప్రశ్నోపనిషత్తు. సోహమస్మి అంటుంది. ఈశావాస్యం. తత్త్వమసి అంటుంది ఛాందోగ్యం ఇలాగ అయిన వారికి. ఈ లోకము – కాని పరలోకమేదీ? వారికా 'లోకములో' సంచారములేదీ, మరి ప్రత్యేకసత్త ఎక్కడిదీ? లేదు కదా? అమ్మ "అన్ని రాతలు ఒక రాతలో కలుస్తాయి. 'ఎవరికైనా తప్పదు వచ్చిన చోటికి పోక' 'మీరంతా తరంగాల్లాగా నా సంకల్పంవల్ల పుట్టి, తిరిగి నాసంకల్పంవల్ల నాలోలయ మౌతారు'. అంటూ సాయుజ్యం చెపుతున్నారు.

ఇలాగే చెప్పారు ఉద్దాలకుడూ యాజ్ఞవల్క్యుడూ, దత్తాత్రేయులూ, అష్టావక్రుడూ ఇత్యాది మహర్షులు కూడాను.

"ఈనాటి భౌతికవాదులు" వస్తువునుంచే చైతన్యం వచ్చింది అంటున్నారు. చైతన్యము (అనగా ఆత్మ) నుంచే ఈ జగత్తంతా వచ్చినదీ అని ఉపనిషత్తులు చెబుతున్నాయి. "చైతన్యమూ జగత్తూ వేర్వేరు కాదూ, అంతా ఒకటే ఆ సమష్టియే కనబడే వ్యష్టిగా ఉన్నది' అంటున్నారు అమ్మ. నీరే సముద్రమూ తరంగాలూ మంచుగడ్డ ప్రవాహాలు సుడులూగా ఉన్నప్పుడు నామభేదమూ రూపభేదమూ 'గుణభేదమూ రావడంలేదా? "నా దృష్టిలో జడమేలేదు. అంతా చైతన్యమే' అన్నారు. అమ్మ జడము అని అనుకునే దానిలో కూడా గుణమూ, శక్తీ ఉన్నాయి. అంటుంది.

ఆత్మజడము కాదు శక్తిమయము. శక్తి ఎక్కడుంటే అక్కడ ఆత్మ ఉన్నదన్న మాటే. ఒక పేరు 'శక్తి'. ఇంకొక పేరు 'చైతన్యము'. ఇంకొక పేరు 'వస్తువు' ఇంకొక పేరు 'అంతా అదే' 'సర్వం ఖల్విదం బ్రహ్మ' 'నేహనానాస్తికించన' 'వాసుదేవజగత్సర్వం' అంటూ శ్రీపాదవారు అమ్మ విషయం వ్రాసేటప్పుడు తన్మయులై వ్రాస్తారు.

బ్రహ్మసూత్ర పదైశ్చైవ సూత్రప్రాయంగా బ్రహ్మ సూచకములైన వాక్యములు బ్రహ్మసూత్రాలు. వాటిచేత బ్రహ్మమెఱుగబడుతుంది కాబట్టి అవి పదములౌతాయి (పద్యతే = ఎరుగబడుచున్నది) అని శంకరుడూ బ్రహ్మసూత్రాలంటే శారీరక సూత్రాలనీ రామానుజులూ మధ్వాచార్యులూ గ్రహించారు.

బ్రహ్మసూత్ర పదైశ్చైవ-
సర్వవేదాంత సిద్ధాంత సారం వచ్మి యథార్థతః
స్వయం భూత్వా స్వయం మృత్వా
స్వయ మేవావశిష్యతే"

అని ఒక చక్కని బ్రహ్మసూత్రం ఉంది. అది ఈ అధ్యాయంలో పరమాత్మ చెప్పిన అన్ని మాటలకు అమ్మ మాటలకు ఏకంగా వర్తించే సూత్రం.

6. మహాభూతా న్యహంకారో బుద్ధి రవ్యక్త మేవచ,
ఇంద్రియాణి దశైకం చ పంచ చేంద్రియగోచరాః॥

7. ఇచ్ఛా ద్వేష స్సుఖం దుఃఖం సంఘాత శ్చేతనా ధృతిః,
ఏతత్ క్షేత్రం సమాసేన సవికార ముదాహృతమ్॥

తా: పంచమహాభూతాలు, అహంకారమూ, బుద్ధి, అవ్యక్తం అనే మూల ప్రకృతి, పదకొండు ఇంద్రియాలు, అయిదు ఇంద్రియ విషయాలూ, కోరిక, ద్వేషము సుఖము, దుఃఖము, దేహేంద్రియాల సముదాయం తెలివి ధైర్యం. అనే వీటితో సంక్షేపంగా ఈ క్షేత్రం ఉదాహృతమై ఉంది.

వ్యా: 'ఇదం శరీరం కౌన్తేయ క్షేత్రమిత్యభిధీయతే అంటే అస్థిపంజర నిర్మితమైన దేహము ఒకటే అనే భావం మనస్సులో భాసిస్తుంది. చాలా మందికి అలా భాసించే శరీరాల్లో కూడా మనుష్య శరీరం ఒక్కటే మోక్షార్హమైన శరీరంగా గుర్తించబడుతుంది. ఇది పెద్ద పొరపాటు. ఆ పొరపాటు బడనీయకుండా కృష్ణపరమాత్మ పై రెండు శ్లోకాలలోనూ క్షేత్రమంటే ఏమిటో స్పష్టంగా విశదీకరించారు.

శరీరం ఉపాధి లేక క్షేత్రం. విత్తనాలను పొలంలోవేస్తే మొక్కలుగా మొలిచి

శతమూలాలు శతాంకురాలుగా విస్తరించడం మనకు రోజూ అనుభవంలోని విషయమే. మొలిచిన మొక్కలను పండిన గింజలను కోసికొని బండ్లకెత్తుకుని తీసుకుపోతే పొలం వెనుక మిగిలిపోతున్నది. కాబట్టి స్థూలదృష్టికి పొలం వేఱూ విత్తనాలు వేఱూ. పంట వేఱుగా అనిపిస్తాయి మనకు. కాని మన మనస్సులను కొంచెం సాగదీసి ఆలోచిస్తే ఈ భేదభావం అదృశ్యమైపోతుంది. పొలం ఉంది. పొలం అంటే ఎక్కడ ఉన్న పొలమైనా ఆ పొలమనే అర్థం. అంటే విత్తనాలు ఇక్కడవేసినా, ఇంకో చోట పొలంలో వేసినా వాటిని మొక్కలుగా మొలిపించే కార్యప్రణాళిక పొలాలన్నింటికీ సమానధర్మంగా వర్తిస్తుందన్నమాట. కాబట్టి పొలం అంటే పొలం ధర్మమనే కాని పొలంలోని విస్తీర్ణమూగట్లూ కావన్నమాట. ఆ ధర్మాన్ని ప్రసవధర్మం అనుకుందాం. ప్రసవధర్మానికీ పండిన గింజలకూ సంబంధమేమిటీ? ప్రసవధర్మమే గింజల ఆకారం దాల్చి మాతృధర్మ ఘనత్వాన్ని పొందాయి. దీనికి కారణమైన దేశ కాల వ్యవస్థల నుంచి దూరంచేస్తే. ప్రసవ ధర్మానికి, పొలానికి, గింజలకు భేదం లేకుండా పోతుంది. తల్లిబిడ్డలకు అభేదాధ్యవసాయం కుదురుతుంది.

ఇక ఉపాధి ఐన శరీరమంటే శరీర కారణధర్మాలు, శరీరధర్మాలు అనే అర్థం. దృశ్యమంటే ఫోటోగ్రాఫుతీసే కేమేరా. కంటికి అందుబాటులో ఉండే రూపమేకాదు. అర్జునుడికిచ్చిన దివ్యచక్షువు, అందుబాటులో ఉండే అంశాలని కూడా అర్థం. ఈ శరీరానికి కారణాలయిన పృథివ్యాది పంచభూతాలు, పంచతన్మాత్రలు, అహంకారం, బుద్ధి, అవ్యక్తము, (అంటే మూర్తులకు మూర్తిత్వం అబ్బడానికి పూర్వం, మూర్తుల స్థానంలో ఏది ఎలా ఎంతగా ఉండేదో అది అవ్యక్తం). జ్ఞానేంద్రియాలు ఐదు. కర్మేంద్రియాలైదూ, శబ్దస్పర్శాది విషయపంచకమూ, ఇచ్ఛ, ద్వేషం, సుఖం, దుఃఖం, ఇంద్రియాల సమూహం, అంతఃకరణవృత్తి, ధైర్యం, ఇవన్నీ కలిసిన కూడలి శరీరం, లేక క్షేత్రమూ, లేక దృశ్యం అవుతాయి. ఈ కూడలి ఎలా పనిచేస్తుంటుంది? దృక్కునే ఉదాహరణగా తీసుకుందాం. లోపల బయటా ఉన్న చైతన్యం లోపలి నుంచి కంటి ద్వారా ప్రసరించి బయటి వస్తువులను ఆవరించి, ఆ వస్తువుల రూపాన్ని దాల్చి, బింబస్మృతి రూపంగా తిరిగి కంట్లో ప్రవేశించి బయటి ప్రపంచమే తాననుకునే వృత్తిని సదా మనస్సుకు అందజేస్తుంటుంది. అలాగే చెవీ, ముక్కూ నోరూ మొదలయిన జ్ఞానేంద్రియాలు, బయటి వస్తు స్వరూపాలనూ, శబ్ద గ్రంథాలను లోపలికి చేరవేస్తుంటాయి. జ్ఞానేంద్రియాలు కేవలం ఉపకరణ మాత్రాలే. వాటికి గ్రహణ స్వాతంత్ర్యం లేదు. ఇచ్ఛాద్వేషాలు లేవు. అద్దం, ప్రత్యేకంగా ప్రతిబింబించుతాననీ, మిగతా వాటిని చేరనీయననీ అంటానికి వీలులేదు. అన్నింటినీ

సమానంగా ప్రతిఫలింపజేయడమే దాని పని. విచక్షణావృత్తిలోపల ఉండే అంతః కరణ సామగ్రిది. విచక్షణకు ఇంకో రకం పేర్లే రాగద్వేషాలు. ద్వేషం అనేది రాగంలేని చోట పుట్టదు. శరీర ధర్మాన్ని అనుసరించి కూడా ఈ విచక్షణ ఉంటుంది. క్షేత్ర వికారాలన్నీ ఈ విచక్షణాది స్వభావాన్ని ఏర్పఱచడానికి సాయపడతాయి. కాని ఒక వ్యక్తి విచక్షణ ఇంకొకని విచక్షణతో సమానంగా ఎందుకు ఉండదూ అని ప్రశ్న. సంప్రదాయ సిద్ధంగా అయితే కర్మ, ప్రారబ్ధం, వాసనలు - ఇలాంటి మాటలతో దాన్ని విశదీకరించే ప్రయత్నం జరుగుతుంది. కాని ఈ పైన చెప్పిన వికారాల హెచ్చుతగ్గులవల్లనే ఈ విచక్షణా వైఖరి ఏర్పడుతందని అమ్మ అంటుంది. హెచ్చుతగ్గులు ఎందుకు కలగాలి అనే ప్రశ్నకు హెచ్చుతగ్గులే సృష్టి అని చెపుతుంది అమ్మ. ఎప్పుడు మారుతూ ఉండే ప్రకృతి పదార్థాలలో హెచ్చుతగ్గులు సంభవిం చడం సహజమే. లోపలా వెలుపలా కనపడేదంతా నాదే అనే భావం స్థిరంగా మనసులో నాటుకున్ననాడు ఈ హెచ్చుతగ్గులూ పోతాయి. వాటితోబాటు విచక్షణా పోతుంది.

"నా చిన్నతనంలో ఒక రోజున మధ్యాహ్నం కూర్చుని నిద్రపోయిలేచాను. కళ్ళు తెరిచేటప్పటికీ నా శిరస్సుపై సర్పం కనిపించింది. పక్కకు తిరిగితే పక్కన కనిపించింది. ఎదురుగుండా చూస్తే ఎదురుగుండా కనిపించింది. ఎటుచూస్తే అటు కనిపించింది. చింతచెట్టు వైపుచూస్తే చింతచెట్టు అంతా అదేగా కనిపించింది. రోడ్డునే బయలుదేరితే రోడ్డుననే నడిచినట్లే నడిచింది. శివాలయం వాకిలి ముందర నిలుచుని ధ్వజం వంకచూస్తే ధ్వజం పొడుగునా కనిపించింది. నా పాదాల వద్ద నుండి గుడి వాకిలి దాకా ఉన్నది. ఆశ్చర్యంతో భావ నారాయణస్వామి దేవాలయా నికి వెళ్ళాను. అక్కడా ఉన్నది. అక్కడ కూర్చున్నాను. చివరకిది ఏమిటి అని ఆలో చించాను. ఇదంతా నాలోదే అనిపించింది.

పైన శ్లోకాల్లో వివరించబడ్డ ప్రతీ వికారమూ ప్రతీ అంశమూ అంటే ప్రతీ పంచభూతమూ, ప్రతి సుఖమూ ప్రతి దుఃఖమూ ప్రతి ఒక్కటి ఒక నాగుబామే. ఆ నాగుబాములన్నీ మనలోవే అని తెలుసుకోవాలి. క్షేత్ర లక్షణాలనే పైశ్లోకాలలో వివ రించారు.

క్షేత్రజ్ఞుని లక్షణాలు వర్ణించడానికి ఇది తావు కాదు. చేతనాధృతి అయిన క్షేత్ర స్వభావాన్ని గూర్చి వివరించిన పిదప క్రింద శ్లోకాలలో స్వభావాన్ని గూర్చి చెపు తున్నారు పరమాత్మ.

8. అమానిత్వ మదంభిత్వ అహింసా క్షాంతి రార్జవం।
ఆచార్యోపాసనం శౌచం స్థైర్యమాత్మ వినిగ్రహః॥

9. ఇన్ద్రియార్థేషు వైరాగ్య మనహంకార ఏవ చ।
జన్మ మృత్యు జరావ్యాధి దుఃఖ దోషాను దర్శనమ్॥

10. అసక్తి రనభిష్వఙ్గః పుత్రదార గృహాదిషు।
నిత్యం చ సమచిత్తత్వ మిష్టానిష్టోపపత్తిషు॥

11. మయి చానన్యయోగేన భక్తి రవ్యభిచారిణీ।
వివిక్తదేశసేవిత్వ మరతి ర్జనసంసది॥

12. అధ్యాత్మ జ్ఞాన నిత్యత్వం తత్వ జ్ఞానార్థ చింతనం।
ఏతత్ జ్ఞాన మితి ప్రోక్త మజ్ఞానం యదతోఽ_న్యథా॥

పెద్దలను తిరస్కరించకుండా ఉండటం దంబం లేకపోవడం, హింస చేయకుండడం, ఓర్పు, తిన్నని నడవడి కలిగి ఉండడం ఆచార్యసేవ. శుచిగా ఉండడం, నిలకడ కలిగి ఉండడం మనస్సును అణచి ఉంచడం, ఇంద్రియ విషయాలలో విరక్తి, అహంకారం లేకపోవడం, పుట్టుక, చావు ముసలితనము అనువానిలోని దుఃఖదోషాలను చూచి ఉండడం, విషయాల యందు తగులుబాటు లేకుండడం, కొడుకులు, భార్య, ఇల్లు మొదలైనవాని యందు ఆసక్తి లేకుండా ఉండడం. మేలు కీడు కలిగినప్పుడు ఎల్లప్పుడును, సమానమై మనస్సు కలిగియుండడం నా యందు ఏకాగ్ర బుద్ధితో ఉండడం, ఏకాంత ప్రదేశాలలో ఉండడం, జన సమూహం మీద ప్రీతి లేకుండా ఉండడం, ఆధ్యాత్మ జ్ఞానాన్ని ఎల్లప్పుడు కలిగి ఉండడం, తత్వజ్ఞానం యొక్క ప్రయోజనాన్ని తెలుసుకోవడం, ఈ గుణాలుకలిగి ఉండడం జ్ఞానమని చెప్పబడ్డది. దీనికంటె వేఱైనది అజ్ఞానం.

వ్యా: 1. **అమానిత్వం:** పెద్దలను తిరస్కరించకుండా ఉండటం ఇతరులలోని మంచిని చూడడమే మన మంచితనం.

2. **అదంభిత్వం:** లోపల ఒకలా ఉండి బయటికింకోలా కన్పించడానికి చేసే ప్రయత్నం. దంభం– అదిలేకపోవడం అదంభిత్వం.

"ఆయనది దూషణ అని మనం అనవద్దు. ఆయన పబ్లిగ్గా చెబుతున్నారు. మనం లోపల ఉంచుకుంటున్నాం. ఆయన పద్ధతే మంచిది"

3. **అహింసా:** సహిచలేనది హింస: ఏది సహించలేదో అది హింస. అంతా సజీవం అంటారు. ఎక్కడికక్కడ హింస చెయ్యటల్లేదూ? కాళ్ళ క్రిందపడి ఎన్నిజీవరాసులు చచ్చిపోవటల్లేదూ? అయినా పొద్దుగూకులూ హింసబెట్టీ ఆ భగవంతుడి కంటే హింసపెట్టే వాళ్ళెవరున్నారు. "కాబట్టి అన్నింటి యెడల సమానంగా ఉండే సహన భావమే అహింస.

4. **క్షాంతి:** సహజమైన ఓర్పు - నేర్పుగల ఓర్పుగాదు - ఓర్పు దేనికీ? ఏదైనా బాధవస్తేనూ - "బాధపడడమేకాని పెట్టడం ఏముంటుంది? ఏంచేసినా బాధ పడనివాణ్ణి ఎవరు బాధపెట్టగలరు? బాధ అంటూ ఉంటేగా సహనం అన డానికి క్షాంతి అంటే బాధలేకపోవడం అంటుంది అమ్మ.

5. **ఆర్జవం:** ఋజువర్తనం. ప్రకృతిస్థుడై ఉండడమే ఋజువర్తనానికి అర్థం. శాస్త్రంలో చెప్పిన విధినిషేధాలను పాటింటించడంవల్ల ఋజువర్తనం అబ్బదు. జీవచైతన్యం, నిజమైన దేహయాత్ర, ప్రకృతి శక్తులవల్ల నిర్ణయించబడుతాయి గాని, మతభేదాల చెదలు పుట్టలయిన విధి నిషేధాలూ ఆచారాలూ, సంప్ర దాయాలను పాటించడం వల్లనే ఆర్జవం రాదు.

6. **ఆచార్యోపాసనం:** ఆచార్యుడంటే గురువు ఆచార్యోపాసనం అంటే గురువును ధ్యానించి పూజించి జ్ఞానాన్ని పొందడం.

'గుర్తు చెప్పిన వాడే గురువు' అన్నారు అమ్మ. 'భగవంతుడే గురువూ శిష్యుడూ సమస్తమూ' అమ్మ నేను సద్గురువును కాను. మీరు శిష్యులు కారు. నేను మార్గదర్శిని కాను. మీరు బాటసారులు కారు. నేను అమ్మను మీరు బిడ్డలు అంతే". ఎవరో అడిగారు. తాము ఏ మంత్రం జపించారు. తమ సాధన ఏమిటి" అని. అందుకమ్మ తరచు మీరనుకొను కాకిమంత్రం, కొంగజపం చేయుచుండగా ఎచటి నుండియో 'ఏ' వచ్చిపడినందున తానేకాకి నైతిని అన్నారుట. ఆచార్యోపాసనవల్ల సాధనా వైవి ధ్యాలు తెలిసి త్వరగా ఆత్మజ్ఞాన సిద్ధి కలుగుతుందని సంప్రదాయం. అమ్మ విషయం లో రాజమ్మగారు, బ్రహ్మానంద సరస్వతి, లక్ష్మీకాంత యోగి, కళ్యాణానందులు, ఆచార్యపీఠా లెక్కడానికి ప్రస్తావనలు వచ్చాయి కాని అనుభవంతో చెప్పిన గురు వెవరూ అమ్మకు లేరని అందరికీ తెలిసిన విషయమే.

7. **శౌచం:** లోపలా వెలుపలా శుభ్రంగా ఉండడం. ప్రయత్నం చేసి ఎవడూ ఈ శౌచాన్ని సాధించుకోలేదు. ప్రయత్నానికి ప్రయత్నం పరమేశ్వరుడే చేయాలి. ఈ బహిరంత శ్శౌచం చేసుకోనిదే పరమాత్మభావం మనస్సులో ప్రవేశించనే ప్రవేశించదు. వెలుతురు రావడం చీకటిపోవడం రెండూ యుగపద్ధర్మాలుగా

ఎలా గౌతాయో, అలాగే, పరమాత్మ భావం అవతరించడమేమిటి బహిరంత శ్శౌచాలు అవహించడమేమిటి రెండూ ఒకే క్షణంలో జరిగిపోతాయి. "నా బాధ్యత అట్లాంటిది. అందఱకీ సుగతి అన్నానంటే మీదేమీ లేదు కనుక. మీరు బురద పూసుకున్నా దాన్ని కడిగి శుభ్రపఱచవలసిన బాధ్యత నాది. దానికి మాతృత్వం కావలసి వచ్చింది. వచ్చాను.

8. **స్థైర్యం:** 'ఏది వచ్చినా - సుఖంగానీ - దుఃఖంగానీ భగవత్ప్రసాదమే అను కుంటూ, అనుకున్నది జరుగదు. తనకున్నది తప్పదు, అని అమ్మ చెప్పినట్లు ఎప్పటికేది ప్రాప్తమౌతుందో దాన్ని సమబుద్ధితో అనుభవించడమూ దుఃఖాన్ని, అప్రాప్త ఫలిత సంతోషంగా స్వీకరించడమే స్థైర్యం అంటారు. 'సుఖంగా బాధ అనుభవిస్తే బాధ బాధకాదు' అమ్మ ఆత్మవినిగ్రహం మనస్సు అదుపులో ఉంచుకోవడం 'నీ మనసుకు కారణమేదో, మనసు నిలువకపోవడానికి కారణ మేదో నీ మనసు నిలపడానికి కూడా అదేకారణం కనుక నీవేమీ దిగులు పడకు'. మనస్సే భగవంతుడు కారణం పక్వమైనప్పుడు ఆత్మవినిగ్రహం సాధ్య వస్తువే అయి జ్ఞానోదయానికి బీజమవుతుంది.

9. **ఆత్మవి నిగ్రహం:** మనస్సును గుంజకు కట్టెయ్యడంట

10. **ఇంద్రియార్థేషువైరాగ్యమ్:** 'సర్వత్ర అనురాగమే విరాగం' అన్నది అమ్మ. ఇంద్రియార్థములంటే ఇంద్రియ వ్యాపారాలకు లక్ష్య భూతములైన విష యాలు. వాటి యందు వైరాగ్యం అంటే ఊపిరితీయడం ఎలా సహజంగా చేస్తామో అలాగే సర్వత్ర సమానమైన అనురాగాన్ని చూపడమే వైరాగ్యం.

11. **అనహంకారము:** 'తనమూలమ్ ఇదంజగత్' అన్నది అమ్మ. ఎవరే పనిచేసినా స్వలాభం ఏకించిత్తో లేనిది ఏ పనీ చెయ్యడు. పైగా మాటలు మాత్రం అందుకు చేశాను ఇందుకు చేశాను అని ప్రేల్చుతుంటాడు.

"తను వేఱుగా ఉన్నాననుకోవడమే అహంకారం. అలాకాక ఏదో ఒక శక్తి సర్వజగత్తునూ వ్యక్తినీ, వ్యక్తి మనస్సునూ నడిపిస్తున్నదని నమ్మడం అనహం కారం-

12. **జన్మ మృత్యుజరా వ్యాధి దుఃఖ దోషానుదర్శనమ్**

'అందర్లోకి నాకు కుష్టువాళ్ళకి పెట్టుకోవాలనిపిస్తుందమ్మా. ఎందుకంటే తక్కిన వాళ్ళకి ఏదో విధంగా దొరుకుతుంది. వీళ్ళని ఎవరూ దగ్గఱచేరనియ్యరు. ఒకసారి కుష్ఠాసుపత్రిలో వాళ్ళని అడిగా- ఏం తినాలని ఉందని వాళ్ళు ఇడ్లీలు

కావాలన్నారు. ఒకరోజులో కొన్ని హోటళ్ళలో ఆర్డరిప్పించి నాలుగు వేల ఇడ్లీ పంపాను. ఇది వ్యాధి దుఃఖం.

ఒక వృద్ధుడు అర్థించగా తలలోని బంగారు బిళ్ళను తీసియిచ్చి దానిని తాకట్టుపెట్టి తన అవసరమును గడుపుకొమ్మని అమ్మ చెప్పింది బాల్యంలోనే ఇది జరా దుఃఖం.

ఎంత శరీర బాధేనా వంకికి తగిలించినట్లు తగిలించగలదని 'నాన్నగారి వాక్యం'.

'ఏ మమ్మా! నీకు (పురిటి) నొప్పుల్లే వా' అని చీరాలలో డాక్టర్లు అడిగేరు. ఇంజక్షను తీసుకుంటున్న అమ్మ ఊరుకున్నా జ్యోత్స్న ఇవ్వలేకపోయింది సూది గ్రుచ్చడానికి జడిసి 'భరించరాని గర్భసంచి నొప్పితో ఆమె సతమతమౌతుండాలి. అని చీరాల హాస్పిటల్‌లోని డాక్టర్లు అన్నప్పుడు ఆవిడ మఱిదిగారు చూస్తే అమ్మ పచారు చేస్తున్నారట.

ఇది జన్మదుఃఖం.

8-12-67 నాడు విషసన్నిభమైన రసానయమేదో అమ్మ ఇతరుల ప్రమాదం వల్లనే కానీండి - పుచ్చుకుని కొయ్యబారిపోవడం విన్నాం.

అమ్మ శవాన్ని ముద్దుపెట్టుకుండి. ముడ్రుకలు నెరసిన ముసలివాళ్ళ చర్మం ముడుతలంటే నాకు ముద్దు అన్నది. ఇది మృత్యు దుఃఖం.

ఇలాగా అమ్మ జన్మదుఃఖ మృత్యుదుఃఖ జరాదుఃఖ వ్యాధిదుఃఖాలను తనలోను ఇతరులలోనూ అనుదర్శనం చేసి ఉన్నది.

హైమకోసం ఏడుస్తున్నావా అంటే ఏడుస్తున్నాను. బాధపడ్తున్నాను. చలిగాలికి కప్పుకున్నట్టు, ఎండకు విసురుకున్నట్టు... ఏడుపు వస్తున్నదీ - ఏడుస్తున్నాను.

13. అసక్తి రనభిష్వఙ్గః పుత్రదార గృహాదిషు

అభిష్వఙ్గం - అంటే కౌగిలించుకుని ఉండడం. అసక్తి - ఆసక్తి లేకపోవడం - పై పాదానికి కొడుకు, భార్య, ఇల్లూ, వాకిలి బంధాలు వదిలించుకోవడం అని అర్థం.

'పెళ్ళిలో పెద్దపులి ఉన్నదని భయపడేవారి భయం పోగొట్టడానికే నేను పెళ్ళి చేసుకుంటున్నాను', 'ఎన్ని వచ్చినా మనస్సుకు ఏమీ సంబంధం లేదని చెప్పటం కోసమే నాయీ పెళ్ళి'.

ఒక పెన్నిధి అండన చేరడమే పెళ్ళి

ఆ అండను చేరే పరిణామమే పరిణయం

సర్వాన్నీ అనుభవిస్తూ సర్వాన్నీ వదలి వేయడమే వివాహం

కళంక రహితమైన మనస్సును కళంకరహితంగా అర్పించడమే కళ్యాణం.

సంసార బాధ్యతలే ఆధ్యాత్మిక సాధన నాయనా! ఆధ్యాత్మిక సాధన అంటే వేరే అదేదో కాదు. "నువ్వుచేసే ప్రతి పనీ భగవత్సేవయనీ భగవదాజ్ఞానుసారమేననీ అనుకోగలిగితే - ఈ సంసారం ప్రతిబంధకం కానేరదు. అనగా నీ దృష్టిలో, భావనలో మార్పు తెచ్చుకోవటమే"

మరొకసారి 'నీ ఆధ్యాత్మిక సాధన యేమిటి?' అని అడిగిన వారితో

'పిల్లలను కనడమే' అని అమ్మ నిర్లిప్తంగా చెప్పింది.

14. నిత్యంచ సమచిత్తత్వమిష్టా నిష్టోపపత్తిషు

నేను అమ్మను. మీరు బిడ్డలు.

ఇది సమచిత్తత్వం.

'సుఖంగా అనుభవిస్తే బాధ బాధేకాదు'
'బాధలేని బ్రతుక్కంటే చావునయం'
'ద్వంద్వాలతోనే ద్వంద్వాన్ని జయించాలి'

15. ఇలా అమ్మ భావం ఇష్టానిష్టాల కతీతమైనదిగా మనం తెలుసుకోగలం. అమ్మ దగ్గఱ ఉన్నప్పుడు మనకూ ఈ విభేదాలు కనిపించవు.

16. మయిచానన్యయోగేనర భక్తి వ్యభిచారిణి

తనయందు ఇతర ధ్యాసలేవీ లేకుండా అసాంక్రామికమై, తైలధారా వచ్చిన్న రూపమైన భక్తిని కలిగి ఉండడమని పరమాత్మ వాకొన్నారు. భక్తి హృదయాన్ని ద్రవింపజేస్తుంది. భక్తిపారవశ్యాన ఆనందాశ్రువులు వస్తాయి. హృదయమే నీరై పోయి కళ్ళద్వారా ధారారూపకంగా బయటికి ప్రవహిస్తుంది. అమ్మ దగ్గఱకు వచ్చేవారికి ఈ దృశమైన హృచ్చక్షు స్నేహ వ్యాపారము అందఱికీ తెలిసిన సంగతే.

17. వివిక్త దేశ సేవిత్వం

ఏకాంత ప్రదేశ నివాసాన్ని అపేక్షించి ఏకాంత వాస రుచిని అభిమానించడ మని అర్థం. అంటే లోకంలోని కల్లోలాల వలన మనస్సు ఏకాగ్రతకు భంగం కలుగుతుంది. కాబట్టి సమ్మర్థాన్ని విసర్జించి, సంకేత స్థానానికి పోయి ఆత్మ సంకేత బుద్ధితో ఉండిపోవడాన్ని వివిక్తదేశ సేవిత్వమనే దాని కర్థం.

'తాను సంసారంలో ఉండవచ్చునుగాని

తనలో సంసారం ఉండరాదు' అమ్మమాట చాలా సూటిగా నిజాన్ని కఠోర సత్యాన్ని వెల్లడించింది. ఎందుకంటే పర్వతగుహలో కూర్చుని గూడా సాధకుడి ఆలోచనలు ప్రోనోట్లమీదా, వడ్డీవ్యాపారం మీదా చిక్కుబడి ఉంటే, గుహా నివాసానికి అర్థమేలేదు. ఇంట్లో ఉన్నప్పటికీ భక్తుని మనస్సు అమ్మమీదే ఉన్ననాడు ఇంట్లో ఉండడంవల్ల నష్టమూలేదు.

18. **అరతిర్జన సంసది:** ఆహార నియమము. కొంతమంది సాధకులు నేటికాలపు 'రిలే'నిరాహార దీక్షలలాగా సాగిస్తుంటారు ఈ ఆహార నియమాలను. కాని అన్ని నోళ్ళూ తన నోరేగా, అన్ని జీర్ణకోశాలూ, తన జీర్ణకోశాలూ, అన్ని కడుపులలోని క్షుధలూ, తనవిగానే అయిన అమ్మ విషయంలో ఈ విషయం చాలా ఆశ్చర్యకరంగానే ఉంటుంది. 'ఆహారాన్ని నేను వదలలేదు. నన్నే ఆహారం వదిలింది' అని అమ్మ చెప్పినా, అప్పుడప్పుడు కొన్ని విచిత్రకరమైన సంఘటనలు అమ్మ విషయంలో జరుగుతుంటాయి.

'1963 అక్టోబరు 6వ తేదీన. మామూలుగా తన ప్రక్కన వారితో మాట్లాడుతూ ఉన్నట్లుండి 'పరధ్యానం'గా మూడురోజుల నుండి చపాతీలు చేసి పెట్టమని అడుగుతున్నా. సత్యం (హోటలు నడుపుతుంటాడు) 'యింతవఱకు అవి చేసిపెట్టలేదు. ధనవంతులయిన వారికి - ఏం కావాలో అవి తెప్పించుకోగలిగిన వారికే చేసి పెట్టటమెందుకు? నాకెవరూ లేరు. నాకు చేసి పెట్టండర్రా చపాతీ' అన్నది. కొంతసేపయినాక మళ్ళీ 'నేనివ్వాళ నియమంగా ఆహారం తీసుకోవాలి. వెంటనే పదినిమిషాల్లో రెండు చపాతీలు, కొద్దిగా వేడినీళ్ళు తెచ్చిపెట్తావా?' అని తన ప్రక్కనున్న ఒక ఆమె నడిగింది అమ్మ. అలాగే పది నిమిషాల్లో అమ్మ అడిగినట్లు ఏర్పాటు చేయబడింది. ఇప్పుడే బార్లీ జావ త్రాగానని అవి స్వీకరింప నిరాకరించింది. తీసుకొమ్మని బ్రతిమాలగా మంచంమీద పడుకునే తినటం ప్రారంభించింది. తింటూ పరధ్యానంగా "తడి ఉండగూడదు. దీన్నిసరిగా కాల్చారా! జాగ్రత్తగా ఉండకపోతే గర్భంలోకి నీరు చేరుతుంది. అందుకు ఇవ్వాళ ఆహారం నియమంగా తీసుకోవడం మంచిది". 'ఎవరికమ్మా' అవి అని అడిగితే 'ఆమెను గురించి అడుగుతున్నావా?' అని చెప్పటం మొదలుపెట్టింది. ఆ మాట్లాడే సమయంలో కూడా, మన ప్రశ్నలకు సమాధానం చెప్పేప్పుడు కూడా అమ్మ మన మధ్య ఉన్నట్లు లేదు. 'పరధ్యానం'గానే మాట్లాడడం.

"పండరిపురంలో ఒక కొండజాతి దంపతులకో కుమార్తె ఉంది. ఆమె సంసా

రంలోని కష్టాలు భరించలేక తను తరచూ తపస్సు చేసుకునే అడవులలోకి పారిపోయింది. అరణ్యాలకు పోయినట్లు ఆమె పెనిమిటికి తెలిసింది. ఆమెను వెతికి పట్టుకుని క్రూరంగా ప్రవర్తించాడతను. ఆమె గర్భిణి. గృహిణిగా జీవిస్తున్నా ఆమె మనస్సు మాత్రం పవిత్రంగానే ఉంది. ఆమె గర్భంలో శిశువు చనిపోయింది. ఆమె మళ్ళీ తపశ్చర్య నారంభించింది. పూర్వపు స్త్రీకాదామె ఇప్పుడు. నిరంతర ధ్యానంతో గడుపుతూంటుంది. ఆమె తల్లి తెనాలిలో మా తాతగారింట్లో పనిచేసేది!

అమ్మ మాట్లాడుతూ తింటూనే ఉంది. ఆ 'పరధ్యానం'లో చపాతీ పెట్టిన ఆకుని కూడా నోట్లో పెట్టుకుంది. నిర్జరారణ్యాలతో ధ్యాన నిమగ్న ఐన తపస్విని అవసరాలు తీర్చే తత్పరతలో ఆమె ఏం చేస్తున్నదీ గమనించే స్థితిలో లేదు. మాలో ఒకరు హడావిడిగా అమ్మ నోటిలోని ఆకుని తీసివేశారు. అప్పుడమ్మ మావేపు తిరిగి నిశ్శబ్దంగా పడుకుంది. సహజమైన అరతి లక్షణం ఇదీ.

ఒక జనసమూహం మీద అమ్మ అరతి ఎలా ఉంటుందంటే – అమ్మా మీ తపసేమిటంటే

'మీరంతా కావాలనుకోవటమే' అన్నది. మనం అనుబంధాన్ని తగిలించుకుంటే తప్ప లక్షమంది జనుల మధ్యలో ఉన్నా మనం ఏకాకులమే అవుతాం. మనను గూర్చి పట్టించుకోని వాళ్ళెంతమంది మన చుట్టూ ఉన్నా వాళ్ళ మధ్య మనం ఏకాకితనాన్నే అనుభవిస్తాం. అంతేకాదు. కొన్ని కొన్ని పరిస్థితులలో ఉన్న లక్షమందీ ఏకాకులే ఐపోయి అరతిర్జన సంసది అనే మాటకు వింత ఉదాహరణ లౌతారు. ఒక సినిమా హాలులో వెయ్యిమంది తన్మయులై సినిమా చూస్తున్నప్పుడు హఠాత్తుగా హాలుకు నిప్పంటుకుని తగలడ్డం ఆరంభించిందనుకోండి. ఎవడి ప్రాణాన్ని కాపాడుకునే ఆతురతలో వాడేమగ్నుమై, ప్రతీ ఒక్కడూ ఏకాకిగానే ప్రవర్తించడం ఆరంభిస్తాడు. కాబట్టి ఏకాకిత్వం ముఖ్యంగా మనస్థితి మీద ఆధారపడి ఉంటుందన్నమాట. అమ్మ తన మంచంమీద నాలుగు గోడలమధ్యా ఏకాకినిగా ఉన్నా అందఱి బిడ్డల మధ్య, విశ్వసంసారంలోని అందఱు జీవులూ చుట్టూ పరివేష్టించి ఉన్నట్లే ఉంటుంది? కాబట్టి వ్యక్తి మనః ప్రవృత్తినిబట్టి ఒంటరితనం ఉంటుందికాని, మనుష్యుల సంఖ్యను బట్టి ఉండదని నిర్ధారితం అవుతుంది.

19. అధ్యాత్మ జ్ఞాన నిత్యత్వం

పై వాళ్ళకు సంసారంలో మునిగిపోయి ఉన్నాడని అనిపిస్తున్నా, నిజమైన యోగి, సంసారం అనే బురదలో కుమ్మరి పురుగుగానే ఉంటాడు. దానికి తాత్కాలిక ప్రస్తావన లేనేలేదు.

ఇది భగవానుడి లక్షణం; సృష్టిచేసి అందుకు తాను బద్ధుడై తాను వ్రాసిన నాటకంలో తానొక పాత్ర వహించి నాటక ధర్మానికి తలవంచినట్లుండడమే సంసారం. అయినా అందులో సుఖదుఃఖాలకు లొంగకుండా అనుభవిస్తున్నట్లు అభినయిస్తూ పూర్తిచేస్తాడు. అది తెలియనివాడు జీవితరంగంలో తనపాత్ర నిర్వ హించటంలో ద్వంద్వాల్లో చిక్కుకుంటాడు. ఇదీ తనలో సంసారం ఉందనటానికి తాను సంసారంలో ఉండడానికీ తేడా.

రమణ మహర్షి చెప్పిన ఒక కథ యిక్కడ చాలా సందర్భ సహితంగా ఉంటుంది. కడువేలి సిద్ధార్ అన్న ఒక మహాత్ముడు చెట్లనుండి రాలిన ఎండు టాకులు మాత్రం తిని జీవిస్తుండేవాడు. రాజు అతని గొప్పదనాన్ని ఎవరైనా పరీక్షిం చాలంటే, ఒక దాసి అందుకు కంకణం కట్టుకొందట. ఆమె అతని సమీపంలో కుటీరం వేసుకొని అతడు ఏరుకునే ఆకుల్లో వేయించిన అప్పడం ముక్కలు వేసేదట. ఆయన ఆకులు విడిచి అవి తినడం మొదలు పెట్టాక రుచికరమైన వంటకాలు చేసి, చివరికి శుశ్రూష చెయ్యటంలో ఆయన్ని సంసారంలో దింపి ఆయనవల్ల కొడుకును కన్నదట. చివరికి అతని స్థితి బయటపెట్టడానికి తన నాట్య ప్రదర్శనం అని చాటించింది. జనం, రాజు అందరూ మూగారు. ఆమె నాట్యం చేస్తుండగా పిల్లవాడు పాలకోసం ఏడిస్తే కడువేలి సిద్ధుడు అతన్ని ఎత్తుకుని అక్కడి కొచ్చాడట. అది చూచి తన కాలిగజ్జను కావాలని త్రెంచుకొని సిద్ధుడి దగ్గరకొచ్చి కట్టమంటే అతడు కడుతుండగా జనం చూచి అతన్ని పరిహసించారట. అప్పుడా సిద్ధు డన్నాడట. –

"ఇంతకాలం అహర్నిశలు నేను ఆత్మనిష్టయందున్న మాట నిజమే అయితే యీ రాతి విగ్రహం పగిలి అంతర్థానం కావాలి" అన్న వెంటనే అక్కడున్న విగ్రహం బ్రద్దలైపోయిందట. రాజు, ప్రజలు, ఆ దాసి అందఱూ నివ్వెఅపోయారట. ఈ కథ ద్వారా భగవన్ జ్ఞాని స్థితిని బాహ్యచర్యలవల్ల ఎవడూ నిర్ణయింపలేడని విశదపఱి చారు.

అమ్మ సంసారం విశ్వసంసారం. మన సంసారాల లాంటిదికాదు. సృష్టికర్తను విశ్వసంసారం ఎంత బంధించకలదో అమ్మనూ అంతే. అమ్మ అధ్యాత్మతత్వం నిత్య మైనది.

20. తత్వజ్ఞానార్థ దర్శనమ్

అమ్మ చెప్పే అనుభవసారంలో, సందేహానికి తావులేకుండా, సామాన్య

మానవుడు నిత్యజీవితంలో నిర్భయం, ఋజువైన జీవితాన్ని గడపి పరమేశ్వరుణ్ణి చేరుకోడానికి రాజమార్గం ఉన్నది. అమ్మ చెప్పే మాటలు నేటి సైన్స్‌కు దగ్గఱగా ఉన్నవి. కలియుగంలో పరమార్థాన్ని గుఱించి ప్రతి విషయమూ వివాదాస్పదమే అవుతున్నది. ఆచారమూ సంప్రదాయమూ అన్నింటినీ ముగ్గులోకి ఈడ్చి వాటి నిగ్గుతేలిస్తేనేగాని మూఢంగా వాటిని అనుసరించమంటున్నారు. ఇటువంటి పరిస్థితిలో అటు అతి వాస్తవ బుద్ధి కలవాళ్ళకు, ఇటు శాస్త్ర బుద్ధికలవాళ్ళకు, సమ్మతంగా ఉండేలాగా జీవిత శాస్త్రాన్ని ముక్తిశాస్త్రాన్ని చెప్పడటం చాలా కష్టం. సంప్రదాయ పద్ధతులతో సాధన అని చెప్పబడేది క్లిష్టపద్ధతులతో శరీరాన్ని క్లేశపెట్టే ఉగ్ర నియమాలతో భయం గొల్పేదిగా ఉంది. సంప్రదాయ మార్గం చాలా కష్టాలతో నిండి ఉన్నా చివరికి దొరికే ఫలితం అస్తి నాస్తివిచికిత్సా భూతంగా ఉంది. సామాన్య ప్రజానీకానికి అది అందుబాటులో ఉండకపోవడమేగాక, నిస్పృహ నిరాశ కల్పించేదిగా కూడా ఉంది. దానిలోని క్లేశాన్ని తగ్గించి అమ్మ చెప్పేమాట సాధన మీరు చెయ్యగలిగిందే చెయ్యండి. చేసేదంతా సాధనే అంటుంది అమ్మ. ఇందులో దుష్కరాభ్యాసాలకూ, కఠిన నియమాలకు స్థానం లేదు. అందఱికి అందుబాటులో ఉండే పద్ధతి అమ్మ చెప్పింది. పూర్వ సంప్రదాయాలు దేవుడు ఏదో కొన్ని లోకాలకు చెంది ఉంటాడనీ, ఈలోకంలో కూడా ఉన్నా అతనిని కొలిచేవాళ్ళు అతనికి ప్రియులనీ వాళ్ళకే మోక్షం ఇస్తాడని చెబుతాయి. అమ్మ అలాకాక దైవమంటే సర్వానికీ ఆధారమైన చైతన్యం తప్ప వేఱేమీ కాదనీ, ఆ చైతన్యమే అన్ని కార్యాలకూ, మనుష్యుల తలపులకూ, చేష్టలకూ మూలకారణమనీ, అందఱు ఆ పరమాత్మ బిడ్డలేననీ, పరమాత్మను కొలిచినా, కొలువకున్నా ఆయన అనుగ్రహానికి భేదముండదనీ, పాపం పుణ్యం వేఱుగా లేవనీ, లోకం అంటే ద్వంద్వాల హెచ్చు తగ్గులనీ, పాపమూ పుణ్యమూ రెండూ జగత్తు నిర్వహించడానికి అవసరమైనవేననీ చెపుతుంది. అనుకున్నది జరగదనీ, తనకున్నది తప్పదనీ అమ్మ చెబుతుంది. యుగపత్ ప్రళయం ఎక్కడా లేదనీ, ఒకచోట నాశనమైతే మరొకచోట పుట్టడం సహజమే అని అమ్మ చెపుతుంది. వ్యక్తి ప్రయత్నం విషయంలో ఆస్తిక్య సంప్రదాయం ఇలా అంటుంది. పేకాటలోలాగా నీకు కొన్ని ముక్కలు భగవంతుడిచ్చాడు వాటిని ఎలా ఆడుకొంటావో అది నీ బాధ్యత. నీ తెలివితేటల మీద ఆధారపడి ఉంటుంది. ఆట ఓడిపోయినా గెలిచినా భగవంతుని ప్రమేయం ఏమీ లేదంటారు. పూర్వపు ఆస్తికులు. నాస్తికులు మనం ఏం చేయగలిగినా చేయలేకపోయినా అంతా మనచేతిలోదే. Life is what you make of it అంటారు. 'యావజ్జీవేత్సు ఖం

జీవేత్ ఋణంకృత్వాధ ఘృతంపిబేత్' అంటారు వీరు. ఎవరి సుఖం వారి చేతుల్లోనే ఉంది. ఎవరి కర్మకు వాళ్ళే కర్తలు అనేవాళ్ళ మతం కూడా మంచిదే అంటుంది అమ్మ. 'అన్నీ నేనే చేస్తున్నాననుకోవడం కూడా మంచిదే. కాని సగం బాధ్యత తన మీదా సగం భగవంతుడి మీదా పెట్టుకోవడమే తగదు' అంటుంది. ఈవిధంగా నాస్తికులది కూడా ముక్తి మార్గమని ఒప్పుకుని, అందఱకూ సుగతే అని అభయ హస్తం ఇచ్చిన తత్త్వవేత్త ఇదివరకు చరిత్రలో ఎవరూ లేరు. ఎంత పాపాత్ముడైనా, తన కర్మలకు తాను బాధ్యుడు కాడని, వానికి ముక్తినిచ్చే బాధ్యత కూడా భగ వంతునిదేనని చెప్పే ప్రత్యక్షదైవం అమ్మ తప్ప వేఱు లేరు. ద్వంద్వాలంటూ వేఱుగా లేవనీ వాటి హెచ్చుతగ్గులే సృష్టి అనీ అంటుంది అమ్మ. కర్మ సిద్ధాంతం కర్తకు బాధకంగా ఉండడం అమ్మ ఒప్పుకోదు. కర్మను సృష్టిచేసేవాడు కర్త అవుతూ ఉండగా, కర్తను కర్మ ఎలా సృష్టి చేయగలదంటుంది అమ్మ. పునర్జన్మలను, సకార ణంగా పరిశీలించి నేడు సైన్సు ప్రతిపాదించే Tortuous Time space చిత్రాన్ని స్పష్టంగా చిన్న చిన్న మాటల వెనుక చిత్రించి అమ్మ ఉంచింది. Time space structure గా అర్థం చేసుకుంటే తప్ప పురావృత్తిలేని జన్మ ప్రణాళిక అర్థం కాదు. ఈ తత్వార్థం అంతా అమ్మ స్వయంగా అనుభవించి తరువాత మనకు చెపుతున్నది. అందుకనే 'అనుభవం శాస్త్రాన్నిస్తుంది కాని శాస్త్రం అనుభవాన్నివ్వదు' అంటుంది. ఈవిధంగా తత్వజ్ఞానాన్ని బాగుగా అనుభూతం చేసుకోవడం అనే జ్ఞానం యొక్క ఇరవయ్యో లక్షణం కూడా అమ్మ విషయంలో సార్థకం అయింది. ఈ 20 లక్షణాలు కలది పై జ్ఞానం అనీ, ఇది కానిది అజ్ఞానమనీ పరమాత్మ చెబుతాడు. 'ప్రజ్ఞానం పరమాత్మ అయితే అజ్ఞానమో' అన్నది అమ్మ. అజ్ఞానం కూడా పరమాత్మయే.

'కర్మ' అంటూ, ప్రారబ్ధం అంటూ, జన్మపరంపర అంటూ, భయవిహ్వల చిత్తులైన బిడ్డలను అమ్మ తన ఒడిలోకి తీసికొని బుజ్జగించి 'అన్ని స్థితులూ నేనిచ్చి నవే నాన్నా! నీదేమీలేదు అని ఓదార్చుతుంది. ఇంతకంటే చల్లనిమాట మనకేం లభిస్తుంది. ఎప్పుడు లభించింది? ఇంకా 'తనకున్నది తృప్తిగా అనుభవించడం, నలుగురికి ఆదరణగా పెట్టడం అంతా వాడే చేస్తున్నాడని నమ్మటం - ఇదే నా ఆదేశం' అని శాసిస్తున్నది. ఇలా సాగుతున్నది. సర్వవేదసారము సర్వజనులకూ మోక్ష సాధకమూ అయిన అమ్మ అమృతవాక్కు.

13. జ్ఞేయం యత్తత్ ప్రవక్ష్యామి యద్జ్ఞాత్వాஉ మృత మశ్నుతే।
అనాదిమత్ పరంబ్రహ్మ న సత్తన్నాస దుచ్యతే॥

తా॥ దేనిని తెలుసుకుని మనుష్యుడు మోక్షమును పొందుతున్నాడో, ఏది అనాదియైన పరబ్రహ్మమో, ఏది సత్తనిగాని అసత్తనిగాని చెప్పడానికి వీలులేనిదో, అటువంటి జ్ఞేయాన్ని తెలుసుకోదగిన దాన్ని గూర్చి నేను నీకు చెపుతున్నాను.

వ్యా॥ పరమాత్మ ఇక జ్ఞేయ వస్తువును గూర్చి చెపుతున్నారు. పైన చెప్పిన ఇరవై గుణాలే జ్ఞానంగా వక్కాణించి జ్ఞానానికి గుర్తయిన జ్ఞేయంలేనిదే జ్ఞానం ఏమిటో అర్థంగాదు కనుక దాని లక్షణాలను కూడా తెలుసుకోమంటున్నారు. జ్ఞానమంటే తెలివి. వాడు చాలా తెలివి కలవాడంటాం. అంటే కన్నూ, కాలూ, ముక్కు లాగా కంటికి కనిపించేది కాదుగా తెలివి. తెలివి కొలవదగింది కాని తూచదగింది కాదు గదా! తెలివి, నేర్పు, బద్ధకం, చురుకుతనం, ఇవన్నీ మనిషిచేసే చేష్టలను, అతడు చేసిన కఠిన కార్యాలనుబట్టి ఆయాగుణాలు వ్యక్తమవుతాయి. ఎలెక్ట్రిసిటి అక్కడ ఉన్నదనేమాట, షాకు తగిలితేనూ, బల్బు వెలిగితేనూ తెలుస్తుంది. ఏ చిక్కునైతే విప్పలేక పదిమంది చిత్తైపోతారో, ఆ చిక్కును విప్పిన వాడిని తెలివి కలవాడంటాం. అలాగే ఇతర జంతువులు చేయలేని పనిని ఒక్క ఏనుగు చేస్తే ఏనుగు బలం కలదంటాం. బలం కూడా అది చేసే పనినిబట్టే గుర్తించబడుతుంది. తెలివీ అలాంటిదే. అది గుర్తించిన గుర్తును బట్టి దాని తీక్ష్ణత బయటబడుతుంది. పరమాత్మ ఉపన్య సించిన తెలివి జగత్తు కంతటికీ మూలమైన బుద్ధిసారం. పదికోతులు నిప్పు రవ్వలనుకుని మిణుగురు పురుగుల పుట్టను సమీపించి చలి కాచుకున్నాయి. చెట్టు మీద పక్షి వణుకుతున్న కోతులను చూచి అవి నిప్పురవ్వలు కావు. పురుగులన్నది. ఈ అధిక్షేపణను సహించలేక ఒక వృద్ధవానరం పక్షి చూడకుండా వెనుక నుండి చప్పుడు చేయకుండా చెట్టెక్కి పక్షిని పట్టుకుని మెడ నులిమేసి క్రింద నిప్పులో పారే సింది. పక్షి శరీరం పడిన అలజడికి పురుగులన్నీ చెదిరిపోయి నాలుగు మూలలకూ భయపడి పారిపోయాయి. పక్షి తెలివికి నిదర్శనం అంటే జ్ఞేయం, ఆ పురుగుల పుట్టా? కాదు. పురుగుల పుట్టను పురుగుల పుట్ట అని గుర్తించే జ్ఞానం. ఆ ప్రజ్ఞ. మరి పురుగుల పుట్ట ఏమిటీ? ఆ పుట్ట లేకపోతే కోతులకు నిప్పురవ్వల భ్రమ గాని, నిశ్చయ జ్ఞానానికిగాని ఆస్కారం కలిగేదా? వస్తువులేకపోతే వస్తుజ్ఞానం ఎక్కడి నుంచి వస్తుంది? అదే పుట్ట కోతులకు నిప్పు రవ్వలుగా తోచాయి. పిట్టకు చలి వెలుగు పురుగులుగా తెలిశాయి. ఆ నిశ్చయ జ్ఞానం పక్షి బలియైతే కాని కోతుల అజ్ఞానంకూడా తొలిగిపోలేదు. ఇలాగా 'చీకటే వెలుగుకాధారం' అవుతుంది. ఆది అని మొదలుపెడితే తప్ప అనాది అర్థం కాదు. ఇటువంటి అస్తవ్యస్త పరిస్థితులలో బింబదర్శనం కావాలంటే కళాయి పెట్టకుండా అద్దాన్ని తెస్తే ఆ పని చేయ

జాలుతుందా! అద్దం ఉన్నా వ్యక్తి ఎదుటలేకుండా బింబం కనబడుతుందా? కాంతి కిరణాన్ని 'నీవు తరంగ స్వభావం కలదానివా' అని ప్రశ్నిస్తే–కొన్ని ప్రయోగాలలో ఔను అని సమాధానం ఇస్తుంది. నీవు మాత్రా స్వభావం కలదానివా అని ప్రశ్నిస్తే 'ఔను' అని మఱికొన్ని ప్రయోగాలల్లో సమాధానం ఇస్తుంది? రెండూ యథార్థాలే. ఉపాధి భేదాలని బట్టి ఈ భేదం వస్తుంది. అలాగే జ్ఞేయ వస్తువును అసత్తువా నీవు అని ప్రశ్నిస్తే ఔను అంటుంది. సత్తువా నీవు అంటే దానికీ ఔను' అని జవాబిస్తుంది. 'నాకేం తెలుసో తెలియదు'. 'నాది తెలిసీ తెలియని స్థితి' అంటుంది అమ్మ. ఇదే స్వయంభూతత్వం. దీనిని చికీర్షగాని క్రియాశక్తి గాని అవసరం లేదు. అదెలా ఉంటుందంటే

14. సర్వతః పాణి పాదంతత్ సర్వతోఽ క్షి శిరోముఖం।
సర్వత శ్రుతిమల్లోకే సర్వ మావృత్య తిష్ఠతి॥

తా: అది అన్నిచోట్లా కాళ్ళూ చేతులున్నది. అన్నిచోట్లా కళ్ళూ, తలలూ, నోళ్ళూ కలది. అన్నిచోట్లా చెవులున్నది. లోకమంతటా ఆవరించి ఉన్నది.

వ్యా: 'అపాణి పాదోజవనోగ్రహీతా, పశ్చత్య చక్షుఃసశ్రుణోత్యకర్ణః'

అనే ఉపనిషద్వచనాన్ని జ్ఞప్తికి తెస్తుందీ శ్లోకం. విశ్వచైతన్యం కాళ్ళు లేకుండా అన్నిచోట్లా నడుస్తుంది. చేతులు లేకుండా అన్నింటినీ గ్రహిస్తుంది. చెవులు లేనిదైనా అన్నింటినీ వింటుంది. కళ్ళులేనిదైనా అన్నీ చూస్తుంది.

ప్రపంచంలోని భూతాలన్నిటి స్వరూపమై తానుంటూ, తన స్వరూపమై ప్రపంమంతా, భూతాలన్నీ అయిన ఉన్న అమ్మకు, బిడ్డల చెవులే తన చెవులు, బిడ్డలనోళ్ళే తన నోళ్ళు. బిడ్డల కళ్ళే తనకళ్ళు; బిడ్డల కాళ్ళూ చేతులే తన కాళ్ళూ చేతులుగా పనిచేయడంలో అతిశయోక్తి ఏమున్నది.

'మీరందఱు నా అవయవాలనుకుంటాను' అన్న అమ్మమాట కర్థం ఇంకా ఏమై ఉంటుంది. అమ్మ కళ్ళూ, కాళ్ళూ చేతులూ ఇక్కడే ఉన్నట్టున్నా అమెరికాలో, నెదర్లాండులోనూ అవి కదులుతున్నమాట ఎవరెరగరు?

15. సర్వేన్ద్రియ గుణాభాసం సర్వేంద్రియ వివర్జితం।
అసక్తం సర్వభృచ్చైవ నిర్గుణం గుణ భోక్తృచ॥

తా: సమస్తమయిన ఇంద్రియ గుణాలచేత ప్రకాశిస్తున్నట్టు ఉన్నప్పటికీ, సర్వేంద్రియ వ్యాపారాలు లేనటువంటిదిన్నీ, దేనిని అంటనిది అనిపిస్తున్నా అన్నిం

టిని భరిస్తున్నదిన్నీ, గుణాతీతమైనదైనప్పటికీ గుణాలనుభవిస్తున్నదీ ఏది కలదో అదే జ్ఞేయం.

సామాన్య గృహస్థులందరు మూర్తిగారికి రక్త విరోచనాలు అయినప్పుడూ, కూలీ అయిన మునిస్వామి రోగగ్రస్తుడయినప్పుడూ, సేవకుడయిన మంత్రాయి క్షయ పీడితుడయినప్పుడు, బాపట్ల హాస్పిటల్లో కుష్ఠురోగులను దర్శించినప్పుడు ఎందరికో, సామాన్యులు అసహ్యించుకునే సకలోపచారాలూ చేసింది అమ్మ. అందు కని అమ్మ సకలలోకారాధ్య మాత్రమేకాదు. ఆమె దయామయి, వాత్సల్యమూర్తి. వెన్నకన్నా మెత్తనయిన గుండెగల కన్నతల్లి. అమ్మలోని గుణాలూ, ఇంద్రియ వ్యాపారాలు ఆసక్తులూ పరిపూర్ణంగా ఉండటంవల్ల, అవి ఉండీ లేనట్లే, లేకా ఉన్నట్లుగా ఉంటాయి.

16. బహి రన్త శ్చ భూతానా మచరం చర మేవ చ।
సూక్ష్మత్వా త్తదవిజ్ఞేయం దూరస్థం చాన్తికే చ తత్॥

తా: అది భూతాలకు లోపలా బయటా కూడా ఉంటుంది. అది కదిలేదీ కదలిని దీన్నీ. మిక్కిలి చిన్నదికాబట్టి అది గుర్తించడానికి సాధ్యం కానిది. దూరం గానూ ఉంటుంది. దగ్గఱగానూ ఉంటుంది.

వ్యా: 'నేను ప్రతిదానిలోనూ ఉన్నాను. పతనమనే భాగంలో ఉండకుండా లేను. అన్నిట్లోనూ ఉన్నాను'. అమ్మ ఆధారం – నాన్న ఆకాశం – అమ్మ.

భూతాల లోపల శ్వాసలాగా, ప్రాణంలాగా, జ్ఞానంలాగా ఉంటుంది. బయటి గాలితో రాయబారాలు జరుపుతూ అది బయటి గాలిని లోపలికి ఆశ్వాసించు కుంటూ దానిని ప్రాణశక్తిగా మార్చుకుంటూ, ప్రాణశక్తిగానూ, వాయుశక్తిగాను, వ్యోమశక్తిగాను, పంచభూత శక్తులుగానూ లోపలా, బయటా శక్తి నిండియే ఉన్నది. అందటి బిడ్డల కడుపులలో ఆకలిని తెలుసుకునే శక్తిగా లోపలా, ఆకలి తీర్చే ఔషధ శక్తిగా బయటనూ, అమ్మ సాక్షాత్కారించియే ఉన్నది. అది కదిలేదీ, కదలినిదీన్నీ. ప్రపంచంలో Absolute motion గాని Absolute rest గాని ఉన్నట్లు దృశ్యమాన ప్రపంచంలోని దాఖలాలవల్ల ఋజువుకావడంలేదని Newton అంటాడు. కాని సూర్యగోళం నిశ్చలంగా ఉన్నట్లు మనకు కనిపిస్తున్నా ప్రచండవేగంతో అది తనచుట్టూ అది తిరుగుతూనే ఉన్నది. ఆకాశంలో కనిపించే కోట్లాది గోళాలు నిత్యమూ చలిస్తూనే ఉంటాయి. మఱి ఈ ఆకాశం కూడా చలిస్తూనే ఉంటుందా? ఉండవచ్చు. కాంతివేగంతో ప్రయాణం చేసేటప్పుడు నిశ్చల దశలోనే అంతా

ఉన్నట్లు కనిపిస్తుంది. రోజూ మనం వేసుకునే ఎలెక్ట్రిక్ పంఖాలను చూడండి. ఒక దాని కెదురుగా రెండు పంఖాలను బెట్టి త్రిప్పితే రెండు తెక్కలూ ఆగిపోయి ఉన్నట్లే అనిపిస్తాయి. అసలు ఈ చరాచర శబ్దాలు లోపల ఉన్న శక్తి ధర్మాలేకాని దేహ ధర్మాలు కావని మనం గ్రహిస్తే మన అవగాహనా చిత్రం ఇట్టే మారిపోతుంది. మన కళ్ళూ, మన బుద్ధి, జగత్తులోని విషయాలన్నింటికీ, సుప్రీంకోర్టు అను కుంటాం. మన బుద్ధికందని విషయాలను నమ్మం. అతి సూక్ష్మ విషయాలను మనం గ్రహించజాలం కనుక గ్రహించం. తెలిసికోజాలం. కాని పురుషునిలోనే శిశూత్పత్తి భావనా పూర్వకంగా, ఇచ్ఛాపూర్వకంగా ఐ, మూడునెలలు అతనిలో వృద్ధిపొంది రేతో రూపకంగా స్త్రీ క్షేత్రంలో ప్రవేశించి 9 నెలల వృద్ధిపొంది సంవత్స రాంతాన బిడ్డగా పుడతాడని ఉపనిషత్తులు చెపుతాయి. సంవత్సర కాలం అంటే సూర్యుని తేజస్సు భూదేవతను దౌహృదగా చేసే కాలం అని ఒక గుర్తు. భూప్రకృతి ఐన త్రసరేణువుమీద ఒక సూర్యకిరణం ప్రసరించి పరావర్తమై పోయినంతకాలాన్ని పరమాణు కాలం అంటారు. కాని అత్యల్ప సూక్ష్మ ప్రకృతి కావడంచేత మనం దీన్ని గ్రహించలేం, తెలుసుకోలేం. 'నీవార శూకవత్తన్వీ పీతాభాస్వత్య ణూపమా'

ఇటువంటి అతి సూక్ష్మాస్తిత్వమును దాల్చిన ఈ పరమాత్మను తెలిసికోవడం సాధ్యం కాదు. దూరంగానూ ఉంటుంది. తెలీని వారికి; తెలిసిన వారికి దగ్గఱగానూ ఉంటుంది. కన్నీళ్ళలో నివసించే అమ్మ కంట్లోనే ఉంటుంది. కన్నీళ్ళు లేని వాళ్ళకు అమ్మ వెన్నంటియే ఉన్నా నడినెత్తి మీదనే ఉన్నా ఎప్పుడూ ముచ్చట ముడిలాగా కనబడకుండానే ఉంటుంది. అది అందటిల్లైనా ద్వారం దాటివెళ్ళం తలుపు తెటిచే ఉన్నా, గుమ్మంముందే జీవితమంతా గడిపేస్తాం.

'చూస్తే కనబడును - కనిపిస్తే చూస్తారు' అమ్మ

17. అవిభక్తం చ భూతేషు విభక్త మివ చ స్థితమ్।
భూత భర్తృ చ తత్ జ్ఞేయమ్ గ్రసిష్ణు ప్రభవిష్ణు చ॥

తా: అది భూతాలలో విభజింపబడకుండా ఉన్నదైనా విభజింపబడినట్లున్నది. అది భూతాలను భరిస్తున్నదే కాక వాటిని మ్రింగుతున్నది. పుట్టిస్తున్నది అని కూడా తెలిసికోదగినదై ఉన్నది.

వ్యా: పరమాత్మ ఉనికి ఉపాధులవల్ల విభక్తంగా తోస్తుంది. కాని అది అవి భక్తంగా ఉన్నదనేమాట ఋజువౌతుంది? కుండలూ, కూజాలూ, మూకుళ్ళు, ముంతలు ఎన్నోరకాల స్వరూపాలు ఒక్కొక్కటిగా లెక్కిస్తే, ఒక్కొక్కటిగా గ్రహిస్తే

అన్నీ వేరువేరుగా ఉన్నట్లే కపిపిస్తాయి. లోలకులూ, నాను పేటలూ, గాజులూ, గొలుసులూ, బాజుబందులూ, ఎన్నోరకాల నగలు. అన్ని వేర్వేరుగా గ్రహిస్తే విభక్త ములైనవి ఉన్నా ఎన్నో భూషణాలు, కుండలు, మూకుళ్ళలాగే కాని అన్ని ఘటాలూ, నగలూ మట్టిలోంచే వచ్చాయి. మట్టి ఉపాదాన కారణం. అన్ని నగలూ బంగారం తోనే చేయబడ్డాయి. బంగారం ఉపాదాన కారణం. అన్ని నగలకూ ఉపాధి భేదా లున్నా అన్నింటిలో ఉన్నదీ మట్టే, బంగారమే. ఈ అనుస్యూత ధర్మమే వాటి అవిభక్త త్వాన్ని నిరూపిస్తాయి. అందఱు బిడ్డలలో ఉపాదాన కారణంగా ఉన్న మాతృత్వమే అవిభక్తమైన సమాన ధర్మం. 'మీరు కానిది నేనేమీ కాదు' అన్నది అమ్మ.

నేనెక్కడ ఉన్నానో మీరూ అక్కడే ఉన్నారు. మీరెక్కడ ఉన్నారో నేనూ అక్కడే ఉన్నాను. ఎక్కడా ఏమి తేడా లేదు మనకు' అమ్మ.

అమ్మ అనే మాటలోనే ప్రభవిష్ణుభావం ఉంది.

అమ్మచేసే ప్రేతక్రియలు–

హైమాలయ ప్రతిష్ఠాపన గ్రహిష్ణుభావాన్ని తెలుపుతుంది.

అందఱిల్లు – అందఱినీ అన్నం తినమని – ఆదేశించడమేకాక కలిపి నోట్లో అన్నం ముద్దలు పెట్టడం అమ్మ భూత భర్తృభావాన్ని బోధిస్తుంది.

18. జ్యోతిషా మపి తజ్జ్యోతి స్తమసః పర ముచ్యతే।
జ్ఞానం జ్ఞేయం జ్ఞానగమ్యం హృది సర్వస్య ధిష్ఠితమ్"

తా: అది వెలుగులన్నింటికీ వెలుగు – చీకటికి అవతల చీకటి. అది తెలివి, తెలియదగినది, తెలివిచేత చేరదగినది ఐ అందఱి హృదయమందును విస్తారముగా ఉన్నది.

వ్యా: 'వెలుగుకు చీకటి ఆధారము' అంటుంది అమ్మ. చీకటిలేకుండా వెలుగు ఏదో మనకు అర్థంకాదు. అంతేకాక అన్నివైపులా వెలుగు దట్టంగా ఉన్నప్పుడు, సూర్యమండల మధ్యస్థానంలో మన కళ్ళు పనిచేయజాలవు. మిఱుమిట్లు క్రమ్ము టయేకాక ఇక చూడకుండాబోయే చీకటి ఆవరించుకుంటుంది కళ్ళను. వెలుగు నాలుగువైపులా ఉన్నా ఱెప్పలు మూసుకొని కన్ను తనలో తాను చీకటిని సృష్టించు కోగలదు. అదే చీకటిలో అంతర్ముఖుడైనవాడు మహాప్రకాశాన్ని సృష్టించుకొని అంత రాత్మను బయటిలాగానే లోపలా చూచుకోగలడు. 'సర్వస్యధాతార మచిన్త్యరూప మాదిత్య వర్ణం తమసఃపరస్తాత్' అని లోగడవచ్చిన శ్లోకంలో కూడా ఇదే భావం వ్యక్తం చేయబడినది. ఈ సమగ్రమైన చీకటి వెలుగుల భావమే జ్ఞానంగానూ, జ్ఞేయంగానూ, జ్ఞానగమ్యంగాను తెలుసుకోవలెను.

19. **ఇతిక్షేత్రం తథాజ్ఞానం జ్ఞేయం చోక్తం సమాసతః**
మద్భక్త ఏతద్విజ్ఞాయ మద్భావా యోపపద్యతే॥

తా: సంగ్రహంగా క్షేత్రము, అలాగే జ్ఞానమూ, జ్ఞేయమూ అనే విషయాలను గూర్చి ఇలా చెప్పాను. నా భక్తుడు దీన్ని బాగా తెలుసుకున్నవాడై నా భావాన్ని పొందుతాడు.

ఇంతవఅకు పరమాత్మ క్షేత్రక్షేత్రజ్ఞులను గూర్చి జ్ఞాన జ్ఞేయాలను గూర్చి చెప్పి రాబోయే శ్లోకాలలో ప్రకృతి పురుషులను గూర్చి చెప్పడమారంభిస్తున్నారు.

20. **ప్రకృతిం పురుషం చైవ విద్ధ్యనాదీ ఉభావపి।**
వికారాం శ్చ గుణాం శ్చైవ విద్ధి ప్రకృతి సమ్భవాన్॥

ప్రకృతీ పురుషుడూ అనే ఇద్దఱూ అనాదిగా అవినాభావంగా ఉన్నవారే అని తెలుసుకో. వికారాలూ గుణాలు కూడా ప్రకృతి నుండి పుట్టినవనే తెలుసుకో!

వ్యా: ప్రకాశించే ధర్మం సూర్యుడిలో ఉన్నా పరమేశ్వరుని శక్తివల్లనే పరమేశ్వరుని సంకల్పంవల్లనే సూర్యునికి ప్రకాశం కలిగిందని సంప్రదాయం చెపుతుంది. ప్రకృతి అనే మాయను అవలంబించి నేనే సృష్టిని చేస్తున్నానని పరమాత్మ చెప్పారు ఇదివరలో. భూత సూక్ష్మ ప్రకృతినే తమస్సు అంటారు. ప్రకృతి అన్నా పురుషుడన్నా రెండూ ఒకటే అమ్మ మతంలో. ఎలెక్ట్రిసిటీ ప్రవాహ వేగము, ప్రవాహపు ఒత్తిడి, ప్రవాహ పరిమాణము ఇలా నానారకాల లక్షణాలను గుర్తిస్తాం. బల్బు వెలగవలసి వచ్చినప్పుడో లేక హీటరు వెలగవలసి వచ్చినప్పుడో, విద్యుచ్ఛక్తి ఒత్తిడినో, ప్రమాణాన్నో పరిమాణాన్నో ఏదో ఒక లక్షణాన్ని గుర్తిస్తాం. అంతమాత్రాన అది ఎలెక్ట్రిసిటీ కంటే వేరైపోదుకదా. అలాగే మహాచైతన్యం సృష్టిగా మారడంలో వచ్చిన మార్పునీ, మారడానికి ఆధారమైన శక్తినీ, ప్రకృతి అన్నాం. పరమాత్మ ఇచ్ఛను సంకల్పమన్నాం. వస్తుతః పరమాత్మ సంకల్పమన్నా, ప్రకృతి అన్నా సృష్టి అన్నా పరమాత్మకంటే వేఱుకావు.

చైతన్యం సృష్టిగా రూపుధరించడంలోని శక్తినే ప్రకృతి అని అన్నారు కాని అవి పరమాత్మకంటే వేరుకాదు. సృష్టి గుణాలే ప్రకృతి సంభవమైన గుణాలూ, వికారాలూ. ప్రకృతి స్త్రీ అనీ, పరమాత్మ చైతన్యం పురుష వాచకమనీ సర్వసాధారణంగా ఈ రెండు మాటలూ వినంగానే మన కనిపిస్తుంది సృష్టిలోని మహా రహస్యమూ, సృష్టి క్రియాకీలకమూ అయినదే ఈ స్త్రీపుంవాచకభేదం. ఇదే అర్ధనారీశ్వరతత్త్వం. ఏవిధమైన ఆకర్షణ వికర్షణలేని స్థిరచైతన్యం, ప్రశాంతమైన

ఆనందసమాధి స్థితిలో అలాపడి ఉండడమే కాని ఏమీ చేయకుండానే ఉంటుంది. అన్నింటిని చేయగలిగిన క్రియాశక్తి దానికి ఉన్నా ఆశక్తి విజృంభిస్తేగాని ఆ కార్యాలు జరగవు. దీనికొక ఉదాహరణ చెప్తాను స్థిరవిద్యుచ్ఛక్తి అన్ని పదార్థాలలోనూ ఉన్నది. దానిలోని క్రియాశక్తి Static స్థితిలో ఉంటుంది. దానికీ ధ్రువవైషమ్యాలు కలిగి నప్పుడు అది kinetic state గా మారి అన్ని పనులూ చేయడానికి సమర్థమైన దౌతుంది. కొండమీద చెఱువున్నది. చెఱువులో నీళ్ళున్నాయి. ఆ నీళ్ళను అలానే ఉండనిస్తే దానివలన ఏ పనీ జరగదు. దాన్ని గొట్టాలద్వారా క్రిందికి ప్రవహింపజేస్తే భూమ్యాకర్షణవల్ల లాగబడి అమితమైన వేగంతో నీరు క్రిందికి ప్రవహిస్తుంది. ఆ ప్రవాహానికడ్డుగా Turbine టర్బైనులను అమర్చితే, దానివలన చక్రాలు తిరిగి డైనమోలు పనిచేసి, స్థిర విద్యుత్తుకు ధ్రువభేదాలు ఏర్పడి విద్యుద్వాహినిగా అవుతుంది. ఆ విద్యుద్వాహిని వల్ల లైట్లు వెలుగుతాయి. పంకాలు తిరుగుతాయి, మళ్ళీ మెషీన్లు నడుస్తాయి. మఱి ఈ విద్యుచ్ఛక్తి ఎక్కడ నుంచి వస్తున్నది. డైనమోలో విద్యుచ్ఛక్తి క్రొత్తగా తయారుకాదు. ఇదివఱకు లేని క్రొత్త శక్తిగాని క్రొత్త పదార్థంకాని ఉత్పత్తికాదు. జరిగేదల్లా అదివఱకు సమానమైన రీతిలో పంపకమై ఉన్న ఎల క్ట్రానులు ఒకచోటికి ఆకర్షింపబడి ఒకచోట కుప్పగా చేర్చబడతాయి. కుప్పగా అయిన ఎలక్ట్రానులకు ఆ క్రొత్త చోటు క్రొత్తదిగానే ఉంటుంది. అవి ఎప్పుడూ మళ్ళీ తమ పాత చోట్లకు పోవాలని ప్రయత్నిస్తూనే ఉంటాయి. కాని ఆకర్షణ శక్తులు వాటిని ఆ క్రొత్త చోటునే ఉంచడానికి ప్రయత్నిస్తాయి. ఈవిధంగా ఈ నెగెటివ్ పాజిటివ్ ధ్రువాలు ఏర్పడుతాయి. వాటి మధ్య ఉండే విషమత్వమే ఆ రెంటికీ ఉన్న ఆకర్షణ. అమ్మ చెప్పినట్లు హెచ్చుతగ్గులే అంటే ఎలక్ట్రానుల గుంపుల సమ్మర్దంలో, హెచ్చుతగ్గులు రావడమే క్రియాశక్తి విజృంభించడానికి కారణ మౌతుంది. ఆ రెండు ధ్రువాలే ఆడామగా భేదం అనుకోవచ్చు మనం. రెండు ఎల క్ట్రోడ్లనూ ఏదైనా తీగబెట్టి కలిపితే ఋణధ్రువం వద్ద హెచ్చుగా గుంపుగా ఉన్న ఎల క్ట్రానులు, సమ్మర్దం తక్కువగా ఉన్న ధనధ్రువానికి చేరుకుంటాయి. అక్కడ వెలితి పూర్తి అయ్యేదాకా ఈ ప్రవాహం సాగుతుంది. కొంతసేపు ఈ ప్రవాహం సాగి మళ్ళీ రెండు ధ్రువాలు ఒకే లెవెలుకు వస్తాయి. మళ్ళీ ప్రశాంత పరిస్థితి ఏర్పడు తుంది. ఇలా జరగడానికి సంకల్పమే కారణం. సంకల్పం కామచుంబితం. దానివల్ల మొదట్లో ఏకంగా ఉన్న శివస్వరూపం, అర్థనారీశ్వరమై కారణమౌతుంది. కారణ మంటే ఉన్న కారణాలకు ప్రధాన కారణమని కాదు అర్థం. రాబోయే కారణాలకు కారణమౌతుందని అర్థం. ప్రకృతి శక్తి స్త్రీవాచకంగా, క్షేత్రంగా పరిణమిస్తుంది.

పురుషశక్తి బీజప్రాయంగా క్షేత్రజ్ఞుడై భాసిస్తుంది. ఈ హెచ్చుతగ్గులున్నంత వఱకు ఈ ద్వయానికి మళ్ళీ అద్వయంగా అయిపోవాలనే మథన, ఆకర్షణ, తదను కూలమైన క్రియా శక్త్యుల్బణాలు తప్పవు. సహజంగా ఈ స్త్రీ పుం భేదాలు లేనివి అవడంచేత, ఊరికే మనం అనుకోడానికే ఈ భేదంకాని వాస్తవంగా వాటికి ప్రత్యే కతలేదు. +1 - 1 గా ఉండే రెండు గుర్తులు కలిపితే సున్నా అయినట్లు ఈ రెండూ ఏకంకావడమే పూర్ణాత్ పూర్ణం. +1 - 1 లో రెండు స్థానాలూ స్త్రీపుం వాచకాలే. + 1 మగదే -1 మగదే. +1 ఆడదే -1 ఆడదే. ఈ కృతక భేదం నుంచి పుట్టినవే ప్రకృతి సంభవమైన గుణాలూ వికారాలు ఈ భేదం పోగానే గుణాలు పోతాయి. వికారాలు పోతాయి. సైన్సు అభివృద్ధి చెందిన ఈకాలంలో ఎంతమంది మగవాళ్ళు ఆడ వాళ్ళుగా మారడం లేదూ. ఆడవాళ్ళు మగవాళ్ళుగా మారడం లేదు! శక్తి విజృంభ ణానికి పరమార్ధ పరంగా ప్రకృతి పురుషులకు స్త్రీపుం వివక్షతలేదు. అదంతా మన కల్పనే.

శ్రీపాద అన్నట్లు – బృందావనంలో కృష్ణుడులాగా జిల్లెళ్లమూడిలో పురుషుడు ఒకడేనమ్మా. ఆ పురుషుడు స్త్రీ.

'హెచ్చుతగ్గులూ వ్యష్టిత్వమూ లేకపోతే సృష్టికి ఆధారమేమిటి? సంఘ నియ మాలు మంచిచెడ్డలకు ఆధారమైనట్లే హెచ్చుతగ్గులు సృష్టికి ఆధారం.

'నిర్వికారంలోని వికారమే ఆకారం"

"ఆకారానికి నిర్వికారం, నిర్వికారానికి ఆకారం ఆధారమన్నమాట. ఆ ఆధారమే అమ్మ"

21. కార్య కారణ కర్తృత్వే హేతుః ప్రకృతి రుచ్యతే।
పురుష స్సుఖ దుఃఖానాం భోక్తృత్వే హేతు రుచ్యతే॥

తా: కార్యం, కారణం, కర్తృత్వం అనే విషయంలో ప్రకృతి హేతువుగా చెప్ప బడుతున్నది. సుఖదుఃఖాల భోక్తృత్వం విషయంలో పురుషుడు హేతువుగా చెప్ప బడుతున్నాడు.

వ్యా: కార్యం, కారణము, కర్తృత్వము, ఈ మూడూ క్రియకు సంబంధించిన విషయాలు. ఏదైనా పని జరిగిందంటే ఎందుకు జరిగిందనుకుంటాం. అంటే దానికి కారణం అన్వేషిస్తాం. కర్త ఎవడూ అని ఆలోచిస్తాం. ఎవడో చేసేవాడుంటే గాని ఆ పని జరగదు కదా! కార్యం అంటే క్రియా శరీరం క్రియాబీజం ఏర్పడడం దగ్గఱ నుండి ఎలా వృద్ధి చెంది, ఫలప్రాప్తి రూపంగా ఎలా పర్యవసించిందో ఇవన్నీ

ఆలోచిస్తాం. ఈ మూడు విషయాలను ఆలోచించేటప్పటికీ, ప్రశ్నార్థక సర్వనామాలైన ఎవరు, ఏది, దేనిని, ఎందుకు, ఎలా, ఎప్పుడు, ఎంత, ఇలాంటి అన్నింటికి సమాధానం వచ్చేస్తుంది అనుకుంటాం. ఉదాహరణకు దాహం వేసింది - మంచి నీళ్ళు త్రాగితే దాహం తీరింది అనుకుందాం. ఎందుకు దాహం వేసింది. నీళ్ళు త్రాగితే ఎలా తీరింది అంటే శరీరశాస్త్రజ్ఞులు ఎన్నో కారణాలు చెప్పవచ్చుగాని, భాషా శాస్త్రజ్ఞులు మాత్రం, 'దాహం' అయింది. అనే వాక్యంలో అర్థసార్థక్యం కలిగే లాగా కర్మ కర్తక్రియలను సమన్వయించి చెప్పలేరు. 'ఆకలి అయింది, దాహం అయింది, అనే మాటలు స్వతఃసిద్ధంగా జరిగిపోయే ధర్మాలు. వాటికి కర్త క్రియా కర్మ సమన్వయం కుదర్చడం కష్టం. వైయాకరణులు వేసింది అనే క్రియాపదాన్ని పట్టుకుని ఏది అయింది ఆకలి అయింది కాబట్టి ఆకలి కర్త అని పిల్లలు గ్రామరు పాఠాలు ఏకరువు పెట్టవచ్చుగాక. ఆ క్రియలేకపోయినా భావార్థానికే లోపమూ రాదు. 'ఏమిత్రా అబ్బీ అలా ఉన్నావు' అంటే 'బాబూ! ఆకలి! అమ్మా ఆకలి!' అని జవాబు వస్తుంది. క్రియ లోపించిదంటారు వైయాకరణులు. మనం చేసే పనులకైతే కర్మ క్రియాకర్తలు వెదుక్కోవచ్చు. మన అజ్ఞానం చేత పరమాత్మయే అన్నీగా అయిపోయే సందర్భంలో కర్త కర్మ క్రియలు మూడూ అతనిలోనే పర్యవసిస్తాయి. కుమ్మరి నేర్పుతో కూజా చేశాడు. కుమ్మరి నేర్పు జత కాకుండా మట్టి ఉన్నా, చక్రం ఉన్నా, కఱ్ఱ ఉన్నా కుండ తయారయ్యేది కాదు. కుమ్మరిలో నేర్పు రూపకంగా పరమాత్మే ఉన్నాడు. కుమ్మరిరూపంగానూ అతడే ఉన్నాడు. కుమ్మరి అతని నేర్పూ వేఱు వేఱు అంశాలుగా గ్రహించడానికి వీలుకాదు. కుండ అస్థిత్వాన్ని గూర్చి ఆలోచించేటప్పుడు నేర్పుతో ఉన్న కుమ్మరినే గ్రహించాలి కాని నేర్పులేని కుమ్మరిని కాదు. పరమాత్మ శక్తియే ప్రవృత్తి. పరమాత్మను విడిచి ప్రకృతి వేఱుగ ఉండజాలదు. జగత్కర్తృత్వంలో పరమాత్మకు ఏమీ భాగం లేదనుకోవడం ఎలా ఉంటుందంటే - అన్ని పనులను చేతులు చేస్తున్నాయి కాబట్టి మనిషి వేఱు, చేతులు వేఱు అనుకున్నట్లు ఉంటుంది. పురుషుడు అకర్త, అతడు చేయడు, చేయింపడు అనే మాటకు మనం చెప్పే అర్థం కాదు. 'విధ్యకర్తారం' అంటే చెయ్యని వాడని అర్థం కాదు. అన్నీ చేస్తూ ఏమీ చెయ్యనట్లుండే వాడని అర్థం. అతని సంకల్పంగా అన్నీ అలా అయిపోతూ ఉంటాయి అని అర్థం. ఆ అయిపోవడమే ప్రకృతి; సృష్టి; అతని విభూతిన్నీ 'ప్రకృతిం స్వాం అవష్టభ్య విసృజామి పునఃపునః' అని స్వకీయ కర్తృత్వాన్ని పరమాత్మయే చాటుకున్నాడు. సుఖదుఃఖాలను అనుభవించే విషయంలో పురుషుడు హేతువు అనడంలో అర్థం అతడు ప్రకృతికంటే వేఱని చెప్పడం కాదు. ప్రకృతి సహితుడై ఉండియే భోగాలను అనుభవిస్తున్నాడని చెప్పడమౌతుంది. మన

శరీరంలో నోరు తింటుంది. తిన్న దానిని కడుపు అరిగిస్తుంది. చేతులు చేస్తాయి. కాళ్ళూ నడుస్తాయి. ఏ అవయవం పనులనూ అనాదరించడానికి వీలులేదు. అవయవ ప్రాధాన్యాన్నిగాని, ప్రయోజన ప్రాధాన్యాన్నిగాని, కార్యకారణ కర్తృత్వ ప్రాధాన్యాన్నిగాని అడ్డుతెరగా కట్టి అన్నింటికి మూలమైన చైతన్యశక్తిని తక్కువ చేయడం ఉపనిషత్తులలోని కథలాగానే ఉంటుంది.

ఒకసారి అన్ని ఇంద్రియాలూ ప్రాణంమీద తిరగబడ్డాయట. కన్ను, కాళ్ళ, చెయ్యి, చెవి, ముక్కు నోరూ ఇవన్నీ దేనిమటుకు అదే గొప్పదాన్నని చెప్పుకోవడం ఆరంభించాయట. మేం పనులు చెయ్యకపోతే నీవెలా ఉండగలుగుతావో చూస్తామని కిమ్మిన్నాస్తిగా ఊరుకున్నాయట. అప్పుడు ప్రాణం ఊర్ధ్వముఖంగా వెళ్ళిపోవడం ఆరంభించిందట. ప్రాణంలేనిదే ఏ ఇంద్రియానికీ చేతనత్వం కలుగదు కనుక పోతుటీగతోపాటు తక్కిన తేనెటీగలలాగా ఇంద్రియాలూ దాన్ని అనుసరించాయట. అప్పుడు ప్రాణం యొక్క ప్రాశస్త్యాన్ని గుర్తించి ఇంద్రియాలు దాన్ని స్తుతిచేశాయట. పరమాత్మ ప్రకృతులను వేఱుచేసి చూడడమూ అలాగే ఉంటుంది.

మామూలు మాటలతో చెప్పవలసివస్తే ప్రకృతి అనే స్త్రీ ఇంట్లో అంతశ్రమపడి, కార్యకారణ కర్తృత్వబాధ్యతలన్నీ వహించి సృష్టి పదార్థాన్ని పక్వంచేసి తయారుగా పెడుతుంటే, ఏమీ చేయకుండా అకర్తగా ఉండే పురుషుడు తటస్థుడుగా, సాక్షీమాత్రుడుగా చూస్తూ కూర్చుని సుఖదుఃఖాలను తీరికగా అనుభవిస్తున్నాడని పై శ్లోకానికి అర్థం వస్తుంది. ఒక చెట్టుమీద రెండు పక్షులున్నాయి. ఒకటి చూస్తూ ఉంటుంది. ఒకటి తింటూ ఉంటుంది అని ఉపనిషత్తు చెప్పే మాటకు – ఆ చూస్తూ ఉండే పక్షికి తినే పక్షితో ప్రమేయం లేదని అర్థం కాదు. చూచే పక్షి చూస్తూ ఉండకపోతే రెండో పక్షి తినగలిగేదీకాదు. కాబట్టి ఆ పక్షి తినేట్టుగా ఈ పక్షి చూస్తున్నదనే ఆ మాటకర్థం. చూపు అంటే దృశ్యమే తానై తిరిగి తనలో పర్యవసితం కావడం అని శాస్త్రనిర్వచనం కాబట్టి ఆ పక్షి తినడానికి ఈ పక్షి చూడడానికీ అభేదాధ్యవసాయం చెప్పుకోవాలి.

'విధి అంటే విధానమే'

'సమష్టియొక్క వ్యష్టిత్వమే సృష్టి'

'కర్త కర్మక్రియ ఒక్కటే, కర్మక్రియకర్తలోనే' అమ్మ.

22. పురుషః ప్రకృతి స్థోహి భుంక్తే ప్రకృతిజాన్ గుణార్।
కారణం గుణసంగోఽస్య సదస ద్యోని జన్మసు॥

తా: ప్రకృతి యందున్న వాడైన పురుషుడు ప్రకృతి జన్యములైన గుణాలనే అనుభవించును కదా. అతనికున్న గుణసంగమే మంచి చెడ్డయోనులందు జన్మాలనెత్తడానికి కారణమవుతున్నది.

వ్యా: పురుషుడు ప్రకృతితో కూడి ఉన్నప్పుడు తానే యే గుణాలు ప్రకృతికి ప్రసాదించాడో ఆయా గుణాలను అనుభవించకుండా ఎలా వీలవుతుందీ? నీళ్ళలో గుడ్డను ముంచామనుకోండి నీటికి తడపడం ధర్మమైనప్పుడు గుడ్డ తడవకమానుతుందా. ఏ పరిస్థితిలోనూ అది తగలడదు కదా. మంచుప్రాంతాల్లో నివసించే ఎస్కిమోలు, మంచుగుణాలకు అలవాటు పడతారు. ఉష్ణప్రదేశాల్లో నివసించే వాళ్ళు ఉష్ణప్రదేశాల్లో ఉండే ఉష్ణవాతావరణాని కలవాటు పడతారు. సహజంగా ఏయే పరిసరాల్లో వాళ్ళు ఉంటుంటే ఆయా పరిసరాల గుణాలకు అలవాటుపడతారు. ఆయాగుణాలే వాళ్ళకు అతిప్రియములై ఉంటాయి. ఎస్కిమోను తెచ్చి భూమధ్యరేఖ దగ్గఱ నిలిపితే చాలా అవస్థపడతాడు. సముద్రంలో లోతు నీటి ఒత్తిడికి అలవాటైన బృహత్తిమింగిలం, సముద్రో పరిభాగానికివస్తే దాని శ్వాసమండలం బ్రద్ధలైపోతుంది. జీవచైతన్యం ఏ పరిసరాల్లో తాను శరీరధారణ చేస్తుందో ఆయాప్రకృతి పరిసరాల గుణాలను పంచుకుని జీవిస్తుంది. సహజంగా ఈవిధంగా తాను అనుభవిస్తున్న పరిస్థితులను అతడు అర్థం చేసుకోడాన్నిబట్టే అతని జన్మంలోని మంచి చెడ్డలు ఏర్పడుతాయి. అతనికి ఆ పరిసరాలు సంతుష్టిని కల్పించాయనీ అవన్ని తనకు సౌఖ్యంగా ఉన్నాయని అతని మనస్సు తలిస్తే అతని జన్మం సద్యోనిజం అవుతుంది. ఈవిధంగా పరిసరాలను వ్యక్తి మనస్సు అనుకూలం అయినవిగానో ప్రతికూలం అయినవిగానో స్వీకరించడాన్నిబట్టే అతని జన్మం సద్యోనిజమో అసద్యోనిజమో నిర్ణయించబడుతుంది. అంతేకాని పుట్టుకవలనే అవి నిర్ణయింపబడవు. కష్టాలనుకూడా సుఖాలుగా అనుకునే బుద్ధి పరమాత్మయే ప్రసాదించాలి. మూఢయోనులు అనేమాట ఒకసారి లోగడ వచ్చింది. పశుపక్ష్యాది సర్పసరీసృపాదులు మూఢయోన్యుద్భుతాలైనవని దాని అర్థం. కొన్ని సంవత్సరాల క్రితం మల్లవరంలో ఒక నాగుబామును మందిరంలో నిలిపి అందఱూ పూజించేవారు. ముమ్మిడివరం బాలయోగి వంటివారు ఉన్నత కులాల్లో జన్మించినవారా! కాబట్టి క్షేత్రం జీవిత ఔన్నత్యాన్ని నిర్ణయించజాలదని తేలుతున్నది. పరమాత్మ అనుగ్రహమే దీనికి కారణం.

'క్షేత్రజ్ఞం చాపిమాంవిద్ధి' (క్షేత్రజ్ఞుడనుకూడా నేనే అని తెలుసుకో అని గీత అన్నప్పుడు "క్షేత్రజ్ఞుడు ఉండి భగవంతుడే అతనిద్వారా, లేక అతనే అయి చూస్తూ

చేస్తూ ఉన్నాడా! లేక క్షేత్రజ్ఞుడు ఉన్నాడని చెప్పడానికే వీలులేకుండా తానొక్కడే వ్యవహారమంతా జరుపుతున్నాడా" అని కలిగిన సందేహం చాలాకాలం నుంచి ఉంది. అనుభవంలో నేను చూడడం లేదు. కంటి పైనున్న ఏదోశక్తి చూస్తోంది. అసలు నేనున్నానా అనిపిస్తుంది అనే సందేహాన్ని వ్యక్తపఱిచారు చెలసాని నాగేశ్వర రావుగారు. ఆ సందేహానికి ఎలా సమాధానం అమ్మ మాటల్లో దొరికిందో అదీ తరువాత వ్రాశారు.

"అసలు వ్యష్టిత్వం లేకపోతే సృష్టి ఏముంది? అనీ "రెండూ ఆ దైవమే అయినా రెండయితే కాని సృష్టి నడవదు అనీ కూడా అమ్మ! మీరే ఇతర సందర్భాల్లో సూత్రార్థంగా చెప్పారు. అందుచేత ఈ సూత్రాలు 'పెక్కు నేనులు ఉండి అవి అన్నీ కూడా తానైన నేనే చూస్తూ, చేస్తూ ఉన్నది అని వక్కాణించుతూ పై సందేహాన్ని పరాస్తము చేస్తున్నాయి.

23. ఉపద్రష్టా నుమన్తా చ భర్తా భోక్తా మహేశ్వరః।
పరమాత్మేతి చాఽప్యుక్తో దేహేఽస్మిన్ పురుషః పరః॥

ఈ దేహంలో ఉన్న శ్రేష్ఠుడైన పురుషుడు ఉపద్రష్ట, అనుమంత, భర్త, భోక్త, మహేశ్వరుడు పరమాత్మ అని చెప్పబడుతున్నాడు.

ఉపద్రష్ట: దగ్గఱ ఉండి చూచేవాడు. మనం చేసే అన్ని పనులను ఈ జీవుడు సమీపంలో ఉండి చూస్తూ ఉంటాడు. యజ్ఞ యాగాదులలో supervisorని ఉపద్రష్ట అంటారు.

అనుమంత: అనుమతించేవాడు. మనకు హితమైన వాటికి తన అనుమతి నిచ్చేవాడు. అహితమైన వాటిని చెయ్యవద్దని హితవు చెప్పేవాడు అడ్డంగా మాత్రం వెళ్ళడు.

భర్త: భరించేవాడు.

భోక్త: అనుభవించేవాడు.

మహేశ్వరః: అంటే ప్రభువైనవాడు.

వ్యా: Theory of Relativity, special Theory of relativity, Quantum theory లను అన్వయించుకునేటప్పుడు పైమాటలను జాగ్రత్తగా అర్థం చేసుకోవాలి. ఇందులోని విశేషణాలన్నీ ప్రత్యగాత్మకు పరమాత్మకు వర్తిస్తాయి. ఆ రెంటికీ భేదం లేదు.

24. యః ఏనం వేత్తి పురుషం ప్రకృతిం చ గుణైస్సహ।
సర్వథావర్తమానోఽపి న స భూయోఽభిజాయతే॥

గుణాలతో సహా ప్రకృతిని, పురుషుణ్ణి ఎవడైతే తెలుసుకుంటాడో అతడు సర్వవిధాలచేత కర్మలు చేస్తున్న వాడైనప్పటికీ పునర్జన్మ దుఃఖాన్ని పొందడు. 22వ శ్లోకంలో గుణసంగం కారణంగా సదసద్యోనులయందు జన్మిస్తాడని చెప్పి పరమాత్మ ఈ శ్లోకంలో ప్రకృతి పురుషులను గూర్చి ప్రకృతి గుణాలే ఈ సృష్టినంతా చేస్తున్నవనే విషయాన్ని గూర్చి తెలుసుకున్న వాడికి మళ్ళీ జన్మ ఉండదని సెలవిచ్చారు. పూర్వ వ్యాఖ్యాతలు దీపం వెలుగులో జనులు వారి వారి పనులు చేసుకుంటున్నట్లు, సూర్యోదయం కాగానే ప్రజలు వారివారి కార్యకలాపాలు జరుపుకుంటున్నా, ఆ దీపానికీ సూర్యునికీ కర్తృకారయిత్వాలు లేనట్లు పురుషుని సాన్నిధ్యంలో ప్రకృతి క్రియాశీలమై ఉన్నప్పటికీ అతనికి ఈక్రియాసంబంధమైన దోషాలు అంటవని వ్రాశారు. ఆకాశం సర్వవ్యాప్తమై ఉన్నప్పటికీ దానిని పదార్థాలు అంటవు. క్షేత్రజ్ఞు డైన పురుషుడు క్షేత్రంనందు అంతటా వ్యాపించి ఉన్నా అతడు నిర్లేపుడే. సూర్యుడు లోకానికి ప్రకాశాన్ని ఒడగూరుస్తున్నట్లే జడమైన ప్రకృతికి అతను వెలుగును సమకూరుస్తున్నాడు. తిరగలితో క్రింద కదలని రాయిలాగా అతడుంటాడు. ప్రకృతి తిరగలిలో తిరిగే రాయిలాగా ఉంటుంది. నిశ్చలుడైన క్షేత్రజ్ఞుడు, చంచలమైన క్షేత్రము సంయోగం కావడంవల్ల ఈ సృష్టి ఏర్పడుతున్నది. జీవుడు నిజానికి పురుషుడే కాని ప్రకృతికాదు. అవివేకం చేత అతడు ఆ ప్రకృతితో తాదాత్మ్యం చెందేసరికి ఆ ప్రకృతి గుణసంగం కారణంగా నిర్లిప్తుడైన క్షేత్రజ్ఞునికి జనన మరణ ప్రవాహంలో మునుగుతూ ఉండే దౌర్భాగ్యాన్ని కలగజేసింది కాబట్టి గుణసంగం లేకుండా విజ్ఞుడు నేను క్షేత్రజ్ఞుడినే కాని క్షేత్రాన్ని కాను అని మాటిమాటికీ భావన చేసుకుంటూ ఉంటే ఈ బంధాలు తెగిపోతాయి అని వ్రాస్తారు మునుపటి వ్యాఖ్యానకర్తలు. సృష్టి కావడం పరమాత్మ చైతన్యానికి బంధం కాదు. లోగడ చెప్పినట్లు తిరగలితో కదలని రాయి కదిలేదానికి ఎంత ఆధారమో కదిలేరాయి కదలనిదానికీ అంతే ఆధారం. మారేదానికి మారనిది ఆధారం అనీ, జగత్తును బట్టి పరమాత్మను, పరమాత్మనుబట్టి జగత్తునూ తెలుసుకోవచ్చు, ఆ రెండూ గుర్తించిన స్థితే వికారంలేని ఆకారం. అశ్రాంతవివర్తనాత్మక మహాయంత్రమైన ఈ అపకృతి పురుష సంయోగంలో బయటబడిన జీవులన్నీ మళ్ళీ తమ మొదటి స్థానాలకు చేరక తీరదనీ, అలా చేరుకోవడమే సాయుజ్యము అనీ శ్లోకభావం.

కర్మ ప్రారబ్ధం జీవుడిని బాధించడమంటూ లేదు. పరమాత్మను బాధించని

కర్మ జీవుడిని ఎలా బాధిస్తుంది? 'భూతభావోద్భవకరో విసర్గః కర్మసంజ్ఞితః' జీవుడి కంటే ఉన్నట్లు పంచభూతాలు వేరుగా కనపరిచే వింగడమే కర్మ. అది పుట్టుకతోనే వస్తుందంటే, దాన్నికూడా పరమాత్మే ఇచ్చి పంపించాడన్న మాట అన్న సందేహానికి.

'నా ఉద్దేశం వీడు కర్మకు కారకుడు కాదనే. ఆ దైవం ఇట్లా ఇన్ని రకాలుగా ఎందుకు సృష్టించాలనేటప్పటికీ, బీద, భాగ్యం అనేవి కష్టసుఖాలు కావు. అనేకరకాల బాధలున్నాయి. చెప్పుకోటంలో బీదా భాగ్యమే తీసుకోవచ్చు. ఆరోగ్యం – అనారోగ్యమే కావచ్చు. గుణాల్లో మంచి చెడ్డలు కావచ్చు ఇవన్నీ – ఏదన్నాకానీ ద్వంద్వం లేకపోతే సృష్టిలేదు.'

ఎట్లా అంటే ఒకదానిని ఛేదించటానికి ఇంకొక వస్తువు కావద్దూ. పీటవేరు పీటను వాడుకుండే వారు వేరూ. వస్తువు వేరు నేను వేరుగా ఉన్నాను కదా. ఈ వేరు అయినప్పుడే రెండు కాలేదూ... (పంచభూతాలు) అన్నింటి మిశ్రమమే ఇది. ఒక్క భూమిలో అన్నీ ఉన్నాయి కదా నీటిలో అగ్నితత్వం లేకపోతే నీరు వేడెక్కదు. నిప్పుపెట్టి నా వే డెక్కదు. అగ్నితత్వం ఉంది కాబట్టే కాగగలుతుంది. అగ్నికి జల తత్వం ఉంది కాబట్టే చల్లారగలుగుతుంది. ఒకదానిలో ఒకటి ఇంకోదానిలో మఠొకటి ఉన్నది. ఇన్నింటికి కారణమేమిటి? అసలు? నిజమే గుణాలున్నాయి. గుణాలన్నింటికి ఆధారమేమిటి? ఎందుకట్లా కావల్సి వచ్చింది అనే కదా ప్రశ్న. ఈ ప్రశ్న ఎందుకు? ఇదంతా ఇట్లా జరగటం సహజమే అనిపిస్తుంది కాని పుణ్యాపాపాలు వీడికున్నాయని అనిపించదు. వీడు చేసుకోవడమంటూ వీడికి వచ్చేటప్పటికీ వీడికి బాగుచేసుకోవాలని ఉంటుంది కదా! పూర్వజన్మకర్మ ప్రకారం వీడికి వచ్చిందనే సిద్ధాంతాన్ని తీసుకున్నా, పూర్వానికి పూర్వం ఉన్నదిగా మరి, ఆపూర్వంగా వెళ్ళేటప్పటికి మొదటి పూర్వం ఏదో అదే ఈ పూర్వంగా వచ్చింది. కాని మొట్టమొదట వీడికి జన్మే లేనప్పుడు వీడు చేసిన పాపం ఎక్కడుంది. మొట్టమొదట జన్మలో వీడికి పాపం లేదుగా అసలు – వీడు ఇచ్చింది చేస్తున్నాడు. తను (పరమాత్మ) ఇచ్చింది వీడు చేస్తున్నాడు. ఇంకా వీడికి పాపం ఎక్కడుంది.

మనం చేస్తున్నదంతా దేవుడు చేయిస్తున్నాడనుకున్నప్పుడు మనం ఏదైనా చెయ్యొచ్చు అనే భావం రావచ్చు కదా! అనుకుంటే.

అమ్మ: "వస్తుంది, తప్పకుండా వస్తుంది. ఎందుకంటే అటువంటి భావన రావడం సహజమే. ఈ హస్తిమశకాంతరం లేకపోతే జగతీ ప్రగతీ ఈ రెండూ లేవు. ఆ రెండే... చూచేదీ – చూడబడేదీ (దృక్‌దృశ్యం – క్షేత్రజ్ఞుడూ క్షేత్రమూ అదే హెచ్చు తగ్గుకదా! చూచే వస్తువూ! కనపడే వస్తువూ రెండు ఉన్నాయి కదా

ఒకటి ఒకటిగా ఉంటే ఏంలేదు. ఆ ఒకటి ఇంకొకటిగా ఏర్పడినప్పుడు రెండు అయింది. దేనికది సంఖ్య చూసినప్పుడు ఒకటైనది కాని రెండూ కలిపినప్పుడు ఒకటి ఒకటి రెండు అయినది. ఈ రెండు ఏర్పడవలసి వచ్చింది కనుక భిన్నత్వం అనేది అదే. ఆ రెండే ఈ సృష్టి. ఎందుకనేటప్పటికీ సహజమనిపిస్తుంది. కొంత మంది వాడి లీలని, నాటకమనీ, ఏ పేర్లు పెట్టుకున్నా నాకుమాత్రం ఇదంతా అదేనని, ఒకే శక్తి ఇదంతా ఏర్పడిందో అదే ఇవన్నీ ఏర్పాటు చేసింది, పుణ్య పాపా లంటే మంచి చెడ్డలనండి. ఇష్టం అయిష్టం అనండి - దాన్నే (పరమాత్మ అంటాం"

25. **ధ్యానే నాత్మని పశ్యంతి కేచి దాత్మాన మాత్మనా।**
అన్యే సాంఖ్యేన యోగేన కర్మయోగేన చాపరే॥

తా: కొంతమంది ఆత్మను ధ్యానం చేతనూ, కొంతమంది ఆత్మను ఆత్మచేతను, ఇతరులు సాంఖ్యయోగం చేతను, ఇతరులు కర్మయోగం చేతను దర్శిస్తారు.

వ్యా: కేవలం ముక్కు మూసుకుని అరణ్యాలలోకి పాటిపోయి గుహల్లో కూర్చుండడంవల్ల మంత్రమే ధ్యానయోగం కుదురుతుందని అనుకుంటారు. ముమ్మిడివరం బాలయోగికి ఈ ధ్యానయోగంగా తనంతటవచ్చి అతని మీదపడ్డది. పరమాత్మ తలిస్తేనే మనమూ తలవడం. ధ్యాసే ధ్యానం అన్నది అమ్మ. ధ్యాస మన స్సుకు ఒరపిడిపెట్టి తీక్ష్ణంగా చేసి దానికి ఏకాగ్రతను కూరుస్తుంది. ధ్యానం అంటే ఆత్మదర్శనయోగం వల్ల అంటే అన్ని భూతాలను తనలోనే చూచుకోవడంవల్ల అని కూడా అర్థం చెబుతారు. అమ్మ ధ్యాస అంతా తన బిడ్డలను గుఱించే.

ఆత్మాన మాత్మనా - ఆత్మచేతనే ఆత్మదర్శనం చేసుకోవడం - ముల్లుతో ముల్లును తీసినట్లు మనస్సుతో మనస్సును గుర్తించినట్లు, ఆత్మతోనే ఆత్మను గుర్తిం చాలి అంటుంది అమ్మ.

ఇతరులు సాంఖ్యయోగం చేత పరమాత్మను తెలుసుకుంటారు. 'శుద్ధాత్మతత్వ విజ్ఞానం సాంఖ్యమిత్యభిధయతే' అని సాంఖ్యపదానికి నిర్వచనం మొట్టమొదట్లో వ్రాశాను. త్రిగుణాల సంపర్కం లేకుండా, లేదా త్రిగుణాలూ సమానస్థితిలో ఉన్న, ప్రధానమనే ప్రకృతి అందులోని మూడు గుణాలూ విషమస్థితి చెందడంవల్ల సంసా రంగా పరిణ మించిందంటారు సాంఖ్యులు. సంఖ్యావాచకంగా ప్రకృతి పరిణా మాన్ని అన్వయించి చెప్పారు కనుక సాంఖ్యమంటారు. భిన్నత్వం లేకుండా ప్రధానం ఉండే స్థితిలో ఏమీ ఉండదు కనుక అది ఏమీలేని పూర్ణత్వం. అది తప్ప ఇంకోటి లేదు కాబట్టి అది ఒకటే. సంఖ్యావాచకంగా చెప్పాలంటే ఒకటి = సున్నా అవుతుంది కదా. ఇది ఎలా సాధ్యం అవుతుంది. అంటే ఒకటికుండే రెండు కొసలూ వంచి

రెంటినీ ఏకంచేస్తే అది మళ్ళీ పూర్ణమే అవుతుంది. సృష్టిలో కనిపించే ప్రతి వస్తువూ రేఖా గణితంలో ఇమిడిపోతుంది. గోళాలు బిందురూపకంగా వర్తులంగా ఉంటాయి. అవి తిరిగే యానరేఖలు కోడిగ్రుడ్డు ఆకారంగా సాగిన వర్తులాలౌతాయి. ఎలక్ట్రానులూ అలాగే తమ పరిధుల్లో తిరుగుతాయి. శక్తి క్రియలన్నీ జామెట్రీలో బొమ్మల ఆకారాలలోనే పనిచేస్తాయి. మనిషి ఆకారం కూడా జామెట్రికల్‌గానే ఉంటుంది. అంతా సాంఖ్య రేఖామయం. ఇలాంటి ప్రకృతివిజ్ఞానాన్ని సాంఖ్యం అంటారు. కొందఱు ఆత్మను ఇలాక్కూడా తెలుసుకుంటారు.

మఱికొందఱు కొందఱు కర్మయోగంవల్ల పరమాత్మను తెలుసుకుంటారు. తనకున్న దానిని నలుగురితో పంచుకుని తింటూ మానవసేవే మాధవసేవగా తెలుసుకుని ఆవిధంగా పరమాత్మను దర్శించుతారు ఆబుబెన్ ఆడంలాగా.

26. అన్యే త్వేవ మజానన్త శ్రుత్వాఽ న్యేభ్య ఉపాసతే।
తేఽపి చాతి తరన్త్యేవ మృత్యుం శ్రుతి పరాయణాః॥

తా: క్రిందటి శ్లోకంలో చెప్పబడ్డ ధ్యానయోగ సాంఖ్య
యోగ కర్మయోగాల జ్ఞానం లేనట్టి పామరులు
కూడా, పరమాత్మను గూర్చి ఇతరులవలన విని
ఆవిన్న దానిని శ్రద్ధా భక్తులతో ఉపాసించుతూ
కొందఱు ఉంటారు. వాళ్ళు కూడా మృత్యువును దాటివేస్తున్నారు.

వ్యా: మోక్షం అనేది కేవలం వేదాధ్యయనం చేసిన వాళ్ళకూ, యజ్ఞాలు చేసిన సోమయాజులకూ, సన్యాసం పుచ్చుకున్న విరాగులకూ, విద్యావంతులకూ, సంపత్తి కలవాళ్ళకూ మాత్రమే గుత్త అయిన సొత్తు కాదు. అలాగే అయితే, సంఘంలో ఉండే కోట్లాది నిరక్షరాస్యులు ఎప్పుడూ నరకంలోనే పడి ఉండవలసి ఉంటుంది. పరమాత్మకు అక్షరాస్య, నిరక్షరాస్య పక్షపాతం ఏమీలేదుగదా. అందువల్ల పరమాత్మ అటువంటి పామర జనులకు అభయహస్త ముద్రగా ఉండే ఈ శ్లోకాన్ని చెప్పారు. స్వయంగా వేదాధ్యయనం, యోగాభ్యాసం, సాంఖ్య విజ్ఞానం పొందే భాగ్యంలేని పామరులు కూడా అటువంటి పండితోత్తములయొక్కా, అమ్మలాంటి ఆత్మజ్ఞానుల వద్దకూ చేరి వారుచెప్పే బోధలను చక్కగా విని, ఆ విన్న దానిని ఆచరణలో పెట్టిన వాళ్ళు కూడా మృత్యువు అనే భయంకర శక్తి నిజానికి భయంకరం కాదని తెలుసు కుని వారుకూడా తక్కినవారిలాగే మృత్యువుని దాటనే దాటుతారు. 'ఏవ'శబ్దాన్ని ఉపయోగించి తప్పక దాటుతారని పరమాత్మ నొక్కి నొక్కి ఈమాట చెప్పుతున్నారు.

'అందటికీ సుగతే' అని అమ్మ అభయ హస్తం ఇస్తున్నది. జిల్లెళ్ళమూడి స్వయంగా వచ్చి తనను దర్శించుకునేవారికంటే కూడా అక్కడకు రాజాలని వారి హృదయ క్షాళనమే తనకు బాధ్యతగా ప్రకటించింది. చేస్తున్నది కూడాను. అమ్మ కరుణకు పాత్రులై మృత్యువును తరించిన యార్లగడ్డ వెంకన్న, కోన వెంకాయమ్మ లాంటి వాళ్ళు ఏ అధ్యయనమూ చేసిన పండితులు కారు.

అమ్మ కరుణ అవ్యాజమయినది.

27. యావత్సఞ్జాయతే కించిత్ సత్త్వం స్థావర జంగమమ్।
క్షేత్రక్షేత్రజ్ఞ సంయోగాత్ త ద్విద్ధి భరతర్షభ!॥

తా: భరతవంశ శ్రేష్ఠుడా! అర్జునా! కదలనట్టి కదిలేటటువంటి సృష్టి అంతటిలోనూ ఏ కించిత్తు వస్తువు పుట్టినా అది క్షేత్రక్షేత్రజ్ఞుల కూడిక చేతనే పుట్టు చున్నదని తెలుసుకో!

వ్యా: మహాచైతన్యం స్పృశించకుండా పంచభూతాల చేత నిర్మించబడకుండా ఏ చిన్న వస్తువూ సృష్టిలో అస్థిత్వం కలిగి ఉండజాలదు. దాన్ని తెలుసుకునే తెలివి కావాలి. చూచే కన్నుకావాలి కాని, పేనుగ్రుడ్లలో కూడా సర్వవిశ్వమూ ప్రత్యక్షం అవుతుంది.

'నా దృష్టిలో జడమే లేదు. అంతా చైతన్యమే అన్నదమ్మ.

28. సమం సర్వేషు భూతేషు తిష్ఠన్తమ్ పరమేశ్వరమ్।
వినశ్యత్స్వ వినశ్యన్తమ్ యఃపశ్యతి సపశ్యతి॥

తా: సమస్త భూతములయందు అవేతానుగాఐ సమంగా ఉన్న వానిని, నశిస్తున్న వాటిలోకూడా ఉంటూ నశించనివానిని ఎవడు చూస్తాడో వాడే పర మాత్మను చూచిన వాడౌతాడు.

వ్యా:సమస్త భూతాలలోనూ తాను ఉన్నాననడంలో భూతాలు వేఱూ పరమాత్మ వేఱూ అనే భావం వస్తుంది. అన్ని భూతాలూ తానే అయి పరమాత్మ ఉన్నాడం టుంది అమ్మ.

'సర్వమూ తానే అయినది. చీమలో దోమలో అనికాదు సంపూర్ణముగా అని నప్పుడు చీమగా దోమగా ఉన్నాడంటాను' అమ్మ.

శవంలో కూడా చైతన్యం ఉంటుంది. కాని అది మనకు పనికివచ్చే స్థాయిలో ఉండకపోవచ్చు. శవంలో చైతన్యాన్నిచ్చే ఆహార పదార్థాలు లేకపోతే అది పురుగు

లకూ, మృగాలకు ఆహారంగా కాకపోతుంది. నశించడమంటే మన ప్రయోజనాల కుపయోగించక పోవడమే నాశనానికి ప్రాతిపదికగా భావిస్తాం. మనుష్యుడే విశ్వ మంతటికీ కేంద్రస్థానంగా భావిస్తాం - ఎంత స్వార్థం.

29. సమం పశ్యన్ హి సర్వత్ర సమవస్థిత మీశ్వరమ్।
నహిన స్త్యాత్మ నాఽఽ త్మానం తతో యాతి పరాం గతిమ్॥

వ్యా: అన్ని భూతాల్లో అన్నిచోట్లా సమానంగా నిండి ఉన్న నన్ను చూస్తూ అతడు తన్నుతాను హింసించుకోడు. కాబట్టి అతడు పరమగతి అయిన తృప్తి అనే మోక్షాన్ని పొందుతున్నాడు.

వ్యా: అన్నింటి రూపంగా పరమాత్మయే కనిపిస్తున్నప్పుడు పరమాత్మయే అన్నింటికి కర్తృత్వం వహించి జగత్కార్యాన్ని నిర్వహిస్తున్నప్పుడు, జగదా ధారత్వ, జగత్కర్తృత్వ, జగన్నియంతృత్వ, జగద్రక్షణాది బాధ్యతలను పరమాత్మయే నిర్వ హిస్తున్నాడనే భావమూ, ఆ మహాదర్శనమూ కలిగినప్పుడు మనస్సు నేనే చేస్తున్నా ననే భావంతో తన్ను తాను హింసించుకోదు. అందువల్ల అతడు ఉత్తమగతిని పొంది ముక్తిని చెందుతాడు.

ఉపనిషత్తులలో ఆత్మకు అంతర్యామిత్వం చెప్పబడింది. జగత్తును సృష్టించి అందులో పరమాత్మ ప్రవేశించినట్లున్ను చెప్పబడింది. సృష్టి స్వరూపమే పరమాత్మ అని కూడా చెప్పబడింది. ఇలా వేర్వేఱు విధాలుగా చెప్పడంవల్లనే జీవాత్మ పర మాత్మలకు భిన్నత్వమూ ఏకత్వముల గూర్చిన వివాదాలకు ఆధారం కలిగింది. అమ్మ సకల సృష్టిపైనా లోపలా రెండూ పరమాత్మ స్వరూపమే ఇదిగానిది అదేమీ లేదని నిస్సందేహంగా చెప్పి ఈ ఆత్మహింసను మాన్పింది.

30. ప్రకృత్యైవ చ కర్మాణి క్రియమాణాని సర్వశః।
యః పశ్యతి తథాఽఽ త్మాన మకర్తారం స పశ్యతి॥

పరమాత్మ ప్రేరణచే ప్రకృతి చేతనే అన్నివిధములుగానూ కర్మలు చేయ బడుతున్నవి. (అలా జరిగేవన్ని పరమాత్మవల్లనే జరుగుతున్నా-) పరమాత్మను బయటికి మాత్రం కర్మలు చేయకుండా ఉన్నవాడిని లాగా ఎవడు గుర్తిస్తాడో అతడు జ్ఞాని.

అన్ని పనులు పరమాత్మ ప్రేరణవల్లనే జరుగుతున్నవి. బయటి ప్రకృతియే అన్ని పనులు చేస్తున్నట్లు కనబడుతున్నది. పరమాత్మ స్వయంగా చేస్తున్నట్లు కనిపించడం లేదు.

ఏ పని అయినా మనస్సులోని ప్రేరణ వల్లనే కర్మేంద్రియాలు చేస్తూ ఉంటాయి. బయటికి చేతులు చేస్తున్నట్లే కన్పిస్తాయి.మనస్సు వచ్చితానుగా చేస్తున్నట్లు కన్పించదు. దీనిలోని యథార్థ్యాన్ని గుర్తించినవాడు జ్ఞాని.

నేను శాశ్వతంకాను. సృష్టి శాశ్వతమే. ఆత్మను తెలుసుకొనడానికి అనాత్మ అంటూ బయలు దేరతాడు. అనాత్మ అని బయలుదేరడానికి కాని, అనాత్మ అని వాదించలేదు. అనాత్మ మాత్రము కాదు. బయలుదేరడానికి సాధనా వాక్యమది. సూది మోపసందులేనిదని ఒకవైపు చెపుతున్నారు. కర్మేంద్రియాలు లేకుండా జ్ఞానేంద్రియాలు ఎక్కడ దాగి ఉన్నాయి. ఆజ్ఞానేంద్రియమే కర్మేంద్రియాలను వాడుకుంటున్నది. అమ్మ

31. యదా భూత పృథగ్భావ మేకస్థ మనుపశ్యతి।
తత ఏవ చ విస్తారం బ్రహ్మసంపద్యతే తదా॥

తా: ఎప్పుడైతే భూతాల నానాత్వాన్ని ఏకస్థమై పరమాత్మగా ఉండడాన్ని చూస్తాడో అప్పుడే ఆకారణంవల్లనే భూతవిస్తారం అదేగా ఉన్న బ్రహ్మాన్ని పొందుతాడు.

వ్యా: అనంతమైన భేదాలతో, అనంతమైనవికారాలతో, అనంతమైన ఆకారాలతో సంసారంలోని పృథగ్భావం, భిన్నత్వం అనంతంగా ఉంది. ఈ అనంతమైన భిన్నత్వం లోని ప్రతి వ్యష్టిమాత్రా పరమాత్మయే అయి ఉన్నందున అదంతా పరమాత్మయే అని చెప్పబడుతుంది. బియ్యపురాశిలో ప్రతి గింజా బియ్యపుగింజే. అన్నీ కలిసి బియ్యపురాశి అయినట్లు పరమాత్మ ఏకత్వము భూతాల పృథగ్భావాన్ని పరాస్తం చేసి ఒకటిగా కనిపింపజేస్తుంది. అమ్మలో ఏ దేవుని స్వరూపాన్ని తలుచుకుంటే ఆ దేవుని స్వరూపం కన్పించినట్లు, సృష్టిలోని ఏ ఆకారం కావాలంటే ఆ ఆకారం పరమాత్మ శరీరంలో కనిపిస్తుంది. గుడ్డ యొక్క సమగ్రభావాన్ని మనస్సులో ఉంచుకుని చూస్తే ఆ యాపోగులన్నీ కలిసిన సమగ్ర భావం పరమాత్మగా కనిపిస్తుంది. సృష్టి నంతటినీ పరమాత్మగానే అనుకుని చూస్తే 'ముఖాదింద్రశ్చాగ్నిశ్చ ప్రాణాద్వాయురజాయత' మొదలైన సంపూర్ణమైన విరాణ్మూర్తిగానే ఈ సృష్టి దర్శనమిస్తుంది. అలాగా భూతవిస్తారాన్ని చూడగలిగిన వాడు బ్రహ్మాన్ని కూడా పొందుతాడు.

పైశ్లోకం వేదాంతానికి పరమార్థానికి కొలికిపూస. నానాత్వంలో ఏకత్వాన్ని చూడడమే అన్నిసాధనలకూలక్ష్యం.

32. అనాదిత్వా న్నిర్గుణత్వాత్ పరమాత్మాఽ యమవ్యయః।
శరీరస్థోఽ పి కౌన్తేయ న కరోతి న లిప్యతే!!

తా: అర్జునా! అనాదిత్వముచేతను, నిర్గుణత్వముచేతను, అవ్యయుడైన ఈ పరమాత్మ శరీరములో నివసించుచున్న వాడైనా స్వయంగా ఏపనులూ చేయడు. వేటి వలనా అంటబడడు.

వ్యా: అన్ని గుణములు అతనివే కనుక పరమాత్మ నిర్గుణుడు. నిర్గుణుడు కనుక అతనికి నాశనంలేదు. తఱుగులేనివాడు. ఎంతగావికారంచెందినా ఇంకా వికారం చెందని భాగం అతనికి పదింట తొమ్మిది వంతులుంటుంది. పరమాత్మ కాకుండా శరీరం ఉండదు కాబట్టి అతడు శరీరంకూడాను. శరీరమై ఉండి అతడు శరీర కర్మలను చేస్తున్నా కర్మల వల్ల అతడు అంటుసొంటు తగలనివాడై ఉంటాడు.

ఎలెక్ట్రిక్ క్రిమటోరియంలోని కొలిమి పెట్టెలలో పీనుగులను పెట్టిదహిస్తారు. పీనుగుల కుళ్ళుగాని, బూడిదెకాని ఆ పెట్టెల చుట్టూ ప్రవహించిన విద్యుత్తును మలిన పఱచదు కదా. పీనుగును తగులవేసిన చితిమంటను శవవాసన పట్టు కోదుకదా! అలాగే శరీరము అవయవాలుచేసే పనులను లోపలి ఆత్మయే చేస్తు న్నట్లుగా అనుకోడానికి వీలులేదు.

33. యథా సర్వగతం సౌక్ష్మ్యా దాకాశం నోపలిప్యతే।
సర్వ త్రాఽ వస్థితో దేహే తథాఽ త్మానోపలిప్యతే॥

ఏవిధంగా సూక్ష్మాకారంతో సర్వత్రవ్యాపించి ఉన్న ఆకాశము, అంటబడ కుండా ఉంటుందో అన్నిచోట్లూ అన్నీతానే అయి ఉన్నప్పటికీ ఆత్మ అంట బడ కుండా ఉంటుంది.

వ్యా: ఆకాశం అన్నిచోట్లా, అన్ని వస్తువుల్లో లోపలా బయటా కూడా వ్యాపించి ఉంది. రాళ్లను, లోహాలను బ్రద్దలు కొట్టి వాటిని పరమాణువులుగా చేసినప్పటికీ ఆయాద్రవ్యాణువుల మధ్య స్థలమందు కూడా ఆకాశం ఉంది. ఇలాగాలోపలా బయటా వ్యాపించి ఉన్నప్పటికీ ఆయావస్తుగుణాలు దాని కంటుకోవు. పూవులో పలాబయటా ఆకాశం వ్యాపించి ఉన్నా ఆ ఆకాశాన్ని పూవు వాసన అంటుకోదు. అలాగే అన్ని స్వరూపాలుగా పరమాత్మయే ఉన్నా, ఆయాదేహాల కర్మవృత్తులు ఆత్మను అంటుకోవు అని అర్థం.

34. యథా ప్రకాశయ త్యేకః కృత్స్నం లోక మిమం రవిః!
క్షేత్రం క్షేత్రీ తథా కృత్స్నం ప్రకాశయతి భారత!!

తా: అర్జునా! లోకాన్నంతటిని ఒక్కడైన సూర్యుడు ఎలా ప్రకాశింప జేస్తుం టాడో, క్షేత్రాన్ని ఆవిధంగానే క్షేత్రి అంటే జీవుడు ప్రకాశింపజేస్తుంటాడు.

బహిరాకారానికి సూర్యుడెలాగో అంతరాకారానికి జీవాత్మ అలాగా. సూర్యుని వెలుగులో లోకం జీవ వంతమై తిరుగుతుంది. జీవం ఉన్నప్పుడే శరీరం నడవ కలుగుతుంది. జీవం సూర్య శక్తి వల్ల వృద్ధిచెందినా పరమాత్మ అనుగ్రహం వల్లగాని సూర్యుడు కూడా ప్రకాశించలేడు.

35. క్షేత్ర క్షేత్రజ్ఞయో రేవ మన్తరం జ్ఞానచక్షుషా!
భూత ప్రకృతి మోక్షం చ యే విదుర్యాన్తి తే పరమ్!!

తా: ఎవరు ఈ విధంగా క్షేత్ర క్షేత్ర జ్ఞుల అంతరమును, భూత ప్రకృతినీ, మోక్షాన్నీ జ్ఞానచక్షువుల చేత తెలుసుకుంటారో వారు పరమును పొందుదురు.

వ్యా: కళ్ల ఎదుట మనకు ప్రాణమున్నవీ, ప్రాణం లేనివీ, కదులుతున్నవీ, కదలలేనివీ అయిన నానాకారాలతో సృష్టి కనిపిస్తున్నది. దాన్ని గుఱించి అనాది నుంచి ఆలోచించే మనస్సు ఇదంతా ఏమిటి? ఈ సృష్టి ఏమిటి? ఎందుకిలా కావల్సి వచ్చింది? దీని వెనుక చేసే కర్త ఎవడైనా ఉన్నాడా? నడిచే శరీరాలు పడిపోతు న్నాయి. నడిపించే శక్తి ఒకటి ఉన్నట్లు అనిపిస్తున్నది. ఆశక్తి నడవని వాటిలో ఉన్నదో లేదో చెప్పడం తెలుసుకోవడమూ క్లిష్టసమస్యగా ఉన్నది. ఆశక్తి కాస్తా లేచి పోతే శరీరం కూడా కదలని వాటిలో చేరిపోతున్నది. సూర్యుడు ప్రకాశిస్తున్నాడు. అతని ప్రకాశానికి కూడా ఎవరో ఆధారంగా ఉండాలనిపిస్తున్నది ఒక వైపున. రెండోవైపున సూర్యుని తేజస్సు ఆధారంగా ప్రాణము సృష్టి అంతా తలెత్తుతున్నది. ఇంట్లో కూర్చుని దాహంతీరడానికి త్రాగుతున్న కుళాయి నీటికి వెనకాల ఓవర్ హెడ్ టాంకూ, దానివెనకాల కాలవా దాని వెనకాల గోదావరి ఆనకట్ట, దాని వెన కాల గోదావరి ప్రవాహం, దాని వెనకాల వర్షం, వర్షం వెనకాల మేఘాలూ, మేఘాలవెనకాల సముద్రం, సముద్రం వెనకాల సూర్యకిరణాలూ, మళ్లీ మొదటి కేవచ్చాం మెర్రిగోరౌండ్‌లో లాగా. ఈస్టేజీలన్నింటినీ వెనక్కు నెట్టేసి, గ్లాసులోని మంచినీళ్లను సముద్రంలోని ఉప్పు నీళ్లుగా అనుకోమంటే మనస్సు ఒప్పుకోదు. మనస్సు ఒప్పుకోవడమైనా, ఒప్పుకోకపోవడమైనా అది మనోవృత్తి, ఒకడి మనో వృత్తి సార్వత్రికంగా భాసిస్తుంది సూర్యుని వెలుగు లాగా. మఱొకటి ఏకత్రికంగానే భాసిస్తుంది కిరణం వెలుగులాగా, ఎవడు చూచి చెప్పింది వాడి మటుకు అది సత్యమే, క్షేత్రజ్ఞుడు దృక్కై చూడగలగడం అనేదే ఈ మనోవృత్తి, ప్రత్యక్ష సత్యంగా

కనిపిస్తున్న దృశ్యాన్ని పట్టుకుని ఎవరికితోచిన మాటలు వాళ్లు అంటారు. ఎవరికి తోచిన ఊహాకల్పనలు వారు చేస్తారు. అలాచేయడంలోనే వివిధములైన ఉపనిష ద్రుషులు చెప్పిన మాటలలో భేదం అంతరం వచ్చింది. అమ్మ అయితే ఆ కనపడని దాన్ని కూర్చిబాధ పడడమెందుకు. ఈకనపడే దాన్ని గూర్చి ముందఱ ఆలోచించు. ' ఇది కానిదదేమీలేరు- అని క్షేత్ర క్షేత్రజ్ఞుల మధ్య అంతరం లేదని తెమిల్చివేసింది. పూర్వవ్యాఖ్యాతలు చెప్పినది చదివీ, మనస్సులో పుట్టే సందేహాలకు "సమాధానం దొరక్క గొట్టు మిట్టాడే జిజ్ఞాసువుల కిదిమహావర ప్రసాదం. శ్రీపాద అన్నట్లు 'బ్రహ్మము మారనిదే, కనబడే దానికంటే వేరైనదే, బ్రహ్మమును తెలుసుకున్నవాడు బ్రహ్మమే అవుతాడు అని నమ్మినవాడు లోకాన్ని వదలి ఏ ఆశ్రమాలలోనో జపమో తపమో చేసుకుంటూ సన్యాసిగానే ఉంటూ జీవితం చాలిస్తాడు; ఈసర్వమూ బ్రహ్మమే. అని నమ్మేవాడు యదృచ్ఛాలాభ సంతుష్టుడుగా విశ్వబంధువుగా నడవడా నికి యత్నిస్తాడు. వాడికి ప్రపంచం మరుమరీచికం, వీడికి ఆనంద నిలయమూను. వారిసాధనలోనే తేడావస్తుంది నమ్మకము భేదించడముతో. ఎవరికి వారు వారి నమ్మకాన్ని బట్టి నడుచుకుంటే పై వారికి లాభమూ లేదు. నష్టమూలేదు. ఇంకొకరికి చెప్పయత్నిస్తేనే చిక్కు వస్తుంది. వాదన అంటే ఇంకొకరికి నచ్చచెప్పయత్నించడమే. వారన్నది కాదనడానికి అయితే వితండము సిద్ధము. 'సర్వంఖల్విదంబ్రహ్మ' అన్న వాక్యానికి వేదాంత పండితులు, ఇది సర్వమూ బ్రహ్మ మేను' అన్న అర్థం తియ్యారు. వానికి బొడ్డు తుంబాయిపెట్టి ' ఇది దానిలోనుంచి వచ్చింది కనుక ఇది అదేను' అంటారు. అమ్మ 'నేను అదీ అనుకోవటం లేదు. ఇదే అనుకుంటున్నాను' అన్నారు. వారు ఇదం కాదు. అదః అంటారు.

చెప్పేతీరువేఱుగా ఉండవచ్చుగాని గీతలో చెప్పనిది నేను క్రొత్తగా చెప్పు తున్నదీ ఏమీలే' దన్నది అమ్మ.

పరిపూర్ణమైన ఆధ్యాత్మవిజ్ఞానమంతా ఒక్కటే అనుకున్నప్పుడు, అందులో ఉపనిషత్తులు చెప్పిన సంగతులు వేఱు, అమ్మ చెప్పిన తీరు వేరు అని చెప్పడానికి సాధ్యపడదు. మనం చూసేది విజ్ఞాన సముద్రాన్నిగాని నదులనుకాదు, అమ్మ చెప్పింది సముద్రమే.

ఇతి శ్రీమన్మాతృగీతలోని క్షేత్ర క్షేత్రజ్ఞ విభాగ యోగమను త్రయోదశోధ్యా యము.

శ్రీమద్భగవద్గీతా

గుణత్రయవిభాగయోగము

చతర్దశోధ్యాయము

శ్రీభగవానువాచ

పరం భూయః ప్రవక్ష్యామి జ్ఞానానాం జ్ఞానముత్తమం!
యద్ జ్ఞాత్వా మునయ స్సర్వే పరాం సిద్ధి మితో గతాః!!

తా: జ్ఞానములలో కల్ల ఉత్తమ మైన జ్ఞానమూ, దేనిని తెలిసికొని సమస్తము నులు మోక్షమును పొందారో ఏదిపారమార్థిక మైనదో అటు వంటి పరమాత్మజ్ఞానాన్ని మఱల నీకు చెప్పుతున్నాను.

వ్యా: క్రిందటి క్షేత్ర క్షేత్రజ్ఞ విభాగయోగంలో ఈ శరీరము జీవుడు వారిద్దఱి సంబంధము ఏవిధంగా దేహవ్యాపారం నడిపితే బంధాలు తెగిపోయి మోక్షం లభిస్తుందో ఆవిషయాన్ని గుఱించి పరమాత్మ ఉపన్యసించారు. కాని అది వ్యష్టి శరీరాన్ని గుఱించిన విషయం. ఈ అధ్యాయంలో అదే క్షేత్రాన్ని లేక శరీరాన్ని గూర్చి ఇంకా వివరంగా చెబుతున్నారు. శరీరం దానిలో ఉండే ఆత్మా అంటే చైతన్యం ఒకదాని నుండి ఒకటి విడదీయరానివి. శరీరయాత్రను బట్టే పురోగతి ఆధారపడి ఉంటుంది. కాబట్టి శరీర యంత్రాంగం ఎలా ఏర్పడ్డదీ, ఆశరీర యాత్రను నడిపించే శక్తులు ఏలా ఉండేదీ, వాటితాలూకు ప్రతిబంధకాలు ఎలా ఉంటాయో, పరమాత్మ ప్రేరణ ఈ యంత్రాంగాన్ని ఎలా నడిపిస్తుందో ఈ విషయాలను గుఱించి ఇంకా సాకల్యంగా ఈ అధ్యాయంలో పరమాత్మ చెప్పబూను కున్నారు. మళ్లీ అర్జునుడు ప్రశ్నించకుండా స్వయంగానే ఈ పరమార్థ తత్వాన్ని మళ్లీ చెబుతానని పైశ్లోకం ఆరంభించారు. మొట్ట మొదటి ఆరధ్యాయాలలో కర్మ యోగాన్ని గూర్చి ఉపన్యసించ బడింది కాబట్టి అవి కర్మషట్కమని, తరువాత అధ్యాయాలు భక్తిని గూర్చి ప్రతిపాదించబడినవి కాబట్టి భక్తి షట్కమనీ చివరి ఆఱు అధ్యాయాలూ జ్ఞానయోగాన్ని గూర్చి చెప్పబడినవి కాబట్టి అవి జ్ఞానషట్కమనీ చెప్పబడతాయి. జ్ఞానషట్కంలో గుణత్రయ విభాగయోగం రెండవ అధ్యాయం. దీనిలో పరమాత్మ ఆకారసహితమైన హిరణ్య గర్భసృష్టి ఎలా మొదలౌతుందో ఏయే గుణాల వల్ల ఆసృష్టి జన్మస్థితిలయాలకు అగ్గమౌతుందో, ఏప్రతిబంధకాలను తొల గించుకుంటే పరమాత్మ సాక్షాత్కారం లభిస్తుందో ఇవన్నీ చెప్పుతున్నారు.

2. ఇదం జ్ఞాన ముపాశ్రిత్య మమ సాధర్మ్య మాగతాః!
సర్గేఽ పి నోపజాయన్తే ప్రలయే న వ్యథయన్తి చ.!!

తా: ఈ జ్ఞానాన్ని పొందిన మానవులు నా సాధర్మ్యమును పొంది సర్గములలో మళ్లీ పుట్టరు. మృత్యువు ప్రాప్తించినప్పుడు వ్యథచెందరు.

వ్యా: ఈ జ్ఞానం అంటే నవస్వరూపజ్ఞానం. ఏవిధంగా ఈ శరీరం తయారవుతున్నదో. ఈశరీర యాత్రకు అర్ధమేమిటో దీనికికారకులెవరో అసలు కారణ ద్రవ్యానికీ ఈ పృథక్శరీరమయమైన సంసారానికీ సంబంధ మేమిటో ఈ విషయాలకు సంబంధించిన జ్ఞానాన్నీ, మోక్ష మంటే ఏమిటో అనే విషయాన్ని గుతించిన జ్ఞానాన్నీ ఆశ్రయించి అంటే పొంది భక్తులు నా సాధర్మ్యమును పొందుతారు. సాధర్మ్యము అంటే నాతో సమానమైన ధర్మాన్నిపొందుతారు. అందు వలన సృష్టి కాలంలో కూడా వాళ్లపుట్ట కుండా ఉంటారు అంటే వాళ్లు పుట్టినా పుట్టకుండానే ఉంటారు. మృత్యువు ఆసన్నమైనప్పటికి వాళ్లు ఏవిధమైన వ్యథా పొందరు. అంటే మరణమాసన్న మైనా సర్వజగదాధారమైన పరమాత్మనే నేను, మరణం అంటే మార్పే కాని మఱేంకాదు. నేను నశించే వాడినికాను. ఉన్నవాడినే ఇలా అయ్యాను. అయిన వాడిని మళ్లీ ఉన్నవాడిలో చేరిపోతున్నాను అని తెలుసుకుని స్థిమితపడ తాడు. అని పరమాత్మ వాక్యం.

3. మమ యోని ర్మహ ద్బ్రహ్మ తస్మిన్ గర్భం దదా మ్యహం।
సమ్భవ స్సర్వభూతానాం తతో భవతి భారత॥

తా: కీలక శ్లోకం. మహద్బ్రహ్మ అనే పేరుగల నా ప్రసవ కీలకస్థానంలో నేనే గర్భాన్ని ఉంచుతున్నాను. అందువలన సమస్త భూతాలు ఉత్పత్తి నొందుతున్నాయి.

వ్యా: బ్రహ్మ అంటే బృహతీతిబ్రహ్మ బృంహయతీతి బ్రహ్మ పెద్దదిగా తానుండేది, ఉన్నదాన్ని పెద్దది పెద్దదిగా చేసేది అనిఅర్థం. మహత్ అంటే వికారం చెందేది అని అర్థం. ప్రసవధర్మిణి, వికారశీల అయిన ప్రకృతి ధర్మంగా పరమాత్మ మారినప్పుడు సమస్త లోకాలు సమస్తజీవులు ఆ పరమాత్మయోని నుండి ఆవిష్కారం అవుతూ ఉంటాయి. అనేక వికారాలుగల ఈ ప్రకృతికే మహత్ బ్రహ్మఅని పేరు. అదేనిజానికి పరమాత్మయోని అందులో పరమాత్మయే తన గర్భాన్ని అంటే సమష్టి చైతన్యాన్ని ఉంచుతాడు. ఇక్కడగర్భం అంటే అండ చైతన్యరూపియైన అండాండం. అందులో నుంచి సర్వభూతాలు ఆవిష్కారం అవుతాయి. ప్రకృతి కూడా తనదే, అని పూర్వం పరమాత్మ చెప్పి ఉన్నా ఈ హిరణ్యగర్భదశలో పరమాత్మకూ క్షేత్రజ్ఞునికీ, భేదం చెపుతారు ప్రాచీన వ్యాఖ్యాతలు పరమాత్మ నిర్గుణుడూ నిర్వికారుడూ,

నిష్క్రియుడు కనుక, ఈ సృష్టికార్యాన్ని ఆత్మమాయను తన అధీనంగా చేసుకుని అది ఈసృష్టి యంత్రాంగాన్ని కల్పించి నడిపిస్తూ ఉంటే తానుసాక్షి మాత్రంగా చూస్తూ ఊరుకుంటాడని పారంపర్యంగా కర్మ సూత్రాన్ని నిలబెట్టడాని కల్లబడిన సిద్ధాంతాలు చెబుతాయి. పరమాత్మకు నిష్క్రియత్వాన్ని అంటగట్టడం వల్ల వచ్చే లాభం ఏమిటో అర్థం కాదు. అంతానేనే చేస్తూన్నాను, అంతానా వల్లనే జరుగు తున్నది అని స్పష్టంగా పరమాత్మ చెబుతుంటే దానికి డొంక తిరుగుడు అర్థాలు చెప్పి తలచుట్టు చేతిని త్రిప్పి ముక్కును చూపించడమెందుకోతెలిదు. అమ్మ అలా చెప్పదు. ఒకటిగా ఉన్న పరమాత్మతానే ద్వంద్వమైనాడు. ద్వంద్వంతోనే సృష్టి ఆరంభమయింది. అలాగా కావడం పరమాత్మ స్వభావం. అలా కాకుండా పర మాత్మ ఉండలేడు అంటుంది అమ్మ ద్వంద్వాతీతత్వం, గుణాతీతత్వం పరమాత్మకు గీత ఆపాదిస్తున్నా పెక్కుచోట్ల ఈగుణాలకు, వికారాలకు ఆది కారణమూ బీజయోనీ అయిన ప్రకృతి జడమనీ, పరమాత్మ తన చైతన్య శక్తిని అందులో నిక్షేపిస్తేనే కాని అది క్రియాసమర్థం కాజాలదనీ, ఉద్ఘాటిస్తుంది. ఏశక్తిలేకుండా, ప్రకృతి గాని, ప్రకృతి జన్యద్రవ్యాలుకాని, భూతాలుకాని, భూతాలుగాకావడంగాని, చైతన్య వ్యాపారం మేలుకోవడం గాని నిద్రపోవడంగాని ఏదైనా ఉండడంగాని లేక పోవడం గాని కలుగజాలదో, అలాంటి శక్తిని విస్మరించి, దాని నుంచి వేటే ఇంకో దాన్ని విడదీసి, ఆవిడదీయబడిన దానికి ప్రత్యేకస్థానం, విశిష్టమైన ఉనికినీ కల్పించడానికి పల్టీలు కొట్టడమెందుకూ. అందుకనే అమ్మ ఒకసారి అద్వైతాన్ని గూర్చిచెబుతూ.

'ఏదీ అది కాదంటూ అన్నీ అదే ననడం అద్వైతం' అన్నది. సామాన్య మాన వుల మస్తిష్కానికి అందుబాటులో ఉండేవి కావు వంధ్యాపుత్రీ, గంధర్వ నగరాదుల సాదృశ్యాలూ, ఆవరణ విక్షేపాది మాయలతో కూడిన రజ్జుసర్ప, శుక్తి రజత భ్రాంతులూ ఈ మాటల గారడీలన్నీ పరమాత్మయే స్వయంగా ఈ జగత్తౌతున్నాడనీ, అది అలాకావడం అతని స్వభావమనీ చెప్పితే సులభంగా అర్థమౌతుంది. తరువాత ఈ స్వభావం ఎన్నెన్ని అవస్థలలో ఏయే కిటుకులతో మారినది మారుతున్నది. అనే విషయాన్ని వివరాలతో ప్రపంచించడంలో ఏ ప్రత్యాఘాతమూ రాదు. అందుకనే అమ్మ అంటుంది.

'ఈద్వంద్వాలన్నీ ఆబ్రహ్మాలో భాగాలే కదా!

ఈద్వంద్వాలను ఆబ్రహ్మాగా గుర్తించడమే బ్రహ్మానందం.' సర్వకార్యాల కంటె గొప్పది కాబట్టి సర్వకార్యాలను వృద్ధి పొందించేది కాబట్టి, ప్రకృతిని మహద్బ్రహ్మా మని వ్యవహరిస్తారని శంకరుని నిర్వచనం.

మహదహంకారాది వికారాలకు కారణం కనుక ప్రకృతి మహాబ్రహ్మ మన బడుతుందని రామానుజుల మతం పరమాత్మకూ ప్రకృతి పురుషులకూ భేదం లేదని అమ్మమతం

ఈశ్లోకంలోని విషయం సమష్టికి సంబంధించిన వాక్యము

4. సర్వ యోనిషు కౌన్తేయ! మూర్తయ స్సంభవన్తి యాః।
తాసాం బ్రహ్మ మహద్యోని రహం బీజ ప్రదః పితా॥

అర్జునా! అన్ని యోనుల్లోపుట్టుతూ ఉండే అన్ని రూపాలకు, మహద్బ్రహ్మయే మహద్యోని-అంటే ఈ రెంటికీ భేదంలేదు. వాటిల్లో బీజాన్ని ఉంచే తండ్రిని నేను.

ఇందాకటి శ్లోకం సమష్టిని గూర్చి చెప్పింది ఈ శ్లోకం వ్యష్టి సృష్టిని గూర్చి చెప్పుతున్నది. వ్యక్తి స్పర్శకి కూడా నేనేకారణాన్నని పరమాత్మ చెబుతున్నారు. 'దంతియదుగులోన తక్కిన జంతుచయంబునదుగులట్లు అని భారతం చెబుతుంది. అంతా, అన్నీ అనే సర్వనామాలు తెలుగులో ఉన్నాయి. అంతా అనేది వ్యష్టిభేదాన్ని సూచించని సమష్టి వాచకం అన్నీ అంటే వ్యష్టిని చూపిస్తూ కూడా సమష్టిని నిర్ణయించే సమష్టివాచకం. కొంత మంది అంతా అనడమే యుక్తమనిపిస్తుంది. వ్యష్టి సృష్టిమూర్తి సహితమైనది. ఈమూర్తి యొక్క ఆంతర్యమేమిటి? చెట్టుమూర్తి, పొద మూర్తి, పక్షిమూర్తి, ఎద్దుమూర్తి,పురుగుమూర్తి, మనిషిమూర్తి, రాయి రప్పమూర్తి, గాలిమూర్తి, వెలుగుమూర్తి, నీరుమూర్తి, పృధివిమూర్తి, మూర్తిద్రవ్యాన్ని సూక్ష్మ భోగాలుగా విభజించుకుంటూ పోతే చివరకు మిగిలే పరమాణువుమూర్తి. ఎలక్ట్రాను మూర్తి. మనస్సులో పుట్టేభావంమూర్తియే. సూర్యకిరణంమూర్తియే. అయస్కాంత శక్తి కూడా మూర్తియే. అదిసూక్ష్మమూర్తి. ఫొటాను(చేతనశక్తి తరంగకోశం) కూడా మూర్తి ద్రవ్యమే. మళ్లీ ఇంకా ఆలోచిస్తే ఒక సూక్ష్మమూర్తి గుర్తించలేనంత చిత్రంగా మఱొక స్థూలమూర్తిని సృష్టిచేసి ప్రచ్ఛన్నంగా తానామూర్తి రూపందాగి ఉంటుంది. రాక్షసిబొగ్గుల గనులలోని బొగ్గంతా ఈ రకంగా ప్రచ్ఛన్నంగా పడియున్న సూర్య కిరణాలే. చిత్తుప్రకృతి వికారాలతో కలిసినప్పుడు చిత్తమౌతుందని శాస్త్రజ్ఞులంటారు. ప్రతి చెట్టూ సూర్యకిరణాల సమూహమే. చెట్టును చూచేటప్పుడు చెట్టు ఆకారం కాక సూర్యకిరణాల సముదాయాన్ని చూడ గలిగిన వాడికి అతీంద్రియ దర్శనం లభిస్తుంది కాని ఏ చైతన్య శక్తి వల్ల ఈ కిరణాలు చెట్టు రూపాన్ని దాలుస్తాయో ఆశక్తిని పరమాత్మతనచైతన్య బీజంగా ప్రతిద్రవ్యంలోనూ నిక్షేపిస్తున్నాను అని పరమాత్మ సెలవిస్తున్నారు. మఱి ఈ కార్యపరిణామకీలక మైన పరమాత్మ చైతన్యశక్తి

లేక ప్రేరణయే ఈనాటకాన్ని నడిపించే సూత్రధారి పాత్రను నిర్వహిస్తున్నది. ఈ ప్రేరణయే, శ్లోకంలో ఉపయోగించబడిన బీజం అనే పదానికి అర్థం. ఈబీజాన్ని తండ్రిఅయిగా పరమాత్మ సృష్టిచేసుకుని, తల్లిగా అంటే ప్రకృతిగా అయి తనలోనే నిక్షేపించుకుని ఈసృష్టి అంతటికీ సృష్టికావడానికి కారణమవుతున్నాడు. ఏకంగా ఉన్నది ద్వంద్వంగా ఉండకావడమే సృష్టికి కారణభూతము అవుతున్నది.

విత్తు ముందాచెట్టుముందా అని ఒక సమస్య ఉంది. దానికి జవాబుకాయలు, పండ్లు, లేని చెట్టుండవచ్చుగాని గింజలేకుండా చెట్టుమొలవదు. శ్లోకంలో బీజప్రద త్వానికే ప్రాధాన్యం ఈయబడింది.

5. సత్త్వం రజ స్తమ ఇతి గుణాః ప్రకృతి సంభవాః।
నిబధ్నన్తి మహాబాహో! దేహే దేహిన మవ్యయం॥

తా: సత్త్వము, రజస్సు, తమస్సు అనే ప్రకృతి సంభవములైన గుణములే దేహిని దేహమునందు బంధించుచున్నవి.

వ్యా: దేహము వేఱు దేహివేఱుగా ఉన్నందుకు దాఖలాగామృత్యువుదేహానికి దాపురించిన తరువాత ఆదేహంయొక్క జడమూర్తి వెనుకమిగిలి పోతున్నది. ఇది ప్రత్యక్షానుభవమైన సంగతి. అంత వఱకు ప్రీతి, భీతి, సుఖ, దుఃఖాదులు, శీతోష్ణాదులు కలిగినప్పుడు ఏది ఉండడం ఆదేహం ఆయామనః ప్రవృత్తులకను గుణమైన సన్నికర్షపలాయనాదులను చేస్తూవచ్చిందో అది ఇప్పుడు అందులో లేక పోవడం వల్ల జడంగా పడి ఊరుకున్నటున్నది. కాబట్టి ఈ మూర్తిని కదిలించే చైతన్యశక్తి. కనబడకుండా అందులోనివసిస్తూ ఆదేహాన్ని ఆవేశించి ఉన్నమాట నిర్వివాదాంశం. జడంలో ఈచేతనశక్తి సహజంగా కూడా ఉంటుంది. కాని అది మనకు వ్యక్తమయ్యేరీతిగా అన్ని వ్యవస్థలలోనూ ఉండదు. యురేనియం పరమాణు వులను ఒక ఆపన్నప్రమాణానికి తెచ్చినప్పుడు అందులోని చిచ్చేతన శక్తి బ్రహ్మాండ సంహారక రూపంలో బయటి కుఱుకుతుంది. అంతకంటె తక్కువ తరగతులలోని సృష్టివర్గాలలో ఈశక్తిపరిమితంగా ఉంటుంది. జీవత్ప్రకృతులలో కూడా చేతనశక్తి వివిధ మైన దశలలో వివిధమైన అంశాలలో ఉంటుంది. గొఱ్ఱెకు బుద్ధి తక్కువగా ఉంటుందంటాం. గుఱ్ఱానికి కుక్కకు మెదడు ఎక్కువగాపనిచేస్తుందంటాం. అలాగే ఏనుగు పెద్దపులి, మృగరాజు వీటికి కూడా హెచ్చుతగ్గులలో ఉంటుంది ఈ బుద్ధి ప్రాణశక్తి కూడా అలాంటిదే. జీవాత్మ అంటే ఈ చైతన్యశక్తియే. అది బుద్ధిజీవు లందేకాక, స్థావరజంగమాలన్నింటిలోను వ్యాపించి ఉన్నది. భూతము అంటే అలా

అయినది అని అర్థం. ఉండడం వేఱు కావడం వేఱు ఉండడంలో క్రియాశక్తి మఱుగు పడి ఉంటుంది. కావడంలో క్రియాశక్తికి చలనం కలగడమే కాక ఇచ్ఛాశక్తి కూడా దానితో కలిసి అలాగాకావడం జరుగుతుంది. నిత్యముక్త బుద్ధ స్వరూపుడూ జ్ఞానఘనుడూ కూటస్థుడూ అయిన సచ్చిదానంద పరమాత్మకు ఈ జంజాటం ఎందుకు కావలసి వచ్చింది అనే ప్రశ్నకు- సమాధానంగా మాయా వాదం ఇలా చెబుతుంది.

మహా ప్రళయంలో అన్ని సర్గాలకు క్రియాశక్తి నశించి నప్పుడు భూతాలన్ని విధ్వస్తములై పోయినప్పుడు, వాటికర్మవాసనలు పరమాత్మలోనే అణిగిపోతాయి. అవి అక్కడ జతుపిండం అంటే కంసాలి వాడుపయోగించే లక్కముద్దలోని బంగారు కణాలలాగా అతుక్కుని ఉంటాయి. పరమాత్మలో అవి కరిగి గాని కలిసిగాని పోవు. లక్కతో బంగారం కలిసిపోదుకదా. నిర్గుణ పరబ్రహ్మానికి గుణాలను అరిగించు కోడం ఎలాగా జతపడుతుంది? ఆసువర్ణలేశాల రూపాలలో ఉన్న కర్మావశేషాలు పక్వం అయ్యేసమయానికి పరమాత్మ వాటివాటికి అనుగుణమైన దేహాలనిచ్చి లోకంలోకి పంపిస్తుంటాడు ఇలాగా ఏర్పడినదే సంసారం ఇలా తన మాయచేత తానే జన్మిస్తుంటానని పరమాత్మసెలవిచ్చారు. సంభవామ్యాత్మమాయయా అనే వాక్యం చేత తానే ఈసృష్టిగా ఔతున్నానని స్పష్టంగా చెప్పినా వివిధములైన మత కర్తలు, సృష్టికీ పరమాత్మకు భేదాన్ని కల్పించి, నానారీతులుగా చిత్రించారు. ఇలా ఏర్పడ్డ యంత్రాంగంలో సూక్ష్మరూపంగా ఉన్న సృష్టికి స్థూలరూపం. ఇలా అంతా ఏర్పడడానికి ఈశ్వరుని సంకల్పమే ఆదికారణం అంటారు.

ఈశ్వరసంకల్పం ఉంటేకాని ఈకర్మశేషాలు కూడా బయట బడి వికసించ గలశక్తి కలిగి ఉండేవికావు కాబట్టే ఆసంకల్పం ఉదయించేదాకా అవి అలా నిద్రాణ స్థితిలో స్తబ్ధంగా ఉండిపోతాయి. స్వయం బోధక శక్తిలేని ఈ కర్మశేషాలు మళ్లీ వ్యక్త సృష్టిలోని జీవుల భవితవ్యాన్ని ఎలా శాసించగలుగుతాయో మాయావాదం చెప్పదు. మొదటి జన్మాని కే కర్మ కారణమనే మాటకు కూడా సమాధానం చెప్పదు. జగత్తు అనాదిగా వస్తున్నది అనాదిగావచ్చే జన్మల పరంపరలో ఆదిజన్మము గూర్చి వాదం రేపడం నిరర్థకం అంటుంది.

కాబట్టి, జీవుణ్ణి బంధించి ఉంచేది కేవలం శరీరం లేక అస్థిపంజరం ఒక్కటే కాదనీ, లేదా నిమిత్తకారణాలుకావనీ పంచభూతాలు కూడా కావనీ, ఆశరీరం పుట్ట డానికి కారణమైన కర్మలేశమూ, దానిని పరిపక్వస్థితికి తెచ్చిన కాలమూ దానిని ఆవిష్కారస్థితికి తెచ్చిన పరమాత్మ సంకల్పమూ, ఇవన్నీ కూడా క్షేత్రజ్ఞునికి

క్షేత్రబంధంగా పరిణమించడానికి కారణాలవుతున్నాయి. అనీ అనిపిస్తుంది. అందువల్ల ప్రకృతి సంభవాలైన సత్వరజస్తమో గుణాలు దేహిని 'నిబధ్నంతి' అంటే మోక్షావరోధకారణంగా ఐ బంధించుతూన్నాయని చెప్పే అర్థం సరియైనది కాదని పిస్తుంది. ఆకారం కలగడానికైనా మూర్తిత్వం సిద్ధించాలి అంటే అందులోని అణువులూ, పిరరాలూ సన్నికర్షణాశ్లేషణాది శక్తులను కలిగి ఉండాలి. విడివిడిగా ఉండే మట్టికణాలకు ఆశ్లేషణశక్తి ఉన్నప్పుడే అవి ఒకటిగా చేరి ఒక కుండ ఆకారాన్ని సంసిద్ధం చేయగలుగుతున్నాయి. సృష్టి కార్యం జరుగుతున్నది. అనడానికి తార్కాణం అణువులకు ఈ క్రియ ఈశ్వరేచ్ఛవల్లనే కలుగుతుంది. ఈశ్వరస్య చికీర్షావశాత్ పరమాణుషు క్రియా జాయతే. ప్రళయం ఎక్కడైనా వస్తే అప్పుడు అక్కడి అణువులు ఈ క్రియాశక్తిని కోల్పోయినవౌతాయి. అప్పుడు అంత వఱకు కుండగా ఉన్న మూర్తిలోని అణువులు అతకబడి ఉండక ఇసకరేణువులు లాగా ఒక దానితో ఒక దానికి సంబంధాన్నికోలు పోయికుప్పబడి పోతాయి. ఇసుకతో కుండను చేయడం సాధ్యం కాదుకదా. ఇసుక ఉదాహరణానికి మాత్రమే చెప్పాను. పరమాత్మ శక్తి లేనప్పుడు ఇసుకలోని అణువులు కూడా తమక్రియాశక్తిని కోల్పోతాయి. ఇసుక వల్ల సిద్ధమయ్యే గాజు మొదలైన మూర్తులు తయారుకావు:

మన యేవ మనుష్యాణాంకారణం బంధమోక్షయోః

పరమాత్మ మనస్సే మనమనస్సుల ద్వారా ప్రసరించి సత్వర జస్తమోగుణముల రూపాలుదాల్చి తత్తదనుగుణములైన చేష్టలకు కారణంకావడమే ఈ బంధానికి అర్థం. సత్వరజస్తమోగుణాలలో ఉండే శక్తి పరమాత్మ శక్తి కంటే వేరుకాదు.

'సర్వమూ అమ్మేనంటారు అమ్మ. మనము చూచే వినే తలచుకునే నిశ్చయించే చేసే సర్వమూ అమ్మే, అమ్మపనే సహస్ర శీర్షపురుషుడు, విశ్వదృశ్యం అవుతున్నాడూ చూస్తున్నాడూ. దేవుడువేరు జగత్తువేరుకాదు. తల్లే జగత్తు. జగత్తే తల్లి. జీవులందఱు. అమ్మ సముద్రంలో తరంగాలు. అమ్మ సంకల్పం వల్లలేస్తూ అమ్మ సంకల్పం వల్ల అమ్మలో లయమౌతారు. వారి జీవితమూ జీవనమూ అమ్మ ఇచ్చినదే అమ్మ తలుస్తే వాళ్లు తలుస్తారు. వారినైసర్గిక ప్రవృత్తులూ, ఆలోచనలూ, బుద్ధీ, వారితెలివీ మందకొడి తనమూ, సుఖమూ, దుఃఖమూ, దయాస్వార్థమూ– అన్నిటికీ అమ్మేకారణము. వారు దేనికీ బాధ్యులు కారు. దేహధారి స్వతంత్రుడు కాడు. జంత్రపుబొమ్మలాగ అమ్మ ఆడించినట్లు దారిలో ఆడవలసిందే'

కాబట్టి, సత్వరజస్తమో గుణరూపమైన నియమనం కూడ అమ్మదే అని తెలియగలం.

6. తత్ర సత్త్వం నిర్మలత్వా త్ప్రకాశక మనామయం।
సుఖ సంగేన బధ్నాతి జ్ఞానసంగేన చానఘ!॥

తా: పాపరహితుడా! వాటిలో స్వచ్ఛమైనది కావడం వల్లను, ప్రకాశాన్ని కల్గించేది కావడంవల్లను, సౌఖ్యదాయకమైనది కావడం వల్లను. సత్త్వగుణం, సుఖసంగంచేతను, జ్ఞానసంగం చేతను జీవులను బంధిస్తున్నది.

వ్యా: సత్వర జస్తమో గుణాల్లో, రజస్తమో గుణాలలో మాలిన్యం ఎక్కువగా ఉంటుంది. సత్వగుణానికి నిర్మలత్వం ఎక్కువగా ఉంటుంది. సత్వగుణం ద్వారంగా చేసుకుని మనస్సును పరమాత్మ జ్ఞానసంపాదనకూ, సుఖసంపాదనకూ ప్రేరేపిస్తాడు. ప్రకాశమనే మాటకు చాల చక్కటి అర్థం ఉంది. దృక్, దృశ్య, ద్రష్టల విచారం అంతానూ, జ్ఞానం, జ్ఞేయం, జ్ఞాతల చర్చ అంతా సామాన్యంగా ఒకానొక అదృశ్యరంగం మీద జరపబడుతూ ఉంటాయి. చూచే కన్ను చూడబడే వస్తువు, చూచే కర్తా, ఈ మూడు పాత్రల ప్రాముఖ్యాన్ని గూర్చి గంటల తరబడి కోటీలెత్తి తర్కించి వాదిస్తారు పండితులు. దృశ్యమూ ద్రష్టా ఉన్నప్పటికీ కన్ను లేకపోతే దృశ్యసిద్ధి ఎలా కలుగుతుందంటారు ఒకరు. కన్నూ ద్రష్టా ఉన్నా దృశ్యం లేకపోతే ఏం ఫలమంటారు మరొకరు. గత రెండు ఉన్నా ద్రష్ట అంటూ లేకపోతే ఎలా జ్ఞానసిద్ధి ఏర్పడుతుందని అంటారు తక్కిన పార్టీలు. ఎన్నినాళ్ళు ఎంత ధాటితో వాదించుకున్నా, పరమేశ్వరుడిచ్చిన వెలుగులేకపోతే ఈ మూడు పాత్రలలో ఎవరూ ఏమీ చేయజాలరనీ రహస్యాన్ని అందఱూ మఱచిపోతారు. అలాంటిదే భగవత్ప్రేరణ, భగవత్ప్రసాదము. కాళ్ళతో నడుస్తున్నాం కనుక మనమే నడుస్తున్నాం అనుకుంటాం కాని ఏ శక్తి సహాయంవల్ల మనం నడువగలుగుతున్నామో దాన్ని స్మరించం అంటుంది అమ్మ. అజ్ఞాతంగా ఉండే ఈ భగవద్ధర్మం అమ్మ దయలాగే అన్నింటినీ తానే నడిపిస్తున్నా తెరవెనుకనే ఉండిపోతుంది. అనామయం అంటే రోగాలు లేకుండా ఉండడం రోగం రాకుండా ఉంటే సత్వగుణం ఉన్నట్లు లెక్క. దేహానికే కాదు మనస్సుకు కూడా ఈ ఆరోగ్యం ఉండాలి. రోగం లేకపోవడంవల్ల మనశ్శాంతి ఏర్పడుతుంది. మనశ్శాంతి జ్ఞానం సంపాదనకు బీజం వేస్తుంది. అనామయంవల్ల సుఖమూ, జ్ఞానంవల్ల శాంతి లభిస్తాయి. కాని ఇలా ఉండడం కూడా మనస్సుకు బాధకమే అంటారు. సుఖ సంగమూ, అంటే సుఖాల మీద ఆసక్తి, జ్ఞానసంగం అంటే జ్ఞానం మీద ఆసక్తి మనస్సును పట్టు త్రాళ్లతో కట్టి వేస్తాయి. రెండూ స్వార్థాలే కోరికలే కాబట్టి "స్వార్థం లేనిది ఏదీలేదు నాన్నా! దేవుని ప్రేమించడం కూడా స్వార్థమే. ఏదో ఒక కోరికతో అనగా మోక్షమునకో, శాంతికో ఆనందానికో కోరికలేకుండా ఉండాలనడం కూడా ఒక కోరికా" అమ్మ.

7. **రజో రాగాత్మకం విద్ధి తృష్ణా సంగ సముద్భవం।**
తన్నిబధ్నాతి కౌంతేయ! కర్మసంగేన దేహినమ్॥

తా: అర్జునా! రాగాత్మకమైనది రజోగుణమని తెలుసుకో అది తృష్ణకు, కోరికకు తగులుబాటుకు కారణమై ఉంటుంది. కర్మసంగంచేత దేహిని దేహంతో బంధించి ఉంచుతుంది.

వ్యా: పరమాత్మ సత్వగుణం బంధకారణంగా పూర్వశ్లోకంలో చెప్పి ఈ శ్లోకంలో రజోగుణం కూడా బంధకారణమే అవుతుందని చెప్పారు. అది జీవుణ్ణి కర్మ సంగముతో బంధిస్తుంది.

రాగం ఎల్లా ఉంటుందంటే రంగువేసిన గుడ్డలాగా ఉంటుంది. ఆ రంగు బట్టతోనే పుట్టినట్లుగా మనకు తోస్తుంది. గుడ్డనుండి దాన్ని విడదీయడానికి వీలు లేదా అన్నట్లు అనిపిస్తుంది. ఈ రాగం కర్మలు చేయడానికి దేహిని పురికొలుపు తుంది. కోరికలు ఆశలు వీటి మీద ఆసక్తిని ఎక్కువ చేస్తుంది. రజోగుణంకూడా ఆ విధంగా దేహికి బంధం ఔతుంది. ఈ సంసారమే నీకు బంధం అనుకునే పక్షంలో నీవు ఈ సంసారానికి దూరంగా పారిపోయి ఎక్కడో ఉన్నదేనినో పొందడానికి ప్రయత్నించు అని అర్థం తీసే సిద్ధాంతాలకైతే పైరకంగా అర్థం చెప్పడం సరిపోతుం దేమోకాని అమ్మ చెప్పే మాటల ప్రకారం అన్ని రకాలైన అనురక్తీ వ్యక్తికి బంధ కారణం కాదు. కర్మలను చెయ్యడాన్ని ప్రేరేపించే రజోగుణం, తృష్ణా సంగాన్ని పెంచుతుంటే జీవికి అది ఎందుకని దుఃఖహేతువు కాదు అనిపిస్తుంది మనకు. బౌద్ధమతంలో కూడా 'తన్హా' తృష్ణయే అన్ని దుఃఖాలకు మూలకారణమని చెప్పారు. కోరిక, ఫలాసంగము నిరంతర దుఃఖహేతువని గీతయే చెబుతుంది. కాని ఎలాంటి కోరిక అనేది దాని నిరూపణ లోనే ఈ కోరిక దుఃఖహేతువు కావడమూ కాక. పోవడమూ ఇమిడి ఉంది. క్రింది శ్లోకంలో చెప్పిన రీతిగా అన్ని గుణాలతోబాటు తృష్ణ కూడా జీవికి పరమాత్మ ఇచ్చినదే. బాధా సంతోషమూ అమ్మ ఇచ్చిన గుణాలే. కోరిక లేకుండా ఉండాలనేది కూడా కోరికే. అయినప్పటికీ దాని అనుభవం జీవిదే అవుతున్నది కాదా అనుకుంటే

"మంట ఎంత పెద్దదైనా దాని శరీరమంతటా వత్తిని వెలిగించే శక్తి ఉంటుంది. అంతా చైతన్యమే అయిన అమ్మకి అవయవాలవంటివారు జీవులూ సమస్త వస్తువులూనూ. 'నేను' అన్న స్ఫురణ గల ఆబ్రహ్మము తన ప్రతీ అవయవము. నా 'నేను' అని అనుకుంటుంది. ఈ పరిమితితో పరిమితమమకారమూ, పరిమిత గుణాలూ, పరిమిత శక్తీ పరిమిత సంకల్పాలూ ఏర్పడతాయి. రాగద్వేషాలతో కూడా

పరిమితి ఏర్పడుతుంది. 'ఏకదేశ మాత్రమైన పరిమితమైన అనురక్తి బంధహేతువే కాని, అన్ని వస్తువుల మీదా, అందఱు వ్యక్తుల మీదా సమానంగా చూపే అనురక్తి దైవీయగుణమే, పరమాత్మ గుణమే అవుతుంది. అయితే పరమాత్మకు కూడా ఈ గుణాలు అన్నీ ఉంటాయా అంటే పరమాత్మకు లేనిది మనకేమీ కలగదు. అయితే పరిమితమైన శక్తిమనదైతే అపరిమితమైన శక్తి పరమాత్మది. మనది పరిమిత జ్ఞానం. పరమాత్మకు అపరిమిత జ్ఞానం. రాగమూ ద్వేషమూ అంతే అపరిమిత ప్రమాణంలో పరమాత్మకు కూడా ఇవీ ఉన్నాయి. అందటినీ ఖండించే వజ్రా యుధాన్ని నేను, మృత్యువును నేను. మోసాలలో జూదాన్ని నేను ప్రయత్నాన్ని నేను అని అన్ని రకాల గుణాలకు, ప్రయత్నాలకూ తానే ఆరకంగా పరమాత్మ చెప్పి ఉన్నారు విభూతి అధ్యాయంలో 'నతదస్తి వినాయత్ స్యాన్మయా భూతం చరాచరం'

కాబట్టి పరమాత్మకు కూడా అన్నిగుణాలూ ఉంటాయనే తాత్పర్యం. మఱైతే పరమాత్మ నిర్గుణుడూ నిర్వికారుడు కదా అంటే. అన్ని గుణాలూ పరమాత్మవే కాబట్టి అతడు నిర్గుణుడు. అన్ని వికారాలూ ఆయనవి కాబట్టి అతడు నిర్వికారుడు.

అమ్మకు రాగము ఉన్నదా అనే ప్రసక్తి వస్తే శ్రీపాద వారి మాటలు

'రాగమూ విరాగమూ ఒకటే ఆవిడకి'

'అదేమిటి'

'మీరిప్పుడడిగితే తట్టింది. "తన కోసము చేసేది రాగమూ ఇంకొకరికోసం చేసేది త్యాగమూ" అన్నారు ఆవిడ.

8. తమ స్త్వజ్ఞానజం విద్ధి మోహనం సర్వదేహినాం।
ప్రమాదాలస్య నిద్రాభి స్తన్నిబధ్నాతి భారత!॥

తా: అర్జునా! అజ్ఞానంవలన పుట్టేది తమోగుణం. అని తెలుసుకో. సమస్త జీవులను అది మోహింపజేస్తుంది, ప్రమాదం, ఆలస్యం, నిద్ర అనే వాటితో అది జీవుడిని బంధిస్తున్నది.

వ్యా: పూర్వవ్యాఖ్యాతల ప్రకారం – తమోగుణం ఎక్కువగా ఉన్న వ్యక్తి శరీరమే ఆత్మ అనుకుంటాడు. శరీరసుఖమే సుఖమనుకుంటాడు. శరీర దుఃఖమే దుఃఖము అతనికి. మఱపు మాంద్యం నిద్ర అనే గుణాలు అతనికి ప్రియములై ఉంటాయి. చెప్పిన సంగతి, జటిగిన సంగతి ఇట్టే మఱచిపోయి పరాకుగా దేహంలోని వేడి ఎలా చేయిస్తే అలా చేస్తాడు. మన్ను దిన్న పాములాగా హెచ్చరిక లేకుండా

ఉంటాడు. అతనికి మంచమే మహాసుఖస్థానం. నిద్రయే నిర్వాణంగా ఉంటుంది. ఈ గుణాలు జీవుడిని బంధించి ఉంచుతాయి ఇదీ పూర్వుల మతం.

అయితే ఈ తామస ప్రకృతి సృష్టిలో భాగం కదా? దీన్ని ఎవరు నిర్మించారు? భగవంతుడు నిర్మించినవి కావా త్రిగుణాలూ? మరి ఇది జీవుడికి ప్రతిబంధకంగా ఉండేలాగా పరమాత్మ ఎందుకు నిర్మించాడు. అనే ప్రశ్నలను ఆలోచిస్తే ఇందులో మన ఇష్టానిష్టాల తీవ్రతే సత్యదర్శనానికి అడ్డుగా ఉన్నట్లు తెలిసిపోతుంది. సత్వ గుణమూ జీవికి బంధకారణమే అన్నాడు. రజోగుణమూ బంధకారణమే అన్నాడు. తమో గుణమూ బంధకారణమే అన్నాడు. గీతా కారుని తరపు నుంచి ఈ మూడింటి విషయంలో పారమార్థిక దృష్ట్యా భేదం వాటి వాటి గుణస్వరూపాలతోనే ఉంది కాని బంధకాలు కావడంలో లేదు. జీవిని బంధించి ఉంచడంలో మూడూ శిక్షణలే; శిక్షణ కూడా రక్షణే అనే భావంతో దైవం జీవులకు వాళ్ల వాళ్ళ అవసరాల ననుస రించి దేహాలను పరిసరాలను సమకూరుస్తుంటాడు. చంద్రమండలానికి ఎగిరి పోయే రాకెట్టు నిర్మించడానికి నేలమీది వాతావరణంలో తిరిగే కారుకు వాడిన ఇనుపరేకులు పనికిరావు. సెకండుకు అంటే కన్ను మూసి కన్ను తెరిచే లోపల భారతదేశంలో బయలుదేరిన రాకెట్టు అమెరికాలో ఉంటుంది. ఇంతవేగంతో ప్రయాణం చేసేటప్పుడు చుట్టూ ఉండే వాయువు ఒరపిడివల్ల పుట్టిన వేడికి ఆ రాకెట్టు పైరేకులు కొలిమిలోని ఇనుంలాగా ఎఱ్ఱగా కాలిపోయి కరిగిపోతాయి. కాబట్టి అవి అలా కరగకుండా ఉండాలంటే తీవ్రమైన ఉష్ణోగ్రతను ఓర్చుకోగల లోహపురేకులు రాకెట్టు శరీర నిర్మాణానికి తప్పని సరిగా కావలసి వస్తాయి. అలాంటిదే తామసగుణం కూడాను. పరమాత్మ ఆ జీవికి ఇయ్య సంకల్పించిన పరీక్షలకు తగిన పరిసరాలను శరీరాన్ని అతనికి సమకూర్చుతాడు. అలాంటి శరీరం వాడికే ఎందుకివ్వాలి ఇంకోడి కెందుకివ్వలేదు అనే ప్రశ్న గంగానది హిమాలయాల నుండి క్రిందికే ఎందుకు ప్రవహించాలి పైకెందుకు ప్రవహించరాదూ అన్నట్లుం టుంది. అనాది, అనంత, అఖండశబ్దాలలోని పలుకును తర్కించేత ఎలా సాధించ లేక అవి ప్రమాణాలుగా ఎలాగా స్వీకరిస్తామో అలాగే సృష్టి వ్యవహారాలైనా సరే, మనుష్యుడి మనో వ్యాపారాలైనా సరే, ఇచ్ఛాహంకార ద్వేష ప్రపంచకములోనైనా సరే, పరమాత్మ యొక్క సంకల్పమూ, అనుగ్రహమూ, నియామకత్వమూ ఈ మూడు సిద్ధసత్యాలుగా మనం అంగీకరించవలసి ఉంటుంది. ఏదో ప్రయోజనం లేకుండా పెద్దపులి, సింహం, తిమింగలం, తేలూ, పామూ, ఇవి సృష్టిలో ఉండవు. అలాగే నిద్రా ఆలస్య ప్రమాదాలు కూడాను ఇవి కూడా పరమాత్మ ప్రసాదాలే.

సర్వమూ నాదేనంటున్నాను... కొడుకు మంచివాడుగానీ, చెడువాడుగానీ, కుష్టువాడుగానీ, కురూపిగానీ, ఎటువంటి వాడైనా వాడి గుణం మారినా తల్లిని తిట్టినా ఏమి చేసినా మారనిదే మాతృత్వం. ఎట్లా ఉందంటే మీరు ఇసుక దిబ్బలమీద ఆడుకుని బురదలో దిగినా, ఇంటికి వచ్చినప్పుడు హాయిగా నీళ్ళుపోసి అన్నం పెట్టే పరిస్థితి. ఆ పరిస్థితి ఏర్పడడమే. తన్నంటూ మరచిపోయి, తనకే బాధ్యతా లేదని అనుకోవడమే. అంతకంటే కావలసినదేమున్నది? వాడి హాయి ఏదో సమాధిలో కాస్సేపు కూర్చుని దిగివచ్చిన వాడికి కూడా లేదు" అమ్మ.

పర్వత ధర్మాన్ని స్థాపించడానికి పరమాత్మ పర్వతంగా అవతరించినట్లే. తామ సధర్మాన్ని స్థాపించడానికి కూడా పరమాత్మ తామస గుణంగా అవతరిస్తాడు. అంతే కాని తామసంలో బ్రహ్మలేదని కాదు.

'అన్నం బ్రహ్మమయితే అశుద్ధమో' అన్నది అమ్మ.

9. సత్త్వం సుఖే సంజయతి రజః కర్మణి భారత!।
జ్ఞాన మావృత్య తు తమః ప్రమాదే సంజయత్యుత॥

తా: అర్జునా! సత్త్వగుణం సుఖంలో జీవుణ్ణి లగ్నం చేస్తుంది. రజోగుణం కర్మలలో లగ్నం చేస్తుంది. తమోగుణం జ్ఞానాన్ని ఆవరించి ఉండి ప్రమాదంలో లగ్నం చేస్తుంది.

వ్యా: ప్రమాదం అంటే కర్మలు చేయకుండా కూర్చోవాలనే బుద్ధి. అలాంటి బుద్ధితో చురుకుతనం ఉండదు. సోమరితనం అబ్బుతుంది దానివల్ల. అదే తామస భావం అంటారు. రజోగుణం ఉన్నవాడు చురుకుగా పనులు చేస్తుంటాడు. ఊరికే ఒక్కక్షణం విశ్రాంతిగా కూర్చోలేడు. వాడికి ఎప్పుడూ ఏదో చెయ్యాలి ఏదో చెయ్యాలి అని ఆతురత ఎక్కువగా ఉంటుంది. అయ్యో జీవితం వ్యర్థమై పోతున్నదే. ఏమి సాధించినట్లు ఈ జీవితంలో ఐశ్వర్యమా అబ్బలేదు. యశస్సారాలేదు. గుళ్ళూ గోపు రాలు కట్టించలేదు. నావలన పది మంది బతుకుతారని ఆశించినా అదీ జరగలేదు. బ్రతుకు అస్తమించకపూర్వమే ఏదో చెయ్యాలి. అని అన్నం తినడానికి కూర్చుని అన్నం తినే సమయం కూడా అన్నం తినడటంలో వ్యర్థమైపోతున్నదని అస్తమానం విచారిస్తుంటాడు. తమస్సు ఎక్కువగా ఉన్నవాడికి దైహికమైన సుఖబుద్ధి బంధం ఔతుంది. సత్త్వగుణం ఎక్కువగా ఉండే వాడికి ఆత్మజ్ఞానం పొందాలనీ, ఆ సుఖం వల్ల మనస్సులోని భేదరూపమైన అశాంతి తొలగిపోవాలనీ శాంతిమీద ఆసక్తి ఉంటుంది. దాని కోసం భగవచ్చింతనం, భగవత్కైంకర్యం. భగవత్కర్మలు చేస్తూ

ఉంటాడు. పఠనపాఠనకీర్తనయమనియమాది ధారణ పూజా విధానాలలో మగ్నుడై, ఇంటి దగ్గఱ పురాణకాలక్షేపాలూ, భజనలు, వ్రతాలూ ఇలాంటివి జరిపించి నలుగురిని పిలిచివారితో భగవద్గోష్టి కలుపుతూ, దానాలుచేస్తూ దేవాలయ పాఠశాల వైద్యాలయాది లోకోపకారకాలైన నిర్మాణాదు లను చేస్తూ సుఖాన్ని వెదుక్కుంటూ ఉంటాడు. ఈ మూడు ప్రవృత్తులూ భగవ ప్రసాదితాలే అని తెలుసుకోవాలి. కాని ఏ దేహంతోనూ ఒకే ఒక సత్త్వగుణంగాని ఒకే ఒక రజోగుణంగాని, ఒకే ఒక తమోగుణం గాని ఇతర గుణాల సంపర్కం లేకుండా నెలకొని ఉండదు. ప్రతి దేహంతోనూ ఈ మూడు గుణాలూ, సమ్మిళి తములైయే ఉంటాయి. ఏ గుణం పాలు ఆ మేళనంలో అధికంగా ఉంటే ఆ గుణం తాలూకు ప్రభావం ఆ జీవితం మీద ఎక్కువగా ఉంటుంది.

10. రజస్తమ శ్చాభిభూయ సత్త్వం భవతి భారత!।
రజ స్సత్వం తమ శ్చైవ తమ స్సత్వం రజస్తథా॥

తా: అర్జునా! ఒకొక్కప్పుడు రజస్తమస్సులకంటె సత్వము జీవికి అధికంగా ఉంటుంది. ఒకొక్కప్పుడు రజస్సత్వాలకంటె తమస్తే ఎక్కువౌతుంది. ఒకొక్కప్పుడు తమస్సత్వాలకంటె రజస్సే ఎక్కువగా ఉంటుంది.

వ్యా: ఈ మూడు గుణాల శక్తులను ఒకదానితో మఱొక దాన్ని పోల్చి వాటి తారతమ్యాన్ని నిర్ణయించడానికి వీలులేదు. ఒక గుణం ఆవహించి ఉన్నది కదా అని ఇంకో గుణం అక్కడ చేరడానికి అభ్యంతరం ఉండదు. అసలు ఈ సమ్మేళనం లోనే ఉన్నదేమో సృష్టి యొక్క అనంత భిన్నత్వం, అనంతమైన అభిన్నత్వంతో సహా 1, 2, 3, 4, 5, 6, 7, 8, 9, 0 అంకెలు ఎన్ని రకాలుగా పల్టీలు కొట్టవచ్చో ఆలో చించండి. గుణకారం, భాగారం, సంకలనం. వ్యవకలనం, క్రమభిన్నం, అపక్రమ భిన్నం ధనమూల్యం, ఋణమూల్యం - వాటి పల్టీలక్రమాన్ని అనుసరించి వాటి విలువల భేదం కూడా అనంతం కదా! అలా ఉండే పద్ధతిలో 1 = 1000 లేక 1000 min అని ఒక స్కేలును కూడా పెట్టామనుకోండి. దానిలోని అనంతత్వం ఎంత దాగా సాగిపోయిందో ఆలోచించండి. అలాంటిదే ఈ గుణాల పల్టీలతో వచ్చే అనులోమ విలోమ ఫలితాలు కూడా. సత్వగుణం ఉండడానికి కావలసిన లక్షణాలను, రజోగుణ లక్షణాలను, తమోగుణ లక్షణాలను, మనోవృత్తులను, జ్ఞానము, దానము, ధృతి అనే లక్షణాలను వేర్వేఱుగా పరమాత్మ సెలవిచ్చి ఉన్నారు. ఇన్నిన్ని అంగోపాంగాలతో ఈ సమ్మేళన క్రమం జరుగుతూ ఉండగా, ఎవడు

సత్త్వగుణ సంపన్నుడో, ఎవరు రజోగుణ సంపన్నుడో ఎవడు తమోగుణ సంపన్నుడో ఎలా చెప్పడం అని ప్రశ్నరావచ్చు.

11. సర్వద్వారేషు దేహేஉస్మిన్ ప్రకాశ ఉపజాయతే।
జ్ఞానం యదా తదా విద్యా ద్వివృద్ధం సత్త్వ మిత్యుత॥

తా: ఎప్పుడైతే ఈ దేహం యొక్క సర్వద్వారాలలోను ఆత్మ ప్రకాశరూపమైన జ్ఞానం ప్రకాశిస్తుందో అప్పుడు ఆ దేహంలో సత్త్వగుణం వృద్ధి చెందిందని తెలుసుకోవాలి.

వ్యా: ఇలా కలగూర గంపలాగా ఉన్న తన ఈ అంతఃకరణ ప్రపంచంలో సత్త్వగుణం విజృంభించిందో, రజోగుణం ప్రకోపించిందో తమోగుణ ప్రసరిస్తున్నదో అనే విషయం ఎలా తెలుస్తుంది. అనే సందేహం తీరడానికి సూచీముఖసూచనగా ఇలా చెబుతున్నారు.

ఈ శరీరం నవద్వారపురి. ఈ ద్వారాలు మంచినీ మకిలనూ స్వీకరించడానికి విసర్జించడానికీ సమానంగా పనిచేస్తాయి. మంచిమాటలాడే నోరే తిట్లను తిడుతుంది. జిలేబీలను తినే నోరే విషాన్నీ తింటుంది. ఒకానొక ప్రైమరీ క్లాసులో కుఱ్ఱాన్ని, నీకు ముక్కెందుకురా అని అడిగాను ఇన్స్పెక్షన్ చేస్తూ 'చీమిడి చీదుకోడాని'కన్నాడు పాపం వాడికి తెలిసినంతవఱకు ముక్కు అందుకే ఉపయోగపడ్డది. ఆ తల్లిశుభ్రం చేస్తూ ఉంటే ఆ అభిప్రాయం వాడిలో అలా పాతుకునిపొయ్యేది కాదేమో, లోపలి ప్రాణ వాయు స్పందనాలని కలిగించి, బయటి ప్రాణవాయువును స్వీకరించడానికి తగిన జాగాను నిశ్వాసం ద్వారా ఊపిరితిత్తులలో కలగడానికి ముక్కు రహదారి అవుతుంది. అలాగే చెవులు పరమేశ్వరుని వార్తలతోబాటు, పరదూషణ, పైశునాదులను వింటుంది. కళ్ళు కూడా అలాగే చెడ్డవాటిని చూడడానికే ఆతురపడుతాయి. కాని ఈ ఆత్మ ప్రతిముఖత్వాన్ని విడిచిపెట్టి ఈ నవద్వారాలూ పరమాత్మ విషయోన్ముఖాలు కాగానే అవి ప్రకాశపూరితాలౌతాయి. ప్రకాశం అంటే ఏమిటి? ఎదుటి వస్తువుని స్పష్టం చేసేది. ప్రకాశం ఎంత స్వచ్ఛంగా, ఎంత తీక్ష్ణంగా ఉంటే అంత నిశితమౌతుంది ఇంద్రియద్వారం, అంత స్పష్టంగా పరమాత్మ సాక్షాత్కారం లభిస్తుంది. నా స్నేహితుడొకడికి కుండలినీ జాగరితమై పరమాత్మ భావోన్ముఖుడై ఉన్నప్పుడు ప్రథమ దశలో చీమకాలు చప్పుడు కూడా ఢంకాశబ్దంలాగా ధ్వనించేది. అమ్మ అదృశ్యంగా ఏ ఇంట్లోకైనా వచ్చారంటే దాఖలా ఆ ఇంట్లో మధురాతి మధురమైన సుగంధాలు అలుముకుంటాయట. ఈ

వాసనలను ముక్కులద్వారా తెలుసుకుని అమ్మ ఆ గదిలోకి వచ్చిపోయారను కుంటారు భక్తులు.

12. లోభః ప్రవృత్తి రారంభః కర్మణా మశమః స్పృహా।
రజ స్యేతాని జాయన్తే వివృద్ధే భరతర్షభ!॥

తా: భరతవంశశ్రేష్ఠుడా! లోభిత్వం, ప్రవృత్తి, కర్మలు ఆచరించడంలో ఆసక్తి, అశమం, అస్పృహ, ఈ గుణాలు మనిషిని ఎప్పుడు ఆవహించి ఉంటాయో ఆ మనిషిలో రజోగుణం ఎక్కువగా ఉంటుంది.

వ్యా: ఇక రాజసగుణం ఎవడిలో ప్రవృద్ధిచెంది ఉంటుందో ఏయే లక్షణాలవల్ల దాన్ని తెలుసుకోవచ్చునో వాటిని పరమాత్మ చెబుతున్నారు.

1. లోభిత్వం అంటే తనది ఇతరులకు ఇవ్వలేకపోవడం. ఇతరులది తనకు కావలెననే ఆరాటం.
2. **ప్రవృత్తి:** ప్రయోజనం లేకుండా ఊరికే తిరుగుతూ తీరిక లేకుండా ఉండడం.
3. **కర్మణామారంభః:** పనులు చేస్తూ ఉండడం.
4. **అశమం:** ఇంద్రియాలకు విశ్రాంతి ఉండకుండా ఉండడం.
5. **స్పృహ:** ఇది కావాలి అది కావాలి అనుకోవడం.

ఈ పైగుణాలు ఎవడిలో ప్రకోపించి ఉంటాయో అతడిలో రజోగుణం వృద్ధి చెంది ఉన్నది గ్రహించాలి.

13. అప్రకాశోఽ ప్రవృత్తిశ్చ ప్రమాదో మోహ ఏవచ।
తమ స్యేతాని జాయన్తే వివృద్ధే కురునందన!॥

తా: కురునందనా! అర్జునా! అప్రకాశం. అప్రవృత్తీ, ప్రమాదం, మోహం ఇవి అన్నీ పుట్టినవాడిలో తమస్సు వృద్ధి చెంది ఉన్నదని తెలుసుకోవాలి.

వ్యా: 1. అప్రకాశం: జ్ఞానసంకోచం

2. అప్రవృత్తి: చలనరాహిత్యం

3. ప్రమాదం: అలసత్వం

4. మోహం: జ్ఞానవిపర్యయం,

పైనాలుగింటినీ తమస్సు వృద్ధి చెందుతున్నందుకు ఎఱ్ఱజెండాలుగా తెలుసు కోవాలి. పది మాటలు చెబితే వాడి బుద్ధికి ఒక మాటే లేక అందులో సగమే బుద్ధికి

పట్టుతుంది. బజారుకు వెళ్ళికూరలుకొని, పోస్టాఫీసులో మనియార్డరు చేసి, ఎలెక్ట్రిక్ బిల్లు కట్టి, తాలూకాఫీసులో పెన్షను ఫారం తీసుకుని రా అని చెబితే వాడు బజారుకు వెళ్ళివచ్చి. ఏం కొనుక్కురమ్మన్నావమ్మా అని అడుగుతాడు. ఒరేయి స్కూలు టైమైంది లేవరా! అంటే ఒళ్ళు బద్ధకంగా ఉంది లేవనియ్యడంలేదంటాడు. ఒరే పురుగో పామో వస్తున్నది లేవరా అంటే. దాని దారినదిపోతుందిలే నేను లేవడమెందుకనుకుంటాడు వస్తువు యొక్క సత్యస్వరూపం వాడికి కనబడదు. సాయంత్రం నిద్ర నుంచి లేచి తెల్లవారిందనుకుని పళ్ళుదోముకుంటాడు. ఇలాంటి వాడిలో తమస్సు ఎక్కువగా ఉంటుంది అని పరమాత్మ సెలవిచ్చారు.

14. యదా సత్త్వే ప్రవృద్ధే తు ప్రలయం యాతి దేహభృత్।
తదోత్తమవిదాం లోకా నమలాన్ ప్రతిపద్యతే॥

తా: సత్వగుణం వృద్ధి చెంది ఉన్న సమయంలో దేహం త్యాగం చేసిన శరీర ధారి, ఉత్తమవిదులైన వారుండే లోకాల్ని పొందుతాడు.

15. రజసి ప్రలయం గత్వా కర్మ సంగిషు జాయతే।
తథా ప్రలీన స్తమసి మూఢయోనిషు జాయతే॥

తా: రజోగుణం వృద్ధి చెంది ఉండగా మరణించిన వాడు కర్మసంగులందు జన్మిస్తాడు. అలాగే తమోగుణం వృద్ధిలో ఉన్నప్పుడు దేహత్యాగం చేసిన వాడు మూఢయోనులందు పుట్టుతున్నాడు.

పైరెండు శ్లోకాలలోను సత్వరజస్తమో గుణాలు వృద్ధి చెంది ఉన్నప్పుడు కాల ధర్మం చెందిన దేహి తిరిగి ఆయా ప్రవృత్తుల కనుగుణమైన జన్మలను మళ్ళీ ఎత్తు తారు అని పరమాత్మ వచనానికర్థంగా అందఱూ చెబుతారు.

వ్యక్తికి బయటనుండే సూర్యచంద్ర గ్రహగతులూ, ఉత్తరాయణ దక్షిణాయ నాలూ, శుక్లపక్ష కృష్ణపక్షాలూ, శీతోష్ణ సుఖదుఃఖాలూ, వ్యక్తికి అంతరంగంలో ఉంటే ఇంద్రియాలూ, అంతరాత్మ, అసహనమూ, సత్వరజస్తమో గుణాలూ ఈ అన్నీ ఆ వ్యక్తి దేహత్యాగం చేసేటప్పుడు అతని మీద ఏయే ప్రత్యేక ప్రభావాన్ని ప్రదర్శిస్తాయి అనే విషయాన్ని గుఱించీ, ఆ ప్రభావ ప్రాబల్యంవల్ల అతనికి ఏయే విధమైన ఉత్తరగతులు, ఉత్తర జన్మలు కలుగుతాయో అన్న విషయాన్ని గూర్చి లోగడ ఎనిమిదో అధ్యాయంలో విపులంగా చర్చించి ఉన్నాము. మళ్ళీ పైశ్లోకాలలో ఈ ప్రసక్తి వచ్చింది. ఇక్కడ కేవలం అంతరంగ వృత్తిలో రజస్సత్వతమో గుణాలు అధి కంగా ఉన్నప్పుడు దేహత్యాగంచేస్తే ఆయా గుణాల ప్రభావం వల్ల అతనికి ఏయే

విధములైన ఉత్తరజన్మలు కలుగుతాయో ఆ విషయం చెప్పబడ్డది. సత్వగుణ గుణ ప్రవృద్ధి ఉన్నప్పుడు దేహత్యాగం చేస్తే తదనుగుణమై వైదుష్యాచారవ్యవహారాలు కల వంశంలో వాడు పుడతాడని, రాజస ప్రవృత్తి అధికంగా ఉండేటప్పుడు మరణిస్తే కర్మ సంగియైపుతాడనీ తామస ప్రవృత్తితో మరణిస్తే తిర్యగ్యోనులయందు పుడతాడనీ చెప్పబడ్డది. మరణించిన తరువాత జరిగే కార్యకలాపాన్ని గూర్చి అమ్మ ఇలా చెప్పింది.

'ప్రాణం ఎట్లా పోతుందమ్మా, ఆక్షణంలో ఏమౌతుంది అని ఎవరో అడగ్గా 'ఏమౌతుంది? వాయువు వాయువులో కలుస్తుంది అది ఒక్కసారిగా శరీరంలో నుంచి పోయినట్లుండదు. ఎక్కడకక్కడ అంతా అణిగినట్లు అనిపిస్తుంది. ఆ క్రియ దగ్గరుండి చూస్తున్నా అర్థంకాదు. అంతే పువ్వు వికసిస్తున్నప్పుడు నువ్వు రెండు కళ్ళు గ్రుచ్చిచూసినా అది ఎట్లా వికసిస్తుందో నీకు అర్థం కాదు, వికసించక ముందు, వికసించిన తర్వాతే చూడగలవు. ఇదీ అంతే. వెన్నకరిగిపోయి నట్లే పంచభూత మయమైన శరీరం కరిగిపోయి జలధాతువులల్లో జలధాతువులు, భూధాతువుల్లో భూధాతువులు, వాయుధాతువుల్లో వాయుధాతువులు, తేజస్సులో తేజస్సు, ఆకాశంలో ఆకాశం లీనమైపోతుంది, అంతః కరణ ప్రవృత్తులను ప్రేరేపించే పంచభూత ధాతువుల్లో ఆ వ్యక్తి తాలూకు అంతఃకరణ ప్రవృత్తులు ఆయా విశ్వనిధులతో కలిసి పోతాయి. ఆయా నిధులు ఆహారంగా కలజీవులు మళ్ళీ ఆయా ప్రవృత్తులను తను గతంగా చేసుకుని ఆ విధంగా వాటిని హరింపజేస్తాయి. అంతేకాని ఒకానొక జీవుడు ఈ వాసనలనన్నింటిని మోసుకునిపోయి ఇంకో శరీరంలో ప్రవేశిస్తాడని అర్థం కాదు, జన్మం అంటే ఏదేహిదైనా జన్మమే. ఏ భావానిదైనా జన్మమే.

16. కర్మణ స్సుకృత స్యాహు స్సాత్వికం నిర్మల ఫలం।
రజస స్తు ఫలం దుఃఖం అజ్ఞానం తమసః ఫలం॥

తా: సాత్త్వికమై మదారాధన రూపమైన పుణ్య కర్మలకు సత్త్వగుణ సంబంధ మను నిర్మలత్వమే ఫలము. రజోగుణ సంబంధమైన కర్మలకు దుఃఖమే ఫలం. తమోగుణ సంబంధమైన కర్మలకు అజ్ఞానమే ఫలం.

వ్యా: నిర్మలత్వం అంటే రజస్తమో మాలిన్యం అంటని సుఖ స్వరూపమైన దుఃఖరహితమైన మనః ప్రసన్నత అని అర్థం. ఎంత డబ్బున్నా, ఎంతజ్ఞానం వైదుష్యము ఉన్నా, ఎంత బడాయి గర్వం, దంభం ఉన్నా ఈ ప్రసాదగుణం వ్యక్తికి లేకపోతే ఆ ఉన్నదంతా నిష్ఫలమే.

17. సత్వాత్సం జాయతే జ్ఞానం, రజసో లోభ ఏవచ।
ప్రమాద మోహౌ తమసో భవతోఽ జ్ఞాన మేవ చ॥

తా: సత్వగుణంవల్ల జ్ఞానం బాగా పుడుతుంది. రజోగుణంవల్ల లోభం పుడుతుంది. తమోగుణంవల్ల ప్రమాదమూ, మోహమూ, అజ్ఞానమూ కలుగుతాయి.

18. ఊర్ధ్వం గచ్ఛన్తి సత్వస్థాః మధ్యే తిష్టంతి రాజసాః।
జఘన్య గుణ వృత్తస్థాః అథో గచ్ఛన్తి తామసాః॥

తా: సత్వగుణం కలవారు ఊర్ధ్వగాములౌతారు రజోగుణంకలవారు మధ్యలో ఊగులాడుతూ ఉంటారు. నికృష్టమైన తామసగుణం కలవారు అధోగతిని పొందుతారు.

వ్యా: అగ్ని ఎప్పుడూ ఊర్ధ్వముఖంగానే ఉద్గమిస్తుంది. బరువైన వాయువులు మధ్యస్తరాల్లోనే నిండి నిలకడగా ఉంటాయి. పృథ్వీపదార్థం క్రిందనే దిగబడి ఉంటుంది. ఇది భూమిని అంతరాళాన్ని కేవలం సమతలాలుగా తీసుకుంటే కనపడే చిత్రం. కాని గోళాకారమైన మనభూమి సూర్యకుటుంబంలోనిత్యమూ తిరిగే తక్కిన గ్రహాలతోబాటు తానూ ఒకటిగా తిరుగుతూ ఉన్నదనే మాట మనసులో ప్రత్యక్షమయ్యేసరికి, ఎక్కడికక్కడే అది ఊర్ధ్వం. ఎక్కడి కక్కడే అది మధ్యం, ఎక్కడికక్కడే అది అధోలోకం అవుతుంది. ఫలితంగా ఊర్ధ్వమధ్యాథోరహితమైన ఒక నిత్యవికీర్యమాణమైన అవ్యక్త ప్రపంచం మన ఎదుట ప్రత్యక్షమౌతుంది. ఆ బృహత్ప్రపంచంలో ఒక క్షణం క్రిందట అధోలోకంగా ఉన్నది ఇంకో క్షణంలో ఊర్ధ్వలోకంగా మారిపోతూ ఉంటుంది. ఊర్ధ్వలోకంగా ఉన్నది అధోలోకంగా మారుతుంటుంది. మధ్యం ఊర్ధ్వం మధ్యమూ అవుతుంది. కాబట్టి నిత్యనిర్వికార స్థితి మనకు ఎక్కడా కనిపించదు. కాని ఈ నాటకాన్నంతటినీ ఒక్క పొరపాటు లేకుండా జరుపుతూ ఉండే విశ్వకర్త నియామక సూత్రం వీటి అన్నిటి వెనుకా మనం గుర్తిస్తాం. అదే భగవంతుడు, సర్వశక్తిమంతుడైన పరమాత్మ అనుకుంటాం. నిజానికి దేవలోకాలు అందఱూ అనుకునేంత సుఖలోకాలా అంటే, కాదనితోస్తుంది. మనకు పంచమహాపాతకాలుగా విధించబడిన వాటిని చెయ్యని దేవప్రకృతి లేదు. మనకు రజస్తమోగుణాలను వృద్ధిచేసే మనోవృత్తులుగా చెప్పబడ్డ లోభక్రోధకామాది గుణాలులేని దేవప్రకృతి కనిపించదు. పురాణాలను అవజ్ఞ చేయడానికి వ్రాసిన మాట కాదిది. సత్యాన్వేషణ బుద్ధితో వ్రాసిన మాటలే. ఈ గుణాలూ వీటి ప్రభావాలు ఎక్కడికక్కడ భగవదనుగ్రహంవల్ల మారుతూ ఉండేవనే గ్రహించదగును.

19. నాన్యం గుణేభ్యః కర్తారం యదా ద్రష్టాఽ నుపశ్యతి।
గుణేభ్యశ్చ పరం వేత్తి మద్భావం సోఽ ధిగచ్ఛతి॥

తా: పరమాత్మ ప్రేరణ గల సత్త్వరజస్తమో గుణాలే తప్ప అన్ని కర్మలకు కర్తవేరొకడు లేడని ఎప్పుడు ఎంచుతాడో, ఏ మనుష్యుడు గుణములతోబాటు గుణ ములకంటె పరుడు అనీ పరమాత్మను గుర్తిస్తాడో అతడు నా భావాన్ని పొందుతాడు.

వ్యా: "ఉన్నదొక్కటే ప్రేరణ, భగవంతుని ప్రేరణ. 'సర్వం ఖల్విదంబ్రహ్మ'. ఆయన చేతులు తప్ప వేరు చేతులులేవు. మన చేతుల్లో లేవు చేతలు. సహస్ర శీర్షసహస్రహస్త సహస్రపాద బ్రహ్మము తన బృహత్సంఖ్యాక రూపాలైన లౌకికుల సంకల్పాలతో విశ్వమహా యంత్రంగా నడుపుకొనిపోతున్నది. నీ మెదడు, నా మెదడు, అందరి మెదడూ నిజానికి ఆయనదే. నీ చేతులతో నా చేతులతో, అన్ని చేతులతో, అన్ని కళలతో, అన్ని గొంతులతో. అన్ని చెవులతో అన్ని రూపాలతో ఆయన ఆడే మహానాటకం నడుస్తున్నది. నీకు నీ భూమికా, నాకు నా భూమికా వచ్చినది ఆయన సంకల్ప ఫలితమే. ఎవరి భూమిక అయిపోతే వారిని ఆయన తనలో చేర్చేసుకుంటాడు. అక్కడికి ఆ పాత్రసరి. ఒకపాత్రము వంటిదే ఇంకొకటి ఉండదు." (పౌలీ ఎలెక్ట్రానులే ఒకదాని వంటిది ఇంకొకటి లేదంటాడు).

కాబట్టి ఈ గుణాలూ, గుణాలవల్ల నడపబడ్డ వ్యక్తీ, ఇవన్నీ పరమాత్మ రూపమే అని తెలుసుకున్నవాడు పరమాత్మలోనే చేరుకుంటాడు,

20. గుణానేతా నతీత్య త్రీన్ దేహే దేహసముద్భవాన్।
జన్మ మృత్యు జరా దుఃఖై ర్విముక్తోఽ మృతమశ్నుతే॥

తా: దేహము నందే పుట్టిన ఈ మూడు గుణాలను అతిక్రమించిన జీవుడు పుట్టుక, చావు, ముసలితనమూ అనే ఈ మూటి నుండి విముక్తుడై అమృతత్వాన్ని పొందుతాడు.

వ్యా: దేహానికి ఉన్న బాధలు మూడు. పుట్టుకతో అది బయటికి వస్తుంది. చావుతో తెరచాటుకుపోతుంది. ఈ రెంటి మధ్య దశలో అది పెరిగి పెరిగి వృద్ధాప్యం వచ్చి క్షీణించి నిలవడానికి పటుత్వం లేనిదై నశించి పోతుంది. ఈ మూడు కలిసిన కూడలికే మర్త్యత్వమని పేరు. పుట్టినవాడికి ముసలితనమూ తప్పదు. చావూ తప్పదు. కాని ఇవన్నీ దృశ్య దేహానికి సంప్రాప్తిస్తున్న వికారాలు. లోపలి ఆత్మకు ముసలితనమూ లేదు. చావూ లేదు. ముసలితనమూ, చావూ వలన భయం, వ్యాకులం, వైకల్యం మనసును కూడా బాధిస్తుంటాయి. సత్త్వ రజ స్తమో గుణాలు

ఈ వైకల్యానికి కారణాలు. ఈగుణాల ప్రభావాన్ని ఏ మనుజుడు నిరోధించి, శమిం పజేసికొని వాటిని అతిక్రమించగలుగుతాడో అతనికి అమృతత్వమే లభిస్తుంది.

లోకంలో ఇంతమంది జనులు కనబడుతున్నారు. అందఱికీ సమానంగా విగ్రహమూ, క్షుత్పిపాసలూ, కామోద్రేకాలు, కర్మాచరణాలూ కనిపిస్తూనే ఉంటాయి. మఱి ఈ గుణాతీతుడు అనే వాడి విలక్షణత్వం ఎలా ఉంటుంది అని అర్జునుడి సంశయం. సత్యాన్వేషి కనుక అర్జునుడు సంశయాలు ఉంచుకుని తెలియకపోయినా తెలిసింది తెలిసింది అని చెప్పే కుర్రాడిలా కాకుండా తన నడవడిని దిద్దుకోడానికే అనండి ఉన్నసంశయాన్ని బయట పెట్టాడు. ఎందుకంటే ఇలాంటి విషయాల్లో సంశయాలు తీర్చగలవాడు పరమాత్మకంటే ఇంకొకరు లేరు కనుక.

'వైకల్యం లేకపోవడమే కైవల్యం' అమ్మ . మరి ఇలా జయించినవాడు మన అందఱికంటే విలక్షణుడై ఉంటాడా?

అర్జున ఉవాచ:

21. కైర్లింగై స్త్రీ న్గుణాన్ ఏతా నతీతో భవతి ప్రభో।
కి మాచారః కథం చైతాన్ త్రీ న్గుణా నతివర్తతే॥

అర్జునుడడిగేడు

ఈ త్రిగుణాలను అతిక్రమించినవాడు ఎలాంటి లక్షణాలు కలిగి ఉంటాడు. వాడి వర్తనం ఎలా ఉంటుంది. అసలు ఈ త్రిగుణాలను అతిక్రమించే మార్గం ఏమిటి? అని అర్జునుడు ప్రశ్నించాడు.

శ్రీ భగవానువాచ

22. ప్రకాశం చ ప్రవృత్తిం చ మోహ మేవ చ పాండవ।
నద్వేష్టి సంప్రవృత్తాని న నివృత్తాని కాంక్షతి॥

భగవానుడు పలికెను.

తా: అర్జునా! గుణాతీతుడు సత్త్వ సంబంధమైన ప్రకాశాన్ని గాని, రజోగుణ సంబంధమైన ప్రవృత్తినిగాని, తమోగుణ సంబంధమైన మోహాన్నిగాని ప్రత్యేకంగా ప్రేమించడు, ద్వేషించడున్నూ. అవి వచ్చి సంప్రాప్తము లైనప్పుడు వైకల్యాన్ని చెందడు. అవి తన్ను విడిచి మరలిపోయినప్పుడు వాటిని తిరిగి కోరడు.

వ్యా: లోగడ చెప్పిన రీతిగా పరమాత్మ జ్ఞానాన్ని మనస్సులో ప్రకాశింపజేసేది సత్వగుణ లక్షణం. ఈ ప్రకాశక గుణం ఉత్పన్నం కాగానే జ్ఞానేంద్రియాలకు

విశేషమైన తీక్ష్ణత్వం అబ్బుతుంది. అతి సూక్ష్మ ధ్వనులను కూడా చెవులు వింటాయి. అతి క్షీణ కాంతిలో కూడా కళ్ళు సూక్ష్మాతి సూక్ష్మాంతరాలను చూడ గలుగుతాయి. చర్మం అతి సున్నితమైన స్పర్శనుగ్రహిస్తుంది. అలాగే నాసిక అతి వ్యగ్రంగా జాజి, మల్లె, సంపెంగ, కస్తూరి, పునుగు, జవ్వాదుల సమ్మిళిత సుగంధం నుంచి ప్రత్యేకమైన సుగంధాన్ని గ్రహించగలుగుతుంది. ఉదాహరణకు కలిసిన వాసన నుండి మల్లె వాసనను ప్రత్యేకంగా విడదీసి ఆనందించగలుగుతుంది. ఈశ్వర ప్రణిధాన రూపమైన శ్రద్ధాప్రేమలు ఉత్కర్షారూపంతో ఆవహించినప్పుడు భక్తునికి ఈ ప్రకాశ గుణం అలవడుతుంది. అన్ని రోమ రంధ్రాలూ ఈ ప్రకాశంతో నిండినట్లుంటాయి.

రాజసగుణం ప్రవృత్తి రూపమైన క్రియాకలాపాన్ని రేకెత్తిస్తుంది. యజ్ఞ యాగాది కర్మలుచేసి పుణ్య సమార్జనం చేసి స్వర్గలోక సుఖాలను చూఱగొనుటకు రజోగుణం వృద్ధిచెందిన మనుష్యుడు ప్రసక్తుడై ఉంటాడు. దీనికి వ్యతిరేకం నివృత్తిమార్గం ప్రవృత్తి అంటే లోక వ్యవహారానికి అభిముఖుడై వర్తించడం. నివృత్తి అంటే లోకవ్యవహారానికి విముఖుడై వర్తించడం – లేక తిరిగిపోవడం. సాధ్యా సాధ్యనుష్ఠానాల వల్ల లోకం నశ్వరమమని తెలిసి నిత్యమైన పరమాత్మ జ్ఞానానికి సాక్షాత్కారానికి ప్రయత్నించడం నివృత్తి. సుఖములపైన ఆశ ఇందులో మిక్కిలి ఉంటుంది.

తామస గుణంవలన పుట్టేది అజ్ఞానం, అజ్ఞానంవలన పుట్టే నిద్రాలస్య మోహాదులు వ్యక్తిలో పాతుకుని పోతాయి. స్వార్థ సుఖాభిలాషతో ఈ వ్యక్తి లోకమే సర్వకాల స్థాయి ఐన సుఖాన్నిస్తుందనీ దేహ సుఖమే నిత్యమైనదనీ, దేహంకంటే ఆత్మలేదనీ విశ్వసించి అలాగే జీవిస్తుంటాడు.

గుణాతీతుడుపై మనోవృత్తులు ఏవి వచ్చి పైకొన్నా వాటివల్ల బంధింపబడడు. అవి తొలిగిపోతే అవి రావాలని కోరుకోడు.

గుణాతీత శబ్దంలో రాజస తామస గుణాలు కూడా ఇమిడే ఉన్నాయి. రాజస తామస గుణాలు వ్యుత్థాన దశలో అతడిని ఆవహించనూ వచ్చు. కాని వాటివల్ల గుణాతీతుడు వికారాలను చెందడు. దీన్నిబట్టి ఆత్మ పదార్థానికి సత్వ రజ స్తమో గుణాల ప్రమేయం సార్వత్రికంగా ఉంటుందనీ తమస్సు అంటే దానికి విరోధం లేదనీ తేలుతుంది. పరమాత్మ దృష్టికి సత్వగుణ ప్రధానుడెంతో తమోగుణ ప్రధానుడూ అంతే.

అమ్మకు అందఱు బిడ్డలు సమానమే.

23. **ఉదాసీనవ దాసీనో గుణై ర్యో న విచాల్యతే।**
గుణా వర్తన్త ఇత్యేవ యోవఙ్ తిష్ఠతి నేంగతే॥

24. **సమ దుఃఖ సుఖ స్వస్థ స్సమ లోష్టాశ్మ కాంచనః।**
తుల్య ప్రియా ప్రియో ధీర స్తుల్య నిందాత్మ సంస్తుతిః

25. **మానావ మానయో స్తుల్య స్తుల్యోమిత్రారి పక్షయోః।**
సర్వారంభ పరిత్యాగీ గుణాతీత స్స ఉచ్యతే॥

తా: గుణముల వికారాలవలన చలించకుండా ఎవడు తటస్థుడిలా ఉంటాడో, ఏ పనులు జరుగుతున్నా పరమాత్మ ప్రేరితములైన గుణములవల్లనే జరుగుతున్నవి కాని నేనుపకరణాన్ని మాత్రాన్నే అని నిశ్చయించుకుని ఉంటాడో, సుఖాలూ, దుఃఖాలూ వచ్చినప్పుడు కూడా ఎవడు స్వస్థుడై సమానభావంతో ఉంటాడో ఎవనికి బంగారంకూడా మట్టిబెడ్డతో సమానంగా ఉంటుందో, ప్రియము అప్రియము అనే గుణాలు ఎవరియందు తుల్యములై భేదభావం లేకుండా ఉంటాయో, నిందాస్తుతుల యందు ఎవడు సమభావంతోనే నిర్వికారుడై ఉంటాడో బుద్ధిమంతుడై ఎవడుంటాడో, మానావమాన భేదంకాని, శత్రుమిత్రులయందు పక్షపాతంగాని ఎవడికి ఉండదో, దేహిత్వ ప్రయుక్తాలైన సర్వకర్మలూ పరమేశ్వర ప్రేరితాలే అనుకొని ఎవడు తనవి కానివిగా విసర్జిస్తాడో, అతడు గుణాతీతుడని చెప్పబడతాడు.

ఉదాసీనుడంటే చుట్టూ ఏం జరుగుతున్నా తనకు పట్టనట్లు తటస్థంగా కూర్చోవడం. అన్నీ తానే చేస్తున్నా చేయిస్తున్నా అంటీ ముట్టనట్లు ఊరుకోవడం. అమ్మ అన్నీ చేస్తున్నట్లే అనిపిస్తుంది.

కాని తానేమీ చేయడంలేదనీ, తనకేమీ తెలీదనీ అంటుంది. నాకేమీ తెలీదని అంటూనే నేనేమీ చేయలేనని అంటూనే ఆధ్యాత్మిక సందేశంతోపాటు లౌకిక కామనలకు ఆకారమూ ఇస్తున్నది.

గుణాల వికారాలవల్ల చలించకుండా ఉండడం అమ్మ చేస్తున్న ప్రతి పనిలోను ద్యోతకమవుతుంది. మరణాలు శుభకార్యాలు అమ్మ అధ్యక్షతలో అమ్మ చేతిమీదిగా ఒకేసారి జరుగుతూ ఉంటాయి.

పరమాత్మ ప్రేరణగల గుణాలే అన్ని చేస్తుంటాయి. చేసేవాడూ చేయించేవాడూ పరమాత్మే.

సమదుఃఖ సుఖస్వస్థః= 'సుఖంలాగే దుఃఖం కూడా అమ్మ ప్రసాదమే' అనుకోమంటుంది అమ్మ. అలాగే హైమ పోయినప్పుడు తనూ నిర్లిప్తంగా అనుభవించింది. దోమకుట్టితే దోమ ముద్దు పెట్టుకున్నదనుకున్నది అమ్మ.

సమలోష్టాశ్మ కాంచనః - మెళ్ళో బంగారు గొలుసును తీసుకోడానికి కష్టపడుతున్న దొంగకు చేతులు నొప్పులు పుట్టాయి. నేనే తీసి ఇస్తానని గొలుసు ఇచ్చింది అమ్మ.

తుల్య ప్రియాప్రియాః = బిడ్డలు అమ్మను నిందించి నావాళ్ళను

దిద్దుబాటు చేయడం తల్లి ధర్మమనుకుంటుంది అమ్మ.

ధీరః= అంత సహజ పాండిత్యానికి మఠాధిపతులూ కొమ్ములు దిరిగిన పండితులూ విస్తుబోయారు. 'అనుభవం శాస్త్రాన్నిస్తుందిగాని శాస్త్రం అనుభవాన్ని ఇవ్వదు' అమ్మ.

తుల్య నిందాత్మ సంస్తుతిః= అమ్మ నిందించే వాళ్ళు ఆరకంగా అమ్మను తలుచుకుంటారు కనుక అది స్తుతే నంటుంది.

మా నావమానవయోస్తుల్యః - అమ్మను ఒకరు గౌరవించారనీ వేఱొకరు అవమానించారనే ప్రసక్తే లేదు.

తుల్యమిత్రారి పక్షయోః - శత్రుత్వంతో సాధించినా అమ్మ బిడ్డకు సుగతే ఇస్తానంటుంది.

సర్వారంభపరిత్యాగీ - తానై అమ్మ యేపనీ చెయ్యదు. జరిగే పనులను కాదనదు.

ఈ గుణాలన్నిటినీ అతిక్రమించి ఉన్నది కనుకనే అమ్మ గుణాతీత అయి ఉన్నది. మఱి ఈ గుణాతీతుడు కావాలంటే ఉపాయమేమిటి? ఈ ప్రశ్నకు జవాబు రాబోయే శ్లోకం.

26. మాం చ యోఽ వ్యభిచారేణ, భక్తి యోగేన సేవతే।
సగుణా న్సమతీ త్యైతాన్ బ్రహ్మభూయాయ కల్పతే॥

ఎవడు అవ్యభిచారిణి అయిన భక్తి ప్రపత్తితో నన్ను సేవిస్తాడో అతడు ఈ గుణాలను లెస్సగా అతిక్రమించి బ్రహ్మాభావం దాల్చడానికి సమర్థుడౌతాడు.

అవ్యభిచారిణి = అంటే ఆత్మేతర భావం లేకుండా ఉండడం. సర్వకర్తృత్వ, సర్వాధారత్వ, సర్వశక్తిమత్వ, సర్వ నియంతృత్వ శక్తులు ఆ పరమాత్మకు తప్ప,

వేఱొకరికి లేవని మనసా విశ్వసించి, అన్ని దేవతలనూ, ఇష్ట దైవాలనూ ఆత్మలోనే చూచే ప్రవృత్తిపేరు అవ్యభిచారభక్తి. అటువంటి భక్తి ఎవడికి ఉంటుందో గుణాలను అతడు అతిక్రమించి బ్రహ్మభావం దాల్చడానికి సామర్థ్యం కలవాడౌతాడని పైశ్లోకం భావం.

అమ్మ పరాదేవత, పరాశక్తి అని విశ్వసించి చేసే ప్రతికైంకర్యంలోనూ, ఆమె విశిష్ట రూపధ్యాస రూపిస్తూనే ఉంటుంది. అందఱు ఆరాధ్య దేవతలూ ఆ ఆదిశక్తి బిడ్డలే కనుక ఈ విశ్వ మాతృత్వంలో వాళ్ళందఱూ .... ఆకారాలు దాల్చి కన్పిస్తుంటారు. అదిష్ఠానాన్నే చేరుకున్న భక్తుని మనస్సు ఇక ఏడో మైలురాయి మీద ఉండదు కదా.

పూర్ణత్వం వంటబట్టించడానికి ఆయమ్మ చెప్పేదేమిటి అన్న ప్రశ్నకు శ్రీపాద వారిలా అంటారు.

అన్ని రూపాలూ నామాలూ సంకల్పాలూ క్రియలూ ఆ శక్తివేననీ, నువ్వు ఏ నామం అర్చించినా దానికే చెందుతుందనీ. 'మీరు నా యిష్టదైవం లాగా కన్పించారమ్మా' అన్నాడు ఒకాయన.'నీ ఇష్టదైవమే నాలాగా కన్పించాడు నాన్నా' అన్నారు అమ్మ.

బ్రహ్మభూయాయ అనే మాటకు బ్రహ్మంగా కావడానికని, అంటే జీవన్ముక్తుడు కావడానికని శంకరులూ, బ్రహ్మభావాన్ని పొందడానికని రామానుజలూ వ్యాఖ్యానించారు. మనసా వాచా కర్మేణ ముక్తిని కావాలనుకోడమే ముక్తిఅని అమ్మ నిర్వచనం.

27. బ్రహ్మణో హి ప్రతిష్ఠాఽ హ మమృత స్యావ్యయస్యచ।
శాశ్వతస్య చ ధర్మస్య సుఖస్యై కాన్తికస్యచ॥

తా: నాశరహితమూ, అవ్యయమూ అయిన బ్రహ్మమునకు, శాశ్వతమైన ధర్మానికి, చలించని మోక్షానికీ నేను ప్రధాన స్థానమైన వాడిని.

"అమ్మ తత్, సత్ అనరు. సత్ పదార్థమన్నది విశేష రూపంతో జగత్తు కాకుండా వేరే ఈ జగత్తుకు వెలిగా ఎక్కడో ఉన్నదనరు. 'ఇదంతనూ' అంటారు. మారుతూన్నంత మాత్రాన 'దీనికి' అంతకీ కుక్క ముట్టుకుపోలేదూ. 'శరీరం ఆత్మ కాక పోలేదూ' ఉన్నదంతా మారుతూ కూడా ఉన్న ఆత్మే నంటారు. ఆది శంకరులు నిర్వాణషట్కంలో "అహం భోజనం నైవ భోజ్యం న భోక్తా, చిదానందరూపః శివోహం శివోహం" అన్నారు. తద్దినాలు పెడ్తూ, 'అన్నం బ్రహ్మ, భోక్త బ్రహ్మ, అహంచ బ్రహ్మ' అంటాడు గృహస్థు. ఈ రెండు వాక్యాలకూ తత్వ విరోధం లేదా?

ఆ సంగతి గట్టిగా చెప్పలేదు మనవారు. చెప్పనంత కాలమూ 'తీర్థానికి తీర్థమూ, ప్రసాదానికి ప్రసాదమూ'నే. "నేతి" అంటే మఱి 'న ఇతి' ఏదీ? అమ్మ అన్నారు. 'ఇదికాదు ఇదికాదు అంటూ అంతా అదే ననడం' అని. 'సర్వం ఖల్విదం బ్రహ్మని 'సత్ అసత్' అని రెండు ముక్కలు చేశారు. అమ్మ అన్న 'సహజంలోంచి విశేషం విడదీసుకునే వఱకే చెప్తే, అంతా అయిన సహజం కంటే విడదీసుకున్న విశేషమే ముఖ్యమనిపిస్తుంది. ఆ విశేషాన్ని సహజం చేసుకోవడముతో గదా 'సర్వం ఖల్విదం బ్రహ్మ' యోగం పూర్తి అయ్యేది.

ఫలితార్థం ఏమిటంటే సగుణ బ్రహ్మమే నిర్గుణ బ్రహ్మం నిర్గుణ బ్రహ్మమే సగుణ బ్రహ్మని కాధారం. ఇదీ బ్రహ్మమంటే.

ధర్మం అంటే శాశ్వతంగా ఉండేదే ధర్మం. అగ్నికి కాల్చడం ధర్మంలాగానే, సూర్యుడు ప్రకాశించడం ధర్మం లాగానే, గోళాలొక దానిమీద ఒకటి పడిపోకుండా ఏదో శక్తి నడుపుతున్న ధృతి అనే ధారణా - ధర్మంలాగానే మాతృధర్మం కూడా శాశ్వతమైన ధర్మం. ఇలా ఏ పరిస్థితిలోను ఎక్కడికి వెళ్ళినా దేశకాల వ్యవస్థల మార్పునుబట్టి మారని ధర్మం శాశ్వత ధర్మం. 'సత్యం వద, ధర్మం చర', నానృతం బ్రూయాత్' అని చెప్పి 'ప్రియం బ్రూయాత్', 'హితం బ్రూయాత్' అని కూడా ధర్మానికి సంస్కారం చేశారు. అలాంటివి శాశ్వత ధర్మాలు ఎలా ఔతయ్యో తెలియదు. మృత్యువు నిత్య సత్యమైన ధర్మం. అది యెక్కడకు వెళ్ళినా మారేది కాదు. సత్యమూ, న్యాయమూ, అన్ని అగ్ని ధర్మాలులాగా ఉన్నవే కాని అధర్మాలు కావు. ఆధ్యాత్మిక ధర్మాలు, రోజూ మారిపోయే హిందూ లా, ఇండియన్ పీనల్ కోడ్ లాంటివిగా ఉండకూడదు. లౌకికంగా సమాజం కోసం చెప్పబడిన ధర్మాలను ఆధ్యాత్మిక ధర్మాలతో సాటి చెప్పడం యుక్తంకాదు. ధర్మాలంటే శాశ్వతంగా మార్పులేని ధర్మాలనే అర్థం. కాబట్టి ధర్మ నిర్వచనం చేయాల్సి వస్తే ఈ అన్ని విషయాలూ చక్కగా విచారించవలసి ఉంటుంది.

మూడో విషయం మోక్షం. మనకు కనిపించని ఏవో దేవలోకాలున్నాయనీ నరకాలూ, బ్రహ్మలోకాలు ఉన్నాయని వాటిని చేరుకోడానికి ఇక్కడి లోకాన్ని అంతా విడిచి పెట్టుకుని సన్యసిస్తే తప్ప మోక్షం దొరకదనీ, పూర్వ సిద్ధాంతాలు చెప్తుతాయి. కాని మోక్షసంగి కావడమే మోక్షమని అమ్మ చెబుతుంది. మళ్ళీ పైనుండి క్రిందికి దిగజాఱని మోక్ష కాంక్షయే మోక్షమని అమ్మ మతం.

అమ్మ మాటలకీ భగద్గీతా వ్యాఖ్యానాలకూ ఏమీ తేడా ఉండదు. తేడా అల్లా వ్యాఖ్యానాలలో ఉండే తేడాయే. పూర్వ వ్యాఖ్యాతలు గుర్తించినట్లుగా 'శరీరము,

మనస్సు, రూపము - భావము, మంచి, చెడూ వంటి ద్వంద్వాలను అమ్మ గుర్తిం చదు. ఆ ద్వంద్వాలు కేవలం భ్రమ, భ్రాంతి. జగత్తుకీ మన మనస్సుకీ ఏకత్వాన్ని మనకు చూపించే ప్రయత్నమే ఆమె మాటల్లో, చేతల్లో ఎప్పుడూ కనిపిస్తుంది. పతనమనేది లేదు. ఒక మెట్టు ఎక్కిన తరువాత అది నిజమైన జ్ఞానమైతే మళ్ళీ పోదు.

పునర్జన్మ, కర్మ సిద్ధాంతాలపట్ల అమ్మది 'అలీన' విధానం. అద్వైత సిద్ధి పొందిన వాని దృష్టికి కాలమూ, చావు పుట్టుకలూ కేవలం భ్రమ. ఆ దృష్టికి జన్మ పరంపరలంటూ ఉండవు. కార్య కారణదృష్ట్యా అమ్మ కర్మ సిద్ధాంతాన్ని అంగీక రిస్తుంది. కాని దానికి అంతెక్కడ అని ప్రశ్న. కేవలం కర్మ సిద్ధాంతాన్ని అంటి పెట్టుకుని ఉంటే విముక్తికి మార్గమే కనిపించదు. కారణాంతరమైనదొకటి పై కార్య-కారణ సంబంధంలో, ఒకానొక తరుణంలో జోక్యం కల్పించుకోవడం (Intervention) ద్వారానే విముక్తి సాధ్యం. ఈ 'కారణాంతరమైన దాన్నే దైవకృప' (Divine grace) అంటారు. వ్యక్తిలోని పరిణామ పరిపక్వతా, దైవికమైన 'కారణాంతరమూ', 'తరుణమూ' ఈ మూడింటి సమీకరణమే ముక్తికి ద్వారముగా అమ్మ సెలవిచ్చి ఉన్నారు. అందులో ఏది ప్రధానము? అనే విషయమై ఎన్నోసార్లు ఎంతమందో వాద ప్రతివాదాలు సాగించడం జరిగింది. వైష్ణవుల్లో తెంగలై, వడగలై విభేదానికి ఇదే మూలం. వ్యక్తి పరిపక్వత యోగ్యత ప్రధానమనడాన్ని 'మర్కట కిశోర' న్యాయంగానూ దైవకృప ప్రధానం అనడాన్ని మార్జాల కిశోర న్యాయంగానూ వ్యవహరిస్తారు. అమ్మ ఈ భేదం అర్థంలేని భేదం అన్నది. మూడింటిలో ఏది ప్రధానం అన్న చర్చకు అర్థం లేదు. మూడూ ఒక్క సత్యానికి మూడు ముఖాలుగా ఉన్నప్పుడు, అవి అవినాభావమైన ఏకవిషయంగా ఉన్నప్పుడు, వాటిని విశ్లేషించే ప్రయత్నమే అజ్ఞానానికి చిహ్నంగా భావించాలి'

సంభవామి యుగేయుగే, పే. 23, మాతృశ్రీ 4-67

ఇది శ్రీ మన్మాతృగీతలోని గుణత్రయ విభాగయోగమను చతుర్దశోధ్యాయము

మాతృగీత

పురుషోత్తమ ప్రాప్తి యోగము

పదునైదవ అధ్యాయము

శ్రీ భగవానువాచ

ఊర్ధ్వ మూల మథ శ్శాఖ మశ్వత్థం ప్రాహు రవ్యయమ్।
ఛన్దాంసి యస్య పర్ణాని య స్తం వేద స వేదవిత్॥

భగవంతుడగు శ్రీకృష్ణ పరమాత్మ పలికెను

తా: వేళ్ళు పైకి, కొమ్మలు క్రిందికి కలిగి అవ్యయమై ఉండేదీ, వేదాలే ఆకులుగా కలిగి ఉండేది అయిన అశ్వత్థమనే పేరుగల ఒక చెట్టున్నదని చెప్పుతారే దాన్ని ఎవడైతే తెలుసుకుంటాడో వాడు వేదాన్ని తెలుసుకున్నవాడు.

వ్యా: ఈపురుషోత్తమ ప్రాప్తి యోగం భగవద్గీతలో ఉన్న రెండు చిన్న అధ్యాయాలలో ఒకటి. చాలా చిన్నదయినా చాలా విలువగల అధ్యాయం. జీవితానికి చక్కని పరిణతి కలిగి పురుషుడు ఎలా పురుషోత్తముడు ఔతాడో ఆ విజ్ఞానాన్ని గూర్చి చెప్పేది కాబట్టి దీనికి పురుషోత్తమ ప్రాప్తియోగమని పేరు వచ్చింది. పరిమితమైన మానవ బుద్ధి ఏయే విధాలుగా వికాసం పొంది మాధవ బుద్ధిగా పరిణమిస్తుందో ఆ విషయాన్ని చర్చించుతుంది. భిన్నత్వం ఉండే మనస్తత్వం మానవత్వం. పరిమితమైన మమకారం మానత్వం. వ్యష్టిత్వం మానవత్వం. పొరపాట్లతో కూడిందే మానవత్వం. నేను చేస్తున్నాననుకునేది మానవత్వం. ఎదుటివానిలో మానవత్వాన్ని చూచేది మానవత్వం; ఇటువంటి మానవత్వ లక్షణాల బంధం నుండి విడిబడి మాధవుడుగా మారే క్రమాభివృద్ధిని పరమాత్మ ఇందులో ఉపన్యసిస్తారు. పదమూడవ అధ్యాయంలో పరమాత్మ క్షేత్రక్షేత్రజ్ఞులను గూర్చి చెప్పారు. 14వ అధ్యాయంలో గుణత్రయాల వలన ఏవిధంగా మానవునికి బంధం ఏర్పడుతుందో అదీ చెప్పారు. ఏవిధంగా పరిణామ చక్రంలో ఈ ఆటంకాలను అతిక్రమించి మానవుడు మాధవుడౌతాడో ఇప్పుడు చెప్పుతారు. సత్సంగత్వే నిస్సంగత్వం అబ్బడానికైనా సత్సంగత్వం అబ్బడానికైనా సుకృతలేశాలు ఉండాలి కదా! అది లేకుండా దైవానుగ్రహం ఎలా అబ్బుతుంది? అనుగ్రహం లేక ఏదీ కాదు గదా అని ప్రశ్నలు వేసుకొని, భగవదనుగ్రహం మనం చేసే అన్ని పనులవలనా సంప్రాప్తించకపోయినా ఆ చేసే వాటిలో మనం కొన్ని అనుకోకుండానే చేసిన మంచి పనులుండడంవల్ల, అవి

భగవత్కటాక్ష కారకాలౌతాయని పూర్వ వ్యాఖ్యాతలంటారు. సుకృతాలు యాదృచ్ఛిక, ఆనుషంగిక, ప్రాసంగిక భేదాలతో మూడుగా ఉంటాయి. పోతూ పోతూ దారిలో ఉన్న గాజుపెంకును తీసి అవతల పారేస్తాం. దానివలన ఎవరికో తగలవలసిన గాయం తగలకుండా నివారింపబడుతుంది. ఇది యాదృచ్ఛిక సుకృతం. పక్క ఇల్లు తలుపులు పగలగొట్టి ఇల్లు దోచుకుందామని దొంగ కాచుకుని ఉంటాడు. మన పనిమీద మనం రాత్రి రెండింటిదాకా దొడ్లోనే ఉంటాం. మనం ఉన్నందున దొంగకు ఇంట్లో దూరడానికి అవకాశం దొరకదు. ఇంతలో ఆ ఇంటి యజమాని రానే వస్తాడు. మనం అనుకోకుండానే మనకు తెలీకుండానే ఒక సుకృతం మన ఎక్కౌంటులో జమ అవుతుంది. ఇది ఆనుషంగిక సుకృతం. అలాగే ఏదో దుఃఖ వార్త విని రంగా! రంగా! ఎంతపని జరిగిపోయింది అంటాం. అకారణంగానైనా భగవంతుని స్మరణ చేశాం కనుక ఇంకో సుకృతం మన ఎకౌంటులో ఎక్కుతుంది. ఇది ప్రాసంగికం. ఇటువంటి అనుకోని సుకృతాల వల్ల భగవత్కటాక్షం కలుగుతుందని కర్మసిద్ధాంతుల మతం. కర్మ సిద్ధాంతం కారణ కార్యవాదంమీద ఆధారపడి ఉంది. కనుక భగవత్కటాక్షానికి కూడా ఏదో సుకృతం చేసినది ఉండాలి కాబట్టి అలాంటి సుకృతాత్ములకే మోక్షమూ అనుగ్రహం భుక్తమని వారి సిద్ధాంతం. అయినా కొంతమంది పాపాత్ములకు కూడా ఈ మోక్షం దొరుకుతున్నదనే మాట లోకంలో కననౌతున్నది కదా! అటువంటి సంఘటనలను సమర్థించడానికే ఈ యాదృచ్ఛిక, అనుషంగిక, ప్రాసంగిక సుకృతాలని తోస్తుంది. పురుషోత్తమ ప్రాప్తికి పురుషోత్తముడే తప్ప ఇంకే ఆధారం లేదు. కాని పురుషోత్తముడుగా కావడానికి ఏది ఆటంకంగా ఉన్నదో తెలుసుకోవాలి. ఇంతవఱకున్న అధ్యాయాలలో ముఖ్యంగా క్షేత్ర క్షేత్రజ్ఞ విభాగ యోగంలోను గుణత్రయ విభాగంలోను, ఈ శరీరానికి పరమాత్మకు ఉండే సంబంధం ఏమిటో, ఏవిధంగా ప్రపంచ వ్యవహారాలవల్ల ఈ సంబంధం వ్యక్తికి క్షేమకరంగా లేక హానికరంగా పరిణమిస్తుందో ఆయా విషయాలు బాగా చెప్పి ఉన్నారు. హానికరంగా ప్రాపంచిక వ్యవహారాలు ఉండకుండా ఏంచేస్తే అడ్డంకులు తీరిపోయి పురుషోత్తమ ప్రాప్తి కలుగుతుందో ఆ ఉపాయం వివేచించాలి. దానికోసం ఈ అధ్యాయంలోని మొదటి మూడు శ్లోకాలలో రూపకల్పన చేసి ఈ సంసారాన్ని పరమాత్మ వర్ణిస్తున్నారు.

అశ్వత్థం అంటే రావిచెట్టు. ఆ రావి చెట్టు తలక్రిందులుగా ఉంది. దాని వేళ్ళు పైకి ఉన్నాయి. అన్ని చెట్లకూ వేళ్ళు నేలలో పాతుకుని ఉంటే ఈ అశ్వత్థవృక్షం వేళ్ళు పైకి తన్నుకొని ఆకాశంలోకి వ్యాపించి ఉన్నాయి. వేదాలు దాని ఆకులు. శ్వ

అంటే రేపు త్థ అంటే ఉండేది. అ అంటే కాదు. అంటే అది నిత్య పరిణామశీలి కనుక ఏక్షణానికాక్షమే మారుతూ ఉండేది. ఈ భూమితోపాటు అన్ని గోళాలూ నిత్యమూ పరిభ్రమిస్తూనే ఉన్నాయి. ఇవాళ ఏకాదశి అయితే రేపు ద్వాదశి. ఈ జరిగే మార్పును గ్రాపులో గీతలాగా చంద్రకళలు గుర్తిస్తూనే ఉన్నాయి. ప్రతి రేపునూ అవి గుర్తిస్తున్నాయి. ఒకవిధంగా ఈ చెట్టు రేపులను మాపులను గుర్తించే కాల చిహ్నంగా ఉంది. ఈ మార్పు అవ్యయంగా జరిగిపోతున్నది. గోదావరి నీళ్ళు నిత్యమూ పాఋతుంటాయి. అంటే ప్రవాహం నిత్యం మారుతుంటుంది. రాజమండ్రి రైలు బ్రిడ్జి దగ్గఱ ఒక క్షణంలో నీళ్ళు మఱోక్షణంలో ఉండవు. అందుకనే గోదావరిని ఎవడూ రెండుసార్లు దాటలేడు అంటారు. నావ బయల్దేరేటప్పుడుండే నీళ్ళు నావ తిరిగి వచ్చేసరికి ఉండవు అని అర్థం. - మూలం అనే మాటకు వ్యాకృత నామరూపాలు లేని మూల పదార్థం అని అర్థం. దాన్ని హిరణ్యగర్భుడు, చతుర్ముఖుడు, మహద్బ్రహ్మ అంటారని పూర్వ సంప్రదాయ వ్యాఖ్యలు అంటాయి. ఊర్ధ్వం అంటే ప్రకాశం అని కూడా అర్థం. ప్రకాశానికి మూలస్థానమూ మన భూమికి ఊర్ధ్వంగా ఉండేదీ ఏది? అది సూర్యబింబమే. సూర్యుడికి అశ్వత్థమని కూడా పేరు ఉంది.

ఊర్ధ్వమూలం: కాలంకంటే సూక్ష్మడై, కారణమై, నిత్యమై గొప్పదై, అవ్యక్త మాయాశక్తి విశిష్టమైన బ్రహ్మం. ఊర్ధ్వం అని శంకరులు నిర్వచించారు. కాబట్టి సంసార వృక్షాన్ని ఊర్ధ్వమూలం అన్నారు.

సూర్యబింబం నుంచి వచ్చిన కిరణాలే ఆధారంగా చేసుకుని ఈ భూమి మీద సృష్టి అంతా అవుతున్నది. శాఖోపశాఖలుగా అనంతకోటి భేదాలలో ఈ భూమిమీద వికసించిన చెట్లు, పుట్టలు, కొండలు, క్రిమి కీట, పశుపక్షి మానవ స్వరూపాలూ అన్నీ పుదుతున్నాయి, పెరుగుతున్నాయి, చస్తున్నాయి. ఈ భూమిమీద సృష్టి ఈ చెట్టుకు శాఖలూ ఉపశాఖలూన్నూ. ఈ శాఖలకీ ఉపశాఖలకూ ఆకులకూ జీవ రసాన్ని ఇచ్చేవి సూర్యకిరణాలు. సూర్యకిరణాలు ప్రతి వ్యక్తిపైనా ఊర్ధ్వదిశ నుండే క్రిందికి వాలుతున్నాయి. ఈ సూర్యకిరణాలే ఈ చెట్టుకు వేళ్ళు. ఈ వేళ్ళు ఊర్ధ్వదిశ నుంచి జీవసారాన్ని తీసుకువస్తూ ఈ సృష్టిగా మారిపోతున్నాయి. కాబట్టి ఈ చెట్టు ఊర్ధ్వమూలం కలదైంది.

ఊర్ధ్వం: అంటే విష్ణువు. 'ఊర్ధ్వ పవిత్రో ఆజినీవస్వ మృత మస్మి ద్రవిణం సవర్చసమ్.

'ఊర్ధ్వమూలో ౨ వాక్శాఖ ఏషోశ్వత్థ స్సనాతనః।
ఊర్ధ్వమూల మ వాక్శాఖం వృక్షం యోవేద సంప్రతిః॥

ఉపనిషత్తులు.

అధశ్శాఖం: మహదహంకార తన్మాత్రాదులు కొమ్మలుగా గలదని శంకరులు. భూమియందు నివసించే సకల నరమృగ క్రిమికీటపతంగ స్థావరములు అంతముగా గలది అని రామానుజులు నిర్వచించినారు.

అవ్యయం: అనాద్యనంతమైన దేహాది పరంపరను పుట్టించేది అని శంకరులు, సమ్యక్ జ్ఞానముదయించేదాకా ప్రవాహరూప నిత్యత్వం కలది అని రామానుజులు.

ఛందాంసి: కప్పేవి, సంరక్షించేవి ఛది ఆచ్ఛాదనే అని వ్యుత్పత్తి వేదాలు.

వేదాలు అంటే ఎంత మనకు తెలిసి ఉందో అది వేదం. తెలిసినదే సృష్టి. తెలిసినది తెలివిచేతనే కప్పబడి ఉంది. తెలిసిన దానివెనుక తెలియనిది ఉంది.

మనిషి శరీరంలో కూడా అన్ని దేహ వ్యాపారాలు ఊర్ధ్వమూలాలే. మొదట మస్తిష్కంలో పుట్టిన ఊహలవల్ల శాఖోపశాఖలుగా వ్యాపించిన నరాల మండలాల వల్ల ఈ శరీర వృక్షం కదులుతుంది. పనులు చేస్తుంది. మస్తిష్కంలోని నాలుగు ప్రధాన భాగాలు నాలుగువేదాలు. చేతులూ కాళ్ళూ శాఖలు. మొండెం, చెట్టు, బోదె. మన శరీరం కూడా ఊర్ధ్వమూల మధశ్శా ఖాంచితమే.

సుషుమ్నా నాడి సర్వభూతాంతరాత్మయై సర్వనాడులకుత్పత్తి స్థానమై ఊర్ధ్వ మూలం కలిగి దేవమనుష్య తిర్యగాది అధశ్శాఖలు కలదై, ప్రాణాది వాయు మార్గాల చేత సర్వవ్యాప్తమై జగదుపాదాన కారణమై ఉంటుంది. ఈ విషయాన్నే ఉత్తరగీతలో పరమాత్మ ఇలా చెప్పారు.

'నానా నాడీ ప్రసవకం సర్వ భూతాతంరాత్మని, ఊర్ధ్వమూల మధశ్శాఖం వాయుమార్గేణ సర్వగం'

2. **అధ శ్చోర్ధ్వం ప్రసృతాస్తస్య శాఖా**
గుణ ప్రవృద్ధా విషయ ప్రవాలాః।
అధశ్చ మూలా న్యను సంతతాని
కర్మాను బంధీని మనుష్యలోకే॥

తా: ఆ చెట్టు కొమ్మలు గుణములచే వృద్ధి పొందింపబడినవి. దానికి విషయ ములు అనే ఎఱ్ఱటి చిగుళ్ళున్నాయి అవి క్రిందికి మీదికికూడా వ్యాపించి ఉన్నాయి. దాని వేళ్ళు మనుష్య లోకంలో కూడా కర్మాను బంధంవల్ల ఇంకా బాగా వ్యాపించి ఉన్నాయి.

వ్యా: ఈ చెట్టు శాఖలు క్రిందా మీదా కూడా వ్యాపించి ఉన్నాయి. వేళ్ళు క్రిందకు కూడా వ్యాపించి ఉన్నాయి అని ఈ శ్లోకంలో చెప్పిన మాటలు మొదటి శ్లోకానికి కేవలం విరుద్ధంగా ఉన్నాయి. లేక భేదంగా ఉన్నాయి. ఈ సంసార వృక్షము. సత్వము రజస్సు తమస్సు అనే మూడు గుణాలచేత వృద్ధిచెందుతున్నది. గుణం అనే మాటకు నార అని కూడా అర్థం ఉన్నది. నార ఉన్న కొమ్మ అంత సుల భంగా విరగదు. బాగా వంగుతుంది. ఈ గుణాలతో బలిష్టమైన కొమ్మలు బాగా వంగి సాగి, విరిచి పారేద్దామన్నా అతి క్లిష్టములై ఉంటాయి. పెళుసుగా ఉన్న కొమ్మ అట్టే విఱిగిపోతుంది. ఈ దృఢమైన కొమ్మలు అథశ్చ, ఊర్ధ్వంచ క్రిందా పైనా వ్యాపించి ఉన్నాయి. ఇంద్రియ విషయాదులైన శబ్దాదులు దీనికి చిగుళ్ళులాగా ఉన్నాయి. శబ్దాది విషయాల గ్రహణశక్తి వల్ల క్రొత్తగా చిగుళ్ళు వచ్చి అవి ప్రతి గ్రంధి నుండి ఉత్పన్నమవుతాయి. చిగుళ్ళు రావడానికి ప్రేరణ చెట్టులోకి ప్రస రిస్తున్న చైతన్యమే. ఈ చైతన్యం అంటే సూర్యుని వెలుగు. దానిని తన ఆకులలోని క్లోరోఫిల్ అనే జీవకణాలతో అహరించి జీవరసంగా మార్చుకుంటుంది. ఈ జీవ రసం మళ్ళీ వేళ్ళదాకా ప్రవహించి, భూమిలోని లవణాలను ఆహార పదార్థాలను వేళ్ళ ద్వారా గ్రహించి, క్రొత్త చిగుళ్ళను ఉద్గమింపచేయడానికి, అవి క్రొత్త ఆకులు కావడానికి ప్రేరణను కల్పిస్తుంది. ఇలాగా భూతల శక్తులనూ ద్యోతల శక్తులను సమీకరింపచేసుకుంటూ, తామే ఇంకొక రూపంలో ఉన్న సూర్యతేజస్సు యొక్క వికారాలౌతూ అశ్వత్థ (ప్రభృతి) వృక్షాలు మనకు దివ్యత్వాన్ని ప్రదర్శిస్తున్నాయి. అధశ్శాఖా అంటే భూమి మీదకు వ్యాపించి కొమ్మలంటే మూలమైన ఆత్మతత్వానికి దూరంగా వచ్చేసినవని పూర్వ వ్యాఖ్యాతలు అర్థం చెబుతారు. ఇది ప్రకృతి విరుద్ధమైన మాట. వేళ్ళూ, బోదె, కొమ్మలు, ఆకులూ అంతా కలిసే సమగ్రమైన వృక్ష స్వరూపం అని వారు గ్రహించరు. మూలంకంటే శాఖలను వేరుగా గ్రహి స్తారు. పైగా ఆత్మతత్వం అనే మూలానికి దగ్గఱగా ఉండడమే ఊర్ధ్వం అంటారు వారు. క్రిందటి శ్లోకంలో ఛందస్సులీ చెట్టుకు ఆకులని చెప్పబడింది. చెట్టును కని పించకుండా చేసేవి ఆకులు. ఆకులవలన జీవిస్తూ ఆకులను ఆవిష్కరిస్తుంది చెట్టు. ఆకుల పచ్చదనంవల్ల చెట్టు బ్రదికి ఉన్నట్లు తెలుస్తుంది.

అలాగే వేదాలు పచ్చగా కనిపిస్తుంటే సంసారవృక్షం సజీవంగా నిలిచి ఉన్నం దుకు దాఖలాగా గ్రహిస్తారు పండితులు. వేదాలు ఛేద్యస్వరూపాన్ని తెలుపుతాయి. ఉపనిషత్తుల భాగం ఛేదించడాన్ని తెలుపుతుంది. వేదములతో చెప్పిన కర్మాచరణం ఆవశ్యకమే. కాని కర్మాచరణం పారమార్థిక ప్రయోజనం కలిగించేదిగా ఉండాలి.

ఈ సంసారం ఆత్మదర్శనానికి అడ్డంగా నిలవరాదు. ఈ సంసారం అనే చెట్టు సుడిగాలికి పెకలి వచ్చి వేళ్ళు పైకి కొమ్మలు కిందికిగా రోడ్డుకడ్డంగా పడి మార్గావరోధకంగా ఉంటుంది. అలాంటప్పుడు దాన్ని ఛేదించికొని ముముక్షువు ముందుకు పోతాడు. ఇదీ పూర్వవ్యాఖ్యాతల మతం.

ఊర్ధ్వమూలం అని మొదటి శ్లోకంలో ఉండగా ఈ శ్లోకంలో అధశ్చమూలాన్యను సంతతాని అని కూడా చెప్పబడింది. అంటే ఈ చెట్టువేళ్ళు క్రిందికి వ్యాపించి 'అనుసంతతాని' అంటే పెనవేసుకుని ఉన్నాయని కూడా చెప్పబడింది. ఈ క్రిందికి వచ్చే వేళ్ళు కర్మ వాసనలచేత ఈ సంసార వృక్షానికి క్రొత్తగా పుట్టినవనీ, అవి మనుష్యలోకంలో చేయబడే కర్మాల సంబంధం కలిగి క్రిందికి విస్తరిస్తూ ఉంటాయని వ్రాశారు. పూర్వవ్యాఖ్యాతలు. ఒకచోట వేళ్ళు పైన ఉన్నాయని చెప్పారు కనుక ఇప్పుడు క్రిందికి వ్యాపిస్తున్నాయనే వేళ్ళు వేళ్ళు కావనీ, అవి ఊడలుగా అనుకోవచ్చునని మఱికొందఱు సమర్థింపచూశారు. ఊడలు మళ్ళీ వేళ్ళున్న చోటికే ఊర్ధ్వముఖంగానే పోవాలి కదా! అవి అధోముఖంగా ఎలా పోగలుగుతాయి. అదీకాక రావి చెట్టుకు ఊడలుంటాయా అంటూ మఱొక ఆక్షేపణను మరికొందఱు ఆక్షేపించారు. న్యగ్రోధ, ఔదుంబర, అశ్వత్థములు (మఱ్ఱి, మేడి, రావి) మూడున్నూ విష్ణుపర్యాయ పదాలుగా వర్తిస్తున్నాయి కాబట్టి అట్టి ఊర్ధ్వమూలమైన చెట్టు అంటే ఈ సంసారవృక్షం అశ్వత్థమన్నా, న్యగ్రోధమన్నా ఏమీ దోషం లేదు అన్నారు ఇంకా కొందఱు.

నిజానికి ఈ వ్యాఖ్యానాలన్నీ శాఖాచంక్రమణ న్యాయాన్ని అనుసరించాయి. అసావాదిత్యోబ్రహ్మలాగా ముక్కును చూపిస్తున్నాయి. సూర్యుని చూడడానికి అపసవ్యంగా ప్రదక్షిణం తిరిగి ఎదుటనే ఉన్న బింబాన్ని చూడ్డంలాగా ఉంటుంది.

స్వర్గం, మోక్షం ఎక్కడో ఊర్ధ్వంగా ఉన్నయ్యనీ, బంధం, సంసారం, అవన్నీ క్రింద ఈ భూమి మీదనే గూడుకట్టుకుని మనుష్యుడి అభివృద్ధికి నిరోధకంగా ఉన్నయ్యనీ మనిషి పైకి పోవాలంటే ఈ సంసారమనే చెట్ల అరణ్యాలని ఛేదించుకుని పోవాలనే సూత్రాల మీద అల్లబడిన పథకం ప్రకారం ఈ శ్లోకాలకే దూరదూరాల నుంచి గుంజుకొని వచ్చిసాగదీసి సాగదీసి ఆ అర్థాలను ఈ శ్లోకాలను ముడిబెట్టి వారనుకున్న సూత్రార్థాలను గిట్టించుకున్నారు. పూర్వ వ్యాఖ్యాతలు.

అమ్మ చెప్పినట్లు ఇది కానిదదేమీ లేదు అనే రీతిగా స్వర్గమర్త్యాలకు ఐక్యభావం చెప్పితే ఈ అన్యోన్య విరోధాలన్నీ మాటలలో నుంచి ఎగిరిపోతాయి. ఊర్ధ్వంలో ఉండే వేళ్ళూ అవే అథస్సులో ఉంటే వేళ్ళూ అవే. ఊర్ధ్వంలో ఉండే కొమ్మలూ అవే.

క్రింద ఉండే కొమ్మలూ అవే. పరమాత్మే ఈ రెండూ అయి ఉన్నాడని సిద్ధమవుతుంది.

నరూప మస్యేహ తథోపలభ్యతే – ఆకాశము కాలము కలిసి సృష్టిగా పరిణమిస్తున్నది. ఆకాశం కరుడుగట్టి భూతాల రూపాలైన ద్రవ్యపదార్థంగా ఔతుంటే, కాలం వాటి మనశ్శక్తిగా ప్రాణశక్తిగా వాటి చలనశక్తిగా పరిణమిస్తున్నది. నిరంతర పరిణామశీలి అయిన ఈ యంత్రసామగ్రి తానే అయి ఆ సామగ్రి ఇలా రూపొందే పరిణామ క్రియాశక్తితానే అయి, పరమాత్మ దీన్ని ముందుకు ఆకర్షించుకుంటున్నాడు. తిరిగే చక్రం మీది పరుగులాగా దీనిది గమ్యం అంటూ నికరంగా లేని చలన యాత్ర. ముందుకు ఇంకో ముందు ఆ ముందుకు ఇంకో ముందు. కాబట్టి ఈ సంసార వృక్షస్వరూపం లభించేదిగాదు.

'ఇదంతా అదే. 'ఈ కనబడేదీ – మారేదీ. మారుతున్నదీ రెండూ ఒకటే – వేరుకాదు, ఈ దృశ్యం ఏదైతే మనకు కనబడుతున్నదో అదే సత్యం. ఇది కాకుండా ఇంకొకటి వేరే ఉందని నేననుకోను. నేను చూడలేదు. నేను చూడకపోవచ్చు. ఇది ఎప్పుడూ కనబడుతున్నది. ఇది ఎప్పుడూ ఉంటూనే ఉన్నది. నేను సత్యమైన పదార్థాన్నేదో చూశానని వాదనుకుంటున్నప్పుడు ఇది అసత్యంగా కనబడదు. నా అనుభవం చెప్తున్నాను. నా అనుభవం – నాకిది సత్యం నిత్యం అనిపిస్తున్నది. చెట్టున్నది అది పెరగవచ్చు. వృద్ధి పొందొచ్చు. ఈ సృష్టి అనాదిగా ఎప్పుడూ... ఎప్పుడు మొదలైందని ఏంలేదు. ఎప్పుడూ ఉందనే ఇదే సత్యం అని.

3. **న రూప మస్యే హ తథోపలభ్యతే**
నాన్తో న చాది ర్నచ సంప్రతిష్ఠా।
అశ్వత్థ మేనం సువిరూఢ మూల
మసంగ శస్త్రేణ దృఢేన ఛిత్వా॥

4. **తతః పదం తత్పరిమార్గితవ్యం**
యస్మిన్ గతా న నివర్తన్తిభూయః
త మేవ చాద్యం పురుషం ప్రపద్యే
యతః ప్రవృత్తిః ప్రసృతాపురాణీ॥

తా: ఈ వృక్షము యొక్క రూపంపైన వర్ణించబడ్డ రీతిగా నిజంగా లోకంలో లభించదు. దీనికి ఆదిలేదు. దీనికి తుద కూడా కనిపించదు. దీనికి ఉనికి కూడా కనిపించదు. గట్టిగా నాటుకొని వేళ్ళు బలిసిఉన్న ఈ అశ్వత్థవృక్షాన్ని అసంగము

లేక విరాగము అనే దృఢమైన ఆయుధంతో నరికివేసి ఆ తరువాత ఎవని నుండి పురాతనమైన ప్రవృత్తి వ్యాపించెనో ఆ ఆది కారణమైనవాడూ, పరమాత్మ స్వరూపుడూ అయిన అతనినే శరణం పొందుచున్నాను. అని తలుస్తూ దీనియందు ప్రవేశించిన వాళ్ళె తిరిగి వెనుకకు రారో ఆపరమోత్కృష్టమైన స్థానం వెదకదగినది.

పూర్వవ్యాఖ్యాతల మతంలో ఒక సందిగ్ధవాదం కనిపిస్తుంది. ఒకవైపున వేదాలనే ఆకులతో అశ్వత్థవృక్షం ఉన్నదని చెప్తుతారు. ఆకులుండడమంటే అది బ్రతికి ఉన్న చెట్టని చెపుతారు. మళ్ళీ ఈ శ్లోకం దగ్గఱకు వచ్చేసరికి అది పెళ్ళగిలివచ్చి దారికడ్డంగా పడిఉందంటారు, అది పెద్దవృక్షం కాబట్టి మార్గం నిరాటంకంగా చెయ్యాలంటే దాన్ని నరికెయ్యాలంటారు. మరి ఈ వేదాలనే ఆకులు ఏమయినట్లూ. చెట్టును ఖండించెయ్యాలంటే వేదాలనూ ఖండించెయ్యాలనా అర్థం?

వ్యా: పై శ్లోకాలలో ఒక అశ్వత్థవృక్షాన్ని గూర్చి చెప్పాము. అది శీర్షాసనం వేసినట్లు వేళ్ళు పైకి కొమ్మలు క్రిందికిగా ఉంటుందని వర్ణించాము. దాని ఆకులు వేదాలనీ, దాని చిగుళ్ళు విషయాలనీ వర్ణించాము. అలాంటి చెట్టు నిజంగా ఈ లోకంలో ఉందా? ఉంటే చూచి వద్దామని ఎవరైనా బయల్దేరుదా మనుకుంటారేమో అని పరమాత్మ ఈ శ్లోకంలో స్పష్టంగా చెబుతున్నారు. అలాంటి వర్ణలున్న చెట్టు వాస్తవంగా లేదు. అది మనకు కనిపించదు. లేదు కనుక కనిపించదు. దీనికి మొదలు తుదిలేదు. సంసారానికి ఆది ఏమిటి. అంతమేమిటి. సర్వసంసారానికి ఒకేమారుగా ప్రళయమూ రాదు, మళ్ళీ పరమాత్మ అశ్వత్థపదాన్నే ఉపయోగించారు. అంటే వికారమైనది. వికారం పొందే స్వభావాన్నీ వికారంలేని దాని సంకల్పాన్నీ ఈ రెంటినీ కలిపి అశ్వత్థమన్నారు. ఇది ఆకార సహితంగా ఉండకపోయినప్పటికీ త్రిగుణాలతో కలిసిన క్షేత్రంలో ఇది సుదృఢంగా నాటుకుని ఉంది. ఇది యుగ యుగాలుగా వేళ్ళుతన్నుకుని ఉంది. దీన్ని అంత సులువుగా నఱికి పాఱెయ్యడానికి వీలులేదు. కాబట్టి అసంగములేక విరాగము అనే శస్త్రాన్ని ఉపయోగించి గట్టిగా నరికెయ్యమని సెలవిచ్చారు. రూపంలేని చెట్టును నరికెయ్యమంటే వ్యాఖ్యాతలు చెప్పినట్లుగా టెంపర్డు స్టీలుతో చేసిన గొడ్డలిని తెచ్చుకోనక్కరలేదు. 'విరాగమంటే సర్వత్ర అనురాగమే' అన్నది అమ్మ. అట్టి విరాగమును చేత బట్టి, ఛిత్వా అంటే తన లోని మమకారాన్ని ఖండించుకొని అంటే లెస్సగా విమర్శ పూర్వకంగా యోచించి కామక్రోధాదులను త్రోసిపుచ్చుకొని నిర్మలమైన చిత్తం కలవాడౌతాడు. ఆ తరువాత పురాతన కాలం నుంచి ఈ లోకమే అదిగా ఉన్న పరమాత్మ ప్రవృత్తి మనస్సులో ప్రత్యక్షం ఔతుంది. అతడే ఆద్యాది కారణుడై ఉండడం సర్వప్రపంచమూ అతడే

అయి ఉండడమూ కూడా అర్థమవుతుంది. ఈ బ్రహ్మ భావాన్ని పొంది అందులో లీనమైన వాడిక మళ్ళీ భేదభావంలోకి తిరిగిరాడు.

అసంగశస్త్రేణ - అంటే పుత్ర విత్త లోకైషణాదుల నుండి విడివడడమనే ఖడ్గంచేత అని శంకరులు, గుణమయభోగములయందు. అసంగమనే శస్త్రంచేత అని రామానుజులు నిర్వచించారు.

ప్రసృతా పురాణీ - పురాతనమగు సంసారమాయా వృక్షం యొక్క పుట్టుక అని శంకరులు పురాతనులైన ముముక్షువుల యొక్క ప్రవృత్తి కాబట్టి పురాణీ అని రామానుజులు.

5. నిర్మానమోహా జితసంగదోషాః
అధ్యాత్మ నిత్యా వినివృత్త కామాః।
ద్వంద్వై ర్విముక్తా స్సుఖ దుఃఖ సంజ్ఞై
ర్గచ్ఛం త్యమూఢాః పద మవ్యయం తత్॥

తా: అభిమానము మోసములేనివాళ్లు, మమకార దోషాన్ని జయించిన వాళ్లు. ఆత్మచింతనయందే లీనమై ఉండేవాళ్లు, కోరికలు విడిచి పెట్టిపోయినవాళ్లు, సుఖ దుఃఖాలు గుర్తుగా కల ద్వంద్వాల నుండి విముక్తి పొందినవాళ్లు, అటువంటి జ్ఞానులు అవ్యయమైన ఆ పరమ పదానికి వెళ్తారు.

వ్యా: దేహాభిమానం వల్ల మోహమూ, మోహంవల్ల సంగమూ, అంటే ఒక దాన్ని అంటిపెట్టుకుని ఒకటి ఉండాలనే కోరిక కలుగుతాయి. ఒకటి తొలిగిపోతే దాని తరువాత వచ్చేది తొలిగిపోతుంది అప్రయత్నంగానే. దేహాభిమానం పోగానే ఆత్మాభిమానం దాని అంతట అదే కలుగుతుంది. ఆత్మయందు అభిమానం కలవాడై మనోవాక్కాయ కర్మలు పరమాత్మ వైపు తిరిగి, ఈ జగత్తుకు పరమాత్మ స్వరూపం గానే కనబడడం మొదలు కాగానే వ్యక్తి మీద కేంద్రీకృతమైన కోరికలు వాటి అంతట అవే విచ్చిపోతాయి. అప్పుడు వ్యక్తి కోరికలను విడిచిపెట్టడం కాదు, కోరికలే వ్యక్తిని విడిచిపెట్టి పాటిపోతాయి. వినివృత్త కామా అంటే ఇదే అర్థం. కామము అంటే ఏమిటి? సహజంగా ప్రకృతిలో సమష్టిగా జరిగిపోతున్న ప్రకృతి విలాసాన్ని, సంఘ టనలను, తన వ్యష్టిత్వానికి అన్వయించుకొని అవి తనకు అనుకూలంగా ఉన్నా యనో లేక ప్రతికూలంగా ఉన్నాయనో తనకు తోచిన రీతిగా మనస్సులో పొందే ప్రవృత్తి. కొన్ని కొన్ని ముఖ్యమైన ప్రవృత్తులు ప్రతి జీవికి సమానంగా వర్తిస్తాయనే లాగా స్థిరపడిపోయి ఉంటాయి. అలాంటివి మచ్చుకు. ప్రాణంమీద తీపి స్వేచ్ఛ

మీద తీపి బ్రతుకుమీద ఇచ్ఛ. ఆకలి, దప్పిక, ఊపిరి, వెచ్చదనం, వెలుగు, లైంగిక వాంఛ ఇవన్నీ సాధారణంగా అన్ని కేంద్రవృత్తులై పనిచేస్తుంటాయి. (centripetal). నీళ్లలో మునిగిపోతున్నా, అగ్ని మధ్యాన ఉన్నా, తన దేహాన్ని రక్షించుకోడానికి తాపత్రయపడతాడు మనిషి పురుగును మనం పట్టుకున్నా గిజగిజలాడి మెలికలు తిరిగి స్వేచ్ఛకోసం తన్ను కుంటుంది. చావబోయే వాడికైనా చావడానికిచ్ఛ ఉండదు. ఇంతచక్కని సృష్టిని ఎలా విడిచిపోదామనుకుంటాడు. చచ్చిన తరువాత సాధించేదే ముంది అనుకుంటాడు. ఆకలీ, దానికంటె దప్పిక, దానికంటె గాలీ, వెలుగూ, ఒకదాని కంటె ఒకటిగా పంచభూత తత్త్వాలు శరీరధారణకు తమ ఆవశ్యకాన్ని మీదబడి కొట్టినట్లు తెలియజేస్తూ ఉంటాయి. ఈ వికారాలన్నీ ఉండడమే దేహ ముండడమంటే. సంసారదేహం ఉండడం అన్నా ఈ వికారాలన్నీ అపరిమితంగా ఉండడమనే అర్థం. ఇవి లేకుండా ఉండే దేహం విదేహమే అవుతుంది. ఈ షణ త్రయాన్ని విసర్జించి, కోరికలను జయించి, పైన చెప్పిన విసర్గమైన మనోవృత్తులను నిరోధించి, అసంగశస్త్రాన్ని సంపాదించాలి అని చెప్పే అర్థం సందర్భానికి అతుకుతుందా? అసంగంగా ఉండాలనుకోవడం కూడా ఒక విధమైన సంగమే కదా! కాబట్టి పూర్వ వ్యాఖ్యాతలు వ్రాసినట్లు 'పరమాత్మ పదమునకు దారిలో ఈ సంసార వృక్షము అడ్డుగా పడియుండి అవరోధములను కల్పించుచున్నది. అధముడగు మానవుడు. దానిని చూచి భీతిచెంది వెనుకకు తిరిగిపోవుచున్నాడు. మధ్యముడగు మనుజుడు దాని దగ్గఱకు వచ్చి అడ్డాన్ని తొలగించుటకు ప్రయత్నించి విఫలుడై వెనుకకు మరలుచున్నాడు. ఉత్తముడగు మానవుడు గొప్ప ఆయుధము లను సమకూర్చుకుని అహర్నిశములు పరిశ్రమించి దాని అంతుజూడ దలంచి ఎట్లైనను దానిని ఛిన్నభిన్నమొనర్చి ఆవలికి బోవుచున్నాడు. వీరి ముష్వరిలో ఉత్త మునివలె మెలగమని గీతాచార్యుడు బోధించెను. "తతః పదం తత్పరిమార్గితవ్యం" ఈ జ్ఞాన రూప సంసార రూపమహావృక్షమును అసంగశస్త్రముచే నఱకివైచి ఆవల నున్న పరమాత్మను వెతకి కొనుడు"ని ఆదేశించెను. సంసారంలో భాగంగా ఉండ కుండా ఉంటే, ఇక తమ ఉనికికి స్థానం ఇంకోటి ఉండనే ఉండదనే మాటను మఱచిపోవడంవల్లనే ఇలాంటి అర్థాలు తీయడం జఱుగుతుంది.

"ద్వంద్వాలతో ద్వంద్వాన్ని జయించాలి"

"ద్వంద్వాలను బ్రహ్మగా గుర్తించితే బ్రహ్మానందం"

"రెండుగా కనబడడం అజ్ఞానం"

"మారేదే మనస్సు, మార్పులేకపోతే దేవుడే"

"మనస్సు చెట్టు వంటిది. కొమ్మలు గుణము వంటివి'

"సంసారంలో తానుండవచ్చును. తనలో సంసారం ఉండరాదు"

నిర్మాన మోహాః అంటే అహంకారాన్ని అవివేకాన్ని విడిచిన వారని శంకరులు అనాత్మ యందాత్మాభిమాన రూపమైన మోహాన్ని విడిచిన వారని రామానుజులు.

6. న తద్భాసయతే సూర్యో న శశాంకో నపావకః।
యద్గత్వా న నివర్తన్తే తద్ధామ పరమం మమ॥

ఆ పరమస్థానాన్ని సూర్యుడు ప్రకాశింపజేయలేడు. చంద్రుడూ ప్రకాశింప జేయలేడు. అగ్నిహోత్రుడూ ప్రకాశింపజేయలేడు. ఏ స్థానాన్ని పొంది మళ్లీ తిరిగి రానేరదో అది నా పరంధామ స్థానం.

సూర్యుడు తనకు తానుగా ప్రకాశిస్తాడు ఇతర వస్తువులను ప్రకాశింపజేస్తాడు. చంద్రుడు సూర్యుని కాంతివల్ల ప్రకాశిస్తూ ఇతర వస్తువులను ప్రకాశింపజేస్తాడు. కాని చంద్రుని ప్రకాశంలో హెచ్చు తగ్గులున్నాయి. పూర్తిగా ప్రకాశించే దశా నిండుగా ప్రకాశించని దశా ఇవి కూడా ఉన్నాయి. కాని ఇందులో ధూమం లేదు. పొగచూరడమూ లేదు. అగ్ని దేనినో దహించి ప్రకాశాన్నీ వేడిని ఇస్తుంది. వాటితో బాటు పొగనూ ఇస్తుంది. ఈ విధంగా మలిన ప్రకాశం, మిశ్రప్రకాశం స్వచ్ఛ ప్రకాశం ఒక దానికొకటి మేలితరంగా ఉన్నాయి. అలాగే పరా – అంటే తన్ను తాను ప్రకాశింపజేసుకుంటూ ఇతరములను కూడా ప్రకాశింపజేసేది. ప్రత్యేక అంటే తనను తాను మాత్రమే ప్రకాశింపజేసుకునేది. పై శ్లోకంలోని భావాన్నే ఈ క్రింది ఉపనిష ద్వాక్యం కూడా రూఢిచేస్తుంది. "నతత్ర సూర్యోభాతి, నచంద్ర తారకం, నేమా విద్యుతోభాంతి కుతోఽ యమగ్నిః! తమే వ భాన్తమనుభాతి సర్వం తస్యభాసా, సర్వమిదం విభాతి"

'చీకటే వెలుతురు కాధారం' అమ్మ. నీడ లేకుండా వెలుగును గ్రహించలేం. మనుష్యుని కంట్లో ఉన్న రెటీనా నీడలాంటి తెరే.

7. మమైవాంశో జీవలోకే జీవభూత స్సనాతనః।
మన షష్ఠా నీంద్రియాణి ప్రకృతి స్థాని కర్షతి॥

తా: నేను సనాతనంగా ఉన్న వాడిని. నా దైవఅంశమే జీవలోకంలో జీవుడై మనస్సుతో కలిసి ప్రకృతి యందున్న ఆఱైన ఇంద్రియాలను ఆకర్షిస్తున్నది.

వ్యా: ఒకప్పుడుండి ఒకప్పుడు లేకపోయిన వాడిని కాను. ఎల్లప్పుడూ సనాతనంగా నేను ఉండడంవల్లనే అన్నీ జరుగుతున్నవి. నా తాలూకు అంశయే

అంటే నేనే జీవత్ప్రపంచంలో కూడా అన్నిటిని నడిపిస్తున్నది. నేనే జీవుడి రూపంగా ప్రకృతిలో ఉన్న త్వక్చక్షు శ్రోత్ర జిహ్వాఘ్రాణాలను మనస్సును ఈ ఆరింటిని ఆకర్షిస్తున్నాను. నా అంశ అంటే నాకంటే వేఱుకాదు.

పరమేశ్వరుడే జీవుడి రూపంలో మనస్సును ఇంద్రియాలను ఆకర్షిస్తున్నాడంటే పరమాత్మ ప్రేరణవల్లనే అంతా జరుగుతున్నదనీ మనిషి పరమాత్మ ప్రేరణ లేకుండా ఏమీ చెయ్యలేడనీ తెలుపుతున్నది.

పదో అధ్యాయంలో "విష్టభ్యాహ మిదంకృత్స్నమేకాం శేనస్థితో జగత్" అని పరమాత్మ చెప్పారు. పరమాత్మ చైతన్యానికి ఒక భాగానికి ఎంత సత్యమున్నదో సంపూర్ణమైన చైతన్యానికి కూడా అంతే సత్యముంటుంది. ఎందుకంటే పరమాత్మ అవిచ్ఛిన్నుడు. జీవుడుగా శరీరయాత్ర గడుపుతూ ఉన్నా, జగత్తునంతటిని ఒక భాగం మాత్రమే భరిస్తూ ఉన్నదన్నా ఆయా భాగాల శక్తిమత్తకు ఏవిధమైన భేదమూ లేదు.

పైశ్లోకంలో మనస్సు వేఱు పరమాత్మ అంశం అయిన జీవుడు. వేఱు అన్నట్లుగా చెప్పబడింది. జీవుడు మనస్సునూ ఇంద్రియాలను ఆకర్షిస్తాడట. అంటే వాటి వ్యాపారాలను సక్రమంగా నడిపిస్తాడన్నమాట. మనస్సు, గాని బుద్ధిగాని ఏ విషయంలోనైనా పనిచెయ్యడానికి స్మృతి, యుక్తి, అనుభవం అనే మూడుంటాయి. అనుభవంలోకి వస్తేనే ఏదైనా నమ్మడానికి వీలుంటుంది. శాస్త్రం నుండి అనుభవం రాదు. శాస్త్రాన్ని ఒకవేళ నమ్మానుఅంటే

'నా మనస్సు దోవ ఇచ్చినది. నా మనస్సు నమ్మిస్తే నమ్మేను. మనస్సు శాస్త్రమును పట్టుకున్నది. ఏది చూస్తే అది హత్తుకుపోయేది మనస్సు. నాకు చికాకుగా ఉంటే ఎదురుగాపోయే మనిషి గుర్తుండదు. అటువంటి మనస్సు ఒకరు చెప్పింది ఆధారం చేసుకొని మరొక దానిని అన్వేషిస్తుంది. ఇంకొకటి అనుభవంలోకి వస్తేనే కాని దాన్ని వదలలేము. అమ్మ.

ప్రకృతి స్థములైన ఇంద్రియానుభవాలని ఆవిధంగా స్టోరు చేసుకుంటున్న జీవుడు శరీరపాతానంతరం వాటిని ఏం చేస్తాడు అంటే, లేక ఈ అనుభవాలు ఏమైపోతాయి అంటే.

8. శరీరం యదవాప్నోతి యచ్చా ప్యుత్క్రామతీశ్వరః।
గృహీత్వైతాని సంయాతి వాయు ర్గంధా నివాశయాత్॥

తా: ఈశ్వరుడు శరీరాన్ని ఎప్పుడు పొందుతున్నాడో ఎప్పుడు విడిచిపెట్టి

వెళ్ళిపోతున్నాడో వాయువు పుష్పాది స్థానముల నుండి పరిమళద్రవ్యాలను తీసికొనిపోయే లాగా ఇంద్రియాలను గూడా తీసికొని పోతున్నాడు.

వ్యా: అందటినీ సృష్టించినది వాడే. వాడు మనకు కనబడడం లేదు. వాడిచ్చినవి మనకున్నాయి. మనం ఉన్నాం. ఒక్కొక్క సమయంలో ఒక్కొక్క గుణం ప్రకోపించబడుతుంది."

'మనిషి పుట్టడం తోనే గుణాలు ఉత్పన్నమయినాయి అన్నివేళల్లో ఒకటిగా ఉండడమనేది లేదు. నాలో అన్ని గుణాలు ఉన్నా పరిపూర్ణమవటంవల్ల వ్యక్తం కాక పోగా ఒకే భావం కలుగుతున్నది"

ఈశ్వరుడేలాటివాడో మనకు నిజంగా అనుభవంలోకి వస్తే నిజంగా ప్రేమిస్తామో ప్రేమించమో. ఏమీ అనుకోకుండానే ఇట్టే మనకు కావలసినవన్నీ కాజేసి చూస్తూ ఊరుకుంటాడు. బిజినెస్‌లో నష్టం, అనారోగ్యం, అప్పుల బాధ – అదేదో పద్యంలో ఉన్నట్లు 'గురువుల రాక దాసి మృతి గుఱ్ఱపు దాడియు వాన యిల్లుడెన్ వరసతి గర్భవేదన వివాహము విత్తుల చల్లకంబు,.. చెవిపోటు... కరువు దరిద్ర మాబ్ధికము" అంటూ అన్నీ ఒకసారి తెచ్చి పెడతాడు. మనం భరించలేనివన్నీ, ఈ బాధలన్నీ తానే అయి మనను ఉద్ధరించడానికే అంటాడు. ఎలక్ట్రిసిటీ పంకాలు త్రిప్పుడూ, లైట్లు వెలిగిస్తూ, ఫ్రిజ్‌లో వేసవికాలంలో అన్నింటిని చల్లబరుస్తూ, చలికాలంలో హీటరుగా వెచ్చదనాన్నిస్తూ, ట్రాన్సిస్టరులాగా పాటలను వినిపిస్తూ, టివిలాగా దూరపు సినిమాలను చూపిస్తూ మన స్థాయిలోకి ఎదిగి మనతో సఖుడై బావమఱందియై' సరసాలాడుకుంటూ ఉన్నంతసేపూ, భగవంతుడి వంటి భగవంతుడు లేదు – నహి రే నహి శంకా – లేదు అనిపిస్తుంది. వాడే ఒక్క పిసరు తన మోతాదును ఎక్కువ చేసి, వఱపును తెచ్చి పెట్టి, వఱదలను ఎక్కువచేసి, భూకంపాలను తెచ్చి పెట్టి, విషూచి, మారి జబ్బులను ఎక్కువ చేసి. కఱువు కాటకాలను సృష్టిచేసి, తుఫానులను రప్పించి, ఓడల్ని ముంచేసి – ఇలాచేసే వాడైతే ఆదేం దేవుడు. మనుషులకి కేవలం పగవాడు అనుకుంటాం. ఎందుకనీ మనం అనుకునే సుఖం ఇందులో లేదు కనుక. ఎలక్ట్రిసిటీ షాకులు తగులుతుంటే నిజాని కది శత్రువే! మా ఇంట్లో ఒక ఫ్యాన్ ఉంది. దాన్ని ముట్టుకుంటే షాకు కొడుతుంది. అయినా అది బాగానే పనిచేస్తుంది. గాలినీ కదిలిస్తుంది. దాని నుంచి షాకు తిననివాడు ఇంట్లో ఎవడూ లేడు. కాని గాలి కావాలి. కనుక దూరంగానే దాని చేత పని చేయించుకుని మనకు కావలసిన గాలిని మనం అనుభవిస్తుంటాం. అలాగే ఉంటాడు మన మనసుల్లోని భగవంతుడు. షాకుకొట్టే వాడైతే దూరంగా

ఉండమంటాం. గాలినచ్చే వాడైతే దగ్గఱకు తీసుకుంటాం, మానవత్వం అదే, ఒక అన్నయ్యను అమ్మ మీద నీకు అంతగా నమ్మకముంటే షాకుల నుంచి ఆమె నిన్ను రక్షిస్తుందనే భరోసా ఉంటే ఈ H.T. వైర్లను పట్టుకోమంటే అతడు 'అమ్మా' అని కేకవేసి పట్టుకున్నాడు. ఇక్కడ అమ్మ వేలు విదిలించేసుకున్నది. రెండో తరగతి వాళ్ళకు అదీ వరస. మనస్సు తనను తానే బాధా రూపకంగానో ధైర్య రూపకం గానో, అనుగ్రహ రూపకంగానో అమర్చుకుంటుంది. ఈ అమర్చుకుని పోయే శక్తి ప్రకృతికి సన్నిహితంగా సహజంగా ఉంటే బయటి సంఘటనలూ, అవి మనస్సులో, అమర్చే అచ్చులూ ఒకేవిధంగా ఉంటాయి భగవంతుడిని 'గుణహీనుడవు కులగోత్ర మెఱుగని వానికి పుడబ్బైనన్నియును' అని రాక్షసులు తిట్టినా అది స్తుతియే ఔతుంది. కాబట్టి ఇంద్రియాలను పూలలో పరిమళాన్ని గాలి ఎత్తుకుపోయినట్లుగా ఈశ్వరుడు దేహధారణ సమయంలోను, దేహత్యాగ సమయంలోనూ తీసుకుపోతాడంటే, ఇదే అర్థం. దేహాన్ని ధరించేటప్పుడు భగవద్విశిష్టాలైన కొన్ని గుణాలని తీసేసుకుని జన్మ ఎత్తుతాడు. మానవత్వ విశిష్టాలైన గుణాలను తీసేసుకుని శరీరం త్యాగం చేసేటప్పుడు తిరిగి తనలో తను లయమౌతాడు అని అర్థం. జన సామాన్యాన్ని అనుగ్రహించే నిమిత్తం అమ్మ మన లెవెలుకు దిగి అవతారమెత్తినట్లు.

అమ్మ: నా వస్తువు ఏదా అని ఆలోచిస్తున్నాను. శరీరం కూడా పోతుంది. "మూలమే అయినా తాను అవతరించినపుడు కొన్ని పరిమితులను విధించు కుంటాను" పేజి 30 జులై 73

9. శ్రోత్రం చక్షుః స్పర్శనం చ రసనం ఘ్రాణ మేవచ।
అధిష్ఠాయ మనశ్చాయం విషయా నుపసేవతే॥

తా: పరమాత్మ అయిన ఈ జీవుడు చెవిని, కంటిని, చర్మాన్ని నాలుకను, ముక్కును మనస్సును కూడా అధిష్టించి శబ్దాది విషయాలను అనుభవిస్తున్నాడు. తానే ఆ విషయాలుగా అయి ఉన్నాడు.

వ్యా: ఈ శ్లోకంలో పరమాత్మ చైతన్యానికీ జ్ఞానేంద్రియ వ్యాపారాలకీ సంబంధం చెప్పబడ్డది. ముక్కు వాసన చూస్తుంది. లోపలి చైతన్యం ఎంత వఱకు ఆ వాసన రూపం ఎత్తదో అది మనస్సు గ్రహించనే గ్రహించదు, అలాగే కంటి ముందటి దృశ్య రూపాన్ని ఎత్తి చైతన్యం లోపలి మనస్సును కదలించకపోతే ఆ దృశ్యం మనకంటికి కనుపించదు ఉన్న రూపం, ఉన్న గంధం, ఉన్న రుచి, ఉన్న శబ్దం ఉన్న గాలి, వీటి అసలు రూపాలు ఎలా ఉంటాయో పరమాత్మకే ఎఱుక.

ఎవడి మట్టుకు వాడికి అది ఏదో ఒక రూపం ఎత్తి ఆ ఆకారంగానే వాడి మనస్సై ఊరుకుంటుంది. సంపెంగ పువ్వు వాసనలో పంచభూతాలూ అమ్మా కలిసి వికసించిన అనుభవం కలిగింది నాకు ఈ వాక్యం వ్రాస్తున్నప్పుడు. మఱి ఈ భావం ఈ అనుభవం తుమ్మెదకెలా ఉంటుందో నా ఊహ కందలేదు. ఒక్కొక్కడు దూరం నుంచి స్త్రీ అందాన్ని మెఱుపు తీగలాగ వర్ణిస్తాడు. మఱి ఆ వర్ణన అతడు అనుభవించే వర్ణిస్తాడో లేదో అర్థం కాదు, అనుభవించేదే అయితే మెఱుపుషాకు రుచి చూచిన తరువాత అతని స్థితి ఎలా ఉంటుందో అనూహ్యం. అలాగే ఉప్పు చాలా ఎక్కువగా ఉంటే Natrum Mur పేషంటుకు కూర రుచిగా ఉంటుంది. ఆ రుచి రూపాన్ని అందఱి మనస్సులూ ఎత్తవు.

ఇలా భిన్నభిన్నంగా తనకిష్టం వచ్చినట్లుగా అచ్చులు పోసుకుని అన్ని ఆత్మలూ అంటే అన్ని శరీరాలూ పరమాత్మ తానే ఐ సమానంగా అనుభవించడమే సృష్టి కార్యం.

'భిన్నత్వమే సృష్టి' అమ్మ.

10. ఉత్క్రామన్తం స్థితం వాపి భుంజానం వా గుణాన్వితం।
విమూఢా నానుపశ్యన్తి పశ్యన్తి జ్ఞానచక్షుషః॥

తా: శరీరాన్ని విడుస్తున్నట్లుగా గాని, శరీరంగా ఉన్నప్పుడుగాని, శరీరమై గుణాలను అనుభవిస్తున్నట్లుగా గాని, వట్టి మూఢులు ఆత్మను గుర్తించలేరు. జ్ఞానమే కన్నులుగా గల మహాత్ములు గుర్తిస్తారు.

వ్యా: తన స్వరూపాన్ని తాను తెలుసుకుందామనే సంకల్పంతో సంసారమై రూపొందిన పరమాత్మ ఆ సంకల్పం సిద్ధించే దాకా పరిమిత బుద్ధితో తానే సంసార రూపాన్ని అనుకుంటూ తనలో తాను రమిస్తుంటాడు. సంకల్పసిద్ధి కాగానే సంసారమే పరమాత్మ యొక్క పూర్ణత్వమై పరిణమించి తానే నిర్వికల్ప సమాధిని పొందుతాడు. ప్రతి మనిషికి వ్యక్తిగతంగా ఈ విషయంలో ఎంత వరకు ఆరోగ్యం వచ్చిందీ అనే మాట భక్తినాడి భుక్తినాడి చూచే అమ్మ నిర్ణయించగలదు,

11. యతన్తోయోగి నశ్చైనం పశ్యన్త్యాత్మ న్యవస్థితం।
యతన్తోఽ ప్యకృతాత్మానో నైనం పశ్య న్త్య చేతసః॥

తా: ప్రయత్నం చేస్తున్నవాళ్ళున్ను, యోగులున్ను అయినవాళ్ళు ఈ ఆత్మను తమయందే తాముగా ఉన్నట్లు చూస్తున్నారు. ప్రయత్నం చేస్తున్న వాళ్ళైనప్పటికి అకృతాత్ములైన అవివేకులు ఈ ఆత్మను చూడజాలరు.

వ్యా: ప్రయత్నం చేయడం అంటే ఏమిటి? మనస్సులో ఏవిధమైన వేడీ కలగకుండానే చేతులు వాటి అంతట అవే పనిచేయడం ఆరంభిస్తాయా? ఆరంభిం చవు. మొటద్లో మనస్సులో ఒక హెచ్చరిక ఒక ఆకాంక్ష, ఒక ఆసక్తి రావాలి. లోపలి ఆత్మను చూడాలి అనే ఆతురత కలగాలి. అప్పుడు ఆ ప్రేరణ ననుసరించి ప్రయత్నం జరుగుతుంది. ఆప్రేరణయే ప్రయత్నంగాను, ప్రయత్నం. ఫలసిద్ధిగాను పర్యవసిస్తుంది. అమ్మ 'నేనే, నాకోసమే' అనే మాటల్లో ఇదే అర్థం. తన ఆనందం కోసమే ఈ జన్మయెత్తటం, ఈ సుఖదుఃఖాలు అనుభవించడం మళ్ళీ తన్ను తాను తెలిసికోవడం.

అలాగే ప్రయత్నం చేయడం తానే పరిణతి చెందని అకృతాత్ముని పాత్రగా ఉండి అచేతస్కంగా తన్ను తాను తెలుసుకోలేకపోవడం. ఈ రెండింటిలోనూ సమానంగా ఆత్మయందే ఆత్మతో రమిస్తూ ఉండడం.

'నాది తెలిసీ తెలియని స్థితి'

నాకేం తెలుసో తెలియదు' అమ్మ

'యథార్థమే నా స్థితి'.

12. యదాదిత్య గతం తేజో జగద్భాసయతేఽ ఖిలం।
యచ్చంద్రమసి యచ్చాగ్నౌ తత్తేజో విద్ధి మామకం॥

తా: జగత్తును ప్రకాశింపజేసే సూర్యుని తేజస్సు, చంద్రుని తేజస్సు, అగ్నితేజస్సు అంతా నాదే అని తెలుసుకో.

వ్యా: సూర్యుని తేజస్సు జగుత్తుకు ప్రాణం. చంద్రుని తేజస్సు జంతువులకు మనస్సు. అగ్ని తేజస్సు భూతాలు స్వరూపాన్ని దాల్చడానికి వృద్ధి చెందడానికీ కావలసిన జఠరాగ్ని, మానవలోకానికి ఆధారభూతంగా ఉన్న చంద్రసూర్యులను అగ్నిని తేజస్సుకు ఆ స్థానాలుగా ఈ శ్లోకంలో చెప్పి ఉన్నారు. వచ్చే శ్లోకాలలో సూర్యుడు ఏవిధంగా జీవుల జీవితానికి ఆధారభూతంగా ఉన్నాడో, చంద్రుడు ఏ విధంగా భూతాల పోషణకు కారణభూతుడౌతున్నాడో, అగ్నిపాకంగా అందటి తత్వంలో ఏవిధంగా బలవర్ధకపాత్రను నిర్వహిస్తున్నాడో ఈ పరమాత్మ చెప్పు తున్నారు.

13. గామావిశ్య చ భూతాని ధారాయామ్యహ మోజసా।
పుష్ణామి చౌషధీ స్సర్వా స్సోమో భూత్వా రసాత్మకః॥

తా: భూమిని ఆవహించి నేను నా బలంతో భూతాలను నిలుపుతున్నాను. చంద్రుడుగా అయి, రస (జలము, అమృతము) స్వరూపంతో సమస్తమైన ఓషధు లకు పుష్టినిస్తున్నాను.

వ్యా: యేనద్యౌరుగ్రా పృథివీ చ దృఢా, సదుధార పృథివీః' అని ఉపనిషత్తు.

పంచభూతాల రూపంగా పరమాత్మ తాను ఏయే పనులు చేస్తున్నాడో ఆయా విషయాలన్నీ పరమాత్మ వివరిస్తున్నారు. క్రిందటి శ్లోకంలో తేజో రూపం ధరించి తానే ఆదిత్యుడుగా అగ్నిగా ఉంటున్నాననీ ప్రాణాధారశక్తిని ఆవిధంగా లోకానికి అనుగ్రహిస్తున్నాననీ చెప్పాడు. ఇప్పుడు భూమిగా తానై, అన్నీ భూతాలను పుట్టిస్తు న్నాననీ, చంద్రుడుగా తానై ఓషధులన్నింటినీ పుట్టిస్తున్నాననీ చెప్పారు. చుట్టుపక్కల ఏ వస్తువు వంక చూచినా, అది భూమినుంచే వచ్చినట్లు ఋజువౌతున్నదనీ, త్రవ్వినా, కాల్చినా, పొడిచినా, దున్నినా, ఎంత బాధించినా ఆ హింసనంతటినీ భరించి బిడ్డలకు చక్కని పాడిపంటలనిచ్చే భూమికంటె దైవమింకావేఱె ఎవరుండ గలరనీ అమ్మ అంటుంది. ఇలాగా ఎంత హింసించినా ఓర్చుకోగలిగే సహనశక్తి, నాగలి చేసిన గాయాల నుంచి తల్లి గనుక తన రక్తనాళాల నుండి రక్తం పోసి పెంచి బిడ్డను కన్నట్లుగా రసాత్మతో పాడి పంటలను కని జనులకు భూతాలకు ఇస్తూ, నిత్యమూ వాటిని బ్రతికిఉన్నా చచ్చినా మోస్తూ, తల్లిలాగా వాటికి ఆహా రాన్నిచ్చి పోషిస్తూ ఉంటే భూమికి ఈ బలం, ఈ ఓజస్సూ ఎలా అబ్బింది? పర మాత్మ రూపమయినది కాబట్టే భూమికి ఈ బలం, ఈక్షాంతి, ఈ సహనం అబ్బింది. చంద్రుడు ఓషధులకు రాజు. చంద్రుని వల్ల సముద్రానికి ఆటుపోట్లూ, ఋతు పవనాలూ కలుగుతాయి, భూమిలో నుంచి మొలకలను తన ఆకర్షణ శక్తిచేత చంద్రుడు పైకి లాగుతాడు. ఈ చేతన చర్యలన్నీ పరమాత్మ యొక్క లక్షణాలే.

14. అహం వైశ్వానరో భూత్వా ప్రాణినాం దేహ మాశ్రితః।
ప్రాణాపానసమా యుక్తః పచామ్యన్నం చతుర్విధం॥

తా: నేను వైశ్వానరుడననే అగ్నినై ప్రాణుల శరీరాలను ఆశ్రయించి ప్రాణా పానవాయువులతో కూడుకొని నాలుగు విధాలైన అన్నాన్ని పచనం చేస్తున్నాను.

వ్యా: ప్రతి దేహానికీ కడుపున్నది. ఆ కడుపులోని ఆంత్ర సామగ్రిలో పుట్టే జఠరాగ్ని తిన్న అన్నాన్ని పచనం చేసి రక్తంగా మార్చి అన్ని భాగాలకు పంపకము చేయడంవల్ల ఈ దేహం జీవిస్తున్నది. ఈ పచనక్రియకు ప్రాణాపాన వాయువులు మండే gas గా అయి ఈ అగ్నిని జ్వలింపజేస్తున్నవి. శ్రుతులు ఈ జఠరాగ్ని స్వరూపుడగు పురుషుణ్ణి భగవంతుడనియే పేర్కొన్నది.

"అయ మగ్ని ర్వైశ్వానరో, యోఽ య మంతః।
పురుషో, యే వేద మన్నం పచ్యతే' అని శ్రుతి

చతుర్విధాన్నములు అంటే భక్ష్యభోజ్య లేహ్య చోష్యములు. భక్ష్యములంటే నమలదగినవి, భోజ్యములు మ్రింగదగినవి, లేహ్యములంటే నాకదగినవి, చోష్యము లంటే జుఱ్ఱుకోదగినవి లేక పీల్చదగినవి. ఈ జఠరాగ్ని పచనం లేకపోతే భూతకోటి జీవించజాలదు. ఈ జఠారాగ్నిని అందఱింటిలో గాడిపొయ్యికి పోల్చవచ్చు. అన్న యజ్ఞాన్ని మించిన యజ్ఞం లేదు.

'ఈ యజ్ఞకుండాలూ, యాగహోమాలూ కంటే నాకు గాడిపొయ్యే ముఖ్య మనిపిస్తుంది. నేను ఏమయినా వెయ్యగలిగినా, వెయ్యవలసి వచ్చినా, అది గాడి పొయ్యిలోనే వేస్తుంటాను"

నా ఆయుధాలు గిన్నెలూగరిటెలే" అన్నది అమ్మ.

స్వర్ణోత్సవంలో లక్షల మంది కడుపుల్లో జరిగిన జఠరాగ్ని యజ్ఞం, నిత్యమూ అందఱింట్లో జరిగే జఠరాగ్ని యజ్ఞం, ఈ యాగాలన్నింటికీ ముఖ్యమైన ఋక్కు. అమ్మ పఠించే 'భోజనం చేశావా' అనే మంత్రమే.

అమ్మ అన్నం కలిపి నోట్లో పెట్టి తిన్పించిన ప్రతి బిడ్డా అమ్మతో కలిసి యజ్ఞ కర్తా యజ్ఞ భోక్తా, యజ్ఞ హోమం, యజ్ఞ క్రతువు, యజ్ఞ పశువు – అన్నీ అమ్మే.

15. సర్వస్య చాహం హృది సన్నివిష్టో
మత్తః స్మృతి ర్జ్ఞాన మపోహనం చ।
వేదైశ్చ సర్వై రహ మేవ వేద్యో
వేదాన్త కృద్వేద విదేవ చాహం॥

తా: సమస్త భూతకోటి హృదయాల్లో సన్నివిష్టుడనై ఉన్నవాడిని నేను. నేనే వాళ్ళ జ్ఞప్తిని, తెలివిని, మఱపును. అన్ని వేదాలనునేనే. వేదాలవల్లతెలియబడే వాడిని నేనే. వేదాన్తములను నిర్మించినవాడిని నేనే. వేదాలను తెలిసిన వాడినీ నేనే.

వ్యా: కడుపులో పచనమైన ఆహారం రక్తంగా మారుతుంది. అది శరీరంలో అన్ని భాగాలకు రవాణా కావాలంటే దానికొక యంత్రం కావాలి. ఆ యంత్రం హృదయం లేక గుండెకాయ. ఆ యంత్రం పనిచేస్తేనే అన్ని అవయవాలకు సమృద్ధిగా రక్తం ప్రవహించి అన్ని ఇంద్రియాలూ తమ తమ పనులను సక్రమంగా చేయగలుగు తాయి. గుండెకాయ నంటిపెట్టుకుని ఉండి అదే నేనై సక్రమంగా పనిచేసేవాడిని నేను అని పరమాత్మ చెపుతున్నారు. ఆ గుండెకాయ పనివల్ల రక్తం సక్రమంగా శిరస్సుకు

మెదడుకుపోతే స్మృతి అంటే జ్ఞాపకశక్తి, జాగ్రద్దశ సరిగా ఉంటుంది. కాదా నేను రక్తప్రసారాన్ని సరిగా పంపక లోపంచేస్తే అపోహనం అంటే మఱపుమైకం, మత్తూ వస్తాయి. స్మృతిని నేనే - మఱపునూ నేనే. స్మృతి జాగ్రద్దశవలనకలిగే ఫలితమైన తెలివి - ఆ తెలిసికొనే ప్రవృత్తిని నేనే. అంటే దృక్కును నేను. తెలిసికోబడే వాడిని నేనే - అంటే వేద్యుడను దృశ్యాన్ని నేనే. తెలివిని ప్రసరింపచేసే ఉపనిషత్తులకు రచయితను నేనే. ఆ వేదాలను తెలుసుకోగలవాడిని నేనే.

"యో బ్రహ్మాణం విదధాతి పూర్వం యో వై వే దాంశ్చ ప్రహిణోతి తస్మై"

"సర్వే వేదాయత్పద మామనంతి"

"అంతః ప్రవిష్ట శ్శాస్తా జనానాం సర్వాత్మా

యః పృధివ్యాం తిష్ఠన్నాత్మ నోన్తరోయమయతి'

'పద్మకోశ ప్రతీకాశం హృదయం చాప్యధోముఖం"

అథయ దస్మిన్ బ్రహ్మపురే దహరం పుండరీకం వేశ్మ" అని శ్రుతి వాక్యాలు ఒక వేదాంతి అమ్మను

'నీవెవరమ్మా? అసలు బ్రహ్మ పదార్థానివా? బ్రహ్మ తత్వానివా? లేక బ్రహ్మవా? అని అడిగాడు.

అమ్మా 'నేను మూటికీ మూలమై మూడు అయినాను' వేదాంతి. 'ఆ మూడు ఏమిటమ్మా'.

అమ్మ 'ఏ మూడు అయినా సరే. నేను బ్రహ్మమై నీవు అనే వస్తువు నేర్పఱచు కొన్నాను. నేను, నీవు మధ్యలో సంధి బ్రహ్మ పదార్థం'.

16. ద్వావిమౌ పురుషౌ లోకే క్షర శ్చాక్షర ఏవచ।
క్షర స్సర్వాణి భూతాని కూటస్థోఽ క్షర ఉచ్యతే॥

తా: లోకంలో క్షరుడనీ అక్షరుడనీ పురుషులు ఇద్దఱు. సర్వ భూతాలూ క్షర పురుషుడు. కూటస్థుడైనవాడు అక్షరపురుషుడు అని చెప్పబడుతుంది.

వ్యా: రెండు అనే ద్వైధీభావంతో మొదలుపెట్టింది శ్లోకం. పరమాత్మ ఒకే ఒకడు అని ఇన్ని అధ్యాయాలలో చెప్పుకుంటూవచ్చి ఇక్కడ పురుషులు ఇద్దఱు అని చెప్పడం వింతగా తోస్తుంది వినేవాళ్ళకు. కాని ఈ శ్లోకంలో 'లోకే' అనే మాట ఉపయుక్తం కావడంవల్ల లోకము అనే దృష్టికోణం నుంచి పరమాత్మను అర్థం చేసుకోవాలన్న మాట. పరమాత్మ స్వరూపం వేఱనీ, లోకం వేఱనీ చెప్పే పూర్వ వ్యాఖ్యాతల వాదం పూర్తిగా ఇందులో నిరాకరించబడుతుంది. ఎలాగంటే పరమాత్మ అంటే వికారం

చెందని స్వభావం కలవాడూ, వికారం చెందే స్వభావం కలవాడూ, రెండునూ అని శ్లోకం చెపుతుంది. వికారాలూ పరమాత్మే. వికారం లేకుండా ఉండేదీ పరమాత్మే. క్షరం అంటే నాశనం చెందే స్వభావం కలది అని అర్థం. నిజానికి శక్తి పదార్థాలలో దేనికీ నాశనం లేదు. లోకం అంతా శక్తి పదార్థాల వల్లనే ఏర్పడి ఉంది. శక్తి అంటే ఎక్కడబడితే అక్కడ పనిచెయ్యగల సత్తా కలది. పదార్థమంటే పనిచేయించగల సత్తా కలది. శక్తి మారు రూపులో ఉన్న పదార్థం. పదార్థం మారురూపులో ఉన్న శక్తి. శక్తి పదార్థంగానూ, పదార్థం శక్తిగానూ మారుతూ ఉండే వ్యాపారాన్నే జగత్తు అంటాం. జగత్తు అంటే అందులో ఉన్న స్థావర జంగమాలూ, చరాచరాలు, బుద్ధిజీవులూను. ఇవన్నీ వికారాలే. వికారాలు అన్నీ అవికారంగా ఉండే కూటస్థంగా ఉండే ఒక స్థితి నుండి వచ్చాయని అంటాం. అయితే వికారాలకు అవికారానికి మధ్య రేఖ ఎక్కడ? ఎక్కడ నుంచి క్షరత్వాన్ని గుర్తించాలి? ఎక్కడ నుంచి అక్షరత్వాన్ని గుర్తించాలి? అంటే ఎక్కడ కక్కడే సందేహమే. చెట్టు మొలకెత్తిన దగ్గఱ నుంచి దాని వికారం, దాని ఆది అనుకుందాం. అనుకుంటే, విత్తులో చెట్టు లేదా, ఆ చెట్టులో విత్తులేదా అనుకుంటూ వెనక్కి వెనక్కి ఆదిని వెతుక్కుంటూ పోయి అది కనబడక అనాది అని ఊరుకుంటాం. అనాది అనే మాటే నాకు సరిగా అర్థం కాదు. ఆది అని మొదలు పెట్టుకుని దానికి న చేర్చి అనాది అనుకుంటాం. పాజిటివ్‌ను పట్టుకుని నెగెటివ్‌ను వెతుక్కుంటాం. అలాగే అనంతం కూడాను. తెలిసిన అంతాలను బట్టుకుని అనంతమును వెదు క్కుంటాం. ఇంతకంటె మేలైనది మనకు తెలిసిన అన్ని ఆదులకు వెనక ఉన్నదేదో, మనకు తెలిసిన అన్ని అంతాలకూ అవతల ఉన్నదేదో అనే అర్థాలను బోధించే మాటలుంటే బాగుండునని తోస్తుంది అని అమ్మ అనే మాటలాగా, అజ్ఞాతం, తెలియనిది అని రెండు ఏకమైన అర్థం వచ్చే మాటే నాకు తోస్తుంది. కాని రెంటికీ వేఱుగా అర్థభేదం వచ్చే మాటలు నాకు తట్టడం లేదు. తొలి మలి శబ్దాలు, మొదలు చివర అనే భావం లేకుండా లేవు. కాబట్టి సుముద్రం దాని అలలూ అనే ఉపమానాన్ని ఈ సందర్భానికి అన్వయించుకొని ఆలోచిస్తే పుట్టి చచ్చే భూతాలన్నీ అలల క్రిందికి వస్తాయి. అలలు కాని సముద్ర భాగమంతా అక్షర పురుషుడి క్రిందికి వస్తుంది. అక్షరం అంటే మార్పు లేనిదని మారనిదీ అని కాదు. అప్పటికి మారకుండా మారుతున్నట్లు కనిపించకుండా ఉన్నది అని అర్థం. క్షరాక్షర పురుషుల భేదం ఒకటి అనే అంకెకున్న రెండుకొసల లాంటివి. పూర్వ వ్యాఖ్యాతలు కూటస్థం అనే మాటకు కమ్మరివాడి ఇనుప దిమ్మను కూటస్థం అంటారనీ, ఆ దిమ్మమీద ఎన్ని వస్తువులు సాగినా దిమ్మ మాత్రం మార్పు చెందకుండా ఉంటుంది అనీ. అందువలన అది అక్షరుడని చెప్పబడుతుంది అనీ

ప్రాస్తాయి. కాని నేటి సైన్స్ సూత్రాలప్రకారం ఒక వస్తువు ఇంకో వస్తువును తాకి నప్పుడు action, reaction అనేవి పని చేస్తాయని, బంతి తాకుడువల్ల గోడకు ఎంత దెబ్బ తగులుతుందో, గోడ తాకిడి వలన బంతికీ అంతే దెబ్బ తగులుతుందని శాస్త్ర విజ్ఞానం చెపుతుంది. పైన సాగే ప్రతి వస్తువూ ఇనుప ముక్కకు తగిలిన దెబ్బా, కలిగిన సాగుడూ, ఇంకో రూపంగా అంటే రియాక్షను రూపంలో ఆ దిమ్మ కూడా పంచుకుని ఉన్నదే. ఇనుప ముక్క చిన్నది కనుక మనచూపుకు అందేటంతగా ఒక దెబ్బకు సాగిపోయింది. క్రింద ఉన్న దిమ్మ కూడా అదే దెబ్బకు సాగింది. కాని అది పెద్ద మొద్దు దిమ్మ కావడంచేత దానిలో కలిగిన మార్పు మన చూపుకు అందడంలేదు. దానిలోని ఎలెక్ట్రానులను చూడగలిగే కళ్ళు మనకుంటే, ప్రతి దెబ్బకూ ఆ దిమ్మలోని ఎలెక్ట్రానుల మధ్య నాగసాకీ మీద ప్రేలిన ఆటంబాంబు ప్రేలుడువల్ల జరిగినంత హంగామా జరుగుతున్నట్లు మనం గుర్తించగలం. ఇదే మాటను అమ్మ తేలికగా.

'కాలికి తగిలిన దెబ్బను గుర్తిస్తాం. రాతికి తగిలిన దెబ్బను గుఱించి అనుకోం' అనేసింది. కాగా action కు తావలమైన సర్వాణి భూతాని క్షరపురుషుడుగాను, Re-action కు తావలమైన కూటస్థ ప్రకృతి అక్షర పురుషుడుగానూ రూఢి అయింది. ఈ రెండూ ఒకటి అనే అంకెకు ఉండే రెండుకొసలు అని చెప్పుకున్నాంగదా. రెండు కొసలలో ఏదైనా క్షరపురుషుడు కావచ్చు, ఏదైనా అక్షర పురుషుడు కావచ్చు. చూచే వాడి అధికారాన్ని అనుసరించి – అయితే ఈ రెండు కొసలమధ్య ఉన్న ఒకటి ఏమిటి ఆ సాగిన గీతలాంటిది ఏమిటి అనిపించవచ్చు ఎవరికైనా.

17. ఉత్తమః పురుషస్త్వన్యః పరమాత్మే త్యుదాహృతః।
యో లోకత్రయ మావిశ్య బిభర్త్యవ్యయ ఈశ్వరః॥

తా: క్షరాక్షరులకు అన్యంగా అనిపించే పరమాత్మ ఒకడుదాహృతుడైనాడు. అతడు తానేఅయిన లోకత్రయాన్ని ఆవేశించి, ఈశ్వరుడై, అవ్యయుడై భరిస్తున్నాడు.

వ్యా: బిందువుకు అస్థిత్వమే తప్ప స్థానం లేదు. స్థానం ఉన్నట్లు అనిపిస్తుంది. బిందువు విస్తరిస్తే వర్తులమౌతుంది. మహత్తౌతుంది. బిందువు స్థానాన్ని అపేక్షించి కదిలి ప్రయాణించడ మారంభిస్తే, అది నడిచిన దారిని రేఖ అంటాం. మొదటి అస్తిత్వ మాత్రంగా ఉండి స్థానం లేని బిందువు కేవలం చిత్తుగానే ఉంటుంది. స్థానాపేక్ష దానికి కలిగి సూదిమోపుకాగానే అది అచిత్తు ఔతుంది. అది విశ్రామ స్థానమే. నిజానికది ఫుల్‌స్టాప్. అలా ఉన్నా బాగుండి పోను. అది అలా ఉండక ద్వంద్వాపేక్షతో కదిలేసరికి రెండుకొసలూ, మధ్యమ పరిమాణంగల విధి రేఖ అవుతుంది.

బయలుదేరిన చోట అక్షర పురుష స్థానం. ఆఖరైనచోటు క్షర పురుషస్థానం. ఏదీ ఉండి ఉండకపోతే ఈ బిందువుకాని, ఈ ద్వంద్వంగాని, ఈ విధి రేఖ కాని ఉండక పోయేదో అది రెండుకొసల మధ్య తానే. ఈ రెండు కొసలకు ఆధారరేఖగా నిలుస్తున్నది. అదే పురుషోత్తమ స్థానం. అదే పరమాత్మ స్థానం. గీతకున్న రెండు కొసలను అంటే ద్వంద్వాలను ఏకం చేసుకుని అతడు అణోరణీయాన్ అయిపోవచ్చు. లేదా క్షరాక్షర పురుషులను కూడగట్టుకొని మహతో మహీయాన్ గానూ అయిపోవచ్చు. ఈవిధంగా ఏకమేవా ద్వితీయం బ్రహ్మ అనే శ్రుతి వాక్యం సార్థకమౌతున్నది. ఈ విషయాన్నే ఇంకోవిధంగా చెప్పుకోవచ్చు. కదిలే రైలుకు కదలని పట్టాలు ఆధారం. కదలని పట్టాలకు కదుల్తున్నా కదలనట్లు కనిపించే భూమి ఆధారం. ఈ ఉపమానంలో కదిలే రైలు క్షర పురుషుడు. కదలని పట్టాలు అక్షర పురుషుడు. కదుల్తా ఉన్నా కదుల్తాన్నట్లు కనిపించకుండా సర్వానికి ఆధారమై ఉన్న భూమి పురుషోత్తముడు. ఈ పురుషోత్తముని రూపాలే క్షర పురుషుడూ అక్షర పురుషుడు.

8వ అధ్యాయంలో అక్షర పురుషుణ్ణి గురించి ఈవిధంగా వర్ణించబడి ఉంది.

అక్షరం బ్రహ్మ పరమం స్వభావోఽ ధ్యాత్మ ఉచ్యతే
భూతభావోద్భ వ క రో విసర్గః కర్మ సంజ్ఞితః
అధి భూతం క్షరోభావః పురుషశ్చాధి దైవతం
అధియజ్ఞోఽ హ మే వాత్ర దేహే దేహ భృతాంవర

సర్వోత్తమమై నాశనంలేని దానిని అక్షర పరబ్రహ్మ అంటారు. దాని స్వభావాన్ని ఆధ్యాత్మమంటారు. ప్రాణుల రూపాలుగా అది ఉత్పత్తి అయ్యే విసర్గక్రమాన్నే కర్మ అని పేరుబెట్టి పిలుస్తారు. క్షరభావం కలది అధిభూతం. పురుషుడు అధిదైవతం - ఈ దేహాలయందుండే జీవితమనే అధియజ్ఞాన్ని నేనే.

పైవిధంగా ఆకాశాది పంచ భూతాలూ, వాటి మార్పుల్లోని పంచతన్మాత్రలూ, వాటి తాలూకు ఆశ్రయాలూ ఈ మొత్తాన్ని సూచించుతూ మారుతూ ఉండే చరాచరాలూ, ఇవన్నీ అధి భూతంగానూ, తానే అధిదైవంగానూ తానే అని పరమాత్మ చెప్పి ఉన్నారు. అధి యజ్ఞం అంటే ఈ జీవితమనే చెప్పి ఉన్నారు.

పై శ్లోకంలో కూడా ఈ భావాన్నే మరో రూపంగా చెప్పారు. కొంతమంది వేదాంతులు, పరమాత్మ అని మనం వ్యవహరించే చైతన్యం కేవలం పరాశక్తి స్వరూపమైన శ్రీ చక్రానికి పై గీతలలోదేననీ, బ్రహ్మజ్ఞానులని చెప్పబడే విశిష్ట వామదేవ విశ్వామిత్ర నారదాది మహర్షులు శ్రీ చిత్రం పైపైన ఉన్న రేఖలలోనే సంచరిస్తున్నారు

కాని అంతరాంతరాలను గూర్చిన గాఢ గూఢ రహస్యం అచ్చుటి వెలుగూ ఎవరికీ ఇంతవరకు అవగాహన కాలేదని, ఆ వెలుగును చూచిన వాళ్ళింతవఱకు పుట్టలేదని అంటారు. ఈ తరగతుల విచారణ చేయడానికి మానవమేధకు సాధ్యం కాదు. పూర్వ వ్యాఖ్యాతలు మాత్రం ఈ ఘట్టంలో ఇలా వ్రాశారు.

'ఈ ప్రపంచమున క్షర పురుషుడు, అక్షరపురుషుడు, పురుషోత్తముడు అని ముప్వురు కలరు. అక్షర పురుషుడనగా ఎనిమిదవ అధ్యాయమునందు తెలుపబడిన అక్షర పరబ్రహ్మమని యెవరును భ్రమ పడరాదు. ఈ రెండింటికి ఆకాశ పాతాళ భేదము కలదు. జీవుని జీవత్వము మోక్షము పొందువఱకును నశింపదు. కావునను, చిదాభాసరూప ప్రతిబింబము శరీరాదులు నశించినను నూతన దేహములను ధరించి చిరకాలము (ఆ మోక్షము) వర్తించుచుండుట వలనను, ఈ ప్రకారముగ క్షణికములగు శరీరాదులతో పోల్చిన, దీర్ఘకాలము ఆయుర్దాయము కలిగియుండుట వలనను జీవుని (చిదాభాసుని) అక్షర పురుషునిగ నిట వర్ణించి చెప్పిరి. క్షరపురుషు డనగా దేహాదులు, ఈశ్వరాక్షములకు అనగా దేహ చిదా భాసులకు అన్యముగ బింబ రూపమగు శుద్ధ చైతన్యము కలదు. అదియే పరబ్రహ్మము. దానినే పురుషోత్తముడని ఇట పేర్కొనిరి. అతడే చరాచరములందు వ్యాపించి, బ్రహ్మాండములన్నింటికిని ఆధార భూతుడై వెలయు అవ్యయ పరమాత్మ మొదటి ఇరువురు ప్రకృతికి, మాయకు అధీనులు.

కనుకనే –

ఉత్తమః పురుషస్త్వన్యః పరమాత్మే త్యు దాహృతః।
యో లోక త్రయ మావిశ్య బి భర్త్యవ్యయ ఈశ్వరః।

అని ఈ అధ్యాయమున తెలుపబడినది. "అనగా స్థూల సూక్ష్మ ప్రకృతులకంటె, దేహమనశ్చిదాభాసులకంటె అన్యుడైన వాడు పరమాత్మ అని భావము".

ఏ పరిస్థితుల్లోనూ దేహాదులను పరమాత్మగా పూర్వ సిద్ధాంతాలు ఒప్పుకోవు. ఏరకంగానూ ఈ సంసారాన్ని పరమాత్మగా చెప్పవు. కాని తమకు అనుకూలమైన అర్థాలను రప్పించుకోవడానికి, పరమాత్మను ఏ గ్రేడుకు కావాలంటే ఆ గ్రేడుకు దింపి, అక్కడ తాము కట్టుకున్న గాబుకో, తొట్టికో సరిపోయేలాగా భగవంతుడిని మలుచుకోవడానికి వ్యాఖ్యాతలు వెనుదీయరు. అదే పని జరిగింది పై వ్యాఖ్యానంలో కూడా. పురుషోత్తముడు – superlative degree కనుక లోకాలను భరించే పర మాత్మ రెండోగ్రేడు పురుషుడు అక్షర పురుషుడు – జీవాత్మ అక్షరశబ్దానికి దీర్ఘకాలము ఆయుర్దాయం కలవాడని అర్థం చెప్పుకున్నారు. క్షర పురుషుడు మూడోగ్రేడు – నశించే భగవంతుడు – అంటే నశించే శరీరంగా ఉండే భగవంతుడు. ఇన్ని పల్టీలు

ఎందుకు వెయ్యాల్సి వస్తుందో తెలీదు. పరమాత్మ ఒక్కడే ఉన్నాడు. ఆకాశంగా ఉన్నా భూమిగా ఉన్నా పరమాత్మ పరమాత్మే. బంగారం ఎక్కడ ఉన్నా బంగారమే. ఎలెక్ట్రిసిటీ ఎక్కడ ఉన్నా ఎలెక్ట్రిసిటీయే అనే అర్థాన్ని సీదాగా చెప్పరు. కనపడే సృష్టి అంతా తానే అని పరమాత్మ పై శ్లోకాలలో చెపుతున్నా డొంక తిరుగుడు మాటలతో సృష్టికీ పరమాత్మకూ భేదం చెప్పడానికి విపరీతార్థాలతో నిండిన వ్యాఖ్యానాలు వ్రాస్తున్నారు. విపరీత వ్యాఖ్యానాలకు అలాంటి అర్థాలు తీయడానికి తావిచ్చే కొన్ని శృతి వాక్యాలను వారుదహరిస్తున్నారు.

"అజామేకాం లోహిత శుక్ల కృష్ణాం, బహ్వీః ప్రజాం జన
యన్తీగ్ం సరూపాం, అజోహ్యే కోజుషమాణోఽ ను
శేతే, జహాత్యేనాం భుక్త భోగామజోన్యః"

అనే శ్రుతి 'అజ' శబ్దంతో పై మూడు రకాలయిన పురుషులనూ వివరిస్తున్న దంటారు.

'సర్వం ఖల్విదం బ్రహ్మతజ్జలానితి'

అనికూడా శ్రుతి చెప్పింది. ఈ మాట నేను ఎందుకు ప్రమాణంగా తీసుకోరు మరి?

'సర్వగ్ం హ్యే తద్బ్రహ్మ' అని మాండూక్యోపనిషత్తు

18. యస్మాత్ క్షర మతీతోఽ హ మక్షరా దపి చోత్తమః
అతోఽ స్మి లోకే వేదే చ ప్రథితః పురుషోత్తమః॥

తా: ఏ కారణంచేత నేను క్షరపురుషుడికి అతీతుడనూ, అక్షర పురుషుడి కంటే ఉత్తముడనూ, అయి ఉన్నానో ఆ కారణంవల్ల లోకమునందును, వేదాలలోను పురు షోత్తముడనని ప్రసిద్ధి పొందినాను.

చెప్పుతున్నది శ్రీకృష్ణ పరమాత్మ ఒక్కడే. శరీర ప్రకృతిగా అయి ఉన్న క్షర పురుషుడి కంటె అతీతమైన వాడిని కనుకనూ, జీవప్రకృతిగా అయి ఉన్న అక్షర పురుషుడికంటె శ్రేష్ఠుడనయి ఉన్నాను కాబట్టి నేను 'తమ' శబ్దవాచ్యుడనై ఉన్నాను. శ్లోకంలో అక్షర పురుషుడికంటె ఉత్తముడనని చెప్పుకొనడం చేత ఈ మూడూ కలిసి ఉన్నతన రూపం ఎక్కువదే అవుతుంది. కాబట్టి పురుషోత్తమ శబ్దం లోకంలో వ్యవ హారంలో అన్వర్థమైనట్లుగానే వేదాల్లోను ప్రఖ్యాతిగన్నదని పరమాత్మ చెపుతున్నారు. ఉపాధి భేదాలచేతనే పరమాత్మయందీ తరతమ భావాలు కాని వస్తుతః లేవనే గ్రహించేది.

19. యో మామేవ మసమ్మూఢో జానాతి పురుషోత్తమం।
స సర్వ విద్భజతి మాం సర్వభావేన భారత!॥

తా: అర్జునా! ఎవడైతే పురుషోత్తముడనైన నన్ను ఇలాగా అజ్ఞానం లేకుండా సంపూర్ణంగా తెలుసుకుంటున్నాడో, అతడు సర్వమూ తెలుసుకున్న వాడై సర్వ భావంతో భజిస్తుంటాడు.

సత్యమిథ్యాత్వ యోగాలవలన ఆత్మ అనాత్మ అనే ప్రతీతి కలుగుతూ ఉంటుంది. అపరోక్షాత్మాను భవం అనేది ఈ రెండింటిలో ఆత్మప్రతీతి. అది స్వానుభవంవల్ల, అమ్మ దయవల్లా కలుగుతుంది. శ్రుతులు దేహానుబంధం వల్ల అనాత్మ ప్రతీతి కలుగుతుందనీ సర్వాత్మక భావంవల్ల ఆత్మప్రతీతి లేక బ్రహ్మప్రతీతి కలుగుతుందనీ చెపుతాయి. మొదట్లో 'అహం బ్రహ్మాస్మి' (బ్రహ్మయే నేను) అనే అపరోక్షానుభూతి కలిగితేనే కాని తరువాత 'సర్వం ఖల్విదం బ్రహ్మ' 'బ్రహ్మయేకదా సర్వం' అనే సర్వాత్మ భావం సోపత్తికంగా ప్రతీతం కాదంటాయి శ్రుతులు.

'ఆదౌ బ్రహ్మాహమస్మీత్యనుభవ ఉదితే ఖల్విదం

బ్రహ్మపశ్చాత్'

అంటారు శంకరులు.

సర్వభావేన = సర్వాత్మ చిత్తత చేత అనిశం.

20. ఇతి గుహ్యతమం శాస్త్ర మిద ముక్తం మయాऽ నఘ!।
ఏతద్బుద్ధ్వా బుద్ధిమాన్ స్యాత్ కృతకృత్యశ్చ భారత!॥

పాపరహితుడా!

తా: అర్జునా! ఈ పురుషోత్తమ ప్రాప్తి యోగమనే పరమ రహస్యమైన శాస్త్రాన్ని నీకు చెప్పాను. దీన్ని చక్కగా తెలుసుకున్న బుద్ధిమంతుడు కృతకృత్యుడౌతున్నాడు.

వ్యా: పరమాత్మ ఈ లోకం వేఱు. నేను వేఱుకాదని ఎవడు తెలుసుకుంటాడో వాడు కృతకృత్యుడు అని సెలవిస్తున్నారు. ఇదే గుహ్యతమమైన శాస్త్రం.

ఇది శ్రీ మన్మాతృగీతలోని పురుషోత్తమ ప్రాప్తి యోగమను పంచదశోధ్యాయము

మాతృగీత

దైవాసుర సంపద్విభాగయోగము

పదునాఱవ అధ్యాయము

శ్రీ భగవానువాచ

1. అభయం సత్త్వ సంశుద్ధి ర్జ్ఞాన యోగవ్యవస్థితిః।
దానం దమశ్చ యజ్ఞశ్చ స్వాధ్యాయ స్తప ఆర్జవమ్॥

2. అహింసా సత్య మక్రోధ స్త్యాగ శ్శాన్తి రపైశునం।
దయా భూతేష్వలోలుప్త్వం మార్దవం హ్రీ రచాపలం॥

3. తేజః క్షమా ధృతి శ్శౌచ మద్రోహో నాతిమానితా।
భవన్తి సంపదం దైవీ మభిజాతస్య భారత!॥

తా: అర్జునా! భయం లేకపోవడం, అంతఃకరణం నిర్మలంగా ఉండడం, జ్ఞాన యోగము నందు నిష్టగలిగి ఉండడం, దానం, ఇంద్రియ నిగ్రహం, యజ్ఞం, వేదాధ్యయనం, తపస్సు, సత్ప్రవర్తనం, హింస చేయకపోవడం, నిజం పలకడం, కోపం లేకుండడం, త్యాగం, శాంతి, కొండెములు చెప్పకుండా ఉండడం, ప్రాణుల యందు దయ, విషయాసక్తి చేత చలింపకపోవడం, మృదుభాషిత్వం, సిగ్గు, చపలత్వం లేకపోవడం, ప్రభావము, ఓరిమి, ధృతి, శుచిత్వం, ద్రోహభావం లేకపోవడం, స్వాతిశయం లేకుండా ఉండడం, దైవసంపత్తి కలవాడికి కలుగుతున్నవి.

వ్యా: క్రిందటి అధ్యాయాలలో పరమాత్మ శరీర స్వరూపాన్ని గుఱించీ, ఆత్మ స్వరూపాన్ని గుఱించీ, ఉపాయ స్వరూపాన్ని గుఱించీ, ఫల స్వరూపాన్ని అంటే ముక్తిని గుఱించీ చాలా వివరంగా చెప్పేరు. ముక్తి లాభానికి ఆటంకాలు ఏమిటి? అని చర్చిస్తూ దైవాసుర సంపత్తులను గూర్చి చెపుతున్నారు. దేవశబ్దంనుంచి దైవం తద్భవం. దేవ శబ్దానికి ప్రకాశం అని అర్థం. మనస్సుకు దైవగుణాలవల్ల ప్రకాశం ఏర్పడుతుంది. అసుర గుణాలవల్ల అంధకారం ఏర్పడుతుంది. దానికిగాను సత్వ గుణం దానంతట అది పెరగాలి. దైవీయమైన సంఘటనతోనే సత్వగుణ సంపత్తి అల్లుకుంటుంది. ఆహార నియమాలు సాధనలూ దానికి తోడ్పడవచ్చు. సాధనలను చేద్దామనే మనస్సు, ఆహార నియమాలు పాటించుదామనే ఆతురతా, దైవప్రేరణ వల్లనే మొదట్లో కలిగినప్పుడు ఈ నియమాలూ, సహజమవుతాయి. కృత్రిమత్వమూ

దైవప్రేరణే. కృత్రిమత్వాన్ని అవలంబించినవాడు "జటిలో ముండీలుంఛిత కేశః" లాగా తయారైన సత్వగుణం గల వాడౌతాడు. దైవ గుణాలకు వ్యతిరేక గుణాలు అసుర గుణాలు. ఈ రెండురకాల గుణాల ప్రాచుర్యమే దైవీ సంపత్తు ఆసురీ సంపత్తు అని తెలియబడతాయి. దైవీ సంపత్తు, ఆసురీ సంపత్తు అనే వాటిని ఆత్మ గుణా లంటారు. సంపద అంటే ఐశ్వర్యం అని అర్థం. పుట్టేది అని కూడా అర్థం.

దైవీ సంపద్గుణాలను పరమాత్మ పై మూడు శ్లోకాలలో క్రోడీకరించారు.

1. అభయం - భయం లేకపోవడం - ఇష్ట వస్తువును విడదీసేటప్పుడూ, అనిష్ట వస్తువు సంక్రమించేటప్పుడూ కలిగే మనోవికారం భయం - అది లేకపోవడం అభయం. పసిపిల్లలకు భయం ఉండదు. పామైనా, నిప్పైనా వాళ్ళకు ఒకటే. ఒకసారి నిప్పుదగిలి బొబ్బెక్కిన తరువాత ఆ అనుభవం భయంగా ఏర్పడు తుంది. కాబట్టి పుట్టేటప్పుడు నిప్పంటే భయం పెట్టుకుని ఎవడూ పుట్ట డనిపిస్తుంది. తల్లి ఒళ్ళో ఉన్నాను నాకేం భయం అనుకుని ఒక బిడ్డ HT current తీగలను పట్టేసుకున్న సంగతి అందఱు ఎఱిగినదే. తల్లి ఒళ్ళో లేకపోవడం పసిపిల్లవాడికి భయం. తల్లి ఒడి నిర్భయం, నిశ్చింత ఐన నిద్ర కూడా బిడ్డకు తల్లి 'ఒడే'. జీవికి మరణ భయం చాలా గొప్పది. అదిలేకుండా ఉండడం అభయం.

2. **సత్త్వసంశుద్ధి:** అంతఃకరణ శుద్ధి: సహజముగా హృదయము నీరై ద్రవించు కోగల కోమలత్వము, వాత్సల్యము కలిగియుండుట. సత్త్వగుణ సంశుద్ధి. అమ్మకు ఈ గుణం స్వభావ జన్యం. అమ్మ విషయంలో ప్రేమ వెదజల్లడమనేదే లేదు - ప్రేమ స్వరూపమే అమ్మ - 'అ కుక్క స్థితి ఏమిటీ? అది యే అవతారం? దానికి మనం ఏవిధంగా నమస్కారం చెయ్యాలి ? (పశువు) తనుకన్న దూడ యొక్క మలినము తల్లి నాకి శుభ్రం చేయవలసిందే. ఇంకొకరు కడిగితే ఆమైల పోదు' అంటుంది అమ్మ.

బిడ్డయొక్క శారీరక మనోమాలిన్యాలను ప్రక్షాళనం చేయడానికి దైవం మాతృ మయమై మనసును ఉద్ధరిస్తున్నాడని తాత్పర్యం. అటువంటి భావాన్ని సత్వ సంశుద్ధి అంటారు.

3. **జ్ఞానయోగ వ్యవస్థితం:** జ్ఞానయోగం అంటే ఏమిటి? సర్వమూ తానే అయి నడుచుకుపోయేది ఉన్నది అన్న తెలివే జ్ఞానం. జ్ఞానం పొందడమేకాని జ్ఞానం వల్ల పొందడమేమీ లేదు. ఇటువంటి జ్ఞానంలో లీనుడైపోయి తాను చెయ్యని

వాడై ఉండి కర్మలుచేస్తూ, అన్ని రూపాలూ ఒకటేనన్న స్థాయికి వచ్చి, తన రూపత్వ పరిమితిని దాటి, రూపత్వ క్రియాత్వ గుణత్వాలు అనే భావ సమాధిలో ఉండడం జ్ఞాన యోగ వ్యవస్థితమైన బుద్ధి ఆత్మజ్ఞానాన్ని జీవితాను భవంగా మార్చుకోవడం యోగం. ఈ అపరోక్ష జ్ఞానం ప్రత్యక్షంగా కలిగిన వానికి శబ్దం, నిశ్శబ్దం, అజ్ఞానం ప్రజ్ఞానం, కర్తా కర్మా క్రియా అన్నీ బ్రహ్మ అవుతాయి. అన్నం బ్రహ్మ, భోక్తా బ్రహ్మ, అర్పణం బ్రహ్మ, హవిస్సు బ్రహ్మ, గంతవ్యం బ్రహ్మ అన్న జ్ఞానం బ్రహ్మ.

"అది ఇచ్చేదీ బ్రహ్మే" అంటుంది అమ్మ.

4. **దానం:** న్యాయార్జితమైన ధనాన్ని పాత్రదానం చెయ్యడం. ఒక దమ్మిడీ బిచ్చ గాడికి దానం చేస్తే మన కష్టార్జితం ఎంతో తెగించి బలిదానం చేశామను కుంటాం. ఒకసారి అమ్మకు నమస్కారం చేస్తుంటే జేబులో ఉన్న పర్సుతోసహా అన్ని వస్తువులు, చేతికి పెట్టుకుని ఉన్న గడియారం కూడా అమ్మ కాళ్ళ ముందఅ పడిపోయినయి. గట్టిగా పెట్టుకున్న గడియారంకూడా పడిపోవడం నాకు వింతగానే కనిపించి ఉండబట్టలేక అమ్మను అడిగాను ఇలా ఎందుకు పడిపోయాయని. అమ్మ అన్నది కదా 'అన్నీ అమ్మవే కనుక. అంతకంటే ఏం లేదు' అని. ఇందాక చెప్పిన దమ్మిడీ కూడా అమ్మదే. ఆ బిచ్చగాడూ అమ్మ బిడ్డే. దానమూ అమ్మే. ఇచ్చేవాడూ అమ్మ బిడ్డే. అంతా కర్తా, కర్మా, క్రియా చుట్టడి వేసుకున్న సర్కిలే. అమ్మ సొమ్ము అమ్మకే ఇస్తున్నట్లుగా అనుకొని చేసినదే దానం - అమ్మ చేసే అన్నదానం ఇందుకు నిదర్శనం.

"దానం చేద్దామనుకున్నా పుచ్చుకునే వాడున్నప్పుడే కదా! వీడెంత ముఖ్యమో వాడూ అంతే ముఖ్యం". తినడంలో ఆకలీ పెట్టడంలో ఆదరణా రెండూ కావాలి.

5. **దమము:** ఇంద్రియ నిగ్రహము. బాహ్యేంద్రియ నిగ్రమహతు శంకరుడు - మనస్సు విషయముల పైకి పోకుండా ఉండడమని రామానుజులు, అంతా పరమాత్మ ప్రేరణ వల్లనే అని అమ్మ.

6. **యజ్ఞం** - జీవితమే ఒక యజ్ఞం. పూర్వ వ్యాఖ్యాతల ప్రకారం ఇది దేవఋణం తీర్చడం. శ్రౌత స్మార్త యజ్ఞాలని శంకరులు. ఫల రహితంగా చేసే మహాయజ్ఞా దులని రామానుజులు.

7. **స్వాధ్యాయం** - వేద పఠనం - సంప్రదాయం ప్రకారం ఇది ఋషి ఋణం తీర్చడం.

8. తపః - తపస్సు - పూర్వుల మతంలో ఇది పితృణం తీర్చడం.

'అమ్మా నీ పూజ ఏమిటమ్మా' అని ఎవరో అడిగారు అమ్మను.

'మీరు కావాలనుకోవడడమే' అన్నారు అమ్మ.

ఎవరు దగ్గఱ లేరనుకుంటున్నామో, ఎవరు కావాలనుకుంటున్నామో వారిని ఆవేదనతో ఆరాధిస్తున్నావు. ఆరాధనం అంటే ఆవేదనే అమ్మా. ఏడుపు అంటే కన్నీళ్ళు కాదుగా! హృదయాన్ని దగ్ధంచేసే అగ్ని ప్రవేశించి దహనం చేస్తుంది. అది సర్వమతాలనూ, రాగద్వేషాలనూ దహనం చేసే మహాయోగం. అదే అందఱూ సర్వ సామాన్యంగా చెప్పుకునే హఠయోగం. అదే భక్తి (యోగం). సర్వకాల సర్వావస్థలయందూ ఉన్నప్పుడు అదే జ్ఞానం. అదే నిష్కామకర్మ - అదే సర్వం.

9. ఆర్జవం = ఋజుత్వం - మనస్సుకు మాటకు ఏకసూత్రత -సామాన్యంగా మనస్సులో ఒకటి అనుకుంటూ మాటలో ఒకటి చెప్తుతుంటాం. భయం వల్లనో లేక వంచించాలనో ఏదో వంకరతనం మనసుకూ మాటకూ మధ్యన నిలిచి వాటిని కలవనీకుండా చేస్తుంది. అలా ఉండకపోవడం ఋజు వర్తనం ఔతుంది.

10. అహింసా "ప్రాణినాం పీడా వర్జనమ్'

హింస అంటే సహించలేందే నాన్నా! మేకలను కోసేవాడు, ఆవులను నఱకడం సహించలేడు. కోళ్ళను కోసేవాడు గొఱ్ఱెలను చంపడం చూడలేడు. సర్వమూ ప్రాణమయం అనుకున్నప్పుడు అన్నం తినడమూ, కూరగాయలను కోయడమూ, మంచినీళ్ళు త్రాగడమూ కూడా హింసే - కనుక - ఏదిహింస? ఏది కాదు? అన్నది సమస్య కాదు. ఎవరు ఏది సహించలేరో - అదే హింస కాబట్టి - దానిని మానుకుంటే సరిపోతుంది - అదీ మానుకోగలిగితే."

11. సత్యం: యథాదృష్ట కథనం భూతహితం సత్యం.

భూతహితంగా ఉంటూ ఉండేలాగా జరిగిన దాన్ని జరిగినట్లు చేప్పేది సత్యమన్నారు పెద్దలు. ప్రకృతి శక్తులకే మొగమాటం లేదు. ఎవడికి నష్టం వస్తుందో ఎవడికి అపకారం జరుగుతుందో ఆ విషయాలను ఆ శక్తులు మినహాయించుకోవు ఉన్నవి ఉన్నట్లుగా చేసి పారెయ్యడమే వాటికి చేతనౌతుంది. ఇంకోరీతిగా చెయ్యడం చేతకాదు. ప్రకృతి సత్యమే. నిజమైన సత్యం. మిగతాది అదికానిది బూటకము.

సత్యం బ్రూయాత్, ప్రియం బ్రూయాత్, నబ్రూయాత్ సత్యమప్రియం అని కాదు సత్యమంటే ఇక్కడ అర్థం. రామకృష్ణుడు సత్యాన్ని తప్ప అన్ని అమ్మకు అర్పణ చేసుకున్నాడు. అందువలన సత్యవిరుద్ధంగా ఏది జరిగినా అతని శరీర వ్యాపారాలు దాన్ని ప్రతిఘటించేవి. ఒకసారి నరేంద్రుడు రామకృష్ణుని విస్తరిక్రింద రూపాయి

నోటు పెట్టాడు. ఆ విస్తరి ముట్టుకోవడానికి కూడా రామకృష్ణుని శరీరం ఒప్పుకోలేదు సరిగదా– యమ యాతన అనుభవించింది. అతడు సన్యాసి కనుక లోహపాత్రను తాకడానికికూడా అతని శరీరం ఒప్పుకునేది కాదు. దాహం ఎలా తీరడం మఱి. ఒక గుడ్డతో గ్లాసును పట్టుకుందామన్నా అతని శరీరం ఒప్పుకునేది కాదు. అందుకని మట్టిపాత్రనే దాహానికుపయోగించేవాడు – ఇదీ సత్యానికి నిజమైన అర్థం.

12. అక్రోధం: అమ్మకు వచ్చే కోపం చాలా విలక్షణంగా ఉంటుంది. అది అక్రోధమో, క్రోధమో తెలీకుండా ఉంటుంది.

ఒక సోదరి "మమ్ములను చూస్తే పాపమనిపిస్తుందా?" అని అడిగింది.

అమ్మ "కాదు. కోపం. మీరు కోరినట్టుగా చూసుకోలేకపోతున్న తల్లి కడుపున పుట్టారని కోపం" అన్నది.

ఇలాంటి కోపం అక్రోధం కంటే ఎన్నోరెట్లు శ్రేష్ఠమైన తరగతికి చెందింది. అక్రోధంలో చైతన్యం లేదు. ఈ కోపంలో చైతన్యం వెల్లివిరిసి ఉంది. అంతేకాని జుట్టూ జుట్టూ పట్టుకు లాగినా, తన్నినా కోపం రాకపోవడం కాదు అక్రోధమంటే.

13. త్యాగం: 'తనకొఱకు చేసేది రాగమూ
ఇతరుల కొఱకు చేసేది త్యాగమూ'– అమ్మ.

సన్యాసం ఆత్మహితానికి విరుద్ధమైన పనిని విడుచుట (రా)తన దనుకునే వాటిమీద తనదనే బుద్ధివదలి పెట్టడం త్యాగం. క్షమకూ అక్రోధానికీ భేదం ఉంది. కోపం రాకపోతే క్షమ. కోపం వచ్చి తగ్గితే అక్రోధం.

14. అపైశునం: పరుల దోషాలను ఇతరులకు చెప్పడం – కొండెములు చెప్పడం.

15. భూతేషు దయ? – భూతదయ.

'ఈ ఆవరణలో ఒక్క కుక్క ఉండేది. దాని తల్లి పిల్లి దగ్గఱ పాలుత్రాగింది. దానికి పాలు ఇచ్చే భాగం చీలిపోయింది. అయినా ఆ తోలును ముక్కల కఱచుకొని దాని పిల్లలు పాలుత్రాగేవి. శరీర నిర్మాణం కలిసి ఉంటేనే పాలు ఏర్పడేది. పిల్లలు అలవాటువల్ల పట్టుకున్నాయి. తల్లి ఇస్తున్నది. ఆ భాగం చీకిపోయింది. కనుక పాలుగాక రక్తం వస్తున్నది. నాన్నగారు ఆ దృశ్యాన్ని చూచి సహనానికి ఇదే నిదర్శనం అన్నారు' అమ్మ.

16. శాంతి: అమ్మ అంతఃకరణము యొక్క ఉపశమనము. బాధ ఆలోచనా అన్నీ ఉన్నాయి నాకు. 24 గంటలూ ప్రతి చిన్నదానికీ ఏడుపు వస్తున్నది. ఇన్నీ ఉండి అశాంతి ఎందుకు కలుగుతున్నది.

భర: నీకే నిజంగా అశాంతి ఉండి ఉంటే తొలగించుకోవాలనే ప్రయత్నం చేసే దానివే.

అమ్మ: ఎప్పుడూ అశాంతే. నన్ను మీరు ఆనంద స్వరూపమంటున్నారు. ఆనందం లేకుండా లేదు. సర్వకాల సర్వావస్థలతో లేదు. – శాంతి సముద్రంలోని అశాంతి తరంగాలు – అమ్మ.

17. అలోలుప్త్వం: నిర్లిప్తత్వం – రుచి ఐన దానిమీదకు పరిగెత్తడం లోలుపత్వం. అది లేకపోవడం అలోలుపత్వం

వార్థ: అమ్మ నిర్లిప్తంగా చూస్తూ ఉంటుంది.

అమ్మ: అనుకున్నది జరగనప్పుడు అందఱూ నిర్లిప్తంగా చూస్తూ ఉన్నారే.

భర: అశక్తతవల్ల నిర్లిప్తత వేఱు. నీ చూపులోని నిర్లిప్తత వేఱు.

18. మార్దవం: 'లేత గులాబీ రేకుల్లాంటి ఆ అతి సున్నితమైన మెత్తని పాదాలు మన మొరటు చేతుల స్పర్శకు కందిపోతాయి. కానీ అమ్మ తన బిడ్డల కొఱకు ఎలాంటి కష్టాన్నయినా సహిస్తుంది'. పాకలో గేదె ఉంది. దాని దూడ (బిడ్డ) చచ్చిపోయింది. ఒక వంక దానిని తీసుకొని వెళుతుంటే తాతయ్య పాలకు వెళ్ళాడు. అది తన్నకుండా పాలు ఇచ్చింది. పాలు తీసుకుంటుంటే కాలుకూడా కదపలా, దాని బాధను మఱిపించి పాలు తీసుకుందామని చిట్టు (ఆహారం) పెట్టారు. "మీరు పెట్టింది నేను తినను, మీ పాలు మీరు తీసుకోండి" అన్నట్లుంది దాని భావం. సహనమా? నిర్లిప్తతా? దానికేం పేరు పెడతారు? దానిని చూచి నేర్చుకోవాలా? (కరుణామయి అయిన అమ్మ ఈ సంఘటన చెబుతుంటే అమ్మ కళ్ళు చెమ్మగిల్లాయి. అమ్మలో జీవకారుణ్యం ప్రస్ఫుటం అవడం చూచి మా కన్నులు ఆర్ద్రమయినాయి)

–దండి విమల

19. హ్రీః 'హ్రీశ్చతే లక్ష్మీశ్చ పత్న్యౌ'. చెయ్యగూడని పని చేసినందుకూ, చెయ్య వలసిన పని విడిచినందుకూ ప్రేరణవల్ల మనస్సు ముడుచుకుపోవడం.

20. అచాపలం – శరీరానికి – చపలత్వం లేకపోవడం.

భరద్వాం నీ స్థితి మాకు అసలే అర్థం కాకుండా ఉన్నది. 'అన్నీ నాకున్నాయని' నీవనటం వల్ల, 'నేను మీలాంటిదానినే' అని అనటంవల్ల, మఱీ అయోమయమై పోతున్నది (అమ్మ కూడా మనలాంటి మానవమాత్రు రాలేనా అని అనుమానం కలుగుతుంది.).

అమ్మ: 'అమ్మ శక్తి అనంతం. అమ్మే సమస్తం' అనుకుంటాడు ఒకడు. 'అమ్మ లాలనచేస్తుంది కాని కష్టపెట్టదు' అని ఇంకొకడనుకుంటాడు. అమ్మ ఇస్తూన్న 'ప్రసాదం' (కుంకుమ) 'ఈ అనుగ్రహం చాలు' అనుకుంటాడు మరొకడు. అన్ని చోట్ల అందఱూ భోజనాలు చేస్తున్నారని తెలుసు. అన్నింటికి నేనే కారణమని తెలుసు. మరి (నేను మీకంటె విశేషమైనదానినైతే) ఈ భోజనాలు పెట్టడంపై మమకారం నాకెందుకు" అమ్మ.

పై గుణాలు మానవుడికుంటే చాపలం. భగవంతునికుంటే అచాపలం.

అహింస, సత్యం, అక్రోధం, త్యాగం, శాంతి, అపైశునం, భూతదయా, అలోలుపత్వం, మార్దవం, లజ్జ అచాపలం, ఆర్జవం ఈ 12 బ్రాహ్మణునికి అసాధారణ ధర్మాలు అంటారు.

ఉపయోగం లేని పనులందు కాళ్ళు చేతులు మొదలైన వాటిని ఉపయోగించకుండా ఉండటమని శంకరులు-కోరదగిన విషయసన్నిధిలో చలించకుండా ఉండడమని రామానుజులూ అచాపలాన్ని వర్ణించారు.

21 **తేజః:** సూర్యుని కాంతి లాగా దగ్గఱగా వెళ్లాలని సరదా కల్పించేది. దగ్గఱకు వెళ్తే భయం పుట్టించేదీ. అంటే ప్రాగల్భ్యం - చర్మగతమైన ప్రకాశం మాత్రమే కాదు. బుద్ధి ప్రకాశాధిక్యం.

22. **క్షమా:** సమర్థుడై ఉండీ కూడా పరిభవంలో కలతలేకుండా ఉండడం - తన్నినా లాగినా కొట్టినా అంతఃకరణలో విక్రియ పుట్టకపోవడం - అక్రోధంలో విక్రియ ఉన్నా కోపానికి శాంతి ఉంటుంది. క్షమలో అసహజంగానే మనస్సులో విక్రియ పుట్టదు. ఇదీ భేదం.

23. **ధృతి:** కుందుపాటు లేకుండడం. ఆధారభావం. ఇన్నిగోళాలు ఆకాశంలో నిత్య తిరుగుతూ ఉన్నాయి. అవి ఒకదాని మీద ఒకటి పడిపోకుండా ఉంచే శక్తిని ధృతి అంటారు 'అం' అంటే అవధి లేనిది. 'ఆ' అంటే ఆధారమైనది.

విక్షేపం ప్రాప్తించి నా దేహంద్రియమనో బుద్ధులు నిశ్చలంగా ఉండడం.

ఈ మూడూ క్షత్రియడికి అసాధారణ ధర్మాలు.

24. **శౌచం:** బహిరంతర పారిశుద్ధ్యం - మృజ్జలాదుల పరిశుభ్రత బాహ్యం - మనోబుద్ధుల నైర్మల్యం ఆంతరం.

25. **అద్రోహం:** ఇతరుల స్వేచ్ఛను అరికట్టకుండుట అమ్మపఠించే 'సరే' మంత్రం అందటికీ పూజా విధానాదుల్లో కాని, సాధకవిధానాల్లో కాని జీవిత విధానాల్లో కాని అనంతమైన స్వేచ్ఛను ప్రసాదిస్తుంది.

ఈ రెండూ వైశ్యునికి అసాధారణ ధర్మాలు

26. **నాతిమానితా:** ఉన్నదానికంటె కంటే ఎక్కువ ఉన్నదనుకోవడం అతి మానిత్వం అలాటి స్వాతిశయం లేకపోవడం నాతి మానిత్వం.

ఇది శూద్రునికి అసాధారణ ధర్మం.

పై 26 గుణాలూ దైవీసంపత్తికి లక్షణంగా పరమాత్మ చెప్పారు. దీవ్యతే నిర్మల త్వేన ప్రకాశః ఇతిదేవః అంటే నిర్మలం కావడంచేత ప్రకాశించేది 'దేవః' అని చెప్పబడుతుంది - కాబట్టి ఈ గుణాలు ప్రకాశాధిక్యాన్ని కల్పించే దైవసంవత్తుకు లక్షణాలు. వీటికి వ్యతిరేకమైనవి ఆసురీ లక్షణాలుగా ముందు చెప్పబోతారు. మానసికంగా కాని, ప్రాపంచికంగా గాని, పరమాత్మ గుణం కానిది కాని, పరమాత్మ వస్తువు కానిది కాని, ఏ కొంచెమూ లేదని పలుసార్లు పరమాత్మయే ఇంతకు ముందు వచ్చిన అధ్యాయాలలో పరమాత్మ నొక్కినొక్కి చెప్పారు. ఇందులో ఏ గుణాన్ని తీసు కున్నా అది గుర్తుకు దారియే అవుతుంది. ఇందఱి హృదయాల్లోని గుర్తుగా భాసిస్తున్న అమ్మ సద్గురువు (గుర్తు చెప్పిన నరుడే గురువు) పరమాత్మ; మనస్సును శాసించగల మహాయోగి ఏ పేరును పట్టుకుని వెనక్కు వెళ్ళినా ఆమె ప్రత్యక్షమౌతుంది. ఏ పేరు పెట్టుకుంటేనేం ఆమె ప్రత్యక్ష సత్యం" అంటుంది సోదరి వసుంధర.

ఆహా! ఆసురీ సంపద్గుణాలతో సహా - అమ్మ దైవీ సంపత్తి గల పరమాత్మయే.

4. **దంభోదర్పోఽ భి మానశ్చ క్రోధః పారుష్య మేవ చ,।**
అజ్ఞానం చాభిజాతస్య పార్థ! సంపద మాసురీమ్॥

తా: పార్థా! దంభము, దర్పము, అతి మానం, క్రోధం, పారుష్యం, అజ్ఞానం, అసుర సంబంధమైన సంపదలో జన్మించిన వాళ్లకు కలుగుతున్నవి.

వ్యా: **(1) దంభః:** లోపల ఉన్నదానికంటె ఎక్కువ ఉన్నదనిపించడానికి మనిషి చేసే భేషజం, చేష్టలూ. ధర్మధ్వజిత్వం -

2. **దర్పః:** చేయకూడని దాన్ని చేయించే పొగరు ధనస్వజనాది నిమిత్తమైన ఉత్సేకం.

3. **అతిమానితా:** గర్వం - స్వాతిశయం నేనే ఉత్కృష్టుడననే మిథ్యా ప్రత్యయం.

4. **క్రోధం:** కోపం - పరాపకార ప్రవృత్తి హేతువైన నేత్రాది వికార లింగకమైన అంతఃకరణ వృత్తి విశేషం.

5. **పారుష్యం:** కాఠిన్యం - పరుష వచనా లాడే స్వభావం.

6. **అజ్ఞానం:** అవివేకజ్ఞానం.

పై గుణాలు ఆసురీ సంపత్తుకు సంబంధించిన గుణాలు. మొదటి మూడు

శ్లోకాలలో పరమాత్మ 26 గుణాలను దైవీసంపత్తుకు ఉదాహరణాలుగా జాబితా ఇచ్చి ఉన్నాడు. ఈ శ్లోకంలో ఆసురీ సంపత్తును సూచించే గుణాలలో కేవలం ఆఱింటిని పేర్కొన్నాడు. ఆసుర గుణాలకు అంతేలేదు. కనుక అందులో ముఖ్యమైన వాటినే చెప్పాడు. అదీకాక ఏ ఒకటి నేర్చుకున్నా అది మంచి గుణం అయితే మనిషి దాని వలన మంచి వాడవుతాడు. అందువల్ల పిల్లల పరీక్ష పత్రాలలో choice ప్రశ్నలు ఇచ్చినట్లుగా ఏది తనకు అందుబాటులో ఉంటే దాన్ని అలవఱచుకోగలందులకు పరమాత్మ అన్ని మంచి గుణాలను పేర్కొన్నాడు. అదీకాక వట్టి ఉపదేశభాగం కంటే పరమాత్మకు తన ప్రేరణతో ఉజ్జీవితమయ్యే సాధన యందే ప్రీతి. అందుకని మాటిమాటికి మనుష్యుడిలో దైవప్రేరితములయ్యే మంచిగుణాలను తఱచి తఱచి విపులీకరిస్తారు పరమాత్మ. 12వ అధ్యాయంలో అద్వేష్టృత్వాది సుగుణాలను అనేకంగా చెప్పారు. దానితో తృప్తి చెందక 13వ అధ్యాయంలో అమానిత్వాది లక్షణాలను విశదీకరించారు. ఇప్పుడు 16వ అధ్యాయంలో అభయంతో మొదలుపెట్టి 26 సుగుణాలను పేర్కొన్నారు. దీనివలన మనుష్యుడి మనస్సు పరమాత్మ భావం మీద తనకు ప్రియాన్ని గుర్తించే రీతిలోనే కేంద్రీకృత మౌతుందనీ ఆవిధంగా పరిణమించిన అతని మనస్సు పరమాత్మతో సాయుజ్యం చెందాలని పరమాత్మ ఆశయం.

'తనకు ప్రియం కూర్చే రీతిలోనే' అన్నాను. తనకు ప్రియంగూర్చే రీతి సాధారణంగా ఏది? ప్రతి మనిషీ ఇతరులు తనను మంచి వాడనుకోవాలని ఆశిస్తాడు. ఇతరులు తనను చెడ్డవాడంటే సహించలేడు. అలాగని ఇతరులలో చెడ్డతనాన్ని గుర్తించి పైకెత్తి చూపకుండా తానూరుకోలేడు. దానివలన తనలోని మంచితనం అధికమౌతుందని అనుకోకుండానే అనుకుంటుంటాడు. తనలో చెడు గుణాలు ఉంటాయి. కనుకనే ఇతరులతో చెడు గుణాలను మనిషి వ్రేలెత్తి చూపు తుంటాడు. రూపాయకు 16 అణాలవంతు మంచి గుణాలే కలిగిఉన్న సర్వ గుణాభిరాముడైన శ్రీరాముని వంటి వ్యక్తి ఉన్నాడోలేడో, అసలు మంచిగుణం చెడ్డ గుణం అనేది మన దృష్టి కోణాన్ని బట్టి గదా నిర్ణయమౌతుంది. ఆ ప్రశ్న అలా ఉంచినా, పరమాత్మ దైవీయ గుణాలుగా 26టినీ, ఆసురీ గుణాలుగా ఆఱింటినీ ఇచ్చారంటే దానిలోని ఉద్దేశాన్ని పూర్వవ్యాఖ్యాతలు అనేక విధాలలో వర్ణించారు.

పరమాత్మకు సాధన మీద ఎక్కువ ఇష్టం కాబట్టి ఈ మంచి గుణాలను అభ్యసించి ఈ చెడ్డగుణాలను వర్జించమనడం ఇందులో ఉద్దేశం అంటాడు ఒక వ్యాఖ్యాత.

ఈ జాబితా ఇచ్చానుకదా! నీలో ఈ గుణాలు ఎన్ని ఉన్నాయో చూచుకో,

దానితో నీవు దేవుడవో రాక్షసుడివో తేలిపోతుంది అనడమే ఇందులో ఉద్దేశం అంటాడు మరో వ్యాఖ్యాత.

కురుక్షేత్ర యుద్ధం కూడా దేవాసుర యుద్ధం లాంటి దేననీ, దేవతాగుణాలున్న పక్షం పాండవులదనీ, అసుర గుణాలున్న పక్షం కౌరవులదనీ నిర్దేశించి చెప్పడమే ఇందులో పరమాత్మ ఉద్దేశమని మరో వ్యాఖ్యాత అంటాడు.

సోదరి వసుంధర అన్నట్లు

'అమ్మ చెప్పిన దాన్నిబట్టిచూస్తే, మంచి చెడ్డలనేవాటి మీద ఇష్టానిష్టాల ప్రసక్తి లేకుంటే, నిజాయితీతో నిశితంగా ఆలోచిస్తే మనం చూస్తున్న దంతా మనలోనిదే అని స్పష్టపడుతుంది. మనం పూర్తిగా మంచితనం మూర్తీభవించిన వాళ్ళమే అయితే చెడ్డతనాన్ని దేంతో గుర్తిస్తున్నాము? మనసులోని కొంత భాగాన్ని మాత్రం స్వంతం చేసుకున్న అహంకారం మిగతా భాగాన్ని ద్వేషిస్తుంది. ఇష్టానిష్టాలూ తరతమభేదాలూ అనేవి అహంకారానికి సంబంధించిన లీలమాత్రమే అవుతుంది. తనను తాను తెలుసుకున్న వానికి రాగద్వేషాలు ఉండటానికి వీల్లేదు. ఎందువల్లనంటే అంతా కూడా తానే గనుక. ఆత్మజ్ఞానం లభ్యంగాని మానవులమైన మనకు తనను తాను తెలుసుకోవటం కర్తవ్యంకాని అవతలివాళ్లని కనుక్కోబోవటం అర్థం లేని పని. అందువలన చిత్తం అణిగిపోవడానికి బదులుగా వ్యాపిస్తుంది.

అయితే ఈ తనను తాను తెలుసుకోవడం అంటే ఏమిటి ఇతరులలోని తనను గుర్తించుకోవడం. నీవులేని నేను కావడం. అది ఎల్లా జరుగుతుంది?

'ఎదుటివారిలో దైవత్వాన్ని చూస్తున్నంతసేపూ మనలో దైవత్వం కలుగు తుంది''.

కాబట్టి పరమాత్మ ఇచ్చిన లిస్టులోని గుణాలు ఇతరులలో గుర్తించడానికిగాని మనలో గుర్తించుకుంటూ మనం దేవుళ్లం అనుకోడానికి మాత్రం కాదని తేలుతుంది. అసురగుణాలను ఇతరులలో గుర్తించినవాడు అసురుడే అవుతాడు. ఈవిధంగా అమ్మ దేవత్వం అనే మాటకు చెప్పిన నిర్వచనంవల్ల, నీవులో నేనును గుర్తించడానికి సాధ్యమవుతున్నది. వ్యక్తిత్వాన్ని సర్వసృష్టిలోనూ, సర్వసృష్టినీ తన వ్యక్తిత్వంలోను కరిగించి వేసుకునే ప్రణాళిక సిద్ధమయిపోయింది. నిజానికి ఇదే సర్వోత్కృష్టమైన నిర్వచనం. ఈ సూత్రముఖం ద్వారా దైవాసుర సంపద్వి భాగయోగంలోని అర్థ ప్రాచుర్యమంతా ఒక్కసారిగా విష్ణుముఖమయి ఊరుకుంటుంది.

పూర్వ వ్యాఖ్యాతలయితే ఇలా వ్రాస్తారు.

పైగుణాలలిస్టును మనసులో ఇటూ అటూ త్రిప్పుకుని చదువుకునే సరికి అర్జు

నుడి ముఖం వెలవెలబోయిందట. ప్రతీ గుణమూ తనలో ఉన్నట్టూ లేనట్టు కనిపించ సాగే సరికి తను దైవీయ సంపత్తికి చెందేవాడో, ఆసురీ సంపత్తికీ చెందేవాడో సరిగా నిశ్చయానికి రావడంలేదు. విశ్వరూపదర్శనం అంతటి మహాదైవ విభూతిని దర్శనం చేసుకున్న తనలో కూడా ఏవో కొన్ని లోపాలున్నట్లు కనిపించసాగేసరికి అతని ముఖం వివర్ణం కాజొచ్చింది. కాబట్టి అతని విషాదాన్ని మాన్పడం కోసం క్రింది శ్లోకాన్ని చెప్పాడని వ్యాఖ్యాతలు వ్రాస్తారు.

5. దైవీ సంప ద్విమోక్షాయ నిబంధా యాఽ సురీమతా।
మాశుచ స్సంపదం దైవీ మభిజాతోఽ సి పాండవ!॥

తా: హే అర్జున! నేను చెప్పిన దైవీ సంపద అంతా మోక్షం కొఱకు, ఆసురీ సంపద బంధం కొఱకు అయిఉన్నదని నిర్ణయించబడ్డది. నీవు మాత్రం దైవీ సంపదలో జన్మించిన వాడవే కాబట్టి శోకించకు.

వ్యా: కృష్ణుడు అర్జునుడి ముఖంలోని విచారరేఖలను గమనించాడట. అతని శోకాన్ని పోగొట్టాలని నిశ్చయించుకున్నాడట అందుకని అర్జునా! దైవీసంపద గల వాళ్ళకు మోక్షం వస్తుందనీ, ఆసురీ సంపదకలవాళ్ళకు బంధాలు తప్పవనీ చెప్పిన మాట నిజమే. ఈ రెండు సంపదలలో నేను ఎందులో చేరుతానా? అనే మథన నీవు పడుతున్నట్లు నీ ముఖకళవళికలవల్లే తెలుస్తున్నది. నీవు నిశ్చయంగా దైవీ సంపత్తుకు చెందిన వాడవే కనుక శోకించకుమని ఆశ్వాసించినట్లు పూర్వ వ్యాఖ్యాతలు వ్రాస్తారు.

నిజానికి దైవీ సంపత్తు కరుడుకట్టి అవతరించిన సాక్షాత్పరమాత్మయే కృష్ణ భగవానుడు కనుక అర్జునునిలో దేవత్వమునే చూచాడు. అలా చూడడంలోనే పర మాత్మ దేవత్వం సిద్ధించదని చెప్పుకోవడంలో విశేషార్థం ద్యోతకమౌతుందని నేనను కుంటున్నాను. శ్లోకంలో మొదటిపాదంలో దైవసంపత్తు కలవాడు అవి కారమైన పరమాత్మతో సాయుజ్యం చెందుతాడు. ఆ సురీ సంపత్తు కలవాడు వికారాల స్వరూపంగా ఉన్న పరమాత్మతో చేరుతాడు అని చెప్పేసరికి, ఈ రెండు సంపత్తులలో తనస్థానం ఏది అనే ప్రశ్న అర్జునుని మనస్సులో ఉదయించినది.

6. ద్వౌ భూత సర్గౌ లోకేఽ స్మిన్. దైవ ఆసుర ఏవచ।
దైవో విస్తరశః ప్రోక్తః ఆసురం పార్థ! మే శృణు॥

తా: అర్జునా! దేవతా సంబంధమైనదిగానూ ఆసుర సంబంధమైనదిగానూ ఈ లోకంలో ఉన్న భూత సృష్టి రెండుగా వేఱుపడి ఉంది. దైవసృష్టిని గుఱించి లోగడ నీకు విస్తరంగా చెప్పియే ఉన్నాను. అసుర సృష్టిని గూర్చి చెపుతాను విను.

వ్యా: ఈశ్వరసృష్టిలో దైవసృష్టి అనీ అసురసృష్టి అనీ రెండు రకాలుగా ఉన్నదనే మాట మనకు అలా అంటే కాని అర్థం కాని మాట.

అమ్మ 'ఈశ్వరుడే సృష్టి' అంటుంది. ఈ ఆ సృష్టిలో తను వేఱుగా ఉన్నానని మనుష్యుడు అనుకోవడం భ్రాంతి కావచ్చు. భ్రాంతి కూడా పరమాత్మ స్వరూపమే - పరమాత్మ అనుభవంలోకి రాకుండా ఉన్నంత వఱకూ మాయగా ఉంటాడు. అను భవంలోకి వచ్చినప్పుడు బ్రహ్మగాను ఉంటాడు. అది అనుభవం-అంటే పరమాత్మ - పాపంగా పుణ్యంగా, ఏడుపుగా దుఃఖంగా ఉండొచ్చు. అటు దేవసృష్టీ ఇటు అసుర సృష్టీ రెండూ పరమాత్మ భావాలే.

(6) రాక్షసీమాసురీం చైవప్రకృతిం మోహినీం శ్రితాః 'అన్నీ దైవీం ప్రకృతి మాశ్రితాః" అనీ "ప్రకృత్యానియతాస్స్వయా" అనీ లోగడ అనేక ప్రకృతులు చెప్ప బడ్డాయి. "ద్వయాహప్రాజాపత్యా దైవాశ్చాసురాశ్చతతః కనీయసా ఏవదే వాజ్యా యసా సురాః" అని శ్రుతి. ఉన్నవి రెండే ప్రకృతులు దైవీ ప్రకృతి ఆసురీ ప్రకృతి అని. రాక్షసీ ప్రకృతి వేఱుగా లేదు. దేవతలు చిన్నవాళ్ళు. రాక్షసులు పెద్దవాళ్ళు అని అంటారు.

7. **ప్రవృత్తిం చ నివృత్తిం చ జనా న విదు రాసురాః।**
నశౌచం నాపి చాఽఽ చారో న సత్యం తేషు విద్యతే॥

తా: అసుర సంపదల జనులు ప్రవృత్తిగాని నివృత్తిగాని యెఱుగరు. ఆచారం శుచీ శుభ్రతా, సత్యవర్తనమూ వాళ్ళ యందుండవు.

వ్యా: ఆసురీ సంపద అంటే శాస్త్రంలో మోక్షసాధకాలుగా చెప్పబడ్డ విధి నిషేధాలు పాటించేవాళ్ళు కాదనీ ఆస్తిక్య సంప్రదాయానికి కేవలం విరుద్ధంగా ప్రవర్తించే వాళ్ళనీ, ఇహపర లోకాలలో పురుషార్థాలంటే వాళ్ళకు కేవలం శారీరక వాంఛాతృప్తి, స్వార్థ ప్రయోజనాలకు పాటుపడడం ఇవే తప్ప అంత కంటే హెచ్చుగా వాళ్ళ చేష్టలు భావాలు ఉండవనే రీతిగా వ్యాఖ్యానిస్తారు. దీనికి పునాది ముఖ్యంగా పుణ్య కర్మలనీ పాపకర్మలనీ శాస్త్రాలతో నిర్ణయించబడడం, దేవుడంటే కేవలం మనం మనకు సంతోషాన్నిచ్చే ప్రీతికరములైన సంఘటనలకే అధికర్తగా నిర్ణయించడం, పూజా కైంకర్యాలతో పరమాత్మ మన అయిష్టాలను తొలగించి మన పొగడికలతో పొంగి పోయేవాడినిగా అనుకోటం, మనం మనచేసే కర్మలకధికారుల మనుకోడం, ఈ కర్మలు తిరిగి మనకు మంచి జన్మలో చెడు జన్మలో ఇస్తాయనుకోడం. ఇలాంటి చట్రంలో బిగించబడిన సిద్ధాంతాలనే కొలతబద్దలతో కొలిచి చెప్పినమాటలు నిష్పక్షపాతంగా ఆలోచిస్తే, అవును ఏ పరమాత్మ సృష్టిచేశాడో అతడే పెద్దపులినీ సృష్టి

చేశాడు. పువ్వుకు మార్దవమిచ్చిన వాడే ముల్లుకు బాధించే గుణమూ ఇచ్చాడు. పువ్వులో తేనె పెట్టినవాడే తేలుకొండిలో విషం పెట్టాడు. ఉల్లి పాషాణం మన ప్రాణాలను తీస్తుంది. దాన్ని తిని బ్రతికే జీవులున్నాయి. మనం అసహ్యించుకునే అశుద్ధం పందికాహారం. మనం అతిప్రీతిగా తినే గొడ్డుకారం పశ్చిమ దేశస్థులకు ప్రాణకంటకం. అక్కడ ఆచారాలను పాటిస్తే ఇక్కడ కేవలం అపచారం చేసిన వాళ్ళమవుతాం.

నీతి నియమాలూ దేశకాల పరిస్థితులను బట్టి శీతోష్ణస్థితులను బట్టి మారుతాయి. రోజుకు మూడుసారులైనా ఆంధ్రదేశంలో మూడుకాలాల్లోను స్నానం చేయడానికి కష్టం ఉండదు. కాశ్మీరంలో మంచుకరుడుగట్టుకుని ఉన్న చోట్లలో కొన్ని నెలలకొకసారిగాని స్నానం చెయ్యడానికి వీలుండదు. త్రాగడానికి నీళ్లు కూడా దొరకని ఎడారిలో స్నానం పేరెత్తడానికీ వీల్లేదు. కనుక అక్కడ త్రికాల స్నానాలు, చేయని వాళ్లు ఇక్కడ పద్ధతుల ప్రకారం ఆ చారానికి వెలి అయిన అసురులు కావచ్చు. కాని ఏ దేశం వెళ్ళినా, తప్పని నియమాలు కొన్ని ఉన్నాయి. మాతృత్వం లాంటివి. అవే నిజమైన ప్రకృతి ఆచారాలు, విధులు, నిషేధాలు. కాబట్టి ఆచారాలను పాటించని అసురులు కూడా తల్లి బిడ్డలే. అటువంటి బిడ్డలను తల్లి దిద్దుకునే పద్ధతి వేఱు. తల్లి అనుగ్రహం అందఱి మీదా ఒకటే. కాని మందురోగికిస్తే వాడు బాగుపడతాడు. మంచి వాడికామందిస్తే రోగి అవుతాడు వాడు. అనుగ్రహం ఒకటే పంచడం వేఱుగా ఉండొచ్చు అన్నది అమ్మ.

ప్రవృత్తి అంటే ఇహలోక సుఖాలకోసం యజ్ఞయాగాదులను చేసి ఐహిక సుఖాలకోసం ప్రయత్నించడం. అంటే ధర్మార్థకామాలనే పురుషార్థాలతో మొదటి మూడింటికోసం పని చెయ్యడం వృత్తి అంటే. ఈ ఇహలోక సుఖాల నుండి తిరిగి పోవడం – అంటే నాల్గవ పురుషార్థమైన మోక్షాసక్తుడు కావడం.

8. అసత్య మప్రతిష్ఠం తే జగదాహు రనీశ్వరం।
అపరస్పర సంభూతం కి మన్య త్కామహేతుకం॥

తా: వారు ఈ జగత్తు అసత్యమనీ, ప్రతిష్ఠ లేదనీ దీనికి ఈశ్వరుడు కర్తకాదనీ, వట్టి స్త్రీ పురుష సంయోగం వల్లనే పుట్టిందే అయినా, ఆ స్త్రీ పురుష సంయోగానికి కామమే హేతువు తప్ప ఇంకేమున్నదని అంటారు.

వ్యా: పై శ్లోకంలో అసురప్రవృత్తి కలవారుచేసే నాస్తిక మతప్రచారం ఎలా ఉంటుందో పరమాత్మ వివరించారు.

అణుపరమాణు పుంజమయమైన జగంబున నెట్లు చూచినన్
క్షణికములైన కర్మములు కాలమునుం జతకూడి సృష్టికా
రణమగు చుండగా బుధపరంపర వాద బలంబుచేత ని
ర్గుణుడగు వానికెవ్వనికొ గూర్చెదరేటికొ సృజ్యకర్మమున్

కాబట్టి ఈశ్వరజగత్తు ఈశ్వరకృతం అనే మాట అసత్యం. ఏవో కొన్ని అంధ శక్తులు లెక్కల బిగింపులోకి కుదింపబడదగిన కొన్ని కర్మలను చేయడం వలన వివిధములైన రూపాలు ఏర్పడడానికి కారణమౌతున్నది. ఇది వఱకు చంద్రుడు మానవుల మనస్సుపైనా, స్త్రీల కళాస్థానాలపైనా, ఆమె ఋతుక్రమంపైనా ప్రభావం చూపుతూ ఉండడం వల్లనే స్త్రీలలో కామోద్రేకం కలుగుతుందనే మాట, అమల్లో ఉండేది. అది అసత్యం. Cantharis మొదలైన మందుల వలన కామోద్రేకం వృద్ధి చేసుకోవచ్చు. మిథున సంయోగంవల్లనే సంతానం ఏర్పడి జనవ్యాప్తికి కారణమౌ తున్నది. ఇంతకంటే ఏ కారణముంది ఈ జగత్సృష్టికి? సృష్టి సూత్రాలను ఫిజిక్సు, కెమిస్ట్రీ, బయాలజీ, మొదలగు శాస్త్రాలతో యుక్తియుక్తంగా నిరూపించగలిగి యుండగా ఏ మూలనూ కనిపించని దేవుడిని లాక్కురావడమెందుకు ఈ పనికోసం. అతనికి ఈ సృష్టి కర్తృత్వాన్ని ముడిపెట్టడమెందుకు అంటారు నాస్తికులు? ప్రాణశక్తి తనంత తానుగా కార్బన్ అణువుల సంయోగంవల్ల ఆకస్మిక ఫలితంగా భూమిమీద త్రుళ్ళిపడ్డది. దాని కి RNA, DNA కణముల పేర్పే కారణం. Gene లనే జీవప్రకృతు లను వేర్వేఱు పద్ధతులుగా పేర్చి, నెహ్రూ కావాలంటే నెహ్రూను, కింగ్‌కాంగ్ కావా లంటే కింగ్‌కాంగ్‌ను సృష్టి చేసుకోవచ్చు అంటాడు. డాక్టరు ఖురానా. చంద్రగోళాలూ అంగారక గ్రహాలూ చూచి వస్తున్న మానవుడి విశ్వాంతరాళ జ్ఞానం, గుండెను తీసి గుండె నతికి, కిడ్నీని తీసి కిడ్నీని అతికించి కంటిగ్రుడ్లను తీసి కంటిగ్రుడ్లను అతికించే నేటి మానవుని జీవశాస్త్ర విజ్ఞానం, కృత్రిమంగా నెత్తురును తయారుచేస్తూ, కృత్రి మంగా, మిథునసంయోగం లేకుండా సంతానోత్పత్తిని సంభావ్యంగా చేస్తున్న నేటి ప్రసూతి విజ్ఞానం, ఈశ్వరుని జగత్కర్తృత్వాన్ని శంకించడానికి, ప్రశ్నించడానికి ఏమీ విడ్డూరం కాదు. అంతరిక్షయానం, వ్యోమవిజ్ఞానం నేడు అతివేగంగా అభివృద్ధి చెందుతున్నది. శనిగ్రహం మీదకు మనుష్యుడు దిగినట్లైతే అక్కడ భూమ్యాకర్షణశక్తి మనభూతలం మీద ఉన్న దానికంటె, ఎన్నో వేల రెట్లు ఉంటుంది. కాబట్టి అక్కడ రెండు కాళ్ళమీద మనుష్యుడు నిలవగలగడం సాధ్యంగాదు, కొంచెం ఒరిగి నా అయ స్కాంతం మీద గుండుసూది చప్పగా పడుకుని ఊరుకున్నట్లే మనిషి కూడా నిలువుగా ఉన్నవాడు క్రిందపడి భూమికి అతుక్కుని ఊరుకుంటాడు. అటువంటి ప్రమాదా న్నుండి మనిషిని కాపాడడానికి మనిషి చేతులను కూడా స్వల్పమైన ఆపరేషన్లతో

కాళ్ళుగా మార్చడానికి పథకం వేసుకుంటున్నారు. మరి చేతులు రెండూ, కాళ్ళుగా అయిపోతే పనులు చేయడానికి గ్రహణేంద్రియంగా ఉపయోగపడే లాగా ముక్కును బాగా సాగదీసి దాని చేత ఇప్పుడు ఏనుగు తొండం చేసేపని చేయించడానికి ప్లానులు వేసుకుంటున్నారు. మనిషి రూపాన్నే చతుష్పాత్తుగా చేయడానికి ఇలా ఆలోచిస్తు న్నారు, ఇక మానవుడిని శరభమృగంగానో సాళ్వమృగంగానో చేసి సర్కసు చేయించ డానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి.

మెదడు చేసే పనులను Electronic brain చేస్తున్నది. మనుషులు చేసే పను లను Robot లు చేస్తున్నవి. Laser Maser కిరణాల నుండి మృత్యుకిరణాన్ని సృష్టిస్తు న్నాడు మానవుడు. Synthetic ద్రవ్యాలని ఎన్నో కనిపెట్టి, Hybrid జాతులను ఎన్నో సృష్టించి, మానవుడు సృష్టికి ప్రతి సృష్టి అయిన విశ్వామిత్ర సృష్టిని తయారు చేస్తు న్నాడు. అదేమిదేమని Aldus Huxley Brave New World అనే పుస్తకంలో యాంత్రి కంగా క్రొత్త మానవజాతినే సృష్టిచేసే ప్రణాళిక సూచించాడు. ఇంతటి శాస్త్ర వైదుష్యం కల నేటి మానవ మేధస్సు, ఎక్కడో ఏ రసాయనిక భేదప్రయోగాలకూ అందని పర మాత్మశక్తి సృష్టి కారణమంటే ఒక పట్టాన ఒప్పుకుంటుందా? ఒప్పుకోదు. పరమాత్మ లేదనడం పరలోకం లేదనడం నాస్తిక లక్షణం.

అమ్మ కూడా ఇలాంటి నాస్తిక ప్రచారం చేస్తున్నారని అని ప్రముఖులే కొంద రంటున్నట్టు తెలుస్తున్నది అని మొదలుపెట్టి మాతృశ్రీలో శ్రీపాద ఒక వ్యాసం వ్రాశారు. ఆ వ్యాసంలో వారు అన్ని విషయాలూ సాంగో పాంగంగా చర్చించి, పైరెండు ప్రశ్నలకూ, తగిన సమాధానాలిస్తూ,

'అన్ని రాతలూ ఒకే రాతలోనే కలుస్తాయి'

'ఎవరికైనా తప్పదు వచ్చిన చోటికిపోక'

'నటులూ, రంగమూ దుస్తులూ, తెరలూ నాటకమూ, ప్రేక్షకులూ అన్నీ తానే అయి ఉన్నాడు'

'జీవమూ జీవితమూ ఇచ్చినది భగవంతుడే' అనే అమ్మ వాక్యాలను ఉదహ రించి 'సర్వంఖల్విదం బ్రహ్మ' అంటే నాస్తికమా? వాడు ఏదీ కాకుండా ఎక్కడో ఉన్నాడు అంటే ఆస్తికమా? అంతర్యామి అంటేనే ఆస్తికమా! అంతా అదే అంటే నాస్తికమా! అని ప్రశ్నించారు.

అమ్మ జన్మలు లేవంటుంది – ఇదే నాస్తిక ప్రచారానికి పట్టుకొమ్మ అయితే దాన్ని గురించి విపులంగా వేరొక చోట చర్చించి ఉన్నాను కనుక ఆ విషయాన్ని వదిలేస్తు న్నాను.

అ పరస్పర సంభూతం కి మన్యత్ = స్త్రీ పురుషులకలయిక తప్పవేటింకా ఏమిటి? అని అర్థం.

9. ఏతాం దృష్టి మవష్టభ్య నష్టాత్మానోఽ ల్ప బుద్ధయః।
ప్రభవ న్త్యుగ్ర కర్మాణః క్షయాయ జగతోఽ హితాః॥

తా: ఈ వక్రదృష్టిని అవలంబించిన నష్టాత్ములున్ను, అల్పబుద్ధి కలవాళ్లున్ను జగత్తుకు శత్రువులై క్రూర కార్యాలనిచేసే వాళ్ళే లోక ధ్వంసం చేయడానికి పుట్టు తున్నారు.

వ్యా: నష్టాత్మానః ఆత్మస్వభావమైన మోక్షానికి దూరులై అని శంకరులూ, దేహాతి రిక్తమైన ఆత్మజ్ఞానశూన్యులై అని రామానుజులూ అల్పబుద్ధయః అంటే అల్పములగు విషయసుఖములందే బుద్ధికలవారని శంకరుడు దేహమందలి ఆత్మను తెలియలేని బుద్ధికలవారని రామానుజులు.

లోకాన్ని సృష్టించిన దేవుడనేవాడు ఒకడున్నాడనీ, తన శక్తి ఆ పరమాత్మ శక్తికంటే ఎన్నో రెట్లు పరిమితమైనదనీ గుర్తించినంతవఱకు, ఏ అరిష్టాలు వచ్చినా, ఉపద్రవాలు వచ్చినా అదొక రకమైన తృప్తితో అనుభవించేవాడు మానవుడు. వెనుక అభయహస్తం ఇచ్చి న న్నాదుకునే శక్తి, నన్ను నడిపిస్తున్న శక్తి ఒకటి ఉన్నదనే ధైర్యం మానవుడికి శ్రీరామరక్షగా ఉన్నంతవఱకు ఎంతెంతటి ఘోరమైన ఉపద్రవాలైనా అతడు ఢీకొనేవాడు. అప్పుడూ అతనికి ఎదురైన ప్రకృతి ఉపద్రవాలలో భీషణత్వం నిండుగానే ఉన్నా, భగవద్విశ్వాసంతో నిండిఉన్న అతని మనస్సులో అది జొరబడినా అక్కడ గోతులు త్రవ్వడానికి అది అశక్తమైపోయేది. నేటికాలంలో నాస్తిక మతం ప్రబలినందువల్ల మానవత్వం, సహజమైన కరుణ, వీటికి హృదయం శూన్యమై పోయింది. మానవత్వానికే స్థానంలేని హృదయంలో మాధవత్వం ఎక్కడ నుంచి వస్తుంది? ఆ జాగాలో దానవత్వరూపంలో భగవత్స్వరూపం తాండవిస్తున్నది. ఆటం బాంబుల ప్రేల్చి హిరోషిమా, నాగసాకి పట్టణాల్లోని అమాయక ప్రజలను జంతు జాలాన్ని కిక్కురుమనకుండా అకారణంగా నాశనం చేసింది అమెరికా – అదే అమెరికా మైలే అనే చోట కిరాతక చర్యలను చేసింది. బంగాళాదేశంలో పాకిస్తాన్ స్త్రీబాలవృద్ధ జనులను లక్షలకు లక్షలను, ఘోరమైన అత్యాచారాలకు హత్యలకూ పాలుచేసింది. ఈ హత్యాకాండ అంతా ప్రజలమేలుకే అనివాళ్ళు వాదిస్తున్నారు. ఈ యుద్ధాలు అంటే వియత్నాం లాంటి యుద్ధాలు పూర్వం లేవా. ఉండేవే. కాని వాటి భీషణత్వం నిజాయితీతో నిండియున్న యోధుల మనస్సులలో విషం నింపేదికాదు, అమ్మ ఇవన్నీ మనకవసరమే అంటుంది.

'సృష్టిలో ఒకభాగాన్నే గురించి ఆలోచిస్తున్నాం దైవాన్ని మలయమారుతమనే అనుకుంటున్నాం కాని ప్రళయం గాలి కాదనుకుంటున్నాం. ప్రతిదీ మన అవసరం. మన అవసరానికి ఏది భిన్నంగా జరిగినా కష్టమే'' అమ్మ.

10. కామమాశ్రిత్య దుష్పూరం దంభ మానమదాన్వితాః।
మోహాద్గృహీత్వాఽ సద్గ్రాహాన్ ప్రవర్తన్తేఽ శుచివ్రతాః

వారు తనివితీరని కామాన్ని ఆశ్రయించి దంబము, అభిమానం, మదం, అనే వాటితో కూడినవారై అయోగ్యములైన వాటిని అవివేకంవల్ల స్వీకరించి అపవిత్ర వ్రతాచరణం కలవారై సంచరిస్తున్నారు,

11. చింతా మపరిమేయాం చ ప్రలయాంతా ముపాశ్రితాః।
కామోప భోగపరమాః ఏతావ దితి నిశ్చితాః॥

12. ఆశా పాశ శతైర్బద్ధాః కామక్రోధ పరాయణాః।
ఈ హన్తే కామభోగార్థ మన్యాయే నార్థసంచయాన్॥

వారు దేహాంతం వఱకు అంటిపెట్టుకుని ఉండే అపరిమితమైన చింతలో మునిగి బ్రతకడమంటే కామోపభోగమే పరమార్థమని నిశ్చయం కలవాళ్ళై, అంతు లేని ఆశాపాశాలతో కట్టబడ్డవాళ్లై, కోపం, కోరికలు ఇవే నిండుకొన్న బ్రతుకులు కల వాళ్ళై వాటితోనే కాలక్షేపం చేస్తూ, అన్యాయంగా డబ్బు సంపాదించ గోరుతుంటారు. కామోపభోగమే వాళ్ళకు పురుషార్థం.

13. ఇద మద్య మయా లబ్ధ మిమం ప్రాప్స్యే మనోరథం।
ఇద మ స్తీద మపి మే భవిష్యతి పునర్ధనం॥

14. అసౌ మయా హత శ్శత్రు ర్హనిష్యే చాపరా నపి।
ఈశ్వరోఽ హ మహం భోగీ సిద్ధోఽ హం బలవాన్ సుఖీ।

15. ఆఢ్యోఽ భి జనవానస్మి కోఽ న్యోఽ స్తి సదృశో మయా।
యక్షే దాస్యామి మోది ష్యే ఇత్యజ్ఞాన విమోహితాః॥

16. అనేక చిత్త విభ్రాంతా మోహజాల సమావృతాః।
ప్రసక్తాః కామభోగేషు పతన్తి నరకేఽ శుచౌ॥

తా: ఇది నేడు నాకు లభించింది. ఈ మనోరథాన్ని ఇక మీదట పొందగలను. ఇంత ధనాన్ని సంపాదించాను. ఇంకా ఇంత సంపాదించగలను.

ఈపగవాళ్లను చంపేశాను. ఇతరశత్రువులను కూడా చంపివేయగలను. ఈశ్వరుడన్నా నేనే. భోగినీ నేనే, కోరికలు సిద్ధించిన వాడిని నేనే 'బల' శాలిని. సుఖం గల వాడిని నేనే. ధనవంతుడన్నా, కులీనుడన్నా నేనే. ఇంకెవడైనా నాతో సమాను డున్నాడా! యాగాలను దానాలను చేస్తున్నాను. ఆనందాన్ని పొందగలను. అని ఈ విధంగా, అజ్ఞానంలోపడి, మోహంలోపడి, అహంకార ప్రధానులై, అనేక రీతులుగా మనస్సును చెదరగొట్టుకొని, చివరకు మోహం అనే వలలో తగులుకొని కామభోగాల యందే ఆసక్తి కలవాళ్లై చిట్ట చివరకు కశ్మలపూరితమైన నరకంలో పడుతున్నారు.

17. ఆత్మ సంభావితాః స్తబ్ధాః ధన మాన మదాన్వితాః!
యజన్తే నామ యజ్ఞైస్తే దంభేనా విధి పూర్వకమ్!!

తా: తమనే తాము గొప్పగా తలుచుకునేవాళ్లు, వినయంలేని వాళ్లు, ధనం, దురభిమానం, మదం వీటితో కూడుకున్నవాళ్లు, దంబాచారంగా శాస్త్ర విరుద్ధ మార్గంలో, అసురభావంతో నామమాత్రాలైన యజ్ఞాలను, శాస్త్రవిరుద్ధమార్గంలో చేస్తుంటారు.

పూర్వం చెప్పబడిన అసురసంపద్విశిష్టులు అందరూ బ్రాహ్మణులే. అధ్యయనా ధ్యాపనాలు వాళ్లకున్నాయి. వేదోక్త కర్మానుష్ఠానమూ ఉంది. మరి ఇలాంటి వైదికు లకు అపవిత్రమైన నరకం ఎలా వస్తుంది. అంటే 'శ్రద్ధయాగ్నిస్సమిధ్యతే యోవా ఏతదక్షరం గార్గ్య విదిత్వాస్మింల్లో కే జుహోతి" అనే ఉపనిషద్వాక్యం వల్ల నియమోల్లం ఘనంచేస్తూ ఆచరించిన యజ్ఞాభాసాలవల్ల పరమాత్మ సంతోషించదనీ అలా యజ్ఞాలు చేసేవాళ్లకు నరకమే గతిఅనీ వ్యాఖ్యాతలు వ్రాస్తారు.

'అప్రణాత్మనోస్తబ్ధాః' అంటే నమ్రత లేకుండా ధర్మధ్వజిత్వం కోసం ప్రాకులాడే గర్వపోతని అర్థం.

వ్యా: నేనే డబ్బు సంపాదించాననుకుంటాడు దేవుడిచ్చాడనడు. పగవాళ్లను నేనే చంపాననుకుంటాడు-పరమాత్మ శక్తితో జయించాననుకోడు. కొంచెపుబుద్ధి మానవత్వాన్ని ప్రేరేపిస్తుంది. జ్ఞానం కోలుపోయి తనకోసం, తన హింసాతుష్టి కోసం, తీవ్ర కర్మలు చేస్తూ జగదభ్యుదయానికి కాక జగన్నాశనానికి కారణమవుతుంటాడు. విచిత్రమేమిటంటే ఆవిధంగా తాను జగత్తును బాగుచేస్తున్నాననుకుంటాడు. ఇదంతా లోకం మరమ్మత్తుదార్లం అనుకునే వాళ్ల దృష్టిలో ఏదో సృష్టిలో అవకతవకగా అనిపిస్తుంది. భగవంతుడు కరుణామయుడు, సకల కళ్యాణగుణాభిరాముడు, లోకశ్రేయస్కాముడూ అయితే ఈ దౌర్జన్యమేమిటి, ఈ యుద్ధాలేమిటి, ఈ హింసా

కాండ ఏమిటి, ఈ వ్యాధులు, ఈ పీడ, ఈస్వార్థం, ఈ కఋువు, ఈ కాటకం ఈ ధరలు- ఈ దారిద్ర్యం ఇదంతా ఏమిటి సృష్టి చేసుకున్నవాడు నందనవనంలాగా దాన్ని సాకుకోక ప్రతిమొక్క కుళ్లగించి పారేస్తాడు. కాయలకు పురుగు పట్టిస్తాడు. ఒక్కొక్కచోట కుళ్లు, కంపు-ఛీ ఇదేమిటి సృష్టిలో డ్రెయినేజి సిస్టమ్ సరిగా లేదు. 'టౌన్ ప్లానింగ్ చేతగాదు భగవంతుడికి అనుకుంటాడు మానవుడు. అమ్మ అంటుంది కదా ప్రతిదీ మన అవసరమేనని.

'నీరు, బురద, తారురోడ్డు అన్నీ కలిసిందే ప్రకృతి అది అందమైనదంటాడు. చెట్టుచూచి ఆహా! ప్రకృతి ఎంత అందమైనదీ అని కవి వర్ణిస్తాడు. వాటి ప్రక్కనే మురుగు కాలువ ఉంటే. వెధవ రోగం కుదురుతుంది. ముక్కు మూసుకుంటాడు.'

ఏమిటోయది. ఎన్నితలకాయలు పగలాలో! వియత్నాంలో ఈ వేళ ఎట్లా ఉందిరా!'

చస్తూ చంపి చద్దామని ఉంటుంది. అట్లా ఉంటుంది వియత్నాం వార్... ప్రకృతే సందేశం ఇస్తుంది నాయనా...

పరిస్థితులే గురువన్నా, కాలమే కర్తృత్వమును బోధిస్తుందన్నా; ప్రకృతి సందేశం ఇస్తుందన్నా ఒకటే అర్థం.' అన్నది అమ్మ.

పైశ్లోకంలో స్తబ్ధాః అనే పదం ఉపయుక్తమైనది. స్తబ్ధుడంటే విఱ్ఱవీగుతూ కఱ్ఱలాగా పొగరుతో నిండిన వాడని అర్థం-వీడు పనులు చేస్తాడు. అహంకారంతో తనకిష్టం వచ్చినట్లుగా చేస్తాడు కాని, ఇతరులకుపయోగపడేలాగా, నలుగురికీ పరిసరాలకు అనుకూలంగా ఉండేలాగా చెయ్యడు.

అయుక్తుడనే వాడు ఇంకోడున్నాడు వాడు ముందు అధ్యాయాల్లో వస్తాడు. వాడికి పనులు చేయడానికీ ఆసక్తి ఉండదు- మన్నుదిన్నపాములాగా అలాపడి ఉంటాడు.

18. అహంకారం బలం దర్పం కామం క్రోధం చ సంశ్రితాః!
మా మాత్మ పరదేహేషు ప్రద్విషన్తోఽ భ్యసూయకాః!!

తా: అహంకారము, బలము, దర్పము, కామము, క్రోధము, వీటితోకూడుకుని ఉన్న ఆ అసురులు తమ దేహాల్లోనూ ఇతర దేహాల్లోనూ ఉనికిని నేనే అని గుర్తించ డానికి ఇష్టంకాక అసూయాపరులై నన్ను శత్రుభావంతో చూస్తున్నారు.

వ్యా: ఇంగ్లీషులో ఎలర్జీ అనే మాట ఒకటి ఉంది. దేనిపేరైనా ఎత్తితే లేక ఏదైనా పదార్థం తింటే, ఏదైనా వార్తవింటే. అదివఱకు లేని అనారోగ్యమో, అసహ్యాభావమో,

ఆగ్రహమో అకారణంగా ఆవేశించడాన్ని ఎలర్జీ అంటారు. దేవతలంటే రాక్షసులకు ఎలర్జీ. తత్వమే సరిపడదు. అలాగే కొంత మంది ముఖాలను చూస్తే అకారణంగా ఏదో విముఖత్వంతోస్తుంది. కోపం వస్తుంది. పూర్వజన్మవాదులైతే అందఱు గతజన్మలో జాతివైరం గలపామూ కప్పా అయి ఉండాలని అంటారు.కాని యుక్తి యుక్తంగా ఆలోచిస్తే అమ్మ ఉపయోగించే 'ఆకలి' అనే మాటకూ ఈ స్వభావాలకూ సంబంధం ఉన్నట్లు అనిపిస్తుంది. ఇది కూడా ప్రకృతి సిద్ధమయినదే అనిపిస్తుంది. ఇదీ అవసరమే అనిపిస్తుంది.

ఆకలి అనే మాటను మనం మన శరీరంలోని కడుపుకొక్క దానికే అంటగడు తుంటాం. ఏం పాపం చేసుకున్నదోకాని, ఈ శరీర భాగం మాత్రం చేసే పని రాణించని హతభాగ్యుడిలా ఎప్పుడూ ఉదాసీనంగా ఉంటుంది. బ్రహ్మాండ భాండోదరీ' అని ఆదిశక్తిని వర్ణించడంలో అర్థం– పరమాత్మ ఆకలే సృష్టి అనిపిస్తుంది నాకు. ఆకలే సంకల్పమూ. మంచి గుణాలూ ఆకలే చెడ్డగుణాలూ ఆకలే. గాడి పొయ్యిలో మంట ఆకలే. అన్నమూ ఆకలే. 'అన్నాద్భవంతి భూతాని, అన్నాని కాకలి వేసి భూతా లవుతుంది. భూతాల కాకలివేసి అన్న మవుతుంది. అన్నం మృత్యు వౌతుంది. అన్నం అమృతమవుతుంది. పరమాత్మ ఆకలి అయిన సృష్టిలో, ఏ పదా ర్థమూ సహించని ఎలర్జీ కలవాడే అసురుడు. అన్ని పదార్థాలూ సహించేవాడే దైవ సంపత్తి గలవాడు మఱి ఇలాంటి ఎలెర్జీ వ్యక్తులను ఎలాగా కడతేరుస్తాడు పర మాత్మవాళ్ల గతి ఏమిటి. వాళ్లు కావాలని ఆ ఎలర్జి తెచ్చుకున్నారా? తెచ్చుకునే దాన్ని ఎలర్జి అనరు. సహజంగా పుట్టిన ద్వేషాన్ని, సహజంగా వికటించే స్వభావాన్నే ఎలర్జి అంటారు. పరమేశ్వరుడు వీళ్లనేం చేస్తాడు?

19. తానహంద్విషతః క్రూరాన్ సంసారేషు నరాధమాన్!
క్షిపా మ్యజస్ర మశుభా నాసురీష్వేవయోనిషు.!!

తా: బ్రహ్మద్వేషులూ, క్రూరులూ అయిన అట్టి మనుజాధముల్ని ఈ సంసారంలోనే పడేసి, అపవిత్రాలైన అసురయోనుల్లో నేను విసిరిపారేస్తాను.

వ్యా: అని శ్రీ కృష్ణ పరమాత్మ ఉద్రేకంగా పలికాడని పూర్వ వ్యాఖ్యాతలు వ్రాస్తారు. నరాధములనే కఠినమైన పదాన్ని కూడా ప్రయోగించాడు. శాంతాకారం భుజగశయనం అనే విశేషణాలతో కూడిన ఆ ప్రశాంతమూర్తి, అధర్మాన్ని, అన్యా యాన్ని పాపాచారాన్ని ఆశ్రయించేవాళ్లను గూర్చి చెప్పేటప్పుడు అపర రుద్రుడుగా మారిపోయాడని వ్రాస్తారు వ్యాఖ్యాతలు.

అమ్మ అలా అనదు.

'నీవు ఖూనీ చేసినా నా బిడ్డవే. నీవేం చేసినా నాఒడిలో స్థానం ఉంది. నీ చర్యలకు బాధ్యత నీకు ప్రేరణ ఇచ్చిన శక్తిది కాని నీదేమున్నది.' అంటుంది. 'ఈ రకంగా పుణ్యం సంపాదించామని రొమ్ములు విరుచుకొని తిరిగే వారిని, పాపం చేశామని క్రుంగిపోయే వారినీ సమత్వదృష్టితో చూడటం, మాతృత్వానికీ మమతకూ మాయని నిదర్శనం.'

'తన సంతానంలో ఒకడు తప్పు త్రోవ త్రొక్కేవాడుంటే తల్లి వాడిని పోగొట్టు కుంటుందా! పైగా అమ్మ చెప్పినట్లు' బిడ్డ బురద పూసుకుని వచ్చినా శుభ్రపరచ వలసిన బాధ్యత తల్లిదే. వాడికేమీ పట్టదు.

'అసుర యోనుల్లో పిసిరి పారేస్తాను' అనే మాట ఏదో ఘోరాపరాధానికి భగవంతుడు విధించిన శిక్షలాగా వ్యాఖ్యానించారు పూర్వవ్యాఖ్యాతలు. నాస్తిక మతం భగవదపరాధంగా కూడా నిర్వచించారు.

ఆస్తికుడు అంతా భగవంతుని శక్తి మీద భాధ్యతవేసి మాట్లాడుతాడు. నాస్తికుడు స్వశక్తి మీద బాధ్యత వేసుకుని మాట్లాడుతాడు. ఇద్దఱు మాట్లాడేవి మాటలే కాని జరిగేది భగవంతుడను కున్నదే. జరిగేదివాడి కున్నది.

అమ్మ. ఈజరిపించే శక్తికి 'భగవంతుడని పేరు పెట్టుకోవచ్చు. శక్తి అని పేరు పెట్టుకోవచ్చు. లేదా సహజమనుకోవచ్చు. పూర్తిగా మానవశక్తి అనుకున్నా ఏంలేదు. నేను కాదనటంలేదు. పూర్తిగా దైవశక్తి అనుకున్నా ఏంలేదు! కొంత 'మనది' కొంత 'తనది' అని మాత్రంతోచదు' అంటుంది.

మఱి ఈ ఆసురీ ప్రవృత్తి ఎందుకుండాలి సృష్టిలో? అనుకుంటే అమ్మ సృష్టికి అది కూడా అవసరమే అంటుంది.

అమ్మ: ప్రకృతి యే ఆనందం. అదియే దైవం అదియే సౌందర్యం, ఆ ప్రకృతిలో మలయమారుతాలే కాదు. ప్రళయ వీచికల కల్లోలముంది. చల్లనిగాలులే కాదు; వడగాలి ఉంది. సుకుమారమైన గులాబీ ముళ్లకే పూచింది కదూ నాన్నా! ప్రకృతిలో అశుద్ధముంది. ఆకలీ, వేదనా, ఆరాటమూ అన్నీ ఉన్నాయి. శరీరం వ్యాధులతో ఉండడం ప్రకృతి ధర్మమే.

సుఖం అనుభవిస్తున్నావు గనుక నీకు కష్టం తెలుస్తుంది. కష్టం అంటే ఇష్టం లేనిదే; అది సృష్టి స్వభావమే.

'అంతా సోదరులే కదమ్మా; ఒకరిపట్ల ఒకరికి ద్వేష మెందుకు.'

అమ్మ: ఎక్కడోలేదు 'ద్వేషం' తనలోనే ఉంది. ఒకసారి వచ్చిన అభిప్రాయం

మరొక సారిలేదు. అన్నీనాలోనివే. వైషమ్యం- ఆకలి- ద్వేషం- మందం ఈ ప్రకోపాలన్నీ నాలోనివే. నాలో లేనిది అవతల లేదు. నీకు అరటిపండు పెట్టడం నా ఆనందం కోసం. ఈరోజు పెట్టి రేపు పో అంటే కోపం వస్తుంది. రమ్మనటం పొమ్మనటం తనలోనివే కదా! కోపమదేదో కాదు నాన్నా! ప్రేమ యొక్క రూపాంతరమే. రెండూ దానిలోవే (తనలోనివే)"

పరమాత్మ ఆకలియే సృష్టి అన్నాను. ఆకలి కాలుతున్న స్థితియే పైశ్లోకాలలోని ఆసురీభావం. ఆకలి శమించి శాంతించిన స్థితియే ఆ తృప్తియే దైవీయసంత్తి.

రెంటినీ అమ్మ ఒకే భావంగా దరిచేర్చుకుంటుంది. అసురులని విసిరిపారెయ్యదు. వాళ్లను బురద పూసుకుని వచ్చిన పిల్లలే అనుకుంటుంది. బురదపాము కరిస్తే బురద త్రాగుటంరట.

బురద మలాంవేస్తే కొన్ని వ్రణాలు తగ్గుతాయి. కాబట్టి ఆ పిల్లలకు బురద ట్రీట్‌మెంటు అవసరమైతే అమ్మ అలాగే ఉంచేస్తుంది. లేకుంటే అమ్మ కడిగేస్తుంది. అది మలినమని సంకోచించదు మలిన క్షాళనం మాతృ బాధ్యత-ఇంకొకళ్లా పని చేయలేరు.

'ఆడుకొని బిడ్డ బురద పూసుకొని వచ్చినా నాకు బురద అనిపిస్తే కడుగుతా! లేకుంటే-మీద వేసుకుంటా. వదిలేదనేది లేదు. ఆవు ఈసగానే దూడపైన ఉన్న మాలిన్యం పోవడానికి సబ్బుతోపోదు. ఆవునాకితేనే. ఆమాలిన్యం పోవడానికి తల్లే శుద్ధిచేయాలి. దాని ఒంటి మీద రక్తం ఎక్కడిది? రక్తం తనదే. కుక్కవస్తే కరుస్తుంది తల్లినే'

అందటికీ సుగతే అన్న ఈ ముక్తి ప్రదానంలో పరమాత్మలో పూర్వవ్యాఖ్యాతలు వీక్షించిన ప్రళయకాల రుద్రరూపం నాకు కన్పించడంలేదు.

వెన్న కంటే మెత్తని, పూవుకంటె సుతిమెత్తని, వెన్నెలకంటె చల్లని, తేనెకంటె తియ్యని అమృతమధుర మాతృదేవతామూర్తి నా మనస్సులో సాక్షాత్కరిస్తున్నది. ఆ మాతృమూర్తి ఎప్పుడూ బాలింతే చూలింతే. ఆశిశూదయభావస్ఫూర్తి బ్రహ్మపదార్థం నుండి బ్రహ్మాండమే విరిసిపోతున్న విశ్వరూపంతో ఐక్యమవుతున్నది. ఇక్కడ ఆస్తికుడెవడో నాస్తికుడెవడో నాకు బోధపడడంలేదు. ఏదో అనిర్వచనీయమైన పులకలులేని శాంతి తప్ప. నాకింకో సందేహం రావడంలేదు. దేహాన్ని గుటించిగాని దేహిని గుటించిగాని. మనస్సు మాత్రం త్వరపెట్టుతున్నది ఎందులో పట్టినా ఈ అమ్మ దగ్గఱ మధురరాశి ఉన్నదనీ, అందులో అణుమాత్రం అర్థం కావడంలేదనీ, అదే దో దోచుకొమ్మనీ.

20. ఆ సురీం యోని మాపన్నాః మూఢా జన్మని జన్మని!
మామప్రాప్యైవ కౌంతేయ! తతో యాంత్యధమాం గతిమ్!!

తా: అర్జునా! అసురజన్మ మెత్తిన మూఢులు ప్రతి జన్మమునందు నన్ను పొందలేనివాళ్ళే చిట్టచివరకు అధోగతిని చెందుతున్నారు.

వ్యా: ఇంతవఱకు జరిగిన వ్యాఖ్యానంవల్ల దైవసంపత్తితో జన్మించినా, ఆసురీ సంపత్తితో జన్మమెత్తినా జన్మలుగా ఎత్తిన ఆకారాలుగా,వారి స్వభావాలుగా అయిన వాడు పరమాత్మయే అని తెలుసుకున్నాం. నా దేహానికీ, మేక దేహానికీ, ప్రాణచైత న్యాల విషయంలోభేదం ఏమీలేదు. పామో, తేలో ఇంట్లోకి వస్తే వాటిని వెళ్లగొట్టేదాకా నిద్రపోం. చిలకా, మైనాలను తెచ్చి ఇంట్లోపెట్టుకుంటాం. ఇదే భేదం. ఈ భేదమే సృష్టి అంటే. పరిణామయాత్రలో ఏ ఒకటీ నీచమూ కాదు. ఏ ఒకటీ ఉచ్చమూ కాదు. పైకెక్కిన వాడికి నిచ్చెన మూడో మెట్టు ఎంతో 9వ మెట్టూ అంతే. ఎక్కలేని వాడికి ఎన్ని మెట్లున్నా ఒకటే. ప్రవాహం పుట్టిన దగ్గఱ నుంచి సముద్రంలో కలిసే దాకా అంతా ఒకటే ప్రవాహం. వ్యాఖ్యాతలు అధమగతులని వ్రాసే, వాటిలో వస్తుతః అధమత్వం ఏమీలేదు. ఆ రాతినే తెచ్చి గుళ్లో లింగంగా పూజ చేస్తాం అదే రాతిని రుబ్బుడు పాత్రం చేసుకుంటాం. మన దేవతావిగ్రహాలను మసీదు మెట్ల మీద రాళ్లుగా వేసుకున్నారు మఱి ఈ తేడా ఈ ఉచ్చనీచత్వం ఎక్కడ ఉందంటే దానిని గుర్తించే మనస్సు పరి పక్వతను బట్టి ఉంటుంది. కాళహస్తీశ్వరుడిని అర్చించిహీన జన్మాలెత్తిన సాలెపురుగు, ఏనుగు మోక్షాన్ని పొందాయి. ముమ్మిడి వరం బాలయోగి ఉన్నత వంశంలో పుట్టిన వాడు కాదు. కాబట్టి ఎన్ని జన్మలెత్తినా అతడు పరమాత్మను తప్ప తెలుసుకోలేని మన స్సుతో ఉంటాడనిభావం. అలా కాని వాడికి కూడా సుగతి ఉండనే ఉంటుందని అమ్మ అభయహస్తం ఇస్తున్నది.

21. త్రివిధం నరక స్యైతత్ ద్వారం నాశన మాత్మనః।
కామః క్రోధ స్తథా లోభ స్తస్మా దేత త్త్రయం త్యజేత్॥

తా: కామ క్రోధలోభాలనే మూడు ద్వారాలు తెలుచుకుని ఇక్కడే నరకమున్నది. వీటి వలన ఆత్మవినాశం సంభవిస్తున్నది కాబట్టి ప్రతి మానవుడు వీటిని త్యజించ వలెను.

22. ఏతైర్విముక్తః కాంతేయ! తమో ద్వారై స్త్రిభిర్నరః।
ఆ చర త్యాత్మన శ్శ్రేయ స్తతో యాతి పరాం గతిం॥

తా: అర్జునా! ఈ మూడు తమోద్వారాలచేతా విడవబడిన మనుష్యుడు తనకు తాను మేలుచేసుకున్నవాడై ఉత్కృష్టమైన మోక్షాన్ని పొందుతున్నాడు.

23. య శ్శాస్త్ర విధి ము త్సృజ్య వర్తతే కామకారతః।
న స సిద్ధి మవాప్నోతి న సుఖం న పరాంగతిమ్॥

ఎవడు శాస్త్ర విధిని ఉల్లంఘించి తన ఇష్టానుసారంగా ప్రవర్తిస్తూ ఉంటాడో అట్టివాడు సిద్ధిని సుఖాన్ని మోక్షాన్ని పొందజాలడు.

సిద్ధి అంటే పురుషార్థసిద్ధి అని శంకరులు ఆముష్మిక సిద్ధి అని రామానుజుల వ్యాఖ్య.

24. తస్మా చ్ఛాస్త్రం ప్రమాణం తే కార్యా కార్య వ్యవస్థితౌ।
జ్ఞాత్వా శాస్త్ర విధానోక్తం కర్మ కర్తుమిహార్హసి॥

తా: కాబట్టి అర్జునా! ఏది చెయ్యదగింది ఏది చెయ్యదగనిది అనే మాట నిర్ణయించడానికి ఎల్లప్పుడు నీకు శాస్త్ర మేప్రమాణం అవుతున్నది. అట్టి శాస్త్రం ఎలా చెపుతున్నదో తెలుసుకుని దాన్ని అనుసరించి, నీవు కర్మచేయదగి ఉంటుంది.

వ్యా: అమ్మ చెప్పే సూక్తులు లౌకికాన్ని ఆధ్యాత్మికాన్ని కలిపి సమరసభావాన్ని కల్పిస్తాయి. శాస్త్రమూ ఉపనిషత్తులూ ఆధునిక శాస్త్రవిజ్ఞానం ఇంతగా అభివృద్ధిని చెందక పూర్వం రచించబడ్డవి అప్పటికి చంద్రుడు దేవతాస్వరూపంగా ఆరాధించ బడుతూ ఉండే వాడు. ఇప్పుడు మానవుడు చంద్రలోకం మీద సంచరించిస్వేచ్ఛా విహారం చేస్తున్నాడు. సమాజపు కట్టుబాట్లు ఎన్నోమారాయి కేవలం మూఢ విశ్వాసాలమీదనే ఆధారపడి ఆచారాలనూ, సంప్రదాయాల మీదనే ఆధారపడి ఆచారాలనూ, సంప్రదాయాలను, విశ్వసించడానికివీల్లేదు. అలాగే నిర్దుష్టంగా వ్యవస్థితమైన నేటి భౌతికవిజ్ఞానం, సాముద్రదైహిక విజ్ఞానం, రోదోంతరాళాల శక్తి విజ్ఞానం వీటిని గమనించకుండాగాని, గమనిస్తూ కిక్కురుమనకుండా పూర్వశాస్త్ర విజ్ఞానాన్ని గ్రహించడానికి ఎవరికీ ఉచితమైన పద్ధతిగాతోచదు. ఆ పూర్వశాస్త్రాలైనా అన్నీ ఒకేరీతిగా సిద్ధాంతాలను చెప్పలేదు. ఒక్క ఈ భగవద్గీతనే అద్వైత విశిష్టాద్వైత ద్వైతమతాల వారు వారి వారి సిద్ధాంతాల కనుకూలంగా చెప్పుకున్నారు ఒకే అర్థాన్ని చ్చేవయితే ఈ మహావాక్యాలు ఇన్ని మతభేదాలను ఎలా సమర్థించగలుగుతాయి. అమ్మ చెప్పే మాటల్లోని విషయానికి తేడాగా అనిపించే అంశాలు ముఖ్యంగా కొన్నింటిని ఈ క్రింద వ్రాస్తాను.

అమ్మ	శాస్త్రం.
1. ఈశ్వరుడూ పరమాత్మ అని ఇన్ని విధాలైనపరమాత్మ లేదు.	1. సృష్టి సంకల్పం లేనప్పుడు పరబ్రహ్మమనే పేరిట పరమాత్మ తెలియబడతాడు సంకల్ప సృష్టయిన తరువాత మాయనధిష్టించి ఈశ్వరుడై హిరణ్య గర్భుడని తెలియబడతాడు.
2. సంకల్పమూ భగవంతుడూ వేఱు కాదు. సంకల్పమే భగవంతుడు.	2. సంకల్పమూభగవంతుడూ వేఱు.
3. సృష్టి పరమాత్మ వేఱు కాదు-రెండూ ఒకటే.	3. పరమాత్మ నిష్క్రియుడు. అతని అనుగ్రహం వలన సృష్టి చేస్తుంది ప్రకృతి.
4. వ్యష్టి లేక సమష్టిలేదు. సమష్టి లేక వ్యష్టిలేదు.	4. వ్యష్టి సమష్టి విజ్ఞానం వేఱు వ్యష్టి చేష్టల ఫలం వ్యష్టిదే.
5. జన్మ అకారణం-పూర్వజన్మలు లేవు.	5. పూర్వజన్మకర్మ వల్లనే ఈ జన్మ కలుగుతుంది. ఈ జన్మకర్మల వలన కలిగిన వాసనలు జన్మతో నశించవు.
6. మఱపే మరణం-చావు అంటే పంచభూతాత్మకమైన శరీరం పంచభూతాలలో కలిసిపోవడమే. కర్మ శేషాలుండవు.	6. ఆగామి సంచిత ప్రారబ్ధ రూపములైన కర్మలు, పునర్జన్మలకు కారణాలౌతవి. ఈ జన్మలో చేసిన మంచి చెడు కర్మలే వచ్చే జన్మలలో సుఖ దుఃఖాలకు కారణమౌతాయి.
7. మంచి చెడూ, సుఖం దుఃఖం ఇలాంటి ద్వంద్వాలకు ప్రమాణ సిద్ధిలేదు. మనస్సులోని భావం అలా అనుకుంటుందేకాని నిజానికి ద్వంద్వాలు వేతే వేతే రూపా	7. జనుల స్వాస్థ్యం మంచి, జనుల అశ్రేయస్సు చెడ్డ. శాస్త్రం చెప్పిన పుణ్యపాపాలే పుణ్యపాపాలు.

లతో లేవు; పుణ్యపాపాలు లేవు.

8.	విధి నిషేధాలను ఎవరూ పాటించడంలేదు - అవసరమే విలువైనది.	విధినిషేధాలను శాస్త్రం నిర్ణయిస్తుంది.
9.	కర్మ జీవుణ్ణి బంధించలేదు. కర్త కర్మ క్రియా అన్నీ పరమాత్మే.	చేసుకున్న కర్మఫలితం అనుభవించిన దాకా జీవుడు కర్మ బంధాన్ని తప్పించు కోలేడు.
10.	పరమాత్మ ప్రేరణే వ్యక్తి చేసే పనులకు కారణం.	వ్యక్తి స్వతంత్రబుద్ధియే అతడు చేసేపనులకు కారణం.
11.	స్వర్గ నరకాలువేఱే ఎక్కడో లేవు అన్నీ ఇక్కడే.	స్వర్గాదిలోకాలువేర్వేరుగా ఉన్నవి.
12.	పరమేశ్వరుడు సృష్టిగా మారడం అతని స్వభావం.	సృష్టి జీవుల కర్మశేషాలను బట్టి జరుగుతుంది.
13.	మాయ, భ్రాంతి, అజ్ఞానం, జ్ఞానం అన్నీ పరమాత్మే.	శుద్ధ బుద్ధ జ్ఞాన స్వరూపుడు పరమాత్మ. అజ్ఞానం అవిద్య నశిస్తేనే తప్ప జ్ఞాన సాక్షాత్కారం కాదు.
14.	సాధ్యమే సాధన-	సాధన పాకానికి వస్తే సాధ్యం అవు తుంది.
15.	నీవేది చేసినా పరమాత్మ ఆరాధనే	శాస్త్రాలలో చెప్పిన రీతిగా చేసినదే ఆరాధన
16.	అన్ని ఆకారాలు పరమాత్మవే కాబట్టి నిరాకారుడు.	అన్ని ఆకారాలు వేఱు నిరాకార తత్వంవేఱు.
17.	మన కుండే ప్రతి గుణంలో పరమాత్మ అపరిమితంగా ఉంది- పరిమితంగా ఉండేది మానవత్వం అపరిమితంగా ఉండేది దైవత్వం.	పరమాత్మనిర్గుణుడు.
18.	వైరాగ్య మంటే అందఱి ఎడలా అనురాగం	వైరాగ్యమంటే మమకారాన్ని చంపు కోడం.

19. మోక్షానికి సంసారానికి దూరం కానక్కర లేదు. సంసారంలో తానుండవచ్చును కాని తనలో సంసారం ఉండరాదు.	19. సంసారాన్ని విసర్జించి కోరికలను నాశనం చేసి సన్యాసం పొందితే కాని మోక్షంలేదు.
20. జ్ఞానేచ్ఛ కలగడమే జ్ఞానం. తృప్తే ముక్తి.	20. గురుశుశ్రూషచే కాని జ్ఞానం రాదు. స్వాధ్యాయం లేనిదే స్వర్గం రాదు. పరమాత్మతో సాయుజ్యం ముక్తి.
21. గుర్తు చూపించినవాడు గురువు.	21. బ్రహ్మజ్ఞానిగురువు.
22. శాస్త్రం అనుభవాన్నివ్వడు. అనుభవం శాస్త్రాన్నిస్తుంది.	22. వేదం అపౌరుషేయం అనుభవంతో దానికి సంబంధంలేదు వేద విధిశాసనమే.
23. ఇన్ని రకాలైన బ్రహ్మలు లేరు మారుతూ ఉండేది కూడా అయిన బ్రహ్మ ఒక్కడే.	23. జీవాత్మ వేఱు పరమాత్మ వేఱు.

శాస్త్రం అంటే సృష్టి శాస్త్రమే.

'మన శాస్త్రాల్లో ధర్మాలన్నీ చెప్పే ఉన్నయ్ నాన్నా - అవి ప్రతిమానవుడికీ కొన్ని పనులను నిషేధించినయ్ - కొన్నింటిని శాసించినయ్. కాని ఎవరూ నిషేధించిన వాటిని మానుకుంటున్నదీ లేదు. శాసించిన వాటిని ఆచరిస్తున్నదీ లేదు. అంటే ఈ విధి నిషేధాలను బట్టి కాదు మనిషి ఆచరిస్తున్నది. తనకు ఎప్పుడు ఏది అవసరమో అది ఆచరిస్తున్నాడు. అంటే మనిషిని అవసరమే నడుపుతున్నది. అందుకే అవసరమే విలువైనదనిపిస్తుంది నాకు' అమ్మ.

ఇది శ్రీమన్మాతృగీతలోని

దైవాసుర సంపద్విభాగ యోగమను

షోడశోధ్యాయము.

మాతృగీత

శ్రద్ధాత్రయ విభాగయోగము

సప్తదశోధ్యాయము

అర్జున ఉవాచ

1. యే శాస్త్రవిధి ముత్సృజ్య యజన్తే శ్రద్ధయాఽ న్వితాః।
తేషాం నిష్టా తు కా? కృష్ణ! సత్త్వ మాహో రజస్తమః॥

తా: శ్రీ కృష్ణా! శాస్త్ర విధులను విడిచిపెట్టి కూడా శ్రద్ధతో కూడుకున్న వాళ్ళై ఎవరు పరమాత్మను పూజిస్తారో, వాళ్ల నియమం సాత్వికమా? రాజసమా లేక తామసమా?

వ్యా: శాస్త్రం అంటే శాసించేది, శిక్షించేది కనుక స్మృతి, శ్రుతి, రెండేనని శంకరాదుల మతం. పురాణాదులు కూడా శాస్త్రంలోనే చేరతాయని రామానుజాదుల అభిప్రాయం.

క్రిందటి అధ్యాయంలో చివర రెండు శ్లోకాల్లో కృష్ణపరమాత్మ శాస్త్రవిధుల నుల్లంఘించి ఎవడైతే చరిస్తారో, వాళ్ళకు ఫలసిద్ధీలేదు, సుఖమూ లేదు, మోక్షప్రాప్తీ లేదని చెప్పారు.

కాబట్టి ఏ కర్మ చెయ్యదగినదీ ఏది చెయ్యదగనిదీ అనే సందేహం వచ్చినప్పుడు శాస్త్రం ఏ విధంగా చెప్పితే అదే ప్రమాణంగా స్వీకరించవలసినదని పరమాత్మ సెలవిచ్చారు. దీని మీద అర్జునుడికీ సందేహం వచ్చింది. 12వ అధ్యాయం ప్రారంభంలో అర్జునుడు సాకారోపాసన గొప్పదా? నిరాకారోపాసన గొప్పదా? అని ప్రశ్న వేయగా అతిచాకచక్యంగా పరమాత్మ "శ్రద్ధయా పరయోపేతా స్తేమే యుక్తతమా మతాః" అని చెప్పి, ఎవడు శ్రద్ధతో కూడుకున్న వాడై ఉపాసన చేస్తాడో వాడే నా దృష్టిలో ఉత్తమ యోగి అని చెప్పాడు. శ్రద్ధ లేకుండా ఎంత భారీ పూజ సాకారానికి చేసినా, ఎన్నేండ్ల తపస్సు నిరాకారానికి చేసినా, ఆ పూజవల్ల, ఆ తపస్సువల్ల ఏ విధమైన ఫలమూ కలగదని తేలింది. ప్రధానమైనది శ్రద్ధ. పూజ ఎలా జరిగిందని కాదు. అదే నమ్మకంతో వింటున్న అర్జునుడి కిప్పుడు శాస్త్ర సమ్మతం కాని అర్చనవల్ల ఏమీ ఫలం కలగదనీ, దానివలన మోక్షసిద్ధి కలగదనీ పరమాత్మ చెప్పారు. కాబట్టి శ్రద్ధాయుక్తమైన పూజ ప్రధానమా? శ్రద్ధాయుక్తమై ఉన్నప్పటికీ అది శాస్త్ర విహితం కాకపోతే అది ఫలప్రదమౌతుందా కాదా? అని అర్జునుడికి సందేహం వచ్చింది.

శాస్త్ర నియమాలు లేకుండా శ్రద్ధతో చేసే పూజ ఏ రకానికి చెందుతుంది. అది సాత్వికమా, రాజసమా, తామసికమా అని ప్రశ్నించాడు.

'శాస్త్రమంటే శాసించునది; శాశ్వతమైనది' అమ్మ. 'అనుభవం శాస్త్రాన్నిస్తుంది శాస్త్రం అనుభవాన్నివ్వదు' అమ్మ.

కాబట్టి శాస్త్రాన్ని గౌరవించాలా అనుభవాన్ని గౌరవించాలా అంటే ఈ రెండింటి అనుభవం క్రోడీకరించుకుని అవసరాన్ని గౌరవించి, అవసరం ప్రకారం నడుచు కోవాలి అన్నదే అమ్మ మతం.

శ్రీ భగవానువాచ

2. త్రివిధా భవతి శ్రద్ధా దేహినాం సా స్వభావజా।
సాత్త్వికీ రాజసీ చైవ తామసీ చేతి తాం శృణు॥

భగవానుడు వచించెను.

తా: శ్రద్ధ దేహి యొక్క స్వభావాన్ని బట్టి మూడు విధాలుగా ఉంటుంది. కొందరిలో అది సాత్త్వికంగా ఉంటుంది. కొందరిలో అది రాజసికంగా ఉంటుంది. మరికొందరిలో అది తామసికంగా ఉంటుంది. అట్టి శ్రద్ధా స్వరూపాన్ని గురించి చెప్తాను విను.

వ్యా: జన్మాంతర కృతమైనది సంస్కారమన్నారు. ఈ జన్మ ధర్మ సంబంధియైన వృత్తియే మరణకాలమందు కూడా అభివ్యక్తమౌతుంది. దాన్ని స్వభావం అంటారు. ఈ స్వభావంవల్ల పుట్టినది స్వభావజం. ఇదీ స్వభావజం అనే మాటకు శంకరుల నిర్వచనం.

ప్రాచీన వాసనాజన్యమగు తత్తద్రుచి విశేషము వలన పుట్టినది అని రామానుజుల నిర్వచనం.

వికారాలు చెందడానికిగాని వికారంలేకుండా ఉండడానికిగాని పరమేశ్వరునికి ఒక్కడికే శక్తి ఉంది. అతని శక్తి అన్నా అతనే. పరమాత్మ వేరు పరమాత్మ శక్తి వేరూ కాదు. సూర్యుడూ సూర్యుని కాంతి వేరుగావు. సూర్యుని వెలుగు కనిపిస్తున్నదంటే సూర్యుడు ఉన్నాడనే అర్థం. కాలమూ దూరమూ అతడు అతనికాంతి కంటె వేరుగా ఉన్నట్టు కనిపిస్తుంటుంది. మనుష్యులు చాలావరకు బాధ కలిగించే దాన్ని అర్థం చేసుకున్నంతగా సాఫీగా జరిగిపోయే దాన్ని అర్థం చేసుకోరు. ఎలక్ట్రిక్ దీపాలు రోజూ త్రెంపు లేకుండా వెలుగుతూ పంకాలు తిరుగుతుంటే పవర్‌హౌస్ నుంచి ఎడతెగని

ధారగా విద్యుచ్ఛక్తి తీగల ద్వారా మన ఇంట్లో బల్బులకు, పంకాలకు అంటుకునే ఉండి అవతలకు కూడా ప్రవహిస్తున్నదనే ఆధారభావం మన మనస్సును ఎన్నడూ అంటుకోదు. ఒక్కసారిగా అన్నం తింటున్నప్పుడో, రోగికి ఆపరేషను చేస్తున్నప్పుడో, విమానం తుఫాను మధ్యలో ఆకాశంలో వగుడాకు లాగా కొట్టుకుంటున్నప్పుడో, ఈ విద్యుద్ధార తెగిపోతేగాని సంతతశక్తి ధారాస్వభావం మనుష్యుడికి అర్థం కాదు, అంధ కారం ఉంటేగాని వెలుగువల్ల ఉపయోగం అర్థంకాదు. అందుకే చీకటి వెలుతురు కాధారం అంటుంది అమ్మ. అంధకారం మూసుకునిపోయి మనను ముంచివేసి నప్పుడే మనం పవర్‌హౌసుకు పరుగెత్తుతాం. ఎలాగైనా మళ్ళీ మన బల్బులు వెలిగే లాగా చేసుకోడానికి అన్ని ప్రయత్నాలు చేస్తాం. ఆదుర్దాగా ఫ్యూజులు కాలిపోయా యేమో అని అన్నీ పరీక్ష చేసుకుంటాం. ఆదుర్దాగా సైకిలు మీదా, ఫోను మీదా కబురు చేసి కనుక్కుంటాం. ఈ పడే ఆదుర్దా, ఏదో పని చెయ్యాలనే ఈ తీవ్రమైన మెదడు వేడి, ఇది సఫలం కాకపోతే అనవసరంగా చిక్కులు పడిపోతామనే భావిక్లేశ భయం, ఇవన్నీ చికీర్షాభిముఖంగా ఏకరూపమౌతున్న మనఃప్రవృత్తి శ్రద్ధ. ఈ శ్రద్ధ అవసరాన్ని బట్టి మనిషికి సంక్రమిస్తున్నదా లేక సహజంగా జన్మతోనే స్వభావంగా వస్తున్నదా అనే ప్రశ్న ఈ శ్లోకంలో ఉటంకింపబడ్డది. పరమాత్మ ఇది స్వభావజన్యంగానే వస్తుంది మనుషులకన్నారు. స్వభావజన్యంగా రాకపోతే కొన్ని కొన్ని వింత ప్రవృత్తులకు మనం కారణం చెప్పలేకపోవాలి. ఇళ్ళు తగలడుతుంటే. ఒకొక్కడు తన ఇంటి నార్పుకోవ డమేకాక ఇతరుల ఇళ్ళనూ ఆర్పి, తగలడని వాటి మీద నీళ్ళుపోసి, మండే ఇళ్ళలో పిల్లలను ప్రాణులను రక్షించి, తనకు అపాయమని ఐనా, శంకించకుండా పని చేస్తాడు. దీనివల్ల పరోపకారం, దానివలన పుణ్య, ప్రాప్తి, దానివలన స్వర్గభోగాలు, ఇవన్నీ జరుగుతాయనే సినిమా అతని మనస్సులో ఆ మంటల్లోనుంచి ప్రత్యక్షం కాదు. స్వతస్సిద్ధంగానే అతని మెదడూ నరాలూ అవయవాలూ, ప్రేరేపించబడి పనిచేస్తాయి. స్విచ్చి వేయడం లైటు వెలగడం రెండూ ఒకసారే జరిగినట్లు ప్రేరేపణా క్రియాకాండా ఒక్కసారే జరిగిపోతాయి.

రెండోరకం వాడు తన ఇంటికి మాత్రం ముందఱ బందోపస్తు చేసుకుంటాడు. కడవలూ బకెట్లూ నీళ్ళతో నింపుకొని తన ఇంటి నడికప్పెక్కి కూర్చుంటాడు. అగ్ని అంటుకోడం జరిగితే నానా యత్నాలూ చేసి దాన్ని ఆర్పేసుకుంటాడు. Charity begins at home అనుకుంటాడు.

మూడో రకం వాడు నాలుగు ఇళ్ళు ఆర్పుతుంటే నాదాన్ని మాత్రం విడిచిపెట్టి ఊరుకుంటారా! ఊరుకుంటే వాళ్ళకే నష్టం కదా అని మండిపోతున్న ఇంటి నుండి

కాలే కొరివితో బీడీ అంటించుకుని తీరిగ్గా ఆహా మంటలెంత బాగా నిప్పు నాలుకల లాగా సాగిపోతున్నాయో అని మెచ్చుకుంటూ హాయిగా కూర్చుంటాడు. ఏమిటి! అలా కూర్చున్నావ్ లేవరా! బాల్చి అందుకో! అంటే మీరందరూ అలిసిపోతే మీకు రిలీఫ్‌గా రావడాని కెవరైనా ఉండాలా అక్కరలేదా? అంటాడు.

ఇలాగా శ్రద్ధ అనేక విధాలుగా ఉంటుంది సాత్విక రాజసిక తామసిక భేదాలతో మూడు విధాలుగా ఉంటుందని చెప్పారు పరమాత్మ.

వాసనా, రుచి, విశ్వాసం, శ్రద్ధ, స్వభావం ఇవన్నీ తనతోపాటు అనుసరించి వచ్చేవని విజ్ఞులు అంటారు. మరి పరమాత్మ అనుగ్రహం కూడా తనతోపాటు ఎందుకు రాదూ అనే ప్రశ్న వస్తుంది. చేసుకున్న కర్మ అడ్డుపడుతున్నదని కర్మవాదులు సమాధానం చెపుతారు. అయితే మనిషి కర్మ దేవుని అనుగ్రహం కంటె బలీయమా? అనే మాట వస్తుంది. అంతకంటె ఉత్తమమైన పద్ధతి అమ్మ చెప్పేది నా కటాక్షం ఎప్పుడూ ఉన్నది. సుఖమూ అమ్మ ప్రసాదమే. దుఃఖమూ అమ్మ ప్రసాదమే. అన్ని హెచ్చు తగ్గులూ అమ్మ ప్రసాదమే.

3. సత్త్వానురూపా సర్వస్య శ్రద్ధా భవతి భారత!।
శ్రద్ధామయోఽ యం పురుషో యో యచ్ఛ్రద్ధ స్స ఏవ సః॥

తా: అర్జునా! పరమాత్మ ప్రసాదించిన దానికి అనురూపమయిన శ్రద్ధే ఎల్లరకు కలుగుతున్నది. ఎటువంటి శ్రద్ధపరమాత్మవల్ల లభ్యమయిందో పురుషుడు అలాటి దాన్నే కలవాడౌతున్నాడు.

వ్యా: సత్వానురూప - అనే మాటకు విశిష్ట సంప్రదాయ యుక్తమైన అంతః కరణానికి తగిన అని శంకరుడు అర్థం చెప్పారు; అంతఃకరణాన్ని అనుసరించేది అని రామానుజులు అర్థం చెప్పారు; చిత్తానికనురూపమైనది అని మధ్వాచార్యులవారు అర్థం చెప్పారు.

సంస్కారం అంటే పూర్వజన్మ సుకృతం వలన ఏర్పడి, మనస్సును ఒక రీతిగా నియమించి చేయించగల ప్రవృత్తి' దీన్ని గురించి అమ్మ అనే మాట వినండి.

'సాధన సుకర్మనూ దుష్కర్మనూ కొట్టి వేస్తుందా! పుట్టినప్పుడే రెంటినీ జోడించు కునే ఉంది. డబ్బుకూ జబ్బులకూ అన్నిటికీ మీరు చెప్పుతూ ఉన్నట్టుగా, వీడు నిల్చున్నా, కూర్చున్నా పూర్వ జన్మసుకృతమే. అప్పుడు వీడి ప్రయత్నమేముంది? అంతా వాడిదే నాన్నా! మీరు చెప్పినట్టు పూర్వజన్మ సంస్కారం అన్నా ఇప్పుడు చేయ గలిగిందేమి లేదు. సంస్కారమే దైవమంటాను. దుష్కర్మ సుకర్మమని వేఱుగా లేదు.

వీడి సాధన అని మూడవది తెస్తున్నారు. పూర్వ జన్మసుకృతంవల్ల భాగవతం చదవటం. పుస్తకాన్ని దొంగతనంచేసి పోగొట్టుకోవా లనిపించింది? చేస్తున్న వాడికి తప్పు అన్నభావమెక్కడిది? అప్పుడు కర్మ ఏరకమైన కర్మ? నిన్నటి వఱకు తప్పు చేశాను. ఇక చేయకూడదనుకున్నాను. ఏ సాధనతో చేయగూడదనిపించింది? ఇప్పుడు చాలా హాయిగా ఉన్నాను. నిన్నటివఱకు పుస్తకాలు చదువుతూ ఏదో తెలియ లేదు అనుకుంటూ పొందలేదు అనుకుంటూ బాధపడ్డాను. శాస్త్రపరిచయం ఉంది. ఆనందం లేదు, ఆ చెప్పేది నా జ్ఞానానికి చాలా పేలవమనిపించింది. అనంతపురం నుండి బస్సు రాగానే వీళ్ళేదైవ స్వరూపాలనిపించింది. ఇది సాధనల ప్రతి ఫలమా? ఈ భావం ఏ సంస్కారము తెచ్చినది'. అమ్మ

4. యజన్తే సాత్త్వికా దేవాన్ యక్షరక్షాంసి రాజసాః।
ప్రేతాన్ భూతగణాం శ్చాన్యే యజన్తే తామసా జనాః॥

తా: సాత్వికులు దేవతలను, రాజసులు యక్షరాక్షసులను తామసులైన ఇతరులు భూతప్రేత గణాలనూ పూజిస్తున్నారు.

5. అశాస్త్ర విహితం ఘోరం తప్యన్తే యే తపోజనాః।
దంభా హంకార సంయుక్తాః కామ రాగ బలాన్వితాః॥

6. కర్శ యన్త శ్శరీరస్థం భూత గ్రామ మచేతసః।
మాం చైవాన్త శ్శరీరస్థం తాన్విద్ధ్యాసుర నిశ్చయాన్॥

తా: మఱికొందఱు శాస్త్ర విరుద్ధంగా ఉన్న తపస్సులను చేస్తుంటారు. వామాచారాది ఘోర తపస్సును చేస్తుంటారు. వారి తపస్సులు పరులకు బాధాకరంగా పరిణమిస్తుంటాయి. డంబము, అహం కారం, కామ ప్రవృత్తి, అతిశయం వీటితో కూడుకొని ఉంటారు. ఈ మానవులు శరీరంలోని భూతసమూహాలను, అంతశ్శరీరంలోని నన్ను కూడా కృశింపజేస్తుంటారు. వాళ్ళే అసురసంపత్తు కలవాళ్ళని తెలుసుకో.

7. ఆహార స్త్వపి సర్వస్య త్రివిధో భవతి ప్రియః।
యజ్ఞ సప్త స్తథా దానం తేషాం భేద మిమంశృణు॥

తా: సమస్తానికి (ఆధారమైన) ఆహారం కూడా సాత్విక రాజసతమో భేదాలతో మూడు విధాలుగా ఉన్నది. ఆయా ప్రవృత్తులు కలవాళ్ళకు ఈ త్రివిధములైన మానవులకు ప్రియమౌతున్నది. ఇదే ప్రకారంగా యజ్ఞం, తపస్సు, దానం అనే విషయాలు కూడా మూడు విధాల భేదములు కలవై ఉన్నాయి. వాటిని చెప్తాను విను.

వ్యా: సర్వస్య అనే మాటకు సర్వభోక్తకు అని శంకరులు, సమస్త ప్రాణిజాతానికి అని రామానుజులు అర్థం చెప్పారు.

ఈ విధంగా తినే ఆహారాన్నిబట్టి వారి స్వభావం సాత్వికంగా ఉందో, రాజసంగా ఉందో లేక తామసంగా ఉంటుందో, చెప్పవచ్చు. అలాగే యజ్ఞాలు తపస్సు, దానం ఎలా ఉందో చూచి వారు సాత్వికులో, రాజసులో తామసులో నిర్ణయించవచ్చు. వారి స్వభావాన్ని ఇంకో రకంగా మార్చడాని సాధ్యం కాదు. ఎందుకంటే వారి జన్మకు కారణమైన వారి పూర్వ జన్మ సంస్కారం, వారి జన్మకు కారణమైనట్లే వీటికీ కారణ మైంది. ఆసురీభావ సందష్టులైన మనుష్యులు మూఢయోనుల్లోకి విసిరి వేయబడ్డట్టు గానే, ఆగతిని వారు తప్పించుకోలేనట్టుగానే ఈ సాత్విక, రాజసిక, తామసిక స్వభావా లను కూడా వారు తప్పించుకోలేరు. అవి సత్వాను రూపాలు. అంటే సంస్కార ఫలాలు. సంస్కారం ఇంకో లాగా ఎలా అవతరించగలదు? కుంకుడు గింజకు మామిడి చెట్టు పుట్టుతుందా?

8. ఆయు స్సత్త్వ బలారోగ్య సుఖ ప్రీతి వివర్ధనాః
రస్యాః స్నిగ్ధా స్థిరా హృద్యాః ఆహారా స్సాత్త్విక ప్రియాః॥

తా: ఆయువును, సత్త్వగుణాన్ని, బలాన్ని ఆరోగ్యాన్ని సుఖాన్ని, ప్రీతిని ఎక్కువ చేసేవి, రసం కలవి, చమురుకలవి, స్థిరంగా ఉండేవి, నోటికింపైనట్లుగానే హృద యానికీ సంతోషము లైనవీ అవి సత్త్వగుణం గలవారికి ఇష్టంగా ఉంటాయి.

వ్యా:సత్త్వము అంటే సత్వగుణమని శంకరులూ అంతః కరణకార్యమైన జ్ఞానం అని రామానుజులూ నిర్వచించారు.

స్థిరః: అంటే దేహంలో చిరకాలం నిలిచేవి అని శంకరులూ అప్పుడే పక్వం గానివి (నెయ్యి మొదలైనవి) అని రామానుజులూ నిర్వచించారు.

రస్యాః: రసంతో కూడినవని శంకరులూ మధుర రసంతో నిండినవని రామాను జులూ నిర్వచించారు.

హృద్యాః: హృదయమునకింపైనవని శంకరులూ, రమణీయమైన ఎషంకలవి అంటే కంటికింపైనవని రామానుజులూ అనుభవించిన తరువాత కూడా మనో హరములైనవని మధ్వాచార్యులూ అన్నారు.

9. కట్వామ్ల లవణా త్యుష్ణ తీక్ష్ణ రూక్ష విదాహినః
ఆహారా రాజస స్యేష్టాః దుఃఖ శోకామయ ప్రదాః

కారం, ఉప్పు, పులుపు, మిక్కిలి వేడి, గలవీ, తీవ్రమైనవీ, చమురు లేనివీ, విశేషంగా దాహాన్ని కలిగించేవీ, దుఃఖము, శోకము, రోగము వీటిని కలిగించేవీ, అయిన పదార్థాలు తినడమంటే రాజస స్వభావులకు ఇష్టం.

ఒకరు: Spiritual life lead చేసే వారికి శరీరానికి ఏ అన్నం అవసరం?

అమ్మ : మీరు తినేదే.

ఒకరు: Spiritual food ప్రపంచంలో ఉందా

అమ్మ: రెండుగా చెప్పను.

వ్యాఖ్యాతలు ఉష్ణం అనే విశేషణానికి ముందున్న 'అతి' అనే ఉపసర్గను కట్వాదులైన ఏడింటికి తగిలించి, ఎక్కువ కారం, ఎక్కువ పులుపు, ఎక్కువ ఉప్పు అని వ్యాఖ్యానించారు.

ఒక రకమైన ఆహారం ఒక రకమైన గుణాన్ని వృద్ధి చేస్తుంది కాబట్టి. సత్వగుణం అభివృద్ధి చేసుకోవాలనుకుంటే, అటువంటి సాత్వికాహారములనే తింటూ ఉండమని ముముక్షువులను తెలిసిన వాళ్ళు హెచ్చరిస్తూ ఉంటారు. వ్యాఖ్యాతలు ఇలా అంటారు.

'శ్రీకృష్ణపరమాత్మ ఇన్ని పర్యాయములు సాధకులను ఏల హెచ్చరిక చేయవలసి వచ్చినదో ఒకింత ఆలోచింపుడు. ఆహారం యొక్క సూక్ష్మాంశముచేతనే మనస్సు ఏర్పడుచున్నది. మనస్సు సాత్త్వికాణువులతో కూడియున్నప్పుడు మాత్రమే ధ్యానము, దైవచింతన, తత్త్వవిచారణ చక్కగా జరుగగలవు కాబట్టి మనోనిర్మాణమునకు హేతుభూతమైనట్టి ఆహారము నెడల సాధకుడు బహుశ్రద్ధ గలిగియుండవలెను. కారములు మానివేయవలెను. ఏలయనిన ఈ 'కారములు' పెరిగినచో ఆ'కారము'లున్ను (అహంకారం, మమకారం, అపకారము మున్నగునవి) పెరిగిపోవును. మత్స్య, మాంస మద్యాదులను సేవింపరాదు. తరింపదలంచినవాడు ఏదియో కొంత శిక్షణకులోను కావలసి ఉండును".

అమ్మ ఏదో సందర్భంలో ఒకసారి అన్నట్లు గుర్తు. కారమే వాడడం ఎఱగని దేశాలు కొన్ని ఉన్నవి. అలాగే చింతపండు. ఘాటైన పదార్థాలు, మిరపకాయలు వాడడం ఎఱగని యూరప్ అమెరికా లాంటి దేశాల్లో యుద్ధాలు లేకుండా పోయాయా అని అమ్మ అడిగినట్లు గుర్తు. ప్రపంచాన్ని రెండుసార్లు జన సంహారంతో ఉత్పాత లూగించిన మహాయుద్ధాలకు జన్మస్థానం జర్మనీదేశం. ఆ దేశంలో ఎక్కువ కారం ఎక్కువ పులుసు ఎవరూ ఉపయోగించరు. పంజాబులో విశేషంగా పాలు, వెన్న,

గోధుమ, రొట్టె, వేరుసెనగనూనె, నెయ్యి, ఇవే ఎక్కువగా వాడతారు. దుక్కల్లాగా ఉంటారు మనుషులు. మనదేశంలో జరిగిన రక్తపాతంలో మూడు వంతులు అక్కడే జరిగింది. కురుక్షేత్ర సంగ్రామం పంజాబుగడ్డ దగ్గర జరిగినదే.

యోగానికి ఆహార నియమం అవసరమా?

"యోగసాధనకు ఉప్పూ, పులుసూ కారమూ కూడదని చెబుతున్నారు. వీటివల్ల ప్రకోపాలు కలుగుతాయని అంటున్నారు. ఉప్పూ, కారమూ తినని ఇతర దేశాల్లో కూడా ప్రకోపాలు కలుగుతూనే ఉన్నాయి. మిరపకాయలు తినకపోవచ్చుగాని మిరప కాయలో ఉన్న గుణం మన శరీరంలో ఉంది. మనస్సుకూ ఆహారానికీ సంబంధం లేదు' అమ్మ.

రెండో ప్రపంచ యుద్ధానికి మహానాశనానికి కారణమైన హిట్లరు, శాకాహారి. డబుల్ రొటీ తినే జాతికి చెందినవాడు.

కాబట్టి ఆహారం వల్ల స్వభావం మారుతుందన్నమాట ఋజువయ్యేది కాదు. స్వభావం దేవుడిచ్చిన ప్రసాదం. దాని కనురూపమైనవే ఆహారం గుణం, కర్మ అన్నీను.

10. యాతయామం గతరసం పూతి పర్యుషితం చ యత్।
ఉచ్ఛిష్ట మపి చా మేధ్యం భోజనం తామస ప్రియ॥

తా: వండిన తరువాత జాముకుపైగా నిలవ ఉన్నదీ, అంటే చద్ది అన్నం. రసం ఇంకిపోయినదీ, పాసిపోయి చెడు వాసన గొట్టుతున్నదీ, రాత్రి అల్లా ఉండిపోయనదీ, ఎంగిలి ఐనది, అంటే ఆకుల్లో తినగా మిగిలినదీ, యజ్ఞశేషం కానిదీ, అంటే నైవేద్యం పెట్టనిది అని కూడా అర్థం. ఇటువంటి ఆహారం తమోగుణంగల వానికిష్టంగా ఉంటుంది.

వ్యా: యాతయామీం అంటే సరిగా పక్వం కానిది అని శంకరులు. ఉచ్ఛిష్టం అంటే గుర్వాదులకంటె ఇతరులు తినగా మిగిలినది అని అర్థం.

జగత్తు పరమాత్మ నిత్యశేష వాచకాలు: మఱి అమ్మకొఱికిన పండు పరమాత్మ అనుగ్రహం అబ్బిన వారికి తప్ప ఇంకెవరికి లభిస్తుంది. ఆహార విషయాన్ని ఇంత వఱకు చర్చించి, యజ్ఞవిషయాన్ని గూర్చి పరమాత్మ చెపుతున్నారు.

11. అఫలాకాంక్షిభి ర్యజ్ఞో విధి దృష్టో య ఇజ్యతే।
యష్టవ్య మేవేతి మన స్సమాధాయ స సాత్త్వికః॥

తా: శాస్త్రవిధిననుసరించి ఏది చేయదగినదో దానిని చేసి తీరాలనే స్థిర నిశ్చయంతో ఫలాకాంక్ష లేకుండా చేయబడే యజ్ఞం సాత్వికమైనది.

వ్యా: శాస్త్రవిధులకూ అమ్మ చెప్పే దానికీ నిజానికి తేడా ఏమీలేదు. మనం అర్థం చేసుకోడంలోనే తేడా. అమ్మ అన్నట్టు 'భగవద్గీతలో లేనిదీ నేను చెప్తున్నదీ వేఱుగా ఏమీలేదు. చెప్తున్న తీరు వేఱుగా ఉండవచ్చుగాని.

శాస్త్రవిధిలో చేస్తేనే యజ్ఞమే ఔతుందా? మనస్సు ప్రధానంకాదా? భగవద్గీతా వాక్యం శాస్త్రవిధిలో మనస్సు నిలవడానికి కొన్ని తతంగాలు చెప్పబడి ఉన్నాయి. షోడశోపచార పూజల్లాంటివి. షోడశోపచారాలు మాత్రమే జరుపుతూ మనస్సును ఇంకో చోట అమ్ముకుని ఉంటే అది శాస్త్ర విధ్యుక్తమైన యజ్ఞం అవుతుందా?

'బొట్టు పెట్టుకొని విభూతి పూసుకొని అందఱూ ఒక్కసారి స్తోత్రముచేయక పోవచ్చు. శేషయ్యగారు, భాస్కరరావు, తాతయ్య (మనస్సు అమ్మపై కేంద్రీకరించి) మనసులో పెట్టుకొని కదా చేసేది. వీరు మనసును అర్పించి చేస్తున్నారని ఇతరుల కెట్లా తెలుస్తుంది? గజేంద్రమ్మ హోటలులో ఉన్నా మనస్సు ఇక్కడే. వసుంధర కాఫీ కప్పులు కడగడం కనిపిస్తుంది. మనస్సును అర్పించిందని తెలియదు కదా? సాధారణంగా అందరి దృష్టికీ చేసే పనిని బట్టి ఉద్దేశాన్ని భావిస్తారు. భక్తి ఉండబట్టే చెయ్యడం. ఇక్కడ ఏమి జరుగుతుందీ అంటే ఏమి చెప్తారు? ఏది చేసే వాడి కదే సుప్రభాతం. శారదాంబ ఇరువది నాలుగు గంటలు నీళ్ళు కాచుతునే ఉంటుంది. చూచేవాళ్ళే మనుకుంటారు. ఇది మామూలు ఇల్లు. విధి నిషేధాలూ ప్రతిబంధకాలూ ఇక్కడ లేవు. ఆశ్రయమేకాని ఆశ్రమముకాదు (ఇక్కడ ఉండే వారికి) నాది అని అందఱికీ లేకపోవచ్చును. 62 నవంబరు ఒకటవ తారీఖు వచ్చిన రాజే రామకృష్ణ నాది అని దిగాడు. వాడికి సహజంగానే ఉంది ఆ భావం. విసుగు ప్రతి మనిషికీ రావచ్చు. మనం వదలివెళ్ళకూడదు అని పించడమే (మనసు అర్పించినట్లు గుర్తు).

12. అభిసంధాయ తు ఫలం దంభార్థ మపి చైవ యత్।
ఇజ్యతే భరత శ్రేష్ఠ! తం యజ్ఞం విద్ధి రాజసం॥

తా: భరతవంశ శ్రేష్ఠుడా! అర్జునా! ఫలాన్ని ఉద్దేశించో, డంబం కోసమో చేయబడే యజ్ఞం రజోగుణ సంబంధిగా తెలుసుకో!

13. విధిహీన మసృష్టాన్నం మన్త్రహీన మదక్షిణం।
శ్రద్ధావిరహితం యజ్ఞం తామసం పరిచక్షతే॥

తా: శాస్త్ర విధితో చేయబడనిది, అన్నదానం లేనిది, మంత్రం, దక్షిణ ఇలాంటివి లేనిది శ్రద్ధతో చేయబడనిది ఐన యజ్ఞం తామసికమనబడుతుంది.

వ్యా: శాస్త్రవిధి శాస్త్రవిధి అని పదే పదే కృష్ణపరమాత్మ చెప్పుతున్నారు. ఎందుకంటే శాస్త్ర విధులంటే తానే అని 'వేదానాం సామవేదోస్మి' 'బృహత్సామత థాసామ్నాం గాయత్రీ ఛందసామహం' యజ్ఞానాంజపయజ్ఞోస్మి అని ఇటువంటి వాక్యాలతో పరమాత్మయే ఇదివరలో చెప్పి ఉన్నారు. శాస్త్రమూ పరమాత్మయే. కాని శాస్త్రం వేఱు పరమాత్మ వేఱుగా నిరూపించి, భగవంతుడిని వెనక్కు నెట్టి శాస్త్రాన్ని ముందుకు లాగుతున్నారు. ఛాందసులు. అమ్మ సాక్షాత్తూ జ్ఞానస్వరూపిణిగా అభయ హస్తం ఇచ్చి మనకు ప్రత్యక్షంగానే ఉంది. మన నమ్మకం మీదనే అంతా ఆధారపడి ఉంది.

"శాస్త్రాన్ని నమ్మినట్లు నన్నూ నమ్ముతున్నారు. ఆ శాస్త్రము మాదిరి కాకుండా ఏదన్నా దొరికితే తీసుకుందురుగాని' అన్నది. అమ్మ.

ఇంతవఱకు పరమాత్మ సాత్విక రూపంగా ఉంటే యజ్ఞాలూ, రాజసరూపంగా ఉండే యజ్ఞాలు, తామసికరూపంగా ఉండే యజ్ఞాలూ వీటిని గూర్చి ఉపన్యసించారు. ఇక వచ్చే శ్లోకాలలో మూడు రకాలైన తపస్సులను గూర్చి చెపుతున్నారు.

14. దేవ ద్విజ గురు ప్రాజ్ఞ పూజనం శౌచ మార్జవం।
బ్రహ్మాచర్య మహింసా చ శారీరం తప ఉచ్యతే॥

తా: దేవతలను, బ్రాహ్మణులను, గురువులను పండితులను పూజించడం, అంతర్బ హిశ్శౌచం కలిగి ఉండడం, ఋజువర్తనం, త్రికరణశుద్ధిగా బ్రహ్మచర్యాన్ని కలిగి ఉండడం, అహింస, ఈ గుణాలు శారీరకమైన తపస్సు అని చెప్పబడుతుంది.

వ్యా: తపస్సు అంటే ముక్కు మూసుకుని కూర్చోడం అని సాధారంగా అని పిస్తుంది మనకు. తపస్సు మనస్సును శుద్ధిచేస్తే శరీరాన్ని శుద్ధిచేసే మనస్సంబంధు లయిన క్రియలు పైనచెప్పబడ్డాయి. బ్రహ్మచర్యం, ఋజువర్తనం శౌచం శరీరానికే కాక మనస్సుకు కూడా పారిశుద్ధ్యాన్ని కల్పిస్తాయి.

15. అనుద్వేగకరం వాక్యం సత్యం ప్రియ హితం చ యత్।
స్వాధ్యాయా భ్యసనం చైవ వాఙ్మయం తప ఉచ్చతే॥

ఉద్రేకం, ఉద్వేగంతో ఇతరుల మనస్సు నొప్పించకుండా ఉండేదీ, ప్రసన్నతను ప్రియమును కలిగించేది, మేలునుగూర్చేది, సత్యమైనది, అయిన సంభాషణమూ, వేదపఠనమూ వాక్స్వరూపమైన తపస్సని చెప్పబడుతున్నది.

16. మనః ప్రసాద స్సౌమ్యత్వం మౌనమాత్మ వినిగ్రహః
భావ సంశుద్ధి రిత్యేత త్తపో మానస ముచ్యతే॥

తా: మనస్సులోని నిర్మలత్వం, ముఖంలో ప్రసన్నత, నోరు అదుపులో ఉంచుకోవడం, మనస్సును కట్టిపెట్టుకోవడం, కపటం లేకుండా వ్యవహరించడం, ఇవి మనస్సుకు సంబంధించిన తపస్సని చెప్పబడుతున్నది.

17. శ్రద్ధయా పరయా తప్తం తపస్తత్ త్రివిధం నరైః।
అఫలా కాంక్షి భి ర్యుక్తై స్సాత్త్వికం పరిచక్షతే॥

తా: శ్రద్ధాపరితప్తులై పైనచెప్పిన మూడు విధాలైన తపస్సులను చేసేవాళ్ళూ, తాము చేసిన పనుల ఫలాన్ని ఆకాంక్షించని వాళ్ళూ, జ్ఞానులూ అయినవారి తపస్సు సాత్వికమని చెప్పబడుతుంది.

వ్యా: యుక్తైః = సమాహితులు (శం)

వ్యా: అమ్మ ధ్యేయమూ, అమ్మతపస్సూ తాపత్రయం అన్నీ పిల్లలను గుఱించే ఈ తపస్సులో పైన శ్లోకాల్లో మనోవాక్కాయ రూపములైన అన్ని లక్షణాలు మూర్తీభవించి ఉన్నాయి. అమ్మమౌనంతోని మాధుర్య స్వనం అమ్మ వాత్సల్యంలోని ఆవేదన, అమ్మ ఒంటరితనంలోని ప్రజాబాహుళ్యం అన్నీ అక్షరాలలోగాని ఛందస్సులోగాని ఇముడ్చడానికి సాధ్యం కానివి. అమ్మ కరుణ అనుభవైక వేద్యంగాని ప్రదర్శన సులభం కాదు. సాత్వికమైన తపస్సుకు సారం ఇది.

అమ్మ: ఈ చేసేదంతా నీవు కీర్తిప్రతిష్ఠలకోసం కాదా అని ఎవరో అడిగిన ప్రశ్నకు అమ్మ ఇచ్చిన జవాబు. ఇది 'నాన్నా నీవట్లా అనుకుంటానంటే నేను కాదనేది ఏమీ లేదు. కాని నేను ఇదంతా నా కీర్తికోసం పాటుబడుతున్నాననుకోవడంలేదు. ఇది నా అవసరానికి చేస్తున్నాను. కాని అదంతా కీర్తి క్రింద మారుతున్నదేమో. ఇక్కడకు వచ్చిన వారికి పట్టెడన్నం పెట్టడం, ఆదరించి పంపడం, తల్లిగా నాకున్న ధర్మం ఆ విధంగా నేను నలుగురికీ అన్నం పెట్టి పంపితే కీర్తిగా మారుతున్నదేమో'

18. సత్కార మాన పూజార్థం తపో దంభేన చైవ యత్।
క్రియతే తదిహ ప్రోక్తం రాజసం చలమధ్రువం॥

తా: తనను ఇతరులు పెద్దచేసి గౌరవించాలనే ఆశతో చేసే భేషజ రూపమైన తపస్సు ఏదైతే ఉందో అది అస్థిరముగా చంచలమూ అయిన ఫలాన్ని ఇస్తూ ఈ లోకంలో అది రాజసమైన తపస్సని చెప్పబడుతుంది.

వ్యా: ఇందుకే మనస్సు ప్రధానమంటుంది అమ్మ. కరిగేది మనస్సుకాని దేహం కాదు. ఇతరులు తనను మెచ్చుకోవాలని చేసే తపస్సు ఎవర్ని ఉద్ధరించడానికి? చిత్తం శివుడి మీదా బుద్ధి చెప్పుల మీదా అన్నట్లు తపస్సుకు ధ్యేయం ఇతరుల వలన పొగడ్తయే అయితే అసలు ముటికికి ఇంకోకొంచెం ముటికి కలవడమే అవుతుంది. కాని తఱగడం కాదు. అలాంటి వాళ్ళు కూడా తరుణం ఆసన్నం కాగానే ఇతరుల పొగడ్తకు మారుగా ఇతరులలో ఉన్న దైవస్వరూపాన్ని చూసిదాన్ని గూర్చి తపస్సు చేయడమారంభిస్తారు.

19. మూఢగ్రాహేణాత్మనో య త్పీడయా క్రియతే తపః।
పరస్యోత్సాదనార్థం వా తత్తామస ముదాహృతం॥

మూర్ఖపు పట్టుదలతోను ఆత్మహింసతోను కూడుకుని తన్ను తాను బాధించు కొనుటచే గాని ఇతరులను నాశనం చేయడానికిగాని ఉద్దేశించిన ఏ తపస్సు చేయ బడుతున్నదో అది తామసికమని చెప్పబడుతున్నది.

ఏవిధంగా ఉపయోగిస్తే ఆవిధంగా పనిచేసే శక్తి మనస్సుకున్నది. హఠయోగ రాజయోగాభ్యాసాలు చేసి సిద్ధులు పొందిన వారు అభూత క్రియలను చేస్తూ ఉంటారు. నాగలి రైతు చేతుల్లో ధాన్యాన్ని పండించి అన్నాన్ని మానవలోకానికి పశువు లకూ సమకూర్చే ఆయుధం కాగా బలరాముడి చేతుల్లో అది ఆయుధమై రాక్షసులను దుష్టులను చంపింది. అలాగే తపస్సు కూడా దక్షిణమార్గంలో చేసిన హనుమదాదు లకు సీతామాత పరాశక్తి రూపంలో సాక్షాత్కరిస్తే వామాచార పద్ధతిలో తపస్సు చేసిన రావణుడికి మహానాశన కారకమైన లయశక్తిగా ప్రత్యక్షమయింది. తుచ్ఛ దేవతలను ఆరాధించి, మనశ్శక్తిని పెంచుకొన్న దుష్టులు, తమకు వచ్చిన మనశ్శక్తిని ఇతరులను చంపడానికి ఉపయోగిస్తారు. మనశ్శక్తితో పదార్థాలను కదిలించడం, వెలిగే దీపాన్ని ఆర్పేయడం ఇలాంటి క్రియలను భారతదేశంలోని యోగులు చేస్తున్న అద్భుతాలే. పైవిధంగా ఆత్మ పీడాపరాయణులైనా తీవ్రములు ఉగ్రములైన పూజలను చేసి, ఏవో శక్తులను సంపాదించి ఆశక్తులను మారణకాండ కుపయోగించే వారి తపస్సు తామసికమైనదని పరమాత్మ సెలవిచ్చినార.

ఇంతవఱకు పరమాత్మ త్రివిధములైన తపస్సులను గూర్చి చెప్పారు. ఇక త్రివిధములైన దానాలను గూర్చి చెప్పుతున్నారు.

20. దాతవ్యమితి యద్దానం దీయతేఽ నుప కారిణే।
దేశే కాలే చ పాత్రే చ తద్దానం సాత్త్వికం స్మృతం॥

ప్రత్యుపకారవాంఛలేకుండా, దేశకాలపాత్రల భేదాలు లేకుండా (ఈ దానం ఇతనికి ఈయదగినది) ఈయబడేది సాత్వికమైన దానం అని చెప్పబడుతుంది. దేశకాలపాత్రములంటే కురుక్షేత్రం కాశీ గయాది పుణ్యక్షేత్రాలూ సంక్రాంతి మొదలైన పుణ్యకాలాలూ వేదవిదులు పేదలు మొదలైన పురుషులు అని వ్యాఖ్యాతల మతం. అంతేకాకుండా శాస్త్రవిధిననుసరించి కూడా దానాలు ఇవ్వాలని వారు వ్రాస్తారు.

వ్యా: అదీగాక దానం అనే మాట వినబడగానే మన మనస్సులతో కొన్ని అభిప్రాయాలు తలచూపుతాయి. తనకు మాలిన దానం కూడదు. అంటే ఏ దానంచేస్తే తనకు బాగా నష్టం వస్తుందో అది దానం కాదు. Charity begins at home. ఇంట్లో పుష్టి చూచుకుని గాని దానం చెయ్యరాదు. అదీగాక ఇచ్చే చోటు కూడా అనుకూలంగా ఉండాలి. పాకీ దొడ్లో దానం చెయ్యకూడదు. చేసేవాడుకూడా శుచిశుభ్రంగా ఉండాలి. వేదాలేకరువు పెడుతూ మకర కుండలాలు ధరించి మడికట్టుకొని, మనను అపరదాన కర్ణుడవని పొగిడే వాడు కావాలి. వాడూ అందంగా ఉండాలి. ఏ రైలుకు పోతున్నప్పుడో, పర్సులో డబ్బులు లేనప్పుడో పట్టుకుని హింసించకూడదు. ఇలాంటివే కావు. ఇంకా అనేక రకాలయిన పరిస్థితులూ, పాత్రార్హతలూ దానమును గురించిన పురుషార్థానికి బాధకాలుగా ఉంటాయి. మిలిటరీలో బిచ్చగాడికి దానం చేయడం నేరం. బిచ్చగాళ్ల వేషాల్లో శత్రువులు వచ్చి మన ఆచూకీని కనుక్కొని పోతారు. సేన అంతటికీ దానివలన ముప్పు వస్తుంది. పాత్ర దానాలు కూడా మిలిటరీలో పనికిరావు. అంబాలాలో ఉంటూ ఉండగా ఒక వింతైన సంఘటన జరిగింది. ఒక రాత్రి ఒక బిచ్చగాడు చాలా మధురంగా పాడుకుంటూ మెయిన్ రోడ్డు మీద పోతున్నాడు. అతనిపాటలోని మాధుర్యం నన్ను నిలువునా ఆపేసింది. ఒక పావలా తీసి అతని వెంట వెళ్ళి అతని వీపు మీద వ్రేలాడుతున్న చెంబులో వేశాను. ఎందుకంటే అతడు ఎవరినీ అడగటమూ లేదు. ఒకరికోసం ఆగడమూ లేదు. పాడడమూ మానలేదు. నడవడమూ మానలేదు. నేను పావలా వాడి చెంబులో వేసి వెనుక్కు తిరిగి పోదామనుకుంటున్నాను. ఆ బిచ్చగాడు పాట ఆపి చెంబులో తడివి పావలా తీసి చేతపట్టుకుని తిరిగి నా దగ్గఱకు వచ్చి నాకు దాన్ని తిరిగి ఇచ్చి వేశాడు. మీరు ఇవ్వదలుచుకుంటే 2-10-0లు ఇవ్వండి. అది రాగానే నేనెవ్వరినీ అడగను. పాట మానేసి ఇంటికిపోతాను. ఏమీ అనుకోకండి.

అంతకు తక్కువయితే బాధపడకండి. నేను మిమ్ములను అడగలేదుగా. నా బలవంతమేమీ లేదు. అని నిర్ఘాంతపోయిన నన్ను ఇంకో ప్రశ్న వేయకుండా తిరిగి పాడుకుంటూ వెళ్ళిపోయాడు. ఆ బిచ్చగాడు తన పాత్రను తనకు తానే నిర్ణయించు

కున్నాడు. 2-10-0 ఒకే మనిషి నుండి అబ్బేదాకా పాడుతూ ఇతరులను హింస పెడుతూనే పోతూ ఉండాలి అనుకున్నాడు అతడు. దొరికిన తరువాత ఆ రోజుకు అతని శ్రమాలేదు లోకానికి హింసా లేదు.

అమ్మ విషయంలో దానం సహజంగా ఏర్పడిపోయిన స్వభావం. ఒంటిమీద నగలన్నీ, ఒంటిమీది గుడ్డలతోసహా ఒలిచి ఇచ్చిన తెగువకు చివరిమాట. ఎంతో మంది ఈ పనులన్నీ కీర్తి కాంక్షతో చేస్తున్నారా అమ్మా అని అడిగారు. కీర్తియే తానైన అమ్మకు కీర్తి కాంక్ష ఎందుకు? కీర్తి అంటే బురద అని కూడా అర్థం ఉంటే చాలాసార్లు బురద పూసుకుని వచ్చిన బిడ్డను గూర్చి చెపుతూ ఉంటుంది అమ్మ. కీర్తి అంటే బిడ్డ పూసుకున్న బురద – తప్పని బురద – అలాంటిదేదైనా ఉంటే దానిమీద కాంక్ష ఉండ వచ్చునేమో అమ్మకు. మనం అనుకునే కీర్తి కాంక్ష కాదు.

శాస్త్రాలు దేశ కాల పాత్రములు ప్రతిదానికి తప్పనిసరిగా నియమాలు విధించి నాయి. కాని అన్న దానానికి మాత్రం అవి ఈ షరతులను నియమించలే. అందుకనే కాబోలు అమ్మ విరాళంగా అందటిల్లు నడిపించి దానానికి ఉండే సహజత్వాన్ని నిరూపిస్తున్నది. ఇక వద్దనిపించేది ఒక్క అన్నదానమే.

21. యత్తు ప్రత్యుపకారార్థం ఫల ముద్దిశ్య వా పునః।
దీయతే చ పరిక్లిష్టం త ద్రాజస ముదాహృతం॥

తా: ప్రత్యుపకారాన్ని మనసులో ఉంచుకుని కాని లేక ఏదో ఫలాన్ని తిరిగి వాంఛించి గాని ఏ దానం ఇయ్యబడుతున్నదో దాన్ని రాజసదానం అంటారు.

22. అదేశకాలే యద్దాన మపాత్రేభ్య శ్చ దీయతే।
అసత్కృత మవజ్ఞాతం తత్తామస ముదాహృతం॥

వ్యా: ఆ దేశంలో, ఆ కాలంలో, అపాత్రంగా అపత్కృతంగా, అవజ్ఞాతంగా ఏ దానం ఇయ్యబడుతుందో అది తామసిక దానం అని నిర్వచించబడుతుంది. దానం చేసిన దేశంలో మ్లేచ్ఛులు అశుచులు నిండి ఉంటారు. పర్వకాలాలు కాకపోయినా ఈ దానాలు జరుగుతాయి.. మూర్ఖవిట తస్కరాదులకు ఈ దానాలు ఇవ్వబడతాయి. ఇచ్చేటప్పుడు కాళ్ళు కడిగి ఐనా ఇంత ఆచారాన్ని పాటించరు. దానం పుచ్చుకొనే వాడిని నానా మాటలు అని పరాభవించి మఱీ ఆ నాలుగు డబ్బులూ వాడి చేతులో పడేస్తారు. ఇలాంటి దానం తామసిక మంటారు.

వీటికే ఇంకా ఇంకా పేర్లు లంచాలు, బల్లకింది చేతులు– చేతి తడులు – ఆమ్యా మ్యాలు. మీ ఋణం ఉంచుకోము – పారితోషికాలు – బహుమానాలు – ఇప్పుడు

న్నవే అవి. ఈ నీళ్ళు పోస్తేకాని చెట్టు పూయదు. ఫలించదు. ఇదే పాలు పితుక్కోబోయే టప్పుడు గేదె ముందు చిట్టూ తవుడూ. 'తన మూలం ఇదం జగత్తులోని' ధనమూలం. ఇటువంటి దానాలవల్ల పరమార్థం లేదని పరమాత్మ ఆనతిచ్చారు.

పై శ్లోకాలలో పరమాత్మ దానప్రకరణాన్ని గూర్చి అనేక విధాలుగా వర్ణించారు. అన్నదానం, వస్త్రదానం, భూదానం, గోదానం, విద్యాదానం, శ్రమదానం, ధనదానం, ఈవిధంగా ఎన్నో దానములున్నవి. ప్రకృతివంటి మహాదాని ఇంకెవ్వరూ లేరు. ప్రకృతికి ఇవ్వడమే తెలుసును- మళ్ళీ తీసుకోవడం తెలీదు. పంచ భూతాలనూ ప్రకృతియే ఇచ్చింది. సూర్యుడు అనుక్షణమూ టన్నులకొద్దీ తేజః పదార్థాన్ని తననుండి దానం చేస్తున్నాడు. సముద్రుడు టన్నుల కొద్దీ ఆవిరి రూపంగా నీటిని మేఘాలకు దానం చేస్తున్నాడు. దానం చేస్తున్నాడు కనుకనే నదీజలాల రూపంలో తిరిగి ఇనిమిక్కిలిగా జలాన్ని పొందుతున్నాడు. ప్రకృతి అంతటిలో ఒక చేత్తో ఇవ్వడం, ఇంకో చేత్తో పొందడం కనిపిస్తుంది. 'ఈ' లేక 'రా'లేదు. ధనానికి ధర్మము రాజు, అగ్ని, దొంగలు అనే నలుగురు హక్కుదారులున్నారు. ధర్మము అనే మొదటి హక్కును మనం కాదంటే మిగతా ముగ్గురు దాన్ని మ్రింగేస్తారు. దానం చేసుకున్న డబ్బు దాచిపెట్టుకున్న బ్యాంకు బ్యాలెన్స్ లాంటిది. అమ్మ వాడి అన్నం ఇక్కడ ఉన్నది. వాడు తిని పోతున్నాడు అని అంటుంది కదా. ఎవరికి ఉండే రాత వాడికి ఉంటుంది. దానికోసం ప్రత్యేకంగా ఎవరు ప్రయత్నం చేసుకోవడం ఎందుకు అనుకుంటారేమో ఎవరైనా. అడక్కుండానే ఆకలి కనుక్కొని పెట్టేది అమ్మ కనుక మన ప్రయత్నం దేనికి అనుకుంటారేమో.

దానం చెయ్యటం, అమ్మ అనుగ్రహం పొందటం ఈ రెండూ అమ్మ శాసనం లోనివే. సమస్త ప్రేరణలకూ సమస్త క్రియలకూ ఆధార భూతుడయిన దైవం ఒక కోరిక తీర్చేముందు ఆ కోరిక తీరడానికి కార్యకారణ సంబంధంగా కనిపించగల మరోపనిని ఆ వ్యక్తిచేత చేయిస్తాడు. అ వ్యక్తిచేత డబ్బు సంపాదింపచేస్తాడు. బీద వాళ్ళంటే దయ అతని మనస్సులో రగిలిస్తాడు. అతనిచేత దానం చేయిస్తాడు. తుదకు ఫలితం ప్రసాదిస్తాడు. ఇదే మనం చేసుకుంటున్నాం అనుకుంటే దానం ధర్మం చేస్తున్నాం అనుకుంటాం. అమ్మ చేయిస్తున్నదీ అనుకుంటే అమ్మ అనుగ్రహం ఆవిధంగా బహిర్గతమైంది అనుకుంటాం. పరమాత్మ వ్యక్తిపరంగా విధుల్లాగా చెప్పే నియమాలూ, నిష్ఠలూ ఇవన్నీ ఇదేవిధంగా అర్థం చేసుకోవాలి. అప్పుడే అమ్మచెప్పిన మాటల్లోని యథార్థ్యం మనకు బోధపడుతుంది.

"కొండకు వెళ్ళడం, మ్రొక్కుకోవడం కూడా

ఆ శాసనంలోవే. నమస్కారమో, ప్రార్థనో

చేయించుకోవాల్సిందీ తానే" అన్నది అమ్మ.

'నిర్ణయానికి నిర్ణయించిన వాడు కూడా బద్ధుడే' అన్నది అమ్మ.

నిర్ణయం ఏమీటీ అంటే–

'నాటక రచయితకు నాయకుని పాత్రపై అభిమానం సమానమే కావచ్చును. కానీ పాత్రధారి నాయకుని పాత్రనే కోరుకుంటాడు. సహజంగా ప్రతి పాత్రధారీ ప్రేక్షకుల ప్రేమనూ, సానుభూతినీ సంపాదించగల పాత్రనే కాంక్షిస్తాడు.

అంటే–ప్రతివాడూ జీవితంలో సుఖశాంతులనూ, కార్య రంగంలో విజయాన్నీ, లోకంలో గౌరవాన్నీ మాత్రమే పొందాలని అభిలషిస్తాడు. వాటిని ఇవ్వదలుచుకున్న వారిచేత దైవం ముందు సత్కార్యాలు చేయించి తరువాత సత్ఫలితాలను ప్రసాదిస్తాడు.

కనుక ఎవరైనా సత్కార్యాలు, దానాలు అనబడేవి చేస్తున్నారంటే దైవానుగ్రహం వారిమీద ప్రసారితం అయిందన్న మాట.

23. ఓమ్ తత్ స ది తి నిర్దేశో బ్రహ్మణ స్త్రివిధ స్మృతః।
బ్రాహ్మణా స్తేన వేదాశ్చ యజ్ఞాశ్చ విహితాః పురా॥

తా: బ్రహ్మయొక్క నామం పూర్వం 'ఓమ్' అని 'తత్' అనీ 'సత్' అనీ మూడు విధాలుగా నిర్దేశించబడి, దానినుండి బ్రాహ్మణులు వేదాలూ యజ్ఞాలూ ప్రవర్తింపబడ్డాయి.

వ్యా: 'ఓమ్' అనే అక్షరం బ్రహ్మ అనడానికి 'ఓమ్ ఇతి బ్రహ్మ' అనే శ్రుతి ఆధారం.

'తత్' అనే అక్షరం బ్రహ్మ అనడానికి 'తత్త్వమసి' అనే శ్రుతి ఆధారం.

'సత్' అనే అక్షరం బ్రహ్మ అనడానికి 'సదేవ సోమ్యేదమగ్ర ఆసీత్' అనే శ్రుతి ఆధారం.

24. తస్మా దో మిత్యుదాహృత్య యజ్ఞదాన తపః క్రియాః।
ప్రవర్తన్తే విధానోక్తా స్సతతం బ్రహ్మావాదినామ్॥

తా: కాబట్టే బ్రహ్మావాదులైనవారు ఎల్లప్పుడూ శాస్త్రోక్తములైన యజ్ఞాలూ, దానాలూ, తపస్సూ తాము చేసేటప్పుడు ఓం తత్సత్ అని బ్రహ్మానామాన్ని ఉచ్చరించి చేస్తుంటారు.

వ్యా: తపస్సుచేసినా అది బ్రహ్మరూపమే. యజ్ఞం చేసినా అది బ్రహ్మ రూపమే. దానం చేసినా అది బ్రహ్మరూపమే, అధ్యయనం చేసినా అది బ్రహ్మరూపమే అది

కానిది ఇది ఏమీ లేదు అనేభావం బాగా పాతుకుపోయిన మనస్సులో అందులో లీనమైపోవడానికే అలా చేస్తుంటారని తాత్పర్యం.

25. తదిత్యనభిసంధాయ ఫలం యజ్ఞ తపః క్రియాః।
దానక్రియాశ్చ వివిధాః క్రియన్తే మోక్ష కాంక్షిభిః॥

తా: ఆవిధంగానే తాముచేసే యజ్ఞాన్ని గాని, తపస్సునుగాని, దానాన్నికాని, ఇంకా ఇతరమైన వివిధ శాస్త్రోక్త కర్మలనుగాని, మోక్ష కాములైనవారు 'తత్' అనే బ్రహ్మనామాన్ని ఉచ్చరించి ఫలాన్ని మనస్సులో తలచుకోకుండా చేస్తూంటారు.

వ్యా: వారు చేసే కర్మల యొక్కఫలం కేవలం 'తత్' అంటే ఆ పరమాత్మయే అయి ఉండాలికాని, ఇంకేవిధమైన ఫలితాలు మనస్సులోకి రాగూడదనే దృఢ నిశ్చయంతో ఆయా కర్మలను వారు చేస్తూ ఉంటారని భావము.

26. సద్భావే సాధు భావేచ సదిత్యే తత్ప్రయుజ్యతే।
ప్రశస్తే కర్మణి తథా సచ్ఛబ్దః పార్థ! యుజ్యతే॥

తా: పార్థా! 'సత్' అనే శబ్దం మంచిది అనే భావం బోధించడానికి, బ్రహ్మ వాచకం గానూ రెండు విధాలుగానూ ఉపయోగింపబడుతున్నది. అట్లే శ్రేష్ఠములైన కర్మల విషయంలో కూడా ఈ సచ్ఛబ్దం ఉపయోగింపబడుతున్నది.

వ్యా: 'సత్' అంటే సత్యమైనది అనే అర్థాన్ని బోధించేటప్పుడు ఆ మాట బ్రహ్మ వాచకమౌతున్నది. అదే మంచి కర్మలను గూర్చి ప్రయుక్తమైనప్పుడు - శ్రేష్ఠమైన ఉత్తమమైన అనే అర్థంలో వాడబడుతున్నది.

ప్రశస్తే కర్మణి = అంటే కళ్యాణమైన కర్మము నందు అని రామానుజులూ, వివాహాది కర్మములందు అని శంకరులూ అర్థం చెప్పారు.

సద్భావమంటే సృష్టి అని మధ్వాచార్యులు, సాధుభావము లేక కళ్యాణత్వము అని రామానుజులూ నిర్వచించారు.

27. యజ్ఞే తపసి దానే చ స్థితిస్స దితి చోచ్యతే।
కర్మచైవ తదర్థీయం సదిత్యే వాభిధీయతే॥

తా:యజ్ఞము, తపస్సు, దానములకు సంబంధించిన కర్మలందుండే నిష్ఠ కూడా సత్తే అనబడుతున్నది. తదర్థములైన కర్మలు కూడా సత్తే అనబడుతున్నవి.

వ్యా: భగవత్సంబంధి అయిన కర్మకు నిష్ఠ జీవగఱ్ఱ. ఆ నిష్ఠకు మనస్సే ఊట బావి. ఆ ఊటబావి నుంచి తోడిపోసిన నీళ్ళు అన్నింటితో కలిసి చెట్లూ చేమలై అన్నీ

కలిసి బ్రహ్మగా భాసిస్తున్నాయి. బ్రహ్మయే సృష్టిగా మనస్సుగా భాసిస్తున్నాడు. 'అదే ఉప్పు' అయింది. అదే తీపి అయింది. అన్నీ తనే అయినాడు. అన్నీ తనే చేశాడన టంలా. నాటకం వ్రాయడమనేది లేదు. స్వభావం. ఉన్నది బ్రహ్మే. సృష్టి ఒకప్పుడు ఉంది. ఒకప్పుడు పోతుందని కాదు. అంతా వాడి రూపమే. చేశాడు అన్నప్పుడు దైవం ఎక్కడా దూరంగా ఉండి చేశాడు అన్న భావం వస్తుంది. చీమగా, దోమగా అయినాడన్నప్పుడు సంపూర్ణత్వం. అన్నీ వాడే అయి అన్నీ వాడే చేస్తున్నాడు. సహస్ర శీర్షాపురుషః అంటే అదే. చేశాడు అన్నప్పుడు ద్వంద్వమున్నది. అయినాడు అన్న ప్పుడు ఒకటే ఉన్నది. - అమ్మ.

28. అశ్రద్ధ యా హుతం దత్తం తప స్తప్తం కృతంచ యత్।
అసది త్యుచ్యతే పార్థ! న చ తత్ప్రేత్యనో ఇహ॥

పార్థా! అశ్రద్ధతో ఆచరింపబడ్డ హోమంగాని, ఇవ్వబడిన దానం గాని, చేయ బడ్డ తపస్సుగాని, అసత్తనబడుతుంది. అట్టివాని వల్ల ఇహలోకంలోనూ పరలోకం లోనూ ఫలం కలగదు.

సంస్కారమే పరమాత్మ. సంస్కారంవల్లనే శ్రద్ధాభావం కలుగుతుంది. అశ్రద్ధ కూడా దాని ప్రసాదమే. తరుణం వచ్చేదాకా చేసే తపస్సుమీదా, దానాలమీదా, యజ్ఞాలమీదా శ్రద్ధ కలగదు. ఫలప్రాప్తికి, బంధ మోక్షానికి తరుణం ఆసన్నం కావడం, శ్రద్ధ కలగడం, అమ్మ కటాక్షం మన మీద ప్రసరిస్తున్నట్లుగా మన కళ్ళలో కనిపించడం ఇవన్నీ ఒకే ముహూర్తంలో జరుగుతాయి. ఆ ముహూర్తాన్ని ప్రసవించే మహామాయ, ఆదిశక్తి, పరాప్రకృతి అదే అదే అమ్మ.

ఇతి శ్రీ మన్మాతృగీతలోని
శ్రద్ధాత్రయ విభాగయోగమను

సప్తదశోధ్యాయము.

మాతృగీత

మోక్షసన్యాస యోగము

పదునెనిమిదవ అధ్యాయము

జయహోమాతా శ్రీ అనసూయా

రాజరాజేశ్వరి – శ్రీ పరాత్పరి

అర్జున ఉవాచ:

1. సన్న్యాసస్య మహాబాహో తత్త్వమిచ్ఛామి వేదితుమ్।
త్యాగస్య చ హృషీకేశ! పృథక్కేశి నిషూదన!॥

తా: మహాబాహూ! హృషీకేశా! కేశినిషూదనా! కృష్ణా! సన్న్యాసమంటే ఏమిటో, త్యాగమంటే ఏమిటో, ఈ రెండింటి అసలు తత్వాన్నీ వేఱు వేఱుగా విడదీసి నాకు చెప్పగోరుతున్నాను.

వ్యా: ఇది యోగశాస్త్రం. యోగం అంటే వ్యష్టి మనుష్యులకుండే సంబంధం. ఆ సంబంధాన్ని తెలుసుకునే ఉపాయాన్ని చెప్పేదే యోగశాస్త్రం, వ్యష్టి మాత్ర తన పరిధులను పెంచుకుని సమష్టితో సాయుజ్యం చెంది అందులో లయమయ్యే విద్యను చెప్పేది బ్రహ్మ విద్య. గత 17 అధ్యాయాలకు సమన్వయం గూర్చేది ఈ ఆఖరు అధ్యాయం.

ఈ అధ్యాయానికి మోక్ష సన్న్యాస యోగం అని పేరు. కర్మని వ్యక్తి వదలడం కాకుండా కర్మలు వ్యక్తిని వదలడం సన్యాసం. గత పదిహేడు అధ్యాయాలలో సన్యాస త్యాగ శబ్దాలు శ్రీ కృష్ణార్జున సంవాదంలో పెక్కుచోట్ల అర్థ వివరణం లేకుండా వాడ బడ్డాయి.

'మయి సర్వాణి కర్మాణి సన్న్యస్యాధ్యాత్మ చేతసా'	3-30
'యేతుసర్వాణి కర్మాణిమయ సన్న్యస్యమత్పరా	12-6
'సన్యాసయోగ యుక్తాత్మావిముక్తోమాముపైష్యసి	4-28
'యోగ సన్న్యస్త కర్మాణం జ్ఞాన సంఛిన్న సంశయః	4-41
'త్యక్త్వా కర్మ ఫలాసంగం నిత్యతృప్తో నిరాశ్రయః'	
'సర్వ కర్మ ఫలత్యాగం తతః కురుయతాత్మవాన్	12-11
'ధ్యానాత్కర్మ ఫల త్యాగస్త్యాగా చ్ఛాన్తిరనంతరం'	12-12

'సర్వారంభ పరిత్యాగీయో మద్భక్తస్సమే ప్రియః' 12-16

'సర్వారంభ పరిత్యాగీ గుణాతీత స్స ఉచ్యతే' 14-25

ఈవిధంగా సన్యాస త్యాగ శబ్దాలు సరియైన అర్థ వివరణం లేకుండా వాడ బడ్డాయి కనుక ఒకటిగానే కన్పించే ఈ రెండు మాటల్లోని అర్థ వైశిష్ట్యం ఏమిటి అని అర్జునునికి సందేహం వచ్చింది. త్యాగానికి సన్యాసానికి భేదం ఉన్నదా. సమిష్టి జ్ఞానం కలిగిన వానికి జగత్తు సత్యం. ఆ జ్ఞానం కలిగే దాకా జగత్తుమాయే. ముక్తావస్థలో తానే పరిపూర్ణుడననే జ్ఞానం పొందిన వానిని కర్మలు విడిచిపెడతాయి. కర్మలు చేస్తున్నా అతనికి కర్మ సంగం ఉండదు. కర్మను గూర్చిన జ్ఞానం ఈ అధ్యాయం మొదటి శ్లోకంలో లెస్సగా విచారించబడుతుంది.

మొట్టమొదటి శ్లోకంతోనే అర్జునుడు పరమాత్మకు మూడు సంబోధనలు చేశాడు. మహాబాహో, హృషీకేశ, కేశినిషూదన అని. కేశినిషూదన అంటే కేశి అనే రాక్షసుణ్ణి సంహరించినవాడా అని అర్థం. అంటే ప్రకృతిలోని అసుర శక్తులను నిర్జించిన వాడా అని అర్థం. హృషీకేశ అంటే ఇంద్రియాలను జయించినవాడా అని అర్థం. మహాబాహో అంటే జ్ఞాన పూర్వకమయి కర్మ సంగాన్ని విడిచిపెట్టిన దైవస్థితి. అంటే ప్రకృతిని ప్రకృతిచేతనే జయించాలి. కాయాన్ని కాయం చేతనే జయించాలి. హృషీకేశ శబ్దం అంతర్విజయాన్ని సూచిస్తుంది. చివరకు అన్ని ఆసురీ శక్తులను లోబఱచుకొనడం కేశినిషూదన శబ్దం సూచిస్తుంది. పరమాత్మ చెప్పిన సాధనలు చేస్తూ రాగా మోక్షం దానంతటదే లభిస్తుంది. కాబట్టి మోక్ష సంకల్ప త్యాగం చేయ వలెననడం మోక్ష సన్యాస పదానికి ఒక అర్థం. రెండో అర్థం సన్యాసం అవలం బించడంవల్ల మోక్షాన్ని పొందవలసిందని. రెంటిలో దేనికైనా త్యాగం తప్పదు.

శ్రీ భగవానువాచ

2. కామ్యానాం కర్మణాం న్యాసం సన్యాసం కవయో విదుః।
సర్వకర్మ ఫలత్యాగం ప్రాహుస్త్యాగం విచక్షణాః॥

తా: కామ్యకర్మలను విడిచి పెట్టడం సన్యాసమనీ, సర్వకర్మ ఫలత్యాగమును త్యాగమనీ అంటారని పరమాత్మ చెప్పెను.

వ్యా: సన్యాసమంటే కామ్యకర్మలను విడిచిపెట్టడం అని పండితులు తెలుసు కున్నారని పరమాత్మ చెప్పారు. కామ్యకర్మలంటే - అశ్వమేధాది యజ్ఞకర్మలని శంకరులు, కామ్యకర్మల స్వరూపమని రామానుజులు,

కోరికతో చేసే సమస్త ప్రాపంచిక కర్మలని తిలక్ నిర్వచించారు. శిక్షాశీలమైనది జీవితం. దేహాన్ని క్రమంగా శిక్షాలయంగానే ఉపయోగించాలి. దానికి కర్మలను అదుపులో పెట్టుకోవడంలోనే ఉంది శిక్షామార్గం అంటారు పూర్వాచార్యులందఱూ.

కర్మలు నిత్యకర్మలూ నైమిత్తశ కర్మలూ, కామ్యకర్మలూ, నిషిద్ధ కర్మలు అని నాలుగు విధాలు. వీటివల్లనే ప్రవృత్తిమార్గం, నివృత్తిమార్గం దేహధారణకు జీవిత ప్రయాణానికి ఏర్పడుతాయి.

నిత్యకర్మలంటే – ఊపిరి తీయడం లాంటి సహజ కర్మలు.

(1) ఆ గతః ప్రాప్తాలైన కర్మలు (2) శాస్త్రోక్తాలైన సంధ్యావందనాది కర్మలు. నిత్యకర్మలు చేసినందువల్ల ఫలమేమీ ఉండదు కానీ చెయ్యకపోతే నష్టం ఉంటుంది – ప్రత్యవాయం ఉంటుంది.

నైమిత్తిక కర్మలు. సూర్యగ్రహణాది సమయాదులలో గ్రహణ స్నానాలూ, జాతకర్మ నామకర్మలు, వ్యాధులువస్తే ఔషధ సేవ ఇలాంటివి నైమిత్తికాలు. ఒక అవసరం నిమిత్తం చేయబడేవి.

కామ్యకర్మలు. ఫలాభి సంధిగల కర్మలు ఏదో ప్రయోజనాన్ని మనస్సులో పెట్టుకుని చేసే కర్మలు కామ్యకర్మలు. ఇవే నిత్య జీవితం నిండా ఉండే కర్మలు, నిత్యనైమిత్తికాలకు ఫలం లేదనే చెప్పాం. వాటిని విడవడంవల్ల ఫల సంగం పోయే ప్రసక్తేలేదు. అందువల్ల సన్యాసమంటే నిత్య నైమిత్తికాలను విడవడం కాదు. కామ్య కర్మలను విడిచిపెట్టడం తమామూ అట్టి కర్మలను చేయకుండా విడిచిపెట్టడం సన్యాసం.

కామ్యకర్మ ఫలాన్ని మాత్రం త్యజించడం త్యాగం. బ్రదికి ఉండాలంటే కర్మలు చేయకుండా ఉండనే లేదు ఎవడూ. 'నహి కశ్చి క్షణ మపి జాతు తిష్టత్య కర్మకృత్' అని గీత చెప్పింది. 'ధ్యాసకూడా కర్మమే' అని అమ్మ చెప్పింది. ఫలకాంక్ష లేకపోతే అసలు కర్మలు చేయడంచేసే ప్రవృత్తి కూడా ఉండదు కదా. అందువలన ఫలత్యాగం ఎలా చేయగలడు. విత్తనం వేశాడు. చెట్టు మొలిచింది. కర్మ ఫలితంగా మొలిచిన చెట్టును త్యాగం చెయ్యడమంటే ఆ చెట్టును లోకానికి విడిచిపెట్టెయ్యమనా అర్థం. లేదు. మొదటికి కొట్టెయ్యమనా? రెండూ కాదు. కాయలు కాస్తే అందఱికీ పంచి పెట్ట మనా? అదీకాదు. ఈ విత్తనం వేసింది కాని మొక్క మొలవడంకాని, అది కాయలు కాయడంగాని నా ప్రయోజకత్వంవల్ల జరగలేదు. ఏదో ఒక శక్తి నన్ను ప్రేరణచేసి నడిపిస్తున్నది. ఆ శక్తి ఒక లేక పరమాత్మ ప్రేరణ వల్లనే. ఫలితం లభ్యం అయింది. విత్తనం, చెట్టూ, దాని ఫలం, నాచేసిన పనీ అంతా పరమాత్మయే అని విశ్వసించడం.

తనమీద ప్రాజాపత్యం పెట్టుకోకుండా పనులను చేయడమే కర్మఫలత్యాగం. అంటే స్వార్థ భావన లేకుండా కర్మలు చేయడం.

అమ్మ: స్వార్థమనే పదానికి మనం చెప్పుకున్న నిర్వచనం. 'మన' ఆనందం కోసం చేసే ప్రతి పనిస్వార్థమే అని కదా. నా విషయంలో స్వార్థం ఏమిటీ అంటే – నేను మీకోసం చేసే ప్రతి పని నాకు ఆనందమే. మీరు హాయిగా కూర్చుని కబుర్లు చెప్పడం, మీరు వేసే ప్రశ్నలకు జవాబులివ్వడం... ఇదంతా నా ఆనందం కోసమే. అందుచేత తమ గురించి నేను చేసే ప్రతి ఆలోచనా స్వార్థం కోసమే. అంటే నా ఆనందం కోసమే. కనుక ఇహ నాలో స్వార్థం లేదు అని ఎలా అనుకోను".

ఇదే నిజమైన స్వార్థమైతే ఇలాంటి స్వార్థంతోనే ప్రతి మనిషీ కర్మలు చేయమని పరమాత్మ పై శ్లోకాల్లో ఆదేశించాడని, ఇలాంటి స్వార్థంతో చేసే కామ్యకర్మలు, నిత్య నైమిత్య కర్మలతోటేకాక సన్యస్త కర్మలతోనూ త్యక్త కర్మలతోను పర్యవసిస్తాయనీ అర్థం చెప్పడానికి ఏవిధంగానూ ఆక్షేపణ ఉండదు. సర్వకర్మఫల త్యాగః – అనే మాటకు నిత్యనైమిత్త కములగు సర్వకర్మల ఫలమును త్యజించడమని శంకరులు, నిత్యనైమిత్తిక కార్యకర్మల యొక్క ఫల పరిత్యాగమని రామానుజులు.

3. త్యాజ్యం దోషవ దిత్యేకే కర్మ ప్రాహు ర్మనీషిణః।
యజ్ఞ దాన తపః కర్మ న త్యాజ్య మితి చాపరే॥

తా: దోషాన్ని ఏవిధంగా విడిచి పెట్టదగిందో ఆవిధంగా కర్మ కూడా విడిచి పెట్టదగిందే అని కొందఱు పండితు (సాంఖ్యు)లు చెపుతారు. ఇతరులు యజ్ఞం, దానం, తపస్సు అనే వాటికి సంబంధించిన కర్మ విడిచి పెట్టదగదని చెపుతారు.

వ్యా: పై రెండు శ్లోకాలలోనూ నాలుగు విధాలైన మతాలను పరమాత్మ చెప్పారు.

1. కర్మలను తమామూసన్యసించమని కొందఱంటారు.
2. కర్మల ఫలాన్ని మాత్రమే త్యజించమని కొందఱంటారు.
3. దోషాన్ని ఏవిధంగా త్యజిస్తామో అలాగే కర్మలను త్యజించమంటారు కొందఱు. అంటే వీరి దృష్టిలో కర్మ అంటేనే పాప స్వరూపం.
4. యజ్ఞదాన తపస్సులనే మూడు కర్మలు విడవదగినవని మఱికొంద ఱంటారు..

ఈ పై నాలుగు మతాలు చెప్పి తన మతాన్ని ఈ దిగువ శ్లోకాలలో చెప్తున్నారు.

4. నిశ్చయం శృణు మే తత్ర త్యాగే భరత సత్తమ!।
త్యాగో హి పురుషవ్యాఘ్ర! త్రివిధ స్సంప్రకీర్తితః॥

తా: ఈ భిన్న మతములను గూర్చి విన్నావు: ఈ విషయంలో నా నిశ్చయ మేమిటో విను. పురుష శ్రేష్ఠా! భరతకుల దీపకా! విను. త్యాగం మూడువిధాలుగా చెప్పబడుతుంది.

వ్యా: పూర్వాధ్యాయంలో త్యాగం సాత్విక, రాజస, తామస భేదాలతో మూడు విధాలుగా ఉంటుందని పరమాత్మ విభజించి చెప్పారు. అదే కర్మత్యాగం, కర్మఫల త్యాగం, కర్తృత్వ త్యాగం అని కూడా మూడు విధాలుగా ఉంటుంది అని సూచిస్తు న్నారు.

5. యజ్ఞదాన తపః కర్మ న త్యాజ్యం కార్య మేవ తత్।
యజ్ఞో దానం తప శ్చైవ పావనాని మనీషిణాం॥

తా: యజ్ఞము, దానము, తపములకు సంబంధించిన కర్మ చేయదగిందే కాని త్యజింపదగిందికాదు. యజ్ఞము, దానము, తపము, పండితులకు పవిత్రతను కలిగి స్తాయి.

వ్యా: మనీషులంటే ఫలకాంక్షలేని వాళ్ళని శంకరుడు. మలిన శీలురని రామా నుజులు.

ఏది దోషభూయిష్ఠమో దానిని త్యజించడంలో అర్థం ఉంది. పవిత్రతను కల్పించే కర్మను త్యజించడంలో అర్థం ఏముంది? కనుక ఆ కర్మను విడువరాదని అర్థం.

6. ఏతా న్యపితు కర్మాణి సంగం త్యక్త్వా ఫలాని చ।
కర్తవ్యానీతి మే పార్థ! నిశ్చితం మత ముత్తమమ్॥

తా: అర్జునా, ఈ యజ్ఞము, దానము, తపస్సులకు సంబంధించిన కర్మకూడ ఫలాభి సంధిని విడిచిపెట్టియే చేయవలసి ఉంటుంది. అలా చేయడమే విధి అని నమ్మి చేయడమే ఉచితమమని నామతం. ఇదే ఉత్తమమైన మతం.

7. నియతస్య తు సన్న్యాసః కర్మణో నోపపద్యతే।
మోహాత్తస్య పరిత్యాగ స్తామసః పరికీర్తితః॥

తా:శాస్త్రము కొన్నికర్మలను పరిత్యజింపరాదని ఆ త్యాగము ఉచితం కాదనీ

నియమించి ఉంది. అజ్ఞానం వల్ల ఎవడైనా అలాంటి కర్మ త్యాగాలు చేస్తే త్యాగం తామసమని చెప్పబడుతుంది.

వా: సంధ్యా వందనాది కర్మలు, అగ్నిహోత్రాది నిత్యకర్మలు శ్రుతి స్మృతులు పరిత్యజించ రానివిగా నిర్ణయించినవి కాబట్టి వాటిని త్యజించరాదని భావం.

8. దుఃఖ మిత్యేవ య త్కర్మ కాయక్లేశ భయా త్త్యజేత్।
స కృత్వా రాజసం త్యాగం నైవ త్యాగఫలం లభేత్॥

తా: ఒళ్ళు అలిసిపోతుందేమో అనే భయంతోనూ, ఇది చేయడం దుఃఖమే అనీ, ఏ కర్మను ఎవడు విడిచిపెడ్తాడో, వాడు చేసిన కర్మ త్యాగం రాజస త్యాగమని చెప్ప బడుతుంది. దానివల్ల వాడికబ్బే ఫలితం ఏమీ ఉండదు కూడా. త్యాగఫలం అనే మాట ఒక కథను గుర్తుకు తెస్తుంది.

ధర్మరాజు 'అశ్వత్థామ హతః కుంజరః' అని సగం అబద్ధాన్ని ఆడిన పాపానికి నరకలోకాన్ని చూడవలసిన అవసరం పట్టింది. అతడు నరక సమీపంలో కాలు పెట్టేసరికి అతని ధర్మప్రభావంవల్ల నానా బాధలు పడుతున్న పాపాత్ములకు ఆయా బాధలన్నీ పోయాయట. మండుతుండే అగ్ని యాతనలు చల్లబడ్డాయట. హఠాత్తుగా చల్లబడిపోయిన నరకాన్ని చూచి అక్కడి పాపులు దానికి కారణమేమిటో అని విచా రించసాగారట. చివరకు అక్కడే ఉన్న ధర్మరాజును శాంత వాతావరణానికి కార ణంగా తెలుసుకుని, అందఱూ వచ్చి ఆయన కాళ్ళమీద పడి వేడుకున్నారు. మీరింకా కొన్ని గంటలిక్కడే ఉంటే మా బాధలు తగ్గిపోతాయని, 'ఉండి పొండనీ' మొఱ పెట్టుకున్నా రట. ధర్మజుడు వాళ్ళమీద దయపుట్టి తనపుణ్యాన్ని అంతటినీ వాళ్ళ తపనలన్నీ నశించి, చల్లదనం కలిగేటందుకు వినియోగపడేటందుకు త్యాగం చేస్తున్నాననుకున్నా డట. మఱుసటి క్షణంలోనే విష్ణుదూతలు వచ్చి ధర్మరాజును అక్కడి నుంచి వెంటనే తీసుకొని పోవడానికి వచ్చి త్వరపెట్టసాగారట ఆయనను. ధర్మజుడు వాళ్ళతో అన్నా డట. నాకున్న పుణ్యాన్ని అంతా వీళ్ళకోసం త్యాగం చేశాను. విష్ణులోకానికి పోయే పుణ్యశేషం నా దగ్గఱలేదని అన్నాడట. దానికి ఆ దూతలు 'మహాత్మా! నీవిప్పుడు చేసిన త్యాగంవల్లనే నీ త్యాగఫలం రెట్టింపై పోయింది. కనుక ఒక్కక్షణం కూడా నీవిక్కడ ఉండతగవని అతనిని తరలించుకుని పోయారట.

త్యాగఫలంవల్ల పుణ్యం ఇనుమడిస్తుందని భావం. పురాణ కథ ఎలావున్నా త్యాగఫలంవల్ల ప్రత్యక్షంగా బ్రతుకు సుఖం ఇనుమడిస్తుంది. త్యాగం చేసిన వాడూ త్యాగాన్ని అందుకున్నవాడూ కలిసి బ్రతికినవాళ్ళిద్దరౌతారు.

ఫలం - సాధ్యం కాదు. సిద్ధమైనదే ఫలం. పండి బ్రద్దలయ్యేదే ఫలం - అది సహజంగానే రావాలి.

తామస త్యాగి విపరీత జ్ఞానం కలవాడు. చికీర్షయే లేదు వాడికి. పచ్చికాయను కోసి పారేసినట్టిది తామస త్యాగం.

కాయ క్లేశ కరమనుకోనీ, సుఖప్రద కార్యాన్ని దుఃఖప్రదకరమనుకోనీ, వేఱు విధంగా భాసించడంవల్ల ఆ కర్మను మనుష్యుడు విడిచిపెడ్తాడు. దీన్నే అవ్యవస్థిత జ్ఞానం అని కూడా అంటారు. ఇలా చేసే వాడిని రాజస త్యాగి అంటారు.

ముగ్గుతున్న కాయ లేదా దోరగా ఉన్న పండు రాజసం! యథార్థ జ్ఞానం పండి బ్రద్దలై పడిపోయే త్యాగం. ఇందులోకర్త ప్రయత్నం ఏమీ ఉండదు. అమ్మ అనుగ్రహం. ప్రకృతి పరిపక్వతా రెండూ ఒకే తొడిమన పండై రాలుతాయి. ఇదీ సాత్విక త్యాగం. ఇందులో ఆత్మారాముడు ఆత్మరీతి కలిగి చేస్తాడు త్యాగాన్ని. నియత కర్మలను చేస్తాడు. తనయందు కర్మ యందు కర్తృత్వ దోషాలను విడిచి చేస్తాడు.

9. కార్య మిత్యేవ యత్కర్మ నియతం క్రియతేఽ ర్జున!।
సంగం త్యక్త్వా ఫలం చైవ స త్యాగస్సాత్త్వికో మతః॥

తా: అర్జునా! ఎవడైతే ఇది చేయవలసిన నియతమైనదియే అని తలపోసి ఏ త్యాగాన్ని మమత్వం కోరిక తగులుపాటు లేకుండా, ఫలకాంక్ష లేకుండా చేస్తాడో వాడు చేసిన త్యాగం సాత్వికమవుతుంది.

10. నద్వే ష్ట్య కుశలం కర్మ కుశలే నానుషజ్జతే।
త్యాగీ సత్త్వ సమావిష్టో మేధావీ ఛిన్న సంశయః॥

తా: సత్త్వగుణం గలవాడూ, ప్రజ్ఞాశాలీ, ఛేదింపబడిన సంశయాలు గలవాడూ అయిన త్యాగశీలుడు దుఃఖకరమైన కర్మలవల్ల దుఃఖాన్ని పొందడు. సుఖాన్నిచ్చే కర్మలతో ఆసక్తుడు కాడు.

సత్త్వసమావిష్టః= ఆత్మానాత్మ వివేక విజ్ఞాన హేతువుచే కూడినవాడు

మేధావి = ఆత్మజ్ఞాన లక్షణమైన ప్రజ్ఞకలవాడు.

11. నహి దేహభృతా శక్యం త్యక్తుం కర్మాణ్య శేషతః।
యస్తు కర్మఫలత్యాగీ స త్యాగీ త్యభిధీయతే॥

తా: దేహధారి అయిన ఎవడికీ సంపూర్ణంగా కర్మలను త్యాగం చేయడం శక్యం కాదు. ఎవడు కర్మఫలత్యాగం చేస్తారో వాడే త్యాగి అని చెప్పబడుతున్నాడు.

వ్యా: మూడో అధ్యాయంలో కూడా ఇలాంటి శ్లోకమే ఉంది.

నహికశ్చిత్ క్షణమపిజాతుతిష్ఠ త్యకర్మ కృత్
కార్యతేహ్యవశః కర్మసర్వః ప్రకృతి జైర్గుణైః

అమ్మ ధ్యానంచేయడం కూడా కర్మే అంటుంది ఊపిరి తియ్యడం కూడా కర్మే ఇక కర్మలు చేయకుండా నేను కూర్చున్నాననుకోడం ఎలా సాధ్యం?

12. అనిష్ట మిష్టం మిశ్రం చ త్రివిధం కర్మణః ఫలం।
భవత్య త్యాగినాం ప్రేత్య న తు సన్యాసినాం క్వచిత్॥

తా: కర్మఫల త్యాగం చేయని వాని కర్మలఫలం వాడు ప్రకృతి గతుడై దేహ త్యాగం చేసిన తరువాత ఇష్టం, అనిష్టం, మిశ్రం అని మూడు విధాలుగా పరిణ మిస్తుంది. ఎన్నడు కర్మసన్యాసం చేసిన వాడికి అలాగా జరగదు.

వ్యా: అత్యాగినాం అంటే అజ్ఞులైన కర్ములకు అని అర్థం.

1. అపరమార్థ సన్యాసులకు అని శంకరులు, కర్తృత్వమమతా ఫలత్యాగ రహితులకు అని రామానుజతా అర్థం చెప్పారు.
2. సన్యాసినాం అనే మాటకు పరమార్థసన్యాసులకు పరమహంస పరివ్రాజ కులకు కేవల జ్ఞాననిష్ఠులకు అని శంకరులూ కర్తృత్వాది పరిత్యాగం చేసిన వాళ్ళకు అని రామానుజులు అర్థ నిర్వచనం చేశారు.

కర్మ ఫలత్యాగం చేయకపోతే కర్మల పరిణామమయిన ఫలసిద్ధి, స్వర్గ నరక లోకాల సుఖదుఃఖ రూపాలుగా ఆయా వ్యక్తుల జీవాత్మలకు భుక్తమౌతుందని కర్మ సిద్ధాంతవాదులంటారు. మిశ్రమ కర్మఫలం సుఖదుఃఖ మిశ్రరూపంగా మళ్ళీ ఇహ లోకంలో ఇంకో జన్మ ఎత్తడం ద్వారా జీవాత్మ అనుభవిస్తుందని వారు చెపుతారు. అచ్చగా సుఖమంటే ఎలా ఉంటుందో అచ్చగా దుఃఖం అంటే ఎలా ఉంటుందో ఎవ రికీ అర్థం గాని విషయం. ఒకడికి లక్షరూపాయల లాటరీ వచ్చిందనుకుందాం వాడికి నికాల్సైన ఆనంద మూలభించిందనుకుందా.

ఈ లక్ష రూపాయలూ ఎక్కడి నుంచి పోగయ్యాయి. ఒక్కొక్కడు రూపాయ చొప్పున ఎన్నిలక్షల మందో కట్టిన రూపాయలే కదా వీడికి వచ్చి వీడి అఖండ సంతోషానికి కారణమైనవి. అన్ని లక్షల మంది టిక్కెట్టుదార్లూ పెట్టుకున్న ఆశాలేశాల పరిణామమే కదా ఈ అఖండ సంతోషం. అఖండ సంతోషం ఒక్కచోట కేంద్రీకృతం కావడంతో తక్కిన లక్షల మనస్సులు ఏ కొంచెమో నిరాశ చెందడమే కదా దీని

రెండోవైపు చిత్రం. మామూలు మాటలతో చెప్పాలంటే కొన్ని లక్షల మనస్సులను ఏడి పించి తానొక్కడూ పగలబడి నవ్వుతున్నాడన్న మాటేనా! ఇలాంటిదే ప్రతి దుఃఖమూ ప్రతి సుఖము దుఃఖానికి రెండోవైపు సుఖం, సుఖానికి రెండోవైపు దుఖం. సుఖం, దుఃఖం అంటే క్రింది సంఖ్య ఎంత పెద్దదైతే పై సంఖ్య విలువ అంత చిన్నదౌతుంది. ఇదే మిశ్రమ ఫలితం. ఈ ఫలితాల అనుభవాలుగా నరకంలో దుఃఖాన్ని స్వర్గంలో సుఖాన్ని భూలోకంలో మిశ్రమాన్నీ అనుభవిస్తాడని కర్మసిద్ధాంతవాదులూ, పునర్జన్మ వాదులూ అంటారని తెలుసుకున్నాం. లోగడ ఇటువంటి విషయాన్ని చర్చించుకుని ఉన్నాం. 'ప్రేత్య' అంటే మరణించిన తరువాత అని అర్థం చెపుతారు వ్యాఖ్యాతలు. మరణించిన తరువాత జీవుడు ఎక్కడికి వెళతాడు.

'జీవుడని ప్రత్యేకంగా ఏంలేదు. జీవం అంటే ప్రాణం. పంచభూతాలను ఆధారం చేసుకుని కదా ఏర్పడటం? ఎక్కడికక్కడే లయమౌతుంది. అంటుంది అమ్మ.

మఱి శ్లోకంలో ఇష్టం అనిష్టం అనే మాటలు ఉపయోగించబడ్డాయే వాటికేమిటి అర్థం? అవి ఎలాగు అమ్మ చెప్పినట్లు లయమౌతాయి అంటే "పుణ్యాపాపాలు వేఱు. వాడు కాదు వాడు కాదు సూది మోప సందులేని వాడంటూ ఎక్కడో పెట్టి మాట్లాడు తున్నాం.

రెండుగా కనబడడం పాపమేమో. ఇష్టం అయిష్టం.. అనిపించడం భావం రావడమే..." అన్నది అమ్మ.

పంచభూతాలతో తయారైనది ఈ శరీరం. ఇది ప్రేత్యభావం పొందినప్పుడు పంచభూతాలలో లయమైంది. అదివఱకు పంచభూతాల్లో లేనిది ఈ శరీరంలో ఇప్పుడేమీ లేదు. ప్రాణసహితంగా ఉన్నప్పుడు, పంచభూతాల్లో ఉండే ఏమో తన్మాత్రాంశాల లోపంవల్లనో ఆధిక్యతలవల్లనో, ఆ దేహిలో ఇష్టానిష్టాలు లేక వాటి మిశ్రమ భావాలు బయట బడడానికి కారణమయింది. ఇప్పుడు ఆ మూలధాతువులు ఏమైపోతాయి. శరీరం పంచత్వం చెందగానే ఆయా ధాతువులు వాటివాటి ప్రాపంచిక నిధులతో చేరిపోతాయన్నమాట. అంతేగాని లేని జీవుడిని వాసనలలాగా పట్టుకుని వెంట బడి స్వర్గంలో అందలం మీదనో పట్టుపఱుపుల మీద కూర్చోబెట్టవు. కుంభీపాత నరకంలో మరుగుతూ ఉండే నూనె కాగులో పకోడీలలాగా వేయించనూ వేయించవు. ధాతువులకు ప్రత్యేక గుణాలను ప్రకోపింపజేసే స్వభావం ఉన్నదని వ్రాశాను.

అమ్మ ఒకసారి జ్యోతిషశాస్త్రం మీద మాట్లాడుతూ హోమియో వైద్యాన్ని గురించి అందుకుని

'హోమియోలో ఒక మూలిక అన్ని మూలికలకు ఆధారమనీ, ఒక రసమే అన్ని రసాలకూ ఆధారమనీ, ఒక జబ్బే అన్ని జబ్బులకు ఆధారమనీ చెప్తుతారు. నమ్మకం ఉంటేనే' అన్నారు.

ఈ మాటలు చదివిన తరువాత నాకు పైవిషయానికి హోమియోలో బంగారం లక్షణాల్ని గూర్చి చెప్పాలనిపించింది. 'అబింధనమ్ విద్యుత్ సువర్ణ మాకరజమ్' అనే శ్రుతివాక్యం వల్ల పరమాత్మ చైతన్యం అప్పును అంటే నీటిని ఆశ్రయంగా చేసుకుని విద్యుత్తు ఔతున్నాడు. పృథివిని ఆశ్రయంగా చేసుకొని గనుల్లోని బంగారమౌతున్నాడు అని దాని అర్థం. బంగారం పరమాత్మ అంశమే. అణు శాస్త్రంలో అంకమూలం.

బంగారంరోగికి జీవించాలని ఆశ ఉండదు. మృత్యువునే కోరుతాడు. జీవితం మీద అసహ్యం వేస్తుంది. ప్రేమస్థానమైన సహృదయం దెబ్బతింటుంది. తరువాత బుద్ధిలో మార్పు వస్తుంది. తన్నుదాను నిందించుకొని తాను మొదలుపెట్టిన ఏ పనీ ఫలించదని తానేమీ మంచి పనిచేయలేదని నిరాశ చెందుతాడు. తన స్నేహితులను మరిచిపోయానని తన విద్యుక్తధర్మం విస్మరించానని వృథాగా కాలం పాడుచేశానని విచారిస్తాడు. తాను మోక్షాన్ని పొందడానికి అనర్హుడనని నిందించుకుంటాడు.

ప్రపంచంలోని చెడ్డనే చూస్తూ ఉంటాడు. ఏదో అశుభం కలుగుతుందని భయపడతాడు. తన వృత్తి చెడ్డదనుకుంటాడు. తన కుటుంబం తనకు బాధాకరమని భావిస్తాడు. తన స్నేహితులు తన్ను చిక్కులు పెట్టుతున్నారనుకుంటాడు. స్వల్ప విషయాలకే చాలా కోపం ఉద్రేకం వస్తుంది. అతని మనస్థితి ఒకరకం పిచ్చిలాగా ఉంటుంది. అందులో తీవ్రత విషాదం కూడా ఉంటాయి. ఆరోగిని చూస్తే చూచే వారికి భయం కలుగుతుంది.

ఇవి బంగారం కారణంగా వచ్చే మానసిక లక్షణాలు. నిజానికి ఆరోగ్య శాస్త్ర రీత్యా విలువ ఎక్కువగా ఉండే బంగారం వెండి ప్రాణానికి దుఃఖకరమైన గుణాల్నే ప్రకోపింపజేస్తాయి. ఇనుములాంటి విలువ తక్కువైన జాతే రక్తాన్ని వృద్ధిచేసి పరమాత్మ భావాన్ని మనస్సులో కలిగిస్తుంది.

ఉదాహరణకు ఈ బంగారం లక్షణాలు కలవ్యక్తి చచ్చిపోయి అతని శరీరం దహించబడిందని అనుకుందాం. అతని శరీరంలో పైలక్షణాలకు కారణభూతాలైన ధాతువులు పంచభూతాలలోని ఆయా రకాలైన ధాతునిధులలో లయమైపోతాయి. ఆ దేహం పాతిబెట్టబడిందనుకుందాం. ఆ దేహంలోని ఆ బంగారం ధాతువు ద్రవ్యాలంటే ప్రీతికరంగా ఉండే పురుగులు వాటిని తిని జీర్ణం చేసుకుని ఆవిధంగా ఆ శరీరాన్ని పట్టుకున్న ఇష్టానిష్ట మిశ్రమ కర్మ ఫలితాలను భుక్తం చేసుకుంటాయి.

ఈవిధంగా ప్రతి వ్యష్టి చావునూ ప్రపంచం అంతా పంచుకుంటుంది. ఒక జీవి అనుభవం అంటే ఒక స్థాయిలో సర్వ ప్రపంచం, అనుభవమే. ఒక జీవి జీవితం అంటే ఒకానొక స్థాయిలో సర్వ ప్రపంచ జీవితమే.ఒక రీతిగా చెప్పవలసివస్తే సర్వప్రపంచమూ తానే ఐ పుట్టుతున్నాడు ప్రతి మనిషీ 'కొయ్యగా, రాయిగా అన్నీ అయి ఉన్నాడు' అమ్మ.

13. పంచైతాని మహాబాహో! కారణాని నిబోధ మే।
సాంఖ్యే కృతాన్తే ప్రోక్తాని సిద్ధయే సర్వ కర్మణామ్॥

14. అధిష్ఠానం తథా కర్తా కరణం చ పృథగ్విధమ్।
వివిధాచ పృథక్చేష్టా దైవం చైవాత్ర పంచమమ్॥

తా: మహాబాహూ! అర్జునా! సమస్త కర్మముల ఫలప్రాప్తికొఱకు అయిదు కారణాలున్నాయని సాంఖ్య సిద్ధాంతం చెప్తుతున్నది. ఆ కారణాలను చెబుతాను అర్థం చేసుకో. అవేవి అంటే మొదటి కారణం శరీరం; రెండో కారణం కర్త; మూడోది ఇంద్రియాలూ మనస్సూ; నాలుగోది వేర్వేఱు క్రియలు; ఐదో కారణం దైవం ఇలా చెప్పబడ్డాయి.

వ్యా: (i) అధిష్టానం అంటే శరీరమూ శారీరక శక్తులూ.

(ii) కర్తా అంటే ఉపాధి లక్షణుడైన భోక్త అని శంకరులూ, జీవాత్మ అని రామానుజులూ, విష్ణువు అని మధ్వాచార్యులూ వర్ణించారు.

(iii) చేష్టాః: ప్రాణాపాన వాయువుల క్రియలు అని శంకరులు రామానుజులూ చెప్పారు.

(iv) దైవం: కన్నులు మొదలగు వానికి దృష్ట్యాదులనిచ్చే సూర్యుడు మొదలైన దైవము అని శంకరులూ, సర్వాంతర్యామి అయిన పరమాత్మ జీవుల హృదయము నందుండే వాడని రామానుజులూ అదృష్టము అని మధ్వాచార్యులూ నిర్వచించారు.

మనం చేసే కర్మ మనం ఒక్కళ్ళమే చేయడం లేదు. ఏ పని చేసినా మన ఒకళ్ళ ప్రయోజకత్వంవల్లే జరుగుతున్నదని అనిపిస్తుంది. కాని నిజానికది సామూహికమైన కృషియే. ఏ ఒక్కరిదీ కాదు, కర్తృత్వం తన ఒక్కడి మీదనే పెట్టుకోవడం అజ్ఞానం వల్లే అవుతుంది. ప్రతి పనికీ అయిదు కారణాలు.

1. అధిష్టానం– శరీరం; శారీరక శక్తులూ.

2. కర్తా అంటే చైతన్యం
3. కరణం పృథగ్విధం అంటే వేర్వేరు ఇంద్రియాలు
4. పృథక్చేష్టా – పలు రకాలుగా కనిపించే పనులు
5. దైవం – ప్రేరణ. అయిదుగానూ విభజించవచ్చు. కారణాలని అనంతం గానూ విభజించవచ్చు. ముఖ్యంగా చెప్పబడిన ఈ ఐదు కారణాలకూ కారణరూపమైన పరమాత్మ చైతన్యం ఒక్కటే అన్నిటికీ కారణం అనుకోవడంలోనే అందటికీ సౌలభ్యం, అందటికీ రక్షణా ఉన్నది.

15. శరీర వాఙ్మనో భిర్యత్కర్మ ప్రారభతే నరః।
న్యాయ్యం వా విపరీత వా పంచైతే తస్య హేతపః॥

తా: న్యాయ్యమైనదైనా అన్యాయమైనదైనా, శారీరకంగానూ, వాచికంగానూ మానసికంగానూ ప్రారంభించిన ప్రతి కర్మకూ ఈ ఐదూ ముఖ్యకారణాలై ఉంటాయి.

16. తత్రైవం సతి కర్తార మాత్మానం కేవలం తు యః।
పశ్య త్యకృత బుద్ధిత్వా న్న పశ్యతి సదుర్మతిః॥

తా: ఈ విషయం ఇట్లుండగా అంటే పరమాత్మ ప్రేరణవల్లనే అన్ని పనులు జరుగుతూ ఉండగా నేనే చేస్తున్నానని కర్తృత్వం తన మీదనే పెట్టుకునే వివేక విహీనుడు తత్వయాదార్థ్యాన్ని గుర్తించలేకపోతున్నాడు. అతడు కర్తను చూడజాల కున్నాడు.

17. యస్య నాహం కృతో భావో బుద్ధి ర్యస్య న లిప్యతే।
హత్వాఽ పి స ఇమాన్ లోకా న్న హన్తి న నిబధ్యతే॥

తా: ఎవడు అహంకార భావాన్ని విడిచిపెట్టుకుంటాడో, ఎవని బుద్ధి పర మాత్మతో నిండి అలిప్తమై ఉంటుందో అతడు లోకమునందలి ప్రాణులను భౌతిక దృష్టిచే చంపిన వాడైనప్పటికీ పరమార్థ దృష్టితో అతడు చంపేవాడూ కాదు. కర్మలచే బంధింపబడే వాడూ కాదు.

వ్యా: పూర్వం గాంధీ మహాత్ముడూ మరణయాతనతో చాలా బాధ పడుతున్న ఒక ఆవును ఒక కత్తితో చిన్నదెబ్బ కొట్టి దాని బాధను తుద ముట్టించాడట. లోక దృష్టిలో మహాత్ముడుగా హత్యచేశాడు అనుకున్నా నిజానికి అతడు ఆ జీవి అంతిమ యాతనను తగ్గించిన వాడే అయినాడు.

కోన వెంకాయమ్మ ప్రాణావసాన సమయంలో మరణశయ్య నధిరోహించి కళ్ళు

తెఱిచి చూస్తుంటే, ఇంకేం చూస్తావు కళ్ళుముయ్యి అని అమ్మ ఆమె యమయాతనకు స్వస్తి చెప్పింది. ఇవి కరుణతో చేసిన పనులుగాని పగతో చేసిన హత్యలు కావు.

18. జ్ఞానం జ్ఞేయం పరిజ్ఞాతా త్రివిధా కర్మ చోదనా।
కరణం కర్మ కర్తేతి త్రివిధః కర్మ సంగ్రహః॥

తా: కర్మ ప్రవృత్తికి కారణాలు మూడు విధాలుగా చెప్పబడ్డాయి. ఒకటి జ్ఞానకారకమైన బుద్ధి వృత్తి రెండు ఆజ్ఞానం చేత తెలియబడే వస్తువు మూడు దాన్ని తెలుసుకునేవాడు పరిజ్ఞాత. ఈ ముగ్గురు కలిసి కర్మ వృత్తిని నడుపుతూ ఉంటారు. ఇక ఆ కర్మముల ఏర్పాటును అమరికను బట్టి చూచినా అది కూడా మూడు విధాలుగా ఉంది. ఒకటి కరణము, రెండు కర్మము మూడు కర్త. పనిచేసేవాడు కర్త, వానిచేత చేయబడేది కర్మ, కార్యసాధనాశక్తి కరణం అని మూడుగా కనిపిస్తుంది.

వ్యా: కాని చక్కగా విచారించే సరికి కర్త లేకుండా క్రియగాని కర్మగాని ఉండజాలవని తేలిపోతుంది. "కర్మ క్రియ కర్తలోవే" అమ్మ.

19. జ్ఞానం కర్మ చ కర్తా చ త్రిధైవ గుణ భేదతః।
ప్రోచ్యతే గుణ సంఖ్యానే యథావచ్ఛృణు తాన్యపి॥

తా: గుణ విచారాన్ని చేసే శాస్త్రాన్ని అనుసరించి, జ్ఞానం, కర్త, కర్మ, అనేవి. గుణభేదతయా, మూడేసి విధములుగా విభజింపబడి ఉన్నాయి. అంటే సత్వరజస్తమో గుణాల భేదాలననుసరించి కర్త, కర్మ, జ్ఞానం అనే వాటిలో ఒక్కొక్కటి మళ్ళీ మూడేసి విధాలుగా భాగింపబడి ఉంది. కాబట్టి వాటి స్వరూపాన్ని ఉన్న దున్నట్లు చెపుతా విను.

20. సర్వభూతేషు యేనైకం భావ మవ్యయ మీక్షతే।
అవిభక్తం విభక్తేషు తద్జ్ఞానం విద్ధి సాత్వికం॥

బాహ్యదృష్టికి వేర్వేఋగా కనిపించే సర్వభూతాలలోను అన్నీ తానే ఐ ఏకంగా ఉండే అవిభక్తమై నాశనరహితమైన ఐక్యభావం ఒక్కటే ఉన్నదని తెలిసే జ్ఞానం సాత్వికజ్ఞానం అని తెలుసుకో ఇదే - ఇదే స్థితప్రజ్ఞుని లక్షణంగా పూర్వం పరమాత్మ చెప్పారు.

21. పృథక్త్వేన తు యత్ జ్ఞానం నానాభావాన్ పృథగ్విధాన్।
వేత్తి సర్వేషు భూతేషు తద్జ్ఞానం విద్ధిరాజసమ్॥

తా: అర్జునా! బాహ్యదృష్టికి పృథిగ్విధములుగా ఏవిధంగా సర్వభూతాలు కన్పిస్తుంటాయో అదే ప్రకారంగా ఆంతర్యములో కూడా భిన్నంగా ఉన్నట్టుగానే తెలుసుకునే జ్ఞానం ఏదైతే ఉందో అదిరాజస జ్ఞానమని తెలుసుకో.

22. య త్తు కృత్స్నవ దేకస్మిన్ కార్యే సక్త మహైతుకమ్।
అతత్వార్థవదల్పం చ త త్తామస ముదాహృతమ్॥

తా: తన ప్రతిమే దేవుడని మొండి పట్టుపట్టి వాదిస్తాడు.

ఏ జ్ఞానం విగ్రహాది పదార్థమునందే సమస్తము అడగి ఉన్నదని అక్కడ తప్ప ఇకెక్కడా లేదని నమ్ముతూ, దానికి చెప్పే కారణం యుక్తిహీనంగా ఉంటూ, పరమార్థం లేనిదిగా ఉంటుందో, ఇంకా మిక్కిలి అల్పఫలితం కలదై ఉంటుందో, అది తామసజ్ఞానమని చెప్పబడుతుంది.

వ్యా: ఈ విధంగా త్రివిధ జ్ఞానములను చెప్పి పరమాత్మ త్రివిధ కర్మలను చెపుతున్నాడు

23. నియతం సంగరహిత మరాగద్వేషతః కృతమ్।
అఫల ప్రేప్సునా కర్మ యత్త త్సాత్విక ముచ్యతే॥

తా: నియతమైన ఏ కర్మం రాగద్వేషభావాలకు లోనుగాకుండా, సంగము, కోరిక విడిచిపెట్టి పురుషుడి చేత చెయ్యబడుతున్నదో అట్టి సాత్త్వికకర్మగా చెప్పబడుతున్నది.

వ్యా: నియతం అంటే 7వ శ్లోకంలో చెప్పిన 'నియతస్యతు సన్యాసో' అనే మాట లోని నియత శబ్దానికున్న అర్థమే ఇక్కడా వర్తిస్తుంది. శాస్త్ర నియతమైన ఉండడమే నియతమని సంప్రదాయం చెప్తుతుంది. ఏకాలానికి ఏదేది అవసరమో ఆయా మార్పులు ఉన్న శాస్త్ర నియమాలకి చేయబడుతూ ఉంటాయి. కొంత కాలం జరిగే సరికి అవే నియతాలైపోతాయి. ఆవిధంగా మారిపోయిన నియమాల్లో చాలా ఉన్నాయి మన సంఘంలో. కాబట్టి నియతమైన అనే మాటకు రాగద్వేషభావాలకు లోనుకాకుండా ఉండడం, ఒక నియమం. సంగం, కోరికలేని పురుషునిచేత చెయ్యబడడం రెండో నియమం. ఈ రెండు నియమాలచేత సిద్ధమైన కర్మ ప్రతిదీ నియతమే అని చెప్పుకుంటే సరిపోతుంది. అదే సాత్విక కర్మ.

24. యత్తుకామేప్సునా కర్మ సాహంకారేణ వాపునః।
క్రియతే బహులాౙ యాసం తద్రాజస ముదాహృతం॥

తా: ఫలాపేక్ష కలవానిచేతగాని, అహంకారం కలవాని చేతగాని, మఱల బహుళాయాస పూర్వకంగా ఏ కర్మ చేయబడుతుందో అది రాజసకర్మ అని చెప్పబడుతుంది.

వ్యా: సాత్విక కర్మలలో సంగమూ లేదు కోరికాలేదు. రాగద్వేషాలతో కూడు కొన్న అహంకారమూలేదు. నియతం అంటే సూర్యుని రాకపోకలెంత సహజంగా జరిగిపోతాయో అంత సహజంగా జరిగిపోతుంది సాత్త్విక కర్మ మఱి రాజస కర్మలో విశేష ప్రయాసా ఉంది. కామమూ ఉంది. నేను చేస్తున్నాననే అహంకారం కూడా ఉంది.

25. అనుబంధం క్షయం హింసా మనపేక్ష్య చ పౌరుషమ్।
మోహా దారభ్యతే కర్మయత్త త్తామస ముచ్యతే॥

తా: ఏ పని అయితే తరువాత రాగల దుఃఖాదులనూ, ధనవ్యయాన్ని శరీ రాదులకు కలిగే బాధలనూ, ముందుగా గుర్తించుకోకుండా, తన సామర్థ్యమును గూడా యోచించుకోకుండా అజ్ఞానం చేత తొందరబడి ప్రారంభించబడుతున్నదో అది తామసకర్మ మనబడుతున్నది.

వ్యా: సర్వసాధారణంగా ఇలాంటి పనులే లోకంలో ఎక్కువ ఉంటాయి. అను బంధం అంటే ఆ పని వలన దుఃఖమే వస్తుందో సుఖమే వస్తుందో చేసేవాడు ఆలో చించడు. తనకున్న స్తోమతను అంచనా వేసుకోడు. అనుకున్న ప్రకారం ఫలం ప్రాప్తించకపోతే పెట్టిన డబ్బంతా నష్టమే అయిపోతుందని ఆలోచించడం శరీరా యాసం కూడా మిక్కుటమౌతుంది. ఇంకో మంచి పని దానివల్ల చేయలేకపోతాడు. అప్పటికే కళ్ళు మూసుకునిపోతాయి. ఎన్నో లక్షల బ్లాక్ మనీ వస్తుందని నమ్మి కార్లమీద వెళ్ళి, పోలీసులకు కూడా తెలియకుండా అసలు నోట్లకట్టలను అయిదు లక్షలిచ్చి, నల్లడబ్బు నోట్ల కట్టలను పదిహేను లక్షలను ఇంటికి తెచ్చుకుంటాడు. తీరా కట్టలు విప్పి చూసుకుంటే పైనా క్రిదా అసలు నోట్లూ మధ్యన ఉన్నవన్నీ తెల్లకాగి తాలూ ఉంటాయి. అక్కడకక్కడ అన్ని కట్టలూ విప్పిచూడడానికి వీలుపడదుగా మోహాదారభ్యతే - అనే మాటకదే అర్థం.

పరమాత్మ ఇంతదాకా మూడు విధాలైన కర్మలను గూర్చి చెప్పారు. ఇక త్రివిధములైన కర్తలను గూర్చి చెపుతున్నారు.

26. ముక్త సంగోఽ నహంవాదీ ధృత్యుత్సాహ సమన్వితః।
సిద్ధ్యసిద్ధ్యో ర్నిర్వికారః కర్తా సాత్త్విక ఉచ్యతే॥

తా: తగులుబాటును విడిచిన వాడూ, నేను చేస్తున్నానని అనుకోనివాడు, ధైర్యము, ఉత్సాహములతో కూడినవాడు, ఫలం సిద్ధించినా సిద్ధించకపోయినా నిర్వికారంగా ఉండేవాడూ, అయిన కర్త సాత్త్వికుడని చెప్పబడతాడు.

27. రాగీ కర్మ ఫల ప్రేప్సు ర్లుబ్ధో హింసాత్మకోఽ శుచిః।
హర్షశోకాన్వితః కర్తా రాజసః పరికీర్తితః॥

తా: అనురాగం కలవాడూ, కర్మఫలాన్ని ఆశించేవాడూ, లోభీ. హింసా స్వభావం కలవాడూ, శుచిత్వం లేనివాడూ, సంతోషంతోను, విషాదంతోనూ కూడి ఉన్నవాడూ, అయిన కర్త రాజస కర్త అని చెప్పబడతాడు.

వ్యా: చేసే పని మీద రాజసకర్తకు అనురక్తి ఉంటుంది. ఫలం మీద దృష్టి ఉంటుంది. ద్రవ్యాదులనే కాదు, తనలోని మంచి తనాన్ని కూడా ఖర్చు చేయడానికి ఒప్పుకోడు. యత్నం ఫలించిందా సంతోషంతో విఱ్ఱవీగుతాడు. యత్నం చీదేసిందా విషాదంతో చచ్చినంత క్రుంగిపోతాడు. ఇదీ రాజసకర్త యొక్క చిత్రం.

రాగీ: కర్మచేయడం మీద మమకారం కలవాడు (శం) యశస్సుకోరేవాడు (రా)

లుబ్ధః: పరద్రవ్యాసక్తి కలవాడు. తన ద్రవ్యాన్ని తీర్థాదులందు వ్యయపఱచని వాడు (శం)

కర్మానికి కావలసిన ద్రవ్యాన్ని వ్యయం చెయ్యనివాడు(రా)

హర్షశోకాన్వితః ఇష్టంగా ఫలం వచ్చినప్పుడు సంతోషం, అనిష్టం కలిగినప్పుడు దుఃఖం పొందే వాడు(శం)

యుద్ధాది కర్మాల్లో జయాదికం వస్తే సంతోషించేవాడు అపజయం కలిగితే శోకించేవాడు.

28. అయుక్తః ప్రాకృత స్తబ్ధ శ్శఠో నైకృతి కోఽ లసః।
విషాదీ దీర్ఘసూత్రీ చ కర్తా తామస ఉచ్యతే॥

తా: పనులు చేయడాని కాసక్తే లేనివాడు, వెఱ్ఱి బాగులవాడు, విఱ్ఱవీగుతూ కఱ్ఱలాగా పొగరుతో నిండిన వాడూ దొంగచాటుగా శక్తులను వాడే వాడు ఇతరులను వంచించేవాడూ, సోమరిపోతూ దిగులుతో క్రుంగిపోయేవాడూ, హెచ్చరిక లేకుండా పనులను ముఱగబెట్టేవాడు, ఇలాంటి లక్షణాలు గల కర్త తామసుడని చెప్పబడతాడు.

వ్యా: స్తబ్ధః అంటే గర్వంతో అకారణంగా బిఱ్ఱబిగిసిన పొగరుబోతని అర్థం సద్విద్యా ప్రకరణంలోని శ్వేతకేతువు స్తబ్ధుడు.

నైకృతికీ: ఇతరులను మోసపుచ్చడమే స్వభావంగా కలవాడు.

అయుక్తః: సమాహితుడు కానివాడు (శం) శాస్త్రీయకర్మకు తగనివాడు.(రా)

దీర్ఘసూత్రీ: అప్పుడు చేయవలసిన పనిని చిరకాలానికిగాని చేయనివాడు (శం) అభిచారాది కర్మాలు చేస్తూ పరులకు దీర్ఘకాల మనర్థం కలగాలని దీర్ఘాలోచనచేసే స్వభావం కలవాడు(రా) ఇతరులు చేసిన దోషాన్ని చిరకాలం గడచిన తరువాత కూడా మరచి పోకుండా ఉండేవాడు (మధ్వ).

పంచతంత్రంలో దీర్ఘదర్శి, ప్రాప్తకాలజ్ఞుడు, దీర్ఘసూత్రి అనే మూడు చేపల కథ ఉంది. నీరెండిపోతున్న చెఱువును చూచి దీర్ఘదర్శి ముందుగానే బాగా నీళ్ళున్న మఱో చెఱువులోకి పోతుంది. ప్రాప్తకాలజ్ఞుడు వలను కొఱికేశో, చచ్చినట్లు పడి ఉండో, జాలరి బారినుంచి తప్పించుకొని పాఱిపోతుంది. దీర్ఘసూత్రి వలలో పడి ఊరికే ఎగురుతూ పొగరుబోతు దనంతో కనిపించేసరికి అక్కడికక్కడే రెండు దెబ్బలు కొట్టి చంపి జాలరి దాన్ని తీసుకుపోయాడు. దీర్ఘసూత్రికాలాన్ని నానబెడతాడు. ఇంత వఱకు త్రివిధములైన కర్మలను గూర్చి వర్ణించి కృష్ణపరమాత్మ ఇప్పుడు బుద్ధి, ధృతి అనుగుణములను గూర్చి వివరించుచున్నారు.

29. బుద్ధేర్భేదం ధృతేశ్చైవ గుణత స్త్రివిధం శృణు।
ప్రోచ్యమాన మశేషేణ పృథక్త్వేన ధనంజయ!॥

తా: అర్జునా! బుద్ధి యొక్క ధృతి యొక్క భేదాలు గుణాలననుసరించి ఒక్కొక్కటి మూడు విధాలుగా ఉంటుందని చెప్పబడింది. కాబట్టి ఈ రెండింటి వివరాలను వేర్వేఱుగాను, అశేషంగాను విను.

బుద్ధి అంటే గ్రహణ సామర్థ్యం

ధృతి అంటే ధారణ సామర్థ్యం

ఆత్మజ్ఞానం కావాలంటే ఈ రెండూ అవశ్యంగా ఉండాల్సినవే.

30. ప్రవృత్తిం చ నివృత్తిం చ కార్యాకార్యే భయాభయే।
బంధం మోక్షం చ యా వేత్తి బుద్ధి స్సా పార్థ! సాత్త్వికీ॥

తా: ప్రవృత్తిని, వృత్తులనూ, కార్యాకార్యములను, భయాభయాలను, బంధ మోక్షాలను ఏ బుద్ధి తెలుసుకుంటుందో ఆ బుద్ధి సాత్వికమైనది.

ప్రవృత్తి: ప్రవర్తనం; బంధహేతువైన ప్రవృత్తి మార్గంగా అభ్యుదయ సాధన భూతమైన ధర్మం(రా)

నివృత్తి: ప్రవృత్తిని విడిచిపెట్టడం అంటే మోక్షహేతువైన సన్యాసమార్గం (శం) మోక్షసాధన భూతం (రా) పనిచేయడం ప్రవృత్తి ఈ కర్మలను చేస్తూ స్వర్గాదులకు వెళ్ళి తిరిగి భూలోకానికి రావడం అని కూడా విశిష్టాద్వైతులు దీనికర్థం చెప్తుతారు.

నివృత్తి: లోకంలో ఉండే కర్మాల నుంచి మరలి పోయి ఇక తిరిగి రాకుండా పర మాత్మను చేరుకోవడమంటారు. ఫలితార్థం ఏమంటే ప్రవృత్తివల్ల భయమూ బంధమూ కలుగుతుంది. నివృత్తివల్ల అభయమూ మోక్షమూ కలుగుతుంది.

ప్రవృత్తి మార్గం తితఉది అంటే జల్లెడది.

జల్లెడతో జల్లించేటప్పుడు నూకలు క్రిందికి దిగిపోతాయి. గట్టిమెఱికలుపైన ఉండిపోతాయి నూకలవంటి సూక్ష్మ పదార్థాలను విడిచిపెట్టి స్థూలపదార్థాలను తనలో ఉంచుకుంటుంది తిత ఉ అంటే జల్లెడ.

చేటతో కోడేటప్పుడు బెడ్డలు మెఱికలు ముందఱికి వస్తాయి. నూకలు, సగం విఱిగిన బియ్యం వెనక్కుండి పోతాయి. అంటే సూక్ష్మాలు వెనుక్కుండి పోతాయి.

కత్తిపీట ఒకటిగా మనస్సులా నిలబడి ఉన్నదాన్ని రెండుగాను చాలా ముక్కలు గాను చేసి చూపిస్తుంది. అలా ముక్కలు చెయ్యడంలోనే అంతరార్థాలను విడమఱచి చూపిస్తుంది,

రోలు రోకలి – ఒకటిగా ఉన్న దాన్ని గుండుచేసి పిండిచేసి విడిచి పెడుతుంది. ఒక్క మూలపురుషుని శుక్రం సమస్త మానవజాతిగా విరిసిపోతుంది.

పొయ్యి: తను మండిపైన ఘటాన్ని మండించి భోగ్యవస్తువును పక్వం చేస్తుంది. ఈ పొయ్యి ఎక్కడిదో కాదు. జ్వాలమాలాకులం భాతివిశ్వస్యా యతనం, మహత్.

చీపురు: మకిలగా ఉన్న హృదయాన్ని శుభ్రంగా చిమ్మి కడిగి పరిశుద్ధం చేస్తుంది. చీపురుకు శోధని అని సంస్కృతం మాట. పిల్లలు, బురద పూసుకుని వస్తే కడిగే పనిచేస్తుంది.

జల్లెడలాగా ప్రవృత్తి మార్గంలో ఉండి స్థూలాపేక్షతో సతమతం కావద్దనీ చేట లాగా స్థూల ప్రపంచాన్ని బయటికి త్రోసేసి సూక్ష్మాలను లోపల ఉంచుకోమనీ శాస్త్రజ్ఞులు చెపుతారు. స్థూలసూక్ష్మాలు పరమాత్మ కన్న వేఱనుకున్నప్పుడు ఈ భేదాలు కాని, అన్నీ పరమాత్మే అయి ఉన్నాడనుకున్నప్పుడు. ప్రవృత్తికీ నివృత్తికీ భేదం లేదు. జ్ఞానానికి అజ్ఞానానికీ భేదం లేదు. వేదాల చదువుకీ, అమ్మ చదవకుండా చెప్పే వేదా లకీ భేదం లేదు.

"నేను చదువుకోలేదు, పొయ్యి, చీపురు. రోలు, రోకలి, కత్తిపీట - ఇవే నా వేదాలు. పంచమవేదం - చేట" అన్నది అమ్మ.

31. యయా ధర్మ మధర్మం చ కార్యం చా కార్య మేవచ।
అయథావ త్ప్రజానాతి బుద్ధి స్సాపార్థ! రాజసీ॥

తా: అర్జునా! ఇక ఏ బుద్ధిచేత ధర్మం అధర్మంగానూ కార్యం అకార్యంగాను, అవాస్తవంగా తెలుసుకోబడుతుందో ఆ బుద్ధి రాజసమైనది.

32. అధర్మం ధర్మ మితి యా మన్యతే తమసాఽ వృతా।
సర్వార్థా న్విపరీతాంశ్చ బుద్ధి స్సా పార్థ తామసీ॥

తా: పార్థా! అజ్ఞానంచేత ఆవరింపబడి ఉండి ఏ బుద్ధి ధర్మాన్ని అధర్మాన్ని చూస్తూ, జ్ఞేయపదార్థాలన్నింటినీ విపరీత మార్గంలో అర్థం చేసుకుంటుందో ఆ బుద్ధి తామసమైనది.

వ్యా: పైన చెప్పిన మూడు శ్లోకాలలోను సాత్విక రాజసతామస బుద్ధుల లక్షణాలను పరమాత్మ చెప్పారు. ఉన్నదాన్ని యథాతథంగా అర్థం చేసుకుని పరమార్థ సిద్ధికి ప్రయత్నించే దాన్ని సాత్వికబుద్ధి అనీ, ధర్మాన్ని అధర్మం అనీ, కార్యాన్ని అకార్యమనీ, అయథావత్‌గా అర్థం చేసుకునే బుద్ధిరాజసమైనదనీ అధర్మాన్ని ధర్మంగా విపరీతంగా అర్థం చేసుకునే బుద్ధిని తామస బుద్ధి అనీ పరమాత్మ నిర్వచించారు. ఉన్న దాన్ని యథాతథంగా అర్థం చేసుకోవడంలో చిక్కులేదు క్లేశమూ లేదు మిగతా రెండింటిలో అంటే రాజసతామసాల్లో ఉన్నదాన్ని వ్యతిరేకంగా అర్థం చేసుకోడం సమానంగా ఉన్నా ఆ రెంటికీ భేదం ఉంది. పైకి మాత్రం సమానంగా కనిపిస్తాయి. ఉదాహరణకు పది మంది మనుషులు పన్నెండు గంటలకు భోజనానికి వస్తారు కనుక వంట వండమని భర్త భార్యతో చెప్పాడనుకోండి. ఆమె ఆ మాటలను సరిగా అర్థం చేసుకుని ఉంటే వంట వండి సిద్ధంగా ఉంచుతుంది పన్నెండు గంటలకు వచ్చిన వాళ్ళు తిండి తిని వెళ్ళిపోతారు. సాత్వికగుణమే ఆవిడది అనుకుంటాం.

అన్నం వండవలెను అనే ధర్మాన్ని అయథావత్‌గా అర్థం చేసుకుని, అన్నం వండకూడదు అని అర్థం చేసుకుని వండలేదనుకోండి. వచ్చిన వాళ్ళు ఆకలితో వెళ్ళిపోతారు. అర్థం చేసుకోడం పొరపాటని తెలియగానే ఈమె అన్నం మళ్ళీ వండే అవకాశం ఉంది. అన్నం వండకూడదు అనేది అధర్మమే అయినా అదే ధర్మంగా అనుకుని బంధువులు ఎప్పుడు వచ్చినా వాళ్లను కడుపు మాడ్చి పంపే బుద్ధి తామసబుద్ధి అవుతుంది. అతిథివస్తే అన్నం వండకపోవడమే ధర్మమని విశ్వసిస్తుంది కనుక ఈమె మళ్ళీ అతిథికి అన్నంపెట్టే ప్రసక్తేరాదు.

మానవ బుద్ధి ఇలా మూడు విధాలుగా పని చేయడానికి కారణం ఏమిటి? త్రిగుణాలు అంటారు వ్యాఖ్యాతలు అంతా దేవుని ప్రేరణే! అలా హెచ్చుతగ్గులుగా ఉండడమే సృష్టి అంటుంది అమ్మ. ఇప్పుడు త్రివిధములైన ధృతులను గూర్చి చెపుతారు పరమాత్మ.

33. ధృత్యా యయా ధారయతే మనః ప్రాణేంద్రియ క్రియాః।
యోగే ऽ వ్యభిచారిణ్యా ధృతి స్సా పార్థ! సాత్త్వికీ॥

తా: అర్జునా! ఏ ధారణాశక్తి చేత మనస్సు యొక్క ఇంద్రియాల యొక్క వివిధములైన వ్యాపారాలను నిత్య సమాధియోగముచేత పురుషుడు ధరించగల్గుతున్నాడో అటువంటి ధృతి సత్త్వ సంబంధమైనది.

34. యయా తు ధర్మకామార్థాన్ ధృత్యాధారయతేऽర్జున!।
ప్రసంగేన ఫలాకాంక్షీ ధృతి స్సాపార్థ! రాజసీ॥

తా: అర్జునా! మఱి ఏధారణాశక్తి చేత, ఫలాకాంక్షియైన పురుషుడు, మోక్షము మాట ఎత్తుకోకుండా ధర్మార్థకామాలను మిక్కిలి ఆసక్తితో ధరిస్తూ ఉంటాడో ఆ ధృతి రజస్సంబంధమైనది.

35. యయా స్వప్నం భయం శోకం విషాదం మద మేవచ।
నవి ముంచతి దుర్మేధాః ధృతి స్సా పార్థ! తామసీ॥

తా: అర్జునా! ఎవడు దుర్బుద్ధి కలవాడై స్వప్నము, భయం ప్రియవియోగం వల్ల దుఃఖం విషాదం మదము ఈ గుణాలను విడిచి పెట్టలేకపోతున్నాడో ఆ ధృతి తామసికమైనది.

వ్యా: పైమూడు శ్లోకాలలో పరమాత్మ త్రివిధాలైన ధృతులను గూర్చి వర్ణన సలిపారు. ధృతి అంటే ఏమిటి? మనం ఏమన్నా వస్తువును పట్టుకుని లేవనెత్తి భూమి కెత్తుగా తీసుకుపోతున్నామనుకొండి. అది భూమి మీద ఉన్నప్పుడు అది నిలిచి ఉండడానికి భూమి ఆధారంగా ఉంది. భూమిని విడిచిపెట్టి అది చేతిలోకి వచ్చిన తరువాత చేతుల్లో ఏదో శక్తి ఆధారంగా మళ్ళీ భూమి మీద పడకుండా ఉంది? చేతిపట్టు అని చెప్పవచ్చు. చేతిపట్టు ఏ శక్తివల్ల దాన్ని క్రింద పడనీయకుండా ఉంచుతున్నది. సూదంటు రాతికి ఆకర్షణశక్తి ఉన్నందువల్ల మేకు దాన్ని అంటిపెట్టుకుని భూమి మీద పడకుండా ఉన్నది. మఱిచేతికి ఆకర్షణశక్తి లేదు కదా. పీనుగు చేతులకీ వస్తువును పట్టుకునే శక్తిలేదు కదా. ఏదో ప్రాణశక్తి నరాలను కండరాలను బిగించి

చేతివ్రేళ్ళను ఒక ముకుళాకారంలోకి తీసుకునివచ్చి ఆ వ్రేళ్ళకు ఆ బిగింపును కల్పించి ఉంచి ఆ బిగింపును నిరంతంగా ఉంచగలగడం వల్ల ఆ వస్తువు క్రింద పడకుండా ఉన్నది. మనిషిలోని ఏ శక్తి వలన ఇదంతా జరుగుతున్నదో ఆ శక్తికి ధృతి అని పేరు. ఇది ఏ ఒక్క శక్తి కార్యమూ కాదు. శరీరంలో ప్రాణశక్తి, విద్యుచ్ఛక్తి, మనశ్శక్తి, గ్రహణ శక్తి, మేధశ్శక్తి ఇవన్నీ ఉన్నాయి. ఈ శక్తులలో ఇదంతా ఒక్కదాని పనీ కాదు. ఇది అన్నీ కలిసి సామూహికంగా చేసిన పనే. ఇలాటి సామూహిక అంతఃకరణాన్ని జ్ఞానేం ద్రియాలనీ, కర్మేంద్రియాలను అదుపులో ఉంచుకుని వాటి చేత ఇచ్ఛానుసారంగా పనిచేస్తుంది పరమేశ్వరేచ్ఛ లేకప్రేరణ. ఇదే వాస్తవానికి ధృతి. ఇదే వాస్తవానికి బుద్ధి. ఇదే వాస్తవానికి కర్త, ఇదే వాస్తవానికి కర్మ. ఇదే వాస్తవానికి ప్రకృతి గుణాల నోళ్ళ లోని లగాము. పరమేశ్వరావలంబనం.

పరమాత్మ ఇప్పుడు త్రివిధాలైన సుఖాలను గూర్చి చెప్పుతున్నారు.

36. సుఖం త్విదానీం త్రివిధం శృణుమే భరతర్షభ!।
అభ్యాసా ద్రమతే యత్ర దుఃఖాన్తం చ నిగచ్ఛతి॥

తా: అర్జునా! అలవాటువలన మనుష్యుడు ప్రకృతి యందు రమిస్తూ క్రీడిస్తూ ఉంటాడు. కొన్ని సమయాల్లో ఆయా రమణము సుఖమూ దుఃఖమూ కల్పిస్తాయి. కొన్ని సమయాల్లో దుఃఖం శమించి సుఖస్వరూపం గోచరిస్తుంది. అట్టి సుఖం మూడు విధాలుగా ఉంటుంది. వాటి లక్షణాలు కూడా చెపుతాను విను.

37. యత్తదగ్రే విషమివ పరిణామేఽ మృతోపమమ్।
తత్సుఖం సాత్త్వికం ప్రోక్త మాత్మ బుద్ధి ప్రసాదజం॥

తా: ఏది ఆరంభంలో తీయగా ఉండకుండా విషతుల్యంగా అనిపించి పరిపక్వ స్థితి యందు అమృతోపమానంగా పరిణమిస్తుందో అది ఆత్మ యొక్క బుద్ధి యొక్క నైర్మల్యంవల్ల కలిగిన సుఖం సాత్త్వికసుఖ అనబడుతుంది.

సుఖం మొదట్లో విషతుల్యంగా ఎందుకుండాలి? చేదులేకుండా తీపి తెలీదు. బాధలేనిది జీవితంకాదు.

'కష్టం సుఖం మనస్సును బట్టి ఉంటుంది. ఈ రెండూ ప్రతివాడికీ తప్పవు. మనిషీ మనిషి నీడా ఎట్లాగో – ఈ రెండూ అట్లాగే. అమ్మ.

అగ్రే: జ్ఞానం వైరాగ్యధ్యాన సాధనా భ్యాస ప్రారంభం

లో(శం) యోగ ప్రారంభ సమయంలో(రా)=

ఆత్మబుద్ధి ప్రసాద జం: 1. తన బుద్ధి వినిర్మలతవలన కలిగినది.

2. ఆత్మావలంబన ప్రకర్షము వలన బుట్టినది (శం)

38. విషయేంద్రియ సంయోగాద్యత్త దగ్రేఽ మృతోపమ్।
పరిణామే విషమివ తత్సుఖం రాజసం స్మృతమ్॥

తా: ఇంద్రియాలకు విషయాలకు కలిగే సంయోగ ఫలితంగా అనుభవకాలంలో మొట్టమొదట అమృతప్రాయంగా తోచినా. చివరకు విషతుల్యంగా అనుభవానంతరం తోచే సుఖం రాజస సుఖం అనబడుతుంది. ఈ సుఖంవల్ల హానికూడా కలగవచ్చు.

39. యదగ్రే చానుబంధే చ సుఖం మోహనమాత్మనః।
నిద్రాలస్య ప్రమాదోత్థం తత్తామస ముదాహృతం॥

తా: ఇది నిద్ర ఆలస్యం, సోమరితనం, ఏమరుపాటు వీటివల్ల పుట్టుతుంది. అనుభవించేటప్పుడూ అజ్ఞాన మోహాన్ని కలిగిస్తుంది. అనుభవించిన తరువాత కూడా అజ్ఞానమోహాన్నే కల్పిస్తుంది. అటువంటి సుఖం తామస సుఖం అనబడుతుంది.

వ్యా: సుఖము దుఃఖము అనేవి మనోజనితములైన భావాలు. ఒకరికి సుఖంగా ఉండేది ఇంకొకరికి దుఃఖం కావచ్చు. అందటికీ ఒకేవిధంగా సుఖాన్ని కల్పించే వస్తువు ఏదీ లేదు. సూర్యోదయం, రాత్రించరులకూ, గుడ్లగూబకూ దుఃఖాన్ని కలిగిస్తుంది. దుఃఖం లేకుండా సుఖం అర్థం కాదు. ఉపాధి భేదాలని బట్టి మారే మనస్సే మనకు అవగతమౌతుంది. అనుభవంతో కనిపిస్తుంది. అన్నీ మారేవే. మనస్సు అనుభవం కూడా మారేదే. ఇవాళ సుఖంగా కనిపించనిగి రేపు సుఖదాయకం కావచ్చు. కాబట్టి సుఖమూ దుఃఖమూ రెండూ పరమాత్మ ప్రసాదించినవే అనుకోటంలో ఉండే సుఖమే నిత్యసుఖంగా నిర్ణయించుకోవచ్చు.

అనుబంధేన - అవసానోత్తర కాలంలో (శం) విపాకములో (రా).

40. న తదస్తి పృథివ్యాం వా దివి దేవేషు వా పునః।
సత్త్వం ప్రకృతిజై ర్ముక్తం యదేభి స్స్యాత్ త్రిభిర్గుణైః॥

తా: సత్త్వరజస్తమో గుణాలు ప్రకృతి నుంచి పుట్టినవి. ఈ మూడు గుణాల నుంచి విడుదలైన సత్త్వం ప్రకృతిలోనే లేదు. లేదు కాదు ఉండదేమో. ఈ భూమి మీదగాని, స్వర్గంలో కాని చివరకు దేవతలందు కూడా మళ్ళీ మళ్ళీ ఉండదనే చెప్పాలి

వ్యా: సత్త్వం - ప్రాణిజాతంగాని అప్రాణిజాతం గాని(శం)

"మనిషి పుట్టడంతోటే గుణాలు ఉత్పన్నమయినాయి. గుణాలు (చచ్చి) అన్ని వేళల్లో (నేను కూడా). ఒకటిగా ఉండడమనేది లేదు. (నాలో) అన్ని గుణాలు ఉన్నా పరిపూర్ణమవడంవల్ల వ్యక్తం కాకపోగా ఒకే భావం కలుగుతున్నది. నిండుగా ఉన్న ప్పుడు ప్రకోపించవు. ప్రేమ ఎట్లా ఉన్నదో ద్వేషమట్లాగే ఉన్నది. ప్రేమమారుతేనే ద్వేషం. నా బాధను బట్టే గదా నీ బాధ అర్థమవడం" అమ్మ.

41. బ్రాహ్మణ క్షత్రియ విశాం శూద్రాణాం చ పరంతప।
కర్మాణి ప్రవిభక్తాని స్వభావ ప్రభవైర్గుణైః॥

తా: పరంతపా! అర్జునా! స్వభావంవలన ప్రభవములైన గుణాలలోని భేదాల ననుసరించే బ్రహ్మణ క్షత్రియ వైశ్యశూద్రుల యొక్క కర్మములు నిర్ణయించబడి ఉన్నాయి.

వ్యా: మనుష్యులుచేసే కర్మలు వాళ్ళ స్వభావాన్ని అనుసరించి ఉంటాయి. స్వభావం జన్మతో వచ్చేది మఱి జన్మ పూర్వజన్మ కర్మవల్ల వచ్చేదని కర్మ సిద్ధాంత వాదులు అంటారు. ఆ కర్మను అనుసరించియే బ్రాహ్మణాది పూర్వ జన్మాలు కలుగు తున్నాయని కూడా వారంటారు. శాస్త్రాలూ అలాగే అంటాయి. కాని ప్రపంచంతో ఉన్న పరిస్థితులకు తగి ఉన్నాయా ఈ సిద్ధాంతాలు? బ్రాహ్మణ యోనిలో పుట్టినవాడు బ్రహ్మజ్ఞాని అవుతున్నాడా? శాస్త్రాలలో చెప్పబడ్డ క్షత్రియత్వం ప్రపంచములో ఎక్క డైనా మిగిలి ఉందా? కృషి వ్యాపారాలు, వాణిజ్యాలు చేసేవాళ్ళు అందఱూ వైశ్యకు లోద్భవులేనా? శూద్రులు సేవాధర్మాన్నే పాటిస్తున్నారా? ఈ మాటలకు వ్యాఖ్యాతలిచ్చే అర్థాలకు లోకంలో కళ్ళకు కనిపించే యథార్థ దృశ్యానికి పొత్తు కుదరటం లేదు. శాస్త్రాలు చెప్పాయని అమలులో లేని ప్రత్యక్షంగా ఋజువుకాని విషయాలను ఎలాగా స్వీకరించడం? ఇక్కడ చెప్పేమాట శాస్త్ర ప్రామాణ్యాన్ని గుఱించిన విషయం కాదు. వాటికి చెప్పిన వ్యాఖ్యానాల ప్రామాణ్యాన్ని గుఱించి. ఉదాహరణకు పైశ్లోకాన్ని తీసు కుందాం.

'స్వభావ ప్రభవైర్గుణైః' అనే మాటకు పుట్టుకతో వచ్చిన స్వభావ గుణాలచేత అనే అర్థంకాని, పుట్టుకతో వచ్చేవి తల్లిదండ్రుల కులానికి సంబంధించి ఉండాలని ఎక్కడ అర్థం ఉంది? బ్రాహ్మణుని స్వభావం ఆయా ప్రత్యేక గుణాలవల్ల నిర్ణయించబడు తుందంటే, ఆ గుణాలున్నవాళ్లు బ్రాహ్మణకులంలో పుట్టిన వాళ్ళందఱకూ ఈ గుణాలూ, శాస్త్రాధ్యయనం మీద ఆసక్తీ తప్పకుండా వస్తాయని ఎక్కడుందీ? స్వభావ

జన్యములైన గుణాలు కులానికే సంబంధించిన విషయాల్లో అంత అవిలంఘనీయ ములైతే, ఆ పురుషుణ్ణి అదే ప్రవృత్తిలో నడిపించగలిగినంత బలవచ్ఛక్తిని కలిగి ఉండాలి కదా. అతని స్వభావం కులంవల్లనే నిర్ణయించబడాలి కదా? మఱి అలా ఉండడంలేదే ప్రపంచ పరిస్థితి, సాంఘిక పరిస్థితీ. శాస్త్రం చెప్పిందని లేదా శాస్త్ర వచనానికి వ్యాఖ్యాతలు ఈ అర్థాన్ని చెప్పారని వాటినే ఎలాగా స్వీకరించి......

"శాస్త్ర ప్రమాణం దగ్గరికి వెళ్ళినప్పుడు మరి వీరుచేసే పనికి బ్రాహ్మణుడికి మరి ఉద్యోగమే పనికి రాదని శాస్త్రం ఉన్నది కదా! ఈ ఉద్యోగాలు రివాజుగా చేయవల్సిందేగా! వీడు యజ్ఞయాగాదులే కదా చేయాల్సింది. మొదట్లోనే దెబ్బతిన్నాడు కదా శాస్త్రం దగ్గఱకు పోతే" అన్నది అమ్మ.

'చాతుర్వర్ణ్యం మయాసృష్టంగుణకర్మ విభాగశః' అని పూర్వం చెప్పిన మాటలుగా ఇక ముందు చెప్పబోయే

'స్వభావజేన కౌన్తేయ నిబద్ధస్స్వేనకర్మణా।
కర్తుం నేచ్ఛసి యన్మోహా త్కరిష్య స్యవశోఽ పితత్॥

అనే శ్లోకంలో కాని పితృబీజంవల్లగాని, మాతృక్షేత్రం వల్లగాని, కులాచారాల వల్లగాని కులధర్మాల పారంపర్యంవల్లగాని జీవి స్వభావం నిర్ణయించబడుతుందని ఎక్కడా లేదు. స్వభావమూ గుణమూ పరమాత్మ ప్రసాదించినవే. ఒకవేళ బుద్ధి వితర్కంవల్లనో, అన్యప్రబోధల బలవంతం వల్లనో తాత్కాలికంగా స్వభావ విరుద్ధంగా జీవి ప్రవర్తించడానికి అనుకూలమైన పరిస్థితులు ఏర్పడ్డా స్వభావం బలీయమై అతనికి సహజమార్గంలో అతన్ని నడిపిస్తుంది. సంస్కారం, స్వభావం ఇవన్నీ పరమాత్మ ప్రసాదాలే.

గుణకర్మలవల్ల, స్వభావానుగుణంగా, చాతుర్వర్ణ్యం ఏర్పడే వ్యవస్థను విశదీకరించి, జన్మవల్ల కాక ఏయే గుణాలవల్ల బ్రాహ్మణ, క్షత్రియవైశ్య శూద్రులను ప్రజా బాహుళ్యంలో గుర్తించవచ్చో ఆయా గుణాలను ప్రత్యేకంగా పరమాత్మ చెపుతున్నారు.

42. శమో దమ స్తప శ్శౌచం క్షాన్తి రార్జవ మేవ చ।
జ్ఞానం విజ్ఞాన మాస్తిక్యం బ్రాహ్మం కర్మ స్వభావజం॥

తా: అంతరింద్రియనిగ్రహం, బహిరింద్రియ నిగ్రహం, తపస్సు, శౌచం, ఓరిమి, ఋజుస్వభావం, ఇంకా జ్ఞానం, విజ్ఞానం, ఆస్తిక్యం ఇవి ప్రకృతి సిద్ధంగా బ్రాహ్మణకర్మలు.

43. శౌర్యం తేజో ధృతి ర్దాక్ష్యం యుద్ధే చా ప్యపలాయనం।
దాన మీశ్వర భావశ్చ క్షాత్రం కర్మస్వభావజం॥

తా: శౌర్యము, పరాక్రమము, ధైర్యం, సామర్థ్యం యుద్ధంలో వెన్ను చూపక పోవడం, దాతృత్వం పరిపాలనా దక్షత్వం ఇవి స్వభావ సిద్ధంగా ఉండే క్షాత్రకర్మలు.

44. కృషిగోరక్ష వాణిజ్యం వైశ్యం కర్మ స్వభావజం।
పరిచర్యాత్మకం కర్మ శూద్ర స్యాపి స్వభావజం॥

తా: వ్యవసాయం, పశుపాలనం, వర్తకం ఇవి వైశ్యులకు స్వభావ సిద్ధమైన కర్మలు. శూద్రులకు సేవాధర్మము స్వభావ సిద్ధమైన కర్మం.

పైవిధంగా ఏయే గుణాలను బట్టి మనిషి ఏయే జాతికి చెందినవాడో నిర్ణయించ డానికి మార్గాలు చెప్పారు పరమాత్మ. ఎవరికైనా చెయ్యడానికి చేతయినదే కర్మ లేక సాధన. కర్మయే సాధన. చేత గానిది ఎవడూ చేయలేడు కదా! స్వభావమంటే పలానా పనిచేయడానికి ఉన్ముఖంగా ఉండే మనః ప్రవృత్తియేకాదు. దానికతని కుండే అధి కారం అది. దాన్ని తుదముట్టజేసే సామర్థ్యం కూడా అర్థమే. కొంతవఱకే చెయ్యగల గడం, మధ్యలో విడిచిపెట్టడం, తుదముట్టేదాకా విడిచిపెట్టకుండా ఉండడం ఇవన్నీ పరమాత్మ ప్రసాదించి వ్యక్తి శక్తి సామర్థ్య చక్రంలోనివే. నేను కర్మలు చెయ్యకుండా ఉందామనుకునే వాడికి నైష్కర్మ్యంరాదు. కర్మ సన్యాసం చేసిన వాడికి సిద్ధీరాదు. అన్ని దేవతలూ పరమాత్మ స్వరూపాలే. కనుక ఇష్టదేవతా పూజనాది కర్మలను చేయడంవల్ల అతనికి ఇష్టసిద్ధి కలుగనూ వచ్చు. కాని ఏ కర్మ జరగాలన్నా ఫలం దానికి లభించా లన్నా పరమాత్మ యొక్క క్రియాశక్తియే అయిదు రూపాలుగా అయిన శరీరము, కర్మ మనస్సుతో కూడిన ఇంద్రియాలు, కర్మ, దైవములనేవి కలిసి పనిచెయ్యాలి. శరీరం పనిచెయ్యడానికైనా దైవసాహాయ్యం అవసరం. కర్తగా ఒక క్రియకు అధినేత కావ డానికైనా దైవసాహాయ్యం అవసరం, మనస్సు ఆ పని మీద పని చేయడానికైనా ఇంద్రియాలు ఆ కార్యోన్ముఖంగా పనిచేయడానికై నా దైవసాహాయ్యం అవసరం. ఐదోది దైవానుగ్రహం కలగడానికైనా దైవసాహాయ్యం అవసరం ఈ విధంగా అయిదు కారణాలు పరమాత్మయే ఐ కర్మ స్వరూపుడౌతున్నాడు. కర్మ స్వరూపుడే కర్మపాక స్వరూపుడౌతున్నాడు. కర్మపాక స్వరూపుడే కర్మఫల స్వరూపుడౌతున్నాడు. ఇలా కావడం పరమాత్మ స్వభావమే పరమాత్మకు పరమాత్మ స్వభావమెలాగో బ్రాహ్మణు లకు బ్రాహ్మణుల స్వభావమలాగా; క్షత్రియులకు క్షత్రియుల స్వభావమలాగా; వైశ్యు లకు శూద్రులకు వారివారి స్వభావములాగా;

45. స్వే స్వే కర్మణ్యభిరతః సంసిద్ధిం లభతే నరః।
స్వకర్మ నిరత స్సిద్ధిం యథా విందతి తచ్ఛృణు॥

తా: అర్జునా! నరుడు తనకు స్వభావ సిద్ధమైన కర్మాన్ని ఆసక్తి కలిగిచేస్తూ ఉంటే తప్పక కర్మసిద్ధిని పొందుతున్నాడు. స్వకర్మనిరతుడై ఉన్నవాడు ఎలాగా సిద్ధిని పొందు తున్నాడో చెపుతా విను.

సిద్ధి:- సాక్షాత్సిద్ధి (మోక్షము) స్వకర్మ వలన కలిగే జ్ఞాననిష్ఠాయోగ్యతా లక్షణమైన సిద్ధిని (శం) పరమపదాన్ని (రా)

46. యతః ప్రవృత్తి ర్భూతానాం యేన సర్వ మిదం తతం।
స్వకర్మణా తమభ్యర్చ్య సిద్ధిం విందతి మానవః॥

తా: సర్వభూతాలకు పుట్టుక మొదలైన వ్యాపారం ఎవరి వలన కలుగుతున్నదో, ఎవనిచేత ఇదంతా వ్యాపించబడి ఎవడిదంతా అయిఉన్నదో అతనిని తన కర్మముల చేత అర్చనచేసి మానవుడు కర్మఫలసిద్ధిని పొందుతున్నాడు.

వ్యా: సృష్టి అంటే పరమాత్మ తానుగా అయిన కర్మం. ఆ సృష్టిలో భాగమయిన వాడు మానవుడు. పరమాత్మ అర్చనకు మరో రకమైన పూలు పనికిరావు. పర మాత్మకు ఏవిధంగా క్రియాశక్తి స్వాభావికంగా ప్రియమైనదో అట్లాగే స్వాభావికంగా తనకు ప్రియమైన కర్మలచేతనే పరమాత్మను ఆరాధించాలి. ఆరాధనలోనే సిద్ధి కూడా ఇమిడి ఉంది.

47. శ్రేయాన్ స్వధర్మో విగుణః పరధర్మా త్స్వనుష్ఠితాత్।
స్వభావ నియతం కర్మ కుర్వన్నా ౽ ౽ ప్నోతి కిల్బిషమ్॥

తా: బాగుగా అనుష్ఠింపబడిన పరధర్మం కంటెగుణం లేనిదయినప్పటికీ స్వధ ర్మాన్ని అనుసరించడమే మేలు. స్వభావ నియతమైన కర్మనుచేస్తే మనుష్యుడు ఎన్నడూ పాపాన్ని పొందడు.

వ్యా: అర్జునుడు భిక్షాటనం చేస్తానన్నాడు. విలునమ్ములు క్రిందపారేసి యుద్ధం చెయ్యనన్నాడు. అంటే స్వధర్మాన్ని నిరాకరించి పరధర్మాన్ని చేపట్టుతానన్నాడు. అలా చేస్తే అర్జునుడికి వచ్చే లాభం ఏమీ ఉండదనీ, స్వధర్మమైన యుద్ధాన్నే చేయమని పరమాత్మ ప్రోత్సహిస్తున్నట్లూ ఉంది.

48. సహజం కర్మ కౌన్తేయ! సదోషమపి న త్యజేత్।
సర్వారంభా హి దోషేణ ధూమేనాగ్ని రివా౽ ౽ వృతాః॥

తా: కౌన్తేయ! దోషసహితమైన దైనప్పటికీ సహజమైన కర్మను త్యజించరాదు. అగ్నిని పొగ గప్పుకొని ఉన్నట్లే కర్మములన్నింటిని దోషము కప్పుకొనియే ఉన్నది.

వ్యా: దోషంలేని కర్మఅంటూ లేదు. ఒకే కర్మ ఒకడికి సుఖమూ ఇంకోడికి దుఃఖమూ కూరుస్తుంది. ఆవుపాలు పోసి పెంచినా పులిపిల్ల పెద్దదై మాంసాన్నే కోరుతుంది. దోషభావన మనిషి మనస్సులోనే ఉంది. అదే మానవత్వం. మానవత్వంలోని పరిమితత్వం లోపమే. ఆ లోపంలేని మానవత్వమూ లేదు. ఆలోపచ్ఛాయ అయిన దోషం క్రమ్మని కర్మాలేదు కనుక సహజమైన కర్మను చేస్తున్నది నేను కాదనుకొని అహంభావాన్ని పోకడ బెట్టి, పరమాత్మయే నాచేత చేయిస్తున్నాడనే శరణభావంతో కర్మలు చేసిన వాడికి ఆ కర్మలనావరించి ఉన్న దోషచ్ఛాయలు వాడి మనస్సును పీడించవు.

49. అసక్త బుద్ధి స్సర్వత్ర జితాత్మా విగతస్పృహః।
నైష్కర్మ్య సిద్ధిం పరమాం సన్న్యాసే నాధిగచ్ఛతి॥

తా: సమస్త విషయాలలో తగులుబాటులేని బుద్ధిగలవాడున్ను, ఆత్మను జయించిన వాడున్ను కోర్కెలు నశించిన వాడున్ను సన్యాసం చేత ఉత్కృష్టమైన నైష్కర్మ్యసిద్ధిని పొందుతున్నాడు.

వ్యా: జితాత్ముడంటే ఆత్మ కర్తృత్వం మీద స్పృహ లేనివాడు.

సర్వత్రదారాపుత్రాదులందు (శం) ఫలాదులందు(రా).

సన్యాసేన: సమ్యగ్దర్మన పూర్వకమైన సర్వకర్మ సన్న్యాసం చేత (శం) త్యాగం కంటె వేఱుకాని నిర్ణీతమైన సన్యాసంతో కూడినవాడై కర్మలను చేస్తూ (రా) నైష్కర్మ్య సిద్ధి, సద్యోముక్తి రూపమైన నిష్కయత్వసిద్ధి (శం) పరమధ్యాననిష్టను; జ్ఞానయోగానికి ఫలభూతమును (రా).

నైర్మల్యం, బ్రహ్మనిష్ఠ, ఆత్మధ్యానం, ఆత్మావలోకం, ఆత్మానుభూతి, ఇలాటి దైవికమైన గుణాలు అసక్త బుద్ధులకు, జితాత్ములకు వాటి అంతట అవే చుట్టుకుంటాయి. అప్పుడు నైష్కర్మ్యసిద్ధి అతనికి లభిస్తుంది. అంటే కర్మలు అతన్నే విడుస్తాయి అని ఈ శ్లోకాలలో కర్మయోగాన్ని చెప్పారు. వచ్చే శ్లోకాలలో జ్ఞానయోగాన్ని చెపుతారు.

50. సిద్ధిం ప్రాప్తో యథా బ్రహ్మ తథాఽఽప్నోతి నిబోధ మే।
సమాసేనైవ కౌంతేయ! నిష్ఠా జ్ఞానస్య యా పరా॥

తా: అర్జునా! సిద్ధిని ప్రాప్తించిన వాడు ఏవిధంగా బ్రహ్మమును పొందుతాడో, ఉత్కృష్టమైన జ్ఞాన నిష్ఠా ప్రకారం ఎలా ఉంటుందో ఆ విషయాన్ని సంగ్రహంగా చెపుతాను విను.

51. బుద్ధ్యా విశుద్ధయా యుక్తో ధృత్యా ఽ త్మానం నియమ్యచ।
శబ్దాదీన్ విషయాన్ త్యక్త్వా రాగద్వేషౌ వ్యుదస్య చ॥

52. వివిక్తసేవీ లఘ్వాశీ యత వాక్కాయ మానసః।
ధ్యాన యోగపరో నిత్యం వైరాగ్యం సముపాశ్రితః॥

53. అహంకారం బలం దర్పం కామం క్రోధం పరిగ్రహం।
విముచ్య నిర్మమ శ్శాంతో బ్రహ్మ భూయాయ కల్పతే॥

తా: గీతలో పైమూడు శ్లోకాలు తలమానికాలవంటివని చెపుతారు. కంఠస్థం చేసుకొని నిత్యమూ పటించదగ్గవని కూడా అంటారు.

దీని కర్థం ఇది.

యథావస్థితమైన బుద్ధితో కూడుకున్న వాడై సహజమైన ధైర్యంతో ఆత్మను నియమించి, శబ్దాది విషయాలనుత్యజించి, రాగద్వేషభావాలను రెండింటిని విడిచి పెట్టి, ఏకాంత స్థలవాసి, మితాహరి ఐ, వాఙ్మనః కాయాలను అదుపులో ఉంచుకొని. ధ్యానయోగదీక్ష కలవాడై, నిత్యమూ విరక్తి భావాన్ని అవలంబించిన వాడై, అహం కారం, బలం, దర్పం, కామం, క్రోధం, ద్రవ్య సంపాదన అనే వాటిని వదిలిపెట్టుకుని, మమకారం లేనివాడై పురుషుడు బ్రహ్మభావాన్ని పొందడానికి సమర్థుడౌతున్నాడు.

వ్యా: బుధ్యావిశుద్ధయా యుక్తా అంటే సంశయవిపర్య యరహితమైన బ్రహ్మాత్మ తత్వ నిశ్చయం కలవాడై (శం) యథావస్థితాత్మ తత్వ విషయమైన బుద్ధితో రా)

త్యక్త్వా: సామర్థ్యంవల్ల కేవలం శరీర స్థితికవసరమయ్యేవి తప్ప మిగతా సుఖార్థాలను విడిచి (శం) దగ్గఱకు రాకుండా చేసి(రా).

వివిక్త సేవీ: అరణ్యం, నదుల యందలి ఇసుక తిన్నెలు, పర్వత గుహలు, మొదలైన ఏకాంత ప్రదేశాలలో నివసించేవాడు (శం) సమస్తమైన ధ్యానవిరోధుల చేత విడువబడ్డ స్థలాలలో నివసించేవాడు (రా)

విముచ్య: పరమహంస పరివ్రాజకుడై (శం)

బ్రహ్మ భూయాయ – బ్రహ్మ సాక్షాత్కార కోసం (నందగిరి) ఆత్మానుభవం కోసం (రా) ఎల్లప్పుడు బ్రహ్మమునందు దృష్టి నిలుపుట కొఱకు (మధ్వ)

పై మూడు శ్లోకాలలో పరబ్రహ్మను భూతిని పొందడానికి అధికారం కలగడానికి మనుష్యుడు ఏమేమి చేయాలో ఆ విషయాలను పరమాత్మ వివరించారు. 'అహంబ్రహ్మాస్మి' 'తత్త్వమసి' ఇత్యా దిమహావాక్యాలు పూర్వం నుంచి ఉండనే ఉన్నవి. వాచ్యార్థాన్ని పట్టుకునే వాదోపవాదాలు వాగ్యుద్ధాలు పండితులు చేస్తారు. వాద ప్రియులకు అందులోని వాచ్యార్థం మీదనే ప్రీతికాని అందులోని అర్థాన్ని అనుభూతికి తెచ్చుకునే ఆర్తి ఉండదు. ఎప్పుడు శరీరంలోని అణువణువూ ఈ మహావాక్యంలోని అర్థానుభూతితో పులకించిపోతూ ఉంటుందో అదే బ్రహ్మానుభూతి అవుతుంది. సృష్టిలో ఉన్న విషయాలే రెండు. చిన్నరూపమూ - పెద్ద రూపమూ - అణువు మహత్తు. అణువు మహత్తుగానూ మహత్తు అణువుగానూ మారడమే సృష్టి. మహత్తు నంతటినీ అణువులోనూ అణువునే మహత్తునంతటిదాన్ని గానూ చూచే అను భూతియే బ్రహ్మకైవల్యం. వైకల్యం లేకపోవడమే కైవల్యం అన్నది అమ్మ. అప్పుడు సర్వము సామాన్యమైపోగా సర్వసామాన్యమవుతుంది అదే మనస్సు చేరుకోగల సంపూర్ణ స్థాయి. 'సంపూర్ణ స్థాయి అంటే ఏమీ తెలియని, అంతా తెలిసిన స్థితి' 'సర్వకాల సర్వావస్థల యందూ ఉండే సమానస్థితి.

ఈ స్థితిని చేరుకోగలగడానికి కల్తీలేని బుద్ధి ఉండాలి. బుద్ధికి తోడు ధృతి ఉండాలి. ఈ రెండు కలియడంవల్ల మనస్సు మనం అనుకున్నట్లు నడవాలి. మనస్సు అనుకున్నట్లు మనం నడవడంకాదు. ధృతివల్ల ఆత్మను ఆత్మ రమణ మందే నిలప గలడంవల్ల త్యాగం అబ్బుతుంది. ఏది వచ్చినా నిర్మలంగా అనుభవించడమే త్యాగం. దేనికీ జడవకపోవడమే త్యాగం. నేను, నాది మర్చిపోయేది త్యాగమే. ఏదో ఒక్క విషయంలో ఉండి తతిమ్మా వాటిల్లో లేకపోతే ఆ విషయంలో మంచి త్యాగిలెండి అంటారు. అన్నింటిలో ఉన్నప్పుడు అంటే త్యాగము యొక్క చరమదశ సర్వసంగ పరిత్యాగం. అన్నీ కావాలనేదీ త్యాగమే. ఏమీ వద్దనేదీ త్యాగమే. సంపూర్ణ స్థితి ఏదైనా సరే త్యాగమే. సంపూర్ణ స్థితి ఎలా ఉంటుందంటే - అమ్మ ఒకసారి చెప్పినట్లు-

చక్కెర రుచిగా ఉందని చెపుతాం, చక్కెరే అయినపుడు రుచి ఏది? తాను వేరై రసం, రుచి, అరుచి, తీపి అయి అన్నీ తానయి తానుగాకుండా చూడటం. ఈ స్థితి వచ్చినప్పుడు రాగద్వేషాలు వాటంతటవే రాలిపోతాయి.

అలాంటి వాడు ఏకాంతంగా ఉండాలా అంటే కొండగుహలు, నదులలోని ఇసుక తిన్నెల మీద నివాసం ఏకాంత నివాసం అన్నారు వ్యాఖ్యాతలు. అమ్మ అలా అనదు.

'తాను సంసారంలో ఉండవచ్చును. తనలో సంసారం ఉండరాదు. తనలో

సంసారం ఉండరాదంటే ఏకాంతాన్ని ఆత్మద్వితీయగా చేసుకోడం అన్నమాట.

లఘ్వాశీ అనే మాటకు పంచభూతాలనుంచి చెట్ల లాగా ఆహారాన్ని గ్రహించి 'అమ్మలా బ్రదకడం ఉత్తమోత్తమ స్థాయి ఐనా- శరీరధారణకు అవసరమైన ఆహార మని అర్థం. దానికైనా తన నోటితోనే తిననక్కరలేదు ఏ జీవి నోటితో తిన్నా తనకు చేరుతుంది. త్రికరణాలకు లగాం పడి ఉండడం. పరమాత్మ ధ్యాసలోనే ఉండడం ధ్యానం. సర్వత్రా సమానంగా అనురాగం కలిగి ఉండడమనే విరాగం కలిగి ఉండడం విషయేంద్రియాలను విడిచిపెట్టడం ఇవన్నీ బ్రహ్మానుభూతికి రోడ్డు వేస్తాయి అని పరమాత్మ చెపుతున్నారు. మఱి ఆత్మ దర్శనమంటే ఏమిటి – నిర్వికల్ప సమాధి స్థితి అని వ్యాఖ్యాతలంటారు.

అహంకారము దర్పకామక్రోధాలు పరిగ్రహమూ – ఇవన్నీ ఒకదాని నుండి ఇంకోటి పుట్టే స్వభావం కలవి. అవి పరమాత్మ అనుగ్రహంవల్ల యథా సేతువులై పోతాయి. ఆనకట్ట నీళ్ళు ఆగి ఉన్నా నీళ్ళుపోతున్నా దానికి లంపట మాత్రం ఉండదు కదా!

"శ్వేతాశ్వతరంలో అన్నట్టుగా సమాధిలో సర్వమూ అయిన ఆత్మయే ఈ జగత్తు సర్వమూ అయివచ్చినదన్న విశ్వాసముతో "అదే అగ్ని, అదే ఆదిత్యుడు, అదే వాయువు, అదే చంద్రుడు, అదే వెలుగు అమృతము. బ్రహ్మ, నీరు, ప్రజాపతి, నీవు స్త్రీవి నీవు పురుషుడవు, నీవు కుమారుడవు, కుమారివి. నీవు కఱ్ఱపోటేసుకుని నడిచే వృద్ధుడవు. నీవు నీలపతంగము, ఆకుపచ్చని ఎఱ్ఱకళ్ళ చిలకవు. వర్షమేఘానివి, ఋతువులు, సముద్రాలు విశ్వభువనాలు దేని నుండి పుట్టినవో అది నువ్వు (4, 2, 3, 4) అని మననము చేసుకోవాలి. సమాధిస్థితిలోని మహాంత తేజము అప్పుడగు నిజ మైనట్లే. దాని నుండి పుట్టిన విశ్వము జాగ్రత్తలో నిజం. మారనిదీ మారేదీగా ఉన్న అయిన, సర్వమూ నిజమే నన్ను స్ఫురణ ఉన్నప్పుడే 'అహంభోజనంనైవ భోక్తా న భోగం, చిదానంద రూపో' శివోహం శివోహం. అన్న అభిప్రాయము, అన్నం బ్రహ్మ, భోక్తా బ్రహ్మ, అహంచబ్రహ్మ "అన్న మననములోనికీ, క్రమముగా సహజసమాధికీ దారితీయగలదు" శ్రీపాద.

ఇంతవఱకు పరమాత్మ జ్ఞానయోగాన్ని గూర్చి చెప్పారు. ఇక భక్తియోగాన్ని గూర్చి చెపుతున్నారు.

54. బ్రహ్మభూతః ప్రసన్నాత్మా న శోచతి న కాంక్షతి।
సమస్సర్వేషు భూతేషు మద్భక్తిం లభతే పరామ్॥

తా: బ్రహ్మభూతుడై ప్రసన్నాత్మ నొందినవాడు దేనికొఱకును శోకింపడు. కాంక్షింపడున్నూ, సర్వభూతాల యందు సమత్వ బుద్ధికలిగి, నా యందలి ఉత్తమ భక్తి కలవాడౌతున్నాడు.

వ్యా: బ్రహ్మభూతః ప్రసన్నాత్మా: బ్రహ్మమేనేనని పరమానందా విర్భావం చెందినవాడు (శం) ఆవిర్భూతమైన అపరిచ్ఛిన్నజ్ఞానై కాకారమును, మచ్ఛేషత్వైక స్వభావమునగు ఆత్మస్వరూపం కలవాడు, క్లేశకర్మాదులచే కలుషంగాని శరీరం కలవాడు(రా)

మద్భక్తిం: పరాం పరమేశ్వరుడనగు నాయదుత్తమమైనదీ, జ్ఞానలక్షణమైనదీ అయిన చతుర్థభక్తిని (శం) కల్యాణరూపుడనగు నాయందు అత్యంత ప్రియానుభవ రూపమగు పరమభక్తిని (రా)

55. భక్త్యా మా మభిజానాతి యావాన్ యశ్చాస్మి తత్వతః।
తతో మాం తత్త్వతో జ్ఞాత్వా విశతే తదనన్తరం॥

తా: భక్తి చేత మొట్టమొదట నేనెలాటి వాడనో ఎంతటివాడనో ముందుగా అనే వాస్తవాన్ని తెలుసుకుని, ఆ నిజస్థితిని స్వయంగా తెలుసుకున్న తరువాత తోడనే నా యందు ప్రవేశిస్తున్నాడు.

వ్యా: నా స్వరూపమును తత్వతః తెలుసుకోవడానికి భక్తునికి జ్ఞానమే మొదటి అధికారం. భక్తి అంటే ప్రీతిపూర్వకమైన జ్ఞానమే. దీన్నే పరాభక్తి అంటారు. ఇటు వంటి భక్తుని ప్రేమ పరమాత్మ ప్రేమనాకర్షిస్తుంది. యావాన్ అంటే తాను ఎంత వాడనో యశ్చా తాను ఎట్టివాడో ఆవిభూతి విశ్వరూప ప్రదర్శన యోగాలలో పర మాత్మ నిజస్వరూపాన్ని చూపే ఉన్నాడు. అటువంటి జ్ఞానంవల్ల కలిగిన భక్త్యతిశయం వల్లనే నాలో నా భక్తుడు ప్రవేశిస్తున్నాడు అంటే నేనే అవుతున్నాడు. సాకార, సారూప్య, సాయుజ్యాలను పొందుతున్నాడు. భక్తివల్లనే ఆజ్ఞానమూ లభిస్తుంది. పరాభక్తికీ జ్ఞానానికీ భేదం లేదు. ఇటువంటి ఉత్తమ స్థితి కలిగిన తరువాత కూడా అతడు కర్మలను చేస్తూనే ఉంటాడు.

56. సర్వ కర్మాణ్యపి సదా కుర్వాణో మద్వ్యపాశ్రయః।
మత్ప్రసాదా దవాప్నోతి శాశ్వతం పద మవ్యయమ్॥

తా: ఎల్లప్పుడూ సర్వకర్మలను చేస్తూ ఉన్నవాడైనప్పటికీ, నా అనుగ్రహాతిశ యము వలన నన్ను ఆశ్రయించినవాడు శాశ్వతమూ అవ్యయమూ అయిన స్థానాన్ని పొందుచున్నాడు.

వ్యా: దేనికైనా పరమేశ్వరుని అనుగ్రహమే ప్రేరణయే కారణం. 'భగవంతుడి కటాక్షం ఎప్పుడూ ఉన్నది. కాని నువ్వు అనుకున్నది అనుకున్నట్లు జరిగినప్పుడు దాని గుర్తిస్తావు" అమ్మ.

కాబట్టి మనం అనుకోటం ఎప్పుడో పరమాత్మ కటాక్షాన్ని కలవడం ఎప్పుడో అనే సందిగ్ధస్థితి లేకుండా ఉండడానికి సర్వకాల సర్వావస్థల యందు మనం పరమాత్మను స్మరిస్తూ ఉండాలి.

సర్వకర్మాణ్యపి: నిషిద్ధ కర్మలను గూడ (శం) కామ్య కర్మలను గూడ (రా).

మద్వ్యపాశ్రయం: నేను ఈశ్వరుడను అని మదర్పితమైన సర్వాత్మ భావంకల వాడు (శం) నా యందు సన్యసింపబడిన కర్తృత్వాదికం కలవాడు(రా).

57. చేతసా సర్వ కర్మాణి మయి సన్న్యస్య మత్పరః।
బుద్ధియోగ ము పాశ్రిత్య మచ్చిత్త స్సతతం భవ॥

తా: వివేకబుద్ధితో సర్వకర్మలను నాయందు సన్యసించి నేనే పొందదగిన స్థానంగా చక్కగా తెలుసుకుని, బుద్ధియోగాన్ని ఆశ్రయించి సర్వకాల సర్వావస్థల యందు నా మీదనే మనస్సును నిలిపిఉంచు.

వ్యా: బుద్ధియోగం అనే మాట ఇదివఱకు రెండో అధ్యాయంలోను పదో అధ్యాయంలోను రెండుసార్లు వచ్చింది.

'దూరేణహ్యవరం కర్మబుద్ధి యోగాద్ధనంజయ!' సమత్వబుద్ధి ప్రధానమైన యోగముకంటె కర్మ చాలా తక్కువైనదికదా - అని ఇక్కడ అర్థం చెప్పుకున్నాము.

తేషాంసతత యుక్తానాం భజతాం ప్రీతి పూర్వకం
దదామి బుద్ధి యోగం తం యేన మా ముపయాన్తితే

అంటే ఎప్పుడూ నాయందే మనస్సు కలవాళ్ళే నన్నే పరమ సంతోషంతో భజించే వారికి శాశ్వతమైన మోక్షమును అనుభవించడానికి బుద్ధియోగాన్ని ఇస్తు న్నాను. అని అర్థం.

ఇక్కడ బుద్ధియోగం అనే మాటకు, సమ్యగ్దర్శనంతోడి సంబంధం అని శంక రులూ బుద్ధి యోగమనే పరిపాకదశను పొందిన దానిగా అని రామానుజులూ అర్థం చెప్పారు.

(నిర్వికుల్ప) సమాధి అనుభవము కన్నుమూసిన చీకటికి అవలిది. అది అభావము (ఏదీ కానిది) మాత్రం కాదు. ఈ అనుభవం అందకముందుండిన

చీకటితో దీనిని పోల్చి ఈ అనుభవాన్ని 'వెలుగు' అన్నారని నాకనిపిస్తున్నది. ఏమంటే మామూలు దృష్టికీ, చెవికీ, శరీరానికీ అందే వెలుగూ శబ్దమూ స్పర్శా పరిహరించి కదా ధ్యానం చేశారు? ఇంద్రియాలకు గోచరించే వెలుగు నాదమూ వంటిది కాదు సమాధి అనుభవం. అయితే వర్ణించినప్పుడు ఇంద్రియగోచర విషయములను దాటి మాటలు పోలేవు కనుక 'వెలుగు' అన్నారు. చాలా ఉపనిషత్తులలో కఠమహర్షి మొదటలో 'ప్రత్యగాత్మ'ను ఎవడో ధీరుడు చూస్తాడు అన్నాడు, (కశ్చిద్ధీరః ప్రత్యగాత్మాన మైక్షత్)

శ్వేతాశ్వతరుడు దానినే 'దేవాత్మకశక్తి' అన్నాడు దానినే మళ్లీ 'ఆదిత్యవర్ణం' అన్నాడు చాలా ఉపనిషత్తులు 'శుక్రం' అన్నయ్యి – అది సమాధి అనుభవం – ఈ అనుభవాన్ని గుర్తించేదే బుద్ధియోగం.

58. మచ్చిత్త స్సర్వదుర్గాణి మత్ప్రసాదా త్తరిష్యసి।
అథ చేత్త్వ మహంకారా న్న శ్రోష్యసి వినంక్ష్యసి॥

తా: నాయందే నీవు చిత్తాన్ని అంకితం చేసి ఉన్నట్లయితే నాయనుగ్రహం వలన నీవు సర్వదుస్తర ఘట్టాలను దాటగలిగిన వాడవౌతావు. అలాకాకుండా అహంకార గర్వంతో నాయీ పరమోపదేశాన్ని వినకపోతే నశిస్తావు.

వ్యా: నీకు చెప్పిన మాటలలో నేనే యజ్ఞాన్ని నేనే కర్తను, నేనే కర్మను, నేనే భోక్తను అని పలుసార్లు చెప్పి ఉన్నాను. నీవే కర్మచేసినా నేనే చేయిస్తున్నాని నమ్మిచేస్తే నీకే బాధ్యతా ఉండదు హాయిగా, నిష్పూచీగా, స్వతంత్రంగా అనిబద్ధంగా కర్మలు చెయ్యవచ్చు. చేతస్సు నా యందు సన్యసించి కర్మలు చెయ్యి. అటువంటి స్థితిలో బుద్ధి యోగంతో చిత్తం నా యందే లయమౌతుంది. ఈ మాటలను నీవు వినకపోతే నీ అహంకారమే నీ నాశనానికి దారితీస్తుంది. అని పరమాత్మ అర్జునుడికి కర్తవ్యాన్ని పథ్యాన్ని బోధించారు,

59. యద్యహంకారమాశ్రిత్య న యోత్స్య ఇతి మన్యసే।
మిథ్యైష వ్యవసాయ స్తే ప్రకృతి స్త్వాంనియోక్ష్యతి॥

తా: పనికి మాలిన అహంకారాన్ని పైన వేసుకుని నేను యుద్ధం చేయనని నీవు నిరాకరించి ఊరుకున్నా నీ ప్రయత్నం చెల్లేది కాదు నీ ప్రకృతి యే అంటే స్వభావ సిద్ధంగా నీకబ్బిననీ క్షత్రియ స్వభావమే నీ చేత యుద్ధం చేయించి తీరుతుంది.

వ్యా: నేను నీకు చెప్పవలసినది చెప్పాను. అయినా నీవు నీ మనసులో ఇలా అనుకోవచ్చును. నా హితాహితాలను నేనే నిర్ణయించుకోగలను. నీవెవడవు నాకు

చెప్పడానికి. అని యుద్ధం చెయ్యననుకుని ఊరుకున్నా నీ శరీరం నీచేత ఆ పని చేయించి తీరుతుంది. ప్రకృతి నీ చేత ఆపని చేయించి మోహంతో నిన్ను బంధిస్తుంది. ఇప్పుడైతే నా బోధను విని యుద్ధంచేస్తే స్వతంత్రుడవై యుద్ధం చేస్తావు. నేను కర్తను కాను. పరమాత్మ ఉపకరణంగా ఈ కర్మను చేస్తున్నావనుకుంటావు. ప్రకృతి చేతిలో బడితే అవశుడవై చేస్తావు. అంటే అమ్మ అన్నట్లు ఇదే మాట అనుభవంలోకి రానం దున మాయగా పరిణమిస్తుంది. అనుభవంలోకి వచ్చినప్పుడు బ్రహ్మ వాక్యంగా అవుతుంది.

60. స్వభావజేన కౌంతేయ! నిబద్ధ స్స్వేన కర్మణా।
కర్తుం నేచ్ఛసి యన్మోహా త్కరిష్య స్యవశోఽ పి తత్॥

తా: అర్జునా! అజ్ఞాన మోహంచేత నీవొకానొక పనిని చేయడానికి సమ్మతించ పోయినప్పటికీ నీ ప్రకృతి స్వభావం చేతనే బలవంతంగా కట్టబడిన వాడవై అదే పనిని నీవు చేయవలసిన వాడవౌతావు.

61. ఈశ్వర స్సర్వభూతానాం హృద్దేశోఽ ర్జున! తిష్ఠతి।
భ్రామయన్ సర్వభూతాని యన్త్రారూఢాని మాయయ॥

తా: అర్జునా! తానే అయిఉన్న సర్వభూతాల దేహయంత్రాలను అధిరోహించి వాటి హృదయ దేశములందు నిలిచి ఉండి ఈశ్వరుడు మాయచేత కీలుబొమ్మలవలె వాటిని త్రిప్పుచున్నాడు.

వ్యా: 15వ అధ్యాయంలో కూడా 'సర్వస్యచాహం హృది సన్నివిష్టో' అని ఇది వఱలో పరమాత్మ చెప్పి ఉన్నారు.

"అనుభవంలోకి రానప్పుడు మాయగా అనుభవం వచ్చినప్పుడు బ్రహ్మగా ఉంటాడు దైవం". అన్నది అమ్మ.

"మాయాంతు ప్రకృతిం విద్యాన్మాయినంతు మహేశ్వరం" శ్రుతి.

62. తమేవ శరణం గచ్ఛ సర్వభావేన భారత!॥
తత్ప్రసాదా త్పరాం శాన్తిం స్థానం ప్రాప్స్యసి శాశ్వతమ్॥

తా: అర్జునా! ఆ ఈశ్వరుడినే శరణు పొందుము. సర్వభావములచేత శరణు పొందావంటే ఈశ్వరానుగ్రహం వలన పరమమైన శాంతిని పొందగలుగుతావు. శాశ్వత స్థానాన్ని కూడా అంటే నిత్యతృప్తిరూపమైన మోక్షాన్ని కూడా పొందగలవు.

వ్యా: శాంతి అంటే సంసారోపరతి అంటారు శంకరులు – కర్మ బంధోప శమనము అంటాడు (రా) 'తృప్తియే మోక్షం' అమ్మ.

63. ఇతి తే జ్ఞాన మాఖ్యాతం గుహ్యా ద్గుహ్యాతరం మయా
విమృశ్యైత దశేషేణ యథేచ్ఛసి తథా కురు॥

తా: ఈ విధంగా రహస్యాలలో కల్లా గుహ్య తమమైన గీతా శాస్త్ర జ్ఞానాన్ని నీకు చెప్పాను. దీనిని సాకల్యంగా విమర్శించి, పరిశీలించుకుని నీఇచ్ఛ ఎలా ఉంటే అలా చెయ్యి.

వ్యా: ఈ జగత్తంతా ఒక రంగులరాట్నం. అందులో పెద్దపులులూ, సింహాలూ, లేళ్ళూ, ఏనుగులూ, ఇటువంటి బొమ్మలను వాహనాలుగా అమర్చి పరమేశ్వరుడు దానిని త్రిప్పే భాగంగా ఉండి తాను యంత్రాన్ని త్రిప్పుతున్నాడు. ప్రతీ భూతం ఏదో వాహనం మీద ఎక్కి మహాసంతోషంగా తిరుగుతున్నది. తిరిగే శక్తి త్రిప్పేశక్తి పరమేశ్వరుడిదే. కూర్చున్నవాళ్ళూ తన రూపాలే తన అవయవాలే. హృదయదేశం వేఱుగా అవయవాలు వేఱుగా ఉన్నట్లు కనిపిస్తున్నది. జగత్తనే రంగుల రాట్నమూ యంత్రమే – శరీరమూ యంత్రమే – రెంటికీ త్రిగుణాత్మకమైన బంధం ఎక్కడికక్కడే మాయ. ఒక్కొక్కసారి ఈ తిరగడం ఉల్లాసకరంగా ఉంటుంది. ఒక్కొక్కసారి కళ్ళు తిరిగిపడిపోతున్నట్లుంటుంది. ఈ కళ్ళు తిరిగినప్పుడు క్రిందికి దిగిపోదామంటే మన చేతుల్లో ఏమీ లేదు. మానవుడు స్వతంత్రుడు కాడు. ఈశ్వరుడు హృదయస్థానంలో ఉండి అన్ని భూతాలను మాయచేత యంత్రారూఢంగా త్రిప్పుతున్నాడు. కాబట్టి వాడినే ఆశ్రయించాలి. మోతాదు మించకుండా ఈ యంత్రాన్ని త్రిప్పకుండా ఉండడానికి త్రిప్పాడా అంటే కళ్ళు తిరిగి పడిపోతాయి అన్ని భూతాలు. అందువలన వాడినే శరణు వేడుకోవాలి 'తమేవ శరణం గచ్ఛ' ఈ ఏవ అనే పదం పరమాత్మ వారం వారం వాడుతాడు. అతనినే, అతడు తప్ప ఇంకెవరినీ కాదు అని నొక్కినొక్కి చెప్పడానికి. జ్ఞానాల్లోకి ఉత్తమోత్తమమైన జ్ఞానం. ఈ సంసారమంతా వాడే అయిన వాడు. స ఏవ – అతనినే శరణు పొందాలి తమేవ. గుహ్యం అంటే రహస్యమైనది అని అర్థం. గుహ్యాతమం అని Superlative విశేషణం వేసి చెప్పడంలో అర్థం ఇంకా ఎవరూ ఇంతకంటే చెప్పగలిగింది లేదు. రహస్యాలలోకెల్లా మిక్కిలి రహస్యమయినదిది. దీన్ని నీకు బోధించినాను. నేను ఉన్న విషయం ఉన్నట్లుగానే చెప్పాను. నీవు ఈ రహస్యాన్ని తెలుసుకుని, నేను చెప్పినట్లు నీ స్వధర్మమైన యుద్ధాన్ని చెయ్యి. అలా నామాట వినకపోయినా, నా ప్రకృతి బలవంతంగా నీచేత ఆపని చేయిస్తుంది. నేను చెప్పిన మాటలు లెస్సగా పరిశీలించుకుని నీకేది నచ్చితే ఆ మార్గం అనుసరించు అన్నారు పరమాత్మ.

ఈ జ్ఞానం కరణవ్యుత్పత్తిచే గీతాశాస్త్రమే అని బోధపడుతుంది (శ) కర్మజ్ఞాన భక్తి యోగ విషయం సర్వస్వమూ (రా)

యథేచ్ఛసి తథాకురు అంటే జ్ఞానము కాని కర్మకాని యేది ఇష్టమో దానిని చెయ్యి (శం) కర్మయోగంకాని, జ్ఞానయోగంకాని, భక్తియోగం కాని నీ యిష్టము వచ్చినట్లు చెయ్యి (రా).

కర్తృత్వం నెత్తిమీద పెట్టుకోక పరమేశ్వరుడే నన్ను ప్రేరణచేసి చేయిస్తున్నాడని నమ్మి నీకు తోచినట్లు చెయ్యి అని అమ్మ.

64. సర్వ గుహ్యతమం భూయ శ్శృణుమే పరమం వచః।
ఇష్టోఽసి మే ధృఢమితి తతో వక్ష్యామి తే హితమ్॥

తా: నీవు నాకు మిక్కిలి ప్రియమైనవాడవు. కాబట్టి నీ మేలుకోరి అన్నింటిలోకి అత్యంత రహస్యమైన మిక్కిలి ప్రశస్తమైన మాట నొకదాన్ని చెపుతాను విను.

వ్యా: ఇందాక చెప్పిన మాటే గుహ్యోద్గుహ్య తమం అని పరమాత్మ చెప్పారు. దానితో తనివి చెందక పరమాత్మ అంతకంటె ప్రశస్తమైనది, అంతకంటె రహస్యమైనది. అన్నింటికంటే ఉత్కృష్టమైనది అయిన ఒక మాటను చెపుతానంటున్నారు. ఎందుకంటే సామాన్యులకయితే ఈ సంగతి చెప్పేవాడు కాదేమో. నీవు ఇష్టోసి నాకు చాలా ప్రియతముడవు కాబట్టి నీ మేలును గోరి చెపుతున్నానని చెప్పారు పరమాత్మ. పరమాత్మకు భక్తులంటే ఎంత ఇష్టమో దీనివలన తెలుస్తున్నది. గుహ్యోద్గుహ్య తమాల కంటే కూడా గుహ్యతమమైన చెప్పబోయేమాట నిజానికి ముత్యాల మూటవంటిదే. ఆస్తిక లోకానికి పంచిపెట్టిన ఆస్తి ఇది. ఇదే జ్ఞాన ప్రాప్తి సాధనము. ఇదే భక్తియోగానికి అవధి. మహర్షులు కూడా ఏ హిమాలయ పర్వత గుహల్లోకో శిష్యులను తీసుకునిపోయి చేసే మహోపదేశాలు కూడా ఇలాగే ఉంటాయి. అర్జునా! ఇన్ని రహస్య సాధనాలు నేను చెయ్యగలనా అని నిర్వేదం చెందవద్దు. సులభమార్గం చెబుతా విను.

65. మన్మనాభవ మద్భక్తో మద్యాజీ మాం నమస్కురు!
మామే వైష్యసి సత్యం తే ప్రతిజానే ప్రియోఽసి మే॥

తా: నీవు నాపైన మనస్సుంచు; నన్ను భజించు; నన్ను పూజించు; నాకు నమస్కరించు; నిత్యమూ ఇలా ఉంటే నీవు నన్నే పొందగలవని సత్యప్రతిజ్ఞ చేసి చెపుతున్నాను. ఎందుకంటే నీవు నాకు చాలా ఇష్టుడవు.

వ్యా: 'ఇష్టోసిమే', 'ప్రియోసిమే' అని రెట్టించి రెట్టించి పరమాత్మ చెప్పారు. పరమాత్మ వరించాక ఇంకా ఆ జీవికి కొఱత ఏముంటుంది? తాను కావాలనుకున్న

భక్తునికి ఎంత కూర్చువాడై పరమాత్మ ఉంటాడో దీనివల్ల బోధపడుతుంది. అతన్ని రక్షించడానికి ఎంతదూరం నుంచి ఐనా వస్తాడు. అతడు ఇచ్చినవి అటుకులైనా, ఎంగిలి ఫలమైనా, చిన్న పాకాన్న లవమైనా చాలు, అష్టైశ్వర్యాలతో దాన్ని తుల దూచడానికి - అంత ఇష్టం భక్తుడంటే పరమాత్మకు - అమ్మకు తనదగ్గఱ ఉండే వాళ్ళ మీద కంటె దూరంగా ఉండే వాళ్ళమీద ఎక్కువ మక్కువ. అరణ్యంలో ఉన్న శ్యామలకు గోధుమ రొట్టెలు తనే పంపించింది. అమ్మది మార్జాల కిశోర న్యాయం. పిల్లి కూనలను తల్లి పిల్లి నోట్లో కరచుకుని పోతుంది. మర్కట కిశోర న్యాయంలో కోతిపిల్ల తల్లిని కఱచుకుంటుంది. ఇందులో భక్తుడు పరమాత్మ ప్రేమను ఆకర్షిస్తాడు. రెండూ పరమాత్మ చేష్టలే.

ఈ రెండు పద్ధతులలోను తల్లీబిడ్డల సంబంధానికి 4 అంశాలు సహజంగా బలాన్నిస్తాయి.

1. భక్తుడు మనస్సే పరమాత్మమయంగా ఉండడం.
2. భక్తుడి ధ్యానం పరమాత్మమయంగా ఉండడం.
3. భక్తుడి పూజాదిక ద్రవ్యాలూ పూజా అంతా పరమాత్మమయంగా ఉండడం.
4. భక్తుడి సర్వస్వమూ ఈ శరీరము సర్వస్వమూ నమస్కార రూపంగా పరమాత్మమయంగా అయిపోవడం.

నమః అంటే మః= నాది న= కాదు - అనే విశ్వాసం కుదిరి అంతా పర మాత్మయే ఇది అంతా అదే అనే విశ్వాసం కుదరడం ఆ విశ్వాసంలో తన ఉనికిని తాను మఱచిపోవడం. ఈ నిజాన్ని భక్తుని హృదయంమీద ముద్ర వెయ్యడానికి పరమాత్మ 18 అధ్యాయాల గ్రంథం చెప్పారు. భక్తుడంటే తన కెంత ప్రియతముడో భక్తియోగంలో 'యోమద్భక్తస్సమేప్రియః' అని ఆరుసార్లు రెట్టించి రెట్టించి వక్కాణించారు. కాని చివరకు వచ్చేసరికి అర్జునుడు వంటి భక్తుడు, ఇష్టమైన వాడిదగ్గఱ పరమాత్మ ఒట్టుపెట్టుకుని చెప్పడానికి కూడా వెనుకాడలేదు. 'సత్యంతే ప్రతిజానే' సత్యప్రతిజ్ఞ చేసి చెపుతున్నా వినవోయి పార్థా! ఎందుకంటే ప్రియోஉసిమే. నీవు నాకు ప్రియతముడవని సర్వగుహ్యతమ రహస్యమైన మన్మనాభవేత్యాది క్రియలను పర మాత్మ చెప్పారు.

రాబోయే శ్లోకాన్ని వైష్ణవులు చరమ శ్లోకం అంటారు. ఈశ్వర ప్రణిధానాన్ని పరాకోటికి తెచ్చిన శ్లోకం. గీతా శాస్త్రానికంతటికీ మకుటాయమానమై ఆస్తిక్య విచారానికి బ్రహ్మ శిరస్సులాంటిదైన శ్లోకం.

66. సర్వధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణం వ్రజ।
అహం త్వా సర్వపాపేభ్యో మోక్షయిష్యామి మాశుచ॥

తా: సర్వధర్మాలను పరిత్యజించి నన్నొకడినే శరణుబొందుము. అన్ని పాపముల నుండి నేను నీకు మోక్షము కల్పించెదను. శోకింపకుము.

వ్యా: నిజానికిది ఎంత తిన్నని దారి? ధర్మమంటే ఏదో అధర్మమంటే ఏదో తెలుసుకోడానికి పెద్దపెద్ద కొమ్ములు తిరిగిన పండితులే తికమకపడతారు. 'కింకర్మ కిమకర్మేతి కవయోప్యత్ర మోహితాః' కర్మమేది, అకర్మమేది అనే విషయాన్నిగూర్చి బుద్ధిమంతులు కూడా ఎఱుగజాలరని గీత చెపుతుంది. ధర్మాధర్మ వివాదాలతో బ్రదుకు కాస్తా అంతరిస్తే ఇక పరమార్థం మాటేమిటి? వివాదగ్రస్తమైన ధర్మాధర్మ జ్ఞానం లేకపోతే ఇక మానవ మాత్రుడికి మోక్షం లేదా? అనే ప్రశ్నకు పరమాత్మ ఇచ్చిన సూటి ఐన సమాధానం ఇది.

అన్ని ధర్మాలను విడిచిపెట్టు. నన్నొక్కడినే శరణు పొందు. పాపాలేమైనా దానివల్లన వస్తాయని నీకు భయం ఉంటే అవన్నీ నేను క్షాళనం చేయిస్తాను. భయపడకు అని అభయమిచ్చాడు పరమాత్మ.

అన్ని ధర్మాలను విడిచిపెట్టమంటే ఏ పనీ చెయ్యకుండా ముక్కు మూసుకుని ఇంట్లో కూర్చోమనా? ఎన్నటికీ కాదు. ఎందుకంటే 'ప్రకృతి స్త్వాం నియోక్ష్యసి' నీ స్వభావమే, నిన్ను బలవంతపెట్టి నీచేత ఈ పనులు చేయిస్తుంది. అందువల్ల కూర్చుందామన్నా కర్మలు చేయకుండా కూర్చోలేవు. మఱి ఏ కర్మ ధర్మమో, ఏది అధర్మమో అదీ తెలీదాయె ఎలాగా వేగడం అంటే, అన్ని కర్మల కర్తృత్వాన్నీ పరమాత్మ మీదనే వదిలేసి పాపమైనా పుణ్యమైనా 'శ్రీకృష్ణార్పణమస్తు అనుకుంటూ' ఓం తత్సత్' అని స్మరిస్తూ మనసారా నమ్మి పనులుచేస్తూ ఉండాలి. 'మామేకం శరణం వ్రజ' అంటే భారమంతా నా మీద వదిలెయ్. మఱి ఏమౌతుందో నాగతి. నా కళ్ళనే నా కనపడే దేహాన్నే, నేను చేసే పనులనే నేను నమ్మలేకుండా ఉన్నాను కదా! మఱి అంతగా కనిపిస్తూ ఎక్కడాకనిపించని నీవు ఏం చేస్తావో నన్ను అనుకోకుండా పరమాత్మే 'అహంత్వా సర్వపాపేభ్యో మోక్షయిష్యామి' నిన్ను తప్పకుండా పాపాలనుండి ముక్తుడవయ్యేలాగా చేస్తాను. సందేహించకు. శోకించకు అని హామీ ఇచ్చాడు పరమాత్మ.

అమ్మమీద మనస్సు నిలపలేం - ఎందఱో అడుగుతారు. అమ్మా ధ్యానం చేయాలనుకుంటే నీవు కనిపించక శూన్యమే కనిపిస్తుందన్న సోదరుడికి అమ్మ అయిదువేళ్ళూ విప్పి చూపించి వ్రేళ్ళమధ్య ఖాళీ కూడా ఉన్నది కదా. వ్రేళ్లు ఎలా అమ్మో ఖాళీకూడా అలాగే అమ్మని వివరించారు. అమ్మమీద నిత్యమూ భక్తి ఉండదు.

తిండిమీద ఉన్న భక్తి అమ్మమీద ఉండదు. నౌకరీని పూజించినట్లు, నెలసరి జీతాన్ని పర్సునూ మనస్సుతో పూజించినట్లు అమ్మను పూజించుము. నాదికాదు 'నమః' అని నమస్కారం చెయ్యడానికి చేతకాదు. మరి మనం మర్కట కిశోరాలామెలా కాగలం. అందుకనే అమ్మయే బిడ్డలను పట్టుకుంటున్నది. బురద కడిగి శుభ్రం చేస్తున్నది.

'నిన్ను కడతేర్చవలసింది అమ్మ. ఆ బాధ్యత నీది కాదు' అన్నది అమ్మ.

ఈ వాక్యాల దృష్ట్యా సర్వధర్మాన్ పరిత్యజ్య అంటే ధర్మాలంటే ఏమిటో తెలియని అవ్యవస్థిత స్థితిలో 'మామేకం శరణం వ్రజ' కర్తవ్యాన్ని పరమాత్మమీద వదిలెయ్ అనేమాట ఎంత సులువుగా, ఆచరణీయంగా ఉండే సహజ పద్ధతో మనకు బోధపడు తుంది. దీనితోబాటు అమ్మ ఇచ్చిన అభయ వాక్యం 'అందరికీ సుగతే' అన్నమాట 'మోక్షయిష్యామి' అనే దాన్ని వ్యాఖ్యానిస్తుంది. మనం చెయ్యాలనుకున్నా మనకు ఏం చెయ్యాలని ఉన్నా ఆ చెయ్యాలనుకున్న పనికి సంకల్పం కలిగించేది అమ్మే. ఏ పనీ చెయ్యాలనుకోకపోవడానికి మూలమయిన అతీతశక్తి కూడా అమ్మే అని నమ్మాలి. మనం చేసేవాడు చేయించేవాడూ మనలో ప్రేరణగా మాత్రమే నిలుస్తున్నాడు. అవన్నీ వాడే అయి చేస్తున్నాడు. అలాంటప్పుడు జీవితంలో వచ్చే పాపపుణ్యాలు, సుఖదుః ఖాలు, లాభనష్టాలు ఆ చేయించేవాడికే కాని మనకు కావు. అందుచేత మనం ఏదో చేస్తున్నామని అంతా మనవల్లే జరుగుతుందనీ భావన చేయరాదు. మన ఉనికి ప్రపంచంలో నామమాత్రంగానే.

ధర్మం అంటే నిశ్రేయస సాధనం – అభ్యుదయ సాధనం –ముక్తికి సాధనమే కాని ధర్మం ముక్తికాదు. సాధనాలు నిజానికి సాధనాలు కూడా కావు. పరమేశ్వర ధృతి అందుకోలేకపోతే. కాబట్టి అన్నింటికి నేనే సాధనం అన్నారు పరమాత్మ. ఇదివఅలో మామేవ మామేవ అనే ఏవశబ్దానికి మారుగా ఇక్కడ ఏకం మామేకం – నన్నొక్కడినే శరణు పొందమని చెప్పారు. ఇంకెవరిని శరణనన్నా ఆ పని జరిగేది కాదని తాత్పర్యం అందువల్లనే వైష్ణవ సంప్రదాయంలో ఈ శ్లోకం శరణాగతికి ప్రమాణం. సర్వ ధర్మపరిత్యాగమనే దృఢమైన అధ్యవ సాయం లేకపోతే పరమాత్మ అనుగ్రహం ఉన్నా అతనిలో వ్యక్తం కావడానికి అర్హత ఏర్పడదు. ఇన్సులేషన్ అంతా తీసేస్తే గాని తీగలకు కాంటాక్టు లభించదు.

త్వా= అంటే బురద పూసుకుని ఉన్నప్పటికీ, పరిపూర్ణత లేనప్పటికీ నిన్ను అని అర్థం.

పాపేభ్యో అంటే ఇదివఅకున్నవి రాబోయేవి అన్నీ నీవనుకున్నవి నీవి కావని పించేలాగా మోక్షయిష్యామి తృప్తిని కలిగిస్తాను.

మాశుచ – శోకింపకుము. అర్జునుడు విషాదం చెందడంతో గీతాబోధ ఆరంభ మయింది. ఆ శోకాన్ని మాన్పడానికి 'అశోచ్యా నన్వశోచస్త్వం' అని పరమాత్మ హెచ్చరించారు మొదట్లోనే. 'నాను శోచన్తిపండితాః' అని అతన్ని ఓదార్చడానికి కూడా ప్రయత్నించారు. అక్కడికీ లాభంలేకపోగా 'నత్వం శోచితుమర్హసి' అని పెక్కుమార్లు అతడిని వారించారు. చిట్టచివరకు ఈ శ్లోకంలో 'శోకింపకుము' అని ఊరడించారు.

అమ్మను చూడవచ్చేవాళ్ళు సాధారణంగా కళ్ళనీళ్ళు కార్చకుండా పోరు. ఈ విషయమై ఒక సోదరుడు ఇందరిని ఏడిపించడంలో నీ తృప్తి ఏమిటమ్మా అని అడిగారు.

అమ్మ: ఏడిస్తే చంకనేసుకోవచ్చు. ఏడుపు ఇమోషన్. అమ్మలో ఉండే ప్రేమ వాడిని కదిపి ఏడిపిస్తుంది.

దానిమీద ఆ సోదరుడన్నమాట కూడా చాలా బాగుంది.

ఈ ప్రేమ చాలా బాగుందమ్మా! ఇదే గొప్ప. ఇదే అవతార రహస్యం. అందఱూ అట్లా గుర్తించాలి. లేకపోతే వ్యర్థమౌతుంది.

సరిగా 'మాశుచ' అనే మాటకోసం ముందుగా అమ్మ కలిగించినట్లే ఉంది ఈ సంభాషణ. ఈ శ్లోకానికి ఆచార్యత్రయం ఇచ్చిన వ్యాఖ్యానం కూడా వ్రాసి దీన్ని ముగిస్తాను.

1. ధర్మాధర్మ రూపములగు సర్వ కర్మములను సన్యసించి నేనొక్కడనే గాని ఇతరములేదని నిశ్చయించి యాత్మాఽభేదమున శరణుబొందుము. అట్టి నిశ్చయ బుద్ధిగల నిన్ను ధర్మాధర్మ బంధన రూపములైన సమస్త పాపముల నుండి విడిపించెదను.

2. కర్మయోగ జ్ఞాన యోగ భక్తియోగ రూపములైన (శం) పరమ నిశ్రేయస సాధన భూతములగు సమస్త ధర్మములను నాయారాధన రూపమున మిక్కిలి ప్రీతితో అధికారానుసారముగా చేయుచున్న వాడవై చెప్పినయట్లు ఫలకర్మ కర్తృత్వాది పరిత్యాగముచే విడిచి నన్నొకనినే కర్తగాను ఆరాధ్యునిగాను ప్రాప్యునిగాను, ఉపాయునిగాను భావింపుము. మిగతాది శంకరులతో సమానము. ధర్మ త్యాగ మనగా ఫలత్యాగముకాదేని యుద్ధవిధియెట్లు? 'యస్తు కర్మ ఫలత్యాగే సత్యాగీత్యభిధీయతే' అనియు చెప్పబడియున్నది (మధ్వ).

67. ఇదంతే నాఽ తపస్కాయ నాభక్తాయ కదాచన।
న చాశుశ్రూషవే వాచ్యం న చ మాం యోఽ భ్యసూయతి॥

తా: ఇప్పుడు నాచేత చెప్పబడిన ఈ గీతాశాస్త్రం ఎన్నడూ తపశ్శీలుడు కాని వానికిన్నీ, నా భక్తుడుకాని వానికిన్నీ, వినుటకిచ్ఛలేని వానికిన్నీ, లేదా పరిచర్య చేయనివానికిన్నీ, నాయందసూయగల వానికిన్నీ చెప్పదగింది కాదు.

'నా ప్రశాంతాయ దాతవ్యం నా పుత్రాయా శిష్యా యా
వా పునః 'శ్వేతాశ్వతరోపనిషత్తు'

68. య ఇదం పరమం గుహ్యం మద్భక్తే ష్వభిధాస్యతి।
భక్తిం మయి పరాం కృత్వా మామే వైష్యత్య సంశయః॥

తా: పరమ రహస్యమైన ఈ గీతా శాస్త్రాన్ని పవిత్రమైన భక్తితో నాయందు భక్తి గలవాళ్ళకు ఎవడు చెపుతున్నాడో వాడు నన్నే పొందగలడు. ఇందుకు సంశయము లేదు.

వ్యా: ఈ గీతాశాస్త్ర బోధనం కూడా విశ్రేయస మార్గమవుతుందని ఈ శ్లోకంలో చెప్పబడింది. కాబట్టి పరమాత్మకు గీతాశాస్త్రమంటే ఎంత ప్రియమో దాన్ని చెప్పేవాళ్ళ యొక్క వినేవాళ్ళ యొక్క అర్హతానర్హతలను కూడా పరమాత్మ చెప్పి ఉంచారని దీనివలన తెలుస్తుంది. ఉపనిషత్తులలో ఈ మర్యాద గురుశిష్యుల సంప్రదాయంలో నియమై ఉండనే ఉన్నది.

'తస్మై ఏతే కథితా అర్థాః ప్రకాశంతే మహాత్మనః'
అని శ్వేతాశ్వ తరోషనిషత్తు

69. న చ తస్మా న్మనుష్యేషు కశ్చిన్మే ప్రియకృత్తమః।
భవితా న చ మే తస్మాదన్యః ప్రియతరో భువి॥

తా: ఆ విధంగా ఈ గీతాశాస్త్రాన్ని బోధించే వానికంటే మనుష్యులలో ఎవ్వడూ నాకు ప్రియాన్ని కూర్చేవాడు ఇదివఅలో లేడు. అట్టివానికంటె నా కిష్టుడైనవాడిక ముందు ఉండబోడు.

'నభూతో నభవిష్యతి' అని అర్థం.

70. అధ్యేష్యతే చ య ఇమం ధర్మ్యం సంవాదమావయోః।
జ్ఞానయజ్ఞేన తేనాహ మిష్ట స్స్యా మి తి మే మతిః॥

తా: ధర్మసంబంధమైన మన ఇద్దఱి సంవాదరూపమైన గీతాశాస్త్రాన్ని ఎవడు అధ్యయనం చేస్తాడో, అటువంటి పాఠకుడు జ్ఞానయజ్ఞంచేసి నన్ను పూజించి నట్లుగా నేను భావిస్తాను.

71. శ్రద్ధావా ననసూయశ్చ శృణు యాదపి యోనరః।
సోఽ పి ముక్త శ్శుభాన్ లోకాన్ ప్రాప్నుయా త్పుణ్య కర్మణామ్॥

తా: శ్రద్ధావంతుడై, అసూయలేనివాడై ఏ మనుష్యుడు గీతా శాస్త్రాన్ని వింటాడో, అతడు కూడా పాపవిముక్తుడై, పుణ్య కర్మములను చేసిన మహాత్ములు పొందే లోకాలను, శుభములను పొందుతాడు.

వ్యా: పుణ్యాత్ములు ఏదో లోకాలకు పోతారన్నట్లుగా ఈ శ్లోకంలో అర్థం వస్తుంది. మనం సాధారణంగా ఎవరితో మాట్లాడకుండా మౌనంగా ఉంటే వాళ్ళను చూసి 'వాడిలోకం వాడిది' అంటాం. అలాంటివే ఈ పుణ్యాత్ములు పొందే లోకాలు కూడా. అన్నీ మనో నిర్మితాలే. అసూయ అంటే గుణములయందు దోషం కనిపించడం. పై శ్లోకాలలో పరమాత్మ గీతను బోధించడానికి ఎవరు అనర్హులో, ఎవరు అర్హులో గీతను భోధించేవాళ్ళకు, పఠించేవాళ్లకు వినేవాళ్ళకు ఏయే ఫలాలు వస్తాయో వివరించారు. గీతాధ్యయన పఠన శ్రవణాసక్తులగువారు తనకు ఎంత ప్రియులో ఆ విషయం కూడా చెప్పారు.

తనవంటి ఉపదేష్ట ఇంకెవరూ లేరు. అర్జునుని వంటి ప్రియ శిష్యుడూ ఇంకెవరూ ఉండరు. అసలు అర్జునుడు కారణంగానే ఈ గీతను పరమాత్మ ఉపదేశించవలసి వచ్చింది. కాబట్టి తనవంటి ఉత్తమ గురువు బోధకు శిష్యుడైన అర్జునుని మీద ఎంతగా ఫలించిందో తెలిసికోగోరి పరమాత్మ ఇలా ప్రశ్నించాడు.

(అర్జునుడు చెప్పబోయే జవాబు తనకు తెలియకకాదు. పరమాత్మ అడగడం అర్జునుడు జవాబు చెప్పడం అంతా ఆ నిర్ణయంలోనిదే)

72. కచ్చిదేత చ్ఛ్రుతం పార్థ! త్వయైకా గ్రేణ చేతసా।
కచ్చి దజ్ఞాన సమ్మోహః ప్రణష్ట స్తే ధనంజయ!॥

అర్జునా! నేను చెప్పిన గీతాశాస్త్రోపదేశాన్ని శ్రద్ధతో విన్నావా? నీ అజ్ఞాన మోహం ఏ కొంచెమైనా నశించిందా?

వ్యా: పరమాత్మ ప్రశ్నకు అభియుక్తుడైన శిష్యుడీయవలసిన సమాధానాన్నే అర్జునుడు ఇచ్చాడు. ఇక అర్జునుడు ఇదివఱకులాగా వేయవలసిన ప్రశ్నలేమీలేవు. ఛిన్న సంశయుడైన అతడు ఏ కొంచెం వ్యంగ్యార్థం లేకుండా కత్తివ్రేటులాగా స్పష్టంగా నాలుగు మాటల్లో చెప్పేశాడు.

అర్జున ఉవాచ:

73. **నష్టోమోహః స్మృతి ర్లబ్ధా త్వత్ప్రసాదా న్మ యాఽ చ్యుత!।**
స్థితోఽస్మి గత సందేహః కరిష్యే వచనం తవ॥

అర్జునుడు పలికెను

చ్యుతిలేనివాడా! శ్రీకృష్ణా! నీ అనుగ్రహంవల్ల నా మోహం నశించింది. జ్ఞానం కలిగింది. సందేహాలు తీరిపోయాయి. మళ్ళీ ఎప్పటి మనిషి నయ్యాను. నీవు చెప్పి నట్లు చేస్తాను (అంటే యుద్ధం చేస్తాను)

సంజయ ఉవాచ

74. **ఇత్యహం వాసుదేవస్య పార్థస్య మహాత్మనః।**
సంవాద మిమ మశ్రౌష మద్భుతం రోమహర్షణమ్॥

సంజయుడు పలికెను.

తా: ఈవిధంగా వాసుదేవుడైన శ్రీకృష్ణుని యొక్క మహాత్ముడైన పార్థుని యొక్కా అత్యాశ్చర్యకరమైన ఈ సంవాదాన్ని గగుర్పాటుతో విన్నానని ధృతరాష్ట్రునితో సంజ యుడు చెప్పాడు.

75. **వ్యాస ప్రసాదా చ్ఛ్రుతవా నేతద్గుహ్యా మహం పరం।**
యోగం యోగేశ్వరా త్కృష్ణాత్ సాక్షాత్ క్కథయత స్వయం॥

తా: ఆ వ్యాస మహర్షి నాకు ప్రసాదించిన దూరదృష్టి దూరశ్రవణాది ప్రభా వంచే స్వయంగా నాయెదుట నిలిచి చెపుతున్నట్లుగానే యోగీశ్వరుడైన శ్రీకృష్ణుడు చెప్పిన ఈ అత్యంత రహస్యమైన పరమోత్కృష్టమైన యోగమును విన్నాను.

76. **రాజన్ సంస్మృత్య సంస్మృత్య సంవాదమిమ మద్భుతం।**
కేశవార్జునయోః పుణ్యం హృష్యామి చ ముహుర్ముహుః॥

తా: ధృతరాష్ట్ర మహారాజా। పుణ్యకరమూ ఆశ్చర్యకరమూ అయిన ఈ కేశ వార్జున సంవాదాన్ని తలుచుకొని తలుచుకొని మాటిమాటికి సంతోషిస్తున్నాను.

77. **తచ్చ సంస్మృత్య సంస్మృత్య రూప మత్యద్భుతం హరేః।**
విస్మయో మే మహాన్ రాజన్ హృష్యామి చ పునఃపునః॥

తా: మహారాజా! ఇంతేకాక శ్రీకృష్ణ పరమాత్మ చూపించిన అత్యాశ్చర్యకరమైన

విశ్వరూపం మాటిమాటికి నా మనస్సు ఎదుట కనబడుతున్నది. దాన్ని తలచు కొన్నప్పుడల్లా మాటిమాటికి విస్మయమేకాక మహా సంతోషంకూడా నాకు కలుగు తున్నది.

అమ్మ ప్రేమమయమైన విశ్వరూపం తలుచుకున్నా నాకూ అలాగే విస్మయం కలుగుతూ ఉంటుంది. పేనుగ్రుడ్లు, కుక్కపిల్లలు, పంది పిల్లలు, అప్పుడు పుట్టిన దూడ వంటిమీద నెత్తురును నాకేస్తున్న ఆవు, సముద్రం అడుగున పెద్ద చేప పొట్టలో చేప పిల్లలు. తిమింగిలం పాలుతాగే తిమింగిలం పిల్ల, చేతుల్లో గ్రుడ్డును పట్టుకుని ఆఱునెలలు నిల్చున్న పింగ్విను పక్షి, తన గ్రుడ్లను మ్రింగేసే నాగుబాము, ఆకలేసి తన పిల్లలను తినేసే పెద్దపులి, కూనల నోట కఱచుకొని పోయే పిల్లి తల్లి, పొట్టకు కఱచుకొని ఉన్న పిల్లలతో కొండమీద చెట్టు నుండి చెట్టు మీదికి దూకే కోతులు, కన్నదూడను పాలిస్తున్న ఖడ్గమృగం, పిల్లలను చూచి కడుపునింపుకునే తల్లి చేప, పిల్లలను తలుచుకుంటూ త్రేన్చుతుండే తాబేలు, ముత్యాన్నిపొదుగుతున్న చిప్ప పురుగు. ముట్టెతోపిల్లను రాస్తున్న డైనాసరస్, పిసరుపిందె ఔతూ ఔతూ ఉన్న పువ్వు, నానినాని అంకురాన్ని ఈనుతున్న భూమి లోపలిగింజ, మృత్యువును కంటున్న పుట్టుక, పుట్టుకను ప్రసవిస్తున్న మృత్యువు, తలపుల నీనుతున్న మనస్సు, సుఖాన్ని ఈనే దుఃఖం, వెలుగును ఈనుతున్న చీకటి, అర్బుదన్యర్బుద గోళాలనే ఆకాశం వర్తమానాన్ని ఈనుతున్న భవిష్యత్తు, భూతాన్ని ఈనుతున్న వర్తమానం ఈ మూటినీ ఈనుతున్న మహాకాలం – మనఃప్రాణాలను ఈనే కలకాలం వికారాన్నీనే అవికారం – ఈ అన్నింటికీ కారణ కారణ స్వరూపమూ అవతారమూ అయిన అమ్మ ప్రేమ మయ భయంకర స్వరూపాన్ని తలుచుకుంటే సరి నాకు సంభ్రమాశ్చర్యాలు మనస్సు లో పెనవేసుకుంటాయి. ఈ పీనుగులను నిద్రపుచ్చే మృత్యుహస్తం అమ్మలో కని పిస్తుంది. అమాయికపు పాపాయికి హాయిగా జోలపాడుతున్న అమ్మ మధురాకారం కూడా కనిపిస్తుంది.

తచ్చ సంస్మృత్య సంస్మృత్య – స్మరించుకొని, స్మరించుకొని అని సంజయుడు రెట్టించి చెప్పడంతో ఈ విషామృతం నాటినుంచి నేటిదాకా కాలరూపంగా వివర్త నాత్మక ప్రవాహరూపకంగా, వచ్చిపోయే ప్రళయాల రూపం భూత భవిష్యద్వర్త మానాత్మకమైన వివర్త మహాంబుధిలోని సృష్టికల్లోలాన్ని మనస్సులో తలపోసిన కొద్దీ విస్మయమూ, హర్షమూ, అద్భుతమూ ముంచుకొస్తూ ఉంటాయి. ఈ స్మరించడం లోనే ఉంది విజ్ఞాన సర్వస్వమూనూ. స్మృతికి రాని విజ్ఞానం ఉండీ లేనట్లే. ఈ స్మృతు లను కల్పించే ప్రేరణ అమ్మదే.

స్మృతి వర్తమాన కాలానికి సంబంధించినది. స్మృతికి పునాది భూతకాలానికి సంబంధించినది. స్మృతికి జన్మ స్థానం, జన్మకారణం, అవసరం. ఈ అన్నీ కలిసిన కూడలియోగం. కాల వికారానికి స్మృతి చేతనకీ, భూతోద్ధరణానికీ, నిత్యమూ అవ లంబంగా ఉన్నది ప్రేరణ - ప్రేరణ అవసరం అనే ధనుస్సును లాగి స్మృతి అనే నారాచాన్ని ఎక్కుబెడుతుంది. పైన చెప్పిన స్మృతి చేతనాయోగమే సదా జాగృతి రూపంగా వికసిస్తున్న యోగీశ్వరత్వం. యోగేశ్వరత్వం ఎక్కడ ఉంటుందో, సార్థ కత్వం కూడా అక్కడ తప్పక ఉంటుంది. ఈ రెండూ తత్వాలూ నిజానికి విజ్ఞాన విజ యాన్నే, సుగతి విజయాన్నే సాధిస్తూ ఉంటాయి. ధృతరాష్ట్రుడు వంటివాళ్ళకు అది కనిపించకపోవచ్చు. యథార్థ స్వరూప జ్ఞానం లేనందున విపరీత జ్ఞానం భాసించ వచ్చు కూడా.

78. యత్ర యోగేశ్వరః కృష్ణో యత్ర పార్థో ధనుర్ధరః।
తత్ర శ్రీ ర్విజయో భూతి ర్ధ్రువానీతిర్మతి ర్మమ॥

యోగేశ్వరుడైన శ్రీకృష్ణుడూ, గాండీవధారి ఐన అర్జునుడూ ఏ పక్షాన ఉంటారో ఆ పక్షానికే లక్ష్మి, విజయము, ఐశ్వర్యము, స్థిరమైన ధర్మము ఉంటుందని నా నిశ్చయము అని సంజయుడు ధృతరాష్ట్రునితో చెప్పాడు.

గీత మొట్టమొదటి శ్లోకంలో ధర్మక్షేత్రమైన కురుక్షేత్రమునందు యుద్ధం చేయ డానికి ఇచ్ఛగల వాళ్ళై తలపడ్డ నా పక్షము పాండవపక్షము ఏంచేశారు సంజయా అని ధృతరాష్ట్రుడు అడిగిన ప్రశ్నకు సంజయుడు చెప్పిన జవాబు ఇది అంటారు వ్యాఖ్యాతలు. వాచ్యంగా పాండవులే జయిస్తారని చెప్పకుండా కృష్ణార్జునులేపక్షాన వుంటే ఆ పక్షానికే జయమని వక్రోక్తిగా సంజయుడు చెప్పారు సమాధానం

పశుయోనిషు

పశువులనగా అజ్ఞానులు పామరులు అనే అర్థం - జంతువులని కాదు.

అన్యోఽసావన్యోఽహమస్మీతి న సవేద యథాపశురితి'..

ఇది శ్రీమన్మాతృగీతలోని మోక్ష సన్యాసయోగమను అష్టాదశ యోగోధ్యాయము

మాతృశ్రీ విలాసం.

డా॥ కొమరవోలు వెంకట సుబ్బారాయ రచిత మాతృ గీతావ్యాఖ్యానం సర్వం

సంపూర్ణం.



డా॥ కె.వి. సుబ్బారావు

M.A., MDH, D.S.C.

భార్య : నిర్మలాదేవి

జననం : 5-10-1911

అంగలకుదురు, గుంటూరు జిల్లా

1945 వరకు స్టేట్ ఎక్సైజు, రెవిన్యూలో ఉద్యోగం.

1945-1973 వరకు మిలిటరీ (A.O.C)

ఆనరరీ లెఫ్టినెంట్‌గా పదవీ విరమణ

1973 నుండి నేటి వరకు Matrusri Ex-Service Men's Free Homoeo, Magneto Radionic Dispensary సంస్థాపన - నిర్వహణ

1985లో The Radionic Association of India స్థాపన. ప్రస్తుతం పై థెరపీలలో చికిత్స - పరిశోధన.

అభిరుచులు : సంగీతం, తెలుగులో కావ్య రచన, కిర్లియన్ ఫోటోగ్రఫీ, రేడియానిక్ యంత్ర నిర్మాణము, యోగసాధన, తాత్త్విక పరిశోధన - Sujok ఆక్యుపంక్చర్, జంత్రవాద్యం, వైజ్ఞానిక పరిశీలన

ముద్రిత గ్రంథాలు : ప్రత్యూషము, రాగసుధ, అమరశ్రీ, చెకుముకిరవ్వ శతకం, భ్రమరాంబా ప్రియశతకం, యామాసా, ఉగ్రభారతి, పరమాణుగాథ, సప్తశతి, ఛిన్నమస్త, Holograms, Bio-Rhythms and Radionics, చిన్న కథలు

అముద్రిత రచనలు : మహావంశము (పాళీ నుండి అనువాదము), భగవద్గీతా వ్యాఖ్యానం, ఈశావాస్యోపనిషత్తు (ఇంగ్లీషు), పరిగెపిట్టలు, సర్పజిహ్వ

